ఎ.వి. అనీకిన్

అర్థశాస్త్ర క్రమపరిణామం

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

గతానికి చెందిన ఆర్థిక సిద్ధాంతాలకూ, అర్థశాస్త్రపు ప్రధాన ఆధునిక ధోరణులకూ భావాలకూ మధ్య గల సంబంధాన్ని యీ పుస్తకం రేఖామాత్రంగా చిత్రిస్తుంది. రచయిత తన విశేష పాండిత్యానికి హాస్యాన్ని జోడించి, బువాగిల్బేర్, పెట్టీ, కెనే, ట్యూర్గో, స్మిత్, రికార్డో, సెంట్ సైమన్, ఫోరియర్, ఓవెన్ మొదలైన అనేకమంది ఆర్థిక చింతనాపరులతో పాఠకులకు పరిచయం కలిగించాడు. ఆయా అర్థశాస్త్రవేత్తలు ఏ కాలంలో జీవించి, తమ రచనలు చేశారో ఆ కాలపు పూర్వరంగంలో వారి భావాలు ఆవిష్కరింపబడ్డాయి.

మాస్కో విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ఆచార్యుడైన రచయిత ప్రముఖ సోవియట్ అర్థశాస్త్రవేత్తల్లో ఒకడు.

ఎ. వి. అనీకిన్

అర్థశాస్త్ర క్రమపరిణామం

మార్క్సు పూర్వపు అర్థశాస్త్రం

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు

А. В. Аникин

ЮНОСТЬ НАУКИ

на языке телугу

A. V. Anikin

A SCIENCE IN ITS YOUTH

in Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రించబడింది

$A \frac{0602000000-542}{014(01)-83} 710-82$

విషయసూచిక

ముందుమాట

ఆర్థిక చింతన చరిత్రపైన వివిధ భాషల్లో, డజన్లకొద్దీ, ఆ మాటకు వస్తే వందలకొద్దీ రచనలు వెలువడ్డాయి. కాగా, ఆ గ్రంథ జాలానికి మరో రచనను జత చెయ్యడం యీ రచయిత లక్ష్యం కాదు. సుబోధకమైన వ్యాసాల రూపంలో రచింప బడిన ఈ పుస్తకంలో ఆయా అర్థశాస్త్రజ్ఞుల జీవితాలకూ, శాస్త్రీయ విషయాలకూ సంబంధించిన అతి ముఖ్యమైన వివరాలను సమకూర్చడం సంభవమవడమే కాకుండా, ఈనాటికీ విశేష ప్రాముఖ్యం కలిగిన సమస్యలపైన ఉటంకింపు యివ్వబడింది.

ఈ పుస్తకం, అర్థశాస్త్రాన్ని గురించిన ప్రత్యేక పరిజ్ఞానం లేని సామాన్య పాఠకులకోసం ఉద్దేశింపబడింది. అర్థశాస్త్రం నిస్సారమైన విసుగుపుట్టించే విషయమని కొందరు భావిస్తూవుంటారు. కాని, సమాజపు ఆర్థిక నిర్మాణంలో, ప్రకృతిలో ఉన్న దాని కన్న తక్కువ ఆకర్షణీయమైన సమస్యలూ, నిగూఢ విషయాలూ లేవు.

ఇటీవలి కాలంలో ప్రామాణిక, ప్రకృతి విజ్ఞానశాస్త్రాలలోని పండితులకి ఆర్థిక సమస్యలతో సంబంధం పెట్టుకోవడమనేది ప్రత్యేకించి సామాన్య విషయమైంది.

అర్థశాస్త్రపు ఆరంభ దశలో మానవ సంస్కృతిపైన చెరగని ముద్రవేసిన ప్రముఖ చింతనాపరులు, మనకి కనిపిస్తారు. వీరు అపార శేముషీ సంపన్నులు. శాస్త్ర, సాహిత్య రంగాలలో గొప్ప ప్రతిభా సామర్థ్యాలన్నీ కలిగినవారు. ఇది యాదృచ్ఛికమైన విషయమేమీ కాదు.

వెనకటి అర్థశాస్త్రజ్ఞులూ, యీనాటి అర్థశాస్త్రజ్ఞులూ

మానవజాతి జీవితంలో ఆర్థికశాస్త్రం ఎప్పుడూ కూడా అత్యంత ముఖ్యమైన పాత్ర వహిస్తూవచ్చింది, కాగా, యీనాడు యిది ప్రత్యేకించి మరింత నిజం.

ప్రాచీనుల జీవితాలకు రాజకీయాలూ, మధ్య యుగాలవారికి కేథలిక్ మత సూత్రాలూ ఆధారాలన్న వాదన ఎంత అసంగతమైందో మార్క్సు పేర్కొన్నాడు. మానవజాతి జీవితానికి ఎప్పుడూ కూడా "అర్థికశాస్త్రమే ఆధారం." కాగా రాజకీయాలూ, మతం, విజ్ఞానశాస్త్రం, కళా అర్థికశాస్త్ర ప్రాతిపదికపైన మాత్రమే మనగలుగుతాయి. గతంలో అర్థికశాస్త్రం అభివృద్ధిచెందకపోవడమే, యీ దశలను గూర్చిన యిటువంటి అభిప్రాయాలకు ప్రధాన కారణం. ఆధునిక అర్థికశాస్త్రం, మనలో ప్రతి ఒక్కని జీవితంలోనూ కీలకమైన పాత్ర వహిస్తోంది.

ఈనాటి ప్రపంచం వాస్తవానికి రెండు భిన్న — సోషలిస్టు, పెట్టుబడిదారీ — ప్రపంచాలు, వీటిలో ప్రతి ఒక్కటీ తన సొంత అర్థిక వ్యవస్థనూ, తన సొంత అర్థశాస్త్రాన్నీ కలిగివుంది. వలసపాలననుండి తమనుతాము విముక్తంచేసుకున్న వర్ధమాన దేశాలు కూడా, అంతర్జాతీయ రంగంలో నానాటికీ ముఖ్యమైన పాత్రను వహిస్తున్నాయి. ఏ అభివృద్ధి పంథాను అనుసరించాలన్న సమస్యను నిర్ణయించుకోవలసిన అవసరం, యీ దేశాల విషయంలో నానాటికీ తక్షణ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటోంది. ఆధునిక ప్రపంచ సమస్యలను అవగాహన చేసుకోడానికీ, అర్థిక విజ్ఞానశాస్త్రాన్ని తన సొంత ప్రపంచ దృక్పథంలో ఒక అంతర్భాగంగా అర్థంచేసుకోడానికీ అర్థశాస్త్ర చరిత్ర అధ్యయనం మనకి తోడ్పడుతుంది.

మానవేచ్ఛ ప్రమేయం లేకుండా పనిచేసినప్పటికీ మానవ అవగాహనకు అందుబాటులో వుండి వస్తుపర నియమాలు పనిచేసే అర్థిక వ్యవస్థ సిద్ధాంతాన్ని మొట్టమొదట అభివృద్ధి చేసినది బూర్జువా అర్థశాస్త్ర ప్రామాణిక రచయితలు, ప్రత్యేకించి ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోలు. దేశపు అర్థిక విధానం యీ నియమాలపైన ఆధారపడాలేగాని, వాటికి వ్యతిరేకంగా ఉండరాదని వారు భావించారు.

విలియం పెట్టీ, ఫ్రాన్సువా కెనే, తదితర పండితులూ అర్థిక క్రమాల పరిమాణాత్మక విశ్లేషణకు పునాదులు వేశారు. ఈ క్రమాలను ఓ మాదిరి ఉపచయాపచయ క్రియగా పరిశీలించేందుకూ, దాని దిశలనూ, పరిధినీ నిర్వచించేందుకూ వారు ప్రయత్నించారు. సామాజిక ఉత్పాదితపు పునరుత్పత్తికి సంబంధించిన తన సిద్ధాంతంలో, మార్క్సు వారి శాస్త్రీయ విజయాలను వినియోగించుకున్నాడు. వినిమయ సరుకులకూ ఉత్పత్తి సాధనాలకూ మధ్య సమతులనమూ, సంచయ వినిమయాల అనుపాతాలూ, వివిధ శాఖల మధ్య సంబంధాలూ ఆధునిక అర్థిక వ్యవస్థలోనూ, అర్థిక అధ్యయనంలోనూ అతి ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. అర్థిక విజ్ఞానశాస్త్రపు యీ మార్గదర్శకుల రచనలు ఆధునిక అర్థిక గణాంక శాస్త్రాన్ని — దాని ప్రాముఖ్యాన్ని ఎంతగా చెప్పినా ఎక్కువ కాబోదు — ఉత్పన్నంచేశాయి.

19వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో ఆర్థిక విశ్లేషణలో గణిత పద్ధతులను వినియోగించే ప్రయత్నాలు జరిగాయి. ఇవి లేకుండా ఆర్థిక విజ్ఞానశాస్త్రపు పలు శాఖల అభివృద్ధిని ఊహించడం యీనాడు అసంభవం. ఈ రంగంలో మార్గదర్శక కృషి జరిపిన వారిలో ఫ్రెంచి ఆర్థికశాస్త్రవేత్త అంటువాన్ కుర్నో ఒకడు.

బూర్జువా అర్థశాస్త్ర ప్రామాణిక రచయితలూ, అంతేకాకుండా పెటీబూర్జువా, ఊహాజనిత సోషలిజాల ప్రతినిధులూ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని పలు వైరుధ్యాలను విశ్లేషించారు. బూర్జువా సమాజానికి మహమ్మారివంటివైన ఆర్థిక సంక్షోభాల కారణాలను అర్థంచేసుకోడానికి ప్రయత్నించిన ప్రథములల్లో స్విస్ ఆర్థిక శాస్త్రవేత్త సిస్మోండీ ఒకడు. గొప్ప ఊహాజనిత సోషలిసులైన సెంట్ సైమన్, ఫోరియర్, ఓవెన్‌లూ, వారి అనుయాయులూ పెట్టుబడిదారీ విధానాన్ని తీవ్రంగా విమర్శించి, సమాజపు సోషలిస్టు పునర్నిర్మాణానికి పథకాలను రూపొందించారు.

లెనిన్ రాసినట్లు "మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన మేధావులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను కచ్చితంగా ఇవ్వడమే మార్క్స్ మేధ వైశిష్ట్యం. తత్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధలకు సూటి అయిన, తక్షణమైన కొనసాగింపుగానే మార్క్స్ సిద్ధాంతం ఉద్భవించింది."*

మార్క్సిజం మూలాధారాల్లో సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రం ఒకటి. కాని, అర్థశాస్త్రంలో మార్క్స్ ఉపదేశం విప్లవాత్మకమైన ఒక మలుపు. పెట్టుబడి అన్నదొక సామాజిక సంబంధమనీ, యిది ప్రధానంగా శ్రామికుల వేతన శ్రమ దోపిడి అనీ మార్క్స్ నిరూపించాడు. తన అదనపు విలువ సిద్ధాంతంలో, యీ దోపిడి స్వభావాన్ని ఆయన వివరించి, పెట్టుబడిదారీ విధానపు చారిత్రక ధోరణిని — దాని శత్రుత్వపూరిత వర్గవైరుధ్యాలు తీవ్రతరం కావడాన్నీ, పెట్టుబడిపై శ్రమ సాధించే అంతిమ విజయాన్నీ — నిరూపించాడు. ఈ విధంగా, మార్క్స్ ఆర్థిక సిద్ధాంతంలో గతితార్కిక ఐక్యత యిమిడివుంది. అది ఆయనకన్న పూర్వపు అర్థశాస్త్రజ్ఞుల బూర్జువా భావాలను ఒకవంక తిరస్కరిస్తూనే మరోవంక, వారు సృజించినదానిలో సానుకూలమైన ప్రతి అంశాన్నీ సృజనాత్మకంగా అభివృద్ధిచేసింది. ఈ ఐక్యతను వెల్లడించి, వివరించడమే ఈ గ్రంథ లక్ష్యం.

శాస్త్రీయ సోషలిజానికి మార్క్సిజం-లెనినిజంయొక్క ఆర్థిక సిద్ధాంతాలే ఆధారం. ఈ సిద్ధాంతాలను పూర్తిగా అర్థంచేసుకొని, సృజనాత్మకంగా వాటిని అభివృద్ధిచెయ్యాలంటే వాటి మూలాన్నీ, పుట్టుకనూ వివరించడం చాలా ముఖ్యం.

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 19, p. 23.

మార్క్స్, అంతకు పూర్వపు అర్థశాస్త్రజ్ఞులూ

తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, శాస్త్రీయ కమ్యూనిజం — యీ మూడూ మార్క్సిజంయొక్క అంశీభూత భాగాలు. మార్క్సిస్టు తత్వశాస్త్రం గతితార్కిక, చారిత్రక భౌతికవాదం. సమాజాభివృద్ధి, దాని ఆర్థిక నిర్మితిలో వచ్చే మార్పులపైన ఆధారపడి వుంటుందన్నదే చారిత్రక భౌతికవాద మూలసూత్రం. అర్థశాస్త్రం యీ ఆర్థిక నిర్మితిని అధ్యయనంచేసి, సామాజికార్థిక నిర్మాణ రూపాల చలన నియమాలనూ, ఒక నిర్మాణ రూపాన్నుంచి మరో నిర్మాణ రూపానికి పరివర్తననూ వెల్లడిస్తుంది. శాస్త్రీయ కమ్యూనిజం సోషలిస్టు విప్లవపు సిద్ధాంతం, నూతన, కమ్యూనిస్టు సమాజ నిర్మాణ మార్గాల సిద్ధాంతం, యీ సమాజపు మౌలిక దశల, లక్షణాల సిద్ధాంతం.

మార్క్సిజపు అంశీభూత భాగాల్లో ప్రతి ఒక్కటీ అంతకు పూర్వపు చింతనాపరుల ప్రగతిశీల భావాల అభివృద్ధీ, ప్రపంచ విజ్ఞానశాస్త్ర అభివృద్ధీ కూడా. ఈ మూడు అంశీభూత భాగాలూ మార్క్సిజపు మూడు మూలాధారాలకూ అనుగుణంగా వుంటాయి. లెనిన్ రాసినట్లు "...మానవజాతి విశేషమైన పురోగమనాన్ని సాధించిన మూడు దేశాలలో పంథొమ్మిదవ శతాబ్దపు ప్రధాన సైద్ధాంతిక వాహినులైన మూడు ధోరణులను — సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రాన్నీ, సాంప్రదాయిక ఇంగ్లీషు అర్థశాస్త్రాన్నీ, మొత్తంమీద ఫ్రెంచి విప్లవాత్మక సిద్ధాంతాలతో సహా ఫ్రెంచి సోషలిజాన్నీ — కొనసాగించి పరిపూర్ణం చేశాడు మార్క్స్."*

ఈ సుప్రసిద్ధ ప్రధానాంశం, దాని పూర్తి ప్రగాఢత్వ, కచ్చితత్వాలలో, ప్రధానంగా మార్క్స్ రచనల్లోనే వెల్లడింపబడింది. హేగెల్, ఫాయెర్‌బాఖ్‌లకూ, స్మిత్, రికార్డోలకూ, సెంట్ సైమన్, ఫొరియర్‌లకూ తాను రుణపడివున్న ప్రతిదానినీ మార్క్స్ సవివరంగా, గొప్ప విశ్లేషణాత్మక ప్రగాఢ పరిజ్ఞానంతో వర్ణించాడు. మార్క్స్‌కి గల సుగుణాలలో పండితయోగ్యమైన అసాధారణమైన చిత్తశుద్ధి ఒకటి. ముఖ్యంగా, పద్దెనిమిదవ శతాబ్దపు, 19వ శతాబ్ది ప్రథమార్థపు ఆర్థిక సాహిత్యంలో ఆయన పరిజ్ఞానం సర్వసమగ్రమైనది.

మార్క్స్ ప్రధాన శాస్త్రీయ రచన అయిన "పెట్టుబడి"కి ఉపశీర్షిక "అర్థశాస్త్ర విమర్శ." ఈ రచనయొక్క నాల్గవ సంపుటియైన "అదనపు విలువ సిద్ధాం

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 21, p. 50.

తాల"ను అంతకు పూర్వపు అర్థశాస్త్రమంతటి విమర్శనాత్మక విశ్లేషణకు మార్క్స్ వినియోగించాడు. ప్రతి ఒక్క రచయితలోనూ పెట్టుబడిదారీ అర్థశాస్త్ర ప్రధాన కర్తవ్య పరిష్కారానికి తరతమ స్థాయిల్లో తోడ్పడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు చలనసూత్రాన్ని వెల్లడిచేసే శాస్త్రీయాంశాలను ఎత్తిచూపడమే దీనిలో మార్క్స్ అవలంబించిన ప్రధానమైన పద్ధతి. దానితోబాటే, గతానికి చెందిన యీ ఆర్థికశాస్త్ర వేత్తల అభిప్రాయాలలో వున్న బూర్జువా పరిమితులనూ, అసంగతత్వాలనూ ఆయన నిరూపించాడు.

మార్క్స్, తను దేనికైతే అపభ్రంశ అర్థశాస్త్రం అని పేరు పెట్టాడో, ఆ అర్థశాస్త్ర విమర్శకు గణనీయమైనంత స్థలాన్ని కేటాయించాడు. సిసలైన శాస్త్రీయ విశ్లేషణ కాక, పెట్టుబడిదారీ వ్యవస్థను న్యాయబద్ధమైనదిగా నిరూపించ ప్రయత్నించడం, బాహాటంగా దాన్ని వెనకేసుకు రావడమే యిందుకు కారణం. సహజంగానే, యీ బూర్జువా అర్థశాస్త్ర ధోరణియొక్క ప్రధాన ప్రతినిధులకు కూడా యీ పుస్తకంలో గణనీయమైనంత స్థలం కేటాయింపబడింది. బూర్జువా అర్థశాస్త్రవేత్తల సమర్థనాత్మక అభిప్రాయాల విమర్శనాక్రమంలో మార్క్స్ శ్రామికవర్గ అర్థశాస్త్రాన్ని అభివృద్ధిచేశాడు.

"పెట్టుబడి"నీ, అర్థశాస్త్రంపై మార్క్స్ రచించిన యితర రచనలనూ చదివినవాడికి, వాటిలో గతానికి చెందిన పలువురు శాస్త్రజ్ఞులు తారసపడతారు. ఇతర అన్ని విజ్ఞానశాస్త్రాల మాదిరిగానే అర్థశాస్త్రం కూడా గుర్తింపబడిన ప్రముఖ శాస్త్రజ్ఞుల కృషి ఫలితంగానే కాకుండా, పలువురు, తరచుగా అప్రసిద్ధ పండితులచేత కూడా అభివృద్ధిచెయ్యబడింది. సాంప్రదాయిక అర్థశాస్త్రం ఒకటిన్నర శతాబ్దాలపాటు సాగిన విస్తృతమైన ఒక ధోరణి. ఈ ధోరణిలో చాలామంది పండితులు రచనలు చేశారు. ఉదాహరణకు స్మిత్‌నే తీసుకుందాం. ఆయనకు ముందు కొన్ని తరాల అర్థశాస్త్రవేత్తలు కృషిచేసి, ఆయనకు కూలంకషమైన భూమికను సిద్ధంచేశారు. అందుచేత, యీ రంగంలోని అత్యంత ప్రముఖ వ్యక్తుల జీవితాలపైనా, భావాలపైనా ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తూనే, యీ పుస్తక రచయిత, అంతగా ప్రసిద్ధులు కాకపోయినప్పటికీ తరచుగా ప్రముఖ చింతనాపరులైన వారి కృషిని ప్రతిబింబించేందుకు కూడా ప్రయత్నించాడు. ఇలా చెయ్యడంలో, ఒక విజ్ఞానశాస్త్రంగా అర్థశాస్త్రపు అభివృద్ధి యొక్క రేఖా చిత్రాన్ని మరింత సమగ్రంగా యివ్వడమే రచయిత లక్ష్యం. ఈ పండితులు ఏ పరిస్థితులలో, ఏ సామాజిక, బౌద్ధిక "వాతావరణం"లో జీవించారో, కృషిచేశారో వివరించడం ముఖ్యం.

అర్థశాస్త్ర చరిత్రను స్మిత్, కెనే, రికార్డోల రచనలకు పరిమితంచెయ్యడం

అన్నది, ఉదాహరణకు గణితశాస్త్ర చరిత్ర యావత్తూ డేకార్ట్, న్యూటన్, లప్లాస్‌ల కార్యకలాపాల్లోనే యిమిడివుందని వాదించడం ఎంత పొరపాటో, అంత పొరపాటు. 17వ శతాబ్దపు కళా చరిత్రలు మహా కళాకారుడైన రెంబ్రాంట్‌నే కాకుండా "అప్రధాన డచ్చి చిత్రకారులను" కూడా గుర్తించాయి.

ఇప్పటికొక శతాబ్దంగా బూర్జువా విజ్ఞానశాస్త్రమూ, ప్రచారమూ ఒక శాస్త్రజ్ఞునిగా మార్క్స్ చరిత్రాత్మక పాత్రను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనిలో స్పష్టంగా గుర్తించగల రెండు వైఖరులు మనకి కనిపిస్తాయి. మార్క్సునూ, ఆయన విప్లవ బోధననూ అలక్ష్యం చెయ్యడమూ, ఆయనను అల్ప శాస్త్రీయ ప్రాముఖ్యం కలిగినవానిగానో లేక "పాశ్చాత్య సాంస్కృతిక సంప్రదాయ" బాహ్యునిగానూ, తత్పర్యవసానంగా, "నిజమైన" విజ్ఞానశాస్త్రానికి బాహ్యునిగానో చిత్రించడం మొదటి వైఖరి. దీనిలో మార్క్సుకూ, ఆయనకు పూర్వపు అర్థశాస్త్రజ్ఞులకూ, ప్రత్యేకించి సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రజ్ఞులకూ మధ్య సంబంధం తగ్గించబడి, తక్కువ అంచనా వెయ్యబడింది.

కాని యిటీవలి దశాబ్దాల్లో, మార్క్సును ఒక సామాన్య (లేక చివరకు అసామాన్య) హేగెలియనుగా, రికార్డియనుగా మార్చే రెండవ వైఖరి మరింత ప్రస్ఫుటంగా ముందుకు వచ్చింది. రికార్డోకూ, యావత్తు సాంప్రదాయిక ధోరణికీ మార్క్స్ సామీప్యత గట్టిగా ఉటంకించి చెప్పబడింది, కాని అర్థశాస్త్రంలో మార్క్స్ తెచ్చిన మూలమలుపు విప్లవాత్మక స్వభావం మరుగుపరచబడింది. ఆర్థిక చింతన చరిత్రపై 20వ శతాబ్దంలో వెలువడిన మిక్కిలి పెద్ద గ్రంథాలలో ఒకదాని రచయిత అయిన జె. ఎ. షుంపేటెర్ అవలంబించిన వైఖరి సరిగ్గా యిదే. మార్క్సును రికార్డియన్‌గా వర్గీకరించి, మార్క్స్ ఆర్థిక బోధన రికార్డో ఆర్థిక బోధనతో అతి తక్కువగా విభేదిస్తుందనీ, కాగా రికార్డోలోని లోపాలే దానిలోనూ ఉన్నాయనీ అంటాడతను. అయితే సందర్భవశాత్తూ యిక్కడొక విషయాన్ని చెప్పకోవాలి. చివరకు ఆ షుంపేటెర్ పైతం, మార్క్స్ రికార్డోయొక్క "యీ రూపాలను మార్చివేసి, చివరకు, ఎంతో భిన్నమైన నిర్ధారణలకు వచ్చాడు"* అని అంగీకరిస్తాడు.

మార్క్సిజాన్ని ఆధునిక బూర్జువా సామాజిక శాస్త్రంతోనూ, అర్థశాస్త్రంతోనూ సమన్వయపరచవచ్చుననీ, యివన్నీ ఒకే మూలంనుండి ఉత్పన్నంకావడమే యిందుకు కారణమనీ వక్కాణించి చెప్పబడుతూ వుండటం తరచుగా మనకు తటస్థపడుతూ

---

* J. A. Schumpeter, *History of Economic Analysis*, N. Y., 1955, p. 390.

వుంటుంది. సుప్రసిద్ధ బ్రిటిష్ లేబర్ సిద్ధాంతవేత్త అయిన జాన్ స్ట్రాచీ "సమకాలీన పెట్టుబడిదారీ విధానం" అనే తన రచనలో మార్క్సిజాన్ని పాశ్చాత్య సాంస్కృతిక సంప్రదాయాలతో సమ్మిళితం చేసేందుకు ప్రయత్నించాడు.

ఇటీవలి సంవత్సరాల్లో మార్క్స్‌పట్లా, మార్క్సిజంపట్లా బూర్జువా ఆర్థికవేత్తలలో ఆసక్తి గణనీయంగా పెరిగిందన్న సంగతి మనకు తెలిసినదే. మార్క్స్ ఉపదేశపు విడి అంశాలను వినియోగించుకోవాలన్న ప్రయత్నం వాళ్లకు బాగా సామాన్య విషయమైంది. ఆర్థిక పెరుగుదల, సంచయనం, జాతీయాదాయ పంపిణీ వంటి కీలక సమస్యలకు సంబంధించిన ఆర్థిక విధానంపై సిఫారసులను రూపొందించేటప్పుడు పరిస్థితుల వాస్తవికమైన అంచనాను యివ్వడం అవసరం అయ్యే సందర్భాల్లో, మరింత దూరదృష్టి కలిగిన పండితులు మార్క్సిస్టు విశ్లేషణ పద్ధతులపట్లా, ఫలితాలపట్లా తరచుగా ఆకర్షింపబడుతున్నారు.

ఉదాహరణకు, యీనాటిదాకా ఆర్థిక చింతన చరిత్రపై ఆర్. ఎల్. హైల్ బ్రోనర్ రచనలో మార్క్సిజంలో యీ ఆసక్తి పెరుగుదలను చూడవచ్చు. ఈ పుస్తకంలో మార్క్స్ జీవిత, కార్యకలాపాలను గురించిన ఆసక్తికరమైన వర్ణన వుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ యింతవరకు గురైన ఆర్థిక విశ్లేషణలలోకెల్లా మిక్కిలి గంభీరమూ, అత్యంత సునిశితమూ అయినది మార్క్సిస్టు ఆర్థిక విశ్లేషణేనని అతడు పేర్కొన్నాడు: "నైతిక పంథాలో ఔనన్నో, కాదన్నో చెయ్యబడిన పరిశీలన కాదది.... దానిలో ఎంత ఉద్వేగం యిమిడివున్నప్పటికీ కూడా, అదొక నిష్పాక్షికమైన అంచనా. సరిగా యీ కారణంగానే అది కనుగొన్న అస్పష్ట అంశాలను నిగ్రహంతో పరిశీలించాలి."*

పాశ్చాత్య దేశాల్లో యిటీవల అవతరించిన "రాడికల్" అర్థశాస్త్రం సాంప్రదాయిక సిద్ధాంతాల ఛాందసత్వాన్ని సవాలుచేస్తుంది. ఈ ధోరణికి ప్రతినిధులైనవారు, సామాజికార్థిక విశ్లేషణను నిరాకరించినందుకూ, వాటి రూప ప్రాధాన్య తత్వానికీ, వాటి నిస్సారతకూ ప్రధాన అర్థశాస్త్ర సంప్రదాయాలను ప్రత్యేకించి విమర్శిస్తారు. మార్క్స్‌ను రికార్డోతో జతచేసే వైఖరి పటుత్వాన్ని – సమాజంలో ఆదాయాల పంపిణీ సమస్య వర్గ విశ్లేషణ పటుత్వాన్ని – వాళ్లు నొక్కిచెప్తారు.

ఇది ప్రశంసనీయమైనదే. అయితే, మార్క్సిస్టు, బూర్జువా అర్థశాస్త్రాలను ఒకే శాస్త్రీయ అధ్యయన రంగంలోకి "మేళవించాలన్న" భావాన్ని మాత్రం తిరస్కరిం

---

* R. L. Heilbroner, *The Worldly Philosophers. The Lives, Times and Ideals of the Great Economic Thinkers*, 3rd edition, New York, 1968, p. 153.

చాల్సిందే. మార్క్సిస్టుల దృష్టిలో సమాజపు విప్లవాత్మక పరివర్తన ఆవశ్యకతని గురించి వాదించేందుకు ఆర్థిక సిద్ధాంతం ప్రాతిపదిక. కాని, బూర్జువా అర్థశాస్త్రవేత్తలు, రాడికల్స్‌తో సహా, యీ నిర్ధారణలను చేయరు.

కమ్యూనిస్టు, కార్మికవర్గోద్యమాలలోని సంస్కరణవాదమూ, మితవాద అవకాశ వాదమూ, మార్క్సిజాన్ని 19వ శతాబ్దంలోని సామాజిక చింతనయొక్క మానవతావాద, ఉదారవాద సంప్రదాయంలో మాత్రమే వేరూనుకొన్న ధోరణిగా పరిగణించేందుకు మొగ్గు చూపుతాయి. మార్క్సిజం ప్రధానంగా కార్మికవర్గపు విప్లవ భావజాలం అన్న విషయమూ, దానికీ, ఏ ఉదారవాద రూపానికీ పొందూ పోలికా బొత్తిగా లేదన్న విషయమూ మరుగుపరచబడుతూ వుంటుంది. మార్క్సిజంయొక్క సైద్ధాంతిక పార్శ్వం, దాని విప్లవాత్మక ఆచరణ పార్శ్వంనుండి తరచుగా వేరుజెయ్యబడుతూవుంటుంది.

జనసామాన్యంలో శాస్త్రీయ మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని వ్యాపింపజేసే కృషిలో "వామపక్ష" రివిజనిజంపైనా, పిడివాదంపైనా జరిపే పోరాటానికి విశేష ప్రాముఖ్యం వుంది. ఈ పెడధోరణులు మార్క్సిజానికి పూర్వుల సిద్ధాంతాలనూ, అభిప్రాయాలనూ నిర్లక్ష్యం చెయ్యబూనుకుంటాయి. అంతేకాక, మార్క్సిజంయొక్క శాస్త్రీయ విశ్లేషణాత్మక పార్శ్వాన్నీ, సామాజికాభివృద్ధి వస్తుపరమైన నియమాలకు అనుగుణంగా సంభవించే ఒక క్రమం అన్న దాని అభిప్రాయాన్నీ అవి తక్కువ చేసి చెప్తాయి. అర్థశాస్త్రంలో ఐచ్ఛికవాదమూ, రాజకీయాల్లో దుస్సాహసికతావాదమూ — యివే "వామపక్ష" రివిజనిజం విశిష్ట లక్షణాలు.

"నయా వామపక్ష"వాదులలో మార్క్సిజాన్ని ప్రూడన్, క్రొపోత్కిన్‌ల అరాజక వాద భావాలతో జోడించేవాళ్లు మనకి కనిపిస్తారు. ప్రూడన్, క్రొపోత్కిన్‌లకీ మార్క్సుకీ మధ్య ఎంతో భావసాన్నిహిత్యం వుందని వీళ్లు అంటూ వుంటారు. కాని, అనేక సంవత్సరాలపాటు మార్క్సు ఎంగెల్సులు ప్రూడన్‌కీ, ఆయన ఉపదేశానికీ వ్యతిరేకంగా తీవ్ర పోరాటం జరిపారన్నది సుపరిచిత విషయం. "ప్రతికూల సంస్కృతీ" భావం ఒక్కొక్క మారు బూర్జువా సంస్కృతియొక్క సకల పార్శ్వాల, సమస్తాంశాల నిరాకరణలోకి పరిణమిస్తూ వుంటుంది. గాలిలోంచి ఒక కొత్త, బూర్జువా వ్యతిరేక సంస్కృతిని నిర్మించే ప్రయత్నాల అసంగతత్వాన్నీ, ప్రమాదాన్నీ సిద్ధాంతాచరణలలో మార్క్సిజం-లెనినిజం నిరూపించింది. కొత్త సంస్కృతి పాతదాని అత్యుత్తమ, ప్రగతిశీల అంశాలను వినియోగించుకుంటుందేగాని, దాన్ని తిరస్కరించి చేజార్చుకోదు.

మార్క్సు, ఎంగెల్స్, లెనిన్‌లు పెట్టుబడిదారీ వ్యవస్థను సరైనదని సమర్థించే బూర్జువా ఆర్థిక సిద్ధాంతాలను విమర్శించి, వాటి బండారాన్ని బహిర్గతంచేసి, వాటి సామాజిక మూలాలనూ, లక్ష్యాలనూ, ఆర్థికాభివృద్ధి నియమాలకూ, క్రమాలకూ

సంబంధించిన వాటి మిడిమిడి, అశాస్త్రీయ దృక్పథాన్నీ వెల్లడించారు. కార్మికవర్గో ద్యమాన్ని నష్టపరచి, తన విప్లవాత్మక కర్తవ్యాలనుండి దాన్ని మళ్ళించే ప్రమాదకర మైన భావజాలంపైన వారు ప్రత్యేకించి రాజీలేని దాడులుచేశారు.

అదేసమయంలో, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు తమ విమర్శనద్వారా, బూర్జువా ఆర్థిక భావనలనుండి వస్తుగతమైన యథార్థపు అవగాహనకు తోడ్పడే హేతుబద్ధ అంశాలను ఎంపికచేయ సంకల్పించారు. బూర్జువా పండితుల నిర్దిష్ట ఆర్థిక రచనల అధ్యయనావసరాన్ని వారు ప్రత్యేకించి నొక్కిచెప్పారు.

మూడు శతాబ్దాలు

ఆర్థికవేత్తల భావాలు చాలవరకు, వారి దేశపు సమాజంయొక్క, ఆర్థిక వ్యవస్థ యొక్క అభివృద్ధి స్థాయిచేత నిర్ణయింపబడతాయి. అందుచేత వారి జీవిత, కార్య కలాపాల వర్ణనలలో ఆయా దేశ కాలాల ఆర్థిక లక్షణాల సంగ్రహ రేఖాకృతులను కూడా యీ గ్రంథ పాఠకుడు చూస్తాడు.

17వ శతాబ్దంనుండి 19వ శతాబ్దంవరకు అర్థశాస్త్ర అభివృద్ధి ఒక నూతన సామాజిక వ్యవస్థయైన పెట్టుబడిదారీ విధానంచేత ముందే నిర్ణయించబడింది. ఆ కాలంలో అది ప్రగతిశీలమైన వ్యవస్థ. అప్పుడు ప్రతిభా, బలీయమైన వ్యక్తిత్వమూ కలిగిన వ్యక్తులు, గొప్ప చింతనాపరులు ఆవిర్భవించారు.

ఆ మూడు శతాబ్దాల ఆర్థికవేత్తలూ ఒక చోట కూడినట్లు ఊహించుకొనేందుకు ఒక క్షణంపాటు మనం ప్రయత్నిద్దాం. ఎంతటి వైవిధ్యపూరితమైన సమూహమది!

వారిలో అత్యధికులు ఆంగ్లేయులు, మధ్యమధ్య కాస్త ఎక్కువగానే ఫ్రెంచివాళ్లు కనిపిస్తారు. దీన్ని మనం అర్థంచేసుకోవచ్చు. అప్పట్లో ఇంగ్లండే అగ్రశ్రేణి పెట్టు బడిదారీ దేశం. మార్క్స్ కాలంలో సైతం అర్థశాస్త్రం యింకా ప్రధానంగా ఆంగ్లేయ విజ్ఞానశాస్త్రంగానే పరిగణింపబడుతూండేది. ఫ్రాన్సులో సైతం పెట్టుబడిదారీ విధానం మిగిలిన అత్యధిక సంఖ్యాక దేశాలలో కంటె ముందుగా అభివృద్ధిచెంద నారంభించింది. తత్ఫలితంగా "అర్థశాస్త్రం" (political economy) అన్న పదబంధం మొట్టమొదట ఫ్రెంచి భాషలోనే కూర్చబడింది. ఈ కాలపు ఆర్థికశాస్త్రవేత్తలలో అమెరికన్లు కొద్దిమందే వున్నారు, కాని వారిలోనే వివేకవంతుడైన ఫ్రాంక్లిన్ కూడా వున్నాడు.

మార్క్స్ మాటల్లో చెప్పాలంటే, తొలి ఆర్థికశాస్త్రవేత్తలు సర్వసామాన్యంగా "వ్యాపారస్తులూ, రాజనీతిజ్ఞులూ"ను. ఆర్థిక వ్యవస్థ, వర్తక, రాజ్య నిర్వహణావసరాల మూలంగా వారికి ఆర్థిక సమస్యలపై ఆలోచించవలసిన ప్రేరణ కలిగింది.

అరుగో అటు చూడండి, సుదీర్ఘమైన జాలపాల జాట్లు పెద్దమనుషులను, పెట్టుబడిదారీ సంచయనపు తొలి దశకు చెందిన షేక్స్పియర్ సమకాలికులను, లేసు దుస్తుల వర్తకులను. వీళ్లు రాజ సలహాదారులైన వ్యాపారవాదులు — మొంక్రెట్యేన్, థామస్ మన్లు.

మరో బృందాన్ని చూద్దాం. ఇక్కడ సాంప్రదాయిక అర్థశాస్త్ర సంస్థాపకులైన పెద్ద విగ్గులూ, వెనక్కి మడతపెట్టబడిన వెడల్పాటి పొడుగు కోట్లూ ధరించిన పెట్టీ, బువాగిల్బేర్, ఆడమ్ స్మిత్‌కు పూర్వులైన యితరులూ మనకి కనిపిస్తారు. వారు వృత్తిరీత్యా అర్థశాస్త్రంలో నిమగ్నులు కారు, అటువంటి వృత్తి అంటూ అప్పటికి యింకా లేనేలేదు. పెట్టీ — వైద్యుడూ, అసఫల రాజకీయవేత్త; బువాగిల్బేర్ — ఒక జడ్జి. లోక్ — ఒక ప్రసిద్ధ తత్వవేత్త. కంటిల్యోన్ — ఒక బ్యాంకరు. వాళ్లు మామూలుగా రాజులనూ, ప్రభుత్వాలనూ ఉద్దేశించి రాస్తారు. అయితే వాళ్లు విజ్ఞులైన పౌరులను ఉద్దేశించి కూడా రాయనారంభిస్తున్నారు. మరి మొట్టమొదటిసారిగా యీ కొత్త విజ్ఞానశాస్త్రపు సైద్ధాంతిక సమస్యలను వాళ్లు ముందుకు తెస్తున్నారు. పెట్టీ ప్రత్యేకించి ప్రముఖంగా కనిపిస్తాడు. అతను ఉజ్వల ఆలోచనాశీలియే గాక, భాస్వంతమైన విశిష్ట వ్యక్తి కూడా.

ఇదిగో చురుకైన యీ విగ్రహం, గొప్ప పథకకర్తా, సాహసపరుడూ, కాగితం డబ్బు "సృష్టికర్తా," ద్రవ్యోల్బణపు తొలి సిద్ధాంతకర్తా, ఆ సిద్ధాంతాన్ని ఉపయోగంలో పెట్టినవాడూ అయిన జాన్ లాది. లా ఉన్నతీ, పతనమూ 18వ శతాబ్దారంభంలో ఫ్రాన్సు చరిత్రలోని అత్యంత ఉజ్వలమైన పుటల్లో ఒకటి.

చిత్రాలలో మొల్యేర్, స్విఫ్ట్‌ల తలలపై మనకి కనిపించే పెద్దపెద్ద విగ్గుల స్థానాన్ని కణతల దగ్గర రెండు ఉంగరాలతో పొడరుకొట్టిన పొట్టి విగ్గులు ఆక్రమించాయి. పిక్కలమీద సిల్కు మేజోళ్లు కనిపిస్తాయి. వీళ్లు 18వ శతాబ్ది మధ్యానికి చెందిన ఫ్రెంచి ఆర్థికవేత్తలు, వైతాళిక యుగ మహా తత్వవేత్తల మిత్రులైన ఫిజియోక్రాట్లు. వాళ్ల తిరుగులేని నాయకుడు వృత్తిరీత్యా వైద్యుడూ, వ్యావృత్తిరీత్యా ఆర్థికవేత్తా అయిన ఫ్రాన్సువా కెనే, మరో ప్రముఖ పండితుడు ట్యూర్గో. విప్లవ పూర్వపు ఫ్రాన్సులో ట్యూర్గో అత్యంత వివేచనాపరుడైన, ప్రగతిశీల రాజనీతివేత్త.

ఆడమ్ స్మిత్.... విదేశాల్లో బహుళజనాభిమానాన్ని చూరగొన్న వ్యక్తి.

ఆయన జీవిత చరిత్రా న్యూటన్ జీవిత చరిత్ర వంటిదే: ఈ యిద్దరి జీవితాల్లోనూ బాహ్య ఘటనలు తక్కువగానూ, ఆంతరిక మేధో జీవితం అతి ప్రగాఢంగానూ కనిపిస్తాయి.

స్మిత్ అనుయాయుల పేర్లను లెక్కిస్తే అవి అసంఖ్యాకంగా కనిపిస్తాయి. 18వ శతాబ్దం చివరా, 19వ శతాబ్దం మొదటా అర్థశాస్త్రంలో నిమగ్నుడవడమంటే

స్మిత్ అనుయాయిగా ఉండటమనే అర్థం. ఈ గొప్ప స్కాట్‌వానిని "రైటుకి తిప్పడం" మొదలైంది. రైటుకి తిప్పడం, అంటే ఒకప్పుడు "మితవాద పద్ధతిలో రైటుకి తిప్పడం" మొదలెట్టారు. ఫ్రాన్సులో సేయ్ వంటివారిచేతా, ఇంగ్లండులో మాల్తస్ చేతా యీ పని చెయ్యబడింది. విశ్వవిద్యాలయాల్లో అర్థశాస్త్ర బోధన ఆరంభమై, ఉన్నత వర్గాలకు చెందిన యువకులకు అర్థశాస్త్రాభ్యాసం ఒక "తప్పనిసరి" విషయంగా తయారవుతోంది.

ఇప్పుడిక సంపన్న స్టాక్ ఎక్స్‌చేంజి వ్యాపారస్తుడూ, స్వయంబోధిత మహామేధావీ అయిన డేవిడ్ రికార్డో రంగంమీదకి వస్తాడు. ఇది నెపోలియన్ యుగమేమో, అందు కని, సహజంగానే రికార్డోకు విగ్గు వుండదు. లాంగు కోటుకూ, మోకాలిదాకా వచ్చే మేజోళ్లకూ బదులు ఫ్రాక్ కోటూ, మోకాలి కిందికి బిగించికట్టబడే పొడవుపాటి బిగుతైన లాగూ ధరించాడు. బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రాభివృద్ధిని రికార్డో పూర్తిచెయ్యవలసివుంది. కాని, పెట్టుబడిదారీ సమాజంలోని ప్రధాన వర్గాల— బూర్జువావర్గం, కార్మికులు—ప్రయోజనాల మధ్య వైరుధ్యాన్ని గురించి పేర్కొన్న రికార్డోపైన, ఆయన జీవిత కాలంలోనే దాడులు ప్రారంభమయ్యాయి.

రికార్డో అనుయాయులు అనేక భిన్నభిన్న బృందాలుగా విభజితులయ్యారు. ఒక వంక, రికార్డో సిద్ధాంతాలను బూర్జువావర్గానికి వ్యతిరేకంగా వినియోగించుకునేందుకు సోషలిస్టులు ప్రయత్నించారు. మరోవంక, బూర్జువా విజ్ఞానశాస్త్రంలో రికార్డో బోధనల అవశేషంపైన అపభ్రంశ అర్థశాస్త్రం అభివృద్ధిచెయ్యబడింది. ఈ విధంగా మనం 1840 దశాబ్దాన్ని చేరుకుంటాం. ఈ దశాబ్దంలో కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సుల కార్యకలాపాలు మొదలవడాన్ని మనం చూస్తాం.

బూర్జువావర్గంలోని మిక్కిలి ప్రగతిశీల విభాగపు భావాలను వ్యక్తంచేసే క్రమంలో సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలు, ఇంగ్లండులో దృఢంగా కాలూనుకున్న, 18వ శతాబ్ది చివర విప్లవం దాకా ఫ్రాన్సులో ప్రాబల్యంలో వున్న ఫ్యూడల్, భూస్వామ్య ప్రభు వర్గంతో ఘర్షణపడ్డారు. ప్రభువర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసిన రాజ్యాధికారంతోనూ, అధికారిక చర్చితోనూ వారు ఘర్షణపడ్డారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రతిదాన్నీ వారు ఎంతమాత్రమూ గుర్తించనూ లేదు, అంగీకరించనూ లేదు. తత్పర్యవసానంగా పలువురు ఆర్థికవేత్తల జీవితాలు నిరసన, తిరుగుబాటు, పోరాటాలతో నిండివున్నాయి. జాగరూకుడైన స్మిత్ సైతం అభివృద్ధి నిరోధక శక్తుల దాడులకు గురిచెయ్యబడ్డాడు. మార్క్స్ పూర్వకాల సోషలిస్టులలో ఉన్నత సూత్రాలకు కట్టుబడివుండి, గొప్ప పౌర, వ్యక్తిగత ధైర్యసాహసాలు కలిగినవారు మనకు కనిపిస్తారు.

మన పరిశీలనలో వున్న కాలంలో రష్యాలో వ్యుత్పన్నులైన సాహసిక ఆలోచనాశీలురు

కొందరు ఉద్భవించిన మాట నిజమే అయినప్పటికీ, రష్యాలోని ఆ మార్గదర్శక ఆర్థిక వేత్తలను గురించి యీ పుస్తకంలో ప్రత్యేకించి వివరించబడదు. ఈ సందర్భంగా పీటర్ ది గ్రేట్ కాలానికి చెందిన శాస్త్రజ్ఞుడూ, చక్కని రష్యన్ రచయితా అయిన ఐ. పొసొష్కోవ్‌ను పేర్కొంటే సరిపోతుంది. రష్యాలో ప్రత్యేకించి ఆర్థిక సమస్యలకు పరిమితమైన తొలి వ్యాసం రచించినవాడు యీ పొసొష్కోవే. ఎ. రదీశ్చెవ్ (1749–1802) సామాజిక ఆర్థిక సమస్యలపట్ల విశేషమైన శ్రద్ధ కనబరిచాడు. విప్లవాత్మక వివేకవర్ధకుడూ, ప్రసిద్ధ గ్రంథమైన "పీటర్స్‌బుర్గ్‌నుండి మాస్కోకు యాత్ర" రచయితా అయిన రదీశ్చెవ్, ఆ గ్రంథంలో భూస్వాములను, రాజరికాన్ని సైతం విమర్శించాడు.

1825 డిసెంబరులో జారుకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపేందుకు ప్రయత్నించిన తొలి రష్యన్ విప్లవోద్యమ భాగస్వాములైన డిసెంబ్రిస్టులు ముఖ్యమైన కొన్ని ఆర్థిక రచనలు చేశారు. వీటిలో ఎన్. తుర్గెనెవ్ (1789–1871), పి. పేస్తెల్ (1793–1826), ఎమ్. ఒర్లోవ్‌ల రచనలు ప్రత్యేకించి కొట్టవచ్చి నట్లు కనిపిస్తాయి. రష్యన్ మహా రచయితా, విప్లవ ప్రజాస్వామ్యవాదీ అయిన ఎన్. చెర్నిషేవ్‌స్కీ (1828–1889) గొప్ప ప్రాగల్భ్యం కలిగిన ఆర్థిక చింతనాపరుడు, బూర్జువా అర్థశాస్త్రపు ప్రతిభావంతుడైన విమర్శకుడు. చెర్నిషేవ్‌స్కీ శాస్త్రీయ రచనలనూ, ప్రత్యక్ష కార్యకలాపాలనూ మార్క్స్ ఉన్నతమైనవిగా పరిగణించాడు.

కాని, 18వ శతాబ్దంలోనూ, 19వ శతాబ్ది మొదట్లోనూ ఆర్థికాభివృద్ధి విషయంలో రష్యా పశ్చిమ యూరపియన్ దేశాలకన్న బాగా వెనకబడివుంది. రష్యాలో భూదాస్యం యింకా అమల్లో వుంది, బూర్జువా ఉత్పత్తి సంబంధాలు యింకా పిండ దశలో మాత్రమే వున్నాయి. రష్యన్ ఆర్థిక ఆలోచనాభివృద్ధిలో కొట్టవచ్చినట్లు కనిపించే యీ విశిష్ట స్వభావానికి యిదే కారణం. అదే సమయంలో, మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం రష్యాలో సారవంతమైన సుక్షేత్రంలో పడి, త్వరలోనే వేరూనుకొంది. "పెట్టుబడి" గ్రంథం అనువదింపబడిన తొలి భాష రష్యనే. మార్క్స్ ఉపదేశానికీ, స్మిత్, రికార్డోల సిద్ధాంతాలకూ మధ్య సంబంధాన్ని విశ్లేషించిన మొదటివారిలో కీయెవ్ నగరానికి చెందిన ప్రొఫెసరు ఎన్. ఎన్. జిబెర్ ఒకడు.

అర్థశాస్త్రంపైన రచింపబడిన కొన్ని గంభీరమైన గ్రంథాలను కొనసకంటా చదవడం, హైల్‌బ్రోనర్ చెప్పినట్లు, పాఠకుడికి "ఒంటెకున్నంత ఓర్పూ, సాధుపుంగవుడికున్నంత సహిష్ణుతా" అవసరముండదని ఆశిద్దాం.

ఈ విధంగా బానిస యాజమాన్య సమాజపు అర్థశాస్త్రంనుండి 19వ శతాబ్ది మధ్యకాలపు అర్థశాస్త్రాభిముఖంగా బయల్దేరుదాం. ఈ సుదీర్ఘ యానంలో కీలకమైన ఘట్టాల దగ్గర పలు మజిలీలు చేసుకొంటూ మనం ముందుకు సాగుతాం.

ప్రకరణం 1

ఆరంభం

ఆదిమ మానవుడు మొదటి గొడ్డలినీ, విల్లమ్ములనూ తయారుచేసుకున్నప్పుడు, అది ఆర్థిక వ్యవస్థ కాదు. ఒక విధంగా చెప్పాలంటే, అది సాంకేతిక విజ్ఞానం మాత్రమే.

కాని తర్వాత ఒక వేటగాండ్ర బృందం అనేక గొడ్డళ్లతో, విల్లమ్ములతో వెళ్లి ఒక లేడిని చంపారు. ఆ లేడి మాంసం వాళ్ల మధ్య సమానంగా పంచుకోబడి ఉంటుంది: కొందరు మిగిలినవారి కంటె ఎక్కువ పొందేవుంటే, ఆ మిగిలినవాళ్లు బతికి బట్టకట్టలేకపోయి వుండేవాళ్లు. తరువాత సమష్టి సమాజపు జీవితం మరింత సంక్లిష్టంగా తయారైంది. తను స్వయంగా వేటలో పాల్గొనకపోయినప్పటికీ వేటగాళ్ల కోసం మంచి వవిముట్లను తయారుచేసిన ఒక వృత్తిపనివాడు ఉన్నాడనుకుందాం. అప్పుడు మాంసాన్నీ, చేపలనూ వేటగాళ్లూ, చేపలు పట్టినవారూ — వృత్తిపనివాడు మొదలైన వారికి ఒక వాటాను వదిలిపెట్టి — పంచుకోవలసివుంటుంది. ఒకానొక దశలో, సమష్టి సమాజాల మధ్యా, సమష్టి సమాజం లోపలా శ్రమోత్పాదితాల మార్పిడి ప్రారంభమైంది.

ఇదంతా కలిసి — యింకా ఆదిమమూ, అభివృద్ధిచెందనిదే అయినప్పటికీ — ఆర్థిక వ్యవస్థ అయింది. ఈ వ్యవహారం — విల్లు, గొడ్డలి, లేక మాంసం వంటి వస్తువులతో మనుషుల సంబంధాలకు సంబంధించినదే కాకుండా, సమాజంలో వారి పరస్పర సంబంధాలకు కూడా సంబంధించినది కావడమే యిందుకు కారణం. మరి ఈ సంబంధాలైనా సాధారణ సంబంధాలు కాక, మనుషుల జీవితాలకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి పంపిణీలతో అనుబంధితమైన పాదార్థిక సంబంధాలు. మార్క్సు యీ సంబంధాలనే ఉత్పత్తి సంబంధాలు అన్నాడు.

పాదార్థిక వస్తువుల సామాజిక ఉత్పత్తీ, మార్పిడీ, పంపిణీ, వినిమయాలూ, యీ ప్రాతిపదికపైన ఉత్పన్నమయ్యే ఉత్పత్తి సంబంధాలూ వెరసి ఆర్థిక వ్యవస్థ అవుతాయి. ఈ అర్థంలో ఆర్థికశాస్త్రం అన్నది మానవ సమాజమంత ప్రాచీనమైనది. ఆదిమ సమాజపు ఆర్థిక వ్యవస్థ నిజంగానే అత్యంత సరళమైనది. అప్పటి మను

షులు వాడిన పనిముట్లు కూడా మిక్కిలి సరళమైనవి కావడం, వారి శ్రమ నైపుణ్యాలు బాగా పరిమితం కావడమే యిందుకు కారణం. మరోవిధంగా చెప్పాలంటే, ఒక సమాజపు ఉత్పత్తి సంబంధాలనూ, దాని ఆర్థిక వ్యవస్థనూ, ఆ సమాజ జీవితపు యితర పార్శ్వాలనూ నిర్ణయించే ఉత్పాదక శక్తులు బాగా అభివృద్ధి చెందలేదన్నమాట.

మొట్టమొదటి ఆర్థికవేత్త ఎవరు?

మంట ఎందుకు మండుతోంది, లేక ఉరుము ఎందుకు గర్జిస్తోంది అని మనిషి మొట్టమొదటిసారిగా ఎప్పుడు ఆలోచించనారంభించాడు? బహుశా అనేక వేల సంవత్సరాల క్రితం అయివుంటుంది. తొలి వర్గసమాజమైన బానిసయాజమాన్య సమాజంలోకి క్రమంగా మారుతూవుండిన ఆదిమ సమాజపు ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విషయాలను కూడ అలాగే చాలా కాలం క్రితమే అతను ఆలోచించుకున్నాడు. ఈ ఆలోచనలే ఒక విజ్ఞానశాస్త్రం — ప్రకృతికీ, సమాజానికీ సంబంధించిన మానవ జ్ఞాన విధానం — కావు, కాజాలవు కూడా. ఇంకెంతో బాగా అభివృద్ధిచెందిన ఉత్పాదక శక్తులపై ఆధారపడిన పరిణత బానిస యాజమాన్య సమాజ యుగందాకా విజ్ఞానశాస్త్రం అవతరించలేదు. నాలుగైదు వేల సంవత్సరాలకు పూర్వం వున్న ప్రాచీన రాజ్యాలైన సుమేరియా, బాబిలోన్, ఈజిప్టులలో గణితశాస్త్రంలోనూ, లేక వైద్య విజ్ఞానంలోనూ మనుషులకుగల జ్ఞానం ఒక్కొక్కమారు పరమ విభ్రాంతికరంగానే వుంటుంది. ప్రాచీన జ్ఞానానికి సంబంధించి మిగిలిన అతిచక్కని నమూనాలు ప్రాచీన గ్రీకులకూ, రోమన్లకూ చెందినవి.

17వ శతాబ్దంలో అర్థశాస్త్రం అన్న విజ్ఞానశాస్త్ర ప్రత్యేకశాఖ ఆవిర్భావానికి చాలా ముందే ఆర్థిక జీవిత వాస్తవాల అవగాహనకు నిర్దిష్టమైన కృషి ఆరంభమైంది. ఈ విజ్ఞానశాస్త్రం పరిశీలించిన అనేక ఆర్థిక విషయాలు — మారకం, డబ్బు, ధర, వర్తకం, లాభం, వడ్డీ — ప్రాచీన ఈజిప్షియన్లకూ లేక గ్రీకులకూ అంతకుముందే తెలుసు. అన్నిటికన్న ముఖ్య విషయమేమిటంటే, ఆ యుగంలోని ఉత్పత్తి సంబంధాల ప్రధాన లక్షణం అయిన బానిసత్వం గురించి మనుషులు ఆలోచించనారంభించారు.

ఆదిలో ఆర్థిక ఆలోచన సమాజాన్ని గూర్చిన తదితర చింతన రూపాలకు వేరుగా లేదు. అందుచేత, ఆర్థిక ఆలోచన అన్నది కచ్చితంగా మొట్టమొదట ఎప్పుడు అవతరించిందో చెప్పడం అసాధ్యం. కాగా, ఆర్థిక చరిత్రకారులు భిన్నభిన్న కాలాలను ఆరంభ కాలాలుగా పరిగణించడంలో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. కొన్ని చరిత్రలు ప్రాచీన

గ్రీకులతో ప్రారంభం కాగా, మరికొన్ని ప్రాచీన ఈజిప్షియన్ భూర్జపత్రాలతోనూ, వేరేకొన్ని త్రికోణపు రాతి పలకలమీద చెక్కబడిన హమ్మురబీ సంకేత లిపితోనూ, యింకా కొన్ని హిందూ వేదాలతోనూ మొదలవుతున్నాయి.

పాలస్తీనాలోనూ, దాని పరిసర దేశాల్లోనూ క్రీస్తుకు పూర్వం రెండవ, మొదటి సహస్రాబ్దాలలో నివసించిన ప్రజల ఆర్థిక జీవితానికి సంబంధించిన ఆర్థిక ప్రస్తావనలనూ, వ్యాఖ్యానాలనూ మనం బైబిలులో చూడగలం.

కాని, ఉదాహరణకు, ఆర్థికశాస్త్రపు అమెరికన్ చరిత్రకారుడైన ప్రొఫెసర్ జె. ఎఫ్. బెల్, బైబిలుకి ఒక పెద్ద ప్రకరణాన్ని వినియోగించి, ఆ దశకు చెందిన తదితర ఆధారాలన్నింటినీ పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు. దీనికీ, విజ్ఞానశాస్త్రానికీ సంబంధమేమీ లేదనుకోవలసి వుంటుంది. అదేమిటంటే, బైబిలు క్రిస్టియన్ మత పవిత్ర గ్రంథం, అమెరికన్ విద్యార్థుల్లో అత్యధిక సంఖ్యాకులకు చిన్నతనంనుండీ దానితో బాగా పరిచయం వుంది. అందుకని, ఆధునిక జీవితానికి సంబంధించిన ఈ వాస్తవానికి పరిశోధన తనను తాను కొంతమేరకు సరిబుచ్చుకుంటోందన్నమాట.

ప్రాచీన గ్రీకు సమాజానికి, ఆదిమ సమాజం బాగా పతనమైపోయి, బానిస యాజమాన్య వ్యవస్థ రూపొందిన దశలో, హోమర్ గీతాలలో అద్భుతమైన సాహిత్య చిత్రణ యివ్వబడింది. సుమారు మూడు వేల సంవత్సరాల క్రితం ఈజియన్, అయోనియన్ సముద్ర తీరాలలో నివసించిన మనుషుల జీవితానికీ, తత్వశాస్త్రానికీ మానవ సంస్కృతి యొక్క యీ స్మారకచిహ్నాలు ఒక వాస్తవ విజ్ఞాన సర్వస్వం. ట్రాయ్ నగర ముట్టడికీ, ఒడిస్సస్ యాత్రలకూ సంబంధించిన ఉత్తేజకరమైన గాథ అనే రత్నకంబళంలోకి అత్యంత వైవిధ్య పూరితమైన ఆర్థిక విషయాలు నిపుణంగా అల్లబడ్డాయి. "ఒడిస్సీ" మహాకావ్యంలో బానిస శ్రమ హీన ఉత్పాదకతకు రుజువులున్నాయి.

> యజమాని లేకుంటే, బానిసలకు పట్టపగ్గాలుంటాయా?
> కల్లోలం చెలరేగినచోట మానవాళి మనుతుందా?
> బ్రహ్మ ఎన్నడో రాసిపెట్టాడు, ఏనాడైతే మనిషి
> బానిస అవుతాడో, ఆనాడే వాడు విలువ సగం కోల్పోతాడు.

సహజంగానే, హమ్మురబీ ప్రవర్తన నియమావళినీ, బైబిలునూ, హోమర్ రచనలనూ ప్రాచీన జనసముదాయాల ఆర్థిక జీవితానికి మూలాధారాలుగా చరిత్రకారులూ, ఆర్థికవేత్తలూ పరిగణించవచ్చు. ఈ రచనలను ఆర్థిక ఆలోచనకు రెండో పక్షంలో మాత్రమే ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఆర్థిక ఆలోచనకు కార్యకలాపాలను

కొంతమేరకు సాధారణీకరించడమూ, ఊహను సారించడమూ, అనిర్దిష్ట భావ సంగ్రహణమూ పూర్వావసరాలు. సుప్రసిద్ధ బూర్జువా పండితుడైన జోసెఫ్ ఎ. షుంపేటెర్ (తన జీవిత ద్వితీయార్ధంలో అమెరికాలో జీవించిన ఆస్ట్రియన్ దేశస్థుడు) తన పుస్తకానికి "ఆర్థిక విశ్లేషణ చరిత్ర" అని పేరుపెట్టి, దాన్ని సాంప్రదాయిక గ్రీకు చింతనాపరులతో మొదలుపెట్టాడు.

క్సెనొఫోంట్, ప్లాటో, అరిస్టాటిల్‌ల రచనలలో గ్రీకు సమాజపు ఆర్థిక నిర్మితికి సంబంధించిన సైద్ధాంతిక వివరణలనిచ్చేందుకు తొలి ప్రయత్నాలు ఉన్నమాట నిజమే. మన ఆధునిక సంస్కృతిని ఆ చిన్న జనసముదాయపు ప్రశంసనీయమైన నాగరికతతో కలిపే సూత్రాలు ఎన్ని వున్నాయన్న విషయాన్ని మనం ఒక్కొక్కసారి మరచిపోయేందుకు ఉన్ముఖులమవుతాం. మన విజ్ఞానశాస్త్రం, మన కళ, మన భాషా ప్రాచీన గ్రీకు నాగరికతా మూలాంశాలను జీర్ణించుకున్నాయి. ఆర్థిక ఆలోచనను గురించి మార్క్స్ యిలా అన్నాడు: "గ్రీకులు యీ రంగంలోకి మధ్యమధ్య విహారం చేసిన మేరకు, మిగిలిన అన్ని రంగాల్లో మాదిరిగానే ఆదే ప్రతిభావ్యుత్పన్నతలను ప్రదర్శిస్తారు. ఈ కారణంగా, వారి అభిప్రాయాలు, చారిత్రకంగా, ఆధునిక విజ్ఞానశాస్త్రపు సైద్ధాంతిక ఆరంభ బిందువులవుతున్నాయి."*

ఆర్థికవ్యవస్థ (ఎకానమీ) అన్న పదం (οικος) — గృహం, νομος — పాలన, శాసనం అన్న పదాలనుండి ఏర్పడిన (οικονομια) క్సెనొఫోంట్‌యొక్క ఒక ప్రత్యేక రచనకు శీర్షిక. క్సెనొఫోంట్ దీనిలో గృహ నిర్వహణకూ, వ్యవసాయానికీ అర్థవంతమైన నియమాలను పరిశీలించాడు. ఈ పదం ఆ అర్థాన్ని (గృహ నిర్వహణ విజ్ఞానం) చాల శతాబ్దాల పాటు నిలుపుకుంది. గ్రీకుల కాలంలో యీ పదానికి మనం గృహ నిర్వహణ అనే మాదిరి పరిమితార్థం లేని మాట నిజమే. ధనికుడైన ఒక గ్రీకు గృహం అన్నదొక మొత్తం బానిసయాజమాన్య ఆర్థిక వ్యవస్థా, ప్రాచీన ప్రపంచపు సూక్ష్మరూపమూ కావడమే యిందుకు కారణం.

అరిస్టాటిల్ "economy" (ఆర్థిక వ్యవస్థ), దానినుండి ఉత్పన్నమైన "economics" (ఆర్థికశాస్త్రం) అన్న పదాలను యీ అర్థంలోనే ప్రయోగించాడు. మౌలిక ఆర్థిక విషయాలనూ, తన కాలపు సమాజ నియమాలనూ విశ్లేషించినవాడు అరిస్టాటిలే. ఈ వాస్తవం కారణంగానే విజ్ఞానశాస్త్ర చరిత్రలో ఆయన ప్రప్రథమ ఆర్థికవేత్త అయాడు.

---

* ఫ్రెడరిక్ ఎంగెల్స్, "ఆంటీ డ్యూరింగ్," మాస్కో, 1969, పేజి 271 ("ఆంటీ డ్యూరింగ్" 2వ భాగపు 10వ ప్రకరణాన్ని మార్క్స్ రాశాడు).

ఆద్యుడు అరిస్టాటిల్

క్రీ. పూ. 336లో మాసిడన్ రాజైన ఫిలిప్, తన కూతురు వివాహ సమయంలో ద్రోహపూరితంగా హత్యచెయ్యబడ్డాడు. ఈ నేర ప్రోత్సాహకులెవరో ఎన్నడూ కనుగొనబడనే లేదు. పర్షియా పాలకులే యీ ఘాతుకానికి ఒడిగట్టారన్న కథనం నిజమైనట్లయితే, వాళ్లు స్వయంగా తమకు తాము చేసుకోగల యింతకు మించిన వినాశకరమైన పని మరొకటుండజాలదు: ఫిలిప్ కొడుకైన ఇరవై యేళ్ల అలెగ్జాండర్ సింహాసన మెక్కి, కొద్ది సంవత్సరాల్లోపలే మహా శక్తివంతమైన పర్షియన్ సామ్రాజ్యాన్ని జయించాడు.

అలెగ్జాండర్, స్తగీరా పట్టణానికి చెందిన అరిస్టాటిల్ అనే తత్వవేత్తకు శిష్యుడు. అలెగ్జాండర్ మాసిడన్ చక్రవర్తి అయిన నాటికి అరిస్టాటిల్‌కి నలభై ఎనిమిదేళ్లు న్నాయి. ఆయన కీర్తి అప్పటికే హెలెనిక్ ప్రపంచమంతటా విస్తారంగా వ్యాపించింది. అంతకు కొద్దికాలం తర్వాత మాసిడన్‌ని వదిలిపెట్టి ఏథెన్సుకు వెళ్లేందుకు ఆయన్ని ప్రేరేపించినదేమిటో మనకి తెలియదు. కారణం ఏమైనప్పటికీ, అది అలెగ్జాండర్‌తో విభేదం మాత్రం కాదు. ప్రతిభావంతుడైన ఈ యువకుడు నంశయాత్మకుడూ, చపలచిత్తుడైన నిరంకుశ పరిపాలకుడుగా మారిన చాలా కాలానికిగాని వారి మధ్య సంబంధాలు దిగజారలేదు. ప్రాచీన ప్రపంచపు సాంస్కృతిక కేంద్రంగా, తన గురువైన ప్లాటో జీవించి మరణించిన పట్టణంగా, తను తన యౌవన కాలాన్ని గడిపిన పట్టణంగా ఏథెన్సు అరిస్టాటిల్‌ను బహుశా ఆకర్షించివుండవచ్చు.

కారణమేమైనప్పటికీ, క్రీ. పూ. 335లోగాని, 334లోగాని అరిస్టాటిల్ తన భార్యతో, కూతురుతో, తన పెంపుడు కొడుకుతో ఏథెన్సుకు తరలివెళ్లాడు. దరిమిలా పది పన్నెండేళ్లకాలంలో — యీ కాలంలో అలెగ్జాండర్ గ్రీకులకు తెలిసిన దేశాలన్నింటినీ జయిస్తూపోయాడు — అరిస్టాటిల్ అసాధారణమైన శక్తి సంపత్తితో తన జీవిత కృషిని పూర్తిచేసి, దాన్ని సాధారణీకరించి, అద్భుతమైన విజ్ఞానశాస్త్ర మహాసౌధాన్ని నిర్మించాడు. అయితేనేం, తన శిష్యుల మధ్యా, స్నేహితుల మధ్యా తన వార్ధక్యాన్ని శాంతియుతంగా గడిపే అదృష్టం ఆయనకు లేకపోయింది. క్రీ. పూ. 323లో, 33 సంవత్సరాల వయస్సు వచ్చీరాకముందే, అలెగ్జాండర్ మరణించాడు. ఎథీనియన్లు మాసిడన్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటుచేసి, ఆ తత్వవేత్తను తరిమివేశారు. మరో ఏడాది తర్వాత యుబోయా ద్వీపంలో అరిస్టాటిల్ మరణించాడు.

విజ్ఞానశాస్త్ర చరిత్రలో మిక్కిలి గొప్ప మేధావుల్లో అరిస్టాటిల్ ఒకడు. ఈ నాటికీ మిగిలివుండి, ఆయనవని ధ్రువీకరింపబడిన రచనలు ఆనాడున్న సమస్త జ్ఞానరంగాలనూ అవలోడన చేశాయి. ఉదాహరణకు, మానవ సమాజ విజ్ఞానశాస్త్ర

మైన సామాజిక శాస్త్రానికి ఆయన సంస్థాపకుడు. ఆ శాస్త్రపు చట్రంలోనే ఆయన ఆర్థిక సమస్యలను కూడా పరిశీలించాడు. సామాజిక శాస్త్రపరమైన అరిస్టాటిల్ రచనలు ఏథెన్సులో ఆయన గడిపిన చివరి సంవత్సరాల దశకు చెందుతాయి. ప్రధమంగానూ, ప్రధానంగానూ అవి: "నికోమాహియన్ ప్రవర్తన సూత్రాలు" (ఆయన వంశీకులు ఆయన కొడుకైన నికోమాహ్ పేరునుబట్టి ఆ పుస్తకానికి యీ పేరు పెట్టారు), రాజ్య నిర్మితిని గూర్చి రచింపబడిన పుస్తకం "రాజకీయాలు."

ప్రకృతి, సామాజిక విజ్ఞానశాస్త్రాలు రెండింటిలోనూ అరిస్టాటిల్ "కొత్త తరహా" శాస్త్రవేత్త. అనిర్దిష్ట ఊహా ప్రాతిపదికపైన గాక, వాస్తవాల శ్రద్ధాపూర్వక విశ్లేషణపైన ఆధారపడి ఆయన ఎప్పుడూ తన సిద్ధాంతాలనూ, నిర్ధారణలనూ రూపొందించేవాడు. ఆయన "జంతుజగత్తు చరిత్ర" విస్తృతమైన జంతుశాస్త్ర సంబంధిత వస్తుసంచయం ఆధారంగా చెయ్యబడిన రచన. అదేవిధంగా, "రాజకీయాలు" అన్న ఆయన గ్రంథంకోసం ఆయనా, ఆయన శిష్యబృందమూ 158 హెలెనిక్, ఆటవిక రాజ్యాల నిర్మితికీ, నియమాలకూ సంబంధించిన సమాచారాన్ని సేకరించి, పరిశీలించారు. వాటిలో అత్యధికభాగం "పోలిస్" తరహా నగర రాజ్యాలు.

అరిస్టాటిల్ శతాబ్దాల తరబడిగా విద్యార్థులచేతా, శిష్యులచేతా పరివేష్టింపబడిన వివేకవంతుడైన గురువుగా స్మరింపబడ్డాడు. ఏథెన్సులో తను గడిపిన కడపటి రోజుల నాటికి యాభై యవ పడిలో వున్నాడు. ఆయన శక్తిసంపన్నుడైన, ఉత్సాహవంతుడైన వ్యక్తిగా ఉండి ఉండాలి. బాగా నీడగా వుండే తోటలో పచార్లుచేస్తూ తన మిత్రుల తోనూ, శిష్యులతోనూ సంభాషించడం ఆయనకి చాలా యిష్టంగా వుండేదని చెప్తారు. అందుకనే ఆయన తాత్విక సంప్రదాయానికి చరిత్రలో "పెరిపాటెటిక్స్" (అటూ యిటూ పచార్లు చేసేవాళ్లు) అనే పేరు స్థిరపడింది.

"రాజకీయాలు," "ప్రవర్తన సూత్రాలు" అనే గ్రంథాలు లిఖించబడ్డ సంభాషణల రూపంలోనో, ఒక్కొక్కమారు ప్రకాశంగా అనుకొన్న స్వగతాల రూపంలోనో రచింపబడ్డాయి. ఒక భావాన్ని వివరించే క్రమంలో అరిస్టాటిల్ తరచుగా దానికి తిరిగివస్తూవుంటాడు. దాన్ని చూసినప్పుడు, మరో భిన్న కోణంనుంచి దాన్ని ఆయన సమీపిస్తున్నాడేమో అన్నట్లూ, తన శ్రోతల ప్రశ్నలకు జవాబిస్తున్నాడేమో అన్నట్లూ అనిపిస్తుంది.

అరిస్టాటిల్ ఆ యుగం సృష్టించిన మహావ్యక్తి. బానిసత్వాన్ని సహజమైనదిగానూ, బానిసను మాట్లాడే పరికరంగానూ ఆయన పరిగణించాడు. దీనికితోడు, ఒక విధంగా ఆయన యథాతథవాది. తన కాలపు గ్రీసులో వాణిజ్యమూ, డబ్బు సంబంధాలూ

అభివృద్ధిచెందడం అయనకు నచ్చలేదు. ఆయన ఆదర్శం ఒక చిన్న వ్యవసాయ క్షేత్రం (దీనిలో సహజంగానే బానిసలు పనిచేస్తారు). ఈ వ్యవసాయ క్షేత్రం తనకు తాను దాదాపు అవసర వస్తువులన్నింటినీ సమకూర్చుకుంటుంది. కొరవడిన కొద్ది వస్తువులనూ "పరస్పరమైన మార్పిడి" ద్వారా పొరుగువారినుండి అది సమకూర్చుకోగలుగుతుంది.

ఆర్థికవేత్తగా అరిస్టాటిల్ గొప్పతనం యేమిటంటే, అర్థశాస్త్ర సంబంధమైన కొన్ని భావాభివర్గాలను మొట్టమొదట రూపొందించడం. కొంతవరకు వాటి పరస్పర సంబంధాన్ని అరిస్టాటిల్ నిరూపించాడు. వివిధ నష్టావశేషాలనుండి కూర్చబడిన అరిస్టాటిల్ "ఆర్థిక వ్యవస్థ"ను ఆడమ్ స్మిత్ రచించిన "జాతి సంపద"లోని మొదటి ఐదు ప్రకరణాలతోనూ, కార్ల్ మార్క్స్ "పెట్టుబడి" గ్రంథపు మొదటి సంపుటంలోని మొదటి భాగంతోనూ పోల్చిచూసినట్లయితే మనకి అద్భుతమైన భావానుస్యూతి కనిపిస్తుంది. ఈ భావం అంతకు ముందరివాటిపైన ఆధారపడి కొత్త దశకు అధిగమిస్తోంది. ధరల రూపధారణనూ, మార్పునూ (అంటే, విలువ నియమాన్ని) కనుగొనాలన్న ప్రయత్నం అరిస్టాటిల్‌నుండి మార్క్స్ వరకు మొత్తం సాంప్రదాయిక అర్థశాస్త్రమంతటా పూసల్లో దారంలా కనిపిస్తుందని లెనిన్ రాశాడు.

అరిస్టాటిల్ సరుకుకి రెండు పార్శ్వాలను — దాని ఉపయోగపు విలువ, దాని మారకం విలువ — రూఢం చేసి, మారక క్రమాన్ని విశ్లేషించాడు. రాజకీయ అర్థశాస్త్రం నిరంతరాయంగా దృష్టిలో పెట్టుకోవలసిన ప్రశ్నను: మారకంయొక్క, లేక మారకపు విలువలయొక్క, లేక, చివరకు ధరలయొక్క సహసంబంధాలను నిర్ణయించేదేమిటి? — డబ్బు రూపంలో వాటి వ్యక్తీకరణను ఆయన ముందుకు తెచ్చాడు. ఈ ప్రశ్నకి ఆయనకు జవాబు తెలియదు లేక, మరోవిధంగా చెప్పుకోవాలంటే, ఆయన ఆ జవాబుదగ్గరకు వచ్చి నిలిచిపోతాడు, తన యిచ్ఛకు వ్యతిరేకంగా దాన్నుంచి పక్కకి వైదొలగుతాడు. కాని డబ్బు ఆవిర్భావ, విధులకు సంబంధించిన సహేతుక భావాలు కొన్నింటిని ఆయన కల్పించాడు. చివరకు ఆయన తన సొంత విలక్షణ పద్ధతిలో డబ్బు పెట్టుబడిగా — కొత్త డబ్బును సృష్టించే డబ్బుగా — పరివర్తన చెందడమన్న భావాన్ని వ్యక్తంచేశాడు.

ఈ గొప్ప గ్రీకు తత్వవేత్త విషయాంతర ప్రసక్తులతో, అస్పష్టతతో, పునరుక్తులతో సంచరించిన శాస్త్రీయ విశ్లేషణ పథం అది.

అరిస్టాటిల్‌యొక్క విజ్ఞానశాస్త్రపరమైన వారసత్వం ఎప్పుడూ వివాదాంశంగానే వుంటూవచ్చింది. తత్వశాస్త్రంపైనా, ప్రకృతి విజ్ఞానశాస్త్రాలపైనా, సమాజంపైనా ఆయన భావాలు చాల శతాబ్దాలపాటు తిరుగులేని పిడిసూత్రాలుగా, అనతిక్రమణీయ

ప్రామాణిక సూత్రాలుగా పరిగణింపబడి, క్రిస్టియన్ చర్చివ్యవస్థచేతా, కుహనా విజ్ఞానశాస్త్ర పండితమ్మన్యులచేతా, రాజకీయ అభివృద్ధి విరోధకులచేతా, నవతకూ ప్రగతికీ వ్యతిరేకంగా తాము జరిపే పోరాటంలో, ఆయుధాలుగా వినియోగించుకోబడ్డాయి. మరోవంక, విజ్ఞానశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన పునర్వికాసానికి చెందినవాళ్లు పిడివాదంనుంచి అరిస్టాటిల్ భావాలను విముక్తంచేసి, వాటిని వినియోగించుకున్నారు. అరిస్టాటిల్ కోసం జరిగిన యీ పోరాటం యీనాటిదాకా సాగుతూనే వుంది. ఈ పోరాటం, మిగతా అంశాలతోబాటు, ఆయన ఆర్థిక సిద్ధాంతానికి కూడా వర్తిస్తుంది.

ఈ గొప్ప గ్రీకు వ్యక్తియొక్క ఆర్థిక అభిప్రాయాలను గూర్చిన రెండు రకాల అంచనాలతో కూడిన యీ దిగువ రెండు ఉల్లేఖనలను శ్రద్ధగా చదవండి. మొదటిది మార్క్సిస్టు — సోవియట్ అర్థశాస్త్రవేత్త ఎఫ్. వై. పొల్యాన్స్కీ — అంచనా. రెండవది బూర్జువా ఆర్థిక చింతన చరిత్రకర్త అయిన ఆచార్య జె. ఎఫ్. బెల్‌ది.

పొల్యాన్స్కీ

“విలువపట్ల అరిస్టాటిల్ ఆత్మపరమైన అభిప్రాయం ఏర్పరచుకోలేదు. అందుకు భిన్నంగా దానిపట్ల వస్తుపరమైన వ్యాఖ్యానం చెప్పేందుకు మొగ్గు చూపాడు. ఏదేమైనప్పటికీ, ఉత్పత్తి ఖర్చులను తీర్చవలసిన సామాజికావసరాన్ని ఆయన స్పష్టంగా గుర్తించాడు. ఖర్చుల కూర్పును ఆయన విశ్లేషించని మాట నిజమే, ఈ సమస్య విషయంలో ఆయనకి ఆసక్తి లేదు. కాని, వాటి కూర్పులో శ్రమకి బహుశా ముఖ్యమైన స్థానం కేటాయింపబడింది.”*

బెల్

“సరుకు ఉపయోగాన్ని ప్రాతిపదికగా తీసుకొని, అరిస్టాటిల్ విలువను ఆత్మపరమైనదిగా పరిగణించాడు. మారకం అన్నది మనిషి అవసరాలపై ఆధారపడి వుంటుంది.... మారకం న్యాయమైనదైనప్పుడు, శ్రమ ఖర్చు అర్థంలో ఖర్చులపైన కాక, అవసరాల సమానత్వంపైన అది ఆధారపడుతుంది.”**

---

* “ఆర్థిక చింతన చరిత్ర.” ఉపన్యాస సంపుటి, మొదటి భాగం, మాస్కో యూనివర్శిటీ ప్రెస్సు, 1961, పేజి 58 (రష్యన్ భాషలో).

** J. F. Bell, *A History of Economic Thought*, N. Y., 1953, p. 41.

ఈ బేరీజులు పరస్పర విరుద్ధమైనవన్న విషయాన్ని తేలికగా గ్రహించవచ్చు. ఈ రెండు ఉల్లేఖిత భాగాలూ విలువను గురించి పేర్కొన్నాయి. అర్థశాస్త్రంలో మౌలిక భావాభివర్గమైన యీ **విలువ,** మనకి మళ్లీ మళ్లీ ఎదురవుతుంది.

బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రపు సవిమర్శక విశ్లేషణ ప్రాతిపదిక పైన మార్క్స్ అభివృద్ధి చేసిన శ్రమ విలువ సిద్ధాంతానికి మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతంలో అత్యంత ముఖ్యమైన పాత్ర వుంది. ఈ సిద్ధాంత అంతస్సారం ఏమిటంటే: అన్ని సరుకులకూ ప్రాతిపదిక అయిన ఒక ఉమ్మడి లక్షణం వుంది. సరుకులన్నీ కూడా మానవ శ్రమోత్పాదితాలన్నదే అది. ఒక సరుకును ఉత్పత్తి చెయ్యడంలో వినియోగింపబడిన యీ శ్రమ పరిమాణమే దాని విలువను నిర్ణయిస్తుంది. ఒక గొడ్డలిని తయారు చెయ్యడానికి అయిదు పని గంటలూ, ఒక మట్టికుండను తయారుచెయ్యడానికి ఒక గంటా పడితే, మిగతా అన్ని విషయాలూ ఒకే విధంగా ఉన్నప్పుడు, ఆ గొడ్డలి విలువ ఆ మట్టికుండ విలువకు ఐదు రెట్లు ఎక్కువ వుంటుంది. మామూలుగా ఒక గొడ్డలికి ఐదు కుండలు మారకం చేసుకోడాన్ని బట్టి యీ విషయాన్ని గ్రహించవచ్చు. ఇది గొడ్డలి మారకపు విలువ. కుండల్లో వ్యక్తంచెయ్యబడినప్పుడు గొడ్డలి విలువ యిదన్న మాట. ఇదే విధంగా గొడ్డలి విలువ మాంసంలో, వస్త్రంలో, లేక మరే యితర సరుకులోనైనా కూడా, లేక చివరకు డబ్బులో, అంటే ఒకానొక మొత్తం వెండిలోనో, బంగారంలోనో కూడా వ్యక్తీకరింపబడవచ్చు. డబ్బులో వ్యక్తం చెయ్యబడిన ఒక వస్తువు మారకపు విలువయే దాని ధర.

శ్రమ అన్నది విలువను సృష్టించేదన్న భావ్యమే అత్యంత ముఖ్యమైనది. గొడ్డళ్ల ఉత్పత్తిదారుని శ్రమ కుండల తయారీదారు శ్రమతో పోల్చబడవలసినప్పుడు, అదొక నిర్దిష్ట వృత్తికి సంబంధించిన నిర్దిష్ట తరహా శ్రమ కాకుండా, ఒక వ్యక్తియొక్క కండపుష్టీ, మనోశక్తీ, ఒక నిర్దిష్ట కాలవ్యవధిపాటు వినియోగించడంగా — అంటే, దాని నిర్దిష్టరూపానికి అతీతమైన అనిర్దిష్ట శ్రమగా — మాత్రమే దాన్ని పరిగణించవలసి వుంటుంది. ఒక సరుకు ఉపయోగపు విలువ (ఉపయోగం), ఆ సరుకు విలువకు ఒక ప్రధాన మూలం కాగలదేగాని, ఆ విలువకు అదే మూలం కాజాలదనడం నిస్సందేహమైన విషయం.

ఈ విధంగా, విలువ అన్నది వస్తుపరంగా వుంటుంది. అది ఒక వ్యక్తి అనుభూతులకు అతీతంగా, అంటే ఒక సరుక్కు ఉపయోగానికి అతను వ్యక్తిగతంగా విలువ కట్టే పద్ధతికి అతీతంగా, వుంటుంది. ఇంతే కాదు, విలువకు సామాజిక స్వభావం కూడా వుంది. అది ఒక వస్తువుపట్ల, ఒక పదార్థంపట్ల ఒక వ్యక్తి వైఖరినిబట్టి కాక, తమ శ్రమతో సరుకులను ఉత్పత్తి చేసి, వీటిని తమ మధ్య మారకం చేసుకునే జనం మధ్య సంబంధంచేత నిర్ణయింపబడుతుంది.

ఈ సిద్ధాంతానికి భిన్నంగా ఆధునిక బూర్జువా రాజకీయ అర్థశాస్త్రం మార్పిడి చేసుకోబడిన సరుకుల ఆత్మపరమైన ఉపయోగాన్నే విలువకు ప్రాతిపదికగా పరిగణి స్తుంది. ఒకానొక సరుకు మారకపు విలువ వినిమయదారు వాంఛా తీవ్రతను బట్టీ, పరిశీలనలో వున్న ఆ సరుకు మార్కెట్లో ఏ మేరకు సరఫరా అవుతున్నదన్న దాన్ని బట్టీ నిర్ధారితమవుతుంది. తద్వారా అది, యాదృచ్ఛికమైన "మార్కెట్" విలువ అవుతుంది. విలువ సమస్య వ్యక్తిగత యిష్టానిష్టాల రంగానికి నెట్టివెయ్యబడింది గనుక, విలువ యిక్కడ తన సామాజిక స్వభావాన్ని కోల్పోయి, మనుషుల మధ్య ఒక సంబంధంగా ఉండటం మానుకుంటుంది.

విలువ సిద్ధాంతానికి సిద్ధాంతప్రాయమైన ప్రాముఖ్యమే గాక, దానికి యితరత్రా కూడా ప్రాముఖ్యం వుంది. శ్రమవిలువ సిద్ధాంతపు ముఖ్య నిర్ధారణల్లో ఒకటేమిటంటే, అదనపు విలువ సిద్ధాంతం. పెట్టుబడిదారులు కార్మికవర్గాన్ని దోపిడీచేసే వ్యవస్థను ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలో వేతన కార్మికుల శ్రమచేత ఉత్పత్తి చేయబడిన సరుకుల విలువలో, ఏ భాగానికైతే పెట్టుబడిదారులు వేతనం చెల్లించరో ఆ భాగమే అదనపు విలువ. దాన్నే పెట్టుబడిదారు డబ్బు చెల్లించకుండా భుక్తం చేసుకుంటాడు. పెట్టుబడిదారీ వర్గపు లాభాలకు యిదే మూలం. పెట్టుబడిదారీ ఉత్పత్తి లక్ష్యం యీ అదనపు విలువయే. అదనపు విలువ సృష్టియే పెట్టుబడిదారీ విధానపు సాధారణ ఆర్థిక నియమం. ఆర్థిక శత్రు వైరుధ్య బీజాలూ, కార్మికులకూ బూర్జువావర్గానికీ మధ్య వర్గపోరాట బీజాలూ యీ అదనపు విలువలోనే వున్నాయి. మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతానికి పునాదియైన అదనపు విలువ సిద్ధాంతం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వైరుధ్యాల అభివృద్ధి ప్రగాఢత్వాల అనివార్యతనూ, చివరకు దాని పతనాన్నీ నిరూపిస్తుంది. మార్క్సిజంపైన బూర్జువా పండితుల దాడులు ప్రధానంగా యీ అదనపు విలువ సిద్ధాంతంపైకే ఉన్ముఖంచెయ్యబడతాయి. ఆత్మపరమైన విలువ సిద్ధాంతమూ, అందుకు సంబంధించిన బూర్జువా అర్థశాస్త్రపు భావాలేవీ దోపిడిని గురించీ, వర్గవైరుధ్యాలను గురించీ ప్రస్తావించవు.

2400 సంవత్సరాలకు తక్కువ కాకుండా సాగుతున్న యీ కింది వివాదాన్ని యిది వివరిస్తుంది: అరిస్టాటిల్ శ్రమ విలువను చూచాయగా ఎన్నడో ప్రతిపాదించాడా? లేక, మారకపు విలువను ఉపయోగంనుంచి నిర్ధరించే సిద్ధాంతాలకు ఆయన పితామహుడా? సమగ్రమైన విలువ సిద్ధాంతాన్ని అరిస్టాటిల్ పరికల్పించకపోవడం, పరికల్పించలేకపోవడమే యీ వివాదానికి ఆస్కారాన్ని కలిగించింది.

మారకంలో సరుకుల విలువల సమానత్వాన్ని ఆయన కనుగొని, యీ సామ్యానికి

గల ఉమ్మడి ప్రాతిపదిక ఏమిటో కనుగొనేందుకు తంటాలుపడ్డాడు. ఈ కృషి సామాన్యమైనది కాదు. అసాధారణమైన ఆలోచనా ప్రగాఢత్వం దీనిలో యిమిడి వుంది. అరిస్టాటిల్‌కి పలు శతాబ్దాల తదనంతర ఆర్థిక విశ్లేషణకు యిదొక భిన్న ఆలోచనా పథాన్ని సమకూర్చింది. శ్రమవిలువను అత్యంత ప్రాథమిక వాక్యాలనేకం ఆయన రాశాడు. పై ఉల్లేఖనలో పాల్యాన్‌స్కీ ఉదహరించిన అంశాలు అవేననడం నిర్వివాదం. కానైతే యింతకంటె ముఖ్యమైన విషయమేమిటంటే, విలువ సమస్యకు సంబంధించిన చైతన్యం. ఉదాహరణకు, "నికోమాహియన్ ప్రవర్తన సూత్రాలు" లోని యీ కింది భాగం చూడండి:

"ఎందుకంటే, ఒకే రకానికి చెందిన ఇద్దరి మధ్య ఏ బేరమూ జరగదన్న విషయం గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు, యిద్దరు వైద్యుల మధ్య యీ మార్పిడి జరగదు. కాని ఒక వైద్యునికీ ఒక వ్యవసాయదారునికీ మధ్య, లేక సాధారణంగా చెప్పాలంటే, సమానులు కాక భిన్నమైనవారి మధ్య యీ మార్పిడి జరుగుతుంది. కాని, యీ మారకం జరిగేందుకు ముందు వీరి మధ్య సమానత్వం సాధింపబడాలి.... అందుకనే అన్నింటికీ సామాన్యమైన ఒకే కొలమానం ఉండాలి.... సరే అప్పుడిక, యీ కింది అనుపాతంలో మాదిరిగా ఉండేలాగ షరతులు సమానమొనర్చబడినప్పుడు పరస్పర ఆదానప్రదానాలు జరుగుతాయి, అంటే, వ్యవసాయదారు: బూట్లు కుట్టేవాడు — బూట్లు కుట్టేవాని సరుకులు: వ్యవసాయదారుని సరుకులు."*

వేర్వేరు ఉపయోగాల్ని విలువలు కలిగిన సరుకులను ఉత్పత్తిచేసే జనం మధ్య సామాజిక సంబంధంగా విలువకు బీజరూపంలో యిక్కడొక వ్యాఖ్య మనకి కనిపిస్తుంది. తమ ఉత్పాదితాల మార్పిడిలో వ్యవసాయదారునికీ బూట్ల తయారీదారుకీ మధ్య సంబంధం కేవలం ఒక బస్తా గింజలు ఉత్పత్తి చెయ్యడానికీ ఒక జత బూట్లు తయారు చెయ్యడానికీ పట్టే శ్రమ మొత్తంతో, అంటే శ్రమ కాలంతో సమానమన్న నిర్ధారణను చేరుకునేందుకు యింకొక్క అడుగు మాత్రమే ముందుకు వెయ్యవలసి వుందన్నట్లు కనిపిస్తుంది. కావి అరిస్టాటిల్ యీ నిర్ధారణ చెయ్యలేదు.

ఆయన యీ నిర్ధారణ చెయ్యలేకపోయాడు. ఆయన ప్రాచీన బానిసయాజమాన్య సమాజంలో నివసించడమే అందుకు కారణమని చెప్పుకుంటే చాలు. బానిస సమాజం, దాని స్వభావరీత్యా, సమానత్వ భావానికి, అన్ని రకాల శ్రమయొక్క సమాన విలువ భావానికి విరుద్ధమైనది కావడమే యిందుకు కారణం. శరీర శ్రమ బానిసల శ్రమగా

---

* Aristotle, *The Nicomachean Ethics*, translated by D. P. Chase, London — Toronto, New York, 1920, p. 113.

అసహ్యించుకోబడింది. గ్రీసులో స్వతంత్రులైన చేతిపనివారూ, వ్యవసాయదారులూ కూడా ఉన్నప్పటికీ, సామాజిక శ్రమను వ్యాఖ్యానించే విషయం వచ్చేసరికి, అరిస్టాటిల్ చిత్రంగా వారిని "ఉపేక్షించాడు."

కాని, విలువ (మారకపు విలువ) రహస్యాన్ని విడదియ్యడంలో విఫలుడైన అరిస్టాటిల్, అందుకు విచారపూర్వకంగా నిట్టూర్చినట్లు, సరుకుల ఉపయుక్తలోని గుణాత్మకమైన తేడా అనే పైపై విషయం వంకకు తిరిగాడు. ఈ విషయ ప్రకటనలోని నిస్సారతమూ, దాని పరిమాణాత్మక అస్పష్టతమూ ఆయన గ్రహించాడనడం నిస్సందేహం (ఉజ్జాయింపుగా ఆయన భావమేమిటంటే: "నీ సరుకు నాకు అవసరం, నా సరుకు నీకు అవసరం, అందుకనే మనం సరుకులను పరస్పరం మారకం చేసుకుంటాం"). అందుకనే ఆయన డబ్బే సరుకులను పోల్చదగినవిగా చేస్తున్నదని ప్రకటిస్తాడు: "అందుకే అన్ని వస్తువులకూ సామాన్యమైన ఒక కొలమానం అవసరం. కాగా వాస్తవానికి, వాటికి గల గిరాకీయే అది. అటువంటి బేరసారాలన్నింటికీ ఉమ్మడి బంధం ఆ గిరాకీయే.... మరి, సాధారణ ఒప్పందం మేరకు, ఆ గిరాకీకి ఒక ప్రతినిధిగా డబ్బు అస్తిత్వంలోకి వచ్చింది."*

ఇది మౌలికంగా భిన్నమైన వైఖరి. ఆచార్య బెల్ పుస్తకంనుండి పైన పేర్కొనబడిన ఉల్లేఖనవంటి వాక్యాలను సాధ్యం చేసినది యీ వైఖరే.

అర్థశాస్త్రం, క్రెమటిస్టిక్స్

అరిస్టాటిల్‌యొక్క ఆసక్తికరమైన భావాల్లో మరొకటేమిటంటే, అర్థశాస్త్రానికీ క్రెమటిస్టిక్స్‌కీ మధ్య ఆయన చేసిన విచక్షణ. సుప్రసిద్ధమైన యీ విచక్షణే ఆర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రలో పెట్టుబడిని విశ్లేషించేందుకు జరిగిన తొట్టతొలి ప్రయత్నం. క్రెమటిస్టిక్స్ అన్న పదాన్ని అరిస్టాటిల్ సృష్టించాడు. కాని, "అర్థశాస్త్రం" మాదిరిగా ఆధునిక భాషల్లో యీ పదం వేళ్లానుకోలేదు. ఈ పదం ఆస్తి, స్వామ్యం అన్న అర్థం కలిగిన "క్రెమా" అన్న పదంనుండి ఉత్పన్నమైంది. అరిస్టాటిల్ దృష్టిలో ఆర్థికవ్యవస్థ అంటే జీవితావసర వస్తువుల, అంటే ఉపయోగపు విలువల ఉత్పత్తితో సంబంధించిన సహజ గృహనిర్వహణ కార్యకలాపం. దానిలో మారకం కూడా — అయితే వ్యక్తి అవసరాలను తృప్తిపరచే మేరకు మాత్రమే — యిమిడివుంటుంది. ఈ కార్యకలాప

---

* Aristotle, అదే గ్రంథం, పేజి 113.

పరిమితులు కూడా సహజమైనవే: అవి ఒక మనిషి సహేతుక వ్యక్తిగత సొంత వినిమయం.

మరైతే, క్రెమటిస్టిక్స్ అంటే ఏమిటి? "అది ఆస్తి సంచయన కళ," అంటే, లాభార్జన దిశగా, ప్రత్యేకించి డబ్బు రూపంలో సంపద సంచయనం దిశగా ఉన్ముఖం చెయ్యబడిన కార్యకలాపం. మరో విధంగా చెప్పాలంటే, క్రెమటిస్టిక్స్ అంటే, పెట్టుబడి మదుపు, సంచయనాల "కళ."

ప్రాచీన ప్రపంచంలో పారిశ్రామిక పెట్టుబడి లేదు. కాని అప్పటికే వాణిజ్య, డబ్బు (వడ్డీ) పెట్టుబడి గణనీయమైన పాత్ర వహిస్తోంది. దీన్నే అరిస్టాటిల్ యీ కింది మాటల్లో చిత్రించాడు: "...ఆస్తి సంపాదన కళలో, అది వర్తక కార్యకలాపాల్లో వ్యక్తమైన మేరకు, ఆ లక్ష్య సాధనకు ఒక మితి అంటూ ఏమీ లేదు. అపరిమితమైన ఆస్తిని సంపాదించడం, అపారమైన డబ్బును సంపాదించడమే యిక్కడ లక్ష్యం కావడం యిందుకు కారణం.... డబ్బు చలామణీలో నిమగ్నుడయ్యే ప్రతివాడూ తన పెట్టుబడిని అనంతంగా పెంచుకొనేందుకు ప్రయత్నిస్తాడు."*

అరిస్టాటిల్ దీన్నంతనీ అసహజమైనదిగా పరిగణించాడు, కాని తగినంత వాస్తవిక దృష్టివున్న కారణంగా, శుద్ధ "అర్థశాస్త్రం" అసంభవమన్న విషయాన్ని ఆయన గ్రహించాడు: దురదృష్టవశాత్తూ అర్థశాస్త్రం తప్పనిసరిగా క్రెమటిస్టిక్స్‌గా పరిణతి చెంది తీరుతుంది. ఈ వ్యాఖ్య సరైనది: అందుకే మనం ఏ ఆర్థిక వ్యవస్థలోనైతే వస్తువులు మారకం కోసం సరుకులుగా ఉత్పత్తిచెయ్యబడతాయో ఆ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ సంబంధాలు తప్పనిసరిగా అభివృద్ధిచెందుతాయని చెప్తాం.

అర్థశాస్త్ర సహజత్వానికీ, క్రెమటిస్టిక్స్ అసహజత్వానికీ సంబంధించిన అరిస్టాటిల్ భావం విచిత్రంగా రూపాంతరం చెందింది. వడ్డీ వ్యాపారాన్నీ, ఆస్తిసంపాదనకు ఒక "అసహజ" సాధనంగా కొంతమేరకు వాణిజ్యాన్నీ ఖండించడంలో మధ్యయుగాల్లో పండితులు అరిస్టాటిల్‌ను అనుసరించారు. కాని పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడంతో, ఆస్తి సంపాదన రూపాలన్నీ సహజంగానూ, "సహజ హక్కు"చేత అనుమతింపబడినవిగానూ కనిపించసాగాయి. సరిగా యీ ప్రాతిపదిక పైనవే 17వ, 18వ శతాబ్దాల సామాజికార్థిక ఆలోచనలో homo oeconomicus (ఆర్థిక మానవుని) రూపం — ధనికుడు కావాలన్న వాంఛయే యితగాని కార్యకలాపాలకు ప్రేరణ — తలెత్తింది. తన స్వలాభంకోసం కృషిచెయ్యడం ద్వారా ఆర్థిక మానవుడు సమాజశ్రేయ

* అరిస్టాటిల్, "రాజకీయాలు," సెంట్ పీటర్స్‌బుర్గ్, 1911, పేజీలు 25–26 (రష్యన్ భాషలో).

స్సుకు కృషిచేస్తున్నాడని ఆడమ్ స్మిత్ ప్రకటించాడు. ఈ విధంగా స్మిత్‌కు తెలిసిన ప్రపంచాలన్నింటిలోనూ అత్యుత్తమ ప్రపంచమైన బూర్జువా ప్రపంచం ఆవిర్భవించింది. అరిస్టాటిల్‌కి సంబంధించినంతవరకు homo oeconomicus అన్న పదం యిందుకు పూర్తి వ్యతిరేక అర్థాన్ని – ఎంతమాత్రం పరిమితంకాని సహేతుకమైన తన అవసరాలను తృప్తిపరచుకొన ప్రయత్నించే మనిషి అన్న అర్థాన్ని – స్ఫురింపజేసివుండేది. రక్తమాంసాలు లేని యీ ఊహావ్యక్తిని, స్మిత్ కాలంలోని ఆర్థిక రచనల కథానాయకుణ్ణి, అరిస్టాటిల్ బహుశా homo chrematisticus అని పిలిచివుండేవాడు.

ఇప్పుడిక మనం యీ గొప్ప గ్రీకు శాస్త్రజ్ఞుని వదిలిపెట్టి సుమారు రెండు వేల సంవత్సరాలు ముందుకు, అంటే 16వ శతాబ్దపు చివరి కాలానికీ, 17వ శతాబ్దపు ఆరంభ కాలానికీ చెందిన పశ్చిమ యూరప్‌కు కదలిపోవాలి. అయితే దీని అర్థం యిరవై శతాబ్దాలు ఆర్థిక చింతనా పథంలో ఏవిధమైన జాడలూ లేకుండానే గడిచి పోయాయని ఎంతమాత్రం కాదు. గ్రీకు తత్వవేత్తలు అరిస్టాటిల్ భావాల్లో కొన్నింటిని మరింతగా అభివృద్ధిచేశారు. వ్యావసాయిక ఆర్థికవ్యవస్థ అని మనం పిలిచే అంశాన్ని గురించి రోమన్ రచయితలు బోలెడంత రాశారు. మధ్యయుగాల్లో పాండిత్యం ధరించిన మతపు ముసుగు మౌలికమైన ఆర్థిక భావాలను మధ్యమధ్య మరుగుపరుస్తూవచ్చింది. అరిస్టాటిల్‌పై వ్యాఖ్యానాలు చేసిన పండితమ్మన్యులు "న్యాయమైన ధర" అనే భావనను అభివృద్ధిచేశారు. ఆర్థిక చింతనా చరిత్రకు సంబంధించిన ఏ పుస్తకంలోనైనా యిదంతా కనిపిస్తుంది. కాని బానిసయాజమాన్య సమాజం పతనమై, ఫ్యూడలిజం పెంపొంది ప్రాధాన్యం వహించిన కాలంలో అర్థశాస్త్రాభివృద్ధికి ప్రోత్సాహం లభించలేదు. రాజకీయ అర్థశాస్త్రం అన్నది ఒక స్వతంత్ర శాస్త్రంగా, పెట్టుబడిదారీ విధానాభివృద్ధి దశ యొక్క కార్ఖానా ఉత్పత్తి దశలో మాత్రమే – అప్పటికే ఫ్యూడల్ సమాజంలో పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన ముఖ్యాంశాలూ, బూర్జువా సంబంధాలూ రూపొందుతున్నాయి – ఆవిర్భవించింది.

శాస్త్రానికి నామకరణం జరిగింది

సామాజికార్థిక సాహిత్యంలో రాజకీయ అర్థశాస్త్రం అన్న పేరును మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టినవాడు అంటువాన్ డి మొంక్రెట్యేన్, స్యెర్ డి వట్టెవిల్. ఆయన సామాన్య ఆస్తిపరుడైన ఒక ఫ్రెంచి కులీనుడు. నాల్గవ హెన్రీ, పదమూడవ లూయీల పాలన కాలంనాటివాడు. మొంక్రెట్యేన్ జీవితం సాహసకార్యాలతో నిండినది.

కవి, ద్వంద్వ యుద్ధ ప్రవీణుడు, ప్రవాసి, రాజదర్బారు సభ్యుడు, తిరుగుబాటుదారు, రాజ్య వ్యతిరేక నేరస్తుడు, తన శత్రువులు పన్నిన కుట్రలో చిక్కుకొని కత్తుల ఘర్షణల మధ్య, పిస్తోళ్ల గర్జల మధ్య ప్రాణాలు కోల్పోయాడు. అయితే ఆయన విషయంలో అదొక అదృష్టమనే చెప్పాలి. అలా కాకుండా సజీవంగా పట్టుబడివుంటే ఆ తిరుగుబాటుదారు చిత్రహింసలకూ, అవమానకరమైన మరణశిక్షకూ గురిచెయ్యబడివుండే వాడు. ఆయన మృతదేహం సైతం అవమాన తిరస్కారాలకు గురిచెయ్యబడింది. ఎముకలు యినుప కడ్డీలతో చూర్ణంచెయ్యబడ్డాయి, ఆయన శవం తగలపెట్టబడి, చితాభస్మం గాలిలో కలిపివెయ్యబడింది. రాజుకీ, కేథలిక్ చర్చికీ వ్యతిరేకంగా ఫ్రెంచి ప్రొటెస్టెంటులు (హ్యూగెనాట్లు) జరిపిన తిరుగుబాటు నాయకుల్లో మొంక్రెట్యేన్ ఒకడు. తన నలభై అయిదవ ఏటనో, నలభై ఆరవ ఏటనో 1621లో ఆయన మరణించాడు. కాని ఆయన పుస్తకం "రాజకీయ అర్థశాస్త్ర సిద్ధాంత వివరణ" 1615లో రుయాన్‌లో ప్రచురింపబడింది. సిద్ధాంత వివరణ విస్మరింపబడటంలోనూ, మొంక్రెట్యేన్ పేరు అవమానానికి గురిచెయ్యబడటంలోనూ ఆశ్చర్యమేమీ లేదు. దురదృష్టవశాత్తూ ఆయన జీవితానికి సంబంధించి లభిస్తున్న మూలాధార సమాచారమల్లా ఆయన్ని ద్వేషించే వారి పాక్షిక లేక శుద్ధ నిందాపూర్వక అభిప్రాయాలు మాత్రమే. ఈ అభిప్రాయాలు తీవ్రమైన రాజకీయ, మత పోరాటానికి సంబంధించిన కక్షతో కూడి వున్నాయి. మొంక్రెట్యేన్‌ని వాళ్లు దారిదోపిడిగాడన్నారు, దొంగ బాంక్‌నోట్లు తయారుచేశాడన్నారు, డబ్బుకి గడ్డి కరిచాడన్నారు, ఉన్నత వంశీకురాలైన ఒక హ్యూగెనాట్ విధవరాలిని పెళ్లిచేసుకొనేందుకే ప్రొటెస్టెంటు మతానికి మారాడని ఆరోపించారు.

ఆయన మంచిపేరు పునరుద్ధరింపబడటానికీ, ఆర్థిక, రాజకీయ ఆలోచనా చరిత్రలో ఆయన గౌరవప్రదమైన స్థానం పొందడానికీ దాదాపు మూడు వందల సంవత్సరాలు పట్టింది. విషాదకర పరిస్థితుల్లో ఆయన జీవితం అంతం కావడం యాదృచ్ఛిక ఘటన కాదన్న విషయం యీనాడు జగద్విదితం. నిరంకుశ ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా దమిత ఫ్రెంచి బూర్జువావర్గం జరిపిన వర్గపోరాటానికి ఒక పాక్షిక రూపమైన హ్యూగెనాట్ల తిరుగుబాట్లలో ఒకదానిలో ఆయన — పుట్టుకతో సామాన్యుడు (తండ్రి మందులు తయారుచేసి అమ్మేవాడు), యాదృచ్ఛికంగా ప్రభువు, ప్రవృత్తిరీత్యా మానవతావాదీ, పోరాటకుడూ అయిన మొంక్రెట్యేన్ — పాల్గొనడమన్నది ఆయన జీవిత సహజ పర్యవసానమనే చెప్పవలసివుంటుంది.

తన కాలంనాటికి మంచి విద్య అనదగినదాన్ని పొందాక, యిరవైయేళ్ల వయసులో మొంక్రెట్యేన్ తను రచయిత కావాలని నిర్ణయించుకొని, ఒక సాంప్రదాయిక అంశం పైన ఒక విషాదాంత కావ్యం రాశాడు. తర్వాత ఆయన అనేక నాటకాలూ,

కవితలూ రాశాడు. "వార్మండీ చరిత్ర" కూడా ఆయన రాసిన సంగతి మనకి తెలిసి నదే. 1605లో ఆయన పాల్గొన్న ఒక ద్వంద్వ యుద్ధంలో, ఆయన ప్రత్యర్థి చని పోవడంతో ఆయన ఇంగ్లండుకు పారిపోవలసివచ్చింది. అప్పటికే ఆయన రచయితగా ప్రసిద్ధుడు.

ఇంగ్లండులో గడిపిన నాలుగేళ్లూ ఆయన జీవితంలో ముఖ్యమైన పాత్ర వహిం చాయి. మరింత బాగా అభివృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థనూ, బూర్జువా సంబంధాలనూ అక్కడ ఆయన చూశాడు. వాణిజ్యం, చేతివృత్తులు, ఆర్థిక విధానాల్లో ఆయన క్రియా శీలమైన ఆసక్తి వహించనారంభించాడు. ఇంగ్లండులో అనుసరింపబడుతున్న పద్ధతు లను చూసి, మొంక్రెత్యేన్ వాటిని మానసికంగా ఫ్రాన్సుకు అనువర్తించుకున్నాడు. ఇంగ్లండులో చాలామంది దేశబహిష్కృత ఫ్రెంచి హ్యూగెనాట్లతో ఆయన సమావేశాలు ఆయన భవితవ్యాన్ని నిర్ణయించి వుంటాయి. వారిలో అత్యధికులు చేతివృత్తులవాళ్లు, చాలామంది అత్యున్నత స్థాయి నిపుణులు. వారి శ్రమా, నైపుణ్యమూ ఇంగ్లండుకు గణనీయమైన లాభాన్ని తెచ్చిపెట్టడాన్నీ, అదే సమయంలో అలాంటివాళ్లని దేశ బహిష్కృతులను చేసి ఫ్రాన్సు భారీ నష్టాలు పొందడాన్నీ మొంక్రెత్యేన్ గమనించాడు.

మొంక్రెత్యేన్ ఫ్రాన్సుకు తిరిగివచ్చేనాటికి దేశీయ పరిశ్రమ, వర్తకాల అభివృద్ధి ఆవశ్యకతపట్ల గాఢ విశ్వాసం ఆయనలో నెలకొంది. బూర్జువావర్గ ప్రయోజనాలను ఆయన బలపరచసాగాడు. తన నూతన భావాలను ఆయన అమలుజరప పూను కొన్నాడు. ఆయన ఒక ఇనుప కార్ఖానా నెలకొల్పి, తన సరుకులను పారిస్‌లో — అక్కడ ఆయనకొక గిడ్డంగి వుంది — అమ్మనారంభించాడు. కాని ఆయన ముఖ్య కార్యక్రమం "సిద్ధాంత వివరణ" రచన. శీర్షిక గంభీరంగా ఉన్నప్పటికీ, ఆయన రచన పూర్తిగా ఆచరణయోగ్యమైన విషయాలతో నిండివుంది. ఫ్రెంచి కార్ఖానాదారులకూ, వర్తకులకూ ప్రభుత్వం రక్షణ సౌకర్యాలు కల్పించవలసిన అవసరాన్ని అందులో ఆయన సూచించాడు. విదేశీ సరుకుల దిగుమతి కారణంగా దేశీయోత్పత్తికి హానికలగకుండా ఉండేందుకు గాను విదేశీ సరుకులపై భారీ ఎత్తున సుంకాలు విధింపబడాలని మొంక్రెత్యేన్ వాదిం చాడు. ఆయన శ్రమను ప్రస్తుతించాడు. తన కాలానికి విలక్షణంగా, దేశ సంపదల ప్రధాన సృష్టికర్త పనివాడే అన్నాడాయన: "అతి చక్కని అద్భుతమైన చేతి పనివారు ఏ దేశానికైనా అత్యంత అవసరం. అంతేకాదు, వారు దేశానికి అవసర మైనవారూ, గౌరవనీయులూ అని చెప్పడానికి నేను వెనుదియ్యను."*

---

* *Montchrétien et l'économie politique nationale,* Paris, 1901, p. 21లో P. Dessaixచేత ఉల్లేఖింపబడింది.

వ్యాపారవాద ప్రముఖ సమర్థకుల్లో మొంక్రెక్ట్యేన్ ఒకడు. (తర్వాతి ప్రకరణానికి యిదే యితివృత్తం.) దేశపు ఆర్థికవ్యవస్థను ప్రభుత్వం నిర్వహించాల్సిన ప్రధానాంశాల్లో ఒకటిగా ఆయన భావించాడు. దేశంయొక్క, ప్రభుత్వంయొక్క (రాజుయొక్క) సంపదకు విదేశ వ్యాపారాన్ని, అందునా ప్రత్యేకించి కార్ఖానాల్లోనూ, చేతిపరిశ్రమల్లోనూ ఉత్పత్తియైన వస్తువుల ఎగుమతిని ప్రప్రథమ, ప్రధాన సాధనంగా ఆయన పరిగణించాడు.

తన పుస్తకం ప్రచురింపబడగానే — దీన్ని ఆయన 13వ లూయీకీ, రీజెంటు రాజమాతకీ అంకితమిచ్చాడు — మొంక్రెక్ట్యేన్ ఒక ప్రతిని ఆర్థిక మంత్రికి బహూకరించాడు. రాజభక్తిపూరితమైనదిగా కనిపించే యీ పుస్తకానికి మొదట్లో రాజదర్బారులో మంచి స్వాగతమే లభించిందని వేరే చెప్పనక్కర్లేదు. ఆ గ్రంథ రచయితకు ఒక రకమైన అనధికార ఆర్థిక సలహాదారు పాత్ర లభించింది. మొంక్రెక్ట్యేన్ 1617లో షతిల్యోన్ సుర్-లుయర పట్నపు గవర్నరుగా నియమింపబడ్డాడు. ఆయనకు ప్రభుహోదా కల్పింపబడినది బహుశా ఆ కాలంలోనే అయ్యుంటుంది. మొంక్రెక్ట్యేన్ ప్రొటెస్టెంటు ఎప్పుడయాడు, హూగెనాట్ల తిరుగుబాటుదార్లలో కలవడం ఎలా తటస్థించిందనేది తెలియదు. రాజరిక ప్రభుత్వం తన పథకాలను అమలు జరుపుతుందన్న ఆశను బహుశా ఆయన కోల్పోయివుంటాడు. అందుకు భిన్నంగా ప్రభుత్వం ఓ కొత్త మతయుద్ధ జ్వాలలను రేపుతూ వుండటం ఆయనకొక ఆందోళన కారణమై వుంటుంది. తను రూపొందించిన సూత్రాలు ప్రొటెస్టెంటిజానికి మరింత సన్నిహితమైనవిగా ఆయనకు కనిపించి వుంటాయి. దృఢసంకల్పమూ, సాహసమూ కలిగినవాడేమో, ప్రొటెస్టెంటిజానికి అనుకూలంగా ఆయన పోరాటానికి సంసిద్ధుడై వుంటాడు.

సరే యిప్పుడిక మళ్లీ ఆయన "రాజకీయ అర్థశాస్త్ర సిద్ధాంత వివరణ" విషయానికి వద్దాం. మొంక్రెక్ట్యేన్ తన పుస్తకానికి యీ పేరెందుకు పెట్టాడు? దాంట్లో ఏమైనా ప్రత్యేక ప్రతిభ వుందా? లేనట్లే కనిపిస్తుంది. ఈ కొత్త విజ్ఞానశాస్త్రానికి నామకరణంచెయ్యాలన్న భావం ఆయన మనస్సులో ఏ మూలా లేదనే చెప్పాలి. ఈ పదబంధమేమిటి, యిలాంటివే యితర పదబంధాలేమిటి గాలిలో — ప్రాచీన సంస్కృతికి సంబంధించిన పలుభావాలూ, భావనలూ పునరుద్ధరింపబడి, పునర్వ్యాఖ్యానింపబడి, పునర్నవమొనర్చబడిన పునర్వికాస దశలో — ప్రచలితంగా వున్నాయి. తన కాలంలో బాగా విద్యావంతులైన యితరులందరికీ మాదిరిగానే మొంక్రెక్ట్యేన్‌కు గ్రీకు, లాటిన్ భాషలు వచ్చు. ఆ భాషల్లోని ప్రామాణిక గ్రంథాలను ఆయన చదివాడు. ఆ కాలపు అలవాటు ప్రకారం, ఆయన తరచుగా వాటినుండి ఉటంకించాడు. క్సెనొఫోంట్, అరిస్టాటిల్‌లు ఆర్థికవ్యవస్థ, అర్థశాస్త్రం అన్న పదాలను ఏ అర్థంలో వాడారో ఆయనకు

తెలుసునననడంలో సందేహం లేదు. 17వ శతాబ్దపు రచయితలు యీ పదాలను గృహ నిర్వహణ, గృహయాజమాన్యం, సొంత వ్యవసాయ యాజమాన్యం అన్న అర్థంలోనే వాడటాన్ని కొనసాగించారు. మోంక్రెట్యేన్ తదనంతరం కొద్ది కాలానికి ఒక ఆంగ్లేయుడు "ఆర్థిక పరిశీలనలు, సలహాలు" అనే శీర్షికతో ఒక పుస్తకాన్ని ప్రకటించాడు. ఆర్థికవ్యవస్థను అతడు "మనిషి తన సొంత గృహాన్నీ, ఆస్తినీ చక్కగా నిర్వహించుకొనే కళ"గా నిర్వచించాడు. ఉదాహరణకు, ఒక మగవాడు తగిన గృహిణిని ఎంపికచేసుకోవడం వంటి సమస్యలను గురించి దానిలో అతను చర్చించాడు. మగవాడు భార్యను ఎంపిక చేసుకునేటప్పుడు, "రాత్రి రంభలాగా, పగలు పనిచేసేదిగా" వుండేలా చూసుకోవాలని "ఆర్థిక" సలహా యిచ్చాడు.

అయితే మోంక్రెట్యేన్‌కు ఆసక్తి కలిగించిన ఆర్థిక వ్యవస్థ యిదే కాదనడం నిస్సందేహం. రాజ్యానికీ, జాతీయ సముదాయానికీ సంబంధించిన ఆర్థికవ్యవస్థ అభివృద్ధిచెందాలని ఆయన కోరుకున్నాడు. అందుకనే అర్థశాస్త్రానికి రాజకీయ అన్న పదాన్ని ఆయన జతకలపడం ఆశ్చర్యపడవలసిన విషయమేమీ కాదు.

మోంక్రెట్యేన్‌కి పూర్తిగా ఓ 150 ఏళ్ల తర్వాత, అర్థశాస్త్రం ప్రధానంగా రాజ్య ఆర్థికవ్యవస్థగా, తరచుగా నిరంకుశ పాలకులచేత పాలింపబడే వివిధ దేశాల ప్రభుత్వాల ఆర్థికవ్యవస్థగా పరిగణింపబడింది. ఆడమ్ స్మిత్ అవతరణతోనూ, సాంప్రదాయిక ధోరణికి చెందిన బూర్జువా అర్థశాస్త్ర ఆవిర్భావంతోనూ మాత్రమే దాని స్వభావం మారి, మొత్తంగా ఆర్థిక నియమాలకూ, ప్రత్యేకించి వర్గాల మధ్య ఆర్థిక సంబంధాలకూ చెందిన ఒక విజ్ఞానశాస్త్రంగా అది తయారైంది.

తన పుస్తకానికి అటువంటి సముచిత శీర్షికనివ్వడమే మోంక్రెట్యేన్ చేసిన ఘనమైన సేవ కాదనడం స్పష్టం. ఫ్రాన్సులోనేమి, మొత్తం యూరప్‌లోనేమి ప్రత్యేకించి ఆర్థిక సమస్యలకే వినియోగించబడిన తొలిరచనల్లో అదొకటి. ఇతర సామాజిక విజ్ఞానశాస్త్రాలకు భిన్నమైన రంగంలో ప్రత్యేక పరిశీలనా రంగాన్నొకదాన్ని ఆయన పుస్తకం వేరుచేసి, పరిమితం చేసింది.

రాజకీయ అర్థశాస్త్రం, అర్థశాస్త్రం

పశ్చిమ దేశాల్లో రాజకీయ అర్థశాస్త్రం అన్న పదం ఇటీవలి దశాబ్దాల్లో వాడుకలోంచి పోయి, దాని స్థానంలో అర్థశాస్త్రం అన్న పదం వచ్చింది. ఈ పదం

రెండు అర్థాల్లో వాడబడుతోంది: ఒక సమాజపు ఆర్థిక వ్యవస్థ, ఆ సమాజంలోని ఉత్పత్తి సంబంధాల మొత్తం; ఆర్థికాభివృద్ధి నియమాల విజ్ఞానశాస్త్రం.

అయితే, అర్థశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం అనే పదాలను ఒకే అర్థంలో గ్రహించరాదు. ఈనాడు ఒక జ్ఞాన శాఖ అన్న అర్థంలో అర్థశాస్త్రం అన్న పదం చాలవరకు ఆర్థిక విజ్ఞానశాస్త్రాలుగా అర్థంచేసుకోబడుతోంది. రాజకీయ అర్థశాస్త్రానికి తోడు యీనాడు యీ విజ్ఞానశాస్త్రాలలో ఆర్థిక క్రమాలను గూర్చిన వివిధ జ్ఞాన శాఖలు వున్నాయి. ఉత్పత్తి నిర్వహణ, శ్రమ, ఉత్పాదిత వస్తువుల అమ్మకం, పారి శ్రామిక పెట్టుబడి — యివన్నీ కూడా ఆర్థిక విజ్ఞానశాస్త్రాల విషయాంశాలు. పెట్టు బడిదారీ, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలు రెండింటికీ యిది వర్తిస్తుంది. పెట్టుబడిదారీ ప్రణాళికా రచన భారీ పెట్టుబడిదారీ పారిశ్రామిక సంస్థల చట్రంలో జరుగుతుం దన్న విషయం మనకి తెలుసు. మరి ఆ ప్రణాళికా రచనా పద్ధతులూ, రూపాలూ కూడా ఆర్థిక విజ్ఞానశాస్త్ర విషయాంశమే. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ గుత్త నియంత్రణ అన్నది లేకుండా మనమీ నాడు ఆధునిక పెట్టుబడిదారీ విధానాన్ని ఊహించుకోలేము. ఆర్థిక వ్యవస్థను గురించి మొత్తంగానూ, దాని శాఖలను గురించి వేర్వేరుగానూ అధ్య యనం చేసేటప్పుడు యీ ప్రభుత్వ గుత్త నియంత్రణకు సంబంధించిన వాస్తవిక పరిశీలన కూడా జరపవలసివుంటుంది. ఇలా చూస్తూ పోతే ఆచరణలో ఆర్థిక విజ్ఞాన శాస్త్రాల విధులు వృద్ధిచెందుతున్నట్లు స్పష్టపడుతుంది.

సోషలిస్టు దేశాల్లో ఆర్థికశాస్త్రవేత్త వృత్తిని పరిశీలించినట్లయితే దానిలో అత్యంత వైవిధ్యపూరితమైన విధులు — మార్క్సిస్టు-లెనినిస్టు అర్థశాస్త్ర ప్రచారమనే శుద్ధ సైద్ధాంతిక ప్రబోధంనుంచి అత్యంత నిర్దిష్టమైన ఇంజనీరింగు లేక ప్రణాళికా కృషిదాకా — యిమిడివుంటాయి.

ఉత్పత్తి సంబంధాల భావనా సంక్లిష్టత దీనికి కారణం. వాటి రూపాల్లో కొన్ని మరింత సాధారణమూ, సామాజికమూ అయిన స్వభావం కలిగినవి. మరింత నిర్దిష్టమైన ఉత్పత్తి సంబంధ రూపాలు ప్రత్యక్షంగా సాంకేతిక విజ్ఞానంతోనూ, ఉత్పాదక శక్తులతోనూ ముడివడివుండగా యీ ఉత్పత్తి సంబంధ రూపాలు రాజకీయ అర్థశాస్త్ర ప్రత్యక్ష అధ్యయనాంశంగా వున్నాయి. మిగిలిన ఆర్థిక సాంకేతిక సమస్యలు ఉత్పత్తి సంబంధాలతో పరోక్షంగా మాత్రమే అనుబంధితమైవున్నాయి. నిర్దిష్ట ఆర్థిక విజ్ఞానశాస్త్రాల ప్రాముఖ్యం పెరిగి తీరుతుంది. ఆర్థిక పరిశోధనకూ, ఆచరణలో ఆర్థికవ్యవస్థా నిర్వహణకూ గణితశాస్త్ర, కంప్యూటర్ సాంకేతిక విజ్ఞానాల అన్వయంతో వాటి అభివృద్ధి ముడివడివుంది.

ఒకనాడు దాదాపు అన్ని జ్ఞానశాఖలనూ ఆవరించిన విజ్ఞానశాస్త్రాలకి విజ్ఞానశాస్త్ర

మైన తత్వశాస్త్రం యీనాడు "అనేకంలో ఒకటి" అయినట్లుగానే, ఒకనాడు ఆర్థిక విషయాలన్నింటినీ ఆవరించిన అర్థశాస్త్రం, యీనాడు ఆర్థికవిజ్ఞానశాస్త్ర కుటుంబంలో ప్రధానశాఖ అయింది. ఇది పూర్తి సహేతుకమైనది.

అయితే యీ విషయం యింతటితోనే ముగియలేదు. స్మిత్, రికార్డోల చేతుల్లో తయారైన అర్థశాస్త్రం ప్రధానంగా బూర్జువా సమాజంలో జనం మధ్య వర్గ సంబంధాల విజ్ఞానశాస్త్రం. దాని కేంద్ర సమస్య ఏమిటంటే, ఉత్పాదిత వస్తువుల (లేక ఆదాయాల) పంపిణీ సమస్య. ఇదొక సామాజిక సమస్య, పైగా అత్యంత వివాదాస్పదమైన సమస్య. రికార్డో అనుయాయుల్లో పలువురు ఆయన అర్థశాస్త్రపు వివాదాస్పద సామాజిక స్వభావాన్ని నీరుగార్చాలని ప్రయత్నించారు. అయితే బూర్జువావర్గం యింతటితోనే తృప్తిచెందలేదు. అదే కాలంలో రికార్డో సిద్ధాంతాల ప్రాతిపదికపైన, సామాజికోత్పత్తి సంబంధాలను ఆర్థిక విజ్ఞానశాస్త్ర విషయంగా బాహాటంగా చాటిచెప్పి, పెట్టుబడిదారీ విధానం కూలిపోక తప్పదని నిర్ధారణచేసిన మార్క్స్ అర్థశాస్త్రం తలెత్తింది.

అందుకని, గత శతాబ్దపు 70వ దశకంలో, శ్రమ విలువ సిద్ధాంతాన్ని తిరస్కరించడంద్వారా రాజకీయ అర్థశాస్త్రపు విప్లవాత్మక సామాజిక సారాంశాన్ని అర్థశాస్త్రం నుండి తొలగించ ప్రయత్నించిన కొత్త ఆర్థిక భావనలు పలు దేశాల్లో ఏకకాలంలో వేళ్లూనుకున్నాయి. సామాజిక, చారిత్రక సారాంశంలేని ఉపయోగక్రమంలో వ్యక్తులకు సరుకుల ఉపయుక్తత క్షీణతా సూత్రం, ఆర్థిక సమతూక సూత్రం వంటి కొన్ని సాధారణ సూత్రాల చుట్టూ—యీ విజ్ఞానశాస్త్రాన్ని తిప్పడం మొదలైంది. నిజానికి, యీ బూర్జువా అర్థశాస్త్ర యితివృత్తం వస్తువులతో మనుషుల సంబంధాన్ని పట్టించుకున్నంతగా ఉత్పత్తితో మనుషుల సామాజిక సంబంధాలను పట్టించుకోలేదు.

ఆర్థికవిజ్ఞానశాస్త్రపు ప్రధాన సమస్య సామాజిక అంతస్సారంలేని "సాంకేతిక" సమస్య, పరిశీలనలో వున్న సరుకు వినియోగానికి గల ప్రత్యామ్నాయావకాశాలలో దేన్ని ఎంచుకోవడమనే సమస్యో, లేక, పరిశీలనలో వున్న: శ్రమ, పెట్టుబడి లేక భూమి అన్న ఆమోదిత ఉత్పత్తి అంశమో అయి కూర్చుంది. పరిమితంగా వున్న వనరులను అత్యధిక స్థాయిలో వినియోగించుకొనే సమస్య ఏ సమాజానికైనా నిస్సందేహంగా ముఖ్యమైన సమస్యేననడంలోనూ, అది ఆర్థిక విజ్ఞానశాస్త్రాల పరిధిలోకే వస్తుందనడంలోనూ సందేహం లేదు. కాని దాన్నే రాజకీయ అర్థశాస్త్ర ఏకైక లక్ష్యంగా పరిగణించరాదు.

రాజకీయ అర్థశాస్త్రపు "సామాజిక తాటస్థ్యం" చాటబడింది. విజ్ఞానశాస్త్రం వర్గాలు, దోపిడీ, వర్గపోరాటాలతో తల ఎందుకు బద్దలుకొట్టుకోవాలి?

కాని యీ తాటస్థ్యమన్నది, పెట్టుబడిదారీ విధానానికి కొత్త రూపంలో సైద్ధాంతిక సమర్థనకు ఒక తెరమరుగు మాత్రమే. ఈ ఆర్థికవేత్తల — ఇంగ్లండులో జెవాన్స్, ఆస్ట్రియాలో మెంగెర్, వీసెర్‌లు, స్విట్జర్లాండులో వాల్రస్, అమెరికాలో జాన్ బేట్స్ క్లార్క్ — చేతుల్లో "పాత" రాజకీయ అర్థశాస్త్రం గుర్తుపట్టరానంతగా మార్చివెయ్యబడింది. ఇప్పుడది, ఆర్థిక విషయాలపట్ల స్వీయమనస్తత్వ వైఖరిపై ఆధార పడిన కొన్ని అనిర్దిష్ట తార్కిక, గణిత పథకాల సముదాయంగా తయారైంది. సహజంగానే యీ విజ్ఞానశాస్త్రానికి పేరు పెట్టాల్సిన అవసరం యేర్పడింది. సాహిత్యపరంగానూ, సాంప్రదాయికంగానూ సామాజిక అంతస్సారాన్ని కలిగిన "రాజకీయ అర్థ శాస్త్రం" అనే పదం ఒక న్యూసెన్సుగానూ, యిబ్బందికర విషయంగానూ తయారైంది.

అమెరికన్ ఆర్థికశాస్త్ర చరిత్రకారుడు బెన్ బి. సెలిగ్మన్ యిలా రాస్తాడు: జెవాన్స్ "రాజకీయ అర్థశాస్త్రంనుంచి 'రాజకీయ' అన్న మాటను విజయవంతంగా తొలగించి, అర్థశాస్త్రాన్ని మొత్తంగా సమాజపు ప్రవర్తనగా, అధ్యయనంగా కాకుండా విడివిడి వ్యక్తుల ప్రవర్తన అధ్యయనంగా మార్చివేశాడు."*

ఈ విజ్ఞానశాస్త్రంలో సంభవించిన "విప్లవ" స్వభావాన్ని మరింత స్పష్టంగా అర్థంచేసుకోవాలంటే, మరో ప్రసిద్ధ బూర్జువా పండితుడైన ఫ్రెంచి అర్థశాస్త్రవేత్త ఎమిల్ జేమ్స్ రచననుండి యీ కింది ఉల్లేఖనను చూస్తే సరిపోతుంది: "ఘనత వహించిన యీ సిద్ధాంతవేత్తలు, ఏ ఆర్థిక పాలనలో నైనాసరే పనిచేసే ఏర్పాట్లను వర్ణించడమే అన్నింటికన్న ముఖ్యంగా ఆర్థిక విజ్ఞానశాస్త్ర లక్ష్యమని భావించి, వ్యవస్థలపైన నిర్ధారణలు చెయ్యకుండా వుండేందుకు ప్రయత్నించారు. సామాజిక నిర్మాణ సమస్యల విషయంలో వారి మౌలిక సిద్ధాంతాలు తటస్థమైనవి. అంటే, ప్రస్తుత వ్యవస్థను గురించి వాటినుండి దూషణను గాని, భూషణను గాని ఎవరూ నిర్ధరించ లేరు."** కొత్త ఆస్ట్రియన్ ఆర్థికవేత్తలు "ఉపాంత విలువద్వారా విలువకు తామిచ్చే వివరణల్లో అన్నిటికన్న ముఖ్యంగా శ్రమవిలువ సిద్ధాంతానికి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతంపైనవే దాడిచేస్తున్నారు."***

తదుపరి శతాబ్దంలో బూర్జువా ఆర్థికవేత్తలు యీ సూత్రాల ప్రాతిపదికపైన

---

* Ben B. Seligman, *Main Currents in Modern Economics*, N. Y., 1963, p. 499.

** Emile James, *Histoire de la pensée économique an XX^e^, siècle*, Paris, 1955, pp. 10–11.

*** అదే గ్రంథం.

ఆర్థిక విశ్లేషణ సాంకేతిక పద్ధతులను అభివృద్ధిచేశారు. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలోని సామాజిక వైశిత్యం ఉద్దేశపూర్వకంగా గాని, అనుద్దేశపూర్వకంగా గాని, యీ "కొత్త" పద్ధతుల సహాయంతో మొద్దువారజెయ్యబడింది. ఈ విజ్ఞానశాస్త్రం చాలా ఆసక్తికర సమస్యల అధ్యయనాన్ని కొనసాగించినప్పటికీ, అది తన తొలి విధినీ, సారాంశాన్నీ విస్మరించ నారంభించింది. ఆ రకంగా, రాజకీయ అర్థశాస్త్రం, అర్థశాస్త్రం అనే పదబంధాల సమస్య పదజాలానికి సంబంధించిన కీచులాటకాదు, మౌలిక సూత్రాల విషయంమీదే అభిప్రాయభేదం.

ప్రకరణం 2

స్వర్ణారాధన, శాస్త్రీయ విశ్లేషణ: వ్యాపారవాదులు

భారతీయ సుగంధ ద్రవ్యాలకోసం యూరపియన్లు చేసిన అన్వేషణ ఫలితంగా అమెరికా కనుగొనబడింది, వెండి బంగారాల పట్ల వారికిగల తీరని దాహం ఫలితంగా అమెరికా కనుగొనబడి ఆక్రమించుకోబడింది. వ్యాపార పెట్టుబడి అభివృద్ధితో ముడి వడివున్న గొప్ప భౌగోళిక ఆవిష్కరణలు, తిరిగి తమ క్రమంలో, దాని భవిష్యదభివృద్ధికి విశేషంగా దోహదంచేశాయి. చరిత్రలో వ్యాపార పెట్టుబడే పెట్టుబడి ప్రాథమిక రూపం. ఈ పెట్టుబడి రూపంనుంచే పారిశ్రామిక పెట్టుబడి పెంపొందింది.

వ్యాపారవాదమే, 15వ శతాబ్దంనుండి 17వ శతాబ్దందాకా (చాలవరకు 18వ శతాబ్దంలో కూడా), ఆర్థిక విధానంలోనూ, ఆర్థిక చింతనలోనూ ప్రధాన ధోరణిగా ఉంటూవచ్చింది. దాన్ని క్లుప్తంగా మనం యిలా చెప్పకోవచ్చు: ఆర్థిక విధానంలో దేశంలోనూ, ప్రభుత్వ ఖజానాలోనూ వెండి బంగారాల అపార సంచయనం; సిద్ధాంతంలో చలామణీ రంగంలో (వర్తకం, డబ్బు తిరగడ) ఆర్థిక నియమాల అన్వేషణ.

స్వర్ణారాధన అన్నది పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అభివృద్ధి అంతటినీ అను సరించి వుంది. బూర్జువా జీవిత విధానంలోనూ, ఆలోచనా విధానంలోనూ అది అంత ర్భాగంగా వుంది. కాని, వ్యాపార పెట్టుబడి ప్రాబల్యం వహించిన కాలంలో యీ పూజా విగ్రహపు తళుకు ప్రత్యేకించి అధికంగా వుంది. మరింత ఎక్కువ ధరకు అమ్మ డంకోసం కొనడం — యిదే వ్యాపార పెట్టుబడి సూత్రం. మరి ఆ తేడా బంగారం రూపంలో చూడబడుతూ వచ్చింది. ఈ తేడా అన్నది ఉత్పత్తినుండీ, శ్రమనుండీ మాత్రమే ఉత్పన్నమవుతుందన్న విషయం అప్పటికింకా ఎవరికీ తట్టలేదు. విదేశాల్లో

తాము కొన్నదానికంటె ఎక్కువగా అమ్మడం — యిదే వ్యాపారవాద ప్రభుత్వపు వివేక పరాకాష్ఠ. అంతేకాదు, ప్రభుత్వాధినేతలూ, వారికోసం ఆలోచించి రచనలు చేసేవారూ యీ తేడాను విదేశాలనుండి దేశంలోకి ప్రవహించే బంగారం (లేక వెండి) రూపంలోనే చూసేవారు. దేశంలోనే కనుక పుష్కలంగా డబ్బుంటే, అన్నీ సక్రమంగా వుంటాయి అంటూండేవారు వాళ్ళు.

ఆదిమ సంచయనం

వ్యాపారవాదం బూర్జువా అర్థశాస్త్ర పూర్వచరిత్ర అయినట్లుగానే, ఆదిమ సంచయన కాలం బూర్జువా ఉత్పత్తి విధానపు పూర్వచరిత్ర. ఆదిమ సంచయనం అన్న పదబంధాన్ని ఆడమ్ స్మిత్ రూపొందించినట్లు కనిపిస్తుంది: పలు అంతస్సంబంధిత ఉత్పత్తి శాఖల అభివృద్ధి గుండా శ్రమ ఉత్పాదకత పెంపుదలకు పెట్టుబడి ఆదిమ సంచయనమే షరతని స్మిత్ రాశాడు (స్మిత్ దాన్ని "పూర్వ సంచయనం" అన్నాడు).

ఈ పదబంధం బూర్జువా విజ్ఞానశాస్త్రంలో వేళ్ళూనుకొని, బూర్జువావర్గానికి సంబంధించి ఒక ప్రత్యేకమైన, పవిత్రమైన అర్థాన్ని సంతరించుకున్న కారణంగా, మార్క్స్ యీ "ఆదిమ సంచయనం అని పిలవబడేదాని" గురించి ప్రస్తావించాడు.

దేని పర్యవసానంగానైతే సమాజం పెట్టుబడిదారులూ, వేతన కార్మికులూ అనే రెండు వర్గాలుగా విభజితమైందో, ఆ ఆదిమ సంచయన క్రమం యావత్తూ బూర్జువా అర్థశాస్త్రవేత్తలచేత ఒక ఆర్థిక స్వర్గరాజ్యమన్నట్లు చిత్రింపబడుతూవుంటుంది. చాలా కాలం క్రితం, ఒకవంక, కష్టించి పనిచేసేవారూ, అందునా ప్రత్యేకించి, కొద్దిమంది పొదుపరులూ, యుక్తాయుక్త వివేకజ్ఞానం గలవారూ, మరోవంక, తమ కున్నదాన్నంతనే కాకుండా అంతకు మించి కూడా విచ్చలవిడిగా దుబారా చేసిన దౌర్భాగ్యులూ వున్నారు.... కాగా, ఆ మొదటి తరగతికి చెందినవారు సంపదలను సంచయనం చేసుకోగా, రెండో తరగతివారు తమ కండలను అమ్ముకోడం తప్ప మరేమీ మిగలని దౌర్భాగ్యులయారు. ఈ సుందర వర్ణనలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలా నడుస్తుంది, శ్రమకి బహుమానం లభిస్తుంది, సోమరితనమూ, దుబారా శిక్షింపబడుతాయి.

ఇంతకన్న సత్యదూరమైన విషయం మరొకటుండదు. పెట్టుబడి ఆదిమ సంచయనం వాస్తవ చారిత్రక క్రమం అనడంలో సందేహం లేదు. కాని అది భీకరమైన వర్గపోరాటం మధ్య జరిగింది. పీడనతో, హింసామోసాలతో ఆ పోరాటం సాగింది.

ఇది దుస్సంకల్ప ఫలితంగావి, హింసపట్ల మానవునికిగల "ఆదిమ" అభిరుచి

మొదలైన వాటి పర్యవసానంగాని కాదు. ఆదిమ సంచయన కాలంలో ఒక సామాజిక రూపంనుండి మరో సామాజిక రూపానికి, అంటే పెట్టుబడిదారీ సామాజిక రూపానికి, వాస్తవికమైన చారిత్రక పరివర్తన నియమం అప్పుడప్పుడే ఆచరణలోకి వస్తోంది. తత్పర్యవసానంగా యీ క్రమం ప్రధానంగా ప్రగతిశీలమైనది. సమాజపు ఆర్థిక చరిత్ర అభివృద్ధికి యిది దోహదం చెయ్యడమే యిందుకు కారణం. ఆదిమ సంచయన యుగం సాపేక్షంగా ఉత్పత్తిలో శీఘ్ర పురోగతి, పారిశ్రామిక, వాణిజ్య పట్టణాల పెరుగుదలా, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల అభివృద్ధీ సాధింపబడిన యుగం. అది వెయ్యి సంవత్సరాల స్తబ్ధత అనంతరం కళా సంస్కృతుల వికాసాన్ని తెచ్చిన పునర్వికాస యుగం.

కాని, పాత ఫ్యూడల్ సామాజిక సంబంధాలు కూలిపోయి, కొత్త, బూర్జువా సంబంధాలు వాటి స్థానాన్ని ఆక్రమిస్తూవున్న కారణంగానే విజ్ఞానశాస్త్ర, సంస్కృతులు, ఈ యుగంలో వేగంగా అభివృద్ధిచెందగలిగాయి. లక్షలాది చిన్నరైతులు నాశనమవుతున్నప్పుడు, అర్ధ ఫ్యూడల్, స్వేచ్ఛాయుత భూఖామందులు పట్టణవాస, గ్రామీణ శ్రామికులుగా మారారు. ధనార్జనే తమ మతంగా కలిగిన పెట్టుబడిదారీ దోపిడిదారుల వర్గం ఏర్పడింది. అప్పుడు ఇక సుందర వర్ణన ప్రసక్తి ఉండజాలదు.

16వ శతాబ్దంలో ఇంగ్లండు, ఫ్రాన్సు, స్పెయిన్ వంటి పలు పశ్చిమ యూరపియన్ దేశాల్లో పటిష్ఠమైన రాజరికంతో కేంద్రీకృత జాతీయ రాజ్యాలు పెంపొందాయి. కొన్ని శతాబ్దాలపాటు సాగిన పోరాటంలో రాజరిక ప్రభుత్వాలు మొండిపట్టుదల కలిగిన భూస్వామ్య ప్రభువులను అధిగమించి, వారిని లొంగదీసుకున్నాయి. ఫ్యూడల్ సాయుధ పరివారాలు రద్దుచెయ్యబడ్డాయి. ఫ్యూడల్ ప్రభువుల యోధులూ, పరిచారకులూ "నిరుద్యోగులు" అయారు. వాళ్ళు వ్యవసాయ కార్మికులు కాగోరకపోయినట్లయితే, సైన్యంలోనూ, నౌకాసైన్యంలోనూ చేరి, అపార సంపదలను పోగుచేసుకొనే ఆశతో అమెరికాకో, ఈస్టిండియా వలసలకో పోనారంభించారు. వ్యవసాయ కార్మికులుగా వాళ్ళు వ్యవసాయదారులనూ, భూస్వాములనూ సంపన్నులను చేశారు. విదేశాలకు పోవడంద్వారా వాళ్ళు సాధారణంగా వర్తకుల, తోటల యజమానుల, ఓడయజమానుల సంపదలను పెంచారు. వాళ్లలో కొద్దిమంది పరమపద సోపానపటంలోని "నిచ్చెన ఎక్కి," ధనవంతులై, తామే వర్తకులుగానో, తోటల యజమానులుగానో మారారు. కొన్ని పెద్దపెద్ద సంపదలకు ఓడదొంగతనాలూ, బాహాటమైన దోపిడీయే మూల కారణం.

రాజులు భూస్వామ్య ప్రభువులతో జరిపిన పోరాటంలో పట్టణాలూ, చేతివృత్తులూ, వాణిజ్య బూర్జువావర్గమూ వారి నేస్తాలు. రాజులు జరిపే యీ పోరాటంలో పట్టణాలు వారికి ధనాన్నీ, ఆయుధాలనూ, కొన్ని సమయాల్లో సైనికులనూ సమకూర్చాయి. ఆర్థిక జీవన కేంద్రాలు పట్టణాలకు మారడంతోటే ఫ్యూడల్ ప్రభువుల అధికారానికీ,

వలుకుబడికీ ఎసరు వచ్చింది. బూర్జువావర్గం తన వరుసక్రమంలో, ఫ్యూడల్ ప్రభువులకూ, "సామాన్య జనానికీ," విదేశీ పోటీదార్లకూ వ్యతిరేకంగా ప్రభుత్వం తమ ప్రయోజనాలను బలపరచాలని ఒత్తిడిచేసింది. ప్రభుత్వం యీ చేయూత నిచ్చింది. వర్తక కంపెనీలూ, చేతివృత్తి కార్పొరేషన్లూ, రాజులనుండి వివిధ సౌకర్యాలనూ, గుత్తాధికారాలనూ పొందాయి. కఠిన శిక్షలకు గురికాకుండా వుండాలంటే పేదలను పారిశ్రామిక యజమానుల కోసం పనిచేసేలా నిర్బంధించే చట్టాలూ, గరిష్ఠ వేతనాలను నిర్దేశించే చట్టాలూ చెయ్యబడ్డాయి. వ్యాపారవాద ఆర్థిక విధానం పట్టణవాస, ప్రత్యేకించి వాణిజ్య బూర్జువావర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలచబడింది. ప్రభువర్గపు ఆదాయాలు ఏదో విధంగా వాణిజ్య వ్యాపార కార్యకలాపాలతో ముడిపడి వున్న కారణంగా, అనేక సందర్భాల్లో వ్యాపార సంస్థలు కూడా ప్రభువర్గ ప్రయోజనాలకు అనుగుణంగా వున్నాయి.

ఏ వ్యాపారానికైనా ప్రాతిపదిక అయిన డబ్బు, దాని సొంతదారు దాన్ని కార్మికులను పనిలో కుదుర్చుకోడానికో, సరుకులను ప్రోసెస్ చెయ్యడానికో, తిరిగి అమ్మడానికో వినియోగించినప్పుడు, అది పెట్టుబడి అవుతుంది. ఈ వాస్తవమే వ్యాపారవాదానికి ప్రాతిపదిక. దీని సారాంశమూ, లక్ష్యమూ డబ్బునూ — అరుదైన లోహాలనూ — దేశంలోకి ఆకర్షించడమే.

తొలి వ్యాపారవాద కాలంలో యీ చర్యలు పురాతనమైనవిగా వుండేవి. ఏ దేశంలోనైనా విదేశీ వర్తకులు తమ సరుకులను అమ్మినప్పుడు, అలా అమ్మడంద్వారా వచ్చిన డబ్బును ఆ దేశంలో అప్పటికప్పుడు విధిగా ఖర్చుపెట్టవలసివచ్చేది. వారు అలా చేసేలా చూసేందుకు ప్రత్యేక "సూపర్వైజర్లు," కొన్ని సందర్భాల్లో ప్రచ్ఛన్నంగా, నియమింపబడేవారు. వెండి బంగారాల ఎగుమతి నిషిద్ధమే అయిపోయింది.

దరిమిలా, 17వ, 18వ శతాబ్దాల్లో, యూరపియన్ రాజ్యాలు మరింత వెసులుబాటుతో కూడిన నిర్మాణాత్మక విధానాన్ని అనుసరించాయి. ఎగుమతి వస్తువుల ఉత్పత్తిని అభివృద్ధి చెయ్యడం, ఎగుమతులు దిగుమతులకన్న ఎక్కువగా ఉండేలా చూడటమే దేశంలోకి డబ్బును ఆకర్షించడానికి అత్యంత విశ్వసనీయ సాధనంగా పాలకులూ, వారి సలహాదారులూ గ్రహించారు. తత్పర్యవసానంగా ప్రభుత్వమే పారిశ్రామికోత్పత్తిని పెంపొందించి, కార్ఖానాలను పోషించడానికీ, స్థాపించడానికీ పూనుకొంది.

వ్యాపారవాద విధానంలోని యీ రెండు దశలూ దాని ఆర్థిక సిద్ధాంతాభివృద్ధిలోని రెండు దశలకు అనురూపమైనవి. తొలినాటి వ్యాపారవాదం — యిది <u>ద్రవ్య వ్యవస్థ</u> (monetary system) అని కూడా పిలువబడుతూండేది — డబ్బును దేశంలో ఉంచేందుకు పరిపాలనా చర్యలను రూపొందించడాన్ని దాటి ముందుకుపోలేదు. అభి

వృద్ధిచెందిన వ్యాపారవాదం దేశాన్ని సంపన్నమొనర్చేందుకు మూలసాధనం ఆదిమ సంపద సంచయనంలో గాక, విదేశ వ్యాపారాభివృద్ధిలోనూ, సానుకూల వ్యాపార సమతులనం (దిగుమతుల కన్న ఎగుమతుల ఆధిక్యత)లోనూ ఉన్నట్లు భావించింది. అది తన పూర్వుల "పరిపాలనా సంబంధమైన ఉత్సాహం"లో విశ్వాసాన్ని ప్రదర్శించలేదు. తమ దృష్టిలో సహజ హక్కు సూత్రాలకు అనుగుణమైన ప్రభుత్వ జోక్యాన్ని మాత్రమే అభివృద్ధి చెందిన వ్యాపారవాద భాష్యకారులు ఆమోదించారు. 17వ, 18వ శతాబ్దాలలో అర్థశాస్త్రాభివృద్ధిపైన సహజ హక్కు తత్వశాస్త్రం అతిముఖ్యమైన ప్రభావాన్ని కలిగివుంది. కొంతమేరకు విజ్ఞానశాస్త్రమే సహజ హక్కు చట్రంలోపల అభివృద్ధిచెందింది. అరిస్టాటిల్‌నుండీ, తదితర ప్రాచీన ఆలోచనాపరులనుండీ ఉత్పన్నమైన యీ భావాలు నూతన యుగంలో నూతన సారాంశాన్ని పొందాయి. సహజ హక్కు తత్వశాస్త్రజ్ఞులు నిరాకారమైన "మానవ స్వభావం"నుండీ, మానవుని "సహజ" హక్కులనుండీ తమ సిద్ధాంతాలను ప్రమాణీకరించారు. ఈ హక్కులు చాలవరకు మధ్యయుగాల లౌకిక, మత నిరంకుశత్వాన్ని వ్యతిరేకించిన కారణంగా సహజ హక్కు తత్వశాస్త్రం ముఖ్యమైన ప్రగతిశీల అంశాలను కలిగివుంది. పునర్వికాసకాలపు మానవతావాదులు సహజ హక్కు దృక్పథాన్ని చేబట్టారు.

రాజ్యం విషయంలో, తత్వవేత్తలూ, వారి అడుగుజాడల్లో వ్యాపారవాద సిద్ధాంతకారులూ మానవుని సహజ హక్కులకు — వీటిలో సొంత ఆస్తీ, భద్రతా యిమిడి వున్నాయి — హామీ కల్పించే సంస్థగా దాన్ని పరిగణించారు. రాజ్యం బూర్జువా సమాజపు పెరుగుదలకు పరిస్థితులను సమకూర్చాలన్నదే యీ సిద్ధాంతాల సామాజిక అర్థం.

ఆర్థిక సిద్ధాంతాలకూ, సహజ హక్కులకూ మధ్య సంబంధం దరిమిలా వ్యాపారవాదంనుండి సాంప్రదాయిక అర్థశాస్త్రానికి మారింది. అయితే, యీ సంబంధపు స్వభావం మారింది. సాంప్రదాయిక ధోరణి అభివృద్ధి దశలో (ఫ్రాన్సులో ఫిజియోక్రాట్లూ, ఇంగ్లండులో ఆడమ్ స్మిత్ అనుయాయులూ) బూర్జువావర్గానికి రాజ్య సంరక్షకత్వ అవసరం తక్కువగా ఉండటం, ఆర్థికవ్యవస్థలో రాజ్యపు అధిక జోక్యాన్ని వారు వ్యతిరేకించడమే దీనికి కారణం.

సామాన్య వ్యాపారవాది థామస్ మన్

ఆంగ్లేయులు లండన్‌ని the Great Wen అంటే "పెద్ద కంతి" అంటూండేవారు. ఒకప్పుడు ప్రపంచంలో చాలా శతాబ్దాలపాటు మిక్కిలి గొప్ప పట్టణమైన

లండన్, థేమ్స్ నది అనే రిబ్బనుపైన ఓ బ్రహ్మాండమైన ముడి మాదిరిగా పెరిగింది. దృశ్యాదృశ్యమైన దారాలు దాన్నుండి వెలువడుతూండేవి.

అర్థశాస్త్ర చరిత్రకు సంబంధించి లండన్ ఒక ప్రత్యేక పట్టణం. వర్తకానికీ, ద్రవ్యానికీ (finance) ప్రపంచ కేంద్రమైన లండన్ యీ విజ్ఞానశాస్త్ర ఆవిర్భావాభివృద్ధులకు మిక్కిలి అనువైన చోటు. పెట్టీ రచించిన చిన్నపుస్తకాలు లండన్‌లోనే ముద్రింపబడ్డాయి. అతని జీవితం ఐర్లండుతో సమానంగా దానితో కూడ ముడివడివుంది. ఒక శతాబ్దం తర్వాత ఆడమ్ స్మిత్ రచించిన "జాతి సంపద" అక్కడే ప్రచురింపబడింది. డేవిడ్ రికార్డో లండన్, దాని ముమ్మర వ్యాపారపు, రాజకీయ, విజ్ఞానశాస్త్రీయ జీవితపు సిసలైన సంతానం. తన జీవితంలో సగానికిపైగా లండన్‌లోనే గడిపిన కార్ల్ మార్క్స్ తన "పెట్టుబడి" గ్రంథాన్ని అక్కడే రచించాడు.

ఆంగ్ల వ్యాపారవాదానికి థామస్ మన్ (1571–1641) నమూనా వ్యాఖ్యాత. ఆయన వృత్తిపనివారల, వర్తకుల పురాతన కుటుంబంలో పుట్టాడు. ఆయన తాత లండన్ టంకశాలలో చెక్కుడు పనివాడు. తండ్రి విలువైన వస్త్రాల వ్యాపారి. తన ఫ్రెంచి సమకాలీనుడైన మొంక్రెట్యేన్ మాదిరిగా మన్ విషాదాంత నాటకాలు రాయ లేదు, ద్వంద్వయుద్ధాలు చెయ్యలేదు, తిరుగుబాట్లలో పాల్గొనలేదు. నిజాయితీపరుడైన వ్యాపారస్తుడుగా, తెలివైనవాడుగా ఆయన ప్రశాంతమూ, హుందా అయిన జీవితం గడిపాడు.

చిన్నతనంలోనే తన తండ్రిని కోల్పోయిన మన్, ధనిక వర్తకుడైన తన మారుటి తండ్రి యింట్లో పెరిగాడు. ఈ వ్యాపారి ఈస్టిండియా వర్తక సంఘ సంస్థాపకుల్లో ఒకడు. ఈ కంపెనీ మధ్యధరా సముద్రతీర దేశాలతో వర్తకం చేస్తూవుండిన పాత లెవాంట్ కంపెనీకి ఒక శాఖగా 1600వ సంవత్సరంలో ప్రారంభింపబడింది. తన మారుటి తండ్రి అంగడిలోనూ, ఆఫీసులోనూ అప్రెంటిస్‌గా పనిచేసిన తర్వాత, మన్ తన పద్దెనిమిదో ఏటనో, ఇరవయ్యో ఏటనో లెవాంట్ కంపెనీలో పనిచెయ్య నారంభించి, చాలా సంవత్సరాలు ఇటలీలో గడిపాడు. టర్కీకీ, లెవాంట్ దేశాలకూ ప్రయాణాలు చేశాడు.

మన్ త్వరలోనే ధనవంతుడై, అధికంగా గౌరవింపబడుతూ వచ్చాడు. 1615లో మొదటిసారిగా ఈస్టిండియా కంపెనీ డైరెక్టర్ల కమిటీ సభ్యుడుగా ఎన్నుకో బడి, త్వరలోనే ఆయన పార్లమెంటులోనూ, పత్రికల్లోనూ ఆ కంపెనీకి ఆరితేరిన, చురుకైన సంరక్షకుడుగా తయారయాడు. కాని మన్ మరీ ఎక్కువ ఆశలకు పోకుండా మెళకువగా వ్యవహరించాడు. ఆ కంపెనీ ఉపాధ్యక్ష పదవిని తిరస్కరించి, కంపెనీ కార్ఖానాల ఇన్స్పెక్టరు హోదాలో భారతదేశం వెళ్లేందుకు నిరాకరించాడు. ఆ రోజుల్లో

భారతదేశానికి వెళ్లాలంటే మూడునాలుగు నెలలు పట్టడమే కాకుండా, ప్రయాణం తుపానులు, అనారోగ్యం, సముద్రపు దొంగల దాడులు మొదలైన ప్రమాదాలతో కూడి వుండేది.

మరోవంక, లండన్ సిటీలోనూ, వెస్ట్‌మిన్‌స్టర్‌లోనూ* అత్యంత ప్రముఖ వ్యక్తుల్లో ఆయనొకడు. ఆర్థికాంశాలపై రచనలుచేసే ఎడ్వర్డ్ మిస్సెల్డెన్ అనే పబ్లిసిస్టు 1623లో మన్‌ని యిలా వర్ణించాడు: "...ఈస్టిండియా కంపెనీ వర్తకాన్ని గురించి ఆయన సూక్ష్మ పరిశీలన, మొత్తంగా వర్తక విషయాల్లో ఆయన సముచిత నిర్ణయాలు, దేశంలో ఆయన ఓర్పుతో కూడిన శ్రమైక ప్రవర్తన, విదేశాలకు సంబంధించిన ఆయన అనుభవం యివన్నీ ఆయనకు అలంకారప్రాయమైన గుణాలు. అందరిలోనూ ఉండాలని మనం కోరుకునే యీ సల్లక్షణాలు యీకాలపు వర్తకుల్లో మనకి సకృత్తుగా కనిపిస్తాయి."

అతిశయోక్తులనూ, స్తోత్రపాఠాలనూ వదిలిపెట్టేసినా, మన్ సాధారణ వర్తకుడు కాడనడంలో సందేహం లేదు. ఇటీవలి పరిశోధకుడొకడు పేర్కొన్నట్లు, ఆయన వర్తక వ్యూహకర్త. (అన్నట్లు, 17, 18 శతాబ్దాల్లో "వర్తకం" అన్న పదానికి మౌలికంగా "ఆర్థికవ్యవస్థ" అన్న అర్థమే ఇంగ్లండులో చలామణీలో వుండేది.)

మన్ పరిణత జీవితం స్టూవర్ట్ వంశానికి చెందిన మొదట యిద్దరు రాజుల పరిపాలన కాలంలో గడిచింది. నిస్సంతు అయిన ఎలిజబెత్ రాణి సుమారు 50 ఏళ్ల పరిపాలనానంతరం 1603లో మరణించింది. ఆమె రాజ్యానికి వచ్చేనాటికి ఇంగ్లండు మత, రాజకీయ విభేదాలతో సతమతమవుతున్న ఒక ఒంటి ద్వీప రాజ్యంగా వుండేది. అలాంటిది ఆమె మరణ కాలంనాటికి ఇంగ్లండు శక్తిసంపన్నమైన నౌకా బలాన్నీ, విస్తృత వ్యాపారాన్నీ కలిగిన ప్రపంచ శక్తిగా తయారైంది. ఎలిజబెత్ యుగం బ్రహ్మాండమైన సాంస్కృతిక వికాసంతో విలసిల్లింది. కొత్తగా సింహాసనం అధిష్ఠించిన మొదటి జేమ్స్ శిరచ్ఛేదానికి గురైన స్కాట్ రాణి మెరీ స్టూవర్ట్ కొడుకు. అతను లండన్ సిటీ (వ్యాపార కేంద్రం) అంటే భయపడినా, దాని అవసరాన్ని గ్రహించాడు. మొదటి జేమ్స్ నిరంకుశ చక్రవర్తిగా పాలించాలని కోరుకున్నాడు, కాని, ఖజానా పార్లమెంటు చేతుల్లోనూ, లండన్ వర్తకుల చేతుల్లోనూ ఉండిపోయింది. 17వ శతాబ్ది మూడవ దశకపు మొదటి సంవత్సరాల్లో ఆర్థిక, వర్తక యిబ్బందుల మూలంగా రాజూ, ఆయన మంత్రులూ సిటీలోని ఆర్థిక నిపుణుల సలహాను తీసుకోవలసివచ్చింది. వర్తక విషయాలపై ప్రత్యేక ప్రభుత్వ కమిషన్ ఒకటి నెలకొల్పబడింది. థామస్ మన్ 1622లో దానిలో చేరాడు. ఈ సలహా సంఘంలో అతను పలుకుబడి కలిగిన చురుకైన సభ్యుడు.

---

* లండన్‌లోని సిటీ — వ్యాపార కేంద్రం, వెస్ట్‌మిన్‌స్టర్ — రాజకీయ కేంద్రం.

వర్తకంపైన పరంపరగా కరపత్రాలు, అర్జీలు వెలువడ్డాయి. ఆ కమిషన్లో చర్చలు జరిగాయి. ఈ క్రమంలో 1620 దశకంలో ఇంగ్లండు వ్యాపారవాద ఆర్థిక విధానం స్వీకరింపబడింది. ఆ శతాబ్దాంతం దాకా ఆ విధానమే అనుసరింపబడుతూ వచ్చింది. ముడి పదార్థాల (ప్రత్యేకించి ఊలు) ఎగుమతి నిషేధింపబడింది. కాని, కార్ఖానా తయారీ వస్తువుల ఎగుమతులు, ప్రభుత్వ సబ్సిడీలద్వారా సైతం ప్రోత్సహింపబడ్డాయి. ఇంగ్లండు అంతకంతకు ఎక్కువగా కొత్త వలసలను ఆక్రమించుకుంది. అవి కార్ఖానాదారులకు ముడి పదార్థాలనూ, వర్తకులకు పంచదార, సిల్కు, సుగంధ ద్రవ్యాలు, పొగాకుల రవాణా, దళారీ బేరాలద్వారా లాభాలనూ సమకూర్చాయి. ఇంగ్లండులోకి విదేశీ పారిశ్రామిక సరుకుల ప్రవేశానికి అధిక దిగుమతి సుంకాల విధింపు ద్వారా ప్రతిబంధకాలు కల్పింపబడ్డాయి. ఈ చర్యలు పోటీ తాకిడిని తగ్గించి స్వదేశీ కార్ఖానాల పెరుగుదలను ప్రోత్సహించాయి (రక్షణవిధానం). ప్రపంచపు నాలుగు మూలలకూ సరుకులను చేరవేసి, ఇంగ్లీషు వర్తకాన్ని పరిరక్షించవలసిన నౌకాదళంపట్ల విశేషమైన శ్రద్ధ వహింపబడింది. దేశంలోకి వెండి బంగారాల ప్రవాహమే యీ చర్యలన్నింటి అతి ముఖ్య లక్ష్యం. కాని, అమెరికాలోని గనులనుండి నేరుగా తన వెండి బంగారాలను తెప్పించుకొనే స్పెయిన్ మాదిరిగా కాకుండా, ఇంగ్లండు విషయంలో దాని ధనాకర్షణ విధానం పరిశ్రమ, నౌకాదళ, వర్తకాల అభివృద్ధి యిందులో యిమిడివున్న కారణంగా లాభసాటిదిగా నిరూపితమైంది.

ఈలోగా స్ట్యువర్ట్ రాజరికంపైన తుపాను ముసురుకు రానారంభించింది. మొదటి జేమ్స్ కొడుకైన మొదటి చార్లెస్ దూరదృష్టిలేని మొండివాడు. అతను విస్తృత ప్రజానీకంలో వున్న అసంతృప్తిని వినియోగించుకున్న బూర్జువావర్గాన్ని తనకు శత్రువును చేసుకున్నాడు. మన్ మరణానికి సరిగా ఒక ఏడాది ముందు, 1640లో పార్లమెంటు సమావేశమై, రాజుపైన బాహాటంగా దాడిచేసింది. పోరాటం కొనసాగింది. ఇంగ్లీషు బూర్జువా విప్లవం ఆరంభమైంది. తొమ్మిదేళ్ల తర్వాత మొదటి చార్లెస్‌పైన శిరచ్ఛేద శిక్ష అమలుజరపబడింది.

వృద్ధ మన్ రాజకీయాభిప్రాయాలేమిటో మనకి తెలియదు. విప్లవాత్మక ఘటనల పర్యవసానాలను చూసేదాకా ఆయన బతకలేదు. కాని తన కాలంలో ఆయన నిరంకుశ రాజరికంపైన దాడిచేసి, రాజు అధికారాన్ని, ప్రత్యేకించి పన్నుల విధింపు రంగంలో పరిమితం చెయ్యాలని కోరాడు. అయితే, ఆయన రాజ శిరచ్ఛేదాన్ని ఆమోదించి వుండేవాడా అన్నది అనుమానాస్పదమే. తన జీవితపు చివరి దశలో మన్ చాలా ధనికుడయ్యాడు. పెద్దపెద్ద భూఖండాలు కొన్నాడు. పెద్దమొత్తాల్లో నగదు రుణాలివ్వగలవాడుగా లండనులో పేరుపొందాడు.

మన్ రెండు చిన్న రచనలు చేశాడు. అవి ఆర్థిక సాహిత్య భాండాగారంలో శాశ్వతంగా చోటుచేసుకుంటాయని చెప్పవచ్చు. ఈ రచనల భవితవ్యం అసామాన్యమైనది. వీటిలో మొదటిదాని పేరు "ఈస్టిండియా దీవుల్లో ఇంగ్లండు వ్యాపారంపై సామాన్యంగా లేవదియ్యబడే వివిధ అభ్యంతరాలకు సమాధాన గ్రంథం." ఇది 'T. M.' అన్న పొడి అక్షరాలతో 1621లో ప్రచురింపబడింది. పాత, ఆదిమ వ్యాపారవాదాన్ని (ద్రవ్య వ్యవస్థను) బలపరచి, ఈస్టిండియా కంపెనీ భారతీయ సరుకులను కొనేందుకు ఇంగ్లండు వెండిని ఎగుమతి చేస్తున్నదనీ, తత్కారణంగా ఆ వెండి శాశ్వతంగా ఇంగ్లండుకు కాకుండా పోతున్నదనీ ఈస్టిండియా కంపెనీని విమర్శించేవారికి వ్యతిరేకంగా రచింపబడిన ఖండనాత్మక గ్రంథం యిది. కంఠోపాఠంగా తెలిసిన వాస్తవాలతో, వివరాలతో శక్తివంతంగా మన్ యీ వాదాన్ని పరాస్తంచేశాడు. ఆ వెండి మాయమైపోవడం లేదనీ, మరింత పెద్ద మొత్తంలో ఇంగ్లండుకు తిరిగివస్తోందనీ నిరూపించాడు. అలా కాకుంటే, కంపెనీ నౌకల్లో రవాణా చేసుకునే సరుకులకు తుర్కులనుండో, లెవాంటైన్ల నుండో మూడు రెట్ల ధరను చెల్లించవలసి వుండేదన్నాడు. పైగా, యీ సరుకుల్లో గణనీయమైన భాగం తదితర యూరపియన్ దేశాలకు వెండి బంగారాలకు అమ్మబడుతున్నాయన్నాడు. ఆర్థిక చింతనకు సంబంధించినంతవరకు యీ చిన్నపుస్తకపు ప్రాముఖ్యం ఈస్టిండియా కంపెనీ ప్రయోజనాలను బలపరచడంలో కాక, అది పరిణత వ్యాపారవాద వివరణను కలిగివుండటంలో వుంది.*

దీనికంటె, మన్ రెండవ పుస్తకంపైననే అతని కీర్తి ఎక్కువగా ఆధారపడివుంది. ఆడమ్ స్మిత్ పేర్కొన్నట్లు "విదేశ వ్యాపారం ద్వారా ఇంగ్లండు కోశం లేక మన విదేశ వ్యాపార శేషమే మన కోశానికి మూలాధారం" అన్న ఆ పుస్తకం పేరే అందులో ప్రధాన విషయాంశాన్ని వ్యక్తం చేసేదిగా వుంది. ఈ పుస్తకం, మన్ మరణానికి దాదాపు పావు శతాబ్దం తర్వాత, 1664లో వెలువడింది. విప్లవం, అంతర్యుద్ధం, రిపబ్లిక్‌ల సుదీర్ఘ

---

* చాల కాలంపాటు ఇంగ్లీషు పండితులు 1609లో వెలువడిందని తలచబడిన యీ గ్రంథ ప్రథమ ముద్రణ ప్రతిని కనుగొనేందుకు ప్రయత్నించారు. అటువంటి ముద్రణ ఒకటుందని అర్థశాస్త్రవేత్తా, పాత ఇంగ్లీషు ఆర్థిక సాహిత్య సంచయనకర్తా అయిన జాన్ రామ్సే మెక్‌కుల్లోహ్ గత శతాబ్ది మధ్యంలో పేర్కొన్నాడు. ఈనాడు నిపుణులు అటువంటి ముద్రణ ఏదీ లేదని విశ్వసిస్తున్నారు. కాగా, వ్యాపారవాద రచనలు చేసినవారిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను ఇటాలియన్ సెరా (1613), ఫ్రెంచి మోంక్రెట్యేన్‌లు (1615) పొందారు. అయితే యింత మాత్రాన మన్ ప్రాధాన్యం ఏమాత్రం తగ్గదు.

కాలంలో యితర కాగితాలూ, పత్రాలతోబాటు యీ పుస్తకం రాతప్రతి కూడా బీరువాలో ఉండిపోయింది. మన్ కొడుక్కి, మన్ స్థిర, చరాస్తులతోబాటు యివన్నీ కూడా సంక్రమించాయి. 1660లో స్ట్యువర్టుల రాజ్య పునరుద్ధరణ జరిగింది. ఆర్థిక వాదోపవాదాలు తిరిగి చెలరేగాయి. దానితో యాభై ఏళ్ల ధనిక వర్తకుడూ, భూస్వామీ అయిన మన్ కొడుకుకి యీ పుస్తకాన్ని ప్రచురించి, యిప్పటికి దాదాపు విస్మరింపబడిన థామస్ మన్ పేరును ప్రజలకీ, ప్రభుత్వాధికారులకీ గుర్తుచెయ్యాలన్న ప్రేరేపణ కలిగింది.

మార్క్స్ అన్నట్లు "మరో వంద సంవత్సరాలపాటు ఆ పుస్తకం వ్యాపారవాదపు బైబిలు అయింది. వ్యాపారవాదానికి, 'ఆరంభంలో శాసన ప్రాయమైన'* యుగకర్తృక రచన ఏదైనా ఉందంటే, అది యీ పుస్తకమే..."**

1625–1630 మధ్య రాయబడిన వేర్వేరు ప్రకరణాలతో కూడిన యీ పుస్తకం వ్యాపారవాద సారాంశాన్ని సంగ్రహంగానూ, నిర్దిష్టంగానూ యిస్తుంది. మన్ శైలి అలంకార భూయిష్ఠమైనది కాదు. దానిలో ప్రామాణిక గ్రంథాలనుండి ఉల్లేఖన లకు బదులు ప్రజాసామాన్యంలో ప్రచారంలో వున్న నానుడులూ, అంచనాలూ చోటు చేసుకున్నాయి. ఒక్కచోట మాత్రమే అతను చారిత్రక వ్యక్తి – మాసిడన్ రాజా ఫిలిప్ – పేరు పేర్కొన్నాడు. ఫిలిప్, బలాన్ని ప్రయోగించడం సాధ్యంకానిచోట్ల డబ్బును కార్యాచరణ రంగంలోకి దింపాలని చెప్పాడు.

అసలైన వ్యాపారవాదిగా మన్, సంపదను ప్రధానంగా దాని డబ్బు రూపంలో, వెండి బంగారాల రూపంలో, చూస్తాడు. వర్తక పెట్టుబడి దృక్పథం అతని ఆలోచనపైన ప్రాబల్యం వహిస్తుంది. విడి వ్యాపారస్తుడైన పెట్టుబడిదారు డబ్బును పెంచుకోడం కోసమే దాన్ని చలామణీలో పెట్టినట్లే, దేశం కూడా వర్తకంద్వారా సంపన్నం కావాలి, అందుకుగాను ఎగుమతులు దిగుమతులను మించేలా చూసుకోవాలి. ఉత్పత్తి అభివృద్ధిని వర్తక విస్తరణకు ఒక సాధనంగా మాత్రమే అతను చూశాడు.

ఆర్థిక రచనలు ఎప్పుడూ కూడా కొద్దిగొప్పల్లో, ఏదో ఒక ఆర్థిక చర్య, పద్ధతి, లేక విధానం సరైనదని నిరూపించే ఒక నిర్దిష్టమైన లక్ష్యంతోనే చెయ్యబడుతాయి. కాని వ్యాపారవాదుల విషయంలో యీ ఆచరణాత్మక కర్తవ్యాలు ప్రత్యేకించి ప్రబలంగా వుంటాయి. తదితర వ్యాపారవాద రచయితల మాదిరిగానే మన్‌కి కూడా,

---

* కొటేషన్లలో వున్న మాటలు ఇ. డ్యూరింగ్ శైలికి వ్యంగ్యానుకరణ. ఈ సందర్భంలో మార్క్స్ డ్యూరింగ్‌ను విమర్శిస్తున్నాడు.

** Frederick Engels, *Anti-Dühring*, Moscow, 1969, p. 274.

ఆర్థికాభిప్రాయాల "వ్యవస్థ" దేన్నీ కల్పించాలన్న వాంఛ లేదు. అయితే, ఆర్థిక ఆలోచనకు దాని సొంత తర్కం వుంది. దాని మూలంగా ఆయన సరుకులు, డబ్బు, లాభం, పెట్టుబడివంటి వాస్తవాన్ని ప్రతిబింబించే సైద్ధాంతిక భావనలను వాడవలసివచ్చింది. ఏదేమైనా, వాటిమధ్య ఆయన కార్యకారణ సంబంధాన్ని కనుగొన ప్రయత్నించాడు.

మార్గదర్శకులు

కొత్తది ఏదైనా ఎప్పుడూ కష్టమే. 17వ శతాబ్దపు చింతనాపరుల విజయాలను అంచనావేసేటప్పుడు, వారికి ఎదురైన బృహత్తరమైన కష్టాలను మనం గుర్తులో పెట్టుకోవాలి. ఆంగ్ల భౌతికవాద మహా తత్వవేత్తలైన ఫ్రాన్సిస్ బేకన్, థామస్ హాబ్స్‌లు ప్రకృతిపట్లా, సమాజంపట్లా ఓ కొత్త దృక్పథాన్ని రూపొందించే క్రమంలో వున్నారు. తత్ఫలితంగా ప్రకృతి సమాజాల వస్తుపర నియమాల వివరణే తత్వశాస్త్ర ప్రధాన కర్తవ్యం అయింది. ఆర్థిక చింతనా రంగంలో పలు శతాబ్దాలుగా పాతుకుపోయివున్న మత, నీతి సూత్రాలు అధిగమింపబడవలసివచ్చింది. పవిత్రమైన బైబిలులోని వాచ్య, అంతరార్థాలకు అనుగుణంగా ఆర్థిక జీవితంలో ఏది ఉండి తీరాలి అన్నది పూర్వం ప్రధాన సమస్యగా ఉంటూవచ్చింది. ఇప్పుడు అందుకు భిన్నంగా, వాస్తవంలో ఏమి వుంది, "సమాజ సంపద" ప్రయోజనాల దృష్ట్యా, యీ కార్యకలాపాల విషయంలో ఏమి జరగాలన్నది ప్రధాన సమస్యగా తయారైంది.

మహత్తరమైన భౌగోళిక ఆవిష్కరణలూ, వర్తకం పెరుగుదలా వారి మనోదృష్టిని విస్తృతం చేసినప్పటికీ, జనానికి ప్రపంచాన్ని గురించి తెలిసినది చాలా తక్కువ. విదేశాల మాట అటుంచి, ఇంగ్లండ్ భౌగోళిక, ఆర్థిక వర్ణనలు సైతం తప్పుల తడకలతో నిండి, అర్థరహితంగా వుండేవి. ఆర్థిక ఆలోచనలో మార్గదర్శకుల అందుబాటులో అతి తక్కువగా మాత్రమే వాస్తవాలుండేవి. గణాంక లెక్కలు దాదాపుగా ఉండేవే కావు. అయితే జీవితం మానవ వ్యవహారాలపట్ల ఓ కొత్త దృక్పథాన్ని అవసరం చేసింది. కొత్త రంగాల్లో తడువులాడుతున్న ఆలోచనాపరులకు ప్రేరణనిచ్చింది. మన్‌కీ స్మిత్‌కీ మధ్యగల శతాబ్దంలో ఇంగ్లండులో ప్రచురింపబడిన ఆర్థిక రచనల సంఖ్య వేగంగా పెరిగింది. 1764లో గెరాల్డ్ మాస్సీచేత సంకలితం చెయ్యబడిన అటువంటి రచనల మొదటి కేటలాగులో 2,300కు పైగా పుస్తకాల పేర్లున్నాయి. పెట్టీ, లోక్, నార్త్‌ల మరికొందరు యితర రచయితల పుస్తకాలలో అప్పటికే

సాంప్రదాయిక అర్థశాస్త్ర ప్రాతిపదికలు ఉన్నప్పటికీ, యిది ప్రధానంగా వ్యాపారవాద సాహిత్యం.

వ్యాపారవాదం ప్రత్యేకించి ఇంగ్లండుకే చెందిన విషయం కాదు. ధన సంచయన విధానమూ, పారిశ్రామిక రక్షణవిధానమూ, ప్రభుత్వంచేత ఆర్థిక వ్యవస్థ నియంత్రణా 15నుండి 18వ శతాబ్దందాకా, పోర్చుగల్‌నుండి మస్కోవీదాకా యూరప్ అంతటా అనుసరింపబడ్డాయి. ఫ్రాన్సులో 17వ శతాబ్ది రెండవ అర్ధ భాగంలో, సర్వశక్తివంతుడైన మంత్రి కొల్బేర్‌కింద, వ్యాపారవాద విధానం ఫ్రాన్సులో అభివృద్ధిచెందిన రూపాలను సంతరించుకుంది. వ్యాపారవాద సిద్ధాంతాన్ని ఇటాలియన్ అర్థశాస్త్రవేత్తలు విజయవంతంగా అభివృద్ధి చేశారు. ఇంగ్లండులో వ్యాపారవాద రచనను దేన్ని తీసుకున్నా దాని శీర్షిక కింద "వర్తకం" అన్న పదం వుండగా, ఇటలీ విషయంలో "డబ్బు" అనే పదం వుండేది. విభజిత ఇటలీకి డబ్బు సమస్యా, చిన్న రాజ్యాల మధ్య డబ్బు మారకం సమస్యా ప్రధాన ప్రాముఖ్యం కలిగివుండేవి.

కాని వ్యాపారవాద భావాలను రూపొందించడంలో ఆంగ్ల అర్థశాస్త్రవేత్తలే ప్రధాన పాత్ర వహించారు. ఇంగ్లండు త్వరితంగా ఆర్థికంగా అభివృద్ధిచెందడం, ఆంగ్ల బూర్జువావర్గ పరిణతి యిందుకు నిదర్శనాలు. వ్యాపారవాదాన్ని మార్క్స్ లోతుగా విశ్లేషించినప్పుడు, తన విశ్లేషణకు ఆంగ్ల రచయితల గ్రంథాలనే ప్రాతిపదికగా చేసుకున్నాడు.

వ్యాపారవాదం ఒక రకమైన మూఢాభిప్రాయమన్న దృక్పథాన్ని ఆడమ్ స్మిత్ ప్రవేశపెట్టాడు. సాంప్రదాయిక అర్థశాస్త్రానికి వక్రభాష్యం చెప్పేవారిలో యీ దృక్పథం పాతుకుపోయింది. మార్క్స్ దానికి అభ్యంతరం చెప్పాడు: "...వ్యాపారవాదులు దరిమిలా అపభ్రంశ స్వేచ్ఛా వర్తకవాదులచేత చిత్రింపబడినంత మూఢులేమీ కారు."* తన కాలంనాటికి అభివృద్ధిచెందిన వ్యాపారవాదం పరిగణనీయమైన శాస్త్రీయ విజయం. ఆర్థిక ఆలోచనా రంగంలో అత్యంత ప్రతిభావంతులైన యీ మార్గదర్శకులు తత్వ, గణిత, ప్రకృతి విజ్ఞానశాస్త్రాలలో 17వ శతాబ్దపు అత్యున్నత ఆలోచనాశీలురకు సరిజోడైనవారు.

ఒక సైద్ధాంతిక వ్యవస్థగానూ, ఒక విధానంగానూ వ్యాపారవాదానికి గల జాతీయ స్వభావానికి దాని సొంత కారణాలున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ శీఘ్రతరాభివృద్ధి జాతీయ చట్రంలో మాత్రమే సాధ్యం. పెట్టుబడి సంచయనాన్నీ, తద్వారా

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, Moscow, 1969, p. 179.

ఆర్థికాభివృద్ధినీ ప్రోత్సహించే ప్రభుత్వం పైననే అది చాలవరకు ఆధారపడివుంటుంది. వాళ్ల దృష్టిలో వ్యాపారవాదులు ఆర్థికాభివృద్ధి నిసర్గ నియమాలనూ, డిమాండ్లనూ వ్యక్తంచేస్తున్నారు.

"సంపద," అంటే సృజింపబడి, వినియోగింపబడి, సంచితమొనర్చబడిన వస్తువుల మొత్తం, అంటే ఉపయోగపు విలువల మొత్తం. ఒక దేశంలో కంటె మరో దేశంలో మరింత ముమ్మరంగా ఎందుకు పెరుగుతుంది? సంపద మరింత వేగంగా పెరిగేందుకు కార్ఖానాల స్థాయిలోనూ, ప్రత్యేకించి దేశ స్థాయిలోనూ ఏం చెయ్యగలం, ఏం చెయ్యాలి? ఈ ప్రశ్నలకు జవాబులను సమకూర్చడంలో అర్థశాస్త్రానికి గల సామర్థ్యమే ఒక విజ్ఞానశాస్త్రంగా దాని అస్తిత్వానికి సాఫల్యాన్ని చేకూరుస్తుంది. వ్యాపారవాదులు ఆ జవాబులను అన్వేషించ ప్రయత్నించారు. వాటికోసం తమ కాలపు ఆర్థిక పరిస్థితులలో అన్వేషించారు. "హేతుబద్ధ ఆర్థికవ్యవస్థ" నిర్మాణ కర్తవ్యాన్ని ఆర్థిక విజ్ఞానశాస్త్రపు అతిముఖ్య సమస్యగా ముందుకు తెచ్చినవారిలో వారే మొదటివారని చెప్పవచ్చు. వారి ప్రత్యక్షానుభవయుత నిర్ధారణలలోనూ, సూచనలలోనూ చాల భాగం వాస్తవంలో సహేతుకమైనవిగా నిర్ధరింపబడ్డాయి. ఈ అర్థంలో అవి శాస్త్రీయమైనవి.

దీనికితోడు, వారు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నియమాలనూ, ఆంతరిక నిర్మాణ విధానాన్నీ అవగాహన చేసుకునేందుకు తొలి ప్రయత్నాలు చేశారు. వారు ఆర్థికవ్యవస్థ రహస్యాలకోసం డబ్బు చలామణీ రంగంలో వెతికిన కారణంగా వారి యీ అవగాహన బొత్తిగా పైపైదీ, ఏకపక్షమైనదీ అనాల్సి వుంటుంది. ఒక విమర్శకుడు పేర్కొన్నట్లు, వారు ఉత్పత్తిని "అగత్యమైన కీడు" గానూ, దేశంలోకి, ఆ మాటకొస్తే పెట్టుబడిదారీ వర్తకుల జేబుల్లోకి ధనప్రవాహాన్ని సాధించే ఒక సాధనంగా మాత్రమే పరిగణించారు. అయితే, పాదార్థిక సంపద ఉత్పత్తియే ఏ సమాజానికైనా పునాది. చలామణీ అన్నది ఉత్పత్తి తర్వాతది మాత్రమే.

వర్తక పెట్టుబడి ఆ రోజుల్లో వున్న పెట్టుబడి ప్రాబల్యంగల రూపం. దీన్ని బట్టి యీ వ్యాపారవాద దృక్పథానికి కారణాన్ని మనం గ్రహించవచ్చు. ఉత్పత్తిలో అత్యధికభాగం పెట్టుబడిదారీ పూర్వపు పద్ధతిలోనే యింకా జరుగుతూ వుండింది. కాని చలామణీ రంగం, ప్రత్యేకించి విదేశీ వర్తకం అప్పుడే, ఆనాటికి భారీ పెట్టుబడి అనబడేదాని చేతుల్లోకి పోయింది. 17వ శతాబ్దం అంతట్లోనూ, 18వ శతాబ్ది మొదటి అర్ధభాగంలోనూ ఇంగ్లండులో జరిగిన ఆర్థిక చర్చల్లో ఈస్టిండియా, ఆఫ్రికా వగైరా కంపెనీల వంటి వర్తక సంస్థలు కేంద్ర స్థానాన్ని ఆక్రమించాయంటే అది యాదృచ్ఛికమైన విషయం కాదు.

"జాతి సంపద"నే వ్యాపారవాదులు ప్రధానంగా వర్తక పెట్టుబడి ప్రయోజనాల

దృష్ట్యా పరిగణించారు. తత్పర్యవసానంగా, మారకపు విలువ లాంటి ఒక ముఖ్యమైన ఆర్థిక భావాభివర్గాన్ని వాళ్లు పరిగణనలోకి తీసుకోక తప్పలేదు. నిజానికి, సిద్ధాంత కారులుగా వాళ్లకు ఆసక్తిగొలిపినది సరిగా యిదే. మరి డబ్బు, బంగారం కన్న మారకపు విలువకు మరింత స్పష్టమైన రూపం యేముంది? కాని చివరకు వివిధ రకాల సంప దకూ, మారకంలోవున్న శ్రమకూ సంబంధించిన అరిస్టాటిల్ ప్రాథమిక సమీకరణం సైతం వాళ్లకు తెలియదు. తద్విరుద్ధంగా, మారకం అసమానమైనదనీ, దాని స్వభావరీత్యానే అది అసమమైనదనీ వాళ్లు విశ్వసించారు. (వాళ్లు ప్రధానంగా విదేశీ వర్తక మారకాన్ని పరిశీలిస్తూ వుండటం యీ దృక్పథానికి చారిత్రక కారణమైంది. ఈ మారకం, ప్రత్యేకించి వెనుకబడిన, "ఆటవిక" ప్రజలతో చేసే వర్తకంలో, తర చుగా దారుణంగా అసమానంగా వుండేది.) అరిస్టాటిల్ రచనల్లోనూ, మధ్యయుగా లకు చెందిన కొందరి రచనల్లోనూ బీజప్రాయంగా వున్న శ్రమ విలువ సిద్ధాంతాన్ని మొత్తంమీద వ్యాపారవాదులు అభివృద్ధిచెయ్యలేదు.

అదనపు విలువ — నిజానికి యిది వేతన కార్మికుల ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ ఫలితం, దీన్ని పెట్టుబడిదారులు స్వాయత్తం చేసుకుంటారు — వ్యాపారవాదుల రచనల్లో వర్తక లాభం రూపంలో కనిపిస్తుంది. పెట్టుబడి సంచయనాన్ని శ్రమదోపిడి ఫలితంగా కాక, మారకపు, ప్రత్యేకించి విదేశీ వర్తక ఫలితంగా వాళ్లు పరిగణిస్తారు.

అయితే, వారి యీ భ్రమలూ, పొరపాట్లూ వ్యాపారవాదులు చాలా సమస్యలను వాటి వాస్తవరూపంలో చూడటానికి ఆటంకాలు కాలేదు. ఈ కారణంగానే, సమాజంలో సాధ్యమైనంత పెద్ద విభాగాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తిలోకి లాగాలన్న విషయంలో వాళ్లు విశేషమైన ఆసక్తి చూపారు. దీనికితోడు, అతి తక్కువ నిజవేతనాలు యిస్తే, లాభాలు పెరిగి, పెట్టుబడి సంచయనం వేగాన్ని పుంజుకుంటుందని వాళ్లు విశ్వసిం చారు. ఆర్థికాభివృద్ధిలో వెనులుబాటుతో కూడిన ద్రవ్యవిధానానికి వ్యాపారవాదులు గొప్ప ప్రాముఖ్యాన్ని ఆపాదించారు. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య విషయాల పాత్రకు వాళ్లు చెప్పిన భాష్యం కొన్ని విధాల్లో ఆడమ్ స్మిత్ చెప్పిందాని కంటే మరింత లోతైనది. తమ ఆర్థిక పథకాలలో బలమైన ప్రభుత్వం ఉన్నదని ఊహించుకొని, తదుపరి వ్యాపార వాదులు కూడా, తరచుగా ఆర్థిక వ్యవస్థ విషయంలో ప్రభుత్వం అతిగా, చిల్లర మల్లర నియంత్రణకు పూనుకోడాన్ని వ్యతిరేకించారు. శక్తివంతమైన, స్వతంత్రమైన అనుభవం కలిగిన బూర్జువావర్గపు ప్రయోజనాలను వ్యక్తంచేసిన ఇంగ్లీషువారికి యిది ప్రత్యేకంగా వర్తిస్తుంది. అటువంటి బూర్జువావర్గానికి ప్రభుత్వం అన్నది, తమ ప్రయోజనాల సాధారణ పరిరక్షణకు మాత్రమే అవసరం.

వెండి బంగారాల ఎగుమతిపై కచ్చితమైన నియంత్రణకు వ్యతిరేకంగా థామస్

మన్ గట్టిగా పోరాడాడు. రైతు పంటను పొందేందుకు తన విత్తనాలను భూమిలో ఎలా విరజిమ్మాలో, అలాగే తన సరుకులను మరింత ఎక్కువగా అమ్మి, అదనపు డబ్బు మొత్తాల రూపంలో తన దేశానికి లాభాన్ని తెచ్చేందుకుగాను వర్తకుడు కూడా డబ్బును ఎగుమతిచేసి విదేశీ సరుకులను కొనాలని అతను రాశాడు.

వ్యాపారవాదమూ, మన యుగమూ

ఆర్థిక సిద్ధాంతంలో ఒక ధోరణిగా వ్యాపారవాదం 18వ శతాబ్ది అంత్య ప్రాంతం లోనే రంగంనుంచి నిష్క్రమించింది. సాంప్రదాయిక అర్థశాస్త్ర సూత్రాలు పారిశ్రామిక విప్లవానికీ, కార్ఖానా పరిశ్రమకే మరింత అనుగుణంగా వున్నాయి. ఈ సూత్రాలు బాగా పురోగమించిన పెట్టుబడిదారీ దేశాలైన ఇంగ్లండు, ఫ్రాన్సుల్లో ప్రత్యేకించి ప్రాబల్యంలో వున్నాయి. ఆర్థిక వ్యవస్థలోనూ, విదేశీ వర్తకంలోనూ ప్రభుత్వపు ప్రత్యక్ష జోక్యాన్ని బలహీనపరచడం ద్వారా ఆర్థిక విధానంలో యిది ప్రతిబింబితమైంది.

అయితే, పెట్టుబడిదారీ అభివృద్ధి పథంలో దరిమిలా ప్రవేశించిన దేశాల్లో సాంప్రదాయిక భావాలు పూర్తిగా వేరూనుకోలేకపోయాయి. ఈ దేశాల్లోని బూర్జువా వర్గం ఆర్థిక వ్యవస్థలో అన్నింటినీ వాటి యిష్టానువర్తనకు వదిలెయ్యాలనడాన్ని ఆమోదించ నిరాకరించింది. ఈ యిష్టానువర్తనలో ఇంగ్లీషు బూర్జువావర్గమూ, అలాగే ఫ్రెంచి బూర్జువావర్గం కూడా విజయం పొందే అత్యధికావకాశం ఉన్నట్లు అది భావించిందంటే అది నిర్హేతుకమైనదేమీ కాదు. అందుచేత, ఆయా వ్యాపారవాద భావాలు ఎన్నడూ నశించిపోలేదు. వ్యాపారవాద విధానంలోని ఆర్థిక వ్యవస్థయొక్క ప్రభుత్వ నిర్వహణ, పారిశ్రామిక రక్షణవిధానం, దేశంలో ధనసమృద్ధిని సమకూర్చుకోవడం వంటి ప్రధానాంశాలు ప్రభుత్వాలచేత కొన్ని సందర్భాల్లో క్రియాశీలంగా అనుసరింప బడ్డాయి.

20వ శతాబ్దం రాకతో పారిశ్రామిక బూర్జువా దేశాల్లో ప్రభుత్వ గుత్త పెట్టు బడిదారీ విధానం అభివృద్ధిచెందింది. ఈ పరిస్థితులకు అనుగుణంగా వుండి, ఆర్థిక వ్యవస్థపైన ప్రభుత్వ ప్రభావ కర్తవ్యాన్ని ప్రతిబింబించిన ఆర్థిక భావాలు ఆంగ్ల ఆర్థిక సిద్ధాంతకారుడైన జాన్ మెయ్‌నార్డ్ కీన్స్‌చేత 1930 దశకంలో అత్యంత సమగ్రంగా వ్యక్తంచెయ్యబడ్డాయి. ఇటీవలి దశాబ్దాల బూర్జువా ఆర్థిక ఆలోచన చాలవరకు అతని భావాల ప్రభావం కిందనే అభివృద్ధి చెందింది. కీన్స్ భావాలు

యీనాటి గుత్త సంస్థలూ, ప్రభుత్వాలూ అనుసరించే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక విధానాన్ని అనేక విషయాల్లో నిర్ణయిస్తున్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ స్వయం నియంత్రణ ద్వారా యికనెంతమాత్రమూ మన జాలదని కీన్స్ వాదించాడు. ఆర్థిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంచేసే కర్తవ్యాన్ని ప్రభుత్వం చేబట్టాలి. చిరకాలంగా ఉత్పత్తికన్న వెనుకబడి వున్న కొనుగోలు శక్తికి మద్దత్తునూ, ప్రేరణనూ యివ్వడమే ప్రధానంగా యీ కర్తవ్యం. నిరుద్యోగం పైనా, ఫ్యాక్టరీలలో పూర్తి పనిగంటల కోసమూ పోరాటం జరపాలి. కాగా విడి పెట్టుబడిదారులను పెట్టుబడి పెట్టేలా, అంటే కొత్త ఫ్యాక్టరీలను నిర్మించి, ఉత్పత్తిని విస్తృతం చేసేలా నిరంతరం ప్రోత్సహించాలి.

బూర్జువా అర్థశాస్త్రం ఒకటిన్నర శతాబ్దాలపాటు ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని వాదిస్తూవచ్చింది. ఇది పొరపాటు, ప్రమాదకర అభిప్రాయం. ప్రథమంగానూ, ప్రధానంగానూ దేశంలో డబ్బు సమృద్ధిగా ఉండేలా, అది "చౌకగా" ఉండేలా, అంటే రుణాలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండేలా ప్రభుత్వం చూడాలి. అటువంటి పరిస్థితిలో బ్యాంకురుణాలు తీసుకునేందుకూ, మదుపులు పెట్టేందుకూ, తత్కారణంగా కార్మికులను పనుల్లో పెట్టుకునేందుకూ, వారికి వేతనాలు చెల్లించేందుకూ పెట్టుబడిదారులు ఆతుత చూపుతారు. స్వేచ్ఛావాణిజ్యం అన్నదొక దురభిప్రాయం. పూర్తి ఉద్యోగకల్పనకు అవసరమైనట్లయితే, అప్పుడు విదేశీ వస్తువుల దిగుమతిపై నిర్బంధాలు కూడా అనుమతించదగినవే, అలాగే సరుకులతో ముంచెత్తడమూ (మార్కెట్లపై అదుపును సంపాదించేందుకుగాను తక్కువ ధరలకు సరుకులను ఎగుమతిచెయ్యడమూ), కరెన్సీ విలువ తగ్గింపూ కూడా ఆమోదయోగ్యమైనవే.

ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకూ, పశ్చిమ యూరప్‌లో 250–300 ఏళ్లకు పూర్వం వున్న ఆర్థిక వ్యవస్థకూ మధ్యవున్న తేడాను విస్మరిస్తే సహజంగానే ఈ సూచనలు చిత్రంగా వ్యాపారవాద భావాలను గుర్తుచేస్తాయి. వ్యాపారవాదంపైన నిపుణుడుగా గుర్తింపబడిన స్వీడిష్ ఆర్థికవేత్త ఎలీ హెక్‌షెర్ (1879–1952) యిలా రాశాడు: "...సమాజంపట్ల కీన్స్ తాత్విక అభిప్రాయాలు పూర్తిగా భిన్నమైన వైనప్పటికీ, ఆర్థిక సంబంధాలపై కీన్స్ అభిప్రాయాలకూ, వ్యాపారవాదుల అభిప్రాయాలకూ మధ్య అనేక పోలికలున్నాయి...."* అది భిన్నమై ఉండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వ్యాపారవాదులు పెట్టుబడిదారీ విధానపు తొలిదశకు చెందిన వర్ధమాన వర్తక,

* Eli F. Heckscher, *Mercantilism*, New York, 1955, Vol. 2, p. 340.

పారిశ్రామిక బూర్జువావర్గంయొక్క ప్రయోజనాలను వ్యక్తంచెయ్యగా, కీన్స్ ఆధునిక ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధాన సిద్ధాంతకారుడు.

కీన్స్ తన భావాలను నిర్మొహమాటంగా వ్యక్తంచేశాడు. "సాంప్రదాయిక సిద్ధాంతాన్ని" (స్థూలంగా చెప్పాలంటే, సాంప్రదాయిక సిద్ధాంతమంటే ఆయన ఉద్దేశం, స్వయంనియంత్రణం, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యంచేసుకోకపోవడం అని) కూలదొయ్యడమే తన కర్తవ్యంగా ఆయన పెట్టుకొని, యీ విషయాన్ని మొదటి పుటలోనే స్పష్టం చేశాడు. వ్యాపారవాదుల విషయంలో కూడా — వారిని తన పూర్వులుగా బాహాటంగా గుర్తిస్తూనే — ఆయన యిదే విధంగా వ్యవహరించాడు. విమర్శకులు, ప్రత్యేకించి హెక్‌షెర్, కీన్స్ కొంతవరకు తన సొంత అభిప్రాయాలనే 17, 18 శతాబ్దాల రచయితలకు ఆపాదించాడనీ, మెత్తగా చెప్పాలంటే, వారి రచనలను అతి చిత్రంగానూ, తనకి వీలుగానూ వ్యాఖ్యానించాడనీ దరిమిలా రుజువు చేశారు. ఏదేమైన ప్పటికీ, కీన్స్‌కీ, వ్యాపారవాదులకీ మధ్య గణనీయమైన సంబంధం వుంది. తనకూ వారికీ మధ్యగల సంబంధాన్ని తెలిపే నాలుగు అంశాలను కీన్సే రూపొందించాడు.

మొదటిది, ఆయన దృష్టిలో వ్యాపారవాదులు రుణాలపై వడ్డీని తగ్గించడం ద్వారానూ, పెట్టుబడిని మదుపు పెట్టడాన్ని ప్రోత్సహించడం ద్వారానూ దేశంలో డబ్బు మొత్తాన్ని పెంచేందుకు కృషిచేశారు. మనం యింతకు ముందే చూసినట్లు, కీన్స్ కీలకాభిప్రాయాల్లో యిదొకటి. రెండవది, వాళ్ళ ధరల పెరుగుదలపట్ల భయపడలేదు సరికదా, అధిక ధరలు వర్తకంయొక్కా, ఉత్పత్తియొక్కా విస్తరణకు తోడ్పడుతాయని భావించారు. "పరిమిత ద్రవ్యోల్బణం" ఆర్థిక కార్యకలాపాలకు తోడ్పడే ఒక సాధనం అన్న ఆధునిక భావజనకుల్లో కీన్స్ ఒకడు. మూడవది, "డబ్బు కొరత నిరుద్యోగ కారణాల్లో ఒకటన్న భావానికి... వ్యాపారవాదులు ఆద్యులు."* బ్యాంకు రుణాల విస్తరణ ద్వారా డబ్బు మొత్తాన్ని పెంచడం, ప్రభుత్వ బడ్జెట్ లోటులూ నిరుద్యోగ వ్యతిరేక పోరాటంలో అత్యంత ముఖ్యమైన ఒక ఆయుధంగా ఉండగలవన్న వాదాన్ని కీన్స్ ముందుకి తెచ్చాడు. నాల్గవది, "తమ విధానాల జాతీయవాద స్వభావాన్ని గురించిగాని, యుద్ధానికి దోహదంచేసే వాటి ధోరణిని గురించిగాని వ్యాపారవాదులకు భ్రమలేమీ లేవు."** ఏ ఒక దేశంలోనైనా పారిశ్రామిక రక్షణ విధానం పూర్తి ఉద్యోగ సమస్యా పరిష్కారంలో తోడ్పడగలదని కీన్స్ విశ్వసించి, ఆర్థిక జాతీయవాదాన్ని ప్రతిపాదించాడు.

---

* J. M. Keynes, *The General Theory of Employment, Interest and Money*, London, 1946, p. 346.

** అదే గ్రంథం, పేజి 348.

కీన్స్ ప్రత్యేకించి చెప్పనవసరం లేనట్లు భావించిన అయిదో అంశాన్ని మనం యిక్కడ చేర్చుకోవచ్చు: ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వపు ప్రముఖ పాత్రపై వక్కాణింపు.

పైన పేర్కొన్నట్లు, 19వ శతాబ్దాంతంలో, బూర్జువా అర్థశాస్త్రం శ్రమ విలువ సిద్ధాంతాన్నీ, సాంప్రదాయిక రీతికి చెందిన తదితర సైద్ధాంతిక సూత్రాలనూ తోసిపుచ్చింది. ఈ రోజున సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రంనుండి ఉత్పన్నమైన ఆర్థిక విధానాన్ని కూడా అది పరిత్యజించింది. పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు తీవ్రతరం కావడమే దీనికి ప్రధాన కారణం. బూర్జువా ఆర్థికవేత్తలు ప్రభుత్వ జోక్యాన్ని పెంచడం ద్వారా యీ వైరుధ్యాలను తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వపు సర్వశక్తిమత్వ భావాన్ని గతంలో వ్యాపారవాదులు పూర్తిగా వ్యక్తం చేశారు. అందుకే వారికీ బూర్జువా అర్థశాస్త్రవేత్తలకూ మధ్య యీ సంబంధం.

ఆధునిక బూర్జువా అర్థశాస్త్ర సంప్రదాయాలన్నీ కీన్స్ పంథాను అనుసరించలేదు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యాన్ని తిరస్కరించే పెద్దపెద్ద ధోరణులే వాటిలో వున్నాయి. ద్రవ్యోల్బణంపట్ల కీన్స్ అనుయాయుల ఉత్సాహానికి వ్యతిరేకంగా "ప్రైవేటు వ్యాపార స్వేచ్ఛ"ను వారు బలపరుస్తారు. ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి, పూర్తి ఉద్యోగ కల్పనల విషయంలో ప్రభుత్వ జోక్య ప్రయత్నాలను యీ రచయితలు "నయా వ్యాపారవాదం" అని — నికృష్టార్థకంగా — అప్పుడప్పుడు పిలుస్తూవుంటారు. వారి దృష్టిలో అటువంటి ప్రభావం ఏదైనా కూడా వ్యక్తి స్వేచ్ఛను పరిమితంచేస్తుంది, అది "పాశ్చాత్య ఆదర్శాలకు అనుగుణమైనది కాదు. "నయా వ్యాపారవాదం"యొక్క యీ విమర్శకులు కీన్స్ అనుయాయులు (బహుశా తమకు తెలియకుండానే) తమ సిద్ధాంతాల ద్వారా ఏమి వ్యక్తం చేస్తున్నారో చూడటంలేదు. ఆర్థిక వ్యవస్థలో ఆధునిక బూర్జువా ప్రభుత్వ జోక్యపు పాత్ర పెరుగుదల ఒక వస్తుపర నియమమన్నదే యీ అంశం. లేకుంటే, పెట్టుబడిదారీ విధానం తను ఉత్పన్నంచేసిన శక్తులను యికనెంత మాత్రమూ అదుపుచెయ్యజాలదు.

మరోవంక, "నయా వ్యాపారవాదం" అన్న పదం తరుణ వర్ధమాన దేశాల ఆర్థిక విధానంపట్ల అనుమానాలను రేకెత్తించడానికి వాడబడుతోంది. ఆర్థిక వ్యవస్థలోని ప్రభుత్వ రంగమూ, ఆర్థిక ప్రణాళికలూ, కార్యక్రమాలూ నయావ్యాపారవాదంగా పేర్కొనబడుతున్నాయి. కస్టమ్సు సుంకాల ద్వారా, తదితర చర్యల ద్వారా దేశీయ పరిశ్రమకు రక్షణ కల్పన కూడా నయావ్యాపారవాదంగా పిలవబడుతోంది. ద్వైపాక్షిక వర్తక ఒప్పందాలు, ప్రభుత్వ రుణాల ద్వారా పరిశ్రమలకు పెట్టుబడి కల్పన, ధరల నియంత్రణ, గుత్త సంస్థల లాభాలపై నిర్బంధాలు — యివన్నీ కూడా నయావ్యాపారవాదమే.

మరైతే, యీ దేశాలన్నీ ఎలా అభివృద్ధి చెందాలట? వర్తక స్వేచ్ఛ ద్వారా, అంటే, ప్రభుత్వం ఉదారమైన బేజోక్య విధానాన్ని అనుసరించడం ద్వారా విదేశీ గుత్త సంస్థలకు స్వేచ్ఛా కల్పన ద్వారా. అప్పుడు నయావ్యాపారవాదం ఎంతమాత్రం ఉండదు. అయితే, అప్పుడిక స్వతంత్రమైన ఆర్థికాభివృద్ధి కూడా ఏమీ వుండదు. వెనుకబాటు తనాన్నీ, పరాధీనతనూ పదిలంగా వుంచే పరిస్థితులు సరిగా యివే కావడమే యిందుకు కారణం!

చాలా వర్ధమాన దేశాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహదంచేసే ఒక సాధనంగా పారిశ్రామిక రక్షణ విధానం అవలంబింపబడుతోంది. ఈ సందర్భంలో యిది ప్రగతిశీలమైనది. అభివృద్ధి చెందిన పెద్ద దేశాలు అనుసరిస్తున్న దురాక్రమణపర పారిశ్రామిక రక్షణ విధానానికి — మార్కెట్లకోసం సామ్రాజ్యవాద పోరాటంలో యీ విధానం అనుసరింపబడుతోంది — యిది పూర్తిగా భిన్నమైనది.

ప్రకరణం 3

స్తవనీయుడైన సర్ విలియం పెట్టీ

కళా, విజ్ఞానశాస్త్ర రంగాల్లో మహా నవ్య పథదర్శకులైన షేక్స్పియర్, బేకన్‌లు థామస్ మన్ సమకాలీనులు. అర్థశాస్త్రంలో అదే మాదిరి నవ్య పథదర్శకుడైన విలియం పెట్టీ మరో తరం తర్వాత ప్రత్యక్షమయ్యాడు. వాళ్ల మధ్య తరానికి చెందిన ప్రసిద్ధులు శతాబ్ది మలుపులో జన్మించిన సైనికులూ, మతబోధకులూ. మితవాద బూర్జువా వర్గ నాయకుడూ, వీరుడూ అయిన ఆలివర్ క్రామ్‌వెల్, ఆయనకి మరింత వామ పక్ష రాజకీయ ప్రత్యర్థి అయిన జాన్ లిల్‌బర్న్ కుడిచేతిలో కత్తినీ, ఎడమచేతిలో బైబిలునూ ధరించి ముందుకు వచ్చారు. ఆనాటి చారిత్రక పరిస్థితుల కారణంగా, 17వ శతాబ్దంలోని రాజకీయ, సామాజిక విప్లవం మత ముసుగును సంతరించుకుంది. అది ప్యూరిటనిజం అనే నిష్ఠాపరమైన దుస్తులను ధరించింది.

క్రామ్‌వెల్ ప్రొటెక్టరేట్‌లో తన విప్లవ ఔత్సుక్యాన్ని కోల్పోయిన బూర్జువా వర్గం, 1660లో, కొత్త ప్రభువర్గపు పొత్తుతో, హతమొనర్చబడిన రాజు కుమారుడైన రెండవ చార్లెస్‌ను గద్దెనెక్కించి స్ట్యూవర్ట్ రాజవంశాన్ని పునరుద్ధరించింది. అయితే, రాజరికం పూర్వమున్న మాదిరిగా యిప్పుడిక ఎంతమాత్రం లేదు, విప్లవం వృథాకాలేదు. బూర్జువావర్గం పాత ఫ్యూడల్ ప్రభువర్గాన్ని దిగతొక్కి తన పరిస్థితిని పటిష్ఠంచేసుకుంది.

రెండు దశాబ్దాల విప్లవ కాలంలో (1641–1660) ఒక కొత్త తరం జనం ఆవిర్భవించారు. వారి ఆలోచనావిధానంలో విప్లవం గట్టి ముద్రలను వేసింది, అవి యెంతో భిన్నమైనవే అయినప్పటికీ. రాజకీయాలూ, మతమూ (అవి రెండూ విడదీయరానివిగా ముడిపడి వున్నాయి) కొంతమేరకు పాత ఫేషను అయిపోయాయి. నలభై, ఏభై దశకాల్లో చిన్న వయస్సులో ఉన్నవారు పాండిత్య ప్రకర్షకమైన చర్చలతో – వాటిలో బైబిలే వివేకానికి ప్రధాన మూలాధారంగా వుంటూవచ్చింది – విసుగెత్తిపోయారు. వారు విప్లవంనుండి అందుకు భిన్నమైన మరిదేన్నో – బూర్జువా స్వేచ్ఛాభావాలు, హేతు

జ్ఞానం, అభ్యుదయం — వారసత్వంగా పొందారు. విజ్ఞానశాస్త్రంలో ఉజ్వల తారలవంటి పలువురు ప్రతిభావంతులు ఆవిర్భవించారు. వీరిలో అగ్రగణ్యులు భౌతికశాస్త్రవేత్త రాబర్ట్ బోయిల్, తత్వవేత్త జాన్ లోక్, గొప్ప విజ్ఞానశాస్త్రవేత్త అయిన ఐజక్ న్యూటన్.

ఇదిగో యీ తరానికీ, యీ తరగతికీ చెందినవాడే విలియం పెట్టీ. ఆయన తన కాలపు మహాపండితుల్లో గణుతికెక్కినవాడు. మార్క్స్ పేర్కొన్నట్లు ప్రభువర్గీయుడైన యీ ఆంగ్లేయుడే అర్థశాస్త్ర జనకుడు, ఒక విధంగా గణాంకశాస్త్ర ఆవిష్కర్త.

శతాబ్దాలు దాటి వచ్చిన పెట్టీ

విజ్ఞానశాస్త్ర చరిత్రలో కొందరు వ్యక్తులు విస్మరింపబడి, దరిమిలా పునరుజ్జీవితులైన సందర్భాలున్నాయి. 18వ శతాబ్ది తొలి భాగానికి చెందిన గణనీయుడైన ఆర్థిక సిద్ధాంతవేత్తా, ఒక విధంగా నిగూఢ వ్యక్తీ అయిన రిచర్డ్ కంటిల్యోన్ అటువంటివారిలో ఒకడు. ఫ్రాన్సువా కెనే, జేమ్స్ స్ట్యూవర్ట్, ఆడమ్ స్మిత్‌ల వంటి ప్రముఖ ఆర్థిక సిద్ధాంతవేత్తలు విశేషంగా రుణపడ్డారని మార్క్స్ పేర్కొన్నది యితన్ని గురించే. అలాంటి కంటిల్యోన్, దాదాపు పూర్తిగా విస్మరింపబడి, 19వ శతాబ్దం చివర పునరుజ్జీవితుడయాడు.

హెర్మన్ హైన్రిహ్ గోస్సెన్ 1854లో ఒక పుస్తకాన్ని ప్రచురించాడు. అది బొత్తిగా జనం దృష్టిని ఆకర్షించకపోవడంతో, నిరుత్సాహపడిన ఆ రచయిత నాలుగేళ్ల తర్వాత పుస్తకాల షాపులనుండి ఆ ముద్రణ ప్రతులన్నింటినీ వెనక్కి తీసుకుని దాదాపుగా అన్నిటినీ నాశనం చేశాడు. ఇరవై యేళ్ల తర్వాత యాదృచ్ఛికంగా ఆ పుస్తకపు ప్రతి ఒకటి దొరకగా, జెవాన్స్, అప్పటికి చాల ఏళ్లక్రితమే యిహలోకాన్ని వదిలిపోయిన గోస్సెనే "నూతన అర్థశాస్త్ర" ఆవిష్కర్త అని గట్టిగా చాటిచెప్పాడు. వ్యక్తిపర, మనస్తత్వ దృక్పథంనుంచి ఆర్థిక వస్తువుల ఉపయుక్తత అన్న భావాభివర్గాన్ని వివరించిన గోస్సెన్ నియమాలు అనబడేవి యీనాడు అర్థశాస్త్రానికి సంబంధించిన ప్రతి బూర్జువా పాఠ్యగ్రంథంలోనూ, అర్థశాస్త్ర చరిత్రలోనూ గణనీయమైన స్థానాన్ని పొందాయి.

తద్భిన్నంగా పెట్టీ విషయంలో అలాంటి పునరావిష్కరణావశ్యకత లేకపోయింది. ఆయన తన జీవితకాలంలోనే ప్రఖ్యాతి చెందాడు. ఆడమ్ స్మిత్‌కి ఆయన భావాలతో పరిచయముంది. మెక్‌కుల్లొహ్ "సర్ విలియం పెట్టీ 17వ శతాబ్దపు మిక్కిలి పరిగణనీయ వ్యక్తుల్లో ఒకడు" అని 1845లో రాశాడు. వాస్తవానికి ఆయన పెట్టీని

శ్రమ విలువ సిద్ధాంత జనకుడుగా పేర్కొని, ఆయన తర్వాత సరాసరి రికార్డోను మాత్రమే ప్రస్తావించాడు.

అయితే, అర్థికశాస్త్రానికి సంబంధించినంతవరకు పెట్టీని పూర్తిగా పునరుజ్జీవితుని చేసినది మార్క్సే. ఒక నూతన అర్థశాస్త్రాన్ని సృష్టించి, అర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రపై కొత్త కాంతిని ప్రసరింపజెయ్యడం ద్వారా, ప్రతిభావంతుడైన యీ ఆంగ్లేయునికి అర్థశాస్త్రంలో వున్న నిజస్థానాన్ని మార్క్స్ మాత్రమే వెల్లడి చేశాడు. దృశ్యమాన అర్థిక విషయాల అధ్యయనానికీ వర్ణనకే తనను తాను పరిమితం చేసుకోకుండా, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అంతరిక నియమాల విశ్లేషణకూ, దాని పురోగతి నియమ పరిశోధనకూ ముందుకువెళ్లిన బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రానికి జనకుడు పెట్టీ. పెట్టీ చేతుల్లోనూ, ఆయన అనుచరుల చేతుల్లోనూ యీ విజ్ఞానశాస్త్రం వాస్తవపరిస్థితిని అర్థంచేసుకోడంలోనూ, సామాజిక ప్రగతికోసం కృషి చెయ్యడంలోనూ శక్తివంతమైన ఒక ఆయుధమైంది.

ప్రస్ఫుటంగా, అసామాన్యంగా కనిపించే పెట్టీ వ్యక్తిత్వం మార్క్స్, ఎంగెల్సులను విశేషంగా ఆకర్షించింది. "పెట్టీ తనను తాను ఒక కొత్త విజ్ఞానశాస్త్ర జనకుడుగా భావించుకుంటున్నాడు...", "ఆయన సాహసిక మేధ...", "అత్యంత నిసర్గమైన హాస్యరసం ఆయన రచనలన్నింటిలోనూ వెల్లివిరుస్తోంది...",* "ఈ పొరపాటులో కూడా మేధాశక్తి వుంది...",** "వస్తువులోనూ, రీతిలోనూ యిదో చిన్న కళాఖండం...." — మార్క్స్ వివిధ రచనల్లోని యీ వ్యాఖ్యలు "అర్థికశాస్త్ర పరిశోధకుల్లో అత్యంత ప్రతిభావంతుడూ, అపూర్వమైన ప్రజ్ఞకలవాడూ..."*** అయిన పెట్టీపట్ల మార్క్స్ దృక్పథాన్ని గూర్చి మనకొక అంచనాను యిస్తాయి.

పెట్టీ సాహిత్య వారసత్వ భవితవ్యం అసాధారణమైనది. పెట్టీ వహించిన పాత్ర ఎంత ప్రముఖమైనదైనప్పటికీ ఆయన రచనలెన్నడూ పూర్తిగా ప్రచురింపబడలేదు. అవి పాత అసంపూర్ణ ప్రచురణల్లో మాత్రమే వున్నాయి. 19వ శతాబ్ది మధ్య నాటికి అవి గ్రంథ పట్టికలలో మాత్రమే కనిపించే అపురూప గ్రంథాలయాయి. విచిత్రమైన యీ వాస్తవాన్ని మెక్‌కుల్లొహ్ పేర్కొన్నాడు. పెట్టీని గురించి ఆయన రాసిన ముగింపు వాక్యాలు యీ కింది ఆశాభావాన్ని వ్యక్తంచేశాయి: "పెట్టీ ప్రతిభలో

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, pp. 52, 53.

** Frederick Engels, *Anti-Dühring*, Moscow, 1969, p. 275.

*** అదే గ్రంథం, అదే పేజి.

అధికాంశానికీ, ఆయన ఎస్టేట్లకీ వారసత్వ హక్కుపొందిన ఆయన ప్రభువంశీక వారసులు పెట్టీ సంపూర్ణ రచనలను ప్రచురించడం కన్న ఆయన పేర నిర్మించగల మరింత ఉత్తమ స్మారకచిహ్నం మరొకటుండబోదు."

అయితే, పెట్టీ "ప్రభువంశీక వారసులైన" షెల్‌బర్న్ ప్రభువులకూ, లాన్స్‌డౌన్ మార్క్విస్‌కూ తమ పూర్వీకుణ్ణి ప్రజానీకంముందు ప్రదర్శించుకోవాలన్న ఆదుర్దా అంతగా లేదు. పెట్టీ సామాన్యుడైన వృత్తిపనివాడు. ఆయన ఐశ్వర్యాన్నీ, ప్రభు హోదానూ సంపాదించుకున్న పద్ధతులు ఏమంత నజావైనవి కావు. ఈ మధ్యనే పెట్టీ జీవిత చరిత్ర ఒకటి వెలువడింది. ఆ రచయిత దృష్టిలో పెట్టీకి "ఆడంబరపూర్వకమైన కీర్తి అయితే ఉందిగాని, అది అనుమానానికి అతీతమైనదేమీ కాదు."

పెట్టీ వారసులకు రెండు శతాబ్దాలపాటు ఈ విషయమే ఆయన రచనల శాస్త్రీయ, చారిత్రక విలువకన్న ఎక్కువ ముఖ్యమైనదిగా కనిపించింది. 19వ శతాబ్ది చిట్టచివరగాని పెట్టీ ఆర్థిక రచనల తొలి సంకలనం ప్రచురింపబడలేదు. అదే కాలంలో ఆయన వారసుల్లో ఒకడు ఆయన జీవిత చరిత్రను కూడా ప్రచురించాడు.

పెట్టీ రాజకీయాభిప్రాయాలను గురించీ, ఆయన సామాజిక, శాస్త్రీయ కార్యకలాపాలను గురించీ, ఆయనకు తన సమకాలికులైన గొప్ప విజ్ఞానశాస్త్రవేత్తలతో గల సంబంధాలను గురించీ మనకీనాడు మరింత స్పష్టమైన అవగాహన వుంది. ఆయన జీవితానికి సంబంధించిన అనేక వివరాలు మనకు యీ రోజున తెలుసు. గొప్పవాళ్ల దోషాలనూ, లోటుపాట్లనూ మరుగుపరచి వాళ్ల వ్యక్తిత్వాలకు మెరుగులు దిద్దాల్సిన అవసరం లేదు. ఈ సూత్రం విలియం పెట్టీకి కూడా పూర్తిగా వర్తిస్తుంది. మానవ సంస్కృతీ చరిత్రలో పెట్టీ పేరు ఓ పెద్ద ఐరిష్ భూస్వామిగానూ, చమత్కారియైన (అన్నప్పుడూ విజయవంతుడు కాకపోయినా) రాజాస్థానికుడుగానూ కాక, సామాజిక విజ్ఞానశాస్త్రంలో కొత్త పుంతలను ఆవిష్కరించిన సాహసిక ఆలోచనాశీలిగా శాశ్వతంగా వుంటుంది. మార్క్సిస్టుల దృష్టిలో పెట్టీ ప్రధానంగా సాంప్రదాయిక అర్థశాస్త్ర సంస్థాపకుడు. బూర్జువా అర్థశాస్త్రవేత్తలు పెట్టీని ఒక గొప్ప విజ్ఞానశాస్త్రజ్ఞుడుగానూ, ప్రముఖ వ్యక్తిగానూ గుర్తిస్తారేగాని, ఆడమ్ స్మిత్, రికార్డో,* మార్క్స్‌లకు పథదర్శకుడుగా గుర్తించేందుకు తరచు నిరాకరిస్తారు. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో పెట్టీ స్థానాన్ని తరచుగా గణాంక పరిశోధనా పద్ధతికి పరిమితం చేస్తూవుంటారు.

పెట్టీ రచనల్లో శ్రమ విలువ సిద్ధాంతంగాని (మొత్తంమీద విలువకి సంబంధించిన భావనగాని), వేతనాలకు సంబంధించి పరిగణనలోకి తీసుకోదగిన సిద్ధాంతంగాని లేదనీ, కాగా ఆయన అదనపు విలువను అర్థంచేసుకునే ప్రసక్తే లేదనీ షుంపేటెర్ ఘంటాపథంగా వక్కాణించి చెప్పాడు. "పెట్టీయే ఆర్థికశాస్త్ర పితామహుడన్న మార్క్స్

సాధికార ప్రకటనా,"* తాము ఎవరికి తోడ్పడుతున్నామన్న గ్రహింపు లేకుండా కొందరు బూర్జువా పండితులు చేసే స్తోత్రపాఠాలూ మాత్రమే పెట్టీ కీర్తికి మూలమని షుంపేటెర్ అంటాడు.

బూర్జువా పండితుల చాలా గ్రంథాలు పెట్టీని కేవలం వ్యాపారవాద ప్రతినిధిగా మాత్రమే – బహుశా అత్యంత ప్రతిభావంతుల్లో పురోగాముల్లో ఒకడైతే కావచ్చుననీ, అంతకుమించి మరేమీ కాడనీ – పేర్కొన్నాయి. మహా అయితే, ఆయన గణాంక పరిశోధనా పద్ధతిని కనుగొనడంతోబాటు, పన్నులు, కస్టమ్స్ సుంకాల వంటి విడి ఆర్థిక సమస్యలనూ, ప్రశ్నలనూ పరిశీలించాడని మాత్రం అంగీకరించారు. అయితే ఆధునిక బూర్జువా ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో యీ దృక్పథమే పరమ ప్రభావం కలిగి వుందని చెప్పలేము. పెట్టీని గూర్చి మరింత సరైన చారిత్రక అవగాహనతో వెల్లడింప బడిన అభిప్రాయాలు లేకపోలేదు. కాని షుంపేటెర్ వైఖరే ప్రధానమైనది. ఇది యాదృచ్ఛిక విషయమేమీ కాదు.

భూస్వామిగా మారిన ఓడ పరిచారకుడు

డేనియల్ డెఫో నవలా నాయకుడైన యువ రాబిన్సన్ క్రూసో యింటి దగ్గర్నుంచి పారిపోయి, సముద్రయానానికి పూనుకున్నాడు. అలా ప్రారంభమైన అతని సాహస కృత్యాలతో నిండిన ఆ నవల యిప్పటికి రెండున్నర శతాబ్దాలుగా పాఠకుల మనసులను పులకింపజేస్తోంది. హాంప్‌షైర్‌లోని రోమ్సే పట్టణానికి చెందిన నేత పనివాడు ఆంథొనీ పెట్టీ కుటుంబంలో కూడా సరిగా అలాంటి ఘటనే సంభవించింది. ఆయన పద్నాలుగేళ్ల కొడుకు విలియం కుటుంబవృత్తిని కొనసాగించ నిరాకరించి, సౌత్‌హెంప్టన్‌లో ఓడ పరిచారకుడుగా చేరాడు.

17, 18 శతాబ్దాలనాటి ఇంగ్లండులో చప్పని రోజువారీ జీవితంపట్ల తమ నిరసనను వ్యక్తం చేసేందుకుగాను పలువురు యువకులు సర్వసామాన్యంగా సముద్రం మీదకి పోతూండేవారు. సాహస కార్యాలపట్లా, స్వేచ్ఛపట్లా యువతరానికి గల తృష్ణ యీ విధంగా వ్యక్తమవుతూండేది. ఇది బూర్జువా జీవిత పద్ధతిపట్ల తిరుగుబాటు

---

* J. A. Schumpeter, *History of Economic Analysis*, N.Y., 1954, p. 55.

కాదు. అందుకు భిన్నంగా తాము ధనికులు కావాలనీ, యీ నూతన బూర్జువా ప్రపంచంలో తాము గట్టిగా కాలూనుకొని నిలబడాలన్న ఆ యువకుల వాంఛ సాహసకృత్యాల పట్ల గల వారి యీతృష్ణతో ముడిపడివుండేది. ఈ లక్షణమే యువ పెట్టీలో కూడా నిండుగా వుంది.

తర్వాత ఒక సంవత్సరానికి సముద్రయాన క్రమంలో కాలు విరిగింది. ఆనాటి కఠిన ఆచారాల మేరకు అత్యంత సమీపంలో వున్న తీర భాగంలో అతన్ని ఓడనుంచి నిర్దాక్షిణ్యంగా దింపేశారు. అది ఫ్రాన్సు ఉత్తరభాగంలోని నార్మండీ తీరం అవడం సంభవించింది. తన క్రియాశీలత్వ, సామర్థ్య, అదృష్టాల కారణంగా పెట్టీ తనను తాను కాపాడుకోగలిగాడు. తన ఆత్మకథలో పెట్టీ, తనను తీరంమీద దింపేసేటప్పుడు ఎంత తక్కువ మొత్తం డబ్బు యిచ్చినదీ, దాన్ని తను ఎలా వినియోగించినదీ, దానితో తను చిల్లరమల్లర వస్తువులు కొని, వాటిని లాభానికి అమ్మడం ద్వారా తన "సంపద"ను ఎలా పెంపొందించుకున్నదీ తు.చ తప్పకుండా సవివరంగా, కచ్చితంగా వర్ణించాడు. రాబిన్సన్ క్రూసోకి తీసిపోని కథనం యిది. ఆయనొక జత ఊతకర్రలను కూడా కొనుక్కోవలసి వచ్చింది. అయితే త్వరలోనే వాటిని అతను వదిలేశాడు.

పెట్టీ ఒక మాదిరి అసాధారణ ప్రజ్ఞావంతుడైన బాలుడు. రోమ్సేలోని పట్టణ విద్యాలయంలో ఆయన పొందినది సాదా విద్యయే అయినప్పటికీ, ఆయనకి లాటిన్ భాష ఎంత బాగా వచ్చునంటే, కాన్ కళాశాలలోని లాటిన్ పీఠానికి లాటిన్ కవితలో ఆయన "దరఖాస్తు" పెట్టుకున్నాడు. ఈ యువకుని అసాధారణ సామర్థ్యానికి దిగ్భ్రాంతులే అయ్యారో, లేక కేథలిక్ చర్చికి మెరికలాంటి వాడిని సంపాదించుకోగలిగామనే సంబర పడ్డారో తెలియదుగాని, జెస్యూట్లు ఆయనను కళాశాలలో చేర్చుకుని, ఆయన పోషణ భారాన్ని వహించారు. పెట్టీ అక్కడ రెండేళ్లు గడిపాడు. తత్ఫలితంగా, ఆయన మాటల్లోనే చెప్పాలంటే, "నేను లాటిన్, గ్రీకు, ఫ్రెంచి భాషలు నేర్చుకున్నాను. సామాన్య గణితశాస్త్రం మొత్తం ఆపోశన పట్టాను. నౌకా యానానికి సంబంధించిన ప్రాయోగిక రేఖాగణితం, ఖగోళశాస్త్రం నేర్చుకున్నాను."* గణితశాస్త్రంలో పెట్టీ సామర్థ్యం అసాధారణమైనది. ఈ రంగంలో సాధింపబడే నూతన అంశాలను తన జీవితకాలం పొడుగునా ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నాడు.

1640లో లండనులో సముద్ర పటాలు గీసి, పెట్టీ తన రోజులు గడుపుకున్నాడు.

---

* E. Strauss, *Sir William Petty. Portrait of a Genius*, London, 1954, p. 24.

అటు తర్వాత ఆయన నౌకా సైన్యంలో మూడేళ్ళు పనిచేశాడు. అక్కడ ఆయన నౌకా యాన అనుభవమూ, దేశపట లేఖనా నైపుణ్యమూ విశేషంగా ఉపయోగపడ్డాయి.

అవి విప్లవమూ, తీవ్రమైన రాజకీయ, భావజాలాత్మక ఘర్షణా శిఖరస్థాయిని అందుకున్న సంవత్సరాలు. అంతర్యుద్ధం ప్రజ్వరిల్లింది. ఇరవయ్యేళ్ల ప్రాయంగల పెట్టీ ప్రధానంగా బూర్జువా విప్లవ పక్షానా, ప్యూరిటనిజం పక్షాన్నే ఉన్నప్పటికీ, యీ పోరాటంలో స్వయంగా యిరుక్కోడానికి ఆయనకి యిష్టం లేకపోయింది. విజ్ఞానశాస్త్రం ఆయనను సమ్మోహితుణ్ణి చేసింది. దానితో ఆయన హాలండు ఫ్రాన్సులకు వెళ్లి, అక్కడ ప్రధానంగా వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. ఈ బహుముఖ ప్రజ్ఞ పెట్టీ వైయక్తిక ప్రతిభకు ఒక చిహ్నం మాత్రమే కాదు, విజ్ఞానశాస్త్రాలు విడివిడిగా వేరుపడటమన్నది 17వ శతాబ్దారంభంలో అప్పుడప్పుడే మొదలవుతోంది. కాగా విద్యా విషయిక బహు ముఖ ప్రజ్ఞ అన్నది అపురూపమేమీ కాదు.

అటు తర్వాత మూడేళ్లూ లోక యాత్రలోనూ, ముమ్మరమైన కార్యకలాపాల్లోనూ, తీవ్రమైన జ్ఞానార్జన కృషిలోనూ సరదాగా గడిచిపోయాయి. ఆమ్‌స్టర్‌డాంలో ఒక స్వర్ణకారుడి కళ్లజోళ్ల అంగట్లో పనిచేసి, పెట్టీ తనను తాను పోషించుకున్నాడు. పారిస్‌లో వుండగా, పారిస్‌కి ప్రవాసిగా వచ్చిన తత్వవేత్త హాబ్స్‌కి ఆయన కార్యదర్శిగా పనిచేశాడు. 24 ఏళ్లు వచ్చేసరికల్లా పెట్టీ, అపారమైన జ్ఞానమూ, గొప్ప శక్తిసామర్థ్యాలూ, జీవిత సుఖాస్వాదనానుభూతీ, వీటన్నింటికీ తోడు వ్యక్తిగత సమ్మోహక శక్తీ కలిగిన పూర్ణవికసిత మానవుడుగా పరిణతి చెందాడు.

ఇంగ్లండుకు తిరిగివచ్చిన పెట్టీ, త్వరలోనే, తనింకా వైద్య శాస్త్రాధ్యయనం చేస్తున్న ఆక్స్‌ఫర్డులోనూ, తన జీవనోపాధికోసం పనిచేస్తున్న లండనులోనూ యువ శాస్త్రజ్ఞుల బృందమొకదానిలో ప్రముఖ సభ్యుడయ్యాడు. ఈ విజ్ఞానశాస్త్రజ్ఞులు తమాషాగా తమను తాము "కనబడని బృందం" అని పిలుచుకొంటూండేవారు. కాని, పునరుద్ధరణ కాలం తర్వాత త్వరలోనే వాళ్లు నూతన యుగపు మొట్టమొదటి విజ్ఞాన శాస్త్రాల అకాడెమీ అయిన రాయల్ సొసైటీని స్థాపించారు. 1650లో పెట్టీ, ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంనుంచి భౌతికశాస్త్రంలో డాక్టరేటు తీసుకుని, శరీర నిర్మాణ శాస్త్ర పీఠంలో ఆచార్యుడూ, ఒక కళాశాలకు ప్రిన్సిపాలూ అయిన దరిమిలా, ఒక ఔషధ వ్యాపారి యింట్లో అద్దెకు తీసుకున్న అతని బ్రహ్మచారి వాటాలో ఆ "కనబడని బృందం" సమావేశం కానారంభించింది.

పెట్టీతో సహా యీ విజ్ఞానశాస్త్రజ్ఞుల రాజకీయాభిప్రాయాలు ప్రత్యేకించి తీవ్రమైనవేమీ కావు. కాని, అప్పటికి రిపబ్లిక్ ప్రకటనకు (1649 మే) దారితీసిన విప్లవ ప్రభావం వారి కార్యకలాపాలన్నింటిపైనా ప్రగాఢమైన ముద్రవేసింది. విజ్ఞాన

శాస్త్ర రంగంలో పాండిత్య ప్రాగల్భ్యానికి వ్యతిరేకంగానూ, ప్రాయోగిక పద్ధతులను ప్రవేశపెట్టడానికి అనుకూలంగానూ వారు పోరాడారు. పెట్టీ యీ విప్లవ, ప్రజాతంత్ర ప్రభావాన్ని జీర్ణం చేసుకుని, తన జీవితకాలమంతట్లోనూ దాన్ని నిలబెట్టుకున్నాడు. సంపన్న భూస్వామి, ప్రభువూ అయిన పెట్టీలో పాతుకున్న యీ ప్రభావం, తదనంతర సంవత్సరాల్లో మధ్యమధ్య పైకి పొక్కుతూవుండేది.

పెట్టీ మంచి వైద్యుడూ, శరీర నిర్మాణ శాస్త్రవేత్తా అయివుండి తీరాలి. ఆక్స్‌ఫర్డులో ఆయన సాధించిన విజయాన్ని చూసినా, ఈ యువ ఆచార్యుని వైద్యశాస్త్రీయ రచనలను చూసినా, తదనంతరం ఆయన అధిరోహించిన ఉన్నతోద్యోగాన్ని దృష్టిలో పెట్టుకున్నా యీ విషయం బోధపడుతుంది. అదిగో సరిగా ఆ తరుణంలోనే, ఆయన సాపేక్షంగా మరింత పెద్ద ప్రజాసమూహానికి సుపరిచితుడైన ఘటన ఒకటి సంభవించింది.

1650 డిసెంబరులో ఆక్స్‌ఫర్డులో, ఆనాటి ఆటవిక చట్టాలకూ, ఆచారాలకూ అనుగుణంగా అన్ గ్రీన్ అనే ఒక అమ్మాయి ఉరితియ్యబడింది. ఆ పేద రైతుబాలిక ఒక యువ ప్రభువుచేత చెరచబడింది. తన శిశువుని హత్యచేసినట్లు ఆరోపింపబడింది. (కాని దరిమిలా ఆమె నిర్దోషురాలని తేలింది: నెలలు నిండకముందే పుట్టిన ఆ శిశువు సహజంగానే మరణించింది.) ఆమె మరణించిందన్న విషయం రూఢిచేసుకోబడిన తర్వాత ఆమె శవపేటికలో ఉంచబడింది. సరిగా ఆ క్షణంలో డాక్టర్ పెట్టీ, ఆయన సహాయకుడూ శరీరశాస్త్ర పరీక్షలకోసం రంగంలో ప్రవేశించారు. ఉరితియ్యబడిన ఆ యువతి బొందిలో యింకా ఊపిరి ఉన్నట్లు కనుగొన్న ఆ డాక్టర్ల ఆశ్చర్యానికి అంతులేకపోయింది. తక్షణ సహాయక చర్యలు తీసుకోవడం ద్వారా వారామెను "పునర్జీవితురాలిని" చేశారు! తదుపరి ఘటనాక్రమమూ, ఆయన స్వభావానికి విలక్షణమైన పలు పార్శ్వాలకు సహజపర్యవసానమైన పెట్టీ చర్యలూ ఆసక్తికరమైనవి. మొదటి సంగతి, అసాధారణమైన తన రోగి శారీరక స్థితిని గురించేకాక, ఆమె మానసిక స్థితిని గురించి కూడా పెట్టీ పరిశోధనలు జరిపి, వాటిని సవివరంగా రికార్డు చేశాడు. రెండవ సంగతి, ఆయన వైద్యశాస్త్ర నైపుణ్యానికి తోడు మానవత్వాన్ని కూడా ప్రదర్శించి, అన్‌కి కోర్టువారి క్షమాభిక్షను సంపాదించి, ఆమె సహాయార్థం ఒక నిధిని కూడా పోగుచేశాడు. మూడవ సంగతి, తనకు స్వతహాగా వున్న వ్యాపారాభిరుచి కారణంగా, యీ ఘటనను తన వ్యక్తిగత ప్రచారానికి ఆయన వినియోగించుకున్నాడు.

1651లో ఆకస్మికంగా డాక్టర్ పెట్టీ తన ఆచార్య పదవిని వదిలేసి, ఐర్లండులో ఆంగ్ల సైన్యపు కమాండర్ ఇన్ ఛీఫ్ దగ్గర డాక్టరు ఉద్యోగాన్ని స్వీకరించాడు. 1652 సెప్టెంబరులో మొట్టమొదటిసారిగా ఆయన ఐరిష్ గడ్డపైన అడుగుపెట్టాడు.

ఇంత ఆకస్మికంగా ఆయనెందుకు తన వృత్తిని మార్చుకున్నాడు? సాహసిక చర్యలపట్ల ఆసక్తి కలిగి, శక్త్యుత్సాహాలు తొణికిసలాడే యువకునికి ఆక్స్‌ఫర్డులో ఆచార్యుడుగా గడపడమంటే అతి ప్రశాంత జీవితమే తప్ప మరేమీ కాదు.

ఇంగ్లండుకు వ్యతిరేకంగా జరిపిన తిరుగుబాటులో అప్పుడే పరాజయం పాలై, పదేళ్ళపాటు జరిగిన యుద్ధంతోనూ, ఆకలితోనూ, రోగాలతోనూ నలిగి నవసిపోయిన ఐర్లండును పెట్టీ చూశాడు. ఆంగ్ల వ్యతిరేక తిరుగుబాటులో పాల్గొన్న ఐరిష్ కేథలిక్కులకు చెందిన భూములు జప్తుచెయ్యబడ్డాయి. ఆ యుద్ధం కోసం ధనాన్ని సమకూర్చిన లండన్ సంపన్న భూస్వాములకూ, అలాగే గెలుపొందిన సైన్యపు అధికార్లకూ, సామాన్య సైనికులకూ యీ భూమిని దఖలుపరచాలని క్రామ్‌వెల్ సంకల్పించాడు. లక్షలాది యకరాల విస్తీర్ణం కలిగిన ఆ భూమిని సర్వే చేసి, ప్లాట్లువేసి వారికి కేటాయించవలసివుంది. (అందునా, సైన్యం అసంతృప్తితో కుతకుతలాడుతూ ప్రతిఫలం కోసం గొడవ చేస్తున్న కారణంగా యీ పని సత్వరమే జరగవలసిన అగత్యం ఏర్పడింది.) 17వ శతాబ్దపు మధ్యనాటికి యిది మిక్కిలి కష్టంతో కూడిన పని. ఎందుకంటే, అప్పటికింకా మ్యాపులుగాని, పరికరాలుగాని, యీ పనికి తగిన యోగ్యతలు కలిగిన సిబ్బందిగాని, రవాణా సౌకర్యాలుగాని లేవు. రైతులు సర్వేయర్లపై దాడులు జరుపుతూండేవారు....

అతి త్వరలో డబ్బు కూడబెట్టుకొని, వృద్ధిలోకి వచ్చే అవకాశమున్న యీ పనిని పెట్టీ చేబట్టాడు. దేశపట లేఖన, భూమి సర్వే లేఖనలలో గల పరిజ్ఞానం ఆయనకి బాగా తోడ్పడింది. అయితే, దానికితోడు శక్త్యుత్సాహాలు, పట్టుదల, నైపుణ్యం కూడా యీ పనికి అవసరం. సైన్యపు భూములను సర్వేచేసే పనికి పెట్టీ ప్రభుత్వంనుంచీ, సైన్యాధికారులనుంచీ కంట్రాక్టు తీసుకున్నాడు. భూములు పొందే సైనికులనుండి వసూలుచేసిన సొమ్ముతోనే ప్రధానంగా ఆయన పనికి ప్రతిఫలం చెల్లింపబడింది. పెట్టీ లండనుకు రాసి కొత్త పరికరాలు తెప్పించాడు. ఓ వెయ్యిమంది సర్వేయర్లను సమకూర్చుకున్నాడు. ఐర్లండ్ మ్యాపులను తయారుచేయించాడు. దరిమిలా 19వ శతాబ్ది మధ్యందాకా ఐర్లండులో భూములకు సంబంధించి ఏ తగాదాలు పరిష్కరించాలన్నా కోర్టులకు యీ మ్యాపులే ఆధారమయ్యాయి. ఇంత పనీ ఒక్క సంవత్సరంపైన కొద్ది రోజుల్లో పూర్తి అయింది. ఆయన ఏ పనైనా అవలీలగా చేబట్టగలిగినవాడు.

అప్పటికి ముప్ఫయ్యేళ్లకు కొంచెం పైబడిన పెట్టీకి యీ "సైన్యపు భూముల సర్వే" పని నిజంగా బంగారు పాతరే అయింది. ఒక సామాన్య వైద్యుడుగా ఐర్లండుకు వచ్చిన పెట్టీ, కొద్ది సంవత్సరాల్లో దేశంలోని అత్యంత ధనికుల్లోనూ, అత్యధిక పలుకుబడి కలిగినవారిలోనూ ఒకడయ్యాడు.

విభ్రాంతి గొలిపే యీ ధనార్జన కార్యక్రమంలో చట్టబద్ధమైన దేమిటి? చట్ట విరుద్ధమైన దేమిటి? పెట్టీ జీవితకాలంలో యీ అంశంపై తీవ్రమైన వాదోపవాదాలు చెలరేగాయి. అయితే యీ విషయం చూసేవారి దృక్పథంపైన ఆధారపడివుంటుంది. ఐర్లండుపైన జరిగిన ప్రత్యక్షమైన దోపిడి చట్టవిరుద్ధమైనది. పెట్టీ యీ దోపిడి ప్రాతిపదికపైన పనిచేశాడు, అయితే, ఆయన స్వయంగా లాంఛనప్రాయమైన చట్ట బద్ధతా పరిధిని అతిక్రమించలేదు. అప్పుడు అధికారంలో వున్నవారినుండి ప్రతిఫలం పొందాడేగాని తను స్వయంగా దోచుకోలేదు. కొన్నాడేగాని దొంగిలించలేదు. కోర్టు ఉత్తరువుల ద్వారా జనాన్ని పొలాలనుండి పారదోలాడేగాని ఆయుధ బలంతో వాళ్లను వెళ్లగొట్టలేదు. ఈ పనులన్నింటిలోనూ లంచగొండితనం, అవినీతి లేవా అంటే, ఆ రోజుల్లో యివన్నీ సర్వసామాన్యమైన సహజమైన విషయాలుగా చలామణీ అవు తూండేవి....

పెట్టీకి గల అద్భుతమైన శక్త్యుత్సాహాలూ, ముందుకు చొచ్చుకువెళ్లే విషయంలో ఆయనకి గల విశేషశక్తీ, ఆయన సాహసిక తత్వం... యివన్నీ కొంత కాలంపాటు ధని కుడు కావాలన్న ఆయన వ్యామోహంలో వ్యక్తమయ్యాయి. ఆయన చెప్పిన అంకెల ప్రకా రమే, ఆ కంట్రాక్టు నిర్వహణ ద్వారా 9,000 పౌనుల నికర లాభం ఆర్జించిన పెట్టీ, తమ భూఖండాల కోసం వేచి వుండి, వాటిని ఆక్రమించుకునే శక్తీ, ఓపికా లేని ఆఫీసర్ల నుండీ, సైనికులనుండీ భూములను కొనడానికి ఆ మొత్తాన్ని వినియోగించాడు. దీనికితోడు, ప్రభుత్వంనుండి ఆయనకి ముట్టిన ప్రతిఫలంలో కూడా కొంతభాగం భూమిరూపంలో ముట్టింది. ఆ జిత్తులమారి డాక్టరు సరిగా ఏ పద్ధతుల ద్వారా తన ఆస్తిని పెంచుకున్నాడో మనకి తెలియదుగాని, అందులో ఆయన సాధించిన విజయం మాత్రం ఊహాతీతమైంది. దీని ఫలితంగా ఆ దీవిలోని వివిధ ప్రాంతాల్లో వేలాది యకరాల భూమికి ఆయన సొంతదారయ్యాడు. తర్వాత తర్వాత ఆయన భూ వసతి మరింత పెరిగింది. అదే సమయంలో, రాజ సంరక్షకుడైన క్రామ్‌వెల్ చిన్న కొడుకూ, ఐర్లండు లార్డ్ లెఫ్టినెంటూ అయిన హెన్రీ క్రామ్‌వెల్‌కి ఆయన సహాయకుడూ, కార్యదర్శీ అయ్యాడు.

రెండు మూడేళ్లపాటు శత్రువులూ, తన చెడుగును కోరేవారూ ఎన్ని కుట్రలు పన్నినా, పెట్టీ వాటినన్నింటినీ తట్టుకొని మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాడు. కాని 1658లో క్రామ్‌వెల్ చనిపోవడంతో, ఆయన కొడుకు పరిస్థితి నానాటికీ అస్థిరం కాసాగింది. తనకు యిష్టం లేకపోయినా లార్డ్ లెఫ్టినెంటు మన డాక్టరుగారి కార్య కలాపాలపై విచారణ జరిపేందుకు ఒక కమిషన్‌ని నియమించడం తప్ప గత్యంతరం లేకపోయింది. ఆ కమిషన్‌లోని సభ్యులు పలువురు పెట్టీ మిత్రులేనన్న మాట నిజ

మేననుకోండి. దీనికితోడు, తన భావాలకోసం ఎంతటి శక్త్యుత్సాహాలతోనూ, ప్రతి భావంతంగానూ, నేర్పుగానూ పోరాడాడో వాటికి తీసిపోని రీతిలో తన సంపదనూ, పరువునూ నిలుపుకొనేందుకోసం ఆయన పోరాడాడు. ఆయన ఆ కమిషన్ ముందే కాకుండా, లండన్‌లోని పార్లమెంటు ముందు కూడా (ఆయన అంతకు కొంతకాలం ముందే పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యాడు) తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నాడు. ఆయన ఆ పోరాటంలో విజయోత్సాహంతో కాకపోయినా, కనీసం ఎటువంటి నష్టాలూ లేకుండా బయటపడ్డాడు. 1660లో పునరుద్ధరణకు ముందు కొద్ది మాసాలపాటు ఏర్పడిన రాజకీయ సంక్షోభపరిస్థితి పెట్టీ కేసును ప్రజల దృష్టినుంచి మరుగుపరచింది. ఆ పరిస్థితి పెట్టీకి చక్కగా ఉపయోగపడింది.

పునరుద్ధరణకు కొంచెం ముందు, హెన్రీ క్రామ్‌వెలూ, అతని ఆంతరంగికుడూ, రెండవ చార్లెస్ ప్రవాసంనుండి తిరిగి వచ్చినప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రముఖ రాజరికవాదులకు ముఖ్యమైన కొన్ని సేవలు చేశారు. తత్ఫలితంగా సంరక్షకుని కొడుకు ప్రైవేటు జీవితంలోకి హుందాగా రిటైరు కావడానికీ, పెట్టీ రాజదర్బారులో రవి తేజములలరగ ప్రవేశించడానికీ అవకాశాలు ఏర్పడ్డాయి. 1661లో యీ నేతపనివాని కొడుకు నైట్ పట్టంకట్టబడి సర్ విలియం పెట్టీ అయ్యాడు. ఇది ఆయన విజయ యాత్రకు కలికి తురాయి. ఆయన చార్లెస్ రాజు అభిమానాన్ని చూరగొన్నాడు, తన శత్రువులను అవమానం పాలుజేశాడు, ఐశ్వర్యవంతుడయాడు, స్వతంత్రుడయాడు, పలుకుబడి గలవాడయాడు....

రాజుగారు ఆయనకి రెండు పర్యాయాలు పీర్ (లార్డ్) హోదాను యివ్వజూపినట్లు పత్రాల ద్వారానూ, పెట్టీ ఉత్తరప్రత్యుత్తరాల ద్వారానూ రూఢిగా తెలియవచ్చింది. సాహసోపేతమైన తన ఆర్థికపథకాలను అమలుజరపగలిగేందుకుగాను తనకు సిసలైన ప్రభుత్వ పదవిని యివ్వమంటూ రాజుగారినీ, రాజదర్బారునూ ఊదరగొట్టే తన అభ్యర్థనలను తోసిపుచ్చేందుకు ఒక మిషగా మాత్రమే ఆయన యీ పీర్ హోదా ప్రతి పాదనను పరిగణించాడు. ఆయన యీ భావన ఆధారరహితమైనదేమీ కాదు. తను యీ రాజ మన్ననను ఎందుకు తిరస్కరించినదీ ఆయనొక లేఖలో వివరించాడు. ఆ లేఖ పెట్టీ వ్యక్తిత్వానికీ, శైలికీ ఒక మచ్చుతునక: తను "అదెంత డంబంగా ముద్రించబడినప్పటికీ, బంగారు పూత పూయబడినప్పటికీ కూడా, ఇత్తడి అర్ధ్రకౌనుగా వుండేదానికన్న, త్వరలోనే నిజమైన విలువ కలిగిన రాగి ఫార్తింగుగా ఉండటం మేలు"* అని

* *Dictionary of National Biography*, ed. by L. Stephen and S. Lee, Vol. 45, p. 116.

రాశాడాయన. రాజదర్బారుయొక్క పలు అంచెల అధికార సోపాన పటంలో పెట్టీకి లభించినది అత్యంత నిమ్నస్థాయి హోదా.

సర్ విలియం పెట్టీ మరణానికి ఒక సంవత్సరం తర్వాత మాత్రమే, ఆయన కొడుకు చార్లెస్, బేరన్ షెల్‌బర్న్ చెయ్యబడ్డాడు. అయితే అది ఐరిష్ బేరన్ హోదా. ఈ హోదావల్ల ఆయునకి లండన్‌లోని ప్రభువుల సభకు హాజరయ్యే హక్కు లభించలేదు. చివరకు యీ హోదా పెట్టీ మునిమనుమనికి లభించింది. లాన్స్‌డౌన్ మార్క్విస్ పేర ఒక ప్రముఖ రాజకీయవేత్తగానూ, విగ్ పార్టీ నాయకుడుగానూ ఆంగ్ల చరిత్రలో ప్రసిద్ధి చెందినది ఈయునే.

సందర్భవశాత్తూ, మనం ఒక విషయం చెప్పుకోవాలి. 20వ శతాబ్దంనాటి బ్రిటన్‌లో పాలకవర్గాలకు ముఖ్యమైన సేవలు చేసిన ప్రముఖ అర్థికవేత్తలకు యిప్పుడు వారి శాస్త్రీయ రచనలను పురస్కరించుకొని పీర్ హోదా యివ్వబడింది. అటువంటి తొలి "అర్థశాస్త్రపు అరిస్టోక్రాట్" కీన్స్.

అర్థశాస్త్రపు కొలంబస్

భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనడానికేగాని ఓ కొత్త ఖండాన్ని కనుక్కోడానికి బయల్దేరని కొలంబస్‌కు, తన జీవితాంతందాకా తాను అమెరికాను కనుక్కున్నాన్న సంగతి తెలియదన్న విషయం మనకు తెలిసిందే.

పెట్టీ అడపాదడపా నిర్దిష్టమూ, అప్పుడప్పుడు ధనార్జనా లక్ష్యాలతో సైతం — యిది ఆనాటి అర్థికవేత్తలలో ఆచారం — కొన్ని చిన్న పుస్తకాలు ప్రచురించాడు. రాజకీయ గణితశాస్త్రానికి (గణాంకశాస్త్రానికి) కర్తృత్వాన్ని మాత్రమే ప్రధానంగా ఆయన తనకు ఆపాదించుకున్నాడు. ఆయన సమకాలీనులు సైతం దీన్నే ఆయన సాధించిన ప్రధాన విజయుంగా పరిగణించారు. నిజానికి ఆయన మరొకటి కూడా సాధించాడు. సందర్భవశాత్తూ విలువ, వడ్డీ, వేతనం, శ్రమ విభజన, డబ్బులపై ఆయన వెల్లడించిన భావాలు శాస్త్రీయమైన అర్థశాస్త్రానికి ప్రాతిపదిక అయ్యాయి. ఈ కొత్త కొలంబస్ ఆవిష్కరించిన నిజమైన "అర్థిక అమెరికా" యిదే.

పెట్టీ తొలి పరిగణనీయమైన రచన "పన్నులు, విరాళాల సిద్ధాంతం." ఇది 1662లో వెలువడింది. బహుశా ఆయన రచనల్లోకెల్ల అతిముఖ్యమైనది కూడా అదేనేమో. కొత్త ప్రభుత్వానికి (స్వయానా తనకూ భాగస్వామ్యం వుండి, నిస్సందేహంగా తన పర్యవేక్షణలో నడుస్తున్నదే) పన్నుల ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచు

కోవచ్చునో తెలియజెప్పే ప్రయత్నంలో ఆయన తన ఆర్థికాభిప్రాయాలను సైతం అతి సమగ్రంగా వివరించాడు.

అప్పటికి తను డాక్టరునన్న సంగతిని పెట్టీ దాదాపుగా మరచిపోయాడు. తనకి అతి సకృత్తుగా లభించే తీరిక క్షణాల్లోనో, విజ్ఞానశాస్త్రజ్ఞులైన తన మిత్రులు కొందరితో కలుసుకున్న తరుణాల్లోనో మాత్రమే గణిత, యంత్రగతి శాస్త్రాల్లోనూ, నౌకా నిర్మాణ విషయాల్లోనూ ఆయన నిమగ్నుడయేవాడు. కొత్త విషయాలను కను గొనే శక్తీ, వెసులుబాటూ కలిగిన ఆయన మనస్సు అంతకంతకు అధికంగా ఆర్థిక శాస్త్రంపైకీ, రాజకీయాలపైకీ మళ్ళింది. ఆయన బుర్రనిండా ప్రణాళికలే, పథకాలే, ప్రతిపాదనలే: పన్నుల సంస్కరణ, గణాంక సేవా పరికల్పన ఏర్పాట్లు, వర్తకాభి వృద్ధి.... ఇవన్నీ ఆయన "సిద్ధాంతం"లో చోటుచేసుకున్నాయి. అంతేకాదు. జాతుల సంపదపైన ఆడమ్ స్మిత్ పుస్తకం 18వ శతాబ్దపు అతి ముఖ్య రచన అయినట్లే పెట్టీ "సిద్ధాంతం" బహుశా 17వ శతాబ్దపు అతి ముఖ్యమైన ఆర్థిక రచన.

రెండు శతాబ్దాల అనంతరం కార్ల్ మార్క్స్ యీ "సిద్ధాంతం" గురించి యిలా రాశాడు: "ఈ పుస్తకంలో ఆయన సరుకుల విలువను వాటిలో యిమిడివున్న శ్రమ పరిమాణాన్ని బట్టి నిర్ణయిస్తాడు."* తన వంతులో "అదనపు విలువ నిర్ధారణ విలువ నిర్ధారణపైన ఆధారపడుతుంది."** ఆ ఆంగ్ల చింతనాపరుని శాస్త్రీయ విజయాన్ని యీ మాటలు క్లుప్తంగా వ్యక్తంచేస్తున్నాయి.

ఆయన వాదనా విధాన క్రమాన్ని ఆరా తియ్యడం ఆసక్తికరమైన విషయం.

నవ బూర్జువాయుగ మానవుని సునిశిత ఆలోచనతో ఆయన వెంటనే మౌలిక మైన అదనపు విలువ సమస్యను లేవనెత్తాడు: "... డబ్బుపై వచ్చే ఆదాయం — మనం దీనిని వడ్డీ అంటాం — అలాగే భూములపైనా, ఇళ్లపైనా వచ్చే కౌలు, అద్దెల నిగూఢ స్వభావాన్ని వివరించేందుకు మనం ప్రయత్నించాలి."*** 17వ శతాబ్దంలో మానవ శ్రమ వినియోగింపబడే ప్రధాన వస్తువు యింకా భూమే. తత్పర్యవసానంగా పెట్టీకి అదనపు విలువ అనివార్యంగా భూమి కౌలు రూపంలోనే కనిపిస్తుంది. పారి శ్రామిక లాభం కూడా దానిలో మరుగుపరచబడింది. ఆయన వడ్డీని కూడా భూమి కౌలు

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, Moscow, 1969, pp. 354–355.

** అదే గ్రంథం.

*** W. Petty, *The Economic Writings*, Vol. I, Cambridge, 1899, p. 42.

నుంచే నిర్ధరిస్తాడు. వర్తక లాభంలో పెట్టీ అంతగా ఆసక్తి కనబరచలేదు. ఆ కాలపు యితర వ్యాపారవాదులనుండి పెట్టీని వేరుజేసే సునిశితమైన విలక్షణం యిది. వడ్డీకి సంబంధించిన నిగూఢ స్వభావాన్ని గురించి ఆయన పేర్కొనడం కూడా గమనీయమైన విషయం. తను ఒక గొప్ప శాస్త్రీయ సమస్యను ఎదుర్కొంటున్న సంగతినీ, ఆ విషయం యిక్కడ ఎదురుకావడం దాని సారాంశానికి భిన్నమైనదనీ పెట్టీ చూచాయగా గ్రహిస్తాడు.

అటుతర్వాత వచ్చే గ్రంథభాగం తరచుగా ఉదహరింపబడుతూ వుంటుంది. ఒకడు (యీ ఒకడు గణిత పాఠ్యగ్రంథాల హీరోయేగాక ఆర్థిక గ్రంథాల హీరో కూడా!) ధాన్యాన్ని ఉత్పత్తిచేస్తున్నాడని అనుకుందాం. అతను ఉత్పత్తిచేసేదానిలో కొంత భాగం కొత్త విత్తనాల కింద వినియోగింపబడుతుంది, కొంతభాగం అతని సొంత అవసరాలకు (మారకం ద్వారా వాడబడేదానితోబాటు) వినియోగింపబడుతుంది, అవి పోగా "మిగిలిన ధాన్యమే ఆ సంవత్సరానికి ఆ భూమిపై వచ్చిన సహజమైన నిజమైన కౌలు." ఇక్కడ మనకి ఉత్పాదిత వస్తువూ, తత్పర్యవసానంగా దాని విలువా, దాన్ని సృష్టించిన శ్రమ అంటూ మూడు ప్రధాన భాగాలుగా విభజన కనిపిస్తుంది: 1) వెచ్చింపబడిన ఉత్పత్తి సాధనాలను తిరిగి భర్తీచెయ్యడానికి కావలసిన భాగం, యీ సందర్భంలో విత్తనాలు;* 2) కార్మికుడూ, అతని కుటుంబ సభ్యులూ మనగలిగేందుకు అవసరమైన భాగం; 3) అదనపు లేక నికర ఆదాయం. ఈ చివరిభాగం మార్క్స్ ప్రవేశపెట్టిన అదనపు ఉత్పాదితం, అదనపు విలువ అన్న భావనకు అనురూపమైనది.

దీని తర్వాత పెట్టీ యీ కింది సమస్యను లేవదీశాడు: "...ఈ 'ధాన్యం' లేక 'కౌలు' విలువ ఇంగ్లీషు డబ్బులో ఎంత? నేనేం చెప్తానంటే, మరో విడివ్యక్తి, దాన్ని ఉత్పత్తి చెయ్యడానికీ, తయారుచెయ్యడానికీ తనను తాను పూర్తిగా కేటాయించు కున్నట్లయితే, అదే కాలంలో, తన ఖర్చులుపోగా, ఎంత డబ్బు మిగుల్చుకుంటాడో సరిగా అంత అని. మరో మనిషి, వెండి వున్న దేశానికి పోయి, అక్కడ వెండిని తవ్వి, శుద్ధి

---

* ఉత్పత్తి సాధనాల తదితర ఖర్చును, ఉదాహరణకు ఎరువు, గుర్రం, నాగలి, కొడవలి వంటి వాటి తరుగుదలను పెట్టీ వదిలేశాడు. ఈ ఖర్చులు విలువ రూపంలోనేగాని వస్తురూపంలో ధాన్యం ద్వారా భర్తీ చేయబడడమే (బహుశా యిందుకే అయివుంటుంది పెట్టీ వాటిని లెక్కలోకి తీసుకోడు). ఉదాహరణకు పదేళ్లలో రైతుకి కొత్త గుర్రం కావలసి వుంటుంది. భవిష్యత్తులో కొనవలసిన యీ గుర్రం ధరకోసం ఏయేటికా ఏడు వచ్చే పంటనుండి అతను కొంత భాగాన్ని కేటాయించి అట్టే పెట్టవలసివుంటుంది.

చేసి, రెండోవాడు ధాన్యాన్ని పండించిన చోటుకి తెచ్చాడనుకోండి. వెండికోసం పనిచేసే వ్యక్తే తన జీవికకు అవసరమైన తిండి, బట్ట వగైరాలు సంపాదించుకోడానికి అదే కాలాన్ని వెచ్చించవలసి వుంటుంది. నేను చెప్పేదేమిటంటే, ఒకడి వెండి విలువ రెండో వాడి ధాన్యం విలువతో సమానం. ఒకడు 20 ఔన్సులు ఉత్పత్తి చేసి వుండవచ్చు, రెండోవాడు 20 బుషెళ్ళు ఉత్పత్తి చేసియుండవచ్చు. దీన్నిబట్టి ఒక బుషెల్ ధాన్యం వెల, ఒక ఔన్సు వెండితో సమానం అని తేలుతుంది."*

విలువ దృష్ట్యా అదనపు ఉత్పాదితమైన ధాన్యం, వెండి భాగాలు సమానం అని చెప్పేందుకు ప్రయత్నించడం మొత్తం వెరసి ఉత్పాదితాలు సమానం అని చెప్పడమేన నడం స్పష్టం. ఇంతకీ, యీ చివరి 20 బుషెళ్ల ధాన్యం రెండోదానికి, అంటే, విత్త నాలకూ, వ్యవసాయదారుని జీవికకూ వినియోగింపబడే 30 బుషెళ్లకు ఏ విధంగానూ భిన్నమైనది కాదు. పైన పేర్కొనబడిన 20 ఔన్సుల వెండికి కూడా యిదే వర్తి స్తుంది. మరోచోట పెట్టీ శ్రమ విలువ భావాన్ని శుద్ధ రూపంలో వ్యక్తం చేశాడు: "ఒకడు సరిగా ఒక బుషెల్ ధాన్యాన్ని ఉత్పత్తి చెయ్యగలిగిన కాలంలోనే పెరూ నేల లోంచి ఒక ఔన్సు వెండిని తవ్వి లండన్‌కి తీసుకురాగలిగితే, అప్పుడు ఒకటి రెండోదాని సహజమైన ధర అవుతుంది...."**

ఈ విధంగా, పెట్టీ వాస్తవంగా విలువ నియమాన్ని స్వీకరిస్తున్నాడు. ఈ నియమం అత్యంత సంక్లిష్టమైన పద్ధతిలో, ఒక సాధారణ ధోరణిగా మాత్రమే పని చేస్తుందని ఆయన అర్థం చేసుకుంటాడు. నిజంగా ఆశ్చర్యం గొలిపే ఈ కింది భాగంలో యీ విషయం వ్యక్తంచెయ్యబడింది: "దీన్నే నేను విలువలను సమం చేసి, సమతులితం చేసేందుకు పునాది అంటాను; అయితే, దానిమీద అభివృద్ధిచేయబడే ఉపరి నిర్మాణాలూ, వ్యవహారాలలో చాలా వైవిధ్యమూ, చిక్కూ ఉంటాయని నేను ఒప్పుకుంటాను...." ***

మారకపు విలువకూ — దీని పరిమాణం శ్రమ వ్యయం ద్వారా నిర్ణయింపబడు తుంది — వాస్తవమైన మార్కెట్ ధరకూ మధ్య ధర రూపొందే క్రమాన్ని అపరిమి తంగా సంక్లిష్టంచేసే అంతర్దశలు అనేకం వున్నాయి. ఆధునిక ఆర్థికవేత్తలూ, ప్రణాళికాకర్తలూ పరిగణనలోకి తీసుకోవలసిన ధరను రూపొందించే కొన్ని అంశాలను —

---

* W. Petty, *The Economic Writings*, Vol. I, Cambridge, 1899, p. 43.

** అదే గ్రంథం, పేజి 50.

*** అదే గ్రంథం, పేజి 44.

ప్రత్యామ్నాయ సరుకుల, సరికొత్త సరుకుల, ఫేషన్ల, ఇమిటేషన్ల, వినిమయ అలవాట్ల ప్రభావం – అద్భుతమైన అవగాహనతో పెట్టీ పేర్కొన్నాడు.

విలువను సృష్టించే అనిర్దిష్ట శ్రమ విశ్లేషణ దిశగా పెట్టీ తొలి అడుగులు వేశాడు. ఎందుకంటే ప్రతి ఒక నిర్దిష్ట శ్రమ పద్ధతీ నిర్దిష్టమైన ఒక సరుకును సృష్టిస్తుంది: వ్యవసాయదారుని శ్రమ – ధాన్యాన్ని, నేతగాని శ్రమ – వస్త్రాన్ని వగైరా. కాని ప్రతి ఒక రకం శ్రమా అన్ని రకాల శ్రమనూ పోల్చదగినదిగానూ, అన్ని వస్తువులనూ సరుకులుగానూ, మారకపు విలువలుగానూ చేసే ఒక ఉమ్మడి అంశాన్ని కలిగి వుంది: అదే శ్రమ కాలం, మొత్తంమీద కార్మికుని ఉత్పాదక శక్తి వినిమయం.

అర్థికశాస్త్ర చరిత్రలో, మార్క్సిస్టు విలువ సిద్ధాంతానికి పునాది అయిన అనిర్దిష్ట శ్రమ భావానికి బాటవేసిన మొట్టమొదటివాడు పెట్టీయే.

అర్థికశాస్త్ర సంస్థాపకుడూ, మార్గదర్శీ అయిన పెట్టీనుండి సమతులితమూ, సమగ్రమూ అయిన అర్థిక సిద్ధాంతాన్ని ఎవరూ ఆశించజాలరు. వ్యాపారవాద భావాల్లో చిక్కుకున్న అతగాడు వెండి బంగారాల వెలికితీతకు వినియోగింపబడే శ్రమ, మిక్కిలి నేరుగా విలువను సృష్టించే ఒక ప్రత్యేక రకమైన శ్రమ అన్న భ్రమను వదిలించుకోలేకపోయాడు. ఈ లోహాల్లో అతి స్పష్టంగా యిమిడివున్న మారకపు విలువను విలువ సారాంశం – సార్వత్రిక మానవ అనిర్దిష్ట శ్రమ – నుండి పెట్టీ విడదీసి చూడలేకపోయాడు. విలువ తారతమ్య స్థాయి ఆయా నిర్దిష్ట అర్థికాభివృద్ధి స్థాయికి విశిష్టమూ సగటూ అయిన సామాజికంగా అవసరమైన శ్రమ వ్యయంచేత నిర్ణయింపబడుతుందన్న అవగాహన ఆయనకి బొత్తిగా లేదు. సామాజికంగా అవసరమైన దానికన్న అదనంగా వినియోగింపబడే శ్రమ వృథా శ్రమ, అది విలువను సృష్టించదు. అర్థికశాస్త్రంలో దరిమిలా వచ్చిన అభివృద్ధి దృష్ట్యా పెట్టీ రాసినదానిలో ఎక్కువ భాగం సారంలేనిదనీ లేక శుద్ధతప్పనీ ఒప్పుకోవలసివుంటుంది. కాని ప్రధానమైన విషయమేమిటంటే ఆయన తన దృక్పథానికి – శ్రమ విలువ సిద్ధాంతానికి – గట్టిగా కట్టుబడివుండి, దాన్ని అనేక నిర్దిష్ట సమస్యలకు విజయవంతంగా అన్వయిస్తాడు.

అదనపు ఉత్పాదితంయొక్క స్వభావానికి ఆయన ఎలాంటి భాష్యం చెప్పాడో మనం యింతకు ముందే చూశాం. అయితే తనచేత ఉత్పత్తి చెయ్యబడిన అదనపు ఉత్పాదితాన్ని తనే భుక్తంచేసుకునే సాదా సరుకు ఉత్పత్తిదారుకి సంబంధించిన సందర్భం అది. తన కాలంలో ఉత్పత్తిలో గణనీయమైన భాగం అప్పుడే వేతన శ్రమ వినియోగం ద్వారా జరుగుతున్న విషయాన్ని పెట్టీ గమనించకుండా ఉండజాలడు.

అదనపు ఉత్పాదితం భూస్వాముల, పెట్టుబడిదారుల కోసం ఉత్పత్తి చెయ్యబడుతున్నంతగా కార్మికుని కోసమే ఉత్పత్తి చెయ్యబడటం లేదన్న నిర్ణయానికి ఆయన

చేరుకోక తప్పదు. వేతనాలను గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఆ నిర్ధారణకు చేరుకున్నాడన్న దానికి రుజావు. ఆయన దృష్టిలో ఒక కార్మికుని వేతనం అతని కనీస జీవితావసరాలను బట్టి మాత్రమే నిర్ణయింపబడుతుంది, నిర్ణయింపబడాలి. జీవించడానికీ, శ్రమించడానికీ, సంతానోత్పత్తి చెయ్యడానికీ అవసరమైనదాని కన్న ఎక్కువ అతను పొందకూడదు. అదే సమయంలో యీ కార్మికుని శ్రమచేత సృష్టింపబడిన విలువ పూర్తిగా భిన్నమైన పరిమాణం కలిగినదనీ, విధిగా, పరిగణనీయమైనంత అధికతరమైనదనీ పెట్టీ గ్రహిస్తాడు. ఈ తేడాయే అదనపు విలువకు మూలం, అదే పెట్టీ రచనల్లో వడ్డీ రూపంలో కనిపిస్తుంది.

అపరిణత రూపంలోనే అయినప్పటికీ, పెట్టీ సాంప్రదాయిక అర్థశాస్త్ర మౌలిక శాస్త్రీయ సూత్రాన్ని — వేతనం, అదనపు విలువ (కౌలు, లాభం, వడ్డీ), అంతిమ విశ్లేషణలో శ్రమ వ్యయం ద్వారా నిర్ణయింపబడే సరుకు ధరకు విలోమానుపాతంలో సంబంధితమైవున్నాయన్న సూత్రాన్ని — వ్యక్తం చేశాడు. ఉత్పత్తియొక్క ఒకే అభివృద్ధి స్థాయిని తీసుకున్నప్పుడు, వేతనంలో పెంపుదల అదనపు విలువను తగ్గించుకున్నప్పుడే సాధ్యమవుతుంది, అలాగే వేతనంలో తరుగుదల అదనపు విలువలో పెరుగుదలకు దారితీస్తుంది. ఈ అంశంనుంచి, ఒకవంక కార్మికుల, మరోవంక భూస్వాముల, పెట్టుబడిదార్ల వర్గప్రయోజనాల మధ్య మౌలికమైన వైరుధ్యం వున్నదన్న సంగతిని గుర్తించడానికి, యింకొక్క అడుగు మాత్రమే వుంది. రికార్డో ద్వారా సాంప్రదాయిక అర్థశాస్త్రం చేయవలసివున్న తుది నిర్ణయం సరిగా యిదే. పెట్టీ యీ అభిప్రాయానికి అతి సన్నిహితంగా బహుశా తన "సిద్ధాంతం"లో కాక, 1670 దశకంలో రాయబడిన సుప్రసిద్ధమైన తన "రాజకీయ గణితశాస్త్రంపై గ్రంథం"లో — అందులో కూడా యీ భావం పిండ రూపంలోనే వున్నా — వచ్చాడు.

అయితే మొత్తంమీద, రాజకీయ గణితశాస్త్రంపట్ల గల వ్యామోహం తన ఆర్థిక సిద్ధాంతాన్ని అభివృద్ధిచెయ్యడానికీ, పెట్టుబడిదారీ అర్థశాస్త్ర మౌలిక నియమాలను అవగాహన చేసుకోడానికీ పెట్టీకి అవరోధమైంది. "సిద్ధాంతం"లోని ప్రతిభావంతమైన పలు ఊహలు అభివృద్ధి చెయ్యబడకుండా మిగిలిపోయాయి. అంకెలు ఆయన్ని విమోహితం చేశాయి. ప్రతిదానికీ అవే కీలకంగా కనిపించాయి. "సిద్ధాంతం"లో విలక్షణమైన పదబంధం ఒకటి అంతకుముందే వుంది: "చెయ్యవలసిన మొట్టమొదటి పనేమిటంటే, గణించడం...." ఇదే పెట్టీ వైధానిక సూక్తిగా, ఓ రకమైన మంత్రంగా మారింది: గణితంలో ప్రతీదీ తేటతెల్లమైపోతుంది. గణాంకశాస్త్రాన్ని కనిపెట్టినవాళ్లు దాని శక్తి పట్ల ఒకరకమైన అమాయక విశ్వాసానికి గురి అయ్యారు.

ఇంతకు ముందు ఉదహరింపబడినదే పెట్టీ ప్రధాన ఆర్థిక రచనల సారాం

శాన్నంతనీ తెలియజేయ్యదనడం సుస్పష్టమే. ఆ సారాంశం యింకెంతో సంపన్నమై నది. ఆనాటికి ప్రగతిశీల బూర్జువావర్గపు ప్రపంచ దృక్పథాన్ని ఆయన భావాలు వ్యక్తం చేశాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తిని అధ్యయనంచేసి, ఉత్పత్తి దృష్ట్యా ఆర్థిక విషయా లను అంచనావేసిన మొట్టమొదటివాడు పెట్టీ. వ్యాపారవాదులపై ఆయన ముందడుగు యిదే. జనాభాలోని అనుత్పాదక విభాగాలపట్ల — ఆయన ప్రత్యేకించి మతబోధకులు, న్యాయవాదులు, ఉద్యోగులను వేలెట్టి చూపిస్తాడు — ఆయన విమర్శనాత్మక వైఖరికి కారణం యిదే. అలాగే ఆయన "తాము స్వంతంగా అందరికీ పనికి వచ్చే ఏ ఫలితాన్నీ సృష్టించని" వర్తకుల, అంగడి యజమానుల సంఖ్యను తగ్గించడం సాధ్యం అని తలు స్తాడు. జనాభాలోని అనుత్పాదక విభాగాలపట్ల విమర్శనాత్మక వైఖరి ముందు ముందు సాంప్రదాయిక అర్థశాస్త్రపు జీవనాడి అయింది.

ఒక పాత ఫ్రెంచి సూక్తి పేర్కొన్నట్లు, శైలి మనిషిని పట్టి యిస్తుంది. పెట్టీ రచనా శైలిలో అసాధారణమైన నవ్యత్వం, విశిష్టతా కనిపిస్తాయి. దీనికి కారణం ఆయన శైలిలో ఏదో సాహిత్యపరమైన నిర్దుష్టతా, ఆలంకారికతా వుండటం కాదు. తద్భిన్నంగా పెట్టీ శైలికి సంక్షిప్తత, మాటిదనం, నిరాడంబరత్వం విశిష్ట లక్షణాలు. ఆయన ప్రస్ఫుటమైన భావాలను ప్రస్ఫుటమైన మాటల్లో మినహాయింపు ల్లేని రూపంలో చెప్తాడు. ఆయనెప్పుడూ కూడా సరళమైన మాటలతో విషయాంశా నికి నిక్కచ్చిగా కట్టుబడివుంటాడు. ఆయన అతిపెద్ద రచన కూడా ఎనభై పేజీలను మించలేదు.

రాయల్ సొసైటీ నిబంధనావళి — దీని సంస్థాపక సభ్యుల్లో పెట్టీ ఒకడు — యిలా నిర్దేశించింది: "...ప్రయోగాలకు సంబంధించిన అన్ని నివేదికల్లోనూ... వాస్త వాంశం ముందుమాటలూ, సమర్థనలూ, ఆలంకారిక ఆర్భాటాలూ లేకుండా తేట తెల్లంగా చెప్పబడాలి." అద్భుతమైన యీ నియమం ప్రకృతిశాస్త్రాలకే కాకుండా సామాజిక శాస్త్రాలకు కూడా వర్తిస్తుందని విశ్వసించిన పెట్టీ, దాన్ని అనుసరించ ప్రయత్నించాడు. ఆయన రచనల్లో చాలవరకు "ప్రయోగాల నివేదికలను" తలపింప జేస్తాయి. (ఆధునిక ఆర్థికవేత్తలూ, తదితర సామాజిక శాస్త్రజ్ఞులూ యీ నియమాన్ని అనుసరిస్తే యెంతో మేలు.)

పెట్టీ రచనల వెనుక వున్న ఆయన ప్రస్ఫుటమైన వ్యక్తిత్వాన్నీ, నిర్నిరోధమైన ఆయన భావతీవ్రతనూ, రాజకీయ వ్యామోహాన్నీ మనం చూడకుండా ఆయన రచనా సారళ్యం నిరోధించలేదు. రంగు అద్దిన పెద్ద విగ్గులోనూ, నిండుగా వుండే సిల్కు పుట్టంలోనూ (చివరి చిత్రాల్లో ఒకదాంట్లో సర్ విలియం కనిపించే తీరు యిదీ) వుండే యీ సంపన్న భూస్వామి చాలవరకు సామాన్యుడైన మోటువాడుగా, ఓ మాదిరి

వెటకారి అయిన వైద్యుడుగా ఉండిపోయాడు. తనకెంత సంపదవున్నా, ఎన్ని బిరుదులున్నా పెట్టీ — మానసికంగానే కాకుండా, శారీరకంగా సైతం — నిరంతరాయంగా పనిచేశాడు. ఆయనకి అభిమానపాత్రమైన పని నౌకా నిర్మాణం. ఆయన అవిరామంగా అపురూపమైన నౌకలకు రూపురేఖలు దిద్దుతూ, నిర్మిస్తూండేవాడు. ఆయన వైయక్తిక లక్షణాలు ఆయన అయిష్టాలకు గల కారణాలను పాక్షికంగా స్పష్టపరుస్తాయి: సోమరిపోతులన్నా, పరాన్నభుక్కులన్నా ఆయనకి మహచెడ్డ మంట. రాజరికంపట్ల సైతం పెట్టీ కటువైన ధోరణి వహించాడు. దర్బారులో రాజకటాక్షాన్ని తనపైకి తిప్పుకొనేందుకు ఒకవంక తంటాలుపడుతూనే అదేసమయంలో మరోవంక రాజుకుగాని, ప్రభుత్వానికిగాని నచ్చని విషయాలను ఆయన రాశాడు: రాజులకు దురాక్రమణపర యుద్ధాలపట్ల సహజంగా వ్యామోహం వుంటుందనీ, వాటిని నిరోధించే అత్యుత్తమ మార్గం వాళ్ల చేతికి డబ్బేమీ అంకకుండా చెయ్యడమేననీ రాశాడు.

రాజకీయ గణితశాస్త్రం

ఇంగ్లండు రాజైన రెండవ చార్లెస్ హుందాయైన తన బంధువూ, ఫ్రెంచి రాజూ అయిన పద్నాల్గవ లూయీని ఏదో ఒక దాంట్లో అధిగమించాలని తన జీవితంలో మరే దానికన్న ఎక్కువగా ఆరాటపడ్డాడు. ఫ్రెంచి రాజభవనాలున్న వెర్సేల్స్‌లో జరుపుకుంటున్న మాదిరిగానే విందులూ, బాణసంచా ప్రదర్శనలూ ఏర్పాటుచేశాడు. కాని ఫ్రెంచి పాలకుని కన్న ఆయనకి చాలా తక్కువ డబ్బు వుంది. తన అక్రమ సంతానంలో కొందరిని ఆయన అక్రమ హోదాలతో అలంకరించాడు. కాని లూయీ మరో అడుగు ముందుకేసి తన అక్రమ సంతానాన్ని ఫ్రాన్స్ మార్షల్సును చేశాడు. పాపం యీ స్ట్యూవర్టు రాజు యీ పని చెయ్యలేకపోయాడు. ఆయన నిరంకుశ రాజరికం నిజానికి అంత తీరుగు లేనిది కాదు.

పోతే యిక విజ్ఞానశాస్త్ర రంగం ఒకటే మిగిలింది. పునరుద్ధరణకు కొద్ది కాలం తర్వాత తన ప్రోత్సాహంతోనూ, మొత్తం రాజకుటుంబ మంతటి పోషకత్వం తోనూ రాయల్ సొసైటీ స్థాపించబడింది. ఇది నిజంగానే చార్లెస్‌కి గర్వించదగిన విషయం. లూయీకి యిలాంటిదేమీ లేదు! రాజు స్వయంగానే రసాయనిక ప్రయోగాలు నిర్వహించాడు, నౌకాయాన శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఇది ఆ కాలానికి సహజమైన విషయం. "ఖుషీ అయిన రాజు"కి అదొక విలాస కార్యంలా పనికివచ్చింది, అలాగే రాయల్ సొసైటీ కూడాను!

రాయల్ సొసైటీ సభ్యులందరిలోకీ అత్యంత ఆసక్తిగొలిపేవాడూ, హాస్యచతురత వున్నవాడూ సర్ విలియం పెట్టీయే. అంతరంగికుల మధ్య వున్నప్పుడు రాజూ, ప్రభు గణంలో ఉన్నత శ్రేణికి చెందినవారూ స్వేచ్ఛా భావుకులుగా వుండేవారు. అన్నిరకాల కపట భక్తులనూ పెట్టీ అంత బాగా మరెవరూ ఎగతాళి పట్టించగలిగేవారు కారు. ఓ రోజున ఐర్లండు లార్డ్ లెఫ్టినెంటు అయిన ఆర్మండ్ డ్యూక్ హుషారుగానూ బహుశా కొంచెం మత్తులోనూ వున్న సహవాసుల మధ్య సర్ విలియంని తన కళా ప్రదర్శనం చెయ్యమన్నాడు. ఓ రెండు కుర్చీలు పక్కపక్కన చేర్చి, వాటిపై కెక్కి పెట్టీ వివిధ స్థాయిల్లోని వివిధ తెగలకు చెందిన మతబోధకుల వికటానుకరణ మొదలు పెట్టాడు. శ్రోతలు కడుపుబ్బ నవ్వడం మొదలుపెట్టారు. ఆ హుషారులో కొట్టుకుపోయి, ప్రత్యక్ష సాక్షి చెప్పినదాన్ని బట్టి "కొందరు రాజకుమారులనూ, గవర్నర్లనూ" వారి అధ్వాన్నపు యాజమాన్యానికీ, పక్షపాతానికీ, స్త్రీలోలత్వానికీగాను చివాట్లుపెట్టే మతబోధకుల మాదిరిగా నటించసాగాడు. నవ్వు నిలిచిపోయింది. తను రెచ్చగొట్టిన భూతాన్ని శాంతపర్చడం ఎలాగో ఆ డ్యూక్‌కి బోధపడలేదు.

రాజకీయాలను గురించీ, వర్తకాన్ని గురించీ మాట్లాడటం మొదలుపెట్టేదాకా రాజుగారూ, ఐరిష్ లార్డ్ లెఫ్టినెంటులూ పెట్టీ మాటలను సరదాగానే విన్నారు. అయితే ఆయన ఆ విషయాలు మాట్లాడకుండా ఆగలేకపోయేవాడు! ఆయనకి సంబంధించినంతవరకు తదితర సంభాషణ అంతా తన సరికొత్త ఆర్థిక పథక వివరణకు కేవలం ఒక సాకు మాత్రమే. ఆయన పథకాల్లో ప్రతి ఒక్కటీ అంతకు ముందరిదాని కన్న మరింత సాహసికమైనదీ, మరింత తీవ్రమైనదీను. ఇది ప్రమాదకరమైనదీ, విసుగుపుట్టించేదీ, అనవసరమైనదీను. లార్డ్ ఎసెక్స్ అనే మరో ఐరిష్ లార్డ్ లెఫ్టినెంటు చెప్పినదాన్ని బట్టి మూడు రాజ్యాల్లోనూ (అంటే, ఇంగ్లండు, స్కాట్లండు, ఐర్లండు) పెట్టీ అంత "చికాకు పుట్టించే మనిషి" మరొకడు లేడు. ఆర్మండ్ డ్యూక్, నిన్ను గురించి కొందరు "ఓ మంత్రగాడివనీ, మరికొందరు ఉన్మత్తతకు దరిదాపుల్లోవుండే ఊహాజీవివనీ, భ్రాంతిలో కొట్టుమిట్టాడేవాడివనీ" అనుకుంటున్నారని పెట్టీకి, ఆయన ముఖంమీదనే నిర్మొగమాటంగా చెప్పాడు.

పెట్టీ జీవితం తేలికైనదేమీ కాదు. ఆయన సహజమైన ఆశావాదం ఒక్కొక్క మారు నిస్సహాయమైన దిగులుకీ, వృథా కోపానికీ చోటిస్తూవుండేది.

పెట్టీ పథకాలకు రాజదర్బారు ఎన్నడోగాని యిష్టపడకపోవడానికి కారణమేమిటి? వాటిలో కొన్ని, అవెంత ప్రతిభావంతమూ, సాహసికమూ అయినవైనప్పటికీ, శుద్ధ ఊహాజనితమైనవి. అయితే చాలమట్టుకు అనాటికి అర్థవంతమైనవి. అసలు విషయమేమిటంటే, ఇంగ్లండు, ఐర్లండులలో ఫ్యూడల్ సంబంధాలను మరింత నిశ్చితంగా

తెంచుకొని, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థను చైతన్యంతోనూ, సాహసంతోనూ అభివృద్ధి చేసేందుకు అవి ఉద్దేశింపబడ్డాయి. కాని రెండవ చార్లెస్, రెండవ జేమ్సుల రాజరికం యీ ఫ్యూడల్ అవశేషాలను పట్టుకొని వేలాడాయి. బూర్జువావర్గపు ఒత్తిడికింద అవి మహా అయితే అరకొర చర్యలకు ఆమోదించాయి. అందుకనే అది (పెట్టీ మరణానికి ఒక సంవత్సరం తర్వాత) కుప్పకూలిపోయింది.

పెట్టీ ఇంగ్లండు సంపత్సౌభాగ్యాలను ఎప్పుడూ యిరుగుపొరుగు దేశాలతో సరిపోల్చి అంచనా వేసేవాడు. హాలండు ఆయనకొక కొలబద్దగా వుంటూవచ్చింది. దానితో ఆయన తరచుగా హాలండు అభివృద్ధికి గల కారణాలేమిటన్న సంక్లిష్ట సమస్యను పునశ్చరణ చేస్తూండేవాడు. కాని ఏళ్ళు గడిచినకొద్దీ ఇంగ్లండు స్థానానికి నేరుగా ఎసరుపెట్టేది హాలండు కాదనీ, దానికన్న మరింత పెద్దదీ, శక్తివంతమైనదీ అయిన ఫ్రాన్సు అన్న దృఢ నమ్మకం ఆయనకి కలగసాగింది. దానితో ఆయన ఆర్థిక భావాలు అంతకంతకు బాహాటంగా ఫ్రెంచి వ్యతిరేక రాజకీయ స్వభావాన్ని సంతరించుకోసాగాయి.

1676లో పెట్టీ తన రెండవ ప్రధాన ఆర్థిక రచన అయిన "రాజకీయ గణిత శాస్త్రం" పూర్తిచేశాడుగాని, దాన్ని ప్రచురించ సాహసించలేకపోయాడు. రెండవ చార్లెస్ విదేశాంగ విధానానికి ఫ్రాన్సుతో పొత్తే ప్రాతిపదిక. పార్లమెంటు పీనాసిగా వ్యవహరిస్తోంది, పన్నుల రూపంలో వచ్చే ఆదాయం రాజుకు చేరడం లేదు. అందుచేత ఆయన మరో విధంగా తన ఖర్చులు గడుపుకోవలసివచ్చింది. ఇంగ్లీషు రాజా పధ్నాల్గవ లూయీ నుండి రహస్య ఆర్థిక సహాయం పొందుతూవచ్చాడు. సర్ విలియం పిరికిపంద ఏమీ కాడు కాని, రాజ దర్బారు ఆగ్రహాన్ని చూరగొనడం ఆయనకి యిష్టం లేకపోయింది.

"రాజకీయ గణితశాస్త్రం" రాతప్రతి రూపంలోనే సర్క్యులేట్ అయింది. 1683లో పెట్టీ రచన అనామకంగా, ఆయన ఎరుక లేకుండా, మరో పేరుతో ప్రచురింపబడింది. 1688–89 నాటి "మహత్తర విప్లవానంతరం," తత్ఫలితంగా ఇంగ్లండు విధానంలో మార్పు వచ్చిన తర్వాత మాత్రమే పెట్టీ కొడుకు (లార్డు షెల్ బర్న్) యీ పుస్తకం పూర్తి పాఠాన్ని రచయిత పేరుతో ప్రచురించాడు. "ఈ పుస్తకంలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతం ఫ్రాన్సుకు కోపదాయకమైనది" కనుక, కీ||శే||డైన తన తండ్రి రచించిన యీ పుస్తక ప్రచురణ అంతకు ముందు అసాధ్యమైందని తను రాసిన అంకితంలో ఆయన వ్యాఖ్యానించాడు.

పెట్టీ ఫ్రెంచి వ్యతిరేక భావాలకు ఆంగ్ల బూర్జువావర్గ ప్రయోజనాలే ప్రేరకాలు. తదుపరి శతాబ్ది కాలమంతటిలోనూ, 19వ శతాబ్ద్యారంభందాకా కూడా, ఇంగ్లండు ఫ్రాన్సుతో పోరాడి, ప్రపంచపు తొలి పారిశ్రామిక రాజ్యంగా స్థిరంగా కుదురుకోవలసివచ్చింది. అయితే, "రాజకీయ గణితశాస్త్రం"లో అతి ముఖ్యాంశమేమిటంటే,

పెట్టీ తన వాదనలను నిరూపించడానికి పూనుకున్న పద్ధతులు. సామాజిక విజ్ఞాన శాస్త్రాల చరిత్రలో గణాంక పరిశీలనా పద్ధతిపై ఆధారపడిన పుస్తకాలలో యిదే మొట్ట మొదటిది.

గణాంక లెక్కలు లేకుండా ఏ ఆధునిక రాజ్యాన్నైనా ఎవరైనా ఊహించుకో గలరా? ఊహించుకోలేరనడం స్పష్టం. గణాంక లెక్కలు లేని ఆధునిక ఆర్థిక పరిశోధ నను ఎవరైనా ఊహించుకోగలరా? ఊహించుకోగలరు కాని సకృత్తుగా మాత్రమే. ఏ రచయిత అయినా "శుద్ధ సిద్ధాంతాన్నే" దాని సాహిత్యపరమో లేక గణితశాస్త్రపరమో అయిన రూపంలో వినియోగించి, ఏ గణాంక సమాచారాన్ని ఉదహరించినప్పటికీ, సూత్ర రీత్యా అవి ఉంటాయనీ, పాఠకునికి అవి ఎంతో కొంతమేరకు తెలిసివుంటాయనీ అతను తప్పకుండా ఊహిస్తాడు.

17వ శతాబ్దిలో పరిస్థితి యిందుకు భిన్నం. గణాంకశాస్త్రం అప్పటికి ఉనికిలో లేదంతే (అసలా పదం లేదు. ఆ పదం 18వ శతాబ్ద్యాంతందాకా ఉత్పన్నం కాలేదు). జనాభా పరిమాణ, విభజన, వయో, వృత్తులను గురించిన పరిజ్ఞానం బహు స్వల్పంగా మాత్రమే వుండేది. ప్రధానావసర సరుకుల ఉత్పత్తి వినిమయాలు, ఆదా యాలు, సంపద పంపిణీలకు సంబంధించిన ప్రాతిపదిక ఆర్థిక సూచికల విషయంలో పరిస్థితి యింతకన్న అధ్వానంగా ఉండేది. పన్నులు, విదేశీ వర్తకాలకు సంబంధించి మాత్రమే కొద్ది వాస్తవాలూ, అంకెలూ ఉండేవి.

పెట్టీ చేసిన గొప్ప సేవ ఏమిటంటే, ప్రభుత్వ గణాంక సర్వీసు స్థాపన సమస్యను ముందుకుతెచ్చి, సమాచారాన్ని పోగుచేసే ముఖ్యమైన పద్ధతుల స్థూల రేఖలు చిత్రిం చడమే. ఆయన తరచుగా తన రచనల్లో గణాంక శాఖ ఏర్పాటు విషయాన్ని ప్రస్తా విస్తూ, తప్పనిసరిగా అన్నట్లు తనను తాను ఆ శాఖాధిపతిగా పరిగణించుకునేవాడు. తను కనిపెట్టిన యీ పదవికి తన చిత్తంవచ్చిన పేర్లు పెడుతూండేవాడు. ఆ పేర్లు ఆయన చిత్తవృత్తిని బట్టీ, ఆ పదవిని తను పొందే అవకాశాలను బట్టీ తర తమ స్థాయిల్లో ఆడంబరంగా వుండేవి. అంతేకాకుండా, అంచనాలు వెయ్యడమే కాకుండా కొంతవరకు ఆయన "ప్రణాళికా" రచన చెయ్యాలని కూడా ఆశించాడు. "శ్రామిక శక్తి సమతులనం" పైన, ఉదాహరణకు, దేశానికి ఎంతమంది డాక్టర్లూ, బారిష్టర్లూ అవసరం (నిజానికి 17వ శతాబ్దంలో వీరికి మించిన ఉన్నత విద్యావంతులైన నిపుణులు మరెవరూ లేరు), తత్పర్యవసానంగా ఏటా విశ్వవిద్యాలయాలు ఎంతమంది విద్యార్థుల్ని చేర్చుకోవాలి అన్న అంశంపైన ఆయన కొన్ని అంచనాలను తయారుచేశాడు.

గణాంక లెక్కల అవసరాన్ని గురించి అవిరామంగా బోధించడంతోబాటు, అప్పటికి తనకు లభ్యమైన అంతగా మరీ ఆధారపడదగని స్వల్పమాత్రపు ఆర్థిక వాస్తవాలను

తన ఆర్థికాభిప్రాయాలను గురించి వాదించడంలో ప్రతిభావంతంగా వాడుకున్నాడు. ఫ్రాన్సుకన్న ఇంగ్లండు పేదదిగాని, బలహీనమైనదిగాని కాదని ప్రత్యక్షంగా లభ్యమైన సమాచారాన్ని ఆధారంచేసుకుని రుజువుచేసే నిర్దిష్టమైన ఒక కర్తవ్యాన్ని ఆయన తన ముందు పెట్టుకున్నాడు. దీనితో, తన నాటి ఇంగ్లండు ఆర్థిక స్థితిని పరిమాణ పూర్వకంగా అంచనా వెయ్యవలసిన మరింత విస్తృత కర్తవ్యం ఆయనకి ఎదురైంది.

తన పుస్తకానికి రాసిన ముందుమాటలో రాజకీయ గణితశాస్త్రాన్ని గురించి ఆయన యిలా రాస్తాడు: "ఈ పని చేసేందుకు నేను చేబట్టిన పద్ధతి అంత మరీ సామాన్యమైనది కాదు. ఎందుకంటే, తర, తమ పదాలను వాడేందుకూ, మేధావరమైన వాదనలు చేసేందుకూ బదులు నేను (చిరకాలంగా నేను ఉపలక్షిస్తున్న నా "రాజకీయ గణితశాస్త్రానికి" ఒక నమూనాగా) నా అభిప్రాయాలను సంఖ్య, తూకం, లేక కొలతలో వ్యక్తం చెయ్యపూనుకొన్నాను. అర్థవంతమైన వాదనలు మాత్రమే చేసేందుకు పూనుకొన్నాను. కొందరు యితరుల అభిప్రాయాలకు భిన్నంగా కొందరు ప్రత్యేక వ్యక్తుల అస్థిరమైన మనస్సులపైనా, అభిప్రాయాలపైనా, వాంఛా రాగ ద్వేషాలపైనా ఆధారపడేవాటిని వదిలేసి, ప్రకృతిలో ప్రత్యక్షాధారాలు కలిగిన కారణాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొన నిశ్చయించుకున్నాను."*

పెట్టీయొక్క అత్యంత ప్రముఖ అనుయాయుల్లో ఒకడైన చార్లెస్ డావెనంట్ సరళమైన యీ కింది నిర్వచనం యిచ్చాడు: "మా ఉద్దేశంలో రాజకీయ గణితశాస్త్రం అంటే ప్రభుత్వానికి సంబంధించిన విషయాల్లో సంఖ్యలతో హేతుబద్ధంగా వాదించడం...." మరికొంత ముందుకెళ్లి, ఒక కళగా యిది నిస్సందేహంగా చాలా పురాతనమైనదని ఆయన పేర్కొన్నాడు. కాని పెట్టీ "దానికి యీ పేరు పెట్టి, దాన్ని నియమ బద్ధమైన పద్ధతుల్లోకి తెచ్చాడు" అన్నాడు.

పెట్టీ రాజకీయ గణితశాస్త్రం గణాంకశాస్త్రానికి అసలైన నకలు. కాగా ఆయన రాజకీయ గణిత సంవిధానం ఆర్థికశాస్త్రంలో ప్రధాన ధోరణులు అనేకానికి బీజప్రాయమైనది. దేశపు జాతీయాదాయాన్ని అంచనా వెయ్యడానికిగల ప్రాముఖ్యాన్ని గురించీ, ఆధునిక గణాంకశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ విస్తారమైన పాత్ర వహించే జాతీయ సంపద సూచీ సంఖ్యల ప్రాముఖ్యాన్ని గురించీ ఆయన ప్రస్ఫుటంగా రాశాడు. ఇంగ్లండు జాతీయ సంపదను గుణించడానికి ప్రయత్నించి అంచనావేసిన ప్రప్రథముడు ఆయనే. పెట్టీ ప్రజాస్వామిక తత్వమూ, అసాధారణమైన సాహసమూ యీ కింది మాటలనుబట్టి స్పష్టమవుతాయి: "...ప్రజల సంపదా, ఎక్కడైనా, ఎప్పుడైనా, తన

---

* W. Petty, *Political Arithmetick*, London, 1690, p. 244.

చిత్తంవచ్చిన మొత్తంలో ప్రజలనుండి డబ్బు గుంజుకునే నిరంకుశుడైన రాజు ఆదాయం — వీటి మధ్య తేడాను చూపించేటప్పుడు విశేషమైన శ్రద్ధ వహించాలి.''* ఇక్కడ ఆయన ప్రస్తావించినది ఫ్రెంచి రాజు పధ్నాల్గవ లూయీని గురించే అయినా, రెండవ చార్లెస్ సైతం యీ పదబంధాన్ని గట్టి హెచ్చరికగా చూడకుండా ఉండజాలడు.

ఇంగ్లండు పాదార్థిక సంపదను 25 కోట్ల పౌనులుగా పెట్టీ అంచనావేశాడు. కాని, దానికి మరో 41 కోట్ల, 70 లక్షల పౌనులు చేర్చాలని — దీన్ని ఆయన దేశ జనాభా ధన సంపదగా గుణించాడు — సూచించాడు. విచిత్రాభాసలాగ కనిపించే యీ భావం పైపైకి కనిపించేదాని కన్న మరింత ప్రగాఢమైనది: శ్రమ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాలు, సాంకేతికాభివృద్ధి పాటవం అనే ఉత్పాదక శక్తుల వ్యక్తి గతాంశపు పరిమాణాలను అంచనావేసే ఒక సాధనం కోసం పెట్టీ యిక్కడ తడు వుళ్లాడుతున్నాడు.

పెట్టీ ఆర్థిక సిద్ధాంతం యావత్తూ జనాభా పరిమాణ సంపుటుల సమస్య నుంచి మొదలవుతుంది. పెట్టీని గురించి విశ్లేషిస్తూ మార్క్స్ యిలా పేర్కొన్నాడు: ''మన మిత్రుడు పెట్టీ మాల్తస్‌కి పూర్తిగా భిన్నమైన 'జనాభా సిద్ధాంతం' ప్రతి పాదిస్తున్నాడు... అది జనాభా సంపద సిద్ధాంతం...''** జనాభా పెరుగుదలకు సంబంధించిన ఆశావాద దృక్పథం సాంప్రదాయిక అర్థశాస్త్రపు తొలినాటి ప్రతినిధులకు విలక్షణమైనది. కార్మికవర్గపు పేదతనానికి అధిక జనాభా పెరుగుదల అనే స్వతస్సిద్ధమైన కారణమే ప్రధానమైనదని చెప్పే బూర్జువా అర్థశాస్త్రపు సమర్థన పూర్వక ధోరణుల్లో ఒక దానికి 19వ శతాబ్ది మొదట్లో మాల్తస్ పునాది వేశాడు (దీన్ని గురించిన మరింత సమాచారం కోసం ప్రకరణం 14 చూడండి).

పెట్టీ ఇంగ్లండు జాతీయాదాయాన్ని గుణించాడు. ఇదే ఆధునికమైన జాతీయ అకౌంటింగు పద్ధతిగా అభివృద్ధిచెందింది. ఈ పద్ధతి ద్వారా ఒక దేశపు ఉత్పత్తి పరిమాణాన్నీ, వినిమయం కోసం, సంచయనం కోసం, ఎగుమతి కోసం ఆ దేశపు ఉత్పాదితపు పంపిణీనీ, ఆ దేశంలోని ప్రధానమైన సామాజిక వర్గాల, బృందాల ఆదాయాలు మొదలైనవాటిని గురించీ అందాజాగా అంచనావెయ్యవచ్చు. పెట్టీ అంచనాలలో గణనీయమైన పొరపాట్లు ఉన్నమాట నిజమే. జాతీయాదాయాన్ని జనాభా వినిమయ వ్యయంగా ఆయన అంచనావేశాడు. వేరే విధంగా చెప్పాలంటే, భవన నిర్మా

* W. Petty, *The Economic Writings*, Cambridge, 1899, Vol. 1, p. 272.

** Karl Marx, *Theories of Surplus-Value*, Part I, pp. 354, 355.

ణానికీ, యంత్రాలు నెలకొల్పడానికీ, భూమి బాగుచేత వగైరాలకూ, అంటే ఆస్తి పెంపకానికిగాను మదుపుగా కేటాయింపబడే ఆదాయంలోని సంచిత భాగాన్ని లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేదని ఆయన భావించాడు. 17వ శతాబ్దం నాటికి యీ ఊహ వాస్తవికమైనదే. ఎందుకంటే, అప్పటికి సంచయనపు రేటు అతి తక్కువగా వుంది. దేశపు పాదార్థిక సంపద నెమ్మదిగా పెరుగుతోంది. అంతేకాకుండా, రాజకీయ గణిత శాస్త్రంలో పెట్టీ పొరపాటు త్వరలోనే ఆయన అనుచరులచేత, ప్రత్యేకించి గ్రెగొరి కింగ్ చేత సరిదిద్దబడింది. 17వ శతాబ్ద్యాంతంలో ఇంగ్లండు జాతీయాదాయాన్ని గురించి ఆయన వేసిన కొన్ని అంచనాలలో సంపూర్ణత్వ నిర్దుష్టత్వాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

పెట్టీ, గ్రాంట్ లేక గణాంకశాస్త్రాన్ని కనిపెట్టింది ఎవరు?

పెట్టీ తదుపరి రచనలు జనాభా, దాని పెరుగుదల, వంపిణీ, ఉద్యోగాలకు సంబంధించినవి. పెట్టీ, ఆయన మిత్రుడు జాన్ గ్రాంట్‌లకే జనాభా గణాంకశాస్త్ర మూల పురుషులన్న గౌరవం దక్కుతుంది. ఈ మార్గదర్శులిద్దరి సామాన్య రచనలనుండే జనాభా గణాంకశాస్త్రపు శక్తివంతమైన అధునాతన సాంకేతిక శాఖలన్నీ అభివృద్ధిచెందాయి.

ప్రతి ఒక విజ్ఞానశాస్త్రానికీ దాని కర్తృత్వాన్నీ, ఆద్యత్వాన్నీ గురించిన తగాదాలు వున్నాయి. కొన్ని సందర్భాల్లో యీ వివాదాలు నిష్ఫలమైనవే కాకుండా, ఆ శాస్త్ర విభాగానికి హానిదాయకం కూడా. మరికొన్ని సందర్భాల్లో అవి దాని చరిత్ర పైన వెలుగును ప్రసరింపజెయ్యడానికి తోడ్పడే కారణంగా ఉపయోగకరమైన వవుతాయి. గణాంక శాస్త్ర చరిత్రలో "పెట్టీ – గ్రాంట్ సమస్య" చుట్టూ యిటువంటి వివాదమొకటి చెలరేగింది. దాని సారాంశం యిదీ.

"మరణాల లెక్కలపై ప్రాకృతిక, రాజకీయ పరిశీలనలు"* అన్న శీర్షికతో జాన్ గ్రాంట్ రాసిన ఓ చిన్న పుస్తకం లండనులో 1662లో వెలువడింది. విలక్షణమూ,

---

* క్లుప్తతకోసం శీర్షిక సంక్షిప్తం చెయ్యబడింది.

వికృతం కూడా అయిన శీర్షికను కలిగివున్నా, ఆ పుస్తకం గణనీయమైన ఆసక్తిని రేపి, కొద్ది సంవత్సరాల్లో ఐదు ముద్రణలు పొందింది. ప్రచురితమైన సంవత్సరమే రెండవ ముద్రణ అవసరం కావడం మరో విశేషం. సాక్షాత్తూ రాజాగారే దానిలో ఆసక్తిని ప్రదర్శించాడు. కొత్తగా స్థాపించబడిన రాయల్ సొసైటీలో రాజు కోరిక మేరకు గ్రాంట్ సభ్యుడు చెయ్యబడ్డాడు. అప్పట్లో అందుబాటులో వున్న కొద్దిపాటి గణాంక సమాచార ప్రాతిపదికపైన ప్రజలకు సహజంగా సంబంధించిన ముఖ్య సమస్యలను తెలివిగా చర్చించేందుకు జరిగిన మొట్టమొదటి ప్రయత్నం యిది. ఇవీ ఆ సమస్యలు: జనన, మరణాల రేట్లు, జనాభాలో స్త్రీ, పురుషుల నిష్పత్తి, సగటు ఆయుః ప్రమాణం, జనాభా వలసకి, మరణానికి ప్రధాన కారణాలు.

"పరిశీలనలు" రచయిత గణాంకశాస్త్రపు అత్యంత ప్రధాన సమస్యను — విడివిడి విషయాలకు సంబంధించి గణనీయమైన సంఖ్యలో గణాంకాలను అధ్యయనం చేసినట్లైతే, వాటిలో ప్రతి ఒక్కటీ కాకతాళీయమైనదిగానే కనిపించినప్పటికీ, మొత్తం మీద ఆ విషయాలన్నీ తీవ్రకాఠిన్యమూ, క్రమబద్ధమూ అయిన నియమాలకు లొంగి వుంటాయన్న సమస్యను — చర్చించేందుకు సంకోచపూర్వకమైన తొలి ప్రయత్నాలు చేశాడు. ప్రతి ఒక వ్యక్తి జనన మరణాలూ కాకతాళీయమైనవే, కాని, ఏ ఒక దేశంలోనైనా (లేక, చివరకు ఓ పెద్ద పట్టణంలోనైనా లేక ప్రాంతంలోనైనా) శిశు జననాల, మరణాల రేటు గణనీయమైనంత కచ్చితంగా వుంటుంది. ఆ రేటులో మార్పు నెమ్మదిగా సంభవిస్తుంది. దానిలో మార్పులను మామూలుగా శాస్త్రీయంగా వివరించగలం, కొన్నికొన్ని సార్లు దాన్ని గురించి ముందే జోస్యం కూడా చెప్పవచ్చు. తదుపరి శతాబ్దంలో, అంటే 18వ శతాబ్దంలో, సంభావ్యతా సిద్ధాంత కర్తలైన గొప్ప గణితశాస్త్రవేత్తల రచనల ద్వారా గణాంకశాస్త్రానికి గణితశాస్త్ర పరమైన కచ్చితమైన పునాదులు వెయ్యబడ్డాయి. కాని, అప్పట్లో అనామకుడైన జాన్ గ్రాంట్ రాసిన చిన్న పుస్తకంలో కొన్ని ప్రాథమిక భావాలు వున్నాయి.

ఆయన 1620లో జన్మించాడు, 1674లో మరణించాడు. లండన్ సిటీలో ఆయనకి ఒక చిల్లరవస్తువుల అంగడి వుండేది. ఆయన స్వయంకృషితో విద్యార్జన చేశాడు. "ఆయన తీరిక కాలంలో" ఆయన విజ్ఞానశాస్త్రీయ కృషి జరిపాడు. 1640 దశకపు చివరి సంవత్సరాల్లో పెట్టీకి ఆయనతో స్నేహం కలిగింది. అప్పట్లో గ్రాంట్ ఆయనకి పోషకుడుగా కూడా వుండేవాడు. అయితే 1660 దశకంలో యిరువురి పాత్రలూ ఉల్టాపల్టా అయ్యాయి. అయితే అంతమాత్రాన వారి మధ్య స్నేహం సన్నగిలలేదు. గ్రాంట్ అప్పటికి పెట్టీకి అత్యంత సన్నిహిత మిత్రుడు, లండనులో ఆయన ఏజెంటు, ఆయనకీ, రాయల్ సొసైటీకీ నడుమ మాధ్యస్థుడు.

గ్రాంట్ పుస్తకం అంత అధికానక్తిని రేకెత్తించినప్పుడు, లండన్‌లోని విజ్ఞాన శాస్త్ర వర్గాల్లో దాని అసలు రచయిత సర్ విలియం పెట్టీయేననీ, యీ అప్రసిద్ధ నామం వెనుక ఆయన అజ్ఞాతంగా ఉండాలని కోరుకున్నాడనీ పుకార్లు వ్యాపించాయి. గ్రాంట్ మరణానంతరం యీ పుకార్లు మరింత బలం పుంజుకున్నాయి. పెట్టీ రచనల్లోనూ, లేఖల్లోనూ యీ పుకారును బలపరిచేలా కనిపించే కొన్ని భాగాలు వున్నాయి. అయితే మరోవంక, "మన మిత్రుడు గ్రాంట్ పుస్తకం" గురించి ఆయన అతి స్పష్టంగా రాశాడు.

19వ శతాబ్దంలో "పరిశీలనలు" కర్తృత్వ సమస్య ఇంగ్లీషు సాహిత్యంలో విస్తృతంగా చర్చింపబడింది. ప్రస్తుతం "పెట్టీ – గ్రాంట్ సమస్య" పరిష్కృతమైపోయినట్లే మనం భావించవచ్చు. ఆ గ్రంథంయొక్కా, దానిలోని ప్రాతిపదిక గణాంక భావాలయొక్కా, విధానాలయొక్కా కర్త జాన్ గ్రాంట్. కాని తన సామాజికార్థిక భావాల విషయంలో గ్రాంట్, పెట్టీచేత ప్రభావితుడయాడనడం స్పష్టం. అయితే ఆ గ్రంథ ఉపోద్ఘాతాన్నీ, యీ భావాలు వ్యక్తం చెయ్యబడిన ముగింపునూ రచించినది పెట్టీయే అయివుంటాడు. ఆ పుస్తకంలోని సాధారణ భావం పెట్టీదే అయ్యుండటానికి విశేషావకాశం వుంది, కాని రచన మాత్రం నిస్సందేహంగా గ్రాంట్ కృషే.*

1666లో లండనులో జరిగిన భారీ అగ్ని ప్రమాదం మూలంగా గ్రాంట్ దివాళా తీశాడు. అటుతర్వాత కొద్ది కాలానికి ఆయన కేథలిక్‌గా మారాడు. అది కూడా ఆయన సామాజిక హోదాను దెబ్బతీసింది. బహుశా యివన్నీ ఆయన మరణాన్ని త్వరితం చేసివుంటాయి. పెట్టీ మిత్రుడూ, ఆయన తొలి జీవితచరిత్ర రచయితా అయిన జాన్ ఓబ్రి రాసినట్లు, గ్రాంట్ అంత్యక్రియల దగ్గర "ఆయన చిరకాల సన్నిహిత పరిచితుడైన చతుర మహా కళాభిజ్ఞుడైన సర్ విలియం పెట్టీ గుడ్లనీరు కుక్కుకుంటూ నిలబడ్డాడు."**

మధ్యయుగపు లండన్ నగరంలో నగభాగాన్ని నేలమట్టం చేసి, నూతన నగర నిర్మాణానికి మార్గాన్ని సుగమంచేసిన భారీ అగ్నిప్రమాదం పెట్టీ సాహసిక పథకాల్లో ఒకదానితో ముడిపడివుంది. ఆ అగ్నిప్రమాదం తర్వాత అలుపు సొలుపుల్లేని మన పథకరచయిత ప్రభుత్వానికి నగరాన్ని శుభ్రంచేసి, పునర్నిర్మించేందుకు ఒక పథకాన్ని

---

* ఎమ్. వి. ప్తూహ, "17–18వ శతాబ్దాల గణాంకశాస్త్ర చరిత్రమీద వ్యాసాలు," మాస్కో, 1945, పేజి 45 (రష్యన్లో).

** E. Strauss, *Sir William Petty. Portrait of a Genius*, London, 1954, p. 160.

సమర్పించాడు. "ఈ పని నిర్వర్తించడానికి తగినంత నగదు సొమ్మును కలిగి, అన్ని అవరోధాలనూ, చిక్కుముడులనూ తెగగొట్టేందుకు అవసరమైన శాసనాధికారాన్ని పొందిన ఒకే వ్యక్తికి నిర్మాణ స్థలమూ, చెత్తా చిదుగూ చెందివుండాలి"* అన్న పూర్వాభిప్రాయంతో ఆ పథకం రచింపబడినట్లు శీర్షికలో పేర్కొనబడింది. వేరే విధంగా చెప్పాలంటే, అప్పటికే పట్టణాభివృద్ధికి ఆటంకంగా పరిణమించిన ప్రైవేటు స్వామ్యం స్థానంలో ప్రభుత్వ లేక మ్యునిసిపల్ స్వామ్యం ఉండాలని ఆ పథకంలో ఉద్దేశింపబడింది.

లండన్, పారిస్, న్యూయార్కు, టోకియోల వంటి మహా నగరాల అభివృద్ధికి ప్రైవేట్ స్వామ్యం ఎలాంటి సమస్యలనూ, యిబ్బందులనూ కలిగిస్తుందో ఊహించుకున్నప్పుడే మూడువందల ఏళ్లకు పైగా వెనక వెల్లడింపబడిన యీ భావపు విలువను పూర్తిగా గ్రహించడం సాధ్యం.

యుగమూ, మనిషీ

వ్యాపారవాదులు ఆర్థిక క్రమాలలో వస్తుపర నియమాలను గమనించలేదు. ఆర్థిక క్రమాల నియంత్రణ కేవలం రాజనీతిజ్ఞుల యిచ్ఛపైననే ఆధారపడివుందని వారు భావించారు. అర్థశాస్త్రంలో యీనాడు మనం అంటున్న ఐచ్ఛికవాదం (voluntarism) వ్యాపారవాదుల విశిష్ట లక్షణం.

ఆర్థికవ్యవస్థలో వస్తుపరమూ, తెలుసుకోగలవీ అయిన నియమాలు ఉన్నాయన్న భావాన్ని వ్యక్తంచేసిన ఆద్యుల్లో పెట్టీ ఒకడు. ఈ నియమాలను ఆయన ప్రకృతి నియమాలతో సరిపోల్చి, తత్కారణంగా వాటిని సహజ నియమాలు అన్నాడు. ఒక విజ్ఞానశాస్త్రంగా అర్థశాస్త్ర అభివృద్ధి పథంలో యిదో పెద్ద ముందంజ.

ప్రాతిపదిక ఆర్థిక క్రమాలైన ఉత్పత్తి, పంపిణీ, మారకం, చలామణీలు నియత, బృహత్ రూపాన్ని, మానవ సంబంధాలు ప్రధానంగా సరుకు—డబ్బు స్వభావాన్నీ సంతరించుకున్నదాకా ఆర్థిక నియమం అన్న భావం ఉత్పన్నం కాజాలదు. సరుకుల కొనుగోలు అమ్మకాలు, శ్రమను కూలికి కుదుర్చుకోవడం, భూమిని కౌలుకు తీసుకోవడం, డబ్బు చలామణీ — యీ సంబంధాలు యించుమించు పూర్తిగా అభివృద్ధిచెయ్యబడినప్పుడే, దీన్నంతటినీ బట్టి వస్తుపర నియమాలు అమల్లో వున్నట్లు జనం నిర్ణయానికి

* The Petty Papers, *Some Unpublished Writings of Sir William Petty ed. by the Marquis of Landsdowne*, London, 1927, Vol. 1, p. 28.

రాగలుగుతారు. వ్యాపారవాదులు ప్రధానంగా ఆర్థిక కార్యకలాపాల్లో విదేశీవ్యాపారం అనే ఒకే ఒక రంగానికి తమను తాము పరిమితం చేసుకున్నారు. పెట్టీ అందుకు భిన్నంగా, అన్నిటికన్న దీనిలో తక్కువ నిమగ్నుడయాడు. వేతనాల పెరుగుదలనూ, వడ్డీనీ, చివరకు పన్నులను సహజంగానే నిర్ణయించే ఆవృత్త నియమబద్ధ క్రమాలలో పెట్టీ ఆసక్తి చూపాడు.

17వ శతాబ్ది చివరి నాటికే ఇంగ్లండు అత్యంతాభివృద్ధి చెందిన బూర్జువాదేశం అవుతోంది. ఇది ప్రధానంగా పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క కార్ఖానా ఉత్పత్తి దశ. ఈ దశలో దాని పెరుగుదల యంత్రాలనూ, కొత్త ఉత్పత్తి విధానాలనూ ప్రవేశ పెట్టినందువల్ల కన్న పాత సాంకేతిక పరిజ్ఞానపు ప్రాతిపదికపైన పెట్టుబడిదారీ శ్రమ విభజనను విస్తరింపజేయడం వల్లనే ముందుకు తీసుకుపోబడుతుంది. అంటే, ఏదో ఒక పనిలో విశేష నైపుణ్యాన్ని కార్మికుడు సంపాదించుకుంటాడు, తత్ఫలితంగా శ్రమ ఉత్పాదకత పెరుగుతుంది. అర్థశాస్త్రంలో శ్రమ విభజనను ఆకాశానికి ఎత్తడమన్నది పెట్టీ చేసిన కొన్ని వ్యాఖ్యలతో ప్రారంభమైంది. పెట్టీ శ్రమ విభజన సామర్థ్యాన్ని గడియారాల తయారీ ఉదాహరణను ఉపయోగించి నిరూపించాడు. ఆడమ్ స్మిత్ రచనలో యిది ప్రత్యేకించి శక్తివంతంగా వ్యక్తంచెయ్యబడింది. శ్రమ విభజనను ఆయన తన ఆలోచనా విధానానికి పునాదిని చేసుకున్నాడు.

పెట్టీ రోజులకి అప్పుడే పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తులు రెండూ చాలవరకు పెట్టుబడిదారీ ప్రాతిపదికలమీద నిర్వహింపబడుతున్నాయి. చేతి పరిశ్రమలూ, సన్నకారు వ్యవసాయమూ పెట్టుబడిదారీ పద్ధతిలో నిర్వహింపబడటమన్నది నెమ్మదిగానూ, వివిధ శాఖల్లోనూ, వివిధ ప్రాంతాల్లోనూ భిన్నభిన్న పద్ధతుల్లోనూ జరిగింది. అత్యధిక రంగాల్లో పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి రూపాలు విస్తృతంగా అమల్లో వున్నాయి. కాని పెట్టుబడిదారీ అభివృద్ధి ధోరణి పొడసూపింది. దాన్ని గమనించిన మొట్టమొదటి వారిలో పెట్టీ ఒకడు.

ఇంగ్లండు ఆర్థిక వ్యవస్థకు అప్పటికింకా పునాదిగావున్న ఊలు పరిశ్రమతోబాటు బొగ్గు గనుల తవ్వకం, ఇనుము, ఉక్కుపోత పరిశ్రమలు అభివృద్ధిచెందాయి. అంతకు ముందు శతాబ్ది మధ్యనాటికి ఏటా 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతూ వున్న దల్లా 1680 దశకంలో సుమారు 30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. (కాని అప్పటికింకా దాదాపు పూర్తిగా బొగ్గే యింధనంగా వాడబడుతూ వుండేది: కోకింగ్ పద్ధతి అప్పటికింకా కనుగొనబడలేదు. లోహాలు కట్టెబొగ్గుతోనే కరిగింపబడుతూండేవి. అంటే అడవులు నాశనంచెయ్యబడుతూ వుండేవన్నమాట.) ఇవి ఆదినుంచీ కూడా పెట్టుబడిదారీ శాఖలుగానే అభివృద్ధిచెందాయి.

గ్రామీణప్రాంతం కూడా మారుతోంది. సరుకుల మార్పిడినీ, చిన్నతరహా వర్తకాన్నీ అనుసరిస్తూవుండిన సన్నకారు భూస్వాముల వర్గం క్రమంగా అంతరిస్తోంది. వారి భూఖండాలూ, ఊరుమ్మడి పొలాలూ అంతకంతకు అధికంగా పెద్ద భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతం కాసాగాయి. ఈ బడా భూస్వాములు తమ భూములను వ్యవసాయదారులకు అమరుస్తూ వుండేవారు. వీరిలో మిక్కిలి సంపన్నులైన వ్యవసాయదారులు వ్యవసాయ కూలీలను కుదుర్చుకోవడం ద్వారా అప్పుడే పెట్టుబడిదారీ పద్ధతి వ్యవసాయం మొదలుపెట్టారు.

పెట్టీ స్వయంగా ఓ పెద్ద భూస్వామి అన్న విషయాన్ని యీ సందర్భంగా మనం గుర్తుచేసుకోవాలి. అయితే అతి కొద్ది సందర్భాల్లో తప్ప ఆయన తన రచనల్లో భూస్వామ్య ప్రభువర్గపు ప్రయోజనాలను వ్యక్తంచెయ్యలేదు.

లియో టాల్‌స్టాయ్‌ని గురించి రాస్తూ, యీ కౌంటుకి (ప్రభువుకి) ముందు సాహిత్యంలో సరైన రైతే లేడని లెనిన్ పేర్కొన్నాడు. ఈ సూక్తిని అన్వయించి చెప్పినప్పుడు యీ భూస్వామికి ముందు అర్థశాస్త్రంలో సరైన బూర్జువా లేడనవచ్చు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయినప్పుడు మాత్రమే "జాతి సంపద" పెరుగుదల సాధ్యమన్న విషయాన్ని పెట్టీ స్పష్టంగా అర్థంచేసుకున్నాడు. ఈ అభిప్రాయాలను కొంతవరకు తన ఎస్టేట్లలో ఆయన అమల్లోపెట్టాడు. ఆయన తన భూములను కౌలుకి యిచ్చేటప్పుడు వ్యవసాయదారులు వాటినీ, వాటి సాగుపద్ధతులనూ మెరుగు పరచే విషయాన్ని ఖండితంచేసుకున్నాడు. ఆయన తన భూములపైన చేతివృత్తుల్లో నిపుణులైన ఇంగ్లీషు వలసవాసుల కాలనీని ఏర్పాటుచేశాడు.

వ్యక్తిగా చూసినప్పుడు పెట్టీ వైరుధ్యాల పుట్ట. నిష్పాక్షికుడైన జీవితచరిత్ర కారునికి పెట్టీ ఒకమారు అవివేకియైన సాహసికుడుగానూ, మరోమారు అపారమైన లాభతృష్ణ కలవాడుగానూ, యింకోసారి పట్టుదల కలిగిన లిటిగెంటుగానూ, వేరొకసారి జిత్తులమారి రాజదర్బారీయుడుగానూ, మరోసారి అమాయకుడైన బడాయికోరుగానూ కనిపిస్తాడు. అణచరాని జీవితేచ్ఛ – బహుశా యిదే ఆయన లక్షణాల్లోకెల్లా విశిష్ట లక్షణం. అయితే యీ లక్షణం తీసుకున్న రూపాలు, ఆయన ఏ సామాజిక పరిస్థితుల్లోనూ, సందర్భాల్లోనూ నివసించాడో వాటిని బట్టి నిర్దేశితమయ్యాయి. ఒక విధంగా చూస్తే సంపదా, గౌరవమూ వాటికి అవిగా ఆయన లక్ష్యాలు కావు. అయితే వాటి పట్ల ఆయనకి ఒకరకమైన వినోదాత్మక ఆసక్తి వుంది. తన శక్తియుక్తులనూ, జిత్తులమారితనాన్నీ, ఆచరణాత్మక వంచననీ ప్రదర్శించడంపట్ల ఆయన తన కాలానికీ, పరిస్థితులకీ సహజమైన మానసికానందానుభూతిని పొందేవాడనడం స్పష్టం. ఆయన జీవిత, ఆలోచనా సరళిపైన సంపద హోదాల ప్రభావం బహు స్వల్పం.

లండనులో పెట్టీకి పరిచితుడైన జాన్ ఎవెలిన్, 1675వ సంవత్సరపు తన డైరీలో, పిక్కడిల్లీలోని పెట్టీ యింట్లో యివ్వబడిన సుష్టైన ఒక విందును గురించి యిలా వర్ణించాడు: "బాగా సామాన్యస్థితిలో వుండగా ఆయనను ఎరిగున్న నేను అద్భుతమైన ఆయన భవనానికి వెళ్లినప్పుడు, తను ఆ దశకు ఎలా చేరుకున్నాడన్న విషయాన్ని గురించి ఆయనే అబ్బురపడ్డాడు. సౌందర్యవతి అయిన ఆయన సతీమణి* నాసి అయిన వస్తువు దేన్నీ, వైభవంగా వుండని దేన్నీ సహించలేకపోగా, ఆనాటికి ఫేషన్ అయిన అద్భుతమైన ఫర్నిచరు సేకరణపట్ల, అపూర్వ వస్తు సంచయనంపట్ల ఆయన పెద్దగా ఆసక్తి గాని, మొగ్గు గాని ప్రదర్శించలేదు. ఆయన మాత్రం దానంతటివట్లా అత్యంత అశ్రద్ధగా, వేదాంత ధోరణిలో వున్నాడు: 'ఓరి భగవంతుడా, యిక్కడెంత సామాను పేరుకుందో, నా మటుకు నేను వట్టి గడ్డిమీదనైనా యింతే హాయిగా పడుకోగలను, అనేవాడు. నిజంగానే సొంత విషయాలపట్ల ఆయన అశ్రద్ధగా వున్నాడు...."**

ఆయనకి జీవితం పొడుగునా — బహిరంగ, రహస్య — శత్రువులున్నారు. వారిలో ఆయనపట్ల యీర్ష్యాళువులు, రాజకీయ ప్రత్యర్థులు, సునిశితమూ, నిర్దాక్షిణ్యమూ అయిన ఆయన అవహేళనలకు — వీటిలో ఆయనది అందెవేసిన చెయ్యి — గురై ఆయన్ని ద్వేషించేవారూ వున్నారు. కొందరు ఆయనపైన భౌతిక దౌర్జన్యాన్ని పురిగొల్పగా, మరి కొందరు కుట్రలూ, కుహకాలూ పన్నారు. ఓరోజున డబ్లిన్‌లోని ఒక వీధిలో ఒకానొక కల్నలు, యిద్దరు "సహాయకుల" మద్దతుతో పెట్టీపైన దాడిచేశాడు. సర్ విలియం వాళ్ల కాళ్లకు బుద్ధిచెప్పేలా చేశాడు. కాని ఆ కల్నలు వాడి అయిన కర్రదెబ్బకు ఆయన కంటి చూపు పోయినంత పని అయింది. చిన్నప్పటినుంచీ మందమైన కంటి చూపుతో బాధపడుతున్న పెట్టీకి ఆ దెబ్బ సరిగా ఆయువుపట్టులో తగిలింది.

రాజదర్బారులోనూ, ఐరిష్ లార్డ్ లెఫ్టినెంటుల దగ్గరా, న్యాయస్థానాల్లోనూ తనకు వ్యతిరేకంగా కుట్రలు జరిపే శత్రువుల మూలంగా ఆయనకి మరింత వేసటగా వుండేది. ఆయన జీవితపు చివరి 20 సంవత్సరాల కాలంలో తన స్నేహితులకు ఆయన రాసిన లేఖలు తీవ్రమైన అసంతృప్తితోనూ, పారుష్యంతో కూడిన నిరుత్సాహంతోనూ కూడివుండేవి. ఒక్కొక్క సందర్భంలో ఆయన తిట్లూ శాపనార్థాలూ పెడుతూ, అతి స్వల్ప విషయాలకు పితూరీ చేస్తూ హీనస్థాయికి దిగజారేవాడు. కాని ఆయనకి స్వభావసిద్ధంగా వున్న ఆశావాదమూ, హాస్యధోరణీ సదా ఆయన్ని వెన్నంటి వుండేవి.

---

* సౌందర్యవతీ, సంపన్న భూస్వామి విధవరాలూ, చురుకైనదీ అయిన పెట్టీ సతీమణికి యిది ప్రస్తావన. పెట్టీకి అయిదుగురు బిడ్డలు.

** *The Diary of John Evelyn*, London, 1959, p. 610.

ఆయన మళ్లీ మళ్లీ పథకాలు వేస్తూనే వుండేవాడు, నివేదికలు సమర్పిస్తూనే వుండే వాడు... వాటిలో మళ్లీ వైఫల్యాలు ఎదుర్కొంటూనే వుండేవాడు.

1660 దరిమిలా, ఆయన జీవితంలో కొంతకాలం ఐర్లండులోనూ, మరికొంత కాలం లండనులోనూ గడిచింది. చివరకు 1685లోనే ఆయన కుటుంబ సమేతంగానూ, తన చరాస్తులన్నింటితోనూ రాజధానికి చేరుకున్నాడు. ఈ చరాస్తుల్లో 53 పెట్టెల పత్రాలే అతి ముఖ్యమైనవి. అదే సంవత్సరంలో రెండవ చార్లెస్ చనిపోగా ఆయన స్థానంలో రెండవ జేమ్సు సింహాసనం అధిష్ఠించాడు. కొత్త రాజా పెట్టీపట్ల సద్భావం వున్నవాడిలాగే కనిపించాడు. అప్పటికి వయోవృద్ధుడైన పెట్టీ నూతనోత్సాహంతో తయారుచేసిన పథకాలను రాజుగారు సాదరంగానే అందుకున్నాడు. కాని అతి త్వరలోనే యిది భ్రమ అని తేలిపోయింది.

1687 మేనెలో పెట్టీ కాలు విపరీతంగా బాధపెట్టసాగింది. చివరకి అది గాంగ్రీనుగా పరిణమించింది. ఆ వ్యాధితోనే ఆయన అదే సంవత్సరం డిసెంబరులో కన్నుమూశాడు. తన జన్మస్థానమైన రోమ్సే పట్టణంలో ఆయన సమాధిచెయ్యబడ్డాడు.

తన సన్నిహిత మిత్రుడు సర్ రాబర్ట్ సౌత్‌వెల్‌కి పెట్టీ రాసిన చివరి లేఖలు విశేషాసక్తిదాయకమైనవి. అవి సరిగా ఆయన మరణానికి రెండు మూడు నెలల క్రితం రాయబడ్డాయి. స్వార్థపరత్వంతోనూ, చిల్లరమల్లర వ్యవహారాలతోనూ, ప్రైవేటు ఆస్తులతోనూ దూషితం కాని కారణంగా అవి ఆయన విశ్వాసాలకు ప్రతీకలు. కుటుంబ వ్యవహారాలు చూసుకోక జీవితానికి సంబంధించని విషయాలతో బుర్ర బద్దలు కొట్టుకుంటున్నందుకు తన్ను నుతిమెత్తగా చివాట్లుపెట్టిన సౌత్‌వెల్‌కు పెట్టీ యీ లేఖల్లో జవాబిస్తున్నాడు. (సగం గుడ్డితనంతోనూ, యితర రోగాలతోనూ తీసుకుంటున్న పెట్టీ ఆమధ్యనే ప్రచురింపబడిన న్యూటన్ "ప్రాకృతిక తత్త్వశాస్త్ర గణిత సూత్రాలు"ను బిగ్గరగా చదివించుకొని వింటున్నాడు.)

ఈ సందర్భంలో కూడా సర్ విలియం తన స్వభావానికి అనుగుణంగా వ్యవహరించాడు. ఆ పుస్తకాన్ని అర్థం చేసుకోగలిగేందుకుగాను ఆయన చార్లెస్ (తన పెద్ద కొడుకు)కు 200 పౌనులు యిచ్చేవాడు. తన బిడ్డలను గురించి — వారిని ఆయన ప్రేమించడమే కాక, వారి పెంపకంపట్ల విశేషమైన శ్రద్ధ చూపాడు — పెట్టీ యిలా రాశాడు: "నా కూతురుకు పెద్ద సంపద వదిలేందుకు నేను రెక్కలు ముక్కలు చేసుకోను, సోమరి తేనెటీగల కోసం తేనె కూడబెట్టను. పోతే నా కొడుకు సంగతి, తను ప్రేమించి పెళ్లి చేసుకొనే భార్య తెచ్చే డబ్బుతో వాడు సంతృప్తిపడాలని నా అభిమతం." ఇంకా కొంత ముందుకు పోయి, జీవిత పరమార్థాన్ని గురించి యిలా రాస్తాడు: "...ఈ నిష్ఫల కృషులలో పడి ఎందుకు కొట్టుకుంటున్నావని మీరు అడుగుతారు.... నేను

చెప్పేదేమిటంటే అవి మానసికానందదాయకాలైన కృషులు, వాటిలోకెల్లా ఆలోచన సర్వోత్కృష్టమైన, అత్యంత మానసికోల్లాసకరమైన కృషి.''*

సమకాలీనులలో సర్ విలియమ్ పెట్టీకి మూడు రకాలైన కీర్తి వుండేది: మొదటిది; ఆయనొక ఉజ్వల పండితుడు, రచయిత, జ్ఞానసంపన్నుడు అన్నది; రెండవది; ఆయనొక అలుపెరుగని ఊహాపరుడు, స్వాప్నికుడు అన్నది; మూడవది; ఆయనొక జిత్తులమారి కుట్రదారు, దురాశాపాతకుడు, ధనార్జనలో ఎటువంటి పద్ధతులు అనుసరించాసన్న విషయం పట్టించుకోనివాడు అన్నది. ఈ మూడో రకం కీర్తి ఐరిష్ భూముల పంపిణీలో తను సాధించిన ''విజయాల''నుండి జీవితాంతందాకా పెట్టీని వెన్నాడింది. మరి దానికి ఆధారం లేకపోనూ లేదు.

పెట్టీ జీవతపు ద్వితీయార్ధ భాగాన్ని ఓ ఆస్తిపరుని, చలాకీయైన ఓ వ్యాపారస్తుని జీవత చరిత్రగా ఓసారి సింహావలోకనం చేద్దాం. 1656–57 సంవత్సరాల్లో ఆయనొక కింది తరగతి మేధావినుండి లాభార్జనాపరుడుగానూ, సాహసికుడుగానూ, అటు తర్వాత ఓ సంపన్న భూస్వామిగానూ మారాడు. అదే ఆయన జీవితంలో మూలమలుపు. ఈ మార్పు లండన్, ఆక్స్‌ఫర్డులలోని ఆయన శాస్త్రజ్ఞమిత్రులకు అయిష్టాన్ని గొలిపే ఆశ్చర్య కారణమైంది. వారిలో కలిగిన యీ అభిప్రాయం పెట్టీకి గాభరావే కాకుండా బాధను కలిగించింది. బోయిల్ అభిప్రాయానికి పెట్టీ విశేషమైన విలువనిచ్చేవాడు. కాగా, పెట్టీ ఆయన్ని తొందరపడి ఏ నిర్ణయాలకూ రావద్దనీ, జరిగిన దేమిటో ఖుద్దున వివరించే అవకాశాన్ని తనకు యిమ్మనీ కోరుతూ బోయిల్‌కు జాబు రాశాడు. కాలక్రమేణా వారి మధ్య పొరపొచ్చెం పాక్షికంగా మాసిపోయినమాట నిజమే గాని, దాని జాడలు మాత్రం మిగిలిపోయాయి.

పునరుద్ధరణ జరిగిన వెంటనే తన భూములను నిలుపుకోడానికి పెట్టీ తీవ్రంగా పోరాడవలసివచ్చింది: ఆ భూముల పూర్వపు యజమానులు — వారిలో కొందరికి కొత్త ప్రభుత్వపు మద్దతు వుంది — అవి తిరిగి తమకు చెందాలని దావా వేశారు. ఆయన తన శక్తియుక్తులన్నింటితోనూ ఆ పోరాటంలోకి దూకాడు. ఆ పోరాటంలో పెద్ద ఎత్తున ఆయన మానసిక శక్తీ, కాలమూ వ్యయమయ్యాయి. మొత్తంమీద దావాలో గెలిచి, చెల్లాచెదరుగా వున్న తన ఆస్తులను కాపాడుకోటంలో ఆయన సఫలుడయ్యాడు. కాని అంతూపంతూలేని కోర్టుదావాలతో ఆయన వేధింపబడ్డాడు.

ఆయన అంతటితో ఊరుకోలేదు! తన సూత్రాలకు విరుద్ధంగా తన మిత్రుల సలహాలను లెక్క చెయ్యకుండా ఆయనొక కొత్త వ్యవహారంలోకి తలదూర్చాడు: ప్రభు

---

* E. Strauss, *Sir William Petty*, London, 1954, pp. 168, 169—70.

త్వంనుండీ పన్నులు విధించే హక్కును కొనుక్కొని దేశాన్ని దోచుకున్న సంపన్న వడ్డీ వ్యాపారస్తులైన యీనాందార్ల జట్టులో పోయిపడ్డాడు పెట్టీ. తన రచనల్లో పెట్టీ శిస్తు వ్యవసాయాన్ని ఖండించాడు. అది వ్యవసాయదారుల కార్యోత్సాహాన్నీ, ఉత్పత్తినీ కుంటుపరుస్తుందని పేర్కొన్నాడు. దాదాపు బాహాటంగా ఆ కంపెనీలోని తన భాగస్వాములను దోపిడిగాండ్రనీ, జలగలనీ అన్నాడు. అయితేనేం, ఆయన తన వాటాను చెల్లించాడు. తర్వాత త్వరలోనే ఆ "జలగల"తో పోట్లాడాడు, కాని తన డబ్బును వెనక్కి తీసుకోలేకపోయాడు. కాగా యిప్పుడాయన మరో దావాలో — వాటన్నింటిలోకీ అది అతి తీవ్రమైనదీ, అర్థరహితమైనదీని — చిక్కుకున్నాడు. పెట్టీ దానిలో పీకలదాకా కూరుకుపోయి కోపఘూర్ణితుడయ్యాడు. ఆయన పరిస్థితి ఆయన మిత్రులకు ఖేదాన్నీ, శత్రువులకు ద్వేషపూరితమైన మోదాన్నీ కలిగించింది. 1677లో "కోర్టు ధిక్కారణ" నేరానికి గాను ఆయన కొద్దికాలంపాటు జైల్లో కూడా వున్నాడు. ఈ కళంకాలు, రాజకీయాల్లో ఏ స్థానాన్నైతే పొందేందుకు జీవితం పొడుగునా నిరంతరాయంగా ఆయన కృషిచేస్తూవచ్చాడో దాన్ని ఆయన పొందే అవకాశం లేకుండా నాశనంచేశాయి. తన పథకాల నిర్వహణకు కావలసిన పదవులు ఆయనకి తిరస్కరింపబడ్డాయి.

ఆస్తిపరుడు ఆస్తికి దాసుడయ్యాడు. ఒక లేఖలో స్వయంగా పెట్టీయే తనను తాను ఒక ఓడబానిసగా, గాలికి ఎదురెళ్లి డస్సిపోయినవానిగా వర్ణించుకున్నాడు. శక్తియుక్తులు, డబ్బు, వడ్డీ శిస్తు వ్యవసాయాల కఠోర ప్రపంచంలో పారుబోయిన ఒక ప్రతిభావంతుడి విషాదాంతమిది — ఒక బూర్జువా విషాదాంత వృత్తాంతం యిది.

ఆయన సమకాలీనులు యీ ఘోరాన్ని గ్రహించారు, కాని సహజంగానే దీనిపట్ల మరో విధంగా అభిప్రాయపడ్డారు. పెట్టీ బ్రహ్మాండమైన శక్తిసామర్థ్యాలొకవంకా, రాజకీయాల్లోనూ, ప్రభుత్వంలోనూ ఆయన నామమాత్రపు విజయం మరోవంకా — ఈ వైరుధ్యంపట్ల వారు విస్తుపోయారు. రాజ్యవ్యవహారాలను యింతకన్న బాగా అర్థం చేసుకున్న మరో వ్యక్తిని ఊహించుకోవడం కష్టమని రాశాడు ఎవెలిన్. అతనింకా యిలా అన్నాడు: "కార్ఖానా ఉత్పత్తుల సూపరింటెండెంటుగా గాని, వ్యాపారాభివృద్ధి విషయంలో గాని ఆయనకు సాటివచ్చేవాడు ప్రపంచం మొత్తంమీదనే మరొకడు లేడు;... నేనే ఒక ప్రభువునైతే ఆయన్ని కనీసం నా రెండవ సలహాదారును చేసుకొనివుందును."

అయితేనేం, అడ్మిరాల్టీలో ఓ చిన్న ఉద్యోగాన్ని మించి పెట్టీకి లభ్యం కాలేదు.

తన మానసిక, శారీరక శక్తులను హరించివేస్తున్న రోజువారీ వ్యవహారాల అల్పత్వాన్ని గురించిన స్పృహ పెట్టీకి అన్నప్పుడూ లేకపోలేదు. ఆయన ఒక్కొక్కసారి తనను తానే వ్యంగ్యంగా ఎగతాళి చేసుకునేవాడు. కాని ఆయన ఆ విషవలయాన్ని ఛేదించు

కొని బయటపడలేకపోయాడు. ఆయన రచనల్లోని ప్రశంసనీయమైన సూత్రబద్ధమైన క్లుప్తత ఆయన స్వభావానికి ప్రతీక. అయితే అదే సమయంలో అది యితర వ్యవహారాల్లో ఆయన తలమునకలుగా నిమగ్నుడై ఉన్నదాని ఫలితం కూడా.

ఇంగ్లీషు నాణాలను తిరిగి పోతపోసే విషయంలో ఉత్పన్నమైన వివాదాలను ప్రత్యేకించి దృష్టిలో పెట్టుకొని, పెట్టీ 1682లో "డబ్బు గురించిన విశేషాలు" అనే శీర్షికతో ఓ చిన్న పుస్తకం రచించాడు. 32 ప్రశ్నలు, వాటికి క్లుప్తమైన జవాబుల రూపంలో అది రచింపబడింది. ఒక విధంగా యీ రచన డబ్బుకు సంబంధించిన శాస్త్రీయ సిద్ధాంతానికి ఉక్కు చట్రం, ఆధార నిర్మాణం. దీన్ని యితర పదార్థాలతో — విస్తరణలు, వివరాలు, చిత్రాలు, వివిధ విభాగాల మధ్య, సమస్యల మధ్యా విభజనతో నింపవలసి మాత్రమే వుంది.

లార్డ్ హాలిఫాక్స్‌ను ఉద్దేశించి రాయబడిన సామాన్యమైన యీ నోట్సు రచయిత బతికివుండగా ప్రచురింపబడలేదు, వాటిని గురించి మార్క్స్ యిలా వ్యాఖ్యానించాడు: అవి "నీటుగా తీర్చిదిద్దబడిన రచన... ఇదంతా ఏక ఖండంగా పోత పొయ్యబడిందని చెప్పవచ్చు.... ఈ పుస్తకంలో, ఆయన యితర పుస్తకాల్లో కనిపించే వ్యాపారవాద అవశేషాలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. విషయ వస్తువులోనూ, వివరణ రీతిలోనూ అదో చిన్న కళాఖండం...."*

శ్రమ విలువ సిద్ధాంత దృక్పథాన్ని స్వీకరించిన పెట్టీ, డబ్బును సార్వత్రిక సమానాంశ కర్తవ్యాన్ని నిర్వహించే ఒక ప్రత్యేక సరుకుగా పరిగణించాడు. మిగతా సరుకులు అన్నింటి మాదిరిగానే దాని విలువ శ్రమచేత సృజింపబడుతుంది. కాని దాని మారకపు విలువ మాత్రం పరిమాణాత్మకంగా, వెండి బంగారాల వెలికితీతలో వినియోగింపబడిన శ్రమ మొత్తంచేత నిర్ణయింపబడుతుంది. చలామణీకి అవసరమైన డబ్బు పరిమాణం డబ్బు రూపంలో వ్యాపార తిరగడచేత నిర్ణయింపబడుతుంది. అంటే, అంతిమ విశ్లేషణలో అమ్మబడిన సరుకుల పరిమాణంచేత, వాటి ధరలచేత, వివిధ లావాదేవీల్లో డబ్బు యూనిట్ల చలామణీ పౌనఃపున్యంచేత (చలామణీ వేగంచేత) నిర్ణయింపబడుతుంది. పూర్తి విలువ డబ్బు స్థానాన్ని, కొన్ని పరిమితుల్లో, ఒక బ్యాంకుచేత జారీచెయ్యబడిన కాగితపు డబ్బు ఆక్రమించవచ్చు.

తదుపరి రెండు శతాబ్దాల కాలం అంతట్లోనూ డబ్బు, రుణాల సిద్ధాంతం చాలవరకు విలియం పెట్టీ రచించిన యీ పుస్తకంలో (ఆయన మరికొన్ని రచనల్లోనూ)

---

* Frederick Engels, *Anti-Dühring*, Moscow, 1969, p. 276. ("అంటీ-డ్యూరింగ్" భాగం IIలో ప్రకరణం X మార్క్స్ రచించాడు.)

వ్యక్తంచెయ్యబడిన లేక యీ భావాల ఖండన మండనల చట్రంలో అభివృద్ధి చెయ్య బడింది.

ఈ చిన్న వ్యాసంలో పలు భావాలు క్లుప్తీకరింపబడి రేఖాచిత్రప్రాయంగా మాత్రమే యివ్వబడ్డాయి. అయితే అవి ఆయనకి ఎంతటి సైద్ధాంతిక ఆలోచనా శక్తి వుందో చూపుతాయి. తను చెయ్యగలిగిన దాంట్లో ఆయన స్వల్పభాగం మాత్రమే చేశాడు. ఈ మాటని ఏ మనిషి జీవితానికైనా అన్వయించవచ్చునన్నది నిజమే అయినప్పటికీ, పెట్టీ విషయంలో దీనికి ప్రత్యేక సంబంధమూ, ప్రాముఖ్యమూ వున్నాయి.

ప్రకరణం 4

బువాగిల్బేర్, ఆయన కాలమూ, పాత్రా

"మార్క్స్ తన అర్థశాస్త్ర అధ్యయనాన్ని 1843లో పారిస్‌లో గొప్ప ఇంగ్లీషు, ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తల రచనలతో ఆరంభించాడు"* అని మనకి చెప్తాడు ఎంగెల్స్. అప్పటికే చాలవరకు విస్మరింపబడిన 18వ శతాబ్ది తొలి సంవత్సరాలకు చెందిన బువా గిల్బేర్ అనే అర్థశాస్త్రవేత్త రచనలను మార్క్స్ చదవడానికి ప్రేరేపించినదేమిటో చెప్పడం కష్టం. బహుశా యిది యాదృచ్ఛికంగా జరిగివుండవచ్చు. ఎందుకంటే, 1843లో, 18వ శతాబ్దపు మొదటి అర్ధభాగానికి చెందిన ఫ్రెంచి అర్థశాస్త్ర వేత్తల రచనల సంపుటం వెలువడింది. దానిలో బువాగిల్బేర్ రచనలు, 130 ఏళ్ల విరామానంతరం పునర్ముద్రింపబడ్డాయి. ఫ్రెంచి, జర్మన్ భాషల మిశ్రమంలో వున్న బువాగిల్బేర్ రచనల సమగ్ర పరిశీలన చేసిన మీదట మార్క్స్ క్లుప్తంగా నోట్సు రాసుకుని, వాటిని గురించి పునరాలోచనకు పూనుకొన్నాడు. ఈ పునరాలోచనకు రువాన్ జడ్జి అద్భుత భావాలు ప్రేరేపించాయి. ఈ రువాన్ జడ్జి భావాలు పధ్నాల్గవ లూయీ పాలనా కాలంనాటికి చాలా ముందున్నాయి.

మార్క్స్ బహుశా పదేళ్లో ఎంతో తర్వాత, తన యీ సమగ్ర పరిశీలనను "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు" అనే తన పుస్తకంలో ఉపయోగించుకున్నాడు. మార్క్స్ తన యీ పుస్తకంలో మొట్టమొదట "బ్రిటన్‌లో విలియం పెట్టీతోనూ, ఫ్రాన్సులో బువాగిల్బేర్‌తోనూ మొదలై, బ్రిటన్‌లో రికార్డోతోనూ, ఫ్రాన్సులో సిస్మాండీతోనూ అంతమయ్యే సుమారు ఒకటిన్నర శతాబ్దాల కాలపు సాంప్రదాయిక అర్థశాస్త్రంపై ప్రగాఢమైన అంచనావేశాడు."**

---

* Karl Marx, *Capital*, Vol. II, Moscow, 1967, p. 7

** Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, p. 52.

బువాగిల్బేర్ మార్క్స్ దృష్టిని ఆకర్షించినది తన పాండిత్యం ద్వారానూ, రచనల ద్వారానూ కాదు. నిరంకుశ రాజరికపు రాజ్యయంత్రాంగంలో ఓ "చిన్న బిస" అయిన యీ తెలివిపరుడూ, నిజాయితీపరుడూ ఫ్రెంచి ప్రజానీకంలో అధిక సంఖ్యాకులైన పీడితులకు అండగా తన వాణిని ఎలుగెత్తి చాటాడు, అందుకు మూల్యమూ చెల్లించాడు.

ఫ్రెంచి పేదలు

పద్నాల్గవ లూయీ పాలనయొక్క మొదటి రెండు దశాబ్దాలలో దేశపు ఆర్థిక వ్యవస్థ బాధ్యతను కొల్బేర్ వహించాడు. పరిశ్రమల ప్రాధాన్యాన్ని గుర్తించిన కొల్బేర్ వాటి అభివృద్ధికోసం విశేషంగా కృషిచేశాడు. దేశపు ఆర్థికాదాయ వనరుగా మాత్రమే కొల్బేర్ పరిగణించిన వ్యవసాయానికి పారిశ్రామిక రంగపు కొన్ని శాఖల పెరుగుదల నష్టం కలిగించింది. కొల్బేర్ ఆర్థిక విధానంలోని ప్రధాన లోపం ఫ్యూడల్ సంబంధాలను యథాతథంగా వదిలెయ్యడమే. అవి దేశపు ఆర్థిక, సామాజి కాభివృద్ధిని కుంటుపరుస్తున్నాయి. దురాశాపరుడైన లూయీ తను నిరంతరాయంగా జరిపే యుద్ధాలకోసమూ, అపూర్వమైన రాజదర్బారు దర్జాలనిమిత్తం విచ్చలవిడిగా పెట్టే ఖర్చులకోసమూ ఎలాగో ఒకలాగ ప్రజలనుండి డబ్బును గుంజే ప్రధాన బాధ్య తను కనుక కొల్బేర్‌కి అప్పగించి వుండకపోయినట్లయితే, ఆయన ప్రయత్నాలు మరింత జయప్రదమై వుండేవి.

కొల్బేర్ మరణానంతరం, ఆయన విధానం ద్వారా సాధింపబడిన విజయాల్లో కొన్ని త్వరలోనే యీచుకుపోయాయి, కాని లోపాలు మాత్రం యిబ్బడి ముబ్బడిగా తమ దుష్ప్రభావాన్ని ప్రదర్శించాయి. 1701లో ఫ్రాన్సును ఘోరపరాజయానికి గురి చేసి, దాని వినాశానికి కారణభూతమైన స్పానిష్ వారసత్వ యుద్ధమనబడేది ప్రారంభ మైంది. ఫ్రాన్సు దానిలో ఇంగ్లండు, హాలండు, ఆస్ట్రియా, మరికొన్ని చిన్న రాజ్యాల సంఘటనతో తలపడింది.

పద్నాల్గవ లూయీ ముసలివాడవుతున్న కొద్దీ రాజ్యనిర్వహణకు సమర్థులైనవారిని ఎంచుకొనే నేర్పును కోల్పోయాడు. తత్ఫలితంగా శక్తివంతుడూ, కష్టించి పనిచేసే వాడూ అయిన కొల్బేర్ స్థానాన్ని అసమర్థులు ఆక్రమించారు. పద్నాల్గవ లూయీ పాలనలోనూ, అతని వారసులైన యిద్దరు బూర్బన్ వంశపు రాజుల పాలనలోనూ ఆర్థిక శాఖ కంట్రోలర్ జనరలే మంత్రులందరిలోనూ అతి ముఖ్యుడు. రాజ్యపు ఖజానా నిర్వ

హణా, దేశపు ఆర్థిక, ఆంతరంగిక, న్యాయ వ్యవహారాలూ, ఒక్కొక్కమారు సైనిక వ్యవహారాలు సైతం, అతని చేతుల్లో కేంద్రీకృతమై వుండేవి. వాస్తవానికి అతను ప్రధాన మంత్రి, కాని కేవలం రాజాభీష్టాన్ని అమలు జరిపేవాడుగా వుండేవాడు.

ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టడమన్నది కంట్రోలర్ జనరల్ పైన ఆధార పడి వుండేది. ఈ విషయం తెలిసిన బువాగిల్బేర్, 17వ శతాబ్దపు చివరి దశకంలోనూ, 18వ శతాబ్దపు మొదటి దశకంలోనూ యీ పదవిని ఆక్రమించిన పొంషర్ట్రేన్, షమిల్యార్‌చేత తన పథకాలు ఉపయోగకరమైనవన్న విషయాన్ని గుర్తింపచేసేందుకు నిరంతరాయంగా ప్రయత్నించాడు. కాని వాళ్లు ఆయన మాటలను సరిగా చెవిన వేసుకోలేదు. చివరికెలాగైతేనేం పొంషర్ట్రేన్‌తో సమావేశం లభించిన బువా గిల్బేర్, మంత్రి మొట్టమొదట తనను పిచ్చివాడనుకోవచ్చుననీ, కాని తన మాట లను చివరికంటా విన్న తర్వాత తన (బువాగిల్బేర్) భావాల విషయంలో మంత్రి తన అభిప్రాయాలను మార్చుకుంటాడన్న ఉపోద్ఘాతంతో మొదలుపెట్టాడు. అయితే కొద్ది నిమిషాలపాటు విన్నమీదట, పొంషర్ట్రేన్ గొల్లున నవ్వి, ఆ మొదటి అభిప్రాయానికే తను కట్టుబడివున్నాననీ, తర్వాయి సంభాషణ కొనసాగించనవసరం లేదనీ చెప్పేశాడు.

ప్రత్యేక సౌకర్యాలు కలిగిన శ్రేణులవారికి (ప్రభువర్గం, మతాధిపతులు) గాని, శిస్తు-వ్యవసాయదారులకు గాని, సంపన్న ఫైనాన్స్ వ్యాపారస్తులకు గాని నష్టం కలిగించే సంస్కరణలను గురించి ప్రభుత్వం చెవిన పెట్టనైనా పెట్టదు. అయితే, దేశపు ఆర్థిక వ్యవస్థను సుదీర్ఘ సంక్షోభంనుంచి కాపాడగలిగినవి సరిగా అటువంటి సంస్కరణలే. ఓ పట్టాన విడువకుండా పాకులాడే రువాన్ జడ్జి పథకాలు సరిగా యీ లక్ష్య సాధన కోసమే ఉద్దేశింపబడ్డాయి.

ఆనాటి ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థయొక్క వినాశకర పరిస్థితినీ, ప్రజల దుస్థితినీ — వారిలో 75 శాతం మంది రైతులే — తెలుసుకోడానికి బువాగిల్బేర్ రచనలు అతి ముఖ్య మైన ఆధారాలు. అయితే దీన్ని గురించి పలువురు రాశారు. ప్రముఖ రాజకీయ, ఆర్థిక రచయిత అయిన మార్షల్ వొబాన్ 1707లో ఒక అంచనా వేశాడు. దాని ప్రకారం మొత్తం ఫ్రెంచి జనాభాలో 10 శాతం మంది నిర్భాగ్యులు, 50 శాతం మంది నిర్భాగ్య స్థితి అంచుల్లో వున్నవారు, 30 శాతం మంది అతి సంకట పరిస్థితుల్లో వున్నవారు, పైతరగతికి చెందిన 10 శాతం మంది మాత్రమే — విలాసాల్లో జీవిస్తున్న కొన్ని వేలమంది కూడా వీరిలోనే వున్నారు — సుభిక్షమైన జీవితం గడుపుతున్నారు.

ఈ పరిస్థితులకుగల మూలకారణాన్ని బువాగిల్బేర్ కొంతవరకు అర్థంచేసుకున్నాడు. అదే ఆయనకీ, యితర విమర్శకులకూ మధ్య వున్న భేదం. తత్పర్యవసానంగానే ఆర్థిక ఆలోచనాభివృద్ధికి ఆయన విశేషంగా దోహదం చెయ్యగలిగాడు. ఆయన గ్రామీణ ప్రాం

తంపై తన దృష్టిని కేంద్రీకరించడం యాదృచ్ఛిక విషయమేమీ కాదు. ఫ్రాన్సులో బూర్జువా ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి కీలకం యిందులోనే వుంది. విప్లవం ఆ శతాబ్దాంతంలో తాళాలన్నింటినీ విరగకొట్టేదాకా రాజూ, ప్రభువర్గమూ, చర్చీ యీ కీలకాన్ని మొండిగా బిగించివుంచారు. ఫ్రెంచి రైతు కొన్ని శతాబ్దాల క్రితమే తన వ్యక్తిగత స్వేచ్ఛను పొందాడు. కాని తను బతుకుతూ, పనిచేస్తూవున్న పొలానికి అతను స్వేచ్ఛాయుతుడైన సొంతదారు కాడు. మారిన రూపాల్లోనే అయినా, "ఖామందు లేని పొలం ఉండరాదు" అన్న మధ్యయుగాల నాటి సూత్రం యింకా పూర్తిగా అమల్లో వుంది. అయితే ఆ కాలంలో ఇంగ్లండులో అభివృద్ధిచెందుతున్న పెట్టుబడిదారీ కౌలు వ్యవసాయదారుల కొత్త వర్గం ఫ్రాన్సుకు లేదు. ఫ్రెంచి రైతాంగం త్రిముఖ భారం కింద నలిగిపోతోంది: అది భూస్వాములకు కౌలుతోబాటు అన్నిరకాల ఫ్యూడల్ బాకీలనూ చెల్లిస్తోంది. చర్చికి తన ఆదాయంలో పదోవంతు చెల్లించడం ద్వారా వేలాది మతబోధకులనూ, సన్యాసులనూ అది పోషించింది. పోతే రాజుకు పన్నులు చెల్లించిన ప్రధాన వర్గం అదే.

బువాగిల్బేర్ తన రచనల్లోనూ, రిపోర్టు నోట్సులోనూ పదేపదే చెప్పినట్లు, ఈ ఆర్థికవ్యవస్థ మూలంగా భూమి సాగును మెరుగుపరచేందుకుగాని, ఉత్పత్తిని విస్తరింపజెయ్యడానికిగాని రైతుకు ప్రేరణ లేకుండా పోయింది.

పన్నుల ద్వారా ఆదాయాన్ని సంపాదించే కర్తవ్యానికే యావత్తు ఆర్థిక విధానాన్నీ గురిచెయ్యడం ద్వారా, రాజ్యం ఫ్యూడల్ అవశేషాలను వినియోగించుకొని, వాటి వినాశాన్ని వాయిదావేసింది. మొత్తం ఫ్రాన్సు దేశం సుంకాల అవరోధాల ద్వారా వేర్వేరు రాష్ట్రాలుగా విభజింపబడింది. ఆ అవరోధాల దగ్గర రవాణాచెయ్యబడే సరుకులన్నింటిపైనా సుంకాలు విధింపబడ్డాయి. ఇది దేశీయ మార్కెట్ అభివృద్ధికీ, పెట్టుబడిదారీ పరిశ్రమల అభివృద్ధికీ ఆటంకమైంది. మరో ఆటంకం, పట్టణాల్లో, వాటి ప్రత్యేక సౌకర్యాలతోనూ, కఠిన నిబంధనలతోనూ, పరిమిత ఉత్పత్తితోనూ చేతివృత్తి గిల్డులను అట్టేవుంచడం. గిల్డులకు అవే పాత ప్రత్యేక సౌకర్యాలను ప్రభుత్వం అమ్ముతూవచ్చింది, కనుక దానికి యిదికూడా లాభదాయకమే. కొల్బేర్ నెలకొల్పిన కొద్దిపాటి పెద్ద కార్ఖానాలు సైతం 18వ శతాబ్దారంభంలో దిగవాసిల్లిపోయాయి. 1685లో పధ్నాల్గవ లూయీ పరిమిత మత సహనాన్ని మంజూరుచేసే నాంట్ శాసనాన్ని రద్దుచేశాడు. తత్ఫలితంగా వేలాది హ్యూగెనాట్ల కుటుంబాలూ, చేతివృత్తులవారూ, వర్తకులూ తమతోబాటు తమ డబ్బునూ, నైపుణ్యాలనూ, పారిశ్రామిక నిర్వహణోత్సాహాన్నీ తీసుకొని ఫ్రాన్సును వదిలిపెట్టి పోయారు.

రువాన్ జడ్జి

ఊహాజగత్తులో విహరించే ఆర్థిక పథకకర్తలు ఓ ప్రత్యేక తరహా మనుషులు. వీళ్ళు బహుశా అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ కనిపిస్తూవుంటారు. వీళ్ళు, ఆవిష్కర్తలనబడే మరో విశిష్ట తెగ జనాన్ని పోలినవాళ్ళు. వాళ్ల మాదిరిగానే వీళ్ళూ తరచుగా ఒకే మాదిరి అడ్డంకులను — యీ ప్రపంచంలో బలవంతుల స్వార్థపర ప్రయోజనాలు, యథాతథవాదం, శుద్ధ మూర్ఖత్వం — ఎదుర్కొంటూవుంటారు.

అత్యంత ఉత్సాహపరులు, నిజాయితీపరులు, నిస్స్వార్థపరులూ అయిన ఆర్థిక పథకకర్తల్లో బువాగిల్బేర్ ఒకడు. పద్నాల్గవ లూయీ నాటి ఫ్రాన్సులో ఆయన విఫలుడు కావడమన్నది అనివార్యం. అయితే, ఆ వైఫల్యం సైతం వ్యక్తిగతంగా ఆయన విషయంలో పెట్టీ విషయంలో కన్న అధికతర విషాదకారణమైంది. బువాగిల్బేర్ బహుశా, సర్ విలియం అంత బహుముఖ ప్రజ్ఞావంతుడుగాని, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కలిగినవాడుగాని కాడు. కాని పెట్టీకన్న ఆయన జనం గౌరవాన్ని అధికతరంగా చూరగొన్నాడు. సాహసికుడైన ఈ రువాన్ జడ్జిని అభివర్ణించే క్రమంలో ఆయన సమకాలికులు పూర్వకాలపు ప్రామాణిక సద్గుణగరిష్ఠులతో ఆయన్ని సరిపోల్చేవారు. ఈ యిద్దరు అర్థశాస్త్రవేత్తలను గురించీ చెప్తూ మార్క్స్ యిలా పేర్కొన్నాడు: "పెట్టీ కేవలం ఆషామాషీ, దురాశాపర, నియమరహిత దుస్సాహసికుడు కాగా, బువాగిల్బేర్... తన మహా మేధా శక్తితోనూ, ధైర్యసాహసాలతోనూ పీడితవర్గాల ప్రయోజనాలకోసం నిలబడ్డాడు."* మార్క్స్‌కు బువాగిల్బేర్‌ని గురించి ఆయన ప్రకటిత గ్రంథాల ద్వారా మాత్రమే పరిచయం ఉందన్న సంగతినీ, తన యీ వర్ణనలో ఆ రచనల ద్వారానే బువాగిల్బేర్ వ్యక్తిత్వాన్ని మార్క్స్ అంచనావేశాడన్న సంగతినీ, 1860 దశకంలో బువాగిల్బేర్ ఉత్తరప్రత్యుత్తరాలు బయటపడ్డాక మాత్రమే ఆయన వ్యక్తిత్వం మరింత సమగ్రంగా ఆవిష్కృతమైందన్న సంగతినీ యీ సందర్భంగా గుర్తుంచుకోవడం అవసరం.

ప్యేర్ లెపెజాన్** డి బువాగిల్బేర్ 1646లో రువాన్ పట్టణంలో జన్మించాడు.

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, p. 55.

** ఈ ఆర్థికవేత్త అసలుపేరు యిదే. బువాగిల్బేర్ అనేది ఆయన పూర్వులు సంపాదించిన భూ ఎస్టేటు పేరు. సాధారణంగా యింటిపేరుకి యీ పేరును చేర్చడమన్నది

ఆయన కుటుంబం నార్మండీ noblesse de robe (గౌను ప్రభువర్గం)కి చెందినది. వంశపారంపర్యంగా న్యాయస్థాన, పరిపాలక హోదా కలిగిన ప్రభువర్గానికి పూర్వకాలపు ఫ్రాన్సులో వాడబడుతూ వుండిన పదం యిది. దీనికితోడు తమ ఖడ్గాలతో రాజుకి సేవచేసే noblesse d'épée (ఖడ్గ ప్రభువర్గం) కూడా వుంటారు. 17, 18 శతాబ్దాల్లో కొత్తగా ధనికులైన బూర్జువాల చేరికతో ఈ noblesse de robe వర్గ సంఖ్య వేగంగా పెరిగింది. బువాగిల్బేర్ కుటుంబ పూర్వ రంగం యిదీ.

ప్యేర్ లపెజాన్ తన కాలంనాటికి చక్కని విద్యార్హతలు పొందాడు. ఆటుతర్వాత ఆయన పారిస్‌కి పోయి సాహిత్యాధ్యయనానికి పూనుకున్నాడు. త్వరలోనే ఆయన తన కుటుంబ సంప్రదాయానుసారంగా న్యాయవాద వృత్తిని చేబట్టాడు. 1677లో తన వర్గానికి చెందిన యువతిని పెళ్లిచేసుకున్నాడు. నార్మండీలో న్యాయశాస్త్రపరమైన అధికార నిర్వహణోద్యోగాన్ని సంపాదించుకున్నాడు. ఏ కారణంగానో తెలియదుగాని ఆయన తన తండ్రితో పోట్లాడాడు. ఆ కారణంగా వారసత్వరీత్యా ఆయనకి రావలసిన ఆస్తి ఆయన తమ్ముడికి పోయింది. దానితో ఆయన జీవితంలో తన బాటను తాను వెతుక్కో వలసివచ్చింది. ఈ పని ఆయన అత్యంత విజయవంతంగా చేసిన ఫలితంగా, 1689 నాటికి అప్పుడే రువాన్ న్యాయచట్ట యిలాకా జిల్లాలో పెద్ద జీతం లభించే పలుకుబడి కలిగిన లెఫ్టినెంట్ జనరల్ పదవికి అవసరమైన పెద్ద మొత్తం డబ్బును చెల్లించ గలిగాడు. ఆనాటి విలక్షణమైన ప్రభుత్వ వ్యవస్థలో యిది ఎలాంటిదంటే, పోలీసు, సాధారణ మునిసిపల్ వ్యవహారాల నిర్వహణ బాధ్యతతోబాటు పట్టణ ప్రధాన న్యాయ మూర్తి పదవి. బువాగిల్బేర్ తన జీవితకాలమంతా ఆ ఉద్యోగాన్ని నిలుపుకుని, తన మర ణానికి రెండు నెలల ముందు దాన్ని తన కొడుకుకి బదిలీచేశాడు.

ఉద్యోగాలను అమ్మే పద్ధతి బూర్బన్ రాజరిక పాలననాటి దారుణమైన సామాజిక చెడుగుల్లో ఒకటి. ఈ విధంగా ఖజానా బూర్జువాలనుండి డబ్బును గుంజుతూ, తత్పర్యవసానంగా వాళ్ల పారిశ్రామికోత్పత్తిలోనూ, వర్తకంలోనూ డబ్బు మదుపు పెట్ట కుండా నివారిస్తూ వుండేది. ఇలా డబ్బు గుంజేందుకుగాను కొత్త ఉద్యోగాలు సృష్టింప బడుతూనైనా వుండేవి, లేక పాతవే విభజింపబడి తిరిగి విక్రయింపబడుతూ వుండేవి. పధ్నాల్గవ లూయీ మంత్రుల్లో ఒకడు, ప్రభువులవారు కొత్త ఉద్యోగాలు సృష్టించే సరికి అప్పుడే వాటిని కొనేందుకు మూర్ఖులు తయారుతీరి వుంటారని చమత్కరించాడట.

1670 దశకపు చివరి సంవత్సరాల్లోనే బువాగిల్బేర్ ఆర్థిక సమస్యల అధ్యయ

ఒక బూర్జువా బిరుదును పొందినప్పుడు జరిగే పని. కాని, ప్యేర్ లపెజాన్ ఎప్పుడూ కూడా బువాగిల్బేర్ పేరనే వ్యవహరింపబడ్డాడు.

న్ని మొదలుపెట్టివుండాలి. నార్మండీ రాష్ట్రపు గ్రామీణ జనాభా మధ్య నివసిస్తూ, తదితర రాష్ట్రాల్లో ప్రయాణాలు చేస్తూ ఆయన రైతాంగపు దుర్భర పరిస్థితులను సన్నిహితంగా పరిశీలించాడు. త్వరలోనే ఆయన దేశపు సాధారణ ఆర్థిక పతనమే యీ దుర్భర పరిస్థితులకు కారణమన్న నిర్ణయానికి వచ్చాడు. ప్రభువర్గమూ, రాజూ రైతుకి కేవలం ఆకలితో చనిపోకుండా బతికి ఉండగలిగేందుకు సరిపడేటంత మాత్రమే మిగిల్చేవారు, ఒక్కొక్కమారు అదీ మిగిల్చేవారు కారు. అటువంటి పరిస్థితుల్లో రైతు ఉత్పత్తిని పెంచగలుగుతాడనుకోవడం దుర్భ్రమ. మరోవంక రైతాంగపు యీ దుర్భర దారిద్ర్యం పరిశ్రమల పతనానికి — పెద్ద మార్కెట్ల కొరత ఫలితంగా — ప్రధాన కారణమైంది.

ఈ భావాలు క్రమంగా ఆ జడ్జీ బుర్రలో పరిణతి చెందాయి. 1691 నాటికి అప్పుడే ఆయన తన "విధానాన్ని" గురించి మాట్లాడుతున్నాడు. దాన్ని ఆయన కాగితంమీద పెడుతున్నాడని వేరే చెప్పనక్కర్లేదు. ఆర్థిక సంస్కరణల పరంపరే ఆ "విధానం." దాన్ని యీనాడు మనం బూర్జువా ప్రజాతంత్ర స్వభావం కలిగినదని అంటాం. దీనికితోడు మరో విశేషం ఏమిటంటే, బువాగిల్బేర్ పట్టణవాస బూర్జువా వర్గ ప్రయోజనాల సమర్థకుడుగా కన్న ఎక్కువగా రైతు రక్షకుడుగా మనకు కనిపిస్తాడు. ఫ్రాన్సు ఒక పరాజిత దేశంలా పరిగణింపబడుతోంది — యిదే పల్లవి ఆయన రచనలన్నింటిలోనూ కనిపిస్తుంది.

బువాగిల్బేర్ "విధానం"లో దాని తొలి రూపంలోనూ, 1707 నాటికి అది తీసుకున్న తుది రూపంలోనూ — మూడు ప్రధానాంశాలు వున్నాయి.

ఒకటి, పన్నుల విధానంలో విస్తృతమైన సంస్కరణలను ప్రవేశపెట్టాలని ఆయన భావించాడు. దాని వివరాల్లోకి పోకుండా, పాత పన్నుల విధానం స్థానంలో — అది తిరోగామి స్వభావం కలిగిందనడం స్పష్టం — దామాషా లేక వృద్ధి క్రమానుగత పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించాడనుకుంటే సరిపోతుంది. ఈ పన్ను విధింపు సూత్రాలు యీనాటికీ యింకా వివాదాస్పదమైనవే. కాగా వాటిని కొంత వివరించడం అవసరం. తిరోగామి పన్నుల పద్ధతిలో ఒక వ్యక్తి ఆదాయం పెరిగేకొద్దీ అతని దగ్గర వసూలు చేసే పన్ను శాతం మరింత తక్కువ వుంటుంది. దామాషా పద్ధతిలో వసూలు చేసే పన్ను శాతం ఎప్పుడూ ఒకే విధంగా వుంటుంది. వృద్ధిక్రమానుగత పద్ధతిలో ఆదాయం పెరిగినకొద్దీ పన్ను శాతం పెరుగుతూ వుంటుంది. బువాగిల్బేర్ సూచన ఆ కాలానికి అసాధారణమైన సాహసికత కలిగినది. ఎందుకంటే, ఆ రోజుల్లో ప్రభువర్గమూ, చర్చీ దాదాపు పన్నులే చెల్లించేవి కావు. ఆయన వాటి పైన కనీసం పేదలు చెల్లించేటంత శాతంలోనైనా పన్నును విధించాలని కోరాడు.

రెండు, దేశంలోపల వర్తకంపైన గల నిర్బంధాలన్నింటినీ తొలగించాలని ఆయన కోరాడు. ఈ చర్య దేశీయ మార్కెట్టును విస్తృతంజేసి, శ్రమ విభజననూ, సరుకు, డబ్బుల చలామణినీ పెంపొందిస్తుందని ఆయన ఆశించాడు.

మూడు, ధాన్యం విషయంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టాలనీ, దాని సహజ ధరను అణచివుంచరాదనీ ఆయన కోరాడు. ధాన్యం ధరలను కృత్రిమంగా తగ్గించడం అత్యంత హానిదాయకమనీ, ఎందుకంటే ఆ ధరలు ఉత్పత్తి ఖర్చులను భర్తీచేయవనీ, తత్కారణంగా వ్యావసాయికాభివృద్ధిని కుంటుపరుస్తాయనీ ఆయన వాదించాడు. స్వేచ్ఛాయుతమైన పోటీతో ఆర్థిక వ్యవస్థ చక్కగా అభివృద్ధిచెందుతుందనీ, యీ పద్ధతిలో సరుకులకు మార్కెట్లో "అసలైన ధర" లభిస్తుందనీ బువాగిల్బేర్ విశ్వసించాడు.

ఆర్థిక పునరుద్ధరణకూ, దేశంయొక్కా, దేశ ప్రజలయొక్కా సౌభాగ్యపు పెరుగుదలకూ యీ సంస్కరణలను తప్పనిసరి షరతులుగా ఆయన పరిగణించాడు. ఈ పద్ధతిలో మాత్రమే రాజ్యపు ఆదాయం పెరుగుతుందని పాలకులను ఒప్పించేందుకు ఆయన ప్రయత్నించాడు. జనానికి తన భావాలను తెలియపరచేందుకుగాను తన మొదటి పుస్తకాన్ని గ్రంథకర్త పేరు లేకుండా 1695–96లో ప్రచురించాడు. "ఫ్రాన్స్ సవివర వర్ణన, దాని సౌభాగ్య పతనానికి కారణం, పునరుద్ధరణ సరళ పద్ధతులు, లేక ఒకేఒక్క నెలలో రాజుకు కావలసిన డబ్బునంతనీ సప్లయ్‌చేసి, యావత్తు ప్రజానీకాన్నీ సంపన్నులను చేసేందుకు సరళమైన కిటుకు" అన్న చిత్రమైన శీర్షికతో ఆ పుస్తకం వెలువడింది.

సరళమైన కిటుకు అనడం, దీన్నంతనీ ఒకేఒక్క నెలలో సాధించవచ్చుననడం కొంతవరకు జనం దృష్టిని ఆకర్షించేందుకు ఉద్దేశింపబడ్డాయి. చెయ్యవలసినదంతా కొన్ని చట్టాలను రూపొందించడమే, దానితో ఆర్థిక వ్యవస్థ తృటిలో చక్కబడిపోతుంది అన్న బువాగిల్బేర్ నిజాయితీతో కూడిన విశ్వాసాన్ని కూడా యీ శీర్షిక ప్రతిబింబిస్తుంది.

కాని, ఆశాభంగాల పరంపర అప్పుడే ఆరంభమైంది. ఆ పుస్తకాన్ని దాదాపుగా ఎవరూ గమనించనే లేదు. 1699లో పాంషర్‌ట్రేన్ స్థానంలో, బువాగిల్బేర్‌తో వ్యక్తిగత పరిచయం వుండి, ఆయన భావాలపట్ల సానుభూతి కలిగివున్నట్లు కనిపించిన షమిల్యార్ వచ్చాడు. దానితో మన రువాన్ జడ్జిలో ఆశ మళ్లీ రెక్కలు విప్పుకుంది. ఆయన పూర్తి నవ్యోత్సాహంతో, నవశక్తితో పనికి పూనుకొని, కొత్త రచనలు చేశాడు. అయితే తదుపరి ఐదు సంవత్సరాల్లో ఆయన చేసిన ముఖ్యమైన పని సుదీర్ఘ లేఖా పరంపర, మంత్రికి విజ్ఞప్తుల రచన. పరిగణనీయమైన యీ పత్రాలు లేఖలూ,

సినలైన crie de coeur (హార్దిక విజ్ఞప్తులూ), అంతేకాకుండా నివేదికాంశాలూ.

బువాగిల్బేర్ తన యీ రచనల్లో వాదించాడు, బుజ్జగించాడు, అర్థించాడు, వేడుకున్నాడు. పూర్తి అనవగాహన, కొన్ని మార్లు అవహేళన సైతం ఎదురవడంతో ఆత్మగౌరవాన్ని తలుచుకుని మౌనం దాల్చాడు. అయితే మళ్లీ బుద్ధిపూర్వకంగానే స్వదేశం కోసం ఆత్మగౌరవాన్ని వదిలిపెట్టి అధికారంలో వున్నవారికి: తొందరపడండి, చర్యలకు పూనుకోండి, దేశ ఆర్థికవ్యవస్థను కాపాడండి అంటూ మరోమారు విజ్ఞప్తి చేశాడు.

నేరం, శిక్ష

ఏళ్లు గడిచాయి. తన కొత్త రచనలను ప్రచురించవద్దని బువాగిల్బేర్‌పైన మంత్రి ఆంక్ష పెట్టాడు. బువాగిల్బేర్ తన భావాలు అమలు జరపబడుతాయన్న ఆశాభావంతో ఊరుకున్నాడు. చిట్టచివరకు 1705లో తన "ఆర్థిక ప్రయోగాన్ని" అమలు జరిపేందుకోసం ఆర్లియన్స్ రాష్ట్రంలో బువాగిల్బేర్‌కి ఒక ప్రాంతం యివ్వ బడింది. ఏ పరిస్థితుల్లో ఏ విధంగా యీ ప్రయోగం అమలు జరుపబడిందన్న విషయం పూర్తిగా తెలియదు. ఏదేమైతేనేం, ఆ మరుసటి ఏడాదికల్లా ఆ ప్రయోగం విఫలమై పోయింది. ఏదో ఒక మూరుమూల వున్న చిన్న ప్రాంతంలో, పలుకుబడి కలిగిన అధి కారులు ప్రతికూలంగా వున్నప్పుడు అది మరో విధంగా ముగిసే అవకాశం లేదనడం స్పష్టం.

అప్పుడిక బువాగిల్బేర్‌ను ఆపగలదేమీ లేకపోయింది. 1707 మొదట్లో రెండు సంపుటాల్లో ఆయన తన రచనలను ప్రచురించాడు. అవి సైద్ధాంతిక గ్రంథాలే కాకుండా, వాటిలో ఘాటైన రాజకీయ విమర్శలూ, తీవ్రమైన ఆరోపణలూ, భవిష్య త్తులో ఆపత్సూచకమైన హెచ్చరికలూ కూడా నిండివున్నాయి. అప్పుడిక ఆయన మంత్రినుండి జవాబుకోసం వేచి చూడవలసిన అవసరం లేకుండా పోయింది. ఆ పుస్తకం నిషేధింపబడింది, గ్రంథరచయిత రాష్ట్రాలకు ప్రవాసం పంపబడ్డాడు.

అప్పటికి బువాగిల్బేర్‌కి 61 సంవత్సరాలు. ఆయన వ్యవహారాలు అస్తవ్యస్తంగా వున్నాయి. ఆయన కుటుంబం పెద్దది: ఐదుగురు పిల్లలు వున్నారు. ఆయన బంధు వులు ఆయన్ని శాంతపరచాలని ప్రయత్నించారు. రువాన్ పార్లమెంట్‌కి (రాష్ట్ర న్యాయస్థానానికి) గౌరవ సలహాదారైన ఆయన తమ్ముడు తన అన్నగారి పక్షాన వాదించాడు. ఆయనకి మధ్యవర్తుల కొదువ లేదు. పోతే స్వయంగానే తను విధించిన శిక్షలోని

అసామంజస్యాన్ని షమిల్యార్ గ్రహించాడు. కాని యీ ఉన్మత్త పథకాలకర్త లొంగి రావాలని పట్టుబట్టాడు. బువాగిల్బేర్ పళ్లు నూరుతూ అందుకు ఒప్పుకున్నాడు. తన తలను రాతిగోడకేసి ఒద్దలుకొట్టుకుంటూ పోవడం అర్థరహితమని గ్రహించాడు. ఆయన రువాన్‌కి తిరిగి రావడానికి అనుమతింపబడ్డాడు. డ్యూక్ డి సెంట్ సైమన్* అనే ఆయన సమకాలికుడు — యీ కథలోని పలు వివరాలకు ఆయనకి మనం ఋణపడి వున్నాం — తన స్మృతులలో, పౌరులు బువాగిల్బేర్‌కెంత సగౌరవంగానూ, ఆనందంగానూ స్వాగతమిచ్చారో అభివర్ణించాడు.

బువాగిల్బేర్ జీవితంలో మరెన్నడూ యిటువంటి ప్రత్యక్ష నిర్బంధకాండకు గురి చెయ్యబడలేదు. తన రచనలతో మరో మూడు సంపుటాలను ఆయన ప్రచురించాడు. అయితే వాటిలోంచి మిక్కిలి వివాదాస్పదమైన భాగాలను తొలగించిన తర్వాత మాత్రమే వాటిని ప్రచురించాడన్నమాట నిజమేననుకోండి. అయితే మానసికంగా ఆయన కుంగిపోయాడు. 1708లో షమిల్యార్ స్థానంలో కొల్బేర్ భ్రాతృపుత్రుడూ, తెలివైనవాడూ, సమర్థుడూ అయిన డెమరే కంట్రోలర్ జనరల్‌గా నియమింపబడ్డాడు. అవమానితుడైన బువాగిల్బేర్‌పట్ల ఆయనకి సద్భావం వుంది. ఆయన్ని ద్రవ్య నిర్వహణ బాధ్యతలోకి తేవాలని సైతం డెమరే ప్రయత్నించాడు. కాని అప్పటికే కాలం మించిపోయింది. బువాగిల్బేర్ నూరిపోయాడు. ద్రవ్య నిధులు వేగంగా తరిగిపోతున్నాయి. ఆ పరిస్థితి జాన్ లా ప్రయోగానికి భూమికను సంసిద్ధం చేసింది. బువాగిల్బేర్ రువాన్‌లో 1714 అక్టోబరులో మరణించాడు.

బువాగిల్బేర్ సంపూర్ణమూ, శక్తివంతమూ అయిన వ్యక్తిత్వం, ఆయన రచనలన్నింటిలోనూ, లేఖల్లోనూ, ఆయన సమకాలికులనుండి లభించే కొద్దిపాటి సమాచారంలోనూ లభ్యమవుతుంది. వ్యవహారంలోనేమి, వ్యక్తిగత జీవితంలోనేమి ఆయనతో వ్యవహరించడం ఆషామాషీ విషయం కాదు. మొండిపట్టు, పట్టుదల, స్థిరత్వం — యివీ ఆయన విశిష్ట లక్షణాలు. సెంట్ సైమన్ "ఆయన చురుకైన స్వభావం అద్వితీయమైనది" అంటాడు. అయితే, అతనికి బువాగిల్బేర్ పట్ల విభ్రాంతిజనకమైన గౌరవభావం ఉందనడం స్పష్టం.

సర్దుబాటుకు వ్యతిరేకమైన ఆయన స్వభావం ఆయన దృఢమైన సూత్రాల ఫలితం. పెద్ద, చిన్న విషయాల్లో ఆయన తన సూత్రాలను ఆవేశంగా కాపాడుకున్నాడు. మెత్తగా చెప్పాలంటే యీ సూత్రాలు ఆయన కాలానికి అసామాన్యమైనవి కనుక, ఘర్షణలు తప్పనివరి ఆయాయి. ఇరవై యేళ్లపాటు యీ రువాన్ జడ్జి క్లిష్టమైన

---

* గొప్ప సోషలిస్టు ఊహాజనితవాది కె. ఎ. సెంట్ సైమన్ పూర్వుడు.

తన పోరాటాన్ని సాగించాడు. అందుకోసం తన మనశ్శాంతిని, సంపదను, పాదార్థిక ప్రయోజనాలను (షమిల్యార్ ఆయన మొండితనానికిగాను ఆయన పైన చిత్రమైన జరిమానాలు వేసి శిక్షించాడు: అంతకు ముందే ఆయన కొనుక్కున్న ఉద్యోగాలకు మరోమారు డబ్బు కక్కేలా చేశాడు). మంత్రులకు ఆయనపట్ల యిష్టం లేకపోవడమే కాకుండా (బహుశా అంతకన్న ఎక్కువగా), ఆయనంటే భయపడేవారు. నిర్భీక నిష్కాపట్యంతోనూ, దృఢ విశ్వాసంతోనూ బువాగిల్బేర్ తన భావాలనూ, విశ్వాసాలనూ కాపాడుకునేవాడు. అందులోనే ఆయన ఆధిక్యత యిమిడివుంది.

సైద్ధాంతికుడు

అంతకు పూర్వపు అర్థశాస్త్రవేత్తలందరి మాదిరిగానే బువాగిల్బేర్ తన సైద్ధాంతిక పథకాలను ఆచరణకు గురిచేసి మరీ, తన విధానాల సత్య నిరూపణం చేశాడు. సమన్విత సైద్ధాంతిక విధానంపై ఆధారపడి ఆయన తన ఆర్థిక సంస్కరణలను రూపొందించాడు. ఆ విధానం ఆ కాలం నాటికి సమగ్రమైనది. ఆర్థిక విజ్ఞానశాస్త్ర జనకుల్లో ఒకడుగా ఆయన పాత్రను నిర్ణయించినది అదే. బువాగిల్బేర్ తర్కం బహుశా పెట్టీ తర్కం మాదిరిదే. దేశపు ఆర్థికాభివృద్ధిని నిర్ణయించేది ఏమిటని ఆయన తనను తాను ప్రశ్నించుకున్నాడు. ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థ స్తబ్దతా, పతనమూ ఆయనకి ప్రత్యేకించి ఆదుర్దాను కలిగించాయి. ఆ అంశంనుంచి ఆయన మరింత సాధారణ ప్రశ్న దిశగా పయనించాడు: జాతీయార్థిక వ్యవస్థలో పనిచేసి, దాని అభివృద్ధిని సుస్థిరంచేసే నియమాలేమిటి అన్నదే ఆ ప్రశ్న.

అరిస్టాటిల్‌తో ఆరంభమై, ఆర్థిక సిద్ధాంత మంతట్లోనూ ధరలు ఏర్పడేందుకూ, వాటి మార్పుకీ సంబంధించిన నియమాన్ని కనుగొనాలన్న కాంక్ష పూసల్లో దారంలా వస్తోందన్న లెనిన్ అభిప్రాయాన్ని మేము యింతకు ముందే ఉదహరించివున్నాం. ఈ సుదీర్ఘ అన్వేషణకు బువాగిల్బేర్ మౌలికమైన సహాయం చేశాడు. మనం యీనాడు "అత్యంత సముచితమైన ధరల నిర్మితి" అని పిలిచే దృక్పథంనుంచి ఆయన యీ సమస్యను పరిశీలించాడు. ఆర్థిక సమతులనానికీ, పురోగతికీ అతిముఖ్యమైన షరతు దామాషా లేక సామాన్య ధరలు అని ఆయన తన రచనల్లో పేర్కొన్నాడు.

ఇవి ఏ రకం ధరలు? ప్రథమంగానూ, ప్రధానంగానూ దరహాంమీద ప్రతి విభాగంలోనూ ఉత్పత్తి ఖర్చులను భర్తీచేసి, కొంత లాభాన్ని సమకూర్చి, నికరాదాయాన్ని లభింపజేసేవే యీ ధరలు. దీనికితోడు, ఇవి సరుకుల అమ్మకం క్రమాన్ని అవిచ్ఛిన్నంగా

కొనసాగనిచ్చి, నిబ్బరమైన వినిమయదారీ డిమాండును కొనసాగించే ధరలు. చిట్టచివరి సంగతి, ఏ ధరల కిందనైతే డబ్బు "తన స్థానాన్ని తెలుసుకొని వుంటుందో," చెల్లింపుల తిరగడను పెంచుతుందో, ప్రజలపై నిరంకుశపు పట్టును సంపాదించుకోదో, అటువంటి ధరలు అవి.

ధరల నియమాన్ని, అంటే వాస్తవంగా విలువ నియమాన్ని ఆర్థిక వ్యవస్థ దామాషాతత్వ వ్యక్తీకరణగా వ్యాఖ్యానించడం పూర్తిగా వినూత్నమూ, సాహసికమూ అయిన భావం. బువాగిల్బేర్‌యొక్క యితర మౌలిక సైద్ధాంతిక భావాలు దీనితో ముడి వడివున్నాయి. ధరలను యీ దృష్ట్యా పరిశీలించిన మీదట, ఆర్థిక వ్యవస్థలో "అత్యంత సముచిత ధరలను" సుస్థిరం చెయ్యడం ఎలాగ అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమైంది. బువాగిల్బేర్, యీ ధరల నిర్మాణం స్వేచ్ఛాయుత పోటీ కింద సహజంగానే అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డాడు.

ధాన్యానికి సాధ్యమైనంత అత్యధిక ధరలను నిర్ణయించడాన్ని పోటీ చేసే స్వేచ్ఛను అతిక్రమించడంగా ఆయన పరిగణించాడు. ఈ అత్యంత సముచిత ధరలు రద్దుచెయ్యబడినట్లయితే, మార్కెట్లో ధాన్యం ధరలు పెరుగుతాయనీ, తత్పర్యవసానంగా రైతుల ఆదాయాలు అధికమవుతాయనీ, పారిశ్రామిక వస్తువులకు వారి డిమాండూ, పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తీ వృద్ధిచెందుతాయనీ వగైరా, వగైరా బువాగిల్బేర్ విశ్వసించాడు. ఈ గొలుసు ప్రతిచర్య "దామాషా ధరల" సార్వత్రిక సంస్థాపననూ, ఆర్థికవ్యవస్థ వికాసాన్నీ కూడా సుసాధ్యం చేస్తుంది.

"Laissez faire, laissez passer" ("జరిగేదేదో జరగనివ్వండి") అన్న సుప్రసిద్ధ నుడికారం ఎవరిదన్న విషయం యీనాటికీ వివాదాస్పదమైన అంశమే.* ఈ నుడికారం దరిమిలా స్వేచ్ఛా వాణిజ్యానికీ, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం పెట్టుకోకుండా ఉండటానికీ తారక మంత్రమై, తత్పర్యవసానంగా అర్థశాస్త్ర సాంప్రదాయిక శాఖకి మార్గదర్శక సూత్రమైంది. ఈ నుడికార కర్తలుగా — పూర్తిగా గాని, కొంత భాగానికి గాని — విడివిడిగా ముగ్గురి పేర్లు ఉదహరింపబడుతున్నాయి: పధ్నాల్గవ లూయీ కాలం నాటి ధనిక వర్తకుడు ఫ్రాన్సువా లెజాంౡడ్, మార్క్విస్ డి అర్జైన్‌సోన్ (1730 దశకం), వాణిజ్య సూపరింటెండెంటూ, ట్యూర్గో మిత్రుడూ అయిన వెన్సా గుర్నే. అయితే యీ నుడికార కర్త బువాగిల్బేర్ కాకపోయినప్పటికీ, దానిలో

---

* 19వ శతాబ్దాంతంలో ఔగుస్ట్ ఒంకెన్ అనే జర్మన్ పండితుడు యీ నుడికారంలోని మొదటి భాగానికి ఉత్పత్తి స్వేచ్ఛ అనీ, రెండో భాగానికి స్వేచ్ఛా వాణిజ్యం అనీ భాష్యం చెప్పాడు.

వున్న భావాన్ని ఆయన అత్యంత విస్పష్టంగా వ్యక్తీకరించాడు. "ప్రకృతిని దాని మానాన దాన్ని పనిచెయ్యనివ్వాలి..." అని రాశాడాయన.

బువాగిల్బేర్ "laissez faire, laissez passer" అన్న భావనకు పెట్టుబడిదారీ పారిశ్రామిక యజమానియొక్క చిన్న నాబొజ్జకు శ్రీరామ రక్ష అన్న స్వార్థపరత్వాన్ని కల్పించలేదనీ, అది తర్వాత మాత్రమే ఆ అర్థాన్ని సంతరించుకుందనీ మార్క్స్ పేర్కొన్నాడు. ఆయన రచనలో "యీ ఉపదేశంలో మానవీయమైనదీ, గణనీయమైనదీ కూడా ఉంది. తన ఆదాయాన్ని అసహజ పద్ధతుల ద్వారా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న పాత రాజ్యపు ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా మానవీయమైనదీ, బూర్జువా జీవితాన్ని విముక్తం చేసేందుకు అది తొలి ప్రయత్నం కనుక గణనీయమైనదీ. తన స్వరూపం ఎలా వుంటుందో చూపేందుకు అది విముక్తం కావలసివుంది."*

అదే సమయంలో బువాగిల్బేర్ రాజ్యపు ఆర్థిక విధులను తిరస్కరించలేదు; అటువంటి వాస్తవికవాదీ, ఆచరణశీలీ అయిన వ్యక్తి విషయంలో యిది అనూహ్యమైన విషయమే. రాజ్యం, ప్రత్యేకించి అర్థవంతమైన పన్నుల విధానపు సహాయంతో, దేశంలో ఉన్నతస్థాయి వినిమయాన్నీ, గిరాకీనీ పెంపొందించగలదని ఆయన భావించాడు. వినిమయ వ్యయ ప్రవాహం తగ్గినట్లయితే అనివార్యంగా సరుకుల అమ్మకాలూ, ఉత్పత్తీ తగ్గిపోతాయని బువాగిల్బేర్ గ్రహించాడు. పేదలు మరింత ఎక్కువ సంపాదించి, మరింత తక్కువ పన్నులు చెల్లించినట్లయితే — వారు తమ ఆదాయాన్ని త్వరగా ఖర్చుపెట్టేసే ధోరణి వుంది కనుక — అది తగ్గిపోదు. అందుకు భిన్నంగా ధనికులు తమ ఆదాయాన్ని పొదుపుచేసేందుకు సుముఖులుగా ఉంటారు, తత్కారణంగా ఉత్పాదితాన్ని అమ్మడంలో వారే యిబ్బందులను తీవ్రతరంచేస్తారు.

రాబోయే శతాబ్దాల్లో ఆర్థిక ఆలోచనాభివృద్ధికి ఈ వాదనా విధానం ముఖ్యమైనది. బూర్జువా అర్థశాస్త్ర చరిత్రలో పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి, సంపదల పెరుగుదల ప్రధానాంశాలను గురించిన మౌలికంగా భిన్నమైన రెండు దృక్పథాలు తలెత్తాయి. క్లుప్తంగా మొదటిది ఏమిటంటే, ఉత్పత్తి పెరుగుదల కేవలం సంచయన పరిమాణం (అంటే, పొదుపు, పెట్టుబడి మదుపుల)చేత నిర్ణయింపబడుతుంది. ఒక విధంగా, కొనుగోలుశక్తికి సంబంధించి యిది "తనంతట తనే వస్తుంది." ఈ భావం తార్కికంగా ఆర్థిక సంక్షోభాల, సాధారణ అమితోత్పత్తుల సంభావ్యత నిరాకరణకు దారితీసింది. రెండవ దృక్పథం, ఉత్పత్తి పెరుగుదల ఉన్నత రేట్లను

* K. Marx, F. Engels, *Historisch-kritische Gesamtausgabe.* Werke, Schriften, Briefe, Moskau u. a., Abt. 1, Bd. 3, S. 575.

కొనసాగించే అంశం వినిమయదారీ గిరాకీయేనని నొక్కి చెప్పింది. కొంత మేరకు యీ దృక్పథానికి ఆద్యుడు బువాగిల్బేర్. తద్భిన్నంగా ఈ దృక్పథం తార్కికంగా ఆర్థిక సంక్షోభాల సమస్యకు దారితీసింది.

"సంక్షోభాలను" (లేక సంక్షోభాల వంటి ఘటనలను — సంక్షోభాలన్నవి పెట్టుబడిదారీ అభివృద్ధి తరువాతి దశకు మాత్రమే విశిష్టమైనవి కనుక) ఆర్థిక వ్యవస్థ అంతర్గత నియమాలతో కన్న ప్రభుత్వ దుర్విధానంతో బువాగిల్బేర్ ఎక్కువగా ముడిపెట్టిన మాట నిజమే. మంచి విధానాన్ని అనుసరించినట్లయితే అరకొర డిమాండూ, సంక్షోభాలూ నివారింపబడగలవని ఆయన చెప్పినట్లు కూడా మనం భావించవచ్చు.* ఏదేమైనా, "సంపద, డబ్బు, పన్నుల స్వభావం గురించిన పర్యాలోచన" అన్న తన ప్రధాన సైద్ధాంతిక గ్రంథంలో ఆర్థిక సంక్షోభంలో ఏమి జరుగుతుందో విస్పష్టంగానూ, విపులంగానూ బువాగిల్బేర్ వర్ణించాడు. సరుకుల కొరత మూలంగానే కాకుండా, సరుకుల అతి సమృద్ధి మూలంగా కూడా జనం చనిపోగలరు. ఒకనినుండి మరొకడు కొంతదూరంలో గొలుసులతో బంధింపబడిన పది పన్నెండు మందిని ఊహించుకొమ్మంటాడాయన. ఒకడికి బోలెడంత ఆహారమే తప్ప మరేమీ లేదు; రెండో వాడికి పుష్కలంగా దుస్తులు, మూడో వాడికి తాగేందుకు ఎక్కువగా వుంటాయి. ఇలాగే యితరులకూను. కాని వాళ్ళు తమకున్నవాటిని పరస్పరం మారకం చేసుకోలేరు: వాళ్ల గొలుసులు ఆర్థిక

---

* ఈ సమస్యపైన బువాగిల్బేర్‌యొక్క అసమగ్రమూ, పరస్పర విరుద్ధమూ అయిన అభిప్రాయాలు ఆర్థిక ఆలోచనా క్రమ చరిత్రకారులు ఆయన పాత్రను గురించి పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలకు చేరుకోడానికి కారణభూతమయ్యాయి. అంతిమ విశ్లేషణలో బువాగిల్బేర్ భావానికి అర్థం ఏమిటిగా తేలుతుందంటే స్వేచ్ఛాయుత పోటీలో సంక్షోభాలు అసంభవమనీ, తత్పర్యవసానంగా జాన్ బాప్టిస్ట్ సేయ్‌కి ఆపాదింపబడిన సుప్రసిద్ధ పదబంధం "'మార్కెట్ల నియమాన్ని' (అది యింతకు ముందే లేక పోయినట్లయితే) తయారుచేస్తుందనీ" తేలుతుంది. దీని ప్రకారం ఉత్పాదితాల స్వేచ్ఛాయుత మారకం ప్రాతిపదికపై నడిచే వ్యవస్థలో ఉత్పాదితాల అత్యుత్పత్తి ఎన్నడూ జరగదు. (H. Denis, *Histoire de la pensée économique*, Paris, 1967, p. 151.) షుంపేటెర్ యిందుకు భిన్నంగా, బువాగిల్బేర్ వినిమయదారీ గిరాకీ కొరతనూ, అత్యధిక పొదుపునూ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు ముప్పుగా పరిగణించాడనీ, సంక్షోభాలకు కారణంగా తలిచాడనీ, కాగా "సేయ్ నియమం" విమర్శకులకు, ప్రత్యేకించి కీన్స్‌కన్న ఆద్యుడనీ అన్నాడు. (J. A. Schumpeter, *History of Economic Analysis*, pp. 285—87.)

సంక్షోభాలకు కారణభూతమయ్యే, మనిషికి కనిపించని బాహ్య ఆర్థిక శక్తులు. సమృద్ధి మధ్యలో యీ వినాశం 20వ శతాబ్దాన్ని గుర్తుకు తేక మానదు: సముద్రంలో పాలు దిమ్మరింపబడటం, రైలు యింజన్లలో ధాన్యం తగులబెట్టబడటం — అందునా నిరుద్యోగ, పేదతనాల మధ్య.

రాజకీయ సిద్ధాంతాచరణల్లో బువాగిల్బేర్ దృక్పథం వ్యాపారవాదుల అభిప్రాయాలతో విభేదించడమే కాక చాలవరకు వాటికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయాన్ని ప్రాతిపదికగా పరిగణించి, ఆర్థిక నియమాలను ఆయన చలామణీ రంగంలో కాక, ఉత్పత్తి రంగంలో చూశాడు. దేశపు సంపదను డబ్బులో చూడటానికి ఆయన నిరాకరించి, డబ్బును సింహాసనచ్యుతం చేసేందుకు ప్రయత్నించాడు. ఆయన డబ్బుకీ, సరుకుల రూపంలో నిజ సంపదకీ మధ్య విభజన రేఖను గీశాడు. చిట్టచివరి సంగతి, బువాగిల్బేర్ ఆర్థిక స్వేచ్ఛను బలపరచడం అన్నది కూడా వ్యాపారవాదంతో ప్రత్యక్షంగా తెగతెంపులు చేసుకోవడమే.

బువాగిల్బేర్, ఫ్రెంచి అర్థశాస్త్రం

బువాగిల్బేర్ అభిప్రాయాలకు గల చక్కని, ఆకర్షణీయ లక్షణం వాటి మానవతావాదం. అయితే ఆయన "రైతు అభిమానాని"కి ఆర్థిక సిద్ధాంతం దృష్ట్యా దాని తిరోముఖం కూడా వుంది. పరిశ్రమ, వాణిజ్యాల పాత్రను తక్కువగా అంచనావేసి, రైతాంగ ఆర్థిక వ్యవస్థను ఆదర్శీకరించడం ద్వారా చాలవరకు ఆయన ముందుకి కాక వెనక్కు చూశాడు. మౌలిక ఆర్థిక సమస్యలపై ఆయన అభిప్రాయాలను యిది ప్రభావితం చేసింది.

పెట్టీ దృక్పథానికి విశేషంగా భిన్నమైన బువాగిల్బేర్ దృక్పథానికి వెనుకగల కారణాలకోసం, ఫ్రెంచి పెట్టుబడిదారీ విధానాభివృద్ధి చారిత్రక విశిష్టతలలో మనం వెతకవలసివుంటుంది. ఇంగ్లండుతో పోల్చుకుంటే ఫ్రాన్సులో పారిశ్రామిక, వర్తక బూర్జువావర్గం పోలికేలేనంత బలహీనంగా వుంది, ఫ్రాన్సులో పెట్టుబడిదారీ సంబంధాలు ఇంగ్లండులోకన్న మరింత నెమ్మదిగా అభివృద్ధిచెందాయి. ఇంగ్లండులో అవి అప్పుడే వ్యవసాయ రంగంలో కూడా స్థిరపడ్డాయి. ఇంగ్లండు ఆర్థికవ్యవస్థ విశిష్టత ఏమిటంటే, అక్కడ చాలవరకు శ్రమ విభజన, పోటీ, పెట్టుబడి, శ్రమల చలనశీలత

లున్నాయి. ఇంగ్లండులో అది ప్రత్యేకించి బూర్జువా అభిప్రాయాల వ్యవస్థగా అభివృద్ధిచెందుతుండగా ఫ్రాన్సులో అర్థశాస్త్రం ప్రధానంగా పెటీబూర్జువా స్వభావాన్ని కలిగివుంది.

ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రం — దీని ఆదిలో మనకి పెట్టీ కనిపిస్తాడు — అతి ముఖ్యమైన, పరస్పర సంబంధితమైన రెండు సమస్యలను శాస్త్రీయ విశ్లేషణా కేంద్రంలో వుంచింది. సరుకుల ధరల అంతిమ ప్రాతిపదిక ఏమిటి? పెట్టుబడిదారుని లాభం ఎక్కడినుంచి వస్తుంది? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలంటే విలువ స్వభావాన్ని పరిశీలించడం అవసరం. శ్రమ విలువ సిద్ధాంతం ఆంగ్ల ఆర్థికవేత్తల ఆలోచనకు తార్కిక ప్రాతిపదిక. ఈ ప్రాతిపదికను అభివృద్ధి చెయ్యడంలో వారు క్రమంగా వివిధ వినిమయదారీ విలువలను సృష్టించే నిర్దిష్ట శ్రమకీ, ఒకే పరామితిని — పొడుగూ, పరిమాణమూ — మాత్రమే కలిగి, గుణాత్మక విశిష్టతలేని అనిర్దిష్ట శ్రమకీ మధ్య విభేదానికి సంబంధించిన అవగాహనకు చేరుకున్నారు. మార్క్సుకి ముందు యీ విభేదం ఎన్నడూ ఆవిష్కరింపబడనూ లేదు, సూత్రీకరింపబడనూ లేదు. కాని దాన్ని సమీపించే మార్గం, కొంతవరకు, ఇంగ్లీషు అర్థశాస్త్రంలో — పెట్టీనుండి రికార్డో వరకు — వుంది.

దాని పరిశోధనల నిజమైన విషయ వస్తువు విలువ నియమమే. అయినప్పటికీ, మార్క్సు పేర్కొన్నట్లు, "విలువ నియమం పూర్తిగా అభివృద్ధి చెందడానికి, భారీ పారిశ్రామికోత్పత్తీ, స్వేచ్ఛాయుత పోటీ వున్న సమాజం, వేరే మాటల్లో చెప్పాలంటే, ఆధునిక బూర్జువా సమాజం, వుండాలి."* ఇటువంటి సమాజం ఇంగ్లండులో కన్న ఫ్రాన్సులో చాలా ఆలస్యంగా అభివృద్ధి చెందింది. అందుచేతనే విలువ నియమం పనిచేసే తీరును గమనించడం, అర్థంచేసుకోవడం సిద్ధాంతకర్తలకు కష్టసాధ్యమైంది.

తన "దామాషా ధరల" భావంతో బువాగిల్బేర్ "దాని ఎరుక ఆయనకి లేకపోయినప్పటికీ... సరుకుల మారకపు విలువను శ్రమ కాలానికి"** కుదించాడు. కాని శ్రమ యొక్క ద్వంద్వ స్వభావాన్ని అర్థంచేసుకోడానికి ఆయన చాలా దూరంలో వుండిపోయాడు. కాగా ఆయన సంపదయొక్క విలువ పార్శ్వాన్ని — వాస్తవానికి యిదే సార్వత్రిక అనిర్దిష్ట శ్రమలో యిమిడివుంది — పూర్తిగా అలక్ష్యం చేశాడు. సంపద పాదార్థిక పార్శ్వాన్ని మాత్రమే ఆయన చూశాడు. దాన్ని కేవలం ఉపయోగకరమైన వస్తువుల, వినిమయదారీ విలువల సముదాయంగా ఆయన చూశాడు.

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, p. 60.

** అదే గ్రంథం, పేజి 54.

బువాగిల్బేర్ ఆలోచనలోని యీ లోపం డబ్బును గూర్చిన ఆయన అభిప్రాయాల్లో ప్రత్యేకించి విస్పష్టంగా కనిపిస్తుంది. విలువ నియమం పనిజేసే సమాజంలో సరుకులూ, డబ్బూ అవిభాజ్యమైన ఒక మొత్తం అన్న సంగతిని ఆయన అర్థంచేసుకోడు. ఎందుకంటే, మారకపు విలువయొక్క పరమ వస్తుభాండాగారమైన ఆ డబ్బులోనే అనిర్దిష్ట శ్రమ సంపూర్ణవ్యక్తీకరణ పొందుతుంది. బువాగిల్బేర్ తను కేవలం అవసర వస్తువులుగా మాత్రమే పరిగణించిన సరుకులనుండి డబ్బును వేరుచేసి, ఉన్మత్తావేశంతో దానికి వ్యతిరేకంగా పోరాటం జరిపాడు. దానంతట అదిగా డబ్బు వినిమయ వస్తువు కాదు గనుక, అది ఆయనకి బాహ్యమైనదిగానూ, కృత్రిమమైనదిగానూ కనిపించింది. ఆయన తన "సంపద స్వభావం గురించిన పర్యాలోచన"ను డబ్బుపైన తీవ్రమైన దాడులతో మొదలుపెట్టాడు: "...మానవ హృదయంలోని అవినీతి పూజా ప్రతిమలుగా ప్రతిష్ఠించిన, వెండీ, బంగారమూ.... దేవుళ్ళుగా మార్చివెయ్యబడ్డాయి. అజ్ఞానాంధకారాలతో నిండిన పూర్వకాలంలో అత్యధిక సంఖ్యాక జనసమూహాలు క్షుద్ర దేవతలకు చిరకాలంగా బలులిచ్చిన ఆరాధనా, మతాల్లో కన్న ఎక్కువగా వెండి బంగారాలకు యీనాడు మరిన్ని ఎక్కువ వస్తువులూ, ఆభరణాలూ, చివరకు మనుషులు సైతం బలి యివ్వబడుతున్నారు."*

పెట్టుబడిదారీ ఉత్పత్తిని డబ్బు శక్తినుండి విముక్తి చెయ్యాలన్న — దానితోబాటు దాని పునాదులను మార్చకుండా — ఊహాజనిత కోర్కె, మార్క్స్ అన్నట్లు ఫ్రెంచి అర్థశాస్త్రపు — బువాగిల్బేర్‌నుంచి ప్రూడన్‌దాకా — "జాతీయ వ్యాధి."

తన కాలంలో అప్పుడే ఫ్యూడల్ వ్యవస్థ లోపల రూపొందనారంభిస్తున్న బూర్జువా సమాజపు వర్గ, దోపిడీ స్వభావాన్ని బువాగిల్బేర్ బహిర్గతం చెయ్యలేకపోయాడు. కాని ఆర్థిక, సామాజిక అసమానతనూ, పీడన, బలప్రయోగాలనూ ఆయన తీవ్రంగా విమర్శించాడు. ఎవరి రచనలైతే "పాత వ్యవస్థ" పతనానికి భూమికను సన్నద్ధంచేసి, విప్లవానికి మార్గాన్ని సుగమం చేశాయో ఆ మొదటివారిలో బువాగిల్బేర్ ఒకడు. నిరంకుశ రాజరిక సమర్థకులు 18వ శతాబ్దంలోనే యీ విషయాన్ని గ్రహించారు. బువాగిల్బేర్ మరణానికి దాదాపు అర్ధశతాబ్దం తర్వాత, అటువంటి సమర్థకుల్లో ఒకడు ఆయన "ఏవగింపు కలిగించే" రచనలు ప్రభుత్వంపట్ల ద్వేషాన్నీ, దొంగతనాలనూ, తిరుగుబాటునూ రెచ్చగొట్టాయనీ, యువతరం చేతుల్లో అవి ప్రత్యేకించి ప్రమాదకారకాలైనవనీ రాశాడు.

---

* *Économistes financiers du XVIII[e] siècle*, Paris, 1843, pp. 394, 395.

ప్రకరణం 5

జాన్ లా — సాహసికుడూ, ప్రవక్తా

లా పేరు సుప్రసిద్ధమైనది. ప్రసిద్ధుడైన యీ స్కాట్‌వాని తొలి జీవితచరిత్ర ఆయన జీవిత కాలంలోనే వెలువడింది. ఫ్రాన్సులో "లా విధానం" కూలిపోయాక ఆయన్ని గురించి అన్ని యూరపియన్ భాషల్లోనూ రచనలు వెలువడ్డాయి. 18వ శతాబ్దంనాటి ఏ ఫ్రెంచి రాజకీయ రచయితా ఆయన పేరును ఉదహరించకుండా అశ్రద్ధచెయ్యడు.

19వ శతాబ్దంలో ఆధునిక బ్యాంకుల స్థాపన, పరపతి, స్టాక్ ఎక్స్‌చేంజి చట్టా వ్యాపారాల విస్తృతాభివృద్ధితోబాటుగా మహోత్సాహియైన యీ పరపతి దేవదూత కార్య కలాపాల్లోనూ, భావాల్లోనూ ఓ కొత్త ఆసక్తి తరంగం రేగింది. అప్పుడిక ఆయన ప్రతి భావంతుడైన ఒక సాహసికుడుగానే కాకుండా ఒక ప్రముఖ అర్థశాస్త్రవేత్తగా కూడా పరిగణింపబడ్డాడు.

"ద్రవ్యోల్బణ శతాబ్దం" అయిన 20వ శతాబ్దం యీ గణనీయ వ్యక్తియొక్క ఓ కొత్త పార్శ్వాన్ని దర్శించింది. సమృద్ధిగా పరపతి సౌకర్యాన్నీ, కాగితం డబ్బునూ సమకూర్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థ నిరంతరాయమైన వికాసాన్ని సాధించవచ్చునని జాన్ లా ఆశించాడు. ఆధునిక బూర్జువా రాజ్యపు సంక్షోభ వ్యతిరేక విధాన ప్రాతి పదికలో కూడా యిదే భావం (సహజంగానే కొత్త రూపంలో) వుంది. బూర్జువా పరిశోధ కులు లాకీ, కీన్స్‌కీ మధ్య నిజంగానే ఏదో నిగూఢమైన సాపత్యాన్ని వెతుకుతున్నారు: "లారిస్టన్‌కి చెందిన ఫ్రెంచి ద్రవ్య విభాగపు కంట్రోలర్ జనరల్ జాన్ లా (1671–1729)కీ, జాన్ మెయ్‌నార్డ్ కీన్స్ (1883–1946)కీ మధ్య సామ్యం ఎంత ప్రగాఢమైనదీ, ఎంతటి విస్తృతమైనదీ అంటే, చివరకు వారి వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన కొన్ని పార్శ్వాలను స్పృశిస్తుందంటే, ఆధ్యాత్మికవాది ఎవరైనా వీటిని చూసినప్పుడు రెండు శతాబ్దాల తర్వాత లాయే కీన్స్‌గా అవతారమెత్తాడని చెప్పవచ్చు."*

---

* Ferdinand Zweig, *Economic Ideas. A Study of Historical Perspectives*, New York, 1950, p. 87.

లాని గురించి యిటీవలి సంవత్సరాల్లో వెలువడిన పుస్తకాల శీర్షికలు సైతం ప్రత్యేకత కలిగివున్నాయి: "ద్రవ్యోల్బణ పిత," "పరపతి ఇంద్రజాలికుడు," "బ్యాంకరు లా అద్భుతమైన జీవితం." అదే సమయంలో ఆర్థిక ఆలోచనా చరిత్రను గూర్చిన బృహద్గ్రంథాలలో ఆయనకి సమున్నతమైన గౌరవ స్థానం వుంది.

ప్రమాదకర జీవిత గమనం, సాహసిక భావాలు

జాన్ లా 1671లో స్కాట్లండు రాజధానియైన ఎడిన్‌బరోలో జన్మించాడు. ఆయన తండ్రి స్వర్ణకారుడు. ఆనాటి ఆచారం ప్రకారం డబ్బు వడ్డీకి యిస్తూండే వాడు. 1683లో ఆయన లారిస్టన్ అనే ఓ చిన్న ఎస్టేటును కొన్నాడు, తత్పర్యవసానంగా భూస్వామ్య ప్రభువుల్లో ఒకడయ్యాడు. డబ్బూ, సుపరిద్రూపమూ, ఆకర్షణీయమైన అందమూ కలిగిన జాన్ లా చిన్నతనంలోనే జూదానికీ, రౌడీతనానికి అల వాటుపడ్డాడు. ఆయన సహచరుల్లో ఒకడు అన్నట్టు, ఇరవై యేళ్ల వయస్సులోనే అన్ని వ్యసనాల్లోనూ అందెవేసిన చెయ్యి లాకి ఎడిన్‌బరో మిక్కిలి చిన్న పట్టణంగా కనిపించడంతో లా లండన్‌కి మకాం ఎత్తేశాడు. స్కాట్లండుకీ, ఇంగ్లండుకీ రాజు ఒకడే అయినా, యితర అన్ని విషయాల్లోనూ స్కాట్లండు యింకా స్వతంత్ర రాజ్యమే.

లండనులో ఈ యువ స్కాట్‌కి Beau Law అంటే అందగాడు అన్న మారు పేరు రూఢి అయింది. 1694 ఏప్రిల్లో ఆయన తన ప్రత్యర్థిని ఒక ద్వంద్వ యుద్ధంలో చంపేశాడు. హత్యానేరానికిగాను కోర్టు లాకి మరణశిక్ష విధించింది. పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తుల మధ్యవర్తిత్వ ఫలితంగా మూడవ విలియం రాజు ఆ స్కాట్‌ని క్షమించాడు. కాని మృతుని బంధువులు ఆయనకి వ్యతిరేకంగా ఓ కొత్త దావా వేశారు. ఆ కేసు పర్యవసానం తేలేదాకా వేచివుండకుండా, తన మిత్రుల సహాయంతో, 30 అడుగుల ఎత్తు గల గోడదూకి, చీలమండ విరగగొట్టుకొని లా జైలునుంచి పారిపోయాడు. ఆయన పోగల చోటు ఒక్కటే: విదేశం. ఆయన హాలండును ఎంచుకున్నాడు.

లా లండన్లో గడిపిన మూడేళ్ల కాలాన్నీ తాగుబోతుల, స్త్రీల సహవాసంలో మాత్రమే గడపలేదు. లోకజ్ఞానయుతమైన విద్యనూ, లెక్కాచారం విషయంలో ప్రతిభనూ, అన్ని రకాల ద్రవ్య వ్యాపార జ్ఞానాన్నీ కలిగిన లా, 1688-89 విప్లవానంతరం ఆ రోజుల్లో లండన్‌లో బిలబిలలాడుతూ వున్న ద్రవ్యవ్యాపారులతో పరిచయం

కలిగించుకున్నాడు. మరికొద్ది సంవత్సరాల తర్వాత బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు స్థాపింప బడింది. ఇంగ్లీషు పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రలో అదొక ముఖ్య ఘటన.

బ్యాంకింగు విషయంలో లా ఒక స్వాప్నికుడు. ఈ మాట యీ రోజున చిత్రంగా కనిపించవచ్చు: ఊహావిహారం, బ్యాంకింగు. కాని అప్పట్లో, అంటే, పెట్టుబడిదారీ పరపతి ఆరంభకాలంలో, దానికి గల అవకాశాలు అపారమైనవిగా కనిపించాయి, పలువురికి అవి అద్భుతమైనవిగా కూడా కనిపించాయి. లా తన రచనల్లో తరచుగా బ్యాంకుల స్థాపననూ, "భారత దేశ ఆవిష్కరణ"తో అంటే భారత, అమెరికా దేశాలకు సముద్ర మార్గాన్ని – యీ మార్గం గుండానే వెండి బంగారాలూ, అపురూప వస్తువులూ యూరప్‌కి వచ్చాయి – కనుగొనడంతో పరపతి పెరుగుదలనూ సరి పోల్చాడంటే, అకారణంగా ఆయన అలా చెయ్యలేదు. తన జీవితకాలమంతా ఆయన, తన బ్యాంకు ద్వారా వాస్కో డ గామ, కొలంబస్ లేక పిజ్జారో సాధించిన దానికన్న ఎక్కువ సాధించగలనని చిత్తశుద్ధితో నమ్మాడు! జాన్ లా అప్పటికింకా పరపతి అపరీక్షిత శక్తికి ఆరాధకుడూ, కవీ, ప్రవక్తా అయ్యాడు.

ఇది ఇంగ్లండులో ఆరంభమై, హాలండులో కొనసాగింది. హాలండులో లా, అప్పట్లో యూరప్‌లోకెల్ల మిక్కిలి పెద్దదీ, అత్యధిక మన్నన కలిగినదీ అయిన ఆంస్టర్‌డామ్ బ్యాంకు కార్యకలాపాలను అధ్యయనం చేశాడు. 1699లో ఆయన పారిస్‌లో ఉన్నట్లు మనం చూస్తాం. అక్కడినుంచి ఆయన, జన్మతః ఇంగ్లీషుదీ, వివాహితా అయిన క్యాథరిన్ సెన్యేర్ అనే యువతిని వెంట బెట్టుకొని ఇటలీకి వెళ్లిపోయాడు. అప్పటినుండి ఆయన చేసిన యాత్రలన్నింటిలోనూ ఆమె ఆయన వెంటనే వుంది. ఓ కొత్త రకం బ్యాంకును స్థాపించాలన్న భావం మనస్సును పీడిస్తూండగా, క్యాథరీనూ, ఏడాది వయస్సు కలిగిన తమ కొడుకూ వెంటరాగా తన యీ భావాన్ని ఆచరణలో పెట్టేందుకుగాను లా 1704లో స్కాట్లండుకి తిరిగివచ్చాడు.

స్కాట్లండు అప్పటికి ఆర్థిక యిబ్బందులతో సతమతమవుతోంది. వర్తకంలో మాంద్యం ఏర్పడింది, నగరాల్లో నిరుద్యోగం తాండవిస్తోంది, వ్యాపార ఉత్సాహం కుంగిపోయింది. లా మరింత మంచిదనుకున్నాడు! ఈ కష్టాల పరిష్కారానికి తన పథకాన్ని ప్రతిపాదిస్తూ, "జాతికి డబ్బును సమకూర్చాలన్న ప్రతిపాదనతో డబ్బు, వర్తకాల పరిశీలన" అన్న శీర్షికతో 1705లో లా ఒక పుస్తకాన్ని ప్రచురించాడు.

విస్తృతార్థంలో లా సిద్ధాంతవేత్త ఏమీ కాదు. ఆయన ఆర్థిక ఆసక్తులు డబ్బు, పరపతుల సమస్యా పరిధిని ఎన్నడూ దాటిపోలేదు. కాని తన పథకాన్ని సముత్సాహంగా సమర్థించుకునే క్రమంలో ఆయన యీ సమస్యపై వెల్లడించిన భావాలు ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో అత్యంత వైరుధ్యపూరితమైన బృహత్తర పాత్ర వహించాయి. లా

వాస్తవ కార్యకలాపాలతో జోడించి – వీటి పర్యవసానాలు బృహత్తరమైనవి – ఆయన ఆర్థికాభిప్రాయాలను పరిశీలించవలసి వుంటుందన్న విషయం స్పష్టం. అయితే, తన తదుపరి రచనల్లో మాదిరిగానే యీ కార్యకలాపాల్లో కూడ, ఎడిన్‌బరో పుస్తకంలో ప్రతిపాదించిన మౌలిక భావాలనే లా కేవలం అమలుపరచాడు.

ఒక వ్యక్తిగా లాని గురించి కొంత విలువైన సమాచారాన్ని మనకు అందజేసిన డ్యూక్ అఫ్ సెంట్ సైమన్ "ఆయన ఒక విధానానికి కట్టుబడిన మనిషి" అన్నాడు. తన విధానానికి సంబంధించిన మౌలిక సూత్రాలను కనుగొన్న తర్వాత అచంచలమైన దీక్షతోనూ, పట్టుదలతోనూ లా దాన్ని బోధించాడు, ఆచరణలో పెట్టాడు.

ఒకానొక దేశపు ఆర్థిక సౌభాగ్యానికి కీలకం ఆ దేశంలో పుష్కలంగా డబ్బు ఉండటంపైన ఆధారపడి వుంటుందని లా వాదించాడు. దానికి అదిగా డబ్బును ఆయన సంపదగా పరిగణించాడని అనుకోరాదు. ఎందుకంటే, నిజమైన సంపద సరుకులూ, ఫ్యాక్టరీలూ, వర్తకమే నని ఆయన గ్రహించాడు. కాని డబ్బు పుష్కలంగా ఉన్నప్పుడు, భూమినీ, శ్రమశక్తినీ, పారిశ్రామిక సంస్థల స్థాపనా కౌశల్లాన్నీ పూర్తిగా వినియోగించు కోవడం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డాడు.

ఆయన యిలా రాశాడు: "దేశీయ వర్తకం ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తుంది, వస్తువుల మారకాన్ని సాధ్యం చేస్తుంది.... దేశీయ వర్తకం డబ్బుపైన ఆధారపడివుం టుంది. డబ్బు తక్కువగా వున్నప్పటికన్న ఎక్కువగా వున్నప్పుడు ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.... మంచి చట్టాలు డబ్బును, దానికి సాధ్యమైనంత పూర్తి చలామణీలోకి తీసుకురావచ్చు. దాన్ని దేశానికి అత్యంత లాభసాటియైన వృత్తుల్లోకి మళ్లించవచ్చు: కాని అధికతర సంఖ్యాకులకు వేతనాలు చెల్లింప కలిగేందుకు అవిధంగా చలామణీ అయ్యే ఎక్కువ డబ్బు లేనప్పుడు ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించడానికి ఏ చట్టాలూ లేవు."*

పాత వ్యాపారవాదులతో లా విభేదిస్తాడనడం స్పష్టం: ఆర్థికాభివృద్ధి కీలకాన్ని ఆయన కూడా చలామణీ రంగంలోనే చూసినా, లోహపు డబ్బును ఆయన పొగిడేం దుకు బదులు తెగిడాడు. రెండు వందల ఏళ్ల తర్వాత బంగారు డబ్బును కీన్స్ "ఆట విక అవశేషం" అన్నాడు. ఈ మాటను లా కూడా అని వుండేవాడే. డబ్బు లోహరూపంలో వుండరాదు. ఆర్థిక వ్యవస్థ అవసరాల మేరకు అది బ్యాంకు సృష్టించే పరపతి రూపంలో – వేరే విధంగా చెప్పాలంటే కాగితపు డబ్బు రూపంలో – వుండాలి. "డబ్బు పెంపకానికి అమలు జరుపబడుతున్న అత్యుత్తమ పద్ధతి బ్యాంకుల వినియోగం."**

---

* J. Law, *Oeuvres complètes*, Vol. 1, Paris, 1934, pp. 14—16.

** ఆదే గ్రంథం, పేజి 46.

లా ఆర్థిక విధానంలో మరో రెండు సూత్రాలు వున్నాయి, వాటి ప్రాముఖ్యం యింతంత అని చెప్పడం కష్టం. మొదటిది, బ్యాంకుల విషయంలో పరపతి విస్తరణ విధానాన్ని, అంటే, బ్యాంకు అధీనంలో వున్న లోహపు డబ్బుకు మించి యింకెన్నో రెట్లు రుణాలను మంజూరుచెయ్యడం. రెండవది, బ్యాంకు ప్రభుత్వానికి చెందివుండాలనీ, అది ప్రభుత్వపు ఆర్థిక విధానాన్ని అమలుజరపాలనీ ఆయన డిమాండుచేశాడు.

దీన్ని మనం కొంత స్పష్టపరచవలసివుంది. ఎందుకంటే, యిటువంటి సమస్యలే — భిన్నమైన పరిస్థితుల్లోనూ, రూపాల్లోనూ — యీనాటికి కూడా వర్తిస్తాయి. ఒకానొక బ్యాంకు సొంతదారులు దాని పెట్టుబడిగా 10 లక్షల పౌనులను మదుపు పెట్టారను కోండి. దీనికి తోడు వాళ్ళకి 10 లక్షల పౌనుల విలువైన బంగారం డిపాజిట్లు లభిం చాయి. ఆ బ్యాంకు 10 లక్షల పౌనుల విలువైన నోట్లను అచ్చువేసి రుణాలు యిస్తుంది. పద్దులు వెయ్యడానికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం కలవారికి ఎవరికైనా, ఆ బ్యాంకు జమాఖర్చుల పట్టీ యిలా వుంటుందని తెలుస్తుంది:

ఆస్తులు		అప్పులు	
బంగారం	20 లక్షలు	పెట్టుబడి	10 లక్షలు
రుణాలు	10 లక్షలు	డిపాజిట్లు	10 లక్షలు
		బ్యాంకు నోట్లు	10 లక్షలు
మొత్తం:	30 లక్షలు	మొత్తం:	30 లక్షలు

ఈ బ్యాంకు పూర్తిగా ఆధారపడదగినది. ఎందుకంటే దాని బంగారపు నిల్వ, డిపాజిట్లకూ, చెల్లింపుకోసం ఏ సమయంలోనైనా డిమాండు చెయ్యదగిన బ్యాంకు నోట్లకూ దీటుగా వుంటుంది. కాని, లా యీ సందర్భంలో సహేతుకమైన ప్రశ్న ఒకటి వేస్తాడు: ఇలాంటి బ్యాంకువల్ల ఎక్కువ ఉపయోగం వుందా? దానివల్ల కొంత ప్రయోజనం లేకపోలేదనుకోండి: అది చెల్లింపును సుకరంచేస్తుంది, బంగారం పోకుం డానూ, అరిగిపోకుండానూ కాపాడుతుంది. కాని, అదే బ్యాంకు ఉదాహరణకు 1 కోటి పౌనుల విలువ కలిగిన నోట్లను జారీచేసి, ఆర్థికవ్యవస్థకు వాటిని సమకూరిస్తే యింకెంతో ఊహించరానంత ఉపయోగకరంగా వుంటుంది. అప్పుడు చిత్రం యిలా వుంటుంది:

ఆస్తులు		అప్పులు	
బంగారం	20 లక్షలు	పెట్టుబడి	10 లక్షలు
రుణాలు	100 లక్షలు	డిపాజిట్లు	10 లక్షలు
		బ్యాంకు నోట్లు	100 లక్షలు
మొత్తం:	120 లక్షలు	మొత్తం:	120 లక్షలు

ఈ బ్యాంకు కొంత నష్ట ప్రమాదం కలిగివుంటుంది. ఉదాహరణకు బ్యాంకు నోట్లు వున్నవాళ్లు 3 కోట్లు విలువైన వాటిని సూరకం కోసం దాఖలుచేస్తే ఏమవుతుంది? బ్యాంకు దివాళా తీస్తుంది, లేక లా రోజుల్లో అంటూవుండినట్లు, చెల్లింపులను నిలిపేస్తుంది. కాని యిది సహేతుకమూ, అవసరమూ అయిన సాహసమని భావిస్తాడు లా. అంతే కాకుండా, ఒక వేళ బ్యాంకు కొంతకాలం తప్పనిసరిగా చెల్లింపులను నిలిపివెయ్యవలసి వచ్చినా, అదేమంత కొంపలు ముంచుకుపోయే విషయం కాదంటాడు ఆయన.

మనం పైన చూసిన ఉదాహరణలో బంగారపు నిల్వ జారీచెయ్యబడిన మొత్తం నోట్లలో 20 శాతం మాత్రమే. మనం డిపాజిట్లను కూడా కలిపితే యీ శాతం యింకా తక్కువ కూడా. బ్యాంకింగు కంతకీ మూలంలో వుండే పాక్షిక నిల్వ సూత్రమనబడేది యిదే. ఈ సూత్రం ధర్మమా అని బ్యాంకులు రుణాలను పెంచి, చలామణీని వృద్ధిచెయ్యగలుగుతాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధిలో యీ పరపతి అతిముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ఈ విషయాన్ని గమనించిన మొట్టమొదటి వారిలో లా ఒకడు.

కాని సరిగా యిదే సూత్రం బ్యాంకింగు వ్యవస్థ సుస్థిరతకు ప్రమాదాన్ని కలిగిస్తుంది. బ్యాంకులు "మరీ ముందుకు కొట్టుకుపోయి," లాభాలకోసం రుణాలను పెంచెయ్యవచ్చు. అటువంటి సందర్భాల్లోనే అవి దివాళా తీసే సంభావ్యత ఏర్పడుతుంది. అటువంటి దివాళాలకు ఆర్థిక వ్యవస్థమీద తీవ్రమైన దుష్ప్రభావాలు వుంటాయి.

మరో ప్రమాదం, లేక అదే ప్రమాదపు మరో పార్శ్వం ఏమిటంటే, బ్యాంకు సామర్థ్యాలు రాజ్యంచేత సొమ్ముచేసుకోబడుతాయి. ఆర్థిక వ్యవస్థయొక్క వాస్తవావసరాలను తీర్చడానికిగాక, కేవలం దేశపు బడ్జెట్ లోటును భర్తీచేసేందుకు మాత్రమే ఒక బ్యాంకు తన నోట్ల జారీని పెంచేలా నిర్బంధింపబడిందనుకోండి, అప్పుడేం జరుగుతుంది? "ద్రవ్యోల్బణం" అన్న పదం అప్పటికింకా సృష్టింపబడలేదు. కాని ఆ ద్రవ్యోల్బణమే లా బ్యాంకుకూ, అది ఏ దేశంలో పనిచేస్తోందో ఆ దేశానికీ ముప్పుగా పరిణమించివుండేది.

లా పరపతి ద్వారా లభించే సౌకర్యాలనే చూశాడుగాని, దాని ప్రమాదాలను చూడలేదు, చూడలేకపోయాడు. ఆచరణలో ఆయన ఆర్థిక విధానంలోని ప్రధానమైన బలహీనతా, చివరకు దాని పతనానికి కారణమూ కూడా యిదే. లా అమాయకంగా పరపతినీ, డబ్బునీ పెట్టుబడితో సమానంగా పరిగణించాడు. లా అభిప్రాయాల్లోని సైద్ధాంతిక లోపం యిదే. రుణాలను విస్తరింపజేసి, డబ్బును జారీచెయ్యడం ద్వారా బ్యాంకు పెట్టుబడిని సృష్టిస్తుందనీ, తద్వారా సంపదనూ, ఉద్యోగాలనూ పెంపొందిస్తుందనీ ఆయన భావించాడు. కాని ఉత్పత్తిని విస్తృతంచేసేందుకు అవసరమైన వాస్తవ శ్రమ, పాదార్థిక వనరులకు ఏ పరపతీ ప్రత్యామ్నాయం కాజాలదు.

లా తన మొదటి పుస్తకంలో ప్రతిపాదించి, మరో పది పదిహేనేళ్ల తర్వాత భారీ ఎత్తున అమలుజరిపిన పరపతి కార్యకలాపాలు ఆయన విధానానికి ద్రవ్యపరమైన పరమ దుస్సాహసికతత్వాన్ని కల్పించాయి. లాని "పరపతియొక్క ప్రధాన ప్రతినిధిగా"గా వర్ణించి, మార్క్స్ వ్యంగ్యంగా, అటువంటివాళ్లు "దగాకోరు, ప్రవక్తల వ్యక్తిత్వ సమ్మిశ్రమం"*గా వుంటారని పేర్కొన్నాడు.

పారిస్‌పై విజయం

బ్యాంకును స్థాపించాలన్న పథకాన్ని స్కాటిష్ పార్లమెంటు తిరస్కరించింది. లా పదేళ్ల క్రితం చేసిన నేరాన్ని క్షమించేందుకు ఇంగ్లీషు ప్రభుత్వం రెండు సార్లు నిరాకరించింది. ఇంగ్లండు, స్కాట్లండుల సమైక్యతా చట్ట సన్నాహ సందర్భంగా లా మరోమారు యూరప్ ఖండానికి తరలిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ ఆయన వృత్తి జూదరిగా గడిపిన సంగతి తెలిసినదే. ఆయన హాలండు, ఇటలీల్లో, ఫ్లాండర్సు, ఫ్రాన్సుల్లో, ఒక్కొక్కమారు కుటుంబ సమేతంగా, ఒక్కొక్కమారు ఒంటరిగా, అన్ని చోట్లా జూదమాడుతూ, అంతే కాకుండా సెక్యూరిటీలలో, నగల్లో, పూర్వ మహా చిత్ర కారుల చిత్రాల్లో చట్టావ్యాపారం చేస్తూ కాలం గడిపాడు.

తన "పర్షియన్ లేఖల"లో (1721)లో మాంటెస్క్యూ యూరప్ పర్యటన సాగిస్తున్న ఒక పర్షియన్ నోట వ్యంగ్యంగా యీ కింది మాటలు అనిపిస్తాడు: "జూదం యూరప్ అంతటా ఓ పెద్ద ఫేషను. జూదరి కావడం ఓ రకమైన హోదా. జూదరి అన్న పేరే ఉన్నత వంశంలో పుట్టుకకీ, సంపదకీ, నిజాయితీకీ మారుపేరైంది. ఆ పేరు కలిగిన వారందర్నీ అది నిజాయితీపరుల శ్రేణిలో నిలుపుతోంది...."

అదిగో సరిగా ఆ పద్ధతిలోనే లా సామాజిక హోదానూ, సంపదనూ సంపాదించు కున్నాడు. జూదరిగా ఆయన నైపుణ్యాన్ని గూర్చి అభూతమైన కథలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఆయన మనోనిబ్బరం, బుద్ధి నైశిత్యం, అపారమైన జ్ఞాపకశక్తి, అదృష్టం ఆయనకి పెద్ద విజయాలను చేకూర్చిపెట్టాయి. చివరకు పారిస్‌లో స్థిరపడాలని నిర్ణ యించుకున్నప్పుడు లా 16,00,000 లివర్లను తనతో ఫ్రాన్సుకు తీసుకెళ్లాడు. అయితే పారిస్ తన జూదం ద్వారానూ, చట్టావ్యాపారం ద్వారానే ఆయనకి ఆకర్షణ గొలుపలేదు. ద్రవ్య సంక్షోభం మరింత సంక్లిష్టమైన కొద్దీ, తన పథకానికి యిక్కడ ఆమోదం లభిస్తుందని ఆయనకి మరింతగా అనిపించింది. ప్రభుత్వ ఖజానాలు ఖాళీగా

---

* Karl Marx, *Capital*, Vol. III, Moscow, 1971, p. 441.

వున్నాయి, దేశ రుణం అపారంగా వుంది, పరపతి నాసిగా వుంది. ఆర్థిక వ్యవస్థలో స్తబ్ధతా, మాంద్యం తాండవిస్తున్నాయి. బ్యాంకు నోట్లను జారీచేసే హక్కుగల స్టేట్ బ్యాంకు స్థాపన ద్వారా వీటన్నింటినీ సరిదిద్దుతానని లా ప్రతిపాదించాడు.

1715 సెప్టెంబరులో పధ్నాల్గవ లూయీ మరణంతో ఆయనకి అవకాశం చేజిక్కింది. సింహాసన వారసుడు యుక్త వయస్కుడయ్యేదాకా, దేశపాలకుడు అయ్యే సద వకాశంగల పాతపాలకుని పినతండ్రి ఆర్లియన్స్ డ్యూక్ ఫిలిప్‌కి లా తన పథకాన్ని గురించి అంతకు ముందే నూరిపోసివుంచాడు. ఫిలిప్ యీ స్కాట్‌వానిలో విశ్వాసం పెంచుకో నారంభించాడు. రీజెన్సీకి యితర పోటీదార్లను తోసివేసి, అధికారాన్ని హస్తగతం చేసు కున్న మీదట ఆయన లాని నేరుగా పిలిపించుకున్నాడు.

రీజెంట్ ఉన్నతవంశ సలహాదార్ల ప్రతిఘటననూ, తీవ్రవిచర్యలపట్ల భయం కలిగి, యీ విదేశస్తునిపట్ల నమ్మకంలేని పారిస్ పార్లమెంటు వ్యతిరేకతనూ అధిగమిం చేందుకు ఆయనకి ఆర్నెల్లకు పైగా పట్టింది. లా స్టేట్ బ్యాంకు స్థాపన భావనను వదులుకొని, ఒక ప్రైవేటు జాయింట్ స్టాక్ బ్యాంకు స్థాపనకు ఒప్పుకోవలసి వచ్చింది. అయితే యిదొక ఎత్తుగడ మాత్రమే. ఆ బ్యాంకు ఆదినుంచీ కూడా రాజ్యంతో సన్నిహిత సంబంధం కలిగే వుంది. 1716లో మేలో స్థాపింపబడిన ఆ బ్యాంక్ జనరేల్ (సార్వత్రిక బ్యాంకు), మొదటి రెండు సంవత్సరాల్లోనే మహా విజయవంతంగా కార్య కలాపాలు సాగించింది. ప్రతిభావంతుడైన పాలనా దక్షుడు, బుద్ధివైశిత్యం కలిగిన వ్యాపారస్తుడు, సిద్ధహస్తుడైన రాజకీయవేత్తా, దౌత్యనీతిజ్ఞుడూ అయిన లా, రీజెంటు తోడ్పాటుతో దేశపు యావత్తు డబ్బు, పరపతి వ్యవస్థనూ ఆత్మవిశ్వాసంతో నిర్వహిం చాడు. బ్యాంక్ జనరేల్ నోట్లు—యీ దశలో వాటి జారీని లాయే విజయవంతంగా అదుపుచేశాడు—చలామణీలో పెట్టబడ్డాయి. లోహపు డబ్బుతో పోల్చినప్పుడు అవి తరచుగా అదనపు మొత్తానికి కొనబడేవి. పారిస్ వడ్డీవ్యాపారస్తులతో పోల్చినప్పుడు ఆ బ్యాంక్ సరసమైన వడ్డీకి రుణాలిచ్చి, బుద్ధిపూర్వకంగా వాటిని పరిశ్రమ, వాణిజ్యా ల్లోకి మళ్లించేది. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ చిహ్నాలు కనిపించసాగాయి.

ఘోర వైఫల్యం

లా దేశానికి గాక, భావానికి భక్తుడు. ఆయన యీ భావాన్ని మొదట స్కాట్లాం డుకీ, ఇంగ్లండుకీ, సావోయ్ డ్యూక్‌కీ, జినోవా రిపబ్లిక్‌కీ సమర్పించేందుకు విఫల ప్రయత్నం చేశాడు. చివరకు దాన్ని ఫ్రాన్సు ఆమోదించినప్పుడు, ఆయన నిజాయితీగా తనను

తానొక ఫ్రెంచివాడుగా పరిగణించుకున్నాడు. ఆయన వెన్వెంటనే ఫ్రెంచి పౌరసత్వాన్ని స్వీకరించి, దరిమిలా, తను విధానం విజయం పొందడానికి అవసరమని తను భావించి నప్పుడు కేథలిక్‌గా మారాడు.

లా నిజంగానే తన భావాన్ని విశ్వసించాడనడంలోనూ, దాన్ని ఫ్రాన్సులో ఆచరణలో పెట్టడంలో తన డబ్బునే కాకుండా, తన మనస్సును కూడా మగ్నం చేశాడనడంలోనూ సందేహం లేదు. తను దొంగిలించగలిగినంత దొంగిలించి, అలా అక్రమంగా సంపాదించిన దాన్ని తరలించుకుపోయే సామాన్య మోసగాడు కాదు లా. దరిమిలా తను రాసిన "నిర్దోషిత్వ నిరూపక జ్ఞాపికలు"లో ఆయన తరచుగా, అదే కనుక తన పథకమైన ట్లయితే తన సంపదనంతనీ ఫ్రాన్సుకి తీసుకొచ్చి వుండేవాడిని కాననీ, తనింకా అధికా రంలో వున్నప్పుడు తన ఆస్తులు కొన్నింటిని విదేశాలకు తరలించి వుండేవాడిననీ పేర్కొంటూ వచ్చాడు. "ఆయన స్వభావంలో దురాశగాని, టక్కరితనం గాని లేదు" అన్న డ్యూక్ ఆఫ్ సెంట్ సైమన్ మాటలను మనం విశ్వసించవచ్చు. కాని ఆయన విధానపు తిరుగులేని తర్కం మూలంగానే ఆయన మోసగాడుగా తయారుచెయ్య బడ్డాడు!

1715 డిసెంబరులో రీజెంటుకు రాసిన లేఖలో లా మరోమారు తన భావాలను వివరించాడు. దానిలో వంచన వాసనకొట్టే నిగూఢమైన భాగం ఒకటుంది: "కాని బ్యాంక్ ఒక్కటే కాదు నా భావం, నా భావాలన్నింటిలోకీ అదే అతి గొప్పదీ కాదు. నేనొకదాన్ని సృష్టిస్తాను. అది ఫ్రాన్సుకు అనుకూలంగా తను సాధించే మార్పులతో యూరప్‌ను దిగ్భ్రాంతం చేస్తుంది. ఆ మార్పులు ఎలాంటివంటే, ఇండియాను కను గొనడం మూలంగానూ, లేక పరపతిని ప్రవేశపెట్టడం ద్వారానూ కలిగినవాటికన్న మరింత ముఖ్యమైనవి. ఈ పని చెయ్యడం ద్వారా ఏలినవారు రాజ్యాన్ని, అది యీనాడు దిగజార్చబడిన దుస్థితిలోనుంచి బయటపడేసి, దాన్ని, అది ముందె న్నడూ లేనంత బలవత్తరంచేసి, దాని ఆదాయ వనరుల్లో ఒక వ్యవస్థను నెలకొల్పి, వ్యవసాయాన్నీ, కార్ఖానాలనూ, వాణిజ్యాన్నీ పునరుద్ధరించి, వాటికి తోడ్పాటునిచ్చి, అభివృద్ధి చెయ్యగలుగుతారు."*

పథకకర్తలు ఎప్పుడూ పాలకులకు బంగారం పరచిన బాటలను సమకూరుస్తామని వాగ్దానాలు చేస్తూవుంటారు. కాని యితగాడు ఒక ఆర్థిక స్వర్ణయోగి మాదిరిగా ఒక రకమైన పరుసవేదినే యిస్తానని వాగ్దానంచేస్తున్నాడు. మరో రెండేళ్ల తర్వాత యీ అస్పష్ట వాగ్దానాల వెనుక వున్నదేమిటో స్పష్టపడింది. 1717 చివర లా

* J. Law, *Oeuvres complètes*, Vol. 2, Paris, 1934, p. 266.

బ్రహ్మాండమైన తన రెండవ సంస్థను — ఇండీస్ కంపెనీని — స్థాపించాడు. ఆదిలో అది, అప్పట్లో ఫ్రాన్సుకు చెందిన మిసిసిపి ప్రాంతాన్ని వలసగా మార్చేందుకు ఉద్దేశింపబడిన కారణంగా, మామూలుగా అది మిసిసిపి కంపెనీ అని పిలువబడుతూ వుండేది.

బయటకు యిది ప్రత్యేకించి కొత్తదేమీ కాదు. ఒక శతాబ్దానికి పైగా ఈస్టిండియా కంపెనీ ఇంగ్లండులో మూడు పువ్వులూ ఆరు కాయలుగా వృద్ధిచెందుతోంది. పోతే అటువంటి సంస్థే హాలండులో ఒకటుంది. కాని లా కంపెనీ వాటికి భిన్నమైనది. అది, తమ మధ్య తాము వాటాలను పంచుకున్న వ్యాపారస్తుల చిన్న బృందం కాదు. మిసిసిపి కంపెనీ వాటాలు పెట్టుబడిదారుల్లో సాపేక్షంగా ఓ పెద్ద బృందానికి అమ్మకానికీ, చట్టా బజారులో చురుకైన చలామణీకీ ఉద్దేశింపబడ్డాయి. ఆ కంపెనీ ప్రభుత్వంతో అత్యంత సన్నిహితంగా ముడిపడివుంది. అది పలురంగాల్లో ప్రభుత్వం నుంచి విస్తృతమైన ప్రత్యేక సౌకర్యాలనూ, గుత్తహక్కులనూ పొందింది. దాని నాయకత్వంలో తొణుకుబెణుకుల్లేని స్కాట్ పక్కనే కూర్చున్నది మరెవరో సామాన్యుడు కాదు, సాక్షాత్తూ ఫ్రాన్సు రీజెంటైన ఫిలిప్ ఆఫ్ ఆర్లియన్సే. ఈ కంపెనీ, 1719 మొదట్లో ప్రభుత్వానికి దఖలుపడి, రాయల్ బ్యాంక్‌గా పిలువబడిన బ్యాంక్ జనరేల్‌తో కలిపెయ్యబడింది. ఆ బ్యాంక్ కంపెనీలో వాటాలను కొనేందుకు పెట్టుబడిదార్లకు రుణాలిచ్చి, దాని ద్రవ్య వ్యవహారాలను నిర్వహించింది. ఆ రెండు సంస్థల మేనేజిమెంటు సూత్రాలూ లా చేతుల్లో కేంద్రీకరింపబడ్డాయి.

ఈ విధంగా, లా రెండవ "గొప్ప భావం" పెట్టుబడి కేంద్రీకరణ, పెట్టుబడి సాహచర్యం. ఈ రంగంలో కూడా యీ స్కాట్ ఒక ప్రవక్త మాదిరిగా, తన కాలానికి ఓ శతాబ్దమో, అంతకన్న ఎక్కువో ముందువాడుగా కనిపించాడు. 19వ శతాబ్దం మధ్య దాకా పశ్చిమ యూరప్‌లోనూ, అమెరికాలోనూ జాయింట్ స్టాక్ కంపెనీల సత్వరాభివృద్ధి మొదలు కాలేదు. కాగా యీనాడు అవి, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో మొత్తం ఆర్థిక వ్యవస్థలోనూ, ప్రత్యేకించి భారీ ఉత్పత్తిలోనూ విస్తృతంగా వ్యాపించి వున్నాయి. భారీ పరిశ్రమలు ఒకళ్లో లేక చాలామందో పెట్టుబడిదారుల — వారు ఎంత ధనికులైనప్పటికీ — అందుబాటులో లేవు. వాటికి పలువురు పారిశ్రామిక యజమానుల సంయుక్త పెట్టుబడి అవసరం. డబ్బును సమకూర్చేది చిన్నవాటాదారులు మాత్రమే అయినా ఘటనా క్రమంపై వారికి యీషణ్మాత్రపు పలుకుబడి కూడా ఉండదనడం స్పష్టం. వ్యాపారపు అసలు నిర్వాహకులు పైన వున్నవాళ్లు. మిసిసిపి కంపెనీ విషయంలో ఆ పైవాళ్లు లా, ఆయన సహచరుల్లో కొందరూను. జాయింట్ స్టాక్ కంపెనీల ప్రగతిశీల పాత్రను గురించి మార్క్స్ యిలా చెప్పాడు:

"రైల్వే నిర్మాణానికి సరిపడేటంత పెట్టుబడి కొద్దిమంది విడి పెట్టుబడిదారుల దగ్గర పోగుపడేదాకా వేచి వుండవలసి వచ్చినట్లయితే ప్రపంచంలో యింకా యిప్పటికీ రైళ్లు ఉండి వుండేవి కావు. కేంద్రీకరణ ఇందుకు విరుద్ధంగా, జాయింట్ స్టాక్ కంపెనీల ద్వారా దీన్ని త్రుటికాలంలో సాధించింది."*

వాటాల కొనుగోళ్లలోనూ, అమ్మకాల్లోనూ స్టాక్ జాబింగూ, చట్టావ్యాపారమూ జాయింట్ స్టాక్ లావాదేవీలతో తప్పనిసరిగా ముడిపడివుంటాయి. లా ఆర్థిక విధానం యింతకు ముందెన్నడూ కనివిని ఎరుగని స్థాయిలో విచ్చలవిడి చట్టావ్యాపారానికి దారితీసింది. మొదటి సంవత్సరంలో కంపెనీ సుదృఢంగా స్థిరపడ్డాక, వాటాల ధరను పెంచి, వాటి అమ్మకాన్ని విస్తరింపజేసేందుకు లా గట్టి చర్యలు తీసుకున్నాడు. మొదటి చర్యగా ఆయన, అప్పట్లో ఒక్కొక్కటి 250 లివర్లు ఖరీదు మాత్రమే వున్న 500 లివర్ల వాటాలను రెండు వందలను కొన్నాడు. ఆర్నెల్ల కాలంలో, అప్పట్లో దాని ఖరీదు ఎంత ఉందన్నదానితో ప్రసక్తి లేకుండా, ప్రతి ఒక్క వాటాకూ ముద్రిత విలువయైన 500 లివర్లను చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. పలువురికి పైకి అసందర్భంగా కనిపించే యీ అసందర్భపు లావాదేవీ వెనక బుద్ధిసూక్ష్మతతో కూడిన కొన్ని అంచనాలు వున్నాయి. దరిమిలా అవి సహేతుకమైనవేనని తేలింది. ఆర్నెలల్లో ఆ వాటాల విలువ ముద్రిత విలువను మించి అనేక రెట్లు పెరిగింది. దానితో లా ఓ పెద్ద మొత్తం లాభాన్ని జేబులో వేసుకున్నాడు.

కాని యిది కాదు అసలు విషయం. ఈ లక్షా యిప్పుడాయనకి ప్రత్యేకించి ముఖ్యమైనదేమీ కాదు. ఆయన లక్ష్యం వాటాలపట్ల దృష్టిని ఆకర్షించడం, కొనుగోలుదార్లలో ఆసక్తిని రేకెత్తించడం. అదే సమయంలో ఆయన కంపెనీ వ్యాపారాన్ని విశేషమైన శక్త్యుత్సాహాలతో, భారీ స్థాయిన విస్తరింపజేస్తున్నాడు. ఆయన వాస్తవ వ్యాపారాన్ని నిపుణమైన ప్రచారంతో జోడించి, తద్వారా దీనిలో కూడా భవిష్యదాచరణకు ఒరవడి దిద్దాడు.

లా మిసిసిపి లోయను జనావాసంగా తయారుజేసి, రీజెంటు గౌరవార్థం న్యూ ఆర్లియన్స్ పేర ఒక పట్టణాన్ని స్థాపించాడు. ఐచ్ఛికంగా వచ్చి అక్కడ స్థిరపడేవాళ్లు తగినంత మంది లేకపోవడంతో, కంపెనీ అభ్యర్థన మేరకు ప్రభుత్వం దొంగలనూ, దేశదిమ్మరులనూ, వ్యభిచారులనూ అమెరికాకు రవాణా చెయ్యడం మొదలుపెట్టింది. అదే సమయంలో లా వ్యామోహం గొలిపే రకరకాల సాహిత్యాన్ని అచ్చువేయించి పంపిణీ

* Karl Marx, *Capital*, Vol. I, Moscow, 1972, p. 588.

చేసేందుకు ఏర్పాట్లు చేశాడు. వాటిలో ఆయన అత్యంతైశ్వర్యవంతమైన దేశాన్ని గురించి వర్ణింపజేశాడు. ఆ దేశవాసులు ఫ్రెంచివారిని కలుసుకునేందుకు సంతోషపడ తారనీ, వీరు తమతో తీసుకెళ్లే చిల్లరమల్లర అలంకరణ వస్తువులకు బదులు బంగారాన్నీ, మణిమాణిక్యాలనూ, తదితర విలువైన వస్తువులనూ మార్పిడి చేసుకునేందుకు వారు సర్వసంసిద్ధంగా వుంటారనీ ప్రచారం చేయించాడు. రెడ్ ఇండియన్లను కేథలిక్కులుగా మార్చేందుకుగాను ఆయనక్కడకి జెస్యూట్లను సైతం పంపాడు.

లా కంపెనీ దివాళా దశలో వున్న కొన్ని ఫ్రెంచి వలస కంపెనీలను స్వాహా చేసి, సర్వశక్తివంతమైన గుత్త సంస్థగా తయారైంది. దానికి వున్న కొద్ది డజన్ల పాత నౌకలు లా మాటల మూలంగానూ, ఆయన సహాయకుల రాతల మూలంగానూ ఫ్రాన్సుకి వెండినీ, సిల్కు పుట్టాలనూ, సుగంధ ద్రవ్యాలనూ, పొగాకునూ తీసుకెళ్లే విస్తార మైన ఓడదళాలుగా మార్చివెయ్యబడ్డాయి. ఫ్రాన్సులో మటుకు ఫ్రాన్సులో ఆ కంపెనీ శిస్తు వ్యవసాయాన్ని చేబట్టింది. న్యాయంగా చెప్పుకోవాలంటే, తనకు ముందరి కంపె నీలకన్న ఆ పనిని చాలా హేతుబద్ధంగానూ, ఎంతో సమర్థంగానూ చేసింది. మొత్తంమీద యిదంతా ప్రతిభావంతమైన, నిర్వహణ, సాహసికమైన పరిశ్రమ, తీవ్రమైన దుస్సా హసం, పచ్చి దగాల విలక్షణ సమ్మిశ్రమం.

ఆ కంపెనీ అత్యంత స్వల్ప డివిడెండ్లనే చెల్లించినప్పటికీ, దాని వాటాల విలువ 1719 వసంతకాలంలో రబ్బరు బుడగల మాదిరిగా ఆకాశాన్ని అంటింది. లా సరిగా దీనికోసమే నిరీక్షిస్తున్నాడు. నేర్పుగా మార్కెట్ ధోరణిని మలుస్తూ, ఆయన కొత్తగా మళ్లీ మళ్లీ వాటాలను జారీచేయించి, వాటిని అంతకంతకు ఎక్కువ ధరలకు అమ్మ సాగాడు. జారీచెయ్యబడిన వాటాలకన్న వాటికిగల డిమాండు ఎక్కువైంది. కొత్త వాటాలు ప్రకటింపబడినప్పుడు వేలాదిమంది కంపెనీ కార్యాలయాల ముందు రాత్రింబగళ్లు క్యూలలో నిలబడ్డారు. 1719 సెప్టెంబరు నాటికి ఆ కంపెనీ 500 లివర్ల వాటాలను 5,000 లివర్లకు అమ్ముతున్నప్పటికీ ఆ వాటాలకు యింత డిమాండు ఏర్పడింది. పలుకుబడి గలవాళ్లూ, ప్రభువర్గం వాళ్లూ క్యూలలో అయితే నిలబడలేదుగాని, వాటాలకు సొమ్ముచెల్లించేందుకు అనుమతించవల సిందిగా నేరుగా లానూ, తదితర డైరెక్టర్లనూ అభ్యర్థించేవారు. జారీ అయిన నాడు 5,000 లివర్ల ఖరీదుండే వాటా, ఆ మర్నాడు స్టాక్ ఎక్స్చేంజిలో 7,000 లేక 8,000 లివర్లకు అమ్ముకోవడం సాధ్యం! చరిత్ర కొన్ని అసాధారణమైన ఘటన లను నమోదుచేసింది: చిమ్నీగుండా దిగి లా కార్యాలయంలోకి వెళ్లేందుకు మనుషులు ప్రయత్నించడం, లేక ఒక కులీన స్త్రీ, శృంగారపురుషుడైన ఆ పెద్దమనిషి దృష్టిని

ఆకర్షించి, ఆయన తన అభ్యర్థనను వినేలా చేసుకునేందుకు గాను, తన బండివాడిని లా యింటిముందు బండిని బోల్తా కొట్టించమని ఆజ్ఞాపించడం. లాను కలుసుకునేందుకు దరఖాస్తులు పెట్టుకున్న వారి దగ్గరనుండి తీసుకున్న లంచాలతో ఆయన కార్యదర్శి పెద్ద సంపదను పోగేసుకున్నాడు.

రీజెంట్ ఫిలిప్ తల్లి — వ్యంగ్యధోరణిగల ముసలమ్మ — విడ్డూరమైన యీ కాలాన్ని గురించి జర్మనీలోని తన బంధువులకు రాసిన లేఖల్లో అనేక విషయాలు నమోదు చేసింది: "జనం లా చుట్టూ రాత్రింబగళ్లన్న విచక్షణ లేకుండా ముసురుతున్నారు. ఒక డచెస్ బహిరంగంగా ఆయన చేతిని ముద్దుపెట్టుకుంది. డచెస్‌లే ఆయన చేతులను ముద్దుపెట్టుకుంటూవుంటే, ఆయన శరీరంలోని ఏ యితర భాగాలను గౌరవించడానికి యితర స్త్రీలు సిద్ధపడుతున్నారో?" 1719 నవంబరు 9వ తేదీగల ఒక లేఖలో ఆమె యిలా పేర్కొంది: "ఇటీవల కొందరు స్త్రీల సమక్షంలో, ఆయన గది విడిచి బయటకు వెళ్లాలన్న కోర్కెను వెల్లడించాడు. వాళ్లు ఆయన్ని బయటకు పోనివ్వలేదు. ఆయన బయటకు వెళ్లవలసిన కారణం చెప్పక తప్పలేదు. 'ఓస్, యింతే కదా,' 'దానిదేముంది, మీ దేహబాధ తీర్చుకోండి, మేమిక్కడ కబుర్లు చెప్పుకుంటూ వుంటాం' అన్నారు వాళ్లు. అంతే, వాళ్లు ఆయనతోనే ఉండిపోయారు."*

స్టాక్ ఎక్స్చేంజి పెరిగి, పెద్దదైన కెన్‌కమ్పువా వీధిలో యింతకన్న చిత్రమైన విషయాలు సంభవిస్తున్నాయి. తెల్లవారుజామునుండి సాయంత్రందాకా కొనుగోళ్లు, అమ్మకాలు చేసే, ధరలు అడుగుతూ, కూడికలు వేసుకునే గుంపులతో అది కిటకిటలాడుతూ వుండేది. 500 లివర్ల వాటాలు 10,000కు, ఆటుతర్వాత 15,000కు చేరుకుని, చివరకు 20,000 దగ్గర ఆగాయి. ఆకస్మిక ఐశ్వర్య సామూహిక తాండవం అన్ని శ్రేణులవారినీ ఏకంచేసింది. వివిధ శ్రేణులకు చెందిన వీళ్లు యితరత్రా మరెన్నడూ — చివరకు చర్చిలో సైతం — కలవరు. కులీన స్త్రీ గుర్రబ్బండివాడిని రాసుకుపూసుకొని తిరిగింది. ప్రభువు ద్వారపాలకుడితో గీసిగీసి బేరాలాడాడు. క్రైస్తవ మఠాధిపతి అంగడి యజమానితో లెక్కలు తేల్చుకున్నాడు. ఇక్కడ వున్నదల్లా ఒకే ఒక్క దేవుడు. అది డబ్బు!

వాటాలకు మింజావలె వెండి బంగారాలను తీసుకునేందుకు జనం సంకోచించారు. ఈ హఠాత్ సమృద్ధి శిఖరస్థాయిలో వున్నప్పుడు 10 వాటాల ఖరీదు 1.4 లేక 1.5 టన్నుల వెండి! దాదాపు చెల్లింపులన్నీ నోట్లలోనే జరుగుతున్నాయి. ఈ కాగితపు

---

* C. Kunstler, *La vie quotidienne sous la Régence*, Paris, 1960, p. 121.

సంపద అంతా – వాటాలు, బ్యాంకు నోట్లు – ఆ ద్రవ్య ఐంద్రజాలికుడైన లా సృష్టి.

1720 జనవరిలో లా అధికారికంగా ద్రవ్య శాఖ కంట్రోలర్ జనరల్ అయ్యాడు. వాస్తవానికి ఆయన దేశపు ద్రవ్య వనరులను చాలకాలంనుండే అజమాయిషీ చేస్తున్నాడు. కాని సరిగా అదే సమయంలో ఆయన ఆర్థిక విధానపు కాళ్ల కింద నేల కంపించసాగింది.

కొత్తగా జారీచేసిన వాటాల ద్వారా సొమ్ము చేసుకున్న విస్తారమైన మొత్తాలను కంపెనీ ఎక్కడ మదుపు పెట్టింది? దానిలో ఓ చిన్న మొత్తం ఓడలకోసం, సరుకుల కోసం, ఎక్కువ భాగం ప్రభుత్వ రుణపత్రాలపైనా వినియోగింపబడ్డాయి. బాండ్లను, వాటి సొంతదారులనుండి కొనెయ్యడం ద్వారా నిజానికి విస్తారమైన జాతీయ రుణం మొత్తాన్నంతనీ (200 కోట్ల లివర్లదాకా) అదే భరించింది. ద్రవ్య వ్యవస్థలో లా వాగ్దానం చేసిన క్రమం యిదే. అంతకంతకు మరిన్ని ఎక్కువ వాటాలను అమ్మకానికి పెట్టడం ఎలా సాధ్యం? లా బ్యాంకు, లక్షలాది కొత్త నోట్లను అచ్చు వేస్తూ వాటిని చలామణీ చెయ్యడం ద్వారానే యిది సాధ్యమైంది.

ఈ పరిస్థితులు ఎక్కువ కాలం సాగలేకపోయాయి. లా యీ విషయాన్ని గుర్తించ నిరాకరించాడు. కాని ఆయనకి గల పలువురు శత్రువులూ, ఆయన కీడు కోరేవారూ, అలాగే పట్టినే దూరదృష్టిగల చట్టావ్యాపారులూ అప్పటికే యీ విషయాన్ని గ్రహించారు. వాళ్ళు సహజంగానే తమ వాటాలనూ, బ్యాంకు నోట్లనూ వదిలించుకోవాలని తొందరపడ్డారు. ఇందుకు ప్రతిగా వాటాలకు స్థిరమైన ధరను దృఢపరచడానికీ, నోట్లకూ లోహానికీ మారక పరిమితి నెలకొల్పడానికీ లా పూనుకున్నాడు. కాని వాటాలకు మద్దతు నిచ్చేందుకు డబ్బు అవసరం గనుక, లా డబ్బును అంతకంతకు అధికంగా అచ్చువేశాడు. ఆ నెలల్లో ఆయన జారీచేసిన పలు ఆదేశాలలో గందరగోళ సూచనలు కనిపిస్తాయి. పోరాటంలో లా అపజయం పాలవుతున్నాడు. ఆయన ఆర్థిక విధానం కూలిపోతోంది. 1720 ఆకురాలు కాలం నాటికి నోట్లు ద్రవ్యోల్బణపు కాగితం డబ్బుగా మారిపోయాయి. వాటి విలువ వెండి రూపంలో ముద్రిత విలువలో నాలుగో వంతు మాత్రమే వుంది. అన్ని వస్తువుల ధరలూ ఆకాశాన్ని అంటాయి. పారిస్‌లో ఆహార కొరత ఏర్పడింది, జనంలో అసంతృప్తి పెరిగింది. నవంబరులో నోట్లకు చట్టబద్ధ చెల్లింపు విలువ లేకుండా పోయింది. లా విధాన పతనం మొదలైంది.

లా తన పోరాటాన్ని తుదికంట కొనసాగించాడు. జూలైలో చెల్లాకాని పత్రాలకు చట్టబద్ధ ద్రవ్యాన్ని చెల్లించమంటూ తనను చుట్టుముట్టిన క్రుద్ధులైన జన

సమూహం మధ్యనుంచి లా కష్టంమీద బయటపడ్డాడు. రీజెంట్ భవనంలో తలదాచు కోవడం లాకి కష్టసాధ్యమైంది. అందరూ ఆయన ముఖం గుంటలు పట్టిందనీ, ఆయన సహజసిద్ధమైన చిత్త స్థైర్యాన్నీ, మర్యాదా మన్ననలనూ కోల్పోయాడనీ అన్నారు.

లానీ, రీజెంటునీ కూడా వెక్కిరిస్తూ అనేక లొల్లాయి పదాలూ, కథలూ, వ్యంగ్య చిత్రాలూ పారిస్‌లో ప్రచారమయ్యాయి. వాటాల చట్టావ్యాపారం ద్వారా రెండున్నర కోట్ల లివర్లను కూడబెట్టాడనీ, వాటిని విలువైన వస్తువుల్లోకి మార్చు కున్నాడనీ చెప్పబడే బూర్బన్ డ్యూక్, ఆయనిప్పుడు ప్రమాద పరిధినుండి బయటపడ్డా డని లాకి హామీ యిచ్చాడు. పారిస్‌వాసులకు తాము ఎగతాళి చేసేవారిని చంపే అలవాటు లేదు. కాని లాకి తద్భిన్నంగా ఆలోచించేందుకు కారణాలు కనబడ్డాయేమో, తను మంత్రి పదవినుండి అప్పటికే తొలగింపబడినా కూడా, మంచి బందోబస్తుగా అంగ రక్షకులు తన చుట్టూ లేనిదే ఎన్నడూ బయటకు వెళ్లేవాడు కాదు. లాని ఆదినుంచీ వ్యతిరేకిస్తూ వచ్చిన పారిస్ పార్లమెంటు, విచారణ జరిపి, ఆయన్ని ఉరితియ్యాలని డిమాండు చేసింది. డ్యూక్‌కి విశ్వాసపాత్రులైన సలహాదారులు లాని కనీసం జైలులో పెట్టడం మంచిదని సలహా యిచ్చారు. అశాంతిని చల్లబరచేందుకుగాను తన అభిమాన పాత్రుడిని వదిలించుకోవడం మంచిదని ఫిలిప్ గ్రహించనారంభించాడు. ఆయన లాకి చూపగలిగిన చివరి మెహర్బానీ, ఆయన్ని ఫ్రాన్సునుండి బయటకు పోనివ్వడమే.

1720 డిసెంబరులో జాన్ లా తన భార్యనూ, కూతురునూ, సోదరుణ్ణీ పారిస్‌లో దిగవిడిచి, కొడుకును తనతో తీసుకొని, రహస్యంగా బ్రస్సెల్స్‌కి బయల్దేరాడు. రుణదాతలకు బాకీలు తీర్చేందుకుగాను ఆయన ఆస్తులన్నీ జప్తుచెయ్యబడ్డాయి.

సామాజిక దృక్పథంనుంచి లా ఆర్థిక విధానానికీ, దాని పతనానికీ అర్థమేమిటి? ఈ అంశం సుమారు 250 ఏళ్లనుంచి వివాదాంశంగా వుంటూవస్తోంది.

18వ శతాబ్దంలో లా సాధారణంగా తీవ్రంగా విమర్శింపబడ్డాడు, కాని దానిలో హేతుబద్ధమైన పరిశీలన కంటె నైతిక నిరసన అధికంగా వుంది. గత శతాబ్ది మధ్యంలో తన "ఫ్రెంచి విప్లవ చరిత్ర"లో లూయీ బ్లాంక్, అటువంటి భావాలే కలిగిన తది తర సోషలిస్టులూ "లా"ని పునరుద్ధరించి, ఆయన్ని సోషలిజానికి వైతాళికుడుగా చిత్రించేందుకు ప్రయత్నించారు. లా "ధనికుల డబ్బు" అయిన వెండి బంగారాలపై దాడిచేసి, "పేదల డబ్బు" అయిన కాగితం డబ్బుతో చలామణీని నింపాలని కోరుకున్నా డని లూయీ బ్లాంక్ అంటాడు. సర్వాగ్రాసి అయిన తన బ్యాంకు ద్వారానూ, గుత్త వర్తకం ద్వారానూ లా, పరస్పరం పీకలు ఉత్తరించుకొనే పోటీ స్థానంలో సోషలిస్టు సాహచర్య సూత్రాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించాడని ఆయన భావించాడు. లా

ఆర్థిక చర్యల్లో కొన్నింటిని శ్రామిక జన జీవితాన్ని సులభతరం చేసేందుకు బుద్ధి పూర్వకంగా ఉద్దేశింపబడిన విధానంగా లూయీ బ్లాంక్ చిత్రిస్తాడు.

అయితే యిది సత్యానికి కొంత దూరమైనది. సాహచర్య సూత్రాన్ని లా అన్వయించ గోరిన రూపంలో అది పూర్తిగా బూర్జువా సూత్రం. అది పెట్టుబడిదారీ విధానానికి కాక, శ్రేణులుగా సమాజపు జడ విభజనకూ, సామాజిక చలనలోపానికీ ఆలవాలమైన ఫ్యూడలిజానికి వ్యతిరేకం. లా తన కంపెనీ వాటాదార్లనూ, తన బ్యాంకు కాతాదార్లనూ – కులీనుడు, బూర్జువా, వృత్తిపనివాడు, వర్తకుడు – ఒకచోట జేర్చి, వారిని సమానులను చెయ్యాలని కోరుకున్నాడు, అయితే వాళ్లని పెట్టుబడిదార్లుగా ఒక చోట జేర్చాలని ఆయన కోరుకున్నాడు.

లా తన విధానం ద్వారా, పెట్టుబడిదారీ విధానం తర్వాత పూర్తిగా సాధించవలసిన దానికి భూమికను సిద్ధంచేశాడు: "చారిత్రకంగా బూర్జువావర్గం అత్యంత విప్లవకరమైన పాత్ర నిర్వహించింది.

"బూర్జువావర్గంది పైచేయి అయిన చోటల్లా అది సకల ఫ్యూడల్ సంబంధాలనూ, సకల పితృస్వామిక సంబంధాలనూ, సకల నిష్కపట జానపద సంబంధాలనూ నిర్మూలించింది. మానవుణ్ని 'జన్మతః తనకంటె అధికులైన వాళ్ల'కు ముడివేసిన కలగాపులగపు ఫ్యూడల్ సంబంధాలను బూర్జువావర్గం నిర్దయగా పటాపంచలు చేసి, మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన స్వలాభంతప్ప, కిరాతకమైన 'డబ్బు లావాదేవీ' తప్ప, యిక యే సంబంధాన్ని మిగులనివ్వలేదు."*

బువాగిల్బేర్ అంత పరిమితమైనమేరకి స్తైతం లా, పీడితవర్గాల సమర్థకుడు కాడు. ఆయన రచనల్లో, ప్రజలపట్లా, రైతులపట్లా రువాన్ జడ్జిలో కనిపించే నిజమైన అనుకంప మనకేమీ కనిపించదు. పైపెచ్చు, సాహసికుడు, జూదరి, లాభార్జనాపరుడు అయిన ఆయన వ్యక్తిత్వంతో అది పొసగదు. లా బడా బూర్జువావర్గపు ప్రయోజనాలను వ్యక్తంచేశాడు. ఆ వర్గపు పారిశ్రామికోత్సాహంపై ఆయన తన ఆశలను నిలుపుకున్నాడు. ఆయన విధానం కూడా అటువంటిదే. మరింత విస్తృత ప్రజాసామాన్యంలో పంపిణీ అయిన బ్యాంకు నోట్లను వాటి కర్మకు వాటిని వదిలేసి, బడా పెట్టుబడిదారుల వశంలో వున్న తన కంపెనీ వాటాలను చిట్టచివరిదాకా ఆయన సమర్థించాడు.

ఈ ఆర్థిక విధానమూ, దాని పతనమూ గణనీయమైన స్థాయిలో ఐశ్వర్య, ఆదా

---

* Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. I, Moscow, 1973, p. 111.

యాల పునర్విభజనకు దారితీశాయి. చట్టావ్యాపారంలో చేరేందుకుగాను తమ ఎస్టేట్లనూ, భవనాలనూ అమ్మివేసుకున్న ప్రభువర్గంవారి పరిస్థితిని యీ విధానం మరింత దిగజార్చింది. రీజెన్సీ కాలంలో జరిగిన ఘటనలు రాజరికపు, ప్రభువర్గపు పరిస్థితిని బలహీనపరచాయి.

మరోవంక, లా ద్రవ్య గారడీ పట్టణవాస పేదలను దెబ్బతీసింది. ధరల పెరుగుదల కారణంగా వారు విశేషంగా నష్టపడ్డారు. కాగితం డబ్బు చట్టబాహ్యం చెయ్యబడినప్పుడు, ఓ పెద్ద మొత్తం డబ్బు చిన్న మొత్తాల్లో వృత్తి పనివారిచేతా, వర్తకుల చేతా, పరిచారకులచేతా, చివరకు రైతులచేతా నిలవచేసుకోబడింది.

లా ఆర్థిక విధానపు అతిముఖ్యమైన సామాజిక ఫలితాల్లో ఒకటేమిటంటే దుస్సాహసిక చట్టావ్యాపారం ద్వారా పోగేసుకున్న సంపదను నిలుపుకున్న నయా ధనికుల అవతరణ.

పారిస్‌నుండి పారిపోయాక లా మరో ఎనిమిదేళ్ళు బతికాడు. ఆయన ఆ కాలంలో పేదతనం అనుభవించాడు. దీని అర్థం, ఆయన పస్తులున్నాడని కాదు, అన్నప్పుడూ సొంత వాహన పరివారాలు లేకుండా, ఓ పెద్ద ఇల్లు కాకుండా సామాన్యమైన యింట్లో వున్నాడన్నమాట. ఆయనకి స్వగృహమంటూ లేకపోయింది. అయితే ఆయనెప్పుడూ కూడా ప్రవాసి జీవితాన్నీ, సంచారి జీవితాన్నే గడిపాడు. ఆయన తన భార్యను కలుసుకోవడం మళ్లీ ఎన్నడూ పడనే లేదు (అసలింతకీ వాస్తవంలో ఆయన ఆమెను ఎన్నడూ పెళ్లిచేసుకోనేలేదు), అలాగే తన కూతుర్నీ కలునుకోలేదు. ఆయన ఫ్రాన్సులో అడుగు పెట్టకుండానూ, వాళ్లు ఫ్రాన్సునుండి బయటకు పోకుండానూ నిషేధింపబడ్డారు.

మొదటి కొద్ది సంవత్సరాలూ తనింకా ఫ్రాన్సుకి తిరిగి వెళ్ళగలననీ, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొని, తన కార్యకలాపాలను కొనసాగించగలననీ ఆయన ఆశించాడు. ఆయన రీజెంటుపైన లేఖల వర్షం కురిపించాడు. వాటిని ఆయన పదేపదే వివరణలతోనూ, స్వీయ సమర్థనలతోనూ నింపాడు. ఈ లేఖల్లో ఆయన ఆర్థిక భావాల సారాంశం యథాతథంగానే ఉండిపోయింది. మరింత జాగ్రత్తగానూ, ఓపికతోనూ వ్యవహరిస్తానన్నది మాత్రమే కొత్త అంశం.

1723లో ఫిలిప్ ఆఫ్ ఆర్లియన్స్ ఆకస్మాత్తుగా చనిపోయాడు. దానితో తన ఉద్యోగానికీ, ఆస్తిపాస్తులకూ తిరిగి వెళ్లే ఆశ ఆయనకి అడుగంటిపోయింది. రీజెంట్ తనకు యివ్వారంభించిన సామాన్య భృతి సైతం వెన్వెంటనే నిలిచిపోయింది. ఆయన పేరు సైతం వినగోరని వాళ్లు అధికారంలోకి వచ్చారు. అప్పట్లో లా లండన్లో నివసిస్తున్నాడు. ఇంగ్లీషు ప్రభుత్వం ఆయనకి తగినంత పలుకుబడీ, బుద్ధి వైశిత్యమూ

ఉన్నాయని తలచి, జర్మనీకి ఒక అర్ధరహస్య కార్యం పైన ఆయన్ని పంపింది. ఆయన ఆహెన్ మ్యూనిహ్‌లలో సుమారు ఒక ఏడాది గడిపాడు.

లా యిప్పుడు, ఒకనాటి గొప్ప ద్రవ్యవ్యాపారికీ, సర్వశక్తివంతుడైన మంత్రికీ ఛాయామాత్రుడు. ఆయన యిప్పుడొక వాగుడుపిట్టగా మారాడు. ఎడతెగకుండా తన వ్యవహారాలను గురించి మాట్లాడేవాడు, తనను సమర్థించుకొంటూ తన శత్రువులను తెగడుతూ వుండేవాడు. ఆయనకి శ్రోతలకు కొదువ వుండేది కాదు: జనం యీ స్కాటు వాడికి కాగితాన్ని బంగారంగా మార్చే రహస్యం తెలుసుననుకునేవారు. తన సంపదలో కొంత భాగాన్ని ఫ్రాన్సు వెలుపల దాచుకోకుండా ఉండేటంత మూర్ఖుడు కాడని పలువురు అనుకునేవారు. దాన్నుంచి లబ్ధి పొందాలని ఆశించేవారు. మరింత మూఢనమ్మకాలు కలిగినవాళ్లు ఆయన్నొక ఇంద్రజాలికునిగా పరిగణించేవారు.

లా, తన జీవితపు చివరి రెండు సంవత్సరాలనూ వెనీసులో గడిపాడు. ఆయన తన తీరిక కాలాన్ని జూదంలోనూ (ఆయనకీ వ్యసనం ఆమరణాంతం అలాగే వుండి పోయింది), అప్పటికీ తనకు మిగిలిన అనేకమంది శ్రోతలతో కాలక్షేపపు కబుర్లలోనూ, "రీజెంటు కాలంలో ద్రవ్యచరిత్ర" అన్న బృహద్గ్రంథ రచనలోనూ గడిపేవాడు. తన వారసుల దృష్టిలో తన నిర్దోషిత్వాన్ని రుజువుచేసుకోవాలన్న ప్రయత్నంలో ఆయన యీ గ్రంథాన్ని రచించాడు. తొట్టతొలిసారిగా రెండు వందల ఏళ్ల తర్వాత అది ప్రచురించబడింది. 1728లో, సుప్రసిద్ధుడైన మాంటెస్క్యూ తన యూరప్ పర్యటన క్రమంలో లాని కలుసుకున్నాడు. అప్పటికే లా ఓ మోస్తరుగా క్షీణించిపోయాడు. కాని అప్పటికీ ఆయన, తను రైటేనని దృఢంగా నమ్ముతూ, తన భావాలను సమర్థించుకోడానికి సంసిద్ధంగా వున్నాడు. జాన్ లా న్యుమోనియాతో వెనీసులో 1729 మార్చిలో మరణించాడు.

లా, 20వ శతాబ్దం

లా సమకాలికులు ఆయన ఆర్థిక విధానపు పైశాచిక అత్యాచారాలు మళ్లీ ఎప్పుడూ పునరావృతం కాజాలవని భావించారు. కాని వాళ్లు పొరపడ్డారు. లా విధానం ఒక యుగానికి అంతం కాదు. ఒక విధంగా, అది ఆరంభం, ఆ యుగపు నాందీ ప్రస్తావన. తన కాలపు మనుషుల ఆలోచనలను విభ్రాంత పరచిన ఆయన సంస్థలు, 19వ, 20వ శతాబ్దాల పెట్టుబడిదారీ విధానం నెలకొల్పినవాటితో పోలిస్తే, యీనాడు చిన్నపిల్లల ఆటవస్తువుల మాదిరిగా కనిపిస్తాయి.

గత శతాబ్ది మధ్యలో లా భావాలూ, ఆయన బ్యాంక్ జనరేల్, మిసిసిపీ కంపెనీలు, ఒక విధంగా చురుకైన పెరేయ్ర సోదరుల ద్రవ్యసంస్థలుగా, పారిస్ జాయింట్ స్టాక్ బ్యాంక్ అయిన Crédit Mobilierగా పునరుద్ధరింపబడ్డాయి. లా సంస్థల్లో రీజెంట్ ఫిలిప్ మాదిరిగానే, బ్రహ్మాండమైన యీ చట్టావ్యాపార సంస్థలో మూడవ నెపోలియన్ కూడ పోషక, దోపిడిదారు పాత్రను వహించాడు. "తన లావాదేవీలను పెంపొందించుకోడానికీ," మొత్తం ఫ్రాన్సు అంతటి పారిశ్రామికాభివృద్ధినీ స్టాక్ ఎక్స్చేంజి క్రీడకు గురిచేసేందుకూ యీ బ్యాంకు ఏ సాధనాలను ఉపయోగించిందని అడిగినప్పుడు, మార్క్స్ యిలా చెప్పాడు: "ఏముంది, లా ఉపయోగించినవే."* అటుతర్వాత యీ సామ్యాన్ని మరింత సవిస్తరంగా వివరించాడు.

Crédit Mobilier సరిగా ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధానికి ముందు దివాళా తీసింది. కాని అది కొంత చారిత్రక ప్రాధాన్యం కలిగిన పాత్ర వహించింది, బ్యాంకింగు వ్యవస్థలో ఒక నూతన యుగానికి పునాదులు వేసింది – పరిశ్రమలతో సన్నిహిత సంబంధాలు కలిగిన చట్టావ్యాపార బ్యాంకుల స్థాపనే అది. మొత్తం పారిశ్రామిక శాఖల్లో పైచెయ్యి సంపాదించుకున్న భారీ జాయింట్ స్టాక్ కంపెనీల అభివృద్ధి నుండీ, బ్రహ్మాండమైన బ్యాంకుల పెరుగుదలనుండీ, పారిశ్రామిక గుత్త సంస్థలతో వాటి సంలీనంనుండే 19వ శతాబ్దం చివర ఫైనాన్సు పెట్టుబడి రూపొందింది.

కాని యిది, ఒక విధంగా చెప్పాలంటే, "నిర్మాణాత్మకమైన" అభివృద్ధి. మరి అత్యాచారాల మాట ఏమిటి? లా మిసిసిపి దుస్సాహసానికీ, పెనామా కాల్వ నిర్మాణానికి 8 లక్షలమంది వాటాదార్లనుండి డబ్బును పోగుజేసి, దానితో ఉడాయించిన వర్తక బృందపు విస్తృత చట్టావ్యాపారానికీ మధ్య పొందూ పోలికా ఏముండగలదు? లా రోజుల్లో "మిసిసిపి" అన్న మాట అయినంతగామా "పెనామా" (పరమ దగా) అన్న మాట సర్వసామాన్యమైపోయింది.

లా ఆర్థిక విధాన పతనాన్ని 1929లో న్యూయార్కు స్టాక్ ఎక్స్చేంజి పతనంతోనూ, లేక లా ద్రవ్యోల్బణాన్ని 20వ శతాబ్దపు "అతీత ద్రవ్యోల్బణం"తోనూ – అప్పుడు డబ్బు కొన్ని లక్షల సార్లు విలువను (జర్మనీలో 1920 దశకంలోనూ, గ్రీసులో 1940 దశకంలోనూ) కోల్పోయింది – ఎవరైనా ఎలా పోల్చగలరు? ఆధునిక పెట్టుబడిదారీ విధానం విషయంలో ద్రవ్యోల్బణ సమస్యకు గల ప్రాధాన్యం ఎంత

---

* Karl Marx, Friedrich Engels, *Werke*, Bd. 12, Berlin, 1969, S. 32.

అధికమో తేల్చిచెప్పడం కష్టం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు ద్రవ్యోల్బణం "సర్వసాధారణ" అంశమూ, ఒక శాశ్వత లక్షణమూ అయింది. అది ఆర్థిక యిబ్బందులను పెంచుతుంది, సామాజిక వైరుధ్యాలను తీవ్రంచేస్తుంది, కరెన్సీ సంక్షోభాలను అధికం చేస్తుంది. జాన్ లా కాగితం డబ్బు విలువ తరుగుదల కన్న ఆధునిక ద్రవ్యోల్బణం పోలికే లేనంత అధికతర సంక్లిష్టమైన దనడం సుస్పష్టం. ఆధునిక ద్రవ్యోల్బణం ఒక సాధారణ ఆర్థిక క్రమం. కాగితం డబ్బును అదనంగా జారీచెయ్యడంతో అది తరచుగా ముడిపడివుంటోంది. కాని యిది లేకుండా కూడా అప్పుడప్పుడు అది సంభవిస్తూవుంటుంది. పలు సందర్భాల్లో ద్రవ్యోల్బణపు ప్రధానాంశం ధరల పెరుగుదల. ఈ ధరల పెరుగుదల "డబ్బు" పార్శ్వంతో ప్రత్యక్షంగా ముడిపడివుండక, తదితర కారణాలవల్ల — గుత్త విధానం, వస్తువుల కొరత లేక విదేశీ వర్తక పరిస్థితి — సంభవిస్తుంది. అయితే మరి, డబ్బు మొత్తంలో పెరుగుదల, ఒక విధంగా చెప్పాలంటే, ధరల పెరుగుదల స్థాయికి "తోడ్పడి," తిరిగి తన వంతులో ద్రవ్యోల్బణాన్ని ప్రోత్సహిస్తుంది. ఆధునిక పరిస్థితుల్లో డబ్బు మొత్తమూ, ధరల స్థాయీ — యీ రెండూ ఏకదిశా వ్యాకోచత్వాన్ని — అవి పెరుగుతాయేగాని, ఎన్నడూ పడిపోవు — సంతరించుకున్నాయి. ఈ నియమం లా విధానంలోనే పిండరూపంలో వుంది.

సృజనాత్మకమైన ఊహాశక్తీ, విస్తృతమైన కార్య పరిధీ, శక్తులూ కలిగిన ద్రవ్య వ్యాపారిగా లా వ్యక్తిత్వం తదనంతర చరిత్రలో అనేక సార్లు "పునరావృతమైంది." పెట్టుబడిదారీ విధానానికి కావలసిందే అటువంటి మనుషులు, అటువంటి వారిని అది సృష్టిస్తుంది. వాళ్లు కొన్ని సందర్భాల్లో ఇసాక్ పెరేయ్‌ర లేక జాన్ ప్యేర్‌పోంట్ మోర్గన్ వంటి వాస్తవ వ్యక్తులు కావచ్చు, లేక మరి కొన్ని సందర్భాల్లో జోలా నవల "డబ్బు"లోని ప్రధాన పాత్ర అయిన స్టాక్ ఎక్స్‌చేంజ్ ప్రముఖుడు సక్కార్, డ్రైసర్ రచనలోని ఆత్మనిగ్రహం కలిగిన అతీత మానవ పాత్ర కౌపర్‌వుడ్ వంటి కాల్పనిక వ్యక్తులు కావచ్చు....

అర్థశాస్త్ర స్థాపనలోనూ, అభివృద్ధిలోనూ లా ద్రవ్యాచరణా, భావాలూ ముఖ్యమైన పాత్ర వహించాయి. ఈ విజ్ఞానశాస్త్రంలో ప్రత్యక్ష శిష్యుల్ని సంపాదించుకోడానికి ఆయన ఓ శతాబ్దమో, అంతకన్న ఎక్కువో వేచి వుండవలసివచ్చిన మాట నిజమే. మరోవంక, 18వ శతాబ్దంలోనూ, 19వ శతాబ్ది మొదట్లోనూ అర్థశాస్త్ర ఉజ్వలాభివృద్ధి చాలవరకు లా భావాలనుండే సాగినా కూడా, వాటిని ప్రమాదకరమైనవిగానూ, హానికరమైన వితండవాదంగానూ తిరస్కరించడం ద్వారా మాత్రమే అది అభివృద్ధిచెందింది. ఈ వితండవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి కెనే, ట్యూర్గో, స్మిత్, రికార్డోల అభిప్రాయాలు రూపొందడంలో గణనీయమైన ప్రాధాన్యం వుంది.

ఫ్రెంచి అర్థశాస్త్రాభివృద్ధిని విశ్లేషిస్తూ, మార్క్స్ యిలా అంటాడు: "ఫిజియోక్రాట్ల అవతరణ, యిటు కోల్బర్టిజానికి వ్యతిరేకతతోనూ, ప్రత్యేకించి అటు జాన్ లా విధానంపై రేగిన గందరగోళంతోనూ ముడిపడివుంది."*

లాపై సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తల విమర్శ ప్రగతిశీలమైనదీ, సరైన దిశలో సాగినదే. ఏ వ్యాపారవాదంతోనైతే లాకి అనేక ఉమ్మడి అంశాలున్నాయో ఆ వ్యాపారవాదానికి వ్యతిరేకంగా వారు జరిపిన పోరాటంలో అదొక భాగం. అన్ని ఆర్థిక సమస్యలనూ డబ్బుకీ, వ్యాపార సమతులనానికీ కుదించిన ఆదిమ వ్యాపారవాదులనుండి ఆయన చాలా భిన్నమైనవాడనడంలో సందేహం లేదనుకోండి. డబ్బును ప్రధానంగా ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే ఒక సాధనంగా ఆయన పరిగణించాడు. కాని ఆయన చలామణీ బాహ్య పరిధిని దాటి ముందుకు పోలేదు, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంక్లిష్ట అంగ నిర్మాణ, క్రియా విజ్ఞానాన్ని అర్థంచేసుకోడానికి ప్రయత్నం పైతం చెయ్యలేదు. సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు చెయ్య ప్రయత్నించినది సరిగా యిదే.

డబ్బుకి సంబంధించిన అంశాలపై ఆధారపడిన లా, సహజంగానే తన ఆశలన్నింటినీ ప్రభుత్వంతో ముడిపెట్టుకున్నాడు. ఆదినుంచీ కూడా ఆయన స్టేట్ బ్యాంకునే కోరుకున్నాడు. మొట్టమొదట ఆయన ప్రైవేటు బ్యాంకు స్థాపనకు ఆమోదించాడంటే, తనకు ఎదురైన తాత్కాలిక కష్టాలు మాత్రమే అందుకు కారణం. ఆయన గుత్త వ్యాపారం ప్రభుత్వానికొక విశిష్టమైన తోక. లా ఆర్థిక విధానంలో సంగతత్వం అంటూ వుండేది కాదు. ఆర్థిక వ్యవస్థను కుంటువరుస్తున్న కొన్ని ప్రభుత్వ నియంత్రణ చర్యలను ఆయన రద్దుచేశాడు, ఆ వెంటనే మరికొన్నింటిని ప్రవేశపెట్టాడు. ఫ్యూడల్ బ్యూరాక్రటిక్ ప్రభుత్వపు తోడ్పాటును ఆయన పొందాడు. కాని అటువంటి ప్రభుత్వపు మొరటైన, భారప్రాయమైన జోక్యానికి వ్యతిరేకంగానే ఫిజియోక్రాట్లూ, స్మిత్తూ పోరాడారు. ఈ అంశంలో కూడా వారికి లా కంటె బువాగిల్బేర్ ఎక్కువ సన్నిహితుడు.

కాని లా ప్రతిపాదించి, ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నించిన పరపతి పెట్టుబడిని సృష్టిస్తుందన్న భావనను తిరస్కరించడం ద్వారా సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులు ఉత్పత్తిని అభివృద్ధి చెయ్యడంలో పరపతి వహించే ముఖ్యమైన పాత్రను తక్కువ అంచనా వేశారు. ఒక విధంగా చెప్పాలంటే వాళ్లు పురిటి గుడ్డలతోబాటు బిడ్డను కూడా విసిరేశారు. మొత్తంమీద లాను, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు అతి ముఖ్య ప్రతినిధితో పోల్చేందుకు వీల్లేకపోయినా, కనీసం పరపతిని గూర్చిన ఆయన అభిప్రాయాలు రికార్డో అభిప్రాయాలకన్న మరింత ఆసక్తిదాయకమైనవి.

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, p. 59.

"సహజ ఆర్థిక వ్యవస్థ"యొక్క పూర్వనిర్ణీత సామరస్యంలోనూ, స్వేచ్ఛా వాణిజ్య సర్వశక్తిమత్వంలోనూ లాకి విశ్వాసం లేదు. ఈ విషయంలో కూడా ఆయన పెట్టుబడిదారీ విధాన వైరుధ్యాలను గూర్చిన చైతన్యాన్ని ప్రదర్శించాడు. బూర్జువా విజ్ఞానశాస్త్రం లాపట్ల తన వైఖరిని పునస్సమీక్షించుకోడానికి ఈ వైరుధ్యాలు తీవ్రం కావడమే కారణం. లూయీ బ్లాంక్, ఇసాక్ పెరేయ్‌ర కాలంలో లాకి పునఃప్రతిష్ఠ జరిగింది. అయితే అలా జరగడానికి అదే ఆఖరుసారి కాదు. ప్రభుత్వ గుత్తపెట్టుబడిదారీ విధాన సైద్ధాంతికులైన కీన్స్ అనుచరులచేత, మరో భిన్నమైన దృక్కోణం నుంచే కానివ్వండి, ఓ నూతన పునఃప్రతిష్ఠ జరుగుతోంది.

లా ప్రధాన భావాలు రెండూ, పరపతి ద్రవ్యాల రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చెయ్యడం, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వపు బృహత్తర పాత్ర — యిక్కడ చక్కగా అమిరాయి. ఈ ప్రకరణం మొదట్లో లా, కీన్సుల మధ్య గల సామ్యాన్ని గురించి ఒక ఆధునిక రచయిత మాటలను మేము ఉదహరించాం. విరోధాభాసప్రాయమైన వాక్యం యిదొక్కటే కాదు. ఉదాహరణకు ఫ్రాన్సులో, "జాన్ లా, డిరిజిజ్మ్ ఆవిర్భావం" అనే శీర్షికతో ఒక పుస్తకం వెలువడింది. ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికా రచనకు ఫ్రెంచి పర్యాయపదమే డిరిజిజ్మ్.

అమెరికాలో పెట్టుబడిదారీ కంపెనీలమీదా, వ్యక్తులమీదా పన్నుల రేట్లను మార్చడమన్నది కాంగ్రెస్ అనుమతితో మాత్రమే సాధ్యం. ఇదొక పాత బూర్జువా ప్రజాస్వామిక చర్య, యిది కార్యనిర్వాహక విభాగాన్ని హద్దుల్లో వుంచుతుంది. ఈనాడు ప్రభుత్వపు ఆర్థిక సలహాదార్లు యీ పరిస్థితులపట్ల మిక్కిలి అసంతృప్తులై వున్నారు: ఆధునిక ఆర్థిక విధానపు అతిముఖ్య ఆయుధం పన్నుల గారడీ. మరి వాళ్లు దానిపై పూర్తి అదుపును కలిగివుండాలని కోరుకుంటారు. ఇది మనకు, అప్పట్లో ఫ్రాన్సులో సమస్యలను పరిష్కరించగల పద్ధతిపట్ల ప్రసన్నుడైన లాని గుర్తుకు తెస్తుంది. "ఇంగ్లండులో మాదిరిగా 24 ఏళ్లు పట్టకుండా 24 గంటల్లోపల కార్యాచరణను గురించి ఆలోచించడం, దానిపైన నిర్ణయం తీసుకోవడం, దాన్ని అమలుజరపడం ఏ దేశంలో సాధ్యమవుతుందో ఆ దేశం అదృష్టవంతమైన దేశం." ఫ్రాన్సు ఎదురులేని నిరంకుశ రాజరికం అన్న విషయం ఆయన్ని బాధించలేదు. అక్కడ పనులు అంత త్వరగా జరగడానికి అదే కారణమన్న సంగతీ ఆయనకి పట్టలేదు.

ధన సమృద్ధీ, ద్రవ్యోల్బణం — వీటి సానుకూల పాత్రను గూర్చిన లా భావాలు వివిధ బూర్జువా ఆర్థికవేత్తల భావాల్లో మరల మరల పునరుద్ధరింపబడ్డాయి. ఆర్థిక సంక్షోభాలకూ, నిరుద్యోగానికీ, ఆర్థిక మాంద్యానికీ పరిష్కారాన్ని "పరిమిత ద్రవ్యోల్బణం"లో వాళ్లు వెతుకుతారు. కాని, యీ విధానాన్ని అనుసరిస్తే తన సొంత తీవ్ర సమస్యలనూ,

వైరుధ్యాలనూ అది సృష్టిస్తుంది. పశ్చిమ దేశాల్లో ఆర్థికశాస్త్రవేత్త వృత్తి ఎలాంటి దంటే, పెట్టుబడిదారీ విధానపు రోగశయ్య పక్కనగల డాక్టరు వృత్తి వంటిది. మహా అయితే ఈ డాక్టర్లు చెయ్యగలిగేదేమిటంటే, అప్పుడప్పుడు రోగ లక్షణాలకు తాత్కాలిక శాంతి కలిగించడం.

ప్రకరణం 6

ఆడమ్ స్మిత్ పూర్వ అర్థశాస్త్రం

పెట్టీకీ, ఆడమ్ స్మిత్‌కీ మధ్యగల శతాబ్దంలో ఆర్థిక విజ్ఞానశాస్త్రం – సాంప్రదాయిక ధోరణి తొలి మూలసూత్రాలనుండి ఒక విధానంగా అది రూపొందడానికి, విడివిడిగా, ఒక్కొక్కమారు లక్ష్యరహితంగా రచింపబడిన చిన్న పుస్తకాలనుండి నిర్దిష్టమైన "జాతుల సంపద"దాకా – సుదీర్ఘ ప్రయాణం చేసింది. ఈ రచన వస్తువూ, రూపమూ తదుపరి శతాబ్దంలోనూ, ఆటు తర్వాతా సైతం, ఆర్థిక సైద్ధాంతిక రచనల స్వభావంపైన నిర్ణాయకమైన పాత్ర వహించాయి.

మార్క్స్ రాసినట్లు "మౌలిక చింతనాపరులు కొల్లలుగా వున్న ఆ దశ,* అర్థశాస్త్ర క్రమావతరణను పరిశోధించడానికి అతి ముఖ్యమైనది"** ఇంగ్లండులో సాంప్రదాయిక అర్థశాస్త్ర భవనాన్ని యిటుక తర్వాత యిటుకగా నిర్మించిన కొద్దిమంది ప్రముఖ పండితులనూ, రచయితలనూ గురించి మాత్రమే మనమిక్కడ చెప్పుకోగలుగుతాం. వారి భావాల్లో కొన్ని ఆధునిక సమస్యల దృష్ట్యా కూడా ఆసక్తికరమైనవి.

18వ శతాబ్దం

నవయుగానికి చెందిన బ్రిటన్ 18వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో రూపొందిందని చెప్పవచ్చు. ఈ దశలోనే భూస్వామ్య ప్రభువర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య

---

* మార్క్స్ యిక్కడ 1691నుండి 1752వరకు గల దశను ప్రస్తావిస్తున్నాడు. పెట్టీ భావాలను అభివృద్ధి చేసిన లోక్, నార్త్‌ల రచనల ప్రచురణ కాలంనుండి స్మిత్‌కి అతి కొద్దిగా ముందువాడైన హ్యూమ్ ప్రధాన ఆర్థిక రచనలదాకా గల దశ యిది.

** Frederick Engels, *Anti-Dühring*, Moscow, 1969, p. 280. ("ఆంటీ డ్యూరింగ్" భాగం IIలో ప్రకరణం Xని మార్క్స్ రచించాడు.)

రాజీ సుసంఘటితమైంది. ఈ రెండు దోపిడీవర్గాల ప్రయోజనాలూ ఏకమై, సన్నిహితంగా పెనవేసుకుపోయాయి. ప్రభువర్గం బూర్జువాలూ, బూర్జువావర్గం భూస్వాములూ అయారు.

ఈ దశలో ఒక రాజకీయ విధానం పెంపొందింది. బూర్జువా ప్రజాస్వామిక లక్ష్యానికి రెండు శతాబ్దాల పాటు ప్రాతినిధ్యం వహించిన ఆ విధానమే యీనాటికీ సూత్రప్రాయంగా నిలిచివుంది. పార్లమెంటరీ రాజరికంతో కూడివున్న యీ వ్యవస్థలో రాజు ఏలుతాడేగాని పాలించడు. రెండు పార్టీలు వుంటాయి. అవి ఒకదాన్ని మార్చి మరొకటి అధికారంలోకి వస్తూంటాయి. ఆనాటి యూరప్‌లో అపూర్వమైన వ్యక్తి స్వేచ్ఛా, వాక్, పత్రికా స్వేచ్ఛలూ వున్నాయి. అయితే యీ స్వేచ్ఛలన్నింటినీ సమాజంలోని ప్రత్యేక సౌకర్యాలు కలిగిన, ధనిక విభాగాలవారు మాత్రమే వినియోగించుకోగలరన్న మాట ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.

భూస్వాముల మితవాద పార్టీ అయిన టోరీ పార్టీ, ఉన్నత విద్యావంతులైన కులీనుల, పట్టణవాస బూర్జువాల లిబరల్ విగ్గు పార్టీ అనంతమైన తమ పార్లమెంటరీ, ఎన్నికల పోరాటాలను మొదలుపెట్టాయి. ఈ పోరాటాల ముఖ్య కర్తవ్యాల్లో ఒకటేమిటంటే, వర్గపోరాటానికి సంబంధించిన వాస్తవ వివాదాత్మక సమస్యలనుండి "కింది వర్గాల" దృష్టిని మళ్లించడం.

రాజకీయ పోరాటం, అంతకు ముందు శతాబ్దంలో తనకు వున్న మత వాసనను చాలవరకు కోల్పోయింది. అధికారికమైన చర్చి ఆఫ్ ఇంగ్లండ్‌తోబాటు పక్కపక్కనే పూర్వపు ప్యూరిటన్ మతశాఖలు అనేకం కూడా స్థిరపడ్డాయి. దానితో ఇంగ్లండు "శత మతాల దీవి" అయింది. అయితే యిది, ఆ బూర్జువా దేశపు సామాజికార్థిక అభివృద్ధికి ఆటంకం కాలేదు. ఇంగ్లీషు చరిత్రకారుడైన జి. ఎమ్. ట్రెవెల్యాన్ అన్నట్లు: "మతం దేశాన్ని విభజించగా, వర్తకం దాన్ని ఐక్యం చేసింది. వర్తకం సాపేక్షంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటోంది. బైబిల్‌కి యిప్పుడు ఆవర్జా పుస్తకం పోటీగా తయారైంది."*

సామ్రాజ్యం త్వరితంగా పెరిగింది. ఉత్తర అమెరికా వలస చెయ్యబడింది. వెస్ట్ ఇండీస్‌లో చెరుకు, పొగాకు తోటలు వృద్ధిచెందాయి. ఇండియా, కెనడాలు ఆక్రమించుకోబడ్డాయి. ప్రపంచం నలుమూలలా అనేక దీవులు కనుగొనబడ్డాయి. ఇంగ్లండు సాగించిన యుద్ధాలు చాలవరకు విజయవంత మయ్యాయి. నౌకా, వర్తక రంగాల్లో ఇంగ్లండు ప్రపంచంలోనే ఎదురులేని మిక్కిలి గొప్ప శక్తి అయింది. ఆచరణలో ఆంగ్ల

---

* G. M. Trevelyan, ***English Social History***, London, 1944, p. 295.

వర్తకులకు ప్రత్యేకించి బానిస వర్తకంపైన గుత్తాధికారం ఏర్పడింది. ఇంగ్లండు ఏటా అమెరికాకు అనేక వేలమంది నీగ్రో బానిసలను ఎగుమతి చేసింది.

ఇంగ్లండు ఆర్థిక వ్యవస్థలోని మార్పులు ఈ క్రమాలన్నింటికీ మూలం అనడం స్పష్టం. ప్రథమంగానూ, ప్రధానంగానూ గ్రామీణప్రాంతం మారిపోతోంది. ఆ శతాబ్ది మధ్యం నాటికింకా ఇంగ్లీషు వ్యవసాయం పరిశ్రమలకన్న సుమారు మూడు రెట్లు ఎక్కువగా ఉత్పత్తి చేస్తోంది. ఈ కాలంలో భూ ఆక్రమణ ప్రత్యేకించి విస్తృత మైంది. సన్నకారు రైతు కమతాలూ, ఉమ్మడి భూములూ క్రమంగా అదృశ్యమై, భారీ ఎస్టేట్లకు చోటుచేస్తున్నాయి. అవి ఖండాలుగా ధనిక వ్యవసాయదారులకు కౌలుకివ్వబడుతున్నాయి. ఇది వ్యవసాయంలోనూ, పరిశ్రమల్లోనూ పెట్టుబడిదారీ విధానా భివృద్ధికి దోహదంచేసింది.

భూమిగాని, ఆస్తిగాని లేని, రెక్కల కష్టం తప్ప మరే ఆధారమూ లేని వేతన కార్మికవర్గం త్వరితంగా పెంపొందుతోంది. తమ భూములను లేక తమ పూర్వపు అర్ధ ఫ్యూడల్ కౌలు హక్కులను పోగొట్టుకున్న రైతులు, చేతివృత్తులవారు, పోటీలో నాశనమైన వృత్తి నిపుణులు — వీరితో యీ వర్గం ఏర్పడింది. అయితే అసలైన కార్ఖానా శ్రామికవర్గం "కింది వర్గాల్లో" అప్పటికింకా అపరిగణనీయమైన భాగంగానే వుంది. పెట్టుబడిదారీ దోపిడిలో "గడిచిన మంచిరోజుల" నాటి అనేక పితృస్వామిక లక్షణాలూ, అవశేషాలూ వున్నాయి. పారిశ్రామిక బానిసత్వపు ఘాతుకాలు యింకా ఎదటే వున్నాయి.

మరో మూల పారిశ్రామిక పెట్టుబడిదారుల వర్గం పెరుగుతోంది. ధనస్వాము లైన వృత్తినిపుణ మేస్త్రీలూ, వర్తకులూ, విదేశాల్లో తాము పోగేసుకున్న సంపదను ఇంగ్లండుకు తెచ్చిన తోటల యజమానులూ యీ వర్గంలో చేరుతున్నారు. పెట్టుబడికి ఉత్పత్తి దానురాలైన క్రమం సంక్లిష్టమైనది: తరచుగా పెట్టుబడిదార్లు మొదట కుటీర పరిశ్రమల్లో ముడి పదార్థాల కొనుగోలుదార్లుగానూ, సప్లయ్‌దార్లుగానూ ప్రవేశించేవారు, అటుతర్వాత చేతివృత్తి కార్ఖానాలనూ, ఫాక్టరీలనూ స్థాపించేవారు.

కార్ఖానా ఉత్పత్తి యుగానికి, అంటే, శ్రమ విభజన ప్రాతిపదికపై చేతులతో చేసే ఉత్పత్తికి యిది అంతం. పూర్వపు ఆదిమ పరికరాలతో సైతం శ్రమవిభజనా, కార్మికుల స్పెషలైజేషనూ ఉత్పాదకత పెంపుదలను సాధ్యంచేశాయి. యంత్ర పరి శ్రమ అప్పుడే తలెత్తుతోంది. గొప్ప ఆవిష్కరణల యుగం మొదలవుతోంది. 1730 దశకంలో నడుకు, నేత పనుల యాంత్రీకరణ దిశగా తొలి అడుగులు వెయ్యబడ్డాయి. కోక్ శుద్ధి ప్రక్రియ కనుగొనబడింది. 1760 దశకంలో జేమ్స్ వాట్ ఆవిరి ఇంజన్‌ను కనుగొన్నాడు.

పారిశ్రామికవేత్తలకు తమ పరిశ్రమల కోసం, వర్తకులకు విదేశీ వ్యాపారం కోసం,

ప్రభుత్వానికి వలసయుద్ధాల కోసం రుణాలు అవసరమయ్యాయి. ఇది డబ్బు పెట్టుబడిని పోగుచేసే బ్యాంకుల, జాయింట్ స్టాక్ కంపెనీల ఆవిర్భావ, సత్వర పెరుగు దలలకు దారితీసింది. జాతీయ రుణం గణనీయంగా పెరిగింది. సెక్యూరిటీలూ, స్టాక్ ఎక్స్ఛేంజీ అమల్లోకి వచ్చాయి. పారిశ్రామిక, వర్తక పెట్టుబడిదారు సరసన — వీరి ప్రధాన ఆదాయరూపం లాభం — రుణాలపైన వడ్డీ రూపంలో అదనపు విలువలో తన భాగాన్ని పొందే ధనిక పెట్టుబడిదారుయొక్క సమగ్రరూపం ప్రత్యక్షమైంది.

సరుకు—డబ్బు సంబంధాలు అప్పుడే జాతి మొత్తం జీవితంలో పాతుకుపోయాయి. ఒక్క వర్తకమే కాకుండా ఉత్పత్తి సైతం చాలవరకు పెట్టుబడిదారీ తత్వాన్ని సంతరించుకుంది. బూర్జువా సమాజపు ప్రధాన వర్గాలు మరింత ప్రస్ఫుటంగా ముందుకొచ్చాయి. జనసామాన్యం వోట్లో పడి నలిగిన కారణంగా పెట్టుబడి, లాభం, వడ్డీ, భూమి కౌలు, వేతనాల వంటి సామాజిక విషయాలైన వస్తుపరమైన భావాభివర్గాలు నిర్దిష్టంగా నిర్వచితమయ్యాయి. ఇవన్నీ యిప్పుడు పరిశీలనకూ, శాస్త్రీయ విశ్లేషణకూ విషయాంశమయ్యాయి.

మరోవంక, సమాజంలో అప్పటికింకా బూర్జువావర్గమే అత్యంత ప్రగతిశీల వర్గంగా వుంది. పెరుగుతున్న కార్మికవర్గాన్నే తన ప్రధాన ప్రత్యర్థిగా అది యింకా గుర్తించలేదు. వాటిమధ్య వర్గపోరాటం యింకా బీజదశలోనే వుంది. ఈ విధంగా ఇంగ్లండులో సాంప్రదాయిక అర్థశాస్త్రాభివృద్ధికి పరిస్థితులు రూపొందాయి.

అర్థశాస్త్రానికి రాబిన్సనాద్‌లంటే యిష్టం

డేనియల్ డిఫో రాసిన "రాబిన్సన్ క్రూసో" అనే నవల ప్రథమ ముద్రణ లండన్లో 1719లో వెలువడింది. ఆ నవల భవితవ్యం అసాధారణమైనది. ఒక వంక అది అపూర్వమైన సాహస కథనంగా ప్రసిద్ధిచెందింది. మరోవంక, "రాబిన్సన్ క్రూసో"కీ, తదితర రాబిన్సనాద్‌లకీ పలుభాషల్లోని సాహిత్యకారులు చేసిన తాత్విక, విద్యాశాస్త్రపర, రాజకీయార్థిక వ్యాఖ్యాన గ్రంథాలతో యీనాడు ఓ మొత్తం గ్రంథాలయమే నిండిపోతుంది.

రాబిన్సనాద్ అన్నది ఒకానొక చింతనాపరుడూ, రచయితా కల్పించిన ఒక సన్నివేశం. అందులో ఏకాకి వ్యక్తి (ఒక్కొక్కమారు ఒక మనుషుల బృందం కావచ్చు) సమాజానికి వెలుపల జీవన పరిస్థితుల్లో పని పరిస్థితుల్లో అట్టే పెట్టబడతాడు. మీరు కావాలనుకుంటే, అది, ఒక ఆర్థిక నమూనా. దానిలో జనం మధ్య సంబంధాలు,

అంటే సామాజిక సంబంధాలు మినహాయింపబడతాయి. ప్రకృతితో ఏకాకి వ్యక్తి సంబంధాలు మాత్రమే మిగిలివుంటాయి. అర్థశాస్త్రానికి రాబిన్సనాడ్‌లంటే యిష్టం, అని వ్యాఖ్యానించాడు మార్క్స్. ఇది, మార్క్స్ పూర్వపు దానికన్న మార్క్స్ తదుపరి బూర్జువా అర్థశాస్త్రానికి మరింత బాగా వర్తిస్తుందని మనం చెప్పుకోవచ్చు.

డిఫో యించుమించు అరవైయేళ్ల వయసులో రచించిన "రాబిన్సన్ క్రూసో" విజయం పొందినా తరువాత రాసిన యితర నవలలూ విజయం పొందినా, ఆయన తన జీవితాంతందాకా వాటిని స్వల్పాంశాలుగా పరిగణించాడు. తన లేఖిని సృష్టించిన పలు రాజకీయ, ఆర్థిక, చారిత్రక రచనలు తన మరణానంతరం తనకు కీర్తిని తెచ్చిపెడతాయని డిఫో భావించాడు. సాంస్కృతిక చరిత్రలో అటువంటి భ్రమలు అసామాన్యమేమీ కాదు.

డిఫో సొంత జీవితమే ఓ సాహసకథ లాంటిది. ఆయన 1660లో లండన్లో జన్మించాడు (అయితే యీ తేదీ విషయంలో కొంత సందేహం వుంది), 1731లో లండన్లోనే మరణించాడు. ప్యూరిటన్ సన్నకారు వర్తకుని కొడుకైన డిఫో, తన సహజ శక్తి, సామర్థ్య చాతుర్యాల ఫలితంగా, జీవితపథాన్ని స్వయంగా తీర్చిదిద్దుకున్నాడు. రెండవ జేమ్సు రాజుకి వ్యతిరేకంగా 1685లో జరిగిన మాన్‌మత్ తిరుగుబాటులో పాల్గొన్న డిఫో, మరణ శిక్షనూ, వలసదేశాలకు ద్వీపాంతర శిక్షనూ కేవలం అదృష్టం కొద్దీ ఒక యాదృచ్ఛిక ఘటన కారణంగా తప్పించుకొని బయటపడ్డాడు. ముప్పయ్యేళ్లనాటికి ధనిక వ్యాపారస్తుడైన డిఫో, 1692లో దివాళా తీశాడు. ఆయన 17,000 పౌనులదాకా బాకీపడ్డాడు.

అదిగో సరిగా అప్పుడే డిఫో రాజకీయ పుస్తకాలు రాయడం మొదలుపెట్టాడు. మూడవ విలియం (విలియం ఆఫ్ ఆరెంజ్) విశ్వాసాన్నీ, ఆయన సన్నిహిత సలహాదార్ల విశ్వాసాన్నీ చూరగొన్నాడు. 1698లో "ప్రాజెక్టుల గురించి పరిశీలన" అన్న ఒక ఆర్థిక రచనను ఆయన ప్రచురించాడు. దానిలో ఆయన సాహసికమైన అనేక ఆర్థిక, పరిపాలనా సంస్కరణలను ప్రతిపాదించాడు.

1703లో తన పోషకుడైన చక్రవర్తి మరణానికి కొంచెం తర్వాత, ప్యూరిటన్ అసమ్మతిదార్లను సమర్థిస్తూ, చర్చి ఆఫ్ ఇంగ్లండుకి వ్యతిరేకంగా ఘాటైన ఓ చిన్న పుస్తకం రాసినందుకు డిఫోకు బొండకొయ్య శిక్ష వేసి, తర్వాత ఆయన్ని జైలుకి పంపారు. టోరీ పార్టీ నాయకుడైన రాబర్ట్ హార్లీచేత ఆయన జైలునుంచి విడుదల చెయ్యబడ్డాడు. (అక్కడ తను గడిపిన 18 మాసాల్లోనూ ఆయన విస్తారంగా రచనలు చేశాడు.) దీనికి బదులుగా డిఫో తన లేఖినిని – తన కాలంలో అత్యుత్తమ జర్నలిస్టు లేఖినిని – టోరీ పార్టీనీ, వ్యక్తిగతంగా హార్లీనీ సమర్థించేందుకు వినియోగించాడు. హార్లీకి

రహస్య ఏజెంట్లపై, ఆయన అప్పగించిన ముఖ్యమైన, రహస్య కార్యాలపైన డిఫో స్కాట్లం డుకీ, ఇంగ్లండులో వివిధ ప్రాంతాలకీ పయనించాడు.

ఆన్ రాణి మరణం, హార్లీ పతనాలతో డిఫో పదవీ క్రమానికి ఆకస్మికంగా స్వస్తి జరిగింది. రాజకీయ నిందారోపణపై 1715లో ఆయన మరోసారి జైలుకు పంప బడ్డాడు. కొత్త ప్రభుత్వానికి ప్రతికూలమైన పత్రికలను లోపలినుండి విచ్ఛిన్నంచేసే అమాయపడదగని కర్తవ్య నిర్వహణకు పూనుకోవడంతో ఆయన మరోసారి స్వేచ్ఛను సంపాదించుకున్నాడు.

"రాబిన్సన్ క్రూసో" రచయితకి అపారమైన జీవితానుభవ సంపద వుంది. యార్క్‌నుండి బయల్దేరిన నావికుని సాహసకృత్యాల కథనానికి అంతటి ప్రగాఢ త్వాన్ని సమకూర్చినది యీ అనుభవమే. తన జీవితపు చివరి రోజుల దాకా డిఫో, శాంతి విశ్రాంతులను ఎరగడు. ఒక మనిషి, 60–70 ఏళ్ల మధ్య వయస్సులో, కొన్ని పెద్ద నవలలనూ, గ్రేట్ బ్రిటన్ ఆర్థిక, భౌగోళిక వర్ణనాత్మకమైన ఓ బృహద్గ్రంథాన్నీ, అనేక చరిత్రాత్మక వ్యాసాలనూ, దయ్యాలను గూర్చిన శాస్త్రంపైనా, ఇంద్రజాలం పైనా (!) అనేక పుస్తకాలనూ, అత్యంత వైవిధ్యం కలిగిన అంశాలపై అనేక చిన్న వ్యాసాలనూ, కరపత్రాలనూ రచించగలగడం నమ్మేందుకు అతీతమైన విషయం. 1728లో "ఆంగ్ల వాణిజ్య పథకం" అన్న శీర్షికతో ఆయనొక ఆర్థిక గ్రంథాన్ని ప్రచురించాడు.

రాబిన్సనాడ్‌లకు మళ్లీ మనం తిరిగివెళ్దాం. బూర్జువా సాంప్రదాయిక అర్థ శాస్త్రానికి సహజ మానవ భావమే మూలం. ఏ ఫ్యూడల్ సమాజంలోనైతే అన్ని రకాల బలా త్కారపూర్వకమైన సంబంధాలచేతా, ఆంక్షలచేతా కట్టుబాట్లలో మనిషి పెట్టబడతాడో ఆ ఫ్యూడల్ సమాజానికి వ్యతిరేకంగా తెలియకుండానే వెల్లడయ్యే నిరసనలోంచి యీ భావం తలెత్తింది. కానైతే, కొత్త బూర్జువా సమాజపు యీ "సహజ" మానవుడు, యీ సంబంధాలనుండి విముక్తం చెయ్యబడి, స్వేచ్ఛాయుత పోటీ, సమానావకాశాల ప్రపంచానికి అమర్చబడిన యీ వ్యక్తిగతవాది స్మిత్, రికార్డోలచేతా, వారికన్న ముందరి వారిచేతా సుదీర్ఘమైన చారిత్రక క్రమోత్పాదితంగా కాక, తద్భిన్నంగా, భిన్న పథా రంభ కేంద్రంగా, "మానవ ప్రకృతి" మూర్తీభావంగా పరిగణింపబడ్డాడు.

పెట్టుబడిదారీ విధానంకింద సామాజికోత్పత్తిలో యీ వ్యక్తిగతవాది ప్రవర్తనను వివరించే ప్రయత్నంలో, వాళ్ల "సహజ హక్కు" భావాలను ఆధారం చేసుకున్నారు, సమాజపు ప్రత్యక్షాభివృద్ధిపైన కాకుండా, ఏకాకి వేటగాడు, జాలరి వంటి ఊహా వ్యక్తిపైన తమ దృష్టిని కేంద్రీకరించారు. దీని అర్థం, నిర్దిష్టమైన ఒక రాబిన్సన్ క్రూసో – యితడొక నిర్జనమైన దీవిలో ఉండిపోవడం సంభవించింది – ఏదో వ్యంగ్య

స్ఫూరకమైన, అనిర్దిష్ట వ్యక్తిగా, తరచు పూర్తి సాంప్రదాయికమైన వ్యక్తిగా రచయిత తలచేత మార్చబడ్డాడన్న మాట.

ఈ విధంగా రాబిన్సనాడ్ అన్నది, తప్పనిసరిగా ఎప్పుడూ సామాజికమైనదిగానూ, చారిత్రకాభివృద్ధిలో నిర్దిష్ట దశతో సంబంధితమైనదిగానూ ఉండే ఉత్పత్తి నియమాలను పరిశీలించే ఒక ప్రయత్నం. ఒక అనిర్దిష్ట నమూనాను గురించి జరిగే ఈ పరిశీలన ప్రధానాంశమైన సమాజాన్ని మినహాయిస్తుంది. సాంప్రదాయిక అర్థశాస్త్ర రాబిన్సనాడ్‌ల పైన మార్క్స్ అత్యంత ప్రగాఢమైన విమర్శచేశాడు. ఈ ధోరణి 19వ శతాబ్ది మధ్యపు "యిటీవలి అర్థశాస్త్రానికి" వ్యాపించిందనీ, "సహజ మానవుని" ఊహ ప్రపంచంలో అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ విధానానికి విశిష్టమైన ఆర్థిక సంబంధాలను యిప్పుడది వీలుగా కనుగొందనీ ఆయన వ్యాఖ్యానించాడు. మార్క్స్‌నుంచి ఒకేఒక వాక్యాన్ని యిక్కడ ఉదహరిస్తాం: "సమాజానికి బయటగల ఏకాకి వ్యక్తి ఉత్పత్తి – ప్రమాదవశాన నిర్జన ప్రాంతంలోకి విసరివేయబడిన ఒక నాగరక వ్యక్తికి సంభవించగల అసాధారణ విషయం యిది, ఆటువంటి వ్యక్తిలో అంతకు ముందే సామాజిక శక్తులు క్రియాశీలంగా యిమిడివుంటాయి (వక్కాణింపు నాది – ఎ. ఎ.) – జీవించివుండి కలిసి మాట్లాడే వ్యక్తులు లేకుండా భాషాభివృద్ధి ఎంత అసందర్భమో అంతే అసందర్భం."*

రాబిన్సన్ క్రూసో యితివృత్తానికి సంబంధించి వక్కాణిత భాగం ఆసక్తికరమైనది. రాబిన్సన్ సామాజిక శక్తులను ఏమేరకు కలిగివున్నాడో గుర్తుంచుకోవడం అవసరం. మారిన పరిస్థితుల్లో అతను "సహజ మానవ" దశనుండి త్వరితంగా – మొదట పితృస్వామిక బానిస యజమానిగానూ (బానిస ఫ్రైడే), తర్వాత ఒక ఫ్యూడల్ ప్రభువుగానూ (వలసదారుల కాలనీ) – మారిపోయాడు. అతని "సమాజం" అభివృద్ధి పొందుతూనే వుండినట్లయితే అతను ఒక పెట్టుబడిదారుగా కూడా మారివుండేవాడు.

ఆర్థిక విషయాలను విడి వ్యక్తి భావాల దృష్ట్యా, మానసిక తత్వం దృష్ట్యా పరిశీలించ ప్రయత్నించే అర్థశాస్త్రంలోని వ్యక్తిపరవాద ధోరణికి రాబిన్సనాడ్ అన్నది నిజంగా ఒక వరప్రసాదం. అర్థశాస్త్రంలో 1870 దశకంలో తలెత్తిన యీ ధోరణి "పరమాణుప్రాయమైన విడి వ్యక్తి"పై దృష్టిని కేంద్రీకరించింది. అందుకు రాబిన్సన్ క్రూసో కన్న మరింతగా తగిన పాత్రను ఎవరైనా ఊహించడం కష్టం.

ఆస్ట్రియన్ వ్యక్తిపరవాద ధోరణికి చెందిన బోమ్-బావెర్క్ (1851–1914)

---

* K. Marx, *Grundrisse der Kritik der Politischen Ökonomie*, Moskau, 1939, S. 6.

రచించిన రాబిన్సనాద్ యిందుకొక సరైన ఉదాహరణ. బోమ్-బావెర్క్ తన వాదాన్ని బలపరచుకునేందుకుగాను రెండు సార్లు — విలువ సిద్ధాంతంలోనూ, పెట్టుబడి సంచయన సిద్ధాంతంలోనూ — రాబిన్సన్ ప్రసక్తిని గురించి ప్రస్తావించాడు.

విలువ అన్నది ఒక సామాజిక సంబంధమనీ, వస్తువులు సమాజంలో మారకం కోసం, సరుకులుగా ఉత్పత్తిచెయ్యబడినప్పుడు మాత్రమే అది ఉంటుందనీ 17, 18 శతాబ్దాల రచయితలు అప్పటికే గ్రహించారు. బోమ్-బావెర్క్ విలువ భావనను ప్రవేశ పెట్టేదంతా ఎందుకంటే, ఆయనే చెప్పినట్లు, "నరకబడని అడవిలో రవాణా సాధనా లన్నింటికీ దూరంగా ఓ కొయ్య కొట్టంలో వుండే ఓ వలసదారు"కోసం. ఈ రాబి న్సన్‌కి అయిదు బస్తాల తిండిగింజలు వున్నాయి. ఆ తిండిగింజల విలువ వాటిలో చివరి వాటి ఉపయోగాన్ని బట్టి కొలవబడుతుంది.

పెట్టుబడి అన్నది, ఉత్పత్తి సాధనాలు కలిగివున్నవారికీ, ఉత్పత్తి సాధనాలు లేక తమ శ్రమను అమ్ముకొంటూ, దోపిడికి గురయ్యే వారికీ మధ్య వుండే సామాజిక సంబంధం. సామాజికాభివృద్ధియొక్క ఒకానొక నిర్దిష్ట దశలో మాత్రమే అది ఉత్పన్నమవుతుంది. కాని బోమ్-బావెర్క్ దృష్టిలో అది వట్టినే పాదార్థికమైన శ్రమ పరికరాలు మాత్రమే. అందుచేత రాబిన్సన్ అడవిలోని పళ్లు ఏరుకోవడంలో నిమగ్ను డైయున్నంత కాలం, అతనికి పెట్టుబడి లేదు. కాని తన కాలంలో కొంత భాగాన్ని తనకోసం విల్లంబులను తయారుచేసుకోడానికి కేటాయించగానే అతను ఒక పెట్టు బడిదారు అవుతాడు: పెట్టుబడి సంచయనంలో ప్రాథమిక చర్య యిది. పెట్టుబడి సరళ ఆర్థిక వ్యవస్థ ద్వారా సంచితమైనట్లూ, ఏ దోపిడి రూపంతోనూ దానికి సంబంధం లేనట్లూ మనం యిక్కడ చూస్తాం.

బూర్జువా అర్థశాస్త్రంలో రాబిన్సనాద్ సంప్రదాయం ఎంత బలంగా ఉన్నదంటే, రాబిన్సన్‌ని గురించి ప్రస్తావించకుండా ఆర్థిక సిద్ధాంతంపై ఏ పుస్తకమైనా రాయడం కష్టసాధ్యం అయిపోయింది. ఆధునిక అమెరికన్ అర్థశాస్త్రవేత్త అయిన పాల్ ఎ. శామ్యుయెల్‌సన్ రాబిన్సన్‌కి ఎదురైన ఆర్థిక సమస్యలకూ ఓ పెద్ద సమాజానికి ఎదురయ్యే వాటికీ మధ్య మౌలికంగా భేదం లేదన్న వాక్యంతో, తన పాఠ్య గ్రంథాన్ని ప్రారంభించాడు.

డాక్టర్ మన్‌డెవిల్ విరోధాభాసలు

లండన్‌లోని ఏ కాఫీ హోటళ్లకూ, పుస్తకాల షాపులకూ డిఫో తరచుగా వెళ్తూండే వాడో వాటిలోనే చూపరుల దృష్టిని ఆకట్టుకునే డాక్టర్ బెర్నార్డ్ మన్‌డెవిల్

కూడా కనిపిస్తూండేవాడు. ప్రాక్టీసు లేని యీ డాక్టరు పేదలుండే ప్రాంతాల్లో నివసిస్తూండేవాడు. సరదాగా నలుగురితో తాగి తందనాలాడటమంటే యిష్టపడే మన్‌డెవిల్‌కి అంత మంచి పేరు ఉండేది కాదు. ప్రధానంగా సారా బట్టీలవాళ్లనుంచీ, కలాలీలనుంచీ ముట్టే డబ్బుతోనే ఆయన జీవించేవాడనీ, మత్తు కలిగించే పానీయాలను బలపరుస్తూ ఆయన పత్రికల్లో రాసినందుకే వాళ్లు ఆయనకి అలా డబ్బు చెల్లించేవాళ్లనీ చెప్పుకునేవాళ్లు.

బెర్నార్డ్ మన్‌డెవిల్ హాలండులో 1670లో జన్మించాడు. 1691లో లేడెన్ విశ్వవిద్యాలయంనుంచి పట్టభద్రుడైన కొద్దికాలానికి బతుకుతెరువుకోసం ఇంగ్లండుకు వెళ్లి, పెళ్లిచేసుకుని, లండన్లో స్థిరపడి, ఇంగ్లీషు పౌరసత్వం స్వీకరించాడు. అక్కడ ఆయన గడిపిన జీవిత వివరాలు అంతగా తెలియవు. 1733లో లండన్‌లోనే మరణించాడు.

తత్వవేత్తగానూ, రచయితగానూ మన్‌డెవిల్‌కి లభించిన కీర్తి అంతటికీ కారణభూతమైనది ఒకేఒక్క పుస్తకం. 1705లో గ్రంథకర్త పేరు లేకుండా ఆయనొక పుస్తకాన్ని ప్రచురించాడు. సాదా కవితలో సాగిన ఆ పుస్తకపు శీర్షిక "గొణిగే తేనెపట్టు లేక నిజాయితీపరులుగా మారిపోయిన మోసగాళ్లు." ఈ పుస్తకం జనం దృష్టిని అంతగా ఆకర్షించలేదు. 1714లో మన్‌డెవిల్ అదే కవితను పునర్ముద్రించి, దానికి సుదీర్ఘమైన ఒక వ్యాసాన్ని జతచేశాడు. ఈసారి ఆ పుస్తకానికి "తేనెటీగల కథ లేక వ్యక్తిగత దోషాలు, దుర్గుణాలు, సామాజిక ప్రయోజనాలు" అని పేరు పెట్టాడు. ఈ పేరుతోనే మన్‌డెవిల్ పుస్తకం ప్రసిద్ధి చెందింది.

అయితే యీ ముద్రణ సైతం జనం దృష్టిని అంతగా ఆకర్షించినట్లు కనిపించదు. 1723లో యీ "తేనెటీగల కథ, సమాజ స్వభావాన్ని గురించిన ఒక పరిశీలన" అన్న ఉపశీర్షికతో తిరిగి వెలువడినప్పుడు, మన్‌డెవిల్ ఆశించినట్లుగా అది జనం దృష్టిని ఆకర్షించింది. మిడిల్‌సెక్స్‌కి చెందిన జూరీకోర్టు ఆ పుస్తకాన్ని "శాంతిభద్రతలకు భంగకారి"గా పరిగణించింది. పత్రికల్లో దానిపైన వాదప్రతివాదాలు చెలరేగాయి. సహజంగానే మన్‌డెవిల్ దాంట్లో మహోత్సాహంగా పాల్గొన్నాడు. రచయిత జీవితకాలంలో ఆ పుస్తకం మరో అయిదు ముద్రణలు పొందింది. 1729లో "తేనెటీగల కథ" రెండో సంపుటాన్ని ఆయన ప్రచురించాడు.

బృహత్ ఆక్స్‌ఫర్డ్ ముద్రణ, రెండు శతాబ్దాల సాహిత్యంలో మన్‌డెవిల్ రచన ప్రస్తావనల సుదీర్ఘమైన జాబితాను యిచ్చింది. ఆయన్ని గురించి మార్క్స్, ఆడమ్ స్మిత్‌లు, వోల్టేర్, మెకాలేలు, మాల్తుస్, కీన్స్‌లు రాశారు.

ఇంగ్లీషు అర్థశాస్త్రాభివృద్ధిపైనా, ప్రత్యేకించి స్మిత్, మాల్తుస్‌లపైనా (తమాషా

యేమిటంటే వాళ్లిద్దరూ కూడా ఆయన్ని మొరటు సంశయాత్మకుడుగా తెగనాడు తారు!) మన్‌డెవిల్ ప్రభావం విశేషంగా వుంది. ఈ ప్రభావం విలువ, పెట్టుబడి, లాభం మొదలైన ప్రధాన భావాభివర్గాలపైన కాక, అంతకన్న ఎక్కువగా సాంప్రదాయిక అర్థిక సిద్ధాంతాన్ని గూర్చిన మౌలిక తాత్విక వైఖరిపైన వుంది.

మన్‌డెవిల్ చెప్పేదాంట్లోని ప్రధాన విరోధాభాసం "వ్యక్తిగత దోషాలూ దుర్గుణాలూ, సామాజిక ప్రయోజనాలు" అన్న మాటల్లో యిమిడివుంది. ఈ వాక్యంలోని "దోషాలు" అన్న మాట స్థానంలో స్మిత్ వాడిన సుప్రసిద్ధమైన "స్వప్రయోజనం" అనే పదాన్ని పెట్టినట్లయితే పెట్టుబడిదారీ సమాజాన్ని గూర్చి స్మిత్ చెప్పిన ప్రధానాంశం తయారవుతుంది: ఇంగితజ్ఞానంతో, ప్రతి వ్యక్తినీ తన స్వలాభ సంపాదనకు అనుమతిస్తే, మొత్తం సమాజ సంపద పెరుగుదలకూ, సమాజ వికాసానికీ అది తోడ్పడుతుంది. "నైతిక భావావేగాల సిద్ధాంతం" అనే తన పుస్తకంలో స్మిత్, మన్‌డెవిల్‌ని యిలా విమర్శిస్తాడు: "తేనెటీగల కథ" రచయిత స్వలాభార్జనకోసం చేసే యావత్తు ప్రయత్నాన్నీ, కృషినీ ఒక "దోషం" అంటాడు. అదొక్కటే ఆయన పొరపాటు. ఆ మాటకొస్తే, స్వప్రయోజనం అన్నది దోషం ఎంతమాత్రం కాదు.

అయితే ఆర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రకు మన్‌డెవిల్ ప్రాముఖ్యం యింతటితోనే ముగిసిపోలేదు. తన వ్యంగ్య రచనలో ఆయన బూర్జువా సమాజాన్ని అతి నిశితంగా విమర్శించాడు. దాని మౌలిక దోషాలను బహిర్గతం చేసిన ప్రప్రథముల్లో ఆయనొకడు. ఆయన "అవినీతి" అనబడినది యిదే. మార్క్స్ ఆయన్ని "...నిజాయితీపరుడు, భావస్పష్టత కలిగినవాడు"* అన్నాడు.

మానవ సమాజమే అంతకన్న నిర్దిష్టంగా చెప్పాలంటే, మన్‌డెవిల్ కాలపు బూర్జువా ఇంగ్లండే తేనెపట్టు. ఆ కథ మొదటి భాగంలోని వ్యంగ్య వైభవం స్విఫ్ట్ లేఖినికి దీటైనది. తనలో వున్న అసంఖ్యాకమైన దోషాలు, అవకతవకలు, నేరాల మూలంగానే ఈ సమాజపు అస్తిత్వం సాగుతున్నదనీ, అది వికసిస్తున్నదన్నదే ప్రధాన భావం. ఈ సమాజంలో "వికాసం" అన్నది కోట్లాది జనం

"... కొడవళ్లూ, పారలూ వగైరాలు చేబూని
సవాలక్ష కఠినాతికఠిన వృత్తుల్లో
రెక్కలు ముక్కలు చేసుకుంటేనే సాధ్యం;
నాలుగు వేళ్లూ నోట్లోకి వెళ్లేందుకు అనునిత్యం

---

* Karl Marx, *Capital*, Vol. I, Moscow, 1972, p. 577.

ఇచ్ఛికంగా చెమటోడ్చి కండలు కరిగించే
దౌర్భాగ్య దామోదరు లుంటేనే సాధ్యం...''*

అయితే, వాళ్లకి యీ పనైనా ఎందుకుంటుందంటే ధనికులు సౌకర్యాలూ, విలాసాలూ కోరుకుంటారు కనుక, తరచుగా ఫేషన్లు, కల్పిత కోర్కెలు, ఆడంబరాలు మొదలైన కృతకావసరాలను తీర్చుకొనేందుకు అవసరమైన వస్తువులపై కొల్లలుగా డబ్బు ఖర్చుబెడతారు గనుక. దురాశాపాతకులైన వ్యాజ్యాలమారి లాయర్లు, నాటు వైద్యులు, జ్ఞానశూన్యులైన సోమరి మతబోధకులు, కయ్యానికి కాలుదువ్వే జనరల్సు, చివరకు నేరస్థులు — వీళ్లందరూ, లోకజ్ఞానానికి విరుద్ధంగా, యీ సమాజానికి అతి ముఖ్యం. ఎందుకుట? ఎందుకంటే, వాళ్ల కార్యకలాపాలు అడ్డమైన రకాల సరుకులకూ, సేవలకూ గిరాకీని సృష్టిస్తాయి, పరిశ్రమనీ, పరికల్పనలనూ, సాహసోపేతమైన వ్యాపారాన్నీ ప్రోత్సహిస్తాయి.

ఈవిధంగా, యీ సమాజంలో

''...విలాసం
లక్షలాది పేదలకు వృత్తి కల్పిస్తుంది,
హేయమైన గర్వం మరికొన్ని
లక్షలమందికి వృత్తి కల్పిస్తుంది.
సాక్షాత్తూ ఈర్ష్యా స్వాతిశయాలు
పరిశ్రమకి సలహాదారులయ్యాయి,
తిండి, ఫర్నిచర్, దుస్తులపట్ల
వాళ్ల లేకి చాపల్యమనే
విడ్డూర, హాస్యాస్పద దోషమే
వర్తకాన్ని నడిపే చక్రం అయింది.''**

(ఇక్కడొక విషయాన్ని, ఉదాహరణకు, అమెరికన్ ఆటోమొబైల్ కంపెనీలను గుర్తుచేసుకోకుండా ఉండలేం. ఎటువంటి సాంకేతిక కారణమూ లేకుండా, కొలుగోలుదార్ల స్వాతిశయ భావాన్ని కికురించి, ఎలాగైనా సరే తమ అమ్మకాలను పెంచుకోవడం

---

* B. Mandeville, *The Fable of the Bees. Or, Private Vices, Public Benefits. With an Essay on Charity and Charity-Schools. And a Search into the Nature of Society*, 5th edition, London, 1728, p. 3.

* అదే పుస్తకం, పేజి 10.

మాత్రమే లక్ష్యంగా ప్రతి సంవత్సరమూ అవి తమ కార్ల మోడళ్లను మార్చేస్తాయి. ఈ పరిశ్రమ వికాసానికి మూలాధారం "చాపల్యం," తదితర మానవ బలహీనతలేననీ, యీ బలహీనతలు బుద్ధిపూర్వకంగా ప్రోత్సహింపబడుతున్నాయనీ అన్నప్పుడు, మన్‌డెవిల్‌తో యీ కంపెనీ డైరెక్టర్లు ఏకీభవించకుండా ఉండజాలరు.)

కాని తేనెటీగలు, తమ పట్టులో దోషం వున్నందుకు గొణుక్కుంటున్నాయి. వాటి మొరలను వినివిని విసుగెత్తిన దేవేంద్రుడు అకస్మాత్తుగా దోషాన్ని పరిహరించి, తేనెటీగలను దోహరహితం చేశాడు. అతి వ్యయం స్థానాన్ని పొదుపు ఆక్రమించింది. విలాసం అదృశ్యమైంది. సరళ సహజమైన అవసరాలకు మించిన వినియోగమంతా నిలిచిపోయింది. పరశ్రమోపజీవన వృత్తులన్నీ రద్దుచెయ్యబడ్డాయి. స్వజాతీయ దురభిమానంనుంచీ, దురాక్రమణపర సంకల్పాలనుంచీ విముక్తమైన

"వాటికి విదేశాల్లో పైనిక బలగా ల్లేవు;
విదేశీయులను కించపరచిన గర్వం లేదు,
యుద్ధాల ద్వారా లభించే శుష్క ఘనత లేదు."*

క్లుప్తంగా చెప్పాలంటే, మానవ సమాజపు సామాన్యమైన, ఆరోగ్యకరమైన సూత్రాలు అమల్లో వుంటాయి. కాని, దారుణం! సరిగా ఇవే సమాజానికి వినాశాన్నీ, పతనాన్నీ తెచ్చిపెడతాయి, దాన్నే మన్‌డెవిల్ కవితా రూపంలో యిలా వర్ణించాడు:

"ఇప్పుడు ఆ ఘనమైన తేనెపట్టును పరిశీలించండి,
నిజాయితీ వర్తకాలెలా సహజీవిస్తున్నాయో చూడండి:
ఆడంబరం అంతరించడంతో, అది ముందాలోచన చేస్తోంది;
దాని రూపమే మారిపోయింది.
ఏటా పెద్ద మొత్తాలు వెచ్చించినవి
దానికోసం మాత్రమే కాదు వెళ్లినది;
కాని, వాటిపై ఆధారపడి బతికిన గుంపులు,
నిత్యం ఒకటే చేసేలా నిర్బంధింపబడ్డాయి.
అవి వేరే వృత్తులకు వృథాగా పరుగెత్తుతాయి;
దానితో అన్నీ కిటకిటలాడుతాయి....
గృహనిర్మాణ వృత్తి పూర్తిగా మూలపడింది,
వృత్తి నిపుణులకు పని లేకుండా పోయింది

---

* అదే పుస్తకం, పేజి 18.

కళాకారుడికి తన కళకు కీర్తి లేదు;

శిలలుచెక్కి, శిల్పాలు తీర్చిదిద్దేవారికి పేరు ప్రతిష్ఠల్లేవు.''*

క్లుప్తంగా చెప్పాలంటే, ఒక ఆర్థిక సంక్షోభం మొదలవుతుంది: నిరుద్యోగం పెరుగుతుంది, గోదాముల్లో సరుకులు మేట్లు పడతాయి, ధరలూ, ఆదాయలూ పడిపోతాయి, నిర్మాణం నిలిచిపోతుంది. పరశ్రమోపజీవులూ, యుద్ధకండూతి కలవాళ్లూ, దుబారా ఖర్చుదారులూ, మోసకారులూ సౌభాగ్యాన్ని తెచ్చి, శాంతి, నిజాయితీ, పొదుపు, సమరస స్వభావాల వంటి తిరుగులేని సద్గుణాలపట్ల ప్రేమ ఆర్థిక వినాశానికి దారితీసే ఆ సమాజం ఎంత గొప్పది!

మన్‌డెవిల్ భావాలు — వాటిని ఆయన విరోధాభాసప్రాయమైన రూపంలో అభివృద్ధి చేశాడు (''కథ''లోని తదుపరి గద్య భాగంలో ఆ భావాలను మరింత నిగ్రహంతో వివరించాడు) — తదుపరి శతాబ్దాల్లో అర్థశాస్త్రాభివృద్ధి దృష్ట్యా ప్రత్యేకించి ఆసక్తిదాయకమైనవి. రెండు అతి ముఖ్యమైన వాస్తవాలను మనం ప్రస్తావించుకుందాం.

సమాజంలోని అన్ని వర్గాలూ, పొరలూ (భూస్వాములు, మతబోధకులు, అధికారులు వగైరాలు) ఉత్పాదకమైనవి, ఆర్థికంగా అవసరమైనవి అన్న భావాన్ని మాల్తుసూ, ఆయన అనుచరులూ చేబట్టారు. ''ఆదనపు విలువ సిద్ధాంతాలు''లోని ఓ చిన్న పుస్తకంలో యీ దృక్పథం సరికాదని రుజువుచేసేందుకుగాను మన్‌డెవిల్ భావాలనూ, చివరకు ఆయన శైలిని సైతం మార్క్స్ వినియోగించుకున్నాడు. మార్క్స్ యిలా అంటాడు: ''...సాధ్యమైన ప్రతి ఒక వృత్తి రూపమూ ఉత్పాదకమైనదేనని మన్‌డెవిల్ యింతకుముందే రాశాడు.... తేడా అల్లా ఏమిటంటే, మన్‌డెవిల్ కూపస్థమండూకాల్లాంటి యీ బూర్జువా సమాజ సమర్థకులకన్న కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ సాహసికుడూ, ఎక్కువ నిజాయితీపరుడూను.''**

అతి పొదుపు హానిదాయకం, అనుత్పాదక వ్యయం, ఏ రూపంలోనైనా సరే అమిత వ్యయం, అది గిరాకీనీ, ఉద్యోగాలనూ కల్పించినంతకాలం, ప్రయోజనకరమే కాకుండా, చివరకు ఆవశ్యకం కూడా అన్న భావాన్ని మన కాలంలో కీన్స్ పునరుద్ధరించి, దాన్ని పవిత్రీకరించాడు. ఆయన మన్‌డెవిల్‌ని (మాల్తుస్‌నీ) తనకు ఆద్యుడుగా పరిగణించాడు.

పెట్టుబడిదారీ విధానంలోని ఏ దోషాలనూ చూడ నిరాకరించిన బూర్జువా అర్థశాస్త్రం, 19వ శతాబ్దం చివరివాటికి మన్‌డెవిల్‌ని ఒక వాటుసిద్ధాంతవేత్తగానూ,

---

* ఆదే పుస్తకం, పేజీలు 18–19.

** Karl Marx, *Theories of Surplus-Value*, Part I, Moscow, 1969, p. 388.

జిత్తులమారి చమత్కారిగానూ పరిగణించింది. ఆడమ్ స్మిత్ మిక్కిలి గొప్ప వ్యక్తిగత, సామాజిక సుగుణంగా ఆకాశానికెత్తిన మితవ్యయాన్ని విమర్శించాలన్న భావమే ఏ ఒక్కరికీ తట్టలేదు. 1929–33 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభమే ప్రముఖ బూర్జువా అర్థశాస్త్రవేత్తలను మన్‌డెవిల్ బాణీలో ఆలోచింపజేసింది: జనం పొదుపు చెయ్యనారంభిస్తే వాళ్లు సరుకులను కొనరు, అంటే "ఆచరణలో గిరాకీ" పడిపోతుందన్నమాట; కనుక జనం తమ డబ్బును ఏవిధంగానైనా సరే, దేనికోసమైనా సరే ఖర్చు పెట్టేలా చెయ్యాలి.

డాక్టర్ మన్‌డెవిల్ విరోధాభాసలు వెలుగులోకి వచ్చి యిప్పటికి రెండున్నర శతాబ్దాలు దాటింది. అయితే, తన విమర్శనాత్మక దృష్టితో ఆయన ఏ సమాజాన్నైతే పరిశీలించాడో ఆ సమాజం మాదిరిగానే ఆ విరోధాభాసలు యీ నాటికీ సజీవంగా వున్నాయి.

సాంప్రదాయిక శాఖ రూపొందడం

స్మిత్ విద్యార్థి, మిత్రుడూ అయిన డుగాల్డ్ స్ట్యూవర్ట్‌చేత అర్థశాస్త్రం మొట్టమొదట ఒక ప్రత్యేక విజ్ఞానశాస్త్రంగా ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో 1801లో బోధింపబడిందన్న విషయం సార్వత్రికంగా ఆమోదింపబడింది. ఈ విజ్ఞానశాస్త్రానికి ప్రొఫెసర్లు ఎంతమాత్రం కానివాళ్లు ముఖ్యమైన సేవలు చెయ్యడమన్నది కొనసాగుతూనే వున్నప్పటికీ, ఆర్థికశాస్త్రంలో యీ ప్రొఫెసరు 19వ శతాబ్దిదాకా ప్రసిద్ధి చెందలేదు. 17, 18 శతాబ్దాల్లో ఈ నూతన విజ్ఞానశాస్త్రాన్ని సృష్టించిన ప్రతిభావంతులను మూడు తరగతులుగా విభజించవచ్చు.

మొదటి తరగతివారు, తమతమ ప్రత్యేక కాలానికి విశిష్టమైన ప్రకృతి, సమాజాల సాధారణ వ్యవస్థల చట్రంలోపల ఆర్థిక సమస్యలను అధ్యయనం చేసిన తత్వవేత్తలు. వారిలో మిక్కిలి ప్రముఖులు: ఇంగ్లండులో థామస్ హాబ్స్, జాన్ లోక్, డేవిడ్ హ్యూమ్, ఒక విధంగా, ఆడమ్ స్మిత్, ఫ్రాన్సులో హెల్వెటియస్, కన్‌డిల్యాక్‌లు, ఇటలీలో బెక్కారియ.

రెండవ తరగతివారు వర్తక సంకుచిత పరిధినుంచి ప్రభుత్వ వ్యవహారాల్లో ప్రవేశించి, రాజనీతిజ్ఞుల మాదిరిగా ఆలోచించ ప్రయత్నించిన వ్యాపారస్తులు, వర్తకులు. వీరిలో థామస్ మన్, జాన్ లా, డడ్లీ నార్త్, రిచర్డ్ కంటిల్యోన్‌ల పేర్లు చెప్పుకోవచ్చు.

ఫ్రాన్సులో బువాగిల్బేర్, ట్యూర్గో, గుర్నే ఆ దేశానికి విశిష్టమైన న్యాయశాస్త్ర, పరిపాలనా విభాగానికి ప్రాతినిధ్యం వహించారు.

చివరకు మూడవ తరగతి, మేధావంతులైన సామాన్యులు. వివిధ వృత్తులకు చెందిన వీరు కొన్ని సందర్భాల్లో ఉన్నత వర్గంలోకి చేరుకున్నారు, మరికొన్ని సందర్భాల్లో అలా చేరుకోలేదు. వైద్యులైన విలియం పెట్టీ, నికొలస్ బర్బోన్, బెర్నార్డ్ మన్‌డెవిల్, ఫ్రాన్సువా కెనేలను విజయవంతంగా అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేసినవారుగా మార్క్స్ గమనించాడు. దీన్ని మనం అర్థం చేసుకోవచ్చు, ఎందుకంటే, ఆ రోజుల్లో ప్రత్యేక కృషి జరుగుతున్న ప్రకృతి విజ్ఞానశాస్త్రమల్లా వైద్యశాస్త్రం మాత్రమే. కాగా సహజంగానే అది, చురుకైన భావుకులను ఆకర్షించింది. 18వ శతాబ్దపు అర్థ శాస్త్రవేత్తల్లో మతబోధకులు మనకి కనిపిస్తారు. ఫ్రాన్సు, ఇటలీల్లో ఆబట్లు (ప్రగాఢ పరిజ్ఞాన ప్రతిభా సంపన్నుడైన ఇటాలియన్ అర్థశాస్త్రవేత్త ఫెర్నాండో గలియానితో సహా), ఇంగ్లండులో ఆంగ్లికన్ ఫాదరీలు (టకర్, మాల్తస్).

ఈ తరగతులు అత్యంత ఆచారసిద్ధమైనవనీ, భావాల అభివృద్ధిని ఎంతమాత్రం నిర్ణయించవనీ గుర్తించడం అవసరం, అయితే ఈ విజ్ఞానశాస్త్రాభివృద్ధి సంక్లిష్ట క్రమాన్ని అర్థంచేసుకోడానికి అవి తోడ్పడుతాయి.

ఆర్థిక రచనకు వెనకవుండే ప్రధాన ప్రేరేపణ ఆచరణాత్మకమైనదై – ఒకానొక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని ఖండిస్తూనో, బలపరుస్తూనో వాదించేదిగా – వుంటుంది. కాని 1760 దశకంలో వెలువడిన ట్యూర్గో, జేమ్స్ స్ట్యూవర్ట్ రచనలు 17వ శతాబ్దంలోనూ, 18వ శతాబ్ది మొదట్లోనూ వెలువడిన వ్యాపారవాదుల చిన్న పుస్తకాల నుంచి విశేషంగా విభేదిస్తాయి. అవి, అర్థశాస్త్ర మౌలిక సూత్రాలను క్రమబద్ధంగానూ, సిద్ధాంతపరంగానూ విడమరచి చెప్పే తొలి ప్రయత్నాలు.

దీనికితోడు, యీ "ఆచరణాత్మక ప్రేరేపణ" వివిధ రూపాలు ధరిస్తుంది. కొందరు రచయితల విషయంలో యిది, తమ వర్గ ప్రయోజనాలనూ, తమ స్వప్రయో జనాలనూ బాహాటంగా పత్రికల్లో బలపరచే రూపంలో వుంటుంది. మరికొందరి విషయంలో యిది, సామాజిక విషయాల ప్రగాఢతరమైన శాస్త్రీయాధ్యయన క్రమంగా వుంటుంది, వీరి పద్ధతి వర్గ ప్రయోజనాన్ని సంక్లిష్టమైన మాధ్యమిక రూపంలో మాత్రమే పరిగణనలోకి తీసుకొంటుంది. సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రం యీ రెండవరకంవారిచేతనే సృష్టింపబడిందన్న విషయాన్ని ప్రత్యేకించి వేరే చెప్పనక్కర్లేదు. ఉదాహరణకు ఆడమ్ స్మిత్ వ్యాపారస్తుడూ కాదు, పారిశ్రామికవేత్తా కాదు, కాగా "జాతుల సంపద" అన్న తన పుస్తకంలో ప్రవచించిన స్వేచ్ఛా వ్యాపార విధానంవల్ల ఆయన వ్యక్తిగతంగా పొందే లాభమేమీ ఉండజాలదు. అంతే కాదు, ఆయన జీవితంలోని

ఒక విరోధాభాస ఏమిటంటే, ఆ పుస్తకం వెలువడ్డాక, కస్టమ్స్ (సుంకాల) శాఖలో ఆయనకి జీతంతో ఉద్యోగం లభించింది; ఆయన వ్యతిరేకించిన వ్యవస్థకు ఈ కస్టమ్స్ శాఖ మూర్తీభావమే.

తన విరోధాభాసలు ఎంత ప్రతిభావంతమైనవైనప్పటికీ, మన్‌డెవీల్, ఇంగ్లండులో అర్థశాస్త్రపు సాంప్రదాయిక శాఖ రూపుదాల్చే క్రమంలో, కొంత ఎడంగా కనిపిస్తాడు. ఇంగ్లండులో సాంప్రదాయిక అర్థశాస్త్రం పెట్టీకి వేరుగా అనుయాయులైన లోక్ (1632–1704), నార్త్ (1641–1691)ల పేర్లతో ప్రథమంగానూ, ప్రధానంగానూ ముడిపడివుంది.

17వ శతాబ్దపు అత్యంత ప్రముఖ తత్వవేత్తా, ప్రజ్ఞానపు భౌతికవాద సిద్ధాంత కర్తల్లో ఒకడూ, బూర్జువా లిబరలిజం (ఉదారవాదం) జనకుడూ అయిన లోక్, 1691లో ప్రచురింపబడిన తన రచన "వడ్డీ తగ్గింపూ, డబ్బు విలువ పెంపుదలల పర్యవసానాలను గూర్చి కొన్ని పరిశీలనలు" మూలంగా, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాడు. అంతే కాకుండా, మొత్తంగా లోక్ తత్వశాస్త్రం 18వ శతాబ్దంలోనూ, 19వ శతాబ్ది మొదట్లోనూ ఇంగ్లీషు అర్థశాస్త్రానికి పునాదిగా పనిచేసింది. సామాజిక విజ్ఞానశాస్త్రాల్లో ప్రాకృతిక నియమ భావాలను లోక్ అభివృద్ధి చేశాడు, ఇవి, ప్రకృతి విజ్ఞానశాస్త్రాల్లో న్యూటన్ యాంత్రిక భౌతికవాదానికి ఒక మాదిరిగా సమానమైనవి. తమ కాలానికి యీ భావాలు, యింతకుముందే పేర్కొన్నట్లు, సామాజిక విషయాల రంగంలో వస్తుపర నియమ సూత్రాన్ని ప్రవేశపెట్టినందున, ప్రగతిశీలమైనవి. అదనపు విలువను అర్థంచేసుకునే దిశగా లోక్ వేసిన ముఖ్యమైన ముందడుగు సైతం ప్రాకృతిక నియమ దృష్ట్యానే వెయ్యబడింది. తన సొంత శ్రమద్వారా తను సాగుచెయ్యగలిగినంత భూమీ, తన సొంత వినియోగానికి అవసరమైనన్ని యితర సరుకులూ (డబ్బుతోబాటు అనడం స్పష్టం) మనిషికి సహజంగా ఉండాలని ఆయన రాశాడు. ఆస్తి విభజనలో కృతకమైన అసమానత్వం కొందరు అదనపు భూమినీ, డబ్బునూ కలిగివుండడానికి దారితీస్తుంది; వాళ్ళు భూమిని కౌలుకిస్తారు, డబ్బును వడ్డీకిస్తారు. భూమి కౌలునూ, వడ్డీనీ దోపిడి వల్ల లభించే ఒకే రకమైన రెండు ఆదాయ రూపాలుగా లోక్ పరిగణించాడు.

డడ్లీ నార్త్ సహజ ప్రతిభ వున్న వ్యక్తి. ఒక ప్రభు కుటుంబంలో చిన్నకొడుకుగా పుట్టిన నార్త్ చిన్నతనంలో చదువులో బొత్తిగా రాణించకపోవడంతో, లెవాంట్ కంపెనీలోని ఒక వ్యాపారస్తుని దగ్గర అప్రెంటిస్‌గా (థామస్ మన్ మాదిరిగా) కుదర్చబడ్డాడు. నార్త్ టర్కీలో చాలా సంవత్సరాలు గడిపి, నలభై సంవత్సరాలకు కొంచెం తక్కువ వయస్సులో ధనవంతుడుగా స్వదేశానికి తిరిగివచ్చాడు. కాని, ఒక రచయిత

వర్ణించినట్లు, "ఆయన ఆటవికుని మాదిరిగా కనిపించేవాడు, అంతకన్న ఎక్కువ సంస్కృతీ పరుడుగా కనిపించేవాడు కాడు." రెండవ చార్లెస్ కింద టోరీ అభివృద్ధి నిరోధక పాలన కాలంలో 1683లో లండన్ సిటీ షరీఫ్ (పోలీసు ఉన్నతాధికారి) అయినప్పుడు ఆయన తన ఆటవిక అలవాట్లను బయటపెట్టుకున్నాడు. ఆయన రాజుకు విధేయంగా సేవ జేశాడు, విగ్గులకు గొప్ప హానిచేశాడు, అందుకుగాను నైట్ బిరుదం పొంది, సర్ డడ్లీ అయాడు. దీని తరువాత, అనేక ముఖ్యమైన పదవులను ఆయన అధిష్ఠించాడు. అయితే 1688–89 నాటి విప్లవం, పదవుల సోపాన పటంలో ఆయనింకా పైకి వెళ్లే అవకాశాన్ని తుంచేసింది.

లోక్‌కి గల పాండిత్యంలో పదోవంతైనా తనకు లేకపోయినా, సర్ డడ్లీకి ఏ ప్రామాణికులనూ గుర్తించని ఖండితమూ, సాహసికమూ అయిన ఆర్థిక భావన విషయంలో అసాధారణమైన ప్రతిభ వుంది. లోక్ రచనకు సమకాలికమైన, అదే సమస్యపై రచింపబడిన ఆయన చిన్న పుస్తకం "వర్తకంపై పరిశీలన" 17వ శతాబ్దపు ఆర్థిక చింతన సాధించిన అతి చక్కని విజయాల్లో ఒకటి.

అర్థశాస్త్రపు మౌలిక శాస్త్రీయ పద్ధతిని – తార్కిక సాధారణీకరణను – అభివృద్ధిపరచే విషయంలో నార్త్ చాలా చేశాడు – ఒకానొక ఆర్థిక విషయాన్ని విశ్లేషించేందుకుగాను – అదెప్పుడూ కూడా అత్యంత సంక్లిష్టంగా వుండి, అనంతమైన సంబంధాలను కలిగి వుంటుంది – దాన్ని మనం దాని "శుద్ధ రూపం"లో, దాని అన్ని అనావశ్యక లక్షణాలనూ, సంబంధాలనూ విస్మరించి, ఊహించుకోవలసివుంటుంది.

పెట్టుబడిని వడ్డీని యిచ్చే డబ్బు పెట్టుబడి రూపంలో మాత్రమే పరిశీలించాడన్న విషయం నిజమే అయినప్పటికీ, పెట్టుబడిని అర్థంచేసుకోడంలో నార్త్ తొలి అడుగులు వేశాడు. రుణాలపైన వడ్డీ అన్నది, దేశంలో వున్న డబ్బు మొత్తంపైన కాక (వ్యాపారవాదులూ, లోక్ సైతం అలాగే భావించారు), ధనరూప పెట్టుబడి సంచయనం, దానికిగల గిరాకీల నిష్పత్తినిబట్టి నిర్ణయింపబడుతుందని ఆయన నిరూపించాడు. సాంప్రదాయిక వడ్డీ సిద్ధాంతానికి యిదే పునాదిని వేసింది, దాన్నుంచే తర్వాత లాభమనే భావాభివర్గపు అవగాహన ఉత్పన్నమైంది. డబ్బుకి సంబంధించిన సిద్ధాంతాభివృద్ధికి కూడా నార్త్ విశేషంగా కృషిచేశాడు.

అయితే నార్త్‌కి సంబంధించిన ప్రధానాంశం ఏమిటంటే, వ్యాపారవాదంపై ఆయన సూత్రబద్ధమైన విమర్శ, "సహజ స్వేచ్ఛ"కు ఆయన కృతనిశ్చితమైన తోడ్పాటూను. వడ్డీయొక్క నిర్బంధ నియంత్రణకు (ఆయనకన్న ముందు పెట్టీ, లోక్‌ల మాదిరిగా) ఆయన వ్యతిరేకతే దీనికి కారణం. అయితే, వ్యాపారవాదంపై పోరాటంలో నార్త్, వాళ్లకంటె ముందుకు వెళ్లాడన్నమాట నిజమేననుకోండి. ఈ విషయంలో ఆడమ్ స్మిత్‌కు ఆయన నేరుగా ఆద్యుడు.

శ్రమ విలువ సిద్ధాంతంలో లోక్‌గాని, వార్త్‌గాని పెట్టీని దాటి ముందుకెళ్లలేదు. కాని, 17వ, 18వ శతాబ్దాలలో వెలువడిన పలు రచనల్లో యీ సిద్ధాంతం క్రమంగా అభివృద్ధిపరచబడి, రూఢి చెయ్యబడి, తద్రీత్యా స్మిత్‌కి భూమికను సంసిద్ధంచేసింది. శ్రమ విభజన పెరుగుదల, ఉత్పత్తిలో కొత్త శాఖల ఆవిర్భావం, సరుకుల మారకం విస్తరణ — యివన్నీ, జనం వాస్తవంలో మానవ శ్రమను మార్పిడి చేసుకుంటున్నారన్న భావాన్ని రూఢిపరచాయి. తత్పర్యవసానంగా మారకపు నిష్పత్తీ, సరుకుల మారకపు విలువలూ, ప్రతి ఒక్క సరుకు ఉత్పత్తికీ వినియోగింపబడిన శ్రమ పరిమాణాన్ని బట్టి నిర్ణయింపబడాలి. ఉపయోగపు విలువలుగా సంపదను సృష్టించడంలో భూమీ, ఉత్పత్తి పరికరాలూ కచ్చితంగా పాత్ర వహిస్తాయనీ, కాని విలువ సృష్టితో సంబంధం కలిగివుండవన్న చైతన్యం నానాటికీ పెరుగుతూ వచ్చింది.

భావాల అస్పష్టతా గందరగోళంనుంచి, యీ భావాలు మెల్లగా, చాలా కష్టం మీద, రూపుదాల్చాయి. అభివృద్ధిచెందుతున్న భావాల యీ కఠిన పోరాటం ఆడమ్ స్మిత్ బుర్రలో తిరిగి జరిగింది, దాన్ని యీ కింద వర్ణించేందుకు ప్రయత్నిస్తాం. ఆయన ముందువారిలో అతి ముఖ్యులు 1730–1750 దశకాల మధ్య రచనలు చేసిన రిచర్డ్ కంటిల్యోన్, జోసెఫ్ హారిస్, విలియం టెంపుల్, జోసయ్య టకర్.

ఒక రచయిత — ఆయన పేరు ఆకాశరామన్న 1738* — అయినందున ఆయన్ని గురించి మనమేమీ చెప్పలేము శ్రమ విలువ సిద్ధాంతాన్ని అద్భుతమైన కచ్చితత్వంతో రూపొందించాడు. ఈ విషయంలో ఒక విధంగా ఆయన స్మిత్‌ను సైతం అధిగమించి ముందుకెళ్లాడు. 17, 18 శతాబ్దాల్లో పలు అర్థశాస్త్ర రచనలు గ్రంథకర్త పేరు లేకుండా ప్రచురింపబడ్డాయి. వాటిలో కొన్నింటి రచయితలు చాల కాలంగా స్థిర పడినవాళ్లు, మిగిలినవారు యీ విజ్ఞానశాస్త్రంలో ప్రముఖ పాత్ర వహించినవాళ్లు కారు.

"మొత్తంమీద డబ్బుయొక్క వడ్డీని గురించి కొన్ని ఆలోచనలు" అనే సామాన్యమైన శీర్షికను కలిగిన యీ రచనమంచి కీలకమైన ఒక ఖండికను ఉల్లేఖిద్దాం. విశ్లేషణ సౌలభ్యం కోసం కుడిపక్క కాలమ్‌లో వ్యాఖ్యానం యివ్వబడింది.

"జీవితావసరాల అసలైన నిజమైన విలువ, మానవ జాతి పోషణకు అవి చేకూర్చే ఏ భాగం అయితే వుంటుందో ఆ భాగానికి అనుపాతంలో వుంటుంది; వాటిలో ఒకటికి మరొకటి మార్పిడి	వాస్తవానికి రచయిత యిక్కడ ఉపయోగపు విలువకు ఒక నిర్వచనం యిస్తున్నాడు.

---

* ఈ 1738 అన్న తేదీ పూర్తిగా ధృవీకరింపబడలేదు.

చేసుకోబడినప్పుడు వాటి విలువ, తప్పని సరిగా అవసరమైన శ్రమ పరిమాణంచేత, వాటిని ఉత్పత్తి చెయ్యడంలో మామూలుగా గ్రహింపబడినదానిచేత నియంత్రింపబడుతుంది; అవి కొనబడినప్పుడూ, అమ్మబడినప్పుడూ వాటి విలువ లేక ధర, ఉమ్మడి మాధ్యమానికి సరిపోల్చబడి, వినియోగింపబడిన శ్రమ పరిమాణంచేతా, మాధ్యమం లేక ఉమ్మడి కొలమానపు ఎక్కువ సమృద్ధి లేక తక్కువ సమృద్ధిచేత శాసింపబడుతుంది. నీళ్లు జీవితానికి బ్రెడ్ అంత లేక ద్రాక్షపానీయం అంత ముఖ్యం; కాని దైవ హస్తం నీళ్లను మానవునికి అంత ఎక్కువగా ప్రసాదించినందున ప్రతి మనిషికీ అది ఎటువంటి 'యిబ్బందీ' లేకుండా తగినంతగా లభిస్తుంది, కాగా సామాన్యంగా దానికే ధరా వుండదు; కాని ప్రత్యేక వ్యక్తులకు అనువర్తించేందుకుగాను, ఎక్కడ, ఎప్పుడు ఏ శ్రమ అయినా ఉపయోగింపబడవలసి వుంటుందో, అక్కడ ఆ శ్రమను అనువర్తించేటప్పుడు దానికి — నీటికి అవసరం లేకపోయినా — డబ్బు చెల్లించవలసి వుంటుంది: ఆ కారణంగా, కొన్ని సమయాల్లో, కొన్ని చోట్ల, ఒక టన్ను నీరు ఒక టన్ను వైన్ అంత ప్రియంగానూ ఉండవచ్చు."*

ఉపయోగపు విలువనుండి పూర్తిగా భిన్నమైన మారకపు విలువ భావన యివ్వబడింది; సామాజికంగా అవసరమైన శ్రమకాల భావం యిక్కడ పిండరూపంలో యిమిడి వుంది.

రచయిత యిక్కడ ధరకీ, విలువకీ మధ్య భేదాన్ని చూస్తున్నాడు, డబ్బు అదనంగా వుందా లేక కొరతగా వుందా అన్నదాన్ని బట్టి ధర మారుతుందని గమనిస్తున్నాడు.

"విలువయొక్క విరోధాభాసం" అనబడే యీ సాంప్రదాయిక దృష్టాంతం ఉపయోగపు విలువకూ మారకపు విలువకూ మధ్య గల మౌలికమైన తేడాను చూపుతుంది.

ప్రకృతి కాదు, శ్రమ మాత్రమే విలువను సృష్టిస్తుందని రచయిత యిక్కడ నిర్ద్వంద్వంగా చెప్తున్నాడు.

---

* R. L. Meek, *Studies in the Labour Theory of Value*, London, 1956, pp. 42–43నుండి ఉల్లేఖింపబడింది.

విలువ సిద్ధాంతం అభివృద్ధిచెందే సందర్భంగా ముఖ్యమైన యితర రంగాల్లో కూడా పురోగతి సాధింపబడుతోంది. కూలికి కుదుర్చుకోబడిన కార్మికుల వేతనాలు కడపటి విశ్లేషణలో, జీవికకు అవసరమైన కనీస మొత్తంచేత నిర్ణయింపబడుతుందన్న పెట్టీ భావాన్ని అభివృద్ధిచేసే క్రమంలో అర్థశాస్త్రవేత్తలు యీ కనీస మొత్తపు స్వభావ అవగాహనకు సన్నిహితంగా వచ్చారు. జనాభా సమస్యలను అధ్యయనం చెయ్యడంద్వారా కొంతమేరకు, కార్మికుల మధ్య పోటీ, వేతనాలను పరమ కనీస స్థాయికి దిగజార్చే పద్ధతిలో, శ్రమశక్తి పునరుత్పాదనమ నికరం చేసే యంత్రాంగాన్ని వాళ్లు కనుగొన్నారు.

పెట్టుబడినీ, పెట్టుబడినుంచి రాబడినీ అర్థంచేసుకోడంలో ముఖ్యమైన ఒక ముందడుగు ఏమిటంటే, వర్తక, పరిశ్రమలనుంచి లభించే లాభానికీ, రుణాలపైన వడ్డీలకీ మధ్య తేడాను గుర్తించడం. 1750 దశకంలో రచనలు చేసిన జోసెఫ్ మాస్సీ, డేవిడ్ హ్యూమ్‌లు సామాన్య పరిస్థితుల్లో వడ్డీ అన్నది లాభంలో ఒక భాగం అన్న సంగతిని అప్పటికే స్పష్టంగా అర్థంచేసుకున్నారు: వర్తకుడూ, పారిశ్రామికవేత్తా డబ్బు, రుణ పెట్టుబడి సొంతదారుతో పొలుపంచుకోక గత్యంతరం లేని స్థితిలో పడ్డారు.

ఈ విధంగా, స్మిత్‌కి పూర్వపు అర్థశాస్త్రం వాస్తవానికి అదనపు విలువను పరిశీలించింది, కాని, దాని స్వభావాన్ని అది అర్థంచేసుకోలేదు, లాభపు ప్రత్యేక రూపాలైన వడ్డీగానూ, భూమి శిస్తుగావే అదనపు విలువను అది అర్థం చేసుకుంది.

డేవిడ్ హ్యూమ్

1776 మార్చి, ఏప్రిల్ మాసాల్లో తీవ్రమైన వ్యాధితో మంచంపట్టి, తనకు మరణం ఆసన్నమవుతున్న సంగతిని గ్రహించిన హ్యూమ్, హడావిడిగా తన ఆత్మకథను రాశాడు. తర్వాత ఆయన మరో నాలుగు నెలలు బతికాడు. ఆ ఆత్మకథ ఆయన మరణానంతరం, కొద్ది కాలానికి, పావు శతాబ్దంపాటు ఆయన అత్యంత సన్నిహిత మిత్రుడైన ఆడమ్ స్మిత్ రాసిన పరిచయ లేఖతోబాటు, ప్రచురితమైంది. స్మిత్ ఆ తత్వశాస్త్రజ్ఞుని జీవితపు చివరి మాసాలను గురించి వర్ణించాడు. హ్యూమ్ యితరులు అసూయపడదగినంతటి మనశ్శాంతితోనూ, అసాధారణమైన మనోనిబ్బరంతోనూ మరణించాడు. స్థూలకాయుడుగా వుండే ఆయన్ని వ్యాధి సజీవ కంకాళంగా మార్చేసినప్ప

టికీ, సరదాగా కలిసికట్టుగా వుండే హ్యూమ్ తన యీ సల్లక్షణాలను చివరిదాకా నిలుపుకున్నాడు.

స్మిత్ రాసిన ఆ పరిచయ లేఖ అర్థశాస్త్రంలో ఒక అసాధారణమైన పాత్రను వహించింది. అప్పటికే నాస్తికుడుగా పేరొందిన హ్యూమ్, దైవభీతి కలిగిన క్రిస్టియనుగా మరణించలేదన్న విషయాన్ని ఆ లేఖ నిర్ద్వంద్వంగా స్పష్టంచేసింది. స్మిత్ కూడా యీ మతబాహ్య ధోరణినే కలిగివుండేవాడు.

దానితో చర్చి క్రోధం చనిపోయిన హ్యూమ్‌పైనా, బతికి వున్న స్మిత్‌పైనా విరుచుకుపడింది. అంతకు ముందే ప్రచురించబడిన స్మిత్ "జాతుల సంపద" మొదట్లో విద్యావంతుల ఓ చిన్న బృందంచేత మాత్రమే గమనింపబడింది. కాని హ్యూమ్, స్మిత్‌ల పేర్ల చుట్టూ రేగిన దుమారం – తొందరపాటు లేకుండానూ, వినమ్రముడుగానూ వుండే స్మిత్‌కి యిది అసంతోషకరమైన ఆశ్చర్యాన్నే కలిగించింది – ఆ పుస్తకంపట్ల సార్వత్రికమైన ఆసక్తిని రేపింది. దానితో ముద్రణ తర్వాత ముద్రణ వెలువడి, పదేళ్లలో "జాతుల సంపద" ఆంగ్ల అర్థశాస్త్రపు బైబిలుగా తయారైంది.

అయితే హ్యూమ్, మరో రకంగా కూడా స్మిత్‌కి మార్గాన్ని సుగమం చేశాడు. ప్రధానంగా 1752లో ప్రచురింపబడిన, చక్కగా కూర్చబడిన నాతిదీర్ఘమైన హ్యూమ్ వ్యాసాలు, వ్యాపారవాదంతో జరిగిన పోరాటంలో స్మిత్ పూర్వపు సాంప్రదాయిక అర్థశాస్త్రం సాధించిన విజయాలకు సంక్షిప్త సారాంశం. "జాతుల సంపద"కు ప్రజల మనస్సులను అభిముఖం చెయ్యడంలో ఆ వ్యాసాలు ఒక ముఖ్యమైన పాత్రను వహించాయి.

డేవిడ్ హ్యూమ్, ఎడిన్‌బరోలో, 1711లో ఆస్తిహీనుడైన ఒక ప్రభువు యింట కనిష్ట పుత్రుడుగా జన్మించాడు. ఆయన తన జీవితయాత్రను స్వప్రయత్నంతో సాగించవలసివచ్చింది. అందుకు ఆయన ప్రధానంగా నిపుణమైన తన లేఖినిపై ఆధారపడ్డాడు. సాంప్రదాయిక స్కాటిష్ సుగుణాలైన పరిశ్రమా, మితవ్యయమూ ఆయనకి కొల్లలుగా వున్నాయి.

తన 28వ ఏట, తన ప్రధాన తాత్విక రచన అయిన "మానవ స్వభావ పరిశీలన"ను హ్యూమ్ ప్రచురించాడు. అది, దరిమిలా ఆయన్ని, 18వ శతాబ్దపు అత్యంత ప్రముఖ బ్రిటిష్ తత్వవేత్తల్లో ఒకడినిగా చేసింది. హ్యూమ్ తత్వశాస్త్రం దరిమిలా అజ్ఞేయతావాదం అని పిలువబడింది. లోక్ మాదిరిగానే హ్యూమ్ కూడా, పాదార్థిక వస్తువులను గూర్చిన మనిషి జ్ఞానానికి ప్రధానాధారం ఇంద్రియానుభూతియేనని వాదించాడు. అయితే యీ బాహ్య వస్తువులను (పదార్థం) గూర్చిన పూర్తి ప్రజ్ఞానం సూత్రరీత్యా అసాధ్యమని ఆయన భావించాడు. ఆయన భౌతికవాదానికీ భావవాదానికీ మధ్య దేన్నో కనుక్కోవాలని ఊగిసలాడి, ప్రపంచం అజ్ఞేయమని వాదించడం ద్వారా

అనివార్యంగా భావవాదం దిశకే దిగజారాడు. మతంపై ఆయన విమర్శ మౌఢ్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో విశేషంగా తోడ్పడింది. అయితే ఆయన స్థిరమైన నాస్తికుడు కాడు. ఆయన తత్వశాస్త్రం విజ్ఞానశాస్త్రానికీ, మతానికీ మధ్య "రాజీ"కి సందు విడిచిపెట్టింది.

హ్యూమ్ గ్రంథం మొదట్లో ప్రజాభిమానాన్ని చూరగొనడంలో విజయం సాధించలేదు. దాని సంక్లిష్టతనే యిందుకు కారణంగా భావించి, తన భావాలను ఆయన సుబోధకమైన చిన్న వ్యాసాలుగా తిరిగి రాయసాగాడు. దీనికితోడు ఆయన సామాజిక తత్వశాస్త్రంవైపు తన దృష్టిని మళ్లించాడు. రాజకీయ, ఆర్థిక రచనలతో ఆయనకి మొదటి విజయం లభించింది. "మొదటి జేమ్స్, మొదటి చార్లెస్‌ల పాలన కాలపు ఇంగ్లండు చరిత్ర" అనే ఆయన బహుళ సంపుటాల గ్రంథం ఆయనకి యూరప్ అంతటా కీర్తిని సంపాదించిపెట్టింది. చరిత్రకారుడుగా హ్యూమ్ భూస్వాముల పార్టీ అయిన టోరీ పార్టీని – ఛాందస బూర్జువావర్గం కూడా ఆ పార్టీ పట్లనే అనుకూల్యం చూపింది – బలపరిచాడు. హ్యూమ్ "విగ్గు అలగా మూక" పట్ల అయిష్టత చూపాడు, అంగడి యజమానుల మొరటుతనాన్నీ, ప్యూరిటన్ల మూర్ఖత్వాన్నీ అపహ్యించుకున్నాడు, ధనికులైన లండన్ వడ్డీ వ్యాపారస్తులను "థేమ్స్ నదీ తీరాలపైన గల ఆటవికులు"గా పరిగణించాడు.

1763–65 సంవత్సరాల్లో బ్రిటిష్ ఎంబసీ కార్యదర్శిగా హ్యూమ్ పారిస్‌లో నివసించాడు. సమావేశాల్లో ఆయన అత్యంత ఆదరణపాత్రుడుగా ఉండేవాడు. ఫ్రెంచి వైతాళికులు పలువురితో ఆయనకి మైత్రి వుండేది. తర్వాత ఆయన లండన్లోని ఒక పరిపాలకోద్యోగంలోకి మారాడు. ఆయన జీవితపు చివరి సంవత్సరాలు ఎడిన్‌బరోలో సన్నిహిత మిత్రులైన పండితుల మధ్యా, సాహితీపరుల మధ్యా గడిచాయి.

హ్యూమ్ అర్థశాస్త్ర రచనల్లో పలు ఆసక్తికరమైన ఆలోచనలూ, వ్యాఖ్యలూ వున్నాయి. ఉదాహరణకు, చలామణీలో వున్న డబ్బు మొత్తం పెరుగుదలలోకన్న ధరల పెరుగుదలలో ఆలస్యాలు జరుగుతాయన్న విషయాన్ని హ్యూమ్ మొదట పేర్కొన్నాడు. అన్ని సరకుల ధరల్లోకీ "శ్రమ ధర," అంటే, కార్మికుల వేతనమే పెరగడంలో చిట్టచివరిదని హ్యూమ్ ప్రత్యేకించి పేర్కొన్నాడు. కాగితపు డబ్బుయొక్క ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు సంభవించే సామాజిక, ఆర్థిక క్రమాలను అర్థంచేసుకోడానికి ముఖ్యమైన యీ నియమాలు మనకు తోడ్పడుతాయి.

వెండి బంగారాలు దేశాలమధ్య సహజంగా పంపిణీ చెయ్యబడ్డాయనీ, ప్రతి ఒక దేశపు వ్యాపారశేషమూ చివరకు సమతూకంలో ముగిసేందుకే సహజంగా ప్రయత్నిస్తుందన్న భావాన్ని 18వ శతాబ్దంలో యితరులెవరికన్న అధికంగా అభివృద్ధిచేసినది కూడా

హ్యూమే. మొత్తం అర్థశాస్త్రపు సాంప్రదాయిక శాఖకి విశిష్టమైన సహజ సమ తూక భావం హ్యూమ్ రచనల్లో పటిష్ఠంగా వ్యక్తంచెయ్యబడింది. వెండి బంగారా లను కృత్రిమంగా ఆకర్షించి, నిలుపుకోవడం అనే విధానంతో కూడిన వ్యాపారవాదంపై ఆయన విమర్శకు అది ప్రాతిపదికను కల్పిస్తుంది. సమతూకం దిశగా వర్తకశేషాల (మరింత కచ్చితంగా చెప్పాలంటే, వ్యాపార చెల్లింపు శేషాల) సహజధోరణికి సంబంధిం చిన భావన రికార్డోచేత మరింతగా అభివృద్ధిచెయ్యబడింది. ఈ అంశాన్ని రికార్డోపైన గల ప్రకరణంలో మరల ప్రస్తావించుకుందాం.

అయితే, హ్యూమ్ డబ్బును గూర్చి చేసిన సరైన వ్యాఖ్యలు, శ్రమ విలువ సిద్ధాం తానికి విరుద్ధంగా వున్నాయి. ఫ్రెంచివారి మాదిరిగానే, హ్యూమ్ విలువ సిద్ధాంతం సాయం లేకుండానే గడిపేశాడు. ఇది, ఆయన తాత్విక అజ్ఞేయతా, సంశయవాదాల ఫలితం అయ్యుండవచ్చు.

అర్థశాస్త్రంలో హ్యూమ్ ప్రధానంగా, డబ్బు పరిమాణ సిద్ధాంత జనకుల్లో ఒకడుగా ప్రసిద్ధుడు. హ్యూమూ, అటువంటి భావాలనే ప్రతిపాదించిన తదితర రచయితలూ ధర విప్లవం అనబడే చారిత్రక వాస్తవంనుండి ముందుకెళ్లారు. 16–18 శతాబ్దాల మధ్య వెండి బంగారాలు యూరప్‌లోకి ప్రవహించాక, అక్కడ వినిమయ సరకుల ధరలు క్రమంగా పెరిగాయి. సగటున ధరలు మూడు లేక నాలుగు రెట్లు పెరిగాయని స్వయంగా హ్యూమే అంచనా వేశాడు. దీన్నిబట్టి హ్యూమ్ అనివార్యమైన దిగా కనిపించే యీ కింది నిర్ణయానికి చేరుకున్నాడు. మరింత డబ్బు (సంపూర్ణ విలువగల లోహపు డబ్బు!) ఉన్నది కాబట్టి ధరలు పెరిగాయి.

అయితే, పైకి కనిపించేదే సత్యం కాదు. ఎందుకంటే, యీ క్రమంయొక్క గమనమంతా భిన్నంగా వివరించనూవచ్చు, వివరించాలి కూడా. సమృద్ధమైన గనులను కనుగొనడంతో వెండి బంగారాలను తవ్వి పైకి తీసే శ్రమ ఖరీదు పడిపోయింది, తత్పర్య వసానంగా వాటి విలువలో కూడా పతనం సంభవించింది. సరుకులకు సంబంధించి డబ్బు విలువ పడిపోయిన కారణంగా, సరుకుల ధర పెరిగింది.

చలామణీలో వున్న వాస్తవమైన లోహపుడబ్బు మొత్తంతో ప్రసక్తిలేకుండా, డబ్బు "విలువ" (లేక, మరింత సరళంగా చెప్పాలంటే సరుకుల ధరలు) చలామణీ క్రమంలో – యీ క్రమంలో ఒక రాశి సరుకులు ఒక రాశి డబ్బుతో తారసపడతాయి – నిర్ణయింపబడుతుంది.

వాస్తవానికి, డబ్బూ, సరుకులూ రెండూ కూడా ఒక విలువతో – సామాజికంగా అవసరమైన శ్రమ వ్యయంతో యింతకు ముందే అది నిర్ణయింపబడిన విలువతో – చలామణీలోకి వెళ్తాయి. తత్పర్యవసానంగా, ఒకానొక నిర్దిష్ట వేగంలో డబ్బు తిరగడ

జరుగుతున్నప్పుడు, స్థిరమైన ఒక డబ్బు మొత్తం చలామణీలో ఉండగలుగుతుంది. అంతకు అదనమైన డబ్బు విదేశాలకుగాని, నిలవలోకిగాని పోతుంది.

కాగితపు డబ్బు సంగతి వేరే విషయం. చలామణీలోంచి అదెన్నడూ బయటకు పోలేదు. కాగితపు డబ్బుయొక్క ప్రతి విడి యూనిట్ కొనుగోలు శక్తి (యితర అంశాలతోబాటు) వాటి పరిమాణంపై ఆధారపడుతుంది. చలామణీకి అవసరమైన అసలైన లోహపు డబ్బు పరిమాణం కన్న అధికంగా కరెన్సీనోట్లు జారీచెయ్యబడినట్లయితే, అవి తమ విలువను కోల్పోతాయి. దీని పేరే ద్రవ్యోల్బణం అన్న సంగతి మనకు తెలిసిందే. హ్యూమ్, వెండి బంగారాలను గురించి పరిశీలించే క్రమంలో, వాస్తవానికి కాగితపు డబ్బు చలామణీ విషయాన్ని వర్ణిస్తున్నాడు.

హ్యూమ్ చేసిన సేవ ఏమిటంటే, అర్థశాస్త్రంలో యీనాటికీ ప్రముఖపాత్ర వహిస్తున్న అంశాలపైకి దృష్టిని ఆకర్షించడం – అవేమిటంటే, చలామణీకి అవసరమైన డబ్బు పరిమాణం ఎలా నిర్ణయింపబడగలదు? డబ్బు పరిమాణం ధరలపై ఏవిధంగా ప్రభావాన్ని బరపుతుంది? డబ్బు తన విలువను కోల్పోయినప్పుడు, ధర ఏర్పడటానికి సంబంధించిన విశిష్ట లక్షణాలేమిటి?

ప్రకరణం 7

బెంజమిన్ ఫ్రాంక్లిన్, అమెరికన్ అర్థశాస్త్రం

ఫ్రాంక్లిన్ 18వ శతాబ్దానికి చెందిన చివరి గొప్ప విశ్వజనీన చింతనాపరుల్లో ఒకడు. ఉత్తర అమెరికాలో ఫ్రాంక్లిన్ పాత్రను రష్యాలో లొమొనోసొవ్, ఇంగ్లండులో న్యూటన్, ఫ్రాన్సులో డెకార్టే వంటి పాండిత్య పథంలో గొప్ప మార్గదర్శులతో సరి పోల్చవచ్చు. ఫ్రాంక్లిన్ భౌతిక శాస్త్రవేత్త, ఆధునిక విద్యుచ్ఛక్తి విజ్ఞానశాస్త్ర స్రష్టల్లో ఒకడు; సమకాలీన సమాజపు నూత్న బూర్జువా ప్రజాస్వామ్య భావాలను మౌలిక పద్ధతిలో వ్యక్తీకరించిన తత్వవేత్త, రచయిత; రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రముఖ వ్యక్తి, అమెరికన్ విప్లవపు, స్వాతంత్ర్యం కోసం నూతన రాజ్యం జరిపిన పోరాటపు అత్యంత తీవ్రవాద నాయకుల్లో ఒకడు. ఆయన కార్యాచరణ రంగాల్లోనూ, అనక్తుల్లోనూ యివి కొన్ని మాత్రమే. ఈ సుప్రసిద్ధ అమెరికన్ గ్రంథ ముద్రణను తన ప్రధాన వృత్తిగా పరిగణించాడు.

తన తాత్విక, రాజకీయ కార్యకలాపాల చట్రంలో ఫ్రాంక్లిన్ అర్థశాస్త్ర సమస్యలను కూడా పరిశీలించాడు. నూత్న ప్రపంచంలోని ఆర్థిక చింతనా పథ మార్గదర్శకుల్లో ఆయన ఒకడు.

జీవితం, రచనలు

ఫ్రాంక్లిన్ ఆత్మకథ, ఆయన కాలపు గణనీయమైన చారిత్రక, సాహిత్య పత్రాల్లో ఒకటి. తన డెబ్బది తొమ్మిదవ ఏట రచించిన యీ ఆత్మకథలోని ఒక ప్రకరణంలో ఫ్రాంక్లిన్, తన జీవితానందాన్ని గురించి రాశాడు. ఆయన జీవితం నిజంగానే సుదీర్ఘమూ, ఆనందప్రదమూ అయినది. పౌరుడుగా, పండితుడుగా, వ్యక్తిగా ఆయన

సంతోషజీవి. ఆయన జీవితంలోని ద్వితీయార్ధ భాగం యావత్తూ, ఉత్తర అమెరికా స్వాతంత్ర్యమనే ఏ లక్ష్యసాధన కోసమైతే అంకితం చెయ్యబడిందో ఆ లక్ష్యం విజయ వంతంగా సాధింపబడటాన్ని తను బతికివుండగా ఆయన చూశాడు. విజ్ఞానశాస్త్ర రంగంలో ఆయన చేసిన సేవలు యావత్ప్రపంచపు మన్ననలనూ పొందాయి. తన ఏకైక పుత్రుడు విలియం, యుద్ధంలో తనకూ, తన మాతృదేశానికీ శత్రువులైన వారితో కలిసి ఇంగ్లండు తరఫున పోరాడాడన్న ఒకేఒక్క చింతను మినహాయిస్తే, ఆయన వ్యక్తి గత జీవితం కూడా ఆనందంగానే గడిచింది.

ఒక పేద అప్రెంటిస్‌గా జీవితాన్ని మొదలుపెట్టిన ఫ్రాంక్లిన్ తన జీవితాంతం నాటికి మహైశ్వర్యవంతుడు కాకపోయినా కనీసం బాగా సంపన్నుడయాడు. ఆయనకు అనేక యిళ్లూ, భూఖండాలూ వున్నాయి. ఆరోజుల్లో, ప్రత్యేకించి అమెరికాలో, యిదే ముఖ్యమైన సంపద రూపం.

ఫ్రాంక్లిన్ నూత్న ప్రపంచానికి చెందినవాడు. మార్క్సునే ఉల్లేఖించాలంటే అక్కడ, "తమ ప్రతినిధులతోబాటు దిగుమతి చెయ్యబడిన బూర్జువా ఉత్పత్తి సంబంధాలు, చారిత్రక సంప్రదాయ లోపాన్ని పూడ్చేందుకుగాను కొల్లలుగా ఎరువు వున్న నేలలో వేగంగా మొలకెత్తాయి."*

ఇంగ్లండునుంచి వచ్చి స్థిరపడిన తొలి వలసదారుల వారసులలో అత్యధిక సంఖ్యాకులు మతపరమూ, రాజకీయమైన వేధింపును తప్పించుకొని వచ్చిన ప్యూరిటన్లు. వాళ్లు బీళ్లను సాగులోకి తెచ్చి, త్వరలోనే పట్టణాల్లో చేతిపరిశ్రమలను నెలకొల్పారు. భిన్న మైన మరో పద్ధతిలోనే అయినప్పటికీ, స్పానిష్ విజేతలకు తీసిపోని విధంగా, వాళ్లు ఐశ్వర్యారాధన చేశారు.

వాళ్లు చరిత్రలో తొట్టతొలి, సంపూర్ణ బూర్జువా ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పారు. వ్యక్తి స్వేచ్ఛ, ఎన్నిక పద్ధతిపై ప్రభుత్వం ఏర్పాటు, స్వతంత్రమైన న్యాయవ్యవస్థ అనే సూత్రాలను బలపరిచారు. అయితే యిదెలాంటి ప్రజాస్వామ్యమంటే, దీనిలో చట్టం ముందు లాంఛనప్రాయమైన సమానత్వం అన్నది ఆర్థిక, రాజకీయ అసమాన తకు ఒక ముసుగుగా తయారైంది. అధికారికేతర భావాలు అణచివేయబడ్డాయి.

యాంకీలకు జీర్ణ ఫ్యూడల్ ప్రభువర్గం లేదు, హోదాలనూ, వంశ ప్రత్యేక హక్కులనూ వాళ్లు అవహేళన చేశారు.

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, p. 55.

పశ్చిమ యూరప్‌తో పోల్చినప్పుడు, మత స్వేచ్ఛకూ, మత సహనానికీ అమెరికా స్వర్గసమాన దేశం. అయితేనేం ఫ్రాంక్లిన్ జననానికి కొద్ది సంవత్సరాల ముందు, ఆయన జన్మస్థలమైన బోస్టన్ పట్టణానికి మిక్కిలి సమీపంలోని సాలెమ్‌లో "మంత్ర గత్తెలు" విచారింపబడి, మరణదండనకు గురయ్యారు. వివిధ మతాల అనుయాయులు తమతమ వివిక్త జీవితాలు గడుపుతూండేవారు. మతబోధకుల, ధనిక కౌంటీనివాసుల క్రూర నిరంకుశత్వ పెత్తనాలకు వారు తరచుగా గురిచెయ్యబడుతూండేవారు. మతపర మైన కాపట్యంలో యాంకీలు ఇంగ్లీషువారిని తలదన్నేవారు. జాతీయ పీడనకు వ్యతి రేకంగా పోరాడిన ఆ తొలిపోరాటకులే రెడ్ ఇండియన్లను నిర్దాక్షిణ్యంగా తుడిచిపెట్టేసి, దక్షిణాది రాష్ట్రాల్లో బానిసత్వాన్ని నెలగొల్పారు.

మౌలికంగా స్వేచ్ఛాప్రియులూ, ధైర్యవంతులూ, శ్రమైక స్వభావులూ అయిన వ్యవసాయదారుల, చేతివృత్తివారల పూర్వరంగంనుంచి వచ్చాడు ఫ్రాంక్లిన్. అభివృద్ధి చెందుతోన్న జాతిలోని అత్యుత్కృష్టమైనవాటన్నింటినీ ఆయన జీర్ణించుకున్నాడు. కాని ఆయన వ్యక్తిత్వంలో, తన జాతియొక్క బూర్జువా అభివృద్ధిలోని వైరుధ్యాలు కూడా ప్రతిబింబితమయ్యాయి. ప్రగాఢమైన ప్రజాస్వామ్యతత్వంతోబాటు ఐశ్వర్యం పట్లా, అధికారంపట్లా గౌరవం ఆయనలో మేళవించింది మత మౌఢ్యానికీ, కర్మకాం డకీ వ్యతిరేకి అయిన ఫ్రాంక్లిన్ — ఆయన స్వయంగా చెప్పిన మాటల ప్రకారం — "దైవ అస్తిత్వాన్నీ, ఆ దైవం ప్రపంచాన్ని సృష్టించి, దాన్ని తన కృపాకటాక్షంతో శాసిస్తాడన్న విషయాన్నీ క్షణకాలం కూడా శంకించలేదు." బానిసత్వానికి శత్రువూ, జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడినవాడూ అయిన ఫ్రాంక్లినే, ఆంగ్లో—శాక్సన్ జాతియొక్క ప్రత్యేక నిర్ణీత కర్తవ్యంలో విశ్వాసం ప్రదర్శించాడు. నిరాడంబరుడూ, ప్రేమాస్పదుడూ అయిన ఫ్రాంక్లిన్ కొన్ని సందర్భాల్లో శ్రోతలకూ, పాఠకులకూ సంకుచితభావాలు కలిగిన శుష్క పండితుడుగానూ, నిస్సార నీతిబోధకుడుగానూ కని పించేవాడు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706లో బోస్టనులో, సబ్బులూ, కొవ్వొత్తులూ తయారు చేసే ఓ పెద్ద ప్యూరిటన్ కుటుంబంలో జన్మించాడు. ఆయనకు క్రమబద్ధమైన విద్యాభ్యాసావకాశం లభించలేదు. పెట్టీకంటె కూడా ఎక్కువగా ఆయన స్వయం శిక్షితుడైన వ్యక్తి. ప్రాథమిక పాఠశాలలో రెండేళ్లు చదివాక తన సవతి అన్న ప్రింటింగ్ ప్రెస్సుకి ఫ్రాంక్లిన్ అప్రెంటిస్‌గా పంపబడ్డాడు. ఫ్రాంక్లిన్ ఆనాటి విష యాలను గురించి యిలా పేర్కొన్నాడు: "...మా అన్న కోపిష్ఠి, నన్ను తరచు కొడు తూండేవాడు. అందుకు నేను కుతకుతలాడిపోతూండేవాడిని. నన్ను ఆయన చూసిన కఠినమూ, నిరంకుశమూ అయిన తీరు, నాలో నిరంకుశ పెత్తనానికి వ్యతిరేకంగా నా

జీవితకాలమంతా రగిలిన ద్వేషవహ్నులకు బహుశా] ఒక కారణమేమోనని నాకు అని పిస్తూ వుంటుంది.''*

ఈ సంవత్సరాల్లో ఫ్రాంక్లిన్‌కి విశిష్టమైన యితర లక్షణాలు — శక్తి, చొరవ, అసాధారణమైన శ్రమైక శక్తి, అపారమైన జ్ఞానతృష్ణ — అభివృద్ధిచెందాయి. ఆయన విస్తారంగా గ్రంథపఠనం చేశాడు, విద్యావంతులతో పరిచయాలు పెట్టుకున్నాడు. సాహితీపరమైన ఆయన తొలి ప్రయత్నాలు వెలువడ్డాయి. మతంపట్ల ఆయన వైఖరి గణనీయంగా విమర్శనాత్మకమైంది. పదిహేడేళ్ల వయసులో ఫ్రాంక్లిన్ యింటినీ, సొంత పట్టణాన్నీ విడిచిపెట్టి, పెన్సిల్వేనియా రాష్ట్రపు క్వేకర్ ముఖ్యపట్టణమైన ఫిలడె ల్ఫియాకు పోయి, అక్కడొక ప్రింటింగ్ ప్రెస్సులో పనిచేశాడు. ఆటుతర్వాత ఒక సంవ త్సరానికి ప్రింటింగ్ పనిలో తన పరిజ్ఞానాన్ని పెంచుకోడానికీ, ప్రెస్సుకి కావలసిన విడి సామానులు కొనుక్కోడానికీ ఫ్రాంక్లిన్ ఇంగ్లండుకు వెళ్లాడు. ఆయనకి సిఫారసు ఉత్తరాలూ, డబ్బూ యిస్తామన్న వాగ్దానాలు రెండూ వాగ్దానాలుగావే మిగిలిపోయాయి.

ఫ్రాంక్లిన్ లండన్ ప్రింటింగ్ ప్రెస్సుల్లో పద్దెనిమిది నెలలకుపైగా పనిచేసి, అనుభవ జ్ఞానాలను వృద్ధిచేసుకొంటూ ఇంగ్లండులో గడిపాడు. 1726లో, తన వయస్సుకు మించిన పరిణతితో యువ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాకి తిరిగివచ్చాడు. ఆయన దగ్గర డబ్బైతే లేదుగాని, ఆయన పుస్తకాలూ, టైపులూ పట్టుకొచ్చాడు. అన్నిటికన్న ముఖ్యమైన దేమిటంటే, భావాలూ, భవిష్యత్తుపట్ల ఆశాభావం, విశ్వాసమూ ఆయనలో తొణికిసలాడుతున్నాయి.

సాహసవంతుడైన ప్రింటరుగా ఫ్రాంక్లిన్ త్వరలోనే గౌరవనీయ స్థానాన్ని సంపా దించుకొని, ఫిలడెల్ఫియాలో అత్యంత ప్రముఖ పౌరుల్లో ఒకడయ్యాడు. విజ్ఞాన శాస్త్రీయ, సాహిత్య వ్యాసంగాల్లో అభిరుచికలిగిన ఓ యువక బృందం ఆయన చుట్టూ చేరింది. ఫ్రాంక్లిన్ జీవితమూ, కార్యకలాపాలూ, చివరి క్షణందాకా కచ్చితంగా సంఘ టితం చెయ్యబడ్డాయి. ఆయన అజేయ శక్తి చేబట్టిన వాటన్నింటి జాబితానీ తయారు చెయ్యడం సైతం దుస్సాధ్యం. ఆయన పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయాన్ని, మొట్ట మొదటి సైంటిఫిక్ సొసైటీని, మొట్టమొదటి పబ్లిక్ లైబ్రరీని, అమెరికాలో మొట్టమొదటి అగ్నిమాపక దళాన్ని స్థాపించాడు. పెద్ద జాతీయ దినపత్రికను స్థాపిం చినవారిలో ఆయనే మొదటివాడు. పోస్టల్ సర్వీసును ఆయనే మెరుగుపరిచాడు. 1754లో జరిగిన ఆల్బనీ కాంగ్రెస్‌లో తన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి, ఇంగ్లీషు రాజుకింద —

---

* B. Franklin, *The Autobiography and Other Writings*, New York, 1961, p. 33.

అయితే కొంత స్వయం పరిపాలనాధికారంతో — వలస రాష్ట్రాలన్నింటినీ సమైక్యంచేసే తన పథకాన్ని ఆయన ప్రతిపాదించాడు. లండనులో వాళ్లు, అమెరికన్లను ఒక జాతిగా సమైక్యం చెయ్యగలదాన్ని దేన్ని గురించైనా సరే హడిలి చచ్చిపోయేవారు, దానితో ఫ్రాంక్లిన్ పథకం తిరస్కరింపబడింది.

ఫ్రాంక్లిన్ ఎప్పుడూ కూడా ప్రకృతివిజ్ఞానశాస్త్రాలపట్ల విశేషమైన ఆసక్తిని ప్రదర్శించేవాడు. ఆయన మంచి హస్త నైపుణ్యంగలవాడు. భూకంపాల స్వభావాన్ని గురించి ఆయన పరిశోధించాడు, చతురమైన డిజైనుగల ఒక ఫర్నేసును కనిపెట్టాడు. 1743లో విద్యుచ్ఛక్తికి సంబంధించిన కొన్ని ప్రయోగాలను ఆయన చూశాడు — ఆరోజుల్లో సంచార వినోద ప్రదర్శకులు వీటిని చేస్తూండేవారు. ఆయనకి విద్యుచ్ఛక్తి విషయంలో విశేషాసక్తి జనించగా, తనకు సహజసిద్ధమైన శక్త్యుత్సాహాలతో ప్రయోగాలకు పూనుకొని, అయిదారేళ్ల కాలంలో వేలాది స్థిరవిద్యుత్ ప్రయోగాలు చేశాడు. ఆనాటికి ఆయన ప్రయోగాలు చాలా సూక్ష్మమైనవీ, నిపుణమైనవీని. ఫ్రాంక్లిన్ రచనలు స్థిర విద్యుత్ విజ్ఞానానికి పునాది వేశాయి. పాజిటివ్, నెగెటివ్ ఛార్జిలనే భావాన్ని ప్రవేశ పెట్టి (అప్పటిదాకా పలువురు రెండురకాల విద్యుచ్ఛక్తి వుంటుందని నమ్ముతూండే వారు), ఆయన యూనిటరీ విద్యుచ్ఛక్తి సిద్ధాంతాన్ని కల్పించాడు. ఫ్రాంక్లిన్ మెరుపు విద్యుత్ స్వభావాన్ని నిరూపించాడు, వాతావరణ విద్యుత్ అనే విషయాన్ని వివరించాడు, పిడుగు నివారక ఊచను కనిపెట్టాడు.

1757లో ఫ్రాంక్లిన్ ఇంగ్లీషు ప్రభుత్వానికి పెన్సిల్వేనియా ప్రతినిధిగా (తర్వాత యితర రాష్ట్రాలకు ప్రతినిధిగా) ఇంగ్లండుకు వెళ్లాడు. తరువాత ముప్పయ్యేళ్లలోనూ అత్యధికభాగాన్ని ఫ్రాంక్లిన్ యూరప్‌లో — మొదట ఇంగ్లండులో, తర్వాత ఫ్రాన్సు లోనూ — గడిపాడు. ఈ కాలంలో తన జన్మభూమికి కేవలం రెండుసార్లు మాత్రమే వెళ్లాడు. ఈ కాలాన్ని ఫ్రాంక్లిన్ రాజనీతిజ్ఞుడుగా, దౌత్యనీతిజ్ఞుడుగా, రాజకీయ రచ యితగా గడిపాడు. చాల సంవత్సరాలపాటు వలసలకూ, "మాతృదేశానికీ" మధ్య సాయుధ పోరాటం రాకుండా నివారించేందుకు ఆయన ప్రయత్నించాడు, బ్రిటిష్ సామ్రాజ్యం లోపల స్వయంపరిపాలనను సాధించే మార్గాలకోసం అన్వేషించాడు. కాని ఇంగ్లండు రాయితీలు యిచ్చేందుకు ఎంతమాత్రం అంగీకరించలేదు. తిరుగుబాటు అనివార్యమై, 1775లో యుద్ధం ప్రజ్వలించింది. స్వాతంత్ర్య ప్రకటన (అది 1776 జూలై 4 తేదీన ఆమోదింపబడింది) ప్రధానంగా జెఫర్సన్‌చేత రచింపబడిందన్న సంగతి మనందరికీ తెలిసినదే, అయితే దాని రచనలో ఫ్రాంక్లిన్ చెయ్యి కూడా కనిపిస్తుంది. అదే సంవత్సరం ఆకురాలు కాలంలో కాంగ్రెస్, తిరుగుబాటు చేస్తున్న వలసల ప్రతినిధిగా ఫ్రాంక్లిన్‌ను ఫ్రాన్సుకు పంపింది. కొత్తగా పుట్టిన రిపబ్లిక్‌కి ఫ్రాన్సు

సైనిక, ఆర్థిక సహాయం అత్యవసరం. అపారమైన కష్టాలను అధిగమించి, ఫ్రాంక్లిన్ ఫ్రాన్సుతో ఒక సైనిక ఒప్పందాన్ని సాధించాడు. ఆ యుద్ధం ఇంగ్లండుకి బెడిసికొట్టడంతో, 1783లో చేసుకున్న శాంతి సంధిలో అది అమెరికా స్వాతంత్ర్యాన్ని గుర్తించింది.

ఫ్రాంక్లిన్ 1790లో మరణించాడు. ఆయన జీవించివుండగా ప్రచురితమైన చివరి రచన బానిసవ్యాపారంపై ఒక వార్తాపత్రికా సంపాదకునికి ఆయన రాసిన లేఖ (ఆ లేఖ ఆయన మరణానికి 24 రోజుల ముందు ప్రచురింపబడింది). తన జీవితపు చివరి భాగమంతట్లోనూ, పెన్సిల్వేనియా రాష్ట్ర అధ్యక్షుడుగానూ, 1787లో జరిగిన రాజ్యాంగ నిర్ణయసభ సభ్యుడుగానూ ఆయన బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు. ఫ్రాంక్లిన్ తుది రచనా రూపం అత్యంత విలక్షణమైనది. తన వ్యంగ్య టుమ్రీలకు ఆయన bagatelles (అల్పాలు) అని పేరుపెట్టాడు. తన జీవితపు తుది దశాబ్దంలో తను తరచుగా రాస్తూవుండిన చిన్న చిన్న వేడివేడి పుస్తకాలకు ఆయన పెట్టుకున్న ముద్దుపేరు యిదీ. వృద్ధ ఫ్రాంక్లిన్ నిపుణ హస్తాల్లో రూపొందిన యీ "బగటెల్లీలు" చిన్నవే అయినా గట్టిగా గుచ్చుకునేవి.

అర్థశాస్త్రవేత్తగా ఫ్రాంక్లిన్

ఆడమ్ స్మిత్ తన "జాతుల సంపద"లో శ్రమ విలువ సిద్ధాంతాన్ని రూపొందించాడు. అయితే అంతకు ముందు ఒక శతాబ్దకాలంపాటు వెలువడిన అనేక రచనల్లో కొద్దో గొప్పో అస్పష్టమైన ఊహామాత్రంగా యీ సిద్ధాంతానికి మూలాలు మనకి కనిపిస్తాయి. అర్థశాస్త్ర రంగంలో ఫ్రాంక్లిన్ చాలవరకు పెట్టీ అనుచరుడు. ఫ్రాంక్లిన్ మొదటిసారి లండనుకు వెళ్లినప్పుడు బహుశా ఆయనకు పెట్టీ రచనలతో పరిచయం కలిగివుంటుంది. జిజ్ఞాసాపరుడైన 19 ఏళ్ల ఆ యువకునికి బహుశా మన్‌డెవిల్ ఆ రచనలను గురించి సిఫారసు చేసివుంటాడు. చీప్‌సైడ్‌లోని "కొమ్ములు" అనబడే బీరు అంగడిలో "తేనెటీగల కథ" రచయిత తనకు పరిచయం చెయ్యబడిన ఘట్టాన్ని ఫ్రాంక్లిన్ గుర్తుచేసుకుంటాడు.

కొందరు పండితులు ఫ్రాంక్లిన్ భావాలను, ఆయన సమకాలీన పెద్దల్లో ఒకడైన డేనియల్ డిఫో ప్రభావంతోనూ, ప్రత్యేకించి డిఫో రచించిన "ప్రాజెక్టులపై వ్యాసం" ప్రభావంతోనూ జతపరుస్తూవుంటారు.

ఫ్రాంక్లిన్ రాసిన మొదటి ఆర్థిక వ్యాసమైన "కాగితపు కరెన్సీ స్వభావ, ఆవశ్యక

తలపై సవినయ పరిశీలన"తో పెట్టీ రచనలను సరిపోల్చి పలువురు పరిశోధకులు ఫ్రాంక్లిన్‌పై పెట్టీ ప్రభావాన్ని గురించి వాదించారు. 1751లో జనాభా సమస్యపై ఫ్రాంక్లిన్ చేసిన రచన ఆర్థిక సాహిత్యంలో ఒక అపూర్వమైన విశేషం. దానిపైన కూడా పెట్టీ ప్రభావం వుంది. ఈ సందర్భంలో ఒక విషయం చెప్పకోవలసివుంది. జనాభా శాస్త్రంపైన తను చేసిన రచనల్లో, అమెరికన్ రాష్ట్రాల్లో ఆనాడు వాస్తవంగా వున్న పరిస్థితులమీద ఆధారపడుతూ, "సహజ పరిస్థితుల్లో," బాహ్య జోక్యం లేకపోతే, ప్రతి పాతికేళ్ళకూ జనాభా రెట్టింపు అవుతూ వుంటుందన్న ఫ్రాంక్లిన్ ఆసక్తికరమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఈ అంచనాను దరిమిలా మాల్తుస్ విని యోగించుకుని, జీవనాధార వస్తువుల ఉత్పత్తి జనాభా పెరుగుదలకన్న దారుణంగా వెనకబడిపోకతప్పదని వాదించాడు. అయితే, యీ విషయంలో మాల్తుస్‌కుగల చారిత్రక నిరాశావాదం ఫ్రాంక్లిన్‌కి బొత్తిగా లేదు. అందుకు భిన్నంగా, హేతుబద్ధమైన సామాజిక వ్యవస్థ ఉన్నట్లయితే, జీవనాధార వస్తువులను భారీ ఎత్తున ఉత్పత్తిచేసే అపారమైన అవకాశాలు వున్నాయని ఆయన విశ్వసించాడు. అమెరికా జనాభాలో పెద్ద పెరుగుదలను ఆ నూతన ఖండపు అభివృద్ధికి ఒక అవశ్యక పూర్వావసరంగా ఆయన పరిగణించాడు. అయితే, గ్రేట్ బ్రిటన్‌ని గురించి ఆయన యిలా రాశాడు: "...తన జనాభాకి పని కల్పించగలిగినట్లయితే, ప్రస్తుతం వున్నదానికి పదింతల జనాభాను యీ దీవి పోషించగలదు."*

పెట్టీ మాదిరిగానే ఫ్రాంక్లిన్ కూడా, మరింత నిర్దిష్టమైన సమస్య ఒక దాన్ని గురించి చర్చించే క్రమంలో, శ్రమ విలువ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. మొండి క్వేకర్ల బుర్రల్లోకి కాగితపు డబ్బు ప్రయోజనానికి — ప్రత్యేకించి వెండి బంగారాల కొరత వున్నప్పుడు — సంబంధించిన భావాన్ని చొప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్న సందర్భం అది.

ఈ పని చేసేందుకు ఆయన మొట్టమొదట లోహపు డబ్బును దాని ఉన్నత పీఠంమించి కూలదొయ్యవలసి వుంది. ఈ సందర్భంగా ఆయన చేసిన వాదనలు పెట్టీ అభిప్రాయాలను కాక, జాన్ లా ఉద్వేగభరితమైన వాదనలను జ్ఞాపకం తెస్తాయి. విలువ అసలైన కొలమానం శ్రమయే గాని, డబ్బు కాదు అన్నదే ఫ్రాంక్లిన్ ప్రధాన భావం. ఆయన యిలా రాస్తాడు: "శ్రమ ద్వారా వెండి విలువే కాకుండా తదితర వస్తువుల విలువను కూడా కొలవవచ్చు. ఎలాగంటే, ఒక మనిషి ధాన్యం పండించడానికీ,

* Benjamin Franklin, *The Works of Benjamin Franklin*, Vol. 3, London, 1806, p. 115.

మరో మనిషి వెండిని తవ్వి శుద్ధిచేసేందుకూ నియోగింపబడ్డారని అనుకోండి; ఒక సంవత్సరాంతానికో, లేక మరే యితర నిర్దిష్ట కాలవ్యవధి అంతానికో, ఉత్పత్తిచెయ్యబడిన మొత్తం ధాన్యం, మొత్తం వెండీ, ఒకటి మరొకదాని సహజధర అవుతుంది; ధాన్యం 20 బుషెల్సూ, వెండి 20 ఔన్సులూ అయినట్లయితే, అప్పుడు ఒక ఔన్సు ఆ వెండి, ఒక బుషెల్ ఆ ధాన్యాన్ని ఉత్పత్తి చేసేందుకు పట్టే శ్రమతో సమానమవుతుంది. సరే యిప్పుడు, మరింత దగ్గరగా వున్న, మరింత తేలికైన లేక మరింత పుష్కలమైన కొన్ని గనులు కనిపెట్టబడినట్లయితే, యింతకు ముందు 20 ఔన్సులను తవ్వి శుద్ధిచేస్తున్న మనిషే యిప్పుడు అంత తేలికగానూ 40 ఔన్సుల వెండిని తియ్యగలుగుతాడు. అయితే, 20 బుషెళ్ల ధాన్యాన్ని ఉత్పత్తిచెయ్యడానికి యిప్పటికీ అదే శ్రమ పడుతుంది. అప్పుడు రెండు ఔన్సుల వెండి విలువ ఒక బుషెల్ ధాన్యపు ఉత్పత్తికి పట్టే అదే శ్రమకు మించి వుండదు. మరి అప్పుడు coeteris paribus (యితర అన్ని పరిస్థితులూ సమానంగా వుంటే), ఆ బుషెల్ ధాన్యం విలువ అంతకు ముందు ఒక ఔన్సు వెండి అయినట్లే, యిప్పుడు రెండు ఔన్సుల వెండి అవుతుంది."*

మార్క్స్ తన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు"లో యీ ఖండికను ఉదహరించాడు. అందులో ఆయన అర్థశాస్త్ర రంగంలో ఫ్రాంక్లిన్ సేవలకు సంబంధించిన మొట్టమొదటి, సమగ్ర వర్ణనను యిచ్చాడు. ఫ్రాంక్లిన్ "ఆధునిక అర్థశాస్త్రపు మౌలిక నియమాన్ని (అనగా విలువ నియమాన్ని) రూపొందించాడు"** అని మార్క్స్ పేర్కొన్నాడు.

అర్థశాస్త్రాభివృద్ధిలో యీ సుప్రసిద్ధ అమెరికన్ సేవపట్ల తనకుగల ఉన్నతాభిప్రాయాన్ని మార్క్స్ "పెట్టుబడి" గ్రంథంలో పునరుద్ఘాటించి, "విలియం పెట్టీ తర్వాత, విలువ స్వభావాన్ని గ్రహించిన మొదటి అర్థశాస్త్రవేత్తల్లో ఒకడుగా"*** ఫ్రాంక్లిన్‌ని అభివర్ణించాడు.

ప్రథమంగా ప్రధానంగా, పెట్టీయొక్క ప్రతిభావంతమైన భావాలను వేర్పుగా వ్యాపింపజేయడం, ప్రచారం చెయ్యడం, నిర్దిష్టమైన ఆర్థిక సమస్యలకు వాటిని అన్వయించడం అవసరం. ఫ్రాంక్లిన్ చేసినది సరిగా యిదే. అంతే కాకుండా, శ్రమ సార్వత్రిక స్వభావాన్ని గురించిన అన్ని భిన్నభిన్న రకాల శ్రమ సమానత్వాన్ని గురించిన భావానికి ఫ్రాంక్లిన్ పెట్టీ కన్న దగ్గరకు వచ్చాడు. పెట్టీ మాదిరిగా

---

* B. Franklin, *The Works*, Boston, 1840, Vol. II, p. 265.

** Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, London, 1971, p. 55.

*** Karl Marx, *Capital*, Vol. I, Moscow, 1972, p. 57.

ఆయన వెండి బంగారాలను తవ్వితీసే శ్రమకు ప్రత్యేక గుణాలను ఆపాదించలేదు. అందుకు భిన్నంగా, తను దృష్టిలో పెట్టుకున్న ప్రత్యక్ష లక్ష్యసాధన క్రమంలో, విలువను సృష్టించే విషయంలో, యిది యితర ఏ రకం శ్రమకీ భిన్నమైనది కాదని నిరూపించేందుకు చెయ్యగలిగినదంతా ఆయన చేశాడు.

ఒకానొక సరుకులో యిమిడివున్న శ్రమ ద్వంద్వస్వభావ* వివరణ కోసం జరిగిన విజ్ఞానశాస్త్ర ఆలోచనా క్రమపరిణామంలో శ్రమ విలువ సిద్ధాంతాభివృద్ధి, దీనికి సంబంధించి అర్థశాస్త్రంలో మొత్తం సాంప్రదాయిక ధోరణి అంతటి అభివృద్ధి ఇమిడివున్నాయి. అదొక సుదీర్ఘమైన క్లిష్టమైన పథం. యువ ఫ్రాంక్లిన్ యీ పథంలో ఒక అంగ వేశాడు.

కాగితపు డబ్బుకోసం ఫ్రాంక్లిన్ చేసిన ప్రచారానికి ఒక రాజకీయ, వర్గ ప్రాతిపదిక వుంది. ఒకవంక, వలసలపై తీవ్ర నిర్బంధాత్మకమైన లోహపు డబ్బు వ్యవస్థను రుద్దడం ద్వారా, వాటి ఆర్థికాభివృద్ధిని కుంటువరుస్తున్న ఇంగ్లండు అగ్రరాజ్య విధానానికి వ్యతిరేకంగా అది ఉద్దేశించబడింది. మరోవంక, తాము రుణంగా యిచ్చిన సొమ్మును కరకు నగదుగా తిరిగి చెల్లించాలని పట్టుబట్టే వడ్డీ వ్యాపారస్తుల, వ్యాపారస్తులకు వ్యతిరేకంగా వ్యవసాయదారుల, అమాయక పట్టణవాసుల

---

* ఒకానొక సరుకును తయారుచేసే శ్రమ ద్వంద్వ సారాంశం, ఒకానొక సరుకు వినిమయ విలువ <u>నిర్దిష్ట శ్రమచేతా</u>, ఆ సరుకు విలువ <u>అనిర్దిష్ట శ్రమచేతా</u> నిర్ణయింపబడుతుందన్న వాస్తవంతో ముడివడివుంది. ఉత్పత్తి సాధనాలమీద వ్యక్తిగత స్వామ్యంపై ఆధారపడిన సరళ, పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తి వ్యవస్థలో, వ్యక్తిగత శ్రమ సామాజిక శ్రమకు ప్రతిగా ఉన్నట్లే, నిర్దిష్ట శ్రమ అనిర్దిష్ట శ్రమకు ప్రతిగా వుంటుంది. సరుకు ఉత్పత్తిదారుల వ్యక్తిగత శ్రమ సామాజిక స్వభావం సరుకుల మారకపు క్రమంలో మాత్రమే కనిపిస్తుంది. నిర్దిష్ట శ్రమ యొక్క వివిధ రకాలను గుణాత్మకంగా అభిన్నమైన అనిర్దిష్ట శ్రమగా దిగజార్చడం ద్వారా (మొత్తంమీద మానవ శ్రమశక్తి వ్యయంగా కనిపించే యీ అనిర్దిష్ట శ్రమయే సరుకు విలువను రూపొందిస్తుంది) యిది జరుగుతుంది.

నిర్దిష్ట శ్రమకీ అనిర్దిష్ట శ్రమకీ మధ్యా, ఉపయోగపు విలువకీ మారకపు విలువకీ మధ్యా వైరుధ్యం వ్యక్తిగత శ్రమకీ సామాజిక శ్రమకీ మధ్యగల శత్రువైరుధ్యాన్ని బహిర్గతం చేస్తుంది.

శ్రమ ద్వంద్వ స్వభావాన్ని కార్ల్ మార్క్స్ ఆవిష్కరించాడు; ఈ ఆవిష్కరణే శ్రమ విలువయొక్క మార్క్సిస్టు సిద్ధాంతానికి శాస్త్రీయ ప్రాతిపదిక.

ప్రయోజనాలను ఫ్రాంక్లిన్ బలపరుస్తున్నాడు. వాళ్ళు నగదు డబ్బును "నిజాయితీ లేని" కాగితపు డబ్బుకు వ్యతిరేకంగా "నిజాయితీపరమైన" డబ్బు అని పిలిచేవారు. వెండిని చేజిక్కించుకునేందుకుగాను (వలసల్లో దాదాపుగా బంగారం ఏమీ లేదు) రుణగ్రహీతలు కొత్త అప్పులు తీసుకునేలాగానో, తక్కువ వేతనాలకు ఒప్పుకునే లాగానో నిర్బంధింపబడేవారు. ఫ్రాంక్లిన్ తదుపరి రచనలను బట్టి, డబ్బును గూర్చిన యీ వివాదంలో వర్గప్రయోజనాలు యిమిడివున్న సంగతి ఆయనకు పూర్తిగా తెలుసునన్న విషయం స్పష్టమవుతుంది.

లోహపు డబ్బును విమర్శించడంలో ఫ్రాంక్లిన్ చాలా దూరం కొట్టుకుపోయాడు, దానితో ఆయన వాదం సైద్ధాంతిక బలహీనతలకు దారితీసింది. విలువను సృష్టించే విషయంలో వెండికీ, ధాన్యానికీ మధ్య భేదం లేదని చెప్పినమీదట, సరుకుల చలామణీలో, మారకంలో అవి వహించే పాత్రలో కూడా భేదం లేదన్న నిర్ధారణకు ఆయన వచ్చాడు. డబ్బు అనే సరుకు విశిష్ట సామాజిక పాత్రను ఆయన అలక్ష్యం చేశాడు. అప్పట్లో అమెరికాలో వెండి సార్వత్రిక సమానకం, అంటే సుదీర్ఘ పరిణామ ఫలితంగా, మిగిలిన యితర సరుకులన్నింటినీ పక్కకు నెట్టి ముందుకొచ్చిన సరుకన్న మాట. ధాన్యం అటువంటి సరుకు కాదు. ఇతర అన్ని సరుకులకు మాదిరిగానే ధాన్యానికి కూడా, తన విలువను వ్యక్తంచెయ్యాలంటే అసలైన డబ్బు అయిన వెండి అవసరం. పెట్టుబడిదారీ సరుకు ఆర్థికవ్యవస్థకు విలువను వ్యక్తంచేసే మరో సాధనం ఏదీ తెలియదు. ఈ అర్థంలో వెండి ఒక "ప్రత్యేక" సరుకు. కాగితపు డబ్బు వెండికి ఒక ప్రతినిధిగా, ఒక ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండగలదు. ఈ హోదాలో వాటి చలామణీ ఆర్థికంగా పూర్తిగా "సక్రమమైంది."

డబ్బు ఒక ప్రత్యేక సామాజిక విధిని నిర్వర్తిస్తుంది. మిగిలిన సరుకులు అన్నింటి మాదిరిగా కాకుండా, అది అనిర్దిష్ట శ్రమకు సార్వత్రిక, ప్రత్యక్ష సాకారమూర్తిగా వ్యవహరిస్తుంది. తన విలువను వ్యక్తంచేసుకోడానికి దానికి మరో సరుకు అవసరం లేదు: అది నిరంతరం యితర సరుకుల్లో వ్యక్తమవుతూ వుంటుంది. డబ్బు ఆవిర్భావ, పరిణామాలు వస్తుపరమూ, సద్యోజనితమూ అయిన, మానవేచ్ఛకు అతీతమైన ఒక క్రమం. అయితే ఫ్రాంక్లిన్ డబ్బును కృత్రిమమైన ఒక "సృష్టి"గా, మారకాన్ని సాధ్యం చేసే ఒక సాంకేతిక పరికరంగా పరిగణించాడు. తత్పర్యవసానంగా లోహపు డబ్బును ఆయన డబ్బు అభివృద్ధియొక్క ఒకానొక హేతుబద్ధ రూపంగా కాక, ఏదో ఒక బాహ్య శక్తి చేత రుద్దబడిన ఒక కృత్రిమ అంశంగా మాత్రమే పరిగణించాడు.

అర్థశాస్త్ర మౌలిక సమస్యలకు ఫ్రాంక్లిన్ విశ్లేషణలో గల లోపాలకు కారణం, ఆయన పరిశీలిస్తున్న సమాజంలోని బూర్జువా ఉత్పత్తి సంబంధాల అపరిణత స్వభా

వంలో వుంది. అయితే ఎక్కడో మారుమూల, పెన్సిల్వేనియాలో ప్రచురింపబడిన ఆయన చిన్న పుస్తకం, ఆడమ్ స్మిత్ "జాతుల సంపద"కు అర్ధశతాబ్దం ముందు నాటిదన్న విషయాన్ని గుర్తుచేసుకున్నప్పుడు, ఆ గొప్ప అమెరికన్ సాధించిన శాస్త్రీయ విజయాల నిజపరిమాణం సరిగా బోధపడుతుంది.

ఆ చిన్న పుస్తకంలో వెల్లడింపబడిన 23 ఏళ్ల రచయిత పరిగణనీయ భావాలు ఆర్థిక విజ్ఞానశాస్త్ర అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని కలిగించలేకపోయాయి. తన తదుపరి రచనల్లో ఫ్రాంక్లిన్ విలువ స్వభావ సమస్యను ఒక సమస్యగా మరెన్నడూ లేవనెత్తలేదు. అయితే దాన్ని గుర్తించి ప్రస్తావించడం తటస్థించినప్పుడు, ఆయన దాన్ని గురించి భిన్నభిన్నంగా ప్రస్తావించాడు. కొన్నిమార్లు అదే శ్రమ సిద్ధాంత ప్రాతి పదికపై చర్చించాడు, మరి కొన్ని సార్లు తను దేనిచేతనైతే ప్రభావితుడయ్యాడో ఆ ఫిజియోక్రాటిక్ బోధనకు అనుగుణమైన పద్ధతిలో చర్చించాడు, ఇంకొన్ని సార్లు వ్యక్తిపరమైన పద్ధతిలో చర్చించాడు: ఒక లావాదేవీలో పాల్గొనే ప్రతి ఒకడూ అధిక తర వ్యక్తిపరమైన ప్రయోజనాన్ని, అధికతర తృప్తిని పొందుతాడు గనుక, మారకంలో సమానత్వం లేదన్నాడు.

బూర్జువా అర్థశాస్త్రంలో విలువయొక్క వ్యక్తిపరమైన స్వభావం అన్నది, పెట్టుబడిదారీ విధానాన్ని వెనకేసుకువచ్చేందుకు పనికివస్తుందన్న సంగతిని మనం యింతకు ముందే చూశాం. పెట్టుబడిదారీ దోపిడి స్వభావాన్ని బహిర్గతంచేసే అదనపు విలువ సిద్ధాంతాన్ని దాని ప్రాతిపదికపై ఊహించడం దుస్సాధ్యం కావడమే యిందుకు కారణం. సరిగా యిందుకనే గతానికి చెందిన ఆలోచనాపరుల "వ్యక్తిపరవాద" ఉద్ఘాటనలు బూర్జువా పండితుల దృష్టిని ఆకర్షిస్తాయి. 1958లో ప్రచురింపబడిన "అమెరికన్ ఆర్థిక చింతనా, విధానాల నిర్మాతలు" అనే గ్రంథ రచయిత ఓక్లహోమా విశ్వవిద్యాలయ ఆచార్యుడైన విర్గిల్ జి. విల్‌హైట్ యీ విషయంలో ఫ్రాంక్లిన్‌ని అభినందన పూర్వ కంగా భుజం తడతాడు.

తన రచనలనేకంలో ఫ్రాంక్లిన్ "ఆర్థిక అదనపు మొత్తం," అనార్జిత ఆదాయం — వాస్తవంలో యిది అదనపు విలువ — గురించి వివిధ పార్శ్వాల్లో పరిశీలించాడు. మానవతా వాదీ, హేతువాదీ అయిన ఫ్రాంక్లిన్, ఏ సామాజిక వ్యవస్థలోనైతే యితరులు సోమరు లుగా కూర్చొని తమ శ్రమ ఫలితాన్ని దుబారా చేసేందుకు వీలుగా కొందరు తమ కండలు కరిగించి శ్రమిస్తూవుంటారో, అటువంటి సామాజిక వ్యవస్థ "మూర్ఖత్వాన్ని" దర్శించాడు. అలుపు సొలుపుల్లేకుండా కష్టించి పనిజేసే ఫ్రాంక్లిన్, దీన్ని మానవ న్యాయానికి ఒక అవహేళనగా పరిగణించాడు. ఫ్రాంక్లిన్ యిలా రాశాడు: "మరైతే యింతటి లేమికీ, దైన్యానికీ కారణం ఏమిటి? జీవితావసర వస్తువులనుగాని, జీవిత సౌకర్యాలను

గాని ఉత్పత్తి చెయ్యని పనుల్లో పురుషులనూ, స్త్రీలనూ నియోగించడం జరుగుతోంది.* వీళ్ళు, ఏమీ పనిచెయ్యనివాళ్లతో కలిసి కష్టజీవులచేత తయారుచెయ్యబడిన జీవితావసర వస్తువులను అనుభవిస్తారు.... ఒక గణాంకశాస్త్రవేత్త వేసిన అంచనా ప్రకారం, ప్రతి పురుషుడూ, స్త్రీ ప్రతిరోజూ నాలుగేసి గంటల చొప్పున ఉపయోగకరమైన పనేదైనా చేస్తే, ఆ శ్రమ జీవితానికి కావలసిన అన్ని అవసరవస్తువులనూ, సౌకర్యాలనూ సమకూరుస్తుంది, లేమీ, దైన్యం ప్రపంచంనుండి తరిమివేయబడతాయి. మిగిలిన యిరవై గంటలూ విశ్రాంతీ, సంతోషమూ కావచ్చు."**

సహజంగానే ఫ్రాంక్లిన్‌కి, యీ స్వర్ణయుగాన్ని తీసుకురావడం ఎలాగన్న విషయంలో ఒక అభిప్రాయమేమీ లేదు. ఆయన ఉన్నతమైన మాటలు ఒకవంక అన్ని యుగాల ఊహాజనిత స్వర్గాలనూ, మరోవంక ఆడమ్ స్మిత్, ఆయన అనుయాయుల రచనల్లో పరశ్రమోపజీవనంపైనా, అనుత్పాదక శ్రమపైనా గల విమర్శనూ గుర్తుచేస్తాయి.

ఫ్రాంక్లిన్ కోపావేశం పెట్టుబడిదారులపైన ఎక్కువ పెట్టబడలేదనడం స్పష్టం. కాగా ఆయన, ఆ కాలపు మనిషి. అప్పట్లో బూర్జువా సంబంధాల పూర్తి అభివృద్ధి యింకా జరగలేదు. పరశ్రమోపజీవులనూ, యితరుల రక్తాన్ని పీల్చేవారినీ ఆయన తీవ్రంగా ఖండించాడు. అదే సమయంలో పెట్టుబడిపై వడ్డీని అత్యంత న్యాయవిహితమైనదిగా, పొదుపుకి బహూకరణగా పరిగణించాడు. ఆయన భూమికౌలును కూడా అదేమాదిరిగా పరిగణించాడు. భూమికౌలు మొత్తానికీ, పెట్టుబడిపై వడ్డీకీ మధ్య పరిమాణాత్మక పరస్పరాధారాన్ని నెలకొల్పడానికి ఆయన ప్రయత్నించాడు. ఆయన అమాయకంగా "సరసమైన" వడ్డీ రేటంటూ ఒకటి వుంటుందని భావించాడు. ఈ సరసమైన, లేక "సహజమైన" రేటును సంవత్సరానికి 4 శాతంగా అంచనా కట్టాడు. ఆయన దృష్టిలో, యీ రేటు రుణదాతల, రుణగ్రహీతల ప్రయోజనాలను సమన్వయపరచి, వర్గశాంతిని పెంచుతుంది.

వేతనానికి కార్మికులను కుదుర్చుకోడాన్ని కార్మికుడిని పెట్టుబడిదారు దోచుకోవడంగా ఫ్రాంక్లిన్ ఎంతమాత్రం పరిగణించలేదు. వారిమధ్యగల సామాజిక వైరుధ్యాన్ని ఆయన గ్రహించలేదు. భవిష్యత్ కార్మికుడిని కేవలం పితృస్వామిక వ్యవసాయక్షేత్ర శ్రామికుడుగానో, లేక అప్రెంటిస్‌గానో మాత్రమే చూడటం, అతని పక్కపక్కనే తానూ

---

* కుటుంబ పరిచారకులు, పలువురు సేవకులు, ఉద్యోగులు, మత గురువులు, అధికారులు మొదలైనవారికి యిది ప్రస్తావన.

** Vernon Louis Parrington, *Main Currents in American Thought* నుంచి ఉల్లేఖన, New York, 1930, Vol. I, part 2, p. 174.

చెమటోడ్చి శ్రమించే వ్యవసాయక్షేత్ర సొంతదారునో, లేక కార్ఖానా సొంతదారునో ఆయన ఊహించుకోవడమే యిందుకు కారణం.

తన జీవిత కాలంలో ఫ్రాంక్లిన్, "పిడుగును అంకెకు తెచ్చినవాడు"గానూ, తిరుగుబాటు వలసల ప్రతినిధిగానూ మాత్రమే కాకుండా "పేద రిచర్డ్ పంచాంగ" కర్త, ప్రచురణకర్తగా కూడా ప్రపంచమంతటా ప్రసిద్ధిచెందాడు. 1733నుండి 1757దాకా ఫిలడెల్ఫియాలో ఆయన రిచర్డ్ సౌండర్స్ అన్న కలం పేరుతో సంవత్సర పంచాంగం ప్రచురించాడు. దానిలో ఖగోళశాస్త్ర, తదితర సమాచారమే కాకుండా రకరకాల పిట్టకథలు, సూక్తులు కూడా వుండేవి. వీటన్నింటిలోనూ కొన్నింటిని ఫ్రాంక్లిన్ స్వయంగా కూర్చేవాడు, మిగతా సమాచారాన్ని జానపద సాహిత్యంనుంచీ, యితర మూలాధారాలనుంచీ యిచ్చేవాడు.

ఫ్రాంక్లిన్ 1757లో ప్రచురించిన యీ పంచాంగపు చివరి ప్రతికి సంక్షిప్త రూపంలో "పేద రిచర్డ్" సూక్తులతో కూడిన ఒక ముందుమాటను చేర్చాడు. "ఐశ్వర్య సంపాదనా మార్గంపై ఫాదర్ అబ్రహాం ప్రసంగం" అనే శీర్షికగల యీ రచన — దీని శైలి ఫలానా అని నిర్ణయించడం కష్టం — 18వ శతాబ్దంలో అమెరికా, ఇంగ్లండులలో అత్యంత జనరంజకమవడమే కాకుండా, రష్యన్‌తోబాటు అనేక విదేశీ భాషల్లోకి అనువదింపబడింది.

"పేద రిచర్డ్" సుభాషితాలు, ప్రజాసామాన్యానికి చెందిన, జీవితంలో ఔన్నత్యాన్ని సాధించ కోరుకునే ఒక పేదవాడి వివేక సుధానిధి. శ్రమ, పొదుపు, యుక్తాయుక్త విచక్షణ — యీ మూడే సౌభాగ్యానికీ, విజయానికీ మూలస్తంభాలు: "తనకు తాను సహాయం చేసుకునేవాడికి భగవంతుడు తోడ్పడుతాడు," "గట్టున లీవిగా కూర్చునే పిల్లికి ఎలకలు దొరకవు," "నీకు సంపద ఉన్నప్పుడు, రాబడిని గురించే కాక పొదుపును గురించి కూడా ఆలోచించు," "కొంచెం కొంచెం మొత్తాలు కలిసి గొప్ప మొత్తం అవుతాయి."

ఇవి కొద్ది ఉదాహరణలు మాత్రమే. ఇటువంటి అసాధారణమైన ఆర్థిక రచన మరొకటి దొరకడం దుస్తరం. అయితే అది నిజంగానే ఆర్థిక రచన. బూర్జువాలు ఒక వర్గంగా రూపొందుతున్న కాలపు అర్థశాస్త్రంయొక్క సరళీకృత సుభాషితాలు, జానపద సాహిత్య సంపదతోనూ, దైనందిన వివేకంతోనూ కలిసి, అందులో చోటుచేసుకున్నాయి. ఈ సుభాషితాలను గురించి మార్క్స్ యిలా అన్నాడు: "సంచయనం చెయ్యి, సంచయనం చెయ్యి! అదే మోజెస్ చెప్పేదీ, అదే ప్రవక్తలు చెప్పేదీని: 'పరిశ్రమ పదార్థాన్ని సమకూరుస్తుంది, పొదుపు దాన్ని సంచయనం చేస్తుంది.'* అందు

---

* మార్క్స్ యిక్కడ ఆడమ్ స్మిత్‌నుంచి ఉల్లేఖిస్తున్నాడు. ఈ సమస్యపైన స్మిత్ అభిప్రాయాలు ఫ్రాంక్లిన్ అభిప్రాయాలని బాగా పోలినవి.

కనీ పొదుపు చెయ్యండి, పొదుపు చెయ్యండి, అంటే, అదనపు విలువలోని, లేక అదనపు ఉత్పాదితంలోని సాధ్యమైనంత అత్యధిక భాగాన్ని తిరిగి పెట్టుబడిగా మార్చండి!"*

సందర్భవశాత్తూ, సంచయనపు ఆర్థిక ప్రాధాన్యంపై ఫ్రాంక్లిన్ తన భావాలను ఒక స్థాయిలో కచ్చితమైన రూపంలో కూడా వెల్లడించాడు. తన జీవితపు చివరి భాగంలో రచించిన వ్యాసాల్లో దాదాపు తన సహజాతమైన ప్యూరిటనిజంనుంచి ఆయన వైదొలగి, సంచయనం చెయ్యవలసిన అవసరం దృష్ట్యా, విలాసాలను కూడా నైతికంగా సమర్థించవచ్చునని రాశాడు. ఎందుకంటే, ఆయన అభిప్రాయంలో, విలాసార్జన ప్రలోభం పనిచెయ్యడానికీ, పట్టుదలకూ పటుతరమైన ప్రేరణగా పనిచెయ్యవచ్చు. విలాస "ఉపయోగం"పై ఫ్రాంక్లిన్ అభిప్రాయాల్లో కొన్ని మన్‌డెవిల్ అభిప్రాయాలను గుర్తుకు తెస్తాయి.

ఆర్థిక విధాన సమస్యలు ఫ్రాంక్లిన్ జీవితకాల మంతటా ఆయన ఆలోచనలను ఆకట్టుకున్నాయి. కార్యాచరణవాదీ, వాస్తవికవాదీ అయిన ఫ్రాంక్లిన్ తరచుగా వాటిని, ఆయా నిర్దిష్ట పరిస్థితులపైనా, ఆనాటి రాజకీయావసరాలపైనా ఆధారపడి, భిన్న భిన్న పద్ధతుల్లో పరిష్కరించాడు. ఆయన మౌలిక బూర్జువా ప్రజాస్వామిక సూత్రాలు మాత్రమే ఎటువంటి మార్పూ చెందకుండా ఉండిపోయాయి.

1760లో ఫ్రాంక్లిన్ "గ్రేట్ బ్రిటన్ ప్రయోజనాలు" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. అందులో ఆయన ప్రత్యేకించి, అమెరికన్ వలసల్లో కార్ఖానాల అభివృద్ధి అనవసరమే కాకుండా, సామాజికంగా హానికరం కూడా అని వాదించాడు. వ్యవసాయం ఒకటే నిజంగా గొప్ప కార్యకలాపమనీ, అమెరికాలో దాని అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయనీ ఆయన అందులో రాశాడు. ఇది ఆయనపైన ఫిజియోక్రాట్ల సిద్ధాంతానికి గల ప్రభావ కారణమని సాధారణంగా తలచబడుతూండేది — ఆ కాలంలో యూరప్‌లో ప్రచారంలో వున్న ఫిజియోక్రాట్ల సిద్ధాంతంతో ఆయనకు పరిచయమైంది. ఈ అభిప్రాయంలో సామంజస్యం లేకపోలేదు. అయితే అదే సమయంలో, చరిత్రకారులు పేర్కొన్నట్లు, ఫ్రాంక్లిన్ తన యీ పుస్తకంలో యుక్తిగా ఇంగ్లీషు ప్రభుత్వపు ఆందోళనను తగ్గించి పరచేందుకూ, ఫ్రెంచివారినుండి జయించిన కెనడాను మిగిలిన అమెరికన్ రాష్ట్రాలతో కలపమని ఇంగ్లీషు ప్రభుత్వాన్ని ప్రోత్సహించేందుకూ ప్రయత్నించాడు.**

ఫ్రాంక్లిన్ వ్యాపారవాద భావాలనుంచి పూర్తిగా ఎంతమాత్రం విముక్తి కాలేదు,

---

* Karl Marx, *Capital*, Vol. I, 1972, p. 558.

** P. W. Conner, *Poor Richard's Politics. Benjamin Franklin and His New American Order*, London, 1969, p. 73.

అది సహజమే కూడా. ఇతర రచనల్లో, వైరుధ్యాలతో ఎంతమాత్రం గందరగోళపడకుండా, అమెరికాలో పరిశ్రమలను అభివృద్ధిచెయ్యవలసిన అవసరాన్ని గురించి వాదించి, దీనికి వ్యాపారవాద పరిష్కారాలను సూచిస్తాడు: దిగుమతి సుంకాలు, ఆర్థికవ్యవస్థలో డబ్బు పుష్కలంగా ఉండటం, రాజ్యపు క్రియాశీల పోషకత్వం, కొత్త వలసల్లో బినా వాసాల ఏర్పాటు వగైరాలు.

అయితే యిది, 18, 19 శతాబ్దాలనాటి పలువురు అమెరికా దేశీయులకు విశిష్టమైన సంకుచిత, రాష్ట్రీయ, దూరదృష్టి రహిత వ్యాపారవాదం కాదు. ప్రపంచ మార్కెట్టు దృష్ట్యా ఆలోచించినప్పుడు, ఉత్పత్తిలో అంతర్జాతీయ ప్రత్యేకీకరణ కృషీ, స్వేచ్ఛావ్యాపారం అమెరికాలో పరిశ్రమల అభివృద్ధిని కుంటువరచకపోవడమే కాకుండా వర్తకం చేసే దేశాలన్నింటికీ లాభదాయకంగా కూడా వుంటుందని ఆయన భావించాడు. పైన ఉదహరింపబడిన రచయిత ఫ్రాంక్లిన్‌యొక్క యీ అభిప్రాయాలను విరోధాభాస ప్రాయమైన "స్వేచ్ఛా వాణిజ్య వ్యాపారవాదం"* అన్న పేరున పిలిచాడు, ఈ సిద్ధాంతం విశిష్ట అమెరికన్ స్వభావం కలిగినదని పేర్కొన్నాడు. అయితే యీ సందర్భంగా ఒక విషయం చెప్పాల్సివుంది, అమెరికన్‌ల పారిశ్రామికాభివృద్ధిపట్ల ఫ్రాంక్లిన్‌కి వున్నంత ఆసక్తి హ్యూమ్, స్మిత్‌లకు లేకపోయినా వారి అభిప్రాయాలు దీనికి చాల వరకు దగ్గరగా వున్నాయి. స్వేచ్ఛా వ్యాపారాన్ని బలపరచేటప్పుడు వారా సమస్యను పిడివాద దృష్ట్యా కాక, లోకజ్ఞాన దృష్ట్యా పరిశీలించారు.

"జాతుల సంపద"లో స్పష్టంగా కానవచ్చే యీ విశిష్ట లోకజ్ఞానమే, బహుశా అన్నిటికన్న ఎక్కువగా ఫ్రాంక్లిన్‌ని స్మిత్‌తో జతచేసివుంటుంది. ఫ్రాంక్లిన్ స్మిత్‌కన్న పదిహేడేళ్ల పెద్దవాడు, వారి వ్యక్తిగత సంబంధాల్లో నిస్సందేహంగా స్మిత్‌పైన ఫ్రాంక్లిన్ ప్రభావం కొంతమేరకు ఉంది. ఈ సందర్భంగా ఒక కథ ప్రచలితంగా వుంది. 1773–75 సంవత్సరాల్లో స్మిత్ లండన్‌లో తన పుస్తకానికి తుది మెరుగులు దిద్దుతున్నప్పుడు ఫ్రాంక్లిన్ స్మిత్‌కి సలహాదారుగానూ, సంపాదకుడుగానూ పనిచేశాడట. వారి మరణానంతరం (వాళ్లిద్దరూ కూడా 1790లో మరణించారు) ఫ్రాంక్లిన్ యువమిత్రుడూ, రాజకీయవేత్తా అయిన డాక్టర్ జార్జ్ లోగన్, తను ఫ్రాంక్లిన్‌నుండి విన్న యీకింది వివరాలను తన బంధువులకు చెప్పగా, వారు దరిమిలా నలుగురికీ వెల్లడించారు: "...విఖ్యాతుడైన ఆడమ్ స్మిత్ తన 'జాతుల సంపద'ను రాసేటప్పుడు, ప్రకరణం తర్వాత ప్రకరణాన్ని ఆయన (ఫ్రాంక్లిన్ — ఎ. ఎ.) దగ్గరకీ, డాక్టర్ ప్రైస్ దగ్గరకీ, తదితర సాహితీపరుల దగ్గరకీ తెచ్చేవాడు. వాళ్లు చేసిన వ్యాఖ్యా విమర్శలను ఓపి

---

* పూర్వోక్త గ్రంథం, పేజి 74.

కగా విని, వాళ్ల చర్చలవల్లా, విమర్శవల్లా లబ్ధిపొందుతూండేవాడు. ఒకొక్కమారు ప్రకరణాలకు ప్రకరణాలే సరికొత్తగా తిరిగి రాస్తూండేవాడు, తన దృక్పథాన్ని పైతం ఒక్కొక్కమారు మార్చుకుంటూండేవాడు."*

ఈ విచిత్రమైన కథనంలో ఏది నిజమో, ఏది కల్పనో చెప్పడం కష్టం. ఫ్రాంక్లిన్ మాటలను లోగన్ కుటుంబీకులు వక్రీకరించియుండవచ్చు, ఆ పుస్తకాన్ని పూర్తిచెయ్యడంలో ఫ్రాంక్లిన్ పాత్రను అతిశయోక్తి చేసి చెప్పియుండవచ్చు. వారిద్దరి పరిచయమూ అంత సన్నిహితమూ, అంత దీర్ఘకాలికమూ అయివుంటే, వాటికి సంబంధించిన రాతపూర్వక దాఖలాలు ఉండివుండేవి.

ఫ్రాంక్లిన్ అనంతరం అమెరికన్ అర్థశాస్త్రం

స్వాతంత్ర్య యుద్ధానికి (1775–1783) ముందు ఆర్థిక రంగంలో అమెరికన్ల ఆలోచన వలసలకూ, మాతృదేశానికీ మధ్య సంబంధాల తక్షణ ప్రధాన సమస్య పరిధిని దాటి దాదాపు ముందుకి పోలేదు. చాలవరకు ఫ్రాంక్లిన్ విషయంలో కూడా యిది వర్తిస్తుంది.

స్వతంత్ర రాజ్యపు ఏర్పాటు సామాజికాలోచన అభివృద్ధికి కొత్త దిగ్మండలాలను తెరిచింది. అయినా కూడా 18, 19 శతాబ్దాల నాటి అమెరికన్ అర్థశాస్త్రం రాష్ట్రలకు పరిమితమై ఇంగ్లండు, ఫ్రాన్సులనుంచి దిగుమతి చేసుకోబడిన భావాలపైన విశేషంగా ఆధారపడేది. అయితే, పశ్చిమ యూరప్‌లో అభివృద్ధిచెందిన చాలా దేశాల్లోకన్న "పూర్ణవికసిత" బూర్జువా ఉత్పత్తి సంబంధాలు సుమారొక శతాబ్దం తర్వాత మాత్రమే అభివృద్ధిచెందిన అమెరికాలో, సాంప్రదాయిక అర్థశాస్త్రానికి – స్మిత్, రికార్డోల సంప్రదాయానికి – తగినంత ప్రాతిపదిక లేదు.

ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్ర రచనల సిద్ధాంతాచరణలు రెండింటిపట్లా విమర్శనాత్మక ధోరణిలో యిది వ్యక్తమైంది. ఈ సాంప్రదాయిక రచనల విశిష్టత ఏమిటంటే నిష్పాక్షిక విశ్లేషణా, పూర్తి అనిర్దిష్ట భావనా. ఈ సాంప్రదాయిక

---

* John Rae, *Life of Adam Smith*, London and New York, 1895, pp. 264, 265.

అర్థశాస్త్రం ప్రతిపాదించిన ప్రధానార్థిక సూత్రం అయిన స్వేచ్ఛా వ్యాపారమూ, ప్రభుత్వపు కనీస జోక్యమూ కూడా అమెరికాలోని బూర్జువావర్గపు అధిక సంఖ్యాకు లకు ఆమోదయోగ్యం కాదు. అధిక రక్షణ సుంకాల విధింపు ద్వారా స్వదేశీ పరిశ్రమను విదేశీ పోటీనుంచి కాపాడాలని వాదించే రక్షణవాదులచేత ప్రధానంగా ఆర్థిక విధానాలు రూపొందింపబడుతూవచ్చాయి. అర్థశాస్త్రపు యీ ఆచరణాత్మక సమస్యయే ఆర్థిక రచనలకు కేంద్రబిందువైంది. అమెరికన్ రచయిత టర్నర్ అన్నట్లు, "నిజానికి, 1880కి ముందు, అమెరికన్ అర్థశాస్త్రం కస్టమ్స్ సుంకాలపై తర్కక్రమంలో ఉప ఉత్పాదితం తప్ప మరేమీ కాదు."*

శ్రమ విలువ సిద్ధాంతానికి ఆద్యుల్లో ఒకడూ, ఆర్థిక విధానాల్లో రాజకీయాల్లో లిబరలూ, ఒక మాదిరి ఫిజియోక్రాటూ అయిన ఫ్రాంక్లిన్ అమెరికాలోని అర్థశాస్త్రంలో పలుకుబడి కలిగిన సంప్రదాయానికి స్థాపకుడు కాలేకపోయాడు. 19వ శతాబ్ది ప్రథ మార్ధపు అమెరికన్ ఆర్థిక ఆలోచనపై గణనీయమైన ప్రభావం బరపినది అలెగ్జాండర్ హామిల్టన్ ఆర్థికవ్యవస్థలో రాజ్యం విస్తృతంగా జోక్యం పెట్టుకోవాలని వాదించిన ఛాందస భావాలు కలిగిన యీ రాజనీతిజ్ఞుడే అమెరికన్ పారిశ్రామిక రక్షణవిధాన జనకుడు.

హామిల్టన్ అనుయాయుల్లో డేనియల్ రేమండ్ ఒకడు. అర్థశాస్త్రంపై క్రమ బద్ధమైన పుస్తకాన్ని రచించిన మొదటి అమెరికన్ యీ రేమండే. "అర్థశాస్త్రాన్ని గూర్చిన ఆలోచనలు" అనే ఆయన పుస్తకం 1820లో వెలువడింది. రేమండ్ తన "అమెరికన్ ఆర్థిక వ్యవస్థ"ను (ఆయన తీవ్ర జాతీయవాది) స్మిత్‌కీ, మొత్తం యథాతథ వాద అర్థశాస్త్రానికీ వ్యతిరేకంగా ఉన్ముఖం చేసేందుకు ప్రయత్నించాడు. శ్రమ విలువ సిద్ధాంతంపైనా, లాభాన్ని గురించిన స్మిత్ అభిప్రాయాలపైనా (లాభాన్ని ఆయన పెట్టుబడిదారు వేతనంగా పరిగణించాడు), ఆర్థిక ఉదారవాదంపైనా ఆయన దాడిచేశాడు.

పోతే చివరివాడు హెన్రీ చార్లెస్ కేరీ. ఈయన్ని గురించి మార్క్స్ 1852లో "ప్రాముఖ్యం కలిగిన ఏకైక అమెరికన్ అర్థశాస్త్రవేత్త"** అన్నాడు. మార్క్స్ యీ కేరీని అపభ్రంశ అర్థశాస్త్రపు అత్యంత విశిష్ట ప్రతినిధిగా పరిగణించాడు. సాంప్ర దాయిక అర్థశాస్త్రానికి భిన్నంగా, ఈ అర్థశాస్త్ర ధోరణి బుద్ధిపూర్వకంగా బూర్జువా

---

* J. F. Bell, *A History of Economic Thought*, New York, 1953, p. 484నుంచి ఉదాహృతం.

** Karl Marx and Frederick Engels, *Selected Correspondence*, Moscow, 1965, p. 69.

వర్గ ప్రయోజనాలను కాపాడటాన్నీ, పెట్టుబడిదారీ విధానం ఆచరణయోగ్యమైనదీ, న్యాయబద్ధమైనదీ అని నిరూపించడాన్నీ తన లక్ష్యంగా పెట్టుకుంది. కేరీ యీ పని చేసేందుకు బాగా యోగ్యుడు.

ఫ్రాంక్లిన్ భావాల మాదిరిగానే కేరీ భావాలు మౌలికంగా ఉత్తర అమెరికాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి ప్రత్యేక లక్షణాలతో సన్నిహితంగా ముడివడివున్నాయి. అయితే కేరీ, అమెరికన్ ఆర్థిక విజ్ఞానశాస్త్ర జనకునికి ఒక శతాబ్దం తర్వాత రాస్తున్నాడు. ఆ శతాబ్ద కాలంలో ఆ దేశపు బాహ్యరూపమూ, దాని సామాజిక పరిస్థితులూ మారిపోయాయి. పితృస్వామిక వ్యవసాయదారుల, చేతివృత్తులవాళ్ల దేశం అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ సంబంధాలు గల దేశంగా మారింది. కేరీ సుదీర్ఘ జీవితాంతం నాటికి పారిశ్రామికోత్పత్తి పరిమాణంలో అమెరికా ఇంగ్లండును చేరుకుంటోంది.

అమెరికాలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థయొక్క ఉన్నతమైన పెరుగుదల రేట్లూ, బ్రహ్మాండమైన అభివృద్ధి సంభావ్య పాటవమూ కేరీ అభిప్రాయాల్లోని ఆశాభావానికి కారణమై యుండవచ్చు. పెట్టుబడిదారీ పెరుగుదలకు గల అపారావకాశాలలో ఆయనకి పూర్తి విశ్వాసోత్సాహాలు ఉన్నాయి. ఉత్తర అమెరికాలో పెట్టుబడిదారీ అభివృద్ధికి గల ప్రత్యేక పరిస్థితులు, కేరీ బూర్జువా సమాజపు లోపాలనూ, వైరుధ్యాలనూ ప్రత్యేక శ్రద్ధకు యోగ్యంకాని తాత్కాలిక విషయాలుగా తీసుకునేందుకు దారితీశాయి. కేరీ పేరు అమెరికన్ ప్రత్యేకతా సిద్ధాంత మనబడేదానితో ముడివడివుందని చెప్పకోవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, పాత ఖండపు పెట్టుబడిదారీ అభివృద్ధిలో తప్పనిసరి పార్శ్వాలను (తీవ్రమైన వర్గపోరాట, ఆర్థిక సంక్షోభాలను) అమెరికా నివారించుకోగలుగుతుంది. ఈ సిద్ధాంతం యీనాటికీ పూర్తిగా అదృశ్యం కాలేదు.

"ముఖ్యమైన అమెరికన్ సంబంధాలను ఆయన అనిర్దిష్ట రూపంలో, ఇంగ్లండుకు ప్రతికూలంగా వ్యక్తంచేశాడు..."* అన్న మాటల్లో కేరీ విశిష్టతను మార్క్స్ పరిగణనలోకి తీసుకున్నాడు.

కేరీ ప్రధాన విశ్లేషణ పద్ధతి ఏమిటంటే, అమెరికన్, ఇంగ్లీషు సామాజిక సంబంధాలను సరిపోల్చి తేడాలు చూపడం. ఇంగ్లీషు సామాజిక సంబంధాలను ఆయన అసహజమైనవిగానూ, "దాని ఆదర్శరూపంలో" పెట్టుబడిదారీ విధానానికి (అంటే అమెరికా పద్ధతిలో అన్నమాట) బాహ్యమైన అంశాలతో నిరోధితమైనవిగానూ పరిగణించాడు. కేరీయే గనుక ఫ్యూడలిజం అవశేషాలను ప్రస్తావించి వుంటే — అవి నిజంగానే ఇంగ్లండులో

---

* K. Marx, *Fondements de la critique de l'économie politique*, Vol. 2, Paris, 1968, pp. 549—50.

బలంగానూ, దుస్సహంగానూ వున్నాయి — ఆయన చెప్పినది కొంతవరకు సరైనదై వుండేది. అయితే, "సహజ పరిస్థితులను వక్రీకరించే" అంశాలన్నప్పుడు ఆయన ఉద్దేశం, పన్నులు, జాతీయ రుణం, పెట్టుబడిదారీ విధానాభివృద్ధిలోనే అంతర్గర్భితంగా వుండే యితర విషయాలూ అని మాత్రమే.

ప్రధానంగా ప్రయోజనాల సామరస్య సిద్ధాంతానికి ఆయన పేరుపొందాడు. ఈ సిద్ధాంతం బూర్జువావర్గ ప్రయోజనాలకూ శ్రామికవర్గ ప్రయోజనాలకూ మధ్య వ్యతిరేకత ఉందనడాన్ని తిరస్కరించి, పెట్టుబడిదారీ సమాజం వర్గాలమధ్య నిజమైన సాన్నిహిత్యాన్ని కల్పిస్తుందని వాదిస్తుంది. ఎన్నడో 19వ శతాబ్దంలోనే వాస్తవఘటనలు యీ సిద్ధాంతం తప్పని నిరూపించాయి. 1880 దశకంలో అమెరికాలో జరిగిన శక్తివంతమైన కార్మిక సమ్మెలు ఆధునిక కార్మికోద్యమ మూలాధారాల్లో ఒకటిగా పనిచేశాయి.

స్మిత్‌పైన రేమండ్ చేసిన దానికన్న రికార్డోపైన కేరీ తీవ్రంగా దాడిచేశాడు. కేరీ రికార్డో సిద్ధాంతాన్ని వర్గాలమధ్య పొరపొచ్చాల విధానంగా పరిగణించి, స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతాన్ని, అమెరికన్ పెట్టుబడిదారులపై వ్యక్తిగత దాడి అన్నట్లు తలపోశాడు. నిజాయితీపరుడూ, గొప్ప పండితుడూ అయిన యీ ఇంగ్లీషు బూర్జువా రికార్డో, కేరీకి ఒక సోషలిస్టుగానూ, తిరుగుబాటుదారుగానూ, విధ్వంసకుడుగానూ కనిపించాడు.

కేరీ రచనలను 19వ శతాబ్ది మధ్యకాలపు బూర్జువా అర్థశాస్త్రానికి అతిముఖ్య మూలాధారాల్లో ఒకటిగానూ, కేరీని ఆర్థిక విజ్ఞానశాస్త్ర రంగంలో రుణం, కౌలు వంటి సమస్యలను కూలంకషంగా అధ్యయనంచేసినవాడుగానూ మార్క్స్ పరిగణించాడు. అమెరికాలో అర్థశాస్త్రాభివృద్ధిపై తను చేసిన అధ్యయనంలో, సోవియట్ నిపుణుడైన ఎల్. బి. ఆల్తైర్, ఫ్రాన్సు, జర్మనీ, రష్యా దేశాల్లోని ఆర్థిక ఆలోచనపై కేరీ ప్రభావ విస్తృతినీ, స్వభావాన్నీ వివరించాడు.*

1820, 1830 దశకాల్లో ఇంగ్లీషు, ఫ్రెంచి ఊహాజనిత సోషలిజం ప్రభావం కిందా, అమెరికాలో పెరుగుతున్న కార్మికోద్యమానికి సంబంధించి ఆర్థిక ఆలోచనలో తొలి బూర్జువా వ్యతిరేక ధోరణులు తలెత్తాయి. జనావాసాలు లేని విస్తారమైన భూములతో కూడిన తరుణ బూర్జువా ప్రజాస్వామిక రాజ్యం "పాత ప్రపంచానికి" చెందిన పలువురు స్వాప్నికుల, సాంఘిక సంస్కర్తల దృష్టిలో "స్వర్గ భూమి"గా భాసిల్లింది. రాబర్ట్ ఓవెన్ తన కమ్యూనును అమెరికాలో స్థాపించాడు; ఫ్రెంచి కమ్యూనిస్టు

---

* ఎల్. బి. ఆల్తైర్, "అమెరికా సంయుక్త రాష్ట్రాల బూర్జువా అర్థశాస్త్రం," మాస్కో, 1971, పేజీలు 108–126 (రష్యన్ భాషలో).

ఎటియేన్ కాబే అక్కడ చాలా సంవత్సరాల పాటు ప్రత్యక్ష కార్యకలాపాలూ, ప్రచారమూ సాగించాడు. అక్కడ పలు కమ్యూన్లు చార్లెస్ ఫోరియర్ పథకాలను అమలుజరప ప్రయత్నించాయి. ఇది చాలా గ్రంథాల ప్రచురణకు దారితీసింది. ఆ గ్రంథాల రచయితలు ఆర్థిక సమస్యలను ఊహాజనిత సోషలిజంయొక్క వివిధ ధోరణుల దృక్పథాలనుంచి పరిశీలించారు. మామూలుగా, యూరప్‌లోని యీ సిద్ధాంతాల స్థాపకుల ప్రధాన భావాలను దాటి వారు ముందుకుపోలేదు (18, 19 ప్రకరణాలను చూడండి).

19వ శతాబ్దపు 30–60 దశకాల మధ్య పశ్చిమ దేశాల కొత్త భూములకు సామూహిక ప్రస్థానం అమెరికన్ సామాజిక ఆలోచనలో ఒక ప్రత్యేక ఊహాజనిత ధోరణిని ఉత్పన్నం చేసింది. భారీ పరిశ్రమలుగాని, బ్యాంకులుగాని, చట్బా వ్యాపారస్తులుగాని లేని, రాజకీయ బలప్రయోగ యంత్రాంగం లేని, స్వతంత్రులైన వ్యవసాయదారుల, చేతివృత్తులవాళ్ళ సంతోషమయ సమాజ స్వప్నాలు ప్రత్యక్షాభివృద్ధి ధోరణులకు పూర్తి భిన్నమైనవి, అవి భగ్నమై తీరుతాయి. అయితేనేం, వ్యావసాయిక – చేతివృత్తుల ఊహాజనిత భావాలు అమెరికాలో అత్యంత జనరంజకం అయ్యాయి.

1850 దశకంలో అమెరికాలో తొలి మార్క్సిస్టు సంఘాలు ఉద్భవించాయి. వాటి నాయకులు మార్క్సు ఎంగెల్సులకు స్నేహితులూ, సహచరులూను. వారు 1848–49 విప్లవానంతరం జర్మనీనుండి వచ్చిన ప్రవాసులు. అమెరికాలో శాస్త్రీయ సోషలిజానికి తొలి వ్యాఖ్యాతల్లో ఫ్రీడ్రిఖ్ సోర్గె ఒకడు. మార్క్సిస్టు ఆర్థిక బోధన అమెరికాలో ఈ వ్యక్తులచేతా, సంఘాలచేతా వ్యాపింపచెయ్యబడనారంభించింది.

అయితే, విశ్వవిద్యాలయాలలోను, పత్రికల్లోను, విద్యా ప్రపంచంలోను, రాజకీయాల్లోను ప్రాబల్యం వహించిన బూర్జువా భావజాలంతో పోల్చినప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ విమర్శకుల బలమూ, అవకాశాలూ మిక్కిలి పరిమితమైనవి. 19వ శతాబ్దపు ద్వితీయార్ధ భాగంలోనూ, 20వ శతాబ్ది మొదట్లోనూ, ప్రబలమైన కొన్ని బూర్జువా అర్థశాస్త్ర శాఖలు అమెరికాలో తలెత్తాయి. అవి అప్పటికే తమ భావాలను “ఎగుమతి కోసం ఉత్పత్తిచెయ్య” నారంభించాయి.

ప్రకరణం 8

డాక్టర్ కెనే, ఆయన శాఖా

వృత్తి, కీర్తి మనుషులకి రకరకాలుగా వస్తూంటాయి. ఫ్రాన్సువా కెనే వృత్తిరీత్యా డాక్టరు, ప్రకృతిశాస్త్రజ్ఞుడు. దాదాపు తనకు అరవై యేళ్ళు వచ్చేదాకా ఆయన అర్థ శాస్త్రాన్ని చేబట్టలేదు. అప్పటికి ఆయన వైద్యశాస్త్రంపై డజన్లకొద్దీ పుస్తకాలు రచించాడు. కెనే, తన జీవితపు చివరి కొద్ది సంవత్సరాలూ మిత్రుల, శిష్యుల, అను యాయుల సన్నిహిత బృందం మధ్య గడిపాడు. లరోష్‌ఫోకో అన్న యీ కింది మాటలు కెనేకి వర్తిస్తాయి: "ముసలివాళ్లయ్యే కళలో బహుకొద్ది మంది పారంగతులయ్యారు." ఆయన పరిచితుల్లో ఒకడు ఆయన్ని వర్ణిస్తూ, ఆయనకి ఎనభై ఏళ్ల శరీరంపైన ముప్పయ్యేళ్ల తల వుందని అన్నాడు. కెనే 18వ శతాబ్దానికి చెందిన అత్యంత ప్రముఖ ఫ్రెంచి అర్థశాస్త్రజ్ఞుడు.

వైతాళికుల యుగం

ఫ్రెడరిక్ ఎంగెల్స్ యిలా రాశాడు: "ఫ్రాన్సులో రాబోయే విప్లవానికి మనుషుల మనస్సులను సన్నద్ధంచేసిన మహనీయులు స్వయంగా తీవ్ర విప్లవవాదులు. బాహ్యాము లైన ఎటువంటి ప్రమాణాన్నీ వాళ్ళు గుర్తించలేదు. మతం, ప్రకృతి విజ్ఞానశాస్త్రం, సమాజం, రాజకీయ వ్యవస్థలు — ప్రతి ఒక్కటీ కూడా అతి తీవ్రమైన విమర్శకు గురిచెయ్యబడింది: హేతుజ్ఞానమనే విచారణ పీఠం ముందు ప్రతి ఒక్కటీ తన అస్తిత్వ యోగ్యతను నిరూపించుకోవలసిందే, లేకుంటే తన అస్తిత్వాన్ని చాలించుకోవల సిందే."*

---

* Frederick Engels, *Anti-Dühring*, p. 25.

18వ శతాబ్దపు ప్రతిభావంతులైన ఆలోచనాపరుల శ్రేణిలో, సాంప్రదాయిక ఫ్రెంచి అర్థశాస్త్ర జనకులైన కెనే, ట్యూర్గోలకు గౌరవనీయమైన స్థానం వుంది.

ఫ్యూడలిజం అనే మంచు, విముక్త మానవ మేధస్సు అనే ఉజ్వల సూర్యకిరణాలకు క్రమంగా కరిగిపోతుందని వైతాళికులు ఆశించారు. కాని అది జరగలేదు. మంచు కొన్నున్న విప్లవపు హిమ విచ్చేదిని అంతకంతకు విరాట్రూపంలో కనిపించసాగింది, వైతాళికుల్లోని యువతరానికి చెందిన వారు, ఫిజియోక్రాటిక్ అర్థశాస్త్రవేత్తలతోబాటు — వీరు చాలకాలం జీవించారు — ప్రజా క్రోధమనే అగాధాన్ని చూసి భయభీతులై వెనక్కు తగ్గారు.

18వ శతాబ్దం మధ్యలో కెనే రంగంమీదకు వచ్చేనాటికి వున్న ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థ, బువాగిల్బేర్ రచనలు చేస్తూవుండిన 18వ శతాబ్దారంభంనాటి ఆర్థికవ్యవస్థకు మరీ భిన్నంగా లేదు. ఫ్రాన్సు అప్పటికింకా వ్యవసాయ దేశమే, అంతకు ముందరి 50 ఏళ్లలోనూ రైతుల పరిస్థితిలో వచ్చిన మెరుగుదల దాదాపు నామమాత్రం. బువాగిల్బేర్ మాదిరిగానే, కెనే కూడా తన ఆర్థిక రచనలను ఫ్రెంచి వ్యవసాయపు దారుణస్థితి వర్ణనతోనే మొదలుపెట్టాడు.

అయితే, ఆ 50 ఏళ్లలో కొద్ది మార్పులు జరగకపోలేదు. పెట్టుబడిదారీ వ్యవసాయదారుల వర్గం, ప్రత్యేకించి ఫ్రాన్సు ఉత్తరభాగంలో ఆవిర్భవించి, అభివృద్ధి చెందింది. ఈ వర్గంవాళ్లకు సొంత భూమైనా వుండేది, లేక వాళ్లు భూస్వాములనుండి కౌలుకైనా భూమిని తీసుకునేవారు. వ్యావసాయికాభివృద్ధి విషయంలో కెనే తన ఆశలు నిలుపుకున్నది సరిగా యీ వర్గంపైనే. అటువంటి ప్రగతిని ఆయన సరిగానే, మొత్తం సమాజపు ఆరోగ్యవంతమైన ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రాతిపదికగా పరిగణించాడు.

అర్థరహితమూ, వినాశకరమూ అయిన యుద్ధాల మూలంగా ఫ్రాన్సు అలసిపోయింది. ఆ యుద్ధాల్లో తనకు గల సముద్రాంతర వలసలన్నింటినీ, వాటితో తనకు గల లాభసాటి వర్తకాన్నీ అది కోల్పోయింది. యూరప్‌లో దాని పరిస్థితి కూడా మరింత బలహీనపడింది. పరిశ్రమలు ప్రధానంగా రాజదర్బారు, పైతరగతులవారి విలాసాలకూ, డాబుదర్పాలకూ కావలసిన వస్తువులను మాత్రమే ఉత్పత్తిచేశాయి, అదే సమయంలో రైతాంగం మొత్తంమీద చేతి తయారీ వస్తువులతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. పెద్ద కలవరం పుట్టించిన లా వ్యవస్థ పతనం రుణం, బ్యాంకింగుల అభివృద్ధిని కుంటువరచింది. 18వ శతాబ్ది మధ్యనాటి ఫ్రాన్సులో ప్రజాభిప్రాయాన్ని వ్యక్తంచేసిన పలువురి దృష్టిలో పరిశ్రమలూ, వర్తకం, బ్యాంకింగూ ఏదో ఒక రకమైన అప్రతిష్ఠ పాల్జెయ్యబడ్డాయి. కాగా వ్యవసాయం ఒక్కటే శాంతి, సౌభాగ్య, సహజత్వాలకు చివరి ఆస్కారంగా కనిపించింది.

లా రుణంపట్ల తలమునకలుగా ప్రేమారాధనలో పడితే, కెనే — ఆయన వ్యక్తిత్వ స్వభావాల్లో ప్రేమారాధనకు సంబంధించినది బొత్తిగా ఏమీ లేకపోయినా — వ్యవసాయంపట్ల ప్రేమారాధనలో పడ్డాడు. అన్నట్లు, బోధకునిలోని యీ గుణలోపం, ఆయన శిష్యుల్లో కొందరి, ప్రత్యేకించి మార్క్విస్ ఆఫ్ మిరబో, అపారోత్సాహంతో పూరించబడింది.

ఫ్రెంచి జాతి వ్యవసాయంపట్ల విమోహితమైంది, అయితే వివిధ విభిన్న రకాల్లో విమోహితమైంది. వ్యవసాయాన్ని గురించి మాట్లాడటం రాజాస్థానంలో ఫేషనైంది. రాజాస్థాన కేంద్రం అయిన వెర్సేల్స్‌లో నమూనా క్షేత్రాలు నెలకొల్పబడ్డాయి. రాష్ట్రాల్లో వ్యవసాయాభివృద్ధి నిమిత్తం పలు సొసైటీలు స్థాపించబడ్డాయి, అవి "ఇంగ్లీషు" తరహా, అంటే మరింత ఉత్పాదకమైన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించాయి. వ్యవసాయ శాస్త్ర రచనలు వెలువడనారంభించాయి.

ఆ పరిస్థితుల్లో కెనే భావాలకు — వ్యవసాయంలో ఆయన ఆసక్తి వేరే రకమైనదైనప్పటికీ — ఆదరణ లభించింది. ఆర్థికవ్యవస్థలో వ్యవసాయం ఒక్కటే ఉత్పాదక రంగం అన్న అభిప్రాయాన్ని ప్రాతిపదికగా చేసుకొని, కెనే, ఆయన అనుయాయులూ ఫ్యూడల్ వ్యతిరేక స్వభావం కలిగిన ఆర్థిక సంస్కరణల కార్యక్రమం ఒకదాన్ని రూపొందించారు. ట్యూర్గో దరిమిలా యీ సంస్కరణలను అమలుజరప ప్రయత్నించాడు. వాటిలో చాలభాగం విప్లవంచేత అమలుజరపబడ్డాయి.

కెనే, ఆయన అనుయాయులూ డిడ్రో నాయకత్వాన గల వైతాళికుల్లోని ప్రధాన విభాగం కన్న — వైతాళికుల్లోని వామపక్షంవారి సంగతి వేరే చెప్పనే అక్కర్లేదు, వారి నుంచే దరిమిలా ఊహాజనిత సోషలిజం ఉత్పన్నమైంది — మౌలికంగా చాలా తక్కువ విప్లవవాదులూ, ప్రజాస్వామికవాదులూను. గత శతాబ్దానికి చెందిన ఫ్రెంచి చరిత్రకారుడు టొక్విల్ చెప్పినట్లు, వాళ్ళు "నమ్ర, శాంత స్వభావులు, నిజాయితీపరులైన అధికారులు, నిపుణులైన పరిపాలకులు...."* ఆనాటి ఫ్రాన్సులో వక్తృత్వ కళా పారమ్యానికి గీటురాయి బస్టీల్ జైలు పాలుకాకుండా మాట్లాడటమే అని ఒక చమత్కారి చేసిన వ్యాఖ్య ప్రజల్లో బాగా ప్రచారంలో వుంటూండేది. మహోత్సాహి అయిన మిరాబో కూడా ఆ వ్యాఖ్యను పాటించాడు. ఆయన కొద్ది రోజులపాటు అరెస్టయిన మాట నిజమేననుకోండి, అయితే పలుకుబడి కలిగిన డాక్టర్ కెనే త్వరలోనే ఆయన్ని జైలు నుంచి బయటపడేశాడు. ఆ స్వల్పకాలిక జైలువాసం ప్రజల్లో మిరాబోపట్లగల అభి

---

* Alexis de Tocqueville, *L'ancien régime et la revolution*, Paris, 1856, p. 265.

మానాన్ని పెంచడానికి మాత్రమే తోడ్పడింది. తర్వాత ఆయన మరింత జాగ్రత్తగా వున్నాడు.

అయితే ఆచరణలో, ఫిజియోక్రాట్ల కార్యకలాపాలు అత్యంత విప్లవకరంగా వుండి, "పాత వ్యవస్థ" పునాదులను దొలిచేశాయి. ఉదాహరణకు మార్క్స్ తన "అదనపు విలువ సిద్ధాంతాలు"లో "ఫ్రెంచి విప్లవ ప్రత్యక్ష కారుకులలో ఒకడు"*గా ట్యూర్గోను అభివర్ణించాడు.

మేడమ్ డి పంపడూర్ వైద్యుడు

రాజుగారి ఉంపుడుకత్తెకు యింతాచేసి ముప్పయ్యేళ్లకు ఏ కొంచెమో తప్ప ఎక్కువ వయస్సు లేదు, కాని శూన్య మస్తిష్కుడూ, సుఖప్రియుడూ అయిన సింహాసనాధిపతి ప్రత్యేకాభిమానాన్ని ఆమె అప్పుడే కోల్పోతోంది. దరిమిలా ఆమె అతని జనానా నిర్వహణను తన చేతుల్లోకి తీసుకుని, తన ఆధిపత్య స్థానాన్ని చివరికంటా నిలుపుకుంది. ఫ్రాన్సులోకెల్ల మిక్కిలి శక్తివంతులైన ఈ యిద్దరి తర్వాతి స్థానం, మేడమ్ డి పంపడూర్ ఆంతరంగిక వైద్యుడూ, రాజవైద్యుల్లో ఒకడూ అయిన డాక్టర్ కెనేది. సామాన్యమైన దుస్తులు ధరించే యీ గుండ్రభుజాల వ్యక్తి ఎప్పుడూ ప్రశాంతంగానూ, ఒకమాదిరి వెటకారంగానూ వుండేవాడు. ఆయనకు రాజ్యరహస్యాలూ, ఆంతరంగిక రహస్యాలూ అనేకం తెలుసు. అయితే డాక్టర్ కెనేకి నోరు బిడాయించుకుని ఉండటం కూడా తెలుసు. తన వృత్తిలో ఆయనకు గల నైపుణ్యంకన్న ఆయన యీ రహస్య గోపన గుణానికి ఎక్కువ మెచ్చుకోలు లభించేది.

రాజుగారికి బోర్డో అంటే ప్రాణం, కాని ఆ ద్రాక్ష సారాయి రాజోదరానికి మరీ బరువని తలచిన డాక్టరు కెనే ఆదేశాలమేరకు, రాజుగారు దాన్ని విసర్జించవలసి వచ్చింది. అయితే రాత్రి భోజన క్రమంలో రాజా షాంపేన్ ఎంత ఎక్కువగా సేవించేవాడంటే, ఒక్కొక్కమారు మేడమ్ డి పంపడూర్ శయ్యాగారంలోకి కాళ్లు యీడ్చుకుంటూ వెళ్లే ఆతగాడి అడుగులు తడబడుతూండేవి. చాలమార్లు ఆయన నిస్త్రాణ చెందేవాడు, అయితే కెనే అందుబాటులో వుండేవాడు. రాజుగారు తన పడకమీద ప్రాణంవిడిస్తే ఏం జరుగుతుందో ఏమోననీ, తనపైన వెంటనే హత్యారోపణ జరుగుతుందనీ గజగజ వణికే మేడమ్‌కి ధైర్యం చెప్తూ, ఆయన తన రోగి పరిస్థితిని చిట్కా వైద్యంతో బాగుచేసేవాడు. అటువంటి ప్రమాదానికి ఆస్కారం లేదని కెనే ఆమెకు

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, p. 344.

దృఢంగా చెప్పేవాడు. రాజా వయస్సు నలభై యేళ్లే. అతనికే కనుక అరవై యేళ్ళంటే, అతని ప్రాణం విషయంలో కెనే హామీ యివ్వగలిగి యుండేవాడు కాదు. తన కాలంలో రైతులకూ, రాజాస్థానికులకూ, అంగడి యజమానులకూ, యువరాణులకూ వైద్యం చేసిన, అనుభవపరుడూ, తెలివి పరుడూ అయిన ఆ డాక్టరు మేడమ్ డి పంపడూర్ మనస్సును తెరిచిన పుస్తకంలా చదవగలిగేవాడు.

మందులకు సంబంధించినంతవరకు కెనే సాదా, సహజ చికిత్సలంటే యిష్ట పడేవాడు. చాలవరకు ప్రకృతిపైన విడిచిపెట్టేసేవాడు. ఆయన సామాజిక, ఆర్థిక భావాలు ఆయన స్వభావంలోని యీ పార్శ్వానికి పూర్తి అనుగుణంగా వుండేవి. అసలు "ఫిజియోక్రాటోన్" అన్న ఆ మాటకి అర్థం ప్రకృతి శక్తి అవి. ఈ గ్రీకు పదంలోని "ఫిజిస్" అన్న భాగానికి ప్రకృతి అనీ, "క్రాటోస్" అన్న భాగానికి శక్తి అనీ అర్థం.

పదిహేనవ లూయీకి కెనే అంటే అభిమానం వుంది. కెనేని అతను "నా ఆలోచనాపరుడు" అని పిలిచేవాడు. అతను ఆ డాక్టరుకి ఒక బిరుదునిచ్చి, లాంఛనాన్ని తను స్వయంగా ఎంపికచేశాడు. డాక్టరు తనకు నిర్దేశించిన శరీర వ్యాయామాలకోసం తెప్పించిన చేతి ప్రెస్సుమీద, కెనే రాసిన "ఆర్థిక పట్టికలు" మొదటి కాపీలను, 1758లో పదిహేనవ లూయీ స్వహస్తాలతో అచ్చువేశాడు. ఆ రచనయే కెనేను తరువాత ప్రసిద్ధుడ్ని చేసింది. కాని కెనేకు రాజు అంటే యిష్టం లేదు. కెనే రాజును ప్రమాదకరమైన అనామకుడుగా పరిగణించేవాడు. ఫిజియోక్రాట్ల ఆదర్శ పాలకునికి — రాజ్యపు చట్టాల వివేకవంతుడైన సంరక్షకునికి — అతను పూర్తి భిన్నమైనవాడు. రాజాస్థానంలో నిరంతరాయమైన తన ఉనికినీ, తనకుగల పలుకుబడినీ వినియోగించి, క్రమంగా పదిహేనవ లూయీ కొడుకూ, సింహాసన వారసుడూ, అతని మరణానంతరం రాజు మనవడూ, కొత్త సింహాసన వారసుడూ అయిన భవిష్యత్ పదహారవ లూయీని అలాంటి పాలకుణ్ణిగా చెయ్యాలని, కెనే ప్రయత్నించాడు.

ఫ్రాన్సువా కెనే వెర్సైల్స్ సమీపంలోని ఒక గ్రామంలో 1694లో జన్మించాడు. నికొలా కెనే బిడ్డలు పదముగ్గురిలోనూ ఆయన ఎనిమిదోవాడు. ఒకప్పుడు కెనే తండ్రి బారిస్టరుగానో లేక న్యాయవిభాగోద్యోగిగానో పరిగణింపబడ్డాడు. కాని దరిమిలా, యీ కథ డాక్టరు కెనే అల్లుడు కల్పించినదని తేలింది. ఎవేస్ పేరుగల ఆ వైద్యుడు, తన మామగారైన కెనే మరణానంతరం కొద్ది రోజులకు, ఆయన మొట్టమొదటి జీవిత చరిత్రను ప్రచురిస్తూ, ఆయనకి మరికొంచెం ఉన్నతమైన కుటుంబ పూర్వరంగాన్ని కల్పించాలని ప్రయత్నించాడు. కాని యీరోజున మనకు, నికొలా ఒక సామాన్యరైతు అనీ, ఆయన చిన్న తరహా వర్తకం కూడా చేసేవాడనీ తెలిపే లిఖితపూర్వకమైన రుజువులు లభించాయి.

పదకొండేళ్ల వరకు ఫ్రాన్సువాకు చదువుసంధ్యలు రావు. అప్పుడొక దయామయుడైన తోటమాలి ఆయనకి చదవడం రాయడం నేర్పాడు. దీని తర్వాత గ్రామ మతగురువు దగ్గరా, పొరుగునగల చిన్న పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలోనూ ఆయన చదువు కొనసాగింది. ఎవేన్ రాసినదాన్ని బట్టి, పదమూడేళ్ల వయస్సులోనే తండ్రి మరణించిన కారణంగా, ఫ్రాన్సువా పొలాల్లోనూ, యింటి దగ్గరా కష్టపడి పనిచెయ్యాల్సి వచ్చేది. ఆ కుర్రవాడికి గ్రంథపఠనాసక్తి ఎంత ప్రగాఢంగా వుండేదంటే, ఆయన ఒక్కొక్కసారి వేకువఝాముననే కాలినడకన పారిస్‌కి పోయి, తనకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకొని, డజన్లకొలది కిలోమీటర్ల దూరం నడిచి రాత్రి ఎప్పటికో యింటికి తిరిగి చేరుకునేవాడు. రైతుసహజమైన ఆయన సహన శక్తికి యిది మరో రుజువు. బాగా చిన్నతనంలోనే ఆయన్ని పీడించనారంభించిన వాతరోగాన్ని మినహాయిస్తే, కెనే ఆ మరణాంతం మంచి ఆరోగ్యాన్ని నిలుపుకున్నాడని చెప్పవచ్చు.

పదిహేడేళ్ల వయస్సులో కెనే తను సర్జన్ కావాలని సంకల్పించుకొని, స్థానిక డాక్టరు దగ్గర సహాయకుడుగా చేరాడు. ఆయన ప్రధానంగా చెయ్యవలసిన పనేమిటంటే, రోగుల రక్తం స్రవింపజెయ్యడం: ఆ రోజుల్లో యీ రక్తస్రావ చికిత్స సర్వ సామాన్యమైనది. బోధన నాసిగా వున్నప్పటికీ కెనే శ్రమపడి శ్రద్ధగా నేర్చుకున్నాడు. 1711నుండి 1717దాకా ఆయన పారిస్‌లో ఒక చెక్కడపు అంగట్లో పనిచేశాడు, అదే కాలంలో ఒక ఆస్పత్రిలో కూడా ప్రాక్టీసు చేశాడు. ఇరవైమూడేళ్ళ వచ్చేసరికి ఆయన ఎంత బాగా నిలదొక్కుకున్నాడంటే, ఆయన పారిస్‌లోని ఒక పచారీ వర్తకుని కూతురును మంచి కట్నంతో పెళ్లిచేసుకొని, సర్జన్ డిప్లొమా సంపాదించుకొని, పారిస్‌కి సమీపంలోని మంట్‌లో ప్రాక్టీసు మొదలుపెట్టాడు. మంట్‌లో కెనే పదిహేడేళ్ల వున్నాడు. పరిశ్రమ, నైపుణ్యం, రోగుల్లో విశ్వాసాన్ని పురిగొల్పగల ఒక విశిష్ట సామర్థ్యం — వీటి మూలంగా ఆయన ఆ జిల్లాలో కెల్ల మిక్కిలి పేరుపొందిన డాక్టరయాడు. ఆయన కాన్పుకేసులు బాగా చేసేవాడు (యిందులో ఆయన బాగా ప్రసిద్ధుడు), రక్తస్రావం చేయించేవాడు, పళ్ల పీకేవాడు, ఆ రోజుల నాటికి బాగా క్లిష్టమైన కొన్ని ఆపరేషన్లు చేసేవాడు. క్రమంగా ఆయన రోగుల్లో స్థానిక ప్రభువులు కూడా చేరడం తటస్థించింది, ఆయనకి పారిస్‌వాసులైన ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి, ఆయన పలు వైద్య శాస్త్ర గ్రంథాలు రచించి ప్రచురించాడు.

1734లో, అప్పటికి భార్యావిహీనుడూ, యిద్దరు బిడ్డల తండ్రీ అయిన కెనే, మంట్‌ను విడిచి, డ్యూక్ డి విల్లెరువా ఆహ్వానంపైన, ఆయన కుటుంబ వైద్యుడి ఉద్యోగంలో జేరాడు. 1730, 1740 దశకాల్లో ఆయన తన శక్తిలో అధికాంశాన్ని, "ఫాకల్టీ"కి — అధికారిక వైద్య అకాడెమీకి — వ్యతిరేకంగా సర్జన్లు జరిపే పోరాటానికి

వినియోగించాడు. పాత చట్టంప్రకారం సర్జన్లు కూడా క్షురకుల గిల్డుకే చెందుతారు, కాగా వాళ్లు వైద్యం చెయ్యడం నిషిద్ధం. కెనే "సర్జన్ల పార్టీ"కి నాయకుడయాడు, చివరకు ఆ పోరాటంలో విజయవంతుడయాడు. ఆ కాలంలోనే ఆయన తన ప్రధాన శాస్త్రీయ రచనను ప్రచురించాడు. అదొక వైద్య, తత్వశాస్త్ర రచన. దానిలో మౌలికమైన వైద్యశాస్త్ర సమస్యలు — సిద్ధాంతానికీ, ఆచరణపూర్వకమైన వైద్యం, వైద్యపరమైన సత్ప్రవర్తన నియమాలు మొదలైనవాటికీ మధ్యగల సంబంధం — పరిశీలింపబడ్డాయి.

1749లో మేడమ్ డి పంపడూర్‌కి ఆయన బదిలీ — డ్యూక్‌నుంచి ఆయన్ని ఆమె "అర్థించింది" — కెనే జీవితంలో ఒక ముఖ్య ఘటన. కెనే వెర్సేల్స్‌లోని రాజభవనపు అటక వాటాలోకి మారాడు. ఆ అటక వాటా ఆర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రలో ఒక ముఖ్యమైన పాత్రను వహించవలసివుంది. అప్పటికే ఆయన బాగా ఐశ్వర్యవంతుడు.

కెనే జీవితంలోనూ, కార్యకలాపాల్లోనూ వైద్యం ఒక పెద్ద స్థానాన్ని ఆక్రమించింది. తత్వశాస్త్రం అనే వంతెన మీదుగా ఆయన వైద్యంనుంచి అర్థశాస్త్రానికి పయనించాడు. మానవ అంగనిర్మాణం — సమాజం. రక్త ప్రసరణం లేక మానవునిలో జరిగే జీవప్రక్రియ — సమాజంలో ఉత్పాదితాల చలామణీ. జీవశాస్త్రపరమైన యీ సాదృశ్యాన్వేషణే కెనే ఆలోచనకు మార్గదర్శకమైంది, యీ నాటికీ యీ పద్ధతి తన విలువను కోల్పోలేదు.

వెర్సేల్స్ రాజభవనపు అటక వాటాలో కెనే పాతికేళ్లు నివసించాడు. తన మరణానికి ఆర్నెల్లు ముందు మాత్రమే ఆయన ఆ వాటాను వదిలి పోవలసివచ్చింది. పదిహేనవ లూయీ మరణించగా కొత్త పాలకుడు పాత పాలనకు చెందిన అవశేషాలన్నింటినీ తుడిచిపెట్టేశాడు. కెనే వాటాలో ఎత్తు తక్కువగానూ, మబ్బుగానూ వుండే ఓ పెద్ద గదీ, చీకటిగా వుండే రెండు సామాన్య గదులూ వుండేవి. అయితేనేం, త్వరలోనే అది, "సాహితీ రిపబ్లిక్" — విజ్ఞాన సర్వస్వం చుట్టూ 1750 దశకపు మొదటి సంవత్సరాల్లో చేరిన పండితులు, తత్వవేత్తలు, రచయితల — అభిమానపాత్రమైన సమావేశ స్థలాల్లో ఒకటైంది. డాక్టర్ కెనే తన భావాలను పత్రికల్లో కన్న తన అటక వాటాలో చేరిన మిత్రబృందం ముందు ఎక్కువగా వెల్లడిస్తూండేవాడు. ఆయనకి శిష్యులూ, ఆయనతో ఏకాభిప్రాయం కలిగినవారితోబాటు, ఆయనతో ఏకీభవించనివారు కూడా ఉన్నారు. కెనే వాటాలో జరిగే సమావేశాలను గురించి మర్‌మొంటేల్ విశదమైన వర్ణనను యిచ్చాడు: "కెనే అటక వాటాకింద తుపానులు ముసురుకొని, విడిపోతూండగా, వ్యవసాయార్థిక వ్యవస్థపైన తన ప్రతిపాదనలపైనా, అంచనాలపైనా కెనే తదేకంగా పనిచేస్తూండేవాడు, తనేదో ఓ వంద మైళ్ల దూరంలో వున్నట్లు రాజదర్బారు కదలిక

లను పట్టించుకోకుండా ప్రశాంతంగా వుండేవాడు. కింద, వాళ్ళు శాంతి, యుద్ధం, సైన్యాధిపతుల ఎంపిక, మంత్రుల బర్తరఫులను గురించి చర్చిస్తూండగా, మేము కెనే ఆటక వాటాలో వ్యవసాయాన్ని గురించీ, నికరోత్పాదితపు అంచనాను గురించీ చర్చి స్తూండేవాళ్ళం, లేకపోతే ఒక్కోమారు డిడ్రో, డి అలంబేర్, డ్యుక్లో, హెల్వెటియస్, ట్యూర్గో, బుఫాన్‌లతో కలిసి సరదాగా భోజనాలు చేస్తూండేవాళ్ళం. ఈ తత్వశాస్త్ర జ్ఞుల బృందాన్ని కిందనున్న తన మందిరంలోకి ఆకర్షించడంలో విఫలురాలైన మేడమ్ డి పంపడూర్, భోజనాల బల్లచుట్టూ కూర్చున్న వారిని చూసేందుకూ, వారితో కబుర్లు చెప్పేందుకూ తనే వస్తూండేది."*

తర్వాత, కెనే కూటం (sect)** ఆయన చుట్టూ కూడినప్పుడు, సమా వేశాలు కొంత భిన్నమైన స్వభావాన్ని సంతరించుకునేవి: టేబిలు దగ్గర కూర్చున్నవాళ్ళు ప్రధానంగా కెనే శిష్యులూ, అనుచరులూ, లేక, వాళ్ళు మాస్టరుకి పరిచయంచేసే వాళ్ళూను. ఆడమ్ స్మిత్ 1766లో యిక్కడ చాలా సాయంకాలాలు గడిపాడు.

కెనే ఎలాంటివాడు?

సమకాలీనులు ఆయన్ని గురించి పరస్పరం బాగా విరుద్ధమైన విషయాలు అనేకం చెప్పారు. వాటినిబట్టి జిత్తులమారియైన ఒక వివేకి చిత్రం మన కళ్ళముందుకి వస్తుంది. సారళ్యం వెనక తన తెలివిని కొంత మరుగుపరచినవాడిగా కనిపిస్తాడు. కొందరు ఆయన్ని సోక్రటీసుతో పోల్చేవారు. తక్షణమే తేటతెల్లంకాని ప్రగాఢార్థం కలిగిన కట్టు కథలంటే ఆయనకి యిష్టం అని చెప్పుకునేవారు. ఆయన బాగా నిరాడంబరుడు, వ్యక్తిగత కీర్తికాంక్ష లేనివాడు. మనస్సు ఎంతమాత్రం కష్టపెట్టుకోకుండా తన భావా లను తన శిష్యుల్ని ప్రచురించుకోనిచ్చి వాళ్ళని గౌరవం పొందనిచ్చేవాడు. ఆకారంలో ఆయన సదరుగా కనిపించేవాడు కాడు. "ఆటక వాటా క్లబ్బు"కి కొత్తగా వచ్చిన వ్యక్తి, ఆతిథేయుడూ, అధ్యక్షుడూ ఎవరో వెంటనే కనిపెట్టలేకపోయేవాడు. మిరాబో సోదరుడు ఆయన్ని కలుసుకున్నాక, "మహా తెలివైనవాడు" అన్నాడు. ఆయన చెప్పిన కథ విన్న ఒక రాజాస్థానికుడు "జిత్తులమారి మర్కటం" అని ఆయన్ని వర్ణించాడు. 1767లో

---

* *Oeuvres complètes de Marmontel*, t. I, Paris, 1818, pp. 291—92.

** ఫిజియోక్రాట్ల బృందానికి పెట్టబడిన పేరు యిదీ. ఈ పదం, నిక్కచ్చార్థం గాని, వ్యంగ్యంగాని లేకుండా, పట్టినే కెనే అనుచరుల్లో సన్నిహిత భావజాలాత్మక సాన్నిహిత్యాన్ని తెలిపేందుకే తరచుగా వినియోగింపబడింది. కెనేపట్ల అత్యధిక గౌరవం కలిగిన ఆడమ్ స్మిత్ కూడా, తన "జాతుల సంపద"లో యీ "కూటం" గురించి రాశాడు.

వేయబడిన ఆయన చిత్రాన్ని చూస్తే వికారమైన సామాన్యుని ముఖం, వ్యంగ్య పూర్ణమైన అర్ధ దరహాసం, ఎదుటివారి మనస్సు లోతుల్లోకి చొరుచుకుని చూసే తెలివైన నిశితమైన కళ్ళూ కనిపిస్తాయి.

డి అలంబేర్ రాసినదాని ప్రకారం, కెనే "రాజాస్థానంలో వుండే ఒక తత్వవేత్త. దేశపు భాష* తెలుసుకోకుండా, దాన్ని తెలుసుకునేందుకు వీసమెత్తు ప్రయత్నం కూడా చెయ్యకుండా, దానిలో వుండేవాళ్లతో వీసమెత్తు సంబంధం కూడా లేకుండా, అక్కడ ఏకాంతంలో, అధ్యయనంలో గడుపుతున్నవాడు. తనెంత నిష్పక్షపాతో అంతటి వివేకశాలి, అక్కడ చెప్పబడిన, లేక చెయ్యబడిన దేన్నీ పట్టించుకోనివాడు."**

మేడమ్ డి పంపదూర్ పైనా, రాజుపైనా తన పలుకుబడిని కెనే, తను అప్పట్లో అంకితుడైన లక్ష్య ప్రయోజనాలకు వినియోగించాడు. ట్యూర్గోతో కలిసి చట్టాన్ని కొంత సవరింపజెయ్యడానికి ఆయన ప్రయత్నించాడు, ఏకమనస్కులైన స్నేహితుల రచనల ప్రచురణకు ఏర్పాట్లుచేశాడు. లెమెర్స్యేని ఉన్నతోద్యోగంలో నియమింపజేశాడు, ఆ పదవిలో ఆయన ఫిజియోక్రాట్ల తొలి ప్రయోగాన్ని అమలుజరుప ప్రయత్నించాడు. 1764లో మేడమ్ డి పంపదూర్ మృతితో అర్థికవేత్తల పరిస్థితి కొంత బలహీన పడింది, కాని కెనే రాజుకి యింకా వైద్యసలహాదారుగానే వున్నాడు, రాజు ఆయన పట్ల యింకా అభిమానం ప్రదర్శిస్తూనే వున్నాడు.

కొత్త విజ్ఞానశాస్త్రం

రైతు తన పొలాన్ని దున్నుతాడు, దానిలో ఎరువు వేస్తాడు, విత్తనాలు జల్లుతాడు, తర్వాత పంట నొల్లుకుంటాడు. అతను కొన్ని విత్తనాలను పక్కన పెడతాడు, కొన్ని గింజలను తన కుటుంబపు తిండికి నిల్వచేసుకుంటాడు, పట్టణంలో లభ్యమయ్యే అత్యంతావసర సరుకులను సేకరించుకునేందుకుగాను కొంత ధాన్యాన్ని అమ్ముతాడు. అప్పటికీ తనదగ్గర అదనంగా కొంత ధాన్యం మిగిలివుందని సంతృప్తిచెందుతాడు. దీనికన్న సరళమైన కథ ఏముంటుంది? అయితే, యీ మాదిరి విషయమే డాక్టరు కెనేని రకరకాల భావాలకు ప్రేరేపించింది.

---

* అంటే, రాజాస్థానానికి సంబంధించిన కబుర్లకూ, కుట్రలకూ సంబంధించిన భాష.

** *François Quesnay et la Physiocratie*, Paris, 1958, t. I, p. 240.

ఆ అదనపు ధాన్యం ఏమవుతుందో కెనేకి తెలుసు. ఆ రైతు దాన్ని, డబ్బు రూపంలో గాని, ధాన్యం రూపంలోగాని తన భూఖామందుకు, రాజుకు, చర్చికీ యిస్తాడు. ఆ ధాన్యం వారిలో ఒక్కొక్కరికి ఏ నిష్పత్తిలో ముడుతుందో కూడా ఆయన అంచనా వేశాడు: $^4/_7$ వంతు భూఖామందుకు, $^2/_7$ వంతు రాజుకు, $^1/_7$ వంతు చర్చికి. దీన్నిబట్టి రెండు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకటి, రైతు పంటలో; లేక ఆదాయంలో గణనీయమైన భాగాన్ని యీ ముగ్గురూ ఏ హక్కు మేరకు కాజేస్తున్నారు? రెండు, అసలీ మిగులు ఎక్కడినుంచి వస్తోంది?

కెనే మొదటి ప్రశ్నకు ఉజ్జాయింపుగా యిలా జవాబిస్తాడు. రాజు విషయంలోనూ, చర్చి విషయంలోనూ చెయ్యగలిగిందేమీ లేదు — ఒక విధంగా చెప్పాలంటే అది దైవ హస్తం. పోతే భూఖామందుల విషయంలో ఆయనొక ఆసక్తికరమైన వివరణను కనిపెట్టాడు: వాళ్ల కౌలును, భూమి అడ్వాన్సుల (avances foncières) పైన — ఆ భూమిని సేద్యానుకూల పరిస్థితిలో పెట్టేందుకు వాళ్ళు చాలా కాలం క్రితం పెట్టివుంటారనుకొనబడే పెట్టుబడి మదుపుపైన — ఒక రకమైన న్యాయబద్ధమైన వడ్డీగా పరిగణించవచ్చు. ఎవరి మాటో ఎందుకు, అసలు కెనేయేనా యీ విషయాన్ని నమ్మాడా అన్న విషయం చెప్పడం కష్టం. ఏదేమైనా, భూస్వాములు లేని వ్యవసాయాన్ని ఊహించుకోవడం ఆయనకి దుస్సాధ్యం. రెండవ ప్రశ్నకు సమాధానం ఆయనకి మరింత విశదమనడం స్పష్టం. భూమి, ప్రకృతి యీ మిగులును యిచ్చింది! అదే సహజ పద్ధతిలో అది, భూఖామందుకి పోతుంది.

వ్యవసాయోత్పత్తి ఖర్చులన్నీ మినహాయించబడిన తర్వాత ఏర్పడిన వ్యావసాయికోత్పాదితంలోని మిగులుకు కెనే <u>నికర ఉత్పాదితం</u> (produit net) అని పేరుపెట్టి, దాని ఉత్పత్తి, పంపిణీ, చలామణీలను విశ్లేషించాడు. ఫిజియోక్రాట్ల నికర ఉత్పాదితం అదనపు ఉత్పాదితానికీ, అదనపు విలువకీ సన్నిహిత సమరూపం. దాన్ని భూమికౌలుకి పరిమితంచేసి, భూమియొక్క సహజ ఫలితంగా దాన్ని వాళ్ళు పరిగణించారు. కాని వాళ్ళు చేసిన గొప్ప సేవ యేమిటంటే, వాళ్ళు "అదనపు విలువ మూలపు పరిశీలనను చలామణీ రంగంనుంచి ప్రత్యక్ష ఉత్పత్తి రంగానికి బదిలీచేసి, తద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తి విశ్లేషణకు పునాదిని వేశారు."*

కెనేకూ, ఫిజియోక్రాట్లకూ అదనపు విలువ వ్యవసాయంలో మాత్రమే ఎందుకు కనిపించింది? అక్కడ దాని ఉత్పత్తి, కాజేతల క్రమం అతి స్పష్టం కావడమే యిందుకు కారణం. పరిశ్రమల్లో దాన్ని కనుక్కోవడం ఎన్నోరెట్లు కష్టం. సంగతి ఏమిటంటే,

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, p. 45.

ఒకానొక నిర్దిష్ట కాలంలో ఒక కార్మికుడు, తన జీవితావసరాల ఖరీదుకన్న ఎక్కువ విలువను సృష్టిస్తాడు. అయితే కార్మికుడు, తాను వినియోగించే సరుకులకు పూర్తి భిన్నమైన సరుకులను ఉత్పత్తిచేస్తాడు. తన జీవితకాలమంతా అతను నట్లనూ, స్క్రూలనే తయారుచెయ్యవచ్చు, కాని అతను రొట్టెనూ, అడపాదడపా మాంసాన్నీ తింటాడు, బహుశా వైనో, బీరో తాగవచ్చు కూడా. ఈ సందర్భంలో అదనపు విలువను కనుక్కోవాలంటే, నట్లనూ స్క్రూలనూ, రొట్టెనీ వైనునూ ఏదో ఒక రకమైన ఉమ్మడి కొలమానానికి కుదించవలసివుంటుంది, అంటే, సరుకుల విలువకు సంబంధించిన భావనను కలిగియుండాల్సి వుంటుంది. మరి కెనేకి యీ భావన లేదు. అది ఆయనకు ఆసక్తిని కలిగించలేదంతే.

వ్యవసాయంలో అదనపు విలువ, చెల్లింపబడని మానవ శ్రమ ఫలితంగా కాక, ప్రకృతి బహూకరణగా కనిపిస్తుంది. అదనపు ఉత్పాదితపు సహజ రూపంలో, ప్రత్యేకించి ధాన్యంలో, అది ప్రత్యక్షంగా కనిపిస్తుంది. కెనే తన నమూనా నిర్మాణంలో పేద పాలి రైతును కాక, దుక్కి పశువులనూ, అతి సరళమైన వ్యవసాయ పరికరాలనూ కలిగివుండి, కూలీలను కూడా పెట్టుకునే, తనకు ప్రేమ పాత్రుడైన కౌలురైతును ఉపయోగించుకున్నాడు.

ఈ మాదిరి వ్యవసాయదారుని ఆర్థిక వ్యవస్థపై చేసిన ఆలోచనలు కెనే పెట్టుబడిని ఒక రకమైన విశ్లేషణ చేసేందుకు — యీ మాట ఆయన రచనలో లేకపోయినా — దారితీశాయి. ఉదాహరణకు, భూమి, మురుగునీటి పారుదల, కట్టడాలు, గుర్రాలు, నాగళ్లు, గుంటకలు — యివి ఒక రకమైన మదుపు, విత్తనాలపైనా, కూలీల పోషణపైనా పెట్టేది మరో రకమైన మదుపు. మొదటి ఖర్చు ప్రతి కొన్ని సంవత్సరాలకూ ఒక సారి పెట్టేది, కాగా రెండోది ఏటా లేక ఎల్లప్పుడూ పెట్టేది; ప్రతి పంటలోనుంచీ దీన్ని పూడుస్తూవుండాల్సి వుంటుంది. దీనికి అనుగుణం గానే avances primitives (దీన్నే మనం స్థిర పెట్టుబడి అంటాం) గురించీ, avances annuelles (నిర్వహణ పెట్టుబడి) గురించీ కెనే చెప్తాడు. ఈ భావాలను ఆడమ్ స్మిత్ అభివృద్ధిచేశాడు. ఈనాడు యివి అర్థశాస్త్ర ప్రాథమికాంశాలు. కాని ఆ రోజుల్లో యీ విశ్లేషణ ఓ ఘన విజయం. తన "అదనపు విలువ సిద్ధాంతాలు"లో, ఫిజియోక్రాట్లను గూర్చిన తన అధ్యయనాన్ని మార్క్స్ యిలా మొదలుపెడతాడు: "బూర్జువా పరిధిలో, పెట్టుబడి విశ్లేషణ అన్నది, ప్రధానంగా ఫిజియోక్రాట్ల కృషి. వారిని ఆధునిక అర్థశాస్త్ర నిజ జనకులను చేసినది వారి యీ సేవయే."*

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, p. 44.

ఈ భావనలను ప్రవేశపెట్టడం ద్వారా కెనే పెట్టుబడీ చలామణీ, పునరుత్ప త్తుల విశ్లేషణకు, అంటే, ఉత్పత్తి అమ్మకాల క్రమాల అవిరామ నవీకరణ, పునరా వృతుల విశ్లేషణకు — అర్థికవ్యవస్థను హేతుబద్ధంగా నిర్వహించడంలో దీని ప్రాముఖ్యం విశేషంగా వుంది — పునాదులు వేశాడు. మార్క్సిస్టు అర్థశాస్త్రంలో ఎంతో ముఖ్య మైన పాత్రను వహించే పునరుత్పత్తి అన్న పదాన్ని మొట్టమొదట ప్రయోగించినది కెనేయే.

తన కాలంనాటి సమాజపు వర్గ నిర్మాణాన్ని కెనే యీ విధంగా వర్ణించాడు: "జాతి మూడు వర్గాల పౌరులుగా విభజింపబడింది: ఉత్పాదక వర్గం, ఆస్తిస్వాముల వర్గం, అనుత్పాదక వర్గం."*

పైపైకి విచిత్రమైన విభజన అనిపించక మానదు. అయితే అది కెనే బోధన సూత్రాలనుంచి తర్కబద్ధంగా ఉత్పన్నమైన విభజన. అది దాని గుణదోషాలు రెండింటినీ ప్రతిబింబిస్తోంది. ఉత్పాదక వర్గం అన్నది వ్యవసాయదారులు అనడం స్పష్టం. వీళ్లు తమ పెట్టుబడి ఖర్చును తిరిగి పూడ్చి, తమను తాము పోషించు కోవడమే కాకుండా, నికర ఉత్పాదితాన్ని కూడా సృష్టిస్తారు. ఆస్తిస్వాముల వర్గం — భూస్వాములు, రాజాస్థానికులు, చర్చి, వాళ్ల సేవకులందరూ కూడా — నికర ఉత్పాది తాన్ని పొందుతారు. చివరిదైన అనుత్పాదక వర్గంలోకి మిగిలిన అందరూ వస్తారు. కెనేనే ఉదహరించాలంటే, వాళ్లు "యితర వృత్తులలో నిమగ్నులై వున్నవాళ్లు, వ్యవసాయేతర కృషుల్లో నిమగ్నులై వున్నవాళ్లు."

ఈ అనుత్పాదకత అంటే కెనే దృష్టిలో ఏమిటి? భూస్వాములనుండి వేరే అర్థంలో చేతివృత్తులవారిని, కార్మికులను, వర్తకులనూ అనుత్పాదకులుగా ఆయన పరిగణించాడు. వీళ్లు శ్రమిస్తారు నిజమే, కాని వీళ్ల శ్రమ భూమితో సంబంధితమైనది కాదు కనుక తమ శ్రమ ద్వారా వీళ్లు తాము వినియోగించేటంతటి ఉత్పాదితాన్ని తయారుచేస్తారు, అంటే వ్యవసాయంలో తయారయ్యే ఉత్పాదితపు సహజరూపాన్ని రూపాంతరీకరిస్తారు, కేవలం అంతమాత్రమే. వీళ్లు ఏదో విధంగా తదితర రెండు వర్గాలవారిచేతా పనిలో నియోగింపబడుతారని కెనే భావించాడు. ఆస్తిస్వాములు పనిచెయ్యరు, కాని వాళ్లు భూఖామందులు, సమాజ సంపదను పెంపొందించగల ఏకైక ఉత్పత్తి అంశంగా కెనే వీళ్లను పరిగణించాడు. నికరోత్పాదితాన్ని కాజెయ్యడమే వాళ్ల సామాజిక కృషి.

ఈ పథకంలో బోలెడు లోపాలున్నాయి. పరిశ్రమల్లోని, వ్యవసాయంలోని కార్మి కులనూ, పెట్టుబడిదారులనూ యిద్దర్నీ కెనే ఒకే వర్గంలో చేర్చాడని చెప్తే చాలు.

---

* *François Quesnay et la Physiocratie*, Paris, 1958, t. II, p. 793.

ఈ అవకతవక పొరపాటును ట్యూర్గో కొంతమేరకు సరిదిద్దగా, స్మిత్ దాన్ని పూర్తిగా ఖండించాడు.

లేకపోతే, మరీ విశేష ప్రాముఖ్యం గల మరో వివరాన్ని తీసుకోండి. ఒక పెట్టుబడిదారు కేవలం ఒక రకమైన వేతనాన్నే తీసుకుంటే, పెట్టుబడిని ఎలా, దేన్నుంచి అతను సంచయనం చెయ్యగలుగుతాడు? కెనే యీ సమస్యను యీ కింది విధంగా అధిగమిస్తాడు. సహజమైన, ఆర్థికంగా "సక్రమమైన" సంచయనం నికర ఉత్పాదితం నుంచి, అంటే, భూస్వామి ఆదాయంనుంచి వచ్చినది మాత్రమేనని ఆయన అంటాడు. కార్ఖానా ఉత్పత్తిదారూ, వ్యాపారస్తుడూ పూర్తిగా "సక్రమం" కాని పద్ధతిలో మాత్రమే, తమ "వేతనం"నుంచి కొంతభాగాన్ని గుంజుకోవడంద్వారా మాత్రమే సంచయనం చెయ్యగలరు. పెట్టుబడిదారుల మితవ్యయం ద్వారా సంచయనం అనే లోప భూయిష్ఠమైన సిద్ధాంతం పుట్టడానికి యిదే మూలం. మొత్తంమీద కెనే, సమాజంలో ప్రథమంగానూ, ప్రధానంగానూ వర్గసహకారాన్ని చూశాడు. షుంపేటెర్ ఆయన్ని "వర్గ ప్రయోజనాల సార్వత్రిక సామరస్యాన్ని వక్కాణించి చెప్పినవాడు, ఆ కారణంగానే 19వ శతాబ్దపు సామరస్య సిద్ధాంతానికి (సేయ్, కేరీ, బస్తియా) ఆద్యుడు"* అని వర్ణించాడంటే, అది యాదృచ్ఛిక విషయం కాదు.

అయితే కెనే బోధన దీనికే కుదించబడజాలదనడం స్పష్టం. దాన్నుంచి ఆచరణాత్మకమైన ఏ నిర్ధారణలు ఉత్పన్నమవుతాయో మనం పరిశీలిద్దాం. సహజంగానే ఆయన తొలి సిఫారసు ఏమిటంటే, పెద్ద క్షేత్రాల రూపంలో వ్యవసాయం పెంపొందించబడాలన్నది. అయితే, ఆ వెంటనే ఆయన చేసిన మరో రెండు సూచనలు ఆ రోజుల్లో అంత అమాయకమైనవిగా కనిపించలేదు. నికరోత్పాదితం మాత్రమే, నిజమైన ఏకైక ఆర్థిక "మిగులు"గా, పన్ను విధింపదగినదిగా కెనే నమ్మాడు. మిగిలిన పన్నులన్నీ ఆర్థిక వ్యవస్థపైన భారాలు. ఆచరణలో దీని అర్థమేమిటి? సమాజంలో ఏ భూస్వాములకైతే అంతటి ముఖ్యమూ, గౌరవప్రదమూ అయిన విధులను కెనే కేటాయిస్తున్నాడో, ఆ భూస్వాములే పన్నులన్నీ చెల్లించాలన్న మాట. ఆనాటి ఫ్రాన్సులో పరిస్థితి యిందుకు పూర్తి తలకిందులుగా వుంది, వాళ్ళు ఎటువంటి పన్నులూ చెల్లించేవారు కారు. అంతేకాకుండా, పరిశ్రమలూ, వర్తకమూ వ్యవసాయంచేతనే "పోషింపబడుతున్నాయి" కనుక, అది సాధ్యమైనంత చౌకగా నిర్వహింపబడాలి అన్నాడు కెనే. దీని అర్థమేమిటంటే, ఉత్పత్తి, వర్తకాలపై నిర్బంధాలన్నీ తొలగింపబడాలి, లేకపోతే కనీసం

---

* J. A. Schumpeter, *History of Economic Analysis*, p. 234.

నిర్బంధాలూ, అదుపులూ సడలింపబడాలి. ఫిజియోక్రాట్లు స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థించ పూనుకున్నారు.

కెనే బోధనలోని, అలాగే ఫిజియోక్రాట్ల బృందపు బోధనలోని ప్రధానాంశాలు యివి. దీనిలో ఎన్ని లోపాలూ, బలహీనతలూ ఉన్నప్పటికీ, యిది ప్రపంచానికి సంబంధించిన ఒక సమన్విత ఆర్థిక, సామాజిక దృక్పథం, సిద్ధాంతాచరణల్లో ఆనాటికి ప్రగతిశీలమైన దృక్పథం.

కెనే భావాలు పలు చిన్న పుస్తకాల్లోనూ, ఆయన శిష్యుల, అనుయాయుల రచనల్లోనూ చెదిరివున్నాయి. ఆయన సొంత రచనలే 1756–1768 మధ్య, వివిధ రూపాల్లో, తరచు కర్త పేరు లేకుండా, ప్రచురింపబడ్డాయి. 20వ శతాబ్దంలో కనుగొనబడి, ప్రచురింపబడే దాకా, కొన్ని రచనలు రాతప్రతులు గానే ఉండిపోయాయి. కెనే రచనలు అంత మరీ పెద్దదికాని ఒకేఒక సంపుటంలోనే ఉన్నప్పటికీ, ఆయన ప్రధాన భావాలు అనేక అర్థభేదాలు వచ్చేలా, గ్రహించడానికి కష్టసాధ్యమైన మార్పులతో పునరుల్లేఖింపబడిన, పునర్ముద్రింపబడిన కారణంగా, ఆధునిక పాఠకులు కెనే రచనలను అర్థం చేసుకోవడం సులభసాధ్యం కాదు. 1768లో కెనే శిష్యుడైన ద్యుపాన్ డి నెమూర్ "ఒక నూతన విజ్ఞానశాస్త్రపు ఆవిర్భావం, ప్రగతి" అనే శీర్షికతో ఒక పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకంలో ఫిజియోక్రటిక్ సంప్రదాయ అభివృద్ధి సంగ్రహంగా వివరింపబడింది. ఆ శీర్షికను ఆయన, మనం యీనాడు అర్థంచేసుకునే పద్ధతిలో వ్యాఖ్యానింపబడాలని ఉద్దేశించి వుండకపోవచ్చును కాని, ఆయన కీలకాంశాన్ని గ్రహించినట్లు చరిత్ర రుజావుచేసింది. కెనే రచనలు నిజంగానే ఒక నూతన విజ్ఞానశాస్త్రాన్ని — తన సాంప్రదాయిక ఫ్రెంచి రూపంలో అర్థశాస్త్రాన్ని సృష్టించాయి.

ఫిజియోక్రాట్లు

ఫిజియోక్రటిక్ సిద్ధాంతపు బూర్జువా సారాంశం ఫ్యూడల్ దుస్తుల్లో చుట్టబెట్టబడింది, యిది ఆ సిద్ధాంత లక్షణాల్లో ఒకటి. కెనే నికరోత్పాదితాన్ని మాత్రమే పన్నులు విధింపదగినదిగా చెయ్యాలనుకున్న మాట నిజమే అయినా, ఆనాటి పాలకుల సంస్కారవంతమైన ప్రయోజనాన్నే ఆయన ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నాడు, భూమి ఆదాయంలో పెంపుదల వుంటుందనీ, భూస్వామ్య ప్రభువర్గం మరింత బలపడుతుందనీ వారికి హామీ యిచ్చాడు.

ఈ "పన్నాగం" చాలవరకు పనిచేసింది. ఇందుకు ఆనాటి పాలకుల గుడ్డితనం ఒక్కటే కాదు కారణం. భూస్వామ్య ప్రభువర్గం నిజానికి బూర్జువా సంస్కరణల

ద్వారా మాత్రమే కాపాడబడగలగడమే యిందుకు కారణం; వేరే పరిస్థితుల్లో అన్నమాట నిజమే అయినప్పటికీ, యిది ఇంగ్లండులో అంతకుముందే జరిగింది. అయితే, వృద్ధ డాక్టరు కెనే చిట్కాలో యీ చేదుమందుకి బాగా తీపిపూత పెట్టబడి, ఆకర్షణీయమైన తొడుగులో మరుగుపరచబడింది.

తొలి సంవత్సరాల్లో ఫిజియోక్రటిక్ బృందం అత్యంత విజయవంతంగా తన కార్యకలాపాలు సాగించుకుంది. దానికి డ్యూకుల, మార్క్విస్‌ల పోషణ లభించింది. విదేశీ రాజులు దానిలో ఆసక్తి ప్రదర్శించారు. అదే సమయంలో డిడ్రోతోబాటు, వైతాళికులు దాన్ని అధికంగా మన్నించారు. ఫిజియోక్రాట్లు ఆదిలో, ప్రభువర్గంలోని మిక్కిలి ఆలోచనాపరుల తోడ్పాటునూ, ప్రవర్ధమాన బూర్జువావర్గపు తోడ్పాటునూ సంపాదించుకోగలిగారు. 1760 దశకారంభంనుంచీ, వెర్సేల్సులోని "అటక వాటా క్లబ్బు"కుతోడు — దానిలోకి ఎంపికచేయబడిన కొద్దిమందికి మాత్రమే ప్రవేశం వుండేది — పారిస్‌లో మార్క్విస్ మిరాబో యింట్లో ఒక రకమైన పబ్లిక్ ఫిజియోక్రటిక్ కేంద్రం ఒకటి ఆరంభమైంది. అక్కడ కెనే శిష్యులు (ఆయన స్వయంగా దానికి సకృత్తుగా మాత్రమే హాజరయేవాడు) తమ గురువు భావాలను ప్రచారం చెయ్యడంలోనూ, జనరంజకం చెయ్యడంలోనూ నిమగ్నులై, కొత్త సమర్థకులను తమ బృందంలోకి రిక్రూట్ చేసుకుంటూండేవారు. ఫిజియోక్రటిక్ బృందపు కేంద్రకంలో యువ డ్యుపాన్ డి నెమూర్,* లెమెర్స్యే డి లా రివ్యేర్, కెనేకు సన్నిహిత పరిచితులైన పలువురు యితరులూ వుండేవారు. ఈ కేంద్రకం చుట్టూ, కెనేతో తక్కువ పరిచయం కలిగిన బృందసభ్యుల గ్రూపులు, వివిధ సానుభూతిపరులూ, సహయాత్రికులూ వున్నారు. పాక్షికంగా ఫిజియోక్రాట్లకు చెందినప్పటికీ, గురువు బాకాగా ఉండజాలనంతటి గొప్ప, స్వతంత్ర భావుకుడైన ట్యూర్గోకి ఆ బృందంలో ఒక విశిష్ట స్థానం వుండేది. "వెర్సేల్స్ అటక వాటా" యజమాని రూపొందించిన కుంచిత సిద్ధాంత చట్రంలో, ట్యూర్గో యిరుక్కోలేకపోయాడన్న విషయం, ఫిజియోక్రాట్ బృందాన్నీ, దాని నాయకుడినీ మనం భిన్న దృష్టితో చూసేలా చేసితీరుతుంది.

సహజంగానే, కెనే శిష్యుల మధ్యగల ఐక్యతా సంఘీభావాలూ, తమ గురువుపట్ల తిరుగులేని ఆరాధనా గౌరవభావాన్ని కలిగించక మానవు. కానైతే సరిగా యిదే, దరిమిలా ఆ బృందపు బలహీనతగా పరిణమించింది. ఆ బృందపు కార్యకలాపాలన్నీ కెనే

---

* విప్లవానంతరం డ్యుపాన్ అమెరికాకు ప్రవాసం వెళ్లాడు. అక్కడ ఆయన కొడుకు కుటుంబ వ్యాపార సంస్థను స్థాపించాడు. అదే దరిమిలా, బ్రహ్మాండమైన రసాయనిక గుత్త సంస్థ డ్యుపాన్ డి నెమ్యూర్ అండ్ కంపెనీగా పెంపొందింది.

అభిప్రాయాల, చివరకు ఆయన వాక్యాల వివరణకీ, వల్లింపుకీ పరిమితమయ్యాయి. కచ్చితమైన పిడిసూత్రం రూపంలో ఆయన భావాలు అంతకంతకు నిస్సారం చెయ్య బడ్డాయి. మంగళవారం సాయంత్రంపూటల్లో మిరాబో యింటిదగ్గర జరిగే సమావేశాల్లో కొత్త భావాలూ, చర్చా అంతకంతకు కర్మకాండ అనుసరణగా దిగజారాయి. ఫిజియోక్రసీ ఒక మాదిరి మతంగా — దీనికి మిరాబో యిల్లు మంగళవారం ప్రార్థన సమావేశాలు జరిగే ఆరాధనా స్థలంగా — తయారైంది.

ఏక మనస్కుల ఒక గ్రూపు అన్న అర్థంలోని ఆ కూటం, చెడు అర్థంలో కూటంగా, వెసులుబాటు లేని పిడిసూత్రంలో మూఢంగా విశ్వసిస్తూ, భిన్నాభిప్రాయాలు కలవారిని తిరస్కరించే ఒక ముఠా అంటూమే అలా తయారైంది.

ఫిజియోక్రాట్ల ప్రచురణల సంపాదకత్వానికి బాధ్యుడైన ద్యుపాన్, తన చేతికి వచ్చిన ప్రతి రచనూ "కత్తిరించి," దానికి ఫిజియోక్రటిక్ మొగ్గను కల్పించేవాడు. తమాషా ఏమిటంటే, స్వయంగా కెనే ఎన్నడూ పరిగణించుకోనిదాని కన్న, ద్యుపాన్ తనను తాను ఎక్కువ ఫిజియోక్రాట్‌గా పరిగణించుకొని, కెనే తొలి రచనలను ప్రచురించ నిరాకరించడం. (ద్యుపాన్ దృష్టిలో, కెనే, ఆ రచనలు చేసేనాటికి యింకా సరైన ఫిజియోక్రాట్ కాడు.)

కెనే స్వభావంలోని కొన్ని ధోరణులు యీ పరిస్థితులకు తోడ్పడ్డాయి. తన "అర్థశాస్త్ర చరిత్ర"లో డి. ఐ. రోజెన్‌బెర్గ్ యిలా అంటాడు: "అర్థశాస్త్ర జనకుడు అన్న గౌరవంలో విలియం పెట్టీతో పాలుపంచుకున్న కెనే, పెట్టీ మాదిరిగా కాకుండా, సూత్రాలకు అచంచలంగా కట్టుబడిన వ్యక్తి, అయితే పిడివాదంపట్లా, సిద్ధాంత జడత్వంపట్లా బాగా మొగ్గుచూపే లక్షణం కలిగినవాడు."* ఏళ్లు గడిచే కొద్దీ ఆయనలో యీ ధోరణి ముదిరింది. కూటంవాళ్ల కారణంగానే అనడం స్పష్టం. ఈ నూతన విజ్ఞానశాస్త్ర సత్యాలు "స్వయం విదితం" అన్న నమ్మకంతో, యితర అభిప్రాయాలపట్ల కెనేలో అసహిష్ణుత కలిగింది, పోతే కూటంవాళ్లు యీ అసహిష్ణుతకు బాగా దోహదంచేశారు. స్థల, కాలాలతో సంబంధం లేకుండా తన బోధన సర్వే సర్వత్రా వర్తిస్తుందని కెనే విశ్వసించాడు.

ఆయన నమ్ర స్వభావం ఎంత మాత్రం తగ్గలేదు. ఆయన కీర్తికోసం ఎగబడ లేదు, అదే ఆయన్ని వెతుక్కుంటూ ఆయన దగ్గరకి వచ్చింది. ఆయన తన శిష్యులను కించపరచలేదు, కాని వాళ్లే తమను తాము కించపరుచుకున్నారు. చివరి కొద్ది

---

* డి. ఐ. రోజెన్‌బెర్గ్ "అర్థశాస్త్ర చరిత్ర," సంపుటి I, మాస్కో, 1940, పేజి 88 (రష్యన్ భాషలో).

సంవత్సరాల్లో కెనేలో సహింప సాధ్యంకానంత పట్టుదల పెరిగింది. 76 ఏళ్ల వయస్సులో ఆయన గణితశాస్త్రాన్ని చేబట్టి, రేఖా గణిత శాస్త్రంలో తను మౌలికమైన కొన్ని గొప్ప ఆవిష్కరణలు చేశానని భ్రమపడ్డాడు. డి అలంబేర్ యీ ఆవిష్కరణలు వట్టి చెత్త అని ఒప్పుకున్నాడు. తన యీ భావాలను ప్రతిపాదించిన రచనను ప్రచురించి, తనను తాను హాస్యపాత్రుడిని చేసుకోవద్దని ఆ వృద్ధుడికి నచ్చచెప్పాలని ఆయన మిత్రులు ఏకగ్రీవంగా ప్రయత్నించారు. అయితే ఆ ప్రయత్నం నిష్ఫలమే అయింది.

ఆ రచన 1773లో ప్రచురింపబడినప్పుడు, ట్యూర్గో చాలా క్షోభపడ్డాడు: "ఆభాసుల్లో కెల్ల ఆభాసు యిది, సూర్యుడు తన కాంతి తగ్గాడు." సూర్యుడిమీద సైతం మచ్చలున్నాయన్న రష్యన్ సామెతతోనే దీనికెవరైనా జవాబు చెప్పగలరు.

కెనే వెర్సేల్స్‌లో 1774 డిసెంబరులో మరణించాడు. ఆయన స్థానాన్ని ఆక్రమించగల మరొకడెవరూ ఫిజియోక్రాట్లకు దొరకలేదు. దీనికితోడు, వాళ్లు అప్పటికే బాగా పతనావస్థలో వున్నారు. 1774-76 మధ్య కాలంలో ట్యూర్గో పదవిలో వుండటం వాళ్ల ఆశలనూ, కార్యకలాపాలనూ పునర్జాగృతం చేసింది. కాని, ఆయన పదవీ విరమణ వాళ్లకొక తీవ్రాఘాతం అయింది. వాస్తవానికి, యిదే ఫిజియోక్రాట్ల అంతం. పైగా 1776, ఆడమ్ స్మిత్ "జాతుల సంపద" ప్రచురింపబడిన సంవత్సరం. తదుపరి తరానికి చెందిన ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తలు – సిస్మొండీ, సేయ్ ప్రభృతులు – ఫిజియోక్రాట్ల దిశగా కాకుండా, స్మిత్ వేపు తిరిగారు. 1815లో, అప్పటికి బాగా వృద్ధుడైన డ్యుపాన్, సేయ్‌కి ఒక లేఖ రాస్తూ, కెనే పాలు తాగి పెరిగి, "తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు" ప్రవర్తిస్తున్నందుకు, ఆయన్ని నిందించాడు. కెనే పాలు తాగాక తను, చాలా రొట్టె, మాంసం భోంచేశానని – అంటే, స్మిత్‌నూ, యితర అర్థశాస్త్రవేత్తలనూ అధ్యయనంచేశానని – సేయ్ ఆయనకి జవాబిచ్చాడు.

1770 దశకంలో ఫిజియోక్రాట్ల పతనానికి వాళ్ల లోపాలు ఒక్కటే కారణం కాదు. వాళ్లు తీవ్రంగానే కాకుండా వివిధ పార్శ్వాలనుంచి విమర్శింపబడ్డారు. రాజాస్థానపు పోషకత్వాన్ని కోల్పోవడంతో, అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ శక్తుల దాడులకు వాళ్లు గురయ్యారు. అదే సమయంలో, వికాసయుగ వామపక్ష రచయితలు కూడా వాళ్లను విమర్శించారు.

డాక్టర్ కెనే పట్టిక

మర్మోంటేల్ స్మృతులను చదువుతూంటే – కెనే వ్యక్తిత్వాన్ని గూర్చిన అనేక ఆసక్తికర వివరాలను ఆయన అందులో యిచ్చాడు – 1757లోనే ఆ డాక్టరు తన

"నికరోత్పాదితపు గ్రాఫ్" రచనలో నిమగ్నుడై యున్నట్లు బోధపడుతుంది. స్వయంగా కెనే రచనల్లోనూ, ఆయన శిష్యుల రచనల్లోనూ పదేపదే ప్రచురింపబడి, వ్యాఖ్యానింప బడిన "ఆర్థిక పట్టిక" యిదే. అయితే, అన్ని పాఠాంతరాల్లోనూ "పట్టిక" మటుకు ఒక్కటే: వ్యవసాయంలో సృష్టింపబడిన దేశపు మొత్తం ఉత్పాదితమూ, నికరోత్పాదితమూ తన సహజరూపంలోనూ, డబ్బు రూపంలోనూ, సమాజాన్ని కెనే ఏ మూడు వర్గాల్లో కైతే విభజించాడో ఆ వర్గాల మధ్య ఎలా చలామణీ అవుతాయో గణాంక లెక్కల ఉదాహరణలతోనూ, గ్రాపుల సహాయంతోనూ అది చూపుతుంది.

ఏమైనప్పటికీ, ఈ "ఆర్థిక పట్టిక" విషయంలో సాధారణాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు వి. ఎస్. నెమ్చినొవ్ పుస్తకంనుంచి ఒక ఉల్లేఖనను పరిశీలిద్దాం. "ఆర్థిక-గణితశాస్త్ర పద్ధతులూ, నమూనాలూ" అన్న తన పుస్తకంలో (యీ గ్రంథానికి లెనిన్ ప్రైజు బహూకరింపబడింది) ఆయన యిలా రాస్తాడు: "ఆర్థిక విజ్ఞాన శాస్త్రాభివృద్ధి ఉషోదయ కాలమైన 18వ శతాబ్దంలో... ఫ్రాన్సువా కెనే... మానవ మేధాగమనంలో ఉజ్వలమైన ఒక మెరుపు అనదగిన తన 'ఆర్థిక పట్టిక'ను సృష్టించాడు. ఈ పట్టిక ప్రచురింపబడి 1958 నాటికి రెండు శతాబ్దాలు గడిచిపోయినప్పటికీ దానిలోని భావాలు మాసిపోలేదు, సరికదా మరింత ఎక్కువ విలువను సంతరించుకున్నాయి.... కెనే పట్టికను ఆధునిక ఆర్థిక పదజాలంలో వర్ణించాలంటే, స్థూల ఆర్థిక విశ్లేషణకు జరిగిన మొదటి ప్రయత్నాల్లో అది ఒకటి, దీనిలో మొత్తం సామాజిక ఉత్పాదితం అనే భావన కేంద్రస్థానాన్ని అలంకరిస్తుంది.... ఫ్రాన్సువా కెనే 'ఆర్థిక పట్టిక' అర్థశాస్త్ర చరిత్రలో పాదార్థిక విలువల సహజ (సరుకు), డబ్బు ప్రవాహాలయొక్క తొలి స్థూల ఆర్థిక పథకం. భవిష్యదార్థిక నమూనాల భావాలు దానిలో బీజప్రాయంగా యిమిడివున్నాయి. ప్రత్యేకించి, తన ప్రవర్ధిత పునరుత్పత్తి పథకాన్ని తయారుచేసినప్పుడు ఫ్రాన్సువా కెనే ప్రతిభా సంపన్నమైన కృషికి కార్ల్ మార్క్స్ నివాళులు అర్పించాడు...."*

ఈ ఉల్లేఖనల సాధారణ భావం పాఠకుడికి స్పష్టమయే వుంటుంది, కాని వివరాలను బహుశా స్పష్టీకరించడం అవసరం కావచ్చు. స్థూల ఆర్థిక విశ్లేషణ మొత్తం ఆర్థిక విషయాల (సామాజిక ఉత్పాదితం, జాతీయాదాయం, పెట్టుబడి మదుపు), తత్సంబంధిత సమస్యల విశ్లేషణ. ఇందుకు భిన్నంగా, సూక్ష్మ అర్థశాస్త్రం అంటే భావాభివర్గాల, సరుకు, విలువ, ధర, వగైరా సమస్యల విశ్లేషణ, అంతేకాకుండా వ్యక్తి

---

* వి. ఎస్. నెమ్చినొవ్ "ఆర్థిక-గణితశాస్త్ర పద్ధతులూ, నమూనాలూ," మాస్కో, 1965, పేజీలు 175, 177 (రష్యన్ భాషలో).

గత పెట్టుబడి చలామణీ విశ్లేషణ. కెనే స్థూల ఆర్థిక విశ్లేషణ అంటే, కొన్ని ఊహలపైనా, వాద ప్రాతిపదికలపైనా ఆధారపడిన, సామాజికోత్పాదితపు పునరుత్పత్తి, చలామణీల ఊహాత్మక పథకం. పునరుత్పత్తికి సంబంధించిన తన ప్రతిభావంతమైన పథకాలలో మార్క్స్ వినియోగించిన ప్రధానమైన ఆధారపీఠాల్లో అది ఒకటి.

1863 జూలై 6న ఎంగెల్సుకు రాసిన ఒక లేఖలో, యీ రంగంలో తను చేసిన అధ్యయనాన్ని గురించి వర్ణించి, సంఖ్యలతోనూ, గ్రాఫులతోనూ కూడిన ఒక రేఖా చిత్రాన్ని మార్క్స్ యిచ్చాడు: స్థిరపెట్టుబడిని (ముడి పదార్థాలు, యింధనం, యంత్రాలు), అస్థిరపెట్టుబడిని (కార్మికుల వేతనాలు), అదనపు విలువను వ్యయం చెయ్యడంద్వారా మొత్తం ఉత్పాదితం ఎలా వస్తుందో వివరించాడు. ఉత్పాదితం రూపొందడం అన్నది సామాజికోత్పత్తియొక్క రెండు భిన్నమైన ఉపవిభాగాల్లో జరుగుతుంది: యంత్రాలు, ముడిపదార్థాలు మొదలైనవాటి ఉత్పత్తి (మొదటి ఉపవిభాగం), వినిమయ వస్తువుల ఉత్పత్తి (రెండవ ఉపవిభాగం).*

కెనే భావాలచేత మార్క్స్ ఏమేరకు ప్రభావితుడయ్యాడన్న విషయాన్ని, యీ లేఖలో, తన పథకానికి సరిగా కిందనే, ఆయన ''ఆర్థిక పట్టిక''ను, లేక, దాని సారాంశాన్ని యివ్వడాన్నిబట్టి తెలుసుకోవచ్చు. ఈ తొలి రూపంలో సైతం, మార్క్స్ పథకం, కెనే పథకానికి చాలా భిన్నమైనది: అదనపు విలువ వాస్తవ మూలాధారాన్ని – పెట్టుబడిదారులచేత వేతన శ్రామికుల దోపిడీని – అది చూపుతుంది. అయితే, ప్రధానమైన విషయం ఏమిటంటే, కెనే రచనలో అత్యంత ముఖ్యమైన ఒక భావపు అంకురం వుంది: కొన్ని ఆర్థిక అనుపాతాలు పాటింపబడినప్పుడు మాత్రమే పునరుత్పత్తి, సంపాదనల క్రమం అమల్లోకి రాగలదు.

కెనే తన పట్టికలోనూ, మార్క్స్ యీ మొదటి పథకంలోనూ సరళ పునరుత్పత్తినుండి – దీనిలో ఉత్పత్తి అమ్మకాలు సంచయన, విస్తరణలు లేకుండా, ఏటా ఒకే పరిమితుల్లో పునరావృతమవుతాయి – బయల్దేరుతున్నారు. ఇది సరళమైనదాన్నుంచి సంక్లిష్టమైనదానికీ, ప్రత్యేకమైనదాన్నుంచి మరింత సాధారణమైనదానికీ సహజపురోగతి. ఐన్‌స్టైన్ మొట్టమొదట, జడ చలనాలకు అన్వయించే ఒక ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని మాత్రమే ఆవిష్కరించాడు, ఆటుతర్వాత సాధారణ సాపేక్ష సిద్ధాంత వివరణకు పూనుకున్నాడు.

---

* ఈ లేఖ రాసేనాటికి యింకా మార్క్స్, యిందుకు భిన్నంగా, జీవితావసర వస్తువుల ఉత్పత్తిని మొదటి ఉపవిభాగంగా పరిగణిస్తున్నాడు. మార్క్స్ ''ఫిజియోక్రాట్లను అనుసరిస్తున్నాడా అన్నట్లు'' అలా చేశాడని వి. ఎస్. నెమ్చినోవ్ వ్యాఖ్యానించాడు.

మార్క్స్ మరణానంతరం, ఎంగెల్స్ ప్రచురించిన "పెట్టుబడి" రెండవ సంపుటంలో, మార్క్స్ సరళ పునరుత్పత్తి సిద్ధాంతాన్ని అభివృద్ధిచేసి, విస్తరిత పునరుత్పత్తి — అంటే, సంచయనంతో, ఉత్పత్తి పరిమాణంలో పెరుగుదలతో కూడిన పునరుత్పత్తి — సిద్ధాంతానికి పునాదివేశాడు. వి. ఐ. లెనిన్ రచనల్లో కొన్ని అతి ముఖ్యమైనవి కూడా యీ సమస్యలకు అంకితమయ్యాయి.

ఆధునిక అర్థశాస్త్ర భాషను వినియోగించాలంటే, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని సునిశ్చితం చేసే ఆర్థిక అనుపాతాల సమస్యయే, కెనే ఆలోచనలను ఆక్రమించుకున్న ప్రధాన సమస్య. కేవలం యీ సమస్య ప్రస్తావనే చాలు, ప్రస్తుతం దానికిగల విషయ ప్రాధాన్య, ప్రాముఖ్యాలను గుర్తుచేసుకోడానికి. ఈనాడు, సోవియట్ యూనియన్ లోనూ, తదితర దేశాల్లోనూ ఆర్థికవ్యవస్థయొక్క వివిధ శాఖల్లో ఉత్పాదక — ఉత్పత్తుల పట్టికలకు ప్రాతిపదిక కెనే భావాలే అని చెప్పవచ్చు. ఈ పట్టికలు వివిధ శాఖల మధ్య గల పరస్పర సంబంధాలను ప్రతిబింబించి, ఆర్థిక వ్యవస్థా నిర్వహణలో నానాటికీ పెద్ద పాత్ర వహిస్తున్నాయి.

ఇటీవల మార్క్సిస్టేతర అర్థశాస్త్రంలో, కెనేపట్ల ఆసక్తి పెరగడాన్ని మనం చూస్తాం. "ఆర్థిక పట్టిక" ద్విశతజయంతి అత్యంత వైభవంగా జరపబడింది. కెనేని తన జాతీయ ప్రతిభావంతుల్లో ఒకడుగా ఫ్రాన్సు గుర్తించింది.

ప్రకరణం 9
ట్యూర్గో – చింతనాపరుడు, మంత్రి, వ్యక్తి

పదహారవ లూయీ పాలనలో రెండేళ్లపాటు ట్యూర్గో కంట్రోలర్ జనరల్ పదవీ నిర్వహణ విప్లవపూర్వ ఫ్రాన్సు చరిత్రలో నాటకీయమైన ఒక పుట. ఆయన సంస్కరణ కార్యకలాపం విజయవంతం కాలేదు. విప్లవం ద్వారా మాత్రమే "సరిచెయ్య" బడగలదాన్ని ఆయన సంస్కరణల ద్వారా సరిచెయ్య ప్రయత్నించాడు.

ఆయనలో ఒకమాదిరి డాన్ క్విక్సోట్ లక్షణాలున్నాయి. వాస్తవానికి ఆయన పరిస్థితుల ప్రాబల్యంవల్ల అయినంతగా స్వభావసిద్ధంగా డాన్ క్విక్సోట్ కాదు. ఒక్కొక్కమారు అత్యంత హేతుబద్ధమైన భావాలూ, సముచిత కార్యాలూ కూడా నేలవిడిచిన సాములా పరిణమిస్తాయి. అయితే యీ పోలిక మరో విధంగా కూడా సరైనది. ట్యూర్గో వ్యక్తిగతంగా గొప్ప ఆత్మోన్నత్యం కలవాడు, పరిమితుల్లేని ఉన్నత సూత్రాలకు బద్ధుడు, అరుదుగా తటస్థపడే నిస్వార్థపరుడు. పదిహేనవ లూయీ, పదహారవ లూయీల రాజాస్థానాల్లో యీ గుణాలు విడ్డూరమైనవే కాకుండా, అసహజమైనవి కూడా.

చింతనాపరుడు

ట్యూర్గో పారిస్‌లో 1727లో జన్మించాడు. ఆయన ప్రభుత్వానికి సేవజేసిన సుదీర్ఘ సంప్రదాయం కలిగిన ఒక పురాతన నార్మన్ ప్రభుకుటుంబానికి చెందినవాడు. ఆయన తండ్రి పారిస్‌లో యీనాటి ప్రిఫెక్టు లేక మేయర్ ఉద్యోగాన్ని పోలిన ఉద్యోగం చేశాడు. ట్యూర్గో, కుటుంబంలో మూడవ కొడుకు కావడంతో, సంప్రదాయం ప్రకారం చర్చిలో చేరవలసివచ్చింది. తత్పర్యవసానంగా ఆయనకి తన కాలపు అత్యున్నత విద్య లభ్యమైంది. మత విద్యాలయంలో డిస్టింక్షనుతో ప్యాసై, డిగ్రీ కోసం సార్బోన్ విశ్వ విద్యాలయంలో చేరిన 23 ఏళ్ల అబ్బే, సార్బోన్‌కి గౌరవం తెచ్చినవాడూ, కేథలిక్

మతాకాశంలో ఉదయతారా అయిన ట్యూర్గో, మతగురువు పదవీస్వీకారం చేయ రాదని అకస్మాత్తుగా నిర్ణయించుకున్నాడు.

పరిణతి చెందిన చింతనాపరుడు చేసుకున్న నిర్ణయం యిది. ఈ కాలంలో తత్వ శాస్త్రాధ్యయనానికి బోలెడు సమయాన్ని వెచ్చించి, ఇంగ్లీషు చింతనాపరుల రచనలను అధ్యయనం చేసిన ట్యూర్గో బాహ్యప్రపంచం యావత్తూ మానవ చైతన్యోత్పాదితం అని వక్కాణించే వ్యక్తిపర భావవాదానికి వ్యతిరేకంగా పలు తాత్విక రచనలు చేశాడు. ట్యూర్గో సామర్థ్యం ఆయన గురువులనూ, మిత్రులనూ దిగ్భ్రాంతపరచింది. ఆయనకి ఆరు భాషలు బాగా వచ్చు. ఆయన భిన్నమైన పలు విజ్ఞానశాస్త్రాలను అధ్యయనం చేశాడు. ఆయనకి అసాధారణమైన ధారణాశక్తి వుంది. ఇరవై రెండేళ్ల వయస్సులో ట్యూర్గో కాగితపు డబ్బుపై ప్రగాఢమైన ఒక రచన చేశాడు. అందులో లా పద్ధతినీ, దాని లోపాలనూ ఆయన విశ్లేషించాడు. అయితే, ఈ దశలో ఆయన ప్రధానంగా, విస్తృత తాత్విక-చారిత్రక సమస్యల పరిధిలోపలనే అర్థశాస్త్రంపట్ల ఆసక్తిని చూపాడు.

1752లో ట్యూర్గోకి పారిస్ పార్లమెంటులో ఉద్యోగం దొరికింది. తర్వాత సంవత్సరంలో తనకు వారసత్వంగా లభించిన కొద్దిపాటి ఆస్తిని న్యాయస్థానంలో రిపోర్టర్ పదవిని కొనుక్కునేందుకు వినియోగించాడు. ఈ పదవి, ఆయన వివిధ అంశాలను గాఢంగా అధ్యయనం చెయ్యడానికీ, పారిస్ నగర మేధా జీవితం ప్రతిబింబితమయ్యే కేంద్రాలకు వెళ్లడానికీ ఆయనకి ఆటంకం కాలేదు. త్వరలోనే యువ ట్యూర్గో యిటు ఉన్నత సమాజ, అటు తాత్విక సమావేశ కేంద్రాలలో అత్యుత్తమ ఆభరణాలనదగినవారిలో ఒకడయ్యాడు. ఆయన డిడ్రో, డి అలంబేర్‌లకూ, "విజ్ఞాన సర్వస్వం"లో పనిచేసే వారి అనుయాయులకూ సన్నిహిత పరిచితుడయాడు. "విజ్ఞాన సర్వస్వం"కోసం ట్యూర్గో పలు తాత్విక, ఆర్థిక వ్యాసాలను రచించాడు.

ట్యూర్గో జీవితంలో ప్రముఖ ప్రగతిశీల పరిపాలకుడైన విన్సెంట్ గుర్నేకి అతి ముఖ్యమైన పాత్ర వుంది. అర్థశాస్త్ర రంగంలో గుర్నే, ట్యూర్గో భావాలను తీర్చి దిద్దాడు. ఫిజియోక్రాట్ల మాదిరిగా కాకుండా గుర్నే, పరిశ్రమ, వర్తకాలను దేశ సౌభాగ్యపు అతిముఖ్య మూలాధారాలుగా పరిగణించాడు. అయితే, వాళ్లతోబాటు ఆయన కూడా, వర్తకంపై గిల్డు నిర్బంధాలను ఖండించి, స్వేచ్ఛాయుతమైన పోటీని సమర్థించాడు. ఇంతకుముందే పేర్కొన్నట్లు laissez faire, laissez passer* అన్న ప్రసిద్ధ సూత్రం, ఒక్కొక్కమారు ఆయనకి ఆపాదింపబడుతూ వుంటుంది. అప్పట్లో వాణిజ్య ఇంటెండెంటు (నిర్వాహక) పదవిలో వున్న గుర్నేతోబాటు, వర్తకాన్నీ,

---

* దీనికి వివరణ 107వ పేజిలో చూడండి.

పరిశ్రమలనూ పరిశీలించేందుకుగాను ట్యూర్గో కూడా రాష్ట్రాల్లో పర్యటించాడు. పారిస్‌కి తిరిగివచ్చాక, కెనే "ఆటక వాటా క్లబ్బు"కి గుర్నే వెళ్ళినప్పుడు, ఆయనతోబాటు ట్యూర్గో కూడా అక్కడికి వెళ్తూండేవాడు. అయితే అప్పటికే ఫిజియోక్రాట్ల కూటపు అతిశాయితలకు ఆయన అతీతుడయ్యాడు. కెనే ప్రధాన భావాల్లో కొన్నింటితో ట్యూర్గో ఏకీభవించినప్పటికీ, కెనేపట్ల వ్యక్తిగతంగా ఆయనకు గొప్ప గౌరవభావం ఉన్నప్పటికీ, అర్థశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాల్లో ఆయన తన మార్గంలో తను పోయే వాడు. గుర్నే 1759లో మరణించాడు. ఆయన మరణించిన వెంటనే తను రచించిన "గుర్నే ప్రశంస"లో కీర్తిశేషుడైన తన మిత్రుని అభిప్రాయాలను వర్ణించడమే కాకుండా, మొట్టమొదటి సారిగా తన సొంత ఆర్థిక అభిప్రాయాలను క్రమబద్ధంగా ట్యూర్గో వివరించాడు.

1761లో లిమోజ్ రాష్ట్రపు ఇంటెండెంటుగా నియమింపబడటంతో విజ్ఞాన శాస్త్రీయ, సాహిత్య రంగాల్లో ట్యూర్గో కృషికి అంతరాయం కలిగింది. మధ్య మధ్యలో పారిస్ వస్తూ, ఆయన అక్కడ పదమూడేళ్ళు గడిపాడు. కేంద్రాధికారపు ప్రధాన ప్రతినిధి అయిన ఆ ఇంటెండెంటుదే లిమోజ్ రాష్ట్రమంతటి ఆర్థిక సమస్యల పరిష్కార బాధ్యత. అయితే ఆయన ప్రధాన బాధ్యత రాజుకోసం పన్నులు వసూలుచెయ్యడం.

నిష్ఠుర వాస్తవాన్ని ఎదుర్కోవలసివచ్చిన ట్యూర్గో యిలా రాశాడు: "లిమోజ్‌లో చదువనూ, రాయనూ వచ్చిన రైతులు దాదాపు లేరనే చెప్పవచ్చు. తెలివితేటలు, రుజువర్తనల విషయంలో ఆధారపడదగినవారు బహు కొద్దిమంది. వాళ్ళలాంటి మొండిజాతి వాళ్ళంటే, తమ మేలుకోసం ఉద్దేశింపబడిన మార్పులను సైతం వాళ్ళు వ్యతిరేకిస్తారు."*

అయినా ట్యూర్గో ధైర్యం కోల్పోలేదు. శక్తివంతుడూ, ఆత్మవిశ్వాసం కలవాడూ, అధికార ప్రదర్శక స్వభావం కలిగినవాడూ అయిన ట్యూర్గో, ఎన్ని కష్టాలు ఎదురైన ప్పటికీ, తన రాష్ట్రంలో, కొన్ని సంస్కరణలను అమలుజరప నారంభించాడు. పన్నుల వసూలు పద్ధతిని సరళం చేసేందుకు ప్రయత్నించాడు. రోడ్లను సరైన స్థితిలో వుంచేందుకుగాను రైతుల నిర్బంధశ్రమ — రోసిపోయిన వెట్టి చాకిరీ — స్థానంలో స్వేచ్ఛా యుతంగా వేతనానికి కుదుర్చుకున్న కూలీలతో మంచి రోడ్లను నిర్మించాడు. పశువుల అంటుజాడ్యాలనూ, పంటల తెగుళ్లనూ ఎదుర్కొనే విషయంలో ఆయన ప్రచారోద్య మాన్ని నిర్వహించాడు. తనకూ, తన అతిథులకూ తన వంట మనిషిచేత ప్రతి రోజూ

* D. Dakin రాసిన *Turgot and the Ancien Régime in France*, New York, 1965, p. 37నుండి ఉల్లేఖన.

బంగాళాదుంపల వంటకాలు తయారుచేయించి, ఆదర్శాన్ని నెలకొల్పడంద్వారా ఆయన బంగాళాదుంపల వంటను ప్రవేశపెట్టాడు.

నాసిపంటలు, ఆహార లోపం మూలంగా ఏర్పడిన పరిస్థితులను ఆయన ఎదుర్కో వలసివచ్చింది. ఈ ముప్పులను ధైర్యంగానూ, లోకజ్ఞానంతోనూ ఎదుర్కొనే క్రమంలో, ప్రతిదాన్నీ వ్యక్తిగత చొరవకూ, స్వేచ్ఛాయుతమైన పోటీకీ, ఘటనల సహజ క్రమానికీ వదిలెయ్యాలన్న తన సైద్ధాంతిక సూత్రాలనుండి కొంత పక్కకు వైదొలగవలసిన పరిస్థితిలో పడుతూండేవాడు. ట్యూర్గో ప్రగతిశీలుడైన, మానవకారుణ్యవాద పరిపాలకుడుగా వ్యవహరించాడు. కాని, పదిహేనవ లూయీ పాలనలో ఆయన చెయ్యగలిగినది బహు స్వల్పం మాత్రమే.

లిమోజ్‌నుండీ, తను పారిస్‌కు వెళ్ళివచ్చినప్పుడూ ఫిజియోక్రాట్ల విజయాలను ట్యూర్గో గమనించేవాడు. ఆయనకి డ్యుపాన్‌తో స్నేహబంధం ఏర్పడింది, పారిస్‌లో ఆయనకి ఆడమ్ స్మిత్‌తో పరిచయమైంది. కాని, ఆయన యీ దశలో చేసిన ప్రధాన రచనలు — అంతులేని నివేదికలు, అక్కౌంట్లు, ఆధికారిక వివరణలు, సర్క్యులర్లు. అరుదుగా లభ్యమయే విరామ సమయాల్లో మాత్రమే ఆయన విజ్ఞానశాస్త్రానికి కొంత కాలాన్ని కేటాయించగలిగేవాడు. కాగా, 1766లో, దాదాపు యాదృచ్ఛికంగా ట్యూర్గో తన ప్రధాన ఆర్థిక రచనయైన "సంపద రూపధారణ, పంపిణీలపై పర్యాలోచన" రచించడం తటస్థించింది. చాలాకాలంగా ఆయన బుర్రలో రూపొందిన మౌలికభావాలు, ఆధికారిక పత్రాలతోబాటు, యీ విధంగా పాక్షికంగా కాగితం మీదకు ఎక్కాయి.

ఈ రచనకు అసాధారణమైన చరిత్ర వుంది. జెస్యూట్ మిషనరీలు, ఫ్రాన్సులో చదువుకొనేందుకోసం తీసుకువచ్చిన యిద్దరు యువచైనీయులకోసం, పాఠ్యగ్రంథంగానో, గైడుగానో పనికివచ్చే రచనను చెయ్యమన్న మిత్రుల కోర్కెమేరకు, ట్యూర్గో దీన్ని రాశాడు. డ్యుపాన్ 1769–1770లో దీన్ని ప్రచురించాడు. అయితే తన అలవాటు ప్రకారం ఆయన ట్యూర్గోను ఫిజియోక్రాట్‌గా "కత్తిరించాడు." తత్పర్యవసానంగా వాళ్ళిద్దరి మధ్యా నిశితమైన వివాదం రేగింది. 1776లో ట్యూర్గో తను స్వయంగానే యీ పుస్తకపు వేరే ముద్రణను వెలువరచాడు.

ఈ "పర్యాలోచన" పెట్టీ గ్రంథంలోని అత్యుత్తమ పుటలను జ్ఞాపకంచేసే, ప్రతిభాపూర్వకమైన సంక్షిప్తశైలిలో రచింపబడింది. దానిలో 100 క్లుప్తమైన సూత్రీకరణలు వున్నాయి. అవి ఆర్థిక అనుమిత సిద్ధాంత ప్రతిపాదనలు (వాటిలో కొన్నింటిని స్వయం ప్రమాణాలుగా పరిగణించవచ్చునన్నమాట వాస్తవమే అనుకోండి). ట్యూర్గో సిద్ధాంత ప్రతిపాదనలు విస్పష్టమైన మూడు విభాగాలుగా ఏర్పడుతాయి.

31వ సిద్ధాంత ప్రతిపాదనదాకా ట్యూర్గో ఫిజియోక్రాటూ, కెనే శిష్యుడే.

అయినా నికరోత్పాదిత సిద్ధాంతానికి ఆయన యిచ్చిన అర్థభేదం, మార్క్సుచేత యీ కింది వ్యాఖ్యను చేయించింది: "ట్యూర్గోలో [ఫిజియోక్రటిక్ పద్ధతి] అతి సమగ్రంగా అభివృద్ధి చెందింది."* ముందు చేసిన తప్పుడు తర్కాధారం కాక, ఫిజియోక్రటిక్ పద్ధతి చట్రంలోపల వాస్తవికతకి అత్యంత శాస్త్రీయ వ్యాఖ్యానమే అది. ట్యూర్గో "ప్రకృతి నిసర్గ వరం"నుంచి వ్యవసాయదారునిచేత సృష్టింపబడే మిగులుకు — దీన్నే, ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి ఖామందు కాజేస్తాడు — క్రమంగా జరిగి, అదనపు విలువ అవగాహనను చేరుకుంటున్నాడు.

తదుపరి పదిహేడు సిద్ధాంత ప్రతిపాదనలూ విలువ, ధరలు, డబ్బులను పరిశీలిస్తాయి. ఈ పేజీలలోనూ, ట్యూర్గో రచనల్లో మరికొన్నింటిలోనూ, 19వ శతాబ్దాంతంలో ఎంతో పుష్కలంగా వికసించిన వ్యక్తిపర భావవాద సిద్ధాంతాల బీజాలను, బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు మరో వంద సంవత్సరాల తర్వాత కనిపెట్టారు. మొత్తంగా ఫ్రెంచి అర్థశాస్త్రం మాదిరిగానే ట్యూర్గో కూడా శ్రమ విలువ సిద్ధాంతం దగ్గరకు చేరు కోలేదు. ఆయన ప్రకారం, ఒక సరుకు మారకపు విలువా, ధరా అవసరాల మధ్యగల సంబంధంచేత, ఆ మారకంలోకి దిగే వ్యక్తుల — అమ్మకందారు, కొనుగోలు దారులు — కోర్కెల ప్రగాఢత్వంచేత నిర్ణయింపబడుతాయి. అయితే ట్యూర్గోయొక్క యీ భావాలు ఆయన బోధనలోని ప్రధాన భాగంతో అతి కొద్దిగా మాత్రమే సంబంధితమై వున్నాయి.

చివరి 52 సిద్ధాంత ప్రతిపాదనలే మౌలికంగా ట్యూర్గోకి అర్థశాస్త్ర చరిత్రలో అత్యంత గౌరవనీయ స్థానాల్లో ఒకదాన్ని కల్పించాయి.

ఇంతకు ముందే చెప్పినట్లు, ఫిజియోక్రటిక్ వ్యవస్థలో సమాజం మూడు వర్గాలతో కూడివుంటుంది: ఉత్పాదకవర్గం (వ్యవసాయదారులు), భూమి సొంతదారులు, అనుత్పాదక వర్గం (మిగిలిన అందరూ). ట్యూర్గో యీ పథకానికి ఒక అద్భుతమైన చేర్పు చేశాడు. ఆయన ప్రకారం యీ చివరి వర్గం "ఉదాహరణకు రెండు తరగతుల్లోకి తిరిగి విభజింపబడింది: కార్ఖానాదారులైన పారిశ్రామికవేత్తలు, ఫ్యాక్టరీ యజమానులు, తమ డబ్బును మదుపులు పెట్టి జనంచేత పనిచేయించడం ద్వారా లాభాలు పొందే భారీ పెట్టుబడి సొంతదారులు అందరూ ఒక తరగతి; కాగా, రెండో తరగతి, సామాన్య కార్మికులతో కూడివుంటుంది, వీరికి తమ రెక్కలు తప్ప మరి ఎటువంటి ఆస్తి వుండదు, వీరు తమ రోజువారీ శ్రమను మాత్రమే మదుపుపెడతారు, వీరికి తమ వేతనాలు తప్ప

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part I, p. 54.

మరే లాభమూ వుండదు.''* ఈ కార్మికుల వేతనాలు, కనీస జీవితావసరాలకు సరిపడే టంతగా కుదించబడతాయన్న వాస్తవాన్ని ట్యూర్గో మరో ఖండికలో పేర్కొన్నాడు. సాదృశ్య రూపకంగా, ''వ్యవసాయదారుల వర్గం, ఫ్యాక్టరీ యజమానుల వర్గం మాదిరి గానే రెండు తరగతులుగా – పారిశ్రామికవేత్తలు, లేక అన్ని మదుపులూ పెట్టే పెట్టుబడిదారులుగానూ, వేతనాలకు పనిచేసే సామాన్య కార్మికులుగానూ – విభజింప బడింది.''**

ఐదు వర్గాలతో కూడిన యీ సమాజనమూనా, సమాజాన్ని మూడు వర్గాల్లోకి విభజించే కెనే నమూనా కంటె వాస్తవికతకి సన్నిహితంగా వుంది. ఇది, ఫిజియోక్రాట్లకీ, సమాజాన్ని, ఉత్పత్తి సాధనాలతో వారికిగల సంబంధం దృష్ట్యా, భూస్వాములు, పెట్టు బడిదారులు, వేతన కార్మికులు అనే మూడు ప్రధాన వర్గాలుగా స్పష్టంగా విభజించిన ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులకీ మధ్య ఒక వారధి. పరిశ్రమలకూ, వ్యవసా యానికీ మధ్య గల మౌలిక వేర్పాటును వాళ్లు వదుల్చుకున్నారు, ట్యూర్గో యీ పని చెయ్య సాహసించలేదు.

ఆయన సాధించిన గొప్ప విజయాల్లో మరొకటి ఏమిటంటే, పెట్టుబడికి ఆయన చేసిన విశ్లేషణ. అది కెనే విజయంకన్న మరింత ప్రగాఢమైనదీ, మరింత ఫలదాయక మైనదీ.

కెనే పెట్టుబడిని ప్రధానంగా వివిధ సహజ రూపాల్లో మదుపుల (ముడి పదార్థం, వేతనాలు మొదలైనవాటి) ఒక మొత్తంగా పరిగణించాడు. ఆయన దృష్టిలో, సమాజపు వర్గాల మధ్య ఉత్పాదితపు పంపిణీ సమస్యతో పెట్టుబడి అంత సన్నిహితంగా ముడిపడి వుండకపోవడమే యిందుకు కారణం. కెనే వ్యవస్థలో లాభానికి తావు లేదు; ఆయన పెట్టుబడిదారు ఒక విధంగా, ''వేతనం తీసుకుని యాజమాన్యం వహిస్తాడు,'' పోతే, ఏ నియమాలు యీ ''వేతనాన్ని'' నిర్ణయిస్తాయో కెనే పరిశీలించలేదు.

ఈ విషయంలో ట్యూర్గో ఓ పెద్ద ముందడుగు వేశాడు. లాభం అనే భావాభి వర్గం లేకుండా ఆయన యీ వ్యవహారాన్ని పరిష్కరించలేకపోయాడు. సహజేంగితజ్ఞాన ప్రేరితుడై, యీ సమస్య పరిశీలనను పారిశ్రామిక పెట్టుబడిదారుతో ఆరంభించాడు. ఇక్కడ లాభ మూలం ఏమిటో స్పష్టం, ఎందుకంటే, సమస్య యిక్కడ ''మిగులు

---

* Turgot, *Textes choisis et preface par Pierre Vigreux*, Paris, 1947, p. 112.

** అదే గ్రంథం, పేజి 114.

అంతా భూమినుంచే ఉత్పన్నమవుతుంది'' అన్న ఫిజియోక్రాట్ పూర్వనిర్ధారిత విశ్వాసంచేత ఆచ్ఛాదితం కాలేదు.

ఫిజియోక్రాట్ ట్యూర్గో విచిత్రంగా ముందుకెళ్లి, ''సహజ క్రమాన్ని కొంత దారిమళ్లించినందుకు'' క్షమాపణ చెప్పి, వ్యవసాయాన్ని గురించి రెండవ అంశంగా మాత్రమే పరిశీలించ పూనుకున్నాడు. కాని ఆయన క్షమాపణ చెప్పనవసరం లేదు. పైగా, ఆయన వాదన అత్యంత సౌష్ఠవంగా వుంది: వేతనానికి కూలీలను కుదుర్చుకునే పెట్టుబడిదారీ వ్యవసాయదారు, కనీసం ఫ్యాక్టరీ యజమాని పొందేటంత లాభాన్ని పొందాలి, దానికితోడు భూస్వామికి కౌలుమొత్తంగా యిచ్చి తీరవలసిన కొంత అదనపు మొత్తాన్ని కూడా పొందాలి.

బహుశా అత్యంత ఆశ్చర్యకరమైన సిద్ధాంత ప్రతిపాదన అరవై రెండవది. ఉత్పత్తిలో మదుపు పెట్టబడిన పెట్టుబడి స్వయంపెరుగుదల సామర్థ్యాన్ని కలిగివుంటుంది. ఈ స్వయంపెరుగుదల స్థాయినీ, అనుపాతాన్నీ నిర్ణయించేది ఏమిటి?

పెట్టుబడిచేత (నిజానికి, పరిశీలనలో వున్న పెట్టుబడిచేత దోచుకోబడే శ్రమచేత) సృష్టింపబడిన ఉత్పాదితపు విలువలో ఏమేమి వుంటాయో వివరించేందుకు ట్యూర్గో ప్రయత్నిస్తాడు. మొదటిది, ఉత్పాదితపు విలువ, కార్మికుల వేతనాలతోబాటు, పెట్టుబడి వ్యయాన్ని భర్తీచేస్తుంది.* మిగిలినది (వాస్తవంగా, అదనపు విలువ) మూడు భాగాలుగా విభజింపబడింది.

మొదటి భాగం, డబ్బు పెట్టుబడి సొంతదారుగా ''ఎటువంటి కష్టమూ లేకుండా'' పెట్టుబడిదారు పొందగల ఆదాయంతో సమానమైన లాభం. ఇది రుణవడ్డీకి అనురూపమైన లాభ భాగం. లాభపు రెండవ భాగం, తన డబ్బును ఫ్యాక్టరీలోగాని, వ్యవసాయక్షేత్రంలోగాని మదుపుపెట్ట నిర్ణయించుకునే పెట్టుబడిదారు ''శ్రమకీ, నష్టసంభావ్యతకీ, నైపుణ్యానికీ'' చెల్లింపు. ఇది పారిశ్రామిక, లేక వ్యవసాయ కృషికిగాను లభించే ఆదాయం. ఈవిధంగా ట్యూర్గో, పారిశ్రామిక లాభంలోను, రుణమిచ్చే, కృషిచేసే పెట్టుబడిదారు మధ్య దాని పంపకంలోనూ ఒక విభజనను గుర్తిస్తున్నాడు. మూడవ భాగం కౌలు. అది, వ్యవసాయంలో మదుపుపెట్టబడిన పెట్టుబడికి మాత్రమే వుంటుంది. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో నిస్సందేహంగా యిదొక ముందడుగే.

---

* అవాంతర వ్యయం (పశువుల జాడ్యం వగైరాల)కోసం ఉత్పాదితపు విలువనుంచి విధిగా కేటాయింపబడవలసిన ఒక భీమా నిధిని గురించి కూడా ట్యూర్గో ప్రత్యేకించి పేర్కొన్నాడు.

అయితే, ఆ వెంటనే ట్యూర్గో అడ్డంగా తిరుగుతాడు. లాభమే ప్రధానమైన, అదనపు విలువయొక్క సాధారణీకరణ రూపమనీ, దాన్నుంచే వడ్డీ, కౌలూ — రెండూ కూడా ఉత్పన్నమవుతాయన్న సరైన దృక్పథంనుంచి ఆయన వైదొలగుతాడు. మొదట ఆయన లాభాన్ని వడ్డీకి కుదిస్తాడు: యిది కనీస మొత్తం, ఏ పెట్టుబడిదారుకైనా దీనికి హక్కుంది. తన బల్లముందు ప్రశాంతంగా కూర్చునేందుకు బదులు, అతను ఒక ఫ్యాక్టరీ పొగలోకీ, దుమ్ములోకీ వెళ్ల సాహసిస్తే, లేక తన వ్యవసాయ కార్మికులపై ఓ కన్నువేసి, ఎండలో చెమటోడిస్తే, అతనికి కొంచెం అదనంగా ముట్టాలి — ఓ ప్రత్యేక రకపు వేతనం. వడ్డీ, తిరిగి, భూమి కౌలుకి కుదించబడింది: పెట్టుబడితో చెయ్యగల అత్యంత సరళమైన పని ఏమిటంటే, ఓ భూఖండం కొనడం, దాన్ని కౌలుకి యివ్వడమూను. కాగా యిప్పుడు అదనపు విలువయొక్క ప్రధాన రూపం ఏమిటంటే భూమి కౌలు, మిగిలినవి కేవలం దాని ఉత్పాదితం మాత్రమే. పోతే, యావత్తు సమాజమూ భూమిచేత ఉత్పత్తి చెయ్యబడిన "వేతనాలపై బతుకుతోంది." ట్యూర్గో యీ విధంగా ఫిజియోక్రాట్ల ఒడిలోకి తిరిగివస్తాడు.

గొప్ప చింతనాపరుల పొరపాట్లు సైతం ఫలవంతమైనవీ, ముఖ్యమైనవీ అన్న విషయం మనకి తెలుసు. ఈ సూత్రం ట్యూర్గోకి కూడా వర్తిస్తుంది. మదుపు పెట్టుబడి భిన్న రూపాలను పరిశీలించే క్రమంలో, పెట్టుబడుల పోటీకి సంబంధించిన ముఖ్య సమస్యనూ, పెట్టుబడిని ఒక మదుపు రంగంనుంచి మరో రంగానికి తరలించే సంభావ్యత కారణంగా, లాభాన్ని సహజ సమస్థితికి తెచ్చే ముఖ్య సమస్యనూ ఆయన లేవనెత్తాడు. ఈ సమస్యల పరిష్కారం దిశగా ముఖ్యమైన తదుపరి అడుగు వేసినది రికార్డో. ఫ్రెంచి, ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రంలో జరిగిన యీ పరిశోధనలు క్రమంగా, "పెట్టుబడి" మూడవ భాగంలోని ఉత్పత్తియొక్క లాభం, ధరలను గూర్చిన సిద్ధాంతంలోనూ, రుణపెట్టుబడి, వడ్డీలను గూర్చిన సిద్ధాంతంలోనూ, భూమి కౌలు సిద్ధాంతంలోనూ మార్క్స్ సమకూర్చిన పరిష్కారానికి దారితీసింది.

మంత్రి

బూర్బన్ రాజులు భావి తరాలకు ప్రసిద్ధమైన కొన్ని సూక్తులను వదిలిపెట్టారు. "పారిస్ విలువ ఒక సామూహిక ప్రార్థన అంత" అన్న పదబంధాన్ని నాల్గవ హెన్రీ కూర్చినట్లు ఐతిహ్యం. పధ్నాల్గవ లూయీ అపరిమిత రాజరికాన్ని క్లుప్తంగా "రాజ్య

మంటే నేనే'' అన్న రెండు ముక్కల్లో వర్ణించాడు. పదిహేనవ లూయీ దీనితో దీటుగా ప్రసిద్ధిచెందిన "నా తర్వాత లోకం ఏ వరదలో కొట్టుకుపోతే నాకేం'' అన్న సూక్తిని ప్రవచించాడు. పదహారవ లూయీ మాత్రం ఏ ప్రసిద్ధ సూక్తినీ మిగల్చలేదు. దీనికి కారణం త్వరలోనే ఆయనకి శిరచ్ఛేదం జరిగివుండటం కావచ్చు, కాకుంటే, ఆయన అంత గొప్పవాడు కాకపోవడం అయినా కావచ్చు. మిరాబో (ఫిజియోక్రాట్ మార్కీస్ కొడుకు) చెప్పినట్టు, పద్నాల్గవ లూయీ రాజు కుటుంబంలో ఉన్న మగధీరుడల్లా ఒక్కరే, ఆ వ్యక్తి మేరీ అంటువానెట్. పదిహేనవ లూయీ మశూచికంవల్ల 1774లో మరణించాడు. అతని జీవితపు చివరి సంవత్సరాలు క్రూరమైన అభివృద్ధినిరోధకత్వానికీ, ఆర్థిక సంక్షోభానికీ పేరుపొందాయి. ఒక నిరంకుశ ప్రభువు మరణం తర్వాత సామాన్యంగా, కొత్త నిరంకుశుడు వాకిట్లో కాచుకొని వున్నాకూడా, ఉదార ధోరణులు కానవస్తాయి. పాతరాజు మరణంతో ఫ్రాన్సు అంతా అమ్మయ్య అని తేలికగా నిట్టూర్పు విడిచింది. మెత్తటి, వెనులుబాటు స్వభావంగల అతని 20 ఏళ్ల వారసుడు చివరకు "హేతువాద యుగానికి'' నాంది పలుకుతాడనీ, తమ భావాలను ఆచరణలో పెడతాడనీ తత్వవేత్తలు ఆశించారు. ట్యూర్గో ఉన్నత పదవిలో నియమింపబడటంతో యీ ఆశలకు మరింత దోహదం కలిగింది. ట్యూర్గో మొదట నౌకామంత్రిగానూ, మరికొద్ది వారాల తర్వాత ఆర్థికశాఖ కంట్రోలర్ జనరల్‌గానూ నియమింపబడ్డాడు. దానితో, దేశపు ఆంతరంగిక వ్యవహారాలన్నీ ఆచరణలో ఆయన అదుపులోకి వచ్చాయి.

ట్యూర్గోకి యాదృచ్ఛికంగా మంత్రి పదవి లభించిందని తరచుగా అంటూ వుంటారు. ఆయన స్నేహితుడైన మతగురువు వెరీ మేడమ్ డి మొరెపా చెవిలో ఒక మాట ఊదాడనీ, ఆవిడ కొత్త రాజుకి అభిమానపాత్రుడైన తన భర్తపై ఒత్తిడి తెచ్చిందనీ, వగైరా వగైరా చెప్పుకొంటూవుంటారు, ఇది పాక్షికంగా మాత్రమే నిజం. ట్యూర్గో పదవీ నియామకం కుట్ర ఫలితంగా జరిగింది. జిత్తులమారి రాజాస్థానికుడైన మొరెపా, ట్యూర్గోకు ప్రజల్లోగల పలుకుబడినీ, సుప్రసిద్ధమైన ఆయన నిజాయితీనీ తన సొంత ప్రయోజనాలకోసం వాడుకోవాలని అంచనాలు వేసుకున్నాడు. సొంత భావాలకూ, పథకాలకూ అతనికి మరి వ్యవధి తక్కువాయె!

అయితే మొత్తం కథంతా యింతే కాదు. ఇంతకు ముందెన్నటికన్న దేశం మార్పును వాంఛించింది. పైనున్న ఫ్యూడల్ ప్రభువులు సైతం యీ మార్పు ఆవశ్యకతను గుర్తించారు. రాజాస్థాన కుట్రలతో సంబంధం లేని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేశాడన్న మచ్చలేని ఓ కొత్త వ్యక్తి అవసరమయాడు. అలాంటి మనిషి దొరికాడు — ఆయనే ట్యూర్గో. రాజ్యపు ద్రవ్య, ఆర్థిక ఈజియన్ గుర్రాల శాలను పరిశుభ్రంచేసే బాధ్య తను మీద వేసుకున్నప్పుడు, అదేదో తేలికగా జరిగిపోయే పని అన్న భ్రమను ట్యూర్గో

పెట్టుకోలేదు. ఆయన బుద్ధిపూర్వకంగానే ఆ భారాన్నిమీద వేసుకుని, దాన్ని అచంచ లంగా మోశాడు. ఆయన చేబట్టినది సాహసికమైన బూర్జువా సంస్కరణల మార్గం. మానవ హేతువాద, ప్రగతుల దృష్ట్యా యీ మార్గం అవసరమని ఆయన నిర్ణయించు కున్నాడు.

ట్యూర్గోను గురించి మార్క్స్ యిలా రాశాడు: "పాత వ్యవస్థను కూలదోసిన మేధావి వీరులలో ఆయనొకడు."*

మంత్రిగా ట్యూర్గో కచ్చితంగా ఏంచేశాడు? ఆయన పదవిలో వున్న స్వల్ప కాల వ్యవధినీ, ఎదుర్కొన్న బృహత్తరమైన కష్టాలనూ దృష్టిలో పెట్టుకొంటే, ఆయన ఊహాతీతమైనంత అధిక కృషి చేశాడు. అంతిమ, దీర్ఘకాలిక ఫలితాల దృష్ట్యా చూస్తే చాలా తక్కువ చేశాడు. ట్యూర్గోలాంటి వ్యక్తి సంస్కరణలను అమల్లో పెట్టలేక పోయాడంటే దాని అర్థం, సంస్కరణల అమలు అసాధ్యమని. అందుకే ట్యూర్గో సంస్కరణలనుండి తిన్నని ఒక మార్గం, 1789లో బస్టీల్ జైలు ఆక్రమణకూ, 1792లో తుయిలెరీ రాజభవనపు ముట్టడికీ నడిపింది.

ట్యూర్గో వెంటనే పరిష్కరించ పూనుకొన్న మిక్కిలి తక్షణ కర్తవ్యం ఏమిటంటే, రాజ్యపు ద్రవ్య ఆదాయ వ్యయాలను సక్రమ స్థితిలో పెట్టడం. శిస్తువ్యవసాయాన్నీ, భూమి ఆస్తిపై వచ్చే రాబడులపై పన్ను విధించడాన్నీ రద్దుచెయ్యడం వంటి తీవ్ర సంస్కరణతోబాటు, ఆయనకి దీర్ఘకాలిక పథకం ఒకటి వుంది. ట్యూర్గో తన పథకాన్ని నలుగురికీ వెల్లడించేందుకు తొందరపడలేదు, ఆసక్తికర వర్గాలు ఎలా ప్రతి స్పందిస్తాయో ఆయన పూర్తిగా గ్రహించడమే యిందుకు కారణం. అప్పటికి మటుకు ఆయన కొన్ని విడి చర్యలను – పన్నుల విధానంలో వున్న అతి ఘోరమైన అవకతవక లనూ, అన్యాయాలనూ తొలగించడం, పరిశ్రమలపైనా, వర్తకంపైనా పన్నుల భారాన్ని తగ్గించడం, శిస్తు వ్యవసాయదారులపై ఒత్తిడి తేవడం – ప్రవేశపెట్టేందుకు గట్టి కృషి చేశాడు. మరోవంక, బడ్జెట్ వ్యయాన్ని నిరోధించేందుకు – దీనిలో రాజాస్థాన పోషణే ప్రధానమైన పద్దు – ఆయన ప్రయత్నించాడు. ఈ విషయంలో ఆయనకి త్వరలోనే, దుబారాపరురాలైన మేరీ అంటువానెట్ చపల చిత్తంతోనూ, దుష్ట బుద్ధితోనూ ఘర్షణ ఏర్పడింది. బడ్జెట్‌లో కొంత మెరుగుదల సాధించడంలోనూ, ప్రభుత్వ రుణాన్ని నెలకొల్పడంలోనూ ఆయన విజయం సాధించాడు. కాని, మంత్రి శత్రువులు వేగంగా పెరగసాగారు, క్రమంగా మరింత క్రియాశీలురు కూడా కాసాగారు.

---

* Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. 15, Berlin, 1969, S. 375.

పిండీ, ధాన్యాల విషయంలో స్వేచ్ఛావర్తకాన్ని ప్రవేశపెట్టడం, కొందరు కిలాడీ మోసగాళ్లు అంతకు ముందరి మంత్రి తోడ్పాటుతో సంపాదించుకున్న గుత్త వర్తకాన్ని రద్దుచెయ్యడం అన్నది ట్యూర్గో ప్రవేశపెట్టిన ముఖ్యమైన ఒక చర్య. అయితే మౌలికంగా ప్రగతిశీలమైన యీ చర్య, ఆయనకి పెద్ద చిక్కులను కల్పించింది. 1774లో పంట పాడైంది, తదుపరి వసంత ఋతువులో ధాన్యం ధర గణనీయంగా పెరిగింది. కొన్ని పట్టణాల్లో, ప్రత్యేకించి పారిస్‌లో, సామూహిక అల్లర్లు జరిగాయి. రుజావు చేసేందుకు ఎవరికీ ఆస్కారం లేకపోయినప్పటికీ, ట్యూర్గో పదవికి ఎసరుపెట్టే లక్ష్యంతో ఆయన శత్రువులే చాలవరకు యీ అల్లర్లను రెచ్చగొట్టారనేందుకూ, ఏర్పాటుచేశారనేందుకూ ఆధారాలు వున్నాయి. మంత్రి వాటిని దృఢమైన హస్తంతో అణచివేశాడు. జనం తమ ప్రయోజనాలను తామే అర్థంచేసుకోలేదనీ, యీ ప్రయోజనాలను వారికి మరో విధంగా వివరించి చెప్పాలనీ ఆయన ఊహించి వుండచ్చు. ఆయన చెడును కోరుకునేవాళ్లు దీన్నంతనీ ట్యూర్గో వ్యతిరేకంగా వినియోగించుకున్నారు. ఇప్పుడు మొరెపా కూడా రహస్యంగా యీ శత్రుకూటమిలో చేరాడు, కాలం గడిచినకొద్దీ అతను ట్యూర్గో అంటే అంతకంతకు ఎక్కువగా భయాన్నీ, ఈర్ష్యనూ పెంచుకున్నాడు.

అయినాకూడా ట్యూర్గో నిస్సంకోచంగా ముందుకు వెళ్లాడు. 1776 మొదట్లో, ఆయన సుప్రసిద్ధమైన ఆరు శాసనాలకు రాజాంగీకారం లభించింది, ఆయన అంతకుముందు తీసుకున్న ఏ చర్యలకన్న యివి ఫ్యూడలిజం పువాదులను కదిల్చివేశాయి. వాటిలో రెండు అతి ముఖ్యమైనవి: ఒకటి, రోడ్ల వెట్టిచాకిరీ రద్దు; రెండు, ప్రత్యేక హక్కులు కలిగిన వృత్తుల కార్ఖానాలు గిల్డుల రద్దు. ఈ చివరి చర్యను పరిశ్రమల, పెట్టుబడిదారీ పారిశ్రామికుల శ్రేణి శీఘ్ర పెరుగుదలకు ఆవశ్యక షరతుగా ట్యూర్గో పరిగణించాడు. ఈ బిల్లులకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది, ప్రత్యేకించి పారిస్ న్యాయస్థానం యీ ప్రతిఘటనకు ప్రధాన కేంద్రమైంది. న్యాయస్థానం వాటిని గుర్తించి నమోదుచేసేదాకా అవి చట్టాలు కాజాలవు. ఈ పోరాటం రెండు మాసాలకుపైగా సాగింది. మార్చి 12న మాత్రమే యీ నమోదు లభించి, యీ బిల్లులు శాసనాలయ్యాయి.

అది ఎక్కువ మూల్యం చెల్లించి సాధించిన విజయం. పాత వ్యవస్థకు చెందిన శక్తులన్నీ యిప్పుడు సంస్కరణవాద మంత్రికి వ్యతిరేకంగా – రాజాస్థానంలోని కుట్రముఠా, చర్చికి చెందిన ఉన్నత శ్రేణులవాళ్లు, ప్రభువర్గం, న్యాయస్థానాలు, కంపెనీలకు చెందిన బూర్జువాలు – సమీకృతులయారు.

ట్యూర్గో సంస్కరణల ప్రజాస్వామిక స్వభావాన్ని జనం కొంత మేరకు అర్థం చేసుకున్నారు. రోసిపోయిన రోడ్ల వెట్టిచాకిరీలనుండి బయటపడినందుకు రైతులు సంతో

షంతో పొంగిపోయారు, అయితే, ఆయన పేరు వాళ్లకి దాదాపు తెలియనే తెలియదు. మరింత చదువు సంధ్యలు వచ్చిన పారిస్‌లోని అప్రెంటిస్‌లూ, సంచార వర్తకులూ సంతోష మనస్కులై, ట్యూర్గోను పొగుడుతూ పదాలు అల్లారు. అయితే జనం ఎక్కడో అట్టడుగున వుండగా, ఆయన శత్రువులు పక్కలో బల్లెం మాదిరిగా ఆయన పక్కనే వున్నారు. సంచార వర్తకుల హుషారైన పదాలూ, ఫిజియోక్రాట్లు వాస్తవాం శాలను పరిశీలిస్తూ రాసిన వ్యాసాలూ పారిస్‌కి ప్రవాహసదృశంగా వచ్చే విద్వేష పూరిత మైన కరపత్రాలతో, వ్యంగ్య గేయాలతో, కార్టూన్లతో ముంచివెయ్యబడ్డాయి. వ్యంగ్య రచయితలూ, చిత్రకారులూ ట్యూర్గోను ఒక్కొక్కసారి ఫ్రాన్సుయొక్క శనిదేవతగానూ, వేరొక్కొక్క సారి పనికిమాలిన అనాచరణాత్మక తత్వవేత్తగానూ, యింకా కొన్ని సార్లు "ఆర్థికవాద ముఠా" చేతుల్లో కీలుబొమ్మగానూ చిత్రిస్తూండేవారు. ట్యూర్గో నిష్కళంకతనీ, ఆయన నిజాయితీనీ మాత్రం ఎవరూ సవాలుచెయ్యలేకపోయేవారు, ఈ విషయంలో మాత్రం ఆయన వంక ఎవరూ వేలెత్తి చూపలేకపోయేవారు.

ఈ ప్రచార కార్యక్రమమంతటికీ రాజాస్థానంలోని ముఠాయే మార్గదర్శకత్వం వహిస్తూ, యిందుకు అయ్యే ఖర్చులన్నీ తనే భరిస్తూవుండేది. మిగిలిన మంత్రులు ట్యూర్గోకి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూండేవారు. లూయీ ఆయన్ని జైలుకి పంపా లని రాణి ఉన్మత్తావేశంతో అరిచి డిమాండ్ చేస్తూవుండేది. ట్యూర్గోకి వ్యతిరేకంగా అత్యంత విద్వేషపూరిత ప్రచారం చేసినవాళ్లలో చక్రవర్తి సోదరుడు ఒకడు.

ఈ గగ్గోలులో అచంచలమైన దృఢత్వం కలిగి, గర్వి, ఏకాకీ అయిన ట్యూర్గో, నిజంగానే హుందా అయిన, విషాదాత్మక వ్యక్తిగా కనిపిస్తాడు.

ఆయన పతనం యిప్పుడిక అనివార్యం. నాలుగు పక్కలనుంచీ వచ్చిన ఒత్తిడికి చివరకు పదహారవ లూయీ తలొగ్గాడు. ఆ రాజా తన మంత్రికి, ఆయన పదవీ విరమణ విషయాన్ని ముఖాముఖీన చెప్పేందుకు సాహసించలేకపోయాడు. ఆ పదవిని ఖాళీ చెయ్యవలసిందిగా జారీచెయ్యబడిన ఉత్తరువు రాజ వార్తాహరుని ద్వారా ఆయనకి అంద జెయ్యబడింది. 1776 మే 12న యిది జరిగింది. ఆయన ప్రవేశపెట్టిన చర్యల్లో అత్యధిక భాగం, ప్రత్యేకించి పైన పేర్కొనబడిన శాసనాలు, త్వరలోనే పూర్తిగాగాని, పాక్షికంగాగాని ఉపసంహరింపబడ్డాయి. దాదాపు ప్రతీదీ పూర్వం మాదిరిగా జరగ సాగింది. ట్యూర్గో ఆయన సమర్థకులూ, సహాయకులూ ఆయనతోబాటే పదవీ విరమణ చేశారు, ప్రభుత్వ సేవలోకి తెచ్చిన వారిలో కొందరు పారిస్‌ను విడిచి పోవలసివచ్చింది కూడా. ఫిజియోక్రాట్ల, విజ్ఞానసర్వస్వవాదుల ఆశలు భగ్నమయాయి.

వ్యక్తి

ట్యూర్గోకి అప్పటికి యింకా 50 ఏళ్లు నిండకపోయినా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన కీళ్లవాతపు నొప్పులు ప్రత్యేకించి బాధాకరంగా వున్నాయి. మంత్రి పదవిలో వున్న 20 నెలల్లోనూ 7 నెలలు ఆయన మంచంలోనే వున్నాడు. అయితేనేం, ఆయన పనికి ఎన్నడూ — ఒక్క రోజుకూడా — అంతరాయం కలగలేదు. ఆయన ముసాయిదా చట్టాలను, నివేదికలను, ఉత్తరాలను చెప్పి, రాయిస్తూనే వుండే వాడు. ఉద్యోగులను కలుసుకునేవాడు, తన సహాయకులకు ఆదేశాలు యిస్తూనే వుండే వాడు. రాజుగారి గదిలోకి ఆయన్ని ఒక్కొక్కసారి మేనామీద తీసుకెళ్తూండేవారు.

అనారోగ్యం ఆయన్ని పట్టి పీడిస్తూనేవున్నా, దాన్ని ఆయన ఏవగించుకునేవాడు. ఒక్కొక్కసారి ఆయన చంకకర్రల ఊతంతోగాని లేవలేకపోయేవాడు, వాటిని ఆయన వ్యంగ్యంగా తన "పంజాలు" అని పిలుస్తూండేవాడు. చివరు వ్యాధితో 1781 మేలో, తన రిటైర్‌మెంటుకి సరిగా అయిదేళ్ల తర్వాత ఆయన మరణించాడు.

రాజాభిమానం కోల్పోయి పదవినుండి పతనమవడాన్నీ, తన సంస్కరణల అమల్లో వైఫల్యాన్నీ ట్యూర్గో ఎంత ప్రశాంతంగా తట్టుకున్నాడో చూసి ఆయన మిత్రులు చకితులయ్యారు. తన లేఖలను సెన్సార్ ఉద్యోగులు తెరవడాన్ని సైతం ఆయన సరదాగా ఎగతాళి చెయ్యగలిగేవాడు. ప్రైవేటు జీవితంలోకి రిటైర్ కావడాన్ని ఆయన హర్షించినట్లు కనిపించాడు: ఆయన ఇంటెండెంటుగానూ, మంత్రిగానూ పనిచేసిన పదిహేనేళ్లలోనూ గ్రంథపఠనానికీ, వ్యక్తిగత అధ్యయనానికీ, తన మిత్రులతో సాంగత్యానికీ ఆయనకి తీరిక చిక్కేది కాదు. ఇప్పుడు ఆయనకి ఆ వ్యవధి కల్పించబడింది.

తన లేఖల్లో ట్యూర్గో సంగీత సాహిత్యాలను గురించీ, భౌతిక, ఖగోళశాస్త్రాల్లో తన అధ్యయనాన్ని గురించీ చర్చించాడు.

1778లో సాహిత్య భాషా అకాడెమీ వార్షిక అధ్యక్షుడుగా తన కొత్త మిత్రు డైన బెంజమిన్ ఫ్రాంక్లిన్ని ఆయన — అధికారికంగా అకడమీషియన్ని చేశాడు. తిరుగు బాటులో వున్న అమెరికన్ రాష్ట్రాల రాయబారి అయిన ఫ్రాంక్లిన్‌కి రాసిన "పన్నుల గురించిన సంస్మృతులు" ట్యూర్గో చేసిన తుది ఆర్థిక రచన. మిగిలిన ఫ్రెంచి సమాజం మాదిరిగానే, యీ కాలంలో, అమెరికన్ వ్యవహారాల్లో ఆయన ప్రగాఢమైన ఆసక్తి చూపాడు. తనలో అంతర్గర్భితంగా వున్న ఆశాభావంతో, మహాసముద్రానికి అవతలి ఆ రిపబ్లిక్, శిథిల ఫ్యూడల్ యూరప్ పొరపాట్లనూ, లోపాలనూ పరిహరించు కుంటుందని ఆయన ఆశించాడు.

తన పాత మిత్రురాలు డచెస్ డి ఎన్‌వీల్, తత్వశాస్త్రజ్ఞుని విధవరాలైన మదాం హెల్వెటియస్‌ల అతిథి మందిరాలకు ట్యూర్గో తరచుగా హాజరవుతూండేవాడు. అత్యంత స్వేచ్ఛాయుత చింతనాపరులూ, విజ్ఞాన వికాసాలు కలిగినవారూ అక్కడ సమావేశమవుతూండేవారు. మానవ హేతుజ్ఞానాన్ని విశేషంగా హర్షించే ట్యూర్గో మేధాశక్తి చిట్టచివరిదాకా సునిశితంగానూ, సుస్పష్టంగానూ వుంది.

వ్యక్తిగత జీవితంలో ట్యూర్గో ఒక రకంగా ప్రచండుడు, అసౌమ్యుడూనూ. ఆయనలో వెసులుబాటుతనం లేదనీ, మరీ మొండిపట్టు మనిషనీ అప్పుడప్పుడు విమర్శింపబడు తూండేవాడు. దీని మూలంగా ఆయనతో వ్యక్తిగత సాంగత్యం, ఆయనతో సన్నిహితు లైనవారికి సైతం కష్టసాధ్యమై, ఆయనతో బాగా పరిచయం లేనివారిని బెంబేలె త్తించి ఉండవచ్చు.

కాపట్యమన్నా, ఆలోచనా రాహిత్యమన్నా, మాట నిలకడలేకపోవడమన్నా ఆయనకి ప్రత్యేకించి మంటగా వుండేది. ట్యూర్గోకి రాజాస్థానంలో ప్రవర్తించే పద్ధతులు ఎన్నడూ అబ్బలేదు. వెర్సైల్స్‌వాసులు ఆయన వాలకం చూసి తబ్బిబ్బుపడి, చెదిరిపోయేవారని ఆయన జీవిత చరిత్రకారుడు రాస్తాడు: ''గుచ్చుకొనే ఆయన యిటుకరంగు కళ్లూ, ఆయన విశాలమైన నుదురూ, హుందాగా వుండే ఆయన కవళికలూ, అసలాయన తల వాల్చే తీరూ, రోమన్ శిల్పంలా ఠీవిగా ఉండేవాడు.''

వెర్సైల్స్‌లోని రాజ దర్బారులో ఆయన యిముడలేదు. ఆయనకెన్నో ప్రతిభలు వున్నాయి, కాని టాలెరాన్ వర్ణించిన ఒక నేర్పు మాత్రం ఆయనకి లేదు – అదేమిటంటే, భాషను తన భావాలను వ్యక్తంచెయ్యడానికి కాక, వాటిని మరుగుపరచేందుకు వినియో గించగల నైపుణ్యం.

ప్రకరణం 10

స్కాటిష్ ప్రాజ్ఞుడు ఆడమ్ స్మిత్

అర్థశాస్త్రం, తన స్థాపకుల్లో ఒకరికి సంబంధించిన రెండు తేదీల స్మారకోత్సవాలను జరుపుకుంది: మొదటిది 1973లో ఆడమ్ స్మిత్ 250వ జన్మదినోత్సవం, రెండవది 1976లో "జాతుల సంపద" గ్రంథ ద్విశత జయంతి. ఈ ఉత్సవాల సందర్భంగా యీ గొప్ప స్కాట్ జాతీయునిపైనా, యీ విజ్ఞానశాస్త్రంలో ఆయన పాత్రపైనా మరోమారు దృష్టి కేంద్రీకరింపబడింది.

ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్తా, విక్టోరియన్ యుగానికి చెందిన పత్రికా రచయితా అయిన వాల్టర్ బాజ్‌గోట్ 1876లో యిలా రాశాడు: "ఆడమ్ స్మిత్ అర్థశాస్త్రాన్ని గురించి దాదాపు లెక్కలేనంత చెప్పబడింది, కాని వ్యక్తిగా ఆడమ్ స్మిత్‌ని గురించి అతి కొద్దిగా మాత్రమే చెప్పబడింది. అయితే, అత్యంత ఆసక్తిదాయకమైన మనుషుల్లో ఆయన ఒకడవడమే కాకుండా, ఆయన ఎలాంటివాడో తెలుసుకోకుండా, ఆయన పుస్తకాలను అర్థంచేసుకోవడం దాదాపు దుస్సాధ్యం."*

తదాదిగా స్మిత్‌ని గూర్చిన అధ్యయనం విశేషంగా ముందుకెళ్లిందనడం స్పష్టం. అయినాకూడా, 1948లో బ్రిటిష్ నిపుణుడు అలెక్జాండర్ గ్రే యిలా అన్నాడు: "ఆడమ్ స్మిత్ స్వదేశంలోనూ, మొత్తంమీద ప్రపంచంలోనూ, 18వ శతాబ్దపు ప్రముఖ మహామేధావుల్లో ఒకడూ, 19వ శతాబ్దాన్ని ప్రబలంగా ప్రభావితం చేసిన వారిలో ఒకడూ అనడం స్పష్టం. కాగా, ఆయన జీవిత వివరాలను గూర్చిన మన పరిజ్ఞానం యింత స్వల్పంకావడం కొంతవరకు ఆశ్చర్యం గొలిపే విషయమే.... అందుచేత, ఆయన జీవిత చరిత్ర రచనకు ఉపక్రమించిన నేను, లభ్యమైన స్వల్ప సమాచారాన్ని ఆడమ్ స్మిత్ జీవిత చరిత్ర రచనకు కాక, ఆయన సమకాలీన చరిత్ర రచనకు వినియోగిస్తున్నాను."**

---

* *Bagehot's Historical Essays*, New York, 1966, p. 79.

** A. Gray, *Adam Smith*, London, 1948, p. 3.

యుగావసరాలు కావలసిన మనిషిని సృష్టించుకుంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రత్యక్షాభివృద్ధిచేత నిర్ణయింపబడిన అర్థశాస్త్రం, ఇంగ్లండులో ఒకానొక దశకు చేరుకున్నప్పుడు, ఒక విధానం, ఆర్థిక జ్ఞానాన్ని క్రమబద్ధంచేసి, సాధారణీకరించ వలసిన అవసరం ఏర్పడింది. స్మిత్ వ్యక్తిగతంగానే కాక, విద్యాయోగ్యతాపరంగా కూడా ఈ పనికి అద్భుతంగా సరిపోయాడు. సిద్ధాంతపరమైన ఆలోచనా సామర్థ్యం — నిర్దిష్ట విషయాలను గురించి విస్పష్టంగా మాట్లాడగల నైపుణ్యం; విజ్ఞాన సర్వస్వప్రాయమైన పాండిత్యం — అసాధారణమైన చైతన్యం, విద్యాపరమైన నిజాయితీ; యితరుల భావాలను గొప్ప స్వతంత్ర భావంతోనూ, విమర్శనా పూర్వకమైన ఆలోచనాపరత్వంతోనూ ఉపయోగించుకునే సామర్థ్యం; విద్యాపరమైన, పౌర సంబంధమైన సాహసం, ఆచార్య సహజమైన ప్రశాంతత, క్రమబద్ధత — ఈ లక్షణాలన్నీ ఆయనలో కలిసివుండటం ఆయన అదృష్టం.

సరళమైనవిగానూ, సామాన్యమైనవిగానూ కనిపిస్తున్నప్పటికీ మనిషికి కీలక ప్రాధాన్యం కలిగిన విషయాల అర్థాన్ని అవగాహన చేసుకొని, వాటిని వ్యాఖ్యానించడాన్ని సాధ్యం చెయ్యడం, లేక కనీసం అందుకు ప్రయత్నించడం ఆర్థిక విజ్ఞానశాస్త్ర విశిష్ట లక్షణాల్లో ఒకటి. అటువంటి విషయాల్లో డబ్బు ఒకటి. డబ్బును చేత్తో తాకని మనిషీ, అదేమిటో తెలియని మనిషీ ఎవడూ లేడు. కాని డబ్బులో అనేక రహస్యాలు వున్నాయి. ఆర్థిక శాస్త్రవేత్తలకు సంబంధించినంతవరకు యిది అపారమైన సంక్లిష్ట సమస్య. రాబోయే అనేక సంవత్సరాలపాటు నిస్సందేహంగా యీ సమస్య వారి మనస్సులను కలతపరుస్తూనే వుంటుంది.

దైనందిన ఆర్థిక విషయాల రమ్యతపట్ల స్మిత్‌కి విశేషాకర్షణ భావం వుంది. ఆయన లేఖిని కింద — కొనుగోలు అమ్మకాలు, భూమిని కౌలుకివ్వడం, కూలీలను వేతనానికి కుదుర్చుకోవడం, పన్నులు చెల్లించడం, బిల్లులను డిస్కౌంట్ చెయ్యడం వంటివన్నీ ప్రత్యేకమైన అర్థాన్నీ, ఆసక్తినీ సంతరించుకున్నాయి. ఆ విషయాలను అర్థం చేసుకోనిదే "హుందా అయిన" రాజకీయాలయొక్క, రాజ్య ప్రభుత్వంయొక్క ఉన్నత రంగంలో ఏమి జరుగుతోందో, వాటి లోతులేమిటో ఎవడూ గ్రహించనారంభించలేదు. బైరన్, పుష్కిన్‌ల కాలంలో అర్థశాస్త్రం అంతటి ఆసక్తిని కలిగించడానికి కారణభూతుడు స్మిత్తే.

పెంపొందుతున్న పారిశ్రామిక బూర్జువావర్గపు ప్రయోజనాలనే వ్యక్తీకరించినప్పటికీ, స్మిత్ ఆ వర్గాన్ని షరతుల్లేకుండా సమర్థించలేదు — యిది మరొక ముఖ్య విశేషం. వైయక్తిక దృష్టితో అధ్యయనపరమైన నిష్పాక్షికత్వం కోసం, స్వతంత్ర నిర్ణయాల కోసం కృషిచెయ్యడమే కాకుండా, వాటిని ఆయన చాలవరకు సాధించాడు. ఆయనలోని

యీ విశిష్ట గుణాలు ఆయనొక అర్థశాస్త్ర విధానాన్ని సృష్టించడానికి తోడ్పడ్డాయి. మార్క్స్‌ను ఉల్లేఖించాలంటే, "బూర్జువా సమాజపు ఆంతరిక అంగనిర్మాణంలోకి చొచ్చుకుపోయేందుకు ఆయన ప్రయత్నించాడు..."* స్మిత్ గ్రంథం మానవ సంస్కృతిలో ముఖ్యమైన ఒక విజయం, 18వ శతాబ్దపు ఆర్థిక చింతనలో శిఖరస్థాయి.

స్కాట్లండు

స్మిత్ స్కాట్‌జాతీయుడనీ, అందునా జాతీయ స్వభావం కొట్టొచ్చినట్లు కనిపించే విశిష్టమైన స్కాట్ అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు మాత్రమే ఆయన అర్థశాస్త్రాన్ని అర్థంచేసుకోవడం సాధ్యమన్నమాట ఒక పాట అయిపోయింది.

పెన్సిలిన్‌ని కనిపెట్టిన మరో గొప్ప స్కాట్‌జాతీయుడైన అలెక్జాండర్ ఫ్లెమింగ్ జీవిత చరిత్రను ఫ్రెంచి రచయిత ఆంద్రే మొరువా యీ కింది మాటలతో మొదలు పెడతాడు: "స్కాట్‌వాళ్లు ఇంగ్లీషువాళ్లు కారు. పైగా ఇంగ్లీషువాళ్లకెంతో భిన్నులు." పరిశ్రమ, మితవ్యయం, పొదుపు—సాధారణంగా యివి స్కాటిష్ జాతీయ స్వభావపు విశిష్ట లక్షణాలుగా పరిగణింపబడుతూ వుంటాయి. సాధారణంగా, స్కాట్‌జాతీయులు నిగ్రహపరులుగానూ, మితభాషులుగానూ, వ్యాపారసరళి కలవారుగానూ, భావాత్మక విషయాలపై చర్చలపట్ల, "తాత్వీకరించడం"పట్ల మోజు కలవారుగానూ పరిగణింపబడుతూవుంటారు.

అయితే, స్కాటిష్ జాతీయ స్వభావాన్ని గూర్చి పాడిందే పాటగా సాగే యీ అరిగి పోయిన వర్ణనలో ఏమేరకు సత్యం వుందన్నది కాదు ప్రస్తుతాంశం. స్మిత్‌నీ, ఆయన అభిప్రాయాల వైయక్తిక స్వభావాన్నీ అవగాహన చేసుకోవాలంటే, ఆయన జీవిత కాలంలో ఆయన దేశ పరిస్థితినీ, స్కాటిష్ ప్రజల పరిస్థితినీ వివరించడం ముఖ్యం.

1707లో ఇంగ్లండు, స్కాట్లండుల మధ్య సంలీన చట్టం ఆమోదింపబడింది. ఇంగ్లీషు, స్కాటిష్ పారిశ్రామిక వేత్తలకు, వ్యాపారస్తులకు, ధనిక వ్యవసాయదారులకూ అది లాభాన్ని చేకూర్చింది. ఆ కాలంలో వారి పలుకుబడి గమనీయంగా పెరిగింది. ఆ రెండు దేశాల మధ్యా సుంకాల అవరోధాలు తొలగింపబడ్డాయి. ఇంగ్లండులో స్కాటిష్ పశువుల అమ్మకాలు పెరిగాయి. గ్లాస్గో వ్యాపారస్తులకు అమెరికాలోని ఇంగ్లీషు వలసలతో వ్యాపారావకాశాలు లభించాయి. వీటన్నింటి కోసమూ స్కాటిష్ బూర్జువావర్గం తమ

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, Moscow, 1968, p.165.

దేశ భక్తిని కొంతమేరకు త్యాగం చేసేందుకు సిద్ధమయ్యారు; యెందుకంటే కొత్త సంయుక్త రాజ్యం (యునైటెడ్ కింగ్‌డమ్)లో స్కాట్లండుది తద్దినం పెట్టేవాడి తమ్ముడి పాత్రే. మరోవంక, స్కాటిష్ ప్రభువర్గంలోని అధికసంఖ్యాకులు యీ సమ్మేళనకు వ్యతిరేకులు. తెగవ్యవస్థావశేషాలతోబాటు యింకా ఫ్యూడల్ వ్యవస్థలోనే నివసిస్తున్న భక్తివిశ్వాసాలు కలిగిన భయంకరులైన పర్వత ప్రాంతీయుల సహాయంతో వాళ్లు అనేక సార్లు తిరుగుబాట్లు చేశారు. అయితే, ఆర్థికంగా మరింత అభివృద్ధిచెందిన స్కాటిష్ మైదాన ప్రాంతీయులు వారిని బలపరచకపోవడంతో, ఆ తిరుగుబాట్లలో ప్రతి ఒక్కటీ విఫలమైంది.

సమ్మేళనానంతరం, కొన్ని శాఖలు ఇంగ్లీషు పోటీ మూలంగానూ, మరికొన్ని ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాల మూలంగానూ దెబ్బతిన్నప్పటికీ, స్కాట్లండ్ ఆర్థికాభివృద్ధి వేగం త్వరితమైంది. గ్లాస్గో పట్టణమూ, ఓడరేవూ ప్రత్యేకించి వేగంగా వృద్ధిచెందాయి, ఓ మొత్తం పారిశ్రామికప్రాంతం దాని చుట్టూ అభివృద్ధి చెందింది. గ్రామీణ, పర్వత ప్రాంతాలనుంచి చౌక శ్రమ లభ్యం కావడం, స్కాట్లండు, ఇంగ్లండు, అమెరికాలలో భారీ మార్కెట్లు ఉండటం పరిశ్రమల పెరుగుదలకు ప్రోద్బలమిచ్చాయి. బడా భూస్వాములూ, ధనికులైన పాలిరైతులూ వ్యవసాయంలో మెరుగైన పద్ధతులను ప్రవేశపెట్ట నారంభించారు. 1707లో సమ్మేళన నాటికీ, 1776లో "జాతుల సంపద" ప్రచురణ నాటికీ మధ్యగల డెబ్బదేళ్లలోనూ స్కాట్లండు గణనీయంగా మార్పుచెందింది. ఆర్థిక ప్రగతి దాదాపు పూర్తిగా స్కాట్లండులోని మైదాన ప్రాంతాలకే పరిమితమైన మాట నిజమే. అయితే, యిక్కడే, కిర్క్‌కల్డీ, గ్లాస్గో, ఎడిన్‌బరోలతో ఏర్పడే త్రికోణ ప్రాంతంలోనే, దాదాపుగా స్మిత్ జీవితమంతా గడిచింది.

స్మిత్ పరిణతుడయ్యేనాటికి, స్కాట్లండు భవితవ్యం ఇంగ్లండు భవితవ్యంతో విడదీయరానిదిగా ముడివడింది. ప్రతి విషయాన్నీ ఉత్పాదక శక్తుల అభివృద్ధి దృష్ట్యేనూ, "జాతి సంపద" దృష్ట్యేనే పరిశీలించిన స్మిత్‌కి, యిది ప్రత్యేకించి స్పష్టంగా బోధపడింది. పోతే స్కాటిష్ దేశభక్తికి సంబంధించినంతవరకు, ఆయన విషయంలో, విజ్ఞులైన పలువురు యితర స్కాట్ల విషయంలో మాదిరిగానే, అది రాజకీయ రూపాన్ని కాక, "సాంస్కృతిక," భావోద్వేగ రూపాన్ని దాల్చింది.

సామాజిక జీవితంపైనా, విద్యార్జనపైనా చర్చి, మతాల ప్రభావం క్రమంగా తగ్గసాగింది. విశ్వవిద్యాలయాలపై చర్చి తన అదుపును కోల్పోయింది. స్వేచ్ఛాయుత ఆలోచన, లౌకిక విజ్ఞానశాస్త్రాలు, వాటి ఆచరణాత్మక మొగ్గు — వీటి ప్రాముఖ్యత విషయంలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలనుండి స్కాటిష్ విశ్వవిద్యాలయాలు విభేదిస్తాయి. ఈ విషయంలో గ్లాస్గో విశ్వవిద్యాలయం ప్రత్యేక విశిష్టతను సంతరించు

కుంది. స్మిత్ దానిలోనే చదువుకున్నాడు, తర్వాత బోధించాడు. ఆవిరి ఇంజన్‌ను కను గొన్న జేమ్స్ వాట్, ఆధునిక రసాయనశాస్త్ర స్థాపకుల్లో ఒకడైన జోసెఫ్ బ్లాక్‌లు స్మిత్‌తో కలిసి పనిచేయడమేగాక ఆయన మిత్రులు.

1750 దశకం ప్రాంతంలో స్కాట్లండు గొప్ప సాంస్కృతిక కార్యకలాపాల దశలో అడుగుపెట్టింది. విజ్ఞానశాస్త్రపు వివిధ శాఖల్లోనూ, కళల్లోనూ యీ విషయం ప్రస్ఫుటమైంది. అర్ధ శతాబ్ద కాలంలో చిన్నారి స్కాట్లండు అత్యంత ప్రతి భావంతులైన మేధావులను పలువురిని సృష్టించింది. ఇంతకుముందు పేర్కొనబడినవారే కాకుండా, అర్థశాస్త్రవేత్త జేమ్స్ స్ట్యువర్టు, తత్వవేత్త డేవిడ్ హ్యూమ్, చరిత్ర కారుడు విలియం రాబర్ట్‌సన్, సామాజిక శాస్త్రవేత్త, ఆర్థికవేత్త అయిన ఆడమ్ ఫెర్గూ సన్‌లు వారిలో వున్నారు. భూగర్భ శాస్త్రవేత్త జేమ్స్ హట్టన్, ప్రసిద్ధ వైద్యుడు విలియం హంటర్, వాస్తు శిల్పి రాబర్ట్ ఆడమ్‌లు స్మిత్‌కి సుపరిచితులు. వీరి ప్రభావం, వీరి రచనల ప్రభావం స్కాట్లండు ఎల్లలనూ, బ్రిటిష్ దీవుల సరిహద్దులనూ దాటి చాలా దూరం విస్తరించింది.

స్మిత్ ప్రతిభ అభివృద్ధిచెందిన పరిసర, వాతావరణాలు అటువంటివి. సహజంగానే ఆయన స్కాటిష్ సంస్కృతిని ఒక్కదాన్ని మాత్రమే జీర్ణించుకోలేదు. ఇంగ్లీషు విద్యా సంస్కృతులూ, ప్రత్యేకించి ఇంగ్లీషు తాత్విక, ఆర్థిక చింతనా, శుద్ధ స్కాటిష్ ప్రభావాల కన్న ఆయన్ని ఎక్కువగానే తీర్చిదిద్దాయి. ఆచరణలో ఆయన పుస్తకం అంతాకూడా, బ్రిటన్‌యొక్క, లండన్ ప్రభుత్వంయొక్క ఆర్థిక విధానంపైన ఒక నిర్దిష్టమైన (వ్యాపారవాద వ్యతిరేక) ప్రభావాన్ని బరపేందుకే ఉద్దేశింపబడింది. చివరి సంగతి, ఆయనపై పడిన మరో – ఫ్రెంచి – ప్రభావాన్ని గురించి మనం పేర్కొనవలసివుంది. మేరీ స్టువర్ట్ కాలంనుండి ఫ్రాన్సుతో సాంప్రదాయిక సంబంధాలు కలిగివున్న స్కాట్లం దులో, ఇంగ్లండులో కన్న ఫ్రెంచి సంస్కృతీ ప్రభావం ఎక్కువగా ఉంటూవచ్చింది. మాంటెస్క్యూ, వోల్టేర్‌ల రచనలతో స్మిత్‌కి బాగా పరిచయం వుంది, రూసో తొలి రచనలకూ, విజ్ఞాన సర్వస్వపు తొలి సంపుటాలకూ ఆయన మహోత్సాహంగా స్వాగతం పలికాడు.

ప్రొఫెసర్ స్మిత్

ఆడమ్ స్మిత్ 1723లో ఎడిన్‌బరో సమీపంలోని కిర్క్‌కల్డీ అనే చిన్న పట్ట ణంలో జన్మించాడు. కస్టమ్స్ శాఖోద్యోగి అయిన ఆయన తండ్రి అంతకు కొన్ని నెలల

ముందు మరణించాడు. ఆడమ్ ఆ యువ విధవరాలి ఏకైక పుత్రుడు. ఆమె తన జీవితం అంతటినీ ఆయనకే అంకితం చేసింది. ఆ కుర్రాడు అల్పిష్టిగా, రోగిష్టిగా తయారై, తన వయస్సు కుర్రాళ్లతో పాలోమంటూ ఆడుకోకుండా ఒంటరిగా పెరిగాడు. ఆ కుటుంబం అన్నవస్త్రాలకు లోటు లేకుండా, నిజమైన దార్రిద్యం అంటే ఏమిటో తెలియకుండా గడిపింది. అదృష్టవశాత్తూ కిర్క్‌కల్డీలో ఓ మంచి స్కూలు వుంది, ఓ మంచి టీచరున్నాడు. మిగిలిన అనేక స్కూళ్లలో మాదిరిగా బైబిలు భాగాలనూ, లాటిన్ వ్యాకరణ సూత్రాలనూ మాత్రమే విద్యార్థుల బుర్రల్లో కూరే విషయంలో ఆ స్కూలువాళ్లకి మూర్ఖమైన పట్టుదల లేదు. దీనికితోడు, ఆదినుంచీకూడా ఆడమ్ చుట్టూ పుస్తకాలు అందుబాటులో వుండేవి. దరిమిలా స్మిత్‌కి విశిష్టమైన ప్రత్యేక తను తెచ్చిన ప్రగాఢమైన విద్యాభ్యాసానికి పునాదులు అలా పడ్డాయి.

ప్రభువంశానికి చెందిన ట్యూర్గోకి లభించిన మాదిరి ఉజ్వలమైన విద్య — యిందుకు కారణాలు విదితమే — ఆయనకు లభించని మాట నిజమే. ప్రత్యేకించి, ఫ్రెంచి భాష నేర్పే మంచి గురువు ఆయన కెన్నడూ దొరకలేదు. ఫ్రెంచి భాషను ఆయన అనర్గళంగా చదవగలిగినా, ఆ భాషలో సక్రమంగా మాట్లాడటం ఆయనకు ఎన్నడూ రానే లేదు. 18వ శతాబ్దంలో ప్రతి విద్యావంతునికీ తప్పనిసరిగా రావలసివుండిన ప్రామాణిక భాషలను (ప్రత్యేకించి గ్రీకు భాషను), విశ్వవిద్యాలయంలో చేరేదాకా ఆయన గట్టిగా అధ్యయనం చెయ్యేవేలేదు.

స్మిత్ గ్లాస్గో విశ్వవిద్యాలయంలో చాలా చిన్న వయస్సులో, అంటే 14వ ఏట (ఆ నాటి ఆచారం ప్రకారం) చేరాడు. తర్కశాస్త్రాధ్యయనం తర్వాత (మొదటి సంవత్సరం యిది విద్యార్థులందరికీ తప్పనిసరి పాఠ్యాంశం), ఆయన నైతిక తత్వశాస్త్రాధ్యయనానికి పూనుకొని, తద్వారా హ్యూమానిటీస్‌ను ఎంచుకున్నాడు. అయితే ఆయన, గణిత, ఖగోళ శాస్త్రాలను కూడా అధ్యయనం చేశాడు. ఆయనకు యీ రంగాల్లో చివరిదాకా గణనీయమైన పరిజ్ఞానం వుండేది. 17 ఏళ్లు వచ్చేనాటికే విద్యార్థుల్లో స్మిత్‌కి పండితుడనీ, ఆయనో విలక్షణ వ్యక్తి అనీ కీర్తి వుండేది. కలకలంగా వున్న గుంపు మధ్య ఆయన దీర్ఘాలోచనలో మునిగిపోతూండేవాడు, తన చుట్టూ ఏమి జరుగుతోందన్న ప్రసక్తి లేకుండా తనలో తను మాట్లాడుకో నారంభించేవాడు. ఈ చిల్లర మల్లర వింతప్రకృతులు ఆయనకి జీవితాంతమూ వుండిపోయాయి. గ్లాస్గోనుండి పట్టభద్రుడయాక, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తన చదువును కొనసాగించేందుకు స్మిత్‌కి ఒక స్కాలర్‌షిప్ లభించింది. ఒక ధనిక జీవకారుణ్యవాది వీలునామాద్వారా కేటాయింపబడిన మొత్తంనుండి యీ స్కాలర్‌షిప్ ఆయనకి ముట్టింది. స్మిత్ దాదాపు నిరంతరాయంగా ఆరేళ్లపాటు ఆక్స్‌ఫర్డులో గడిపాడు.

అక్కడి ప్రొఫెసర్లూ, ట్యూటర్లూ విద్యార్థుల గ్రంథపఠనంపై ఓ కన్ను వేసివుంచి, స్వేచ్ఛాయుతమైన ఆలోచనను రేకెత్తించే గ్రంథాల పఠనాన్ని నిషేధిస్తూండే వారు. ఆక్స్‌ఫర్డులో స్మిత్ జీవితం ఒక దీన గాథ. తన రెండవ విశ్వవిద్యాలయాన్ని గురించి ఆయనెప్పుడూ కూడా ద్వేషభావంతో తలుచుకునేవాడు. ఆయన ఒంటరిగాడుగా వుండేవాడు, తరచు అనారోగ్యానికి గురి అవుతూండేవాడు. అప్పుడు కూడా పుస్తకాలు మాత్రమే ఆయనకి ఏకైక మిత్రాలు అయ్యాయి. స్మిత్ చదివే గ్రంథాలు అనేక విషయాలకు సంబంధించి వుండేవి. అయితే అప్పట్లో, ఆర్థిక విజ్ఞానశాస్త్ర అధ్య యనంపట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించలేదు.

1746లో ఆయన కిర్క్‌కల్డీకి వెళ్లిపోయి, అక్కడ స్వీయ అధ్యయనాన్ని రెండేళ్ల పాటు కొనసాగించాడు. ఒకమారు ఎడిన్‌బరోకి వెళ్లినప్పుడు ధనిక భూస్వామీ, పోషకుడూ అయిన హెన్రీ హోమ్ (దరిమిలా లార్డ్ కేమ్స్) పైన గాఢమైన ప్రభావాన్ని కలిగించాడు. దానితో ఆయన ఈ యువ పండితుడిచేత ఇంగ్లీషు సాహిత్యంపైన బహిరం గోపన్యాస పరంపరను యిప్పించేందుకు ఏర్పాటుచెయ్యాలని సూచించాడు. ఆ ఉపన్యా సాలు విజయవంతంగా జరగడంతో, దరిమిలా ఉపన్యాసాల విషయాంశం మార్చ బడింది. ఆ ప్రసంగాలు ప్రధానంగా సహజ హక్కుపై సాగాయి. 18వ శతాబ్దంలో యీ భావనలో న్యాయశాస్త్ర పరిజ్ఞానమే కాకుండా, రాజకీయ సిద్ధాంతాలు, సామాజిక, అర్థశాస్త్రాలు కూడా యిమిడివుండేవి. అర్థశాస్త్రంలో ప్రత్యేకాసక్తికి సంబంధించిన తొలి సూచనలు యీ దశకు చెందినవి.

1750–51 సంవత్సరాల్లో ఆయన ఆర్థిక ఉదారవాదానికి చెందిన ప్రధాన భావాలను వెల్లడిస్తున్నట్లు కనిపించాడు. 1775లో ఆయన ఒక ప్రత్యేక గమనికలో యీ భావాలు ఎడిన్‌బరోలో తానిచ్చిన ఉపన్యాసాలకు చెందినవని పేర్కొన్నాడు: “మనిషి సాధారణంగా, రాజనీతిజ్ఞులచేతా, పథకకర్తలచేతా (అంటే రాజకీయవేత్తలచేత — ఎ. ఎ.), ఒక రకమైన రాజకీయ యంత్ర విజ్ఞాన పదార్థంగా, పరిగణింపబడుతూ వుంటాడు. మానవ వ్యవహారాల్లో ప్రకృతి చేసే పనుల క్రమంలో, దాన్ని పథకకర్తలు చీకాకుపరుస్తారు; ప్రకృతి తన సొంత పథకాలను అమలుపరచేందుకు వీలుగా, దాని మానాన దాన్ని సజావుగా పనిచెయ్యనివ్వడంకన్న ఎక్కువగా మరేమీ అవసరం లేదు.... ఒక రాజ్యాన్ని అత్యంత నిమ్న ఆటవికదశనుంచి అత్యున్నత స్థాయి సంపదకు తీసుకువెళ్లా లంటే, శాంతి, తేలిక పన్నులు, భరించదగిన న్యాయ నిర్వహణ — యివి తప్ప మరేమీ అక్కర్లేదు; మిగిలినవన్నీ సహజక్రమంలో సంభవిస్తాయి. ఈ సహజక్రమాన్ని అడ్డ గించి, విషయాలను మరో గాడిలోకి మళ్లించే, లేక ఒకానొక తరుణంలో సమాజ ప్రగ తిని నిరోధించ ప్రయత్నించే ప్రభుత్వాలన్నీ అసహజమైనవి; అవి తమను తాము

బలపరచుకొనేందుకుగాను పీడించేవిగామూ, నిరంకుశమైనవిగానూ తయారుగాక తప్పదు.''*

తన ఫ్యూడల్ దుస్తులను యింకా పూర్తిగా విసర్జించని రాజ్యంపట్ల కఠినవైఖరి వహించిన 18వ శతాబ్దపు ప్రగతిశీల బూర్జువావర్గపు భాష యిది. ఈ ఖండికలో అప్పుడే స్మిత్‌కి విశిష్టమైన సాహసికమూ, శక్తివంతమూ అయిన శైలి మనకి కని పిస్తుంది. ''జాతుల సంపద''లో మహోగ్ర వ్యంగ్యంతో, ''ఎవరి సలహాలైతే వ్యవహా రాల్లో తాత్కాలికమైన ఎగుడుదిగుళ్లచేత నిర్దేశింపబడుతాయో, ఎవరైతే వెకిలిగా రాజనీతిజ్ఞుడు లేక రాజకీయవేత్త అని పిలవబడుతాడో, ఆ వంచక, జిత్తులమారి జంతువు''** అని పేర్కొన్నాడో అదే స్మిత్ ఈయన. ఇది, తన కాలపు రాజ్యంపట్ల ఒక బూర్జువా సిద్ధాంతవేత్త ప్రతికూల వైఖరిగానే కాకుండా, బ్యురాక్రసీ పట్లా, రాజకీయ కుతంత్రంపట్లా ఒక ప్రజాస్వామిక మేధావియొక్క ప్రగాఢమైన శుద్ధ ద్వేషంగా కూడా మనకి కనిపిస్తుంది.

1751లో, విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరు పదవిని స్వీకరించేందుకోసం, స్మిత్ గ్లాస్గోకి మారాడు. మొదట ఆయనకి తర్కశాస్త్ర పీఠమూ, తర్వాత నైతిక తత్వ శాస్త్ర పీఠమూ, అంటే సామాజిక విజ్ఞానశాస్త్రాల పీఠమూ లభించాయి. గ్లాస్గోలో ఆయన పదమూడేళ్లు జీవించాడు. ఆ కాలంలో ఆయన ఏటా రెండు మూడు నెలలపాటు విధిగా ఎడిన్‌బరోకి వెళ్లివస్తూండేవాడు. అదే తన జీవితంలో కెల్ల మిక్కిలి సంతోషప్రదమైన కాలమని వార్ధక్యంలో ఆయన రాశాడు. తనకు బాగా పరిచితమూ, సన్నిహితమూ అయిన వాతావరణంలో, ప్రొఫెసర్ల, విద్యార్థుల, ప్రముఖ పౌరుల గౌర వాన్ని చూరగొంటూ ఆయన అక్కడ కాలం గడిపాడు. ఎటువంటి జోక్యమూ లేకుండా ఆయన అక్కడ పనిచెయ్యగలిగాడు. విజ్ఞానశాస్త్ర రంగంలో ఆయన్నుంచి ఎంతో ఆశించబడింది. ఆయన స్నేహిత బృందాన్ని సంపాదించుకున్నాడు. క్రమంగా బ్రిటిష్ బ్రహ్మచారికీ, క్లబ్‌వాలాకీ విశిష్టమైన లక్షణాలను సంతరించుకున్నాడు. ఈ లక్ష ణాలు జీవితం పొడుగునా ఆయన్ని వెన్నంటివున్నాయి.

న్యూటన్, లైబ్నిత్స్‌ల విషయంలో మాదిరిగా, ఏ స్త్రీ స్మిత్ జీవితంలో గణనీయ మైన పాత్రను వహించలేదు. ఆయన రెండు మార్లు — ఎడిన్‌బరో, గ్లాస్గోలలో వున్న సంవత్సరాల్లో — వివాహపు అంచులదాకా వెళ్లినట్లు రూఢిపరచబడని పుకార్లు వ్నాయి; కాని, ఆ రెండు సార్లూ కూడా ఏ కారణంగానో గాని, వివాహం జరగలేదు.

---

* W. R. Scott, *Adam Smith as Student and Professor*, Glasgow, 1937, pp. 53—54నుండి ఉల్లేఖన.

** A. Smith, *The Wealth of Nations*, Vol. I, London, 1924, p. 412.

అయితే, యిది ఆయన మనశ్శాంతిని కలతపరచినట్లు కనిపించదు. కనీసం అటువంటి కలవరపాటుకు ఆయన లేఖల్లో గాని (సందర్భవశాత్తూ, అవి చాలా తక్కువ), లేక ఆయన సమకాలికుల స్మృతుల్లోగాని — ఎలాంటి చిన్నెలూ లేవు.

ఆయన జీవితం పొడుగునా ఆయన తల్లి, ఓ బంధువురాలూ — అవివాహిత స్త్రీ — ఆయన యింటిపనులు చక్కదిద్దుతూ వుండేవారు. స్మిత్ తన తల్లి కన్న కేవలం ఆరేళ్ళు, తన బంధువురాలికన్న రెండేళ్ళు మాత్రమే ఎక్కువ బతికాడు. స్మిత్ అతిథి ఒకడు అన్నట్లు స్మిత్‌ది "సిసలైన స్కాటిష్" యిల్లు. స్కాట్‌జాతీయ వంటకాలు వడ్డింపబడేవి, స్కాటిష్ ఆచార సంప్రదాయాలు పాటింపబడుతూండేవి. ఈ పరిచిత జీవిత విధానం ఆయనకి ఒక అవసరంగా తయారైంది. ఎక్కువ కాలవ్యవధులపాటు యింటిని విడిచివెళ్ళడానికి యిష్టపడక, ఆయన హడావిడిగా యింటికి ఎగేసుకువస్తూండే వాడు.

స్మిత్ "నైతిక భావోద్వేగాల సిద్ధాంతం" అన్న తన మొదటి పెద్ద శాస్త్రీయ గ్రంథాన్ని 1759లో ప్రచురించాడు. నైతిక ప్రవర్తన సూత్రాలపై రచింపబడిన యీ పుస్తకం ఆనాటికి ప్రగతిశీలమైనదీ, వికాస యుగానికీ, ఆదర్శాలకీ తగినదే అయినప్పటికీ, స్మిత్ తాత్విక, ఆర్థిక భావాల రూపధారణ క్రమంలో అదొక దశ కావడమే యీనాడు ప్రధానంగా దాని ప్రాముఖ్యం. పరలోకంలో పాపాలకు ప్రాయశ్చిత్త భయంపైనా, సుఖాలకు స్వర్గ సుఖాల వాగ్దానంపైనా ఆధారపడిన క్రిస్టియన్ నీతి సూత్రాలను ఆయన ఖండించాడు. ఆయన నీతిసూత్రాలలో, ఫ్యూడల్ వ్యతిరేక భావమైన సమానత్వం ప్రముఖస్థానాన్ని ఆక్రమిస్తుంది. మనుషులందరూ సహజంగానే సమానులు, అందుచేత నైతిక సూత్రాలు అందరికీ సమానంగా అందరికీ వర్తిస్తాయి.

అయితే స్మిత్, మానవ ప్రవర్తనయొక్క తిరుగులేని, "సహజ" నియమంనుంచీ, నీతి సూత్రావళి అన్నది మౌలికంగా ఆయా సమాజాల సామాజికార్థిక వ్యవస్థలచేత నిర్ణయింపబడుతుందన్న బాగా అస్పష్టమైన ఒకానొక అవగాహననుంచీ బయల్దేరాడు. అందుచేతనే, మతపరమైన నీతిసూత్రాలనూ, "ఆంతరిక నైతిక అనుభూతి"నీ తిరస్కరించిన స్మిత్, వాటి స్థానంలో "సానుభూతి సూత్రం" అన్న మరొక అనిర్దిష్ట సూత్రాన్ని పెడుతున్నాడు. ఇతరులకు సంబంధించి మనిషి సంవేదనలూ, చర్యలూ, తను యితరుల స్థానంలో ఉన్నానని ఊహించుకొని, వాళ్ళ పట్ల సంవేదన పొందడం ద్వారా "పరకాయ ప్రవేశం చేసే" అతని సామర్థ్యంపైన ఆధారపడి వుంటాయని వివరించేందుకు ఆయన ప్రయత్నించాడు. ఎంత తెలివిగానూ, ఒక్కొక్కసారి చతురంగానూ యీ భావం అభివృద్ధి చెయ్యబడినప్పటికీ, శాస్త్రీయమైన భౌతికవాద నీతి సూత్రాలకు యిది ప్రాతిపదిక కాజాలదు. స్మిత్ రచించిన "నైతిక భావోద్వేగాల సిద్ధాంతం"

18వ శతాబ్దాన్ని దాటి మనలేకపోయింది. అది స్మిత్ పేరును అమరం చెయ్య లేకపోయింది. అందుకు భిన్నంగా, "జాతుల సంపద" రచయితగా ఆయనకి వచ్చిన కీర్తియే ఆయన పేరును విస్మరింపబడకుండా చేసింది.

ఈలోగా, స్మిత్ శాస్త్రీయాసక్తుల దిశ, "సిద్ధాంతం" రచనా క్రమంలోనే గమనీయంగా మారిపోయింది. ఆయన అంతకంతకు అధికంగా అర్థశాస్త్రాన్ని గాఢంగా అధ్యయనం చేస్తున్నాడు. ఈ అధ్యయనాన్ని ఆయన తన యిష్టానుసారంగా మాత్రమే కాకుండా, ఆ కాలావసరాలు కూడా ఆయన్నలా చేసేందుకు ప్రోత్సహించాయి. వాణిజ్య, పారిశ్రామిక కేంద్రమైన గ్లాస్గోలో ఆర్థిక సమస్యలు ప్రత్యేక బలంతో ప్రస్ఫుటమవుతున్నాయి. గ్లాస్గోలో ఆసక్తికరమైన అర్థశాస్త్ర క్లబ్బు ఒకటి ఉండేది. అక్కడ సమావేశమైన వ్యక్తులు వర్తకం, సుంకాలను గురించీ, వేతనాలూ బ్యాంకింగులను గురించీ, భూమి కౌలు షరతులనూ వలసలను గురించీ చర్చలు జరుపుతూండేవారు. స్మిత్ త్వరలోనే ఆ క్లబ్బులోని అత్యంత ప్రముఖ సభ్యుల్లో ఒకడయాడు. హ్యూమ్‌తో ఆయన సమావేశ స్నేహాలు కూడా అర్థశాస్త్రంలో ఆయన ఆసక్తిని రేకెత్తించాయి.

గత శతాబ్దాంతంలో ఇంగ్లీషు ఆర్థికవేత్త ఎడ్విన్ కెన్నన్, స్మిత్ భావాల వికాస క్రమంపై వెలుగును ప్రసరించే ముఖ్యమైన కొంత సమాచారాన్ని ప్రచురించాడు. గ్లాస్గో విశ్వవిద్యాలయంలో స్మిత్ చేసిన ప్రసంగాలను ఒక విద్యార్థి నోట్సుగా రాశాడు. తర్వాత అవి కొంచెం సరిదిద్దబడి, తిరిగి రాయబడ్డాయి. విషయాలను బట్టి చూసినప్పుడు యీ ఉపన్యాసాలు 1762–63లో యివ్వబడినట్లు తేలింది. విద్యార్థులకు స్మిత్ యిచ్చిన ఉపన్యాసాల అంశమైన నైతిక తత్వశాస్త్ర పాఠ్యాంశాలు అప్పటికి సామాజిక, అర్థశాస్త్ర పాఠ్యాంశాలుగా మారినట్లు ఆ ప్రసంగాలను బట్టి స్పష్టమవుతుంది. గణనీయమైన పలు భౌతికవాద భావాలను ఆయన వాటిలో వ్యక్తంచేశాడు. ఉదాహరణకు: "ఆస్తి ఉన్నప్పుడు తప్ప ప్రభుత్వం ఉండజాలదు, అసలు, దాని ప్రయోజనమే సంపద సేకరణా, పేదలనుండి ధనికులను కాపాడటం."* ఈ ప్రసంగాల్లోని ఆర్థిక విభాగాల్లో, దరిమిలా "జాతుల సంపద"లో పెంపొందించబడిన భావాలను బీజరూపంలో మనం చూడగలం.

1930 దశకంలో ఆసక్తికరమైన మరొక నిధి కనుగొనబడింది: "జాతుల సంపద" మొదటి కొన్ని ప్రకరణాల చిత్తుప్రతి. బ్రిటిష్ పండితులు యీ పత్రం 1763 నాటిదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్ గ్రంథంలోని కొన్ని ముఖ్య భావాలు దానిలో కూడా వున్నాయి: శ్రమ విభజన పాత్ర, ఉత్పాదక, అనుత్పాదక శ్రమ భావన, వగై

---

* A. Smith, *Lectures on Justice, Police, Revenue and Arms*, Oxford, 1896, p. 15.

రాలు. ఈ రచనల్లో వ్యాపారవాదంపైన మిక్కిలి ఘాటైన విమర్శ, స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలమైన వాదనా కూడా వున్నాయి.

ఈవిధంగా, గ్లాస్గో వాసం చివరినాటికి అప్పుడే స్మిత్ ఆర్థిక విజ్ఞానశాస్త్ర రంగంలో ప్రగాఢమైన, మౌలికమైన చింతనాపరుడుగా పరిణతిచెందాడు. అయితే ఆయ నింకా తన ప్రధాన రచన చేసేందుకు సిద్ధంగా లేడు. ఫ్రాన్సులో ఆయన మూడేళ్ల వాసం (యువ బక్ల్యూకు ట్యూటరుగా), ఫిజియోక్రాట్లతో తన వ్యక్తిగత సమావేశం — వీటితో ఆయన సన్నాహం పూర్తయింది.

ఫ్రాన్సులో స్మిత్

పైన వర్ణింపబడిన ఘటనలకు అర్ధశతాబ్దం తర్వాత, 1765–66 సంవత్స రాల్లో స్మిత్ పారిస్ వాసాన్ని గురించి, జాన్ బాటిస్ట్ సేయ్, ముసలి డ్యుపాన్‌ని ప్రశ్నించాడు. స్మిత్, డాక్టర్ కెనే "ఆటక వాటా క్లబ్బు"కి హాజరయాడని డ్యుపాన్ జవాబిచ్చాడు. అయితే ఆయన మౌనంగా కూర్చునేవాడు, ఫిజియోక్రాట్ సమావే శాల్లో అతి తక్కువగా మాట్లాడేవాడు, కాగా, ఆయన భవిష్యత్తులో "జాతుల సంపద" రచయిత కాగలడని ఎవరూ ఊహించివుండరు. పండితుడూ, రచయితా అయిన ఎ. మొరెల్లే — స్మిత్ పారిస్‌లో ఆయనకి స్నేహితుడయాడు — స్మిత్‌ని గురించి తన స్మృతుల్లో యిలా రాశాడు: "ట్యూర్గోకి... ఆయన ప్రతిభపట్ల ఉన్నతాభిప్రాయం వుంది. మేం ఆయన్ని చాలా సార్లే చూశాం; ఆయన హెల్వెటియుస్‌కి పరిచయంచెయ్య బడ్డాడు: వాణిజ్య సిద్ధాంతం, బ్యాంకింగు, జాతీయ రుణాలను గురించీ, ఆయన రాయ తలపెట్టిన గొప్ప పుస్తకపు అనేక అంశాలను గురించీ మేము మాట్లాడుకున్నాం."* ఆయన ఉత్తరాల ద్వారా, స్మిత్, గణితశాస్త్రవేత్తా, తత్వవేత్తా అయిన డి అలం బేర్‌కీ, అజ్ఞాన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం జరిపిన బేరన్ హోల్బాహ్‌కీ స్నేహితుడయ్యాడని కూడా తెలియవచ్చింది. జెనీవా శివార్లలోని వోల్టేర్ ఎస్టేటులో, స్మిత్ వోల్టేర్‌ని కలుసుకొని, ఆయనతో అనేక సంభాషణలు జరిపాడు. వోల్టేర్‌ని మిక్కిలి గొప్ప ఫ్రెంచివాళ్లలో ఒకడుగా స్మిత్ పరిగణించాడు.

1775 నాటికే "ఎడిన్‌బరో రివ్యూ"లో స్మిత్ ఒక వ్యాసాన్ని ప్రచురించాడు;

---

* A. Morellet, *Mémoires sur le dix-huitième siècle, et sur la revolution française*, t. I, Paris, 1822, p. 244.

ఫ్రెంచి సంస్కృతికి సంబంధించి రచయితకు ఎంతటి ప్రగాఢ జ్ఞానముందో ఆ వ్యాసం తెలియజేస్తుంది. ఆయన ఉపన్యాసాలనుబట్టి, జాన్ లా భావాలను గురించీ, కార్య కలాపాలను గురించీ ఆయనకి సవివరమైన పరిజ్ఞానం వుందన్న సంగతి స్పష్టపడుతుంది. "విజ్ఞాన సర్వస్వం"లోని కెనే వ్యాసాలను ఆయన చదివినప్పటికీ, ఫిజియోక్రాట్ల రచనలతో బహుశా ఆయనకి స్వల్ప పరిచయం మాత్రమే ఉండివుంటుంది. వాళ్ళ భావాలకు సంబంధించిన పరిజ్ఞానం ఆయనకి ప్రధానంగా పారిస్‌లోనే — వ్యక్తిగత సాంగత్యం ద్వారానూ, అప్పుడే వెల్లువలా మార్కెట్లోకి ముంచుకు రానారంభించిన ఫిజియోక్రాట్ సాహిత్యం ద్వారానూ — కలిగింది.

స్మిత్ ఫ్రాన్సుకి సరైన తరుణంలో వెళ్ళాడని చెప్పవచ్చు. ఒకవంక, ఆయన అప్పటికే తగినంత పరిణతిచెందిన పండితుడు, సొంత అభిప్రాయాలు కలిగినవాడు. మరోవంక, ఆయన సిద్ధాంతం యింకా పూర్తిగా అభివృద్ధి చెయ్యబడలేదు, కెనే, ట్యూర్గో ల అభిప్రాయాలను ఆయన జీర్ణించుకోగలిగాడు.

ఫిజియోక్రాట్లపైనా, ప్రత్యేకించి ట్యూర్గో పైనా స్మిత్ ఆధారపడ్డాడన్న సమస్యకు, ఓ సొంత చరిత్ర వుంది. బూర్జువా సమాజపు ఆంతరిక అంగనిర్మాణంలోకి స్మిత్ మరింత లోతుగా చొచ్చుకు వెళ్ళాడు. ఇంగ్లీషు సంప్రదాయాన్ని అనుసరించి, ఆయన తన ఆర్థిక సిద్ధాంతానికి శ్రమ విలువ సిద్ధాంతాన్ని ప్రాతిపదికను చేసుకున్నాడు. కాగా, ఫిజియోక్రాట్లకు వాస్తవానికి విలువ సిద్ధాంతమంటూ ఏదీ లేనే లేదు. దీని మూలంగా, ఫిజియోక్రాట్లతో పోల్చినప్పుడు ఆయన ఒక ముఖ్యమైన అడుగు ముందుకు వెయ్యగలిగాడు. ఒక్క వ్యావసాయిక శ్రమ మాత్రమే కాకుండా, సమస్త ఉత్పాదక శ్రమా విలువను సృష్టిస్తుందని ఆయన రుజువుచేశాడు. సమాజపు వర్గ నిర్మాణంపట్ల ఫిజియోక్రాట్ల కన్న స్మిత్‌కి స్పష్టతరమైన అభిప్రాయం వుంది.

అయితే అదేసమయంలో, ఫిజియోక్రాట్లు స్మిత్‌కన్న మరింత ముందుకెళ్ళిన రంగాలు కొన్ని వున్నాయి. పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమాన్ని గురించిన కెనే ప్రతిభావంతమైన భావాలకు యిది ప్రత్యేకించి వర్తిస్తుంది. పెట్టుబడిదారులు స్వీయ సౌకర్యాలనూ, సుఖాలనూ, వినిమయాన్నీ విసర్జించడం ద్వారా మాత్రమే ధనసంచయనం చెయ్యగలుగుతారన్న విశ్వాసంలో స్మిత్ ఫిజియోక్రాట్లను అనుసరించాడు. కాని, ఫిజియోక్రాట్ల దృష్టిలో పారిశ్రామిక శ్రమ "అనుత్పాదకమైనది" గనుక, పెట్టుబడిదారులు "శూన్యం"నుంచి ధనసంచయనం చేస్తారని చెప్తారుగనుక, వాళ్ళకి కనీసం తార్కికమైన ప్రాతిపదిక అయినా వుంది. స్మిత్‌కి కనీసం యీ తర్కబద్ధత కూడా లేదు. అన్ని రకాల ఉత్పాదక శ్రమ సమానత్వాన్ని గురించీ, ఆర్థికంగా వాటి సమాన విలువను గురించీ ఆయన చేసిన ప్రధాన ప్రతిపాదనలో అసంగతత్వం వుంది. విలువను సృష్టించే

విషయంలో వ్యావసాయిక శ్రమ — దీనిలో ప్రకృతి మనిషితోబాటు "పనిచేస్తుంది" — ప్రాధాన్యం వహిస్తుందన్న భావాన్ని ఆయన స్పష్టంగా వదిలించుకోలేకపోయాడు.

వ్యాపారవాదులపట్ల స్మిత్ వైఖరి, ఫిజియోక్రాట్లపట్ల ఆయన వైఖరికి పూర్తిగా భిన్నమైనది. వ్యాపారవాదులను ఆయన సైద్ధాంతిక ప్రత్యర్థులుగా పరిగణించాడు. వృత్తిరీత్యా ఆయన ఎంత సంయమవంతుడైనప్పటికీ, వాళ్ల విషయంలో నిశిత విమర్శను (ఒక్కొక్కమారు మోతాదుకు మించి కూడా) ప్రయోగించకుండా ఉండలేకపోయేవాడు. మొత్తంమీద చెప్పాలంటే, ఫిజియోక్రాట్లను, ఒకే లక్ష్యానికి భిన్నమార్గంలో పురోగమిస్తున్న పొత్తుదారులుగానూ, మిత్రులుగానూ ఆయన పరిగణించాడు. "జాతుల సంపద"లో ఆయన అంతిమ నిర్ధారణ ఏమిటంటే, "అయితే యీ విధానం, దానిలో ఎన్ని లోపాలు వున్నప్పటికీ, బహుశా, అర్థశాస్త్ర విషయంపై యింతవరకు ప్రచురితమైన దానంతటికన్న వాస్తవానికి అత్యంత సన్నిహితంగా వచ్చింది."* మరో చోట ఆయన యిలా అంటాడు: "ప్రపంచంలో ఏ భాగంలోగాని, అది ఎన్నడూ ఎటువంటి నష్టమూ యింతకు ముందు చెయ్యలేదు, బహుశా యికముందెన్నడూ చెయ్యదుకూడా."

చివరి వ్యాఖ్యను ఓ జోక్‌గా తీసుకోవచ్చు. ఆడమ్ స్మిత్, ఉద్వేగరహితమైన గాంభీర్యాన్ని నిలుపుకొంటూనే, కనిపించీ కనిపించనట్లుగా జోక్‌లు విసురుతూవుంటాడు. ఆయన జీవితంలో కూడా యిలాగే వున్నాడనడం స్పష్టం. గ్లాస్గో విశ్వవిద్యాలయంలో ఓ రోజున అధికారికమైన విందొకటి జరుగుతోంది. లండనునుంచి వచ్చిన ఒక వ్యక్తి ఆయన పక్కన కూర్చున్నాడు. అక్కడ అందరూ కూడా ఒక వ్యక్తిపట్ల — ఆయనకి తెలివితేటలు పుష్కలంగా లేవన్న విషయం స్పష్టం — ఎక్కువ గౌరవం ప్రదర్శించడాన్ని చూసి, ఏమిటి సంగతి అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. స్మిత్ యిలా జవాబిచ్చాడు: "ఆ విషయం మా అందరికీ స్పష్టంగా తెలుసు, కాని, మా కళాశాలలో ఆయన ఏకైక లార్డు." ఆయన పక్కన కూర్చున్న వ్యక్తి యిది జోక్ అవునో కాదో చెప్పలేకపోయాడు.

స్మిత్ పుస్తకంలో ఫ్రాన్సు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఫిజియోక్రాట్లతో సంబంధించిన భావాల్లోనే కాకుండా, అనేక భిన్నభిన్న వ్యాఖ్యలలోనూ (వ్యక్తిగతమైన వాటితో సహా), ఉదాహరణలలోనూ, దృష్టాంతాలలోనూ మనకి కనిపిస్తుంది. ఈ సమాచారం అంతటి సాధారణ ధోరణీ విమర్శనాత్మకంగా వుంటుంది. స్మిత్ దృష్టిలో ఫ్రాన్సు — దాని ఫ్యూడల్, నిరంకుశ వ్యవస్థతో, బూర్జువా అభివృద్ధిపై సంకెళ్లతోనూ — అస్తిత్వంలో వున్న వ్యవస్థలకూ ఆదర్శవంతమైన "సహజ వ్యవస్థ"కూ మధ్యగల వైరుధ్యానికి విస్పష్టమైన ఒక ఉదాహరణ. ఇంగ్లండులో ప్రతిదీ నిర్దుష్టంగా వుందని చెప్పేందుకు

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. III, London, 1924, p. 172.

వీల్లేదు, కాని, దాని వ్యవస్థ – దాని వ్యక్తి, ఆలోచనా స్వేచ్ఛలతోనూ, అన్నింటికన్న ముఖ్యంగా కృషి స్వేచ్ఛతోనూ – "సహజ వ్యవస్థ"కు చాలా సన్నిహితంగా వచ్చింది.

ఫ్రాన్సులో ఆయన గడిపిన మూడేళ్లకూ స్మిత్ వ్యక్తిగత జీవితంలో ఎలాంటి పాత్ర వుంది? మొదటి సంగతి, ఆయన ఆర్థిక పరిస్థితి బాగా మెరుగైంది. డ్యూక్ ఆఫ్ బక్లూ్య తలిదండ్రులతో చేసుకున్న ఒప్పందంద్వారా, ఫ్రాన్సులో వున్న మూడేళ్ల పాటే కాకుండా, ఆయన జీవిత కాలమంతా పెన్షనుగా ఏటా ఆయనకి మూడు వందల పౌనులు చెల్లింపబడాలి. దీనితో తదుపరి సంవత్సరాలను స్మిత్ తనీగా తన పుస్తక రచనకు వినియోగించగలిగాడు, ఆయన గ్లాస్గో విశ్వవిద్యాలయానికి తిరిగి వెళ్లలేదు. రెండవ సంగతి, ఆయన సమకాలికులందరికీ ఆయన స్వభావంలో ఒక మార్పు కనిపించింది: ఆయన మరింత క్రమశిక్షణాయుతుడూ, సమర్థుడూ, శక్త్యుత్సాహాలు కలిగిన వాడూ అయ్యాడు. తన పైవారితోబాటు, భిన్నభిన్న వ్యక్తులతో వ్యవహరించే నేర్పును సంతరించుకున్నాడు. అయితే, సామాజికంగా ఆయనెన్నడూ హుందా వైఖరిని సంతరించుకోలేదు, తనకు పరిచితులైన వారిలోని అత్యధిక సంఖ్యాకుల దృష్టిలో ఒక మాదిరి విద్వాంసప్రకృతి కలవాడుగానూ, పరధ్యానపు ప్రొఫెసరుగానే నిలిచిపోయాడు. ఆయన పరధ్యానాన్ని గూర్చిన పుకార్లు ఆయన కీర్తితోబాటే వేగంగా పెరిగి, వీధిమానిసి దృష్టిలో ఆ పరధ్యానం ఆయన కీర్తిలో ఒక భాగమైపోయింది.

"ఆర్థిక మానవుడు"

స్మిత్ పారిస్‌లో సుమారు ఒక సంవత్సరం – 1765 డిసెంబరునుండి 1766 అక్టోబరుదాకా – గడిపాడు. పారిస్ ఉన్నత సమాజపు సమావేశ కేంద్రాల్లో గతమూడేళ్లుగా హ్యూమ్ ఆక్రమిస్తున్న స్థానాన్నిగాని, పదేళ్లుగా ఫ్రాంక్లిన్ ఆక్రమిస్తున్న స్థానాన్నిగాని స్మిత్ ఆక్రమించలేకపోయాడు. సమాజంలో రాణించేందుకు అవసరమైన లక్షణాలు స్మిత్‌లో లేవు, యీ సంగతి ఆయనకి తెలుసు.

స్మిత్‌కి సంబంధించి, హెల్వెటియున్‌తో పరిచయ లాభం, ప్రత్యేక ప్రాముఖ్యం కలిగినది. హెల్వెటియున్ విశేషమైన వ్యక్తిగత ఆకర్షణశక్తీ, ఉజ్వల మేధాశక్తీ కలవాడు. తన తత్వశాస్త్రంలో, నీతి సూత్రాలను మత, ఫ్యూడల్ శృంఖలాలనుంచి విముక్తంచేసేందుకు హెల్వెటియస్ ప్రయత్నించాడు. స్వార్థం అన్నది సహజమైన ఒక మానవ గుణమనీ, సామాజిక ప్రగతిలో అదొక అంశమనీ ఆయన ప్రకటించాడు. ఆ నూతన, ప్రధానంగా బూర్జువా నీతిశాస్త్రం, ప్రతి ఒక్కడూ సహజంగానే తన సొంత లాభం కోసం

కృషి చేస్తాడన్న, యితర వ్యక్తులయొక్క యిదే మాదిరి కృషిచేత మాత్రమే యిది పరిమితమొనర్చబడుతుందన్న అంచనాతో ముందుకు సాగుతుంది. సమాజంలో స్వప్రయోజనవు పాత్రను ప్రకృతిలోని గురుత్వాకర్షణ శక్తి పాత్రతో ఆయన సరిపోల్చాడు. ఇది సహజ సమానత్వ భావంతో సంబంధితమైనది: ప్రతి ఒక్కడికీ, అతని పుట్టుకతోనూ, స్థానంతోనూ ప్రసక్తి లేకుండా, తన సొంత లాభాన్ని ఆర్జించుకునే సమాన హక్కు కల్పింపబడాలి, తద్వారా, యావత్తు సమాజమూ లబ్ధి పొందుతుంది.

స్మిత్ యీ భావాలను అభివృద్ధిచేసి, వాటిని అర్థశాస్త్రానికి అన్వయించాడు. మానవ స్వభావం, మానవునికీ సమాజానికీ మధ్య సంబంధం — వీటికి సంబంధించిన ఆయన దృక్పథమే సాంప్రదాయిక అర్థశాస్త్ర దృక్పథానికి మూలంలో వున్నది. Homo oeconomicus (ఆర్థిక మానవుడు) అనే భావన మరికొంచెం తర్వాత తలెత్తింది, అయితే ఆ భావప్రష్టలు స్మిత్‌పైన ఆధారపడే దాన్ని కల్పించారు. "జాతుల సంపద"నుంచి బహుశా అతి తరచుగా ఉల్లేఖింపబడే ఖండిక బహుశా "అదృశ్యహస్తం" గూర్చినదే.

స్మిత్ తర్కధోరణి సుమారుగా యిలా సాగుతుంది. మనిషి ఆర్థిక కార్యకలాపాల వెనకవుండే ప్రధాన ప్రేరక శక్తి స్వప్రయోజనం. అయితే, యితరులకు సేవలు చెయ్యడం ద్వారాను, తన శ్రమనూ, తన శ్రమోత్పాదితాలనూ యితరులకు మారకం చెయ్యజూపడం ద్వారానూ మాత్రమే, మనిషి తన యీ ప్రయోజనాన్ని సాధించుకొన ప్రయత్నించగలడు. ఈవిధంగా శ్రమ విభజన అభివృద్ధిచెందుతుంది. మనుషుల్లో ప్రతి ఒక్కడూ స్వార్థపరుడే అయినప్పటికీ, తన స్వప్రయోజనాలపట్ల మాత్రమే శ్రద్ధ చూపించినప్పటికీ, జనం ఒకరికొకరు సహాయం చేసుకొంటూ, ఆ క్రమంలో సమాజాభివృద్ధికి కూడా దోహదంచేస్తారు. తన ఆర్థిక పరిస్థితిని మెరుగొనర్చుకునేందుకు సహజంగా మానవుడు చేసే కృషి ఎంతటి బలీయమైన ప్రేరకశక్తి అంటే, దాన్ని స్వేచ్ఛగా సాగనిచ్చినట్లయితే, సమాజాన్ని సౌభాగ్యదశకు నడపగలిగే సామర్థ్యం దానికి ఉంటుంది. అంతేకాకుండా, రష్యాలో సామెతగా చెప్పుకునేట్లు "ప్రకృతిని ద్వారం గుండా యింట్లోంచి తరిమేస్తే, అది కిటికీ గుండా లోపలికి ప్రవేశిస్తుంది": "మానవ చట్టాల మూర్ఖత్వం అతి తరచుగా తన చర్యలకు వందలాది ఏ అసంబద్ధ ఆటంకాలతోనైతే బందాలువేస్తూ వుంటుందో, వాటిని అధిగమించగల"* సామర్థ్యం సైతం యీ ప్రేరక శక్తికి వుంటుంది. ఏదైతే మానవుని "సహజ స్వేచ్ఛ"నూ, కొనే, అమ్మే, కౌలుకిచ్చే, అద్దెకిచ్చే, ఉత్పత్తిచేసే, వినియోగించుకొనే స్వేచ్ఛనూ నిరోధిస్తుందో ఆ వ్యాపారవాదం పైన స్మిత్ యిక్కడ దాడిచేస్తున్నాడు.

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. II, London, 1924, p. 40.

ప్రతివ్యక్తీ తన పెట్టుబడిని (స్మిత్ ప్రధానంగా పెట్టుబడిదారుని గురించే మాట్లాడుతున్నాడుగాని కేవలం మొత్తంమీద మనిషిని గురించి కాదని మనం చూడగలం)—దాని ఉత్పాదితానికి అత్యధికమైన విలువ వుండేలా—ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తాడు. మామూలుగా అలా చేసేటప్పుడు, అతను ప్రజల మేలును గురించిగాని, దాన్ని తను ఏ మేరకు ముందుకు తీసుకు వెళ్తున్నానని గాని ఆలోచించడు. అతని దృష్టిలో అతని స్వలాభం మాత్రమే వుంటుంది, కాని "ఒక అదృశ్య హస్తంచేత (వక్కాణింపు నాది—ఎ. ఎ.) ఒక లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేలా—అది అతని సంకల్పంలో భాగం కాదు—నడపబడుతాడు.... తన స్వప్రయోజనార్థం కృషిచేస్తూ, అతను తరచుగా సమాజ ప్రయోజనాన్ని ముందుకు తీసుకువెళ్తాడు. తను నిజంగా ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించినప్పటికన్న మరింత శక్తివంతంగా ముందుకు తీసుకువెళ్తాడు."*

సద్యోజనితంగా పనిచేసే వస్తుపరమైన ఆర్థిక నియమాలే ఆ "అదృశ్య హస్తం." ఈ నియమాలు, మానవ యిచ్ఛకు అతీతంగానూ, తరచు దానికి భిన్నంగానూ పనిచేస్తాయి. అటువంటి రూపంలో ఆర్థిక నియమాల భావనను ఆర్థిక విజ్ఞాన శాస్త్రంలో ప్రవేశపెట్టడంద్వారా స్మిత్ ముఖ్యమైన ఒక ముందడుగు వేశాడు. అర్థ శాస్త్రాన్ని ఆయన ఒక శాస్త్రీయమైన ప్రాతిపదికపైన పెట్టాడు. ఏ పరిస్థితుల్లోనైతే స్వప్రయోజనమూ, ఆర్థికాభివృద్ధియొక్క సద్యోజనిత నియమాలూ అత్యంత శక్తివంతంగా పనిచేస్తాయో ఆ పరిస్థితులనే స్మిత్ "సహజ వ్యవస్థ" అన్నాడు. స్మిత్ దృష్టిలోనూ, తదుపరి తరాలకు చెందిన అర్థశాస్త్రజ్ఞుల దృష్టిలోనూ యీ భావనకు భిన్నార్థాలు వున్నాయి. ఒకవంక అది, ఆర్థిక విధాన సూత్రమూ, గమ్యమూ, అంటే, స్వేచ్ఛా వాణిజ్య విధానం (తర్వాత చూడండి), మరోవంక, అదొక సైద్ధాంతిక నిర్మాణం, ఆర్థిక వాస్తవాన్ని అధ్యయనం చేసేందుకు ఒక "నమూనా."

భౌతికశాస్త్రంలో, శుద్ధ వాయువుకూ, శుద్ధ ద్రవానికీ సంబంధించిన అనిర్దిష్ట భావనలు జ్ఞాన సాధనకొక సౌకర్యవంతమైన పద్ధతిగా వినియోగించబడుతాయి. నిజమైన వాయువులూ, ద్రవాలూ "ఆదర్శవంతం"గా ప్రవర్తించవు, లేక కొన్ని పరిస్థితుల్లో మాత్రమే అలా ప్రవర్తిస్తాయి. అయితే, విషయాలను "వాటి శుద్ధ రూపంలో" అధ్యయనం చేసేందుకుగాను, యీ వ్యత్రిక్రమాలను పట్టించుకోకుండా అలక్ష్యం చెయ్యడం అవసరం. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో, "ఆర్థిక మానవుడు," స్వేచ్ఛాయుత పోటీ అన్న అనిర్దిష్ట సాధారణీకరణ కొంతవరకు యిలాంటిదే. పెట్టుబడిదారీ విధానం కింద సంపూర్ణమైన స్వేచ్ఛాయుత పోటీ యింతకు ముందెన్నడూ లేదో, యిక ముందు

---

* పూర్వోక్త గ్రంథం, Vol. I, p. 400.

కూడా ఎలా వుండజాలదో, అలాగే నిజమైన మానవుణ్ణి స్వప్రయోజనానికి దిగజార్చడం కూడా సాధ్యం కాదు; అయితే, అత్యంత సంక్లిష్ట, వైవిధ్యపూరిత వాస్తవాన్ని సరళీకృతం చేసి, నమూనాను చేసి దానిలోని అతి ముఖ్యమైన లక్షణాలను వేగిరపరచే కొన్ని ఊహలను చేయకపోయినట్లయితే, ఆర్థిక విజ్ఞానశాస్త్రం సామూహిక ఆర్థిక విషయాలను అధ్యయనం చెయ్యజాలదు. ఈ దృష్ట్యా "ఆర్థిక మానవుడు," "స్వేచ్ఛాయుత పోటీ" అన్న సాధారణీకరణ పూర్తిగా సమంజసం, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో అది ముఖ్యమైన పాత్రను వహించింది. ప్రత్యేకించి, 18వ, 19వ శతాబ్దాల పెట్టుబడిదారీ విధానానికి అది అనురూపమైనది.

మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతంనుంచి రెండు ఉదాహరణలను ఉల్లేఖిద్దాం.

వ్యక్తిగత ఆస్తిపై ఆధారపడిన సరుకుల ఆర్థిక వ్యవస్థలో విలువ నియమం, ఉత్పత్తి యొక్క ఒక సద్యోజనితమైన నియంత్రణశక్తిగానూ, చోదక శక్తిగానూ పని చేస్తుంది. ఉదాహరణకు, సాంకేతికంగా ఏ కొత్త మార్పునో ప్రవేశపెట్టడం ద్వారా, ఒకానొక సరుకు ఉత్పత్తిదారు ప్రతి ఒక సరుకు యూనిట్‌పైనా వినియోగించే శ్రమ కాలపు వ్యయాన్ని తగ్గించుకున్నప్పుడు, ఆ సరుకు విడి విలువ పడిపోతుంది. కాని, అన్ని విషయాలూ అదేవిధిరిగా వుంటే, సగటు సామాజిక శ్రమకాల వ్యయంచేత నిర్ణయింపబడే సామాజిక విలువ మారదు. మన నిపుణ సరుకు ఉత్పత్తిదారు తన సరుకు యొక్క ప్రతి యూనిట్‌నూ దాని పాత ధరకు – సూత్రరీత్యా అది సామాజిక విలువ చేత నిర్ణయింపబడుతుంది – అమ్మి, అదనపు ఆదాయాన్ని పొందుతాడు. ఎందుకంటే, మాటవరుసకు, ఒక పనిదినంలో, మిగిలిన ఏ ఒక ఉత్పత్తిదారుకన్న అతను, ఆ సరుకు యూనిట్లను 25 శాతం అధికంగా ఉత్పత్తి చేస్తున్నాడు. పోటీచేసే సరుకు ఉత్పత్తి దారులు కొత్త సాంకేతిక పద్ధతులను అనుకరించేందుకు ప్రయత్నిస్తారని వేరే చెప్పనక్కర్లేదు. "సాంకేతిక ప్రగతిని ప్రేరేపించే" యంత్రాంగపు తొలి సూత్రం యిది. పైన పేర్కొనబడిన అయత్నకృత అంశాలు – యివి మానవేచ్ఛకు అతీతమైనవి – పని చెయ్యడం, సరుకు యూనిట్‌కి సామాజికంగా అవసరమైన శ్రమవ్యయంలో ఒక కోతనూ, సామాజిక విలువలో పతనాన్నీ సాధిస్తుంది. సరుకు ఉత్పత్తిదారు యిక్కడ ఒక "ఆర్థిక మానవుడు"గా వ్యవహరిస్తున్నాడన్న విషయాన్నీ, తన రాబడిని సాధ్యమైనంత ఎక్కువ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్న విషయాన్నీ, ఏ పరిస్థితుల్లో యిది సంభవిస్తోందో, ఆ పరిస్థితులు స్వేచ్ఛాయుత పోటీకి సంబంధించినవనీ తేలికగా గమనించవచ్చు.

మరో ఉదాహరణ – స్వేచ్ఛాయుత పోటీ పెట్టుబడిదారీ విధానం కింద లాభపు సగటురేటు రూపధారణ. ఏ సుదీర్ఘ దశలోనైనా వర్తకపు భిన్న శాఖల్లో లాభపురేటు గణనీయంగా భిన్నంగా వుండటం అన్నది ఊహాతీత విషయం. లాభపు రేటును సమానం చెయ్యడమన్నది ఒక వస్తుపరమైన ఆవశ్యకత. ఈ సమానీకరణను సాధ్యంచేసే యంత్రాంగం

ఏమిటంటే, వివిధ శాఖల మధ్య పోటీ, నిమ్న లాభపురేటు కలిగిన శాఖలనుండి, ఉన్నత లాభపురేటు కలిగిన శాఖలకు పెట్టుబడి ప్రవాహమూ. ఇక్కడ మళ్లీ పెట్టుబడిదారు ఒక్క కోణంనుంచే — లాభం కోసం కృషికి మూర్తీ భావం మాదిరిగా — దర్శనమిస్తాడు. ప్రతిబంధకంలేని పెట్టుబడి ప్రవాహావశ్యకతను గూర్చిన షరతు, స్వేచ్ఛాయుత పోటీని గూర్చిన షరతు వంటిదే. వాస్తవంలో పెట్టుబడియొక్క ధారాళమైన ప్రవాహాన్ని నిరోధించే అంశాలు ఎప్పుడూ ఉండనే వున్నాయి, మార్క్సుకి వాటిని గురించి బాగా తెలును. అయితే, నమూనాను "దాని ఆదర్శ రూపంలో" పరిశీలించిన తర్వాత మాత్రమే, దానిలోకి యీ అంశాలను ప్రవేశపెట్టాలి.

మార్క్స్ అన్నట్లు, పెట్టుబడి మూర్తీ భావమే పెట్టుబడిదారు. మరోవిధంగా చెప్పాలంటే, అర్థశాస్త్రానికి ఒక విడి పెట్టుబడిదారు వ్యక్తిగత గుణాల ప్రాముఖ్యం వుండజాలదు. పెట్టుబడిదారు పెట్టుబడియొక్క సామాజిక సంబంధాలను వ్యక్తంచేస్తాడు కనుకనూ, వ్యక్తంచేసేమేరకూ మాత్రమే అతనిపట్ల అర్థశాస్త్రానికి ఆసక్తి. ఇక్కడ స్మిత్ భావాలతో వున్న ఒకరకమైన సంబంధాన్ని మనం చూడవచ్చు. అయితే, నిర్ధారణ మాత్రం పూర్తిగా భిన్నమైనది. స్మిత్ దృష్టిలో, పెట్టుబడిదారు తన స్వప్రయోజనాన్ని సాధించుకోవడం ద్వారా, తనకు తెలియకుండానే పెట్టుబడిదారీ విధానాన్ని బలపరుస్తున్నాడు. మార్క్స్ దృష్టిలో, చాలవరకు అదేవిధంగా వ్యవహరించడం ద్వారా, పెట్టుబడిదారు పెట్టుబడిదారీ విధానపు ఉత్పాదక శక్తులను అభివృద్ధిచెయ్యడమే కాకుండా, వస్తుపరంగా దాని పతనాన్ని కూడా సన్నిహితం చేస్తున్నాడు. దీనితో సంబంధం కలిగిన మరో మౌలిక భేదం కూడా వుంది. మానవుణ్ణి చారిత్రక భౌతికవాద దృక్పథంనుంచి, సుదీర్ఘ చారిత్రకాభివృద్ధి ఉత్పాదితంగా, మార్క్స్ పరిశీలిస్తాడు. ఈ మానవుడు, అర్థశాస్త్ర విషయంగా, ఒకానొక నిర్దిష్ట వర్గసమాజ చట్రంలో మాత్రమే ఉంటాడు, దాని నియమాల ప్రకారం వ్యవహరిస్తాడు. అయితే స్మిత్ దృష్టిలో, యీ "ఆర్థిక మానవుడు" శాశ్వత, సహజ మానవ స్వభావ వ్యక్తీకరణ. అతను అభివృద్ధి ఉత్పాదితం కాదు, పైగా దాని వ్యతిక్రమం. మానవ స్వభావానికి సంబంధించి తనకాలపు ప్రముఖ చింతనాపరులూ, ప్రత్యేకించి హెల్వెటియసూ కలిగియున్న యీ చారిత్రకేతర, తత్పర్యవసానంగా పొరపాటు భావనలో స్మిత్ పాలుపంచుకున్నాడు.

"ఆర్థిక మానవుడు" అన్న భావనతో బ్రహ్మాండమైన సైద్ధాంతిక, ఆచరణాత్మక ప్రాముఖ్యం కలిగిన ఒక ప్రశ్నను — మానవ ఆర్థిక కార్యకలాపాల చోదక శక్తులను గూర్చిన, ప్రేరకశక్తులను గూర్చిన సమస్యను — స్మిత్ లేవనెత్తాడు. ఆయన "సహజ" మానవుడు బూర్జువా సమాజపు వాస్తవిక మానవుణ్ణి కప్పిపుచ్చాడన్న సంగతిని మనం గుర్తులో ఉంచుకున్నట్లయితే, తన కాలానికి ఆయన ఫలవంతమైన, ప్రగాఢమైన జవాబు యిచ్చాడు.

సోషలిజం, ఒక శాస్త్రీయ సిద్ధాంతంనుండి సామాజిక – ఆర్థిక వాస్తవంగా మారినప్పుడు, అది కూడా చోదకాలు, ప్రేరకాల సమస్యను ఎదుర్కొంది. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం కావడంతోనూ, ఒక మనిషి వేరొక మనిషిని దోచుకోవడం అన్నది పూర్తిగా రద్దుకావడంతోనూ, మానవ ఆర్థిక కార్యకలాపాలకు బూర్జువా ప్రేరకాలు కూడా అదృశ్యమయాయి.

అంతిమ విశ్లేషణలో, ధనికులు కావాలన్న మనుషుల గాఢ వాంఛయే పెట్టుబడిదారీ ఉత్పత్తిని నడుపుతుందని ఆడమ్ స్మిత్ అన్నాడు. అయితే, ధనికులు కావాలన్న మనుషుల గాఢ వాంఛ స్థానాన్ని ఏ ప్రేరణలు ఆక్రమించాయి? అవి పట్టినే సోషలిస్టు చైతన్యమూ, శ్రమోత్సాహమూ, దేశభక్తినా? ఎందుకంటే, పెట్టుబడిదారులు లేరు, ఫ్యాక్టరీలూ, పొలాలూ ప్రజలకు చెందుతాయి, జనం తమకోసం తామే పనిచేసుకుంటున్నారు....

ఔను, శ్రమకీ, కార్యకలాపాలకీ సోషలిజం శక్తివంతమైన, కొత్త ప్రేరకాలను కల్పిస్తుంది. ఇదే పెట్టుబడిదారీ విధానంపైన దానికిగల అనుకూల స్థితి. అయితే, యీ ప్రేరకాలు, సమాజపు సోషలిస్టు పరివర్తనలోనూ, ప్రజల, వారి మనస్తత్వం, నీతి నియమాలు, చైతన్యాల పరివర్తనతోనూ ఉత్పన్నమవుతాయేగాని శూన్యంలోంచి ఊడిపడవు. శ్రమనుబట్టి పంపిణీ సూత్రం అమలుజరిగే సమాజంలో, పాదార్థిక ప్రయోజనం సహేతుకంగానే శ్రమకి అత్యంత ముఖ్యమైన ప్రేరకం అవుతుంది. లెనిన్ భావాల ప్రాతిపదికపైన రూపొందింపబడిన వ్యయలేఖన సూత్రాలు సోషలిస్టు మేనేజిమెంటు యొక్క ప్రధాన పద్ధతి అయాయి. సోవియట్ యూనియనులో యిటీవలి సంవత్సరాల్లో అమలుజరపబడిన ఆర్థికసంస్కరణ, అభివృద్ధిచెందిన సోషలిస్టు సమాజపు కొత్త పరిస్థితుల్లో, యీ సూత్రాలను అభివృద్ధిచేసి, ప్రగాఢంచేస్తుంది.

Laissez faire *

Laissez faire విధానం, లేక స్మిత్ అన్నట్లు సహజ స్వేచ్ఛ అన్నది మానవుడిపైనా, సమాజంపైనా ఆయన అభిప్రాయాలనుండి నేరుగా ఉత్పన్నమవుతుంది. ప్రతి ఒక్కడి ఆర్థిక కార్యకలాపాలూ చివరకు సమాజపు మంచికి దారితీసినట్లయితే, యీ కార్యకలాపాలు ఏవిధంగానూ నిరోధింపబడరాదనడం స్పష్టం.

సరుకులు, డబ్బు, పెట్టుబడి, శ్రమ స్వేచ్ఛగా వర్తించే అవకాశాన్ని కల్పించిన

* దీనికి 107వ పేజిలో వివరణ చూడండి.

ట్లయితే, సమాజపు వనరులు సాధ్యమైనంత మిక్కిలి హేతుబద్ధమైన పద్ధతిలో వినియోగింపబడుతాయని స్మిత్ భావించాడు. స్వేచ్ఛా పోటీ భావమే ఆయన ఆర్థిక సిద్ధాంతానికి ఆదీ, అంతమూ కూడా. "జాతుల సంపద"లో పూసల్లో దారంలాగ చివరికంటా పాగే భావం యిదే. స్మిత్ యీ సూత్రాన్ని డాక్టర్లకు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లకు, చివరకు... మతబోధకులకు సైతం వర్తింపజేశాడు. అన్ని ఆంతస్తులకూ, తెగలకూ చెందిన మతబోధకులందరికీ తమతో తాము స్వేచ్ఛగా పోటీచేసుకునే హక్కును కల్పించినట్లయితే, ఏ ఒక్క గ్రూపుకీ ప్రత్యేక సౌకర్యాలు కల్పింపబడకపోయినట్లయితే, లేక గుత్తాధిపత్యం కల్పింపబడకపోయినట్లయితే, వాళ్ళ అత్యంత హానిరహితులుగా వుంటారు (వాళ్లనుండి ఎవరైనా ఆశించగల అత్యున్నత విషయం యిదేనని ఆయన సూచిస్తాడు).

Laissez faire సూత్రాన్ని కనిపెట్టడం మాత్రమే కాదు, దాన్ని ఎంతో సుసంబద్ధంగానూ, క్రమబద్ధంగానూ నిరూపించడమే స్మిత్ విజయం. ఈ సూత్రం ఫ్రాన్సులో పుట్టినప్పటికీ, దాన్ని దాని సహేతుక గమ్యానికి అభివృద్ధిచేసి, దాన్ని ఆర్థిక సిద్ధాంత ప్రాతిపదికను చెయ్యడానికి ఒక బ్రిటిషరు అవసరమయ్యాడు. ప్రపంచంలో మిక్కిలి అభివృద్ధిచెందిన ఇంగ్లండు, అప్పటికే వస్తుపరంగా స్వేచ్ఛా వాణిజ్యంలో ఆసక్తి కలిగివుంది. ఫిజియోక్రాట్లపట్ల ఫ్రాన్సులో ఏర్పడిన ఫేషను చాలవరకు విజ్ఞానవంతులైన ఉదారవాద ప్రభువుల మోజు మాత్రమే, అది త్వరలోనే సన్నగిలిపోయింది. తద్భిన్నంగా ఇంగ్లండులో స్మిత్‌పట్ల "ఫేషను" బూర్జువావర్గపు బూర్జువాకృత ప్రభువర్గపు సిద్ధాంతంగా మారింది. తదుపరి శతాబ్ద కాలం అంతటిలోనూ, కొంత మేరకు స్మిత్ పథకపు అమలే ఇంగ్లీషు ప్రభుత్వపు ఆర్థిక విధానం అయింది.

ఈ దిశగా మొదటి చర్యలు స్మిత్ యింకా బతికివుండగానే తీసుకోబడ్డాయి. ఈ సందర్భంగా తమాషా కథ ఒకటుంది, తన జీవితపు చివరిదశలో స్మిత్ ప్రసిద్ధుడయాడు. 1787లో లండనుకి వెళ్లినప్పుడు ఆయనొక పెద్ద ప్రభువు యింటికి వెళ్లాడు. డ్రాయింగ్ రూములో, ప్రధాన మంత్రి విలియం పిట్‌తోబాటు, చాలమంది అతిథులు వున్నారు. స్మిత్ లోపలకు ప్రవేశించగానే అందరూ లేచి నిలబడ్డారు. ప్రొఫెసరుగా తన అలవాటుకొద్దీ, స్మిత్ చెయ్యెత్తి, "పెద్ద మనుషులారా, కూర్చోండి" అన్నాడు. పిట్ యిలా జవాబిచ్చాడు: "అబ్బే, ముందు మీరు కూర్చునేదాకా మేము నిలబడే వుంటాం, మేమందరం మీ శిష్యులం." బహుశా యిది కేవలం కట్టు కథే కావచ్చు. కాని యిది సంభావ్యమైనదే. వర్తక రంగంలో పిట్ పరంపరగా అనేక చర్యలను జారీ చేశాడు, అవన్నీ "జాతుల సంపద"లోని భావాలకు అనుగుణమైనవే.

స్మిత్ తన పథకాన్ని అంశం తర్వాత అంశంగా ఎక్కడా కూడా పొందుపరచలేదు. ఆచరణలో laissez faireపట్ల ఆయన అవగాహన యిలా వున్నట్లు తెలుస్తుంది.

మొదటి విషయం, ఆధునిక పదబంధాన్ని వాడాలంటే, శ్రమ చలనాన్ని నిరోధించే చర్యలన్నింటినీ రద్దుచెయ్యాలని ఆయన డిమాండు చేశాడు. అన్నిటికన్న ముఖ్యంగా, నిర్బంధ అప్రెంటిస్ విధానం, సెటిల్‌మెంటు చట్టాల వంటి ఫ్యూడల్ అవశేషాలకు యిది వర్తిస్తుంది. వాస్తవంలో యీ డిమాండు లక్ష్యం, పెట్టుబడిదారులకు ఆచరణాత్మకమైన స్వేచ్ఛను కల్పించడమేననడం స్పష్టం. అయితే, స్మిత్ ఏ కాలంలో తన రచన చేస్తున్నాడన్న విషయాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి: బ్రిటిష్ కార్మికవర్గం అప్పటికింకా, పెట్టుబడిదారీ విధానం మూలంగా కాక, అది తగినంతగా అభివృద్ధి చెందని మూలంగానే బాధపడుతోంది. తత్పర్యవసానంగా స్మిత్ డిమాండు ప్రగతిశీలమైనదే గాక, మానవతాపూర్ణమైనది కూడా.

రెండవ విషయం, స్మిత్ భూమి విషయంలో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రచారం చేశాడు. పెద్ద ఎస్టేట్లను కలిగివుండటాన్ని ఆయన వ్యతిరేకించి, వారసత్వంగా లభించిన భూముల పంపకాన్ని నిషేధించే జ్యేష్ఠపుత్ర భూస్వామ్య హక్కు శాసనం రద్దు చెయ్యబడాలని ప్రతిపాదించాడు. ఆర్థికంగా అత్యంత లాభదాయకంగా ఉపయోగించగలిగిన, లేక దాన్ని చలామణీలో పెట్టేందుకు అభిముఖులైనవారి చేతిలో భూమి వుండాలని ఆయన వాంఛించాడు. ఇదంతా, వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి దిశగా ఉన్ముఖమైంది.

మూడవ విషయం, పరిశ్రమలు, దేశీయ వర్తకాలపై ప్రభుత్వ నియంత్రణ అవశేషాలను రద్దుచెయ్యాలని స్మిత్ ప్రతిపాదించాడు. దేశీయ మార్కెట్లో కొన్ని సరుకుల అమ్మకంపై విధింపబడే ఎక్సైజు సుంకం బడ్జెట్ ఆదాయం కోసమే విధింపబడాలిగాని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేందుకు ప్రవేశపెట్టబడరాదు. దేశంలోపల సరుకుల చలనానికి ఇంగ్లండులో యిక ఎంతమాత్రమూ ఎటువంటి పన్నులూ లేవు. అయితే, స్మిత్ విమర్శ అప్పట్లో ఫ్రాన్సు విషయంలో మరింత శక్తివంతంగానూ, మరింత సంగతంగానూ వుంది.

నాలుగవ విషయం, ఇంగ్లీషు విదేశవర్తక విధానాన్ని స్మిత్ సవివరంగా తూర్పారబట్టి, స్వేచ్ఛాయుత విదేశ వాణిజ్య కార్యక్రమాన్నొకదాన్ని రూపొందించాడు. ఆయన డిమాండ్లన్నింటిలోకీ అతి ముఖ్యమైన యీ డిమాండు మిక్కిలి నేరుగా వ్యాపారవాదానికి వ్యతిరేకంగా ఉన్ముఖం చెయ్యబడింది. ఈ విధంగా స్వేచ్ఛా వాణిజ్య ఉద్యమం ఉద్భవించి, 19వ శతాబ్దంలో ఇంగ్లీషు పారిశ్రామిక బూర్జువావర్గ వినాదంగా పరిణమించింది.

యావత్తు వ్యాపారవాద విధానాన్నీ — విధిగా విదేశ వ్యాపార చెల్లింపుల శేషం కోసం పాకులాటను, కొన్ని సరుకుల దిగుమతి, ఎగుమతులపైన విషేధాలను, అధిక

దిగుమతి సుంకాలను, ఎగుమతులకు సబ్సిడీలను, గుత్త స్వామ్యం కలిగిన వర్తక కంపెనీలను — స్మిత్ నిశితంగా విమర్శించాడు. ఇంగ్లీషు వలసవిధానాన్ని ఆయన ప్రత్యేక విమర్శనాత్మక దృష్టితో ఖండించి, అది జాతి ప్రయోజనాలకు అనుకూలంగా కాక, ఓ చిన్న వర్తకబృందపు ప్రయోజనాలకు అనుకూలంగా ఉద్దేశింపబడిందని బాహాటంగా పేర్కొన్నాడు. ఐర్లండులోనూ, ప్రత్యేకించి ఉత్తర అమెరికన్ వలసల్లోనూ ఇంగ్లండు అనుసరిస్తున్న పరిశ్రమలను అణచివేసే, వర్తకాన్ని పరిమితం చేసే విధానాన్ని హ్రస్వ దృష్టితో కూడినదిగానే కాక, అవకతవక అయిందిగా కూడా స్మిత్ పరిగణించాడు. ఆయన యిలా రాశాడు: "అయితే, తమ సొంత ఉత్పాదితంలో ప్రతి ఒక భాగాన్నీ తాము చెయ్యగలిగినదాన్నంతనీ చెయ్యకుండా, లేక, తమ సరుకుల నిల్వనూ, పరిశ్రమలనూ తమకు మిక్కిలి లాభసాటి అయిందిగా తాము భావించే పద్ధతిలో వినియోగించుకోకుండా అవరోధాలు కలిగించడం, మానవజాతియొక్క అత్యంత పవిత్రమైన హక్కులను బాహాటంగా కాలరాయడమే."*

ఇది ప్రచురింపబడినది 1776లో, తిరుగుబాటులో వున్న వలసవాసులతో ఇంగ్లండు అప్పటికే యుద్ధంలో వుంది. మంచి బ్రిటిషరుగా వుండి, వలసరాష్ట్రాల వేర్పాటును గాక, సంపూర్ణ, సమాన హక్కుల ప్రాతిపదికపై ఇంగ్లండుకీ, వలసరాష్ట్రాలకీ మధ్య ఒక సమ్మేళనాన్ని సృష్టించాలనే కోరినప్పటికీ, స్మిత్ అమెరికన్ రిపబ్లికనిజంపట్ల సానుభూతి కలిగివున్నాడు. భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడి, పీడనల విధానాన్ని సైతం ఆయన పీళ్లనములుతూ ఖండించలేదు. స్మిత్ తన పుస్తకంలో చర్చిని గురించీ, విశ్వవిద్యాలయ విద్యావిధానాన్ని గురించీ నిశితమూ, పరుషమూ అయిన మాటలు అనేకం రాశాడు. వోల్టేర్, డిడ్రో, మొరెల్యే, చివరకు మిరాబోల వంటి ఆయన ఫ్రెంచి మిత్రులు కొందరు, వివిధ కాలాల్లో జైలు నిర్బంధానికి గురికాగా, ఇంగ్లండ్‌లో స్మిత్ శిరచ్ఛేద శిక్షకు గురయ్యే ప్రమాదంగాని, స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదంగాని, జైలుకి పంపబడే ప్రమాదంగాని లేకపోవడం నిజమేననుకోండి. అయితే, ఇంగ్లీషు మతబోధకుల, విశ్వవిద్యాలయాధికారుల, కిరాయి పత్రికారచయితల ద్వేషమూ, దాడులూ ఎంత విషపూరితంగా ఉండగలవో ఆయనకి తెలుసు. వీటన్నింటిని గురించీ ఆయన భయపడ్డాడు, తన భయాన్ని ఆయన మరుగుపరచనూ లేదు.

సహజంగా తను, ముందు జాగ్రత్తా, అప్రమత్తతా కలిగినవాడే అయినప్పటికీ, ఆయన సాహసికమైన ఒక గ్రంథాన్ని రచించి, దాన్ని ప్రచురించాడు — ఇదే, వ్యక్తిగా స్మిత్‌కి గల ఆకర్షణ.

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. II, London, 1924, p. 78.

ప్రకరణం 11

ఒక విధాన స్రష్ట ఆడమ్ స్మిత్

"జాతుల సంపద"

స్మిత్ 1767 వసంత కాలంలో కిర్క్‌కల్డీకి వెళ్ళిపోయి, దాదాపు నిరంతరాయంగా అక్కడ ఆరేళ్ళు జీవించాడు. ఆ కాలాన్ని పూర్తిగా ఆయన తన పుస్తక రచనకు వినియోగించాడు. వినుగుపుట్టించే తన జీవితాన్ని గురించీ, ఒకే అంశంపై అతిగా శక్తి శ్రద్ధల కేంద్రీకరణ తన ఆరోగ్యాన్ని ఎంతగా తొలిచివేస్తున్నదో అన్నదాన్ని గురించీ తను రాసిన ఒక ఉత్తరంలో ఆయన పేర్కొన్నాడు. 1773లో లండనుకు వెళ్తూ తీవ్రంగా జబ్బుపడిన స్మిత్, ఒకవేళ తను మరణించినట్లయితే తన సాహిత్య వారసత్వానికి లాంఛనప్రాయమైన హక్కులను హ్యూమ్‌కి సంక్రమింపజెయ్యడం అవసరమని భావించాడు. తను పూర్తి అయిన రాతప్రతితో వెళ్తున్నట్లు స్మిత్ అనుకున్నాడు. కాని నిజానికి ఆ రచనను పూర్తి చెయ్యడానికి ఆయనకి మరో మూడేళ్ళు పట్టింది. ఎడింబరో ప్రసంగాల నాటి తొలి ఆర్థిక వ్యాసాలకూ, "జాతుల సంపద" రచనకూ మధ్య ఒక పావు శతాబ్ద కాలపు ఎడం వుంది. అది నిజంగానే ఆయన సర్వోత్కృష్ట రచన.

"జాతుల సంపద స్వభావ కారణాలలోకి ఒక పరిశీలన" లండన్లో 1776 మార్చిలో ప్రచురింపబడింది.

అయిదు పుస్తకాలతో కూడిన రచన అది. స్మిత్ సైద్ధాంతిక విధానపు మౌలిక సూత్రాలు — అంతకు ముందరి శతాబ్దానికి చెందిన ఇంగ్లీషు, ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తల అనేక భావాలను ఆయన విధానం పూరించి, సాధారణీకరిస్తుంది — మొదటి రెండు పుస్తకాల్లో ప్రతిపాదింపబడ్డాయి. మొదటి పుస్తకంలో సంగ్రహంగా, విలువ, అదనపు విలువలు విశ్లేషింపబడ్డాయి; స్మిత్ వీటిని లాభం, భూమి కౌలు అనే నిర్దిష్ట రూపాల్లో పరిశీలించాడు. రెండవ పుస్తకం శీర్షిక: "పెట్టుబడి స్వభావం, సంచయనం, వినియోగం." మిగిలిన మూడు పుస్తకాలలోనూ, పాక్షికంగా చరిత్రకూ, కాని ప్రధానంగా ఆర్థిక విధానానికీ స్మిత్ సిద్ధాంతపు అన్వయం కనిపిస్తుంది. చిన్నదైన మూడవ పుస్తకం,

ఫ్యూడలిజం వుండి, పెట్టుబడిదారీ విధానం రూపుదాలుస్తున్న యుగంలో యూరపియన్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని పరిశీలిస్తుంది. విస్తృతమైన నాల్గవ పుస్తకంలో అర్థశాస్త్ర చరిత్ర, విమర్శ వుంటాయి; దానిలో ఎనిమిది ప్రకరణాలు వ్యాపారవాదానికీ, ఒకటి ఫిజియోక్రాట్లకూ వినియోగింపబడ్డాయి. అన్నింట్లోకీ పెద్దదైన అయిదవ పుస్తకంలో రాజ్యపు ద్రవ్య విషయాలు – ఆదాయవ్యయాలు – పరిశీలింపబడ్డాయి. మరింత నిర్దిష్ట సమాచారం యివ్వబడిన పుస్తకాల్లోనే మౌలికమైన ఆర్థిక సమస్యలపైన స్మిత్ అత్యంత విశిష్టమైన ఖండికలు కొన్ని వున్నాయి.

"జాతుల సంపద" అర్థశాస్త్ర చరిత్రలో అత్యంతాసక్తిదాయకమైన పుస్తకాల్లో ఒకటి అనడం నిస్సందేహం. వాల్టర్ బేజ్‌గాట్ వ్యాఖ్యానించినట్లు, అదొక ఆర్థిక రచనయే కాకుండా, "పాతకాలాన్ని గూర్చిన మనోల్లాసకరమైన రచన" కూడా. కెనే శుష్క విశ్లేషణాత్మక అధ్యయనాలనుంచీ, ట్యూర్గో సిద్ధాంత ప్రతిపాదనల నుంచీ, రికార్డో ప్రగాఢ అనిర్దిష్టీకరణ సాంద్రతారహిత వాతావరణ ధోరణిలో రాసిన "సూత్రాల"నుంచీ అది చాలా భిన్నమైనది. స్మిత్ రచన విస్తృత పాండిత్యం, సూక్ష్మ పరిశీలన, మౌలికమైన హాస్యాల మేలి కలయిక. "జాతుల సంపద"నుంచి ఎవరైనా, వలసలను గురించీ, విశ్వవిద్యాలయాలను గురించీ, యుద్ధకాండను గురించీ, బ్యాంకింగును గురించీ, వెండి గనులను గురించీ, స్మగ్లింగును గురించీ ఆసక్తికరమైన బోలెడు వాస్తవాలనూ... యింకెంతో ఎక్కువ విషయ సామగ్రినీ తెలుసుకోవచ్చు. ఆధునిక దృష్టితో చూస్తే, దీనిలోని చాలా విషయాలకు ఆర్థిక సిద్ధాంతంతో సంబంధం లేదు. కాని, స్మిత్ దృష్టిలో అర్థశాస్త్రం అన్నది దాదాపుగా సమాజపు సర్వతో ముఖ విజ్ఞానశాస్త్రం.

అర్థశాస్త్రంలో మౌలిక పరిశీలనా పద్ధతి తార్కిక సాధారణీకరణ. ఆర్థికశాస్త్రంలో మౌలికమైన ప్రాథమిక భావాభివర్గాల పరంపరనొకదాన్ని వేరుచేయడం ద్వారానూ, వాటిని మౌలిక పరాధీనతలతో సంధానించడం ద్వారానూ, ఎవరైనా అంతకంతకు ఎక్కువ సంక్లిష్టమైన నిర్దిష్ట సామాజిక విషయాల విశ్లేషణకు పూనుకోగలుగుతారు. ఆడమ్ స్మిత్ యీ శాస్త్రీయ పద్ధతిని అభివృద్ధిచేశాడు. తన విధానాన్ని శ్రమ విభజన, మారకం, మారకపు విలువ వంటి భావాభివర్గాలపై ఆధారంచేసుకొని, ప్రధాన వర్గాల ఆదాయాల దగ్గరకు వెళ్లడం ద్వారా ఆయన తన విధానాన్ని నిర్మించ ప్రయత్నించాడు. ఈ అర్థంలో, ఆయన అనేక వ్యతిక్రమణలనూ, వర్ణనలనూ కొంత సోపపత్తిక విలువ కలిగిన వాస్తవిక ఉదాహరణలుగా పరిగణించవచ్చు. అయితే స్మిత్, శాస్త్రీయ పరిశీలనలో యీ ఉన్నత స్థాయిని కొనసాగించలేకపోయాడు. ఆయన తన వర్ణనల్లోనూ, అషామాషీ భావాల్లోనూ కొట్టుకుపోయి, మరింత ప్రగాఢమైన విశ్లేషణాత్మక వైఖరిని వదులుకున్నాడు. ఈ

ద్వంద్వస్వభావం వాస్తవంలో ఆ యుగ లక్షణాల చేతనూ, యీ విజ్ఞానశాస్త్రంలో స్మిత్ స్థానం చేతనూ, వ్యక్తిపరంగా ఆయన మేధా వైలక్షణ్యాల చేతనూ నిర్ణయింప బడింది.

ఈ సందర్భంగా మార్క్స్ యిలా రాశాడు: "స్మిత్ స్వయంగా పరమ అమాయ కంగా, ఎడతెగని వైరుధ్యంలో చరిస్తాడు. ఒకవంక ఆయన, ఆర్థిక భావాభివర్గాల మధ్యగల అంతర్గత సంబంధాన్ని గురించి, లేక బూర్జువా ఆర్థిక వ్యవస్థ అస్పష్ట నిర్మాణాన్ని గురించి జాడతీస్తాడు. మరోవంక, అదే సమయంలో ఆయన ఆ సంబంధాన్ని, పోటీకి సంబంధించిన విషయాల్లో కనిపించే మాదిరిగా, బూర్జువా ఉత్పత్తి క్రమంలో ప్రత్యక్షంగా నిమగ్నుడై, ఆసక్తికలిగి వున్న తనకు మాదిరిగానే అశా స్త్రీయ ప్రేక్షకుడికి కనిపించే మాదిరిగా, చిత్రిస్తాడు. ఈ భావాల్లో ఒకటి బూర్జువా వ్యవస్థ అంతస్సంబంధాన్ని, ఆ మాటకు వస్తే అంగనిర్మాణపు లోతులను చిత్రిస్తుంది. కాగా మరొకటి, జీవితపు బాహ్య విషయాలను, పై చూపులకు కనిపించే మాదిరిగా కేవలం వర్ణిస్తుంది, పట్టీ తయారుచేస్తుంది, సవివరంగా చెప్తుంది, లాంఛనప్రాయ మైన శీర్షికలకింద వాటిని అమరుస్తుంది. స్మిత్ విషయంలో యీ రెండు పరిశీలనా పద్ధతులూ ఒకదాని సరసన మరొకటి సాయిలాపాయిలాగా సాగడమే కాకుండా, ఒక దానితో మరొకటి కలిసిపోయి, పొడుగునా ఒకదాన్ని మరొకటి ఖండించుకుంటాయి."*

మరికొంచెం తర్వాత, స్మిత్ కర్తవ్యం ద్వంద్వాత్మకమైనది కనుక, ఆయనలోని యీ ద్వంద్వాత్మకత సహేతుకమైనదే, అంటాడు మార్క్స్. ఆర్థిక జ్ఞానాన్ని ఒక విధానంగా అమర్చే క్రమంలో, అంతర్గత సంబంధాలకు ఆయన అనిర్దిష్టమైన ఒక విశ్లేషణను యివ్వవలసిరావడమే కాకుండా, బూర్జువా సమాజాన్ని వర్ణించి, నిర్వచనాల, భావనల విధానాన్నొకదాన్ని ఆయన ఎంచుకోవలసివచ్చింది. స్మిత్‌యొక్క యీ ద్వంద్వా త్మకతకూ, మౌలిక శాస్త్రీయ సూత్రాలను అన్వయించడంలో ఆయన అసంగతత్వానికీ, అర్థశాస్త్ర భవిష్యదభివృద్ధిలో విశేష ప్రాముఖ్యం వుంది. ఈ స్కాట్‌వ్యక్తిని మొట్ట మొదట విమర్శించినవాడు బహుశా డేవిడ్ రికార్డోయే. వర్ణనకర్తయైన స్మిత్‌కి వ్యతిరే కంగా విశ్లేషణకర్తయైన స్మిత్‌ని ఆయన సమర్థించాడు. అయితే, రికార్డో మాదిరిగా కాకుండా, స్మిత్‌యొక్క పైపై, అపభ్రంశ భావాలను అభివృద్ధిచేస్తున్నవాళ్లు కూడా "జాతుల సంపద"నుండి ఉల్లేఖించగలిగారు.

ఒక విజ్ఞానశాస్త్రంగా అర్థశాస్త్రాన్ని గూర్చిన ప్రగాఢావగాహన స్మిత్‌కి వుంది,

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part II, Moscow, 1968, p. 165.

ఆ అవగాహనకు యీనాటికీ ప్రాముఖ్యం వుంది. అర్థశాస్త్రానికి రెండు పార్శ్వాలు వున్నాయి. మొదటిదీ, ముఖ్యమైనదీ ఏమిటంటే, అది, ఒక నిర్దిష్ట సమాజంలో పాదార్థిక వస్తువుల ఉత్పత్తి, మారకం, పంపిణీ, వినిమయాల వస్తుపర నియమాలను, మానవేచ్ఛకు అతీతంగా అస్తిత్వంలో వుండే నియమాలను, అధ్యయనంచేసే ఒక విజ్ఞానశాస్త్రం. తన పరిశోధనకు సంబంధించిన మొదటి రెండు పుస్తకాల్లోని విషయాంశాన్ని ఉపోద్ఘాతంలో స్మిత్ పరిశీలించేటప్పుడు, అర్థశాస్త్రపు యీ అవగాహననే నిజానికి ఆయన వివరిస్తున్నాడు. సామాజిక శ్రమ ఉత్పాదకత పెరుగుదల కారణాలనూ, సమాజంలోని భిన్న వర్గాలకూ, జనబృందాలకూ మధ్య ఉత్పాదితపు పంపిణీ సహజ క్రమాలనూ, పెట్టుబడి స్వభావాన్నీ, దాని క్రమ సంచయన సాధనాలనూ పరిశీలించాలని ఆయన ప్రతిపాదిస్తున్నాడు.

సమాజపు ఆర్థిక నిర్మాణంపట్ల యిది సామకూల, విశ్లేషణాత్మక వైఖరి. వాస్తవంగా అస్తిత్వంలో వున్నదాన్నీ, యీ వాస్తవం ఎందుకు అభివృద్ధిచెందుతుందన్నదాన్నీ అది అధ్యయనం చేస్తుంది. అర్థశాస్త్రాన్ని సామాజిక సమస్యల, సామాజిక వర్గాల మధ్య సంబంధాల అధ్యయనంగా స్మిత్ పరిగణిస్తాడు. ఇది ముఖ్యమైన విషయం.

అయితే మరో పార్శ్వం కూడా వుంది. స్మిత్ అభిప్రాయంలో, అర్థశాస్త్రం వస్తుపర విశ్లేషణ ప్రాతిపదికపైన ప్రత్యక్ష సమస్యలను పరిష్కరించాలి. అది నిరూపించి, "జనానికి పుష్కలమైన ఆదాయాన్ని, లేక జీవనాధారాన్ని సమకూర్చే, లేక అంతకన్న సరిగా చెప్పాలంటే, తమకే అటువంటి ఆదాయాన్ని లేక జీవనాధారాన్ని కల్పించే"* ఒక ఆర్థిక విధానాన్ని సిఫారసుచెయ్యాలి. అందుచేత అర్థశాస్త్రం, సమాజంలో ఉత్పాదక శక్తుల పెరుగుదలకు అత్యంత సానుకూల పరిస్థితులను సృష్టించే వ్యవస్థ ఏర్పడేలా చూడాలి.

ఇది ప్రామాణికమూ, ఆచరణాత్మకమూ అయిన వైఖరి. అటువంటి వైఖరిలో ఆర్థికవేత్త, "సంపద పెరుగుదల"కోసం ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి అన్న ప్రశ్నకు జవాబిచ్చేందుకు ప్రయత్నిస్తాడు.

మామూలుగా యీ రెండు పద్ధతులూ సన్నిహితంగా ముడిపడి వున్నాయి. ఆర్థిక పరమైన ఏ అర్థంలోనైనా, ఒకటి మరొకదాన్ని పూరించేటటువంటిదిగా వుంటుంది. అయితే, యికముందు మనం చూడబోయేట్లుగా, దరిమిలా పలువురు ప్రసిద్ధ పండితులు మొదటి వైఖరినో లేక రెండో వైఖరినో చేబట్టారన్న సంగతి మనకు

---

* Adam Smith, *The Wealth of Nations*, Vol. I, London, 1950, p. 395.

తెలుసు: "సేయ్ అనుయాయులు" తమ "పాజిటివిజం" (వాస్తవ ఇంద్రియగ్రాహ్యా వస్తువులను మాత్రమే గుర్తించే పద్ధతి)పట్ల గర్విస్తూ, ప్రామాణిక సిఫారసులను తిరస్కరించగా, తద్భిన్నంగా సిస్మాండీ అర్థశాస్త్రాన్ని ప్రధానంగా, సమాజాన్ని తను కోరుకున్న రీతిలో ఎలా మార్చాలన్నదానికి సంబంధించిన ఒక విజ్ఞానశాస్త్రంగా పరిగణించాడు. అయితే స్మిత్, తనకు విశిష్టమైన బహుముఖత్వంతో యీ రెండు వైఖరులనూ అత్యంత సజీవంగా సమ్మిళితంచేశాడు.

శ్రమ విభజన

సామాజిక శ్రమ ఉత్పాదకత పెరుగుదలలో శ్రమ విభజనను ప్రధానాంశంగా ఆడమ్ స్మిత్ చిత్రిస్తాడు. పరికరాల, యంత్రాల ఆవిష్కరణను, మెరుగుదలను శ్రమ విభజనతో ఆయన ముడిపెడతాడు. గుండుసూదుల ఫ్యాక్టరీకి సంబంధించిన తన సుప్రసిద్ధ ఉదాహరణను స్మిత్ ఉల్లేఖిస్తాడు. ఆ ఫ్యాక్టరీలో కార్మికుల స్పెషలైజేషనూ (ప్రత్యేకీకరణా), తమ మధ్య పనుల విభజనా ఉత్పత్తి అంతకు ముందరికన్న అనేక రెట్లు పెంపొందడాన్ని ఎలా సాధ్యం చేసినదీ అందులో చెప్తాడు. ఆ పుస్తకం అంతట్లోనూ శ్రమ విభజన అనే ఒక చారిత్రక పట్టకంగుండా ఆర్థిక క్రమాలను ఆయన పరిశీలించాడు.

సమాజపు "సంపద," అంటే ఉత్పత్తి పరిమాణమూ, ఉత్పాదితాల వినిమయమూ రెండు అంశాలపై ఆధారపడివుంటాయని స్మిత్ అంటాడు: 1) ఉత్పాదక శ్రమలో మగ్నులైన జనం నిష్పత్తి, 2) శ్రమ ఉత్పాదకత. ఈ రెండవ అంశం సాటిలేనంతగా ముఖ్యతరమైనదని దూరదృష్టితో, ఆయన విశ్వసించాడు. శ్రమ ఉత్పాదకతను నిర్ణయించేది ఏమిటని ప్రశ్నింపబడినప్పుడు, తన కాలానికి అత్యంత సహేతుకమైనదైన యీ కింది జవాబును ఆయన యిస్తాడు: శ్రమ విభజన. పెట్టుబడిదారీ విధానాభివృద్ధి క్రమంలోని కార్ఖానా దశలో, యంత్రాలు అరుదుగా వుండి, చేతి శ్రమ ప్రాబల్యం వహించినప్పుడు, ఉత్పాదకత పెరుగుదలలో శ్రమ విభజనే ప్రధానాంశం.

శ్రమ విభజన ద్వంద్వ స్వభావం కలిగినది. ఒక ఫ్యాక్టరీలో నియుక్తులైన కార్మికులు భిన్నమైన పనుల్లో స్పెషలైజ్ చేసి, అందరూ కలిసి ఒక పూర్తియైన వస్తువును, ఉదాహరణకు గుండుసూదులను ఉత్పత్తిచేస్తారు. ఇది ఒక రకం. రెండో రకం యిందుకు పూర్తిగా భిన్నమైనది — సమాజంలోని విడి పరిశ్రమల మధ్యా, శాఖల మధ్యా శ్రమ విభజన. పశువుల పెంపకందారు పశువులను పెంచి, వాటిని కటికవాడికి అమ్మి

తాడు. కటికవాడు వాటిని జఫాచేసి, చర్మాలను చర్మకారుడికి అమ్ముతాడు. చర్మకారుడు ఆ చర్మాలను పదునుచేసి, వాటివి పాదరక్షల తయారీదారుకి అమ్ముతాడు....

స్మిత్ ఈ రెండు రకాల శ్రమ విభజననూ కలగాపులగంచేశాడు, వాటి మధ్యగల మౌలిక భేదాన్ని ఆయన గమనించలేదు: మొదటి సందర్భంలో సరుకు కొనుగోలుగాని, అమ్మకంగాని లేదు. కాని, రెండవ దానిలో వుంది. యావత్తు సమాజాన్నీ ఒక బ్రహ్మాండ మైన ఫ్యాక్టరీగానూ, "జాతుల సంపద" ప్రయోజనాల దృష్ట్యా శ్రమ విభజనను మానవ ఆర్థిక సహకారపు సార్వత్రిక రూపంగానూ ఆయన పరిగణించాడు. దేన్నైతే సహజము, శాశ్వతమైన ఏకైక సమాజంగా ఆయన పరిగణించాడో ఆ బూర్జువా సమాజానికి సంబంధించిన సాధారణ దృక్పథంతో యిది ముడిపడివుంది. నిజానికి, స్మిత్ దర్శించిన శ్రమ విభజన, పెట్టుబడిదారీ విధానానికి విశిష్టమైనదీ, దాని ప్రధాన లక్షణాలనూ, పర్యవసానాలనూ నిర్ణయించేదీని అది సమాజ ప్రగతికి పట్టినే దోహదం చెయ్యడమే కాకుండా, పెట్టుబడికి శ్రమ లొంగుబాటును పెంచి, పటిష్ఠం కూడా చేస్తుంది.

ఇతర అనేక సమస్యలపైన మాదిరిగానే యీ సమస్యపైన కూడా ద్విముఖ వైఖరిని వహించే స్మిత్, పుస్తకం మొదట్లో పెట్టుబడిదారీ శ్రమ విభజన గుణగానం చేస్తాడు. కాని మరో ఖండికలో కార్మికునిపైన దాని చెడు ప్రభావాన్ని గురించి తర్కిస్తాడు: "శ్రమ విభజన క్రమంలో శ్రమపై జీవించే వారిలో అత్యధికుల, అంటే జనంలో అధిక సంఖ్యాకుల నియామకం అతి కొద్ది సరళమైన, తరచుగా ఒకటి లేక రెండు పనులకు పరిమితంచేసే దశకు కుదించబడుతుంది. తన ప్రత్యేక వృత్తిలో అతని [అంటే కార్మికుని — ఎ. ఎ.] నైపుణ్యం, యీ పద్ధతిలో, అతని మేధా, సామాజిక, సైనిక సద్గుణాలను బలిచేసి సంతరించుకోబడవలసివుంటుంది. కాని ప్రతి మెరుగైన, నాగరిక సమాజంలోనూ, శ్రామిక పేదలు, అనగా జనాభాలో అత్యధిక సంఖ్యాకులు, తప్పనిసరిగా — దీన్ని నివారించేందుకు ప్రభుత్వం కొన్ని ప్రయత్నాలు చేస్తేగాని — యీ స్థితిలోకి దిగజారవలసేవస్తుంది."* కార్మికుడు పెట్టుబడికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తికీ నిస్సహాయుడైన తోకగా, మార్క్స్ అన్నట్లు "పాక్షిక కార్మికుడు"గా మారుతాడు.

ఈ ఖండికలోని చివరి వాక్యం మన దృష్టిని ఆకర్షిస్తుంది. Laissez faire విధానాన్ని బేషరతుగా సమర్థించేవాడినుండి యిది ఒక రకంగా అప్రత్యాశిత మైనది. అదేమిటంటే, యిక్కడ పెట్టుబడిదారీ విధానంలోని ఒక ప్రమాదకర

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. II, London, 1924, pp. 263, 264.

ధోరణిని స్మిత్ గమనించాడు: ప్రతిదాన్నీ దాని సహజ క్రమానికి వదిలేసినట్లయితే, జనాభాలోని గణనీయమైన భాగం హీన స్థితికి దిగజారిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. రాజ్యయంత్రాన్ని తప్ప దీన్ని నివారించగల మరో శక్తిని దేన్నీ ఆయన చూడలేకపోయాడు.

శ్రమ విభజననూ, సరుకుల మారకపు క్రమాన్నీ వర్ణించిన తర్వాత, ఏది లేనిదే మారకం అసాధ్యమో, ఆ డబ్బు సమస్యను స్మిత్ పరిశీలనకు తీసుకున్నాడు. చిన్నదైన నాల్గవ ప్రకరణంలో ఆయన డబ్బు స్వభావాన్ని గురించీ, అన్ని యితర సరుకులనుంచీ ఒక విశిష్టమైన సరుకుగా, సార్వత్రిక సమానకంగా అది విడివడటాన్ని గురించీ ఆయన సవివరంగా చర్చించాడు. స్మిత్ తరచుగానే డబ్బు, రుణం అన్న విషయాలను గురించి ప్రస్తావించాడు, కాని మొత్తంమీద యీ ఆర్థిక భావాభివర్గాలు ఆయన రచనలో అప్రముఖ పాత్రను మాత్రమే వహించాయి. డబ్బును ఆయన ఆర్థిక క్రమాల గమనాన్ని సుసాధ్యం చేసే ఒక సాంకేతిక పరికరంగా మాత్రమే చూశాడు; దాన్ని ఆయన "చలా మణీ చక్రం" అని పేర్కొన్నాడు. రుణాన్ని ఆయన పెట్టుబడిని క్రియాశీలంచేసే ఒక సాధనంగా మాత్రమే పరిగణించి, దాన్ని గురించి సూక్ష్మ పరిశీలన చేయలేదు. స్మిత్ డబ్బునూ, రుణాన్నీ ఉత్పత్తినుంచే పరిగ్రహించి, ఉత్పత్తికి సంబంధించి వాటి అప్రధాన పాత్రను గమనించాడు — ఆయన అభిప్రాయాల విలువ దీనిలోనే వుంది. అయితే యీ అభిప్రాయాలు సైతం ఏకముఖమైనవీ, పరిమితమైనవీని. డబ్బుకీ, రుణానికీ సంబంధించిన అంశాలు సంతరించుకొనే స్వేచ్ఛనూ, ఉత్పత్తిపై వాటికి గల తిరుగు ప్రభావాన్నీ ఆయన తక్కువగా అంచనా వేశాడు.

"జాతుల సంపద"యొక్క మొదటి నాలుగు ప్రకరణాలూ చదవడానికి తేలికగా సాగిపోతాయి, వాటిలోని విషయాలు కూడా సరదాగా వుంటాయి. స్మిత్ బోధన కేంద్ర భాగమైన విలువ సిద్ధాంతానికి ఒక రకమైన ఉపోద్ఘాతంగా అవి పనిచేస్తాయి. విషయాంశపు "అత్యంత సాధారణీకృత" స్వభావం దృష్ట్యా, పాఠకుని "ఓర్పునూ శ్రద్ధనూ" హృదయపూర్వకంగా అర్థించడం ద్వారా, స్మిత్ విలువ సిద్ధాంత పరిశీలనకు పూనుకొంటాడు.

శ్రమ విలువ

స్మిత్ తొలి విమర్శకులు సాధారణంగా, ఆయన పద్ధతులనూ, భావాలనూ వినియోగించుకున్నారు. తత్పర్యవసానంగా ఆయన ప్రభావం, ప్రత్యేకించి రికార్డో ప్రభావంతో కలిసి, 1860 దశకందాకా అపారంగా వుంది. అటుతర్వాత పరిస్థితి

మారింది. ఒకవంక మార్క్సిజం ఆవిర్భవించింది. మరోవంక, బూర్జువా ఆర్థిక విజ్ఞాన శాస్త్రంలో అర్థశాస్త్రపు ఆత్మపర సంప్రదాయం త్వరలోనే ప్రాబల్యంలోకి వచ్చింది.

స్మిత్‌పట్ల వైఖరి "కరుకెక్కింది," దీనికి మొదట బలైనది ఆయన విలువ సిద్ధాంతమేనని వేరే చెప్పనక్కర్లేదు. అయితే అది వెంటనే జరగలేదనుకోండి. 19వ శతాబ్దపు ద్వితీయార్ధ భాగానికి చెందిన ప్రసిద్ధ ఇంగ్లీషు బూర్జువా అర్థశాస్త్రవేత్త అయిన ఆల్ఫ్రెడ్ మార్షల్ రికార్డోతో సంబంధం పెట్టుకుని, ఆయనను కొత్త ఆత్మపర భావాలతో రాజీపడేలా చెయ్యాలని తీవ్రంగా ప్రయత్నించాడు. ఆయన స్మిత్‌ని గురించి రాస్తూ, ఆయన "ప్రధానమైన పని యేమిటంటే తన ఫ్రెంచి, ఇంగ్లీషు సమకాలీనుల, పూర్వుల ఊహలను సమన్వయంచెయ్యడం, అభివృద్ధిచెయ్యడమే"* అన్నాడు.

అంతకు నలభై ఏళ్ల తర్వాత రాసిన ప్రముఖ అమెరికన్ అర్థశాస్త్ర పాల్ హెచ్. డగ్లస్ దృక్పథం, యిందుకు భిన్నమైనది. తన పూర్వులు రాసినదాంట్లో మిక్కిలి విలువైనదాన్ని స్మిత్ తిరస్కరించాడనీ, తన విలువ సిద్ధాంతం ద్వారా ఆయన ఇంగ్లీషు అర్థశాస్త్రాన్ని ఒక మొండిగోందిలోకి నెట్టాడనీ, అందులోంచి అది ఒక పూర్తి శతాబ్దందాకా బయట పడలేకపోయిందనీ ఆయన ఆరోపించాడు. షుంపేటెర్ తన "ఆర్థిక విశ్లేషణ చరిత్ర"లో, స్మిత్‌పట్ల పైకి గౌరవాన్ని కనపరుస్తూనే, మౌలికంగా అత్యంత సంశయాత్మక వైఖరిని చేబట్టాడు. అసలు శ్రమ విలువ సిద్ధాంతాన్ని స్మిత్ చేపట్టాడని ఎవరైనా చెప్పగలరా అని నిజానికి ఆయన ప్రత్యక్షంగానే అనుమానాన్ని వెల్లడించాడు. ఆఖరికి, ఆర్థిక చింతన చరిత్రపై ఒకరకమైన నాసిరకం అమెరికన్ పాఠ్యపుస్తకంలో (జె. ఎఫ్. బెల్) యిలా వుంది: "విలువ సిద్ధాంతానికి స్మిత్ చేసిన చేర్పులు వివేకదాయకమైనవి కన్న ఎక్కువ గందరగోళ కారకాలు. ఆయన రచనలో తప్పులు, తభావతులు, వైరుధ్యాలు పెద్ద లోపంగా కనిపిస్తాయి."**

వీటన్నింటినీబట్టి ఒక విషయం నిస్సందేహంగా నిజం: స్మిత్ విలువ సిద్ధాంతంలో తీవ్రమైన లోపాలు వున్నాయి. కాని, మార్క్స్ పేర్కొన్నట్లు, యీ లోపాలూ, వైరుధ్యాలూ సహేతుకమైనవీ, ఆర్థిక సిద్ధాంతానికి ఒక విధంగా సహాయకమైనవీ. శ్రమ విలువ సిద్ధాంతపు ప్రాథమిక, అత్యంత సరళ సూత్రీకరణనుంచి ముందుకెళ్లేందుకు స్మిత్ ప్రయత్నించాడు. పెట్టుబడిదారీ విధానంకింద స్వేచ్ఛా పోటీ పరిస్థితుల్లో సరుకు—డబ్బు మారకం, ధర ఏర్పడటం అన్న అసలైన విధానంలో ఆయన యీ

---

* J. A. Schumpeter, *History of Economic Analysis*, పేజి 307నుండి ఉల్లేఖింపబడింది.

** J. F. Bell, *A History of Economic Thought*, p. 188.

(శ్రమ విలువ సిద్ధాంతం కేవల సామాన్య విషయంగా కనిపిస్తుంది. ఈ పరిశీలనలో ఆయనకి కొన్ని విడదీయరాని వైరుధ్యాలు ఎదురయ్యాయి. స్మిత్‌లోనూ (రికార్డోలోనూ) పెట్టుబడిదారీ విధానపు చారిత్రక దృష్టి లోపించడమూ, పెట్టుబడికీ వేతన శ్రమకీ మధ్య సంబంధాలు శాశ్వతమైనవనీ, సాధ్యమైన ఏకైక సంబంధాలనీ ఒప్పుకోవడమే దీనికిగల అంతిమ కారణమని మార్క్స్ భావించాడు. ఇది కాకుండా, స్మిత్‌కి "సమాజపు మొరటు స్థితి" మాత్రమే తెలుసు, దాన్ని ఆయన ఒక మిధ్యగా పరిగణించాడు. అయినా కూడా విలువ సమస్యను ఆయన శాస్త్రీయమైన గొప్ప ప్రగాఢత్వంతో పరిశీలించాడు.

వినిమయ, మారకపు విలువ భావనలను తనకంటె ముందు యెవరూ చెయ్యనంత కచ్చితంగా స్మిత్ నిర్వచించి, ఒకదాన్నుంచి మరొకదాన్ని వేరుచేశాడు. ఫిజియోక్రాట్ల పిడివాదాన్ని తిరస్కరించి, తన వాదనలను తన సొంత శ్రమ విభజన సిద్ధాంతం పైననే ఆధారం చేసుకొని, విలువ సృష్టి దృష్ట్యే ఉత్పాదక శ్రమయొక్క అన్ని రకాలూ సమానమేనని ఆయన గుర్తించాడు. అలా చెయ్యడంద్వారా ఆయన మారకపు విలువ, విలువ సారాంశంపైన, మార్క్సును ఉల్లేఖించాలంటే, సమస్త ఉత్పాదక మానవ కార్య కలాపాల మాదిరిగానే శ్రమపైన ఆధారపడివుందని గ్రహించాడు. అనిర్దిష్ట శ్రమ, నిర్దిష్ట శ్రమ అనే శ్రమయొక్క ద్వంద్వ స్వభావాన్ని మార్క్స్ ఆవిష్కరించడానికి యిది మార్గాన్ని సుగమం చేసింది. ఒక నిర్ణీత కాలవ్యవధిలో అనిపుణ, సరళ శ్రమ కన్న నిపుణ, సంక్లిష్ట శ్రమ ఎక్కువ విలువను సృష్టిస్తుందనీ, కొన్ని సహాయకాంశాల సహాయంద్వారా సంక్లిష్ట శ్రమను సరళ శ్రమకు దించవచ్చుననీ స్మిత్ గ్రహించాడు. ఒకానొక సరుకు విలువ ప్రమాణం విడి ఉత్పత్తిదారు శ్రమయొక్క ప్రత్యక్ష వ్యయంచేత కాక, ఒకానొక నిర్దిష్ట సామాజిక స్థితిలో సగటున అవసరమైన వ్యయంచేత నిర్ణయింప బడుతుందని కూడా ఆయన కొంత మేరకు అర్థంచేసుకున్నాడు.

ఒక సరుకు సహజ ధరకూ, మార్కెట్ ధరకూ మధ్య స్మిత్ కనుగొన్న భేదం సానుకూల అంశం. సహజ ధరను మౌలికంగా మారకపు విలువయొక్క డబ్బు వ్యక్తీకరణగా అర్థంచేసుకున్న స్మిత్, దీర్ఘకాల క్రమంలో మార్కెట్ ధరలు ఒక మాదిరి హెచ్చుతగ్గుల కేంద్రమైన సహజ ధర దిశగా కదులుతాయని విశ్వసించాడు. స్వేచ్ఛాయుత పోటీలో డిమాండ్ సప్లయ్‌ల మధ్య సమతూకం కల్పింపబడినప్పుడు, మార్కెట్ ధరలు సహజ ధరలతో సమానమవుతాయి. విలువనుండి ధరల దీర్ఘకాల వ్యత్యాసాలను ఉత్పన్నం చెయ్యగల అంశాల విశ్లేషణకు కూడా ఆయన పునాదులు వేశాడు; గుత్త స్వామ్యాన్ని అతి ముఖ్యమైనదిగా ఆయన పరిగణించాడు.

స్మిత్ ఏ సమస్యనైతే ముందుకు తెచ్చాడో అది, తదుపరి శతాబ్ద కాలం అంతటా విలువ సిద్ధాంతానికీ, ధర రూపధారణ సిద్ధాంతానికీ కేంద్రంగా నిలిచింది,

దీన్నిబట్టి ఆయన సద్యోవబోధ ఎంత ప్రగాఢమైనదో గ్రహించవచ్చు. మార్క్సిస్టు భావాభివర్గాలలో యిది, ఉత్పత్తి ధరలోకి విలువల రూపాంతరీకరణ. లాభం పెట్టుబడికి అనురూపంగా వుండాలన్న విషయం స్మిత్‌కి తెలుసు, సగటు లాభపు రేటు స్వభావాన్ని కూడా ఆయన అర్థంచేసుకున్నాడు, ఆయన తన సహజ ధరకు దానినే ఆధారం చేసుకున్నాడు కూడా. ఆయన ఈ విషయాన్ని శ్రమ విలువ సిద్ధాంతంతో సంధానించి, సమ్మిళితం చెయ్యలేకపోయాడు. అదే ఆయన బలహీనత.

ఎంగెల్సు రాసినట్లు, స్మిత్ రచనలో "విలువపైన రెండే కాదు మూడు, ఆ మాటకు వస్తే నిశిత వైరుధ్యం కలిగిన అభిప్రాయాలు నాలుగు, ఒకదాని సరసన మరొకటి మిక్కిలి పాయిలాపాయిలాగా జమిలిగా కలిసిమెలిసి సాగడాన్ని"* మనం చూస్తాం. అప్పట్లో అభివృద్ధిచెయ్యబడిన పద్ధతిలోనూ, తనచేత నమోదు చెయ్యబడిన పద్ధతిలోనూ, శ్రమ విలువ సిద్ధాంతానికీ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంక్లిష్ట నిర్దిష్ట క్రమాలకూ మధ్య తగినంత తర్కబద్ధమైన సంబంధాలను స్మిత్ కనుగొనలేకపోవడమే యిందుకు ప్రధాన కారణం అనడం స్పష్టం. అందుచేత ఆయన తన తొలి భావాన్ని మార్చుకోవడం, మలుచుకోవడం మొదలుపెట్టాడు.

మొదటిది, ఒక సరుకులో యిమిడివున్న అవసర శ్రమ పరిమాణంచేత నిర్ణయింపబడిన విలువతోబాటు (యిదే ఆయన ప్రథమ, ప్రధాన అభిప్రాయం), ఆయన మరొక భావనను ప్రవేశపెట్టాడు. ఈ రెండో భావన మేరకు ఆ సరుకును కొనగల శ్రమ పరిమాణంచేత విలువ నిర్ణయింపబడుతుంది. దేనిలోనైతే కూలికి కుదుర్చుకోబడే శ్రమ వుండదో, సరుకు ఉత్పత్తిదారులు తమకు చెందిన ఉత్పత్తి సాధనాలతోనే పనిచేస్తూ వుంటారో ఆ సరళ సరుకు ఆర్థిక వ్యవస్థలో, పరిమాణం రీత్యా, రెండూ ఒక్కటే. ఉదాహరణకు, ఒక నేతపనివాడు కొంత గుడ్డను, ఒక బూట్లజతకు మారకం చేసుకుంటాడనుకోండి. అప్పుడు ఆ గుడ్డ విలువ ఒక బూట్లజత విలువతో సమానమని చెప్పవచ్చు, లేక, బూట్లతయారీదారు ఆ బూట్లను తయారుచెయ్యడానికి పట్టిన కాలానికి అతని శ్రమ విలువతో సమానమని చెప్పవచ్చు. అయితే ఈ పరిమాణ కాకతాళీయత అభిన్నతకు రుజువు కాదు. ఒక నిర్దిష్ట సరుకు విలువ, పరిమాణాత్మకంగా ఒక్క పద్ధతిలోనే — అనతలి సరుకు తెలిసిన పరిమాణంలో మాత్రమే — నిర్ణయింపబడవచ్చు.

---

* Frederick Engels, *Anti-Dühring*, p. 275.

పెట్టుబడిదారీ ఉత్పత్తికీ విలువకూ సంబంధించిన తన యీ రెండవ వివరణను యివ్వడంతో, తన కాళ్లకింది ఆధారాన్ని స్మిత్ పూర్తిగా కోల్పోయాడు. బూట్లతయారీ దారు ఒక పెట్టుబడిదారుకోసం పనిచేస్తే, అతను తయారుచేసిన బూట్ల విలువా, తన శ్రమకు అతను పొందే "అతని శ్రమ విలువా" పూర్తిగా భిన్నమైనవి అవుతాయి. దీని అర్థమేమిటంటే, శ్రామికుని శ్రమను కొనే యజమాని (మార్క్స్ రుజువు చేసినట్లు అతను కొంటున్నది నిజానికి శ్రమశక్తిని, శ్రమ చెయ్యగల సామర్థ్యాన్ని), యీ శ్రమకు తను చెల్లించేదానికన్న ఎక్కువ విలువను పొందుతాడు.

శ్రమ విలువ సిద్ధాంతం దృష్ట్యా యీ విషయాన్ని వివరించలేకపోయిన స్మిత్, ఏ సమాజంలోనైతే పెట్టుబడిదారులు గాని, వేతన కార్మికులు గాని ఉండరో — అంటే, మార్క్సిస్టు పరిభాషలో, సరళ సరుకు ఆర్థిక వ్యవస్థలో — అటువంటి "సమాజపు ఆదిమ స్థితి"లో మాత్రమే విలువ శ్రమచేత నిర్ణయింపబడుతుందని పొరపాటుగా నిర్ధారణ చేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిస్థితులకు స్మిత్, విలువ సిద్ధాంతపు మూడవ పాఠాంతరాన్ని* తయారుచేశాడు: ఒక సరుకు విలువలో కార్మికుల వేతనాలు, పెట్టుబడిదారు లాభం (కొన్ని శాఖల్లో భూమి కౌలు కూడా)తోబాటు వట్టి ఖర్చులు యిమిడివుంటాయని ఆయన నిర్ణయించాడు. ఈ విలువ సిద్ధాంతం, పెట్టుబడిపై సగటు లాభం అనే విషయాన్ని, ఆయన మాటల్లో "లాభపు సహజ రేట్ల"ను వివరించేలా కనిపించడంతో, ఆయన విలువను ఉత్పత్తి ఖర్చుతో సమానం చేశాడు. అంతేగాని, వాటి మధ్యగల సంక్లిష్ట మధ్యంతర సంబంధాలను ఆయన చూడలేదు.

తదుపరి శతాబ్దంలో ముఖ్యమైన పాత్ర వహించిన "ఉత్పత్తి ఖర్చులచేత నిర్ణయింప బడే ధరల సిద్ధాంతం" యిదే. పెట్టుబడిదారు తన సరుకు ధర ప్రధానంగా ఉత్పత్తి ఖర్చులచేతా, సగటు లాభంచేతా, అలాగే ఆయా నిర్దిష్ట సమయాల్లో వున్న సప్లయ్, డిమాండులచేతా నిర్ణయింపబడుతుందని భావిస్తాడు. సరిగా పెట్టుబడిదారుడి యీ ఆచరణాత్మక దృక్పథాన్నే స్మిత్ అవలంబించాడు. విలువను గూర్చిన యీ భావన, విలువను సృష్టించడంలో శ్రమనూ, పెట్టుబడినీ, భూమి ఆస్తినీ సమానమైనవిగా పరిగణించేందుకు విశేషమైన అవకాశాన్ని చేకూర్చింది. పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలను కాపాడేందుకు అర్థశాస్త్రాన్ని వినియోగించుకొనేందుకు ప్రయత్నించిన సేయ్ మొదలైన ఆర్థికవేత్తలు త్వరలోనే స్మిత్‌నుండి యీ భావాన్ని స్వీకరించారు.

---

* నాలుగవ పాఠాంతరం — శ్రమ భారం ఫలితంగా విలువకు సంబంధించిన ఆత్మపరవాద వివరణ — స్మిత్ రచనలో యిది బీజ రూపంలో మాత్రమే కనిపిస్తుంది.

వర్గాలూ, ఆదాయాలూ

విలువ సిద్ధాంతం రెండు సంబంధిత ప్రశ్నలకు సమాధానాన్ని ఇవ్వవలసి వుందన్న విషయం మనకు తెలిసిందే: ధరల అంతిమ ప్రాతిపదిక, ఆదాయానికి అంతిమ మూలం. స్మిత్ యీ మొదటి ప్రశ్నకు పాక్షికంగా సరైన సమాధానాన్ని యిచ్చాడు, అయితే దాన్ని వాస్తవంతో సరిపెట్టడంలో విఫలుడై, ఒక అపభ్రంశ దృక్పథాన్ని అవలంబించాడు. శ్రమ విలువ సిద్ధాంతాన్ని అభివృద్ధిచెయ్యడం ద్వారా రెండవ సమస్యకు శాస్త్రీయమైన పరిష్కారాన్ని కూడా ఆయన సమకూర్చాడు, కాని దీనిలో కూడా ఆయన అసంగతత్వ దోషానికి గురయ్యాడు.

"సమాజపు ఆదిమ స్థితి" అంటే స్మిత్ అర్థం ఏమిటి? దీన్ని దాదాపుగా ఆయనొక మిథ్యగానే పరిగణించినా, అది ఒక ముఖ్యమైన అర్థాన్ని కలిగిన మిథ్య. వ్యక్తిగత ఆస్తిలేని సమాజంగా దాన్ని ఆయన తలిచాడా? బహుశా కాదు. మానవజాతి గతంలో గాని, భవిష్యత్తులో గాని స్మిత్ అటువంటి "స్వర్ణ యుగాన్ని" ఊహించలేదు. బహుశా ఆయన ఊహలో, వ్యక్తిగత ఆస్తి వున్నా వర్గాలు లేని ఒక సమాజం ఉండివుండవచ్చు. అటువంటి సమాజం వుండటం సాధ్యమా, లేక ఎన్నడైనా వుందా అన్నది పూర్తిగా వేరే సమస్య.

పది లక్షలమంది వ్యవసాయదారులున్న ఒక సమాజాన్ని ఊహించుకుందాం. వారిలో ప్రతి ఒక్కడికీ సరిగా సరిపడేటంత భూమీ, శ్రమ పరికరాలూ ఉన్నాయనుకోండి. సొంత వినిమయానికీ, తన కుటుంబ జీవితావసరాలకు కావలసిన మేరకు మారకానికీ అతను ఉత్పత్తి చేస్తున్నాడనుకోండి. దీనికి తోడు ఆ సమాజంలో పది లక్షలమంది స్వతంత్ర వృత్తిపనివారు వున్నారనీ, వారిలో ప్రతి ఒక్కడూ తన సొంత శ్రమ పరికరాలతోనూ, ముడిపదార్థాలతోనూ పనిచేస్తాడనీ అనుకోండి. ఈ సమాజంలో వేతన శ్రమ లేదు. కనే దృష్టిలో, యీ సమాజంలో రెండు వర్గాలు వుంటాయి, స్మిత్ దృష్టిలో ఒకేఒక వర్గం వుంటుంది. స్మిత్ వైఖరే మరింత సరైనది; ఎందుకంటే, వర్గాలు, వాటిలోని జనం, ఆర్థిక వ్యవస్థయొక్క ఏ శాఖలో నిమగ్నులైవున్నారు అన్నదాన్ని బట్టి కాక, యీ జనానికి ఉత్పత్తి సాధనాలతో వున్న సంబంధాలు ఏమిటన్నదాన్ని బట్టి విభేదిస్తాయి. స్మిత్ అనేది ఏమిటంటే, ఈ పరిస్థితుల్లో, సరుకుల మారకం శ్రమ విలువ ప్రకారం జరుగుతుంది, శ్రమయొక్క మొత్తం ఉత్పాదితం (లేక, దాని విలువ) కార్మికుడికి చెందుతుంది: అదృష్టవశాత్తూ అప్పటికింకా దాన్ని అతనితో కలిసి పంచుకోవలసినవారు ఎవరూ లేరు. అయితే ఆ రోజులు గడిచిపోయి చాలా కాలం అయింది.

భూమి భూస్వాముల వ్యక్తిగత ఆస్తి అయింది. కార్ఖానాలూ, ఫ్యాక్టరీలూ పెట్టుబడిదారీ యజమానుల చేతుల్లో వున్నాయి. ఆధునిక సమాజపు స్థితి యిదీ. దానిలో మూడు వర్గాలు వున్నాయి: వేతన కార్మికులు, పెట్టుబడిదారులు, భూస్వాములు. సమాజంలో వివిధ మధ్యంతర పొరలూ, గ్రూపులూ కూడా వున్నాయన్న సంగతిని వాస్తవిక దృష్టితో స్మిత్ గమనించాడు. అయితే, సూత్రబద్ధమైన ఆర్థిక విశ్లేషణలో, దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా, త్రివర్గ నమూనామీద ఆధారపడవచ్చు.

ఈ విధంగా, కార్మికుడు యీ రోజున మామూలుగా మరొకరెవరి భూమిమీదనో, మరొకరెవరి పెట్టుబడితోనో పనిచేస్తాడు. అందుకని అతని శ్రమయొక్క మొత్తం ఉత్పాదితం యికనెంతమాత్రం అతనికి చెందదు. ఈ ఉత్పాదితంనుంచి, లేక దాని విలువనుంచి మొదట మినహాయింపబడేది భూస్వామి కౌలు. కార్మికులను పనిలో పెట్టుకొని, వారికి పరికరాలనూ, వారి పనికి అవసరమైన పదార్థాలనూ యిచ్చే పెట్టుబడిదారీ యజమాని లాభం రెండవది.

పెట్టుబడిదారులచేతా, భూస్వాములచేతా శ్రమ దోపిడీకి ఒక వ్యక్తీకరణగా అదనపు విలువను అర్థంచేసుకోవడానికి స్మిత్ సన్నిహితంగా వచ్చాడు. అయితే, మార్క్సుకు పూర్వపు అర్థశాస్త్రవేత్తలు అందరి మాదిరిగానే, అదనపు విలువను ఆయన ఒక భావాభివర్గంగా వేరుచేయక, బూర్జువా సమాజోపరితలంపైన అది తీసుకునే లాభం, కౌలు, వడ్డీ అనే నిర్దిష్ట రూపాలను మాత్రమే ఆయన పరిశీలించాడు. "జాతుల సంపద"లో ఒకప్పుడు కార్మికునికి చెంది, దరిమిలా అతన్నుండి తీసివేసుకోబడిన శ్రమయొక్క పూర్తి ఉత్పాదితాన్ని గురించి స్మిత్ ప్రస్తావించాడు. అటువంటి ప్రస్తావన వున్న అయిదు ఖండికలను పాల్ డగ్లస్ కనుగొన్నాడు. డగ్లస్‌ను ఉల్లేఖించాలంటే, యీ పదబంధానికి "సోషలిస్టు ఆలోచనా చరిత్రలో గొప్ప ప్రాముఖ్యం వుంది, ఇది ఆడమ్ స్మిత్ రచనలో కనిపించడానికి గొప్ప ప్రాముఖ్యం వుంది...."* ఇది పూర్తిగా నిజం. సందర్భవశాత్తూ వేరొక విషయం చెప్పవలసివుంది. "జాతుల సంపద"ను పండితులు తీవ్రంగా పరిశోధించి, విశ్లేషించారు. భిన్నభిన్నమూ, చివరకు పరస్పర విరుద్ధమూ అయిన ఉద్ఘాటనలు యింత ఎక్కువ మోతాదులో వున్న గొప్ప సాహిత్య రచనలు దాదాపు లేవు.

స్మిత్ ఆలోచనలో మరొక వాహిని, విలువను ఆయన వేతనాలు, లాభం, కౌలు వంటి ఆదాయపు మొత్తాలుగా పరిగణించడం దగ్గర్నుంచి మొదలవుతుంది. నిజానికి

* Adam Smith, 1776—1926. "Lectures to Commemorate the 150th Anniversary of the Publication of *The Wealth of Nations*," Chicago, 1928, p. 96.

లాభమూ, కౌలూ — వాటికవిగానే యీ విలువను రూపొందించేమాటైతే, ఒక సరుకు యొక్క పూర్తి విలువనుండి వాటిని మినహాయించడం సాధ్యం కాదు. ఆదాయాల పంపిణీకి సంబంధించిన పూర్తి భిన్నమైన దృక్పథం మనకిక్కడ కనిపిస్తుంది: ఉత్పత్తియొక్క ప్రతి ఒక అంశమూ (యీ పదబంధం తర్వాత ఉత్పన్నమైంది), అంటే, శ్రమ, పెట్టుబడి, భూమి — ఒక సరుకుయొక్క విలువను సృష్టించడంలో పాల్గొంటుంది, సహజంగానే తన వాటాను డిమాండు చేస్తుంది. 19వ శతాబ్దంలో పెట్టుబడిదారీ విధాన సమర్థకులైన అర్థశాస్త్రవేత్తలచేత బాహాటంగా చాటబడిన "పెట్టుబడి అనే దైవిక హక్కు"కీ దీనికీ మధ్య ఎక్కువ ఎడం లేదు.

విలువను ఆదాయాలనుంచి రూపొందించిన మీదట, ప్రతి ఒక ఆదాయపు సహజ రేటూ ఏవిధంగా నిర్ణయింపబడుతుందో, అంటే, విడి సరుకుయొక్క, మొత్తం ఉత్పాదితంయొక్క విలువ ఏ నియమాలచేత సమాజపు వర్గాల మధ్య పంపిణీ చెయ్యబడుతుందో పరిశీలించాలని స్మిత్ నిర్ణయించుకుంటాడు.

మూడు ప్రధాన ఆదాయాల్లో ప్రతి ఒకదాన్నీ పరిశీలించే క్రమంలో, స్మిత్ మళ్లీ కొంతమేరకు, తన అదనపు విలువ సిద్ధాంతానికి తిరిగివస్తాడు. వేతనాలను గూర్చిన ఆయన అభిప్రాయాలు యీనాటికీ ఆసక్తికరంగా వుంటాయి. ఆయన వేతనాల సిద్ధాంతం అనేక విధాల అసంతృప్తికరమైనదనడం స్పష్టం. కార్మికుడు తన శ్రమశక్తిని పెట్టుబడిదారుకు అమ్ముకోవడంలో యిమిడివున్న సంబంధాల నిజ స్వభావాన్ని ఆయన అర్థం చేసుకోకపోవడమే దీనికి కారణం. ప్రత్యక్ష శ్రమ అన్నది సరుకు అనీ, తత్ఫలితంగా దానికి ఒక సహజ ధర వుందనీ ఆయన ఊహించుకున్నాడు. కాని వాస్తవానికి ఆయన యీ సహజ ధరను, శ్రమశక్తి విలువను మార్క్స్ నిర్వచించినట్లే — కార్మికుడియొక్క, అతని కుటుంబంయొక్క జీవికకు అవసరమైన సాధనాల విలువ ద్వారా — నిర్వచించాడు. స్మిత్ దీనికి వాస్తవికమూ, ముఖ్యమూ అయిన కొన్ని చేర్పులు చేశాడు.

మొదటి సంగతి, శ్రమశక్తి విలువ (ఆయన పదబంధాన్ని వాడాలంటే, "సహజ వేతనం") భౌతికంగా కనీసమైన జీవనావసరాలచేత నిర్ణయింపబడటమే కాకుండా, స్థల కాల పరిస్థితులపైన అది ఆధారపడుతుందన్న సంగతిని — అంటే, దానిలో చారిత్రక, సాంస్కృతిక అంశం యిమిడివుందన్న సంగతిని — ఆయన అప్పటికే గ్రహించాడు. స్మిత్ తోలు పాదరక్షల ఉదాహరణను ఉల్లేఖించాడు. ఈ పాదరక్షలు ఇంగ్లండులో పురుషులకీ, స్త్రీలకీ, స్కాట్లండులో పురుషులకు మాత్రమే ఆవశ్యకం, కాగా ఫ్రాన్సులో పురుషులకూ, స్త్రీలకూ ఆవశ్యకం కావు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధితో ఆవశ్యకతల వలయం విస్తరిస్తుందనీ, వాస్తవమైన సరుకులలో వ్యక్తంచెయ్యబడే శ్రమ విలువ పెరుగుతుందన్న నిర్ధారణకు మనం రాక తప్పదు.

రెండవ విషయం, హీన వేతనాలకూ, అవి వాస్తవంలో కనిష్ఠ స్థాయికి సమీపంలో వుండటానికీ గల ప్రధాన కారణాల్లో ఒకటేమిటంటే, పెట్టుబడిదారుతో గల సంబంధంలో, కార్మికునికి బేరమాడటంలో గల బలహీన స్థితి. ఈ విషయాన్ని స్మిత్ స్పష్టంగా గమనించాడు. దీన్ని గురించి ఆయన చాలా ఘాటుగా రాశాడు. దీన్నిబట్టి, కార్మికుల సంఘటన, సంఘీభావాలూ, వారి ప్రతిఘటనా పరిశ్రమ యజమానుల పేరాశను పరిమితంచెయ్యగలవన్న నిర్ణయానికి పాఠకుడు వచ్చితీరుతాడు.

మూడవదీ, చివరిదీ అయిన విషయం, ఆయన వేతన ధోరణిని దేశపు ఆర్థిక వ్యవస్థ స్థితితో ముడిపెట్టాడు, వీటిలో ఆయన మూడు సందర్భాలను వింగడించాడు: ప్రగతిశీల ఆర్థిక వ్యవస్థ, తిరోగామి ఆర్థిక వ్యవస్థ, స్తబ్ద ఆర్థిక వ్యవస్థ. విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థలో శ్రమకు విశేషమైన గిరాకీ వుంటుంది కనుక, మొదటి సందర్భంలో వేతనాలు పెరిగి తీరాలని ఆయన విశ్వసించాడు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో దరిమిలా వచ్చిన అభివృద్ధి, విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ కార్మిక పోరాటం అధికతర వేతనాలు సంపాదించుకోవడానికి నిజంగానే తోడ్పడుతుందన్న సంగతిని నిరూపించింది.

అర్థశాస్త్రంలో లాభాన్ని ఒక ప్రత్యేక ఆర్థిక భావాభివర్గంగా వేరుచెయ్యడాన్ని స్మిత్ పూర్తిచేశాడు. లాభం అన్నది ఒక ప్రత్యేక రకమైన పనికి — "పర్యవేక్షణకీ, నిర్వహణకీ" — వేతనం మాత్రమే అన్న ఉద్ఘాటనను ఆయన కచ్చితంగా తిరస్కరించాడు. లాభపు మొత్తం పెట్టుబడి మొత్తంచేత నిర్ణయింపబడుతుందనీ, యీ శ్రమయొక్క ఊహాత్మకమైన కష్టంతో దానికి ఎటువంటి సంబంధమూ లేదనీ, ఆయన నిరూపిస్తాడు. ఇక్కడా, కొన్ని యితర ఖండికల్లోనూ వాస్తవానికి, లాభాన్ని దోపిడిదారు ఆదాయంగా, అదనపు విలువయొక్క ప్రధాన రూపంగా స్మిత్ వివరిస్తున్నాడు.

ఈ అభిప్రాయానికి పక్కపక్కనే, లాభం అన్నది, సంభావ్యనష్టాన్ని భరించేందుకు పెట్టుబడిదారు సంసిద్ధతకూ, కార్మికునికి అతని జీవితావసరాలను ముదుపుపెట్టినందుకూ, మితవ్యయం అనబడేదానికీ పెట్టుబడిదారుకు ముట్టే సహజ ప్రతిఫలం అన్న పైపై బూర్జువా అభిప్రాయం కూడా స్మిత్ రచనలో మనకి కనిపిస్తుంది.

పెట్టుబడి

మార్క్స్ పూర్వదశకు చెందిన అర్థశాస్త్రవేత్తలు, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రవేత్తలతోబాటు, పెట్టుబడిని కేవలం పరికరాల, ముడి పదార్థాల, జీవి

తావసరాల, ధన సంచయనవు నిల్వగా పరిగణించారు. అటువంటి నిల్వ నిధి లేనిదే ఏ ఉత్పత్తీ సాధ్యం కాదు గనుక — అంటే, పెట్టుబడి ఎల్లప్పుడూ అస్తిత్వంలో వుందనీ, వుంటుందనీ — దీని అర్థం. మార్క్స్ దీన్ని, పెట్టుబడికి తానిచ్చిన భాష్యంతో సవాలు చేశాడు. పెట్టుబడి ఒక చారిత్రక భావాభివర్గం అనీ, శ్రమశక్తి అన్నది ఒక సరుకు అయినప్పుడూ, సమాజంలో ఉత్పత్తి సాధనాలను కలిగివున్న పెట్టుబడిదారూ, శ్రమించ గల సామర్థ్యం తప్ప మరేమీ లేని వేతన కార్మికుడూ ప్రధాన వ్యక్తులు అయినప్పుడే, పెట్టుబడి ఉత్పన్నమవుతుందని మార్క్స్ చెప్పాడు. పెట్టుబడి అన్నది యీ సామాజిక సంబంధపు వ్యక్తీకరణ. అది ఎల్లప్పుడూ లేనూ లేదు, శాశ్వతం కానూ కాదు. పెట్టుబడిని సరుకులు, డబ్బుయొక్క ఒక మొత్తంగా పరిగణించడం సాధ్యమే అయినప్పటికీ కూడా, వేతన కార్మికుల చెల్లింపబడని (అదనపు) శ్రమకు — దీన్నే పెట్టుబడిదారు హరిస్తాడు — అవి సాకార మూర్తులు అన్న అర్థంలోనూ, యీ శ్రమలో కొత్త భాగాలను హరించడానికి అవి వినియోగింపబడుతాయన్న అర్థంలోనూ మాత్రమే వాటిని అలా పరిగణించవచ్చు.

స్మిత్ యిక్కడ అదనపు విలువయొక్క అసలైన మూలాన్ని గ్రహించాడు అని మార్క్స్ ఏ గ్రంథభాగాన్ని గురించి అయితే అన్నాడో, ఆ గ్రంథభాగంలో స్మిత్ యిలా రాస్తాడు: "వ్యక్తుల చేతుల్లో పెట్టుబడి సంచితం కాగానే, వారిలో కొందరు సహజంగానే కష్టపడి పనిచేసేవాళ్లను పనిలో పెట్టుకొని, వాళ్ల పనిని అమ్మడం ద్వారానో, లేక వాళ్ల శ్రమ, పదార్థాల విలువకు కలిపేదాని ద్వారానో లాభం చేసుకునేందుకు వాళ్లకు పదార్థాలనూ, జీవనావసరాలనూ సప్లయ్ చేస్తారు."* పెట్టుబడి ఆవిర్భావపు చారిత్రక క్రమాన్నీ, అది ఉత్పన్నం చేసే సామాజిక సంబంధాల దోపిడిదారీ సారాంశాన్నీ స్మిత్ యిక్కడ గమనిస్తున్నాడు. అయితే, రెండవ పుస్తకంలో పెట్టుబడియొక్క ప్రత్యేక విశ్లేషణకు పూనుకొన్న స్మిత్, తన యీ సమగ్ర దృక్పథాన్ని దాదాపు పూర్తిగా విసర్జించాడు. పెట్టుబడికి సంబంధించిన ఆయన "సాంకేతిక" విశ్లేషణ ట్యూర్గో విశ్లేషణతో సరిపోలినది. అయితే స్మిత్, స్థిర పెట్టుబడి, నిర్వహణ పెట్టుబడి, పెట్టుబడి మదుపుయొక్క భిన్న రంగాలు, రుణ పెట్టుబడి, రుణ వడ్డీ వంటి సమస్యలను, ట్యూర్గో కన్న, మరే యితరునికన్న మరింత క్రమబద్ధంగానూ, మరింత సవివరంగానూ పరిశీలిస్తాడు.

ఆర్థిక ప్రగతి నిర్ణాయకాంశం పెట్టుబడి సంచయనమే అన్న విషయంపై వక్కాణించే, స్మిత్ విశిష్టతా, ఆయన మొత్తం వివరణకు ఒక రకమైన ప్రామాణి

* A. Smith, *The Wealth of Nations*, Vol. II, p. 42.

కతా ధ్వనిని చేకూర్చినదీని. సంచయనమే జాతి సంపదకు కీలకం అనీ, పొదుపుచేసే ప్రతివాడూ జాతికి పోషకుడనీ, ప్రతి దుబారా ఖర్చుదారూ జాతికి శత్రువనీ నిరూపించేందుకు ఆడమ్ స్మిత్ విశేషమైన సంగతత్వంతోనూ, పట్టుదలతోనూ కృషిచేశాడు. పారిశ్రామిక విప్లవపు మౌలిక ఆర్థిక సమస్యను ఆయన ఎంత ప్రగాఢంగా అర్థంచేసుకున్నాడో యిది తెలియచేస్తుంది. ఆధునిక ఇంగ్లీషు పండితుల అంచనాల ప్రకారం, ఇంగ్లండులో, 18వ శతాబ్దపు ద్వితీయార్ధభాగంలో పొదుపు నిష్పత్తి (జాతీయాదాయపు సంచిత భాగం), సగటున 5 శాతానికి మించి లేదు. పారిశ్రామిక విప్లవం తన అత్యంత ముమ్మర దశలో ప్రవేశించిన 1790 ప్రాంతందాకా అది బహుశా పెరగనారంభించ లేదు. 5 శాతం చాలా తక్కువ అనడం స్పష్టం. పొదుపు నిష్పత్తి 12నుండి 15 శాతందాకా వుంటే సంతృప్తికరమనీ, 10 శాతం వుంటే ప్రమాదసూచకమనీ, 5 శాతం వుంటే విపత్కరం అనీ పరిగణించడం యీనాడు మామూలు. ఏమైనాసరే పొదుపు నిష్పత్తిని పెంచాలి. ఆధునిక పదాల్లో చెప్పాలంటే, స్మిత్ గాఢంగా ప్రోత్సహించినది యిదే.

ఎవరు సంచయనం చెయ్యగలరు, చెయ్యాలి? పెట్టుబడిదారులు, సంపన్న వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు, వర్తకులూ అనడం స్పష్టం. దీన్నే వాళ్ల ముఖ్యమైన సామాజిక విధిగా స్మిత్ పరిగణిస్తాడు. తన గ్లాస్గో ఉపన్యాసాలలోనే, స్థానిక పెట్టుబడి ప్రభువుల "భోగాలపట్ల విరక్తి"ని ప్రశంసించాడు: ఆ పట్టణం అంతట్లోనూ, ఒక్క సేవకుడికన్న ఎక్కువమందిని పనిలో పెట్టుకున్న ధనికుడు ఒక్కడు కూడా లేడు. ఒక వ్యక్తి ఉత్పాదక కార్మికులను పనిలో పెట్టుకోవడం ద్వారా ధనికుడవుతాడు, సేవకులను పనిలో పెట్టుకోవడం ద్వారా పేదవాడవుతాడు, అని రాశాడు స్మిత్. ఇదే మొత్తంగా జాతికి కూడా వర్తిస్తుంది: జనాభాలో ఉత్పాదక శ్రమలో నిమగ్నం కాని విభాగాన్ని కనీస స్థాయికి తగ్గించేందుకు కృషిచెయ్యాలి. ఉత్పాదక శ్రమ విషయంలో స్మిత్ భావన సమాజంలోని ఫ్యూడల్ శక్తులకూ, వారితో సంబంధం వున్న ప్రతిదానికీ — ప్రభుత్వ బ్యురాక్రసీకీ, మిలిటరీకీ, చర్చికీ — వ్యతిరేకంగా ఉమ్మఖంచెయ్యబడింది. మార్క్స్ పేర్కొన్నట్లు, ఉత్పత్తిపైన భారంగా తయారై, సంచయనాన్ని నిరోధించే యీ గుంపుపట్ల విమర్శనాత్మక వైఖరి, ఆనాటి బూర్జువావర్గపు, కార్మికవర్గ దృక్పథాన్ని వ్యక్తంచేస్తుంది.

స్మిత్ యిలా రాశాడు: "ఉదాహరణకు, తన కింద సేవజేసే న్యాయ, యుద్ధ శాఖలు రెండింటి ఆఫీసర్లతోబాటు చక్రవర్తి, పదాతి, నౌకా సైనికులందరూ అనుత్పాదక శ్రామికులు. వాళ్లు ప్రజా సేవకులు, ఇతరుల శ్రమయొక్క సాంవత్సరిక ఉత్పాదితంలో ఒక భాగంతో వాళ్లు పోషింపబడుతున్నారు.... అత్యంత గంభీరమూ, ముఖ్యమూ

అయిన వృత్తుల్లో కొన్నీ, అత్యంత నిరర్థకమైన వృత్తుల్లో కొన్నీ – చర్చి మనుషులు, లాయర్లు, వైద్యులు, అన్ని రకాల రచయితలూ, నటీనటులు, బఫూన్లు, గాయకులు, ఆపెరా గాయకులు, డాన్సర్లు వగైరాలు – యీ తరగతిలోనే జమకట్టబడాలి."*

చక్రవర్తీ, బఫూన్లూ ఒకే జట్టులో! ఆఫీసర్లూ, చర్చి మనుషులూ జులగలు! పాండిత్య నిష్ఠ యీ రచయితను, "అన్ని రకాల రచయితలనూ" – స్వయానా తను కూడా రచయిత అయినా – ఆర్థిక దృష్ట్యా అనుత్పాదక కార్మికులుగా అంగీకరించేలా చేసింది. ఈ వాక్యాలు నిస్సందేహంగా కొంత సాహసికమూ, శక్తివంతమూ అయిన వ్యంగ్యంతో కూడినవి. కాని అది, ఆచార్యసహజమైన గాంభీర్యం వెనుకా, వాస్తవికత వెనుకా చక్కగా మరుగుపరచబడింది. అదిగో, అలాంటివాడు ఆడమ్ స్మిత్.

స్మిత్తిజం

స్మిత్ ఉపదేశం ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాల్లో అత్యధిక ప్రభావాన్ని బరపింది. ఈ రెండు దేశాల్లోనూ 18వ శతాబ్దం చివరా, 19వ శతాబ్దం మొదట్లోనూ పారిశ్రామికాభివృద్ధి శిఖరస్థాయిలో వుంది, అక్కడ రాజ్యాధికారం గణనీయమైన స్థాయిలో బూర్జువావర్గం చేతిలో వుంది.

అయితే ఇంగ్లండులో, రికార్డో వచ్చేదాకా స్మిత్ అనుచరుల్లో ముఖ్యమైన, స్వతంత్రమైన చింతనాపరులు లేరు. భూస్వాముల ప్రయోజనాలను వ్యక్తం చేసినవాళ్లే స్మిత్ తొలి విమర్శకులు. ఇంగ్లండులో మాల్తస్, ఎర్ల్ ఆఫ్ లాడర్‌డేల్‌లు వాళ్లల్లో ముఖ్యులు.

ఫ్రాన్సులో స్మిత్ ఉపదేశానికి, తరవాతి ఫిజియోక్రాట్లనుండి మొదట హార్దిక స్వాగతం లభించలేదు. అటుతర్వాత విప్లవం ఆర్థిక సిద్ధాంతంనుండి దృష్టిని మళ్లించింది. మూలమలుపు 19వ శతాబ్ది మొదట్లోనే వచ్చింది. "జాతుల సంపద"కు జెర్మేన్ గర్నీ చేసిన అనువాదం – యిదే దాని తొలి చక్కని అనువాదం – ఆయన వ్యాఖ్యల తోబాటు 1802లో ప్రచురింపబడింది. 1803లో సేయ్, సిస్మోండీలు ప్రచురించిన తమ పుస్తకాల్లో ఆ యిద్దరు అర్థశాస్త్రవేత్తలూ ప్రధానంగా స్మిత్ అనుయాయుల మాదిరిగానే కనిపించారు. సేయ్, స్మిత్‌కి భాష్యం చెప్పిన పద్ధతి, బూర్జువావర్గానికి "శుద్ధ" స్మిత్ కన్న ఎక్కువ అనుకూలంగా తయారైంది. అయితే, పెట్టుబడిదారీ

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. I, London, 1924, p. 295.

పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా సేయ్ శక్తివంతంగా వాదించిన మేరకు, ఆయన భావాలు అనేకం స్మిత్ భావాలకు సన్నిహితంగా వున్నాయి.

స్మిత్ ఉపదేశాలు ఇంగ్లండు, ఫ్రాన్సుల్లోనే ప్రగతిశీలంగా వుంటే, ఫ్యూడల్ అభివృద్ధి నిరోధక శక్తులు యింకా వుండి, బూర్జువా అభివృద్ధి అప్పుడే మొదలైన దేశాల్లో — జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీ, స్పెయిన్, రష్యా సంగతి వేరే చెప్పనక్కర్లేదనుకోండి — అవి ప్రగతిశీలమైనవనడం మరింత స్పష్టం. స్మిత్ పుస్తకం స్పెయిన్‌లోని ఇంక్విజిషన్* చేత ఆదిలో నిషేధింపబడిందని చెప్తారు. జర్మనీలో అభివృద్ధినిరోధక ప్రొఫెసర్లు స్మిత్‌ని గుర్తించేందుకు చాలాకాలం తిరస్కరించారు. అయితేనేం, జర్మన్ రాజ్యంలో మిక్కిలి పెద్దరాష్ట్రమైన ప్రష్యాలో, ఘటనా క్రమంపై స్మిత్ భావాలు తమ ప్రభావాన్ని బరపాయి. నెపోలియనిక్ యుద్ధాల కాలంలో ఉదారవాద బూర్జువా సంస్కరణలను ప్రవేశపెట్టినవాళ్లు ఆయన అనుయాయులే.

స్మిత్ ఉపదేశాలను గురించీ, ఆయన ప్రభావాన్ని గురించీ చెప్పేటప్పుడు, పూర్తి భిన్నమైన అభిప్రాయాలూ, సూత్రాలూ కలిగినవాళ్లు ఆయన భావాలను స్వీకరించడాన్నీ, ఆయనను తమ ఉపదేశకుడుగానూ, మార్గదర్శిగానూ పరిగణించడాన్నీ ఆయన అసంగతత్వమూ, ఆయన రచనల్లోని నానాత్వమూ, చివరకు పరస్పర విరుద్ధమూ కూడా అయిన ఆయన భావాలు సాధ్యంచేశాయన్న సంగతిని గుర్తుంచుకోవడం అవసరం. రికార్డో ఉపదేశాన్ని బూర్జువావర్గానికి వ్యతిరేకంగా తిప్పేందుకు ప్రయత్నించిన 1820–1840 దశకాల మధ్యనాటి ఇంగ్లీషు సోషలిస్టులు, తమను తాము ఆడమ్ స్మిత్‌కు ఆత్మిక వారసులుగా పరిగణించుకున్నారు, వారు నిజంగా స్మిత్ వారసులే కూడా. వీళ్లు, శ్రమయొక్క పూర్తి ఉత్పాదితానికీ, పెట్టుబడిదారుకోసం దాన్నుండి మినహాయింపులకూ సంబంధించిన స్మిత్ సిద్ధాంతాల పైన ప్రధానంగా ఆధారపడ్డారు. మరోవంక, ఫ్రాన్సులోని "సేయ్ శాఖవాళ్లు" కూడా — బూర్జువా అర్థశాస్త్రంలో అపభ్రంశ సమర్థక ధోరణికి వీళ్లు ప్రతినిధులు — తమను తాము స్మిత్ అనుయాయులుగా పరిగణించుకున్నారు. వాళ్లు స్మిత్‌యొక్క మరో ఆలోచనా ధోరణిపై — ఉత్పాదితాన్నీ, దాని విలువనూ సృష్టించడంలో ఉత్పత్తి అంశాల సహకారంపై — ఆధారపడ్డారు. స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా స్మిత్ చేసిన వాదనను వాళ్లు అరువుతెచ్చుకున్నారు, అయితే దానికి మొరటైన వాణిజ్య స్వభావాన్ని కల్పించారు.

స్మిత్‌నుండి సాగిన అతి ముఖ్యమైన సైద్ధాంతిక ప్రభావ రేఖ రికార్డో, మార్క్సుల దగ్గరకు దారితీసింది.

---

* కాథలిక్ మత న్యాయసభ.

సిద్ధాంతం దృష్ట్యా, నిర్దిష్ట ఆర్థిక, సామాజిక విధానం దృష్ట్యా స్మిత్ ఉప దేశంలో వివిధ పార్శ్వాలు వున్నాయి. స్మిత్ అనుయాయుల్లో కొందరు యీ ఉపదేశంలో – స్వేచ్ఛాయుత విదేశీ వాణిజ్యం, రక్షణవాదానికి వ్యతిరేకంగా పోరాటం అనే పార్శ్వాన్ని మాత్రమే తీసుకునేవారు. ఆయా నిర్దిష్ట పరిస్థితులనుబట్టి యీ వాదనను ప్రగతి శీల లేక బాగా అభివృద్ధి నిరోధక స్వభావాన్ని కలిగివుంటాయి. ఉదాహరణకు ప్రష్యాలో, స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా వాదించినవాళ్ళు యథాస్థితివాద బడా భూస్వామ్య వర్గాలు; విదేశాలనుంచి చౌకగా పారిశ్రామిక సరుకులను దిగుమతి చేసుకోవడం, తమ సొంత ధాన్యాన్ని స్వేచ్ఛగా ఎగుమతి చేసుకోవడం వాళ్లకు లాభదాయకం కావడమే యిందుకు కారణం.

స్మిత్ విషయంలో స్వేచ్ఛా వాణిజ్యం ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిన విస్తృతమైన ఫ్యూడల్ వ్యతిరేక కార్యక్రమంలో ఒక భాగం మాత్రమే అన్న విషయం మనకు పూర్తిగా తెలుసు. స్మిత్ భావాలు (అతి తరచుగా 18వ శతాబ్దపు యితర ప్రముఖ చింతనాపరుల భావాలతో దాదాపు విడదీయరాని విధంగా మిళితమైపోయి), 19వ శతాబ్దపు తొలి అర్ధభాగపు యెన్నో ప్రగతిశీల, విముక్తి ఉద్యమాల్లో గోచరిస్తాయి. నాగరకత చరిత్రలో స్మిత్‌కి గల గొప్ప పాత్ర యిదే.

స్మిత్ వ్యక్తిత్వం

ఇక స్మిత్‌ని గురించి చెప్పవలసింది ఎక్కువ లేదు. "జాతుల సంపద" ప్రచుర ణకు రెండేళ్ల తర్వాత, డ్యూక్ బక్ల్యూ, పలుకుబడి కలిగిన తదితర పరిచితులు, ఆరాధ కుల కృషి ఫలితంగా, స్మిత్‌కి ఎడిన్‌బరోలో కస్టమ్స్ శాఖలో సుకరమైన స్కాటిష్ కమి షనర్ ఉద్యోగం లభించింది. సాలుసరి జీతం ఆరు వందల పౌన్లు, ఆ రోజుల్లో యిది పెద్ద మొత్తం. తన జీవితపు మిగిలిన రోజులను స్మిత్, సుంకాల వసూళ్లను అజమాయిషీ చేస్తూనూ, లండనుకు ఉత్తరాలు రాస్తూనూ, మధ్యమధ్యలో స్మగ్లర్లను పట్టుకునేం దుకు సైనికులను పంపుతూనూ, ఆ కస్టమ్స్ ఉద్యోగంలో గడిపాడు. ఆయన ఎడిన్ బరోకి మకాం మార్చి, పట్నపు పాత భాగంలో ఒక యింటివాటాను అద్దెకు తీసుకు న్నాడు. తన వెనకటి మిత జీవిత విధానాన్నే కొనసాగిస్తూ, పెద్ద మొత్తాలను దాన ధర్మాలకు వెచ్చించాడు. తన పెద్ద గ్రంథాలయమే ఆయన మిగిల్చిన ఒకేఒక విలువైన వస్తువు. స్మిత్తే ఒకసారి యిలా అన్నాడు: "నా పుస్తకాలే తప్ప నేను బడాయి చెప్పుకో వలసింది మరేమీ లేదు."

18వ శతాబ్దంలో స్మిత్‌కి దొరికినమాదిరి ప్రభుత్వ ఉద్యోగాలు పోషకుల ద్వారా మాత్రమే లభించేవి. అవి జీతంతో కూడిన అద్భుతమైన గౌరవ పదవులుగా పరిగణింప బడుతూండేవి. కాని, కర్తవ్యపరాయణుడూ, చాదస్తుడూ అయిన స్మిత్, తన విధులను గురించి మనస్సుకు గాఢంగా పట్టించుకొని, ఆఫీసు బల్లముందు చాలా టైము గడిపే వాడు. ఆ పని ఒక్కటే (దానికి ముసిలితనం, అస్వస్థతా తోడుకావడంతో) తన కాలాన్ని ఎక్కువగా మింగెయ్యడంతో, ఆయన యింకే మాత్రమూ గాఢంగా అధ్యయనం చెయ్యలేకపోయేవాడు. దానిపట్ల స్మిత్‌కి ప్రత్యేక వాంఛ లేదేమోనని కూడా అనిపించేది. ఆయన మొదట్లో తన మిక్కిలి పెద్ద పుస్తకాల్లో మూడవదాన్ని — సంస్కృతీ పాండిత్యాల సార్వత్రిక చరిత్ర వంటిదాన్ని — రచించాలని పథకం వేసుకున్న మాట నిజమేననుకోండి. అయితే తన యీ సంకల్పాన్ని ఆయన త్వరలోనే వదులుకు న్నాడు. ఆయన మరణానంతరం ఆయన కాగితాల్లో ఖగోళ, తత్వశాస్త్రాల, చివరకు లలిత కళల చరిత్రపైన కనిపించిన ఆసక్తికరమైన కొన్ని నోట్సు ప్రచురింపబడ్డాయి. ఆయన రచనల కొత్త ముద్రణలకోసం ఆయన కాలంలో ఎక్కువ భాగం వ్యయమ య్యేది. ఆయన జీవిత కాలంలో ఇంగ్లండులో, "నైతిక భావాలేగల సిద్ధాంతం"కి ఆరు ముద్రణలూ, "జాతుల సంపద"కు ఐదు ముద్రణలూ వెలువడ్డాయి. మూడవ ముద్రణకు (1784) స్మిత్ ముఖ్యమైన కొన్ని చేర్పులు చేశాడు, ప్రత్యేకించి "వ్యాపార వాద విధాన పరిసమాప్తి"పై ఒక ప్రకరణాన్ని చేర్చాడు. తన పుస్తకాల విదేశీ అను వాదాల ముద్రణ విషయంలో కూడా ఆయన శ్రద్ధ వహించేవాడు; రెండు ఫ్రెంచి అనువాదాలు ప్రచురింపబడ్డాయి, జర్మన్, డేనిష్, ఇటాలియన్ భాషల్లో ఒక్కొక్క అనువాదం చొప్పున ప్రచురణకు సన్నాహం జరిగింది. "జాతుల సంపద" ఐర్లండు, అమెరికాల్లో ఇంగ్లీషు భాషలో ప్రచురింపబడింది. "జాతుల సంపద" ప్రచురణా నంతరం మొదటి 50 ఏళ్లలోనూ వెలువడిన ముద్రణల ప్రతులతో ఓ చిన్న సైజు పాత పుస్తకాల షాపు నిండుతుంది. మొదటి రష్యన్ ముద్రణ 1802–1806 మధ్య వెలువడింది. 1917 అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం వెలువడిన నాలుగింటితో కలుపుకుని, స్మిత్ పుస్తకానికి మొత్తం ఎనిమిది ముద్రణలు వెలువడ్డాయి.

దేశంలో, లండను తర్వాత స్కాటిష్ రాజధానే రెండవ సాంస్కృతిక కేంద్రం, కొన్ని విషయాల్లో అది దానికి ఏమాత్రం తీసిపోదు. మరోవంక, దానితో పోల్చినప్పుడు అది చిన్నదిగానూ ఒద్దికగానూ వుండే పట్టణం. తన పాత సంప్రదాయం ప్రకారం, స్మిత్‌కి అక్కడకూడా ఓ సొంత క్లబ్బు వుండేది. అక్కడ ఆయన క్రమబద్ధంగా సన్ని హిత స్నేహితుల, పరిచితుల బృందంతో కలుస్తూండేవాడు. దీనికితోడు, స్నేహితులు ప్రతి ఆదివారం ఆయనతో కలిసి భోజనం చేస్తూండేవారు. అప్పటికే యూరప్‌లో ప్రముఖ

వ్యక్తి అయిన స్మిత్, ఒక విధంగా ఎడిన్‌బరోలో దర్శనీయ వ్యక్తిగా తయారయాడు. లండన్, పారిస్‌లనుండీ, బెర్లిన్, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లనుండీ వచ్చే ప్రయాణికులు ఆ స్కాటిష్ రుషితో పరిచయానికి తహతహలాడేవారు.

ఆకారం రీత్యా స్మిత్‌లో విశేషమైందీ, చెప్పుకోదగిందీ ఏమీ లేదు. సగటుకు కొంచెం ఎక్కువ ఎత్తైన స్మిత్, వంగకుండా తిన్నగా నడిచేవాడు. సరళమైన ఆయన ముఖంలో కచ్చితమైన రేఖలు, గచ్చకాయ—నీలం రంగు కళ్లు, తిన్నని పెద్ద ముక్కు కొట్టవచ్చినట్లు కనిపించేవి. చూపరుల దృష్టికి సదరుగా కనిపించని దుస్తులు వేసుకునే వాడు. తన జీవితాంతందాకా ఒక విగ్గు ధరించేవాడు. ఒక వెదురు బెత్తాన్ని భుజం పైన పెట్టుకొని నడవడానికి యిష్టపడేవాడు. తనలో తను గొణుక్కోడానికి ఆయన ఎంతగా అలవాటుపడ్డాడంటే, ఓ రోజున ఆయన అలా మాట్లాడుకోవడం చూసిన యిద్దరు మార్కెట్ మహిళలు, ఆయన పిచ్చివాడేమోనని అనుమానపడ్డారట కూడా. వారిలో ఒకామె అదో మాదిరిగా తల ఎగరేసి, "ఏమండోయ్!" అందిట. రెండో ఆమె, "ఈయన పిచ్చివాడు, పాపం!" అందిట. ఆయన చాలా పరధ్యానంగా వుండేవాడు. ఇతరులతోడి వ్యవహారాల్లో ఆయన ఉదారంగానూ, సాయిలాపాయిలాగా వాగుతూనూ వుండేవాడు. ఆయన సమకాలీనుల్లో ఒకడు, బహుశా కొంత అతిశయోక్తిగానే అయ్యుండ వచ్చు, యిలా రాశాడు: "నేను చూసినంతవరకు, నలుగురిలోనూ వున్నప్పుడు ఆయనంత పరధ్యానం మనిషి మరొకడు లేడు; పెదవులు కదుపుతూ, తనలో తను గొణుక్కొం టూండేవాడు, తనలో తను నవ్వుకొంటూండేవాడు. తన సగటికలనుంచి లేపి, సంభా షణాంశం పైకి ఆయన దృష్టిని మళ్లించామో, ఆయన వెన్వెంటనే జలపాతసదృశమైన తన వాగ్ధోరణి మొదలుపెట్టేవాడు, అత్యంత తాత్విక చాతుర్యంతో తనకు తెలిసిం దంతా మనకి చెప్పేదాకా వదిలిపెట్టేవాడు కాదు."*

స్మిత్ 1790 జూలైలో, తన 67వ ఏట ఎడిన్‌బరోలో మరణించాడు. మర ణానికి దాదాపు నాలుగేళ్లకు ముందే ఆయన తీవ్రంగా అస్వస్థుడయాడు.

స్మిత్ గణనీయమైన స్థాయిలో మేధావిగా, ఒక్కొక్కమారు పౌరుడుగా అయిన ధైర్యాన్ని ప్రదర్శిస్తూండేవాడు, అయితే ఆయన ఏ విధంగానూ కూడా యోధుడు కాదు. ఆయన మానవత్వం కలిగినవాడు, అధర్మాన్నీ, క్రౌర్యాన్నీ, హింసనూ అసహ్యిం చుకునేవాడు, అయినాకూడా, తారతమ్యరీత్యా తేలికగా వాటితో సరిపెట్టుకునేవాడు. హేతుజ్ఞాన, సంస్కృతుల విజయంలో ఆయనకి విశ్వాసం వుండేది, యీ మొరటు,

---

* C. R. Fay, *Adam Smith and the Scotland of His Day*, Cambridge, 1956, p. 79.

చెడ్డ ప్రపంచంలో వాటి భవితవ్యంపట్ల విశేషంగా భయం చూపేవాడు. ఆయన ధాష్ట్రీకపు ఉద్యోగులను అసహ్యించుకున్నాడు, అయితే వాళ్ళలో తనూ ఒకడయ్యాడు.

పేదశ్రామికజనంపట్ల, కార్మికవర్గంపట్ల స్మిత్ విశేషమైన సానుభూతిని ప్రదర్శించేవాడు. వేతన శ్రామికులకు సాధ్యమైనంత అత్యున్నత వేతనం ముట్టాలనీ, సమాజంలోని "అధిక సంఖ్యాకులు పేదలుగానూ, అసంతోషంగానూ వుంటే సమాజం సంపన్నమై, సంతోషంగా ఉండజాలద"నీ ఆయన వాదించేవాడు. తమ శ్రమతో యావత్తు సమాజాన్నీ పోషించే జనం పేదతనంలో బతకడం అన్యాయం అనేవాడు. అయితే అదేసమయంలో, "సహజ నియమాలు" కార్మికులకు సమాజంలో అతి నిమ్న స్థానాన్ని నిర్దేశించాయని ఊహించాడు. "శ్రామికుని ప్రయోజనం సమాజ ప్రయోజనంతో కచ్చితంగా ముడిపడివున్నప్పటికీ, ఆ ప్రయోజనాన్ని అవగతం చేసుకునే, లేక, తన సొంత ప్రయోజనంతో దానికి గల సంబంధాన్ని అర్థంచేసుకొనే సామర్థ్యం అతనికి లేదు"* అని స్మిత్ భావించాడు.

బూర్జువావర్గాన్ని పెరిగే, ప్రగతిశీల వర్గంగా పరిగణించి, వాస్తవిక దృష్టితో దాని ప్రయోజనాలను – దాని సంకుచితము, తాత్కాలికమైన వాటిని కాక, దాని విస్తృతమూ, దీర్ఘకాలికమూ అయిన ప్రయోజనాలను – స్మిత్ వ్యక్తంచేశాడు. అయితే తను స్వతహాగా నిమ్న వర్గానికి చెందిన మేధావి అయిన కారణంగా, పెట్టుబడిదారులుగా పెట్టుబడిదారులంటే స్మిత్‌కి బొత్తిగా యిష్టం లేదు. లాభతృష్ణ వాళ్ల కళ్లను కప్పి వేస్తుందనీ, వాళ్లని కఠినాత్ములను చేస్తుందనీ ఆయన భావించాడు. లాభంకోసం, సమాజ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎటువంటి పనిచెయ్యడానికైనా సరే వాళ్లు సిద్ధం. తమ వస్తువుల ధరలు పెంచడానికీ, తమ కార్మికుల వేతనాలను తగ్గించడానికీ తమ శక్తికొద్దీ పెట్టుబడిదారులు తంటాలుపడతారు. పారిశ్రామికవేత్తలూ, వ్యాపారస్తులూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని అణచివేసేందుకూ, దాన్ని పరిమితంచేసేందుకూ, సమాజానికి హానిదాయకమైన గుత్త సంస్థలను సృష్టించేందుకూ తప్పనిసరిగా ప్రయత్నిస్తారు.

మొత్తంమీద, స్మిత్ దృష్టిలో పెట్టుబడిదారు, ప్రగతికీ, "జాతి సంపద" పెరుగుదలకూ సహజమైన సాధనం. బూర్జువావర్గపు ప్రయోజనాలు సమాజపు ఉత్పాదక శక్తుల పెరుగుదల ప్రయోజనాలతో ఏకీభవించినమేరకే, బూర్జువావర్గ ప్రయోజనాలను స్మిత్ బలపరుస్తాడు.

---

* A. Smith, *The Wealth of Nations*, Vol. I, London, 1924, p. 230.

ప్రకరణం 12

సిటీలోని మహా మేధావి డేవిడ్ రికార్డో

1799లో లండన్ స్టాక్ ఎక్స్చేంజి సంపన్న సభ్యుడొకడు ప్రకృతి చికిత్సా కేంద్రమైన బాత్‌లో కొంత కాలం వున్నాడు. అక్కడ ఆయన భార్య ఖనిజోదక చికిత్స పొందుతూవుండేది. అక్కడ పౌర గ్రంథాలయానికి యాదృచ్ఛికంగా వెళ్లిన ఆ పెద్ద మనిషి, ఆడమ్ స్మిత్ రాసిన "జాతుల సంపద" పేజీలు తిరగెయ్యడం సంభవించింది. ఆ పుస్తకంలో ఆసక్తి పుట్టి, దాన్ని తన గదికి పంపమని ఆయన పురమాయించాడు. రికార్డో అర్థశాస్త్రంకేసి తన దృష్టిని మళ్లించడం మొట్టమొదట యిలా జరిగింది.

ఈ ఘటనను స్వయంగా రికార్డోయే పేర్కొన్నాడు. అయితే, ఐసాక్ న్యూటన్ ఆపిల్, జేమ్స్ వాట్ కెటిల్ మాదిరిగానే యిది కూడా చమత్కార వృత్తాంతమే. విద్యావంతుడైన రికార్డోకి స్మిత్ పుస్తకాన్ని గురించి తెలిసేవుంటుంది. రికార్డోకి ఆర్థికశాస్త్రాన్ని గూర్చిన విస్తృత జ్ఞానం అప్పటికే వుంది, ఆయనకి ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల్లో వున్న ఆసక్తి కారణంగా, ఆలోచనను సాధారణీకరించే సామర్థ్యమూ వుంది. ఏదేమైనా, బాత్‌లోని గ్రంథాలయం ఆయనకి ప్రేరకంగా పనిచేసివుండవచ్చు.

విరామ సమయాల్లో ఖనిజశాస్త్రాన్ని అధ్యయనంచేస్తూ, రికార్డో తన ధనార్జనను కొనసాగించాడు. అయితే అర్థశాస్త్రమే యిప్పుడిక ఆయన ప్రధాన కార్యకలాపమూ, ప్రధానాభిరుచీని. రికార్డోకు గల మేలి గుణాల్లో అత్యంత ప్రస్ఫుటమైన దేమిటంటే, విజ్ఞానశాస్త్రంపట్ల ఆయనకి గల నిస్స్వార్థమైన తృష్ణ, ఆయన నిరంతర, నిస్స్వార్థ సత్యసంశోధన. ఆయన విజ్ఞానశాస్త్రాన్ని ఎన్నడూ డబ్బుకోసం గాని, వృత్తిపరమైన ఉన్నతికోసం గాని, కీర్తికోసం గాని అధ్యయనం చేసేవాడు కాదు. ఆయన విషయంలో అర్థశాస్త్ర అధ్యయనం అన్నది ఒక ఆంతరిక, దైహిక తపన, ఆయన ప్రతిభావంతమైన వ్యక్తిత్వావిష్కారానికి హేతుబద్ధమైన ఒక మార్గం. రికార్డో నిగర్వి, తన జీవితకాల మంతట్లోనూ విజ్ఞానశాస్త్రంలో తనను తానొక ఔత్సాహికునిగా మాత్రమే పరిగణించు కున్నాడు. అయితే యీ ఔత్సాహికుడే ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్ర సృష్టిని పూర్తిచెయ్యవలసివుంది.

శాస్త్రీయమైన ఆర్థిక పరిశోధనా పద్ధతులను రికార్డో విస్తరింపజేశాడు. అదే ఆయన చేసిన గొప్ప సేవ. ఆయన సమకాలికులు రికార్డో లేఖినినుండి వెలువడిన "అర్థశాస్త్రం అనే నూతన విజ్ఞానశాస్త్రం" గురించి చెప్పారు. అలా అనడంలో వారు కొంతవరకు సరిగానే చెప్పారనుకోవాలి. ఆయన రచనల్లో అర్థశాస్త్రం మొట్టమొదటి సారిగా, సమాజపు ఆర్థిక పునాదికి సంబంధించిన ఒక జ్ఞాన వ్యవస్థగా విజ్ఞానశాస్త్ర లక్షణాలను సంతరించుకుంది. ఆర్థికవేత్తల బుర్రలను ఎప్పుడూ వేధిస్తూవచ్చిన ఒక ప్రశ్నకు జవాబును కనుగొనేందుకు రికార్డో ప్రయత్నించాడు — సమాజపు పాదార్థిక సంపద పెరుగుదలకు, ఉత్పత్తి పంపిణీలయొక్క అత్యంత సానుకూల (అత్యుత్తమ) సామాజిక పరిస్థితులు ఏమిటన్నదే యీ ప్రశ్న. ఈ సమస్యపైన ఆయన వెల్లడించిన కొన్ని భావాలు, యీనాటికీ తమ ప్రాముఖ్యాన్ని కోల్పోలేదు. రికార్డో సైద్ధాంతికాభి ప్రాయాల ఒక ముఖ్య లక్షణం ఏమిటంటే — వాటి ఏకత్వం. ఆర్థిక వాస్తవికతయొక్క వేర్వేరు అన్ని యథార్థాల శాస్త్రీయ వివరణకూ ప్రాతిపదిక అయిన ఒకేఒక సాధారణ భావపు అస్తిత్వమే అది. తనకు గొప్ప ఆద్యుడైన ఆడమ్ స్మిత్‌ని అనుసరించి, ఆర్థిక వ్యవస్థను ఒక సంక్లిష్ట విధానంగా అధ్యయనం చేసేందుకూ, దాని సమతూకపు మౌలిక పరిస్థితులను నిర్వచించేందుకూ రికార్డో ప్రయత్నించాడు. ఆర్థిక వ్యవస్థలో వస్తుపర మైన నియమాలు ఉన్నాయి, అప్పుడున్న ధోరణులుగా యీ నియమాలు పనిచెయ్యడాన్ని స్థిరంచేసే యంత్రాంగాలు వున్నాయన్న ఆయన విశ్వాసంతో యిది ముడిపడివుంది. ఆర్థికశాస్త్రంలో "స్వయం నియంత్రణ యంత్రాంగ" సమస్య యీనాటికీ తన సైద్ధాంతిక, ఆచరణాత్మక ప్రాముఖ్యాన్ని కలిగివుంది. ఆర్థికశాస్త్రంలో డబ్బు చలామణీ, రుణం, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు, పన్నుల విధానం వంటి నిర్దిష్ట రంగాల అభివృద్ధిలో రికార్డో రచనలు గణనీయమైన పాత్రను వహించాయి. భూమి కౌలు, అంతర్జాతీయ శ్రమ విభజన సిద్ధాంతాలపైన రికార్డో వెల్లడించిన భావాలు ఆర్థిక ఆలోచనా భాండాగారంలో ఒక భాగమయ్యాయి. ప్రగాఢ సిద్ధాంతకారుడైన రికార్డో, అదే సమయంలో తన కాలపు, తన దేశపు ఆర్థిక సమస్యలతో సన్నిహిత సంబంధాలు కూడా కలిగివున్నాడు. వాదప్రతివాదాల్లో ఆయన నిపుణుడు. ఆర్థిక, సామాజిక సమస్యల పైన ప్రతిభావంతుడైన పత్రికా రచయిత. రికార్డో శాస్త్రీయ నీతినియమాల విష యంలో ఉన్నత సూత్రాలను పాటించాడు, అవి యీనాటికీ గౌరవపాత్రమై, ఆదర్శ వంతమై వున్నాయి.

రికార్డో కాలం నాటికి అర్థశాస్త్రవేత్త వృత్తి అంటూ ఏమీ యింకా స్థిరపడలేదు. అప్పుడు సైతం యీ విజ్ఞానశాస్త్రంలో ఆయన మార్గం గణనీయమైనదిగా వుండి, ఆయన సమకాలికుల మెప్పును సంపాదించుకుంది. ఆయన శిష్యుల్లో ఒకడు 1821లో

యిలా రాశాడు: "ఒక ఇంగ్లీషువాడు, అందునా పాండిత్య విద్యా భవనాంతర్మందిరాల్లో లేనివాడు, నెత్తిపైన వ్యాపార, సాంఘిక బాధ్యతలు కలిగినవాడు, యూరప్‌లోని మొత్తం విశ్వవిద్యాలయాలూ, ఒక శతాబ్దపు చింతనాపరులందరూ వెంబడుకవాసి కూడా ముందుకు తీసుకెళ్లలేకపోయినదాన్ని సాధించాడా?"*

పారిశ్రామిక విప్లవం

ఇంగ్లండు దాదాపుగా ఒక పావు శతాబ్దం పాటు — మొదట జాకొబిన్లతోనూ, తర్వాత జనరల్ బోనపార్ట్‌తోనూ, చివరకు నెపోలియన్ చక్రవర్తితోనూ — యుద్ధంలో వుంది. 1815 వేసవిలో వాటర్లూ విజయంతో ఆ యుద్ధం ముగిసింది. ఇంగ్లండు అప్పుడిక విజయ ఫలితాలను అనుభవించగలిగివుంది, ఏ యూరపియన్ దిగ్బంధంద్వారా అయితే నెపోలియన్ ఇంగ్లండు వర్తకాన్ని నులిమెయ్యాలని ఆశించాడో — ఆ దిగ్బంధం భగ్నమైపోయింది. ఇంగ్లీషు సరుకులకు — అప్పట్లో ప్రపంచంలోనే అత్యుత్కృష్టమైన, అత్యంత వైవిధ్యపూరితమైన సరుకులకు — యూరపియన్ మార్కెట్ల ద్వారాలు తెరుచుకున్నాయి.

యుద్ధం, ఇంగ్లీషు తీరాలకు చాలా దూరాన, యూరప్ ఖండంలో, వలసల్లో, మహా సముద్రాలపైన, జరిగింది. ఇంగ్లండు సంపన్నమయేందుకు ఆటంకం కాకపోగా, అది తోడ్పడింది. 18వ శతాబ్దపు చివరి మూడవ భాగమూ, 19వ శతాబ్దపు మొదటి మూడవ భాగమూ — యిదే ఇంగ్లీషు పారిశ్రామిక విప్లవ కాలం. పెట్టుబడి దారీ విధానం కార్ఖానా దశను దాటి యంత్ర పరిశ్రమల దశలో ప్రవేశించింది. గృహ కార్ఖానాల స్థానంలో వందలాదిమందిచేత పనిచేయించుకొనే ఫ్యాక్టరీలు వచ్చాయి. మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, గ్లాస్గో వంటి కాంతిహీనమైన మసిబారిన పారిశ్రామిక పట్టణాలు తలెత్తాయి. పత్తి పరిశ్రమ పారిశ్రామిక విప్లవానికి యిరుసైంది. దానికోసం యంత్రాలనూ, యింధనాన్నీ ఉత్పత్తిచేసే శాఖలు కూడా అభివృద్ధిచెందాయి. బొగ్గు, ఇనుముల యుగం మొదలైంది. ఆవిరి ప్రధాన చాలకశక్తి అయింది. 1822లో రికార్డో యూరప్ ఖండానికి ఒక ఆవిరినౌకమీద ప్రయాణం చేశాడు. ఆయన మరణానికి రెండేళ్ల తర్వాత మొట్టమొదటి ఆవిరి రైలు రంగంలోకి వచ్చింది.

---

* M. Blaug రచించిన *Ricardian Economics. A Historical Study*, New Haven, 1958, p. V నుండి ఉల్లేఖింపబడింది.

ఇంగ్లీషు గ్రామీణప్రాంతం మారిపోతోంది. తమ సొంత భూములపైనో, లేక కౌలు భూములపైనో స్వతంత్రమైన చిన్న రైతు కమతాలు అంతరిస్తున్నాయి. వాటి స్థానంలో పెద్ద ఎస్టేట్లూ, పెట్టుబడిదారీ కౌలు వ్యవసాయదారుల కమతాలూ అవతరిస్తున్నాయి. వ్యావసాయిక శ్రామికవర్గం రూపొందుతోంది, దానిలోంచి వచ్చినవాళ్లు గనిపనివాళ్ల, తవ్వకం కూలీల, తాపీ పనివాళ్ల, ఫ్యాక్టరీ కార్మికుల శ్రేణులను నింపుతున్నారు.

ఇంగ్లీషువారు సంపన్నులయ్యారు, కాని యీ సంపదతోబాటు పంపిణీలో అసమానత మొదలైంది. వర్గ వ్యత్యాసాలు మరింత నిశితమూ, ప్రస్ఫుటమూ అయాయి. కార్మికులకు సంబంధించినంతవరకు అదొక భయంకరమైన క్రూర ప్రపంచంగా తయారైంది. 1842లో మొట్టమొదటి సారిగా ఇంగ్లండుకు వచ్చి, దాన్ని చూసిన యువ ఎంగెల్సు దిగ్భ్రాంతి చెందాడు. పనిదినం 12–13 గంటలు, ఒక్కొక్కమారు యింకా ఎక్కువ గంటలు వుండేది. జనం ఆకలితో చచ్చిపోకుండా వుంచగలిగేటంతమట్టుకే వేతనాలు వుండేవి. నిరుద్యోగమో, అనారోగ్యమో కార్మికుడినీ, అతని కుటుంబాన్నీ పస్తుల పాల్జేసేది. యంత్రాల సాయంతో ఫ్యాక్టరీ యజమానులు, ప్రత్యేకించి జౌళి పరిశ్రమలో, స్త్రీల, పిల్లల శ్రమను మరింత తక్కువ కూలికి వినియోగించుకోగలిగేవారు.

అన్ని రకాల కార్మిక సమాజాలూ, సంఘాలూ చట్టం ద్వారా నిషేధింపబడ్డాయి, వాటి కార్యకలాపాలు తిరుగుబాటుగా పరిగణింపబడ్డాయి. దారుణమైన యీ పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగిన తొలి కార్మిక ప్రదర్శనలు, నిస్పృహా కోపాల కారణంగా సద్యోజనితంగా రేగిన ప్రజ్వలనలు. యంత్రాలే తమ కష్టాలకు కారణభూతమైనవని అమాయకంగా నమ్మిన లుడ్డైట్లు వాటిని ధ్వంసంచేశారు. 1811–12 సంవత్సరాల్లో వాళ్ల ఉద్యమం గణనీయంగా పెరిగింది. నిరాశా నిస్పృహలకు గురైన యీ బడుగు జీవులను బలపరుస్తూ ప్రభువుల సభలో ప్రసిద్ధకవి బైరన్ ఒంటరిగా ఎలుగెత్తి చాటాడు. లుడ్డైట్ల చర్యలను రికార్డో సమర్థించలేకపోయాడనడం స్పష్టం, కాని కార్మిక సంఘాలను చట్టసమ్మతం చేసేందుకు ఆయన ముందుకు వచ్చాడు. యంత్రాల వాడకం మూలంగా కలిగే సామాజిక పర్యవసానాలను తన రచనల్లో నిగ్రహంతో విశ్లేషించిన మొదటివాడు రికార్డోయే. 1819లో పీటర్స్‌ఫీల్డు ప్రాంతంలో మాంచెస్టరు కార్మికులు జరిపిన ఒక పెద్ద ప్రదర్శనపై సైనికులు కాల్పులు జరిపారు. సమకాలీనులు యీ మూకుమ్మడి హత్యాకాండను అపహాస్యంగా "పీటర్లూ విజయం" అని పిలిచేవారు (యిది వాటర్లూ ప్రస్తావన).

అయితేనేం, బూర్జువా, శ్రామికవర్గాల మధ్య వర్గవైరుధ్యం, 19వ శతాబ్ది

మొదట్లో యింకా సమాజంలోని ప్రధానమైన, అన్ని సామాజిక సంబంధాలనూ, భావజాలాలనూ నిర్ణయించే వైరుధ్యం కాదు. బూర్జువావర్గం అప్పటికింకా ఆరోహణ దశలో వున్న వర్గం, మొత్తంమీద దాని ప్రయోజనాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధికి అనుగుణంగా వున్నాయి. కార్మికవర్గం యింకా బలహీనంగానూ, అసంఘటితంగానూ ఉంది. సామాజిక సంబంధాల్లోనూ, రాజకీయాల్లోనూ అదొక కర్మే గాని కర్త కాదు.

బూర్జువావర్గ ప్రయోజనాలు భూస్వాముల అతిక్రమణ ప్రయత్నాల మూలంగానే మరింతగా ముప్పులో పడ్డాయి. ధాన్యం ధర పెరుగుదల భూస్వాముల భూమికౌలు పెరుగుదలకు కారణమైంది. యుద్ధానంతరం వాళ్ళ టోరీ పార్లమెంటుచేత ధాన్యపు చట్టాలను జారీచేయించుకోగలిగారు. ఆ చట్టాలు ఇంగ్లండులోకి విదేశీ ధాన్యపు దిగుమతులను విశేషంగా పరిమితంచేసి, రొట్టె ధరను ఎక్కువ స్థాయిలో ఉంచేందుకు తోడ్పడ్డాయి. ఇది ఫ్యాక్టరీ యజమానులకు నష్టదాయకంగా పరిణమించింది, కార్మికులు పస్తులుండకుండా చూడటానికి వాళ్లకు మరింత ఎక్కువ వేతనాలు యివ్వవలసి వచ్చింది. 19వ శతాబ్దపు మొదటి అర్ధభాగం అంతట్లోనూ ధాన్యపు చట్టాల విషయంలో జరిగిన పోరాటం ఇంగ్లీషు రాజకీయ జీవితంలో ఒక ముఖ్య భాగం. ఆర్థిక వేత్తల వైఖరులను చాలవరకు అదే నిర్ణయించింది. ఆ పోరాటంలో భూస్వాముల ప్రయోజనాలు, కొంతమేరకు పారిశ్రామిక బూర్జువావర్గపు, కార్మికవర్గపు సంయుక్త ప్రయోజనాలతో ఘర్షణపడ్డాయి.

అటువంటి చారిత్రక పూర్వరంగంలో రికార్డో బోధన పరిణతి చెందింది, ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రం శిఖర స్థితికి చేరుకుంది. మౌలిక సామాజికార్థిక సంబంధాలను, ప్రత్యేకించి పెట్టుబడికీ, శ్రమకీ మధ్య సంబంధాలను రికార్డో ఎందుకు అంతటి శాస్త్రీయ వస్తుపరతతోనూ, నిష్పాక్షికతతోనూ విశ్లేషించగలిగాడన్న విషయాన్ని యీ పూర్వరంగం కొంతమేరకు తెలియజేస్తుంది. సహజంగానే, పండితుడైన రికార్డో వ్యక్తిత్వం కూడా దీనిలో ఒక ముఖ్య పాత్రను వహించింది.

అత్యంత సంపన్న అర్థశాస్త్రవేత్త

ఇంగ్లీషులో ఒక జోక్ వుంది: అర్థశాస్త్రవేత్త అంటే ఎవరు? తన జేబులో చిల్లి కానీ కూడా లేనివాడు, యితరులకు సలహాలు యిచ్చేవాడు. మరి ఆ సలహాలు ఎటువంటివి? వాటిని అనుసరిస్తే వాళ్ల జేబుల్లో కూడా చిల్లి కానీ మిగలదు! అయితే

ప్రతి సూత్రానికీ ఒక మినహాయింపు ఉంటుందనుకోండి. రికార్డో గణనీయమైన మొత్తంలో సంపదను కూడబెట్టాడు, అప్పుడప్పుడు తన మిత్రులకు, ప్రత్యేకించి మాల్తస్‌కు, వాళ్ళ తమ డబ్బును మదుపుపెట్టే విషయంలో చక్కని సలహాలు యిస్తూండేవాడు. వాళ్లకి ఆ సలహాలను గురించి అసంతృప్తి వెల్లడించవలసిన అవసరం వుండేది కాదు.

రికార్డో తాతముత్తాతలు ఇంక్విజిషన్ (క్రైస్తవ మత న్యాయసభ) వేధింపునుంచి పారిపోయి హాలండులో స్థిరపడిన స్పానిష్ యూదులు. ఈ గొప్ప అర్థశాస్త్రవేత్త తండ్రి 1760 దశకంలో ఇంగ్లండుకు వచ్చాడు. అక్కడ అతను మొదట్లో టోకు వర్తకం చేశాడు, అటుతర్వాత ఎక్స్‌చేంజి బిల్సులోనూ, సెక్యూరిటీ పత్రాల్లోనూ వర్తకం చేశాడు. అతని పదిహేడుమంది పిల్లల్లోనూ డేవిడ్ మూడోవాడు. డేవిడ్ 1772లో లండన్లో పుట్టాడు. సాదా ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. అటుతర్వాత అతన్ని రెండేళ్ల పాటు ఆంస్టర్‌డామ్‌కి పంపారు. అక్కడ అతను తన పినతండ్రి ఆఫీసులో వాణిజ్య రహస్యాలను అభ్యసించనారంభించాడు.

లండనుకు తిరిగివచ్చాక డేవిడ్ తన చదువును కొనసాగించాడు. అయితే క్రమబద్ధమైన అతని విద్యాభ్యాసం అతని పద్నాలుగవ ఏట ముగిసిపోయింది. అతను ప్రైవేటు టీచరు దగ్గర పాఠాలు చెప్పించుకోడానికి అతని తండ్రి అనుమతించాడు. ఈ యువకుని అభిరుచులు వర్తకుడికి కావలసినవిగా అతని తండ్రి పరిగణించినవాటిని మించిపోయినట్లు త్వరలోనే బయటపడింది. ఇది అతని తండ్రికి రుచించకపోవడంతో ఆ క్లాసులకు స్వస్తి జరిగింది. 16వ ఏటికల్లా డేవిడ్ తన తండ్రికి ఆఫీసులోనూ, స్టాక్ ఎక్స్‌చేంజిలోనూ మిక్కిలి విశ్వాసపాత్రుడైన సహాయకుడయ్యాడు. మానసికంగా అతను తన వయస్సుకు మించి పరిణతిచెందాడు. పరిశీలన, కల్పనాశక్తి, శక్త్యుత్సాహాలు — తన యీ లక్షణాలతో అతను త్వరలోనే స్టాక్ ఎక్స్‌చేంజిలోనూ, నగరంలోని వ్యాపార కార్యాలయాల్లోనూ నలుగురి దృష్టినీ ఆకట్టుకున్నాడు. అతని తండ్రి అతనికి సొంతంగా పరిష్కరించవలసిన వ్యవహారాలను అప్పగించడం మొదలుపెట్టాడు.

అయితే అలాంటి వ్యక్తి, తన తండ్రి నిరంకుశత్వాన్నీ, ఛాందసాన్నీ సహించలేకపోవడం సహజమే కదా. అతను మతాన్ని లక్ష్యపెట్టేవాడు కాడు, కాని యింటి దగ్గర తప్పనిసరిగా అతను యూదుమతంలోని మూఢాచారాలనూ, కర్మకాండనూ తు. చ. తప్పకుండా అనుసరించవలసివచ్చేది. తనొక క్రిస్టియన్ యువతిని పెళ్లిచేసుకోదలచినట్లు రికార్డో తన తండ్రితో చెప్పగానే యీ ఘర్షణ బయటపడింది. ఆ యువతి ఒక క్వేకర్ వైద్యుడి కూతురు. అతను కూడా యింట్లో, రికార్డో తండ్రి మాదిరి నిరంకుశుడే. రెండు కుటుంబాల యిష్టానికీ వ్యతిరేకంగా ఆ పెళ్లి జరిగింది. ఒక క్రిస్టియన్ యువతిని

పెళ్లిచేసుకోవడంతో రికార్డో యూదు సమాజంనుంచి వెలివెయ్యబడ్డాడు. అతను క్వేకరుగా మారక, యూనిటేరియనిజాన్ని స్వీకరించాడు. సాంప్రదాయికమైన ఆంగ్లికన్ చర్చినుంచి విడిపోయిన అత్యంత స్వేచ్ఛాయుతమూ, మిక్కిలి వెసులుబాటుతనమూ కలిగిన శాఖ యిది. బహుశా అతని నాస్తికతవాదానికి యిదొక పట్టి మేలిముసుగు మాత్రమే అయ్యుంటుంది.

యువ దంపతులకు తమతమ తలిదండ్రులనుంచి సహజంగానే ఏమీ ముట్టక పోవడంతో, యీ ప్రేమ కథాంతం దారిద్ర్య మేఘావృతమై యుండేదే. పాతికేళ్లు విండేసరికే రికార్డో ముగ్గురు బిడ్డల తండ్రి అయాడు (అతనికి మొత్తం ఎనమండుగురు పిల్లలు). స్టాక్ ఎక్స్చేంజిలో ఆడే జూదం తప్ప అతనికి తెలిసిన వృత్తి మరొకటేమీ లేదేమో, అతను ఆ పనికే పూనుకున్నాడు; అయితే యీసారి తన తండ్రికి సహాయకుడుగా కాక, స్వతంత్రుడుగా. అతనికి అదృష్టం కలిసివచ్చింది, దానికితోడు ఉన్నత సంబంధాలు, ప్రసిద్ధి, సామర్థ్యం కూడా తోడ్పడ్డాయి. మరో అయిదేళ్లు గడిచేసరికే అతను బాగా సంపన్నుడై, భారీ ఎత్తు వర్తక లావాదేవీలు నిర్వహించేవాడు.

ఈనాడు బ్రిటన్, అమెరికాలలోనూ, తదితర దేశాల్లోనూ స్టాక్ ఎక్స్చేంజిలలో ప్రధానంగా భారీ ప్రైవేటు కంపెనీల షేర్లు అమ్మబడుతాయి. 18వ శతాబ్ది చివరి నాటికి యింకా అతిస్వల్ప సంఖ్యలో మాత్రమే జాయింట్ స్టాక్ కంపెనీలు వున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, ఈస్ట్ ఇండియా కంపెనీ, తదితర కంపెనీల షేర్లకు సంబంధించిన లావాదేవీలు సైతం స్టాక్ ఎక్స్చేంజి లావాదేవీల్లో అతిస్వల్ప భాగంగా వుండేవి. రికార్డో వాటిలో దాదాపు పాల్గొనేవాడే కాడు. మెరికల్లాంటి యితర వ్యాపారస్తులకూ, ఆయనకీ కూడా బంగారపు గనివంటిది ఏమిటంటే, ప్రభుత్వ రుణమూ, ప్రభుత్వ రుణ బాండ్లకు సంబంధించిన లావాదేవీలూను. యుద్ధపు మొదటి పది సంవత్సరాల – 1793–1802 – కాలంలో గ్రేట్ బ్రిటన్‌యొక్క బాండ్ల రూపంలో వున్న రుణం 23 కోట్ల, 80 లక్షల పౌన్లనుండి 56 కోట్ల, 70 లక్షల పౌన్లకు పెరిగింది, 1816 నాటికి అది 100 కోట్ల పౌన్లను మించింది. దీనికితోడు లండన్లో విదేశీ రుణాలు జారీచెయ్యబడ్డాయి. వివిధ ఆర్థిక, రాజకీయ అంశాల ప్రభావ కారణంగా బాండ్ల ధరలు ఎగుడుదిగుళ్లకు గురి అవుతూండేవి. ఈ మార్కెట్ ఉత్థానపతనాలకు అనుగుణంగా చట్టావ్యాపారం చెయ్యడమన్నది యువ వర్తకులు ధనికులయ్యేందుకు ప్రధాన సాధనంగా వుంటూండేది.

ఆయన సమకాలికులు పేర్కొన్నట్లు రికార్డోకు అతిసూక్ష్మమైన బుద్ధినైశిత్యం, సహజేంగిత జ్ఞానం సద్యో నిర్ణయశక్తి, వాటితోబాటు గొప్ప జాగ్రత్త వున్నాయి. ఆయనెన్నడూ మితిమీరి చట్టావ్యాపారం చేసేవాడు కాదు, తన సద్యఃస్ఫూర్తినీ,

సంయమనంతో కూడిన వివేచనాశక్తినీ ఎన్నడూ కోల్పోయేవాడు కాడు. సకాలంలో ఎలా అమ్మాలో ఆయనకి తెలుసు, ఒక్కొక్కమారు ఆయన ప్రతిఒక బాండుపైనా కొద్దిపాటి లాభంతో సరిపెట్టుకొని, పెద్ద తిరగడల ద్వారా లాభం సంపాదించుకునేవాడు.

ధనిక బ్యాంకర్లు చిన్న గ్రూపులుగా ఏర్పడి, కొత్తగా జారీచెయ్యబడిన రుణాలను చలామణీలో పెట్టే కంట్రాక్టులను ప్రభుత్వంనుండి పొందుతూండేవారు. దీన్నే మరింత సరళంగా చెప్పాలంటే, కొత్త రుణానికి సంబంధించిన బాండ్లన్నింటినీ ప్రభుత్వంనుంచి వాళ్లు టోకుగా కొనేసి, తర్వాత చిల్లరగా వాటిని అమ్ముకునేవారు. ఈ లావాదేవీల ద్వారా అపారమైన లాభాలు వస్తాయి. ఒక్కొక్కమారు ఆ బాండ్ల ధరలు ఆకస్మికంగా పడిపోయి, విశేషమైన నష్టమూ సంభవించవచ్చు. ట్రెజరీ నిర్వహించే వేలంపాటల్లో మిక్కిలి పెద్ద మొత్తానికి పాడే ధనికుల బృందాలకు ఆ రుణం కేటాయింప బడేది. 1806లో రికార్డో, మరో యిద్దరు వర్తకులూ ఒక వేలంపాటలో పాల్గొన్నారు, కాని ఆ రుణం కంట్రాక్టు మరో బృందానికి యిచ్చివెయ్యబడింది. మరుసటి సంవత్సరం రికార్డోకీ, ఆయన బృందానికీ 2 కోట్ల రుణం ఫ్లోట్‌చేసే హక్కు దొరికింది. అటుతర్వాత పదేళ్ల పాటు ఆయన ప్రతి ఏటా విధిగా వేలంపాటల్లో పాల్గొంటూండేవాడు, కొన్ని రుణాలను జారీచేసేవాడు.

1809–10 నాటికి డేవిడ్ రికార్డో, లండన్ ద్రవ్య ప్రపంచంలో అత్యంత ప్రముఖ వ్యక్తుల్లో ఒకడయ్యాడు. లండన్లోని మిక్కిలి వైభవోపేతమైన పేటలో ఆయనొక దివ్యమైన గృహాన్ని కొనుక్కున్నాడు. అటుతర్వాత గ్లాసెస్టర్‌షైర్‌లోని గట్‌కోంబ్ పార్కులో ఓ పెద్ద ఎస్టేటును కొని, అక్కడ తన నివాస భవనాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత రికార్డో క్రమంగా వర్తకప్రపంచంలో తన క్రియాశీల కార్యకలాపాల్లోంచి ఉపసంహరించుకొని, ఓ పెద్ద భూస్వామీ, వడ్డీ వ్యాపారీ అయాడు. ఆయన సంపద పదిలక్షల స్థాయికి చేరుకుంది, ఆనాటికి అది చాలా పెద్ద మొత్తం.

ఇది ప్రతిభావంతుడైన ఒక ధనాధిపతీ, నిశితబుద్ధి కలిగిన వ్యాపారస్తుడూ, లాభార్జనాపరుడి జీవిత చరిత్ర. మరి విజ్ఞానశాస్త్రం మాట ఏమిటి?

ఈ జిత్తులమారి స్టాక్ ఎక్స్చేంజి నిపుణుడు, గౌరవనీయుడైన కుటుంబ పెద్ద అత్యంత పరిశోధనాత్మకమైన మనస్సూ, అపారమైన జ్ఞానతృష్ణా కలిగినవాడు. 26 ఏళ్ల ప్రాయంలో ఆర్థిక స్వేచ్ఛనూ, ఒక మేరకు సంపదనూ సంపాదించుకున్న రికార్డో, తన యౌవనంలో పరిస్థితుల ప్రాబల్యం మూలంగా తను అధ్యయనం చెయ్యలేకపోయిన విద్యాంశాల — ప్రకృతి విజ్ఞాన, గణితశాస్త్రాల — అధ్యయనం పైకి ఆకస్మికంగా తన దృష్టిని మళ్లించాడు. ఎంతటి తారతమ్యం! ఉదయం పూట స్టాక్ ఎక్స్చేంజిలోనూ, ఆఫీసులోనూ — తన వయస్సుకు మించిన శాంతస్వభావం కలిగిన, ఆత్మ సంయమనంతో

కూడిన వ్యాపారస్తుడు. సాయంత్రం పూట యింట్లో—విద్యుచ్ఛక్తిపై తను చేసిన ప్రయోగాలనూ, తను పోగుచేసిన ఖనిజాలనూ తన బంధువులకూ, పరిచితులకూ అమాయిక గర్వంతో ప్రదర్శించే ప్రీతిపాత్రుడైన, ఉత్సాహవంతుడైన యువకుడు.

ఈ అధ్యయనాల ప్రభావంలో రికార్డో సునిశిత మేధ అభివృద్ధి చెందింది. ఏవైతే అయన అర్థశాస్త్ర రచనల్లో ఒక ముఖ్య పాత్రను వహించాయో ఆ గుణాలు ఏర్పడటంలో అవి తోడ్పడ్డాయి. కచ్చితమైన, దాదాపు గణితశాస్త్ర సదృశమైన తర్కం, అత్యంత విస్పష్టత, బాగా సాధారణీకృత వాదనలపట్ల అయిష్టత—యివీ అయన ఆలోచనకు వైశిష్ట్యాన్ని చేకూర్చే లక్షణాలు. సరిగా అదేసమయంలో, ఒక విజ్ఞానశాస్త్రంగా అర్థశాస్త్రంతో రికార్డోకు మొట్టమొదటి సారిగా పరిచయం ఏర్పడింది. స్మిత్ పలుకుబడి అప్పటికింకా శిఖరస్థాయిలో వుంది, యువ రికార్డో స్మిత్ ప్రభావంలో పడకుండా ఉండలేకపోయాడు. అయినాకూడా ఆయన మాల్తూస్ రచన "జనాభా సూత్రంపై వ్యాసం"చేత గాఢంగా ప్రభావితుడయాడు. అది 1798లో మొదట ప్రచురింపబడింది. తర్వాత మాల్తూస్‌తో వ్యక్తిగత పరిచయం ఏర్పడ్డాక, రికార్డో ఆయనకి రాస్తూ, ఆయన పుస్తకం చదివాక మాల్తూస్ భావాలు "ఎంతో స్పష్టంగానూ, ఎంతో సంతృప్తికరంగానూ అమర్చబడ్డాయి, ఆడమ్ స్మిత్ ప్రసిద్ధగ్రంథం తర్వాత యింతటి ఆసక్తిని కలిగించిన మరో పుస్తకం లేదు"* అని పేర్కొన్నాడు.

ఆ శతాబ్దారంభంలో జేమ్స్ మిల్ అనే స్కాట్ యువకుడు లండన్లో ప్రత్యక్షమయ్యాడు. ఆయన సామాజికార్థిక సమస్యలపై రచనలుచేసే వివాదాస్పదుడైన పత్రికా రచయిత, రచయిత. రికార్డోకి ఆయనతో పరిచయమైంది, త్వరలోనే సన్నిహిత స్నేహంగా మారిన ఆ పరిచయం రికార్డో చనిపోయేదాకా కొనసాగింది. మొదట్లో మిల్ గురువు పాత్ర వహించాడు. రికార్డోను ఆయన పండితుల, రచయితల బృందానికి పరిచయంచేసి, ఆయన తొలి రచనల ప్రచురణకు ఆయన్ని ప్రోత్సహించాడు. తర్వాత వారిద్దరి పాత్రలూ కొంతమేరకు తల్లక్రిందులయాయి. రికార్డో ప్రధాన రచనలు వెలువడ్డాక మిల్ ఆయన శిష్యుడూ, అనుచరుడూ అయాడు. అయితే ఆయన అభివృద్ధి చేసినది రికార్డో ఉపదేశపు మిక్కిలి బలమైన పార్శ్వాలను కాదు, విమర్శకులనుండి రికార్డోకు అత్యుత్తమ సమర్థనను ఆయన యివ్వనూ లేదు. వాస్తవానికి యిది రికార్డో అర్థశాస్త్రం కూలిపోవడానికి దారితీసింది కూడా. అయినాకూడా, ఓ మంచిమాట అనుకోకుండా మిల్‌ని తలుచుకోకూడదు. రికార్డో ప్రతిభను నిజంగా ఆరాధించే మిల్, రాయమనీ, పరిష్క-

---

* J. H. Hollander, *David Ricardo. A Centenary Estimate*, Baltimore, 1910, pp. 47—48నుండి ఉల్లేఖింపబడింది.

రించి, ప్రచురించమనీ రికార్డోను నిరంతరాయంగా ప్రోత్సహిస్తూండేవాడు. ఒక్కొక్క మారు అతను రికార్డోకు కర్తవ్యాలు నిర్ణయించి, వాటి ఫలితాల రిపోర్టు చెప్పమని డిమాండు చేస్తూవుండేవాడు. ఉదాహరణకు, 1815 అక్టోబరులో రికార్డోకు అయన యిలా రాశాడు: "మీ పుస్తక రచనలో మీరు సాధించిన పురోగతిని గురించి కొంత చెప్పగల స్థితిలో యీపాటికి మీరున్నారని నేను ఆశిస్తున్నాను. ఆ కర్తవ్య నిర్వహణకు మీరు తగినంతగా అంకితమయ్యారని నేను తలుస్తున్నాను."*

కొందరు ప్రతిభావంతులకు అటువంటి మిత్రుల అవసరం విశేషంగా వుంటుంది.

రికార్డో ఎప్పుడూకూడా తన శక్తులలో విశ్వాస లోపంతోనూ, ఒక రకమైన సాహిత్య భీరుత్వంతోనూ జంకుతూండేవాడు. తన గ్రంథ రచనలో అనేక సంవత్సరాల తరబడి కృషిచేసిన స్మిత్ మాదిరిగా, ఆయనకి విధ్యుక్త భావమూ, "అంకితభావమూ" లేవు. తన వర్తకంలో మినహాయిస్తే రికార్డో మెతకమనిషీ, ఒక మాదిరి సిగ్గరీని. దైనందిన జీవితంలో యితరులతోడి ఆయన సంబంధాల్లో యీ విషయాన్ని చూడవచ్చు. 1812లో ఆయన కేంబ్రిడ్జికి వెళ్లాడు. అక్కడ ఆయన పెద్దకొడుకు ఒస్మాన్ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ అపరిచిత వాతావరణంలో, ధనికుడూ, నలుగురిచేతా గౌరవింపబడేవాడూ అయిన నలభై ఏళ్ల రికార్డో అస్తవ్యస్తంగానూ, బెరుకు బెరుకుగానూ అవస్థపడ్డాడు. ఆ ప్రయాణాన్ని గురించి తన భార్యకు రాసిన ఒక లేఖలో ఆయన యిలా పేర్కొన్నాడు: "నా స్వభావంలో చెరుకుకీ, కలిసిమెలిసి ఉండకపోవడానికీ సంబంధించిన అన్నింటినీ జయించేందుకు ప్రయత్నిస్తున్నాను; ఒస్మాన్‌కి వాంఛనీయులైన కొద్దిమంది పరిచితులను సేకరించిపెట్టేందుకు నా శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నాను."

పరిష్కార ప్రాంగణంలో: డబ్బు చలామణీ సమస్య

మార్క్స్ రాసినట్లు, 1844, 1845 నాటి బ్యాంకు చట్టాలపైన పార్లమెంటులో జరిగిన చర్చల్లో భవిష్యత్తులో కాగల ప్రధానమంత్రి గ్లాడ్‌స్టన్ ఒకసారి,

* D. Ricardo, *The Works and Correspondence*, Vol. 6, Cambridge, 1952, p. 309నుండి ఉల్లేఖింపబడింది.

డబ్బును గురించి తాత్వీకరించడంలో అయినంతమంది మూర్ఖులు చివరకు ప్రేమ విష యంలో కూడా కాలేదని పేర్కొన్నాడు.*

ఆర్థిక విజ్ఞానశాస్త్రంలోని అత్యంత సంక్లిష్టరంగాల్లో డబ్బు సిద్ధాంతం ఒకటి. ఇంగ్లండులో 19వ శతాబ్ది మొదట్లో డబ్బుకీ, బ్యాంకింగుకీ సంబంధించిన సమస్య, పార్టీ ప్రయోజనాలకూ, వర్గ ప్రయోజనాలకూ మధ్య ఉద్రేకంగా జరిగే వాగ్వివాదానికీ, పోరాటానికీ కేంద్రస్థానం వహించింది. ఆచరణలో రుణం, డబ్బు వ్యవహారాలతో బాగా పరిచయం కలిగిన రికార్డో, ఆర్థికవేత్తగానూ, పత్రికా రచయితగానూ తన సత్తాను మొదట యీ రంగంలో పరీక్షించుకో ప్రయత్నించడం సహజమే. అప్పటికి ఆయన వయస్సు ముప్పయ్యేడేళ్లు.

1797లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండుకి, తన నోట్లకు మారకంగా బంగారం చెల్లించనవసరం లేకుండా అనుమతి లభించింది. నోట్లు మార్చుకోజాలని కాగితపు డబ్బు అయ్యాయి. 1809–11 మధ్య రచించిన పలు వ్యాసాల్లోనూ, చిన్న పుస్తకా ల్లోనూ రికార్డో, యీ కాగితపు డబ్బులో బంగారపు మార్కెట్ ధర పెంపుదల, అది అధికంగా జారీచెయ్యబడిన ఫలితంగా, దాని విలువ పడిపోయినదాని ఫలితమూ, సూచనా అని వాదించాడు. ఆయన ప్రత్యర్థులు బంగారపు ధర పెరుగుదలకు వేరే కారణాలు వున్నాయని వాదించారు. ప్రత్యేకించి, విదేశాలకు ఎగుమతి చేసేందుకు బంగా రానికి గల గిరాకీయే అది. ఈ రచనల్లో రికార్డో ప్రతిభ — నిపుణుడైన వివాద కర్తగానూ, రచయితగానూ, అత్యంత తర్కబద్ధంగా, సుసంగతంగా వాదించగలవాడుగానూ — రుజు వైంది. అది పాండిత్య ప్రకర్షక వాదం ఎంతమాత్రం కాదు. నోట్ల విలువ పడిపోయిం దన్న వాదనను తిరస్కరించినవారికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు గవర్నర్ల, పార్లమెంటు లోని కన్సర్వేటివ్ మెజారిటీ సభ్యుల, మంత్రుల, మొత్తం "యుద్ధ పార్టీ" తోడ్పాటు లభించింది. అంతిమ విశ్లేషణలో తేలేదేమిటంటే, ఎవరికైతే యుద్ధమూ, ద్రవ్యోల్బ ణమూ హెచ్చు కౌలుమొత్తాలను తెచ్చిపెట్టాయో, ఆ భూస్వాముల వర్గ ప్రయోజ నాల వ్యక్తీకరణే యిది. రికార్డో అందుకు భిన్నంగా, తన తదుపరి కార్యకలాపాలు అన్నింట్లో మాదిరిగానే, పారిశ్రామిక బూర్జువావర్గపు — అప్పట్లో వారి పాత్ర ప్రగతిశీలమైనది — ప్రయోజనాలను వ్యక్తంచేస్తున్నాడు. రాజకీయంగా ఆయన విగ్గు (ఉదారవాద) ప్రతిపక్షానికి, "శాంతి పార్టీకి" సన్నిహితుడు.

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, Moscow, 1970, p. 64.

అప్పట్లో వున్న ద్రవ్య విధాన విమర్శకే రికార్డో పరిమితం కాక, కచ్చితమైన ఒక కార్యక్రమాన్ని తయారుచేశాడు. ఆయన తదుపరి రచనలు కొన్నింటిలో ఆ కార్యక్రమానికి కొన్ని చేర్పులు చేశాడు. ఆయన ప్రతిపాదించినది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అవసరాలకు సాధ్యమైనంత అనుగుణంగా వుండే ఒక ద్రవ్య విధానమే. రికార్డో భావాల్లో అత్యధికాంశం 19వ శతాబ్దంలో అమలుపరచబడ్డాయని చెప్పవలసి వుంది. 1819నుండి 1914దాకా ఇంగ్లండు స్వర్ణ ప్రమాణాన్ని అనుసరించింది.

క్లుప్తంగా యీ భావాలు యివీ: 1) స్థిరమైన డబ్బు చలామణీ ఆర్థిక పెరుగుదలకు అతి ముఖ్యమైన షరతు; 2) స్వర్ణప్రమాణ ప్రాతిపదికపైన—బంగారంపై ఆధారపడిన ఒక ద్రవ్య విధానంపైన—మాత్రమే యీ సుస్థిరత సాధ్యం; 3) చలామణీలో వున్న బంగారం స్థానంలో, చాలవరకు గాని, పూర్తిగా గాని, బంగారంతో స్థిరసామ్య ప్రాతిపదికపైన కాగితం డబ్బు మారకం చేసుకోబడవచ్చు, యిది జాతికి గొప్ప పొదుపు. పూర్తి చేసేందుకు తనకు వ్యవధి చిక్కని తన చివరి పుస్తకంలో, అప్పట్లో ఒక ప్రైవేటు కంపెనీ అయిన బ్యాంక్ అఫ్ ఇంగ్లండునుండి, నోట్లను జారీచేసే హక్కునూ, రాజ్య ద్రవ్య అజమాయిషీ హక్కునూ తొలగించాలని రికార్డో ప్రతిపాదించాడు. ఈ లక్ష్య సాధనకోసం ఒక జాతీయ బ్యాంకు స్థాపింపబడాలని ఆయన ప్రతిపాదించాడు. ఆ కాలానికి యిది అత్యంత సాహసికమైన ప్రతిపాదన.

రికార్డో డబ్బు సిద్ధాంతం సాంప్రదాయిక అర్థశాస్త్రపు బలాన్నీ, బలహీనతనూ కూడా ప్రతిబింబించింది. డబ్బు సిద్ధాంతాన్ని శ్రమ విలువ సిద్ధాంతంపై ఆధారపరచాలని రికార్డో ప్రయత్నించాడు, అయితే యీ విషయంలో సుసంగతమైన వైఖరిని అనుసరించలేదు. నిజానికి, కచ్చితమైన ఆర్థిక క్రమాలకు తను చేసిన విశ్లేషణలో దాన్ని ఆయన తిరస్కరించాడు కూడా.

ఇతర అన్ని సరుకుల విషయంలో మాదిరిగానే, బంగారపు డబ్బు విలువకూడా, సూత్రరీత్యా, దాన్ని ఉత్పత్తిచెయ్యడానికి అయ్యే శ్రమధరచేతనే నిర్ణయింపబడుతుంది. సరుకులూ, డబ్బూ—యీ రెండూ కూడా స్థిరమైన విలువలతోనే చలామణీలోకి ప్రవేశిస్తాయి. ఒక నిర్దిష్ట ప్రమాణపు సరుకుల చలామణీని కొనసాగించేందుకుగాను ఒక నిర్దిష్ట మొత్తపు డబ్బు అవసరం—యిదీ దాని అర్థం. ఉదాహరణకు, సాలుసరి మొత్తం సరుకుల ప్రమాణం సగటు శ్రమయొక్క 100 కోట్ల శ్రమదినాలనీ, ఒక గ్రాము బంగారం ఒక శ్రమదినం అనీ అనుకుంటే, చలామణీకి 100 కోట్ల గ్రాముల బంగారం అవసరమవుతుంది. అయితే, ప్రతి ఒక గ్రాము బంగారమూ ఒక ఏడాదిలో పది బేరాలకు ఉపయోగపడుతుందనీ, పదిమార్లు చలామణీ అవుతుందనీ అనుకుందాం. అప్పుడు పదోవంతు బంగారం—10 కోట్ల గ్రాములు—సరిపోతుంది. దీనికితోడు, బంగా

రంలో కొంతభాగం, రుణాల్లో జరిగే చేరాల ద్వారా మిగల్చబడగలదు. మ్యూల రేఖా చిత్రంగా, యీ భావాన్నే దరిమిలా మార్క్స్ విశదీకరించాడు.

అయితే, రికార్డో యీ వాదన సరళిని అనుసరించలేదు. ఎంత మొత్తం బంగారమైనా, అక్కడికి అదెలా వచ్చిందన్నదాని ప్రసక్తి లేకుండా, ఒక నిర్దిష్ట దేశంలో చలామణీ కాగలదన్న ఊహమంచి ఆయన బయల్దేరాడు. చలామణీ క్రమంలో ఒక మొత్తపు సరుకులు పట్టినే ఒక మొత్తపు డబ్బుకు తటస్థపడతాయి, యీ విధంగా సరుకు ధరలు స్థిరపడతాయి. బంగారం ఎక్కువగా ఉన్నట్లయితే ధరలు ఎక్కువగా వుంటాయి, బంగారం తక్కువ వుంటే ధరలు తక్కువగా వుంటాయి. ఇదే డబ్బు పరిమాణ సిద్ధాంతం, హ్యూమ్ ద్వారా మనం దీన్ని యింతకు ముందే చూశాం. హ్యూమ్‌నుంచి రికార్డో దేనిలో విభేదిస్తాడంటే, ఆయన దాన్ని శ్రమ విలువ సిద్ధాంతంతో సరిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. అయితే సహజంగానే దీనిలో ఆయన సఫలీకృతుడు కాలేదు.

మార్చడానికి వీల్లేని కాగితపు డబ్బు చలామణీ అనుభవమే రికార్డో ఆలోచనను ఆక్రమించింది. కాగితపు డబ్బు కొనుగోలు శక్తి ప్రధానంగా, దాని పరిమాణం చేతనే నిర్ణయింపబడుతుంది. ఈ డబ్బు ఎంత జారీచెయ్యబడిందన్నదానితో ప్రసక్తి లేకుండా, అదెప్పుడూకూడా చలామణీకి అవసరమైన పూర్తివిలువ బంగారపు డబ్బు మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు, బంగారపు డాలర్లు ఉన్నదానికి రెట్టింపు కాగితపు డాలర్లు ఉన్నాయనుకోండి, అప్పుడు ప్రతిఒక కాగితపు డాలరూ తన విలువలో సగాన్ని కోల్పోతుంది.

అయితే రికార్డో, కాగితపు డబ్బు చలామణీ అనే విషయాన్ని అనాలోచితంగా వెంటనే బంగారానికి ఎందుకు అన్వయిస్తున్నాడు? ఎందుకంటే, యీ రెండింటికీ మధ్యగల మౌలిక భేదాన్ని ఆయన చూడలేదుగనుకా, బంగారాన్ని కూడా విలువయొక్క లాంఛనప్రాయమైన కృతక వాచెంగా పరిగణిస్తున్నాడు గనుకనే. డబ్బును ఒక చలామణీ సాధనంగా మాత్రమే ఆయన చూశాడు, దాని విధుల సంక్లిష్టతనూ, వైవిధ్యాన్నీ ఆయన పరిగణనలోకి తీసుకోలేదు.

తన డబ్బు సిద్ధాంతం, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లోని ఎగుడుదిగుళ్ల వివరణకు ఒక కీలకం కాగలదని కూడా రికార్డో భావించాడు. ఆయన యీ విధంగా తర్కించాడు: ఒకానొక దేశానికి చాలా ఎక్కువ బంగారం వుంటే, అక్కడ సరుకుల ధరలు పెరుగుతాయి, అప్పుడు సరుకులను విదేశాలనుంచి దిగుమతి చేసుకోవడం చౌక అవుతుంది. ఆ దేశపు వ్యాపార సమతూకంలో లోటు కనిపిస్తుంది, దాన్ని బంగారంతో పూడ్చవలసివుంటుంది. బంగారం దేశంనుంచి బయటకుపోతుంది, ధరలు పడిపోతాయి, విదేశీ సరుకుల దిగుమతులు నిలిచిపోతాయి, అన్నీ తిరిగి సమతూకానికి

చేరుకుంటాయి. ఒక దేశంలో తగినంత బంగారం లేనప్పుడు, యిందుకు తలకిందులుగా జరుగుతుంది. ఈవిధంగా అప్రయత్న పూర్వకమైన ఒక యంత్రాంగం పనిచేస్తుంది, అది సహజంగానే వ్యాపార సంతులనాలమధ్య సమతూకాన్ని పునరుద్ధరిస్తుంది, బంగారాన్ని వివిధదేశాలమధ్య పంపిణీ చేస్తుంది. దీన్నిబట్టి రికార్డో, స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా ముఖ్యమైన నిర్ణయాలను లాగాడు. సరుకుల ఎగుమతులను సరుకుల దిగుమతులు మించితే, బాధపడవలసిందేమీ లేదని అన్నాడాయన. ఈ కారణంగా ఎగుమతులను నిరోధించ నవసరంలేదు. వట్టివే దీని అర్థం ఏమిటంటే, దేశంలో అతిగా బంగారం ఉందనీ, ధరలు చాలా అధికంగా ఉన్నాయనీ మాత్రమే. స్వేచ్ఛగా దిగుమతులను జరగనిస్తే, అవి ధరలు తగ్గేందుకు తోడ్పడతాయి.

ఇంగ్లండులో స్వేచ్ఛా వాణిజ్యం కావాలన్న డిమాండు, స్మిత్ కాలంలో మాదిరిగానే రికార్డో కాలంలో కూడా ప్రగతిశీలమైనది. అయితే తమంతట తామే జరిగిపోయే ఆయన సర్దుబాటుల సిద్ధాంతం మటుకు వాస్తవ విరుద్ధమైనది. మొదటి సంగతి, అది డబ్బు పరిమాణ సిద్ధాంతంపై ఆధారపడినది, ఒక దేశంలో డబ్బు పరిమాణంలో వచ్చే మార్పులు ధరల స్థాయిలను ప్రత్యక్షంగా నిర్ణయిస్తాయన్న పొరపాటు ఉద్భావనను చేసింది. రెండవ సంగతి, సరుకు ధరల సాపేక్ష స్థాయిల ప్రభావంకింద మాత్రమే దేశాలమధ్య బంగారం చేతులు మారదు. రికార్డో విమర్శకులు, సమంజసంగానే యిలా పేర్కొన్నారు. నెపోలియన్ యుద్ధాల కాలంలో బంగారం ఇంగ్లండునుండి బయటకు పోయింది ఇంగ్లండులో ధరలు అధికంగా వున్న కారణంగా కాక (తద్విరుద్ధంగా, పారిశ్రామిక వస్తువుల ధరలు అక్కడ గణనీయంగా తక్కువగా వున్నాయి), విదేశాల్లో పెట్టే అధిక సైనికవ్యయం, పంటలు నాసిదిగుబడి అనంతరం ధాన్యం కొనుగోలు వగైరాల మూలంగానే అలా జరిగిందని వాదించారు.

రికార్డో ద్రవ్య సిద్ధాంతంలో ఎన్ని లోపాలున్నప్పటికీ కూడా, ఆర్థిక విజ్ఞాన శాస్త్రాభివృద్ధిలో అది ప్రముఖ పాత్రను వహించింది. అంతకు ముందు వేటిని గురించైతే జనానికి అత్యంత గందరగోళపు భావాలు వుండేవో, ఏవైతే దరిమిలా అంతకంతకు ముఖ్యమైన సమస్యలుగా పరిణమించాయో అటువంటి సమస్యలకు ఆ సిద్ధాంతం రూపకల్పన చేసింది: చలామణీలో వున్న డబ్బు వేగం; "డబ్బుకి గిరాకీ," అంటే, డబ్బు విషయంలో ఆర్థికవ్యవస్థ అవసరాలను నిర్ణయించే అంశాలు; బంగారంలోకి కాగితపు డబ్బు పరివర్తనశీలతకు గల పాత్ర; అంతర్జాతీయంగా బంగారపు చలన యంత్రాంగం, వర్తకంపైనా, విదేశవ్యాపార చెల్లింపు శేషాలపైనా సరుకు ధర స్థాయిల ప్రభావం.

పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రస్తుతం వున్న కరెన్సీ (కాగితపు డబ్బు) సంక్షోభం దృష్ట్యా పై చివరి అంశం ప్రత్యేకాసక్తికరమైనది. వివిధ దేశాల్లో విదేశవ్యాపార చెల్లింపు శేషాలపైన (లేక, ఆయన మాటల్లో చెప్పాలంటే, వ్యాపార సమతులవాలపైనా, దేశాలమధ్య వెండిబంగారాల కదలికపైనా) విభిన్న ధరల స్థాయిల ప్రభావ సమస్యలోనూ, ధరల స్థాయిలపై ప్రపంచ ద్రవ్యపు ఎగుడుదిగుళ్లు కలిగించే ప్రభావ సమస్యలోనూ రికార్డోకు విశేషాసక్తి వుంది. ఆ నాటినుండి ద్రవ్య విధానాల్లోనూ, ప్రపంచ డబ్బుగా వెండిబంగారాల పాత్రలోనూ ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ యీ రెండు సమస్యలూ యీనాటివరకు తమ ప్రాముఖ్యాన్నీ, వివాదాస్పతనూ కోల్పోలేదు. వీటిలో మొదటిదానికి సమకాలీన ప్రాముఖ్యత ఎంతగా ఉన్నదో, ఉదాహరణకు, అమెరికా విదేశవ్యాపార చెల్లింపు శేషాల్లో లోట్లను గురించి ఈ మధ్య జరిగిన చర్చలను బట్టి (యీ లోట్లు ఏమేరకు "డాలర్ విలువ పునర్నిర్ణయ" ఫలితమో, అంటే, ఉన్న మారకపు రేట్లలో, యితర ప్రధాన పెట్టుబడిదారీ దేశాల్లోకన్న అమెరికాలో అధికతర ధరల ఫలితమో) తెలుసుకోవచ్చు. పోతే, రెండవ సమస్య ప్రాముఖ్యాన్ని పశ్చిమ జర్మనీ అనుభవాన్ని బట్టి తెలుసుకోవచ్చు. స్వల్పకాలిక పెట్టుబడి దేశంలోకి ప్రవహించిన ఫలితంగా, పశ్చిమ జర్మనీలో పెద్దమొత్తంలో బంగారమూ, డాలర్ల నిధులూ అదనంగా సంచితమయ్యాయి. (జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ధోరణుల పెరుగుదలను యీ వాస్తవం ఎంతగానో ప్రభావితం చేసింది.)

1809 నాటికి అర్థశాస్త్రవేత్తగా రికార్డో పూర్తిగా అప్రసిద్ధుడు. 1811 నాటికి అప్పుడే ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో గుర్తింపు పొందిన ప్రామాణికుడు, బ్యాంకు నోట్లను మార్చుకోగలగడాన్ని పునస్స్థాపించుకునేందుకు జరిగే ఉద్యమానికి నాయకుడు. కొంతమేరకు మిల్ ద్వారానూ, మరికొంతమేరకు యితర విధాలుగానూ రికార్డో ప్రముఖ రాజకీయవేత్తలతోనూ, పత్రికారచయితులతోనూ, పండితులతోనూ పరిచయాలు పెట్టుకున్నాడు. అతిథిసత్కారానికీ, మంచి భోజనానికీ పేరుపొందిన ఆయన యింటిలో రాజకీయ, ఆర్థిక, సాహిత్య రంగాల్లోని వివాదాస్పద సమస్యలపైన వాగ్వివాదాలు జరుగుతూండేవి. తన ప్రత్యేక ప్రయత్నం ఏమీ లేకుండానే రికార్డో ఆ మేధావుల బృందానికి కేంద్రబిందు స్థానాన్ని పొందాడు. చతురంగా వ్యవహరించే శక్తి, తొణుకుబెణుకులు లేని శాంత స్వభావం, వీటికి తోడు ఆయన మేధ — యివే అందుకు కారణం.

చతుర సంభాషణకర్తగా రికార్డోను గురించి ఇంగ్లీషు రచయిత్రి మరియా ఎడ్జ్‌వర్త్ సునిశితంగా వర్ణించింది. "అతి ప్రశాంత స్వభావుడైన రికార్డోగారి మనస్సు నిరంతరం జాగరూకంగా వుండేది, సంభాషణలో ఆయన సదా కొత్త అంశాలను ప్రవేశపెడుతూండేవాడు. నేను ఎంతమందితోనో వాదించాను, చర్చించాను. కాని ఆయన కంటె ఎక్కువ

సరసంగా, తక్కువ విజయవాంఛతో, ఎక్కువగా సత్యసాధన దృష్టితో వాదించే వ్యక్తిని నేను చూడలేదు. తనకు వ్యతిరేకంగా తేబడిన ప్రతి వాదనకూ ఆయన పూర్తి విలువను యిచ్చేవాడు. ఆ సమస్యపై తన విశ్వాసాన్ని దృఢపరచుకొనే క్షణందాకా, ఆయన ఏ పక్షాన వున్నాడో తెలిసేదే కాదు. సత్యాన్ని నువ్వు దర్శిస్తావా, లేక తనే దర్శిస్తాడా అన్నది ఆయనకి అంతగా పట్టేది కాదు, కావలసిందల్లా సత్యాన్ని దర్శించడం మాత్రమే. ఆయనతో సంభాషించినవాళ్లు లబ్ధి పొందుతారు. తాము రైటో, తప్పో తెలుసుకుంటారు. చర్చ క్రమంలో ఆవేశాలు రెచ్చిపోకుండా అవగాహనను పెంచుకుంటారు.... మొత్తంమీద, ఆయన అత్యంత ప్రీతిపాత్రులైన వ్యక్తుల్లో ఒకడు. అంతే కాకుండా, నాకు తెలిసినవారందరిలోనూ అత్యధిక విషయపరిజ్ఞానం కలిగినవాడూ, మిక్కిలి తెలివైనవాడూను."* ఆర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రలో రికార్డో, మాల్తస్‌ల మధ్య స్నేహం విచిత్రమైన ఒక విరోధాభాసం. అది చాలా సన్నిహితమైనది. రికార్డో, మాల్తస్‌లు తరచుగా కలుసుకునేవారు, ఒకరింటికి మరొకరు వెళ్తూండేవారు, అతి తరచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునేవారు. వారి స్నేహచరిత్ర యావత్తూ సైద్ధాంతిక వివాదంతోనూ, అభిప్రాయ భేదంతోనూ కూడినది. వారి మధ్య ఏకాభిప్రాయం వున్న అంశమంటూ ఏదైనా ఉండటం అన్నది అతి అరుదైన విషయం. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు, ఎందుకంటే వాళ్ల సిద్ధాంతాలు భిన్న వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించాయి: మాల్తసియన్ అర్థశాస్త్రం భూస్వామ్య వర్గ ప్రయోజనాలకు లోబడింది, అది రికార్డోకు బొత్తిగా ఆమోదయోగ్యం కాదు. పోతే మాల్తస్‌కి, రికార్డో యొక్క అతిముఖ్య భావాలు గిట్టవు: శ్రమ విలువ సిద్ధాంతం, భూమి కౌలును పరభాగ్యోపలభ్యమైన ఆదాయంగా చిత్రించడం, స్వేచ్ఛా వాణిజ్యం, ధాన్యం చట్టాలను రద్దుచెయ్యాలన్న డిమాండు.

రికార్డోకి గొప్ప శాస్త్రీయ వస్తుపర దృష్టీ, ఆత్మవిమర్శా లక్షణమూ వున్నాయి. బహుశా యిదే వారి స్నేహాన్ని వివరించగల కీలకం అయ్యుండవచ్చు. తను సాధించినదానిపట్లా, తను దాన్ని ఎలా వ్యక్తంచేశానన్నదానిపట్లా సదా అసంతృప్తితో సతమతమయ్యే రికార్డో, మాల్తస్ నిశిత విమర్శలో తన సొంత భావాలను మెరుగుపెట్టుకొని, స్పష్టపరచుకొని, అభివృద్ధి పరచుకొనే ఒక సాధనాన్ని వెతుక్కొనేవాడు. మాల్తస్‌ను విమర్శించడం ద్వారా తనమటుకు తాను ముందడుగు వేసేవాడు.

---

* D. Ricardo, *The Works and Correspondence*, Vol. 10, Cambridge, 1955, pp. 168—169, 170 నుండి ఉల్లేఖింపబడింది.

తులనాత్మక వ్యయ సూత్రం

అంతర్జాతీయ వర్తక ప్రవాహాన్ని నిర్ణయించే అంశాలను గురించి రికార్డో విశేషంగా ఆలోచించాడు. దీనికి కారణాన్ని మనం ఊహించుకోవచ్చు: ఇంగ్లండు విషయంలో విదేశవర్తకం ఎప్పుడూ ప్రత్యేకించి ముఖ్యమైన పాత్ర వహించింది, యిప్పటికీ వహిస్తోంది. ఒక దేశంచేత కొన్ని వస్తువులు ఎగుమతిచెయ్యబడుతున్నాయి, మరికొన్ని దిగుమతి చేసుకోబడుతున్నాయి, ఉత్పత్తి పెరుగుదలకూ, ఆర్థిక ప్రగతికీ విదేశ వర్తకం ఏవిధంగా తోడ్పడుతోంది — అని ఆయన తనను తను ప్రశ్నించుకున్నాడు.

ఆడమ్ స్మిత్ యీ ప్రశ్నలకు సరళమైనదేగాని, చప్పిడి జవాబు యిచ్చాడు. స్కాట్లండులో ద్రాక్షసారాయాన్ని ఉత్పత్తి చేయడం సాధ్యమే. కాని శ్రమ వ్యయం చాలా ఎక్కువగా వుంటుంది. మాటవరుసకు, స్కాట్లండులో ఓట్స్‌ధాన్యం ఉత్పత్తిచేసి పోర్చుగల్‌నుంచి ద్రాక్షసారాను మారకం చేసుకుంటే మంచిది. పోర్చుగల్‌లో ద్రాక్షసారా ఉత్పత్తికి శ్రమవ్యయం తక్కువా, ఓట్స్‌ధాన్యపు ఉత్పత్తికి శ్రమవ్యయం ఎక్కువా అవుతుంది. బహుశా యీవిధంగా రెండు దేశాలూ లాభపడుతాయి. అయితే, యీ వివరణతో రికార్డో తృప్తిచెందలేదు. లాభం సహజ అంశాలచేత నిర్ణయింపబడే అటువంటి సుస్పష్ట సందర్భాల్లో మాత్రమే వర్తకం లాభసాటిగా ఉంటుందా?

ఆయన యిలా తర్కించాడు: స్కాట్లండు ఓట్స్ ధాన్యాన్నీ, ద్రాక్షసారాయాన్నీ కూడా తక్కువ వ్యయానికే ఉత్పత్తిచేసిందనీ, కాని ద్రాక్షసారాయం కంటే ఓట్స్‌ను మరింత చౌకగా ఉత్పత్తిచేస్తుందనీ ఎవరైనా ఊహించగలిగినా కూడా, ఉత్పత్తి వ్యయాల ఒక నిర్దిష్ట నిష్పత్తిలోనూ, నిర్దిష్ట మారకపు అనుపాతాల్లోనూ స్కాట్లండు ఒక ఓట్స్ ధాన్యం మాత్రమే ఉత్పత్తిచేస్తేనూ, పోర్చుగల్ ఒక్క ద్రాక్షసారాయాన్ని మాత్రమే ఉత్పత్తిచేస్తేనూ లాభం పొందుతాయి. తులనాత్మక వ్యయానికీ, లేక తులనాత్మక సానుకూల స్థితికీ సంబంధించిన సూత్రం యిదే. రికార్డో యీ సూత్రాన్ని శ్రమ విలువ సిద్ధాంతంపై ఆధారితం చేసి, దాన్ని సంఖ్యాత్మక ఉదాహరణలతో రుజువు చేసేందుకు ప్రయత్నించాడు. అటువంటి ఉదాహరణలంటే ఆయనకి చాలా యిష్టం, వాటిని ఆయన ఎప్పుడూ ఉపయోగిస్తుండేవాడు.

19వ శతాబ్ది మొదట్లో వున్న పరిస్థితులకు సాధ్యమైనంత సన్నిహితమైన ఒక సంఖ్యాత్మక ఉదాహరణతో రికార్డో భావాలను వివరించేందుకు ప్రయత్నిద్దాం. ఇంగ్లండూ, ఫ్రాన్సూ వస్త్రం, ధాన్యం — యీ రెండు సరుకులను మాత్రమే ఉత్పత్తి చేస్తాయని అనుకుందాం. ఇంగ్లండులో ఒక మీటరు వస్త్రం ఉత్పత్తికి సగటున పది

గంటల శ్రమా, ఒక టన్ను ధాన్యానికి 20 గంటల శ్రమా అవసరమనుకోండి. ఫ్రాన్సులో వస్త్రానికి 20 గంటల శ్రమా, ధాన్యానికి 30 గంటల శ్రమా అవసరమనుకోండి. అప్పుడు విలువ సూత్రం మేరకు, ఇంగ్లండులో ఒక టన్ను ధాన్యం రెండు మీటర్ల వస్త్రానికీ, ఫ్రాన్సులో ఒక టిన్నర మీటర్ల వస్త్రానికీ మారకం చేసుకోబడుతుంది. ఈ ఉదాహరణలో, ఇంగ్లండుకి రెండు సరుకుల ఉత్పత్తిలోనూ పూర్తి సానుకూల స్థితీ, వస్త్రం విషయంలో మటుకు తులనాత్మక సానుకూల స్థితి మాత్రమే వుందన్న విషయాన్ని గమనించవలసివుంది. ఫ్రాన్సుకి ధాన్యంలో తులనాత్మక సానుకూల స్థితి వుంది. దీన్నే యిలాకూడా చెప్పకోవచ్చు: ఫ్రాన్సులో వస్త్రం ఉత్పత్తి వ్యయం ఇంగ్లండులోదానికి రెండింతలు కాగా, ధాన్యం ఉత్పత్తి వ్యయం ఒకటిన్నర రెట్లు. తులనాత్మక సానుకూల స్థితి అన్నది దీనిలో ''మాత్రమే'' వుంది.

ఆ రెండు దేశాలూ రికార్డో సలహాను అనుసరించి, ఇంగ్లండు వస్త్రంలోనూ, ఫ్రాన్సు ధాన్యంలోనూ స్పెషలైజ్ చేశాయని అనుకుందాం. ధాన్యంకోసం వస్త్రపు మారకం నిష్పత్తి ఇంగ్లీషువారికీ, ఫ్రెంచివారికీ మధ్య, మాటవరుసకు, 1.7 (అంటే, ఒక టన్ను ధాన్యానికి 1.7 మీటర్ల వస్త్రం వుంటుందనుకుందాం). వాదనలో మిగతా భాగాన్ని పట్టిక రూపంలో యిస్తాం (277వ పేజీలో పట్టిక చూడండి).

ప్రతి ముప్పది గంటల సామాజిక శ్రమకీ ఇంగ్లీషు ఆర్థిక వ్యవస్థ 0.2 టన్నుల ధాన్యం లాభం పొందగా, ప్రతి 50 గంటల శ్రమకీ ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థ 0.1 మీటర్ల వస్త్రాన్ని లాభం పొందుతుందన్న విషయాన్ని మనం చూడగలం. స్పెషలైజేషన్ మూలంగానూ, విదేశవర్తకపు అభివృద్ధి మూలంగానూ రెండు దేశాలూ సూత్రరీత్యా, రెండు ఉత్పాదితాల వినిమయాన్ని పెంచుకోగలుగుతాయి.

మామూలుగా, యీ లాభం ఒక వర్గంచేత — పెట్టుబడిదారులచేత — హరింపబడుతుందని కూడా రికార్డో గ్రహించాడు. ఆయన ఆలోచనా పద్ధతి విశిష్టత ఏమిటంటే, దీనికి ఆయన విదేశ వర్తకంనుంచి లభించే లాభం ''పొదుపు చెయ్యడానికీ, పెట్టుబడి సంచయనానికీ ప్రోత్సాహకాలను... సమకూరుస్తుంది'' అన్న అర్థం చెప్పాడు. పెట్టుబడి సంచయనం ఆర్థిక పెరుగుదలకు ఒక హామీ, ప్రత్యేకించి, శ్రమశక్తికి డిమాండును సృష్టిస్తుంది కనుక, కార్మికవర్గ స్థితిపైన దానికి ప్రయోజనకరమైన ప్రభావం ఉండగలదు. దాని అనిర్దిష్ట రూపంలో, యీ తులనాత్మక వ్యయసూత్రం మొత్తం మీద అంతర్జాతీయ శ్రమ విభజనకు అన్వయింపబడవచ్చు. సరళంగా చెప్పకోవాలంటే, స్పెషలైజేషన్నుంచి ఏ వర్గం ఆర్థికలాభాన్ని పొందుతుందన్నదే ప్రశ్న. ఇటీవలి సంవత్సరాల్లో, అంతర్జాతీయ శ్రమ విభజన, ఉత్పత్తి స్పెషలైజేషన్ సమస్య సోషలిస్టు

	ఇంగ్లండు	ఫ్రాన్సు
ఒక మీటరు వస్త్రంమీదా, 1 టన్ను ధాన్యంమీద శ్రమ గంటల మొత్తం వ్యయం . .	30	50
స్పెషలైజేషనుకి ముందు		
వస్త్రం ఉత్పత్తి (మీటర్లు), వినిమయం	1	1
ధాన్యం ఉత్పత్తి (టన్నులు), వినిమయం	1	1
స్పెషలైజేషన్ తర్వాత		
వస్త్రం ఉత్పత్తి (మీటర్లు) .	3	—
ధాన్యం ఉత్పత్తి (టన్నులు) .	—	1.67
వస్త్రం వినిమయం (మీటర్లు)*	1	$0.67 \times 1.7 = 1.1$
ధాన్యం వినిమయం (టన్నులు)*	$2 : 1.7 = 1.2$	1
వినిమయానికి స్పెషలైజేషన్నుండి లాభం	0.2 టన్నుల ధాన్యం	0.1 మీటరు వస్త్రం

దేశాలకు సంబంధించి అధికతర ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న దృష్ట్యా, యీ సూత్రం మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది.

రికార్డోయొక్క యీ భావాలు, దరిమిలా బూర్జువా అర్థశాస్త్రంచేత, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే లక్ష్యాలతో వినియోగించుకోబడ్డాయన్న వాస్తవాన్ని ఒక్కొక్కమారు మార్క్సిస్టు సాహిత్యం నొక్కి చెప్తుంది. అయితే, ఒక విషయాన్ని గుర్తుంచుకోవడం అవసరం: ప్రాథమిక సూత్రం ఒకటే, విభిన్న చారిత్రక పరిస్థితుల్లో దాని సైద్ధాంతిక అన్వయం పూర్తిగా మరొక విషయమూ అన్నదే అది.

* సారళ్యత కోసం, స్పెషలైజేషన్ తర్వాత, ఇంగ్లండు అదే మొత్తం వస్త్రాన్ని వినియోగించుకుని, మిగతాదాన్ని మారకం చేసుకుంటుందనీ, ఫ్రాన్సు అదే మొత్తం ధాన్యాన్ని వినియోగించుకుని, మిగతాదాన్ని మారకం చేసుకుంటుందనీ భావించబడింది. అంకెలు పూర్ణాంకాల్లో యివ్వబడ్డాయి.

రికార్డోయొక్క విదేశ వర్తక సిద్ధాంతాన్ని విమర్శించేటప్పుడు కూడా, స్పెషలైజేషన్ సూత్రరీత్యా, సాపేక్షంగా వెనకబడిన దేశానికి సైతం లాభదాయకం కాగలదనీ, అటువంటి దేశాలు "తద్వారా, తాము ఉత్పత్తి చెయ్యగలదానికన్న మరింత చౌకగా సరుకులను పొందగలవు"* అని మార్క్స్ పేర్కొన్నాడు. స్వేచ్ఛా వాణిజ్యం కింద తన అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల సమరస, సమతులిత సిద్ధాంతంతో చక్కగా కుదిరే తులనాత్మక వ్యయ సూత్రంనుండి రికార్డో అప్పటికే నిర్ధారణలను లాగుతున్నాడనడం నిజం. ఆయన వాదన మౌలికంగా యిలా సాగుతుంది: వర్తకం, దానిలో పాల్గొనే వాళ్ళందరికీ లాభాన్ని చేకూరుస్తుంది, "నాగరక ప్రపంచం అంతటా విశ్వజనీన జాతుల సమాజాన్నీ," ధాన్యం, ద్రాక్షసారాయి, యితర దేశాల్లోని యితర వ్యావసాయిక ఉత్పాదితాలనూ కలుపుతుంది. లోహవస్తువులూ, తదితర పారిశ్రామిక సరుకులూ ఇంగ్లండులో ఉత్పత్తిచెయ్యబడుతాయి. ఈవిధంగా తులనాత్మక వ్యయ సూత్రం ఒక వాదంగానూ, పారిశ్రామికోత్పత్తిలో ఇంగ్లండు "సహజ" ప్రాబల్యానికీ, ప్రపంచపు ప్రధాన పారిశ్రామిక శక్తిగా దాని పాత్రకూ సమర్థనగానూ ఉపయోగపడింది. దరిమిలా తులనాత్మక వ్యయ సూత్రానికీ, శ్రమ విలువ సిద్ధాంతానికీ – మధ్యగల లంకె తెంచివెయ్యబడింది. ఆర్థికంగా వెనుకబడిన, వర్ధమాన దేశాలు ముడిపదార్థాల, ఆహారపదార్థాల ఉత్పత్తిలో పాక్షికమైన స్పెషలైజేషన్ చెయ్యాలన్న వాదన సహేతుకమైనదని సమర్థించేందుకూ, ఆ దేశాల పారిశ్రామికీకరణకు వ్యతిరేకంగా ఒక వాదంగానూ దాన్ని వినియోగించడం మొదలైంది.

బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రంలో ఒక ముఖ్యభాగం అయిన స్వేచ్ఛా వాణిజ్యమనే మొత్తం భావం నూర్పుచెందింది. స్వేచ్ఛా వాణిజ్యం ప్రత్యేకించి ఇంగ్లీషు బూర్జువా వర్గానికే సానుకూలమైనదైనప్పటికీ, అప్పట్లో అది ప్రధానంగా ప్రగతిశీలమైన ధోరణి: ఇంగ్లండులోనూ, తదితర దేశాల్లోనూ ఫ్యూడలిజాన్ని నాశనం చెయ్యడం, కొత్త ప్రాంతాలను ప్రపంచ వర్తకంలోకి తేవడం, పెట్టుబడిదారీ ప్రపంచ మార్కెట్‌ను సృష్టించడం – యివే దాని లక్ష్యం. ఈనాడు స్వేచ్ఛా వాణిజ్య సూత్రం, కనీసం వర్ధమాన దేశాలకు సంబంధించినంతవరకైనా, తరచు అభివృద్ధినిరోధకమైనది. పశ్చిమ యూరప్‌కీ, అమెరికాకీ చెందిన పలువురు అర్థశాస్త్రవేత్తలు, స్వేచ్ఛా వాణిజ్యం వర్ధమాన దేశాలను శాశ్వతంగా ముడిపదార్థాల సరఫరాదారు పాత్రకి దిగజారుస్తుందనీ, వాటి వెనకబాటుతనాన్ని పదిలంగా అట్టేపెట్టుతుందనీ ఒప్పుకున్నారు కూడా. విదేశ వర్తక రంగంలో క్రియాశీలంగా పాల్గొనడం (ఆర్థిక వ్యవస్థయొక్క యితర రంగాల్లో మాదిరిగానే), విదేశీ పారిశ్రామిక సరుకుల దిగుమతిపై సుంకాల విధింపూ, అటువంటి

* Karl Marx, *Capital*, Vol. III, Moscow, 1971, p. 238.

సరుకులను ఆ దేశాలే ఎగుమతి చెయ్యడం మొదలైనవి — యీ దేశాలు తమ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి తోడ్పడగలవు.

ప్రధాన గ్రంథం

రికార్డో ప్రధాన గ్రంథం స్మిత్ "జాతుల సంపద"కు పూర్తి భిన్నమైన పద్ధతిలో వెలువడింది. ఆ కల్లోలిత కాలంగాని, రచయిత మనోప్రవృత్తిగాని ప్రశాంత ఏకాంతంలో చాలా సంవత్సరాలు కృషిచేసేందుకు అయన్ని అనుమతించలేదు.

రికార్డో శాస్త్రీయాభిరుచులు తక్షణ సమస్యలతో అతి సన్నిహితంగా ముడివడి వున్నాయి. అటువంటి సమస్యల్లో ధాన్యపు చట్టాల సమస్య ఒకటి. అది బ్యాంకింగు, డబ్బు సమస్యలను కూడా వెనక్కు నెట్టేసింది. అప్పటికే ప్రముఖ అర్థశాస్త్రవేత్తా, ఉదారవాద శిబిరానికి చెందిన పత్రికా రచయితా అయిన రికార్డో, ఆ పోరాటంలోకి దిగాడు. ధాన్యపు చట్టాలనూ, రొట్టె ధరల పెరుగుదలనూ సమర్థించిన మాల్తుస్‌తోడి వాగ్వివాదమే ఆయన కార్యరంగంలోకి దూకడానికి తక్షణ హేతువు. ఆ వివాద క్రమంలో రికార్డో లేఖినినుంచి ఒక సైద్ధాంతిక వ్యవస్థ ఆవిర్భవించింది. 1814–17 దశ నాటి రికార్డో రచనలే ఇంగ్లండులో సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు అత్యుత్తమ వ్యక్తీకరణలు.

స్మిత్ ఆర్థిక విధానం ఆర్థిక వాస్తవికతకు సంపూర్ణ వివరణగా చెప్పుకునేందుకు యికనెంత మాత్రమూ వీల్లేకపోయింది. గత నలభై ఏళ్లలో చాలా మార్పులు సంభవించాయి. బూర్జువా సమాజపు వర్గాలు రూపొందాయి, వాటి ఆర్థిక ప్రయోజనాలు స్పష్టమైన రూపురేఖలు దాల్చాయి. ధాన్యపు చట్టాలపై జరిగిన పోరాటం బాహాటంగా ప్రధాన వర్గాల — మౌలికంగా పారిశ్రామిక బూర్జువావర్గం, భూస్వాములు — వైఖరులనుంచి జరిగింది. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో వర్గాల మధ్య జాతీయదాయ పంపిణీ సమస్య ముందుకు వచ్చింది. స్మిత్‌కి సంబంధించినంతవరకు యిది, అనేక ముఖ్య సమస్యల్లో ఒకటి మాత్రమే. రికార్డో విషయంలో యిది అర్థశాస్త్రపు ఏకైక విషయాంశం. ఆయన యిలా రాస్తాడు: "ఈ పంపిణీని నియంత్రితం చేసే నియమాలను నిర్ధరించడమే అర్థశాస్త్రపు ప్రధాన సమస్య. ట్యూర్గో, స్ట్యూవర్ట్, స్మిత్, సేయ్, సిస్మొండీల, తదితరుల రచనలు ఆర్థిక విజ్ఞానశాస్త్రాన్ని ఎంతగా మెరుగొనర్చినప్పటికీ, భూమి కౌలు, లాభం, వేతనాలను గురించి అవి యిచ్చిన సమాచారం ఏమంత ఎక్కువ సంతృప్తికరమైనది కాదు."*

---

* D. Ricardo, *The Principles of Political Economy and Taxation*, London, 1937, p. 1.

ఉత్పత్తి పరిస్థితులు, ప్రయోజనాలనుండి బయల్దేరి పంపిణీ నియమాలను రూపొందించేందుకు రికార్డో ప్రయత్నించాడు. వాస్తవంలో దీని అర్థమేమిటి? మొదటిది, సరుకుల విలువ ఉత్పత్తి క్రమంలో శ్రమచేత సృష్టింపబడుతుంది, యీ శ్రమ పరిమాణంచేత కొలవబడుతుంది — అన్న సిద్ధాంతాన్ని ఆయన తన విధానానికి ప్రాతిపదికగా చేసుకున్నాడు. అంతేకాకుండా, ఉత్పత్తిని నిర్దిష్టమైన దాని పెట్టుబడిదారీ రూపంలో ఆయన పరిశీలించి, ఉత్పత్తి సాధనాలు భూస్వాముల (భూమి), పెట్టుబడిదారుల (ఫ్యాక్టరీలు, యంత్రాలు, ముడిపదార్థాలు) చేతుల్లో ఉన్నప్పుడు, విలువ ఎలా రూపొందుతుంది, ఆదాయాలు ఏవిధంగా పంపిణీ చెయ్యబడతాయి అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. చివరకు, పాదార్థిక వస్తువుల ఉత్పత్తి పెంపుదలయే పెట్టుబడిదారీ విధానపు ప్రధాన విధి అని తేల్చుకున్నాడు.

వర్గాలకూ, పెట్టుబడిదారీ విధానాభివృద్ధికీ మధ్య సంబంధాల సమస్యపై రికార్డో యీకింది ప్రధాన నిర్ధారణ చేశాడు. ఆర్థికాభివృద్ధిని దాని మానాన దాన్ని వదిలేస్తే, వ్యావసాయికోత్పాదితాల ధరలు, జనాభా పెరుగుదల, క్రమంగా మరింత తక్కువ సారవంతమైన భూమి సాగుదలలతో కలిసి, క్రమంగా పెరుగుతాయి. దీన్నుంచి వచ్చే లాభమంతా భూస్వాములకు పోగా, పెట్టుబడిపైన లాభం రేటు పడిపోతుంది. తమ శ్రమకు సాపేక్షంగా తక్కువ గిరాకీ వుంటుంది కనుక, కార్మికులు కూడా, దీని మూలంగా నష్టపడుతారు. రికార్డో రాసినట్లు "భూస్వాముల ప్రయోజనం సమాజంలోని మిగిలిన అన్ని వర్గాల ప్రయోజనానికీ విరుద్ధమైనది."* ఈ ధోరణిని ఎదుర్కొనగలిగినది ఏమిటి? విదేశాలనుంచి చౌక ధాన్యపు దిగుమతి. అందుచేతనే ధాన్యపు చట్టాలు హానిదాయకం: అవి జలగల్లాంటి భూస్వాములకు మాత్రమే లాభం కలిగిస్తాయి.

రికార్డో తన అభిప్రాయాలను పుస్తకరూపంలో వివరించాలన్న సంకల్పాన్ని మొట్టమొదటిసారిగా 1815 ఆగస్టులో సేయ్‌కి రాసిన ఉత్తరంలో వెల్లడించాడు. ఆ ఏడాది ఆకురాలు కాలం అంతట్లోనూ ఆయన తన పుస్తకరచన కోసం చాలా కష్టపడి పని చేస్తూ, అంతకంతకు అధికంగా దానిలో నిమగ్నుడయాడు. వ్యాపారం, ప్రయాణాలూ, అక్కడికీ యిక్కడికీ వెళ్లడం బాగా తగ్గించేశాడు.

ఆ కృషి క్రమంలో త్వరలోనే ఆయనకి ప్రధానమైన అవరోధం — విలువ సమస్య — ఎదురైంది (దాన్ని తరువాత విశ్లేషిద్దాం). స్మిత్ సిద్ధాంతం ఆయనకి తృప్తి కలిగించలేదు, కాని దాని స్థానంలో తను మరో సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టలేకపోయాడు. ఆ అన్వేషణ ఆయనకి చిత్రహింసగా పరిణమించింది. ఒక ముఖ్యాంశాన్ని తను ఆలో

---

* *Economic Essays by David Ricardo*, London, 1966, p. 235.

చించి ఒక నిర్ణయానికి వచ్చేలోగా రెండు వారాలపాటు తనకు మనశ్శాంతి లేకపోయిందని తను రాసిన ఒక ఉత్తరంలో ఆయన పేర్కొన్నాడు. ఆ దశలో రికార్డో రాసిన ఉత్తరాలు ఫిర్యాదులతోనూ, అనుమానాలతోనూ నిండివుండేవి. మిల్ ఆయన్ని హుషారుచేసేందుకు గాను పొగడ్తలతో సహా సకల విధాలా ప్రయత్నిస్తూండేవాడు: "...అర్థశాస్త్రంపై మీరు యిప్పటికే అత్యుత్తమ చింతనాపరులు, మీరు అత్యుత్తమ రచయిత కూడా అవుతారన్న పూర్తి ధీమా నాకు వుంది." రికార్డో ఫిర్యాదులకూ, ఆ పుస్తక రచన ఎంతటి అసాధారణ వేగంతో సాగిందో దానికీ మధ్యగల తేడాను చూస్తే తమాషాగా వుంటుంది.

1817 ఏప్రిల్లో "అర్థశాస్త్ర సూత్రాలు, పన్నుల విధానం" 750 కాపీలలో ముద్రింపబడింది. రికార్డో పుస్తకంలో తొందరపాటు చిహ్నాలు అన్నీ కనిపిస్తాయి. ఆయన ఆ పుస్తకాన్ని భాగం తర్వాత భాగంగా ప్రచురణకర్తలకు పంపి, అదే సమయంలో చేర్పులూ, మార్పులూ చేశాడు. ఆయన జీవితకాలంలో ఆ పుస్తకం మరో రెండు ముద్రణలు పొందింది. వాటికీ మొదటి ముద్రణకూ పెద్ద భేదం లేదు. "విలువను గురించి" అన్న మొదటి ప్రకరణం మాత్రమే యిందుకు మినహాయింపు. ఈ ప్రకరణాన్ని కచ్చితంగానూ, ఒప్పిదమైన రీతిలోనూ తీర్చిదిద్దేందుకు రికార్డో గట్టి కృషిచేశాడు.

ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి రికార్డో చారిత్రక ప్రాముఖ్యాన్ని రెండు అంశాలకు కుదించవచ్చు. ఆయన ఒకేఒక మార్గదర్శక సూత్రాన్ని అవలంబించాడు: శ్రమ ద్వారా విలువ నిర్వచనం, శ్రమ కాలం ద్వారా విలువ నిర్వచనమే అది. అర్థశాస్త్ర భవనమంతటినీ దాని పునాదిపై కట్టేందుకు ప్రయత్నించాడు. విషయాల బాహ్యాకృతిని అధిగమించి, లోతుగా పరిశీలించేందుకూ, పెట్టుబడిదారీ విధానపు వాస్తవ అంగనిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలను ఆవిష్కరించేందుకూ యిదే ఆయనకి తోడ్పడింది. బూర్జువా సమాజంలో వర్గాల ఆర్థిక వైరాన్ని ఆయన నిరూపించి, సూత్రీకరించాడు, తద్వారా చారిత్రకాభివృద్ధి మూలానికి చేరుకున్నాడు.

రికార్డో ఆర్థిక విధానంలోని కేంద్రాంశాలు రెండింటినీ, మార్క్స్ తన ఆర్థిక సిద్ధాంతంలో వినియోగించుకున్నాడు. అవి అర్థశాస్త్రంలో ఒక విప్లవాన్ని సృష్టించాయి. మార్క్సిజానికి ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రాన్ని ఒక మూలంగా చేసినవి రికార్డో సాధించిన యీ విజయాలే. ఇందుకు భిన్నంగా, బూర్జువా అర్థశాస్త్రం రికార్డో ప్రధాన ప్రతిపాదనలు రెండింటినీ తిరస్కరించింది. ఈ రెండింటిలో మొదటి అంశం అతి సాధారణీకరణ, శుష్క పాండిత్య అభియోగాన్నీ, రెండవ అంశం సంశయాత్మకత, వర్గద్వేష ప్రేరణ అభియోగాన్నీ అతి త్వరలోనే రికార్డో నెత్తిమీదకు తెచ్చిపెట్టాయి.

రికార్డోకి ఎటువంటి భావావేశాలూ లేవు. ఆయన అర్థశాస్త్రం క్రూరమైనది, యెందుకంటే అది వర్ణించ ప్రయత్నించిన ప్రపంచం కూడ అలాంటిదే. అందుచేత,

సిస్మోండీ మాదిరిగా, విడి వ్యక్తుల మానవత్వ మంచితనాల దృష్ట్యా, రికార్డోను విమర్శించినవాళ్లు పొరపాటుచేశారు. స్మిత్ అభిప్రాయాల మాదిరిగానే రికార్డో అభిప్రాయాల శాస్త్రీయ స్వభావం, ఉత్పత్తి అభివృద్ధి దృష్ట్యానూ, జాతీయ సంపద పెరుగుదల దృష్ట్యానూ వర్గాల ప్రయోజనాలను ఆయన విశ్లేషించాడన్న వాస్తవంచేత నిర్ణయింపబడింది. ఈ ఉన్నత సూత్రానికి అవి ఏమేరకు అనుగుణంగా వున్నాయన్న దృష్ట్యానే, పారిశ్రామిక బూర్జువావర్గ ప్రయోజనాలను కూడా ఆయన బలపరిచాడు. రికార్డో కార్మికులను ఉత్పత్తి క్రమంలో సజీవ రాబట్లుగా చిత్రించాడు. పెట్టుబడిదారు తనకు అత్యంత లాభదాయకమైనదాన్ని – కార్మికులను వేతనాలకు కుదుర్చుకోవడమో, కొత్త యంత్రాలను నెలకొల్పడమో – ఎంచుకుంటాడు. దీనిలో భావావేశానికి తావు లేదు. మార్క్స్ యిలా రాశాడు: "ఇది మనఃస్థైర్యం, వస్తుపరమైన దృష్టి, శాస్త్రీయ దృష్టి. తన విజ్ఞానశాస్త్రానికి భంగకరం కానిమేరకు, రికార్డో ప్రత్యక్షజీవితంలో మాదిరిగానే, ఎప్పుడూ మానవప్రేమ వాదియే."*

మానవప్రేమ సమాజపు చెడుగులను నివారిస్తుందని రికార్డో భావించలేదనడం నిస్సందేహ విషయం. అయితే వాస్తవ జీవితంలో ఆయన దయాపరుడూ, దానశీలీ. గట్‌కోంబ్ పార్కుకి అనతిదూరంలో వున్న స్కూల్లో, ఆయన ధన సహాయంతో, రికార్డో భార్య పర్యవేక్షణ కింద, 130 మంది బాలబాలికలు ఎలా చదువుకొంటూ ఉండేవారో మరియా ఎడ్జ్‌వర్త్ వర్ణించింది. ఆయన ఆస్పత్రులకు విరాళాలు యిచ్చాడు, పేద బంధువులకు ధన సహాయంచేశాడు. ఒక పేద బాలికను గూర్చిన ఆసక్తికరమైన ఉత్తరప్రత్యుత్తరాలు వున్నాయి. రికార్డోల యింట్లో ఒకప్పుడు పనిమనిషిగా పనిచేసిన ఆ అమ్మాయిని ఒక పోకిరి యువకుడు ఆకర్షించి లండనుకు లేవదీసుకుపోయి, పాడు చెయ్యాలని ప్రయత్నించాడు. అది 1816లో జరిగింది. సరిగా రికార్డో తన పుస్తక రచనలో తలమునకలుగా వున్న సమయం అది. రికార్డో చేసిన ప్రయత్నాల ఫలితంగా ఆ అమ్మాయి ఆమె తలిదండ్రులకు తిరిగి అప్పగింపబడింది. రికార్డో యీ వ్యవహారంలో కాలవ్యయాన్ని లెక్కపెట్టలేదు. దానికితోడు ఆ యువకుడితో ద్వంద్వ యుద్ధానికి సవాలుచేయబడే ప్రమాదానికి గురయ్యేందుకు సైతం వెనుకంజ వెయ్యలేదు. ఇది సరిగా డికెన్స్ నవలల్లోని ఘట్టం లాంటిది.

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part II, Moscow, 1968, p. 119.

ప్రకరణం 13

డేవిడ్ రికార్డో విధాన పరిపూర్ణత

విలువే చిక్కు సమస్య

రికార్డో విలువ స్వభావాన్ని స్పష్టంగా అవగతం చేసుకునేందుకు గట్టిగా కృషి చేశాడు. ఆయన తరచుగా తన పూర్వాభిప్రాయాలు అసంతృప్తికరంగా వున్నట్లు ఒప్పుకొని, వాటిని మార్చుకునేవాడు. ఒక యిబ్బందిని తను అధిగమించినట్లు కనిపించగానే దాని స్థానాన్ని మరొకటి ఆక్రమిస్తూండేది. ''విలువను గురించి'' అన్న ఆయన చివరి రచన అనారోగ్య, మరణాల కారణంగా మొండిపడింది. ఆయన ఉద్దేశంలో, పరమ విలువ అంటే ఒక సరుకులో యిమిడి వున్న శ్రమ మొత్తం. మార్క్స్ దీన్నే విలువ సారాంశంగా పరిగణించాడు. సాపేక్ష విలువ అన్నప్పుడు ఆయన ఉద్దేశం మారకపు విలువ అని, పరిశీలనలో వున్న సరుకుయొక్క ఒక యూనిట్‌కు సహజ నియమాల కారణంగా మారకం చేసుకోబడవలసిన మరొక సరుకు పరిమాణం అని. రికార్డో పరమ విలువను గుర్తించినప్పటికీ, దాని స్వభావంలోకి చొచ్చుకు వెళ్ళేందుకుగాని, యీ విలువలో మూర్తీభవించిన వాస్తవ శ్రమ స్వభావాన్ని అధ్యయనం చేసేందుకుగాని ప్రయత్నించలేదు, యిదే రికార్డో విధానపు బలహీనత ఆయన అవిరామంగా ఆసక్తి గొలిపిన అంశం ఏమిటంటే, యీ విషయానికి సంబంధించిన పరిమాణాత్మక పార్శ్వం మాత్రమే: మారకపు విలువ ప్రత్యక్ష పరిమాణాన్ని నిర్ణయించడం ఎలాగ, దాన్ని ఏవిధంగా కొలవడం? అందుకనే ''విలువయొక్క ఆదర్శ కొలమానం'' కోసం ఆయన గవేషణ ఎండమావిలో నీళ్లకోసం వెదుకులాటయే.

తన విలువ సిద్ధాంతాన్ని వాస్తవ ఆర్థిక క్రమాలతో సరిపుచ్చడం ఒక్కొక్కమారు రికార్డోకి అసాధ్యమవుతూండేది, దానితో ఆయన నిస్పృహలో కూరుకుపోతూండేవాడు. అటువంటి ఒక బలహీన క్షణంలో రాసిన ఒక లేఖలో, అసలు విలువ సమస్యనే పూర్తిగా

ఎత్తివేసి, అది లేకుండా పంపిణీ సూత్రాలను అధ్యయనం చేస్తే సులభతరంగా ఉంటుం దేమో అన్న అభిప్రాయాన్ని ఆయన వెలిబుచ్చాడు. అయితే, ఆ బలహీనత తొలగిపోగానే ఆయన తన ప్రధాన కర్తవ్యపాలనకు తిరిగి పూనుకున్నాడు. ఈ పద్మవ్యూహంనుంచి బయటపడే మార్గాన్ని వెతికాడు.

అనేక యితర సమస్యల్లో మాదిరిగానే యీ సమస్యలో, స్మిత్ ఎక్కడ ఆగిపోయాడో, రికార్డో అక్కడ బయల్దేరాడు. సరుకుయొక్క రెండు అంశాలైన ఉపయోగపు విలువకీ, మారకపు విలువకీ ఆయన మరింత కచ్చితమైన హద్దుల నిర్ణయం చేశాడు. పునరుత్పాదన సాధ్యంకాని అతి కొద్ది వస్తువులను మినహాయించి, అన్ని సరుకుల మారకపు విలువా వాటి ఉత్పత్తిలో వినియోగింపబడే సాపేక్ష శ్రమచేత నిర్ణయింపబడుతుంది.

తన శ్రమ విలువ సిద్ధాంతం విషయంలో స్మిత్ ఆద్యంతం ఒకే విధంగా స్థిరంగా లేడన్న విషయం మనకు తెలిసిందే. శ్రమనుబట్టి, శ్రమ కాలాన్నిబట్టి విలువ నిర్ణయం అన్నది — పెట్టుబడిగాని, వేతన శ్రమగాని లేని "ఆదిమ సామాజిక స్థితి"కి మాత్రమే వర్తిస్తుందని ఆయన నమ్మాడు. ఆధునిక సమాజంలో, ఒక సరుకు ఉత్పత్తి, సాధనలనుండి వేతనం, లాభం, భూమి కౌలు రూపంలో పొందే ఆదాయాల మొత్తం చేత, విలువ నిర్ణయింపబడుతుంది. ఇటువంటి అసంగతత్వం, రికార్డో కచ్చితమైన తార్కిక మేధకు ఆమోదయోగ్యం కాలేదు. మౌలిక సూత్రాలను స్మిత్ ఒక విశిష్ఠమైన స్వేచ్ఛాయుత పద్ధతిలో పరిశీలించాడు. ఇది రికార్డోకి గిట్టలేదు. విలువ నియమంవంటి మౌలిక నియమం సమాజపు అభివృద్ధితో మారిపోదు. అబ్బే, అలాకాదు, శ్రమ కాలాన్నిబట్టి విలువను నిర్ణయించడం తిరుగులేని సార్వత్రిక నియమం అన్నాడు రికార్డో.

ఇక్కడ మనం ఒక విషయాన్ని చేర్చుకోవాలి: మారకంకోసం, డబ్బుకు అమ్మకు నేందుకోసం ఏ సమాజంలోనైతే సరుకులు ఉత్పత్తిచెయ్యబడతాయో అటువంటి సమాజంలో అన్నదే అది. అయితే రికార్డో మరే యితర సమాజాన్నీ ఊహించుకోలేకపోయాడు. ఆయనకి ఒకవేళ చరిత్ర బాగానే తెలిసినా కూడా, మాట వరుసకు, ఆదిమ సమాజంలో ఉత్పత్తి పరిస్థితులను — ఆయన ముఖ్యమైనవిగా భావించలేదు. సంభావ్య భవిష్యత్ సమాజానికి సంబంధించి ఆయన దాన్ని "మిస్టర్ ఓవెన్ సమాంతర చుతుర్భుజం"*గా మాత్రమే ఊహించుకోగలిగాడు. ఓవెన్‌పట్ల వ్యక్తిగతంగా ఆయనకి గౌరవం ఉన్నప్పటికీ కూడా, దీన్ని ఆయనొక పగటికలగా పరిగణించాడు. స్మిత్‌కి వున్న చారిత్రక అవగా

---

* రేఖా గణితంలో మాదిరి కచ్చితమైన రూపంలో రాబర్ట్ ఓవెన్ నిర్మించ తలపెట్టిన కార్మిక వాడలకు (కమ్యూన్లకు) యిది ప్రస్తావన.

హన రికార్డోకి లేదు, అందుచేతనే ఆయన తమ వేటజంతువులను మారకం చేసుకునే స్వతంత్రులైన వేటగాళ్ల సమాజానికీ, తన కాలంలో వున్న ఫ్యాక్టరీ ఉత్పత్తి, వేతన శ్రమ వ్యవస్థకీ మధ్యవున్న అపారమైన తేడాను చూడలేదు. క్లుప్తంగా చెప్పాలంటే, పెట్టుబడిదారీ సమాజం తప్ప ఆయనకి మరొక సమాజం ఏదీ తెలియదు. కాగా, యీ సమాజ నియమాలనే సహజమైనవిగా, సార్వత్రికమైనవిగా, శాశ్వతమైనవిగా ఆయన పరిగణించాడు.

అయితేనేం, శ్రమ విలువ నియమం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజానికి సార్వత్రికంగా వర్తిస్తుందన్న తన సిద్ధాంతమే, ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి రికార్డో చేసిన గొప్ప సేవ. ఉదాహరణకు స్మిత్‌యొక్క, ఆయన శిష్యులయొక్క అభిప్రాయాలనుబట్టి, డబ్బు వేతనాల్లో మార్పు (నిజానికి ఏ మార్పు అయినా సరే), సరుకుల విలువలోనూ, ధరల్లోనూ తదనురూపమైన మార్పును కలిగిస్తుంది. ఈ మాటను రికార్డో దృఢంగా తోసిపుచ్చాడు: "ఒక సరుకు విలువ, లేక అది దేనికైతే మారకం పొందుతుందో ఆ మరే యితర సరుకు ప్రమాణమైనా, దాని ఉత్పత్తికి అవసరమైన సాపేక్ష శ్రమపైన ఆధారపడుతుందేగాని, ఆ శ్రమకు చెల్లింపబడిన ఎక్కువో, తక్కువో పరిహారంపైన ఆధారపడదు."*

శ్రమ ఉత్పాదకతలో ఏ మార్పూ లేకుండా వేతనాలు పెరిగినట్లయితే, అది సరుకు విలువను మార్చదు. అన్నీ యథాతథంగా సమానంగానే ఉన్నట్లయితే, అదీ ధరను ప్రభావితం చెయ్యదు. అది బంగారంలో విలువ ప్రతిబింబం మాత్రమే అవుతుంది. మరైతే మారేది ఏమిటి? కార్మికుని వేతనానికీ, పెట్టుబడిదారు లాభానికీ మధ్య విలువ పంపిణీ మాత్రమే. స్వేచ్ఛాయుతమైన పోటీలో పెట్టుబడిదారులు, వేతనాల్లో పెరుగుదలను తమ సరుకుల ధరలను పెంచడం ద్వారా భర్తీచేసుకోలేరు.

ఈ సమస్య భవిష్యత్తులో గొప్ప పాత్ర వహించవలసి వుంది. ఆదినుంచీ కూడా దానికి తీవ్ర రాజకీయ స్వభావం వుంది, ఉన్నత వేతనాలకోసం కార్మికవర్గం జరిపే పోరాటంతో అది సన్నిహితంగా ముడిపడివుంది. వేతనాలు, ధరలు, లాభాల మధ్యగల సంబంధంయొక్క తన విశ్లేషణలో మార్క్స్ ప్రత్యేకించి రికార్డో వాదాన్ని ఆధారం చేసుకున్నాడు. అధిక వేతనాలకోసం జరిగే పోరాటం అర్థరహితమైనది, ఎందుకంటే వేతనాల్లో వచ్చే ఏ పెరుగుదల అయినా ధరల పెరుగుదల మూలంగా నాస్తీకరింపబడుతుందన్న కార్మికోద్యమానికి హానిదాయకమైన అభిప్రాయాన్ని ఖండించేందుకు యీ వాదం ఉద్దేశింపబడింది. మార్క్స్ యిలా వివరించాడు: "వేతనాల రేటులో వచ్చే

---

* D. Ricardo, *The Principles of Political Economy and Taxation*, London, 1937, p. 5.

సాధారణ పెరుగుదల లాభపు సాధారణరేటు తరుగుదలకు దారితీస్తుంది, కాని, దర హాంమీద సరుకుల ధరలను ప్రభావితం చెయ్యదు."*

పెరిగే జీవన వ్యయానికీ, పెరిగే ద్రవ్యోల్బణానికీ కార్మికుల డబ్బు వేతనాల్లో పెరుగుదలయే ఏకైక, లేక ప్రధాన కారణం అన్న బూర్జువా వాదనల దృష్ట్యా, యీ ప్రతిపాదనలకు యీనాటికీ ప్రాముఖ్యం వుంది. అదే సమయంలో, రికార్డో, మార్క్సుల అభిప్రాయాలు యీనాటి పరిస్థితులకు భిన్నమైన పరిస్థితుల్లో వ్యక్తంచెయ్యబడ్డాయనీ, పెట్టుబడిదారీ విధానానికి ఆనాడున్న కొన్ని లక్షణాలు దరిమిలా అంతరించాయనీ లేక మారాయనీ మనం గుర్తుంచుకోవలసివుంటుంది. వాటిలో అతి ముఖ్యమైనవి ఏమిటంటే, మొదటిది, వ్యక్తిగత పారిశ్రామికవేత్త, తన సరుకుల మార్కెట్ ధరలను ప్రభావితం చేసే సంభావ్యతను తొలగించివేసిన స్వేచ్ఛాయుత పోటీ; రెండవది, బంగారు ప్రమాణ ప్రాతిపదికపైన స్థిరమైన డబ్బు చలామణీ — యిది ధరల పెరుగుదల స్థాయికి రుణాన్నీ, డబ్బునూ సరిపుచ్చే సంభావ్యతను పరిమితం చేస్తుంది.

మార్కెట్లమీదా, ధరలమీదా గణనీయమైన పరిమాణంలో అదుపును కలిగిన గుత్తసంస్థల ప్రాబల్యం, పరిమాణాన్ని పెంచే దిశలో డబ్బు చలామణీ, రుణాల ఏకపక్ష వ్యాకోచత్వం, ఆధునిక పెట్టుబడిదారీ విధానపు విశిష్ట లక్షణమన్న సంగతి మనకు తెలిసిందే. ఈ పరిస్థితుల్లో పారిశ్రామికవేత్తలు అధికతర వేతనాలను సరుకుల ధరలపైకి నెట్టగలుగుతారు; తమ లాభాలను కొనసాగించుకునేందుకూ, పెంచుకునేందుకూ గాను వాళ్లీ పనిని ఎల్లప్పుడూ చేస్తూనే వుంటారు. సహజంగానే, యీ పని చేసేం దుకుగల సంభావ్యత అపరిమితమైనదేమీ కాదు. మార్కెట్పైన గల గుత్తాధిపత్యంపైనా, పలు యితర అంశాలపైనా అది ఆధారపడుతుంది. వేతనాలకూ ధరలకూ మధ్యగల సంబంధపు సమస్య, ఆధునిక పెట్టుబడిదారీ దేశాల రాజకీయ జీవితంలో ఒక ముఖ్య పాత్రను వహిస్తోంది. గుత్త సంస్థలచేత ధరల పెంపుదల, ఆధునిక ద్రవ్యోల్బణపు ప్రధానాంశాల్లో ఒకటి. ఇదే మామూలుగా నిజవేతనాల పెరుగుదల ఫలితంగా చిత్రింప బడుతూ వుంటుంది. సహజంగానే, యీ సమస్య మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తల యొక్క అత్యంత కేంద్రీకృతమైన శ్రద్ధను చూరగొంటుంది.

పెట్టుబడిదారీ విధానపు భవితవ్యాన్ని గురించిన రికార్డో అభిప్రాయాల్లోనూ, ఆయన రాజకీయ కార్యక్రమంలోనూ, వేతనాలకూ లాభానికీ మధ్య గల విలోమ సంబం ధాన్ని గూర్చిన నిర్ధారణ అతి ముఖ్యమైనది. వ్యవసాయోత్పాదితాల

---

* K. Marx and F. Engels, *Selected Works*, in three volumes, Vol. 2, p. 75.

ధరలకు నిరంతరాయంగా పెరిగే ధోరణి వుందని రికార్డో విశ్వసించిన సంగతి గుర్తుండి వుంటుంది. ఇది నికరవేతనాల్లో పెరుగుదలకు దారితీస్తుంది: కార్మికులు ఎప్పుడూ అతి కనిష్ఠ వేతనాలనే పొందుతున్నారు కనుక, వేతనాలు పెరగకపోతే వాళ్ళు వట్టినే ఆకలితో చచ్చిపోతారు. అయితే, పెట్టుబడిదారులు పారిశ్రామిక వస్తువుల ధరలను పెంచలేరు గనుక, వాళ్ల లాభాలు తదనుగుణంగా తగ్గించబడుతాయి. ధాన్యం ఖరీదు పెరిగితే అది పారిశ్రామికవేత్తలకు చెడుగు, ఒకానొక దశలో అది పెట్టుబడి సంచయనం విషయంలో వారికిగల ప్రేరణను తొలగిస్తుంది. రికార్డో దృష్టిలో, దీని అర్థం ఆర్థిక విపత్తే!

శ్రమ విలువ సిద్ధాంతానికి ఎదురైన ప్రధానమైన యిబ్బందులు ఏమిటో స్మిత్‌కి తెలిసినంతగా రికార్డోకూ తెలుసు.

మొదటి యిబ్బంది, కార్మికుడికీ పెట్టుబడిదారుకీ మధ్య మారకాన్ని వివరించడం. కార్మికుని శ్రమ ఒక్కటే సరుకు విలువను సృష్టిస్తుంది, యీ శ్రమ పరిమాణమే విలువ పరిమాణాన్ని నిర్ణయిస్తుంది. అయితే, తన శ్రమకు మారకంగా, కార్మికుడు వేతనం రూపంలో తక్కువ విలువను పొందుతాడు. ఈవిధంగా, యీ మారకంలో విలువ నియమం భంగంచెయ్యబడిందని తేలుతోంది. ఈ నియమమే గనుక పాటింపబడి నట్లయితే, కార్మికుడు, తన శ్రమచేత సృజింపబడిన ఉత్పాదితపు పూర్తి విలువను పొందుతాడు, అయితే అప్పుడు పెట్టుబడిదారుకు లాభం అంటూ వుండదు. ఈవిధంగా ఒక వైరుధ్యం ఉత్పన్నమవుతుంది: విలువ నియమం వాస్తవికతకు అనురూపంగానైనా ఉండకపోవాలి, లేకపోతే విలువ నియమం మారకపు అతి ముఖ్య రంగంలో నిరంతరాయంగా భంగపరచబడుతూనైనా వుండాలి.

కార్మికుడు పెట్టుబడిదారుకు అమ్మేది ఒక క్రమమూ, ఒక కార్యకలాపమూ, మానవశక్తి వ్యయమూ మాత్రమే అయిన తన శ్రమను కాక, తన శ్రమశక్తిని మాత్రమే ననీ, అంటే శ్రమించగల తన సామర్థ్యాన్ని మాత్రమేననీ నిరూపించడం ద్వారా ఈ వైరుధ్యాన్ని మార్క్స్ పరిష్కరించాడు. దాన్ని కొనడంలో పెట్టుబడిదారు సామాన్యంగా కార్మికుడికి, అతని శ్రమశక్తియొక్క పూర్తి విలువను చెల్లిస్తాడు; యీ విలువ, శ్రమ సృజించేదానిచేత కాక, జీవించివుండటానికీ, పునరుత్పత్తి చెయ్యడానికీ కార్మికుడికి అవసరమైనదానిచేత నిర్ణయింపబడటమే యిందుకు కారణం. ఈ విధంగా, పెట్టుబడికీ శ్రమకీ మధ్య మారకం, పెట్టుబడిదారు కార్మికుణ్ణి దోచుకోడాన్ని మినహాయించని శ్రమ విలువ సిద్ధాంతానికి పూర్తి అనుగుణంగా, జరుగుతుంది.

రెండవ యిబ్బంది, వాస్తవ జీవితంలో పెట్టుబడిదారుల లాభం వాళ్ళ ఫ్యాక్టరీలలో ఉత్పత్తిచెయ్యబడే సరుకుల విలువచేత కాక, దానిలో పెట్టబడిన పెట్టుబడి మొత్తంచేత

నిర్ణయింపబడుతుందన్న యథార్థంతో, విలువ నియమాన్ని సరిపుచ్చడం ఎలాగ అన్నది. విలువ శ్రమచేత మాత్రమే సృజింపబడి, సరుకులు ఉజ్జాయింపుగా తమ విలువ దగ్గరే మారకం చేసుకోబడినట్లయితే, ఉత్పత్తియొక్క వివిధ శాఖలు పూర్తిగా భిన్నమైన స్థానాల్లో వుంటాయి. వేటిలోనైతే బోలెడంత శ్రమశక్తీ, కాని తక్కువ యంత్రాలూ, ముడిపదార్థాలూ వినియోగింపబడతాయో అటువంటి శాఖలూ, పారిశ్రామిక సంస్థలూ అధిక విలువ కలిగిన సరుకులను కలిగివుండాలి, తమ సరుకులను అధికధరలకు అమ్మాలి, తత్పర్యవసానంగా అధిక లాభాన్ని పొందాలి. వేటిలోనైతే పెట్టుబడి త్వరితగతి తిరగడ వుంటుందో, ఏవైతే సత్వర లాభాలనిస్తాయో ఆ శాఖలకు కూడా యిదే వర్తిస్తుంది. తద్భిన్నంగా, ఏ శాఖల్లోనూ, ఏ పరిశ్రమల్లోనూ అయితే ఉత్పత్తి సాధనాల రూపంలో పెద్ద మొత్తంలో పెట్టుబడి మదుపుపెట్టబడాలో, లేక వేటిలో పెట్టుబడి తిరగడ మరింత మందకొడిగా వుంటుందో, వాటిలో సరుకుల విలువ, ధరలు, లాభాలు మరింత తక్కువగా ఉండాలి.

అయితే యిది అసాధ్యం. ఇది పెట్టుబడిదారీ విధానపు అసలు వాస్తవాలకు విరుద్ధం. ఎందుకంటే, సమాన పెట్టుబడులు సమానమైన లాభపు రేటును లభింపజేసే ధోరణిని కలిగివుంటాయి. లేకపోతే, తక్కువ లాభాన్నిచ్చే శాఖలు కొన్ని మిగిలిపోతాయి. కాగా, శ్రమ విలువ నియమం సగటు లాభపు పరమ, నిర్వహణ నియమంతో పొసగనిదిగా కనిపిస్తుంది.

ఆడమ్ స్మిత్ యీ వైరుధ్యాన్ని గణనలోకి తీసుకోక, ఆచరణలో శ్రమ విలువను తిరస్కరించి, ఆదాయాలనుంచి విలువను – సగటు లాభం వీటిలో ఒకటి – రూపొందించాడు. తన భావాన్ని మరింత సుసంగతంగా శ్రమ విలువ సిద్ధాంతంతో ముడివేసిన రికార్డో ఆవిధంగా చెయ్యలేకపోయాడు. ఆయన, యీ సిద్ధాంతపు చట్రంలోకి, సమాన పెట్టుబడికి సమాన లాభం అన్న యథార్థాన్ని బలవంతాన చొప్పించేందుకు ప్రయత్నించాడు. ఆ చట్రం భగ్నమైపోకుండా చూసే ప్రయత్నంలో ఆయన, పెట్టుబడియొక్క సంపుటిలోని, తిరగడలోని భేదాల ప్రాముఖ్యాన్ని తగ్గించి చెప్పేందుకు ఎంతో నేర్పునూ, కృతనిశ్చయాన్నీ ప్రదర్శించాడు. సగటు లాభం విలువ నియమాన్ని మార్చినప్పటికీ, యిదొక చిన్న అంశమనీ, దీన్ని విస్మరించవచ్చుననీ పాఠకుడిచేత ఒప్పించేందుకు ఒక రకమైన అమాయిక పద్ధతిలో రికార్డో మౌలికంగా ప్రయత్నించాడు.

ఆయన వాదించరానిదానికోసం వాదిస్తున్నాడనడం స్పష్టం. పెట్టుబడిదారీ విధానపు పరిస్థితుల్లో సరుకులు ఉత్పత్తిచెయ్యబడినప్పుడు, విలువ నియమం పనిచేస్తుంది (రికార్డో యీ విషయాన్ని సరిగానే చెప్పాడు), అయితే, సరళ సరుకుల ఉత్పత్తిలో పనిచేసినట్లుగా అది పనిచెయ్యజాలదు (యిక్కడ రికార్డో తప్పు చెప్పాడు). విలువ

ఉత్పత్తి ధరగా రూపాంతరీకరింపబడింది, పెట్టుబడిపై లాభం యీ ఉత్పత్తి ధరలో యిమిడివుంటుంది, యీవిధంగా పెట్టుబడియొక్క సంపుటి, తిరగడలలోని భేదాలు సమతులితం చెయ్యబడుతాయి. శాఖల మధ్య పెట్టుబడిదారీ పోటీ యంత్రాంగం ద్వారా యిది నిర్వర్తింపబడుతుంది. ఇది విలువ నియమపు తిరస్కృతిగాక, అభివృద్ధి. మార్క్స్ యీ సమస్యకు సమకూర్చిన సమాధానపు సాధారణ రేఖాచిత్రం యిదీ.

ఉత్పత్తి ధర అన్నది, విలువనుండి మౌలికంగా భిన్నమైన భావాభివర్గం. అవి రెండూ సమవసించడమన్నదే సంభవిస్తే, అది శుద్ధ యాదృచ్ఛిక విషయం మాత్రమే. అయితే రికార్డో, అవి రెండూ అభిన్నమైనవనీ, వ్యతిక్రమాలు ఏవైనా వుంటే, వాటిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదనీ రుజువుచేసేందుకు ప్రయత్నించాడు. ఆయన తీసుకున్న యీ వైఖరి, ఆయన సైద్ధాంతిక ప్రత్యర్థుల తీవ్ర విమర్శ ధాటికి తట్టుకోలేనిదిగా త్వరలోనే రుజువైంది.

కేక్‌ను పంచుకోవడం లేక రికార్డో దృష్టిలో అదనపు విలువ

రికార్డోది మౌలికంగా గణితశాస్త్రపరమైన బుర్ర. అర్థశాస్త్రమూ, గణితశాస్త్రమూ చెట్టపట్టాలేసుకుని కృషిచెయ్యవలసిన కాలం యింకా చాలా ముందు వుంది. అందుకనే ఆయన రచనల్లో సూత్రాలూ, సమీకరణాలూ కనిపించవు. అయితే ఆయన ఆలోచనా విధానమూ, విషయ వివరణ పద్ధతీ కచ్చితమైన గణితశాస్త్రపరమైన రుజువులను గుర్తుచేస్తాయి!* అర్థశాస్త్రపు సంక్లిష్ట అంశాలనుండీ, సూత్రాలనుండీ సరళమైనవాటిని

---

* అర్థశాస్త్రంలో గణితశాస్త్ర పద్ధతులు ప్రవేశపెట్టడంలో ఆద్యుడైన ఎ. కుర్నో ఎన్నడో 1838లోనే, రికార్డో ఆలోచనలోని యీ లక్షణాన్ని గమనించాడు. అలవికాని సంఖ్యాత్మక ఉదాహరణలతో కూడిన రికార్డో "గణితశాస్త్రం"లోని ఒక బలహీనతను గురించి ఆయన యీవిధంగా పేర్కొన్నాడు: "అర్థశాస్త్రాన్ని గురించే రాస్తున్నప్పటికీ, శుద్ధ సాహిత్య రూపాలంకరణలన్నింటినీ నిలబెట్టుకున్న స్మిత్, సేయ్‌ల వంటి రచయితలు వున్నారు; రికార్డో వంటి మరో రకం రచయితలూ వున్నారు. వీళ్ళ మరింత అనిర్దిష్ట సమస్యలను గురించి చర్చించేటప్పుడు, లేక అధికతర కచ్చితత్వం కోసం వెదుకులాడేటప్పుడు, బీజగణితాన్ని పరిహరించుకోలేకపోయారు. అయితే వాళ్ళు చేసిందల్లా ఏమిటంటే, దానికి విసుగుపుట్టించేటంత సుదీర్ఘమైన గణితశాస్త్రపరమైన లెక్కల ముసుగు తొడ

వేరుచేసి, తనకు అప్రధానమైనవిగానూ, అనావశ్యకమైనవిగానూ కనిపించేవాటి నన్నిం టినీ పక్కకు నెట్టేసే అసాధారణమైన సామర్థ్యం రికార్డోకి వుంది. ఆయన, ఆలో చనలోని కచ్చితత్వం, తర్కం ఆయన సమకాలీనులను విశేషంగా ప్రభావితంచేశాయి. ఆయన వాగ్వివాదాల్లో ప్రతిభావంతుడు. ఆయన్ని గురించి జేమ్స్ మిల్ ఒక మిత్రుడికి యిలా రాశాడు: "రికార్డో జోలికి పోబోకండి. నేను చెప్తున్నాను కదా, ఆయన పొర పాటును కనుక్కోవడం సులభసాధ్యం కాదు. నేను అనేక సార్లు అనుకున్నాను, ఆయన ఎక్కడ పొరపడినదీ కనుక్కున్నానని, కాని చివరకు నేను ఆయన అభిప్రాయానికి వశుడినై పోయేవాడిని."*

అయితే, ఆయన గణితశాస్త్రపరమైన వైఖరికి, దాని లోట్లు దానికి వున్నాయి. విలువలో మాదిరిగానే పంపిణీలో, రికార్డో ప్రధానంగా పరిమాణాత్మక పార్శ్వాన్నే చూశాడు. వాటాల్లోనూ, అనుపాతాల్లోనూ చూపినంత ఆసక్తిని, పంపిణీ ప్రత్యక్ష స్వభావంలోనూ, సమాజపు నిర్మాణ, అభివృద్ధులతో దానికిగల సంబంధంలోనూ ఆయన చూపలేదు.

వేతనం, లాభం, కౌలులను సమాజంలోని మూడు ప్రధాన వర్గాల ప్రాథ మిక ఆదాయాలన్న స్మిత్ అభిప్రాయాలనే చాలవరకు రికార్డో అభివృద్ధిచేశాడు. కార్మికునియొక్క, అతని కుటుంబంయొక్క జీవికకు అయ్యే ఖర్చే వేతనం అన్న నిర్వ చనాన్ని రికార్డో తన వెనకటివాళ్లనుంచి స్వీకరించాడు. మాల్తస్ జనాభా సిద్ధాం తంపై ఆధారపరచడం ద్వారా తను యీ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేస్తున్నానని రికార్డో భావించాడు. మాల్తస్ జనాభా సిద్ధాంతంలోని ప్రధాన సూత్రాలను ఆయన ఆమోదిం చాడు. మాల్తస్‌తో ఆయన ఏకీభవించిన ఒకేఒక ముఖ్యాంశం యిదేలా కనిపిస్తుంది. తన వాదనకు మాల్తస్ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొన్న రికార్డో, వేతనాలు పెట్టు బడిదారీ విధానపు నిర్దిష్ట నియమాల కారణంగా కాక, సహజ, సార్వత్రిక నియమం చేత కచ్చితమైన భౌతిక కనిష్ఠ పరిమితుల్లో ఉంచబడుతాయని విశ్వసించాడు. అంటే, సగటు వేతనం కనీస జీవితావసరాల స్థాయిని దాటగానే కార్మికులు మరింతమంది బిడ్డ లను కని, పెంచవలసివుంటుంది, శ్రమ మార్కెట్లో పోటీ బలవత్తరమై, వేతనాలు తిరిగి పడిపోతాయి.

———————

గడం మాత్రమే." (A. A. Cournot, *Recherches sur les principes mathématiques de la théorie des richesses*, Paris, 1838, p. IX.)

* J. B. Hollander, *David Ricardo. A Centenary Estimate*, Baltimore, 1910, p. 120.

మాల్తస్, రికార్డోల యీ అభిప్రాయాలు, దరిమిలా ఫెర్డినాండ్ లాసాల్‌చేతా, తదితర పెటీబూర్జువా సోషలిస్టులచేతా ప్రతిపాదింపబడిన "వేతనాల ఉక్కు నియమం" అనబడేదానికి ప్రాతిపదిక అయింది. వేతనాలు ఎటుతిరిగీ అనివార్యంగా జీవనాధారాల భౌతిక కనిష్ఠ స్థాయితో ముడిపడి వుంటాయిగనుక, కార్మికవర్గం తన ఆర్థిక ప్రయోజనాలకోసం జరిపే పోరాటం వ్యర్థమని యీ "నియమం" సూచిస్తుంది. పశ్చిమ దేశాల్లో మార్క్స్‌పైన యీ "ఉక్కు నియమానికి" కట్టుబడివున్నాడని వెనకా ఆరోపించారు, యీనాటికీ ఆరోపిస్తున్నారు, అయితే నిజానికి అటువంటి భావాలు మార్క్సిజానికి విజాతీయమైనవి.

రికార్డో సిద్ధాంతం చాలవరకు అచలమైనది. శ్రామికోత్పాదకతను ఆయన గుర్తించడమే గాక, దాని పెరుగుదలను హర్షించినప్పటికీ కూడా, ఆ క్రమంలో కార్మికవర్గం స్వయంగా మారుతుందన్న విషయాన్ని ఆయన గమనించలేదు. ప్రత్యేకించి రెండు అంశాలు మారుతాయి: 1) కార్మికుని సామాన్యమైన, సామాజికంగా ఆమోదింపబడిన డిమాండ్లు పెరుగుతాయి, 2) కార్మికవర్గ నిర్మాణ సంఘీభావాల్లోనూ, ఉన్నత జీవన ప్రమాణంకోసం పోరాడే దాని సామర్థ్యంలోనూ పెరుగుదల వుంది, దాని చైతన్యం పెరిగినకొద్దీ వర్గపోరాటం మరింత బలపడుతుంది.

సమాజంలో జాతీయాదాయ పంపిణీని రికార్డో, ఒక కేకు పంపిణీగా పరిగణించాడు. సాధారణంగా యీ కేకు ఒకే స్థిరమైన సైజులో వుంటుంది. కార్మికులకు సామాన్యమైనదానికన్న కొంచెం పెద్ద ముక్కయే లభిస్తుంది. మిగిలినదంతా పెట్టుబడిదారులకు పోతుంది. అయితే, వాళ్లు ఆ ముక్కను భూస్వాములతో కలిసి పంచుకోవలసి వుంటుంది. దీనికితోడు, భూస్వాముల వాటా నిరంతరాయంగా పెరుగుతోంది.

కౌలూ (పారిశ్రామికవేత్తలు ధనాధిపతులైన పెట్టుబడిదారులకు రుణాలపైన చెల్లించే వడ్డీ కూడా) లాభంనుండి తగ్గించవలసినదే అన్న యీ భావం ముఖ్యమైనది. దీని అర్థం ఏమిటంటే, లాభం ఆదాయపు ప్రాథమిక, మౌలిక రూపంగా అంటే, అదనపు విలువగా పరిగణింపబడింది. దీనికి పునాది పెట్టుబడి. లాభం, అదనపు విలువల మధ్య రికార్డో చేసిన సమీకరణ, ఉత్పత్తి ధర, విలువల మధ్య ఆయన చేసిన సమీకరణతో ముడిపడివుంది. ఆయన విలువ సిద్ధాంతానికి వున్న గుణదోషాలే, ఆయన పంపిణీ సిద్ధాంతానికి కూడా వున్నాయి.

ఒక విడి సరుకు విలువా, జాతీయాదాయంగా రూపొందే అన్ని సరుకుల విలువా వాస్తవానికి, శ్రమ వ్యయంచేత నిర్ణయింపబడుతాయి. ఈ విలువ వేతనాలుగానూ, లాభంగానూ (కౌలుతో బాటు) విభజింపబడుతుంది. అందుకనే రికార్డో, శ్రామిక వర్గంయొక్క, బూర్జువావర్గంయొక్క వర్గ ప్రయోజనాల మూలంలో మౌలికమైన వైరు

ధ్యం వుందని నిర్ధరించాడు. వేతనాలు పెరిగీ, లాభం పడిపోయినప్పుడూ, యిందుకు తలకిందులుగా జరిగినప్పుడూ మాత్రమే వేతనాలూ, లాభమూ విలోమ అనుపాతంలో మారగలవని ఆయన అనేక సార్లు రాశాడు. పెట్టుబడిదారీ విధానాన్ని గట్టిగా సమర్థించిన అమెరికన్ కేరీ, రికార్డో సిద్ధాంతాన్ని వర్గాలమధ్య పోరాట, శత్రుత్వాల విధానం అని పిలిచినది యీ కారణంగానే.

అయితే, రికార్డోకి అనుపాతాల్లోనూ, యీ విషయానికి సంబంధించిన పరిమాణాత్మక పార్శ్వంలోనూ మాత్రమే ఆసక్తి వుంది. వేతనానికీ, లాభానికీ మధ్య వైరుధ్యాన్ని సృష్టించే సంబంధాల స్వభావం, పుట్టుక, భవితవ్యాలతో ఆయనకి సంబంధం లేదు. అందుచేతనే ఆయన పెట్టుబడిదారు కార్మికుడినుంచి, ఆతని శ్రమచేత సృష్టింపబడిన విలువలో కొంత భాగాన్ని హరిస్తాడన్న విషయాన్ని గ్రహించడం ద్వారా, ఆ ఆవిష్కరణకు సన్నిహితంగా వచ్చినప్పటికీ, "అదనపు విలువ రహస్యాన్ని" ఆయన ఆవిష్కరించలేకపోయాడు.

భూమికౌలు స్వభావ, పరిమాణాలను రికార్డో విశ్లేషించాడు. ఆయన సాధించిన అతి మేలైన శాస్త్రీయ విజయాల్లో యిదొకటి. తనకు ముందరివాళ్ల మాదిరిగా కాకుండా, తన భూమికౌలు సిద్ధాంతాన్ని ఆయన శ్రమ విలువ సిద్ధాంతపు దృఢ ప్రాతిపదికపైన నిర్మించాడు. భూమికౌలుకి మూలం ప్రకృతి ఔదార్యం కాదనీ, భూమిపై వినియోగింపబడిన శ్రమయేననీ ఆయన వివరించాడు. భూవనరులు పరిమితమైనవి కనుక, అతి సారవంతమైన భూఖండాలే కాకుండా, మధ్యతరహా భూములూ, నాసిరకం భూములూ కూడా సాగుచెయ్యబడతాయి. వ్యవసాయోత్పాదితపు విలువ, సాపేక్షంగా నాసిరకం భూములపై వినియోగింపబడిన శ్రమచేత నిర్ణయింపబడుతుంది. కాగా, అతి సారవంతమైన భూములూ, మధ్యతరహా భూములూ అధికతర లాభాన్ని చేకూరుస్తాయి. లాభం సగటుచెయ్యబడవలసి వుంటుంది గనుక, పెట్టుబడిదారీ కౌలుదారులు యీ అదనపు ఆదాయాన్ని కౌలురూపంలో భూస్వాములకు యివ్వాల్సివుంటుంది.

నాసిరకం భూములు ఆదాయాన్నివ్వవని రికార్డో భావించాడు. మార్క్స్ అది పొరపాటని నిరూపించాడు: భూమిపై వ్యక్తిగత స్వామ్యం వున్నప్పుడు, భూస్వామి అతి నాసిరకం భూమిని సైతం వట్టినే కౌలుకి యివ్వడు. రికార్డో పద్ధతి కౌలును మార్క్స్ <u>వ్యత్యాస</u> (differential) <u>కౌలు</u> అనీ (అంటే, భూమిలో ప్రకృతిసిద్ధంగా వున్న తేడాలతో సంబంధించినది), రికార్డో పరిగణనలోకి తీసుకోని యీ ప్రత్యేక కౌలును <u>పరమ కౌలు</u> అనీ పేర్కొన్నాడు.

ఆర్థిక సంక్షోభాల్లో కొద్దిపాటి పెరుగుదలల దృష్ట్యా, రికార్డో అన్వయించిన (అపరిణత రూపంలో) క్రమాల విశ్లేషణ గొప్ప పాత్రను వహించింది: ఒకానొక

నిర్దిష్ట సాంకేతిక, డిమాండు స్థాయిలో ఏచివరి (ఉపాంత) భూఖండంపైనైతే శ్రమ వినియోగం లాభసాటియో, ఆ భూఖండంలోని ఆ శ్రమ వ్యయంచేత వ్యావసాయిక ఉత్పాదితపు విలువ నిర్ణయింపబడుతుంది. కొద్దిపాటి పెరుగుదలల (ఉపాంతాల) పద్ధతి అర్థశాస్త్రంలో ఒక ప్రముఖ పాత్ర వహించవలసివుంది.

పెట్టుబడిదారీ విధానం ఎక్కడికి పోతోంది?

అర్థశాస్త్రాన్ని ప్రజానురంజకం చేసిన ఒక ఆధునిక అమెరికన్ రచయిత ఆర్. ఎల్. హైల్‌బ్రోనర్ రికార్డో విధానాన్ని గురించి యిలా రాశాడు: "ఇది యూక్లిడ్ రేఖాగణితమంతటి మౌలికం, నగ్నం, నిరలంకృతం, శిల్పసమన్వితం అయినది; అయితే శుద్ధ రేఖాగణిత ప్రతిపాదనల మాదిరిగా కాకుండా, యీ విధానానికి మానవత్వపు మాధుర్యం వుంది. అదొక విషాదకర విధానం."* పెట్టుబడిదారీ వ్యవస్థలో రికార్డో దర్శించిన విషాదాంతం, యీ వ్యవస్థ భవిష్యత్తుకు సంబంధించిన ఆయన నిరాశా భావం – వీటికి గట్టి పునాది వుంది. పెట్టుబడిదారీ అభివృద్ధిలోని వాస్తవ ధోరణులను అవి ప్రతిబింబించాయి. సోమరి భూస్వాములు ఇంగ్లండును గుటకాయస్వాహా చెయ్యనిమాట నిజమే. ఇంగ్లీషు పెట్టుబడిదారీ విధానం విషయంలో రికార్డో జోస్యం చెప్పిన "అల్ప సంచయన" వ్యాధి కూడా అంత మరీ దారుణంగా పరిణమించనే లేదు. కార్మికవర్గం క్రియాశూన్యంగా మాల్తుసియన్ – రికార్డియన్ విషాద కర్మకు తలొగ్గ లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ విషాదకర స్వభావం, రికార్డో అనుకున్నదానికి కొంత భిన్నంగా పరిణమించింది.

అయితేనేం, ఆ గొప్ప చింతనాపరుడు, పెట్టుబడిదారీ విధానపు అనేక లక్షణాలను వాటి నిజవర్ణాల్లో దర్శించాడు. పెట్టుబడిదారీ విధానం శ్రామికవర్గాన్ని ఉత్పత్తికి ఒక అనుబంధస్థితిలో వుంచి, కార్మికుల వేతనాలను పరమ కనీస స్థాయికి తగ్గించ ప్రయత్నిస్తుందని ఆయన చెప్పాడు. అది పూర్తిగా సరైన విషయం. భూమిపైన భారీఎత్తు వ్యక్తిగత స్వామ్యం ఆర్థిక పురోగతిపైన వినాశకర ప్రభావాన్ని బరపుతుందని ఆయన భయపడ్డాడు. అది కూడా సరైనదే. ఈ భయాలు సమంజసమైనవేనన్న విషయాన్ని, ఇంగ్లండు కాకపోయినా అనేక యితర దేశాల అనుభవం రుజువుచేసింది.

* R. L. Heilbroner, *The Great Economists*, London, 1955, p. 78.

రికార్డో నిరాశాభావం కనీసం రెండు కారణాలచేత పరిమితం చెయ్యబడింది. మొదటిది, స్వేచ్ఛా వాణిజ్యం, ప్రత్యేకించి విదేశాలనుంచి ధాన్యపు స్వేచ్ఛాయుత దిగుమతి, భూమికౌలు పెరుగుదలనూ, లాభపు తరుగుదలనూ అరికట్టి, పరిస్థితిని మౌలికంగా మార్చగలదనీ, మారుస్తుందనీ ఆయన నమ్మాడు. రెండవది, సార్వత్రిక అమితోత్పత్తీ, ఆర్థిక సంక్షోభాలూ అసాధ్యమన్న సూత్రాన్ని ఆయన ఆమోదించాడు, దరిమిలా యీ సూత్రమే "సేయ్ నియమం" అని పిలవబడింది. కనీసం యీ దిశలోనైనా, పెట్టుబడిదారీ విధానానికి ఎటువంటి ఢోకా లేదని ఆయన భావించాడు.

సరుకులకూ, సేవలకూ సమాజంలో వున్న డిమాండు అపరిమితమైనది అన్నాడు రికార్డో. మనిషి పొట్ట ఒక నిర్దిష్ట పరిమాణపు ఆహారం కన్న ఎక్కువను స్వీకరించలేని మాట నిజమే అయినా, వివిధ "సౌకర్యాల కోసం, అలంకారాల కోసం" డిమాండ్లకు మితి అంటూ లేదు. ఇక్కడ అవసరాన్ని డబ్బు చెల్లించగల డిమాండుతో ఆయన గలిబిలి చెయ్యడంలేదా, అనవచ్చు. లేదు, ఆయన అంత అమాయకుడు కాదు. ఆర్థికంగా చెప్పకోవాలంటే, డబ్బు చెల్లించగల డిమాండ్లకు ఎక్కువ విలువ లేదన్న విషయాన్ని ఆయన గ్రహించాడు. అయితే, సేయ్ మాదిరిగానే, ఆదాయాలను ఉత్పన్నం చెయ్యడం ద్వారా ఉత్పత్తి తనంతట తనే వస్తువులకూ, సేవలకూ డబ్బు చెల్లించగల డిమాండును సృష్టిస్తుందనీ, కాగా యీ డిమాండు అనివార్యంగా అన్ని వస్తువులనూ, సేవలనూ సాధించుకోడాన్ని సంభవం చేస్తుందనీ రికార్డో భావించాడు.

ఆయన పెట్టుబడిదారీ సమాజాన్ని ఒక ఆదర్శ నియంత్రిత యంత్రాంగంగా పరిగణించాడు. దానిలో అమ్మకం విషయంలో ఏ యిబ్బందైనా కలిగితే, అది త్వరితంగా, తేలికగా పరిష్కృతమవుతుందని ఆయన భావించాడు. ఏ సరుకైనా అధికతర ప్రమాణంలో ఉత్పత్తిచెయ్యబడుతూ వుంటే, ఆ సరుకు ఉత్పత్తిదారులకు మార్కెట్‌నుండి దానికి సంబంధించిన సూచన అందుతుంది, దానితో వాళ్లు మరో సరుకు ఉత్పత్తికి మారుతారు. సార్వత్రిక అమితోత్పత్తి అసంభావ్యతను గూర్చిన ప్రధాన ప్రతిపాదనను రికార్డో యీకింది విధంగా వ్యక్తంచేశాడు: "ఉత్పాదితాలు ఎప్పుడూ ఉత్పాదితాలచేతా, లేక సేవలచేతా కొనబడతాయి; డబ్బు అన్నది యీ మారకం జరిగేందుకు మాధ్యమం మాత్రమే. ఒకానొక ప్రత్యేక సరుకు అమితంగా ఉత్పత్తిచెయ్యబడవచ్చు, ఆ సరుకుతో మార్కెట్ ముంచెత్తబడవచ్చు, కాగా దానిపై వెచ్చింపబడిన పెట్టుబడి తిరిగిరాకపోవచ్చు; అయితే, అన్ని సరుకుల విషయంలోనూ పరిస్థితి యిలాగే ఉండజాలదు."*

* D. Ricardo, *The Principles of Political Economy and Taxation*, p. 194.

ఈ పంక్తులు రాసేందుకు వాడబడిన సిరా యింకా ఆరిందో లేదో, ఆ మాటలు తప్పని ఘటనలు రుజువుచేశాయి: ఇంగ్లండులో 1825లోనే అమితోత్పత్తికి సంబంధించిన తొలి సార్వత్రిక సంక్షోభం భళ్లుమంది. శాస్త్రీయ నిష్పాక్షికతకూ, ఆత్మ విమర్శకూ పేరొందిన రికార్డో, దరిమిలా తన అభిప్రాయాలను మార్చుకొని వుండేవాడే. అయితే అప్పటికే ఆయన జీవయాత్ర ముగిసిపోయింది.

ఈవిధంగా, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రం (సాంప్రదాయిక శాఖ) రికార్డో రచనల్లో తన పూర్తి వ్యక్తీకరణను పొందింది. దాని ప్రధాన లక్షణాలను గుర్తుచేసుకునేందుకు ప్రయత్నిద్దాం.

1. శాస్త్రీయ సాధారణీకరణ పద్ధతిని ఉపయోగించి, ఆర్థిక విషయాల, క్రమాల సారాంశంలోకి చొచ్చుకుపోవాలన్న ప్రయత్నమే సాంప్రదాయిక అర్థశాస్త్ర శాఖ విశిష్ట లక్షణం. ఈ శాఖకి చెందినవాళ్లు ఈ క్రమాలను విశేషమైన వస్తుపరదృష్టితోనూ, నిష్పాక్షికతతోనూ విశ్లేషించారు. సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలు అంతిమ విశ్లేషణలో ఏ పారిశ్రామిక బూర్జువావర్గపు ప్రయోజనాలను వ్యక్తంచేశారో, ఆ వర్గం ఆ కాలంలో ప్రగతిశీలమైన శక్తి కనుకనూ, బూర్జువావర్గానికీ, శ్రామికవర్గానికీ మధ్య వర్గ పోరాటం సమాజంలో అప్పటికింకా ప్రధానాంశం కాలేదు కనుకనే యిది సాధ్యమైంది.

2. శ్రమ విలువ సిద్ధాంతమే సాంప్రదాయిక అర్థశాస్త్రపు పునాది. అర్థశాస్త్రపు మొత్తం కట్టడమంతా యీ పునాదిపైననే నిర్మింపబడింది. అయితే, సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలచేత యీ శ్రమ విలువ సిద్ధాంతం అభివృద్ధిచెయ్యబడిన రూపంలో, దాన్నుండి బయల్దేరి, వాళ్లు పెట్టుబడిదారీ విధానపు నియమాలను వివరించలేకపోయారు. సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులు పెట్టుబడిదారీ విధానాన్ని ఏకైక సంభావ్య, శాశ్వత, సహజ సామాజిక వ్యవస్థగా పరిగణించారు.

3. సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులు సమాజంలో ఉత్పత్తి పంపిణీల సమస్యను ప్రధాన వర్గాల స్థానపు దృష్టినుంచి పరిశీలించారు. దీని మూలంగా, పెట్టుబడిదారుల, భూస్వాముల ఆదాయాలకు మూలం కార్మికవర్గాన్ని దోచుకోవడంలో వుందన్న విషయాన్ని వాళ్లు గ్రహించడం సాధ్యమైంది. అయితే, వాళ్లు అదనపు విలువ స్వభావాన్ని వివరించలేకపోయారు. ఒక సరుకుగా శ్రమశక్తి స్వభావాన్ని గూర్చిన స్పష్టమైన అవగాహన లేకపోవడమే యిందుకు కారణం.

4. సామాజిక పెట్టుబడి పునరుత్పత్తికి సంబంధించిన సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞుల అభిప్రాయాలు, ఆర్థిక వ్యవస్థలో సహజ సమతులన సూత్రంపై ఆధారపడ్డాయి. మానవ యిచ్ఛకు అతీతమైన వస్తుపర, స్వతస్సిద్ధ ఆర్థిక నియమాలు వున్నాయన్న విశ్వాసంతో యిది ముడిపడివుంది. అయితే, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ

యొక్క స్వయం నియంత్రక స్వభావానికి సంబంధించిన భావం ఆ వ్యవస్థలోని వైరుధ్యాలను కూడా మరుగుపరచింది. సార్వత్రిక అమితోత్పత్తినీ, సంక్షోభాలనూ సాంప్రదాయిక అర్థశాస్త్రం తిరస్కరించింది, ఇది ప్రత్యేక ప్రాముఖ్యం గల విషయం.

5. బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రం ఆర్థికవ్యవస్థలో రాజ్యపు జోక్యాన్ని సాధ్యమైనంత అధికంగా పరిమితం చేయాలనీ (laissez faire సూత్రం), స్వేచ్ఛా వాణిజ్యం వుండాలనీ వాదించింది. దాని ఆర్థిక ఉదారవాదం చాలవరకు రాజకీయాల్లో దాని ఉదారవాదంతోనూ, బూర్జువా ప్రజాస్వామ్య ప్రచారంతోనూ మిళాయించబడింది.

పార్లమెంటు సభ్యుడు

రికార్డో రచించిన "అర్థశాస్త్ర సూత్రాలు, పన్నుల విధానం" బాగా అమ్మకాలు కలిగిన పుస్తకం ఏమీ కాదు. అది ప్రజాసామాన్యానికి గాక అర్థశాస్త్రవేత్తలకు పనికొచ్చే పుస్తకం. అప్పట్లో అర్థశాస్త్రవేత్తలు బహు అరుదు. తన పుస్తకాన్ని అర్థంచేసుకున్న వాళ్లు ఇంగ్లండులో పాతికమందికి మించి వుండరని రికార్డో అన్నట్లు సిస్మాండీ ఉదహరించాడు.

అయితే యీ పుస్తకం ప్రచురింపబడిన ఒక ఏడాదికి తర్వాత దీన్ని పొగడుతూ మెక్కుల్లొహ్ సుదీర్ఘమైన ఒక సమీక్షను ప్రచురించాడు. దానిలో రికార్డో భావాలను అతను సుబోధకమైన రూపంలో చిత్రించేందుకు ప్రయత్నించాడు. ఆర్థిక విధానపు సమకాలిక సమస్యలపై రికార్డో రచనలనుండి ఉల్లేఖనలను యిచ్చాడు. మిల్, మరికొందరూ రికార్డో పుస్తకాన్ని జనం దృష్టికి తెచ్చారు. జనానికి ఆయన పేరుతో అంతకు ముందే బాగా పరిచయం వుంది. మాల్తస్ అప్పటికే తన "అర్థశాస్త్ర సూత్రాలు" రాస్తున్నాడు. ఆర్థిక సిద్ధాంత విధానాల మౌలిక సమస్యలపైన రికార్డో ప్రతిపాదనలను అందులో మాల్తస్ సవాలు చేశాడు. దానితో తను సాధించదలుచుకున్నదాన్ని సాధించినట్లు రికార్డో గ్రహించుకోగలిగాడు.

1819లో ఆ పుస్తకపు రెండవ ముద్రణ వెలువడింది. అప్పుడిక ఆయన పూర్తిగా వ్యాపారంనుంచి విరమించుకుని, స్టాక్ ఎక్స్‌చేంజిలో తన సభ్యత్వాన్ని వదులుకున్నాడు. అప్పటికి ఆయన డబ్బు భూమిపైనా, భవనాలపైనా, ఒడుదుడుకుల్లేని సురక్షితమైన బాండ్లలోనూ మదుపు పెట్టబడింది. రికార్డో పిల్లలు ధనిక భూస్వామియైన ఒక ఇంగ్లీషు కులీనుడి వారసులుగా పెంచబడ్డారు. (డేవిడ్ రికార్డోకి అత్యంత

సన్నిహిత సోదరుడైన మోజెస్ రికార్డో ఆ గొప్ప అర్థశాస్త్రవేత్త జీవితాన్ని ప్రచురించ గోరినప్పుడు, ఆయన కుటుంబం, అంటే విధవరాలూ, పిల్లలూ మోజెస్‌కు అనుమతిని యివ్వలేదు. రికార్డో యూదు ఆనువంశికతనూ, స్టాక్ ఎక్స్చేంజి జీవితాన్నీ వెలుగులోకి తీసుకురావడం వాళ్లకు యిష్టం లేకపోయింది.)

అటువంటి హోదా, అభిరుచులూ కలిగిన రికార్డోవంటివాడికి పార్లమెంటరీ కార్యకలాపాలు సహజమైన విషయాలు. ఆయన మిత్రులు ఆయన్ని పార్లమెంటరీ రంగంలో ప్రవేశించమని సలహా యిచ్చారు. కామన్సు సభలో ప్రవేశించేందుకు రికార్డోకి ఒకేఒక మార్గం వుంది. ఏ బతికి చెడిన భూస్వామి – కొన్ని "మూలపడిన జమీల్లో" ఏదో ఒకదాని యజమాని – నుండో అతని పార్లమెంటరీ సీటును కొనుక్కోవడమే అది. ఆయన సరిగా యీ పనే చేశాడు. ఒక మారుమూల ఐరిష్ నియోజకవర్గంనుంచి ఎన్నుకోబడిన రికార్డో అక్కడికి ఎన్నడూ వెళ్లనూ లేదు, తన ఓటర్లను ఎన్నడూ కలుసుకోనూ లేదు. ఆకాలానికి అది అత్యంత సహజమైన విషయం.

పార్లమెంటులో వున్నది నాలుగేళ్లే అయినా, ఆయనక్కడ ప్రముఖ పాత్రనే వహించాడు. రికార్డో లాంఛనప్రాయంగా పాలక టోరీ పార్టీలోగాని, విగ్గు ప్రతిపక్షంలో గాని చేరలేదు. విగ్గు ప్రతిపక్షంపట్లనే ఆయనకి సానుభూతి అధికం. వామపక్ష, తీవ్రవాద ప్రతిపక్ష వర్గాల్లో ఆయనకి గణనీయమైన పలుకుబడి వుండేది. అయితే కామన్సు సభలో ఆయన స్వతంత్ర వైఖరిని తీసుకొని, తరచుగా విగ్గు నాయకత్వానికి వ్యతిరేకంగా ఓటుచేస్తూండేవాడు. రికార్డో పార్లమెంటరీ కార్యకలాపాల్లో ఆర్థిక సమస్యలు సహజంగానే ప్రముఖ పాత్ర వహించేవి. ధాన్యపు చట్టాలకు వ్యతిరేకంగా, స్వేచ్ఛా వాణిజ్యానికీ, ప్రభుత్వ రుణం తగ్గింపుకీ, బ్యాంకింగు, ద్రవ్య విధానపు మెరుగుదలకీ అనుకూలంగా ఆయన తన ప్రచారాన్ని కొనసాగించాడు. ఆయన ప్రసంగాల్లో పత్రికా స్వేచ్ఛను బలపరుస్తూ, సమావేశ స్వేచ్ఛపై ఉన్న నిర్బంధాలను నిరసిస్తూ చేసినవి కూడా మనకి కనిపిస్తాయి. ఆడమ్ స్మిత్ మాదిరిగానే రికార్డో కూడా రాజకీయాల్లో సాధ్యమైనంత పూర్తి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని బలపరిచాడు.

రికార్డో పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించినప్పుడు, సభ్యులు శ్రద్ధగా వినేవారని ప్రత్యక్ష సాక్షులందరూ ఏకగ్రీవాభిప్రాయాన్ని వెల్లడించారు. మామూలు అర్థంలో ఆయన ప్రతిభావంతుడైన వక్తయేమీ కాడు. అయితే, విషయాల, సమస్యల సామాజిక అంతస్సారంలోకి చొచ్చుకు వెళ్లాలన్న తపన, ఆయన రచనలో వున్న తర్క పటిమా ఆయన పార్లమెంటరీ ప్రసంగాల్లో కూడా కనిపిస్తాయి.

పార్లమెంటు సమావేశకాలంలో దాదాపుగా రికార్డో కాలమంతా దానికే సరిపోయేది. ఆ మాసాల్లో ఆయన లండన్లో వుండేవాడు. ఆయన ఉదయం పూటలు

యింటి దగ్గర పత్రికలు చదువుతూ, ఉత్తరాలు రాస్తూ, ప్రసంగాల ముసాయిదాలు రాస్తూ, ఆగంతుకులను ఆహ్వానిస్తూ, అడపా దడపా కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు వెస్ట్‌మిన్‌స్టర్ (పార్లమెంటు) భవనానికి వెళ్తూ గడిపేవాడు. మధ్యాహ్నం పూటల్లో పార్లమెంటు సమావేశం జరిగేది. అత్యంత బాధ్యతాయుత దృష్టితో వాటిలో పాల్గొనే సభ్యుల్లో రికార్డో ఒకడు. 1819-23 మధ్య ఆయన చేసిన రచనలన్నీ కూడా పార్లమెంటరీ కార్యకలాపాలకు సంబంధించినవే. వాటిలో ప్రధానమైనవి ధాన్యపు చట్టాలకూ, జాతీయ రుణానికీ అంకితమయ్యాయి.

వేసవి మాసాల్లో గట్‌కోంబ్ పార్కులో వున్నప్పుడు మాత్రమే తన శాస్త్రీయ అధ్యయనాన్ని ఆయన కొనసాగించుకోగలిగేవాడు. అందుకే గట్‌కోంబ్‌పట్ల ఆయన యిష్టం అంతకంతకు పెరిగింది. అక్కడే ఆయన, మాల్తస్ పుస్తకంపై తన విమర్శను రాశాడు, తన "సూత్రాలు"ను మూడవ ముద్రణకు సంసిద్ధం చేశాడు, విలువ, భూమి కౌలు, యంత్రాల వినియోగం వల్ల కలిగే ఆర్థిక పర్యవసానాల సమస్యలను గురించి తన ఆలోచనలను కొనసాగించాడు. మాల్తస్, మిల్, మెక్‌కుల్లోహ్, సేయ్‌లతో ఆయన ముమ్మరంగా ఉత్తరప్రత్యుత్తరాలు సాగించాడు. అప్పట్లో రికార్డో యూరపియన్ అర్థశాస్త్రానికి కేంద్ర స్థానంలో వున్నాడు. ఆయన యింటిదగ్గర అవిరామంగా జరిగిన సమావేశాల పర్యవసానంగా, 1821లో లండన్ అర్థశాస్త్ర క్లబ్బు స్థాపింపబడింది. దానికి సర్వజనామోదిత నాయకుడు రికార్డోయే. ఆయన యీ విధిని ఎంతో నేర్పుతోనూ, నిగర్వంగానూ నిర్వహించాడు.

వ్యక్తి చిత్రణ

ఇంతటి ముమ్మర కార్యకలాపాల్లో మునిగివుండగా రికార్డోను ఆకస్మికంగా మృత్యుదేవత కౌగలించుకుంది. మెదడు వాపు ఫలితంగా 1823 సెప్టెంబరులో గట్‌కోంబ్ పార్కులో ఆయన మరణించాడు. అప్పటికి ఆయన వయస్సు యాభై ఒకటి మాత్రమే.

నిత్య జీవితంలో రికార్డో ఎలాంటి వ్యక్తి?

ఆయన రూపం యిలా వర్ణించబడింది: మధ్య రకానికి కొంచెం తక్కువ ఎత్తు, సన్నమేగాని కడ్డీ ఒళ్ళు, చాలా చురుకైనవాడు. తెలివైన, దయార్ద్రమైన, చిత్తశుద్ధితో కూడిన కవళికలు కలిగిన ఆహ్లాదకరమైన ముఖం. నల్లటి, సావధానమైన, చురుకైన కళ్ళు. ఆకట్టుకొనే సరళమైన అలవాట్లు. మనకు తెలిసినదాన్నిబట్టి, యితరులతోడి వ్యవహారాల్లో ఆయన ఆమోదయోగ్యుడూ, ఆహ్లాదకరుడూ అయిన వ్యక్తి.

ఆర్థిక, రాజకీయ సమస్యలపైన తన మిత్రులతో తరచు విభేదించినప్పటికీ, వారితో ఆయన కలహించడమన్నది దుస్సాధ్యమైన విషయం.

కుటుంబీకుడికీ, కుటుంబ పెద్దకీ ఉండవలసిన లక్షణాలు రికార్డోలో దండిగా వున్నాయి. ఆయన పిల్లలే కాకుండా, తమ్ముళ్లూ, చెల్లెళ్లూ, చివరకు ఆయన భార్య బంధువులూ కూడా ఆయన్ని వివేకవంతుడూ, ధర్మబద్ధుడూ అయిన పెద్దగా పరిగణించేవారు. (దీనికి ఆయన సంపద కూడా కొంత కారణమై వుండవచ్చు.) తన జీవితపు చివరి సంవత్సరాల్లో, ఎక్కువ కాలాన్ని ఆయన, తన బిడ్డల పెంపకం కోసం వినియోగించేవాడు. తన పెద్ద కొడుక్కీ, కూతుళ్లకీ పెళ్లిళ్లు చేశాడు, కుటుంబంలో వున్న కొన్ని చిన్నచిన్న కలతలను సర్దుబాటుచేశాడు. మనుమలతోనూ, మనుమరాళ్లతోనూ ఆయన పిల్లలూ, యితర బంధువులూ గట్‌కోంబ్ పార్కులోని ఆదరణపూర్వకమైన యింటిలో సమావేశమైనప్పుడు, తనకు అంత పెద్దగా వయస్సు మీరకపోయినప్పటికీ రికార్డో బైబిలు పాత నిబంధన కాలంనాటి సమష్టి కుటుంబపెద్ద మాదిరిగా కనిపించేవాడు. ఆ పెద్ద భవంతి ఒక్క బంధువులతోనే కాకుండా, అన్ని రకాల అతిథులతోనూ — లండనునుంచి తమ పరిచితులతోబాటు వచ్చిన పరిచితులూ, యిరుగుపొరుగు భూస్వాములూ, పిల్లల స్నేహితులతో — సదా బిలబిలలాడుతూ వుండేది.

రికార్డో ఉన్నత విద్యావంతుడే, కాని విజ్ఞాన సర్వస్వప్రాయమైన మేధ కలిగిన ఆడమ్ స్మిత్ మాదిరిగా విస్తృత జ్ఞానాసక్తులు కలిగినవాడు కాడు. దీన్నొక లోపంగా పరిగణించడం కష్టం. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించేందుకుగాను, రికార్డోకి ఒక్క రంగంలో అద్భుతమైన మేధో ఏకాగ్రత అవసరమైంది. ఆయనే కనుక సర్వతోముఖ జ్ఞానార్జన కోసం ప్రయత్నించివుంటే, అతి కొద్ది కాలంలో ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి తను చేసిన సేవను ఆయన చెయ్యగలిగి వుండేవాడు కాడు.

రికార్డో, మార్క్స్

మార్క్స్ యిలా రాశాడు: "...విలువకీ, డబ్బుకీ, పెట్టుబడికీ సంబంధించిన నా సిద్ధాంతం, దాని మూల సూత్రాల్లో ఆడమ్ స్మిత్, రికార్డోల ఉపదేశానికి తప్పనిసరి పర్యవసానమే."* అయితే అదే సమయంలో, ఆయన ఈ యిద్దరి బ్రిటిష్ ఆర్థిక

* Karl Marx, *Capital*, Vol. I, p. 26.

వేత్తల బోధననూ లోతైన విమర్శకు గురిచేసి, దాని ప్రాతిపదికపైన నూతన శ్రామిక వర్గ అర్థశాస్త్రాన్ని సృష్టించాడు.

రికార్డో సిద్ధాంతంపై మార్క్స్ చేసిన విమర్శ చిత్తశుద్ధికీ, నిర్మాణాత్మకతకీ ఒక నమూనా. సుదీర్ఘమైన "అదనపు విలువ సిద్ధాంతాలు"లో సుమారు మూడోవంతు రికార్డోకి వినియోగింపబడింది. సరైన తన తొలి ప్రమేయాలను సుసంగతంగా అభివృద్ధిచేసివుంటే, రికార్డో ఏవిధంగా వాదించియుండవలసిందో చూపే పద్ధతిని, మార్క్స్, తన విమర్శలో తరచు ప్రయోగించాడు. సాంప్రదాయిక అర్థశాస్త్రపు వస్తుపరమూ, చారిత్రకంగా నిర్దేశితమూ అయిన పరిమితులను మార్క్స్ బహిర్గతం చేశాడు. రికార్డో ఒక మేధానిధే, అయితే ఏ మేధానిధీ కూడా కాల, వర్గాల పరిధులను అధిగమించజాలడు. కాగా, ఆయన బూర్జువా అర్థశాస్త్రవేత్త అయినందుకు కాక, తన శాస్త్రీయ భావనలో — అది బూర్జువా భావన కాకుండా ఉండజాలదు — అసంగతంగా వున్నందుకు రికార్డోను మార్క్స్ విమర్శిస్తాడు.

స్మిత్, రికార్డోల బోధన ప్రాతిపదికపైన మరి, మార్క్స్ ఏమి సృష్టించాడు?

శ్రమ విలువ సిద్ధాంతాన్ని మార్క్స్ ఒక ప్రగాఢమైన, తర్కబద్ధమైన సిద్ధాంతంగా మార్చి, దాని పునాదిపైన మౌలికంగా భిన్నమైన ఒక పూర్తి అర్థశాస్త్ర భవనాన్ని నిర్మించాడు. శ్రమ విలువ సిద్ధాంతంలో రికార్డోను వేధించిన వైరుధ్యాలనుండీ, పద్మవ్యూహాలనుండీ ఆ సిద్ధాంతాన్ని మార్క్స్ విముక్తంచేశాడు. దీనంతట్లోనూ అతి ముఖ్యాంశం ఏమిటంటే, ఒక సరుకులో యిమిడివున్న శ్రమ ద్వంద్వ స్వభావాన్ని — నిర్దిష్ట, అనిర్దిష్ట శ్రమ — మార్క్స్ ఆవిష్కరించి, దాన్ని విశ్లేషించడం. శ్రమ విలువ సిద్ధాంత ఆధారంగా మార్క్స్ డబ్బు సిద్ధాంతాన్ని కూడా సృష్టించాడు. లోహ, కాగితపు డబ్బు చలామణీకి సంబంధించిన విషయాలను యీ సిద్ధాంతం వివరించింది.

శ్రమశక్తిని ఒక సరుకుగా వివరించి, శ్రమశక్తి కొనుగోలు అమ్మకాలు ఏ చారిత్రక పరిస్థితుల్లో జరిగాయో రేఖామాత్రంగా చిత్రించిన మీదట, మార్క్స్, శ్రమ విలువ సిద్ధాంత ప్రాతిపదికపైన, దానికి పూర్తి అనుగుణంగా అదనపు విలువ సిద్ధాంతాన్ని సృష్టించాడు. పెట్టుబడికీ, శ్రమకీ మధ్య "సరసమైన," సమానమైన మారకపు చట్రంలోపల ప్రత్యక్షంగా జరిగినదేమిటో మొట్టమొదటి సారిగా శాస్త్రీయంగా వివరించబడింది — అదే కార్మికవర్గపు దోపిడీ.

పెట్టుబడిచేత చెల్లింపబడని శ్రమయొక్క, దాని ఉత్పాదితాలయొక్క హరణానికి అదనపు విలువను సార్వత్రిక రూపం చేశాడు మార్క్స్. రికార్డోలో మనకి కనిపించే ఈ భావబీజాలు పూర్తిగా అభివృద్ధిచెయ్యబడి, ఒకేఒక విధానంగా తీర్చిదిద్దబడ్డాయి.

అనార్జిత ఆదాయపు నిర్దిష్ట రూపాలైన లాభం, భూమికౌలు, వడ్డీలు యీ విధానంలో చోటుచేసుకున్నాయి. పంపిణీ సమస్య వర్గస్వభావం విశేషమైన బలంతోనూ, స్పష్టతతోనూ వెల్లడైంది.

సగటు లాభం, ఉత్పత్తి ధరల సిద్ధాంతం ద్వారా మార్క్స్, యింతకు ముందే పేర్కొన్నట్లు, రికార్డోయొక్క "గడ్డు" వైరుధ్యాన్ని పరిష్కరించాడు. అయితే, యింతే కాదు. అలా చేసే క్రమంలో ఆయన మహత్తర ప్రాముఖ్యం కలిగిన ఒక నిర్ధారణకు చేరుకున్నాడు: ప్రతి ఒక విడి పెట్టుబడిదారూ "తన" కార్మికులనే దోచుకున్నప్పటికీ, అందరు పెట్టుబడిదారులూ తమ అదనపు విలువను ఒక ఉమ్మడి నిధిలో పెట్టినట్లు, దాన్ని తమతమ పెట్టుబడుల ప్రకారం పంచుకుంటారు. ఆర్థికంగా పెట్టుబడిదారీ వర్గం ఒక మొత్తంగా కార్మికవర్గానికి వ్యతిరేకం.

రికార్డో భూమికౌలు సిద్ధాంతంలో యిమిడివున్న శాస్త్రీయ అంశాలను వినియోగించుకొని, భూస్వాముల ఒక ఆదాయరూపంగా కౌలునూ, వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలనూ వివరించే ప్రగాఢ భావాన్ని మార్క్స్ సృష్టించాడు.

సార్వత్రిక అమితోత్పత్తి సంక్షోభాల అసాధ్యతను గూర్చిన రికార్డో, సేయ్‌ల అభిప్రాయాలను మార్క్స్ తిరస్కరించాడు. పునరుత్పత్తి సిద్ధాంత సూత్రాలను వివరించి, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో ఆవర్తిత సంక్షోభాల అనివార్యతను నిరూపించడంలో ఆయన ఆద్యుడు.

రికార్డో సామాజిక నిరాశావాదం — దీన్ని ఆయన పాక్షికంగా మాల్థస్ నుండి స్వీకరించాడు — పెట్టుబడిదారీ సంచయనపు మార్క్సిస్టు సార్వత్రిక నియమానికి చోటుచేసింది. మార్క్స్ బోధన అంతటికీ తార్కిక పర్యవసానమే యిది. పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధికి వున్న అవకాశాలనూ, చివరకు పెట్టుబడిదారీ విధానపు అనివార్య విప్లవాత్మక పతనాన్నీ, దాని స్థానాన్ని సోషలిజం ఆక్రమించడాన్నీ మార్క్స్ నిరూపించాడు.

ప్రకరణం 14

రికార్డో చివరి సంవత్సరాలూ, ఆయన మరణం తర్వాతా

అంతకు అర్ధ శతాబ్దానికి ముందు, కెనే శిష్యులు ఒక "నూతన విజ్ఞానశాస్త్ర" సృష్టిని గురించి మాట్లాడినట్లే, రికార్డో జీవితపు చివరి సంవత్సరాల్లోనూ, ఆయన మరణానంతరమూ "అర్థశాస్త్రపు నూతన విజ్ఞానశాస్త్రం" గురించి మాట్లాడటమన్నది ఆమోదయోగ్యమైంది.

రికార్డో రచనలు అర్థశాస్త్ర విషయాంశాన్ని (పాదార్థిక వస్తువుల ఉత్పత్తితో మానవ సామాజిక సంబంధాలను) రేఖామాత్రంగా చిత్రించాయనడం, దాని పద్ధతిని విపులీకరించాయనడం నిజమే. కచ్చితమైన ప్రకృతి విజ్ఞానశాస్త్రాలకు స్వభావసిద్ధమైన లక్షణాలను అది కొంతమేరకు సంతరించుకున్నట్లు కనిపించింది. అయితే, అర్థశాస్త్రం ఒక వర్గ విజ్ఞానశాస్త్రం. ఆ శాస్త్ర నిపుణుని వ్యక్తిపరమైన సంకల్పాలు ఏమైనప్పటికీ, ఆయన భావాలు ఎప్పుడూ కూడా నేరుగా, ఏదో ఒక వర్గపు ప్రయోజనాలను ఎక్కువగానో తక్కువగానో బలపరుస్తాయి. రికార్డో బోధన బాహాటంగానూ, నిర్మొగమాటంగానూ బూర్జువా స్వభావం కలిగినది. అయితే, ఇంగ్లండులో వర్గపోరాటం తీవ్రతరమైన దశలో, అంటే 1830, 1840 దశకాల్లో, సరిగా యీ బాహాట లక్షణమూ, నిర్మొగమాటమే బూర్జువావర్గానికి కంటగింపైంది. ఆ చార్టిజం దశలో సమస్త సామాజిక, రాజకీయ జీవితానికీ అది కేంద్రమైంది.

ఆ నూతన పరిస్థితిలో, ఆ శతాబ్ది మధ్యదాకానూ, అంతకు తర్వాతా సైతం, ఇంగ్లీషు బూర్జువా అర్థశాస్త్రంలో అగ్రస్థానాన్ని ఆక్రమించిన రికార్డో అనుయాయులు, రికార్డో బోధనలోని మరింత సాహసిక, తీవ్రవాద పార్శ్వాలను పరిత్యజించి, దాన్ని బూర్జువావర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోనారంభించారు. వాళ్లు రికార్డో రచనలకు సరళమైన భాష్యాలు చెప్పడానికి పరిమితమవడమో, లేక ఆయన భావాలకు పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే మెలికలు యివ్వడమో మొదలుపెట్టారు.

బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో కొత్తగా వచ్చిన ఇంగ్లీషు ఆర్థిక సాహిత్యాన్ని అధ్యయనంచేసిన మీదట, 1851లో ఎంగెల్సుకి మార్క్సు యిలా రాశాడు: "అసలు విషయం ఏమిటంటే, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో, అతి సున్నితమైన వాటితో సహా, కొన్ని నిర్దిష్ట పరిశోధనల్లో చాలా కృషి జరిగినప్పటికీ, స్మిత్, రికార్డోల తర్వాత యీ విజ్ఞానశాస్త్రం పురోగతి ఏమీ సాధించలేదు."*

ఆర్థిక విజ్ఞాన రంగంలో ప్రత్యేకాంశాలపై అధ్యయన బాహుళ్యం పెట్టుబడిదారీ విధానం త్వరితంగా అభివృద్ధి చెందుతోందన్న సంగతినీ, ఆర్థిక వ్యవస్థ విడి పార్శ్వాలను అధ్యయనం చెయ్యవలసిన వాస్తవిక ఆవశ్యకతనూ ప్రతిబింబించింది. ఆర్థిక విజ్ఞాన శాస్త్ర అస్థిపంజరం కండను నింపుకుంటోంది. గణాంక శాస్త్రం, ప్రత్యేకించి సూచీ సంఖ్యల పద్ధతి, బాగా పురోగమించింది. పరిశ్రమలోని విడి శాఖల పెరుగుదల వీటి ద్వారా వర్ణింపబడి, విశ్లేషింపబడుతోంది. వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ, ధరల చలనం, డబ్బు చలామణీ, బ్యాంకింగులలో నిర్దిష్టమైన పరిశోధన సాగింపబడింది. కార్మికవర్గ పరిస్థితిపై విస్తారమైన సాహిత్యం వెలువడింది. ఆ శతాబ్ది మధ్యనాటికి విశ్వవిద్యాలయ పాఠ్యక్రమాల్లో అర్థశాస్త్రం సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

బూర్జువా, అధికారిక ఆర్థిక విజ్ఞాన శాస్త్రానికే యిదంతా వర్తిస్తుంది. అయితే దీనితోబాటు, 1820 దశకంనుంచి 1840 దశకంవరకు ఇంగ్లండులో వేరే రచయితలు మనకు కనిపిస్తారు. వాళ్ల అర్థశాస్త్రవు శ్రామికవర్గ ప్రత్యర్థులు అని మార్క్సు అన్నాడు. రికార్డో బోధనలోని ఏ అంశాలను బూర్జువావర్గానికి వ్యతిరేకంగా తిప్పవచ్చునో, ఆ అంశాలను వీళ్లు స్వీకరించారు.

1820–1840 దశకాలకు చెందిన ఇంగ్లీషు అర్థశాస్త్రం, మార్క్సు ఆర్థిక సిద్ధాంతాభివృద్ధిలో ముఖ్యమైన పాత్రను వహించింది. "అదనపు విలువ సిద్ధాంతాలు" లోని గణనీయమైన ఒక భాగం, ఆనాటి ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్తల అభిప్రాయాల విమర్శనాత్మక విశ్లేషణకు కేటాయింపబడింది. ఈ విమర్శ, శ్రమ విలువకూ, ధరలు రూపొందడానికీ సంబంధించిన సిద్ధాంతాన్నీ, లాభానికీ, పెట్టుబడిదారీ సంచయనపు సార్వత్రిక నియమానికీ సంబంధించిన సిద్ధాంతాలనూ మార్క్సు నిరూపించడంలో ముఖ్యమైన పాత్ర వహించింది.

---

* Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. 27, S. 228.

19వ శతాబ్దం

"బూర్జువా సంపద కాలం" ఇంగ్లండులో దర్శనమిచ్చినంతటి హృదయరాహిత్య, కాపట్యాలతో మరెక్కడా దర్శనమివ్వలేదు. సమాజంలోని జనం మధ్య డబ్బే ఏకైక, సర్వతోముఖ సంబంధమైంది. ఎవడికైనా పెట్టుబడివుందా, వుంటే ఎంత ఎక్కువ వుంది అన్నదే యిప్పుడిక గీటురాయి అయింది. కేవలం ఏభై లేక వంద ఏళ్ళక్రితంవరకు తన సొంత ప్రాంతాలతో అనేక బంధనాలు కలిగివుండి, చివరకు ఎటుపోయి ఎటొచ్చినా సంఘపు సహాయంపై ఆధారపడగలిగిన, కొన్ని సందర్భాల్లో భూస్వామి రక్షణ సైతం పొందగలిగిన పేదవాడికి, యిప్పుడు ఆధారం ఏమీ లేకుండా పోయింది. ఇప్పుడు అతనొక కార్మికుడు, అతనికి శ్రమచేసే చేతులు తప్ప వేరొక ఆధారం లేదు. ఈ చేతులను పెట్టుబడిదారుకు అమ్ముకోవడం మాత్రమే అతని ఏకైక జీవనాధారం.

పెట్టుబడిదారులు కార్మికులను దోచుకొనే పూర్తి స్వేచ్ఛను డిమాండుచేసి, దాన్ని పొందారు. తన రాజకీయ జీవితపు మొదటి అర్ధభాగంలో బూర్జువా ఆచారాలను తీవ్రంగా విమర్శించిన థామస్ కార్లైల్ బూర్జువా వ్యవస్థను "అరాజకత్వం, దానికి తోడు పోలీసు కాన్‌స్టబుల్" అని వర్ణించాడు. రాజ్యం పెట్టుబడిదారులకు, డబ్బు సంపాదించుకునేందుకూ, తమకు తోచిన పద్ధతిలో తమ మధ్య తాము పోటీచేసుకునేందుకూ పూర్తి స్వేచ్ఛను యిచ్చిందని, అయితే, ఆ "స్వేచ్ఛ"నూ, వ్యక్తిగత ఆస్తినీ పోలీసుల సాయంతో కాపలాకాసే విధిని నిర్వర్తించిందన్నదే అతని ఉద్దేశం.

అర్థశాస్త్రాన్ని dismal science (నిరుత్సాహకర విజ్ఞానశాస్త్రం) అని మొట్టమొదట పిలిచినది కూడా ఆ కార్లైలే. అలా అనడంలో ఉద్దేశం ఏమిటి? మొదటి సంగతి, రికార్డో అర్థశాస్త్రంలో రాగద్వేషాలు పూర్తిగా శూన్యం అన్న సంగతి మనకు తెలిసిందే. కార్మికుల దారుణ పరిస్థితులను అదేమీ దాచిపెట్టలేదు, అయితే వాటిని అది సహజమైనవిగా పరిగణించింది. రెండవ సంగతి జనాభాకీ, ప్రాకృతిక వనరులకీ మధ్య తరతరాలుగా వుంటున్న అగాధమే పేదతనానికి కారణమని పరిగణించి, తత్కారణంగా భవిష్యత్తుపట్ల నిరాశాదృష్టిని వహించింది, యీ విషయంలో అది మాల్తస్‌కి సన్నిహితమైంది.

అయితే, ఇంగ్లీషు ధనాధిపతుల దృష్టిలో అర్థశాస్త్రం నిరుత్సాహకర విజ్ఞాన శాస్త్రం ఎంతమాత్రమూ కాదు. స్మిత్ రికార్డోలు స్థాపించిన విజ్ఞానశాస్త్రం, తాము మరింత త్వరితంగా ధనవంతులయ్యే మార్గాలు కనుగొనేందుకు తమకు తోడ్పడాలని

వాళ్ళు అభిప్రాయపడ్డారు. ఈ దృష్టితో భాష్యాలు చెప్పబడిన అర్థశాస్త్ర ప్రాచుర్యం హాస్యాస్పద రూపాలను ధరించింది. మరియా ఎడ్జ్‌వర్త్ పేర్కొన్నదాన్నిబట్టి యీ విషయం స్పష్టంగా తెలియవస్తుంది. 1820 దశకంలో లండన్ నాగరిక మహిళల్లో అర్థశాస్త్రాన్ని గురించి మాట్లాడటం ఓ పెద్ద ఫేషనైంది. సంపన్న నాగరిక మహిళలు, తమ పిల్లల ఉపాధ్యాయినులకు అర్థశాస్త్రం నేర్పగల యోగ్యత వుండాలని పట్టుబట్టేవారు. ఫ్రెంచి, ఇటాలియన్ భాషలూ, సంగీతం, చిత్రలేఖనం, నాట్యం వగైరాలు వచ్చిన ఒక ఉపాధ్యాయిని, తనకు ఉద్యోగం ఖాయంగా దొరుకుతుందనుకుంది; అయితే, అర్థశాస్త్రం మీకు తెలుసా అన్నప్రశ్న విని ఆమె గతుక్కుమని, సంకోచిస్తూ యిలా జవాబుచెప్పింది: "లేదండీ, అర్థశాస్త్రం నాకు తెలుసుననీ, బోధించగలననీ నేను చెప్పలేను, మీరు సముచితమని అనుకుంటే, నేనది నేర్చుకునేందుకు ప్రయత్నిస్తాను." "అయితే వద్దు మేడమ్. మీరు అర్థశాస్త్రం చెప్పకపోతే, మీరు మాకు పనికిరారు" అని బదులుచెప్పింది నాగరిక మహిళ.

"ధనికులయ్యేందుకు సంబంధించిన విజ్ఞానశాస్త్రాన్ని" నేరుగా బలపరిచే తత్వశాస్త్రం, ఇంగ్లీషు బూర్జువావర్గానికి అవసరమైంది. నీతిశాస్త్రంలో ప్రయోజనవాదం (utilitarianism), జ్ఞాన సిద్ధాంతంలో పాజిటివిజమే (positivism in epistemology) — యీ తత్వశాస్త్రం. ప్రయోజనవాద జనకుడు జెరెమీ బెంథామ్. బెంథామ్ ప్రయోజనవాదం (ప్రయోజన తత్వశాస్త్రం, utilitas అన్న లాటిన్ పదంనుంచి ఈ యుటిలిటేరియనిజం ఉత్పన్నమైంది) హెల్వెటియస్, స్మిత్‌లు ప్రకృతిని గురించీ, మానవ ప్రవర్తన గురించీ అభివృద్ధిచేసిన అభిప్రాయాలతో చారిత్రకంగా ముడిపడివున్నాయి. మనిషి స్వభావరీత్యా స్వార్థపరుడు. ఆర్థికమైనవాటితోబాటు అతను తీసుకునే ప్రతి నిర్ణయంయొక్క సారాంశమూ ఏమిటంటే, అతను లాభనష్టాలను బేరీజు వేసుకుంటాడు (తృప్తి, బాధ, లాభం, నష్టం), తృప్తి లాభాలను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలనీ, బాధనష్టాలను సాధ్యమైనంత ఎక్కువగా తగ్గించుకోవాలనీ కృషిచేస్తాడు. స్వేచ్ఛాయుతమూ, హేతుబద్ధమూ అయిన ఎంపిక చేసుకున్నప్పుడు, అతను అత్యధిక విజయాన్ని సాధిస్తాడు. సమాజం, ప్రభుత్వం, శాసనకర్తల లక్ష్యం ఏమిటంటే, యిందుకు మిక్కిలి సానుకూలమైన పరిస్థితులను కల్పించడమే. సమాజం అంటే, కేవలం విడి వ్యక్తుల సమూహం. ప్రతి ఒక విడి వ్యక్తీ ప్రయోజనం, సంతృప్తి, సంతోషాలను ఎంత ఎక్కువగా సాధించుకోగలిగితే, సమాజంలో "ఉమ్మడి సంతోషం" అంత ఎక్కువగా వుంటుంది. "అత్యధిక సంఖ్యాకులకు అత్యధిక సంతోషం" అన్న ప్రసిద్ధ నినాదాన్ని బెంథామ్ ముందుకు తెచ్చాడు. ఈ తత్వశాస్త్రంనుండే వ్యష్టివాద సూత్రం ఉత్పన్నమైంది.

బూర్జువా అర్థశాస్త్రం దీన్ని పూర్తిగా జీర్ణించుకుంది: పోటీ పోరాటంలో ఎవడికి వాడే యమునాతీరే. శ్రమ శక్తిని స్వేచ్ఛగా కొనుక్కునే అవకాశం పెట్టుబడిదారుకీ, దాన్ని స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కార్మికుడికీ ఉండాలి. వారిలో ప్రతి ఒకడూ, యీ బేరాన్ని తన ప్రయోజనానికి మిక్కిలి ఎక్కువ అనుకూలంగా కుదుర్చుకోగలడని తలచబడింది.

ఈ "మానవ కాల్క్యులేటర్" భావాన్ని, మరికొద్ది దశాబ్దాల తర్వాత, అర్థ శాస్త్రంలో ఆత్మపర ధోరణివాళ్లు స్వీకరించారు. ఈ ధోరణి అనుయాయులకు ప్రధానమైన ఆర్థిక సమస్య ఏమిటంటే, వివిధ సరుకుల వినిమయంనుండి లభించే సంతృప్తి స్థాయిల తారతమ్య పరిశీలన, శ్రమ అనుపయుక్తత (భారం) వగైరాలతో వేతనాల ఉపయుక్తత తారతమ్య పరిశీలన.

మొదట్లో, బెంథామ్ ప్రయోజనవాదం మొత్తంమీద ప్రగతిశీలంగా వుంది. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా బూర్జువా స్వేచ్ఛను అది ముందుకు తేవడమే దాని యీ ప్రగతిశీలతకి కారణం. అయితే, బెంథామ్ అనుచరుల కొద్దిపాటి ఉదారవాద డిమాండ్లలో చాలవరకు అమలుజరపబడటంతోనూ, మరోవంక, బూర్జువావర్గానికీ శ్రామిక వర్గానికీ మధ్య వర్గపోరాటం తీవ్రతరం కావడంతోనూ, ప్రయోజనవాదపు పునాదులు కొట్టుకుపోయి, అది పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే ధోరణులతో సంలీనమైపోయింది.

19వ శతాబ్దపు పశ్చిమ యూరపియన్ తత్వశాస్త్రంలో, పాజిటివిజం (లాటిన్ పదం positivus – అనుకూలమైన – దానికి మూలం) విస్తృతమైన ఒక ధోరణి. ఇంగ్లండులో అది, హ్యూమ్ అజ్ఞేయతావాద సంప్రదాయాలతో సంబంధాలు కలిగి వుంది. ఈ భావాల ప్రకారం, యీ విజ్ఞానశాస్త్రపు లక్ష్యం, యథార్థాలను వట్టివే వర్ణించడం, క్రమబద్ధం చెయ్యడం మాత్రమే, ఈ పరిధులను మించిపోవడం శుష్క "అధిభౌతికవాదం." ఇది, డబ్బు నొల్లుకునే బూర్జువా యుగానికి సంబంధించిన, ఉద్దేశ్యపూర్వకమైన పేలవ తత్వశాస్త్రం. పాజిటివిస్టు తత్వవేత్తల్లో అత్యంత ప్రముఖుడు జాన్ స్ట్యూవర్ట్ మిల్. పాజిటివిజం తత్వశాస్త్రం, మిల్‌యొక్క, ఆయన కాలంయొక్క (19వ శతాబ్ది మధ్యం) ఆర్థిక సిద్ధాంతానికీ, తదనంతర బూర్జువా అర్థశాస్త్ర అభివృద్ధికీ ప్రాతిపదిక అయింది.

మాల్థస్, మాల్థస్ సిద్ధాంతం

అర్థశాస్త్ర చరిత్రలో మాల్థస్ ఒక జుగుప్సాకర వ్యక్తి. ఆయన రచించిన "జనాభా సూత్రంమీద వ్యాసం" ప్రచురింపబడి 180 ఏళ్లకు పైబడింది. అయితే, దానిలోని భావాలూ, రచయిత పేరూ యీనాటికి కూడా, ఉద్రేకపూరిత సైద్ధాంతిక, రాజకీయ వివాదానికి ఆస్పదాలుగానే వున్నాయి. మాల్థస్ సిద్ధాంతానికి, అంటే జనాభా సిద్ధాంతానికి మాల్థస్ పునాదులు వేశాడు. సామాజిక వ్యవస్థతో ప్రసక్తిలేకుండా, మానవ జాతికి వాటిల్లే బాధలు, విపత్తులన్నింటికీ అమితజనాభాయే కారణమని వాదిస్తుంది యీ జనాభా సిద్ధాంతం. వర్ధమాన దేశాల విషయంలో, పెట్టుబడిదారీ విధానానికీ సోషలిజానికీ మధ్య యీవాడు జరుగుతున్న సైద్ధాంతిక పోరాటంలో, మాల్థస్ సిద్ధాంతం గణనీయమైన పాత్ర వహిస్తోంది. అభివృద్ధి నిరోధకులైన మాల్థుసియన్లు, యీ దేశాలకు సంబంధించిన కేంద్ర సమస్య అదనపు జనాభా, జనాభా శీఘ్ర పెరుగుదల అంటారు. ఈ సమస్యను పరిష్కరించడం, ప్రధానంగా బూర్జువా స్వభావం కలిగిన కొద్దిపాటి సంస్కరణలను అమలుజరిపి, వాటికి "ఉన్నత సమాజం" (పెట్టుబడిదారీ సమాజం అనడం స్పష్టం)లోకి ప్రవేశం కల్పించడమే పరిష్కారమంటారు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని సాధ్యమైనంత త్వరగా తొలగించేందుకుగాను కొన్ని తీవ్రమైన సామాజిక పరివర్తనలను సాధించడం అవసరమని మార్క్సిస్టులు వాదించారు. ఈ చట్రం లోపల జనవాలరేటునూ, జనాభా పెరుగుదలనూ అదుపుచేసే విధానం ఫలదాయకంగా వుండగలదు. ఈ దృక్పథాలు పరస్పర విరుద్ధమైనవనడం స్పష్టం.

విజ్ఞానశాస్త్రంలో మాల్థస్ స్థానం రెండు అంశాలచేత నిర్ధారితమైంది: ఆయన జనాభా "సూత్రం" రికార్డో విమర్శకుడుగా, సహాయకుడుగా, రికార్డో ప్రత్యర్థిగా, స్నేహితుడిగా ఆయన విచిత్ర పాత్ర.

థామస్ రాబర్ట్ మాల్థస్ 1766లో, లండన్ సమీప గ్రామసీమలో, జన్మించాడు. విద్యావంతుడైన ఒక భూస్వామికి ఆయన రెండవ కొడుకు. ఇంగ్లీషు కుటుంబాల్లో పిల్లలకు భూమిని పంచే ఆచారం లేదు కనుక ఆయనకి పాలమేమీ రాలేదు. ఆయనకి మంచి విద్య మాత్రం లభించింది, మొదట యింటి దగ్గరా, తర్వాత కేంబ్రిడ్జిలోని జీసస్ కాలేజీలోనూ. కాలేజీ చదువు పూర్తిచేశాక మాల్థస్ ఆంగ్లికన్ చర్చిలో దీక్ష పొంది, ఒక గ్రామీణ పారిష్‌లో క్యురేట్‌గా ఒక సాదా ఉద్యోగంలో చేరాడు. 1793లో జీసస్ కాలేజీలో అధ్యాపకుడుగా చేరాడు. 1804లో వివాహం అయేదాకా

ఆయన అధ్యాపకుడుగా వున్నాడు: అధ్యాపకత్వానికి బ్రహ్మచర్యం ఒక షరతు కావడమే యిందుకు కారణం.

యువ మాల్తుస్ చాలా కాలం తన తండ్రి యింటిదగ్గర గడిపాడు. తాత్విక, రాజకీయ విషయాలపై తన తండ్రితో అంతులేని చర్చలూ, వివాదాలూ జరుపుతూండే వాడు. విచిత్రంగా కనిపించవచ్చుగాని, తండ్రి ఉత్సాహవంతుడూ, ఆశావాదీ కాగా, కొడుకు సంశయాత్మకుడూ, నిరాశాపరుడూ. తన తండ్రితో జరిగే వివాదాల్లో వాదనల కోసం చేసే వెతుకులాట క్రమంలో, 18వ శతాబ్దపు కొందరు రచయితల రచనల్లో, జీవితావసర పదార్థాలు పెరిగేదానికన్న జనాభా మరింత వేగంగా పునరుత్పత్తి అవుతుందనీ, జనాభా పెరుగుదల నిరోధింపబడకపోయినట్లయితే, అది ప్రతి 20–25 ఏళ్లకూ ఒకసారి రెట్టింపవుతుందన్న భావం ఆయనకి తటస్థపడింది. ఆహారోత్పత్తి అంత వేగంగా పెరగజాలదన్న విషయం స్పష్టమని మాల్తుస్‌కి అనిపించింది. అంటే, మానవజాతి పేదతనంనుండి బయటపడకుండా ప్రకృతి శక్తులు నిరోధిస్తాయన్నమాట. పేదలచేత అధికతర సంతానోత్పత్తియే సమాజంలో వాళ్ల హీన పరిస్థితికి ప్రధాన కారణం. ఈ మొండిసందులోంచి బయటపడే మార్గం లేదు. ఇక్కడ విప్లవంవల్ల ప్రయోజనమేమీ లేదు.

1798లో రచయిత పేరు లేకుండా మాల్తుస్ ఓ చిన్న రచన ప్రచురించాడు. దాని శీర్షిక: "సమాజపు భవిష్యదభివృద్ధిని ప్రభావితం చేసే జనాభా సూత్రంమీద ఒక వ్యాసం." తన అభిప్రాయాలను ఆయన నిశితంగా, నిర్ద్వంద్వంగా, నిర్దాక్షిణ్యంగా కూడా వివరించాడు. ఉదాహరణకు ఆయన యిలా రాశాడు: "ఇంతకుముందే నిండి వున్న ప్రపంచంలో పుట్టిన మనిషికి, తనకు ఎవరిమీదనైతే న్యాయమైన హక్కుందో ఆ తలిదండ్రులనుండి అతను తన జీవితావసరాలను పొందజాలకపోయినట్లయితే, ఆ సమాజానికి అతని శ్రమ అవసరం లేకపోయినట్లయితే, తిండిలో అతి కొంచెం భాగం పొందే హక్కు కూడా అతనికి లేదు, కాగా నిజానికి, యీ భూమిపై ఉండవలసిన అగత్యం అతనికి లేదు. ప్రకృతిమాత జరిపే బ్రహ్మాండమైన విందులో అతనికి ఖాళీ పీట లేదు. ఆమె అతన్ని పొమ్మని చెప్తుంది, త్వరలోనే తన ఆజ్ఞలను అమలుజరుపుతుంది."*

తమ వర్గపు, తమ జాతి ఆధిక్యతను దృఢంగా విశ్వసించే ఇంగ్లీషు

---

* దరిమిలా వెలువడిన చాలా ముద్రణల్లో యీ భాగాన్ని తొలగించడం అవసరమని మాల్తుస్ భావించాడు. J. M. Keynes రాసిన *Essays and Sketches in Biography*, New York, 1956, p. 26నుండి ఉల్లేఖింపబడింది.

భూస్వాముల తరపో వాళ్లకి మాల్తస్ చెందుతాడు. నిరుపేదలను గురించీ, నిర్భాగ్యులను గురించీ, అంగవికలురను గురించీ చెప్పే పిచ్చికూతల్ని వీళ్లు అసహ్యించుకుంటారు. వీళ్లు తొట్రుబాటులేని ప్రశాంతితో, తెల్లని గ్లౌవ్సూ, నలగని, పరిశుభ్రమైన ఫ్రాక్ కోట్లూ ధరించి, ఫ్యాక్టరీ అల్లర్లలోనూ సిపాయిల మరణ శిక్షలు అమలు జరిగే చోట్లా హాజరు కాగలరు. ఈ పెద్దమనుషులు క్రౌర్యాన్ని అవశ్యక లోకజ్ఞానంగానూ, మానవత్వాన్ని ప్రమాదకర భ్రమగానూ పరిగణిస్తారు.

సందర్భవశాత్తూ ఒక విషయం చెప్పుకోవాలి. మాల్తస్ సమకాలీనుల్లో పలువురు పేర్కొన్నట్లు, ఆయన కలుపుగోలు మనిషే కాకుండా, యిష్టపడదగిన మనిషి. రికార్డోతో ఆయన స్నేహమే యిందుకు రుజువు. ఆయన శాంతస్వభావం, ఆవేశరాహిత్యం గణనీయమైనవి. కోపంలోగాని, అతి సంతోషంలోగాని, అతి విచారంలోగాని ఆయన్ని ఎవరూ ఎన్నడూ చూసి యెరుగరు. తన కఠినమైన అభిప్రాయాలమీద వెలువడిన విమర్శలపట్ల ఆయన ఉదాసీనత ప్రదర్శించగలగడానికి (బహుశా అది నటన అయ్యుండవచ్చు) యీ లక్షణమే ఆయనకి తోడ్పడింది.

ఇంగ్లీషు ప్రజలపై ఫ్రెంచి విప్లవ ప్రభావాన్ని చూసి భయకంపితులైన ఇంగ్లీషు పాలకవర్గం కోరుకున్నది సరిగా మాల్తస్ పుస్తకాన్నే. ఆ పుస్తకం పొందిన విజయం చూసి మాల్తసే విభ్రమచెంది, దాని రెండవ ముద్రణ సన్నాహానికి పూనుకున్నాడు. తన సిద్ధాంతాన్ని బలపరచే సమాచార సేకరణకోసం ఆయన విదేశాలకు వెళ్లాడు. రెండవ ముద్రణ ప్రతి మొదటిదానికి చాలా భిన్నమైనది. అది, చారిత్రక విషయాంతర ప్రసక్తులతో, వివిధ రచయితలపై విమర్శలు మొదలైనవాటితో కూడిన విస్తృతమైన పుస్తకం. మాల్తస్ జీవితకాలంలో యీ "వ్యాసపు" అయిదు ముద్రణలు వెలువడ్డాయి. చివరి ముద్రణ మొదటిదాని సైజుకి అయిదు రెట్లుంది!

1805లో, అప్పట్లో కొత్తగా స్థాపింపబడిన ఈస్ట్ ఇండియా కంపెనీ కాలేజీలో, మాల్తస్ ఆధునిక చరిత్ర, అర్థశాస్త్రాల్లో ప్రొఫెసరుగా నియమింపబడ్డాడు. ఆ కాలేజీ పూజారి విధులను కూడా ఆయన నిర్వహించాడు. అర్థశాస్త్ర క్లబ్బు సమావేశాలకు ఆయన క్రమబద్ధంగా హాజరవుతూండేవాడు. వాటిలో ఆయన రికార్డో, జేమ్స్ మిల్‌లను విధిగా వ్యతిరేకిస్తూండేవాడు. 1815లో మాల్తస్ భూమి కౌలుపైన తన పుస్తకాన్ని ప్రచురించాడు. 1820లో తన "అర్థశాస్త్ర సూత్రాలు" ప్రచురించాడు. అందులో అత్యధిక భాగం, రికార్డోతో ఆయన వివాదమే. మాల్తస్ లెక్చర్లూ, ఉపన్యాసాలూ అనార్ద్రతకూ, సిద్ధాంత జడమైన ధోరణికీ పెట్టింది పేరు. చిన్నవాటినుంచీ ఆయనకి మాట లోపం వున్న కారణంగా కూడా, వాటిని వినడం కష్టసాధ్యంగా వుండేది. రాజకీయాభిప్రాయాల దృష్ట్యా ఆయనొక విగ్గు, ఒక ఇంగ్లీషు

జీవిత నిఘంటువు పేర్కొన్నట్టు ఆయన మధ్యేమార్గాన్ని చేబట్టడానికి ప్రయత్నించే మితవాద విగ్గ. మాల్తస్‌కి ముగ్గురు పిల్లలు. 1834 డిసెంబరులో గుండెపోటు కారణంగా ఆయన ఆకస్మికంగా మరణించాడు.

మనిషీ, భూగోళమూ

మాల్తస్ జనాభా సిద్ధాంతాన్ని అర్థరహితమైనదనిగాని, లేక పెట్టుబడిదారీ విధానపు మొరటు సమర్థనాత్మక వాదన అనిగానీ కొట్టిపారెయ్యడం పొరపాటే అవుతుంది. డేవిడ్ రికార్డో, చార్లెస్ డార్విన్ వంటివాళ్లు, తమపైన ఆ సిద్ధాంత ప్రాబల్యాన్ని గురించి చెప్పారు. ఈ సిద్ధాంతం, వక్రరూపంలోనే అయినా, పెట్టుబడిదారీ విధానపు నిజ లోపాలనూ, వైరుధ్యాలనూ ప్రతిబింబించిందని మార్క్స్ ఎంగెల్సులు రాశారు.

జీవనాధారాలకన్న జనాభా మరింత త్వరితంగా పెరిగే ధోరణిలో వుంటుందని మాల్తస్ వాదించాడు. దీన్ని "రుజువుచేసేందుకు" గాను, తన రోసిపోయిన శ్రేణీ సూత్రమనే సుత్తితో నేర్పుగా పాఠకుని నెత్తిపైన రిమ్మ తిరిగేలా కొట్టాడు: ప్రతి పాతికేళ్లకూ జనాభా రెట్టింపు కాగలదు, తత్పర్యవసానంగా గుణాత్మక శ్రేణిలో మాదిరిగా 1, 2, 4, 8, 16, 32, 64... వగైరా సంఖ్యాక్రమంలో పెరుగుతుంది. కాగా, ఆయన చెప్పినదాన్నిబట్టి, జీవనాధారాలు మహా అయితే, అదే కాలంలో, అంక గణిత శ్రేణిలో: 1, 2, 3, 4, 5, 6, 7... క్రమంలో పెరుగుతాయి. "రెండు శతాబ్దాల్లో జీవనాధారాలకు, జనాభా నిష్పత్తి 256:9; మూడు శతాబ్దాల్లో 4,096:13; రెండు వేల ఏళ్లలో యీ తేడా దాదాపు లెక్కకు అందనంతగా వుంటుంది."*

మాల్తస్ మంచి మనస్తత్వవేత్త. అటువంటి సరళమైన, ఆశ్చర్యజనకమైన దృష్టాంతానికి గల శక్తిని ఆయన గ్రహించాడు. ఇదొక ధోరణి మాత్రమే అన్న సంగతిని పాఠకుడు మరచిపోయేందుకు ఉన్ముఖుడవుతాడు, జనానికి జీవించడానికిగాని, పనిచెయ్యడానికిగాని మాట అటుంచి, నిలబడేందుకే చోటు లేని ప్రపంచాన్ని గూర్చిన ప్రళయసూచక చిత్రాన్ని తలుచుకునే సరికి అతని జుట్టు నిక్కబొడుచుకుంటుంది. వాస్తవానికి అది అసాధ్యమని చెప్పడం ద్వారా, మాల్తస్ పాఠకుని ఊహను కొంత అదుపులో పెట్టి,

---

* T. R. Malthus, *An Essay on the Principle of Population*, Vol. I, London, 1862, p. 11.

యీ ధోరణి వాస్తవరూపం దాల్చకుండా ప్రకృతే స్వయంగా చూస్తుందన్నాడు. అదెలా చేస్తుంది యీ పని? యుద్ధాలు, రోగాలు, దారిద్ర్య అవినీతుల సహాయంతో. మాల్తస్ వీటన్నింటినీ, మనిషి పాపస్వభావానికీ, అదుపులేని కామతృష్ణకీ సహజశిక్షగా పరిగణించాడు. ఈ సమస్యకు మరో యితర పరిష్కారం లేదా? నిజమే ఉందంటూ మొదలెట్టాడు మాల్తస్ తన పుస్తకపు రెండవ ముద్రణను: "నివారక నిరోధాలు" లేక మరింత సరళంగా చెప్పాలంటే కామ సంయమం. ఆలస్యంగా పెళ్లిచేసుకోవడాన్నీ, బ్రహ్మచర్యాన్నీ, వైధవ్య పాలననూ మాల్తస్ పొగిడాడు. అయితే, తను ఎంత ధీమాగా వీటి విషయంలో హామీలు యిచ్చినప్పటికీ, యీ చర్యల సాఫల్యం విషయంలో మాల్తస్‌కే నమ్మకం లేకపోయింది. దానితో ప్రకృతిసిద్ధమైన నిరోధాల అనివార్యత అంశానికి ఆయన తిరిగివచ్చాడు. అప్పటికే సంతాన నిరోధక సాధనాలను గురించిన చర్చలు జరుగుతున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆయన యీ సాధనాలపట్ల అనుకూల్యత ప్రదర్శించలేదు. జననాల రేటును అలా కృత్రిమంగా నిరోధించడాన్ని ప్రకృతి శక్తులలో, అనగా భగవదేచ్ఛలో జోక్యంగా ఆయన పరిగణించాడు. మాల్తస్ సిద్ధాంతంలో అమిత జనాభా మానవజాతికి ఒక మహమ్మారే కాకుండా, మరోవిధంగా అదొక వరం కూడా. సహజంగా సోమరి అయిన కార్మికుడిని ముందుకు నడిపే ఒక కొరడా కూడా. కార్మికులు ఎప్పుడూ కూడా అత్యధిక సంఖ్యలో వుంటారు. కాగా, వారి మధ్య నిరంతరాయమైన పోటీ మాత్రమే, వాళ్లచేత పనిచేయిస్తుంది, అందునా తక్కువ వేతనాలకు పనిచేయిస్తుంది.

మాల్తస్ సిద్ధాంతం వెనులుబాటులేని పిడివాద ప్రాయమైనది. పెట్టుబడిదారీ విధానపు ఒకానొక దశయొక్క, ఏవిధంగానూ ప్రామాణికమైనది గాని పరిమిత అనుభవాన్ని అన్ని కాలాలకూ, అన్ని సామాజిక వ్యవస్థలకూ వర్తించే సార్వత్రిక నియమంగా చిత్రించేందుకు అది ప్రయత్నించింది.

మొదటిది, నిర్నిరోధ జనాభా ఉత్పత్తి ధోరణి కేవలం జీవనాధారాల కొరత ద్వారానూ, దానినుండి ఉత్పన్నమయే మాల్తసియన్ దుష్టశక్తుల ద్వారానూ నిరోధింపబడగలదనడం నిజం కాదు. జీవనాధారాల్లో పెరుగుదలకు తక్షణ పర్యవసానంగా జననాల రేటులోనూ, జనాభా ప్రమాణంలోనూ పెరుగుదల సంభవిస్తుందనీ, యిది మరల జీవనాధారాల పెరుగుదలను నాస్తికరించేదాకా సాగుతుందనీ మాల్తస్ వాదించాడు. వాస్తవానికి ఇది పరమ ధోరణి కాదు. సామాజికాభివృద్ధియొక్క ఒకానొక నిర్దిష్ట దశలో అది, అందుకు పూర్తి భిన్నమైన ధోరణికి చోటిస్తుంది: జీవనాధారాల, జీవన ప్రమాణాల పెరుగుదల జననాల రేటులోనూ, సహజ జనాభా రేట్ల పెరుగుదలలోనూ తగ్గుదల ధోరణికి దారితీస్తుంది. ఈ రోజున సంపన్న పశ్చిమ దేశాల్లోని యీ పెరుగు

దల రేటు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోని పెరుగుదల రేటులో సగంనుండి మూడోవంతు మాత్రమే వుంది. గత యిరవై పాతిక సంవత్సరాల కాలంలో జపాను బ్రహ్మాండమైన ఆర్థిక ప్రగతిని సాధించిందనీ, అదే సమయంలో అక్కడ జననాల రేటు సగానికి పడిపోయిందన్న సంగతి మనకు తెలుసు.

జనబాహుళ్యపు పేదతనం, అమిత జనాభా — యీ రెండింటికీ మధ్య గల "వినాశ కర" సంబంధాన్ని సోషలిజం నిర్మూలిస్తుంది. వస్తువుల, సేవల ఉత్పత్తిలో ముందె న్నడూ కనివిని ఎరుగని అధిక పెరుగుదలనూ, అలాగే వాటి మరింత సమానమైన పంపిణీనీ నూతన సామాజిక వ్యవస్థ సాధిస్తుంది. దీనికితోడు, వ్యక్తి సౌభాగ్య స్వేచ్ఛ లనూ, స్త్రీ పురుషుల మధ్య అసలైన సమానత్వాన్నీ, శీఘ్ర సాంస్కృతిక పురోగమ నాన్నీ అది సమకూర్చి, తద్వారా జనాభా ప్రమాణపు హేతుబద్ధ, మానవత్వపూరిత నియంత్రణకు మార్గాన్ని సుగమం చేస్తుంది. సోషలిజం, కమ్యూనిజంల కింద, మానవ జాతికి యింతవరకు ఎదురైనవాటన్నింటిలోకీ మిక్కిలి జటిలమైన సమస్యను పరిష్క రించే అవకాశం వుంది. సముచిత జనాభా సంఖ్యను అంటే, అత్యధిక స్థాయి ఉత్పత్తి వినిమయాలతో సమాన నిష్పత్తి గల జనాభా పెరుగుదలను కొనసాగించడమే యీ సమస్య. అంతిమ విశ్లేషణలో యిది, అందరికీ సుఖమయ, సౌభాగ్యపూరిత జీవితాన్ని సునిశ్చితం చేస్తుంది.

జనాభాకీ, వనరులకీ మధ్య జరిగే శాశ్వత పోటీలో ప్రవేశించిన మాల్తస్ రెండవ వాదాన్ని — జీవితావసరాలు అంకగణిత శ్రేణిలో పెరుగుతాయన్న వాదాన్ని — మనమిప్పుడు చూద్దాం. ఈ అంశంలో మాల్తస్ వాదన మరింత సత్యదూరమైనది.

నిజానికి ఆయన చేసిన చిత్రణ దాదాపు యిలా వుంటుంది. ఒక్క వ్యక్తికి జీవికను సమకూర్చే ఒక భూఖండాన్ని ఊహించుకోండి. అతను ఆ ఖండంలో ఏడాదికి 200 పని రోజుల శ్రమను వినియోగించి తన ఆ భూఖండంనుంచి పదిటన్నుల — తనకు బొటాబొటీగా సరిపడేటంత — గోధుమను పొందాడునుకుందాం. తర్వాత రెండోవాడు (బహుశా వయస్సు వచ్చిన కొడుకు) వచ్చి, అదే భూఖండంలో మరో 200 పని దినాల శ్రమను వినియోగిస్తాడు. పంట రెట్టింపు — 20 టన్నులు — అవుతుందా? బహుశా కాదని ఊహిస్తాడు మాల్తస్. అది పదిహేనో, పదిహేడో టన్నులైతే గొప్ప విశేషం అంటాడాయన. మూడోవాడు వచ్చి, మరో 200 పని రోజుల శ్రమను అందులో పెడితే, వాళ్లకి మరింత తక్కువ ఆదాయం లభిస్తుంది. అప్పుడు వారిలో ఎవరో ఒకరు వెళ్లిపోవలసి వస్తుంది.

క్షీణమాన రాబడుల నియమం లేక క్షీణమాన భూసార నియమం అనబడేదానికి యిది ప్రాథమిక రూపం. మాల్తస్ బోధనకు పునాది యీ నియమమే. అటువంటి

నియమమంటూ ఏమైనా వుందా? పాదార్థిక వస్తువుల ఉత్పత్తియొక్క పరమ, సార్వత్రిక నియమంగా అలాంటిదేమీ లేదు. కొన్ని ఆర్థిక పరిస్థితుల్లో, వ్యయంలో పెరుగుదల ఉత్పత్తిలో అందుకు అనురూపమైన పెరుగుదలను సాధించనప్పుడు, అటువంటి సందర్భాలూ, పరిస్థితులూ ఉత్పన్నమవుతాయి. అయితే యిది సార్వత్రిక నియమం ఎంతమాత్రమూ కాదు. ఆర్థిక వ్యవస్థయొక్క ఫలానా రంగంలో ఏదో తప్పు గాడిలో పడిందని ఆర్థికవేత్తలకూ, ఇంజనీర్లకూ అదొక సూచన మాత్రమే.

పైన ఉల్లేఖించబడిన ఉదాహరణ, పూర్తిగా పరికల్పనాత్మకమైన, కృతకమైన పరిస్థితిని చిత్రిస్తుంది. మనిషిచేత ప్రాకృతిక వనరుల వినియోగ సమస్యను అది ఎంత మాత్రం పూర్తిగా పరిష్కరించదు. నిజ జీవితంలో అక్కడ పేర్కొనబడిన శ్రమ కొన్ని ఉత్పత్తి సాధనాలతోబాటు ఉపయోగించబడుతుంది. ఈ కలయిక సరిగా ఎంచుకోబడినట్లయితే, ఒక నిర్దిష్ట పరిమాణపు శ్రమ గంటలకు లభించే ప్రతిఫలం తగ్గదు. సాంకేతిక ప్రగతికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. అది నానాటికీ అధికతర ఉత్పాదక పరికరాలనూ, పద్ధతులనూ శ్రమకు చేకూరుస్తుంది. మన పరిశీలనలో వున్న భూఖండానికి పొరుగునవున్న భూఖండాలు జతచెయ్యబడవచ్చు, అప్పుడు ఉత్పత్తి ప్రమాణపు పెరుగుదలతో, మరింత మంచి వ్యవస్థతో, స్పెషలైజేషనుతో, సాంకేతిక విజ్ఞానాన్ని మరింత ఫలవంతంగా అన్వయించడంతో ఫలసాయం పెరిగేందుకు అత్యధిక అవకాశం వుంటుంది.*

---

* "క్షీణమాన రాబడుల నియమానికి" విస్పష్టమైన యీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని, ఆధునిక బూర్జువా ఆర్థికవేత్తలు మాల్తుస్‌తో పోల్చి, అది పనిచేసే రంగాన్ని విశేషంగా పరిమితం చేస్తూవుంటారు. పరిశీలనలో వున్న అంశపు పెంపొందిన పరిమాణం యితర ఉత్పత్తి అంశాల స్థిర పరిమాణానికి చేర్చబడినప్పుడు మాత్రమే యీ "నియమం" పనిచేస్తుందని వాళ్లు అంటారు. మౌలిక ఉత్పత్తి అంశాలన్నప్పుడు, శ్రమ, పెట్టుబడి, భూమి అన్న సంగతి మనకి తెలుసు. పై ఉదాహరణ ఎటువంటి పరిస్థితిని వర్ణిస్తుందంటే, పూర్తిగా అవాస్తవికమైన దాన్ని అన్న విషయాన్ని మనం చూశాం. భూమీ, పెట్టుబడీ (మరో ఉత్పత్తి సాధనం) మారవనీ, శ్రమ పరిమాణం మాత్రమే మారుతుందనీ అది ఊహించుకుంటుంది. అయితేనేం, మాల్తుసియన్లు "క్షీణమాన రాబడుల నియమాన్ని" ఏదో ఒక రూపంలో యింకా ఉపయోగిస్తూనే వున్నారు. ఈ "నియమాన్ని" తిరస్కరించడంలో మార్క్సిస్టు ఆర్థికవేత్తలు ఉత్పత్తి ఖర్చుల ప్రతిఫలానికి (దాని సహజ రూపంలో ఉత్పత్తి పెరుగుదలకు) సంబంధించిన వాస్తవ, ముఖ్య సమస్యను ఎంతమాత్రం నిర్లక్ష్యం చెయ్యరు. ఈ ప్రతిఫలం, పైన

పెట్టుబడిదారీ దేశాల్లో వ్యావసాయిక అభివృద్ధి తదుపరి చరిత్ర, మాల్తుస్ సిద్ధాంతమూ, జోస్యాలూ తప్పని రుజావుచేసింది. వ్యావసాయిక సమస్యపై తను చేసిన రచనల్లో, వి. ఐ. లెనిన్ యీ విషయాన్ని పదేపదే గుర్తుచేశాడు: 19వ శతాబ్దపు ద్వితీయార్ధభాగంలో వ్యవసాయరంగంలో వచ్చిన సాంకేతిక ప్రగతి, వ్యవసాయంలో విని యుక్తమయ్యే శ్రమశక్తిని సాపేక్షంగా (కొన్ని సందర్భాల్లో పరమంగా) తగ్గించినా కూడా, వ్యావసాయికోత్పత్తి పెంపకాన్ని సాధ్యం చేసింది. రెండవ ప్రపంచ యుద్ధానికి దరిమిలా ఉత్తర అమెరికా, పశ్చిమ యూరప్‌ల వ్యవసాయంలో యిదే దిశలో ప్రస్ఫుట మైన మార్పులు సంభవిస్తున్నాయి. ఒక వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానానికి వస్తున్న ప్రమాదం జీవనాధారాల "అల్పోత్పత్తి"నుంచి కాక, ఆ వ్యవస్థ ఉత్పత్తిచేసే సామా జిక వైరుధ్యాలనుంచే వస్తుందన్న యథార్థాన్ని యిది మరింతగా ధృవపరుస్తోంది.

అమిత జనాభాపై దృష్టిని కేంద్రీకరించడం ద్వారా, పెట్టుబడిదారీ విధానంలో శ్రామికవర్గంలోని ఒక భాగాన్ని "అదనపు బలగం"గా రూపాంతరీకరించే, ఎడతెగని నిరుద్యోగ నిల్వబలగాన్ని సృష్టించే ఒక ధోరణిని మాల్తుస్ ప్రతిబింబిస్తున్నాడు. అయితే, మాల్తుస్ చెప్పేదానికి భిన్నంగా, యీ అమిత జనాభా, ప్రాకృతిక వనరులతో పోల్చిన ప్పుడు పరమ అదనపు జనాభా కాదు, పెట్టుబడిదారీ విధానంలో సాపేక్షంగా అదనంగా వుండే కార్మికులు మాత్రమే.

మాల్తుస్ రచనల వాస్తవికమైన అర్థాన్ని, భూస్వాముల ప్రయోజనాల పరిరక్షణగా చాలవరకు కుదించవచ్చు. తనకూ, రికార్డోకీ మధ్య భేదాన్ని ఒప్పుకుంటూ మాల్తుసే స్వయంగా యీ విరోధాభాసాన్ని పేర్కొన్నాడు: "భూమి కౌలును పెద్ద మొత్తాల్లో పొందే మిస్టర్ రికార్డో, వాటి జాతీయ ప్రాముఖ్యతను అంతగా తగ్గించి చెప్పడం, ఎన్నడూ భూమికౌలు ద్వారా ఏ ఆదాయమూ పొందని నేను, వాటి ప్రాముఖ్యాన్ని కొండం తలు చేసి చెప్తున్నానన్న దూషణకు గురికావడం ఒక విధంగా విడ్డూర విషయమే."* దీనికి అర్థమేమైనా వుంటే, అపభ్రంశ సామాజిక వైఖరి ఒక వ్యక్తి మనస్తత్వాన్నీ, ఆలోచననూ వివరించజాలదన్నది మాత్రమే: ఈ సంక్లిష్ట విషయం ఆయన సామాజిక

పేర్కొనబడిన అంశాలపైన (అనేక యితర అంశాలపైనా) ఆధారపడి, మారుతుంది. ఒక రూబులు పెట్టుబడి మదుపుకి, ఒక మనిషి చేసే ఒక గంట శ్రమ, ఒక హెక్టారు భూమికి లభించే ప్రతిఫలాన్ని పెంచే కర్తవ్యమే, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడంలో అతి ముఖ్య అంశం.

* T. R. Malthus, *Principles of Political Economy*, Oxford, a. o., 1951, pp. 216—17.

హోదానిబట్టి నిర్ణయింపబడదు. (సందర్భవశాత్తూ ఒక విషయాన్ని మరచిపోరాదు: రికార్డో భూస్వామి అవగా, మాల్తుస్ జన్మతహా భూస్వామి, దరిమిలా మాత్రమే పూజారీ, ప్రొఫెసరూ.)

ఆర్థికశాస్త్రంలో మాల్తుస్ దృక్పథాన్ని రికార్డో దృక్పథానికి పూర్తి భిన్నమైనదిగా చేసినవి యీ వర్గ దృక్పథమూ, ఆయన వ్యక్తిగత గుణాలే. మరో ప్రత్యేకాంశం వుంది. తనకు విడివిడివిగానూ, తాత్కాలికమైనవిగానూ కనిపించిన వైరుధ్యాలనూ, సమస్యలనూ పట్టించుకోక, రికార్డో భవిష్యత్తులోకి చూడగా, మాల్తుస్ వాటి దగ్గర ఆగి, వాటిని మరింత సన్నిహితంగా చూశాడు. సంక్షోభాల సమస్య విషయంలో యిదే జరిగింది. ఈ సమస్యను రికార్డో నిర్లక్ష్యంచెయ్యగా, మాల్తుస్ నిర్లక్ష్యంచెయ్యలేదు.

ఇంతకుముందే పేర్కొన్నట్లు, యీ సమస్యపైన బూర్జువా అర్థశాస్త్రం రెండు ప్రధాన ధోరణులుగా చీలింది. పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన కీలక సమస్య సంచయనమేనని స్మిత్ రికార్డోలు విశ్వసించారు. సంచయనం ఉత్పత్తి పెరుగుదలను సునిశ్చితం చేస్తుందనీ, కాగా, గిరాకీ, అమ్మకాల దృష్ట్యా తీవ్రమైన యిబ్బందులు వుండవనీ భావించారు. మాల్తుస్ (సిస్మొండీతోబాటు) యీ దృక్పథాన్ని ఖండించాడు. అమ్మకం సమస్యను ఆర్థిక సిద్ధాంతపు కేంద్ర స్థానంలో పెట్టిన మొట్టమొదటివాడు మాల్తుసే. అలా చేసేక్రమంలో పెట్టుబడిదారీ అభివృద్ధియొక్క వైరుధ్యాలను విశేషమైన చైతన్యంతో ఆయన నిరూపించాడు. ఎన్ని సరుకుల, సేవల సాధన అయినా పెట్టుబడిదారులు (ఉత్పత్తికి నిర్దేశింపబడిన సరుకుల డిమాండుతోబాటు), కార్మికుల సంయుక్త గిరాకీ ద్వారా సునిశ్చితం కాగలదు. సూత్రరీత్యా ఆయన రైటే. అయితే అటువంటి అమ్మకానికి అర్థం, ఆచరణలో అది సాఫీగా, ఘర్షణ లేకుండా సాగుతుందని కాదు. ఎంతమాత్రమూ కాదు. ఈ అమ్మకపు క్రమానికి అమితోత్పత్తి సంక్షోభాలు అంతరాయం కలిగిస్తాయి. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందేకొద్దీ యీ సంక్షోభాలు మరింత వినాశకరంగా తయారవుతాయి. మాల్తుస్ యీ అమ్మకపు సమస్యకు పరిష్కారాన్ని, పెట్టుబడిదారులకుగాని, కార్మికులకుగాని సంబంధంలేని సామాజిక వర్గాల్లో, శ్రేణులలో వెదికాడు. సరుకుల మొత్తం రాశియొక్క అమ్మకాన్ని సమకూర్చగలిగినది వాటి గిరాకీ మాత్రమేనని ఆయన వాదించాడు. ఈవిధంగా, మాల్తుస్ అభిప్రాయం ప్రకారం, సమాజ రక్షకులు ఎవరంటే, ఏ భూస్వాములనూ, వాళ్ల సేవకులనూ, ఆఫీసర్లనూ, మతబోధకులనూ అయితే రికార్డో పరభాగ్యోప జీవులని పేర్కొన్నాడో, సరిగా వాళ్లే!

20వ శతాబ్దపు బూర్జువా అర్థశాస్త్రంలోని ప్రముఖ ధోరణి అయిన కీనీషియనిజం అమ్మకపు సమస్యపైనా, "ఫలవంతమైన గిరాకీ" అంశాలపైనా మాల్తుస్ భావాలను

పునరుద్ధరించి, స్వీకరించింది. ఆర్థిక విజ్ఞానశాస్త్రమే కనుక రికార్డో వైఖరికి బదులు మాల్తస్ పంథాను అనుసరించివుంటే పెట్టుబడిదారీ విధానానికి యింకెంతో మంచిగా ఉండివుండేదన్న కీన్స్ ప్రకటన కాకతాళీయమైనదేమీ కాదు. ఆధునిక ఆర్థిక విధానంలో వివిధ మధ్యంతర శ్రేణుల్లో సరుకుల వినియోగం, యీ వినియోగానికి రాజ్యం యిచ్చే ప్రోత్సాహం — యిది, సంక్షోభవ్యతిరేకమైన ఒక ముఖ్య చర్య. పెట్టుబడిదారీ విధానపు మౌలిక నియమాలకు శాస్త్రీయ వివరణను సమకూర్చలేని బూర్జువా ఆర్థిక ఆలోచన, పరిస్థితుల ఒత్తిడి కారణంగా, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క నిర్దిష్ట వైరుధ్యాలను ఆచరణాత్మకంగా మెత్తబరచే కొన్ని పద్ధతులను యింకా కనుగొంటూనే వుంది.

రికార్డియనిజం విచ్ఛిత్తి

1820, 1830 దశకాల్లో జేమ్స్ మిల్, మెక్కుల్లొహ్‌ల రచనలు రికార్డో బోధన ముక్కస్య ముక్క అర్థాన్ని అతి శ్రద్ధగా పునర్లిఖించి, ప్రజల్లో బహుళ ప్రచారం చేశాయి. అయితే యీ బోధన సారాంశం వాళ్లకి అర్థంకాలేదు, దాన్ని వాళ్లు అభివృద్ధి చెయ్యలేకపోయారు. రికార్డోయొక్క అత్యంత సన్నిహితానుచరుల సామాన్య సామర్థ్యాన్ని ఆధునిక బూర్జువా ఆర్థికవేత్తలు సైతం గుర్తిస్తారు. షుంపేటెర్ యిలా రాస్తాడు: రికార్డో సిద్ధాంతం "వాళ్ల చేతుల్లో దాదాపు వెంటనే వాడిపోయి పేలవమైపోయి, అనుత్పాదకమైపోయింది." అయితే, దీనికి కారణాన్ని ప్రధానంగా ఆ సిద్ధాంతపు వంధ్యాత్వంలోనే ఆయన చూస్తాడు.

ఈ గొప్ప అర్థశాస్త్రవేత్త వారసత్వానికి యిటువంటి దుర్గతి పట్టడానికిగల నిజకారణం ఏమిటి? రికార్డో మనకి ప్రగాఢమైన ఒక భావ వ్యవస్థను వదిలిపెట్టాడు. అయితే దానిలో కొట్టవచ్చినట్లు కనిపించే వైరుధ్యాలూ, గ్రంథపాతాలూ వున్నాయి. ఈ విషయం యితరులు ఎవరికన్న ఆయనకే బాగా తెలుసు. రికార్డో సిద్ధాంతాన్ని సరిగా అభివృద్ధిచెయ్యాలంటే ఆయన బోధనా సూత్రాలను ముందు కూలంకషంగా అవగతం చేసుకోవాలి, అటుతర్వాత యీ వైరుధ్యాలకు పరిష్కార మార్గాలను కనుక్కోవాలి.

రికార్డో సన్నిహితులు అటువంటి కర్తవ్య పరిష్కారానికి వ్యక్తిగతంగా అసమర్థులు అన్న విషయం సహజంగానే అతి ముఖ్య అంశం. అయితే యింతే కాదు. విజ్ఞానశాస్త్రంలో వ్యక్తి పాత్ర ఎంత ముఖ్యమైనదైనప్పటికీ, చరిత్రలో వ్యక్తి పాత్ర గురి అయ్యే మాదిరి నియమాలకే అదీ గురి అవుతుంది. కాలమూ, చారిత్రక ఆవశ్యకతా తక్షణ కర్తవ్యాలను

పరిష్కరించగల మనుషులను సృష్టిస్తాయి. ఇక్కడ విషయం ఏమిటంటే, రికార్డో బోధన సృజనాత్మక అభివృద్ధి, ఒక భిన్న భావజాల దృక్పథానికి పరివర్తనచెందవలసిన అవసరం ఏర్పడింది. బూర్జువా భావజాల పరిధిలో మౌలికంగా అది అసంభవం. ఈ కారణంగానే రికార్డోకి నిజవారసత్వం మార్క్సుజానిదే.

రికార్డోకు ఎదురైన రెండు ప్రధాన వైరుధ్యాలను మనం ఒకసారి గుర్తుచేసుకుందాం. మొదటిది, శ్రమకు పెట్టుబడి మారకం (యింతకంటె మరింత సరళంగా చెప్పాలంటే, పెట్టుబడిదారు కూలికి కార్మికులను కుదుర్చుకోవడం) తన శ్రమ విలువ సిద్ధాంతంతో ఎలా పొసుగుతుందో ఆయన వివరించలేకపోయాడు. కార్మికుడు పూర్తిగా "తన శ్రమ విలువను" పొందినట్లయితే (యీ పదబంధం తప్పని మనకు తెలుసు, కాని రికార్డో దాన్ని యీ విధంగానే చెప్పాడు), అంటే, అతని వేతనం, అతని శ్రమచేత సృష్టింపబడిన సరుకు విలువతో సమానం అయినట్లయితే, లాభాన్ని వివరించడం అసాధ్యం. మరి అలా కాకుండా, కార్మికుడు "తన శ్రమ విలువ" కన్న తక్కువ పొందితే, సమతూకాల మారకం మాట, విలువ నియమం మాట ఏమిటి? రెండవది, శ్రమ విలువను, సమాన పెట్టుబడికి సమాన లాభం అన్న విషయంతో అతను సరిపెట్టలేకపోయాడు. విలువ ఒక్క శ్రమచేత మాత్రమే సృష్టింపబడే మాటైతే, వేటిపైనైతే సమాన పరిమాణపు శ్రమ వినియోగింపబడుతుందో ఆ సరుకులు, వాటి ఉత్పత్తిలో ఎంత మొత్తం పెట్టుబడి వినియోగింపబడిందన్న దానితో ప్రసక్తి లేకుండా, దాదాపు సమానమైన ధరలకే అమ్మబడాలి. అప్పుడు దీనికి, పెట్టుబడికి భిన్నమైన రేట్లలో లాభం అన్న అర్థం అవుతుంది. దీర్ఘకాల విషయంగా యిది అసంభవమనడం స్పష్టమే.

మార్క్స్ యీ వైరుధ్యాలను ఎలా పరిష్కరించాడో మనకి తెలుసు. 1820, 1830 దశకాలకు చెందిన ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్తలు వాటిపట్ల ఎటువంటి వైఖరి వహించారో మనం చూద్దాం. విడి రచయితలను కాక, సాధారణ ధోరణిని మాత్రమే మేమిక్కడ పరిశీలిస్తాం. రికార్డో శిష్యులు యీ వైరుధ్యాలకు పరిష్కారాన్ని కనుగొనలేక, వాటిని యీ విధంగా అధిగమించ ప్రయత్నించారు.

పెట్టుబడి అంటే సంచితమైన శ్రమ. మిల్, మెక్‌కుల్లొహ్, తదితరులూ సరిగా యీ రికార్డియన్ భావంనుంచే బయల్దేరారు. అందుచేత, శ్రమ ద్వారా పెట్టుబడి సహాయంతో ఉత్పత్తిచెయ్యబడిన సరుకు విలువ, పెట్టుబడి విలువను కూడా చేర్చుకోవాలి. దీని అర్థం, సరుకు విలువలో యంత్రాలు, ముడి పదార్థాలు, యింధనం మొదలైనవాటి బదలాయింపబడిన విలువతో కూడివుంటుందని అంటే, అది నిజమే. అయితే, అప్పటికీ మనం, లాభం ఎక్కడినుంచి వస్తుందన్న విషయాన్ని కనుక్కొనేందుకు యింకా దూరంలోనే వుంటాం. ఎందుకంటే, పెట్టుబడిదారు పెట్టుబడిని మదుపుపెట్టేది,

అంటే యీ ఉత్పత్తి సాధనాలను కొనేది, వాటి విలువను తయారీ సరుకులో పునరుత్పత్తి చేసేందుకు మాత్రమే కాదు.

అబ్బే, మా ఉద్దేశం అదికాదు, అన్నారు ఆ అర్థశాస్త్రవేత్తలు. కార్మికుడు ఫ్యాక్టరీలో పనిచేస్తాడు, యంత్రమూ అలాగే పనిచేస్తుంది. సాదృశ్యంగా పత్తి, బొగ్గు మొదలైనవి కూడా "పనిచేస్తాయి" అని చెప్పవచ్చు. అవన్నీ కూడా సంచిత శ్రమ కావడమే యిందుకు కారణం. పనిచెయ్యడం ద్వారా అవి విలువను సృష్టిస్తాయి. అవి సృష్టించిన విలువలో భాగమే లాభం. అది సహజంగానే పెట్టుబడిదారుకి పోతుంది, అది పెట్టుబడి అనుపాతంలో వుంటుంది.

రికార్డియన్ వైరుధ్యాలకు యిదొక కృతక పరిష్కారం. ఈ వాదన ప్రకారం కార్మికుడికి "అతని శ్రమయొక్క పూర్తి విలువ" ముడుతుంది. అదెలాగంటే, కొత్తగా సృజింపబడిన విలువలో అతనికి ముట్టని ప్రతీదీ, అతనిచేత, అతని సజీవ శ్రమచేత గాక, పెట్టుబడిలో మూర్తీభవించిన గత శ్రమచేత సృజింపబడుతుంది. ఈ సంయుక్త శ్రమచేత సృజింపబడిన సరుకు విలువ, సరుకు అమ్మబడినప్పుడు, పెట్టుబడిదారుకు అతని పెట్టుబడిపైన సగటు లాభాన్ని తెచ్చిపెడుతుంది. ఈ భావం రికార్డో బోధన అయిన శ్రమ విలువ సిద్ధాంతంనుంచి, దాని శాస్త్రీయ ప్రాతిపదికను తొలగిస్తుంది, అప్పుడిక దాని డొలక మాత్రమే మిగులుతుంది. ఈ పద్ధతిలో ఉత్పత్తి సాధనాలపైనా, వేతనాలపైనా పెట్టుబడిదారు చేసే వ్యయంనుంచీ, లాభంనుంచీ సరుకు విలువ ఏర్పడుతుంది. మరో విధంగా చెప్పాలంటే, విలువ అన్నది, ఉత్పత్తి ఖర్చులకు లాభాన్ని కలిపితే వచ్చే మొత్తంతో సమానం.

అయితే దీనిలో విశేషమేమీ లేదనీ, యిది కేవలం ఒక సర్వసాధారణ సత్యమనీ మీరు అనవచ్చు. మీరు పెట్టుబడిదారు కాకపోయినా కూడా, పెట్టుబడిదారు తన సరుకుల ధరలను అందాజాగా యిలా నిర్ణయిస్తాడని మీరు అర్థంచేసుకోగలరు: తనకు అయిన ఖర్చులను లెక్కవేసి, వాటికి సమంజసమైన లాభం కలుపుకుని ధరలు నిర్ణయిస్తాడు. ఈ సిద్ధాంతం నిజానికి, విషయాలను లోతుగా పరిశీలించకుండా, అతి పైపై, సర్వసామాన్య విషయాలను వర్ణిస్తుంది. పైకి కనిపించే విషయాలు వాటి సారాంశాన్ని బహిర్గతం చెయ్యనప్పుడే విజ్ఞానశాస్త్రం ముగుస్తుంది.

పెట్టుబడిదారుకి యీ పథకం ఎంత అద్భుతంగా కుదిరింది! అంటే, కార్మికుడు తన శ్రమకు సమంజసమైన ప్రతిఫలం పొందుతాడు. అలాగే పెట్టుబడిదారు లాభం పొందుతాడు. లాభం, అతనికి చెందిన భవనాలు, యంత్రాలు, పదార్థాల "శ్రమ"కు న్యాయబద్ధమైన ప్రతిఫలం. భూమి కూడా "పనిచేస్తుంది" కదా, అందుకని, భూమి సొంతదారు భూమి కౌలు పొందడం పూర్తిగా సమంజసం అని కూడా దీనికి తేలికగా

చేర్చవచ్చు. రికార్డో బోధననుండి ఉత్పన్నమైన వర్గాల మధ్య వైరుధ్యం యిక్కడ అదృశ్యమైపోయి, దాని స్థానంలో శ్రమ, పెట్టుబడి, భూమి — వీటి మధ్య శాంతియుత మైన సహకారం చోటు చేసుకుంది. ఫ్రాన్సులో అంతకు ముందు సేయ్ కూడా యిటు వంటి పథకాన్నే ప్రతిపాదించాడు, అయితే తేడా అల్లా ఏమిటంటే, దాన్ని ఆయన శ్రమ విలువ సిద్ధాంతంలో చొప్పించి అమర్చేందుకు ప్రయత్నించలేదు. శ్రమ — వేతనం; పెట్టుబడి — లాభం; భూమి — కౌలు. ఉత్పత్తి అంశాలనూ, వాటివాటి ఆదాయాలనూ అనుబంధించే ఈ త్రయం, 19వ శతాబ్ది మధ్య నాటికి ఇంగ్లీషు అర్థశాస్త్రంలో స్థిరపడింది.

తరుచుగా ఉత్పత్తి ఖర్చుల సిద్ధాంతమని పిలువబడే యీ విలువ సిద్ధాంతంలో స్పష్టంగా కనిపించే ఒక బలహీనత వుంది. సరుకు విలువ ఖర్చుల ద్వారా, అంటే దాని ఉత్పత్తిలో భాగస్వామ్యం కలిగిన సరుకుల విలువను బట్టి వివరింపబడుతుంది. వాస్తవానికి, ధరలు ధరలచేత వివరింపబడుతున్నాయి. శ్రమకి యింత, యంత్రాలకు యింత, పత్తి మొదలైన వాటికి యింతింత చొప్పున ఖర్చు అవుతోంది కాబట్టి, ఒక గజం బట్టకి యిన్ని షిల్లింగులు, యిన్ని పెన్నీలు ఖర్చు అవుతోందన్న మాట నిజమే. అయితే యంత్రాలకు ఎక్కువగాని, తక్కువగాని కాకుండా, సరిగా అంతే ఎందుకు ఖర్చవుతోంది? వగైరా ప్రశ్నలు తలెత్తుతాయి. అర్థశాస్త్రంలో ఎప్పుడూ కూడా కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తూవుండిన ధరల అంతిమ ప్రాతిపదిక సమస్య, కేవలం యిక్కడ నిర్లక్ష్యం చెయ్యబడింది, దానితో సన్నిహితంగా ముడిపడివున్న ఆదాయానికి చివరి మూలపు సమస్య రాజీపద్ధతిలో పరిష్కరింపబడింది.

ఈ యిబ్బందిని అధిగమించ ప్రయత్నించిన 1830 దశకానికీ, 1850 దశ కానికీ మధ్యకాలానికి చెందిన అర్థశాస్త్రవేత్తలు అంతకంతకు రికార్డోనుండి దూరంగా వైదొలగి, జెవాన్స్, మార్షల్‌ల భావాలకు అంతకంతకు ఎక్కువగా మార్గాన్ని సుగమం చేస్తూ, ముందుకెళ్లారు. ఒక వంక, ఉత్పత్తి ఖర్చులను, అంతిమ విశ్లేషణలో శ్రమ ధరపై ఆధారపడే వాస్తవిక విలువలుగా కాక, కార్మికునియొక్క, పెట్టుబడిదారు యొక్క వ్యక్తిగతమైన త్యాగాలుగా పరిగణించడం మొదలైంది. మరోవంక, విలువ, ఒకే చర ఉత్పత్తి వ్యయాల ప్రమేయంగా పరిగణింపబడటం తగ్గి, అనేక చరవ్యయాల ప్రమేయంగానూ, ప్రత్యేకించి ఒక నిర్దిష్ట సరుకు గిరాకీగానూ, కొనుగోలుదారుకు దాని ఉపయోగితగానూ పరిగణింపబడటం అధికమైంది. విలువ, ధరల హెచ్చుతగ్గులకు సహజప్రాతిపదికగా, కేంద్రంగా పరిగణింపబడటం ఆగిపోయింది. ఇప్పుడిక సమస్య అల్లా ధరలకు నేరుగా వివరణ యివ్వడం. మరి ధరలు, అనేక అంశాల ప్రభావం కింద నిర్ణ యింపబడుతాయి, మార్చబడుతాయి.

పెట్టుబడిదారీ లాభాన్ని పెట్టుబడిదారుల "సంయమం" అనబడేదాని ద్వారా వివరించే ప్రయత్నాల వల్ల కూడా రికార్డో సిద్ధాంతాన్ని అపభ్రంశం చేసే మరిన్ని ప్రయత్నాలు జరిగాయి. ఈ భావం ఇంగ్లీషు ఆర్థికవేత్త ఎన్. డబ్లియు. సీనియర్ (1790–1864) పేరుతో సన్నిహితంగా ముడిపడివుంది. లాభం అన్నదాన్ని యంత్రాలు, భవనాలు, పదార్థాలచేత ఉత్పత్తిచెయ్యబడిన ఏదోగా వివరించడం పలువురు ఆర్థికవేత్తలను సంతృప్తి పరచలేదు. తత్పర్యవసానంగా మరో సిద్ధాంతం ప్రతిపాదింప బడింది. దాని ప్రకారం, లాభం పెట్టుబడిదారు "సంయమం"చేత ఉత్పన్నమవుతుంది; పెట్టుబడిదారు తన పెట్టుబడిని వినియోగ వస్తువులపై ఖర్చుపెట్టుకోవచ్చు, కాని అతను అలా చెయ్యకుండా "సంయమం" చూపుతాడు.

ఇద్దరు పెట్టుబడిదారులున్నారనీ, వారిలో ఒక్కొక్కరి దగ్గర 10 వేల పౌనుల చొప్పున పెట్టుబడి వుందనీ అనుకుందాం. మాటవరుసకు, మొదటివాడు తన పెట్టుబడిని బీరుబట్టీమీద మదుపు పెట్టి, తన ఆఫీసులో కూర్చుని, పనిని అజమాయిషీ చేశాడని అనుకుందాం. ఏడాది చివరకు అతనికి 1,000 పౌనుల, లేక తన పెట్టుబడిపై 10 శాతం లాభం వచ్చిందనుకుందాం. రెండవ పెట్టుబడిదారుకు కూడా 10 వేల పౌనుల పెట్టుబడి వుంది. అయితే అతనికి బట్టీకాపు బీరు వాసన గిట్టదు, లేక అజమాయిషీ బాదరబందీ గిట్టదనుకోండి. అయితే అదే సమయంలో, తన డబ్బును ఓ కొత్త యిల్లు, వాహనం మొదలైనవాటిమీద ఖర్చుపెట్టడం అతనికి యిష్టం లేదు. అతను మొదటి పెట్టుబడిదారుకి యీ కింది ప్రతిపాదన చేస్తాడు: "నా 10 వేల పౌనులను కూడా మీ పెట్టుబడికి కలుపుకొని, మీ బీరుబట్టీని పెద్దది చేసుకోండి, నాకు ఏటా దానిమీద 5 శాతం, 500 పౌనులు, యివ్వండి." మొదటి పెట్టుబడిదారు ఒప్పుకుంటాడు. రెండవవాడి పెట్టుబడి కూడా తనదాని మాదిరిగా అదే లాభం రేటును లభింపజేస్తుందనడం స్పష్టం. అయితే, యీ లాభంలో సగం మొత్తాన్ని పెట్టుబడి సొంతదారుకి యిస్తాడు.

"రెండవ పెట్టుబడిదారు తన డబ్బును పైన పేర్కొనబడిన లేక మరే యితర వస్తువుల పైనైనా ఖర్చుపెట్టుకోగలడా?" అని ప్రశ్నిస్తారు "సంయమ" సిద్ధాంత కర్తలు. ఆఁ, ఖర్చు పెట్టగలడు. అయితే అతను సంయమం చూపాడు. ఒక ఏడాది వేచివుండి, తన పెట్టుబడిపై వడ్డీ పొందడాన్ని అతను ఎంచుకున్నాడు, రెండేళ్లు వేచివుండి మరింత వడ్డీ పొందడాన్ని అతను ఎంచుకున్నాడు. (పైగా, పెట్టుబడి చెక్కు చెదరకుండా అలాగే వుండిపోతుంది, తన చిత్తంవచ్చినప్పుడు ఎప్పుడైనా దాన్ని వాడుకోవచ్చు!) అయితే, భవిష్యత్తులో ఎప్పుడోకన్న, యిప్పుడే యిక్కడే వస్తువులను అనుభవించాలని సహజంగా మనిషి కోరుకుంటాడు. భవిష్యత్తులో వాటికోసం యిప్పుడు వస్తు

వులను త్యాగంచెయ్యడం ద్వారా, మన పెట్టుబడిదారు త్యాగం చేస్తున్నాడు, తద్వారా ఒక ప్రతిఫలానికి హక్కును సంపాదించుకుంటున్నాడు.

మరి, మొదటి పెట్టుబడిదారు సంగతి ఏమిటి? తన బీరుబట్టీని అమ్మివేసుకొని, అతను కూడా ఆ డబ్బును ఖర్చు పెట్టుకోగలడు. అయినా, అతను అలా చెయ్యడు, అందుచేత, సరిగా అలాంటి ప్రతిఫలాన్నే పొందే హక్కు అతనికి కూడా సంక్రమిస్తోంది. అయితే అతనికి, తన సహ పెట్టుబడిదారుపైన ఒక అనుకూల పరిస్థితి వుంది. బీరును తను "స్వయంగా" కాచడమే అది. ఈ అజమాయిషీ, మేనేజిమెంటు, మార్గదర్శకత్వాల కోసం అతను వినియోగిస్తున్న శ్రమకు అతనికి వేతనం ముట్టవలసివుంది. అందుచేత అతనికి వాస్తవంలో ముట్టుతున్నది 1,000 పౌనుల లాభం కాదు, అతని పెట్టుబడిపైన అతనికి రెండు రకాల ఆదాయాలు లభిస్తున్నాయి: సంయమానికి ప్రతిఫలంగా 500 పౌనుల వడ్డీ, మేనేజిమెంటు వేతనంగా మరో 500 పౌనులూ.

ఒక ఆర్థిక భావాభివర్గంగా లాభం యిక్కడ పూర్తిగా అదృశ్యమైపోతుంది. ఆల్‌ఫ్రెడ్ మార్షల్ త్రయం (శ్రమ, పెట్టుబడి, భూమి) స్థానంలో ఒక అర్ధ శతాబ్దం తర్వాత, నాలుగు అంశాల కలయిక నొకదాన్ని: శ్రమ – వేతనం, భూమి – కౌలు, పెట్టుబడి – వడ్డీ, "ఆర్గనైజేషన్" – నిర్వహణ ఆదాయం ప్రవేశపెట్టాడు. దీనిలో ఒక విధమైన తర్కబద్ధత కనిపిస్తుంది. అంత బాగా సభ్యంగా కనిపించని "సంయమం" ("abstinence") అన్న మాట స్థానంలో (చూశారా, లక్షాధికారి, తన డబ్బును ఖర్చుపెట్టకుండా సంయమం వహించి, తన అవసరాలను పూర్తిగా తీర్చుకోడు!) మరింత సభ్యంగా వుండే "నిరీక్షణ" ("waiting") అన్న మాటను ప్రవేశపెట్టాడు. అదే సమయంలో కొత్త, వ్యక్తిపర ఉపాంత సిద్ధాంతాల ప్రాతిపదికపైన, వాటిలో ప్రతి ఒక అంశానికీ ప్రతిఫలం ఏవిధంగా నిర్ణయింపబడినదీ వివరించేందుకుగాను ప్రయత్నాలు చెయ్యబడ్డాయి. ఇతర అర్థశాస్త్రవేత్తలు పెట్టుబడికి సంబంధించిన మరొక అంశమైన "రిస్క్"నూ, దానికి అనురూపంగా పెట్టుబడిదారుకు మరో ప్రతిఫలాన్ని, అంటే రిస్కును తీసుకున్నందుకు ఒక రకమైన చెల్లింపునూ బయటకు తీశారు. రిస్కుకి ప్రతిఫలం అన్నది ఋణవడ్డీ కాతా కిందకి వస్తుందా లేక నిర్వహణ ఆదాయం కాతా కిందకి (లేక రెండు కాతాల కిందకీ) వస్తుందా అన్న సమస్య యీనాటికీ యింకా వివాదాంశంగానే వుంది.

మార్క్సు యీ సమస్యను ఎలా పరిష్కరించాడు? వడ్డీ, నిర్వహణ ఆదాయాలుగా లాభాన్ని విభజించడమన్నది వాస్తవికమైనదే, ఋణాభివృద్ధితో యీ విషయం అధికతర ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. తత్పర్యవసానంగా తన సొంత పెట్టుబడిని వినియోగిస్తున్న పెట్టుబడిదారు లాభాన్ని రెండు భాగాలుగా విభజిస్తాడు: పెట్టుబడిగా

పెట్టుబడియొక్క ఫలితం (మార్క్స్ దీన్ని పెట్టుబడి ఆస్తి అన్నాడు), నేరుగా ఉత్పత్తిలో వినియోగింపబడిన పెట్టుబడి ఫలితం (పెట్టుబడి – దాని క్రియ). అయితే, యీ రెండు రూపాల్లోనూ పెట్టుబడి – సంయమం ద్వారా గాని, శ్రమ ద్వారా గాని – విలువను సృష్టిస్తుందనీ, న్యాయబద్ధంగా తను సృష్టించే భాగాన్ని సొంతపరచుకొంటుందనీ దీని అర్థం కాదు. పెట్టుబడికి గల యీ ద్వంద్వ స్వభావం, పెట్టుబడి చేత శ్రమ దోపిడికీ, అదనపు విలువ ఉత్పత్తికీ ఆవశ్యకమైన ఒక షరతు. అదనపు విలువ సృష్టింపబడి, పోటీ క్రమం ద్వారా సగటు లాభంగా మార్చబడినప్పుడు, పెట్టుబడి సొంతదారులకూ, దాన్ని ప్రత్యక్షంగా వినియోగిస్తున్న పెట్టుబడిదారులకూ (వీళ్లు ఒకళ్లే కాకపోతే) సగటు లాభపు పంపకం సమస్య ఉదయిస్తుంది. అయితే యీ సమస్య ఒక దృక్కోణంనుంచి మాత్రమే ముఖ్యమైనది: యీ రెండు రకాల పెట్టుబడిదారులూ కార్మికుల చెల్లింపబడని శ్రమ ఫలితాలను తమ మధ్య ఎలా పంచుకుంటారు.

లాభాన్ని రుణాలపై వడ్డీగానూ, "మేనేజిమెంటు వేతనం" గానూ కుదించవచ్చునన్న ప్రధాన ప్రతిపాదన జాయింట్ స్టాక్ కంపెనీల ఆచరణ ద్వారా తప్పని నిరూపింపబడింది. అవి రుణంగా తీసుకున్న పెట్టుబడిపై వడ్డీని చెల్లిస్తాయి, వాటాదార్లకు డివిడెండ్లు చెల్లిస్తాయి (యిది కూడా ఒకరకం వడ్డీయే), ఉత్పత్తి, అమ్మకాలు మొదలైన విభాగాల నిర్వహణకోసం పనిలో పెట్టుకున్న మేనేజర్లకు చాలా పెద్ద జీతాలు చెల్లిస్తాయి. అయితే, యివి పోను వాటిదగ్గర పంచబడని లాభం వుంటుంది, అది సంచయవార్థం వినియోగింపబడుతుంది. ప్రభుత్వానికి చెల్లింపబడే పన్నులను గురించి నేనిక్కడేమీ ప్రస్తావించను. పంచబడని లాభం కోసమూ, పన్నుల కోసమూ డబ్బు ఎక్కడినుంచి వస్తుందన్న విషయాన్ని బూర్జువా లాభ సిద్ధాంతాల దృక్కోణంనుంచి వివరించడం కొంత కష్టమే.

జాన్ స్ట్యువర్ట్ మిల్

1850, 1860 దశకాల్లో ఇంగ్లండు తన ఆర్థిక రాజకీయాధికార శిఖరాన్ని అందుకుంది. బూర్జువావర్గం యీ సౌభాగ్య ఫలితాలను కార్మికవర్గంతో పంచుకోగలగడమే కాక పంచుకోవలసివచ్చింది. ప్రత్యేకించి, ఇంగ్లండుయొక్క సాపేక్ష అమిత జనాభా ఒత్తిడి, వలస కారణంగా కొంత తగ్గడమే యిందుకు కారణం. ఇది ప్రధానంగానూ, "కార్మిక కులీనవర్గం" అనబడే, కార్మికవర్గంలోని నైపుణ్యం కలిగిన బృందాలకు సంబంధించినది. ఆ శతాబ్ది చివరినాటికి పని పరిస్థితులు మెరుగయ్యాయి, మొత్తంగా

శ్రామికవర్గపు జీవన ప్రమాణం కూడా పెరిగింది. వరుసగా కొన్ని ఫ్యాక్టరీ చట్టాలు చెయ్యబడ్డాయి, ట్రేడ్ యూనియన్లు చట్టబద్ధం గావించబడి, త్వరలోనే అవి గణనీయమైనంత శక్తిని పుంజుకున్నాయి. అయితే, శ్రామికవర్గపు వర్గపోరాటం అంతకంతకు అధికంగా శుద్ధ ఆర్థిక ప్రయోజనాలను సాధించుకొనే రంగంగా తయారైంది. బూర్జువా వర్గానికి మొత్తంమీద యిది అనువుగా పరిణమించింది.

కార్మికవర్గంపట్ల అనుసరింపబడే విధానం కూడా, పాలకవర్గాల మధ్యా, వాటి పక్షాల మధ్యా పోరాటాలచేతా, ఆ శక్తుల పొందికలచేతా నిర్ణయింపబడుతూండేది. ఉదారవాద బూర్జువావర్గపు పలువురు ప్రతినిధుల దృష్టిలో యిది, మానవత్వ ప్రగతుల శాశ్వత లక్ష్యాల సాధనకోసం, యీ ప్రగతినీ, స్వేచ్ఛాసహనాలనే శాశ్వత విలువలనూ సాధించే నిమిత్తం సమాన హక్కులు అనుభవించేవారి మధ్య పొత్తుకోసం జరిగే పోరాటం. జాన్ స్ట్యూవర్ట్ మిల్ మనస్తత్వాన్నీ, అయన విద్యా, సామాజిక కార్యకలాపాలనూ దీన్నిబట్టి వివరించవచ్చు. హృదయ రహితమైన డబ్బు ప్రపంచం ఆయనకి ఎంతమాత్రం నచ్చలేదు. అయితే, ప్రపంచపు యీ చీకటి పార్శ్వాలు కాలక్రమంలో అంతర్హితమవుతాయని ఆయన ఆశించాడు. సోషలిజంలో – అయితే, విప్లవమూ, వర్గపోరాటమూ లేని పరిణామ సోషలిజంలోనే – ఆయన ఆసక్తి చూపాడు. మిల్, "మధ్యే మార్గ గమన" భావ ప్రతిపాదకుడుగా, నిపుణుడైన రాజీవాదిగా, పృథక్కకలవాదిగా పరిణమించాడు. పెట్టుబడి అర్థశాస్త్రాన్ని, యికనెంత మాత్రమూ అలక్ష్యం చెయ్యజాలని కార్మికవర్గపు హక్కులతో సమన్వయించేందుకు ఆయన ప్రయత్నించాడు.

మిల్ వ్యక్తిత్వంలో ఆసక్తిగొలిపే విషయాలు లేకపోలేదు. తత్వవేత్తా, ఆర్థికవేత్తా, రికార్డో మిత్రుడూ అయిన జేమ్స్ మిల్ పెద్ద కొడుకైన స్ట్యూవర్ట్ మిల్ లండనులో 1806లో జన్మించాడు. నిష్ఠురత అనిపించేటంత నిక్కచ్చితనం, పిడివాదం అనిపించేటంత సూత్రబద్ధతా కలిగిన జేమ్స్ మిల్‌కి, పిల్లల పెంపకం విషయంలో తన సొంత పద్ధతి వుంది. దాన్ని ఆయన తన కొడుకు పెంపకంలో అమలుజరప నిశ్చయించుకున్నాడు. కుర్రవాడి "పని దినం" కచ్చితంగా నియంత్రితం చెయ్యబడింది. ఎనిమిదవ ఏటికల్లా అతను చదివిన పుస్తకాల జాబితా విభ్రాంతి గొలుపుతుంది. ఆటబొమ్మలుగాని, కథలుగాని, యితర పిల్లలతో ఆటపాటలుగాని విషిద్ధం. తన తండ్రితో షికార్లకు వెళ్ళాలి, షికార్లక్రమంలో అతను చదివిన గ్రంథాలపై పరీక్ష జరుగుతుంది. ఆటుతర్వాత తన తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు పాఠాలు చెప్తూండేవాడు. అతని ఆటలనుకున్నా, పాటలనుకున్నా, తోటి పిల్లలతో సాంగత్యం అనుకున్నా యింత మాత్రమే. ఆ కుర్రాడు ఒక బాలమేధావిగా పరిణతి చెందాడు. అతని పరిజ్ఞానం, అతని తండ్రి స్నేహితులనూ, పరిచితులనూ అబ్బురపరుస్తూవుండేది. త్వరలోనే పుస్తకాలు చదివే అలవాటూ, మేధా

కార్యకలాపాలూ అతని స్వభావంలో ఒక భాగం అయిపోయాయి. ఉన్నత గణిత శాస్త్రాన్నీ, ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలనూ అతను స్వయంగా అధ్యయనం చేశాడు. అయితే అతనికి అభిమానపాత్రమైన అధ్యయనాంశం చరిత్ర. ప్రాచీన, అధునాతన రచయితల రచనలను వివరిస్తూనూ, విమర్శిస్తూనూ అతను వ్యాసాలు రాశాడు. అయినా, అతని తండ్రి క్రమశిక్షణ కచ్చితత్వం పెరిగిందేగాని, తరగలేదు. జేమ్స్ మిల్, ఆ కుర్రవాడు పరిణతమైన, స్వతంత్రమైన ఆలోచన కలిగినవాడు కావాలని పట్టుబట్టాడు. కుర్ర వాడికి పరిష్కార సాధ్యం కాని కర్తవ్యాలను యివ్వడమంటే జేమ్స్‌కి సరదాగా వుండేది. తన కొడుకు ఎప్పుడూ కూడా, తనకు తెలిసిందీ, తను అర్థంచేసుకున్నదీ చాలా తక్కు వనీ, తన సామర్థ్యం పరిమితమైనదనీ అనుకోవాలి. అతని కొడుకు నిజంగానే అలా అను కున్నాడు. పరాయి పిల్లల సాంగత్యం, సమవయస్కులతో పరిచయం దాదాపు బొత్తిగా లేకపోవడమే అతను అలా భావించడానికి కారణం. దరిమిలా విశాల ప్రపంచంలోకి వెళ్లి నప్పుడు మాత్రమే, తన ఆధిక్యతనూ, విషాదకరమైన లోపాలనూ అతను గుర్తించ గలిగాడు.

పదమూడవ ఏట బాల మిల్, తన తండ్రితో కలిసి అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. అతని తండ్రి అతనికి లెక్చర్లు యిచ్చాడు. వాళ్లిద్దరూ సంక్లిష్ట సమస్యలపై సవివరమైన చర్చలు జరిపారు. తర్వాత ఆ కుర్రాడు వ్యాసాలు రాశాడు. జాన్ స్టూవర్ట్ మిల్, తర్వాత తన స్మృతుల్లో యిలా పేర్కొన్నాడు: "మా నాన్నగారి అధ్య యనంలో నేను ఎప్పుడూ పాల్గొంటూ వుండిన కారణంగా, ఆయన మిత్రుల్లోకెల్ల అత్యంత ప్రీతి పాత్రుడైన డేవిడ్ రికార్డోగారితో నాకు పరిచయ భాగ్యం కలిగింది. తన ఉదార స్వభావం, దయార్ద్ర బుద్ధి కారణంగా ఆయన యువజనులను విశేషంగా ఆకర్షించేవాడు. నేను అర్థశాస్త్ర విద్యార్థినైన తర్వాత, నన్నాయన తన యింటికి ఆహ్వానించి తనతోబాటు షికార్ల సమయంలోనూ యీ అంశంపై సంభాషించాడు."*

మిల్ 1822లో అర్థశాస్త్రంపై తన మొదటి రచనలను ప్రచురించాడు. అవి విలువ సిద్ధాంతంపై రాయబడిన రెండు చిన్న వ్యాసాలు. అతను రాజకీయాల్లో రాణిం చాలని కలలుగన్నాడు. కాని అతని తండ్రి అందుకు భిన్నంగా నిర్ణయించాడు. మరుసటి ఏడాది అతను, తన తండ్రి నిర్వహణలో వున్న ఈస్ట్ ఇండియా కంపెనీలో, అతి చిన్న గుమాస్తా ఉద్యోగంలో చేరి, క్రమంగా ఉన్నత పదవుల్లోకి ఎగబాకసాగాడు. మొదట్లో ఆఫీసు పని, అతని ముమ్మర మేధాకృషికి పెద్దగా ఆటంకం కాలేదు. రోజుకు పద్నాలుగు గంటలు పనిచేసే అలవాటున్న కారణంగా, అతను తన చదువునూ రాతనూ, తన

* J. S. Mill, *Autobiography*, London, 1940, p. 45.

కోసం, ప్రచురణార్థం కొనసాగించాడు. తన తమ్ముళ్లకూ, చెల్లెళ్లకూ చదువు చెప్తూండే వాడు. మిల్, తనని తాను, ఒక ఆలోచనా యంత్రం అని పిలుచుకున్నాడు. అయితే, ఆ సాంద్రీకృత మేధా వాతావరణం జీవితం, భావావేశాలు, కోర్కెలు, అనుభూతుల సహజ ప్రపంచపు స్థానాన్ని భర్తీచేయలేకపోయింది. ఫలితం ఏమిటంటే, మానసికంగా కుంగిపోవడం, చిత్త భ్రమ, ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలూ.

1830లో ఆయనకి శ్రీమతి హరియెట్ టేలర్‌తో పరిచయం ఏర్పడింది. ఒక లండన్ వ్యాపారస్తుని భార్యయైన హరియెట్ అందమైనదీ, తెలివైనదీ, యిద్దరు బిడ్డల తల్లీ. శ్రీమతి టేలర్‌తో పరిచయ, స్నేహాలు మిల్‌లోని విషాద తిమిరాన్ని పారదోలాయి. మిల్ సహాయ భాగస్వామ్యాలతో, ఆలోచనాపరులూ, ఉదారధోరణి కలిగినవాళ్లతో కూడిన ఒక బృందం ఆమె చుట్టూ జేరారు. హరియెట్ టేలర్ క్రమంగా మిల్‌కి అత్యంత సన్నిహిత సహాయకురాలూ, ఆయన తొలి పాఠకురాలూ, ఆయన రచనల విమర్శకురాలూ అయింది.

1830 దశకంలో మిల్ ఒక రాజకీయ పత్రికను ప్రచురించాడు. ఆ పత్రిక తాత్విక తీవ్రవాదులకు, అప్పట్లో పార్లమెంటులోని అత్యంత వామపక్షానికి చెందిన విగ్గుల బృందానికి వాణిగా వుండేది. 1843లో ఆయన రచనల్లోకెల్లా మిక్కిలి ముఖ్యమైన తాత్విక రచన అయిన "ఒక తర్క విధానం," 1844లో "అర్థశాస్త్రపు కొన్ని అపరిష్కృత సమస్యలపై వ్యాసాలు" ప్రచురింపబడ్డాయి. ఈ రెండవ పుస్తకంలో ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి మిల్ చేర్చిన మౌలిక భావాలు యిమిడి వున్నాయి. కాగా, ఆయన బృహద్గ్రంథం "అర్థశాస్త్ర సూత్రాలు" (1848) కేవలం నిపుణంగా చేసిన ఒక కూర్పు మాత్రమే. అయినాకూడా, లేక బహుశా సరిగా అందువల్లనేనేమో, మిల్ పుస్తకం సాటిలేని విజయం పొంది, ఆయన జీవితకాలంలో ఏడు ముద్రణలు పొంది, చాలా భాషల్లోకి అనువదింపబడింది.

తన భర్త మృతి కారణంగా హరియెట్ టేలర్ 1851లో మిల్‌ని వివాహం చేసుకోవడం సాధ్యమైంది. ఆమె మరో ఎనిమిదేళ్లే జీవించింది. ఆ ఎనిమిదేళ్లూ శ్రీమతి మిల్ తీవ్రమైన వ్యాధితో పీడింపబడింది. మిల్ ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే వుండేది. అయినా ఆయన ఆత్మత్యాగానికీ, జితేంద్రియత్వానికీ ఆదర్శప్రాయుడుగా ఉండేవాడు. మిల్ "ఆత్మ కథ," ఆయన లేఖలు, ఆయన్ని ఎరిగున్నవారు ఆయన గురించి రాసిన స్మృతులూ పాఠకులలో పరస్పరం విరుద్ధమైన భావావేశాలను రేకెత్తిస్తాయి. ఆయన బలహీన వ్యక్తి, బహుశా పెంపకమూ, ఆయన తండ్రి దార్ష్ట్యక స్వభావమే అందుకు కారణమైవుండవచ్చు. నిజానికి, యిరవై ఏళ్లపాటు ఆయన జీవితం నిరంతరాయమైన, ఒక్కొక్కమారు బాధాకరమూ, అవమానకరమూ

అయిన రాజీగా సాగింది. సమాజపు సూత్రాలను ఆయన సవాలుచేశాడు, అదే సమయంలో వాటిని తీవ్రంగా అతిక్రమించేందుకు యిష్టపడేవాడు కాడు. మిల్ వ్యక్తిత్వమంతట్లోకీ యిదే మిక్కిలి విశిష్టమైన లక్షణం. అధ్యయన, రాజకీయ రంగాల్లో మాదిరిగావే వ్యక్తిగత జీవితంలో కూడా, మిల్ యిబ్బందులను ఎదుర్కొని, వాటిని ఒకేఒక్క దెబ్బతో పరిహరించలేకపోయేవాడు. ఉష్ట్రపక్షి తన తలను యిసుకలో దాచుకొని గడిపిన మాదిరిగా జీవితం గడపడం మేలని ఆయన అనుకునేవాడు. ఆయన తన ప్రత్యేక, వివిక్త మేధా ప్రపంచాన్ని సృష్టించుకొని, మొత్తంమీద దానిలో శాంతియుతంగా గడపగలిగేవాడు. కార్లైల్ ఒక సందర్భంలో పేర్కొన్నట్లు, మిల్ తనను తాను సంతోషపరుడినని భ్రమచెందిన దుఃఖభాజనుడు.

మరోవంక, మిల్ నైతిక నడవడి కొంత గౌరవభావాన్ని రేకెత్తించకమానదు. ఆయన ఉన్నత సూత్రబద్ధుడు, తన పద్ధతిలో తను క్రమబద్ధంగా బతికినవాడు. మిల్, హారియెట్ టేలర్‌లు నైతిక నియమాలకు కట్టుబడని సాహితీ బృందానికి గాక, విక్టోరియన్ యుగానికి చెందిన గౌరవనీయ బూర్జువా సమాజానికి చెందిన వాళ్లనీ, అది "సభ్య ప్రవర్తన" వ్యతిక్రమాన్ని క్షమించదనీ గుర్తుంచుకోవడం అవసరం.

సిపాయిల తిరుగుబాటు అనంతరం భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారాన్ని ఇంగ్లీషు ప్రభుత్వమే చేబట్టిన ఫలితంగా, 1858లో మిల్ ఆ కంపెనీ పని చాలించుకున్నాడు. ఆ కంపెనీ రద్దుచెయ్యబడింది. తదుపరి సంవత్సరాల్లో మిల్ కొన్ని రాజకీయ, తాత్విక రచనలను ప్రచురించాడు. "అర్థశాస్త్ర సూత్రాలు"యొక్క కొత్త ముద్రణలను పరిగణనలోకి తీసుకోకపోయినట్లయితే, ఆయన అర్థశాస్త్రానికి స్వస్తిచెప్పినట్లే. "స్వేచ్ఛను గురించి" అన్న పుస్తకంలో బూర్జువా ప్రజాస్వామ్య భావాలనూ, "స్త్రీల పరాధీనత" అన్నదానిలో స్త్రీల హక్కులను గురించిన భావాలనూ ఆయన అభివృద్ధిచేశాడు. కొన్ని సంవత్సరాల పాటు ఆయన పార్లమెంటు సభ్యుడుగా వున్నాడు. ఒక ఎన్నికలో ఓడిపోయిన తర్వాత ఆయన ఫ్రాన్సుకు వెళ్లిపోయి, 1873లో అవిన్యోన్‌లో మరణించాడు.

రాజీవాద అర్థశాస్త్రం

తన "పెట్టుబడి" గ్రంథపు మొదటి సంపుటంలో, పెట్టుబడిదారీ విధానంలో పంపిణీయొక్క అన్యాయాన్ని గురించి మిల్ వివరించిన భాగాన్ని ఉదహరించి, మార్క్స్ యిలా పేర్కొన్నాడు: "ఇక్కడ ఒక అపార్థాన్ని దూరంచెయ్యవలసివుంది. జాన్

స్ట్యువర్ట్ మిల్ వంటి వారిలో ఒకవంక సాంప్రదాయిక అర్థశాస్త్రపు పిడివాద భావాలూ, వాటి ఆధునిక ధోరణులూ కలగాపులగంగా వున్నాయి. అందుకు వారిని తప్పు పట్టినప్పటికీ, వాళ్లనీ, అపభ్రంశ అర్థశాస్త్రపు సమర్థకులనూ ఒకే గాటన కట్టడం ఘోరమైన పొరపాటే అవుతుంది."*

స్మిత్, రికార్డోలు నెలకొల్పిన సూత్రాలను అనుసరించిన మేరకూ, బూర్జువా వర్గాన్ని మెప్పించేందుకుగాను వాస్తవిక క్రమాలను వక్రీకరించకుండా బుద్ధిపూర్వకంగా కృషిచేసిన మేరకూ మిల్ శాస్త్రీయ దృష్టి ప్రదర్శించాడు. అయితే ఆయన సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తల భావాలను అభివృద్ధిచెయ్యలేదు. తద్భిన్నంగా వాటిని ఆయన, అపభ్రంశ ఆర్థిక వ్యవస్థయొక్క ప్రస్తుత స్థాయికి అనుకూలంగా మలిచాడు. ఆయనపైన మాల్తస్, సేయ్, సీనియర్‌ల గట్టి ప్రభావం వుంది. ఈ సందర్భంగా మార్క్సు, మిల్ పృథక్కలవాదాన్ని గురించీ, ఆయన రచనల్లో ఒకే రకమైన సుసంగతమైన శాస్త్రీయ దృక్పథపు లోపాన్ని గురించీ పేర్కొని, మిల్ రచనలను "బూర్జువా అర్థశాస్త్రపు దివాళాకోరుతనం"గా అభివర్ణించాడు. పెట్టుబడి ప్రయోజనాలను కార్మికవర్గపు డిమాండ్లతో సమ్మిళితం చేయ ప్రయత్నించిన "రాజీవాద అర్థశాస్త్రానికి" పరిణతమూ, కచ్చితమూ అయిన రూపాన్ని యిచ్చాడు మిల్.

మిల్ "అర్థశాస్త్రపు సూత్రాల" ముఖ్యలక్షణం ఏమిటంటే, ఆర్థిక విజ్ఞాన శాస్త్రాన్ని మొత్తంగా సింహావలోకనంచేస్తూ 19వ శతాబ్ది మధ్య కాలంలో వెలువడిన పుస్తకాలన్నింటిలోకీ అత్యుత్తమమైనది కావడమే. 1890లో మార్షల్ "అర్థశాస్త్రపు సూత్రాలు" వెలువడేదాకా, అదే, బూర్జువా అర్థశాస్త్రపు అత్యంత ప్రామాణిక వివరణగా వుంది. కార్మికవర్గంపట్ల ఒక మోస్తరు సానుభూతిని ప్రకటించి, డబ్బు ఆరాధనను ఖండించి, సోషలిజాన్ని తెగనాడని ఒకానొక రచన బూర్జువావర్గపు మతసిద్ధాంతం అవడాన్ని, షుంపేటెర్ విక్టోరియన్ యుగపు స్వేచ్ఛాభావ వికాసంగా ప్రస్తుతించాడు. మిల్ పుస్తకంలోని అతి ముఖ్యాంశం ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించాడన్నది కాక, దానిలో ఆయన మెరుగుదలకూ, బూర్జువావర్గాన్ని దెబ్బతియ్యని ఒక మాదిరి పరిణామాత్మక సోషలిజపు శాంతియుతాభివృద్ధికీ అవకాశాన్ని చూడటం. బూర్జువావర్గానికి మిక్కిలి కరడుగట్టిన ఛాందసులూ, పెట్టుబడిదారీ విధానపు సూటి సమర్థకుల కన్న — వీరు చాలమందే వున్నారు — బహుశా జాన్ స్ట్యువర్ట్ మిల్ చేసిన సేవయే మరింత ఎక్కువ. 28వ శతాబ్దపు బ్రిటిష్ లేబరు ఉద్యమపు ఆర్థిక, సామాజిక భావాలకు మిల్ ఆద్యుడు.

---

* Karl Marx, *Capital*, Vol. I, p. 572.

1820 దశకం తర్వాత బూర్జువా అర్థశాస్త్రం రెండు ప్రధాన వాహినులుగా చీలిందన్న భావాన్ని మార్క్స్ తరచుగా పేర్కొంటూ వచ్చాడు: ఒక వంక బాహాటమైన సమర్థన, రెండో వంక, "పెట్టుబడి దైవాంశ హక్కుకీ," కార్మికుల ప్రయోజనాలకూ నడుమ మధ్యేమార్గాన్ని కనిపెట్టే ప్రయత్నాలు. ఈ ధోరణులు ఒక్కమాదిరివే కావు. రెండవ ధోరణి వస్తుపరమైన శాస్త్రీయ పరిశీలనకు కొన్ని అవకాశాలను సమకూరుస్తుంది. సంస్కరణవాద కార్యక్రమాల ఆవశ్యకతా నిరూపణకు యీ పరిశీలన ఆవశ్యకం కూడా కావచ్చు.

"అపభ్రంశ అర్థశాస్త్ర" భావనను మార్క్స్, ఉత్పత్తి అంశాల (రోసిపోయిన అంశత్రయ) సిద్ధాంతంతోనూ, వేతనాలు, లాభాలు, కౌళ్లను సహజ ఫలితంగానూ, బహుమతిగానూ, పెట్టుబడిచేత వేతన శ్రమయొక్క దోపిడీతో బొత్తిగా సంబంధం లేనివిగా పరిగణించి, ఆదాయాలను వర్ణించే సిద్ధాంతంతోనూ సన్నిహితంగా ముడిపెట్టాడు. ఈ సందర్భంగా సోవియట్ నిపుణులు, "అదనపు విలువ సిద్ధాంతాలు" కొత్త ముద్రణను సన్నద్ధం చేసే క్రమంలో, యీ సమస్య పరిశీలనకు సంబంధించిన మార్క్స్ రాతప్రతి భాగాలను "ఆదాయాలు, వాటి మూలాధారాలు. అపభ్రంశ అర్థశాస్త్రం" అన్న శీర్షికతో మూడు సంపుటాల ముద్రణ చివర చేర్చారు. మార్క్స్ ప్రత్యేకించి యిలా రాస్తాడు: "నిజానికి, అపభ్రంశ అర్థశాస్త్రజ్ఞులు — మనం పరిశీలిస్తున్న ఆర్థిక పరిశీలకులతో వీళ్లని ఎంతమాత్రం కలగాపులగం చెయ్యరాదు — పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన ప్రతినిధుల భావనలనూ, సంకల్పాలు మొదలైనవాటినీ అనువదిస్తారు. ఈ ఉత్పత్తి విధానానికి గులాములైన యీ ప్రతినిధుల చైతన్యంలో దాని బాహ్య రూపం మాత్రమే ప్రతిబింబితమైంది."* అయితే, ఆదాయాలు, వాటి మూలాధారాల సమస్యకు ఎంతటి నిర్ణయాత్మక ప్రాముఖ్యం వున్నా కూడా, అర్థశాస్త్రం దీని ఒక్కదానికే కుదింపబడజాలదు. సంచయనం, వినిమయం, సంక్షోభాలు, ప్రభుత్వపు ఆర్థిక పాత్ర వంటి సమస్యలు ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో అధికతర ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన అనేక రంగాల కచ్చితమైన అధ్యయనావసరం ఏర్పడింది. ఆదాయాలపైన అపభ్రంశ దృక్పథాన్నే మిల్ మౌలికంగా కలిగి వున్నాడు. అయితే, ఆయన అభిప్రాయాలను యీ ఒక్కదానికే పరిమితం చెయ్యరాదు.

ఆయన ప్రధాన ఆర్థిక రచనలో ఐదు పుస్తకాలు (భాగాలు) వున్నాయి. వాటిలో వరుసక్రమంలో ఉత్పత్తి, పంపిణీ, మారకం, పెట్టుబడిదారీ విధానాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో రాజ్యపు పాత్ర అన్న అంశాలు పరిశీలింపబడ్డాయి. అవన్నీ కూడా చక్కని

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, p. 453.

ఇంగ్లీషులో, స్పష్టంగా, తార్కికంగా, సాఫీగా రాయబడ్డాయి. మరీ సాఫీగా! రికార్డో లోని ప్రతిభావంతమైన వైరుధ్యాలు వీటిలో ఏమీ లేవు. భిన్న దృక్కోణాల పృథక్కరణలాల కూర్పుకి మాత్రమే యిక్కడ ప్రయత్నం జరిగింది.

రికార్డో, స్మిత్‌లు ఏ విలువ సిద్ధాంతంతోనైతే తమ పుస్తకాలను మొదలు పెట్టారో, ఆ విలువ సిద్ధాంతం యిక్కడ మూడో భాగానికి నెట్టివెయ్యబడింది. ఇది యాదృచ్ఛికమైనదేమీ కాదు: శ్రమ విలువ సిద్ధాంతాన్ని మిల్ లాంఛనప్రాయంగా తిరస్కరించకపోయినప్పటికీ, అది ఆయన ఆర్థిక బోధనకు ప్రాతిపదిక ఎంత మాత్రమూ కాదు.* మిల్ విధానంలో ఉత్పత్తిగా ఉత్పత్తితో విలువ ఎక్కువ సంబంధం కలిగివుండదు; మారకం, చలామణీల రంగంలో పట్టినే అదొక విషయం మాత్రమే. విలువ కేవలం, యితర సరుకులకు, ప్రత్యేకించి, డబ్బుకు ఒక నిర్దిష్ట సరుకు మారకానికి విశిష్టమైన ఒక సంబంధం మాత్రమే. ఈ సంబంధం మార్కెట్లో స్థిరపడుతుంది.

పెట్టీనుండి రికార్డోదాకా బూర్జువా ప్రామాణిక గ్రంథాలు యీ సమస్యను కొంచెం యించుమించుగా యిలా పరిగణించాయి: మారకపు విలువల, ధరల అంతిమ ప్రాతిపదిక శ్రమ వ్యయమే. ఇతర అన్ని అంశాలూ పనిచెయ్యడమన్నది, యీ ప్రాతిపదికనుంచి ఏదో ఒక పెడమార్గాన్ని సృష్టిస్తుంది. మిల్ ఆచరణలో ధరల అంతిమ ప్రాతిపదికను తోసిపారేశాడు. మిల్ ఆలోచనలో రికార్డో ఆలోచనా వాహిని యీకింది విషయంలో కనిపిస్తుంది: ఉత్పత్తి ఖర్చుల ద్వారా ధరల నిర్ధారణను ప్రాతిపదిక వస్తు బాహుళ్యానికి వర్తింపజెయ్యవచ్చుననుకోవడమే అది. ఈ వస్తువులు "సహజంగానూ, శాశ్వతంగానూ ఒకటి మరొకదానికి మారకం అవుతాయి. వాటిని ఉత్పత్తిచెయ్యడానికి చెల్లించవలసిన తరతమ వేతనాల మొత్తానికి అనుగుణంగానూ, ఆ వేతనాలను చెల్లించే

---

* మిల్ అవలంబించిన వివరణ రూపం, ఆధునిక ఆంగ్లో-అమెరికన్ అర్థికశాస్త్ర పాఠ్యగ్రంథాలదాకా మనకి కనిపిస్తుంది. పి. శామ్యుయెల్‌సన్ పాఠ్యగ్రంథ నిర్మితి యిలా ఉంది: మొదటి రెండు భాగాల్లోనూ సాధారణ "ఉత్పత్తి సిద్ధాంతం" వుంటుంది. వాటిలో దాని పెరుగుదలకు సంబంధించిన అంశాలు చర్చింపబడతాయి. మూడవ భాగంలో మాత్రమే విలువ సమస్య ప్రవేశపెట్టబడింది. అదైనా, "ధర నిర్మితి" అన్న ముసుగులో గంభీతంగా చర్చింపబడింది. సహజంగానే యిక్కడ శ్రమ విలువ సిద్ధాంతపు చిన్నెలు లేవు. అయితే, ధర ఏర్పాటు అంశాలు మటుకు మిల్ పద్ధతిలోనే పరిశీలింపబడ్డాయి; తదుపరి విశ్లేషణ పద్ధతి ఉపయోగింపబడిన మాట నిజమేననుకోండి: ధరల అంతిమ ప్రాతిపదిక పరిశోధనను తిరస్కరించడం, దాని స్థానంలో గిరాకీ, సప్లయ్‌లతో సంబంధం కలిగి పనిచేసే పలు అంశాలను ప్రవేశపెట్టడం. యిదే ఆ కొత్త పద్ధతి.

పెట్టుబడిదారులు పొందవలసిన తరతమ లాభాల మొత్తానికి అనుగుణంగానూ అవి అలా మారకం అవుతాయి."*

రికార్డోయొక్క అత్యంత సన్నిహిత శిష్యుల్లో కొందరు విలువను ఆ మాదిరిగా పరిగణించడం ద్వారా చిక్కుకున్న పద్మవ్యూహాన్ని తప్పించుకొనే ప్రయత్నంలో, మిల్ దాన్నుండి వైదొలగి, సరుకుయొక్క మారకపు విలువ (అలాగే ధరా) కేవలం సప్లయ్ గిరాకీలు సమానమైన బిందువు దగ్గర నిశ్చయింపబడుతుందన్న నిర్ణయానికి చేరుకున్నాడు. ఒకానొక సరుకు సప్లయ్‌ని నిర్ణయించడంలో ఖర్చులను అత్యంత ముఖ్యాంశంగా పరిగణించాలని వాదించడం ద్వారా మిల్ ఆ రెండు వైఖరులనూ పొసిగించేందుకు ప్రయత్నించాడు.

ఇంతకు ముందే పేర్కొన్నట్లు, విలువయొక్క పృథక్శకల అవగాహనను తదుపరి బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు జీర్ణం చేసుకొన్నారు. ధరల అంతిమ ప్రాతిపదిక ఏమిటని ఆర్థికశాస్త్ర ప్రామాణిక గ్రంథాలు లేవదీసిన ప్రధాన సమస్య స్థానంలో నిజానికి మరో సమస్య ప్రవేశపెట్టబడింది: ఆర్థిక సమతులిత పరిస్థితులకు అనుగుణమైన ధరలు ఏవిధంగా నిర్ధరింపబడుతాయి? శ్రమ విలువ (పోటీ, ఉత్పత్తి ధర సిద్ధాంత) సుదృఢ పునాదినుండి దాన్ని విడదియ్యడం ద్వారా కాకుండా, దానిపై ఆధారపరచి, మార్క్సిస్టు సిద్ధాంతం యీ ప్రశ్నకు సమాధానం చెప్తుంది. అయితే మిల్, రెండవ ప్రశ్నను మొదటి దాన్నుండి విడదీసేందుకు తోడ్పడ్డాడు. సప్లయ్, గిరాకీల ప్రాతిపదికపైన ధర ఏర్పాటుయొక్క లాంఛనప్రాయమైన విశ్లేషణకు యిదే ఆరంభం. ఈ విశ్లేషణ, ఆ శతాబ్దాంతంలో యితర బూర్జువా అర్థశాస్త్రవేత్తలచేత అభివృద్ధి చెయ్యబడింది.

మిల్ విలువ సిద్ధాంతం, స్మిత్, రికార్డోల విలువ సిద్ధాంతంలో గల సామాజిక సారాంశాన్ని దాదాపు పూర్తిగా కోల్పోయింది. విలువ సమస్యను పరిశీలించేందుకు ముందు ఆయన పంపిణీ, ఆదాయాల సమస్యలను పరిశీలించడాన్ని బట్టి యీ విషయాన్ని గ్రహించవచ్చు. శ్రమచేత సృష్టింపబడి, కొలవబడే విలువయొక్క పంపిణీని పరిశీలించిన స్మిత్, రికార్డోల విషయంలో, యిది పూర్తిగా అసంభవమే. అందుచేతనే వాళ్ళు, అదనపు విలువను, పెట్టుబడిదారుకూ, భూస్వామికీ ఉత్పాదితం యొక్క పూర్తివిలువనుండి లభించే మినహాయింపుగా అర్థంచేసుకోవడానికి సన్నిహితంగా వచ్చారు.

---

* J. St. Mill, *Principles of Political Economy with Some of Their Applications to Social Philosophy*, London, 1873, p. 291.

ఈ వైఖరి మిల్‌లో పూర్తిగా లోపించలేదు. శ్రమకు ఎంత వ్యయం అవుతుందో, అంతకన్న ఎక్కువ విలువను అది ఉత్పత్తిచేస్తుందన్న వాస్తవంనుంచి పెట్టుబడిదారు లాభం వ్యుత్పన్నమవుతుందని రికార్డో మాదిరిగానే ఆయన రాశాడు. అయితే యిది తన బోధకునికి ఆయన బాహ్య గౌరవ ప్రదర్శన మాత్రమే. నిజానికి, లాభం పెట్టుబడిదారుడి మితవ్యయ ఫలితం అన్న వివరణను ఆయన ఆమోదిస్తాడు. పంపిణీయొక్క పరిమాణాత్మక పార్శ్వానికి సంబంధించి, మూడు అంశాల్లో అంటే నిజానికి వర్గాల్లో, ప్రతి ఒకదాని వాటా విషయంలో, యీ సమస్యను గురించి మిల్‌కి స్పష్టమైన భావాలు లేవు. ఆయన యీ విషయంలో రికార్డో దృక్పథానికి అంటి పెట్టుకొనివుండేందుకు ప్రయత్నించాడు. భూమికౌలు వాటా, క్షీణమాన భూసార నియమం చేతా, మరింత తక్కువ సారం కలిగిన భూమికి మారడం వలవా విర్ణయింపబడుతుందనీ, తత్కారణంగా దానికి పెరిగే ధోరణి వుంటుందనీ ఆయన చెప్పాడు. వేతనం వేతన నిధి అనబడేదానిచేత నిర్ణయింపబడుతుంది కనుక, వేతన స్థాయి దాదాపు స్థిరంగా వుంటుంది. లాభం మౌలికంగా ఒక ఉత్పాదితపు విలువలో శేషం, పరిమాణాత్మకంగా దీన్ని నిర్ణయించడం బహు దుస్సాధ్యం.

రికార్డో అనంతర అర్థశాస్త్రం అంతటిలోనూ, 19వ శతాబ్దాంతందాకా కూడా, వేతన నిధి సిద్ధాంతం ప్రాబల్యంలో వుంది. ఈ సిద్ధాంత సమర్థకులు, ఒక పెద్ద దేశపు ఆర్థికవ్యవస్థను ఒక వ్యవసాయ క్షేత్రంతో పోల్చారు. ఆ క్షేత్ర యజమాని ఒక ఏడాదికి సరిపడ తిండిని తన శ్రామికులకోసం దాచి ఉంచుతాడు. అతను అలా నిలవచేసినదానికన్న ఎక్కువ మొత్తాన్ని తన శ్రామికులకు యివ్వడం సాధ్యం కాదు. తన శ్రామికులు తన పొలంలో పని చేసేందుకు అవసరమైనదానికన్న ఎక్కువ తిండిని అతను నిలువ చెయ్యనూ చెయ్యడు. ఈ ఉదాహరణను సమాజానికి అన్వయించినప్పుడు, సమాజానికెప్పుడూ కూడా బొత్తిగా ఎదుగుబొదుగుల్లేని, నిజానికి స్థిరమైన జీవనాధార సప్లయ్‌లు వుంటాయనీ, వాటిని పెట్టుబడిదారులు, తమ కార్మికులను పోషించేందుకు గాను నిల్వచేస్తారనీ ("పొదుపు చేస్తారనీ") తేలుతుంది. ఈ నిధిని కార్మికుల సంఖ్యచేత సరళంగా విభజిస్తే వేతనాలు నిర్ణయింపబడుతాయి. దీనంతనుంచీ తేలే చిత్రం పైన పేర్కొన్న "వేతనాల ఉక్కు నియమాన్ని" గుర్తుచేస్తుంది: శ్రామిక నిల్వ ఒక నియమిత స్థిర అంశమైతే, ఏ పోరాటం ద్వారా కూడా కార్మికవర్గం తన పరిస్థితిని మెరుగుపరచుకోలేదు: మహా అయితే ఒక కార్మిక బృందం మరో కార్మిక బృందాన్ని నష్టపరచి మాత్రమే ప్రయోజనం పొందగలదు. పాల్గేవ్ "అర్థశాస్త్ర నిఘంటువు"లో (19వ శతాబ్ద్యాంతంలో ప్రచురింపబడిన ఒక ప్రామాణిక రచన)

యీ అంశంపై వ్యాసరచయిత పేర్కొన్నట్లు, అర్థశాస్త్ర సిద్ధాంతాలపట్ల ఇంగ్లీషు కార్మికవర్గానికి వెగటుకలగడానికి యీ సిద్ధాంతం విశేషంగా తోడ్పడింది.

జాన్ స్టూవర్ట్ మిల్, తనకి సహజసిద్ధమైన పద్ధతిలో, ఒక పేజీలో వేతన నిధి సిద్ధాంతపు సంక్షిప్త సూత్రీకరణను యిస్తాడు, మరో పేజీలో, పెట్టుబడిదారీ విధానం కింద కార్మికవర్గపు జీవన ప్రమాణం గణనీయంగా పెరిగే అవకాశాన్ని గురించి రాస్తాడు. 1869లో తను రాసిన ఒక వ్యాసంలో ఆయన బహిరంగంగా యీ సిద్ధాంతాన్ని తిరస్కరించాడు, అయితే తన "అర్థశాస్త్ర సూత్రాలు" కొత్త ముద్రణలో తన పాత అభిప్రాయాన్ని అలాగే ఉండనిచ్చాడు.

రాజీపడిపోవడం, పొసగనివాటిని పొసగదొయ్యాలన్న తపన — యిదే చివరిదాకా ఈయన విశిష్ట స్వభావంగా కొనసాగింది.

ప్రకరణం 15

ఆర్థిక రొమాంటిసిజం: సిస్మాండీ

స్విస్ ఆర్థికవేత్త సిస్మాండీ రచనలు అర్థశాస్త్ర చరిత్రలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఆయన జీవించి, కృషిచేసిన కాలానికీ మన కాలానికీ మధ్య చాలా ఎడమే ఉన్నప్పటికీ, కొన్ని అంశాల్లో అవి యీనాటికీ తమ శాస్త్రీయ ప్రాముఖ్యాన్ని కోల్పోలేదు. "ఆర్థిక రొమాంటిసిజం విశిష్ట లక్షణాలు (సిస్మాండీ, మన దేశవాళీ సిస్మాండీస్టులు)" అన్న తన వ్యాసంలో వి. ఐ. లెనిన్ యిలా రాశాడు: "అర్థశాస్త్ర చరిత్రలో సిస్మాండీ ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తాడు... చిన్నతరహా ఉత్పత్తిని సముత్సాహంగా సమర్థించి, భారీ పరిశ్రమల సమర్థకులనూ, సిద్ధాంతకారులనూ వ్యతిరేకించిన సిస్మాండీ, ప్రధాన ధోరణులకు కేటాయింపుగా నిలుస్తాడు."*

పారిశ్రామిక విప్లవ కాలంలో, పెట్టుబడిదారీ విధానం విజయవంతంగా పురోగమిస్తున్న కాలంలో, యీ సామాజిక వ్యవస్థనూ, దాని ఆర్థిక యంత్రాంగాన్నీ లోతుగానూ, సునిశితంగానూ విమర్శించిన మొట్టమొదటివాడు సిస్మాండీ. దీన్నిబట్టే సిస్మాండీ పాత్ర, ఆయన భావాల పాత్ర, ప్రథమంగానూ ప్రధానంగానూ నిర్ణయింపబడుతుంది: ఆయనది పెటీబూర్జువా దృక్పథంనుంచి చెయ్యబడిన విమర్శ అన్న మాట నిజమే. అయితే సరిగా యీ సైద్ధాంతిక దృక్పథం మూలంగానే పెట్టుబడిదారీ అభివృద్ధిలోని వైరుధ్యాలనూ, సమస్యలనూ ఆయన చూడగలిగాడు. ఆయన సమకాలీనుడూ, ప్రతిభావంతుడైన ప్రత్యర్థీ, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు అత్యంత ప్రముఖ భాష్యకారుడూ అయిన రికార్డో సరిగా యీ అంశాన్నే పట్టించుకోలేదు. మార్క్స్ పూర్వపు కాలానికి చెందిన ఆర్థికవేత్తల్లో, పెట్టుబడిదారీ విధానపు సహజ, శాశ్వతత్వ స్వభావం విషయంలో ప్రచలితంగా వున్న మూఢవిశ్వాసం విషయంలో అనుమానాన్ని వ్యక్తంచేసిన తొలి ప్రముఖ అర్థశాస్త్రవేత్త సిస్మాండీయే. అర్థశాస్త్రాన్ని బూర్జువా సంపదకు సంబంధించిన ఒక విజ్ఞాన శాస్త్రంగానూ, బూర్జువా సంపదను

* V. I. Lenin, *Collected Works*, Vol. 2, p. 133.

వృద్ధిచేసే ఒక సాధనంగానూ ఆయన చూడలేదు. మానవ సుఖ ప్రయోజనార్థం సామాజిక యంత్రాంగాన్ని మెరుగొనర్చే ఒక విజ్ఞాన శాస్త్రంగా మాత్రమే దాన్ని ఆయన చూశాడు. కొత్తగా ఆవిర్భవించిన శ్రామికవర్గంయొక్క, శ్రామికజనసామాన్యంలోని యితర విభాగాలయొక్క దౌర్భాగ్యంపట్ల హృదయపూర్వకమైన సానుభూతితో సిస్మొండీ రచనలు నిండివుంటాయి. నూత్నయుగపు సామాజిక – ఆర్థిక సాహిత్యంలో శ్రామికవర్గం అన్న పదాన్ని – ఆ లాటిన్ పదాన్ని తవ్వి పైకి తీసి, దాన్ని పునర్వ్యాఖ్యానించి – ఆయనే ప్రవేశపెట్టాడు. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ యంత్రాంగానికి సంబంధించిన సాపేక్ష వాస్తవిక పరిజ్ఞానానికి గల ఆధారాల్లో ఒకటిగా పెటీబూర్జువా భావజాలం యీనాటికీ ఒకొక్కమారు ఉపయోగపడుతోంది.

సుస్పష్టమూ, సజీవమూ అయిన శైలితో కూడిన సిస్మొండీ రచనలు తక్షణ సామాజిక సమస్యలను పరిష్కరించ ప్రయత్నించిన ఆయన మానవతావాద, తీవ్రవాద వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

మార్క్సుకు రికార్డో ఆద్యుడైన అర్థంలో, సిస్మొండీ కాదు. అదనపు విలువ సిద్ధాంత విషయంలో సిస్మొండీ కొత్తదాన్ని ఏమీ చెప్పలేదు, నిజానికి స్మిత్‌ని దాటి ఏ మాత్రం ముందుకు వెళ్లలేదు. అయితే, పెట్టుబడిదారీ విధానంపై ఆయన విమర్శ, సంక్షోభాలపై ఆయన విశ్లేషణ, మార్క్సిజం రూపొందడంలో నిస్సందేహంగా పాత్రను వహించాయి. మార్క్స్ రచనలు చాలావాటిలో యీ జెనీవా ఆర్థికవేత్త రచనలపై ప్రగాఢమైన అంచనాలు వున్నాయి.

జెనీవా పౌరుడు

జాన్ షార్ల్ లియొనార్డ్ సిమోన్‌డ్ డి సిస్మొండీ జెనీవా శివార్లలో 1773లో జన్మించాడు. ఉత్తర ఇటలీనుంచి వచ్చిన ఆయన పూర్వులు ఫ్రాన్సులో చాలకాలం నివసించి, ఆటుతర్వాత కాల్వినిజానికి మారి, మతపరమైన వేధింపునుండి తప్పించుకొని పారిపోయి, జెనీవాలో స్థిరపడ్డారు. సిస్మొండీ తండ్రి కాల్వినిస్టు మతగురువు. ఆ కుటుంబం జెనీవా ప్రభువర్గానికి చెందిన సంపన్న కుటుంబం.

18వ శతాబ్దంలో జెనీవా ఒకచిన్న స్వతంత్ర రిపబ్లిక్. యితర స్విస్ రాష్ట్రాలతో దాని సంబంధాలు బలహీనంగా వుండేవి. తన సహదేశస్తుడూ, కొంత మేరకు తన బోధకుడూ అయిన మహనీయుడు రూసో మాదిరిగానే, సిస్మొండీ కూడా, ఆయన జీవిత చరిత్ర రచయితల్లో ఒకరు అన్నట్లు, పుట్టుక రీత్యా, భావావేశం

రీత్యా కూడా జెనీవా పౌరుడు. కాని, మానసిక ధోరణినిబట్టీ, రచనల పద్ధతినిబట్టీ ఆయనొక ఫ్రెంచివాడు. సిస్మాండీ సైద్ధాంతిక రచనలన్నీ కూడా ఫ్రెంచి భాషలోనే రచింపబడి, పారిస్‌లో ప్రచురింపబడ్డాయి. మొత్తంమీద, ఫ్రెంచి ఆర్థిక చింతనకు ఒక ప్రతినిధిగా ఆయన్ని పరిగణించవచ్చు.

సిస్మాండీ బాల్యయౌవనాలు శాంతియుతమైన పితృస్వామిక వాతావరణంలో గడిచాయి. సిస్మాండీ భావాలకు మూలం కొంతవరకు దానిలోనే దొరుకుతుంది. సంతోషం మామూలుగా నిజాయితీపరులైన చేతివృత్తి కార్మికుల, వ్యవసాయదారుల యిళ్లలో వాసంచేస్తుందనీ, ఫ్యాక్టరీలతో, వాణిజ్య కార్యాలయాలతో, బ్యాంకులతో నిండివుండే పెద్ద పట్టణాల దరిమేనా కూడా వెళ్లదన్న విశ్వాసాన్ని తన జీవితం పొడుగునా ఆయన నిలుపుకున్నాడు. అయితే, సరిగా యీ పితృస్వామిక జీవితమే గతానికి చెందినదై పోతోంది. పారిశ్రామిక విప్లవ పర్యవసానంగా వాశనమవుతోంది. ఆ క్రమంలో చేతివృత్తుల స్థానాన్ని ఫ్యాక్టరీ ఉత్పత్తి ఆక్రమిస్తోంది. తన నైపుణ్యాన్నీ, మితమైన తన సౌభాగ్యాన్నీ చూసుకుని మురిసిపోయే స్వతంత్రుడైన చేతివృత్తి కార్మికుల స్థానాన్ని పేదతనంలో మునిగిన కార్మికుడు ఆక్రమిస్తున్నాడు.

విద్యాభ్యాసాన్ని ముగించక ముందే, తన పద్దెనిమిదవ ఏట సిస్మాండీ లియోన్‌కి వెళ్లి, తన తండ్రి మిత్రుడైన ఒక వర్తకుని దగ్గర గుమాస్తా ఉద్యోగంలో చేరి పని చెయ్యవలసివచ్చింది. జాకొబిన్ విప్లవం త్వరలోనే లియోన్‌కి పాకి, ఆటుతర్వాత జెనీవాకు విస్తరించింది. జెనీవా ఎప్పుడూ కూడా పొరుగున వున్న ఫ్రాన్సుతో సన్నిహిత సంబంధం కలిగివుండేది. సిస్మాండీ కుటుంబం సంచార జీవితానికి పూనుకోవలసివచ్చింది. 1793 మొదట్లో ఇంగ్లండుకు తరలివెళ్లి, వాళ్లక్కడ పద్దెనిమిది మాసాలు నివసించారు. తిరిగివచ్చిన తర్వాత కొద్దికాలానికే వాళ్లు మళ్లీ పారిపోవలసివచ్చింది. ఈసారి వాళ్లు ఉత్తర ఇటలీకి పారిపోయారు. అయితే త్వరలోనే అది కూడా ఫ్రెంచివారిచేత ఆక్రమించుకోబడింది. యువ సిస్మాండీ తనతో తెచ్చిన డబ్బుతో టస్కనీలో కొన్న ఒక చిన్న వ్యవసాయ క్షేత్రాన్ని, ఐదేళ్లపాటు నిర్వహించాడు. ఈ కల్లోలిత వత్సరాల్లో, రాజకీయంగా అనుమానిత వ్యక్తిగా ఆయన కొన్నిసార్లు జైల్లో పెట్టబడ్డాడు. జెనీవా అధికారికంగా ఫ్రాన్సులో భాగమై, ప్రథమ కాన్సల్ నెపోలియన్ బోనపార్ట్ అక్కడ "శాంతిభద్రతలు నెలకొల్పిన" తర్వాత (1798లో) సిస్మాండీ కుటుంబం జెనీవాకి తిరిగివెళ్లింది.

అప్పటికి యువ సిస్మాండీ సామర్థ్యాలూ, యిష్టానిష్టాలూ చాలవరకు సుస్పష్టంగా రూపుదాల్చాయి. ఆయన సాహిత్య కృషి ప్రథమ ఫలితంగా, టస్కనీ వ్యవసాయంపై ఒక పుస్తకం వెలువడింది. 1803లో "వ్యాపార సంపద గురించి" అన్న శీర్షికతో

అర్థశాస్త్రంపైన ఆయనొక రచనను ప్రచురించాడు. అందులో సిస్మాండీ, ఆడమ్ స్మిత్ శిష్యుడుగానూ, ఆయన భావాల సమర్థకుడుగానూ ముందుకొచ్చాడు.

ప్రసిద్ధుడైన బ్యాంకరూ, రాజకీయవేత్తా, చింతనాపరుడూ అయిన నెక్కేర్, ఆయన కూతురూ, రచయిత్రీ, సమాజంలో ప్రముఖ వ్యక్తీ అయిన మేడమ్ డి స్టాల్‌ల చుట్టూ చేరిన పండితుల, రచయితల బృందంలో సిస్మాండీ చేరాడు. ఆయన నెక్కేర్, మేడమ్ డి స్టాల్‌ల ఎస్టేటులో చాలకాలం గడిపి, పనిచేసేవాడు. ఆమె ప్రయాణాల్లో ఆమె వెంట వెళ్తూండేవాడు. మేడమ్ డి స్టాల్‌యొక్క, ఆమె రచయితల బృందంయొక్క సాహిత్య రొమాంటిసిజం ప్రభావం సిస్మాండీపై కొంతవరకు వుంది. ఆయన పలు సంపుటాల "ఇటాలియన్ రిపబ్లిక్‌ల చరిత్ర"ను రచించాడు. రొమాంటిక్ సాహిత్య చరిత్రపైన ప్రతిభావంతమైన కొన్ని ఉపన్యాసాలు ఇచ్చాడు. 1813లో పారిస్‌కు వెళ్లిన సిస్మాండీ, అక్కడ నెపోలియన్ పతనాన్నీ, బూర్బన్ల పునరుద్ధరణనూ, వంద రోజుల విషాద ఘటనపీ చూశాడు. ఈ ఘటనలు అకస్మాత్తుగా ఆయన్ని నెపోలియన్ సమర్థకుడుగా మార్చివేశాయి. కొత్త సామ్రాజ్యం తన అస్పష్టమైన స్వేచ్ఛా, సంతోష ఆదర్శాలను నిజం చేస్తుందని ఆయన ఆశించాడు.

వాటర్లూ, వియన్నా మహాసభ (1815)ల అనంతరం సిస్మాండీ స్విట్జర్లండుకు తిరిగివచ్చాడు. జెనీవా తిరిగి స్విట్జర్లండులో ఒక భాగమైంది. ఆయన ఇంగ్లండుకూ, మరి కొన్ని దేశాలకు కూడా వెళ్లాడు. ఆ సంవత్సరాల్లో ఆయన సామాజిక – ఆర్థిక భావాలు రూపొందాయి. వాటిని ఆయన "అర్థశాస్త్రపు కొత్త సూత్రాలు లేక సంపద, జనాభాకు దానితో సంబంధమూ" అన్న శీర్షికతో ఒక పుస్తకంలో పొందుపరచాడు. ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి సిస్మాండీ చేసిన ప్రధానమైన చేర్పు యిదే. ఆ పుస్తకం ద్వారా ఆయన త్వరలోనే యూరప్ అంతటా ఒక అర్థశాస్త్రవేత్తగా ప్రసిద్ధిచెందాడు. 1827లో ఆయన ఆ పుస్తకాన్ని పునర్ముద్రించాడు. అందులో, ఇంగ్లండులోని రికార్డో అనుయాయులపైనా, ఫ్రాన్సులోని సేయ్ అనుయాయులపైనా, ఆయన విమర్శ మరింత నిశితరూపం దాల్చింది. 1825 నాటి ఆర్థిక సంక్షోభాన్ని తన వాదం సరైనద నేందుకూ, అమితోత్పత్తి అసంభవమనే భావాలు తప్పనేందుకూ ఒక రుజువుగా ఆయన పరిగణించాడు. ఈ ముద్రణకు ఆయన రాసిన ముందుమాటలో తన ప్రత్యర్థులపై ఆయన విజయ స్వరం ధ్వనిస్తుంది. అయితే యిది, రికార్డో పట్ల ఎప్పుడూ ఆయన అత్యధిక గౌరవభావాన్ని కలిగివుండటానికి ఆటంకం కాలేదన్న విష యాన్ని సందర్భవశాత్తూ మనం తెలుసుకోవలసివుంటుంది.

సిస్మాండీ రాసినట్లు, యీ పుస్తకం యితర అర్థశాస్త్రవేత్తల రచనల ప్రగాఢ అధ్యయన ఫలితం కాక వాస్తవాల పరిశీలనా ఫలితం. ఈ పరిశీలనలు, "ఛాందస" ఆర్థిక

విజ్ఞానశాస్త్ర సూత్రాలే, అంటే, ఒకవంక రికార్డో, మరోవంక సేయ్ అభివృద్ధిచేసిన రూపంలో స్మిత్ బోధనలు తప్పన్న సంగతిపట్ల, ఆయనకి నమ్మకాన్ని కలిగించాయి.

రికార్డో అన్ని విషయాలనూ ఉత్పత్తి ప్రయోజనాల దృష్ట్యానూ, జాతీయ సంపద పెంపుదల దృష్ట్యానూ పరిగణించాడన్న సంగతిని మనం యింతకు ముందే చూశాం. కాగా సిస్మాండీ, ఉత్పత్తికి ఉత్పత్తే పరమ ప్రయోజనం కాదనీ, అసలు జాతీయ సంపద సంపదే కాదనీ వాదించాడు. జనాభాలోని బహుళ ప్రజానీకానికి ముష్టి నాలుగు మెతుకులు తప్ప మరేమీ లభ్యం కాకపోవడమే యిందుకు కారణం అన్నాడు. భారీ పరిశ్రమల పంథా మానవ జాతికి వినాశకరమైనది అన్నాడు. అర్థశాస్త్రం, తన సాధారణ పథకాల వెనుక గల నిజమైన మనిషిని చూడాలని ఆయన డిమాండు చేశాడు.

1819లో ఆయనొక ఆంగ్లేయ యువతిని పెళ్లిచేసుకున్నాడు. వాళ్లకి బిడ్డలు కలగలేదు. ఆయన శేషజీవితం జెనీవా సమీపంలోని ఓ చిన్న ఎస్టేటులో శాంతియుతంగా గడిచింది. "ఫ్రెంచివాళ్ల చరిత్ర" అన్న ఒక బృహద్గ్రంథ రచనలో నిమగ్నుడై ఆయన ఆ కాలాన్ని గడిపాడు. ఆ పుస్తకపు 29 సంపుటాలను ప్రచురించాడు. అయినా కూడా తన మరణానికి ముందు దాన్ని ఆయన పూర్తిచెయ్యలేకపోయాడు. అనేక యితర చారిత్రక, రాజకీయ రచనలను కూడా ఆయన ప్రచురించాడు. ఆ కాలంలో ఆయన చేసిన ఆర్థిక రచనలు ఈనాడు అంతగా ఆసక్తికరంగా ఉండవు.

సిస్మాండీ నమ్మశక్యం కానంతగా కష్టించి పనిచేసే వ్యక్తి. తన జీవితపు చివరి రోజుదాకా కూడా ఆయన విధిగా రోజుకు ఎనిమిదిగంటలు, తరచు అంతకన్న ఎక్కువగా కూడా, తన టేబుల్ దగ్గర రాస్తూ గడిపాడు. ఆయన సంపూర్ణ రచనలు 70 సంపుటాలు అయ్యాయి! షికారు వెళ్లడం, ఆతిథ్యానికి ప్రసిద్ధిచెందిన తన యింటి దగ్గర చేరివ పలువురు మిత్రులతోనూ, ఆగంతుకులతోనూ సంభాషించడం – యివే ఆయన కాలక్షేపాలు. ఈ ప్రసిద్ధ జెనీవా పౌరుని చివరి సంవత్సరాలు కూడా, ఆయన బాల్య, కౌమార సంవత్సరాలంత సంతోషంగానే గడిచిపోయాయి. ఆయన తన 69వ ఏట 1842లో మరణించాడు.

సిస్మాండీ చిత్రాలు చూస్తే ఆయన గండు ముఖం కలిగినవాడుగా కనిపిస్తాడు. ఆయన సమకాలికుల్లో ఒకరు పేర్కొన్నట్లు, సిస్మాండీ జాంబవంతుడిలా వుండేవాడు. సమాజానికి ఆయన దూరంగా వుండటానికీ, పరిశోధనా ఏకాంతంలోకి ఆయన్ని నెట్టేందుకూ బహుశా యిదే కారణమై వుంటుందని కూడా అనుకునేవాళ్లు. ఆయన బాగా మెతక మనిషి, దయాళువు, ఆర్ద్రహృదయుడు. మేడమ్ డి స్టాల్ బృందాన్ని వర్ణించిన వాళ్లు "సదయ హృదయుడు సిస్మాండీ" అని ఆయన్ని పేర్కొన్నారు. ఆయన విశ్వాసపాత్రుడైన మిత్రుడు, ఆదర్శ భర్త, శ్రద్ధాళువైన

కొడుకూ, సోదరుడూ. అయితే అదే సమయంలో, ఆయన మెతక స్వభావం, ఆయన సూత్రబద్ధుడైన వ్యక్తి కావడానికీ, ఆయా సందర్భాల్లో అవసరం కలిగినప్పుడు తన అభిప్రాయాల్లోనూ, కార్యాల్లోనూ ధైర్యవంతుడూ, పట్టుదల కలిగినవాడూ అవడానికీ ఆటంకం కాలేదు. పైన ప్రస్తావింపబడిన ఆయన సమకాలికుడే యిలా రాశాడు: ''ఆయన స్వభావరీత్యా పైకి శాంతపరుడే అయినప్పటికీ, ఒక మిత్రుణ్ణి రక్షించేందుకు, దారుణమైన దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డాడు. ఒక ప్రసిద్ధ 'సమీక్ష'తో ఆయనకి సంబంధం వుంది. ఆ పత్రికలో ప్రచురింపబడిన ఒక వ్యాసం, తన కులీనతపట్ల కుహనాహంకారం కలిగిన ఒక వ్యక్తి అహాన్ని దెబ్బతీసింది. సిస్మాండీయే ఆ వ్యాసకర్త అని అతను ఆరోపించి, ఆ నేరాన్ని ఒప్పుకోనైనా ఒప్పుకొమ్మనీ, లేకుంటే అసలైన వ్యాసకర్త పేరు బయటపెట్టమనీ ఒత్తిడిచేశాడు. సిస్మాండీ అతనికి ఎలాంటి జవాబిచ్చేందుకూ నిరాకరించాడు. అవతలి అతను సవాలు విసిరాడు. సిస్మాండీ దాన్ని ఆమోదించాడు. ఆయన ప్రత్యర్థిని తనపైన కాల్చనిచ్చాడు. తనుమటుకు తన పిస్తోలును గాలిలోకి పేల్చి, ఆ వ్యాసరచయిత తను కానని అప్పుడు మొట్టమొదటిసారిగా ప్రకటించాడు. హాస్యాస్పదమైన యీ ఘర్షణలోంచి సగౌరవంగా ఆయన బయటపడ్డాడు.''*

పెట్టుబడిదారీ విధానంపై విమర్శ

కొంచెం సేపు మనం అరిస్టాటిల్ విషయానికి తిరిగివెళ్దాం. ఆ మహా మేధావి ఆర్థికశాస్త్రాన్ని క్రెమటిస్టిక్స్ (ధనార్జన శాస్త్రం)కి ప్రతిగా పెట్టాడు. ఆర్థిక శాస్త్రం మానవ అవసరాలను తీర్చే లక్ష్యంతో చెయ్యబడే సహజ ఆర్థిక కార్యకలాపం. కాగా క్రెమటిస్టిక్స్ అపారమైన ధనార్జన కోసం కృషిచేయడం, వినిమయం కోసం కాక, సంపద సంచయనం కోసం చేసే ఆర్థిక కార్యకలాపం. అరిస్టాటిల్ కాలంనాటినుండి యీ భావం పొందిన మార్పులను మనం చూశాం.

పెట్టుబడిదారీ విధానపు ఏ విమర్శకైనా కూడా అదే సహజ ప్రాతిపదిక, ఎందుకంటే యీ దృష్ట్యా, పెట్టుబడిదారీ విధానం శుద్ధ ధనార్జన పద్ధతి. సిస్మాండీ ఆదర్శం స్వతంత్ర వ్యవసాయదారుల, చేతివృత్తి పనివారల పితృస్వామిక ఆర్థికవ్యవస్థయే గాని,

---

* A. Stevens, *Madame de Staël, a Study of Her Life and Times: the First Revolution and the First Empire*, Vol. II, London, 1881, p. 19.

అర్ధస్వయంపోషక బానిసయాజమాన్య ఆర్థికవ్యవస్థ కాదు. ధనార్జన శాస్త్రానికి సాకారమూర్తులు — ఎవరి ఆచారాలు అప్పడే ఆయన సొంత నగరమైన జెనీవాలోనూ, ఆయనకు ప్రీతిపాత్రమైన ఫ్రాన్సులోనూ పరివ్యాపిస్తున్నాయో ఆ ఇంగ్లీషు ఫ్యాక్టరీ యజమానులూ, వర్తకులూ, బ్యాంకర్లే గాని ఏథెన్సుకి చెందిన వర్తకులూ, వడ్డీవ్యాపారస్తులూ కారు.

పెట్టుబడిదారీ విధానంపై సిస్మాండీ చేసిన విమర్శ పెటీబూర్జువా విమర్శ, అంతమాత్రాన దీన్ని మోటు అర్థంలో తీసుకోకూడదు. ఆయన అంగడి యజమానులనో, లేక చేతివృత్తులవారినో పరిపూర్ణతకు పరాకాష్ఠగా తీసుకున్నాడని దీని అర్థం కాదు. మానవజాతి సుఖతర భవితవ్యం కోసం ఏ యితర వర్గంపైన తను ఆశలను నిలుపుకోగలదో, అటువంటి ఏ యితర వర్గాన్నీ ఆయన ఎరుగడు. పారిశ్రామిక శ్రామికవర్గపు బాధలను ఆయన చూశాడు, దాని హీన పరిస్థితిని గురించి బోలెడంత రాశాడు, అయితే దాని చారిత్రక పాత్రను గురించిన అవగాహన ఆయనకి బొత్తిగా లేదు. ఊహాజనిత, పెటీబూర్జువా సోషలిజానికి చెందిన భావాలు అభివృద్ధిచెందుతున్న కాలంలో ఆయన రచనలు చేస్తున్నాడు. ఆయన స్వయంగా సోషలిస్టు కాదు. అయితే, ఆయన సంకల్పాలు ఏమైనప్పటికీ, ఆ కాలం ఆయన విమర్శకు సోషలిస్టు స్వభావాన్ని సంతరించిపెట్టింది. ఆయన పెటీబూర్జువా సోషలిజానికి — ప్రధానంగా ఫ్రాన్సులోనూ, కొంత మేరకు ఇంగ్లండులో కూడా — జనకుడయ్యాడు. ఈ విషయాన్ని మార్క్స్, ఎంగెల్సులు 1848లోనే, "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"లో పేర్కొన్నారు.

పెట్టుబడిదారీ విధానంలో అంతర్గతంగా వున్న ధనారాధనపట్ల సిస్మాండీకి సహజసిద్ధమైన ద్వేషం వుంది. మేడమ్ డి స్టాల్ అమెరికాకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకొంటున్నప్పుడు (ఈ ప్రయాణం జరగలేదు), అక్కడ ప్రతీదీ డబ్బు లెక్కల్లో కొలవబడుతుందని మండిపడుతూ రాశాడు. దానితోబాటు ఆయనొక అమెరికన్ వార్తా పత్రికలోని ఒక వ్యాసాన్ని కూడా ఉల్లేఖించాడు. ఆ వ్యాసం నెక్కెర్ కూతురు ఎంత సంపన్నురాలో పేర్కొందేగాని, ఆమె ప్రతిభా చమత్కారాలను గురించి గాని, సాహిత్య రంగంలో ఆమె సాధించిన విజయాలను గురించి గాని ఒక్క మాట కూడా అనలేదు. పెట్టుబడిదారీ విధానంపై సిస్మాండీ విమర్శ, గొప్ప స్పష్టతతో పెట్టుబడిదారీ విధానపు అతి ముఖ్యమైన అనేక వైరుధ్యాలను బహిర్గతం చేసింది. తన సిద్ధాంతానికి ఆయన, మార్కెట్లు, అమ్మకాలు, సంక్షోభాల సమస్యను కేంద్రాన్ని చేసుకున్నాడు; దాన్ని బూర్జువా సమాజపు వర్గనిర్మితి అభివృద్ధితోనూ కార్మికజనాన్ని నిరాస్తిపరులుగా మార్చివేసే ధోరణితోనూ సన్నిహితంగా ముడిపెట్టాడు. ఆ విధంగా చేసే క్రమంలో ఆయన ఏనుగు కుంభస్థలంమీద దెబ్బకొట్టాడు. చారిత్రకంగా అభివృద్ధి చెందుతున్న వైరుధ్యాన్నీ, ఓ చిన్న వుండుగా ప్రారంభమైన ఆ వైరుధ్యం, పెట్టుబడిదారీ విధానపు

అత్యంత ప్రమాదకర వ్యాధిగా పరిణమించిన విషయాన్నీ అవగాహన చేసుకున్నాడు. ఆర్థిక సంక్షోభాల సమస్య అర్థశాస్త్ర సాహిత్యంలో వేల రచనల, అనేక వేల రచనల విషయాంశం అయిందని చెప్తే అది అతిశయోక్తి కాదు. సిస్మాండీ రచనలు యీ మొత్తం రాశిలో అదృశ్యమై పోలేదు. సంక్షోభాల సమస్యను ఆయన పరిష్కరించ లేదన్న విషయం స్పష్టం. అయితే అసలా సమస్యను (ఎన్నడో 1819లోనే!) లేవనెత్తడం ద్వారా, ఆయన సమకాలీనులతో పోలిస్తే ఆయన పెద్ద ముందంజ వేశాడు. సిస్మాండీ ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి చేసిన చేర్పును అంచనావేస్తూ పైన పేర్కొనబడిన రచనలో వి. ఐ. లెనిన్ యిలా రాశాడు: "చారిత్రక సేవలు, చారిత్రక వ్యక్తులు ఆధునిక అవస రాలకు సంబంధించి చెయ్యని దానిచేతగాక, వారికి ముందరివాళ్లు చేసినవాటితో పోల్చి నప్పుడు వాళ్లు చేసిన కొత్తవాటి ద్వారా అంచనావెయ్యబడుతాయి."*

రికార్డోకూ, ఆయన అనుయాయులకూ సంబంధించినంతవరకు, ఆర్థిక క్రమం అనంతమైన సమతౌల్య స్థితుల పరంపర, ఒక సమతౌల్య స్థితినుంచి మరొకదానికి దాని పరివర్తన సాఫీగా, దానికదిగా జరిగే "సమన్వయం" ద్వారా సంభవించింది. ఈ సమతౌల్య స్థితులలోనే వాళ్లు ఆసక్తి చూపారు, పరివర్తనలను వాళ్లు అంతగా పట్టించు కోలేదు. కాని సిస్మాండీ ఆ పరివర్తనలు సాఫీగా జరగలేదనీ, అవి తీవ్ర సంక్షోభాల రూపం తీసుకున్నాయనీ, వాటి అమరిక అర్థశాస్త్రానికి గొప్పప్రాముఖ్యం కలిగిన అంశమనీ ప్రకటించాడు.

సిస్మాండీ చిత్రిస్తున్న పెట్టుబడిదారీ విధానపు నమూనా అందాజాగా చెప్పాలంటే యిలా వుంటుంది. ఉత్పత్తియొక్క చోదక శక్తీ, లక్ష్యమూ లాభం కనుక, పెట్టుబడి దారులు తమ కార్మికులనుంచి సాధ్యమైనంత అత్యధిక లాభాన్ని పిండుకోవాలని ప్రయ త్నిస్తారు. పునరుత్పత్తి సహజ నియమాల కారణంగా (సిస్మాండీ ప్రధానంగా మాల్తస్‌ను అనుసరించాడు) శ్రమ సప్లయ్ ఎప్పుడూకూడా గిరాకీకన్న అధికంగా వుంటుంది; ఈ వాస్తవం, పెట్టుబడిదారు వేతనాన్ని అత్యంత కనీస స్థాయిలో ఉంచ డాన్ని సాధ్యం చేస్తుంది. సిస్మాండీ పేర్కొన్నట్లు, బతికివుండగలిగేందుకుగాను కార్మికులు రోజుకు 12–14 గంటలు పనిచెయ్యవలసిన పరిస్థితిలో పడుతున్నారు. ఈ కార్మికుల కొనుగోలు శక్తి అత్యంత హీనస్థాయిలో ఉండి, అత్యంత కనీసావసరాలను కొనగలిగినంత చిన్న మొత్తానికి పరిమితమై వుంది. అయితే, వాళ్ల శ్రమకు అంతకంతకు ఎక్కువ సరుకులను ఉత్పత్తి చెయ్యగలిగిన సామర్థ్యం వుంది. యంత్రాల వినియోగం యీ అసమ నిష్పత్తిని మరింతగా పెంచుతుందంతే, యంత్రాలు శ్రమ ఉత్పాదకతను

* V. I. Lenin, *Collected Works*, Vol. 2, Moscow, 1971, pp. 185—86.

పెంచుతాయి, అదే సమయంలో కార్మికుల ఆవశ్యకతను తగ్గిస్తాయి. దీని తప్పనిసరి ఫలితం ఏమిటంటే, సామాజిక శ్రమ అంతకంతకు అధికంగా ధనికుల కోసం విలాస వస్తువుల ఉత్పత్తిలో వినియోగింపబడుతుంది. అయితే, విలాస వస్తువులకు డిమాండు పరిమితమైనది, అస్థిరమైనది. అందుచేత, సిస్మాండీ తర్కం ప్రకారం, అమితోత్పత్తి సంక్షోభాలు అనివార్యమవుతాయి. అయితే ఆయన తర్కంలో మధ్యంతర లింకులేమీ వుండవు.

సిస్మాండీ చిట్కాలు ఉత్పన్నమైనది అందుకేనేమో కూడా. దేనిలోనైతే "శుద్ధ" పెట్టుబడిదారీ విధానం వుంటుందో, రెండు వర్గాలు — పెట్టుబడిదారులు, వేతన కార్మికులు — వుంటాయో, ఆ సమాజం తీవ్ర సంక్షోభాలకు గురి అయితీరుతుంది. మాల్తస్ మాదిరిగావే సిస్మాండీ ముక్తి కోసం "మూడవ వ్యక్తుల"లో — మధ్యంతర వర్గాలలోనూ, పౌరలలోనూ వెతికాడు. మాల్తస్ మాదిరిగా కాకుండా సిస్మాండీ దృష్టిలో వీళ్లు ప్రధానంగా సన్నకారు సరుకు ఉత్పత్తిదారులు — రైతులు, చేతివృత్తులవాళ్లు, చేతిపనులవాళ్లు. దీనికితోడు, విస్తృతమైన విదేశీ మార్కెట్లు లేనిదే పెట్టుబడిదారీ అభివృద్ధి సాధ్యం కాదని సిస్మాండీ భావిస్తాడు. దీన్ని ఆయన మరింతగా అభివృద్ధి చెందిన దేశాలు తక్కువ అభివృద్ధిచెందిన దేశాలకు సరుకులు అమ్మడంగా ఒకే పక్క నుంచి చూశాడు. ఇంగ్లండు తన సంపద భారంతో యింకా ఉక్కిరిబిక్కిరైపోలేదంటే, దానికి విదేశీ మార్కెట్లు ఉండటమే అందుకు కారణమని ఆయన వివరిస్తాడు.

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం విస్తృతమైన జోక్యం చేసుకోవాలని సిస్మాండీ డిమాండు చేశాడు. ఆర్థిక జీవితంలో సహజమైన, ఆరోగ్యకరమైన ప్రమాణాలను తనకు తానై జరిగే అభివృద్ధిక్రమం నిరంతరాయంగా దెబ్బతీస్తున్నదనీ, వాటిని ప్రభుత్వ తోడ్పాటుతో మాత్రమే సక్రమంగా నెలకొల్పవచ్చుననీ ఆయన ఆశించాడు. సామాజిక భీమా, కార్మికులకు భద్రత, పారిశ్రామిక సంస్థల లాభాల్లో కార్మికులకు వాటాయివ్వడం మొదలైన అనేక చర్యలను సిస్మాండీ ప్రతిపాదించాడు. అప్పట్లో ప్రమాదకరమైన సోషలిస్టు చర్యలుగా పరిగణింపబడిన యీ చర్యలు యీనాడు పెట్టుబడిదారులకు పూర్తి ఆమోదకరంగా మారాయి.

అయితే అనేక విషయాల్లో సిస్మాండీది ముందుచూపు కాక వెనుక చూపు. కృతకంగా పాత ఆచారాలను నిలబెట్టడం, కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకరణను నివారించడం ద్వారా పెట్టుబడిదారీ విధానపు చెడుగులను పరిష్కరించాలని ఆయన భావించాడు. సిస్మాండీ మధ్యయుగాలకూ, ఫ్యూడలిజానికీ తిరిగి వెళ్లాలని కోరుకోలేదనడం స్పష్టం. అయితే, అమానుషమైన పెట్టుబడిదారీ విధానపు పురోగమనాన్ని కొన్ని సామాజిక సంస్థలను నెలకొల్పడం ద్వారా నిరోధించాలనీ, ఒక రకమైన ఏదో కొత్త

మునుగులో అవి "మేలైన పాతరోజులను" పునరుద్ధరిస్తాయనీ ఆయన ఆశించాడు. కార్మికులకు పాదార్థిక భద్రతను కల్పించేందుకుగాను, పాత చేతివృత్తి గిల్డుల మాదిరి ఒక వ్యవస్థను ప్రవేశపెట్టాలని ఆయన ప్రతిపాదించాడు. ఇంగ్లండులో సన్నకారు భూకమతాల పునరుద్ధరణ జరిగివుంటే ఆయన సంతోషించి వుండేవాడు. ఈ ఆర్థిక రొమాంటిసిజం ఊహాజనితమైనదీ, సారభూతంగా అభివృద్ధి నిరోధకమైనదీ. ఎందు చేతంటే పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రగతిశీల స్వభావాన్ని అది తిరస్కరించింది, ఉత్సాహ ప్రేరణకోసం భవిష్యత్తువైపు కాకుండా గతంవైపు చూసింది. సిస్మాండీ సిద్ధాంతాలకు అభివృద్ధినిరోధకమైన అన్న పదం ఎందుకు వర్తిస్తుందో వివరిస్తూ లెనిన్ యిలా రాశాడు: "ఈ పదం, దాని చారిత్రక-తాత్విక అర్థంలో, తమ సిద్ధాంతాలకు నమూనాలను కాలంచెల్లిపోయిన సామాజిక రూపాలనుండి గ్రహించే సిద్ధాంతకారుల పొరపాటును వర్ణించడానికి మాత్రమే ప్రయోగింపబడింది. ఈ సిద్ధాంతకారుల వ్యక్తిగత గుణాలకు గాని, వాళ్ల కార్యక్రమాలకు గాని యీ పదం ఎంతమాత్రమూ వర్తించదు. ఆ పదానికి గల మామూలు అర్థంలో, సిస్మాండీ గాని, ప్రూడన్ గాని అభివృద్ధినిరోధకులు కారని అందరికీ తెలిసిందే."*

అనేక విధాలుగా సిస్మాండీ ప్రగతిశీల చింతనాపరుడూ, వ్యక్తీ. తక్కువ ప్రగతిశీలమైన సామాజిక వ్యవస్థల స్థానాన్ని మరింత ప్రగతిశీలమైనవి ఆక్రమిస్తాయి, అన్న చారిత్రక క్రమానికి సంబంధించిన ఆయన అవగాహనలో, ప్రధానంగా యిది ద్యోతకమవుతుంది. పెట్టుబడిదారీ విధానాన్ని మించి మరే వ్యవస్థలోనూ సామాజికాభివృద్ధి అవకాశాలను చూడని రికార్డోతోనూ, ఆయన అనుయాయులతోనూ వాదించే క్రమంలో, సిస్మాండీ తన ప్రత్యర్థులను యిలా ప్రశ్నించాడు: "...కొన్ని సామాజిక రూపాలను తోసిరాజని వాటి స్థానాన్ని ఆక్రమించిన పెట్టుబడిదారీ విధానం, వాటికన్న ప్రగతిశీలమైనదన్న ప్రాతిపదికపైన మనం నిజాన్ని చేరుకున్నామనీ, బానిసత్వం, ఫ్యూడలిజం, గిల్డు కార్పొరేషన్ల వ్యవస్థల్లోని – మౌలిక దోషాన్ని గుర్తించినట్లుగానే, వేతన శ్రమ వ్యవస్థలోని మౌలిక దోషాన్ని ఆవిష్కరించబోమని మనం నిర్ధారణ చేసుకోగలమా... మన మనుమలూ, మనమూ కూడా కార్మికవర్గాలను బానిసత్వానికి దిగజార్చిన జాతులను ఆటవికమైనవని ఖండిస్తున్నాం. అదే కార్మికవర్గాలను రక్షణలేకుండా వదిలేసిందుకుగాను, మనల్ని అంతే ఆటవికులుగా మన మనుమలు పరిగణించే కాలం నిస్సందేహంగా వచ్చితీరుతుంది."**

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 2, Moscow, 1971, p. 217

** J.-C.-L. Simonde de Sismondi, *Nouveaux principes d'économie*

యీ వాక్యాలను బట్టి, పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానాన్ని అంతకన్న ఉన్నతమూ, మరింత మానవతాపూర్ణమూ అయిన సామాజిక వ్యవస్థ ఆక్రమిస్తుందన్న విషయాన్ని సిస్మాండీ ముందుగానే దర్శించాడని బోధపడుతుంది. అయితే, అది ఎలా ఉంటుందో ఆయన ఊహించలేకపోయాడంతే.

సంక్షోభాలు

"కాగా, జాతులు పరస్పర విరుద్ధంగా కనిపించే ప్రమాదాలకు గురి అవుతాయి. అతిగా వ్యయంచెయ్యడం ద్వారానూ, మరీ తక్కువగా వ్యయంచెయ్యడం ద్వారానూ కూడా సమానంగానే జాతులు దివాళా తియ్యవచ్చు."* సిస్మాండీ గ్రహణ శక్తి ఆశ్చర్యకరమైనది. స్మిత్‌కి గాని, రికార్డోకి గాని యీ సమస్యను యీ విధంగా చూడాలని తట్టివుండదు. వాళ్ల దృష్టిలో, ఒక వ్యక్తి మాదిరిగానే ఒక దేశం, ఆదాయాన్ని మించిన వ్యయంచేసి, పర్యవసానంగా "పెట్టుబడిని మింగివేసినప్పుడు" మాత్రమే దివాళా తియ్యగలదు. మరీ తక్కువ ఖర్చుపెట్టడం ద్వారా అదెలా దివాళా తియ్యగలదు?

నిజానికి సిస్మాండీయొక్క యీ భావంలో ఎంతో నిజం వుంది. ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి యిది ఎక్కువగా వర్తిస్తుంది. జాతి "మరీ తక్కువ వ్యయం చేస్తున్నందున" సంక్షోభాలు మొదలవుతాయన్న మాట కొంతవరకు నిజమే. కొనుగోలుదారులు లేనప్పుడు సరుకులు గిడ్డంగులలో మేట్లు పడిపోతాయి, ఉత్పత్తి తగ్గిపోతుంది, ఉద్యోగాలూ, ఆదాయాలూ పడిపోతాయి. ఆధునిక బూర్జువా సమాజం, జనాన్ని మరింత ఎక్కువగా కొనేలా ప్రోత్సహించడం ద్వారా, సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తుంది. లేకపోతే, జాతీయ రుణం ద్వారా డబ్బును జమచేసి, తనమటుకు తాను పొదుపుగా ఖర్చుపెట్ట నారంభిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తిచెయ్యబడిన సరుకుల మొత్తాన్ని వినియోగించడానికి తగినంత ఫలవంతమైన గిరాకీ లేకపోయినట్లయితే, యీ గిరాకీని ప్రోత్సహించాలి, లేకపోతే కృత్రిమంగానైనా దాన్ని సృష్టించాలి. ఇది ఆధునిక సంక్షోభవ్యతిరేక విధానానికి సంబంధించిన ఒక సర్వసాధారణ సత్యం.

---

politique, ou de la richesse dans ses rapports avec la population, t. 2, Paris, 1827, p. 435.

* అదే గ్రంథం, మొదటి సంపుటం, పేజి 123.

సంక్షోభ కారణాల సైద్ధాంతిక అవగాహనను కాకపోయినా, అనుభవంనుంచి ఉత్పన్నమైన ఆచరణాత్మక పద్ధతులనూ, యీ అనుభవపు సాధారణీకరణనూ యిది ప్రతిబింబిస్తుంది. కొన్ని పరిమితుల లోపల యీ పద్ధతులు సంక్షోభాలను ఎదుర్కోవడంలో ఫలవంతం కావచ్చు.

అయితే సిస్మాండీ సైద్ధాంతిక విధానంలో కొన్ని ప్రగాఢమైన పొరపాట్లు వున్నాయి. అవే చివరకు అభివృద్ధినిరోధకమైన ఊహాస్వర్గానికి — పితృస్వామిక వ్యవస్థ పునరుద్ధరణకీ, వెనుకబాటుతనాన్ని, చేతి శ్రమను సమర్ధించడానికి దారితీశాయి. పైన సిస్మాండీ అభిప్రాయాలను వివరిస్తూ మనం యింతసేపూ వ్యక్తిగత వినిమయాన్ని గురించీ, దాని వస్తువులను గురించే చెప్పకున్నాం. ఇది యాదృచ్ఛిక విషయమేమీ కాదు. స్మిత్ మాదిరిగానే సిస్మాండీ కూడా శ్రమోత్పాదితాన్ని ఆదాయాల — లాభాలు, వడ్డీ, వేతనాల — మొత్తంగా కుదించాడు. మార్క్స్ స్మిత్ పిడిసూత్రం అని పేర్కొన్న విచిత్ర భావాన్ని యిది కలుగజేసింది — ఒక జాతి సాలుసరి ఉత్పాదితాన్ని, దాని వస్తు రూపంలో, వినిమయ వస్తువుల రాశిగా కుదించవచ్చునన్నదే యీ భావం. ఎందుచేతంటే ఆదాయాలు ప్రధానంగా వినిమయంపైన వెచ్చింపబడతాయి. జాతీయ ఆర్థికవ్యవస్థచేత ఉత్పత్తి చెయ్యబడిన మిగిలిన వాటన్నింటినీ కూడా, "శుద్ధ విశ్లేషణ" నిమిత్తం, అలక్ష్యం చెయ్యగలం. సిస్మాండీ యీ పిడివాద సూత్రానికి, ఆర్థిక సంక్షోభాల కారణాలను గూర్చిన తన భావాలకు దాన్ని ప్రాతిపదికను చేసుకోవడం ద్వారా, ఒక ప్రత్యేక భాష్యాన్ని యిచ్చాడు.

అయితే నిజానికి, సమాజపు సాలుసరి ఉత్పాదితం వినిమయ వస్తువులతోనే కాకుండా, యంత్రాలు, రవాణా, బొగ్గు, లోహ, తదితర పదార్థాల వంటి ఉత్పత్తి సాధనాలతో కూడా కలిసివుంటుంది. వాటిలో కొంతభాగం, తర్వాత వినిమయ వస్తువుల రూపం దాలుస్తాయన్న మాట నిజమే ననుకోండి. అయితే యిది, తర్వాత సంవత్సరం గాని, యింకా తర్వాతగాని సంభవించవచ్చు. అంతేకాదు, పరిశీలనలో వున్న ఏడాది చట్రంలోపల కూడా, మాటవరుసకు వస్త్రం అమ్మకాన్ని గురించి మాత్రమే చెప్పలేము. ఆ వస్త్రం ఏ పత్తినుంచైతే ఉత్పత్తిచెయ్యబడుతుందో ఆ పత్తి వగైరాల అమ్మకాలను గురించి కూడా చెప్పవలసివుంటుంది. కొత్త పెట్టుబడి మదుపు పెట్టబడకపోయినా కూడా, పాతగిలిపోయిన వాటి స్థానంలో నెలకొల్పేందుకు అవే యంత్రాలను ఉత్పత్తి చెయ్యవలసి వుంటుంది. అలాగే పాతవాటి స్థానే కొత్త భవనాలను నిర్మించవలసి వుంటుంది. పెట్టుబడిదారీ విధానపు విశిష్ట లక్షణమేమిటంటే సరళ పునరుత్పత్తి కాక, విస్తరిత పునరుత్పత్తి — దీనిలో కొత్త పెట్టుబడి మదుపు నిరంతరాయంగా సాగుతూ వుంటుంది — జరగడం.

ఉత్పత్తి సంక్లిష్టత పెరగడం, కొత్త శాఖలు అభివృద్ధి చెందడం, ఆటోమేషన్ పెంపొందడం — వీటితో, పొలుసరి ఉత్పాదితంలో ఉత్పత్తి సాధనాల పాలు కొంతమేరకు పెరుగుతుంది. సంచయనపు రేటు అధికంగా వున్నప్పుడు, అంటే, ఉత్పాదితానికి సంబంధించి పెట్టుబడి మదుపు పరిమాణం అధికంగా వున్నప్పుడు, అది ప్రత్యేకించి ఎక్కువగా వుంటుంది. ఉత్పత్తి సాధనాల కోసం ఆర్థికవ్యవస్థ గిరాకీ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టిస్తుంది. ఈ మార్కెట్ చాలవరకు సమాజపు వినిమయ సామర్థ్యంతో నిమిత్తం లేకుండా వుంటుంది. ఇందుచేతనే సంక్షోభాలు ఎప్పుడూ ఆవర్తితం గానే వుంటాయిగాని, అవి నిరంతరాయమైనవై వుండవు. కొంతవరకు పెట్టుబడి, ఒక విధంగా చెప్పాలంటే నియమిత వలయంలో చలామణీ అయి, తనను తను పోషించు కుంటుంది. గనుల్లోంచి బొగ్గు తవ్వబడుతుంది, అయితే అది, ప్రజల పొయ్యిల్లో కాక, బ్లాస్ట్ ఫర్నేసుల్లో వినియోగింపబడుతుంది. లోహం కరిగించబడుతుంది, అయితే అది, చాకులూ, ఫోర్కులూ చెయ్యడానికి ఉపయోగింపబడక, గని పరిశ్రమకు కావలసిన యంత్రాలను చెయ్యడానికి వినియోగింపబడుతుంది. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ సద్యోజనిత స్వభావం ఏమిటంటే, బొగ్గు, లోహం, యంత్రాలూ చాలా ఎక్కువగా ఉత్పత్తి చెయ్యబడుతున్నాయన్న విషయాన్ని అది వెంటనే బయటపెట్టదు.

సంక్షోభాలకు కారణాలను, వినిమయ వస్తువులకు ఫలవంతమైన గిరాకీని కల్పించే సామర్థ్యంలేని జనాభాలోని అత్యధిక సంఖ్యాకుల పేదతనంలోనే వెదకడం పొరపాటు అవుతుంది. జీవన ప్రమాణం అతి తక్కువగా ఉన్నప్పుడు కూడా, ఉత్పత్తి గణనీయంగా పెరగవచ్చునన్న విషయాన్ని సిద్ధాంత కార్యాచరణలు రెండూ కూడా నిరూపిస్తున్నాయి. ఆర్థికవ్యవస్థలోని ఉత్పత్తి గిరాకీకి గణనీయమైన ప్రమాణంలో సైనిక పదార్థాల గిరాకీ జోడైనప్పుడు, యిది ప్రత్యేకించి స్పష్టం. చివరిసంగతి, పెట్టుబడిదారీ విధానానికి పూర్వం, జనాభాలోని అత్యధిక సంఖ్యాకులు 19వ శతాబ్దంలో అంతగానూ, లేక అంతకంటె అధికంగానూ పేదతనంలో వున్నప్పటికీ, సంక్షోభాలు లేవన్న సంగతిని గుర్తుచేసుకోవలసి వుంది.

పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి వినిమయాలకు మధ్య అంతర్గతంగా వున్న వైరుధ్యం, ఆర్థిక సంక్షోభాల్లో కూడా ముఖ్యమైన పాత్రను వహిస్తుంది. అయితే, సిస్మోండీ అభిప్రాయానికి భిన్నంగా, దీని విషయంలో వున్నది అంతా యింతేకాదు, యింకా వుంది. మార్క్స్ నిరూపించినట్లు, యిదే వైరుధ్యం, మరింత సాధారణమైన దానికి — ఉత్పత్తియొక్క సామాజిక స్వభావానికీ, దాని ఫలితాలయొక్క వ్యక్తిగత పెట్టుబడిదారీ హరణ రూపానికీ మధ్య వైరుధ్యానికి — వ్యక్తీకరణ. ఈ వైరుధ్యానికి అర్థం

ఏమిటంటే, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సామాజికం చెయ్యబడిందని, అంటే విస్తృతమైన మార్కెట్ కోసం, ప్రధానంగా ప్రత్యేకీకృతమైన భారీ కంపెనీల చేత సాగింపబడిందని. అయితే, యీ ఉత్పత్తి, సమాజపు ఆశయాలకూ, ప్రయోజనాలకూ కాక, ఆ కంపెనీల సొంతదారులైన పెట్టుబడిదారుల లాభానికి లోబరచబడింది. భారీ సామాజికోత్పత్తి, తన సొంత నియమాలకు అనుగుణంగా అభివృద్ధిచెందుతుంది. పెట్టుబడిదారులు దాన్ని ఒక గమ్యంగా కాక, డబ్బు సంపాదనకు ఒక సాధనంగా మాత్రమే పరిగణిస్తారన్న వాస్తవంతో, ఒక విధంగా, భారీ సామాజికోత్పత్తికి సంబంధం లేదు. ఇదిగో, యీ వైరుధ్యమే సంక్షోభాల్లో పరిష్కరింపబడుతుంది.

ప్రతి ఒక పెట్టుబడిదారూ తన ఫ్యాక్టరీలో ఉత్పత్తిని పెంచేందుకూ, అదే సమయంలో తన కార్మికుల వేతనాన్ని పరమ కనిష్ఠ స్థాయిలో వుంచేందుకూ ప్రయత్నిస్తాడు. మరోవంక, ప్రతి ఒక పెట్టుబడిదారూ, ఆ నిర్దిష్ట శాఖలోనూ, తదితర శాఖల్లోనూ మొత్తం పరిస్థితితో ప్రసక్తి లేకుండా, తన సరుకు ఉత్పత్తిని పెంచుతాడు. తత్ఫలితంగా సరుకులు సాపేక్షంగా (ఫలవంతమైన గిరాకీతో పోలిస్తే) అధికంగా ఉత్పత్తి చెయ్యబడుతాయి. ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి అవసరమైన నిష్పత్తులు అస్తవ్యస్తమవుతాయి. పరిశ్రమలో స్థిర పెట్టుబడి పాత్ర పెరుగుదలతో, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి మదుపులను గూర్చిన నిర్ణయాలు వ్యక్తిగత పరిశ్రమదారులచేత, అసమన్విత, విచక్షణారహిత పద్ధతిలో చెయ్యబడుతాయన్న వాస్తవానికి అధికతర ప్రాముఖ్యం చేకూరుతుంది. అందుబాటులో వున్న వనరులన్నింటి వినియోగానికీ తగినంత పెట్టుబడి మదుపును వాళ్ళు పెడతారన్న హామీ ఏమీ ఉండజాలదు.

సంక్షోభం – పెట్టుబడిందీ విధానపు సహజ, అనివార్య గతి రూపం, ఒక తాత్కాలిక సమతౌల్య స్థితినుంచి మరొకదానికి పరివర్తన రూపం. సైబెర్నెటిక్స్ పరిభాషలో చెప్పాలంటే, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ, చాలా సంక్లిష్టమైన ఫీడ్ బాక్ (పరస్పర సంబంధాల)తో కూడిన, కేంద్ర అజమాయిషీ లేని స్వయంకార్యక్రమ నిర్ణాయక వ్యవస్థ. అత్యంత సముచిత పరిస్థితులకు (ప్రస్తుతానికి పరిశీలనలో వున్న ఈ వ్యవస్థ యొక్క) కార్యక్రమ నిర్ణయం ప్రయత్నక్రమంలో జరుగుతుంది. సంక్షోభాలు, సున్నితంగా చెప్పాలంటే, యీ ప్రయత్న క్రమంలో ఉత్తమ మార్గాన్ని కనుక్కోవడమే. అయితే, ఆర్థికరీత్యా, సామాజికరీత్యా, సమాజానికి వాటివల్ల కలిగే నష్టం చాలా ఎక్కువ. ఉత్పత్తిలో కలిగిన నష్టపు మొత్తంతోనూ, తత్పర్యవసానంగా వినిమయంలో తక్కువైన సరుకుల మొత్తంతోనూ, కోల్పోయిన పనిసంవత్సరాలతోనూ, సామాజికరీత్యా కార్మికవర్గపు పేదతనంలో పెరుగుదలతోనూ యీ నష్టాన్ని అంచనావెయ్యగలం.

సిస్మాండీజం చారిత్రక భవితవ్యం

1890 దశకంలో, సిస్మాండీ పేరూ, ఆయన భావాలూ, రష్యన్ విప్లవ మార్క్సిస్టులు లిబరల్ నరోద్నిక్కుల (ప్రజావాదుల) జరిపిన పోరాటానికి కేంద్ర స్థానాన్ని వహించాయి. ప్రగాఢమైన ఆర్థిక చింతనాపరుడుగానూ, సముజ్వలమైన వాదనా పటిమ కలవాడుగానూ లెనిన్ ప్రతిభ రూపుదాల్చినది యీ పోరాట క్రమంలోనే. రష్యన్ విప్లవాత్మక సోషల్-డెమోక్రసీ అభివృద్ధిలో యీ పోరాటం ప్రముఖ పాత్ర వహించింది. రష్యాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధికి పునాది లేదని నరోద్నిక్కులు వాదించారు. ఎందుకంటే అది సరుకు అమ్మకం సమస్యను పరిష్కరించజాలదనీ, భారీ పెట్టుబడిదారీ పరిశ్రమలు ఉత్పత్తి చెయ్యగలిగిన సరుకుల బాహుళ్యాన్ని కొనుగోలు చెయ్యగల శక్తి జనంలో లేకపోవడాన్నీ, జనం మిక్కిలి పేదతనంలో మగ్గుతూండటాన్నీ వాళ్లిందుకు కారణంగా చూపించారు. పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాలో ముందెన్నడో ప్రవేశించిన యితర దేశాలు విదేశీ మార్కెట్లను చాలా కాలం క్రితమే ఆక్రమించుకుని కూర్చున్నాయి. కాగా, రష్యా విదేశీ మార్కెట్లపైన ఆధారపడజాలదు. నరోద్నిక్కులు రష్యాకు ఒక "ప్రత్యేక" అభివృద్ధి పంథాను ప్రతిపాదించారు: పెట్టుబడిదారీ విధానాన్ని దాటవేసి, రైతాంగ కమ్యూన్ల "సోషలిజం"ను అనుసరించడమే అది. లెనిన్ నిరూపించినట్లు, యీ పెటీబూర్జువా ఊహాజనిత స్వర్గం, సైద్ధాంతికాభిప్రాయాల రీత్యా సిస్మాండీ అభిప్రాయాలకు చాలా సన్నిహితమైనది. సిస్మాండీ కూడా "అల్ప వినిమయం" ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోతుందని జోస్యం చెప్పి, చేతివృత్తులవారిమీదా, రైతులమీదా తన ఆశలను నిలుపుకున్నాడు.

ఇరవయ్యవ శతాబ్దారంభంలో పెట్టుబడిదారీ విధానపు గుత్తదశ నియమాలు, మార్క్సిజానికి అతి ముఖ్యమైన సైద్ధాంతిక సమస్య అయాయి. ఈ సమస్య చట్రం లోపలే, పెట్టుబడి సంచయనపు నూతన రూపాలకూ, ధోరణులకూ సంబంధించిన, సామ్రాజ్యవాదం కింద యీ క్రమంయొక్క వైరుధ్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఉత్పన్నమయాయి. 1913లో, జర్మన్ సోషల్-డెమోక్రట్ల నాయకుల్లో ఒకరైన రోజా లుక్సెంబర్గ్, "పెట్టుబడి సంచయనం" అన్న శీర్షికతో రచించిన ఒక పుస్తకం వెలువడింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంచయనాల అవకాశాలనూ, పరిమితులనూ చూసిన చింతనాపరులలో సిస్మాండీయే మొదటివాడుగనుక, యీ పుస్తకంలో ఆయన భావాల విశ్లేషణకు ఒక ముఖ్య స్థానం కల్పించబడింది. సేయ్‌తోనూ, రికార్డో అనుయాయులతోనూ సిస్మాండీ వివాదాలను పేర్కొని, వాటిలో సిస్మాండీ

సిద్ధాంతంలోని సానుకూలాంశాలను రోజా లుక్సెంబుర్గ్ ఎంతో ప్రతిభావంతంగా నిరూపించింది.

అయితే తన సైద్ధాంతిక భావాల్లో రోజా లుక్సెంబుర్గ్, "శుద్ధ పెట్టుబడిదారీ" సమాజంలో పెట్టుబడి సంచయన, ఉత్పత్తి పురోగతుల అసాధ్యతకు సంబంధించిన సిస్మొండీ ప్రధాన ప్రతిపాదనను ఆమోదించింది. సామాజిక ఉత్పాదితపు అమ్మకానికి సంబంధించిన మార్క్స్ పథకాలకు ప్రాతిపదిక అయిన యీ సాధారణీకరణను, "నిస్సార సైద్ధాంతిక కల్పన" అందామె. ఆమె చెప్పిన దాని ప్రకారం, మార్క్స్ అమ్మకాల విశ్లేషణ ఆర్థిక సంక్షోభాల అసంభావ్యతను రుజువుచేసింది. సిస్మొండీ మాదిరిగానే రోజా లుక్సెంబుర్గ్ వాస్తవానికి, పెట్టుబడిదారీ విధానాభివృద్ధి పెట్టుబడిదారీపూర్వ ఆర్థికవ్యవస్థా రూపాలు భగ్నమైనప్పుడు మాత్రమే సాధ్యం అని వాదించింది. ఈ క్రమ పరిపూర్తి, పెట్టుబడిదారీ విధానానికి "నాడీ దిగ్బంధన" ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ఇది ప్రత్యేకించి, సామ్రాజ్యవాదానికి ఆమె తప్పుడు భాష్యాన్ని చెప్పేందుకు దారితీసింది. రోజా లుక్సెంబుర్గ్ నిజానికి సామ్రాజ్యవాదాన్ని, వలసలను ఆక్రమించుకొనే విధానంగా కుదించింది. ఈ విధానానికి కేవలం, దేశీ మార్కెట్లు కుంచించుకుపోయి, అమ్మకాల సమస్య తీవ్రం కావడమే కారణమని ఆమె విశ్వసించడమే యిందుకు మూలం.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక పెరుగుదల సంభావ్యతలనూ, అవకాశాలనూ అంచనావెయ్యడమనే కొత్త సమస్యలను మార్క్సిస్ట్ చింతన ఎదుర్కొంటోంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటపు వ్యూహానికీ, ఎత్తుగడలకూ, యీ మాదిరి సరైన అంచనాల ప్రాముఖ్యాన్ని అతిశయింపజేసి చెప్పడం అసాధ్యం. ఈ సందర్భంగా సిస్మొండీ, రోజా లుక్సెంబుర్గ్‌ల వంటి చింతనాపరుల అభిప్రాయాలకు చారిత్రకమైనదానికన్న అధికతర ప్రాధాన్యమే వుంది. వీళ్లు, అత్యంత సత్సంకల్పంతోనే అయినప్పటికీ, పెట్టుబడిదారీ విధానానికి, తన ఆంతరిక శక్తులతోనూ, మూలాధారాలతోనూ, "విస్తృతంగా సమగ్రంగా" అభివృద్ధిచెందడానికి గల వాస్తవావకాశాలను కొంచెపరిచారు. సోవియట్ ఆకడెమీషియన్ ఎన్. ఎన్. ఇనొజేమ్త్సెవ్ యీ విషయంలో అన్న మాటలను యిక్కడ ఉల్లేఖిస్తున్నాం: "1940 దశకపు చివరి సంవత్సరాల్లోనూ, 50 దశకపు ముందరి సంవత్సరాల్లోనూ పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధి స్థాయీ, సంభావ్యతా రేట్ల సమస్యపైన తప్పుడు అభిప్రాయాలు కొంత విస్తారంగానే వ్యాప్తిలోకి వచ్చాయి. పురోగతి దిశగానూ, తిరోగతి దిశగానూ రెండు ధోరణుల మధ్య జరిగే ఘర్షణ సామ్రాజ్యవాదపు విశిష్ట లక్షణం, ఈ రెండింటిలోనూ రెండవ ధోరణి ఉనికి, పెట్టుబడిదారీ విధానం యింతకు ముందరికన్న మరింత వేగంగా పెరగడాన్ని

ఏంతమాత్రం నిరోధించదని లెనిన్ చెప్పిన అంశాన్ని, యీ చింతనాపరులు నిజానికి గమనంలోకి తీసుకోవడం లేదు.... పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తుల 'స్వయం స్తంభన', 1929 – 33 మాదిరి తీవ్రమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభాల దిశగా దృష్టిని తిప్పడం, 1940 దశకం నాటికి ఉత్పన్నమైన నూతన పరిస్థితిలో, వాస్తవికంగా, ప్రపంచరంగంలో వర్గశక్తుల పరిస్థితియొక్క తప్పుడు అంచనాకు దారితీసింది.... ఒక రకమైన ఉదాసీనతనూ, ప్రపంచ విప్లవ క్రమపు యితోధికాభివృద్ధి విజయానికి అవసర షరతుగా భావింపబడిన కొన్ని అసాధారణ ఉపప్లవాల కోసం నిరీక్షణనూ అది సమర్థించింది."*

పెట్టుబడిదారీ విధానానికి చారిత్రకంగా వినాశం రాసిపెట్టివుంది. అయితే అందుకు కారణం అది యింక అభివృద్ధిచెందజాలకపోవడం కాదు. ఈ అభివృద్ధి ఉత్పన్నంచేసే వైరుధ్యాల మొత్తం నియమబద్ధంగానూ, తప్పనిసరిగానూ, పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో అంతకంటే ఉన్నతమైన సామాజిక వ్యవస్థ అయిన సోషలిజాన్ని తెచ్చేందుకు అవసరమైన పాదార్థిక, రాజకీయ పూర్వావసరాలను సృష్టిస్తాయి.

సిస్మాండీ భావాల పరిజ్ఞానం, ఆధునిక బూర్జువా అర్థశాస్త్ర అభివృద్ధిలోని కొన్ని ధోరణులను అర్థంచేసుకోడానికి మనకు తోడ్పడుతుంది. ఆయన అభిప్రాయాల ఛాయలూ, దేనిలోనైతే సామాజిక – ఆర్థిక విషయాలు పరిశీలింపబడుతాయో ఒకరకమైన ఆ "మాదిరి దృక్పథమూ" – యివి, 19వ శతాబ్దపు చివరి సంవత్సరాలకూ, 20వ శతాబ్దపు ముందరి సంవత్సరాలకూ చెందిన ఛాందస సిద్ధాంతాల దృష్ట్యా "సంప్రదాయ విరోధులు"గా కనిపించే రచయితల్లో కనిపిస్తాయి. ఈ సంప్రదాయ విరోధాలు రెండు రకాలు: కొందరిలో యిది, బూర్జువా వ్యవస్థపట్లనే కొద్దిగొప్పల్లో సునిశితమైన సామాజిక విమర్శ రూపంలో వుంది; మరికొందరు, ఆర్థిక సంక్షోభాలకు సంబంధించి "నయా సాంప్రదాయిక" ధోరణి తాత్పారాన్ని విమర్శించడానికే పరిమితం చేసుకుని, యీ సమస్యను ముందుకుతెచ్చారు. కొందరి విషయంలో యీ రెండు పార్శ్వాలూ సమ్మిళితమయ్యాయి. ఈ సుదూర సారూప్యతకు అతి ముఖ్యమైన ఉదాహరణ బహుశా జాన్ హాబ్సన్ ఆర్థిక సిద్ధాంతం.

బూర్జువా ప్రపంచ దృక్పథపు చట్రంలోనే వుంటూ, శతాబ్దపు మలుపులో హాబ్సన్ పెట్టుబడిదారీ విధానాన్నీ, యీనాటి అధికారిక అర్థశాస్త్రాన్నీ, ప్రత్యేకించి ఇంగ్లీషు అర్థశాస్త్రాన్నీ నిశితంగా విమర్శించాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి జనబాహు

---

* "ఆధునిక గుత్త పెట్టుబడిదారీ విధానపు అర్థశాస్త్రం," సంపుటం 2, మాస్కో, 1970, పేజీలు 373–75 (రష్యన్ భాషలో).

శ్యపు పరిస్థితిని మెరుగుపర్చేందుకు ఏవిధంగానూ అంకితం కాలేదనీ, సరికదా ఆ జనబాహుళ్యం అనుభవించలేని సంపదనూ, ఫలితాలనూ పెంపొందించిందనీ ఆయన పేర్కొన్నాడు. ఉత్పత్తీ, సంపదా "మానవ ఉపయోగం" దృష్ట్యా అంచనా వెయ్యబడాలని ఆయన వాంఛించాడు. నిర్ణీత కనీస వేతనం, పెట్టుబడిదారులపైన ఉన్నత వృద్ధిక్రమానుగతమైన పన్నుల విధింపులతోబాటు గుత్త సంస్థలపైన కచ్చితమైన ప్రభుత్వ అజమాయిషీలతో కూడిన సామాజిక సంస్కరణ పథకాన్నొకదాన్ని హాబ్సన్ ప్రతిపాదించాడు. ఆయన యిలా రాశాడు: "...సామాజిక పునర్నిర్మాణానికి సంబంధించిన ఏ పథకానికైనా కూడా, మన పరిశ్రమల మామూలు క్రమాల్లో వ్యక్తిగత లాభార్జన తృష్ణ స్థానంలో ప్రత్యక్షమైన సామాజిక అజమాయిషీని పెట్టడం అవసరం."*

సిస్మాండీ భావాలతో ఒకరకమైన సాన్నిహిత్యం, సంక్షోభాలకు సంబంధించిన హాబ్సన్ సిద్ధాంతంలో కూడా మనకి కనిపిస్తుంది. దానిలో "సేయ్ నియమాన్ని" అతి తీవ్రంగా విమర్శించి, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సాధారణ అమితోత్పత్తి సంక్షోభాలు సంభవమే కాకుండా అనివార్యం కూడా అని ఆయన వాదించాడు. అత్యధిక సంచయనానికి నిరంతరాయంగా ప్రయత్నించడం — యిది బూర్జువా సామాజిక నిర్మాణపు ఉత్పాదితం; జనాభా సరుకు వినిమయ సామర్థ్యం అంతే నిరంతరాయంగా కుంటువడటం — వీటినే సంక్షోభాలకు కారణాలుగా ఆయన పరిగణిస్తాడు. తత్పర్యవసానంగా పెట్టుబడి అత్యధికంగా పెరగడం, పెట్టుబడి మదుపుకీ, వినిమయ వస్తువులకీ దేశంలో గిరాకీ కొరత — వీటినే, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని భారీ పెట్టుబడియొక్క విదేశీ ఆర్థిక విస్తరణకు ప్రధాన కారణంగా హాబ్సన్ పరిగణించి, యీ దేశాల "దురాక్రమణపర సామ్రాజ్యవాదాన్ని" ఖండించాడు.

సంచయన, సంక్షోభాల సైద్ధాంతిక రంగంలో, హాబ్సన్‌ను తన అతి సన్నిహిత పూర్వీకుడుగా కీన్స్ పరిగణించాడు. ఈ సందర్భంగా పలువురు బూర్జువా రచయితలు కీన్స్, సిస్మాండీల మధ్య భావజాలాత్మకమైన సంబంధాలు ఉన్నాయన్న సంగతి గురించి చర్చలు జరిపారు. అయితే యీ సంబంధం, వినియోగపు ఉపాంత ప్రవృత్తి అనబడేదాని పతనాన్ని సంభావ్య అదనపు పొదుపులకూ, ఫలవంతమైన గిరాకీ కొరతకూ గల కారణాల్లో ఒకటిగా కీన్స్ పరిగణించాడన్న వాస్తవానికి పరిమితమైనట్లు కనిపిస్తుంది. అటువంటి విస్తృతమైన భాష్యం చెప్పుకున్నప్పుడు, ఆ ఆర్థిక సంక్షోభ సిద్ధాంతాలలో దాదాపు అన్నింట్లోనూ కూడా — వేటిలో వ్యక్తిగత వినియోగ, వినిమయ గిరాకీల పాత్ర వుం

---

* Ben B. Seligman రాసిన *Main Currents in Modern Economics*, New York, 1963, p. 238నుండి ఉల్లేఖింపబడింది.

టుందో – సిస్మాండీ "ప్రభావాన్ని" చూడవచ్చు. సిస్మాండీ పేరు, 20వ శతాబ్దపు తొలి భాగానికి చెందిన ప్రసిద్ధ ఫ్రెంచి అర్థికవేత్త ఆల్బర్ట్ అఫ్తల్యోన్ పేరుతో తరచుగా ముడిపెట్టబడుతూ వుంటుంది. ఈ అఫ్తల్యోన్ త్వరణ సూత్ర ఆవిష్కర్తగా పరిగణింపబడ్డాడు. వినిమయ వస్తువుల గిరాకీ ఉత్పత్తులు, పెట్టుబడి మదుపులోనూ, యంత్రోత్పత్తిలోనూ సాపేక్షంగా మరింత నిశితమైన మార్పులను కలిగించి, తత్కారణంగా సంక్షోభాల్లో ముఖ్యమైన పాత్ర వహిస్తాయన్నదే యీ త్వరణ సూత్రం. ఆర్థిక చక్రంలోని సామాజికోత్పత్తి ఉప విభాగాల మధ్యగల లంకెలను ప్రతిబింబించే హేతుబద్ధమైన కొన్ని అంశాలు యీ త్వరణ సూత్రంలో వున్నాయి.

విస్తృత ప్రమాణంలో వాస్తవిక పరిస్థితులచేత యిటీవలి దశాబ్దాల్లో నిర్ణయింపబడిన బూర్జువా అర్థశాస్త్ర పరిణామం సాగుతున్న దిశను పరిశీలిస్తే, దానికి సంబంధించిన కొన్ని ధోరణులను సిస్మాండీ సూక్ష్మ బుద్ధితో యింతకుముందే దర్శించాడని బోధపడుతుంది. జేమ్స్ ఏమి రాశాడో చూద్దాం: "ఇది యిక ఎంతమాత్రమూ సూక్ష్మ అర్థశాస్త్రం కాదు, స్థూల అర్థశాస్త్రం. ఆర్థిక విషయాలను క్రియాశీల దృక్పథంనుంచి అధ్యయనం చెయ్యాలన్న తపన, ఆర్థిక అసమతౌల్యపు పౌనఃపున్యంలోనూ, 'సామాన్యత్వం'లోనూ విశ్వాసం, 'స్వేచ్ఛా వాణిజ్య' తిరస్కరణ, 1900తో పోల్చినప్పుడు 1950కి విశిష్టమైన ప్రధాన లక్షణాలైన జోక్యందారీ భావాల అభివృద్ధి."* మనం యింతకుముందు చూసినట్లు, యీ అంశాల్లో ప్రతి ఒక్కటీ (వేరే మాటల్లోనూ, తరచుగా భిన్నమైన నిర్ధారణలతోనూ) బీజప్రాయంగా సిస్మాండీలో మనకి కనిపిస్తాయి. వీటన్నింటినీ చూసినప్పుడు, సిస్మాండీ సైద్ధాంతిక ఆలోచనలోని ప్రయోజనకర స్వభావాన్ని మనం గ్రహించవచ్చు.

అయితే ఆయన వారసత్వానికీ, చారిత్రక ప్రాముఖ్యానికీ ఎల్లలు యింతమాత్రమే కాదు. గుత్త పెట్టుబడిదారీ విధానాన్ని బలపరచడమే తన ప్రస్తుత లక్ష్యంగా కలిగిన బూర్జువా ఆర్థిక విజ్ఞానశాస్త్రం, సిస్మాండీ రచనల్లో వున్న సామాజిక నిరసన భావాన్ని వారసత్వంగా స్వీకరించలేదు, స్వీకరించజాలదు కూడా. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మిక జనాన్ని ఆయన గట్టిగా బలపరిచాడు, దోపిడినీ, పీడననూ వ్యతిరేకించాడు. బూర్జువా అర్థశాస్త్రంలోని పెట్టుబడిదారీ విధాన సమర్థన ధోరణులను విమర్శించాడు. ప్రముఖ చింతనాపరుడు, మానవతావాది.

---

* E. James, *Histore de la pensée économique an XX^e siécle*, Paris, 1955, p. 18.

ప్రూడన్

సిస్మాండీ పేరు ఫ్రెంచివాడైన ప్యేర్ జోసెఫ్ ప్రూడన్ పేరుతో జతపరచ బడటమన్నది యాదృచ్ఛిక విషయమేమీ కాదు. సిస్మాండీ మాదిరిగానే ప్రూడన్ కూడా పెట్టుబడిదారీ విధానాన్ని పెటీబూర్జువా దృక్పథంనుంచి తీవ్రంగా విమర్శించాడు. సిస్మాండీ మాదిరిగానే ఆయన కూడా, పెట్టుబడిదారీ విధానపు పునాదులను నాశనం చెయ్యకుండా, దానిలోని దోషాల రద్దులో పరిష్కారం కోసం వెతికాడు. అయితే ఆయన సిస్మాండీకి 20–40 ఏళ్ల తర్వాత రచనలు చేశాడు. అప్పటికే వర్గపోరాటం వృద్ధి చెంది, సోషలిజంయొక్క వివిధ ధోరణులు విశేషంగా విస్తరించాయి. అర్థశాస్త్ర, సామాజిక శాస్త్రాల చరిత్రలో ప్రూడన్, పెటీబూర్జువా సోషలిజానికి ప్రధాన ప్రతినిధిగా పరిగణింపబడ్డాడు.

బూర్జువావర్గంపైన ప్రూడన్ చేసిన సాహసిక విమర్శనూ, ఆయన అసాధారణ మేధాసంపదనూ, పబ్లిసిస్టుగా ఆయన ప్రతిభనూ మార్క్స్ ప్రశంసాపూర్వక దృష్టితో చూశాడు. అయితే ప్రూడన్ వర్ణించే పెటీబూర్జువా ఊహాజనిత స్వర్గాలు తరుణ కార్మికోద్యమానికి హానిదాయకాలు, ప్రమాదకారులు. అప్పుడే ప్రచురింపబడిన "ఆర్థిక వైరుధ్యాల వ్యవస్థ లేక దారిద్ర్యపు తత్వశాస్త్రం" అనే ప్రూడన్ పుస్తకం తను బ్రస్సెల్స్‌లో వుండగా అందినప్పుడు, మార్క్స్ "తత్వశాస్త్ర దారిద్ర్యం" (1847) అన్న తన పుస్తకంలో దాన్ని తీవ్రంగా ఖండించాడు. ఈ గ్రంథ ప్రాముఖ్యం ప్రూడన్‌పై విమర్శకే పరిమితం కాలేదు, మార్క్స్ ఆర్థిక సిద్ధాంతపు ప్రధాన సూత్రాలు దానిలో పొందు పరచబడ్డాయి.

ప్రూడన్ పేద కుటుంబానికి చెందినవాడు. యౌవనంలో ఆయన పశులకాపరిగానూ, కంపోజిటరుగానూ పనిచేశాడు. అటుతర్వాత ఒక ప్రింటింగు ప్రెస్సులో భాగస్వామిగానూ, గుమాస్తాగానూ వున్నాడు. ఆయనకి క్రమబద్ధమైన విద్యాభ్యాసం లేదు. ఆయన స్వయంకృషితో విద్యావంతుడైన ప్రతిభావంతుడు. ఆయన జీవితం క్లిష్టమైనది, పొడుగునా చాకిరీతో, యాతి బాధలతో, ఘర్షణతో, వేధింపులతో గడిచింది. లూయీ ఫిలిప్ రాజు కాలంలో తన సాహసిక భావాలకుగాను ఆయన కోర్టుకు యీడ్వబడ్డాడు. నియంత అధ్యక్షుడైన లూయీ నెపోలియన్ పాలనలో ఆయన మూడేళ్లు జైల్లో పెట్టబడి, అటుతర్వాత దేశంనుంచి వెళ్లగొట్టబడ్డాడు. బ్రస్సెల్సులో కోపోద్రిక్త జన సమూహం ఆయన్ని చుట్టుముట్టి దాదాపు చంపినంత పని చేశారు. వాళ్లు ఆయన్ని లూయీ నెపోలియన్ (అప్పటికి మూడవ నెపోలియన్ చక్రవర్తి)కి ఏజెంటుగా భావించిన దాని పర్యవసానమే యిది.

ప్రూడన్ జీవితంలోనూ, కార్యకలాపాల్లోనూ వైరుధ్యాలు కొల్లలుగా కనిపిస్తాయి. విజ్ఞానశాస్త్ర, సాహిత్య రంగాల్లోనూ, ప్రత్యేకించి అర్థశాస్త్రంలోనూ, బూర్జువా వర్గాన్నీ, దాని సిద్ధాంతకారులనూ ఆయన ఢీకొన్నాడు. అయితే అదే సమయంలో కమ్యూనిజాన్ని తీవ్రంగా ఖండించాడు. రాజకీయాల్లో ఆయనొక అవకాశవాది: మూడవ నెపోలియన్‌ని ఒక రోజున తీవ్రంగా విమర్శించేవాడు, ఆ మరుసటి రోజుననే అందుకు పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తూ, అతనిపై పొగడ్తలను వర్షిస్తూ లేఖలు రాసేవాడు. అన్ని రకాల పీడనకూ, అసమానత్వానికీ వ్యతిరేకంగా పోరాడిన ప్రూడన్, సమాజంలో స్త్రీల పరాధీన స్థితిని సహజమూ, సాధారణమూ అయిన విషయంగా పరిగణించాడు. ఈ సూత్రాన్ని కొంతమేరకు తన కుటుంబంలో కూడా అమలుపరిచాడు. ఆయన రచనల్లో ఒకదానిలో స్త్రీల మానసిక శక్తులూ, శారీరక శక్తులూ కూడా పురుషుల వాటిలో మూడింట రెండు వంతులు మాత్రమే అని రాశాడు.

ప్రూడన్ వ్యక్తిత్వం ఒక విధంగా, పెటీబూర్జువావర్గపు వైరుధ్యాలనూ, ఒక వర్గంగా పెట్టుబడిదారీ సమాజపు ప్రధాన వర్గాల మధ్య దాని మధ్యంతర, అస్థిర స్థానాన్నీ ప్రతిబింబిస్తుంది.

1848 విప్లవ తరంగోధృతిలో ఆయన సోషలిస్టు అయాడు, అది ఆయన్ని రాజకీయ ఘటనల సుడిగుండంలోకి యీడ్చి, సమాజంపైనా, ఆర్థిక వ్యవస్థపైనా తన అభిప్రాయాలను కచ్చితంగా వ్యక్తంచెయ్యక తప్పనిసరి పరిస్థితిని కల్పించింది. ప్రూడన్‌లో ఎంతటి అసంగతత్వమూ, గందరగోళపు భావాలూ వున్నప్పటికీ, ఆయన నిజాయితీపరుడూ, ధైర్యవంతుడూ. పారిస్ కార్మికుల జూన్ తిరుగుబాటు అణచివేతకు కొద్ది రోజుల ముందు ఆయన రాజ్యాంగ నిర్ణయసభకు సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు. దానిలో ప్రజలను బలపరచిన కొద్దిమందిలో ఆయన ఒకడు. 1848 జూలై 31న చేసిన ప్రసంగంలో ఆయన పాలకవర్గాలను దుయ్యబట్టి, శ్రామికజనంయొక్క పేదతనాన్ని తగ్గించే చర్యలను చేబట్టాలని డిమాండు చేశాడు. దీన్నొక "గొప్ప సాహసిక చర్య"గా మార్క్స్ పరిగణించాడు. అయితే ప్రూడన్ కార్యకలాపాలలో యిదే శిఖరస్థాయి ఘటన. తన నిర్బంధకాలంలో (1849–52) ఆయన గణనీయంగా దక్షిణ పక్షానికి జరిగాడు, బాగా క్రియా శూన్య అరాజకవాద భావాలను సంతరించుకున్నాడు. తదుపరి సంవత్సరాల్లో ఆయన చేసిన రచనలు అంతకంతకు అధికంగా ప్రాముఖ్యాన్ని కోల్పోతూవచ్చాయి.

ప్రూడన్ శైలి సజీవమూ, స్పష్టమూ అయినది. ఆయన సాహసిక విరోధాభాసాలనూ, సూటి సూక్తులనూ ధారాళంగా ప్రయోగించాడు. ఆయన ప్రజారంజకత్వానికి గల రహస్యాల్లో యిదొకటి. "ఆస్తి అంటే చౌర్యం" అన్న విరోధాభాసకర్తగా ఆయన సాహిత్యంలో ప్రసిద్ధిచెందాడు. ఇది ఆయన్ని అమరుణ్ణి చేసింది. "హక్కే శక్తి"

అన్న మరో సాహసిక విరోధాభాసంతో ఆయన తన కార్యకలాపాలను ముగించాడు. బూర్జువా సమాజానికి సంబంధించి, యీ రెండూ కూడా కొంతవరకు నిజమే.

ప్రూడన్ ప్రధాన ఆర్థిక రచనలు 1846–50 మధ్య వెలువడ్డాయి. సిస్మాండీని తలపింపజేసే పెట్టుబడిదారీ విధాన విమర్శకు తోడు, యీ రచనల ప్రధానాంశం ఏమిటంటే ప్రజల మారకపు బ్యాంకు అన్న భావం. 1849లో యీ భావాన్ని ఆచరణలో పెట్టేందుకు ప్రూడన్ ఒక విఫల ప్రయత్నం చేశాడు.

బూర్జువా సమాజం సరుకుల విలువను అప్రయత్నంగానూ, అసమంజసంగానూ నిర్ణయిస్తుంది. ఈ విలువ అమ్మకం డబ్బు లేనిదే ఊహాతీతమైన విషయం. చెడుగులన్నీ దీని ఫలితమే: ధరల్లో తీవ్రమైన ఎగుడుదిగుళ్లు, పరస్పరం గొంతులు కోసుకొనే పోటీ, సంక్షోభాలు, ఉత్పాదక వస్తువుల అసమంజస పంపిణీ. వినియోగింపబడిన శ్రమ ప్రకారం ప్రత్యక్ష సామాజిక విలువ నిర్ణయ యంత్రాంగాన్ని నెలకొల్పడం ద్వారా, పెట్టుబడిదారీ సరుకుల ఆర్థిక వ్యవస్థ పునాదులను ముట్టుకోకుండానే, దీన్నంతనీ సరిదిద్దవచ్చు. ప్రూడన్ ప్రతిపాదించిన బ్యాంకు విలువను నిర్ణయించవలసివుంటుంది. ఉత్పత్తిదారులనుండి పరిమితి లేకుండా అది సరుకులను తీసుకొని, వాళ్లకొక రకం చెక్కుమ యిస్తుంది. దాన్ని వాళ్లు, తమకు కావలసిన సరుకులకు మారకం చేసుకుంటారు. కేంద్రీకృతమైన, డబ్బు ప్రసక్తిలేని యీ మారకం సాఫీగా, తేలిగ్గా సాగుతుందనీ, ప్రతి ఒక్కడూ తన శ్రమకి న్యాయమైన ప్రతిఫలాన్ని పొందుతాడనీ ప్రూడన్ భావించాడు.

ఈ ఊహాజనిత పథకం సన్నకారు యాజమాన్య సరుకు ఉత్పత్తిదారులకోసం ఉద్దేశింపబడిందనడం స్పష్టం. అయితే, పెట్టుబడిదారులకూ వేతన కార్మికులకూ మధ్య సరసమైన వ్యవహారాలను నెలకొల్పడం ఎలా సాధ్యం? ఈ ప్రశ్నకు ప్రూడన్ సమాధానం ఎంత అమాయకమైనదో అంత అస్పష్టమైనది. ఆయన పెట్టుబడిదారీ దోపిడి సారాంశం రుణవడ్డీలో వుందనుకున్నాడు. డబ్బును కనుక రద్దుచేస్తే, వడ్డీని పొందే అవకాశాన్ని పెట్టుబడిదారులు కోల్పోతారు. మరోవంక, బ్యాంకులు కార్మికులకు వడ్డీ లేకుండా అప్పు (వస్తురూపంలో?) పెట్టాలి, అప్పుడు వాళ్లు "తమ శ్రమ యొక్క పూర్తి ఉత్పాదితాన్ని" పొందడం సాధ్యమవుతుంది.

నిజానికి, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానపు యుగంలో మానవాళికి ఎదురవుతున్న సామాజిక, ఆర్థిక సమస్యలకు ప్రూడన్ దగ్గర జవాబేమీ లేదు. అయితే ఆయన, పెట్టుబడిదారీ విధానపు దోషాల్లో చాలావాటిని చిత్రించాడు. తన సొంత వైరుధ్యాల ద్వారానే, యీ సమస్యలకు నిజమైన సోషలిస్టు పరిష్కార ఆవశ్యకతను నిరూపించాడు. ఈ అర్థంలో శాస్త్రీయ సోషలిజానికి ఆయన ఆద్యుడని చెప్పవచ్చు. మాస్కోలో క్రెమ్లిన్ గోడ పక్కన అలెక్సాండ్రొవ్‌స్కీ పార్కులో 1918లో నిర్మింపబడ్డ కూచి స్తంభంపైన వున్న సోషలిజం నిర్మాతల జాబితాలో ప్రూడన్ పేరు సముచితంగానే స్థానం పొందింది.

ప్రకరణం 16

సేయ్ శాఖ, కుర్నో సేవ

ఫ్రాన్సులో 19వ శతాబ్దపు మొదటి సగభాగంలో అధికారిక ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి సేయ్ శాఖ ప్రాతినిధ్యం వహించింది. మొదట్లో యీ బూర్జువా శాఖలో ఫ్యూడల్ వ్యతిరేక ధోరణి బలంగా వుంది. అయితే, బూర్జువావర్గానికీ శ్రామికవర్గానికీ మధ్య వర్గ పోరాటం మరింత నిశితమైనకొద్దీ, అధికారిక భావజాలం అంతకంతకు అధికంగా కార్మికవర్గానికీ, సోషలిజానికీ వ్యతిరేకంగా ఉన్ముఖంచెయ్యబడింది. సేయ్ శాఖ పెట్టుబడిదారీ పరిశ్రమదారును ఆకాశానికెత్తింది, వర్గ ప్రయోజనాల సామరస్యాన్ని బోధించింది, కార్మికవర్గోద్యమాన్ని ఖండించింది. ఆర్థిక విధానంలో దాని ప్రధాన సూత్రం స్వేచ్ఛా వాణిజ్యం.

సేయ్ దృక్పథాన్నిబట్టి, పెట్టుబడి కార్మికులను ఏ మాత్రం దోచుకోకుండానే లాభాన్ని ఉత్పన్నం చేస్తుంది. కాగా, సేయ్ పెట్టుబడిదారీ విధాన సమర్థక అభిప్రాయాలను విమర్శించడం, మార్క్స్ అదనపు విలువ సిద్ధాంత విపులీకరణకు అత్యంత అవసరం. బూర్జువా అర్థశాస్త్రంలో, సామాజిక ఉత్పాదితంయొక్క అమ్మకపు యంత్రాంగానికి సంబంధించిన ముఖ్య సమస్యను ముందుకు తీసుకురావడమన్నది సేయ్ పేరుతో ముడి పడివుంది. ఈ రంగంలో, అమితోత్పత్తి సంక్షోభాల అనివార్యతను నిరాకరించిన సేయ్‌పై విమర్శ, మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతాభివృద్ధిలో, గణనీయమైన పాత్ర వహించింది.

ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాల్లో ఆర్థిక విజ్ఞానశాస్త్రపు ప్రత్యేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధింపబడింది. కుర్నో ఆర్థిక సిద్ధాంతంలో గణిత విశ్లేషణ పద్ధతులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించాడు. దీనికి భవిష్యత్తులో ప్రత్యేక ప్రాముఖ్యం వుంది.

బాల్జాక్ కాలంలో ఫ్రాన్సు

1789 – ఫ్రెంచి మహా విప్లవారంభం. 1799–1815 – నెపోలియన్ బోనపార్ట్ కాన్సులేట్ (కాన్సుల్‌ల పరిపాలన కాలం), సామ్రాజ్యం. 1815 – బూర్బన్ పునరుద్ధరణ.

1830 – జూలై విప్లవం, బూర్బన్ల కూలదోత, లూయీ ఫిలిప్ రాజ్యాంగబద్ధ రాజరికం. 1848 – ఫిబ్రవరి విప్లవం, రిపబ్లిక్ ప్రకటన. 1851 – విప్లవ ప్రతీఘాత బోనపార్టిస్టు రాజకీయ కుట్ర. 1852 – రెండవ సామ్రాజ్య స్థాపన.

పరిశీలనలో వున్న కాలంలో ఫ్రెంచి చరిత్రలో యివి ప్రధానమైన ఘట్టాలు. అయితే యివి కేవలం పైపై రేఖా చిత్రం, సమాజపు రాజకీయ ఉపరి నిర్మాణంలోని మార్పులు. అతి ముఖ్యాంశం ఆర్థిక పునాదిలో వచ్చిన మార్పులు. ఈ కాలంలో ఫ్రాన్సులో పారిశ్రామిక విప్లవం శక్తిని పుంజుకొంది, యంత్ర పరిశ్రమ అభివృద్ధి చెందనారంభించింది. పెట్టుబడిదారులకూ వేతన కార్మికులకూ మధ్య సంబంధాలు – ప్రధానంగా పట్టణాల్లోనూ, కొంతమేరకు పల్లెప్రాంతంలోనూ – సామాజిక సంబంధాల ప్రధాన రూపం అయ్యాయి. సమాజంలో ఆర్థికంగానూ, రాజకీయంగానూ ప్రభు వర్గ స్థానంలో బూర్జువావర్గం పాలకవర్గ స్థానాన్ని ఆక్రమించింది.

ప్రపంచ సాహిత్యంలోని మిక్కిలి గణనీయ రచనల్లో ఒకటైన బాల్జాక్ రచించిన "మానవ ప్రహసనం"లో ఈ కాలం కళాత్మకంగా ప్రతిబింబితమైంది. గొప్ప రచయితలు అందరి మాదిరిగానే బాల్జాక్ కూడా మానవునిలో ఆసక్తి వహించాడు. అయితే ఆయన, తన యీ రచనలో, మానవుడు ఎప్పుడూకూడా ఒక నిర్దిష్ట కాలపు, నిర్దిష్ట సామాజిక బృందపు చట్రంలో మాత్రమే వుంటాడన్న సూత్రాన్ని అప్రయత్నంగా వ్యక్తంచెయ్యడమే కాకుండా, ఆ సూత్రాన్ని చైతన్యయుతంగా తన యీ సర్వోత్కృష్ట రచనకు ప్రాతిపదికను చేసుకున్నాడు. "మానవ ప్రహసనం" మానవ హృదయ చరిత్రయే కాకుండా, సామాజిక సంబంధాల చరిత్ర కూడా అని బాల్జాక్ రాశాడు.

1815–1853 మధ్య దేశపు ఆర్థిక సంపద మూడు రెట్లకు మించి పెరిగిందని ఫ్రెంచి ఆర్థికవేత్తలు అంచనా వేస్తారు. ఆ సంవత్సరాల్లో పత్తి పరిశ్రమలో పనిచేసే కదుళ్ల సంఖ్య నాలుగు రెట్లకు మించి పెరిగింది. ఏటా ప్రాసెస్ చెయ్యబడే పత్తి పరిమాణంలో మరింత త్వరిత పెరుగుదల వుంది, అయితే శతాబ్ది మధ్యనాటికింకా, ఇంగ్లండుతో పోలిస్తే, అది అయిదోవంతు మాత్రమే అనడం నిజమేననుకోండి. ఈ విషయంలోనూ, పలు యితర విషయాల్లోనూ అది వెనకబడి వున్నప్పటికీ (ప్రత్యేకించి యంత్ర వినియోగంలో), ఫ్రాన్సు త్వరితంగా పారిశ్రామిక విప్లవపు ప్రధాన దశలగుండా గడిచి ముందుకెళ్లింది. 1815–1855 మధ్య దాని ఎగుమతుల విలువ దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఫ్రెంచి సిల్కు వస్త్రాలు, పారిస్ ఫేషను దుస్తులూ, గాజు, తదితర అనేక పారిశ్రామిక వస్తువులూ భారీ స్థాయిలో చాలా దేశాలకు ఎగుమతి చెయ్యబడ్డాయి. పారిస్ ముఖ్యమైన ఒక పారిశ్రామిక, ఆర్థిక

కేంద్రం అయింది. జాయింట్ స్టాక్ కంపెనీల సంఖ్యా, స్టాక్ ఎక్స్చేంజి లావాదేవీల పరిమాణమూ పెరిగాయి. బ్యాంకులు అభివృద్ధిచెందాయి. సేవింగ్స్ బ్యాంకులు అవతరించాయి.

రాజకీయాలకూ, భావజాలానికీ పారిస్ సజీవమైన కేంద్రంగా వుంటూవచ్చింది. ఫ్రెంచి వార్తాపత్రికలూ, తదితర పత్రికలూ యూరప్ అంతటా పఠింపబడుతూండేవి. జర్మనీ, పోలండు, రష్యా, ఇటలీలనుంచి వచ్చిన దేశబహిష్కృతులు పారిస్ మేధావి బృందంలో ముఖ్య భాగంగా ఉంటూవచ్చారు. ఇతర దేశాలపైన ఫ్రాన్సుకు గట్టి మేధాపరమైన ప్రభావం వుండేది. పారిస్‌లో పుట్టిన భావాలు కూడా, పారిస్ ఫేషన్ల మాదిరిగానే యూరప్, అమెరికాల్లో ఆసక్తితో స్వీకరింపబడ్డాయి. తత్పర్యవసానంగా సేయ్ శాఖ భావాలు కూడా ఫ్రాన్సు ఎల్లలను దాటి దూరంగా విస్తరించాయి. ఎక్కువ భాగం అవి నిపుణులైన పత్రికా రచయితలచేత వివరింపబడ్డాయి.

సేయ్ — వ్యక్తి, పండితుడు

జాన్ బాటిస్ట్ సేయ్ లియోన్‌లో 1767లో జన్మించాడు. ఆయన బూర్జువా హూగెనాట్ల కుటుంబానికి చెందినవాడు. బాల్యంలో మంచి విద్యనే పొందాడు గాని, చిన్న వయస్సులోనే ఒక వర్తక సంస్థ కార్యాలయంలో పని ప్రారంభించాడు. తన జ్ఞానాన్ని విస్తరింపజేసుకొనేందుకుగాను ఆయన విశేషంగా గ్రంథపఠనం చేశాడు. అర్థశాస్త్ర అధ్యయనంలో సేయ్, ప్రథమంగానూ, ప్రధానంగానూ ఆడమ్ స్మిత్ "జాతుల సంపద" పైన తన దృష్టిని కేంద్రీకరించాడు.

ఆయన విప్లవానికి అత్యంత ఉత్సాహంతో స్వాగతం చెప్పాడు. ఆయన దేశ భక్త్యుత్సాహాలు యూరప్ రాజులపై జరిగిన పోరాటంలో విప్లవ సైన్యంలో వలంటీరుగా చేరేలా ఆయన్ని పురిగొల్పాయి. అయితే జాకొబిన్ నియంతృత్వం ఆయనకి మహాదుస్సహమైంది. ఆయన సైన్యాన్ని వదిలేసి, పారిస్‌కి తిరిగివచ్చి, అక్కడొక గౌరవనీయమైన పత్రికకు సంపాదకుడయాడు. జాకొబిన్ల పతనానంతరం అధికారంలోకి వచ్చిన మితవాద బూర్జువావర్గ పాలనతో మొత్తంమీద, సేయ్ — ఆయన ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలను ఆయన విమర్శించినప్పటికీ — సరిపుచ్చుకున్నాడు.

బోనపార్ట్ కాన్సలేట్ మొదట సేయ్‌కి ఉద్యోగంలో ప్రమోషన్ యిచ్చింది. ఆయనకి ఫైనాన్సు కమిటీ ట్రిబ్యునల్ సభ్యత్వ పదవి యివ్వబడింది. అదే సమయంలో ఆయన ఒక పెద్ద పుస్తకం రచిస్తున్నాడు. ఆ రచన 1803లో, "అర్థశాస్త్ర సిద్ధాంతం

లేక సంపద ఉత్పత్తికీ, పంపిణీకీ, వినియోగానికీ సంబంధించిన పద్ధతి సరళ వివరణ" అన్న శీర్షికతో వెలువడింది. ఈ పుస్తకాన్ని సేయ్ దరిమిలా సవరించి, దానికి అను బంధాలు చేర్చి, కొత్త ముద్రణలకు సన్నద్ధంచేశాడు. రచయిత జీవితకాలంలో ఐదు ముద్రణలు పొందిన యీ పుస్తకమే ఆయన ప్రధాన రచన.

సేయ్ రచన, స్మిత్ రచనకు సరళ, సంగ్రహ వివరణ. ఆయన దానిలోంచి, తను అనవసరం అనుకున్న సాధారణీకరణలనూ, సంక్లిష్టతలనూ తొలగించాడు. పూర్తిగా సుసంగతంగా కాకపోయినా స్మిత్ అనుసరించిన శ్రమ విలువ సిద్ధాంతం స్థానంలో, ఆయన "అనేకత్వ" వివరణ ఇచ్చాడు. ఈ వివరణలో విలువ, సరుకుయొక్క వ్యక్తిపర ఉపయోగం, దాని ఉత్పత్తి ఖర్చు, సప్లయ్, గిరాకీ మొదలైన అంశాలపై ఆధారితం చెయ్యబడింది: పెట్టుబడిచేత వేతన శ్రమ దోపిడిపైన స్మిత్ భావాలు (అంటే అదనపు విలువ సిద్ధాంతంలోని అంశాలు) సేయ్ రచనలో పూర్తిగా అదృశ్యమైపోయి, ఉత్పత్తి అంశాల సిద్ధాంతానికి చోటిచ్చాయి (యీ సిద్ధాంతం తర్వాత చర్చింపబడుతుంది). స్మిత్ ఆర్థిక ఉదారవాదాన్ని సేయ్ అనుసరించాడు. "చౌక రాజ్యం" ఉండాలని ఆయన డిమాండు చేశాడు. ఆర్థిక వ్యవస్థలో కనీస జోక్యం మాత్రమే ఉండాలన్నాడు. ఈ విషయంలో ఆయన ఫిజియోక్రాటిక్ సంప్రదాయానికి సన్నిహితుడు. ఆ పుస్తకంయొక్కా, దాని కర్తయొక్కా భవితవ్యం విషయంలో సేయ్ ఆర్థిక ఉదారవాదానికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది.

కాన్సలేట్, సామ్రాజ్యాల ఆర్థిక విధానం—సాధారణ స్వభావరీత్యా బూర్జువా విధానమే అయినప్పటికీ—స్మిత్‌యొక్క స్వేచ్ఛావాణిజ్యానికి గట్టిగా వ్యతిరేకమైనది. నెపోలియన్‌కి, తన యుద్ధాలకోసమూ, ఇంగ్లండుతో పోరాటంకోసమూ పరిశ్రమలు అవసరమయ్యాయి. అయితే, కచ్చితమైన వాణిజ్య రక్షణ విధానాన్ని అమలుపరచడం ద్వారానూ, ఆర్థిక వ్యవస్థయొక్క సర్వతోముఖ నియంత్రణ ద్వారానూ మాత్రమే పరిశ్రమలు అభివృద్ధిచెందుతాయని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇది బ్యురాక్రసీకీ, ఆశ్రిత పక్షపాతానికీ అవకాశాలు కల్పించింది. ఆర్థిక వ్యవస్థనూ, ద్రవ్య, వ్యాపారాలనూ, కేవలం తన దేశాల ఆక్రమణ విధానానికి సాధనాలుగా మాత్రమే నెపోలియన్ పరిగణించాడు. అతను కోరుకున్నదల్లా తన యీ విధానాన్ని సహేతుకమైనదిగా నిరూపించి, బలపరచే ఆర్థిక విధానాన్ని మాత్రమే.

సేయ్ పుస్తకం ప్రజల దృష్టిని ఆకర్షించి, నెపోలియన్ దృష్టిలో పడింది. తన పుస్తకంలో పరిశీలింపబడిన సమస్యలను చర్చించేందుకోసం ఆ చిన్న ఉద్యోగి ప్రథమ కాన్సల్ దగ్గరకు ఆహ్వానింపబడ్డాడు. అధికారుల అభిమానాన్ని పొందాలంటే, ఆయన ఆ పుస్తకాన్ని నెపోలియన్ అభిప్రాయాలకూ, విధానానికీ అనుకూలంగా సవరించ

నలిపివుంటుందని స్పష్టం చెయ్యబడింది. అయితే, ఆయన అలా చెయ్యడానికి నిరాకరించ డంతో, ఉద్యోగంనుంచి బలవంతాన రిటైర్‌చెయ్యబడ్డాడు.

శక్తివంతుడూ, ఆచరణాత్మక దృష్టి కలవాడూ, కార్యోత్సాహపరుడూ అయిన సేయ్, తనకు కొత్తదైన పారిశ్రామిక వ్యాపార రంగంలో ప్రవేశించి, ఒక జౌళి ఫ్యాక్టరీలో వాటాలు కొన్నాడు. ఆయన ఐశ్వర్యవంతుడయ్యాడు. ఇది ఆయన తర్వాతి విద్యా, సాహిత్య కార్యకలాపాలపైన ప్రభావాన్ని బరపింది. ఇప్పుడిక ఆయన కేవలం బూర్జువా మేధావి మాత్రమే కాక, తన వర్గపు నిర్దిష్టావసరాలకూ, అభీప్సితాలకూ సంబంధించి ఒక నిపుణుడయ్యాడు. సాధారణీకరణలపట్ల ఆయనకి గల అయిష్టం గాఢతరమైంది, ఆర్థిక విజ్ఞానశాస్త్రాన్ని బూర్జువా పరిశ్రమదారుకు అవసరమైన ఆచరణాత్మక వివేకానికి ఒక మూలాధారంగా అంతకంతకు అధికంగా ఆయన పరిగణించనారంభించాడు. ఇప్పుడాయన అర్థశాస్త్రాన్ని ఉత్పత్తి, అమ్మకాల నిర్వహణ, వ్యాపార మేనేజిమెంటు సమస్యలకు దిగజార్చేందుకు పూనుకున్నాడు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమదారుడైన వ్యక్తికి ప్రత్యేకించి ప్రముఖమైన పాత్రను ఆపాదించనారంభించాడు. సాహసిక నవకల్పనకర్త, ఉత్పత్తి క్రమంలో పెట్టుబడినీ, శ్రమనూ అత్యంత సమర్థంగా సమైక్యం చెయ్యగల విశేష సామర్థ్యం కలవాడు — అవే లక్షణాలను ఆ వ్యక్తికి ఆపాదించాడు.

1812లో ఫ్యాక్టరీలోని తన వాటాలను అమ్మివేసి, సంవత్సరంగా వచ్చే వడ్డీల మీద జీవిస్తూ పారిస్‌కి మకాం మార్చాడు. నెపోలియన్ పతనమై, బూర్బన్ పునరుద్ధరణ జరగడంతో, తన "సిద్ధాంతం" రెండవ ముద్రణను ఆయన వెలువరచగలిగాడు. దానితో ఆయనకి అత్యంత ప్రముఖ ఫ్రెంచి అర్థశాస్త్రవేత్త అన్న ప్రశస్తి వచ్చింది. కొత్త ప్రభుత్వం ఆయన్ని అభిమానించింది. తన యౌవనకాలంనాటి రిపబ్లికన్ తత్వాన్ని సేయ్ తేలికగానే పరిత్యజించి, బూర్బన్లకు విశ్వాసపాత్రుడైన సేవకుడుగా మారాడు. బూర్జువావర్గం తన అధికారాన్ని నిలుపుకోవడం, ఆర్థిక విధానం స్వేచ్ఛా వాణిజ్యం వైపు మొగ్గుచూపడమే యిందుకు కారణం.

సేయ్ మూడవ తరగతికి నమూనా ప్రాయుడైన పభ్యుడు. ఈ ఫ్రెంచి విప్లవ బూర్జువా మూడవ తరగతి విప్లవం చేసి, తర్వాత భీతి చెంది, దాన్నుండి వెనక్కి తగ్గి, జనరల్ బోనపార్ట్ కౌగిట్లోకి దూకి, నెపోలియన్ చక్రవర్తి బూర్జువావర్గపు ఆశలను తీర్చనప్పుడు, అతన్ని పరిత్యజించింది. సేయ్ వ్యక్తిగత భవితవ్యం, ఫ్రెంచి బూర్జువావర్గపు వైఖరిలో యీ చారిత్రక వర్గ మలుపునే ప్రతిబింబించింది.

నిగ్రహపూర్వకమైన లోకజ్ఞానాన్నీ, వాణిజ్యపరమైన సునిశిత బుద్ధినీ ఆరాధించే సేయ్, బూర్జువావర్గం తన స్థానాన్ని సుసంఘటితం చేసుకున్న ఆ కాలానికి తగినవాడు. ఆయన అర్థశాస్త్రంపై బహిరంగోపన్యాసాలు యివ్వనారంభించాడు. 1819లో "సేష

నల్ కన్సర్వెటువా ఆఫ్ ఆర్ట్స్ అండ్ ట్రేడ్స్"లో "పారిశ్రామిక అర్థశాస్త్ర" ఆచార్య పదవిని పొందాడు. సేయ్ ఉపన్యాసాలు విశేష ప్రజాదరణను పొందాయి. తన రచనల్లో మాదిరిగానే ఆయన అర్థశాస్త్ర సమస్యలను సామాన్యుడి స్థాయికి తగ్గించి, సరళంచేశాడు. క్రమబద్ధంచేసి, ప్రజామోదాన్ని పొందడంలో నిపుణుడైన సేయ్, తన శ్రోతల్లో సుస్పష్టతా, సారళ్యాల భ్రమను కల్పించేవాడు. 1820 దశకంలో ఇంగ్లండులో అంతగానూ ఫ్రాన్సులో కూడా జనరంజకం కావడానికి అర్థశాస్త్రం ప్రధానంగా సేయ్‌కే రుణపడివుంది. సేయ్ రచనలు రష్యన్‌తోబాటు అనేక విదేశీ భాషల్లోకి అనువదించబడ్డాయి. సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని సైన్సు అకాడలో సేయ్ విదేశీ సభ్యుడు.

1828–30 సంవత్సరాల్లో సేయ్ తన ఆరు సంపుటాల "ప్రాయోగిక అర్థశాస్త్ర సంపూర్ణ కోర్సు" ప్రచురించాడు. అయితే "సిద్ధాంతం"తో పోల్చినప్పుడు, సైద్ధాంతికంగా దానిలో కొత్తదేమీ లేదు. కాలేజ్ డి ఫ్రాన్స్‌లో ఆయన కోసం ప్రత్యేకించి సృష్టించబడిన అర్థశాస్త్ర ఆచార్యపీఠాన్ని ఆయన స్వీకరించాడు. సేయ్ పారిస్‌లో 1832 నవంబరులో మరణించాడు.

తన చివరి సంవత్సరాల్లో సేయ్ ప్రీతిపాత్రుడుగా వుండేవాడు కాదు. వచ్చిన కీర్తితో తృప్తిగా రొమ్ము విరుచుకు తిరుగుతూ, మరేమీ కొత్తగా పరిశీలన జరపక, వట్టినే తన పాతభావాలనే వల్లెవేస్తూండేవాడు. ఆయన ముద్రిత రచనలు దంభంతోనూ, నమ్రతా రాహిత్యంతోనూ నిండివుండేవి. వాదవివాదాల్లో ఆయన అన్యాయమైన పద్ధతులనూ, మొరటు ధోరణినీ అవలంబించేవాడు.

మార్క్సిస్టుల దృష్టిలో సేయ్ ప్రధానంగా 19వ శతాబ్దపు అపభ్రంశ అర్థశాస్త్ర జనకుడు. స్మిత్ సిద్ధాంతంలోని బలహీనాంశాలను వినియోగించుకొని, రికార్డోతో ప్రత్యక్ష వివాదంలో, పెట్టుబడిదారీ విధానపు మౌలిక నియమాల ప్రగాఢ విశ్లేషణకు వాళ్ళు చేసిన కృషి స్థానంలో ఆర్థిక విషయాల ఆషామాషీ పరిశీలనను ప్రవేశపెట్టాడు. అయినాకూడా (కొంతమేరకు సరిగా అందుచేతనే యేమో కూడా) బూర్జువా అర్థశాస్త్ర చరిత్రలో సేయ్ ఒక ముఖ్య స్థానాన్ని ఆక్రమిస్తున్నాడు. ఉత్పాదితపు విలువను సృష్టించడంలో ఉత్పత్తి అంశాల — శ్రమ, పెట్టుబడి, భూమి — సమాన భాగస్వామ్య భావాన్ని సుస్పష్టమైన రూపంలో వ్యక్తం చేసిన ప్రథముడు సేయ్. పలువురు రచయితల రచనల్లో యీ భావం అభివృద్ధిచెయ్యబడిన తర్వాత, 1870, 1890 దశకాల అర్థశాస్త్రవేత్తలకు యిక మిగిలిందల్లా, యీ అంశాల్లో ప్రతి ఒక్కదాని "సేవలకూ" ప్రతిఫలం ఏ సూత్రాల ప్రకారం ముడుతుందో ఆ ఏకైక సూత్రాన్ని సృష్టించడం మాత్రమే. ఈ విధంగా, సేయే, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే బూర్జువా పంపిణీ సిద్ధాంత జనకుడు.

ఉత్పత్తి అంశాలూ, ఆదాయాలూ

శ్రమ — వేతనం, పెట్టుబడి — లాభం, భూమి — కౌలు. బూర్జువా అర్థశాస్త్రంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించే యీ త్రయాన్ని, లేక యీ త్రిక సూత్రాన్ని చూద్దాం.

స్మిత్, రికార్డోలు ఏ మౌలిక సమస్యను పరిష్కరించేందుకు విశేషంగా శ్రమించి కృషిచేశారో ఆ మౌలిక సమస్యకు పరిష్కారాన్ని చూపే ప్రయత్నమే సేయ్ ఉత్పత్తి అంశాల సిద్ధాంతం. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందడంతో ఒక ప్రత్యేక సామాజిక వర్గానికి చెందిన ఉత్పత్తి సాధనాలతో పాదార్థిక వస్తువులు అంతకంతకు అధికంగా ఉత్పత్తిచెయ్యబడుతున్నాయి. తత్కారణంగా, సరుకుల విలువలో ఒక భాగం ఏదో ఒక విధంగా పెట్టుబడిదారుల వర్గానికి చెందవలసివుంటుంది. ఈ భాగం ఎలా ఉత్పన్నమవుతుంది, అదెలా నిర్ణయింపబడుతుంది?

స్మిత్, రికార్డోల దృష్టిలో (మనం యింతకు ముందే చూసినట్లు, జూనియర్ మిల్‌దాకా రికార్డో అనుయాయుల దృష్టిలో) యిది ఏక కాలంలో విలువ సమస్యా, పంపిణీ సమస్యా కూడా. సేయ్ దృష్టిలో యిదంతా బాగా సులభతరం. నిజానికి ఆయన పంపిణీ సిద్ధాంతం విలువ సిద్ధాంతంతో సంబంధం లేనిది. విలువ సిద్ధాంతంలో ఆయనకి అంతగా ఆసక్తి లేదు. తత్ఫలితంగా, ఉత్పత్తి క్రమానికి సంబంధించి మిగిలేదంతా ఒక్క పార్శ్వమే — ఉపయోగాల, ఉపయోగపు విలువల సృష్టి మాత్రమే. ఈ పద్ధతిలో యీ సమస్యను పరిశీలించినప్పుడు, ఉత్పత్తికి సహజ వనరులు, శ్రమ సాధనాలు, పరికరాలు, శ్రమశక్తీ, అంటే భూమి, పెట్టుబడి, శ్రమ అవసరమనడం స్పష్టం. సరిగా స్పష్టమైన యీ వాస్తవాన్నే సేయ్ నొక్కిచెప్తాడు.

ఇది అన్ని ఉత్పత్తిక్రమాలకూ సాధారణ లక్షణమేననీ, అందుచేత, పెట్టుబడిదారీ ఉత్పత్తి నిర్దిష్ట స్వభావాన్ని యిది వివరించజాలదనీ ఎవరైనా అభ్యంతరాన్ని లేవదియ్యవచ్చు. అయితే, యీ అభ్యంతరం సేయ్‌కి తట్టివుండదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే సంభావ్యమూ, శాశ్వతమూ, ఆదర్శవంతమూ అయినదని — స్మిత్ కంటె కూడా ఎక్కువగా — ఆయన భావించడమే యిందుకు కారణం. సూర్యోదయ సూర్యాస్తమయాల మాదిరిగానే, పెట్టుబడిదారుల, భూస్వాముల అస్తిత్వాన్ని కూడా ఒక మాదిరి ప్రకృతి ధర్మంగా ఆయన పరిగణించాడు.

సేయ్ సిద్ధాంతంలో లాభం పెట్టుబడియొక్క, కౌలు భూమియొక్క సహజోత్పాదితం. ఆ రెండూ కూడా సామాజిక వ్యవస్థకూ, వర్గ నిర్మితికీ, యాజమాన్య

రూపానికీ పూర్తిగా అతీతమైనవి. ఆపిల్‌చెట్టు ఆపిల్సునీ, నేరేడుచెట్లు నేరేడు పళ్లనీ యిచ్చిన మాదిరిగానే పెట్టుబడి లాభాన్ని యిస్తుంది.

ఈ భావం (శమ విలువ సిద్ధాంతానికీ, అదనపు విలువ సిద్ధాంతానికీ పూర్తిగా భిన్నమైనది. పెట్టుబడిదారులూ, భూస్వాములూ కార్మికులను దోచుకుంటున్నారనడాన్ని యీ సిద్ధాంతం తిరస్కరించి, ఆర్థిక (కమాన్ని ఉత్పత్తియొక్క సమానాంశాల సమరస సహకారంగా చిత్రిస్తుంది. సేయ్ అనుచరుల్లోకెల్ల మిక్కిలి (పసిద్ధుడైన (ఫెడరిక్ బస్తియా (పధాన రచన పేరే "ఆర్థిక విధాన సామరస్యాలు."

సేయ్, ఆయన శిష్యులూ వివరించిన రూపంలో ఉత్పత్తి అంశాల సిద్ధాంతం, బూర్జువా అర్థశాస్త్రంలో సైతం, మరీ సరళం చెయ్యబడి ఆషామాషీ చెయ్యబడిందన్న పేరును సంపాదించుకుంది.

నిజానికి, తన రోజులనాటి మౌలిక అర్థశాస్త్ర (ప్రశ్నలకు సేయ్ యిచ్చిన జవాబులు చాలవరకు సమస్యను దాటవేశాయి. విలువ ఏ విధంగా రూపొందుతుంది, అంతిమ విశ్లేషణలో సరుకుల ధరలను నిర్ణయించేది ఏమిటి? సృష్టింపబడిన విలువ పంపిణీ అనుపాతాల రూపధారణమూ, (పతిఒక ఉత్పత్తి అంశానికీ అనుగుణమైన ఆదాయాలనూ నిర్ణయించేది ఏమిటి? దీన్ని గురించి చెప్పేందుకు సేయ్ దగ్గరా, ఆయన అనుచరుల దగ్గరా విషయ సారాంశమేమీ లేదు. సర్వసాధారణ, నిస్సార విషయాలను చెప్పి యీ విషయాన్ని వాళ్లు దాటిపోజాశారు.

సేయ్ తన రచనల్లో (పతి ఒక రకపు ఆదాయాన్నీ వేర్వేరుగా పరిశీలిస్తాడు. అయితే, లాభానికి సంబంధించిన ఆయన వివరణ మాత్రమే ఆసక్తిదాయకమైనది. మనం యింతకు ముందే చూసినట్లు, లాభం రుణాలపై వడ్డీగానూ, నిర్వహణ ఆదాయంగానూ విభజింపబడింది. మొదటిదాన్ని పెట్టుబడి సొంతదారుగా పెట్టుబడి దారు భుక్తంచేసుకుంటాడు, రెండోదాన్ని పరి(శమ డైరెక్టరుగా పెట్టుబడిదారు భుక్తం చేసుకుంటాడు. సేయ్ దృష్టిలో నిర్వహణ ఆదాయం, జీతానికి పనిచేసే మేనేజరు సైతం పొందగలిగే మాదిరి వట్టి ఆదాయం కాదు. అది ఒక (పత్యేక, ఉన్నత (పాము ఖ్యం కలిగిన సామాజిక విధి నిర్వహణకుగాను (పతిఫలం, దీని సారాంశమే మూడు ఉత్పత్తి అంశాల హేతుబద్ధమైన సమ్మేళనం. పరి(శమదారుని ఆదాయాలు అతని "పారి(శామిక నైపుణ్యాలకు, అంటే, అతని విచక్షణాయుతమైన నిర్ణయానికీ, అతని సహజ లేక సమార్జిత (పతిభలకూ, అతని కార్యకలాపాలకూ, (కమపద్ధతి, నిర్వహణలకు సంబంధించిన అతని స్వభావ సిద్ధమైన లక్షణాలకూ"* గాను అతనికి లభించే (పతిఫలం అని సేయ్ రాశాడు.

---

* J.-B. Say, *Traité d'économie politique...*, Paris, 1841, pp. 368—69.

నిర్వహణ ఆదాయాన్ని పరిశ్రమదారుయొక్క నిర్వహణ పాత్రకు ఆపాదించే యీ వివరణను మార్షల్ అందుకున్నాడు. నవకల్పన కర్తగా, సాంకేతిక ప్రగతి వాహకుడుగా పరిశ్రమదారుని పాత్రను గురించి సేయ్ చెప్పిన మరో అంశాన్ని షుంపేటర్ వినియోగించుకున్నాడు. చివరి సంగతి, అమెరికన్ ఆర్థికవేత్త అయిన ఫ్రాంక్ నైట్, పరిశ్రమదారు "అనిశ్చితత్వ భారాన్ని" మోస్తాడు, లేక మరింత సరళంగా చెప్పాలంటే, సంభావ్యనష్ట ప్రమాదాన్ని స్వీకరిస్తాడు, అందుకని అతనికి ప్రత్యేక ప్రతిఫలాన్ని ముట్టజెప్పవలసివుంటుంది, అంటాడు. సేయ్ కూడా యీ విషయాన్నే సూచిస్తాడు.

ప్రాకృతిక మూలకాలను, పదార్థీకృత, సజీవ శ్రమను ఉత్పత్తి క్రమంలో కలిపే సమస్య, సేయ్ శాఖవాళ్ళూ, ఈ నాటి బూర్జువా అర్థశాస్త్రమూ దానికి యిచ్చిన పెట్టుబడిదారీ సమర్థక వివరణతో నిమిత్తం లేకుండా అస్తిత్వంలో వుంది. అది ఒక్క సామాజిక సమస్యే కాకుండా, అతి ముఖ్యమైన సాంకేతిక–ఆర్థిక సమస్య కూడా.

ఉదాహరణకు, గోధుమ పంటను 50 శాతం పెంచడమనే నిర్దిష్ట లక్ష్యాన్ని అనేక పద్ధతుల్లో సాధించగలం: సాగుభూమి విస్తీర్ణాన్ని పెంచడం ద్వారా, లేక ఉన్న భూమిలోనే శ్రమ పరిమాణాన్నీ, పాదార్థిక వ్యయాన్నీ (పెట్టుబడిని) పెంచడం ద్వారా, అదే మొత్తపు శ్రమతోబాటు మరింత పెట్టుబడిని పెట్టడం ద్వారా, లేక మరింత శ్రమను కలపడం ద్వారా. సహజంగానే నిజజీవితంలో, యీ కర్తవ్యం మూలకాల (అంశాల) పెరుగుదల కలయిక ద్వారా సాధింపబడుతుంది. అయితే అవి ఏ అనుపాతాల్లో కలపడం అత్యుత్తమము? ఒక నిర్దిష్ట దేశంలో లేక ప్రాంతంలో కచ్చితమైన పరిస్థితిని ఏ విధంగా అంచనా వెయ్యాలి, ప్రత్యేకించి వివిధరకాల వనరుల కొరత వున్న మేరకు? ఉపయోగింపబడని విస్తార భూఖండాలు వున్న చోట్ల అది ఒకలా వుంటుంది, అదనపు భూమి లేని చోట్ల, కాని నిరుద్యోగ శ్రామిక జనం వున్న చోట్ల అది మరోలా, వగైరా, వగైరా, రకరకాలుగా వుంటుంది. ఇవన్నీ కూడా ఆర్థికవేత్తలకు ఎదురయ్యే ముఖ్య సమస్యలే అనడం స్పష్టం. అవి విడి సంస్థలలో (సూక్ష్మ ఆర్థిక స్థాయిలో) అయినా ఉత్పన్నం కావచ్చు, లేకపోతే మొత్తం దేశ స్థాయిలోనైనా (స్థూల ఆర్థిక స్థాయిలోనైనా) ఉత్పన్నం కావచ్చు.

ఒక దేశపు జాతీయాదాయాన్ని లేక సామాజిక ఉత్పాదితాన్ని ఒకానొక సంవత్సరంలో ఉత్పత్తిచెయ్యబడిన ఉపయోగపు విలువల పేరిట మొత్తంగా పరిగణించవచ్చు. ఈ సరుకుల డబ్బు రూప అంచనా, ఒకే కొలతలో, అపార వైవిధ్యం

కలిగిన మొత్తపు భౌతిక పరిమాణాన్ని — సిమెంటు, పంట్లాములు, కార్లు, పంచదార... — అంచనా వెయ్యడానికి ఒక సాధనం. వాటి మార్పులు ఉత్పత్తియొక్క భౌతిక పరిమాణంలోని పెరుగుదలను, అంటే, సంపద, సౌభాగ్యాల పెరుగుదలను ప్రతిబింబిస్తాయి. అటువంటి వైఖరి జాతీయాదాయపు (లేక ఉత్పాదితపు) వాటా సమస్య పూర్తిగా సమంజసమైనదని నిరూపిస్తుంది. ఈ వాటా సమస్య ఉత్పత్తిలో పాల్గొనే అంశాల్లోని ప్రతి ఒక్కదానికీ, యీ అంశాల్లో ప్రతి ఒకదానిచేతా కల్పించబడే యీ పరిమాణాల పెరుగుదలలో వర్తిస్తుంది. ఉత్పత్తి అంశాల వ్యయంమధ్య విధుల ననుసరించిన పరాధీనత అధ్యయనానికి ఆర్థిక వ్యవస్థ సామర్థ్యపు పెంపుదలలో విశేష ప్రాముఖ్యం వుంది. ఉత్పాదితాల సృజనలో (ఉపయోగపు విలువల మొత్తంగా చూసినప్పుడు) ప్రతి ఒక అంశానికీ స్వేచ్ఛ ఉందనుకోవడం, యీ అంశాలను విభజించవచ్చుననుకోవడమూ మొదలైనవి, సహజంగానే అతి సరళీకృత పరికల్పనే అవుతుంది. అయితే యీ విషయాన్ని మనసులో పెట్టుకొని, నిజ పరిస్థితుల దృష్ట్యా విశ్లేషణకు గల నిర్బంధాలను పరిగణనలోకి తీసుకొని, ఉత్పత్తియొక్క "అంశ" విశ్లేషణను మనం, కొంత మేరకు ఫలవంతంగా వినియోగించుకోవచ్చు. ఈ విశ్లేషణ పద్ధతుల్లో ఒకటి ఉత్పత్తి విధుల విశ్లేషణ, ప్రస్తుతం యిది విస్తృతంగా అన్వయింపబడుతోంది.*

మామూలుగా చెప్పాలంటే, దీని అర్థం ఏమిటంటే, ఉత్పత్తి పరిమాణం (ఒక నిర్దిష్ట పరిశ్రమలో లేక ఒక నిర్దిష్ట దేశంలో ఒక నిర్దిష్ట సరుకు లేక సరుకుల పరంపర, వగైరా) చరాంశాల పరంపర

---

* ఈ పద్ధతి చారిత్రకావిర్భావం బూర్జువా పెట్టుబడిదారీ సమర్థక పంపిణీ సిద్ధాంతంతో ముడిపడివుంది. ఈ సిద్ధాంత బీజాలు సేయ్‌లో కనిపిస్తాయి. అయితే దరిమిలా, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రత్యక్ష అవసరాలు యీ సిద్ధాంత ఉపయోగాన్ని గణిత, గణాంక శాస్త్రాల సహాయంతో, నిర్దిష్ట సాంకేతిక ఆర్థిక సమస్యల పరిష్కారం దృష్ట్యా నిర్ధరించాయి. ఉత్పత్తి విధుల పద్ధతికీ, ఒక పంపిణీ సిద్ధాంతంగా ఉత్పత్తి అంశాల సిద్ధాంతానికీ మధ్య ఆదిలో సంబంధం వుంది గనక ఉత్పత్తి విధుల యథార్థ యంత్రాంగాన్ని సైతం తిరస్కరించాలని ఎంతమాత్రం అర్థం కాదు. ఈ ఉత్పత్తి విధుల యంత్రాంగాన్ని యీ అపభ్రంశ ప్రాతిపదికనుంచి వేరుజేసి, దానికి అనువైన, శాస్త్రీయ వ్యాఖ్యానమిచ్చినట్లయితే, దాని ఉత్పత్తి పెరుగుదల ముఖ్య పార్శ్వాలను విశ్లేషించడం సాధ్యమే.

ప్రమేయం. వీటి సంఖ్య ఎంతపెద్దదైనా వుండవచ్చు. దీన్ని గణితశాస్త్ర సంకేతాల్లో యిలా చెప్పవచ్చు:

$$Y=F\ (x_1,\ x_2 \ldots\ x_n)$$

దీనిలో Y అంటే ఉత్పత్తి, x_1, $x_2 \ldots x_n$ అన్నవి చరాంశాలు, ఉదాహరణకు కార్మికుల సంఖ్య, వాళ్ల యోగ్యతల స్థాయి, యంత్రాల మొత్తం, ముడి పదార్థాల వాణ్యం మొదలైనవి.

ఈ ప్రమేయంయొక్క చాలా విచరణాలు మార్పులు, వివిధ వాదనల మేళనలతో ప్రతిపాదించబడ్డాయి. వీటిలో అత్యంత సుప్రసిద్ధమైనది కాబ్–డగ్లస్ ప్రమేయం. 1920 దశకానికి చెందిన అమెరికన్ విజ్ఞానశాస్త్రవేత్తలనుంచి దీనికి యీ పేరు వచ్చింది. దీని సంకేతం యిదీ:

$$Y = AK^{\alpha}\ L^{\beta}$$

దీనిలో ఉత్పత్తి పరిమాణం రెండు ముఖ్య అంశాలచేత నిర్ణయింపబడుతుందని తలచబడుతుంది: K (పెట్టుబడి మొత్తం, అంటే, వినియోగింపబడిన ఉత్పత్తి సాధనాలు), L (శ్రమ మొత్తం). ఘాతాంకాలైన α, βలు, మరో ఉత్పత్తి కారకం స్థిరంగా ఉన్నప్పుడు, పెట్టుబడి, శ్రమల మొత్తాలు వరుసగా 1 శాతం పెంచబడినట్లయితే, ఉత్పత్తిలో పెరుగుదల శాతాన్ని చూపుతాయి. A అను పాతాత్మకతా గుణాంకం; పెట్టుబడి, శ్రమల మొత్తంలో వ్యక్తం చెయ్యబడని ఉత్పత్తియొక్క అన్ని గుణాత్మక కారకాలనూ లెక్కలోకి తీసుకోవడంగా దాన్ని పరిగణించవచ్చు.

కాబ్–డగ్లస్ ప్రమేయాన్ని అభివృద్ధిచేసేందుకూ, మెరుగొనర్చేందుకూ, దానిలోకి క్రియాశీలమైన అంశాలను, ప్రత్యేకించి సాంకేతిక ప్రగతిని ప్రవేశ పెట్టేందుకూ చాలామంది ఆర్థికశాస్త్రవేత్తలు ప్రయత్నించారు. ఈ సందర్భంగా, 1969లో అర్థశాస్త్రంలో ప్రప్రథమంగా నోబెల్ బహుమతిని పొందిన డచ్చి అర్థశాస్త్రవేత్త జాన్ టిన్‌బెర్గెన్ కృషికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. ఉత్పత్తి పెరుగుదలలో ప్రధాన ఉత్పత్తి కారకాల ("సాంకేతిక ప్రగతి" ఉత్పత్తి కారకంతో బాటు) పరిమాణాత్మక భాగానికి సంబంధించి యించుమించుగా హేతుబద్ధంగా కనిపించే అంచనాలను యిచ్చే గణాంక–గణితశాస్త్ర అధ్యయనాలు వున్నాయి.

"సేయ్ నియమం"

ఇంతకు ముందే అనేక సార్లు సేయ్ "మార్కెట్ల నియమం" లేక వట్టినే "సేయ్ నియమం" మనకి తటస్థపడింది. ఈ నియమం పరిశీలించే అమ్మకాలు, సంక్షోభాల సమస్య, పెట్టుబడిదారీ విధానాభివృద్ధిలోనూ, అర్థశాస్త్రంలోనూ విశేషమైన పాత్ర వహిస్తుంది. "సేయ్ నియమం" చరిత్ర కొంతమేరకు మాల్తస్ "జనాభా నియమం" కథను గుర్తుచేస్తుంది. "సిద్ధాంతం"యొక్క మొదటి ముద్రణ (1803)లో సరుకుల అమ్మకాలపైన సేయ్ నాలుగు పేజీలు రాశాడు. సరుకుల సాధారణ అమితోత్పత్తీ, ఆర్థిక సంక్షోభాలూ మౌలికంగా అసాధ్యమని దానిలో అత్యంత అస్పష్ట రూపంలో వివరించబడింది. ఉత్పత్తియే స్వయానా ఆదాయాలను ఉత్పన్నంచేస్తుంది. వాటితో తదనురూపమైన విలువ గలిగిన సరుకులు కొనితీరబడతాయి. ఆర్థికవ్యవస్థలో మొత్తం గిరాకీ ఎప్పుడూకూడా మొత్తం సప్లయ్‌తో సమానంగా వుంటుంది. పాక్షికమైన వ్యత్యాసాలు మాత్రమే – ఒక సరుకు అమితోత్పత్తీ, మరొకదాని అల్పోత్పత్తీ – సంభవించవచ్చు. అయితే, సాధారణ సంక్షోభం లేకుండానే యిది సరిదిద్దబడుతుంది. మాల్తస్ మౌలిక భావం మాదిరిగానే యీ సరళ ప్రతిపాదన కూడా స్వయంస్పష్టంగా కనిపిస్తుంది. అయితే యిది అతిగా సాధారణీకృతం చెయ్యబడి, సేయ్ భావంలో అర్థమేమీ లేకుండా చేసింది.

"సేయ్ నియమం" చుట్టూ (అప్పట్లో దానికి యీ గంభీరమైన నామధేయం లేదు) తీవ్రమైన వాగ్వివాదం చెలరేగింది. రికార్డో, సిస్మాండీ, మాల్తస్, జేమ్స్ మిల్‌లతోబాటు ఆనాటి అతిప్రముఖ ఆర్థికశాస్త్రవేత్తలు యీ వివాదంలో పాల్గొన్నారు. తన భావాన్ని బలపరచుకొంటూ, దాని తరఫున వాదిస్తూ తన "సిద్ధాంతం"యొక్క ప్రతి కొత్త ముద్రణలోనూ, సేయ్ తన "నియమం" వ్యాఖ్యానాన్ని మరింతగా పెంచాడు. అయితే, దానికి అంతకన్న ఎక్కువ స్పష్టతను చేకూర్చలేకపోయాడు.

"సేయ్ నియమం"పైన యీవాదు పశ్చిమ దేశాల్లో జరుగుతున్న చర్చ, ప్రధానంగా అర్థశాస్త్రంలోని నయా సాంప్రదాయికమనబడే ధోరణి సమర్థకులకూ, కీన్షియన్ ధోరణి సమర్థకులకూ మధ్య జరుగుతోంది. వీటిలో మొదటి ధోరణికి చెందినవాళ్లు, యీ "నియమాన్ని" ప్రస్తావించకపోయినప్పటికీ నిజానికి సేయ్ వైఖరిని అనుసరిస్తారు. వెసులుబాటైన ధరలు, వేతనాలు, తదితర మౌలిక అంశాలూ ఉన్నట్లయితే, ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాలనుంచి అప్రయత్నంగానే తప్పించుకోవచ్చునని వాళ్లు వాదిస్తారు. తత్పర్యవసానంగా, ఆర్థిక వ్యవస్థలో బూర్జువా

ప్రభుత్వపు భారీ జోక్యాన్ని వాళ్లు మామూలుగా వ్యతిరేకిస్తారు. ఆర్థిక విధానాన్ని గూర్చిన అభిప్రాయాల దృష్ట్యా నయా సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలు తరచుగా "నయా – ఉదారవాదం" వైపు మొగ్గు చూపుతారు.

మరోవంక కీన్సూ, ఆయన అనుయాయులూ స్వేచ్ఛగా అభివృద్ధిచెందే పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో సంక్షోభాలు అనివార్యమని వాదించి, "సేయ్ నియమాన్ని" విమర్శించారు. వృత్తిరీత్యా అర్థశాస్త్రవేత్తలైనవాళ్లు, వాస్తవ జీవితంలో సరైనది కాదని రుజువుచెయ్యబడని యీ "నియమాన్ని" పట్టుకు వేలాడిన కారణంగా, సామాన్య మానవుడు అంతకంతకు ఎక్కువగా వారిపట్ల అయిష్టత చూపుతున్నాడు. "వాస్తవాలకు అన్వయించి పరిశీలించినప్పుడు ఎవరి సైద్ధాంతిక ఫలితాలు సరైనవిగా నిరూపింపబడ్డాయో ఆ బృందాల ఆర్థిక శాస్త్రజ్ఞులపట్ల చూపిన మోతాదులో వారిపట్ల గౌరవం చూపడం లేదు."* కీన్సీయన్ ధోరణి ఆర్థిక వ్యవస్థలో విస్తృతమైన ప్రభుత్వ జోక్యాన్ని బలపరుస్తుంది.

పరిశీలనలో వున్న కాలంలో, అంటే 19వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో, "సేయ్ నియమం," లేక అప్పట్లో దాన్ని గురించిన అవగాహన ద్వంద్వ పాత్ర వహించింది. ఒకవంక, బూర్జువా సమాజంయొక్క, ఆర్థిక వ్యవస్థయొక్క పూర్వనిర్ణీత సమరస అమరికపట్ల సేయ్ శాఖలో గల విశ్వాసాన్ని అది ప్రతిబింబించింది. అనివార్యంగా అమితోత్పత్తి సంక్షోభాలకు దారితీసే వైరుధ్యాలను సేయ్ శాఖవాళ్లు చూడలేకపోయారు లేక చూడలేరు. సరుకులు ప్రజల డిమాండ్లను తీర్చడానికి మాత్రమే ఉత్పత్తిచెయ్యబడతాయనీ, మారకంలో పూర్తిగా క్రియాశూన్యపాత్ర వహించే డబ్బుతో మారకం చేసుకోబడుతాయనీ "సేయ్ నియమం" భావిస్తుంది. ఇది సత్యానికి చాలా దూరం. అయితే "సేయ్ నియమం"లో దాని కాలంనాటికి ప్రగతిశీలమైన పార్శ్వం కూడా ఒకటి వుంది. పెట్టుబడిదారీ విధానాభివృద్ధి అసాధ్యతను గురించిన సిస్మాండీ ప్రతిపాదనకు వ్యతిరేకంగా అది ఉద్దేశింపబడింది. పెట్టుబడిదారీ విధానం తన అభివృద్ధి క్రమంలో తన మార్కెట్టును తనే సృష్టించుకుంటుంది, అమ్మకాల సమస్య పరిష్కారానికి మాల్తస్, సిస్మాండీల రోసిపోయిన "మూడవ వ్యక్తుల" అవసరం లేదన్న ప్రధానాంశాన్ని అత్యంత అస్పష్టంగానే అయినా అది వ్యక్తంచేసింది. బూర్జువావర్గం సేయ్ వాదనలను వినియోగించుకొని, స్వేచ్ఛాయుత పరిశ్రమ నిర్వహణకూ, స్వేచ్ఛా వాణిజ్యానికీ అనుకూలంగా బ్యూరాక్రటిక్ ప్రభుత్వయంత్ర జోక్యాన్ని తగ్గించే ప్రగతిశీల డిమాండ్లను

---

* J. M. Keynes, *The General Theory of Employment, Interest and Money*, London, 1946, p. 33.

ముందుకుతెచ్చింది. సేయ్ మార్క్సేట్ల సిద్ధాంతాన్ని రికార్డో ఎందుకు ఆమోదించాడో అన్న విషయాన్ని యిది పాక్షికంగా వివరిస్తుంది.

సేయ్ శాఖ

1873లో "పెట్టుబడి" (మొదటి సంపుటం) రెండవ ముద్రణకు మార్క్స్ తన ముందుమాటను రాశాడు. దానిలో ఆయన, 19వ శతాబ్దంలో బూర్జువా అర్థశాస్త్రాభివృద్ధియొక్క క్లుప్తమైన రేఖాచిత్రాన్ని యిచ్చాడు. ఆ శతాబ్ది మొదట్లో సాంప్రదాయిక శాఖ సాధించిన విజయాలనూ, 1820 దశాబ్దం నాటి తీవ్ర చర్చలనూ పేర్కొని, ఆయన యిలా రాశాడు: "1830వ సంవత్సరంనాటికి నిర్ణయాత్మకమైన సంక్షోభం ఏర్పడింది.

"ఫ్రాన్సులోనూ, ఇంగ్లండులోనూ బూర్జువావర్గం రాజకీయాధికారాన్ని ఆక్రమించుకుంది. ఆనాటినుండి వర్గ పోరాటం ఆచరణరీత్యానూ, సైద్ధాంతికంగానూ కూడా, అంతకంతకు అధికంగా బాహాటమైన, ప్రమాదకర రూపాలను చేబట్టింది. శాస్త్రీయ బూర్జువా అర్థశాస్త్రపు జేగంటను అది మోగించింది. ఆనాటినుండి ఒక సిద్ధాంత పరికల్పన సరైనదా, మరొకటా అన్నది కాక, అది పెట్టుబడికి లాభదాయకమా లేక నష్టదాయకమా, కార్యసాధకమైనదా కాదా, రాజకీయంగా ప్రమాదకరమైనదా కాదా అన్నదే అసలు ప్రశ్నగా తయారైంది. నిష్పాక్షికంగా పరిశీలన జరిపేవారి స్థానంలో కిరాయికి పోటీలుపడి పనిచేసేవాళ్లు తయారయారు; నికరమైన శాస్త్రీయ పరిశోధన స్థానాన్ని పెట్టుబడిదారీ విధాన సమర్థకుని ఆత్మశుద్ధి రాహిత్యమూ, దుస్సంకల్పమూ ఆక్రమించాయి."*

అన్నిటికంటె సేయ్ — బస్తియా శాఖకు యిది అధికంగా వర్తిస్తుంది. మార్క్స్ యింకా యిలా రాశాడు: 1848 తర్వాత అపభ్రంశ అర్థశాస్త్రం కొత్త మార్పులు చెందింది, తత్ఫలితంగా "స్వార్థంతో కూడిన ముందుదృష్టీ, కార్యసాధక దృష్టీ కలిగిన వర్తక జనం, బొత్తిగా అషామాషీ వ్యక్తీ, సరిగా ఆ కారణంగానే అపభ్రంశ అర్థశాస్త్రపు సమర్థకులకు బాగా తగిన ప్రతినిధీ అయిన బస్తియా చుట్టూ పోగుపడ్డారు."**

---

* Karl Marx, *Capital*, Vol. I, Moscow, 1972, pp. 24—25.

** అదే గ్రంథంలో, పేజి 25.

ఆచరణలో బూర్జువా సేవలో తలమునకలుగా మునిగిపోయిన సేయ్ శాఖ ఆర్థిక సిద్ధాంతాభివృద్ధికి దాదాపుగా ఏమీ చెయ్యనే లేదు. ఒక్క మార్క్సిస్టులే కాక, ఆర్థిక చింతనయొక్క బూర్జువా చరిత్రకారుల్లో మరింత గంభీరులైనవారు పైతం, ప్రత్యేకించి షుంపేటర్, యీ విషయాన్ని పేర్కొన్నారు.

దాదాపు ఆ శతాబ్దాంతందాకా, సేయ్ శాఖకు కాలేజ్ డి ఫ్రాన్స్‌లోని అర్థశాస్త్ర ఆచార్యపీఠమే కేంద్రంగా వుంటూవచ్చింది. సేయ్ తన చివరి సంవత్సరాల్లో ఆ ఆచార్య పదవిలో వుండేవాడు. సేయ్ అనుయాయుల్లో ఒకడైన మిషేల్ షెవల్యే వున్నంతలో ప్రసిద్ధుడు. బస్తియాతోబాటు ఆయన, యీ శాఖలోని స్వేచ్ఛావాణిజ్య వ్యాఖ్యాతల్లో ముఖ్యుడు. ఆర్థిక విధాన రంగంలో ఆయన క్రియాశీలమైన పాత్ర వహించాడు. ఆ శాఖ సభ్యులు కొందరు అర్థశాస్త్రంపై సేయ్ ప్రేరణతోనూ, సేయ్ శైలిలోనూ కొన్ని పుస్తకాలను ప్రచురించారు. ఆ పుస్తకాలకు ఆ కాలంలో ప్రజల్లో ప్రచారం లభించినమాట నిజమే అయినప్పటికీ, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో దాదాపుగా వాటి జాడలేమీ మిగల్లేదు.

జెరోమ్ అడోల్ఫ్ బ్లాంకీని యీ శాఖకి చెందినవాడుగా పరిగణించవచ్చు. విప్లవవాదీ, ఊహాజనిత కమ్యూనిస్టూ అయిన లూయీ అగస్ట్ బ్లాంకీకి ఆయన సోదరుడు. ఆర్థికవేత్త అయిన బ్లాంకీ, తద్విరుద్ధంగా, అత్యంత గౌరవనీయుడైన బూర్జువా ప్రొఫెసరు. ఆయన ప్రధానంగా తను రచించిన "యూరప్‌లోని అర్థశాస్త్ర చరిత్ర" (1839) అన్నపుస్తకం మూలంగా ప్రసిద్ధిచెందాడు. అర్థశాస్త్ర చింతనయొక్క ప్రథమ సవివర చరిత్రల్లో అది ఒకటి. చాల కాలంపాటు అది నమూనా ప్రాయమైనదిగా పరిగణింపబడి, రష్యన్‌తోబాటు అనేక భాషల్లోకి అనువదింపబడింది.

ఈ సందర్భంగా మరొక ఉత్సాహవంతుడైన "ఆశావాదీ," "ఆర్థిక స్వేచ్ఛా" వకాలతుదారూ, సమస్త విమర్శలకూ వ్యతిరేకంగా ఆ నాటి పెట్టుబడిదారీ విధాన సమర్థకుడూ అయిన షార్ల్ దునొయేని మనం యిక్కడ పేర్కొనవలసి వుంది. అర్థశాస్త్రంలో ప్రామాణిక ధోరణికీ, అసందిగ్ధ ధోరణికీ మధ్యగల పైన పేర్కొనబడిన భేదానికి దునొయే ఒక మంచి ఉదాహరణ. పెట్టుబడిదారీ విధానంలోని ఆంతరిక శక్తులను సముత్సాహంగా విశ్వసించి, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యాన్ని తిరస్కరించిన దునొయే (సిస్మాండీ మాదిరిగా కాకుండా), అనుకూల వైఖరిని సమర్థించడమన్నది మిక్కిలి తర్కబద్ధమైన విషయం. ఈ సమస్యపైన ఆయన తన అభిప్రాయాలను యీ కింది సుభాషిత రూపంలో వ్యక్తంచేశాడు: "Je n'impose rien; je ne propose même rien; j'expose" ("నేనేదీ విధించను, నేనేదీ ప్రతిపాదించను కూడా, నేను వివరిస్తానంతే").

ఇంకెన్నో పేర్లను ఉదహరించవచ్చు: యింతకు ముందే చెప్పినట్లు, సేయ్ శాఖ

ఛాందస అర్థశాస్త్రంలో చోటుచేసుకుంది. మరి, ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తలకు వాళ్ల సొంత విజ్ఞానశాస్త్ర సంఘమూ, పత్రికా వున్నాయి. అయితే, యిప్పటికే పేర్కొనబడిన పేర్లు చాలు. మరోమారు వక్కాణించి చెప్పవలసిన అంశమేమిటంటే, సేయ్ శాఖా, దాని అభిప్రాయాలూ 1830, 1840 దశకాల్లో, ఫ్రాన్సులో విస్తృతంగా వ్యాపిస్తున్న సోషలిస్టు భావాలకు వ్యతిరేకంగా జరిగిన తీవ్ర పోరాటక్రమంలో రూపొందాయి. ఇది సేయ్ శాఖ వైఖరులను చాలవరకు నిర్ణయించింది. ప్రత్యేకించి బస్తియా, ప్రూడన్‌తో తీవ్రమైన వివాదాన్ని సాగించాడు. 18వ ప్రకరణంలో, గొప్ప ఊహాజనిత సోషలిస్టులైన సెంట్ సైమన్, ఫోరియర్‌ల ఆర్థికబోధనను పరిశీలిస్తాం. వాళ్ల శిష్యులూ, అనుయాయులే, సేయ్ శాఖకి సిద్ధాంతపరంగా ప్రధాన ప్రత్యర్థులు.

కుర్నో: ఆయన జీవితం, కృషి

అనేక ఆర్థిక విషయాలూ, క్రమాలూ స్వభావసిద్ధంగానే పరిమాణాత్మకమైనవి. ఆర్థిక చలరాశుల మధ్య మామూలుగా కొన్ని పరిమాణాత్మక సంబంధాలు వుంటాయి: వాటిలో ఒకటి మారితే, దానితో సంబంధితమైన మరొకటి లేక మరికొన్ని కూడా ఏదో ఒక నియమానుసారంగా మారుతాయి. ఉదాహరణకు, ఒక నిర్దిష్ట సరుకు ధర పెరిగితే, దానికి గల గిరాకీ కొంతమేరకు పడిపోవడం అత్యంత సంభవం. ఈ సంబంధపు స్వభావాన్ని మామూలుగా ఒక ప్రమేయం (function)గా చెప్పవచ్చు. ఈ రకమైన తర్కం, 18వ శతాబ్దం నాటికే కొందరు చింతనాపరులను గణితశాస్త్రాన్ని ఆర్థిక విషయాల విశ్లేషణకు ఎందుకు అన్వయించకూడదని ఆలోచించేలా చేసింది. తదనుగుణంగా ప్రయత్నాలు జరిగాయి. అయితే, సైద్ధాంతిక అర్థశాస్త్రాభివృద్ధి 19వ శతాబ్ది మధ్యదాకా కొన్ని మౌలిక ఆర్థిక సమస్యల గణితశాస్త్రీయ సూత్రీకరణల వ్యవస్థకు దారితీయ్యలేదు.

ఆర్థిక పరిశోధనకు గణితశాస్త్ర పద్ధతులను ఉద్దేశపూర్వకంగానూ, సుసంగతంగానూ అన్వయించిన తొలి శాస్త్రజ్ఞుడు ఫ్రెంచి అర్థశాస్త్రవేత్త అంటువాన్ అగుస్టేన్ కుర్నో. 1838లో వెలువడిన "సంపద సిద్ధాంతపు గణితశాస్త్ర సూత్రాల పరిశోధన" అన్న గ్రంథం వల్లనే కుర్నో దరిమిలా ప్రసిద్ధుడయాడు. ఆయన జీవితకాలంలో ఈ రచన అంత ఆసక్తిని రేకెత్తించకపోవడంతో, ఆర్థిక చింతనా చరిత్రల్లో కుర్నో ప్రతిభావంతుడైన విఫలుడనీ, "ఆర్థిక విజ్ఞానశాస్త్రానికి బలైపోయిన అమరజీవి అనీ" అంచనావెయ్యబడింది. ఇది పూర్తి నిజం కాదు. కాలేజి ప్రొఫెసరుగానూ, విద్యా

సంస్థల నిర్వాహకుడుగానూ కుర్నో ప్రశాంతమూ, సంపద్వంతమూ అయిన జీవితం గడిపాడు. ఆయన పలు గణితశాస్త్ర రచనలు చేశాడు. అవి ఆయన కాలంలో విజయ వంతమయాయి. తన సుదీర్ఘ జీవిత కాలంలో ఒకదాని తర్వాత మరొకటిగా ఏర్పడిన అన్ని ప్రభుత్వాలతోనూ కుర్నో సత్సంబంధాలు కలిగివుండి, అధికార ఆర్థిక విజ్ఞానశాస్త్రంలోనూ, ప్రభుత్వ సేవలోనూ ప్రముఖ స్థానంలో వున్నాడు.

అదే సమయంలో, విజ్ఞానశాస్త్ర రంగంలో తన సేవలు మరింత ప్రగాఢంగా గుర్తింపబడలేదన్న బాధాకరమైన ఎరుక కుర్నోకి వున్నమాట నిజమే. గణిత, తత్వశాస్త్రాల సహాయంతో ప్రకృతి, విజ్ఞానశాస్త్రాల సంయోగాన్ని కనుగొనేందుకు ఆయన ప్రయత్నం చేశాడు. ఆయన జీవితపు చివరి రెండు దశాబ్దాల్లో తన రచనను ప్రధానంగా ప్రకృతి విజ్ఞానశాస్త్రాల తత్వ పరిశీలనకు ఆయన అంకితంచేశాడు. సూత్రాలను ఉపయోగించకుండా, 1860, 1870 దశకాల్లో అర్థశాస్త్రానికి తిరిగివచ్చేందుకు కుర్నో ప్రయత్నించాడు, అయితే అవి సైతం లోకం దృష్టిని ఆకర్షించలేదు. ఈ రచనల్లో ఆయన తొలి రచనలోని కొత్తదనం లేదు. కాగా అవి తొలి పుస్తకానికి భిన్నంగా పుస్తకాల బీరువాలను అలంకరించి, దుమ్ము కొట్టుకున్నాయి. కుర్నో జీవిత చరిత్ర రచయిత యిలా అంటాడు: "ఒకవంక అధికారిగా ఉజ్వలమైన జీవితం, మరొకవంక తన జీవితకాలంలో విజ్ఞానశాస్త్రజ్ఞుడుగా బొత్తిగా గుర్తింపు లేకపోవడం — యీ రెండింటికీ మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది.... తన రచనల అమ్మకాలు ప్రత్యేకించి ఫ్రాన్సులో ఎంత ఘోరంగా వున్నా, విజ్ఞానశాస్త్రాల సాధారణ వ్యవస్థను యింతకు ముందరికన్న మరింత బాగా వివరించే సామర్థ్యం కలిగిన కొద్దోగొప్పో కొత్త భావాలు వాటిలో వున్నాయని తన స్మృతుల్లో కుర్నో విచారంగానూ, కటువుగానూ రాస్తాడు."*

కుర్నో 1801లో ఫ్రాన్సు తూర్పు భాగంలోని గ్రే అనే చిన్న పట్టణంలోని ఒక సంపన్న పెటీబూర్జువా కుటుంబంలో జన్మించాడు. ఆ కుటుంబ సభ్యుల్లో కొందరు బాగా విద్యావంతులు. ఆయన తాత ఒక నోటరీ. కుర్నో పెంపకంలో ఆయన తాత ప్రభావం విశేషంగా వుంది. కుర్నో ప్రశాంత స్వభావం, పట్టుదలా కలిగిన కుర్రాడు. గ్రంథపఠనం, మననం అంటే ఆయనకి యిష్టం. బహుశా, చిన్నతనంలోనే వచ్చిన షార్ట్‌సైట్ యిందుకు బాగా దోహదం చేసివుండవచ్చు. పదిహేనేళ్లదాకా అతను స్కూలుకు వెళ్లాడు. తర్వాత సుమారు నాలుగేళ్లపాటు యింటి దగ్గరే వుండి

---

* H. Reichardt, *Augustin A. Cournot. Sein Beitrag zur exacten Wirtschaftswissenschaft*, Tübingen, 1954, S. 8నుండి ఉల్లేఖింపబడింది.

స్వయంగా చదువుకున్నాడు, మధ్యమధ్య బెసన్‌సాన్‌లోని కాలేజీకి వెళ్లివస్తూండేవాడు. 1821లో ఆయన పారిస్‌లోని ఎకోల్ నార్మల్ సుపీరియర్‌లో ప్రకృతి విజ్ఞానశాస్త్రాల అధ్యయనం మొదలుపెట్టాడు. అక్కడే గణితశాస్త్రంలో ఆయనకి గల ఆసక్త్యుత్సాహాలు పూర్తిగా వికసించాయి. అయితే కొద్ది కాలానికే ప్రభుత్వం, విద్యార్థుల్లో వ్యాపించిన రాజరిక వ్యతిరేక భావాల కారణంగా విద్యా సంస్థను తాత్కాలికంగా మూసివేసింది. కుర్నోకు రాజకీయాల్లో అభిరుచి లేకపోయినప్పటికీ, యితర విద్యార్థులపైన మాదిరిగానే కొంతకాలం ఆయనపైన కూడా పోలీసు నిఘా కొనసాగింది.

1823నుండి 1833వరకు కుర్నో మార్షల్ సెంట్-సిర్ కుటుంబంతో, అతని కొడుక్కి ట్యూటరుగానూ, సామ్రాజ్యకాలం నాటి తన స్మృతులను రచిస్తున్న మార్షల్‌కి కార్యదర్శిగానూ గడిపాడు. ఈ కాలంలో, ఆయన విజ్ఞానశాస్త్రాల అధ్యయనానికీ, వివిధ విద్యా సంస్థల్లో లెక్చర్లను వినేందుకూ ఎక్కువ సమయాన్ని వెచ్చించాడు. ఆయన కొన్ని వ్యాసాలు ప్రచురించాడు. గణితశాస్త్రంలో ఆయన చేసిన కృషికిగాను పారిస్ విశ్వవిద్యాలయం 1829లో ఆయనకి డాక్టర్ డిగ్రీని యిచ్చింది. ఆయనకి చాలా మంది ప్రసిద్ధ శాస్త్రజ్ఞులతో, ప్రత్యేకించి గణితశాస్త్రవేత్త పువసోన్‌తో పరిచయం ఏర్పడింది. పువసోన్ అత్యంత ప్రతిభావంతులైన తన శిష్యుల్లో కుర్నోను ఒకడుగా పరిగణించాడు. ఆయన జీవితకాలమంతట్లోనూ ఆయనకి పోషకుడుగా వున్నాడు. పువసోన్ అభిమాన ఫలితంగా కుర్నో లియోన్‌లో ప్రొఫెసరుగా నియమింపబడి, అక్కడ ఉన్నత గణితశాస్త్రాన్ని బోధించనారంభించాడు. మరో ఏడాది తర్వాత గ్రెనోబ్ల్ అకాడెమీకి ఆయన రెక్టారయ్యాడు. అక్కడ ఆ సంస్థ నిర్వాహకుడుగా తన సామర్థ్యాన్ని ఆయన నిరూపించుకున్నాడు. 1838లో ఆయనకి విద్యాశాఖలో, ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా, మరింత ఉన్నత పదవి లభించింది. 1840 దశకపు మొదటి సంవత్సరాల్లోనే ఆయన ప్రధాన గణితశాస్త్ర రచనలు ప్రచురింపబడ్డాయి.

ఇంతటి అత్యంత వైవిధ్యపూరితమైన రచనల మధ్య కుర్నో ఆర్థిక రచన యింత ఆకస్మికంగా, యింత అనూహ్యంగా ఎలా వెలువడిందో అన్న విషయం కుర్నో జీవిత చరిత్ర రచయితకి ఆశ్చర్యకర విషయమే అయింది. కుర్నో అంతకు పూర్వం అర్థశాస్త్రంలో ఆసక్తి చూపిన దాఖలాలు ఏమీ లేవు. అయితే, యీ సందర్భంగా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. కుర్నోకు విజ్ఞాన సర్వస్వప్రాయమైన జ్ఞానం వున్నదనీ, చాలా విస్తృతమైన ఆసక్తులు వున్నాయన్నదే అది. అప్పట్లో బహుళ ప్రజాదరణ పొందిన సేయ్ రచనలను ఆయన చదివివుండాలి. సేయ్ రచనల ద్వారా ఆయనకు స్మిత్, రికార్డోల రచనలతో పరిచయం ఏర్పడివుండాలి. వీటికి కుర్నో లోకజ్ఞానం, ఆర్థిక యింగితజ్ఞానం జోడైవుండాలి. కుర్నో పుస్తకంలో యివి స్పష్టంగా కనిపిస్తాయి.

ఆర్థిక విజ్ఞానశాస్త్రపు ప్రధాన సూత్రాల్లోని అనిర్దిష్ట, అస్పష్ట, అసంగతత్వ స్వభావంతో అసంతృప్తుడైన కుర్నో కచ్చితమైన తర్కాన్నీ, గణితశాస్త్రీయ పద్ధతులనూ దానికి అన్వయించ ప్రయత్నించాడు. తనకూ, ఆర్థిక విజ్ఞానశాస్త్రానికీ కూడా కొత్తదైన ఈ కర్తవ్య నిర్వహణలో మునిగిపోయి, అత్యంత క్రమబద్ధంగా పనిచేస్తూ, పుస్తకపాండిత్యం విశేషంగా కలిగిన కుర్నో, యీ విషయంలో ముందుకు పోయిపోయి, తన భావాలు ప్రచురణయోగ్యమైనవిగా తలచేటంతవరకు వెళ్లాడు. తన పుస్తకం నలుగురి దృష్టినీ ఆకర్షిస్తుందనీ, తదితర పండితుల మనస్సులను చురుకెక్కిస్తుందనీ ఆయన ఆశించాడనడం స్పష్టం. అయితే ఆయనకి యీ విషయంలో నిరాశే ఎదురైంది.

కుర్నో 1862 దాకా వివిధ పదవులను విజయవంతంగా నిర్వహించాడు. రెండవ రిపబ్లిక్ కాలంలో (1848–1851) ఉన్నత విద్యా కమిషన్లో ఆయన సభ్యుడు, రెండవ సామ్రాజ్యంలో విద్యావిషయిక ఇంపీరియల్ కౌన్సిల్లో సభ్యుడు. ఎనిమిదేళ్లపాటు ఆయన డిజోన్ విశ్వవిద్యాలయపు రెక్టారు. తన సమున్నత సూత్రబద్ధతకూ, విశాల దృష్టికీ ఆయన అక్కడ విద్యార్థుల గౌరవాన్నే కాకుండా ప్రొఫెసర్ల మన్ననను కూడా చూరగొన్నాడు. ఈ కాలంలో విజ్ఞానశాస్త్రాలపట్ల ఆయనకి గల ఆసక్తి శుద్ధ, అనువర్తిత గణితశాస్త్ర రంగంనుంచి తత్వశాస్త్రానికి మళ్లింది. రిటైరైపోయాక కుర్నో పారిస్‌లో స్థిరపడి, తన జీవితాంతం దాకా కచ్చితమైన క్రమబద్ధమైన జీవితం గడిపాడు. ఆయన ప్రతి రోజూ నిర్ణీత సమయానికి నిద్రపోయేవాడు, నిద్రలేచేవాడు, ప్రతి ఉదయమూ విధిగా గ్రంథాధ్యయనం చేసేవాడు. పైకి ఆయన కచ్చితమైన, కరుకైన మనిషిగా కనిపించేవాడు, కాని తన స్నేహితులతోనూ, సన్నిహిత పరిచితులతోనూ కలిసిమెలిసి వుంటూ, సాయిలాపాయిలాగా కబుర్లుచెప్తూ సరదాగా తుళ్లుతూ పేలుతూ వుండేవాడు. ఆయనలో హాస్యప్రవృత్తికి సైతం కొదవ వుండేదికాదు. కుర్నో పారిస్‌లో 1877లో మరణించాడు.

కుర్నో సేవ

కుర్నో ఆర్థిక – గణితశాస్త్రీయ గ్రంథం ఎవరిని ఉద్దేశించి రచింపబడిందన్న విషయం ఆసక్తికరమైంది. సామాన్యపాఠకుడికి అది మరీ జటిలం అవుతుందేమోననీ, అదే సమయంలో వృత్తిపరమైన గణితశాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించడంలో విఫలమవుతుందేమోననీ కుర్నో భయపడ్డాడు. అయితే, ఆయన యిలా రాశాడు: "గణిత విజ్ఞానశాస్త్రాల్లో కొన్ని పురోగామి అధ్యయనాలు చేసిన మీదట, సమాజానికి ప్రత్యే

కానక్తి కలిగిన విజ్ఞానశాస్త్రాలకు (ఆయన దృష్టిలో సాంకేతిక విజ్ఞానం, ప్రకృతి విజ్ఞానశాస్త్రాలూ ఉండి ఉండాలి — ఎ. ఎ.) వాటిని అనువర్తింపజేయ ప్రయత్నించిన వాళ్లు చాలా మంది వున్నారు. సామాజిక సంపదను గురించిన సిద్ధాంతాలు వారి దృష్టిని ఆకర్షించివుంటాయి. వాటి పరిశీలనలో రోజువారీ భాషా వనరులకు పరిమితులైపోయి, విశ్లేషణను అస్పష్టమూ, తరచుగా నిగూఢమూ చెయ్యడాన్ని సముచితంగా భావించే రచయితలకు భిన్నంగా, నా మాదిరిగానే వాళ్లు కూడా తమకు పరిచితమైన సంకేతాల ద్వారా ఆర్థిక విషయాల విశ్లేషణను మరింత సుస్పష్టం చెయ్యవలసి వుంటుంది.''*

ఆ కాలానికి విశిష్టమైన రకపు గణితశాస్త్రజ్ఞుల్లోనూ, ఇంజనీర్లలోనూ, ప్రకృతి విజ్ఞానశాస్త్రజ్ఞుల్లోనూ, సామాజిక విజ్ఞానశాస్త్రాలకు సంబంధించిన మనస్సును ఆకట్టుకొనే వివాదాత్మక సమస్యలపట్ల ఆసక్తి చూపి, కచ్చితమైన గణితశాస్త్రీయ పరిభాషను వాటికి అనువర్తింపజేసేందుకు ప్రయత్నించిన వారిలో బహుశా కుర్నోయే ప్రథముడు. తన తర్వాత చాలామంది గణితశాస్త్రవేత్తల మాదిరిగానే ఆయన ఆర్థిక విజ్ఞానశాస్త్రాన్నీ, దాని కర్తవ్యాలనూ చాలావరకు అప్పటికి వున్న సాహిత్యంలో తను చూసిన పద్ధతిలోనే స్వీకరించాడు. అయితే, అప్పటికి వున్న ఆర్థిక ధోరణుల పిడివాదాన్నీ, పరిమితులనూ అధిగమించే ప్రయత్నంలో, ప్రధాన సమస్యలపట్ల, ప్రత్యేకించి విలువపట్ల కుర్నో వస్తుపరమైన, సామాజిక వైఖరిని అవలంబించాడు. అదే ఆయన విశిష్టత. 19వ శతాబ్దపు రెండవ అర్ధభాగానికి చెందిన ఆర్థిక — గణితశాస్త్రవేత్తలకూ — విషయాలను వ్యక్తిపరమైన, మనస్తత్వ శాస్త్రపరమైన వైఖరిలో చూడటం వాళ్ల ప్రత్యేకత — కుర్నోకూ యిదే తేడా. ఉదాహరణకు, కుర్నో ఆది నుంచీ కూడా రాబిన్సనాడ్‌ను తిరస్కరించాడు. అభివృద్ధిచెందిన సరుకు ఉత్పత్తి, విక్రయాలను కలిగిన సమాజానికి తన సొంత సిద్ధాంతాన్ని నిర్మించుకున్నాడు.

కుర్నో తన రచనలో మౌలికంగా ఒక ముఖ్యమైన సమస్యను పరిశీలించాడు. వివిధ మార్కెట్ పరిస్థితుల్లో అంటే, కొనుగోలుదార్ల, అమ్మకందార్ల శక్తి మధ్య భిన్న సంబంధాలతో, ఒక సరుకు ధరకూ, దాని గిరాకీకీ మధ్య పరస్పరాశ్రయమే యీ సమస్య. అలా చేసే క్రమంలో, ఆర్థిక పరిశోధనలో గణితశాస్త్రాన్ని అనువర్తింపజేయడానికి గల స్వభావ, పరిమితులను నిరూపించడంలో ఆయన బుద్ధినైశిత్యాన్ని ప్రదర్శించాడు. గణితశాస్త్రపు సహాయంతో మౌలికమైన సామాజికార్థిక సమస్యలను వివరించినట్లు ఆయన

---

* A. Cournot, *Recherches sur les principes mathématiques de la théorie des richesses*, Paris, 1838, p. X.

చెప్పకోలేదు, గణితశాస్త్ర సూత్రీకరణకు కొద్ది గొప్పల్లో అనువైన కర్తవ్యాలకు మటుకే ఆయన పరిమితుడయాడు.

గిరాకీకీ, ధరకూ మధ్య సంబంధ సమస్యను అధ్యయనం చేసే క్రమంలో కుర్నో ఆర్థికశాస్త్రంలోకి, గిరాకీ వ్యాకోచత్వం అనే ముఖ్య భావనను ప్రవేశపెట్టాడు. ఇంతకు ముందే పేర్కొన్నట్లు, ఒక సరుకు ధర పెరిగినప్పుడు దాని గిరాకీ పడిపోవడమూ, సరుకుధర తగ్గినప్పుడు దాని గిరాకీ పెరగడమూ నిత్య జీవితానుభవంలో మనం చూస్తాం. ఈ "గిరాకీ నియమం" కుర్నోచేత యీ దిగువ ప్రమేయంలో చూపబడింది. దీనిలో D అన్నది గిరాకీ కాగా p అన్నది ధర:

$$D = F(p)$$

ఈ పరస్పరాశ్రయత అన్నది వేర్వేరు సరుకులకు వేర్వేరుగా వుంటుందని కుర్నో గమనించాడు. ధరలో సాపేక్షంగా తక్కువ వ్యత్యాసంతో గిరాకీ గణనీయంగా మారవచ్చు. దీన్నే గిరాకీ అధిక వ్యాకోచత్వం అంటారు. మరి, తద్విరుద్ధంగా, ధరలో మార్పు వచ్చినాకూడా గిరాకీలో కొద్ది మార్పు మాత్రమే వ్యక్తం కావచ్చు — దీన్నే గిరాకీ అల్ప వ్యాకోచత్వం అంటారు. ఈ చివరది, విచిత్రంగావే కనిపించినప్పటికీ, కొన్ని విలాస వస్తువులకూ, నిత్య జీవితావసరవస్తువులకూ వర్తిస్తుందని కూడా కుర్నో పేర్కొన్నాడు. ఉదాహరణకు, ఒక ఫిడేలు ధర, లేక ఒక ఖగోళ పరిశీలక దూరదర్శిని ఖరీదు సగానికి సగం పడిపోవచ్చు, అయినాకూడా వాటి గిరాకీలో గమనీయమైన పెరుగుదల వుండటం సాధ్యం కాదు. ఆ వస్తువుల గిరాకీ ఉత్సాహపరుల ఓ చిన్న బృందానికి మాత్రమే పరిమితమై వుంది, వాళ్ల దృష్టిలో ధరది కాదు ప్రథమ ప్రాధాన్యం. మరో సందర్భంలో, కట్టెల ధర రెండింతలు కావచ్చు, అయితే గిరాకీ నిస్సందేహంగా ఆ మేరకు పడిపోదు. వెచ్చచెయ్యబడని యిళ్లలో బతకడం కంటె యితర అవసరాలను తగ్గించుకోడానికే జనం సంసిద్ధులవుతారు. ఈ విధంగా గిరాకీ ప్రమేయం భిన్న రూపాలు కలిగివుండవచ్చు. తత్పర్యవసానంగా భిన్నమైన వక్రరేఖలు వాటికి ప్రాతినిధ్యం వహించుతాయి. తక్కువ రూఢియైనదీ, గణితశాస్త్ర పరంగా ఎక్కువ ముఖ్యమైనదీ ఏమిటంటే, యీ ప్రమేయం స్థిరమైనదన్న కుర్నో ప్రధాన ప్రతిపాదన. అంటే, ధరలో యే అతి చిన్న మార్పు అయినా గిరాకీలో అతి చిన్న మార్పుకి అనుగుణంగా ఉంటుందన్నదే యీ ప్రధాన ప్రతిపాదన. మార్కెట్ మరింత విస్తృతం అయినకొద్దీ, వినిమయదార్ల మధ్య సంభావ్య గిరాకీల, పరిస్థితుల, చివరకు చలచిత్తాల కలయికలు పెరిగిన కొద్దీ ఆర్థికంగా

యీ సూత్రం మరింత సమగ్రంగా సాధింపబడుతుందని ఆయన ఊహించడంలో సామంజస్యం లేకపోలేదు. ఈ ప్రమేయ నిరంతరాయత అర్థం ఏమిటంటే, దాన్ని వేరుచేసి చూడవచ్చు, గిరాకీ విశ్లేషణలో అవకలన, సమాకలన విశ్లేషణగా దాన్ని వినియోగించడాన్ని సాధ్యంచేస్తుంది.*

పై వ్యాఖ్యానాలను బట్టి ఒకానొక నిర్దిష్ట సరుకుయొక్క కొంత మొత్తాన్ని అమ్మడం ద్వారా వచ్చిన మొత్తం రాబడిని ఉత్పాదితం pD లేక pF(p)గా చెప్పవచ్చు. కుర్నో యీ ప్రమేయాన్ని అవకలనం చేసి, ఏ సరుకు ఉత్పత్తిదారైనా, తను "ఆర్థిక మానవుడు" కనుక, తన ఆదాయాన్ని సాధ్యమైనంత అధికం చేసుకునేందుకు ప్రయత్నిస్తాడన్న ఊహ మేరకు, దాని అధికతమ స్థాయి కోసం చూస్తాడని చెప్పాడు. అందుచేత, పరివర్తనల ద్వారా, అధికతమ నికర అమ్మకాలకు (రాబడికి) అనురూపమైన ధరను కుర్నో కనుగొంటాడు.

ఈ ధర గిరాకీ ప్రమేయపు రకంపైన, అంటేదాని వ్యాకోచ స్వభావంపైన ఆధారపడుతుంది. ప్రత్యక్షానుభవంలో కిందామీదా పడుతూ అమ్మకందారు నిర్ణయించుకొనే నిర్దిష్ట ధరయేగాని, అధికతమ లాభాన్ని యిచ్చేది అధికతమ ధర కాదనడం కూడా స్పష్టమే. కుర్నో తన విశ్లేషణను, తను సరళతమమైన పరిస్థితిగా పరిగణించే పరిస్థితి — సహజ గుత్తహక్కు — నుంచి మొదలుపెడతాడు. అసాధారణ లక్షణాలు కలిగిన ఖనిజోదక మూలాధారానికి ఎవరో ఒకడు యజమాని అనుకుందాం, అంటాడు ఆయన. అధికతమ ఆదాయం రాబట్టుకొనేందుకుగాను ఆయన యీ ఖనిజోదకానికి ఎంత ధర నిర్ణయించాలి? ఈ ప్రశ్నకు జవాబు చెప్పేందుకు ప్రయత్నించిన మీదట, కొత్త ఉత్పత్తి కారకాలను (ఉత్పత్తి ఖర్చులు, పోటీ, తదితర నిర్బంధాలూ) ప్రవేశపెట్టి, ఆయన మరింత సంక్లిష్ట పరిస్థితులకు ముందుకు వెళ్తాడు. తర్వాత, ద్విధాధిపత్య సందర్భాలను (ఇద్దరు గుత్తదారులు

---

* ఈ గణితశాస్త్ర శాఖల యీ అన్వయం (విశ్లేషణాత్మక రేఖాగణితంతోబాటు), 19వ శతాబ్దపు, 20వ శతాబ్ది తొలిపాదపు మొత్తం ఆర్థిక గణితశాస్త్రమంతటికీ ఒక విశిష్ట లక్షణంగా వుండేది. ఆర్థిక సిద్ధాంతవేత్తకు గణితశాస్త్రం తప్పనిసరి అవుతున్నప్పటికీ, మామూలుగా బాగా చదువుకున్న ఏ వ్యక్తి అయినా, దానికి అవసరమైన పరిజ్ఞానాన్ని, తన విరామకాలంలో అధ్యయనంచేసి సుమారు ఆరు మాసాల్లో సంపాదించుకోగలుగుతాడని 1908లో ఇటాలియన్ ఆర్థికవేత్త బరోనె రాశాడు. ఆర్థిక పరిశోధనయొక్క గణితశాస్త్ర యంత్రాంగం యీనాడు మరెంతో సంక్లిష్టంగా వుంది.

పోటీ చెయ్యడం), పరిమిత పోటీదారులు వుండే సందర్భాలను, చివరకు స్వేచ్ఛా వాణిజ్యాన్నీ కుర్నో పరిశీలిస్తాడు. ఈ విధంగా, 19వ శతాబ్దంలో అభివృద్ధి వాస్తవ చారిత్రక క్రమం స్వేచ్ఛావాణిజ్యంనుండి గుత్తహక్కు దిశగా సాగగా, కుర్నో ఉదాహరణ అందుకు తలకిందులు దశలో నిర్మింపబడింది.

ఆయన విశ్లేషణ అంతా కూడా ఒకేఒక పద్ధతి వినియోగంపైన ఆధారపడి వుంది. మార్కెట్ పరిస్థితిపైన ఆధారపడి భిన్నరూపాలను ధరించే గిరాకీ ప్రమేయాల అంత్య విలువల నిర్ధారణే ఆ పద్ధతి. ఈ పరిశీలనయొక్క గణితశాస్త్రీయ కచ్చితత్వమూ, తర్కమూ అత్యంత గణనీయమైనవి. ఆ నాటి బూర్జువా ఆర్థిక చింతనయొక్క ప్రముఖ వివరణకర్తల రచనలకు కుర్నో రచన చాలా భిన్నమైనది. ఆయన పరిభాష వాళ్లకు పూర్తిగా అపరిచితమైనది, విజాతీయమైనది. ఆయన్ని మరి వాళ్లు అర్థంచేసుకోలేదంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

కుర్నో భావనలో మౌలికమైన కొన్ని పొరపాట్లు వున్నాయి. అత్యంత సాధారణార్థంలో, దాన్ని పెట్టుబడిదారీ విధాన సమర్థకమైనదిగా పరిగణించాల్సివుంటుంది: శ్రమను పెట్టుబడి దోచుకోవడం, సంక్షోభాలు, పెట్టుబడిదారీ విధానపు తదితర మౌలిక నియమాలు — వీటన్నింటినీ కుర్నో అలక్ష్యం చేస్తాడు. తన నమూనాలో ఆయన నేరుగా పరిశీలించినవల్లా ధరలు మాత్రమే. ధరలు ఉత్పత్తితో దాదాపు బొత్తిగా సంబంధం లేకుండా, చలామణీ రంగంలో రూపొందుతాయని ఆయన భావిస్తాడు. గుత్తాధిపత్యాన్నీ, పోటీనీ పరిశీలించేటప్పుడు, వాస్తవికమైన పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థయొక్క అనేక ముఖ్యాంశాలను ఆయన వక్రీకరిస్తాడు. పెట్టుబడిదారీ విధానపు వైరుధ్యాలను పట్టించుకోని కుర్నో "శుద్ధ అర్థశాస్త్రం" వ్యక్తిపర ధోరణికి ఒక మూలం. కుర్నో మరణానంతరం, ఈ శాఖ ప్రతినిధులే ఆయన్ని "పునరావిష్కరించి," ఆయన్ని తమ ఆద్యుడుగా చిత్రించుకున్నారు. కొంతవరకు నిజంగానే ఆయన వాళ్లకు ఆద్యుడు. అయితే మనం యిక్కడ చూడవలసింది, నిర్దిష్ట ఆర్థిక సమస్యల పరిశీలనకు ఆయన సృష్టించిన పద్ధతినే గాని, కుర్నో తత్వంలోని తార్కిక పరిమితులను కాదు. ఈ దృష్ట్యా, ఆయన నిజంగానే, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో ఒక కొత్త వెలుగుబాటను తొక్కిన మార్గదర్శియే.

సంఖ్యాత్మక రూపంలో ఆర్థిక వాస్తవికతను ప్రతిబింబించే ప్రత్యక్షానుభవయుత సమాచారంతో జోడింపబడినట్లయితే తన గణితశాస్త్రీయ నమూనా మరింత విలువైన జ్ఞానసాధనం అవుతుందన్న విషయాన్ని కుర్నో గ్రహించాడు. ఆయన యీ భావాన్ని వ్యక్తంచేశాడు అంతమాత్రమే, అయితే అది గట్టిగా ఆచరణలోకి వచ్చేందుకు ఒక శతాబ్ద కాలం వేచివుండవలసి వచ్చింది.

కాని, దాదాపుగా కుర్నో కాలంలోనే (కొంచెం ముందేనేమో కూడా) యోహాన్ హేన్రిహ్ ఫన్ థ్యూనెన్ అనే ఒక జర్మన్, మరో ఆర్థిక నమూనాను నిర్మించడం ద్వారా, కుర్నో చెయ్యాలనుకున్నదాన్ని పాక్షికంగా సాధించి, ప్రత్యక్షానుభవయుత సమాచారాన్ని దానికి జోడించాడు. థ్యూనెన్ ఒక ఉత్తర జర్మన్ భూస్వామి. ఆయన తన జీవితమంతా తన చిన్న ఎస్టేటులో వ్యవసాయం చేసుకొంటూ శాంతియుతంగా గడిపాడు. అయితే యీ భూస్వామి పుట్టుకతోనే చింతనాపరుడు. ఆయన మరొక ఆర్థిక సమస్యా పరిష్కారంకోసం ప్రయత్నిస్తున్నాడు. ఆయన వలయాకారంలో వివిక్తప్రాంతంలో వున్న సర్వత్రా సారవంతమైన భూమినీ, ఆ వలయపు కేంద్రంలో (వ్యావసాయికోత్పాదితానికి సహజ గిరాకీ మూలాధారం అయిన) ఒక పట్టణాన్నీ ఊహించుకున్నాడు. ఈ నమూనా పరిశీలన క్రమంలో, వ్యవసాయపు వివిధ శాఖలను ఉపాంత తీవ్రతా ఏక కేంద్ర వృత్తాల రూపంలో ఏర్పాటుచెయ్యడం అనుకూలతమమన్న ఆసక్తిదాయకమైన ఒక నిర్ణయానికి ఆయన చేరుకున్నాడు. తన ఆర్థిక యూనిట్‌లో థ్యూనెన్ పదేళ్లపాటు విభ్రాంతిజనకమైన శ్రమచేసి, నిర్దుష్టంగా ఖర్చుల కాతా రాశాడు.

ప్రత్యేకించి, నిర్ణీత ధరను కలిగిన ఒక వ్యావసాయిక సరుకు విషయంలో పట్టణానికి ఎంత దూరంలో రవాణా ఖర్చు నికర లాభానికి (మొత్తం అమ్మకాలలో ఉత్పత్తి ఖర్చులను తగ్గిస్తే వచ్చే మొత్తం) సమానమవుతుందో, తత్పర్యవసానంగా ఉత్పత్తి నష్టదాయకమవుతుందో ప్రత్యేకించి ఆయన అంచనావేశాడు. కుర్నో పుస్తకం సిద్ధాంతపరమైన గణిత అర్థశాస్త్రానికి నాందికాగా, థ్యూనెన్ గణనలు (calculations) ఒక్కొక్కమారు అర్థమితి (econometrics)కీ, గణాంక సమాచారాన్నీ, యథార్థ పరిమాణాలపై ఆధారపడిన అనుభవపూర్వక నమూనాల వివరణలనూ కలిగిన గణిత అర్థశాస్త్రానికీ మచ్చుగా పరిగణింపబడ్డాయి.

థ్యూనెన్ ఏకైక రచన శీర్షిక "వ్యవసాయం, జాతీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన విడి రాజ్యం." మొదటి సంపుటం 1826లోనూ, రెండవ సంపుటంలో కొంత భాగం 1850లోనూ వెలువడ్డాయి. రెండవ సంపుటంలోని కొరవ భాగమూ, మూడవ భాగమూ ఆయన మరణానంతరం 1863లో వెలువడ్డాయి. థ్యూనెన్, తన సమకాలికుల గుర్తింపునుగాని, మెప్పుదలనుగాని దాదాపు పొందనేలేదు. ఆధునిక బూర్జువా ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో ఉపాంతవాద (marginalism) ఆద్యుడుగా ఆయనకి ప్రత్యేకమైన ప్రాముఖ్యం వుంది.

రికార్డో శ్రమ విలువ, వర్గ పంపిణీ సిద్ధాంతానికి విరుద్ధంగా, ఉత్పాదితపు విలువ శ్రమచేతా, పెట్టుబడిచేతా సృష్టింపబడుతుందని థ్యూనెన్ విశ్వసించి, ఉపాంత సూత్రపు సహాయంతో వాటిమధ్య సహజమైన అనుపాతాన్ని స్థిరపరిచేందుకు ప్రయత్నించాడు.

శ్రమయొక్క, పెట్టుబడియొక్క ఆదాయం శ్రమయొక్క, పెట్టుబడియొక్క ఉపాంత ఉత్పాదకతచేత అంటే, ఉత్పత్తిలో ఉపయోగించడానికి వీలైన చివరి యూనిట్ ఉత్పాదకతచేత నిర్ణయింపబడుతుంది. అర్ధశతాబ్దం తర్వాతగాని బూర్జువా అర్థ శాస్త్రంలో ఈ భావాలు అభివృద్ధి చెయ్యబడలేదు.

అర్థశాస్త్రంలో గణితశాస్త్రీయ పద్ధతులు

అర్థశాస్త్రంలో గణితశాస్త్రీయ పద్ధతుల పాత్రను గురించిన చర్చ కనీసం ఒక శతాబ్దం వెనక ఆరంభమైంది. ఆ చర్చలో, "గణితశాస్త్ర వ్యతిరేక మౌఢ్యం" దగ్గర్నుంచి గణితశాస్త్రం లేనిదే అర్థశాస్త్రమే ఉండజాలదన్న ప్రకటనలదాకా — యిలా, సాధ్యమైన అన్ని అభిప్రాయాలూ వ్యక్తంచెయ్యబడ్డాయి. ఈనాడు అటువంటి అతిశయవైఖరులకు తోడ్పాటు లభించే అవకాశం లేదు. అయితే, ఆర్థికవిజ్ఞానపు వివిధ రంగాల్లో గణిత శాస్త్ర స్థానమూ, రూపాలూ, పరిమితులూ యీనాటికీ ఒక చర్చనీయాంశంగా వున్నాయి, నిస్సందేహంగా యిక ముందుకూడా అలా వుంటాయి. మౌలికంగా, అర్థ శాస్త్రంలో గణితశాస్త్ర పద్ధతుల సమస్య, అన్ని యితర శాస్త్రీయ సమస్యల మాదిరిగానే, ప్రధానంగా ఆచరణ గీటురాయి, లేక మరింత సరళంగా చెప్పాలంటే, వాస్తవ జీవిత ప్రాతిపదికపైన నిర్ణయింపబడుతుంది. అభివృద్ధియొక్క ఒకానొక దశలో ఆర్థికవ్యవస్థ యొక్క వాస్తవిక అవసరాలు అర్థశాస్త్రపు గణితశాస్త్రీయకరణకు అగత్యాన్ని కల్పించాయి. ఉత్పత్తి యూనిట్ చిన్న పారిశ్రామిక సంస్థ అయినప్పుడు, దాని నిర్వహణకు కావలసిందల్లా ఆచరణాత్మక పరిజ్ఞానం మాత్రమే. అయితే, ఆధునిక భారీ పారిశ్రామిక సంస్థ ఉత్పత్తి, అమ్మకాలు, డబ్బు నిర్వహణ విషయం పూర్తిగా వేరు, విజ్ఞానశాస్త్ర ప్రమేయం లేనిదే యిది సాగదు. ఆర్థిక విజ్ఞానశాస్త్రం అంటే ఎక్కువ భాగం ఆర్థిక సైబెర్నెటిక్సు, అంటే, ఆర్థిక వ్యవస్థల్లో సంబంధాలనూ, దిశా నిర్దేశాన్నీ, కంట్రోలునూ అధ్యయనంచేసే గణితశాస్త్ర విద్యావిభాగం. ప్రత్యక్ష ఆర్థిక అవసరాలు కూడా, ఒకానొక వర్గపు ఆర్థిక కర్తవ్యాలను పరిష్కరించే కొత్త గణితశాస్త్రీయ పద్ధతులను ఉత్పన్నంచేశాయి. ఉత్పత్తి, పెట్టుబడి మదుపు, పాదార్థిక సప్లయ్‌లు మొదలైన వాటికి సంబంధించిన అత్యంత సముచితమూ, అత్యంత హేతుబద్ధమూ అయిన ఉత్పత్తి కార్యక్రమాన్ని ఎన్నుకోవడమే

ప్రధాన తరహా ఆర్థిక కర్తవ్యం. ఆర్థిక గణితశాస్త్ర పద్ధతుల ప్రాతిపదికపై యీ కర్తవ్యాల శాస్త్రీయ పరిష్కారం ఆధునిక ఎలెక్ట్రానిక్ కంప్యూటర్ల వినియోగం ద్వారా మాత్రమే సాధ్యమవుతోంది. ఒక విధంగా అది, ఆర్థికశాస్త్రం — గణితశాస్త్రం — కంప్యూటర్ల వ్యవస్థలో మూడవ భాగం అవుతోంది. ఈ వ్యవస్థ, ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించడంలో యింతకు ముందే ముఖ్యమైన పాత్రను వహిస్తోంది. భవిష్యత్తులో యిది అధికతర ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక—గణితశాస్త్రీయ పద్ధతుల అన్వయం విడి పారిశ్రామిక సంస్థల పరిధులనూ, చివరకు పెట్టుబడిదారీ దేశాల్లోని భారీ ఉత్పాదక ఆర్థిక సంస్థల, సమ్మేళనల పరిధినీ సైతం దాటి ఎన్నడో ముందుకుపోయింది. ప్రభుత్వ గుత్తపెట్టుబడిదారీ విధానపు ప్రత్యక్ష అవసరాలు, జాతీయార్థిక వ్యవస్థ పనితీరు యొక్క గణితశాస్త్ర నమూనాల (స్థూల నమూనాల) విపులీకరణలు చేసేలా బూర్జువా పండితులను ప్రోత్సహిస్తున్నాయి. అటువంటి నమూనాల, పరిశోధనల కర్తలలో యిటీవలి దశకాలకు చెందిన అత్యంత ప్రముఖ పాశ్చాత్య ఆర్థికశాస్త్రవేత్తలు కూడా వున్నారు. ఒకవంక, బూర్జువా రాజకీయ — ఆర్థికపరిశోధన పద్ధతుల వినియోగం, రెండోవంక, అత్యంత సరళమైన సంకేతాలూ, అంకగణితంనుండి సంశ్లిష్టమైన ఆధునిక పద్ధతుల దాకా గణితశాస్త్రపు అన్వయం — యిదే ఆ రచనల్లోని ఉమ్మడి అంశం. ఈ రచనలు సాధారణంగా అర్థమితి స్వభావం కలిగినవి, అంటే, వాటిలో గణాంక లెక్కలు వుంటాయి, లేకుంటే నమూనాకు గణాంక లెక్కలు అనుబంధంగా చేర్చబడతాయి. పారిశ్రామిక శాఖల విశ్లేషణ రంగంలో అమెరికన్ పండితుడు డబ్లియు. లియోంటీఫ్ రచనలకు గొప్ప శాస్త్రీయ, ఆచరణాత్మక ప్రాముఖ్యం వుంది. 1920 దశకంలో సోవియట్ ప్లానింగు సంస్థల్లో యిలాంటి వివరణ పద్ధతి దీనికన్న ముందే జరిగిందని సందర్భవశాత్తూ, చెప్పుకోవలసివుంది. ఒక శాఖనుండి మరొక శాఖకు వస్తువుల, సేవల బదలాయింపును ప్రతిబింబించే పరిమాణాత్మక సంబంధాలచేత ఒకదానితో మరొకటి అనుసంధానించబడి కొద్ది గొప్పల్లో ఏకం చెయ్యబడిన (అంటే, ఏకరీతి ఉత్పత్తిని సమైక్యంచేసే) శాఖల ఒక వ్యవస్థగా, ఆర్థికవ్యవస్థను పట్టికలలో చిత్రించడమే యీ పద్ధతి సారాంశం.

ఆర్థికవ్యవస్థ అభివృద్ధిని గురించి జోస్యం చెప్పడంలో గణితశాస్త్ర నమూనాలు అతిముఖ్యమైన పాత్రను వహిస్తాయి. పెట్టుబడిదారీ దేశాల్లో వ్యాపార విజృంభణ గురించి ముందే జోస్యం చెప్పడమన్నది ప్రస్తుత పరిస్థితి యాదృచ్ఛిక లక్షణంగాని, తాత్కాలిక లక్షణంగాని కాదు. కొత్త ఆర్థిక ప్రణాళికలకు మారడం, ప్రభుత్వంచేత వాటి అజమాయిషీ యివి గణితశాస్త్రీయ పద్ధతుల, నమూనాల వినియోగం ద్వారా అమలుజరపబడుతున్నాయి. వర్ధమాన దేశాలు ప్రణాళికా రచనలోనూ, మేనేజిమెంటు

లోనూ శాస్త్రీయమైన పద్ధతులపట్ల గణనీయమైన ఆసక్తిని చూపుతున్నాయి. అధికతర పెరుగుదల రేట్లూ ఆర్థిక వ్యవస్థలో అత్యంత సముచిత అనుపాతాలూ యీ దేశాలకు సంబంధించి కీలక ప్రాముఖ్యం కలిగివుండటమే యిందుకు కారణం.

గణిత నమూనాల, పద్ధతుల వినియోగంతో శాస్త్రీయ నిర్వహణ పద్ధతులను సోషలిస్టు ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థలో అత్యంత పటిష్ఠంగానూ, ఫలవంతంగానూ అన్వయించడం సుసాధ్యమేననడంలో సందేహమేమీ లేదు. ఈ రంగంలో సోవియట్ ప్రణాళికా సంస్థలు గణనీయమైన అనుభవాన్ని సంతరించుకున్నాయి. ప్రత్యేకించి యిటీవలి సంవత్సరాల్లో కొత్త పద్ధతులు కొల్లలుగా ప్రవేశపెట్టబడ్డాయి. ఇతర సోషలిస్టు దేశాల నిపుణులు ప్రణాళికా సిద్ధాంత, ఆచరణల విపులీకరణకు గణనీయమైన దోహదం చేస్తున్నారు. ఆర్థిక గణితశాస్త్ర పద్ధతులకు సంబంధించి, సోవియట్ అకడెమీషియన్ వి. ఎస్. నెమ్చినొవ్, పోలిష్ అర్థశాస్త్రవేత్త ఒ. లాంగే ప్రముఖ నిపుణులూ, ప్రచారకులూ.

పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తల ఆర్థిక గణితశాస్త్రీయ రచనల అధ్యయనంపట్ల సోవియట్ విజ్ఞానశాస్త్రవేత్తలు విశేషమైన శ్రద్ధ ప్రదర్శిస్తున్నారు. బూర్జువా ఆర్థిక విజ్ఞానశాస్త్ర వస్తుపర, ప్రజ్ఞాన, ఆచరణాత్మక కర్తవ్యం యీ రచనల్లో వుంటుంది. అది, సైద్ధాంతికమూ, పెట్టుబడిదారీ విధాన సమర్థకమూ అయిన మరో ప్రధాన కర్తవ్యానికి సమాంతర రేఖలో అభివృద్ధిచెందుతుంది. ఆధునిక బూర్జువా అర్థశాస్త్రంలో యీ రెండు కర్తవ్యాలనూ వేరుచేయడం అవసరమని సోవియట్ ఆర్థిక నిపుణుడు ఎల్. బి. ఆల్టెర్ ప్రతిపాదించాడు. దీన్ని యీనాడు మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తల్లో అధిక సంఖ్యాకులు ఆమోదిస్తున్నారు. ఇదొక్క ఆర్థిక గణితశాస్త్రీయ రచనలకు మాత్రమే వర్తించడమే కాకుండా, వాటిని అంచనావెయ్యడంలో ప్రత్యేకించి ఉపయోగకరమైనది.*

---

* వివిధ తరహాల ఆర్థిక గణితశాస్త్రీయ రచనలు ఉన్నాయన్న సంగతి దృష్టిలో పెట్టుకుని కొందరు రచయితలు, గణితశాస్త్రీయ పద్ధతులను వినియోగించే బూర్జువా ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో మూడు కర్తవ్యాలు ఉన్నాయని సూచిస్తున్నారు: పెట్టుబడిదారీ విధానాన్ని సైద్ధాంతికంగా బలపరచే సైద్ధాంతిక కర్తవ్యం; వస్తుపరమైన ప్రజ్ఞానానికీ, ప్రభుత్వ ఆర్థిక విధానానికి శాస్త్రీయంగా ఆధారాలు చూపడానికీ సంబంధించిన కర్తవ్యం; నిర్దిష్ట కర్తవ్యాలను పరిష్కరించి, విడి కంపెనీలకూ, పరిశ్రమలకూ సేవజేసే ప్రధానంగా సాంకేతిక విధి (ఎస్. అవ్‌గూర్‌స్కీ రచించిన "అర్థమితి, ఆధునిక పెట్టుబడిదారీ విధానం," "అర్థశాస్త్రం, గణితశాస్త్ర పద్ధతులు," 5వ సంచిక, 1969, పేజి 646 [రష్యన్ భాషలో]).

ఆర్థిక గణితశాస్త్రీయ రచనల్లో సైద్ధాంతిక కర్తవ్యం విలక్షణంగా వ్యక్తమవుతుంది. ఒకవంక, ఆర్థిక వ్యవస్థా రంగంలోని కర్తవ్యాల పరిస్థితులు, బూర్జువా సమాజపు విశిష్ట వర్గ లక్షణాలు కనిపించని రీతిలో సూత్రీకరింపబడ్డాయి. విడివ్యక్తి ఆర్థిక ప్రవర్తన, అతను ఏ వర్గానికి చెందుతాడో ఆ వర్గంతో ప్రమేయం లేకుండా పరిశీలింపబడుతుంది; పరిశ్రమదారుల ఆర్థిక నిర్ణయాలు, ఉత్పత్తి సాధనాల స్వామ్య రూపంతో ప్రమేయం లేకుండా పరిశీలింపబడుతాయి; బూర్జువా ప్రభుత్వపు చర్యలు, దాని వర్గ సారాంశంతో ప్రమేయం లేకుండా పరిశీలింపబడుతాయి. (అటువంటి ధోరణులు కుర్నోకి విశిష్టమైనవన్న విషయాన్ని మనం వెనకనే చూశాం.) మరోవంక, అది తరచుగా, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నిర్వహణలో ప్రభుత్వపు అపరిమిత సామర్థ్యాన్ని గురించిన అనిరూపిత సూత్రీకరణను ప్రాతిపదికగా చేసుకొంటుంది, ఆర్థిక వ్యవస్థలో సద్యోజనిత శక్తుల ప్రాముఖ్యాన్ని తక్కువ చేసి చెప్తుంది. బూర్జువా ఆర్థిక గణిత శాస్త్రీయ రచనలను విశ్లేషించేటప్పుడు సోవియట్ అర్థశాస్త్ర నిపుణులు యీ విషయాలను పరిగణనలోకి తీసుకొని, వాటిలోని పెట్టుబడిదారీ సమర్థక అంశాలను బహిర్గతం చేసి విమర్శిస్తారు.

అర్థశాస్త్రానికి సంబంధించిన సైద్ధాంతిక పరిశీలనల లక్ష్యం ఒకానొక సామాజిక వ్యవస్థయొక్క — అది పెట్టుబడిదారీ విధానమైనా, సోషలిజం అయినా — మౌలిక గుణాత్మక, సామాజికార్థిక నియమాలను కనిపెట్టడం కాగా, అటువంటి పరిశీలనలకు గణితశాస్త్ర పద్ధతులను అన్వయించడమే, ఆర్థిక—గణితశాస్త్ర పద్ధతుల రంగంలో అత్యంత వివాదాస్పదమైన సమస్య. తర్కం, సాధారణీకరణ, ప్రయోగాల మాదిరిగానే, గణితశాస్త్రం జ్ఞానార్జనకు ఒక పద్ధతీ, ఒక సాధనమూ. ఎలెక్ట్రానిక్ కంప్యూటర్లు తటస్థమైనట్లుగానే స్వతహాగా గణితశాస్త్రం తటస్థమైనది. సైద్ధాంతిక ఆర్థిక పరిశోధన ప్రతిదానికీ ఒక తాత్విక భావం వుంటుంది. అదే ఏ రకమైన గణితశాస్త్ర అన్వయానికైనా ముందుగా జరిగే గుణాత్మక విశ్లేషణను నిర్ధరించి, ఆ కర్తవ్యపు షరతులనూ, పరిమితులనూ సూత్రీకరిస్తుంది. మార్క్సిస్టు ఆర్థిక పరిశోధన మార్క్సిస్టేతరమైన ఆర్థిక పరిశోధనమండి — ఈ రెండింటిలోనూ దేనిలో గణితశాస్త్రం వినియోగింపబడిందన్నదానితో ప్రమేయం లేకుండా — విభేదిస్తుంది. గణితశాస్త్ర వినియోగమన్నది శాస్త్రీయావశ్యకతచేత నిర్ణయింపబడుతుంది. కొన్ని రంగాల్లో, లాంఛన ప్రాయమైన గణితశాస్త్ర పద్ధతులను వాడకపోయినా కూడా ముఖ్యమైన ఫలితాలు సాధింపబడవచ్చు. మరి కొన్ని రంగాల్లో అవి ఉపయోగకరమే గాక ఆవశ్యకం కూడా కావచ్చు. లాంఛన ప్రాయమైన గణితశాస్త్ర పద్ధతుల వినియోగం మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత పరిశుద్ధతకు భంగం కలిగిస్తాయని భయపడిన వారికి సమాధానంగా

వి. ఎస్. నెమ్చినొవ్ రాసినట్లు గణితశాస్త్రం దుర్వినియోగం చెయ్యబడే అవకాశాన్ని గురించి తరచుగా పేర్కొంటూ వుంటారు. అటువంటి దుర్వినియోగం సాధ్యమే ననడం స్పష్టం. అయితే, పరిశీలనలో వున్న ఆర్థిక విషయాల సరైన ప్రాథమిక గుణాత్మక విశ్లేషణ జరిగినట్లయితే యీ దుర్వినియోగాన్ని లేకుండా చెయ్యవచ్చు.

ఆర్థిక సిద్ధాంతంలో గణితశాస్త్ర అన్వయం సాధ్యమేకాకుండా, ప్రయోజనకరమని మార్క్స్ భావించాడన్న విషయాన్ని గుర్తుచేసుకోవడం అవసరం. మార్క్స్ సిద్ధాంతంలోని అనేక పరిమాణాత్మక నియమాలు తరచుగా అనులోమ విలోమ అనుపాతాలతో కూడిన బీజగణిత సూత్రాల సాయంతో వ్యక్తంచెయ్యబడ్డాయి. ఏ విజ్ఞానశాస్త్రమైనా గణితశాస్త్రాన్ని వినియోగించుకోగలిగేదాకా, అది సరిగా అభివృద్ధిచెందదు అన్న మార్క్స్ సుప్రసిద్ధ అభిభాషణను పాల్ లాఫార్గ్ గ్రంథస్థం చేశాడు.* ఆర్థిక చక్రాలను గూర్చిన ఆధారపడదగిన గణాంక సమాచారాన్ని గణితశాస్త్రపరంగా వర్గీకరించడం ద్వారా "సంక్షోభాల ప్రధాన నియమాలను... కనిపెట్టడం"** సాధ్యమేనని తను భావిస్తున్నట్లు 1873లో మార్క్స్ ఎంగెల్సుకు రాశాడు. ఈ సందర్భంలో, సంక్షోభాల కారణాలను గురించి గాక, వాటి పురోగతిని గురించి ఆయన పేర్కొంటున్నాడనడం స్పష్టం.

అన్ని జ్ఞానరంగాల గణితశాస్త్రీయకరణ, సైబెర్నెటిక్స్ అంటే, సమాచార వ్యవస్థ వైఖరి అభివృద్ధి, ఆర్థిక విజ్ఞానశాస్త్రంపైన అనివార్యమైన గొప్ప ప్రభావం కలిగివుంది.

---

* Paul Lafargue et Wilhelm Liebknecht, *Souvenirs de Marx*, Paris, 1935, p. 9.

** Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. 33, Berlin, 1966, S. 82.

ప్రకరణం 17

ఆర్థిక జాతీయవాదం.

ఫ్రీడిష్ లిస్ట్

లిస్ట్, జర్మన్ చరిత్ర

జర్మన్ అర్థశాస్త్రం 18వ శతాబ్దంనుంచి కామెరలిస్టిక్స్‌ను వారసత్వంగా పొందింది. ఇది మధ్యయుగ విశ్వవిద్యాలయాల్లో ప్రభవించిన పద్ధతి. రాజ్య నిర్వహణ సిద్ధాంత, ఆచరణల వక్కాణింపుతో అన్ని సామాజిక విజ్ఞానశాస్త్రాలకూ వర్ణనాత్మకంగా వివరణ నిచ్చే పద్ధతి యిది. ఇంగ్లండు, ఫ్రాన్సుల్లో ఎన్నడో అంతరించిన వ్యాపారవాదమే ఆధికారిక ఆర్థిక సిద్ధాంతం. జర్మనీలో 19వ శతాబ్ద్యారంభంలో స్మిత్ భావాలు వేళ్ళూనుకోనారంభించాయి. తత్పర్యవసానంగా స్మిత్ సిద్ధాంతమూ, పాతగిలిపోయిన కామెరలిస్టిక్సూ కలిసిన విచిత్రమైన ఒక పులగం తయారైంది.

కల్లోలిత రాజకీయ ఘటనలు, ఆర్థిక పరివర్తనలు సంభవించిన కాలం అది. నెపోలియన్ దాడుల తదుపరి, జర్మనీలోని రాజ్యాలలోనూ, సామంత రాజ్యాల్లోనూ ఫ్యూడల్ సంబంధాలు కూలిపోయాయి. భూదాసుల వ్యక్తిగత పరాధీనత రద్దుచేయబడింది. పట్టణ ప్రాంతాల్లోని వృత్తిగిల్డులు విచ్ఛిన్నమయాయి. చాలా జర్మన్ రాజ్యాల్లో, ప్రత్యేకించి మిక్కిలి బలమైన ప్రష్యాలో, కొన్ని విషయాల్లో ఇంగ్లండు, ఫ్రాన్సుల ఆదర్శాన్ని అనుసరించడానికి సిద్ధపడిన బూర్జువా సంస్కర్తలు అధికారంలోకి వచ్చారు.

అయితేనేం, నెపోలియన్ యుద్ధాల అనంతరం సైతం, జర్మనీ ఆర్థికంగా వెనుకబడి, రాజకీయంగా అనైక్యంగా వున్న దేశంగానే మిగిలిపోయింది. విదేశీ ఆక్రమణదారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పెల్లుబికిన దేశభక్తియుత వెల్లువను రాజులూ, భూస్వాములూ తమ స్వప్రయోజనాలకు వినియోగించుకున్నారు. అభివృద్ధినిరోధక శక్తులు విజయం పొంది, జర్మనీనీ, యూరప్ అంతటినీ ప్రక్కదలించివేసిన 1848 నాటి కల్లోలిత ఘటనలదాకా, తిరుగులేనివిగా నిరూపించుకున్నాయి.

ఆర్థికాభివృద్ధి స్థాయి దృష్ట్యా ఇంగ్లండు ఫ్రాన్సులకన్న జర్మనీ బాగా వెనక బడివుంది. 1840 నాటికి జర్మనీ జనాభా ఇంగ్లండు జనాభాతో దాదాపు సమానంగా వుంది (సుమారు 2 కోట్ల, 70 లక్షలు). కాని, జర్మనీ ఇంగ్లండు ఉత్పత్తిచేసే దానిలో $^1/_{14}$వ వంతు బొగ్గునూ, $^1/_8$వ వంతు ఇనుమునూ ఉత్పత్తిచేస్తోంది, ఇంగ్లండు వినియోగించే పత్తిలో $^1/_{16}$వ వంతును మాత్రమే వినియోగిస్తోంది. అయితేనేం, ప్రత్యేకించి 1834లో "సుంకాల యూనియన్"పైన సంతకాలు జరిగి, జర్మన్ రాజ్యాల ఆర్థిక సమ్మేళనం జరిగాక జర్మనీ పారిశ్రామిక పెరుగుదల బాగా వేగంగానే జరుగుతోంది.

ఫ్యూడల్, పితృస్వామిక పద్ధతుల శృంఖలాలను యింకా వదిలించుకోని జర్మనీలో అప్పుడే పరిశ్రమలు తలెత్తాయి. సైలీషియన్ నేత కార్మికుల బలవత్తరమైన తిరుగుబాటు (1844), కార్మికవర్గపు పెరుగుతున్న శక్తిని పాలకవర్గాలకు చూపించింది. తనను తానొక ప్రగతిశీల వర్గంగా, నూతన, సాహసిక భావాల వాహకురాలిగా వ్యక్తం చేసుకొనే వ్యవధి జర్మన్ బూర్జువావర్గానికి లభించలేదు. హడావిడిగా భూస్వాములతోనూ, అన్ని అభివృద్ధినిరోధక శక్తులతోనూ అది పొత్తుపెట్టుకొనేందుకు పూనుకొంది. ఈ పొత్తే త్వరలో కైజర్ జర్మనీ ఆవిర్భావానికి దారితీసింది.

1820 దశకంనుంచి 1840 దశకందాకా జర్మనీలోని అర్థశాస్త్రం ప్రష్యన్ రాజరికంయొక్క, జర్మన్ సామంత రాజులయొక్క దాసీగా వుంది. కామెరలిస్టిక్స్ శాఖనుంచి ఉద్భవించిన అర్థశాస్త్రవేత్తలు పాఠ్యగ్రంథాలను రచించారు. ఆ పుస్తకాలు దేశభక్తియుత జర్మన్ రూపంలోకి ఇంగ్లీషు, ఫ్రెంచి పాఠ్య పుస్తకాల నాసి రూపాంతరీకరణ మాత్రమే. కేవలం పౌర సేవాశాఖల్లో ఉద్యోగ సంపాదనకు సరిపడేటంత జ్ఞానం మాత్రమే వాటిలో వుండేది.

అయితే కొత్త కాలానికి కొత్త విధానాలు అవసరమయ్యాయి. వైవిధ్య పూరితమైన రచయితా, పుర ప్రముఖుడేగాని ఏవిధంగా చూసినా ముఖ్యమైన సిద్ధాంతవేత్త కాని ఫ్రీడ్రిహ్ లిస్ట్, జర్మన్ బూర్జువావర్గపు ప్రయత్నాలను శక్తివంతంగా వ్యక్తంచేశాడు. జర్మనీ ఐక్యతతోనూ, పారిశ్రామికాభివృద్ధితోనూ సంబంధం కలిగివున్న మేరకు వాళ్ళ ప్రగతిశీలురు, వాటిని సాధించడమన్నది అర్ధఫ్యూడల్ రాజరికానికి అధీనంచెయ్యబడిన మేరకు వాళ్ళు తిరోగాములు. అనేక విషయాల్లో సాధారణ విశ్వవిద్యాలయ స్థాయినీ, ఆనాటి సివిల్ సర్వీసు స్కాలర్‌షిప్ స్థాయినీ మించి పైకి వెళ్లడంలో లిస్ట్ సఫలుడయ్యాడు. ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులు కూడా బూర్జువావర్గపు ప్రయోజనాలకే, కాని భిన్న చారిత్రక, సామాజికార్థిక పరిస్థితుల్లో, ప్రాతినిధ్యం వహించారు. లిస్ట్, వారికి భిన్నమైన పంథాను అనుసరించాడు.

పదవి, జైలు, దేశాంతరవాసం

ఫ్రీడిహ్ లిస్ట్ 1789లో వూర్టెంబెర్గ్ రాష్ట్రపు రేయ్ట్లింగెన్ (దక్షిణ జర్మనీ) పట్టణంలో జన్మించాడు. ఆయన తండ్రి ధనికుడైన చేతిపనివాడు — చర్మకారుడు. ఆ కుటుంబం పట్టణ ప్రభువర్గానికి చెందకపోయినా వంశపారంపర్యంగా మధ్యతరగతిలో గౌరవనీయమైన స్థానాన్ని కలిగివుంది. లిస్ట్ విద్యాభ్యాసం పదిహేనవ యేట ముగిసిపోయింది, అటుతర్వాత ఆయన రెండేళ్లపాటు తన తండ్రికి కార్ఖానాలో సహాయకుడుగా పనిచేశాడు. అప్రెంటిసుల్లో త్వరలోనే ఆయనకి సోమరి, పగటికలలు కనేవాడన్న ప్రశస్తి వచ్చింది. ఆ కుటుంబంవాళ్లు ఆయన్ని ఒక గుమాస్తా దగ్గర సహాయకుడుగా కుదర్చాలని నిర్ణయిం చుకున్నారు. లిస్ట్ యిక్కడ చరచరా పైకి వెళ్లి, 1814దాకా ఫ్రెంచి సామ్రాజ్యంలో సామంత రాజ్యంగా వున్న వూర్టెంబెర్గ్‌లో అధికార పదవుల నిచ్చెన పైకి ఎక్క సాగాడు. తన పదేళ్ల ఉద్యోగ కాలంలో లిస్ట్ విభిన్నమైన అనేక పదవులు ఆక్రమించాడు: తూబింగెన్ విశ్వవిద్యాలయంలో ఆయన పద్దెనిమిది మాసాలపాటు న్యాయశాస్త్రాన్ని అభ్యసించి, వూర్టెంబెర్గ్ రాజధాని ష్టుట్‌గార్ట్‌లో గణాంక అధికారి పదవిలో వుండగా తన ఉద్యోగానికి స్వస్తిచెప్పాడు. 1817లో ఉదారవాద మంత్రి వాన్‌గెన్‌హైమ్ అభిమానం ధర్మమా అని, తూబింగెన్ విశ్వవిద్యాలయంలో ఆయన "రాజ్య నిర్వహణ ప్రాక్టీసు" అనే అంశంలో ప్రొఫెసరుగా నియమింపబడ్డాడు.

ఉజ్వలమైన ఉద్యోగ క్రమం! 28 ఏళ్ల లిస్ట్‌యొక్క యీ ఉన్నతోద్యోగం కేవలం యాదృచ్ఛిక విషయం కాదు. అప్పటికి ఆయనకి సమర్థుడైన పాలనాదకుడన్న కీర్తియే కాకుండా, ప్రముఖ ఉదారవాద పత్రికా రచయిత అన్న ప్రసిద్ధి కూడా వుంది. ఫ్రెంచి విప్లవ ఆదర్శాలనూ, జర్మన్ విముక్తి ఉద్యమ భావాలనూ జీర్ణించుకొన్న లిస్ట్, తీవ్రవాద బూర్జువా ప్రజాస్వామిక సంస్కరణల సుదృఢ సమర్థకుడయ్యాడు.

ఆయన రాజకీయ భావావేశం, సాహసం, భావ స్పష్టత, తీక్ష్ణమైన భాష, సునిశితమైన వ్యంగ్యం — ఆయన పరిణత రచనకు విశిష్టమైన యీ లక్షణాలన్నీ ఆయన తొలి రచనల్లో కూడా కనిపిస్తాయి. స్వభావరీత్యా ఆయన సునిశిత బుద్ధిశాలి, మాటకారి, అసాధారణ ఉత్సాహవంతుడు, ఆవేశపరుడు, ఆశావాది. వూర్టెంబెర్గ్‌లో తను చేస్తున్న రాజకీయ పోరాటాన్ని విడిచిపెట్టకుండా, తన సాహిత్య కృషినీ, ప్రొఫెసరుగా తన వృత్తినీ కొనసాగిస్తూ, లిస్ట్ 1819లో ఒక కొత్త పోరాటంలోకి, యీమారు దేశవ్యాపిత పోరాటంలోకి దిగాడు. ఆయన వర్తకుల, పరిశ్రమదారుల సంఘాన్నొకదాన్ని స్థాపించాడు.

జర్మనీ ఆర్థిక సమైక్యత కోసం, మరింత కచ్చితంగా చెప్పాలంటే, దేశ సరిహద్దుల లోపల సుంకాల రద్దు కోసం పోరాడటమే ఆ సంఘ ప్రధాన లక్ష్యం.

అయితే ఆ సంవత్సరమే, ఆయన నెత్తిపైన కారుమబ్బులు ముసురుకోనారంభించాయి. విశ్వవిద్యాలయపు ఇతర ప్రొఫెసర్లు ఆయనకి వ్యతిరేకంగా కుట్రచేశారు. "ప్రమాదకర రాజకీయ ధోరణులు" గల వ్యక్తి అంటూ ఆయనపైన అధికారుల దగ్గర పితూరీ చేశారు. వాన్‌గెన్‌హైమ్ లిస్ట్‌ను యికనెంత మాత్రమూ కాపాడలేకపోయాడు. ఇప్పుడాయన రిటైర్ అయాడు, వూర్టెంబెర్గ్‌లో అభివృద్ధినిరోధక వర్గాలు పైచేయి పొందాయి. వర్తకుల, పరిశ్రమదారుల సంఘంలో కార్యకలాపాలకుగాను లిస్ట్‌పై అభియోగం మోపబడింది: ప్రభుత్వోద్యోగిగా ముందుగా ఆయన యీ విషయంలో తన పైవారితో చర్చించివుండవలసింది. లిస్ట్ దర్పంగా, హుందా అయిన భాషలో విశ్వవిద్యాలయంనుంచి రాజీనామా యివ్వాలన్న తన సంకల్పాన్ని తెలియజేశాడు. ఈలోగా రెయ్‌ట్లింగెన్ పౌరులు ఆయన్ని, కొత్త వూర్టెంబెర్గ్ పార్లమెంటు కింది సభకు సభ్యుడుగా ఎన్నుకొన్నారు. గెలుపొందిన అభ్యర్థికి రాజ్యాంగరీత్యా నిర్ణీత వయోపరిమితి అయిన ముప్ఫయ్యేళ్లు నిండలేదన్న సాకు చూపి, ప్రభుత్వం ఆయన ఎన్నికను చెల్లకుండా చెయ్యడంలో కృతకృత్యమైంది. కాని, ఆరు నెలల తర్వాత లిస్ట్ తిరిగి ఎన్నుకోబడ్డాడు.

పార్లమెంటులో ఆయన కార్యకలాపాలు కొద్దికాలమే అయినా ముమ్మరంగా సాగాయి. తను ఎన్నుకోబడిన కొద్ది కాలానికే రెయ్‌ట్లింగెన్ పౌరుల తరపున ప్రభుత్వానికి ఆయనొక అర్జీని సమర్పించాడు. తనే రచించిన ఆ అర్జీలో విస్తృతమైన ప్రజాస్వామిక సంస్కరణల కార్యక్రమాన్నొకదాన్ని ప్రతిపాదించాడు. ఆ పత్రం సవాలుచేస్తూ తిరుగుబాటుదారుడు రాసే భాషలో ఉండటంతో, త్వరలోనే ప్రభుత్వ కోపం ఆయన నెత్తిపైన విరుచుకుపడింది. "ప్రభుత్వ వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నాడు" అన్న అభియోగం ఆయనపై మోపబడింది. ఆయన పార్లమెంటు సభ్యత్వం రద్దుచెయ్యబడింది, దానికితోడు పది నెలల కారాగారవాస శిక్ష విధింపబడింది. అరెస్టుచెయ్యబడేదాకా ఆగకుండా లిస్ట్ దేశంనుంచి పారిపోయి, పొరుగునగల పశ్చిమ యూరపియన్ దేశాల్లో తిరుగుతూ రెండేళ్లకుపైగా గడిపాడు.

అటుతర్వాత ఆయన రాజ క్షమాపణ లభిస్తుందన్న ఆశతో వూర్టెంబెర్గ్‌కి తిరిగి వచ్చాడు, కాని వెన్వెంటనే ఆయన్ని పట్టుకుని జైల్లో పడేశారు. అప్పటికి జర్మనీ అంతటా ప్రసిద్ధుడైన, బలవంతుడైన తన యీ రాజకీయ ప్రత్యర్థిని వదిలించుకోవడం మేలని ప్రభుత్వం భావించింది. అమెరికాకు దేశాంతరవాసం పోవడానికి అంగీకరించిన మీదట, తన జైలు శిక్షాకాలం ముగియకుండానే లిస్ట్ విడుదలచెయ్యబడ్డాడు. 1825 జూన్‌లో ఆయనా, ఆయన భార్యా బిడ్డలూ న్యూయార్కులో దిగారు. మొదట లిస్ట్ సేద్యానికి పూనుకొన్నాడు, తర్వాత ఒక జర్మన్ వార్తాపత్రికకు సంపాదకత్వం వహించాడు.

చివరకు ఒక పరిశ్రమ నడిపాడు. ఆయన రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తూనే వచ్చాడు. రక్షణ విధానం ప్రాతిపదికపైన అమెరికాకు ఆయనొక ఆర్థిక కార్యక్రమాన్ని రూపొందించాడు. అమెరికా, జర్మనీలు పారిశ్రామికాభివృద్ధి విషయంలో ఇంగ్లండు పోటీని ఎదుర్కోవలసి వస్తోంది గనుక, ఆ రెండు దేశాలూ ఒకే మాదిరి పరిస్థితిలో ఉన్నాయని ఆయన భావించాడు.

1832లో లిస్ట్, అమెరికన్ పౌరుడుగా యూరప్‌కి వచ్చాడు. లైప్జిగ్‌లో అమెరికా కాన్సల్ అయ్యాడు. పశ్చిమ యూరప్ అంతటా రైల్వే నిర్మాణం ముమ్మరంగా సాగుతున్న దశ అది. ఈ కార్యక్రమాన్ని లిస్ట్ చాలకాలంపాటు సముత్సాహంగా సమర్థిస్తూ వచ్చాడు. ఈ నూతన కార్యక్రమాన్ని ఆర్థిక ప్రగతికి ఒక సాధనంగానే కాకుండా, యుద్ధానికి వ్యతిరేకంగా ఒక హామీగా కూడా ఆయన పరిగణించాడు. లైప్జిగ్ నుండి డ్రెస్డెన్‌దాకా రైలుమార్గ నిర్మాణానికి ఆయనొక జాయింట్ స్టాక్ కంపెనీని ఏర్పాటుచేశాడు. జర్మనీలో నిర్మింపబడిన మొదటి రైలుమార్గాల్లో యిదొకటి. రాజకీయ కూహకాల్లోనూ, ఆర్థిక వ్యవహారాల్లోనూ చిక్కుకున్న లిస్ట్, గ్రూండెర్ ప్రత్యక్ష కార్యకలాపాల్లో భ్రమలు కోల్పోయి, 1837లో పారిస్‌కు వెళ్లిపోయాడు. సందర్భవశాత్తూ ఒక విషయం చెప్పుకోవాలి, రైల్వేలకు గల ఉజ్వల భవితవ్యంలో తనకున్న విశ్వాసాన్ని లిస్ట్, తన జీవితాంతందాకా నిలుపుకున్నాడు.

"జాతీయ వ్యవస్థ." లిస్ట్ చివరి సంవత్సరాలు

లిస్ట్ పారిస్‌లో మూడేళ్లు గడిపాడు. ఇది ఆయన మూడవదేకాక, చివరి దేశాంతర వాసం. తనకు సహజసిద్ధమైన శక్త్యుత్సాహాలతో, ఆయన అర్థశాస్త్ర అధ్యయనానికి పూనుకొని, పూర్తిగా పరిణతిచెందిన తన సొంత అభిప్రాయాలను ఆయన విపులీకరించనారంభించాడు. ఆయన కృషి ఫలితంగా, "అర్థశాస్త్ర సహజ వ్యవస్థ"* అనే బృహత్తరమైన ఒక రాతప్రతి తయారైంది. ఫ్రెంచి అకాడెమీ వారు నిర్వహించిన ఒక పోటీ కోసం చెయ్యబడిన రచన అది. అటుతర్వాత ఆయన ప్రధాన రచన "అర్థశాస్త్ర జాతీయ వ్యవస్థ" ఔగ్స్‌బుర్గ్‌లో 1841 మొదట్లో ప్రచురింపబడింది.

లిస్ట్ తన యీ రచనను, అర్థశాస్త్ర సమస్యలన్నింటినీ పరిశీలించే ఒక బృహద్గ్రంథపు మొదటి సంపుటంగా ఎంచుకున్నాడు. అందుకనే దానికి "అంతర్జాతీయ వర్తకమూ,

* 1920 దశకందాకా యిది ప్రచురింపబడలేదు.

వర్తక విధానమూ, జర్మన్ సుంకాల యూనియన్'' అన్న ఉపశీర్షికను ఆయన చేర్చాడు. అయితే అత్యాశతో కూడిన ఆయన యీ పథకం పూర్తికాకుండానే మిగిలిపోయింది. కాగా, ఆర్థిక విజ్ఞానశాస్త్ర అభివృద్ధిలో ఆయన పాత్రకు ప్రధానంగా యీ రచనే ఆధారమైంది. ఈ ''జాతీయ వ్యవస్థ'' విజయవంతమైంది. వెంటవెంటనే మరో రెండు ముద్రణలు వెలువడ్డాయి. జర్మనీ ఆర్థికాభివృద్ధిపైనా, వర్తక విధానంపైనా అప్పట్లో ముమ్మరంగా జరుగుతున్న చర్చల్లో యీ పుస్తకం ముఖ్య పాత్రవహించింది. జర్మన్ ఆర్థిక చింతనపైన కూడా యీ రచనకు గణనీయమైన ప్రభావం వుంది.

లిస్ట్ తనకు అభిమానపాత్రమైన యీ కింది భావాన్ని అభివృద్ధిచేశాడు: జర్మనీ సంపన్నం, సమైక్యం కావడానికి పరిశ్రమలను పెంపొందించుకోవడమే మార్గం, జర్మన్ పరిశ్రమలకు తీవ్ర విదేశీ పోటీనుండి, అధిక దిగుమతి సుంకాల విధింపు ద్వారా, వర్తక విధానపు యితర సాధనాల ద్వారా, రక్షణ చేకూర్చాలి. అన్నింటికన్న ముఖ్యంగా యీ భావం, పశ్చిమ, దక్షిణ జర్మనీకి చెందిన వర్ధమాన పారిశ్రామిక బూర్జువావర్గానికి అనువుగా సరిపోయింది. ఆయన పుస్తకానికి ప్రజాస్వామిక మేధావివర్గంలో కూడా అనుకూల స్వాగతం లభించింది. లిస్ట్ రాజరికవాదం, ప్రభువర్గ సమర్థన మాట ఎలా వున్నప్పటికీ, యీ పుస్తకపు సాధారణ భావం ప్రగతిశీల బూర్జువా సంస్కరణల ధోరణిలో వుంది. ఆయన ప్రతిపాదించినవి జాగరూకతతో కూడిన రాజీవాద సంస్కరణలే అయినప్పటికీ, 1840 దశకంలో స్తబ్దంగా వున్న జర్మనీ వాతావరణంలో, యీ భావాలే దాదాపు విప్లవాత్మకమైనవిగా భాసించాయి.

ఈ పుస్తకం సహజంగానే శత్రువులను కూడా సంపాదించుకుంది. లిస్ట్ భావాలు ప్రష్యన్ బడా భూస్వాముల స్వార్థ ప్రయోజనాలను సవాలుచేశాయి. ఇంగ్లండుకు తమ ధాన్యాన్ని ఎగుమతిచేసే ఈ భూస్వాములు, ఇంగ్లండు కనుక తమ ధాన్యాన్ని సుంకాలు విధించకుండా దిగుమతి చేసుకున్నట్లయితే, అందుకు బదులుగా ఇంగ్లీషు పారిశ్రామిక వస్తువులు ఎటువంటి సుంకాల బెడదా లేకుండా జర్మనీలోకి దిగుమతి కావడానికి ఆమోదించేందుకు సర్వసంసిద్ధులయారు. ఉత్తర జర్మన్ పట్టణాల్లోని పాతతరపు వాణిజ్య బూర్జువావర్గానికి సైతం ''స్వేచ్ఛా వాణిజ్యం''లో ఆసక్తి వుంది. లిస్ట్ జీవితపు చివరి సంవత్సరాల్లో, యీ వర్గాలు ఆయనకి వ్యతిరేకంగా అభాండాలు, అవమానకరమైన ఆరోపణలు, ఆకాశరామన్న బెదరింపుల ఉద్యమం సాగించాయి. దీనికితోడు, రైల్వే నిర్మాణంలో తన కార్యకలాపాల ద్వారానూ, భూస్వాములను, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, మతాధిపతులను, ఒకొక్కప్పుడు ప్రభుత్వాధిపతులను హేళన చేస్తూ, వెక్కిరిస్తూ, పత్రికల్లో తను చేసిన సునిశిత వ్యంగ్య రచనల ద్వారా లిస్ట్,

చాలామంది శత్రువులను సంపాదించుకున్నాడు. ఆయన యౌవన కాలపు "పాపాలు" యింకా విస్మరింపబడనూ లేదు.

జర్మనీకి తిరిగివచ్చాక లిస్ట్ ముఖ్యంగా ఔగ్స్‌బుర్గ్‌లో, పత్రికారచనలూ, పరిశోధనా చేస్తూ గడిపాడు. ఈ కాలంలో ఆయన చేసిన రచనలను ఆధారం చేసుకొనే, ఆయనొక అగ్రరాజ్య దురహంకారి అనీ, జర్మన్ సామ్రాజ్యవాదానికి ఆద్యుడనీ దరిమిలా కొందరు వాదనలు లేవదీశారు. అధిక జనాభా కలిగిన జర్మనీ, ఆగ్నేయ యూరప్‌లోని "స్వతంత్ర" దేశాలను (ప్రస్తుతపు హంగరీ, యుగోస్లావియా, రుమేనియా, స్లొవాకియాలున్న ప్రాంతం)* తన వలసలుగా చేసుకోవాలని లిస్ట్ వాదించాడు. మధ్యతరగతి స్వతంత్ర రైతాంగమే, ఒక రకమైన కులాక్కులే మహత్తర జర్మన్ జాతికి బలీయ దుర్గంగా, ప్రత్యేకించి సైనిక దుర్గంగా వుండాలని ఆయన రాశాడు.

ఈ భావాలకు సంబంధించి ఇంగ్లండుపట్ల తన వైఖరిని సైతం లిస్ట్ మార్చుకున్నాడు. జర్మన్ సమైక్యతకూ, పారిశ్రామికాభివృద్ధికీ ఇంగ్లండునే ఆయనెప్పుడూ ప్రధాన శత్రువుగా పరిగణించిన సంగతి తెలిసిందే. జర్మనీకి యూరప్‌లోని బలవత్తర పొరుగు రాజ్యాలైన ఫ్రాన్సు, రష్యాలకు వ్యతిరేకంగా, జర్మనీని యిప్పుడు ఇంగ్లండు బలపరచవచ్చునని ఆయన భావించాడు. ఇంగ్లీషు రాజకీయవేత్తలతో సంభాషణల ద్వారా, రెండు దేశాల మధ్యా అటువంటి పునస్సౌహార్ద సంబంధాలకు ఆస్కారమేమైనా వుందేమో కనుగొనేందుకుగాను 1846లో ఆయన ఇంగ్లండుకు వెళ్లాడు కూడా. అయితే, ఆయన యాత్ర పూర్తిగా విఫలమైంది.

ఎప్పుడూ బాగా వుండే లిస్ట్ ఆరోగ్యం, యీలోగా దిగజారనారంభించింది. తన కుటుంబాన్ని ఆర్థికంగా పోషించుకోవడం కూడా ఆయనకి కష్టసాధ్యం కాసాగింది. ఆయన చేసే నిరంతర పోరాటానికీ, ఆయన అలవాటుపడిన అవిరామ కార్యకలాపాలకూ ఆయనకిక ఎంతమాత్రమూ శక్తి లేకుండా పోయింది. విశ్రాంతి తీసుకోవచ్చుననీ, తన యీతి బాధలకూ, నిరాశలకూ అక్కడ కొంత మానసిక ఉపశమనం లభించవచ్చునన్న ఆశతో 1846 శరదృతువులో లిస్ట్ ఇటలీకి బయల్దేరాడు. అయితే ఆయన అక్కడికెన్నడూ చేరుకోనేలేదు. చిన్న టిరోలియన్ పట్టణమైన కుఫ్‌ష్టెయిన్‌లో ఫ్రీడ్రిహ్ లిస్ట్ కణతకు కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

---

* అప్పట్లో యీ ప్రదేశాలు పాక్షికంగా ఆస్ట్రియా హంగరీ పాలనకిందా, పాక్షికంగా టర్కీ పాలనకిందా వున్నాయి.

జాతి పారిశ్రామిక విద్యాభ్యాసం

అర్థశాస్త్రంలో లిస్ట్ సాంప్రదాయిక ధోరణిని విమర్శించాడు. ఆయన దృష్టిలో యీ ధోరణి ఆడమ్ స్మిత్‌లో మూర్తీభవించింది. అయితే నిజానికి, ఆయన విమర్శ సాంప్రదాయిక సిద్ధాంతపు పునాదియైన విలువ, ఆదాయాల సిద్ధాంతాన్ని స్పృశించనే లేదు. ప్రత్యేకించి, ఆర్థిక సిద్ధాంతపు యీ రంగాలు లిస్ట్‌కు ఆసక్తిని గొలుపలేదు. ఆయన ఆసక్తి అంతా ఆర్థిక విధాన సమస్యల పైన, ముఖ్యంగా విదేశీ వాణిజ్య విధానం సమస్యపైనే కేంద్రీకృతమైంది.

మొత్తంమీద, స్మిత్, ఆయన అనుయాయుల విమర్శకుడుగా లిస్ట్ ఏమంత పెద్ద ప్రభావాన్ని కలిగించలేదు. ఆయన వైఖరిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సాధారణ నియమాల పరిశీలనా, పరిశోధనా కొరవడ్డాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిశీలనా, బూర్జువా సమాజపు వర్గ నిర్మాణ విశ్లేషణా – యివే స్మిత్–రికార్డో శాఖ ముఖ్యంగా సాధించిన విజయాలు. అయితే లిస్ట్ వీటిని అవగాహన చేసుకోలేదు, విషయాల ఉపరి తలాన్ని దాటి లోతుకు పోలేదు. అయినప్పటికీ, తన అభిప్రాయాల పరిశీలనా క్రమంలో, పెట్టుబడిదారీ అభివృద్ధికి సంబంధించి సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులు వెల్లడించిన దానికి భిన్నమైన పరిస్థితులనూ, అవసరాలనూ ప్రతిబింబించడం ద్వారా, లిస్ట్ చాలా సమస్యలను కొత్త వెలుగులో పరిశీలించాడు. ఇది కొంతమేరకు ఫలదాయకమైన విషయం.

స్మిత్ అర్థశాస్త్ర విధానానికి లిస్ట్ జాతీయాతీత విధానమని పేరుపెట్టాడు. ఈ విధానం విడి దేశాల్లోని ఆర్థికాభివృద్ధియొక్క జాతీయ లక్షణాలను పట్టించుకోలేదనీ, వాటిపైన పిడివాదం మాదిరిగా ఆర్థికవిధానపు సాధారణ "సహజ" నియమాలనూ, సూత్రాలనూ రుద్దిందనీ లిస్ట్ ఆరోపించాడు. ఆయన యిలా రాశాడు: "నేను ప్రతి పాదించే విధానపు విలక్షణమైన తేడా ఏమిటంటే, జాతీయత అని నేను చెప్తాను. వ్యక్తికీ, మానవాళికీ మధ్య మధ్యంతర సంబంధంగా జాతీయతా స్వభావం అనే పునాది పైననే నా విధానపు సౌధమంతా నిర్మితమైంది."*

వివిధ జాతులు భిన్నభిన్న అభివృద్ధి దశల్లో వున్నాయన్నాడు లిస్ట్. వాటి మధ్య

* Friedrich List, *Schriften. Reden. Briefe.* Bd. VI, Berlin, 1930, S. 34.

పూర్తి వాణిజ్య స్వేచ్ఛ, మారకపు విలువల దృష్ట్యా, అంటే శ్రమ వ్యయం దృష్ట్యా, ఒక మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత అనిర్దిష్టమైన ప్రయోజనాన్ని చేకూర్చవచ్చు. అయితే, వెనుకబడిన దేశాల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అది కుంటు వరుస్తుంది. స్మిత్ "మారకపు విలువల సిద్ధాంతానికి" భిన్నంగా, ఆయన తన యీ భావాన్ని ఉత్పాదక శక్తుల సిద్ధాంతం అని పిలిచాడు. ఉత్పాదక శక్తులు అన్న పదానికి తర్వాత మార్క్స్ యిచ్చిన అర్థానికి లిస్ట్ చెప్పిన అర్థం కొంత భిన్నమైందన్న విషయాన్ని యీ సందర్భంలో గుర్తుంచుకోవడం అవసరం. లిస్ట్ దృష్టిలో ఉత్పాదక శక్తులు అంటే, ఏవి లేకుంటే "జాతి సంపద" ఉండజాలదో ఆ సామాజిక పరిస్థితుల వెరసి మొత్తం, అంతమాత్రమే.

ఉపయోగింపబడని వనరులను ఉత్పత్తిలోకి తెచ్చేందుకూ, వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకూగాను, ఒకానొక నిర్దిష్ట సమయంలో, ఏ శాఖల్లోనైతే శ్రమ ఉత్పాదకత విదేశాల్లో కన్న తక్కువ వుంటుందో ఆ శాఖలను అభివృద్ధిచెయ్యడం అనుమతింపదగినదే కాక ఆవశ్యకం కూడా. లిస్ట్ యిలా రాశాడు: "తత్పర్యవసానంగా యీ విలువలనష్టాన్ని జాతి పారిశ్రామిక విద్యావ్యయంగా మాత్రమే పరిగణించవలసివుంటుంది."* పారిశ్రామికాభివృద్ధియే లిస్ట్ అభిప్రాయాల ఆదీ అంతమూ కూడా. వ్యవసాయంలో మాత్రమే నిమగ్నమైన దేశం ఒక్కచెయ్యి మాత్రమే కలిగిన మనిషి లాంటిది అని రాశాడు లిస్ట్. "విద్యావిషయిక" రక్షణవాదం సహాయంతో పారిశ్రామిక పెరుగుదలను త్వరితం చెయ్యాలని ఆయన సూచించాడు. జాతీయ పరిశ్రమ తన కాళ్లపై తను నిలబడి, విదేశీ పరిశ్రమలతో "సమానురాలుగా" పోటీ చెయ్యగలిగేదాకా, దాన్ని విదేశీ పోటీనుండి రక్షించేందుకుగాను ప్రభుత్వ చర్యలు చేబట్టడమే యీ విధానం. ప్రధానమైన జాతులన్నీ దాదాపుగా సమానమైన అభివృద్ధి స్థాయిలో వుండే సుదూర భవిష్యత్కాలంవరకు స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టడాన్ని నెట్టివేశాడు.

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, ఆధునిక అభిప్రాయాల దృష్ట్యా లిస్ట్‌యొక్క యీ కింది ప్రకటన అత్యంత ఆసక్తికరమైనది: "ఒక జాతి పారిశ్రామికోత్పాదితాలను ఎంత ఎక్కువగా ఎగుమతి చేసుకొంటుందో, ఎంత ఎక్కువగా ముడి పదార్థాలను దిగుమతి చేసుకొంటుందో, ఉష్ణదేశాల ఉత్పాదితాలను ఎంత ఎక్కువగా వినియోగించుకొంటుందో అది అంత ఎక్కువ ధనవంతమూ, శక్తివంతమూ అవుతుంది — దీన్నొక నియమంగా మనం పరిగణించవచ్చు."** జపానుకు యీ ప్రకటనను వర్తింపజేయవచ్చు.

---

* Friedrich List, అదే గ్రంథం, పేజి 34.

** అదే గ్రంథం, పేజి 54.

జపానుకు సరిగా యిటువంటి విదేశీ వర్తకమే వుంది. శీఘ్ర ఆర్థిక పెరుగుదల కారణంగా, జపాను యిటీవల, పెట్టుబడిదారీ ప్రపంచంలో అమెరికా తర్వాత రెండవ పారిశ్రామిక శక్తిగా తయారైంది.

ఏ ఆర్థిక నిర్ణయాన్నైనా, ఉదాహరణకు, ఓ కొత్త ఉత్పత్తి శాఖ ఏర్పాటును గూర్చిన నిర్ణయాన్ని, తక్షణ సామర్థ్యం దృష్ట్యా మాత్రమే కాకుండా (యిది మామూలుగా లాభదాయికతతో సమానం), దాని దీర్ఘకాలిక, పరోక్ష పర్యవసానాల దృష్ట్యా కూడా పరిగణించడం అవసరమని లిస్ట్ భావించాడు. ఈ భావానికి ముఖ్యమైన పాత్ర వుంది. అటువంటి సన్నివేశాలు ఆర్థికవేత్తకు సుపరిచితాలు, అవి ఆర్థికవేత్తకు మాత్రమే పరిచితాలు కావు. ఉదాహరణకు, ఓ కొత్త ఫ్యాక్టరీ ఒకానొక పరిసర ప్రాంతంలో నిర్మింపబడితే, ముఖ్యమైన కొన్ని అదనపు ఆర్థిక ప్రతిఫలాలు కూడా ఉత్పన్నం కావచ్చు. పరిశీలనలో వున్న ఉత్పత్తి లాభదాయికతను అంచనా వేసినప్పుడు యీ ప్రతిఫలాలు నేరుగా పరిగణనలోకి తీసుకోబడకపోవచ్చు: జనాభా పని పరిస్థితులూ, జీవన పరిస్థితుల మెరుగుదల, పరిసరాల్లోని శ్రామిక బలగపు సగటు యోగ్యతలో పెరుగుదల, అంతకుముందు వినియోగించుకోబడజాలని సహజవనరులు ఆర్థిక టర్నోవర్ లోకి లాగబడటం, వగైరాలు.

భారతదేశానికి నౌకా నిర్మాణ పరిశ్రమను నెలకొల్పి, వర్తక నౌకలను పెట్టుకోవడం కన్న, విదేశీ వర్తక సరుకులను ఎగుమతి చెయ్యడానికి విదేశీ నౌకలను కేవుకి కుదుర్చుకోవడమే మరింత లాభదాయకమని అంచనాలు తెలియజేశాయి. అయినాకూడా, అనేక ముఖ్యమైన ఆర్థిక, రాజకీయ కారణాల దృష్ట్యా, దీర్ఘ కాలక్రమంలో తన సొంత వర్తక నౌకాబలాన్ని ఏర్పాటుచేసుకోవడం లాభదాయకమూ, దేశానికి ఆవశ్యకమూ కూడా అని భారత ప్రభుత్వం నిర్ణయించుకుంది.

సహజంగానే, సంశయాస్పదమైన లేక అత్యంత సుదూర ఉపయోగం కలిగిన చర్యల అమలు ఆర్థిక వ్యవస్థలో ఐచ్ఛికవాదానికి (voluntarism) దారితియ్యగలదు. అలాంటప్పుడు, కేవలం ప్రతిష్ఠను, లేక సంకుచిత ప్రాంతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, ఆర్థికంగా లాభసాటి కాజాలవని ముందే తెలిసిన పరిశ్రమలను నిర్మిస్తారు. జాతీయ స్థాయిలో "లిస్ట్ సూత్ర" దుర్వినియోగం స్వయం పాలనకు, అంటే, ఆర్థికంగా అహేతుకమూ, మౌలికంగా నష్టదాయకమైన స్వయం సరఫరాకూ, శ్రమ విభజన, ఉత్పత్తి స్పెషలైజేషన్ల సౌకర్యాల తిరస్కృతికీ దారితీస్తుంది.

ఒకానొక ఆర్థిక నిర్ణయంనుండి ఉత్పన్నమయే ఆర్థిక, సామాజిక స్వభావం కలిగిన పరోక్షప్రయోజనాలు, మార్షల్ నాటినుండి "బాహ్య ఆర్థిక విధానాలు" అని పిలవబడుతున్నాయి. ఇందుకు పూర్తి భిన్నంగా, ఒక నిర్దిష్ట నిర్ణయంతో సంబంధం

కలిగిన పరోక్ష నష్టాలు కూడా సంభవిస్తూవుంటాయి. వాటిని "బాహ్య అనార్థిక విధానాలు" అని పిలుస్తారు. లార్డ్ రాబిన్స్, తన ప్రామాణిక రచన "ఆర్థిక చింతనా చరిత్రలో ఆర్థికాభివృద్ధి సిద్ధాంతం"లో యీ రకమైన పర్యవసానాలు "...మార్షల్ కంటె బాగా ముందే, ఉత్పాదక శక్తుల అభివృద్ధిని గురించి లిస్ట్ చేసిన వివిధ పరిశీలనల కేంద్రాంశంగా వుంటూవచ్చింది. లిస్ట్ సంకుచిత, విషాద జీవి. అవిధేయతకూ, విషాదస్వభావానికీ మారుపేరు. ఆయన మనస్సులో ఊహాపరమైన దురభిప్రాయాలూ, అతిశయోక్తులూ నిండివున్నాయి. మేధావి వర్గాల్లోని తన ప్రత్యర్థుల భావాలకు, ప్రత్యేకించి ఆడమ్ స్మిత్ భావాలకు ఆయన వక్రీకరణ, హాస్యాస్పదంగా కనిపించేటంతటి తప్పుల తడక. అయితే, యీ గందరగోళాన్ని తొలగించి చూస్తే, ఆయన వాదంలో కొంత వాస్తవం కనిపించకపోదు. కొన్ని ప్రత్యేక చారిత్రక సందర్భాల్లో కొన్ని పరిశ్రమలను పెంపొందించడం ఉత్పాదక సంభావ్యత పెరుగుదలకు దారితీస్తుందనీ, దీన్ని కేవలం కొన్ని ప్రత్యేక ఉత్పాదితాల, లేక పెట్టుబడి విలువల పెరుగుదలతో కొలవరాదన్నదే ఆయన వాదన సారాంశం. నా దృష్టిలో ఆయన అతిశయోక్తుల వల్లా, వక్రీకరణల వల్లా, ప్రత్యేకించి యూరప్‌లో అవి ఆర్థిక జాతీయవాద అభివృద్ధికి తోడ్పడిన మేరకు, చాలా హాని జరిగింది. అయితే యీ కారణంగా, ఆయన ప్రధాన వాదనలో వున్న ఎంతోకొంత విశ్లేషణాత్మక విలువను తిరస్కరించరాదు."*

లిస్ట్ సిద్ధాంతం అతిముఖ్యమైన ఒక ప్రశ్నకు జవాబు చెప్పే ప్రయత్నం: పెట్టుబడిదారీ చట్రంలోపల, తమ చరిత్ర, ఆర్థికవ్యవస్థల కారణంగా "ప్రపంచ రాజ్యాలన్నింటిలో" వెనక పీటీన వున్న దేశాల ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపడం ఎలా గన్నదే ఆ ప్రశ్న. అనేక యితర ఆర్థిక భావాల మాదిరిగానే, దాన్ని అభివృద్ధి నిరోధక, ప్రగతిశీల ప్రయోజనాలకు వినియోగించడమూ సాధ్యమే, వాస్తవంలో అలా వినియోగింపబడింది కూడా. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల గుత్త సంస్థలు ప్రపంచ మార్కెట్లలో ప్రాబల్యం వహిస్తున్న పరిస్థితిలో, తమ జాతీయ పరిశ్రమలను అభివృద్ధిచేసుకోవలసిన సమస్యను ఎదుర్కొంటున్న వర్ధమాన దేశాల్లో యీనాడు లిస్ట్ రచనలపట్ల ఆసక్తి పునరుజ్జీవితమైంది.

లిస్ట్ రచనల కొత్తదనమూ, శాస్త్రీయమైన విలువా ఆయన ఒక ఆర్థిక సిద్ధాంతాన్ని

---

* L. Robbins, *The Theory of Economic Development in the History of Economic Thought*, London, 1968, p. 116. కీన్స్ మాదిరిగానే లయొనెల్ రాబిన్స్ కూడా, అర్థశాస్త్రంలో తను చేసిన సేవలకుగాను పీర్ (ప్రభువు) చెయ్యబడ్డాడు.

అభివృద్ధి చెయ్యడంలో కాక, బాగా అభివృద్ధి చెందని దేశాల్లో పెట్టుబడిదారీ పెరుగుదలకు సంబంధించిన యిబ్బందులూ, అంశాలూ అనే ఏకైక ఆర్థిక – రాజకీయ సమస్యను ఆయన జాగ్రత్తగా విపులీకరించడంలో వున్నాయి.

పారిశ్రామిక రక్షణవాదం, స్వేచ్ఛా వాణిజ్యం

పెట్టుబడి స్వభావసిద్ధంగా జాతీయాతీతమైనది (cosmopolitic). అయితే దాని యీ లక్షణం, పెట్టుబడిలో అంతర్గర్భిత సజీవభాగమైన సమరశీల జాతీయవాదంతో పరస్పరం మిళితమైపోయి పనిచేస్తుంది. ఈ ఐక్యతా, ఘర్షణలు మొత్తం పెట్టుబడిదారీ విధానాభివృద్ధిని వెన్నంటే వున్నాయి. అవి ఆధునిక పరిస్థితుల్లో కూడా పనిచేస్తాయి. సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలు పెట్టుబడి మొదటి ధోరణిని నొక్కి వక్కాణించగా, లిస్ట్ రెండవదాన్ని అంత గట్టిగానూ నొక్కి వక్కాణించాడు.

"అర్థశాస్త్ర విమర్శకు చేర్పు"కి ముందుమాటలో, 1842–1843 మధ్య *Rheinische Zeitung* పత్రికకు తను సంపాదకుడుగా ఉన్న కాలంలో, తను ఆర్థిక సమస్యలను ఎలా పరిశీలించవలసివచ్చిందో కార్ల్ మార్క్స్ చెప్పాడు. అర్థశాస్త్ర అధ్యయనానికి పూనుకొనేందుకు తనను మొదట ప్రేరేపించిన ఘటనల్లో, స్వేచ్ఛా వాణిజ్యం పైనా, రక్షణ సుంకాల పైనా జరిగిన వాదోపవాదాలను ఒకటిగా ఆయన పేర్కొన్నాడు.* యువ మార్క్స్ చేసిన యీ అధ్యయనాలు 1841లో వెలువడిన లిస్ట్ పుస్తక పఠనంతో ముడిపడివున్నాయనడంలో సందేహం వుండజాలదు. వర్తకాన్ని గురించి జరుగుతున్న చర్చలో లిస్ట్ కేంద్ర స్థానం వహించడమే అందుకు కారణం.

దరిమిలా మార్క్స్, ఎంగెల్సులు తమ ఆచరణ, సాహిత్య కార్యకలాపాల క్రమంలో, మళ్లీ మళ్లీ స్వేచ్ఛా వాణిజ్య, పారిశ్రామిక రక్షణవిధానాలను తప్పనిసరిగా పరిశీలించవలసి వచ్చింది. అలా చేసే క్రమంలో వారు లిస్ట్ భావాలను పరిశీలించారు. ఒక సిద్ధాంత కారుడుగా లిస్ట్‌పైన వారికి ఉన్నత భావం లేకపోయినప్పటికీ, ఆయన బోధనయొక్క పెట్టుబడిదారీ విధాన సమర్థక బూర్జువా సారాంశాన్ని వారు విమర్శించినప్పటికీ,

---

* Karl Marx, *A Contribution to the Critique of Political Economy*, London, 1971, p. 20.

మార్క్సిజం సంస్థాపకులు ఆయన్ని ఆ కాలానికి చెందిన అత్యంత ప్రముఖ జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడుగా పరిగణించారు.

స్వేచ్ఛా వాణిజ్యంపైన జరిగిన చర్చ, బూర్జువావర్గంలోపల పోరాటాన్నేగాక, వివిధ పెట్టుబడిదారీ దేశాల బూర్జువావర్గాల మధ్య పోరాటాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. స్వేచ్ఛా వాణిజ్యం, రక్షణవాదం అన్నవి రెండూ కేవలం వర్గవిధానపు రూపాలు మాత్రమే, అవి రెండూ కూడా సమానంగానే కార్మికులను దోచుకోవడం ద్వారా పెట్టుబడిదారుల లాభాన్ని పెంపొందించడానికి ఉద్దేశింపబడినవే. అయితే అంత మాత్రాన, శ్రామికవర్గమూ, శ్రామికవర్గ పార్టీలూ యీ సమస్యను అలక్ష్యంచేసి, దాన్ని బూర్జువా అర్థశాస్త్రవేత్తలకూ, రాజకీయవేత్తలకూ పూర్తిగా వదిలెయ్యడం సాధ్యమని దీని అర్థం కాదు. తమ దేశపు పరిశ్రమలు ఏ రేటులో, ఏ రూపాల్లో అభివృద్ధిచెందుతున్నాయన్న విషయాన్ని కార్మికవర్గం అలక్ష్యం చెయ్యజాలదు. కాగా, పారిశ్రామికాభివృద్ధి చాలవరకు వర్తకవిధానంపైన ఆధారపడివుంటుంది.

స్వేచ్ఛా వాణిజ్య విధానం, ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధికీ, దాని ఉత్పాదక శక్తుల పెరుగుదలకూ దోహదంచేసే మేరకు, కార్మికవర్గ దృష్టిలో ప్రగతిశీలమైనది. ప్రథమంగానూ ప్రధానంగానూ, కొన్ని సందర్భాల్లో యిది, కార్మిక వర్గపు పాదార్థిక పరిస్థితిలో మెరుగుదలను తీసుకురావడంలో తోడ్పడవచ్చు. అయితే అంతిమ విశ్లేషణలో, పెట్టుబడిదారీ విధానపు శీఘ్రతర అభివృద్ధి అదే కాలంలో తన వైరుధ్యాలను కూడ అభివృద్ధి చేసి, ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణను మరింత ఉన్నత స్థాయికి పెంచి, తద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని ఒక వ్యవస్థగా పతనానికి సన్నద్ధంచేసింది. 1847లో మార్క్స్ యిలా అన్నాడు: "...స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా అన్ని ఆర్థిక నియమాలూ, అత్యంత విభ్రాంతిజనకమైన తమ వైరుధ్యాలతో, మరింత భారీ స్థాయిలో, మరింత విస్తృత భూప్రాంతంలో, భూగోళపు మొత్తం ప్రాంతమంతటా్లోనూ పనిచేస్తాయి కనుకనూ; యీ వైరుధ్యాలన్నింటినీ ఒకే బృందంగా జతచేసిన ఫలితంగా, అవి ముఖాముఖీగా వచ్చి, తనకు తానే శ్రామిక వర్గ విముక్తికి దారితీసే ఒక పోరాటంలో పర్యవసిస్తాయి కనుకనే స్వేచ్ఛా వాణిజ్యానికి మనం అనుకూలురం."*

అయితే స్వేచ్ఛా వాణిజ్యానికి తోడ్పాటు అన్నది, ఏ సందర్భానికైనా, ఏ నిర్దిష్ట పరిస్థితులకైనా సరే సార్వత్రికంగా వర్తిస్తుందని ఎంతమాత్రమూ తలచరాదు. 19వ శతాబ్ది మధ్యకాలపు జర్మనీలో స్వేచ్ఛ వాణిజ్యం, దేశపు వెనుకబాటుతనాన్ని సుస్థిరంజేసి,

---

* Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. 4, Berlin, 1969, S. 308.

ఫ్యూడలిజం అవశేషాలను నిలిపివుంచేందుకు మాత్రమే తోడ్పడివుండగలిగేది. అంతిమ విశ్లేషణలో, పెట్టుబడిదారీ అభివృద్ధిని త్వరితంచేసేందుకూ, ఫ్యూడల్ ఆచారాలను అధిగమించేందుకూ ఒక సాధనంగా రక్షణవాదం కార్మికవర్గానికి ఉపయోగపడగలిగింది. లిస్టూ, ఆయన అనుయాయులూ పారిశ్రామిక రక్షణవిధానాన్ని డిమాండుచేస్తున్నది చిన్నతరహా గృహపారిశ్రామికోత్పత్తి రక్షణ కోసం కాక, దేనిలో నైతే చేతిశ్రమను తోసిరాజని యంత్రాలూ, పితృస్వామిక ఉత్పత్తిని తోసిరాజని ఆధునిక ఉత్పత్తీ చోటుచేసు కుంటున్నాయో ఆ భారీ పెట్టుబడిదారీ పరిశ్రమల రక్షణ కోసమే అన్న విషయాన్ని మార్క్స్ వక్కాణించి చెప్పాడు. అయితే యీ మార్గం చివర, శక్తివంతమైన జర్మన్ పెట్టుబడి విజయాన్ని కాక, సోషలిస్టు విప్లవ విజయాన్నే మార్క్స్ చూశాడు. ఇటువంటి కారణాల మూలంగానే ఎంగెల్స్ కొంతకాలం తర్వాత, అమెరికా పారిశ్రామిక రక్షణవాద వర్తక విధానాన్ని సూత్రరీత్యా ప్రగతిశీలమైనదిగా పరిగణించడం సంభవించింది.

ఆధునిక పెట్టుబడిదారీ విధానంలోని "లిబరల్," రక్షణవాద ధోరణులను అంచనా వేసుకోవడంలోనూ, GATT,* ఉమ్మడి మార్కెట్, వగైరాలపట్ల కార్మికవర్గపు దాని పార్టీల వైఖరిని నిర్ణయించుకోడానికి యీ సూత్రాలు ముఖ్యం.

చారిత్రక శాఖ

జాతీయ లక్షణాలు, జాతీయ స్వభావం, జాతీయ భవితవ్యం — యివీ, యిటువంటి యితర భావనలూ 18వ శతాబ్ది చివరా, 19వ శతాబ్దిలోనూ మొత్తం జర్మన్ సామాజిక చింతన అంతటిలోనూ నిండివున్నాయి. చరిత్రకన్న జాతీయమైనది మరేం ఉండగలదు? చరిత్రపట్ల యీ కాంక్ష, అంతకు ముందరి శతాబ్దపు హేతువాద తత్త్వ శాస్త్రానికి ఒక మాదిరి ప్రతివర్తన అనికూడా చెప్పవచ్చు. ఈ హేతువాద తత్త్వశాస్త్రం, తనకు ముందున్న ప్రతిదాన్నీ, అంటే ఫ్యూడలిజాన్నీ, దాని అవిద్యనుంచీ, అజ్ఞానంనుంచీ, వికాస రాహిత్యంనుంచీ ఉత్పన్నమైన ప్రకృతివిరుద్ధ విషయాలుగా పరిగణించింది.

---

* GATT అన్నది సుంకాల పైనా, వర్తకం పైనా 1947లో కుదుర్చుకోబడిన ఒక సాధారణ ఒప్పందం. విదేశ వర్తకంపైన అంతర్జాతీయ అజమాయిషీని నెలకొల్ప డానికీ, అవరోధాలను తొలగించడానికీ యిది ఉద్దేశింపబడింది.

అర్థశాస్త్రపు జర్మన్ చారిత్రక సంప్రదాయాన్ని యీ కింది మూడు పద్ధతుల్లో లిస్ట్ గట్టిగా ప్రభావితం చేశాడు: 1) లిస్ట్ మాదిరిగానే ఆ "చరిత్రకారులు" అర్థ శాస్త్రాన్ని ఆర్థికాభివృద్ధి సాధారణ నియమాల విజ్ఞానశాస్త్రంగా కాక, జాతీయార్థిక వ్యవస్థ విజ్ఞానశాస్త్రంగా పరిగణించి, రాజ్యపు నిర్ణయాత్మక పాత్రను గురించి వక్కాణించి చెప్పారు; 2) సాంప్రదాయిక ధోరణిపట్లా, దాని అనుయాయులపట్లా వాళ్ల విమర్శనాత్మక వైఖరిని వహించి, ప్రత్యేకించి వాళ్ల సిద్ధాంతాల జాతీయాతీత, సాధారణీకృత స్వభావంపైన దాడిచేశారు; 3) దేశపు ఆర్థికాభివృద్ధియొక్క ఒక నిర్దిష్ట దశనుండి వాళ్లు బయల్దేరారు.

అయితే వాళ్లు, అర్థశాస్త్రంలో ఒక ప్రత్యేక చారిత్రక పద్ధతిని సృష్టించడం ద్వారా లిస్ట్‌ని అధిగమించి ముందుకెళ్లారు. ఈ పద్ధతి, ప్రత్యేకించి జర్మనీ, అమెరికా లలో, ఆర్థిక విజ్ఞానశాస్త్రపు తదుపరి అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర వహించింది. ఇంగ్లండులో బూర్జువా రికార్డియన్లచేతా, ఫ్రాన్సులో సేయ్ శాఖీయులచేతా భాష్యం చెప్పబడిన అర్థశాస్త్రపు మౌలిక లోపాలను పరిగణనలోకి తీసుకున్నట్లయితే, చారిత్రక సాంప్రదాయికుల భావాలను మరింత తేలికగా అర్థంచేసుకోవచ్చు. వాళ్ల విలువ, ఆదాయాల సిద్ధాంతాలు మరీ దారుణంగా గందరగోళపరచబడినవిగానైనా కనిపించవచ్చు, లేకుంటే అర్థరహితమైన అతి సరళీకరణగానైనా కనిపించవచ్చు. సామాజిక ఆర్థిక అభివృద్ధి ఒక చారిత్రక, పరిణామాత్మక క్రమం అన్న అభిప్రాయాన్ని వాళ్లు ఆమోదించలేదు. మనిషి ఒక గణకయంత్రం, తర్కజ్ఞానం కలిగిన ఒక స్వార్థపరుడైన మనిషిపట్ల, నిజమైన, ఆంతరిక లక్షణాలేవీ లేని మనిషిపట్ల వాళ్లకు గల భావన ఆమోదయోగ్యమైనది కాదు. ఈ అర్థశాస్త్రజ్ఞుల, ప్రత్యేకించి ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞుల "జాతీయాతీత తత్వం" (cosmopolitanism), ప్రపంచ మార్కెట్టుపై ఇంగ్లండు ప్రాబల్యాన్ని ప్రతిబింబించింది. ఆ "చరిత్రకారులు" నిర్దిష్టమైన మనిషిని, అతని సంక్లిష్టమైన మనస్సుతోను, నీతి సూత్రాలతోను, అతని జాతీయ, చారిత్రక లక్షణాలతోనూ, ఆర్థిక విజ్ఞానశాస్త్రపు కేంద్రంలో నిలబెట్టాలని వాంఛించారు.

అయితే 19వ శతాబ్ది మొదటి అర్ధభాగపు ఫ్యూడల్ – బూర్జువా జర్మనీలో, ప్రష్యన్ ప్రొఫెసర్ల లేఖిని కింద, సాంప్రదాయిక ధోరణిపై విమర్శ (ఒకవంక స్మిత్‌కీ, మరోవంక సీనియర్, సేయ్‌లకీ మధ్య వాళ్లు విచక్షణ చూపలేదు) అభివృద్ధినిరోధక స్వభావాన్ని వహించింది.

చారిత్రక శాఖ శాస్త్రీయ సాధారణీకరణ పద్ధతిని అర్థశాస్త్రంలో మౌలిక పరిశీలనా పద్ధతిగా నిరాకరించింది. జాతీయ లక్షణాలను ఒక పరమ సూత్రంగా పైకెత్తి, సామాజికాభివృద్ధి సార్వత్రిక, వస్తుపర నియమాలను కూడా అది తిరస్కరించింది. ఆర్థిక

విజ్ఞానశాస్త్రంలో అంతర్గర్భితంగా వున్న విశ్లేషణ పద్ధతి స్థానాన్ని, చరిత్ర, ప్రవర్తన నియమాలు, న్యాయశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, రాజకీయాలు, మానవవర్గ శాస్త్రాలతో కూడిన ఒక అస్పష్ట, అనిర్దిష్ట రంగం ఆక్రమించింది.

ఆర్థిక విజ్ఞానశాస్త్ర చరిత్రకు దాని సొంత పదబంధాలు వున్నాయి. చారిత్రక శాఖకి సాధారణంగా రోషెర్, హిల్డెబ్రాన్డ్, క్నీస్ త్రయం ప్రాతినిధ్యం వహిస్తారు. మరింత గాఢంగా అధ్యయనంచేసినదాన్నిబట్టి యీ సందర్భంలో "శాఖ" అనేమాట పొసగదు. ఈ ముగ్గురు రచయితల మధ్య గణనీయమైన విభేదాలున్నాయి. వారి మధ్య వ్యక్తిగత, ప్రత్యక్ష సంబంధం లేదు. వీళ్ళు కాక, యీ ధోరణిలో కృషిచేసే పలువురు యితర ఆర్థికశాస్త్రవేత్తలు కూడా వున్నారు. మరో విధంగా చెప్పాలంటే, మామూలు మాదిరిగానే, పాఠ్యగ్రంథాల్లో చిత్రింపబడినదాని కన్న వ్యవహారాలు చాలా ఎక్కువ సంక్లిష్టంగా వున్నాయి. క్నీస్ ప్రత్యేకించి రోషెర్, హిల్డెబ్రాన్డ్‌లను అతి ఘాటుగా విమర్శించాడు.

అయినప్పటికీ సిద్ధాంతానికి సంబంధించిన ప్రధాన సమస్యలపైన యీ ముగ్గురు ప్రొఫెసర్లూ ఒకే సాధారణ పంథాను అనుసరించి, దానికి అత్యంత ప్రముఖ ప్రతినిధులయారు. విల్‌హెల్మ్ రోషెర్ తన తొలి (1843) రచన "చారిత్రక పద్ధతి దృష్ట్యా అర్థశాస్త్రం" అనే వ్యాసంలో భవిష్యత్ చారిత్రక పద్ధతియొక్క కొన్ని మౌలిక సూత్రాలను ప్రతిపాదించాడు. అయితే, సాంప్రదాయిక, ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తల ప్రతిపాదనలలో తన వాదనకు అనుకూలమైన అనేక ప్రతిపాదనలను ఆయన స్వీకరించాడు. పర్యవసానంగా, నిజమైన సారం ఏమీలేని అతుకుల బొంత ఒకటి తయారైంది. తన తదుపరి రచనల్లో కూడా రోషెర్ అదే చేశాడు.

రోషెర్ రచనను మార్క్స్, పృథక్శకలవాదానికీ, బూర్జువా పెట్టుబడిదారీ విధాన సమర్థనకూ ఒక నమూనాగా పరిగణించాడు: "చివరి [పెట్టుబడిదారీ విధాన సమర్థక — ఎ. ఎ.] రూపం <u>పాండిత్యరూపం</u>. అది 'చారిత్రకంగా' సాగి, వివేకవంతమైన సమరసత్వంతో, లభ్యమైన అన్ని మూలాలమంచీ 'అత్యుత్తమమైనదాన్ని' సమకూరుస్తుంది, అలా చేసే క్రమంలో వైరుధ్యాలకు లోపం వుండదు; తద్విరుద్ధంగా లోపించేదల్లా సమగ్రత మాత్రమే. ఈ విధంగా అన్ని సిద్ధాంతాలూ నిర్జీవం చెయ్యబడతాయి, వాటి పదును కొరవడజెయ్యబడుతుంది, అవన్నీ తాపీగా ఒక కలగూరగంపగా గుదికూర్చబడుతాయి. పెట్టుబడిదారీ విధాన సమర్థన ఉరవడి యిక్కడ పాండిత్యం చేత మందగింపజెయ్యబడుతుంది. ఈ పాండిత్యం ఆర్థిక చింతనాపరుల అతిశయోక్తులను హీనమైనవిగా కృపాదృష్టితో చూసి, వాటిని కేవలం పులుసులో తేలే చిల్లర మల్లర ముక్కల మాదిరిగా మాత్రమే అనుమతిస్తుంది.... ప్రొఫెసర్ రోషెర్ యీ బాపతు

విషయంలో అందెవేసిన చెయ్యి. అర్థశాస్త్రానికి తనను తనే ఆయన సవినయంగా, థూసిడైడ్స్‌గా ప్రకటించుకున్నాడు."*

తన దీర్ఘ జీవితకాలంలో రోషెర్ రచించిన పుస్తకాలు ఓ మొత్తం గ్రంథాలయాన్ని నింపగలిగినన్ని వుంటాయి. వాటిలో, ఆర్థిక చింతనా చరిత్రపై గొప్ప పాండిత్యపూర్వక మైన కూలంకషత్వంతో ఆయన రాసిన ప్రత్యేకించి పేర్కొనదగిన రెండు పుస్తకాలు కూడా వున్నాయి. దాదాపు ఏభై ఏళ్లపాటు ఆయన లైప్జిగ్‌లో ప్రొఫెసరుగా పనిచేశాడు. ఆయన ప్రభుత్వ, విద్యాబోధన వర్గాల గౌరవాన్ని చూరగొన్నాడు.

బ్రూనో హిల్డెబ్రాన్డ్ జీవితం మొదటి సంవత్సరాల్లో కల్లోలితంగా గడిచింది. హెస్సెన్ అభివృద్ధినిరోధక ప్రభుత్వపు వేధింపునుండి తప్పించుకొనేందుకుగాను ఆయన స్విట్జర్లండుకు పారిపోవలసివచ్చింది. అక్కడ ఆయన జూరిచ్, బెర్న్ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసరుగా పనిచేశాడు. స్విట్జర్లండులో మొట్టమొదటి గణాంక సర్వీసును హిల్డె బ్రాన్డ్ స్థాపించాడు. జర్మనీకి ఆయన 1861లో తిరిగివచ్చాడు. జీవితాంతందాకా ఆయన యేనా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా పనిచేశాడు. "ప్రస్తుత, భవిష్యత్ జాతీయ ఆర్థిక వ్యవస్థ" అనే ఆయన పుస్తకం 1848లో ప్రచురింపబడింది. ప్రధానంగా ఆ పుస్తకం మూలంగానే ఆయన పేరు చారిత్రక శాఖకు జతచెయ్యబడింది. సాంప్రదాయిక అర్థశాస్త్ర ధోరణిని రోషెర్‌కన్న హిల్డెబ్రాన్డ్ మరింత గట్టిగానూ, మరింత క్రమబద్ధంగానూ విమర్శించి, చారిత్రక పద్ధతిని మరింత ఆవేశంగా ప్రవేశ పెట్టాడు. దరిమిలా చారిత్రక ధోరణి అభివృద్ధిపై ఆయన ప్రభావం విశేషంగా వుంది.

కార్ల్ క్నీస్ కార్యకలాపాలు ప్రస్తుతం మనం పరిశీలిస్తున్న కాలానికి బాగా తరువాతి కాలానికి చెందుతాయి. 1860 దశకంనుండి 1890 దశకందాకా ఆయన పని చెయ్యడమే అందుకు కారణం. అయితే, చారిత్రక శాఖ ధోరణికి చెందిన ఆయన ప్రధాన రచన "చారిత్రక పద్ధతి దృష్ట్యా అర్థశాస్త్రం" 1853లో వెలువడింది. క్నీస్ ముప్పదేళ్లకుపైగా హైడెల్బర్గ్‌లో ప్రొఫెసరుగా పనిచేశాడు. 1870 దశకంలో గుస్టావ్ ష్మోలెర్ నాయకత్వాన జర్మన్ స్కాలర్ల యువబృందమొకటి నూతన చారిత్రక శాఖ అని పిలవబడేదాన్ని ఏర్పాటుచేసింది. ఆత్మపర సంప్రదాయం ("నయా సాంప్రదాయి

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, p. 502. "జాతీయ ఆర్థిక వ్యవస్థ మూలసూత్రాలు" (1854) అనే తన పుస్తకానికి రోషెర్ రాసుకున్న ముందుమాటలో, సుప్రసిద్ధ గ్రీకు చరిత్రకారుడు థూసిడైడ్సుతో తనను పోల్చుకొనే గర్వపూరితమైన యీ ప్రస్తావన వుంది.

కులు")తో గాని, సోషలిజంతో గాని సంబంధంలేని మూడవ పంథాను కోరిన వాళ్లను క్నీస్, ష్మోలెర్‌లు తమవైపుకు ఆకర్షించుకున్నారు. ఆంగ్లో-శాక్సన్ దేశాల్లో కూడా వారికి గణనీయమైన సంఖ్యలో అనుయాయులు ఏర్పడ్డారు. చారిత్రక శాఖకి చెందిన వాళ్లు నిర్దిష్టమైన ఆర్థిక పరిశోధనా రంగంలో విశేషమైన కృషిచేశారు. వాళ్ళు, తమ రచనల్లో చారిత్రక, గణాంక సమాచారాన్ని విస్తారంగా ఉపయోగించుకున్నారు. అయితే వాళ్ల రచనల్లో అతివర్ణన, అతి ప్రత్యక్షానుభవతత్వం, లోతు లేమి అనే లోపాలు కనిపిస్తాయి. ఈ చారిత్రక శాఖవాళ్లు ఆదినుంచీ కూడా అన్ని సోషలిస్టు సిద్ధాంతాలనూ ఖండించారు. సామ్రాజ్యవాద జర్మనీలో అది అధికారిక ధోరణి అయినప్పుడు, దేశమంతటా వేగంగా విస్తరిస్తున్న మార్క్సిజంపైన అది తీవ్రమైన దాడి చేసింది.

రాడ్‌బెర్టస్: ఒక ప్రత్యేక సందర్భం

యు. జెల్లెర్‌కి కార్ల్ రాడ్‌బెర్టస్ రాసిన ఒక లేఖలోని భాగం యిది: "దీన్ని మార్క్స్ చాలా చక్కగా — అయితే, నా పేరు ప్రస్తావన లేకుండా — వినియోగించుకున్నాడన్న సంగతిని మీరు చూడగలరు."* రాడ్‌బెర్టస్ మరో లేఖలో, అదనపు విలువ మూలాన్ని మార్క్స్ కన్న తను ముందుగా వివరించాననీ, అందునా దాన్ని మరింత క్లుప్తంగానూ, మరింత స్పష్టంగానూ వివరించాననీ పేర్కొన్నాడు. ఈ లేఖలు వరుస క్రమంలో 1879లో ఒకటీ, 1881లో ఒకటీ ప్రచురింపబడ్డాయి. అంటే, రాడ్‌బెర్టస్ మరణానంతరం, మార్క్స్ యింకా బతికివుండగానూ అన్నమాట.

ఈ విధంగా, మార్క్స్‌కి గ్రంథచౌర్య దోషాన్ని అంటగట్టిన రాడ్‌బెర్టస్ విషయాన్ని మనం యిప్పుడు పరిశీలించబోతున్నాం. అన్నిటికన్న ముఖ్యమైన విషయం ఏమిటంటే, మార్క్స్ తన దగ్గర "కొట్టేసినది" ఆషామాషీ విషయం కాదనీ, మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతానికి మూలాధారమైన అదనపు విలువనేననీ ఆయన ఆరోపిస్తాడు. మార్క్స్ మరణానంతరం రెండేళ్ల తర్వాత "పెట్టుబడి" గ్రంథపు రెండవ సంపుటాన్ని ప్రచురించేటప్పుడు, తను రాసిన ముందుమాటను ప్రధానంగా రాడ్‌బెర్టస్ అభూత కల్పనలనూ — అంతకన్న అధికంగా ఆయన అనుయాయులైన

---

* Karl Marx, *Capital*, Vol. II, p. 6.

జర్మన్ Katheder Sozialisten* కట్టుకథలనూ ఖండించడానికే ఫ్రెడరిక్ ఎంగెల్స్ వినియోగించాడు. ఆ జవాబు కూలంకషమైనదీ, తిరుగులేనిదీని.** (ఎంగెల్స్ ప్రత్యేకించి, రాడ్‌బెర్టస్ ఆర్థిక రచనలతో 1859కి ముందు మార్క్సుకి పరిచయం లేదన్న విషయాన్ని సహేతుకమైన ఆధారాలతో రుజువుచేశాడు.)

ఇంతకీ ఈ రాడ్‌బెర్టస్ ఎవరు?

ఆయన 1805లో ఉత్తర జర్మనీలోని గ్రేయ్‌ఫ్స్‌వాల్డ్‌లో జన్మించాడు. గ్యోటింగెన్, బెర్లిన్ విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం చేశాడు. సివిల్ ఉద్యోగిగా పనిచేశాడు. త్వరలో రిటైరయాక, యూరప్ అంతటా పర్యటించి, పొమెరేనియాలో తను కొన్న యాగెత్సొవ్ ఎస్టేటులో 1836లో స్థిరపడి, జీవితాంతందాకా అవిచ్ఛిన్నంగా అక్కడే బతికాడు. 1883లో ఒక లేఖ రాస్తూ రాడ్‌బెర్టస్‌ని గురించి ఎంగెల్స్ యిలా రాశాడు: "ఇతగాడు ఒక సందర్భంలో అదనపు విలువను దాదాపుగా కనిపెట్టినంత పని చేశాడు. అయితే, ఆయన ఆ పని చెయ్యకుండా ఆయన పొమెరేనియన్ ఎస్టేటు అడ్డపడింది."*** సహజంగావే, భూస్వామి తన వర్గపు భావజాలాన్ని వ్యక్తంచేసితీరవలసిన పని లేదు. అయితే భూస్వామి అయాక, వాస్తవంలో రాడ్‌బెర్టస్ మితవాద పక్షానికి తిరిగాడు. ఆయన సామాజిక హోదా ఆయన అభిప్రాయాలను ప్రభావితంచేసింది.

1842లో "మన రాజ్య-ఆర్థిక వ్యవస్థను గురించిన పరిజ్ఞానం" అనే శీర్షికతో ఆయనొక పుస్తకాన్ని ప్రచురించాడు. అదుగో అందులోనే ఆయన అదనపు విలువను "దాదాపుగా కనిపెట్టినంత పని చేశాడు." ఉదాహరణకు ఆయన యిలా రాస్తాడు: "శ్రమ ఉత్పాదకత కార్మికుని జీవితావసరాలకుతోడు మరిన్ని వినిమయ వస్తువులను కూడా ఉత్పత్తిచెయ్యగలంత అధికమైనట్లయితే, యీ అదనపు మొత్తం లాభం అవు

---

* 1870, 1880 దశకాల్లో మొట్టమొదటి సారిగా ప్రయోగింపబడిన ఈ పదబంధం జర్మనీలో "ప్రభుత్వ సోషలిజం" అంటే దృఢమైన రాజరిక ఛత్రఛాయల్లో వర్గాల సామరస్యం, పొత్తులను బోధించే బూర్జువా ప్రొఫెసర్లకు అన్వయింపబడింది.

** మార్క్సిజానికి వ్యతిరేకియే అయినా ప్రగాఢ పండితుడైన షుంపేటెర్ యీ విషయంలో యిలా అన్నాడు: "రాడ్‌బెర్టస్‌నుండి మార్క్స్ 'కొట్టేశాడన్న' భావానికి ఎంగెల్స్ ఖండనను సవాలుచేసేందుకు తగిన యుక్తియుక్తమైన ఆధార మేమీ ఉందని నేను అనుకోను." (J. Schumpeter, *History of Economic Analysis*, p. 506.)

*** మార్క్స్, ఎంగెల్స్‌ల *Archives*, సంపుటం I, పేజి 38 (రష్యన్ భాషలో).

తుంది, అంటే, భూమిపైన, పెట్టుబడిపైన వ్యక్తిగత స్వామ్యం ఉంటే, శ్రమలేకుండా యితరులచేత యీ లాభం సొంతపరచుకోబడుతుంది. మరో విధంగా చెప్పాలంటే, లాభాన్ని పొందే సూత్రం ఏమిటంటే, భూమిపైన, పెట్టుబడిపైన వ్యక్తిగత స్వామ్యం."*

రాడ్‌బెర్టస్‌కి సముచితమైన గుర్తింపు యివ్వాల్సి వుంది, యీ విషయాన్ని ఆయన చక్కగా చెప్పాడు. కాని, మహా అయితే, ఆయన స్మిత్, రికార్డోల సిద్ధాంతాలను బాగా జీర్ణించుకున్నాడనీ, శాస్త్రీయమూ, ప్రగాఢమూ అయిన చాలా సూత్రాలను వాళ్లనుండి సంగ్రహించాడనీ మాత్రమే అది రుజువుచేస్తుంది. అలా చెయ్యడంలో ఆయన చారిత్రక శాఖ ప్రతినిధులనుండీ, తన సమకాలికులైన యితర జర్మన్ అర్థశాస్త్రజ్ఞులనుండీ ఆయన విశేషంగా విభేదించాడనడం మటుకు స్పష్టం. అయితే, అంతమాత్రమే.

రాడ్‌బెర్టస్‌లో మనకి ఇంగ్లీషు సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులనుండి ఎంచుకున్న వేర్వేరు యితుకలు (అయినా కూడా ఉపయోగకరమైనవే) కనిపించగా, స్మిత్ రికార్డోల సిద్ధాంతాలనుండి ముందుకుసాగిన మార్క్స్, మౌలికంగా నూతనమైన, సౌష్ఠవమైన శ్రామికవర్గ అర్థశాస్త్ర కట్టడాన్ని నిర్మించాడు.

లాభాన్నీ, భూమికౌలునూ కార్మికుల చెల్లించబడని శ్రమ ఫలితాలుగా పరిగణించ డమన్నది శాస్త్రీయమైన అదనపు విలువ సిద్ధాంతాన్ని సృష్టించడంతో సమానం కాదు. రికార్డో అనుయాయులైన ఇంగ్లీషు సోషలిస్టులు యీ సమస్య విషయంలో రాడ్‌బెర్టస్‌కన్న ముందుకు వెళ్లిన సంగతిని మనం 19వ ప్రకరణంలో చూడబోతున్నాం. కాని వాళ్లు అలాంటి సిద్ధాంతాన్ని సృష్టించలేదు. పెట్టుబడిదారీ విధానం కింద, అదనపు ఉత్పాదితపు సార్వత్రిక రూపంగా లాభాన్ని రాడ్‌బెర్టస్ పరిగణించలేదు. శ్రమ శక్తి కొనుగోలు – అమ్మకాల ప్రత్యేక స్వభావాన్ని ఆయన వివరించలేదు. "లాభాన్ని" దోపిడిదారీ ఆదాయంగా పరిగణించే విషయంలో ఆయన మహా సంకోచాన్ని ప్రదర్శించాడు. చివరి సంగతి, సగటు లాభాన్ని పరిశీలించే విషయంలో రాడ్‌బెర్టస్, రికార్డోను అధిగమించి ముందుకు ఏమాత్రం వెళ్లలేదు. మార్క్స్ ఉత్పత్తి ధర సిద్ధాంతం యీ అతి ముఖ్య సమస్యను పరిష్కరించింది.

1848 నాటి విప్లవ ఘటనలు రాడ్‌బెర్టస్‌ను ముందుకు తెచ్చాయి. లాండ్‌టాగ్‌లో (ప్రష్యన్ పార్లమెంటు) ఆయన సభ్యుడయాడు. "సంస్కరణ పార్టీ" అగ్రనాయకుల్లో ఆయనొకడు. హాన్సెమన్ ప్రష్యన్ లిబరల్ ప్రభుత్వంలో కొద్ది కాలంపాటు ఆయన మంత్రిగా పనిచేశాడు. రాడ్‌బెర్టస్ కార్యకలాపాల లక్ష్యం ఏమిటంటే, విప్లవం, ప్రత్యే

* Rodbertus-Jagetzow, *Zur Erkenntniss unser Staatswirtschaftlichen Zustände*, Berlin, 1842, S. 42.

కించి కార్మికవర్గ విప్లవం అభివృద్ధికాకుండా నిరోధించే సంస్కరణలను కనుక్కోవడమే. విజయవంతమైన విప్లవప్రతీఘాతం దృష్టిలో ఆయన మరీ ఉదారవాది కావడంతో, ఆయన తన పామెరేనియన్ ఎస్టేటుకి నిష్క్రమించాడు. మార్క్సుని ఉల్లేఖించాలంటే, ఆయన "మంత్రి పదవి కండూతి"కి తరచుగా గురైనప్పటికీ, దీని తర్వాత రాజకీయ జీవితంలో ఆయన క్రియాశీల పాత్రవహించడం మానుకున్నాడు. ఒకానొక సమయంలో బిస్మార్క్ విశ్వాసాన్ని చూరగొనేందుకు సైతం ప్రయత్నించాడు. రాడ్‌బెర్టస్ యాగెత్సొవ్‌లో 1875లో మరణించాడు.

పైన పేర్కొనబడిన రచనలకు తోడు రాడ్‌బెర్టస్ భావాలు ప్రధానంగా నాలుగు "కీర్‌హ్మన్‌కు సాంఘిక లేఖలు"లో ప్రతిపాదింపబడ్డాయి. ఇవన్నీ ఒక పెద్ద సంపుటంగా వెలువడ్డాయి. వీటిలో మొదటి రెండు లేఖలూ 1850లోనూ, మూడవది 1851 లోనూ, నాల్గవది ఆయన మరణానంతరమూ వెలువడ్డాయి.

ప్రత్యక్ష రాజకీయాల్లో తను ఏమి చెయ్యడంలో విఫలుడయ్యాడో, ఆ పనిని తన రచనల్లో రాడ్‌బెర్టస్ కొనసాగించాడు. పెట్టుబడిదారీ విధానపు అనేక ప్రతికూల పార్శ్వాలను, ప్రత్యేకించి, ప్రజా బాహుళ్యపు పేదతనాన్ని పదిలపరచే దాని ధోరణిని ఆయన గమనించాడు. ఆయన స్వయంగా రాసినట్లు, "పెట్టుబడిని... దాన్నుండే కాపాడే"* సాధనాన్ని కనుగొనడం ఆవశ్యకమైంది. పెరిగిన శ్రమ ఉత్పాదకత ద్వారా లభ్యమైన ఫలితాల్లో కార్మికవర్గానికి వాటా యిమ్మని ఆయన పెట్టుబడిదారులకు విజ్ఞప్తిచేశాడు. అలా చేస్తే "శ్రమకీ, భూమిపై పెట్టుబడి స్వామ్యానికీ మధ్య రాజీని" సాధించడం సాధ్యమవుతుంది. రాడ్‌బెర్టస్‌లో కొంతమేరకు, పెట్టుబడిదారీ దేశాల్లో యీనాడు అనుసరింపబడుతున్న ఆదాయాల విధానమనబడేదాని బీజాలు మనకి కనిపిస్తాయి. "మన రాజ్య-ఆర్థిక వ్యవస్థను గురించిన పరిజ్ఞానం" అనే రాడ్‌బెర్టస్ గ్రంథానువాదపు సోవియట్ ముద్రణకు రాయబడిన ఉపోద్ఘాత వ్యాసంలో యీ విషయం సరిగా పేర్కొనబడింది: "రాడ్‌బెర్టస్ జీవితలక్ష్యం పెట్టుబడిదారీ విధానాన్ని శ్రామిక వర్గ సోషలిజం దృక్పథంనుంచి ఖండించడం కాదు. ఆ విధానంలోని ప్రమాదాలను గుర్తించి, పెట్టుబడిదారీ విధానంలోని కొన్ని తీవ్ర వైరుధ్యాలను వేలుపెట్టి చూపిన పెట్టుబడిదారీ విధానపు దూరదృష్టిగల సిద్ధాంతవేత్తగా పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడటమే ఆయన లక్ష్యం...."

---

* Dr Rodbertus-Jagetzow, *Briefe und Sozialpolitische Aufsärze*, Berlin, Bd. I, S. III.

ప్రకరణం 18

ఊహాజనిత సోషలిస్టుల అద్భుత ప్రపంచం: సెంట్ సైమన్, ఫోరియర్

మానవాళికి మరింత మెరుగైన జీవితం కోసమూ, మరింత మేలైన సామాజిక వ్యవస్థ కోసమూ కలలుగన్న వాళ్లు అన్ని కాలాల్లోనూ వున్నారు. వాళ్లకు తరచుగా ఆనాటి పాలకులతో పోరాడవలసివచ్చి, వాళ్లు వీరులూ, అమర జీవులూ అయారు. తమ కాలపు సామాజిక-ఆర్థిక వ్యవస్థను విశ్లేషించి, విమర్శించే క్రమంలో, వాళ్లు మరింత న్యాయబద్ధమూ, మానవతా ప్రపూర్ణమూ అయిన సామాజిక వ్యవస్థను రేఖామాత్రంగా చిత్రించారు. వాళ్ల భావాలు అర్థశాస్త్రపు సరిహద్దులను అధిగమించే మాట నిజమే అయినా, ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో కూడా అవి ముఖ్యమైన పాత్రను వహిస్తాయి.

16, 17, 18 శతాబ్దాల్లో వెలువడిన భిన్నభిన్న స్థాయిల శాస్త్రీయ, సాహిత్య యోగ్యతలు కలిగి, భిన్నభిన్న అదృష్టాలకు గురైన అనేక రచనల్లో సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలు అభివృద్ధిచెయ్యబడ్డాయి. అయితే యిది కేవలం ఊహాజనిత సోషలిజం పూర్వచరిత్ర మాత్రమే. దాని సాంప్రదాయిక దశ 19వ శతాబ్దపు మొదటి అర్ధ భాగంలో వచ్చింది.

ఆ కాలానికి బూర్జువా సంబంధాలు పెట్టుబడిదారీ విధానపు కూలంకష, ప్రగాఢ విమర్శను ప్రేరేపించేందుకు తగినంతగా అభివృద్ధిచెందాయి. అదే సమయంలో బూర్జువా, శ్రామికవర్గాల వర్గ శత్రుత్వం అప్పటికింకా పూర్తిగా బహిర్గతం కాలేదు. ఐశ్వర్యానికీ పేదతనానికీ, మోటు బలప్రయోగానికీ హక్కుల లేమికీ మధ్య సాధారణ ఘర్షణగా మాత్రమే అది కనిపించేది. శ్రామికవర్గపు చారిత్రక కర్తవ్యాన్ని నిరూపించిన శాస్త్రీయ సోషలిజానికి పరిస్థితులు యింకా ఏర్పడలేదు. అయితే, మార్క్స్ ఎంగెల్సుల సిద్ధాంత ఆధారాల్లో ఊహాజనిత సోషలిజం ఒకటి. ప్రముఖ చింతనాపరులైన సెంట్ సైమన్, ఫోరియర్, రాబర్ట్ ఓవెన్ల రచనల్లో ఊహాజనిత సోషలిజం తన శిఖరస్థాయిని అందుకుంది.

ప్రభు హోదానుండి బికారిస్థాయికి

"మా మూలపురుషుడు చార్లెస్ మాగ్నె, మా నాన్న పేరు కౌంట్ డి సెంట్ సైమన్, డ్యూక్ డి సెంట్ సైమన్‌కి నేను సన్నిహిత బంధువుని."* ఈ మాటలు సెంట్ సైమన్‌కి వర్తిస్తాయని మనకి తెలియనప్పుడు ఈ పంక్తులు వెకిలి అహం భావం మాదిరిగా కనిపిస్తాయి. 1808లో రచించిన తన స్వీయ చరిత్రాత్మక వ్యాసాన్ని ఆయన యీ మాటలతో ఆరంభించాడు. ఒకనాటి ప్రభువైన సైమన్ యీ మాటలు రాసేనాటికి తన నౌకరు పోషణలో వున్న ఒక సామాన్యుడు. ఈ అసాధారణ వ్యక్తి జీవితం ఆయన బోధన అంతగా పూర్తి సంశ్లిష్టతలతోనూ, వైరుధ్యాల తోనూ నిండివుంది. ఆయన జీవితం గొప్ప సంపద, దారిద్ర్యం, సైనిక సాహసాలు, జైలు నిర్బంధం, మానవ సేవకి అర్పణ చేసుకునే తీవ్రోత్సాహం ఆత్మహత్యా ప్రయత్నం మిత్రుల ద్రోహం, శిష్యుల దృఢ విశ్వాసం, వీటితో నిండివుంది.

అన్రీ డి రివ్రువా పారిస్‌లో 1760లో జన్మించాడు. ఫ్రాన్సు ఉత్తరాదిన గల కుటుంబ రాజభవనంలో పెరిగాడు. ఇంటి దగ్గరే మంచి విద్యాభ్యాసం పొందాడు. త్వరలోనే ఆ యువ ప్రభువులో స్వేచ్ఛా ప్రియత్వం, స్వభావ దృఢత్వం బహిర్గతమ యాయి. పదమూడేళ్ల వయసులో ఆయన ప్రథమ బాప్టిజాన్ని పొందేందుకు నిరాకరించాడు. తనకు మత కర్మకాండలో విశ్వాసంలేదనీ, కాగా తను నమ్మకమున్నట్లు నటించజాలననీ ఆయన కుండ బద్దలుకొట్టినట్లు చెప్పాడు. త్వరలోనే ఆయనలో వ్యక్తమైన మరో లక్షణం ఆయన కుటుంబీకులకు విశేషమైన ఆశ్చర్యాన్ని గొలిపింది: తన ఉన్నత సామాజిక కర్తవ్యంపట్ల సుదృఢ విశ్వాసమే అది. పదిహేనేళ్ల సెంట్ సైమన్ తన నౌకర్ని, ప్రతిరోజూ ఉదయం యీ కింది మాటలతో తనను లేపమని ఆజ్ఞాపించినట్లు చెప్పకుంటారు: "ప్రభూ లేవండి, మీరెన్నో గొప్ప పనులు చెయ్యాలి."

అయితే, యీ గొప్ప పనులు యింకా ముందు ముందు వున్నాయి. ఈలోగా సెంట్ సైమన్ — తన కుటుంబపు ఆనవాయితీ ప్రకారం — సైనిక వృత్తిలో

---

* 1832లో Olinde Rodriguesచేత ప్రచురింపబడిన *Oeuvres de Saint-Simon*, Paris, 1848, p. XV. ఈ ఉల్లేఖన సుప్రసిద్ధ జీవిత స్మృతుల రచయిత డ్యూక్ డి సెంట్ సైమన్‌ని ఉద్దేశించింది. బువాగిల్బేర్, లాల జీవితాల్లో ఈయన్ని గురించి మేము పేర్కొన్నాం (ప్రకరణాలు 4, 5).

ప్రవేశించి, మూడేళ్లపాటు విసుగుపుట్టించే నగరరక్షకదళ జీవితం గడిపాడు. ఇంగ్లండుకు వ్యతిరేకంగా తిరుగుబాటుచేస్తున్న అమెరికన్ వలసరాష్ట్రాల సహాయార్థం పంపబడిన ఫ్రెంచి దాడి బలగంలో వలంటీరుగా అమెరికా వెళ్లడంతో ఆ యువ ఆఫీసరుకు రక్షకదళ జీవితంనుండి విముక్తి లభించింది. ఆయన ఫ్రాన్సుకి వీరుడుగా తిరిగి వచ్చాడు. త్వరలోనే ఒక రెజిమెంటుకి ఆయన బాధ్యుడుగా నియమింపబడ్డాడు. ఆ యువ కౌంటు ముందు ఉజ్వలమైన ఉద్యోగ జీవితావకాశాలు ఉన్నాయి. అయితే ఆ శూన్య జీవితంతో ఆయనకి త్వరలోనే విసుగెత్తిపోయింది. హాలండుకీ, అటుతర్వాత స్పెయిన్‌కీ యాత్రలో, సెంట్ సైమన్‌లోని ఓ కొత్త పార్శ్వం – సాహసకృత్యాల అన్వేషకుడుగా, ఉన్మత్త పథకాల కర్తగా – బయటపడింది. ఆయన అలసట ఎరుగని శక్తీ, కాల్పనిక మనస్సూ తమ నిజకర్తవ్యాన్ని యింకా నిశ్చయించుకోలేక, యీ అతుకులబొంత పథకాల్లో బయటపడే దోవను వెతుక్కున్నాయేమోనని అనిపించకమానదు. ఇంగ్లీషువాళ్లనుండి భారతదేశాన్ని జయించుకునేందుకుగాను హాలండులో ఒక నౌకాదళానికి ఆయన శిక్షణ గరిపాడు. స్పెయిన్‌లో ఆయన, మాడ్రిడ్‌ని సముద్రంతో కలిపే ఓ పెద్ద కాలవ నిర్మాణానికి పథకం వేశాడు. తపాలా, ప్రయాణీకుల రవాణా కంపెనీని ఏర్పాటుచేశాడు.

విజ్ఞాన సర్వస్వవాదుల భావాలతోనూ, అమెరికన్ విప్లవానుభవంతోనూ పుష్టి చేకూర్చుకొన్న సెంట్ సైమన్ 1789 నాటి ఘటనలకు అత్యంత ఉత్సాహంగా స్వాగతం పలికాడు. దాదాపు రెండేళ్లపాటు, "స్థానిక స్థాయిలోనే" అయినప్పటికీ, ఆయన విప్లవంలో బాగా క్రియాశీలమైన పాత్రనే వహించాడు. అప్పటికి ఆయన తన కుటుంబానికి పూర్వం చెందిన ఎస్టేటుకి సమీపంలోని ఓ చిన్న పట్టణంలో నివసిస్తూండేవాడు. ఆయన ఎస్టేటు పోయినందుకు విచారించలేదు, తన ప్రభుహోదానూ, పురాతన కుటుంబ నామధేయాన్నీ అధికారికంగా విసర్జించి సిటిజెన్ బొనొమ్ (అంటే సామాన్య మనిషి) అనే పేరును స్వీకరించాడు.

1791లో సిటిజెన్ బొనొమ్ జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఆయన పారిస్‌కి వెళ్లి, భూమి మారుబేరాలకు పూనుకొన్నాడు. ప్రభువర్గంనుంచీ, చర్చినుంచీ ప్రభుత్వం జప్తుచేసిన ఆస్తుల వేలాల మూలంగా ఆ దశలో భూముల మారుబేరాలు విస్తృత స్థాయిలో సాగాయి. తనకు స్పెయిన్‌లో పరిచితుడైన జర్మన్ దౌత్యోద్యోగి బేరన్ రేడెర్న్‌ని ఆయన యీ వ్యాపారంలో తన భాగస్వామిగా ఎంచుకున్నాడు. ఈ బేరాల్లో వాళ్లు సాధించిన విజయం అన్ని అంచనాలనూ మించిపోయింది. 1794 నాటికి సెంట్ సైమన్ గొప్ప ధనికుడయాడు. అయితే అంతలోనే జాకొబిన్ విప్లవపు కరకు హస్తం ఆయనపై విరుచుకుపడింది. విప్లవ ప్రతీఘాత థెర్మిడోర్ రాజకీయ కుట్ర మూలంగా మరణ శిక్షనుండి ఆయన బయటపడ్డాడు. సుమారు ఒక సంవత్సరంపాటు

జైలు జీవితం గడిపాక ఆయన విడుదలచేయబడ్డాడు. వెంటనే ఆయన తిరిగి లాభసాటి మారుబేరాల్లో విమగ్నుడయాడు. అప్పటికి ఆ వ్యాపారం యింకెంతమాత్రమూ ప్రమాదకరంగా లేదు. 1796లో సెంట్ సైమన్, రేడెర్న్‌ల ఉమ్మడి భాగ్యం 40 లక్షల ఫ్రాంకుల విలువగలది అయింది.

అయితే సరిగా ఆ తరుణంలో విజయవంతంగా సాగుతున్న ఆయన మారుబేరానికి అవరోధం ఏర్పడింది. భయంకర పాలన కాలంలో తెలివితేటలుగా విదేశాల్లో తలదాచుకున్న బేరన్ రేడెర్న్ పారిస్‌కి తిరిగివచ్చి, వ్యాపార లావాదేవీలన్నీ తన పేరుమీదుగానే సాగాయి గనుక, తమ ఉమ్మడి సంపద యావత్తూ తనొక్కడిదేనని పేచీపెట్టాడు. ఒక వంక దారుణమైన జిత్తులమారితనం, మరోవంక బాల్యసహజమైన అమాయకత్వం — సెంట్ సైమన్‌లో చిత్రమైన యీ మిశ్రమాన్ని అర్థంచేసుకోవడం ఎవరికైనా పూర్తిగా కష్టసాధ్యమే! దీర్ఘకాలంపాటు తగాదాలు సాగాక, చివరకు రేడెర్న్‌నుంచి 5,00,000 ఫ్రాంకుల పరిహారంతో ఆయన సరిపెట్టుకోక గత్యంతరం లేకపోయింది.

అప్పటికే సైనికుడు, సాహసికుడు, దేశభక్తుడు, చట్టావ్యాపారీ అయిన సెంట్ సైమన్, దీక్షాపరుడైన విద్యార్థిగా మారాడు. ప్రకృతి విజ్ఞానశాస్త్రాల్లో వచ్చిన గొప్ప ఆవిష్కరణలతో ముగ్ధుడైన సెంట్ సైమన్, తనకు సహజసిద్ధమైన శక్త్యుత్సాహాలతో వాటి అధ్యయనానికి పూనుకున్నాడు. ఆయన సంపద అవశేషాలు అతిథులకు సాదరంగా స్వాగతం చెప్పే గృహనిర్వహణకు వినియోగింపబడ్డాయి. పారిస్‌లోని మిక్కిలి విశిష్టులైన పండితులు ఆయన యింట్లో సమావేశమవుతూ వుండేవారు. అటుతర్వాత సెంట్ సైమన్ కొన్ని సంవత్సరాలపాటు యూరప్ పర్యటనలో గడిపాడు. 1805 నాటికి ఆయన డబ్బంతా నిండుకున్నట్లూ, ఆయన దగ్గర దాదాపు చిల్లిగవ్వ కూడా మిగలనట్లూ స్పష్టపడిపోయింది.

దరిమిలా, తన జీవితాన్ని సింహావలోకనం చేసుకొంటూ, తన జీవితంలోని ఆటుపోట్లు తను బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయోగాల పర్యవసానాలనీ, సామాజిక సంస్కర్తగా తన అసలైన జీవిత కార్యకలాపాలకు అవన్నీ సన్నాహక సోపానాలనీ సెంట్ సైమన్ చెప్పుకున్నాడు. ఇదొక భ్రమ అనడం స్పష్టం. ఆయన జీవితం తర్కబద్ధమైనది. ఆ కాలంచేతా, ఆనాటి ఘటనలచేతా నిర్ణయింపబడిన సెంట్ సైమన్ వ్యక్తిత్వపు వ్యక్తీకరణ అది. ఆయన వ్యక్తిత్వం నూతనత్వమూ, ప్రతిభా కలిగినది, కాని మిక్కిలి వైరుధ్యపూరితమైనది కూడా. అప్పటికే తనొక విచిత్రమైన, అదుపులేని వ్యక్తి అన్న కీర్తిని ఆయన సంపాదించుకున్నాడు. సామాన్యత లోకంచేత సహజమైనదిగా పరిగణింపబడుతూ వుంటుంది. కాగా, ప్రతిభ అదుపులేనిదిగానూ, కొన్ని సందర్భాల్లో అనుమానాస్పదమైనదిగా కూడా పరిగణింపబడుతుంది.

"సమకాలికులకు జెనీవా వాసి లేఖలు" (1803) అన్న సెంట్ సైమన్ తొలి ముద్రిత రచనలో కూడా విశేషమైన కొత్తదనం కనిపిస్తుంది. దానిలో అప్పటికే సమాజాన్ని పునర్నిర్మించాలన్న ఊహాజనిత పథకం — అది యింకా అస్పష్టమైన పిండ రూపంలోనే ఉన్నప్పటికీ — మనకి కనిపిస్తుంది. ఈ చిన్న రచనలో గమనీయమైన రెండు అంశాలున్నాయి. మొదటిది, సెంట్ సైమన్ ఫ్రెంచి విప్లవాన్ని, ప్రభువర్గం, బూర్జువావర్గం, పేదలు (శ్రామికవర్గం) అన్న మూడు ప్రధాన వర్గాల మధ్య వర్గపోరాటంగా చిత్రించాడు. ఎంగెల్స్ దీన్ని "అతి ముఖ్యమైన, అర్థగర్భితమైన ఆవిష్కరణ"* అన్నాడు. రెండవది, సమాజ రూపాంతరీకరణలో విజ్ఞానశాస్త్ర పాత్రకు సంబంధించిన సునిశితమైన రేఖాచిత్రాన్ని ఆయన యిచ్చాడు.

సెంట్ సైమన్ సాహిత్యశైలి శక్తివంతమైనది, ఉత్సాహవంతమైనది, కొన్ని సందర్భాల్లో ఆవేశపూరితమైనది. దానిలోంచి మానవాళి భవితవ్యంపట్ల ప్రగాఢాసక్తి కలిగిన వ్యక్తి చిత్రం మన కళ్లముందు రూపుదాలుస్తుంది.

గురువు

సెంట్ సైమన్ జీవితంలోని చివరి రెండు దశాబ్దాలూ కష్టాలతో, పోరాటంతో, ప్రగాఢమైన సృజనాత్మక కృషితో నిండివున్నాయి. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో ఏ రకమైన ఆదాయం దొరికినా సరేనని చూసేవాడు. ఒకానొక సమయంలో తాకట్టు అంగడిలో కాపీయిస్టుగా పనిచేశాడు. 1805లో ఆయన తన పూర్వపు నౌకర్ని కలుసుకోవడం తటస్థించింది. సెంట్ సైమన్ దగ్గర పనిచేస్తూవుండిన కాలంలోనే ఆ నౌకరు కొంత డబ్బు కూడబెట్టగలిగాడు. సెంట్ సైమన్ అతనితో రెండేళ్లపాటు కలిసి జీవించి, అతని సహాయం పొందాడు. ఈ విచిత్ర జంటలో డాన్ క్విక్సట్, శాంకో పాంజాల కథ పునరావృతమైంది! తన వెనకటి నౌకరు డబ్బుతో సెంట్ సైమన్ 1808లో "19వ శతాబ్ది శాస్త్రీయ రచనలకు ఉపోద్ఘాతం" అనే తన రెండవ పుస్తకాన్ని ప్రచురించాడు. దీన్నీ, మరికొన్ని యితర పుస్తకాలనూ కూడా ఆయన తక్కువ కాపీల్లో ముద్రించి, ప్రముఖ పండితులకూ, రాజకీయవేత్తలకూ విమర్శ నిమిత్తం, తన కృషిని కొనసాగించగలిగేందుకు తోడ్పాటును అర్థిస్తూ పంపాడు. అయితే వాళ్లెవరూ బదులిచ్చిన పాపాన పోలేదు.

---

* Frederick Engels, *Anti-Dühring*, p. 307.

1810–1812 సంవత్సరాల్లో సెంట్ సైమన్ కటిక దరిద్రంలో గడిపాడు. దుస్తులతో సహా తన వస్తువులన్నింటినీ అమ్మేశాననీ, కేవలం రొట్టె, నీళ్లతో, వెచ్చదనానికి కట్టెలుగాని, వెల్తురుకు కొవ్వొత్తులుగాని లేకుండా బతుకుతున్నాననీ ఆయన రాశాడు. పరిస్థితులు క్లిష్టతరమైనకొద్దీ ఆయన మరింత కష్టపడి పనిచేశాడు. ఈ సంవత్సరాల్లోనే సమాజంపై ఆయన భావాలు స్ఫుటమైన రూపాన్ని దాల్చాయి. ఆ భావాలనే ఆయన 1814 దరిమిలా వరుసగా వెలువరచిన తన సృజనాత్మక రచనలలో ప్రతిపాదించాడు. యుద్ధానంతర యూరప్ నిర్మితిపై ఆయన రాసిన చిన్న పుస్తకం జనం దృష్టిని ఆకర్షించింది. జనరంజకమూ, సుప్రసిద్ధమూ అయిన "మానవాళికి స్వర్ణయుగం ముందుంది, వెనక కాదు" అన్న పదబంధాన్ని ఆయన వాడినది ఈ పుస్తకంలోనే. దరిమిలా ఆయన కార్యకలాపాలన్నీ యీ ప్రధాన ప్రతిపాదన చర్చకూ, ఆ "స్వర్ణయుగ" సాధనా మార్గాలను రూపొందించేందుకూ అంకితమయాయి.

60వ ఏడు యిక వస్తుందనగా ఆయన పరిస్థితులు మెరుగయాయి. ఆయన శిష్యులనూ, అనుయాయులనూ సంపాదించుకున్నాడు. సమాజపు విద్యావంతులైన, సహజ "నాయకులైన" బ్యాంకర్లనూ, పరిశ్రమదారులనూ, వర్తకులనూ ఉద్దేశించి, సమాజపు శాంతియుత పరివర్తనను గురించి ఆయన చేసిన బోధన, ఆ వర్గంలోని కొందరి దృష్టిని ఆకర్షించింది. సెంట్ సైమన్‌కి, తన రచనలను ప్రచురించే అవకాశం లభించింది. ఆ రచనలు జనబాహుళ్యంలో పలువురికి పరిచితమయాయి. ఆయన సంపన్న అనుయాయులు, ఆయన సౌకర్యవంతమైన జీవితం గడపడాన్నీ, కష్టపడి పనిచెయ్యడాన్నీ సాధ్యం చేశారు.

అయితే తన జీవితంలో మాదిరిగానే, తన రచనల్లో కూడా సెంట్ సైమన్ తిరుగుబాటుదారుగా, ఉత్సాహపరుడుగా, గాఢావేశపరుడుగా, స్వాప్నికుడుగానే ఉండిపోయాడు. ఆయన రచనల్లో ఒకదాని ప్రచురణకు ధన సహాయం చేసిన కొందరు బ్యాంకర్లూ, సంపన్నులూ బహిరంగంగా ఆయన భావాలతో తెగతెంపులు చేసుకుని ఆయన తమను తప్పుదారి పట్టించాడనీ, తమ విశ్వాసాన్ని ఆయన వమ్ముచేశాడనీ ఆరోపించారు. అటు తర్వాత కొద్ది కాలానికి సెంట్ సైమన్ రాజ కుటుంబాన్ని అవమాన పరచిన నేరంపైన కోర్టుకి యీడ్వబడ్డాడు: ఇంతకీ జరిగిందేమిటంటే, ఆయనొక "పిట్టకథను" ప్రచురించాడు. అందులో ఆయన, ప్రభువర్గం, ఉన్నతాధికారులు, మతాధిపతులు మొదలైన వాళ్లతోబాటు ఫ్రెంచి రాజకుటుంబ సభ్యులందరూ ఏ అద్భుతమో జరిగి నామరూపాలు లేకుండా అంతరించిపోయినా ఫ్రాన్సుకి ముంచుకుపోయేదేమీ వుండదనీ, తద్భిన్నంగా, అత్యుత్తమ పండితులూ, కళాకారులూ, వృత్తినిపుణులూ, చేతిపనులవాళ్లూ పోతేమటుకు ఫ్రాన్సుకి అపారమైన నష్టం వాటిల్లుతుందనీ రాశాడు. దీన్ని తమాషాయైన వట్టి

విరోధాభాసంగా మాత్రమే పరిగణించిన జూరీ సభ్యులు ఆయన నేరం చెయ్యలేదని అభి ప్రాయపడ్డారు.

సెంట్ సైమన్ జీవితంలో యిదొక విధమైన మోదాంత విషాద ఘటన కాగా, 1823లో ఆయన చేసిన ఆత్మహత్యా ప్రయత్నం నిజంగానే విషాదాంతమైన ఘటన. సెంట్ సైమన్ పిస్తోలుతో తన కణతకు కాల్చుకున్నాడు, అయినా బతికేవున్నాడు. అయితే ఓ కన్ను మాత్రం పోయింది. ఒక సన్నిహిత మిత్రునికి రాసిన వీడ్కోలు ఉత్తరంలో, తన భావాలపట్ల సార్వత్రిక అనాసక్తి కారణంగా జీవితంపట్ల భ్రాంతి చెదిరిపోయినట్లు ఆయన పేర్కొన్నాడు. అయితే, ఆ గాయంనుంచి తేరుకొనీ తేరుకోగానే ఆయన మళ్లీ కష్టపడి పనిచెయ్యడానికి పూనుకొని, 1823–1824లో "ఇన్‌డస్ట్రియల్స్ ప్రశ్నో పనిషత్" అన్న తన రచనల్లోకెల్ల అతి సమగ్రమైన, మెరుగులు దిద్దబడిన రచనను ప్రచురించాడు. 1824వ సంవత్సరం పొడుగునా ఆయన తన చివరి పుస్తకమైన "నూతన క్రైస్తవ మతం" పైన తీవ్రంగా కృషిచేశాడు. దానిలో ఆయన భవిష్యత్ "ఇన్‌డస్ట్రియల్స్ సమాజానికి" ఓ కొత్త మతాన్ని యిచ్చేందుకు తంటాలుపడ్డాడు. క్రైస్తవ మతంనుండి తొలి మానవతా వాదాన్ని మాత్రమే ఆయన తన మతంలోకి స్వీకరించాడు. "నూతన క్రైస్తవ మతం" ప్రచురింపబడిన కొద్దివారాలకు 1825 మేలో క్లాడ్ ఆంరీ సెంట్ సైమన్ మరణించాడు.

సెంట్ సైమనిజం

సెంట్ సైమనిజం నాలుగు దశల్లో అభివృద్ధిచెందిందని చెప్పవచ్చు. మొదటిదానికి 1814–1815దాకా సెంట్ సైమన్ చేసిన రచనలు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ దశలో దాని ప్రధాన లక్షణాలు విజ్ఞానశాస్త్రం, పండితుల ఆరాధన, అనిర్దిష్టమైన మానవతావాదం. ఈ దశలో సెంట్ సైమనిజం సామాజిక ఆర్థిక భావాలు బీజ రూపంలో మాత్రమే వున్నాయి.

రెండవ దశ, ఆయన జీవితపు చివరి దశకంలో వెలువడిన పరిణత రచనల్లో మూర్తీభావం పొందింది. సెంట్ సైమన్ వాటిలో, పెట్టుబడిదారీ విధానాన్ని సహజ, శాశ్వత వ్యవస్థగా గుర్తించడానికి గట్టిగా తిరస్కరించి, ఓ కొత్త సామాజిక వ్యవస్థ దాని స్థానాన్ని తప్పనిసరిగా ఆక్రమిస్తుందనీ, ఆ కొత్త వ్యవస్థలో శత్రువైరుధ్య, పోటీల స్థానాన్ని జనం మధ్య పొత్తు ఆక్రమిస్తుందనీ ప్రతిపాదించాడు. "ఇన్‌డస్ట్రియల్స్ సమాజపు" శాంతియుతాభివృద్ధి ద్వారా యిది జరుగుతుంది. ఈ సమాజంలో ఫ్యూడల్

ప్రభువుల, పరభాగ్యోపజీవులైన బూర్జువా యజమానుల రాజకీయాధికారం తుద ముట్టించబడుతుంది, కాని వ్యక్తిగత స్వామ్యం మిగిలే ఉంటుంది. మిక్కిలి పెద్ద, అత్యంత పీడిత వర్గపు ప్రయోజనాల పరిరక్షణ వైపు సెంట్ సైమన్ అంతకంతకు అధికంగా మొగ్గాడు. మార్క్స్ యిలా రాశాడు: "తన చివరి రచనయైన 'నూతన క్రైస్తవ మతం'లో సెంట్ సైమన్ నేరుగా కార్మికవర్గం తరపున మాట్లాడుతాడు, వాళ్ల విమోచనే తన కృషి గమ్యం అని చాటుతాడు."*

తన కాలపు సమాజం రెండు ప్రధాన వర్గాలతో — సోమరులైన యజమానులతోటీ శ్రమించే ఇన్‌డస్ట్రియల్స్‌తోటి కూడివుందని సెంట్ సైమన్ భావించాడు. ఈ భావం, ఫ్యూడల్, బూర్జువా సమాజాల వర్గవైరుధ్యాల విచిత్ర సమ్మేళనం. సెంట్ సైమన్ దృష్టిలో మొదటి వర్గం ఆర్థిక ప్రక్రియలో పాల్గొని బడా భూస్వాములూ, పెట్టుబడిదారీ లాభార్జన జీవులతో కూడివుంటుంది, అంతేకాకుండా, విప్లవ, సామ్రాజ్య కాలాల్లో పైకెక్కి వచ్చిన సైనిక, న్యాయ విభాగాల్లోని బ్యూరాక్రటిక్ అధికారుల పొరకూడా యిందులో చేరుతుంది. ఇన్‌డస్ట్రియల్సే మిగిలిన అందరూ. తమ కుటుంబాల తోబాటు వీళ్లు, సెంట్ సైమన్ దృష్టిలో, ఆనాటి ఫ్రెంచి సమాజపు మొత్తం జనాభాలో 96 శాతం వుంటారు. వీళ్లలో ప్రతి ఒక్కడూ సామాజికంగా ఉపయోగకరమైన యేదో ఒకరకం కలాపాల్లో వున్నట్లు మనం చూస్తాం. రైతులు, కూలికి పనిచేసే కార్మికులు, వృత్తిపనివాళ్లు, ఫ్యాక్టరీ యజమానులు, వర్తకులు, బ్యాంకర్లు, పండితులు, కళాకారులు. భూమి యజమానుల ఆదాయాలను పరాన్నభుక్తంగానూ, ఇన్‌డస్ట్రియల్స్ ఆదాయాలను న్యాయబద్ధమైనవిగానూ ఆయన పరిగణించాడు. ఆర్థిక భావాభివర్గాల్లో చెప్పుకున్నప్పుడు, ఆయన భూమికౌలునూ, రుణాలపై వడ్డీనీ భూమి యజమానుల ఆదాయాల్లోనూ, ఇన్‌డస్ట్రియల్స్ ఆదాయాన్నీ (లేక లాభాన్నంతటినీ), వేతనాలనూ ఇన్‌డస్ట్రియల్స్ ఆదాయాలుగానూ జతచేశాడు. ఈ విధంగా, బూర్జువావర్గానికీ శ్రామిక వర్గానికీ మధ్య సెంట్ సైమన్ వర్గశత్రుత్వాన్ని చూడలేదు, లేదా కనీసం, దాన్ని ఆయన ప్రాధాన్యం కలిగిన విషయంగా పరిగణించలేదు. 19వ శతాబ్దపు ఆరంభంలో వర్గాల అపరిణత స్వభావం కొంతవరకూ, తన సిద్ధాంతాన్ని ఒకే లక్ష్యానికి కట్టివుంచాలనే ఆయన కోరిక కొంతవరకూ దీనికి కారణం అనుకోవచ్చు. సమాజపు శాంతియుత, క్రమ పరివర్తన కోసం జాతిలోని అత్యధిక సంఖ్యాకులను సమైక్యంచెయ్యడమే ఆ లక్ష్యం. సెంట్ సైమన్ సూత్రరీత్యా వ్యక్తిగత ఆస్తిని వ్యతిరేకించలేదు, ఒక విధంగా దాని దుర్వినియోగాన్ని మాత్రమే ఆయన వ్యతిరేకించాడు. భవిష్యత్సమాజంలో అది

* Karl Marx, *Capital,* Vol. III, p. 605.

రద్దు కావడాన్ని ఆయన గుర్తించలేదు. దానిపైన కొంతమేరకు సమాజపు అజమాయిషీ నెలకొల్పబడుతుందని ఆయన భావించాడు. పెట్టుబడిదారీ పరిశ్రమదారులు ఉత్పత్తి సహజ సంఘటన కర్తలు, వాళ్ళు సమాజ సౌభాగ్యానికి అవసరం అన్న సెంట్ సైమన్ అభిప్రాయం సేయ్ అభిప్రాయాన్ని గుర్తుకి తెస్తుంది.

సెంట్ సైమన్ మృతికీ, 1831కీ మధ్య కాలంలో ఆయన శిష్యులు చేసిన రచనలు, వాళ్ల ప్రచారం, వాళ్ల ప్రత్యక్ష కార్యకలాపాలూ సెంట్ సైమనిజం అభివృద్ధిలో మూడవ దశ. నిజానికి యిదే దాని వికాస దశ. సెంట్ సైమనిజం ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత స్వామ్యపు రద్దును, శ్రమ, సామర్థ్యాలను బట్టి పంపిణీనీ, ఉత్పత్తి సామాజిక సంఘటననూ, ప్లానింగునూ డిమాండుచేసిన మేరకు, అది నిజంగానే సోషలిస్టు సిద్ధాంతం అయింది. సెంట్ సైమన్ అతి సన్నిహిత శిష్యులైన సెంట్ అర్మాండ్ బజార్, బర్తొలొమ్యే ప్రాస్పేర్ ఎన్‌ఫంటేన్‌లు 1828–1829 సంవత్సరాల్లో పారిస్‌లో యిచ్చిన బహిరంగోపన్యాసాల్లో, యీ భావాలు అత్యంత సమగ్రంగానూ, క్రమబద్ధంగానూ వ్యక్తంచెయ్యబడ్డాయి. అవి దరిమిలా "సెంట్ సైమన్ సిద్ధాంత వివరణ" అన్న శీర్షికతో ప్రచురింపబడ్డాయి.

వర్గాలపైనా, ఆస్తిపైనా సెంట్ సైమన్ భావాలకు ఆయన శిష్యులు మరింత స్పష్టమైన సోషలిస్టు మొగ్గను కల్పించారు. ఇన్‌డస్ట్రియల్స్‌ను వాళ్లిక ఎంతమాత్రం ఏకైక అభిన్న సామాజిక వర్గంగా పరిగణించలేదు. తద్భిన్నంగా, యజమానులు చేస్తున్న దోపిడి నేరుగా కార్మికుడి నెత్తిమీదనే పడుతోందని వాళ్లు వాదించారు. కార్మికుడు, "ఒకనాటి బానిస మాదిరిగానే, పాదార్థికంగా, బౌద్ధికంగా, నైతికంగా దోపిడిచెయ్యబడుతున్నాడు" అని వాళ్లు రాశారు. ఇక్కడ పెట్టుబడిదారీ పరిశ్రమదారులు "దోపిడి ప్రత్యేక సౌకర్యాల్లో పాలుపంచుకొంటున్నారు."

సెంట్ సైమనిజం దోపిడిని వ్యక్తిగత స్వామ్య వ్యవస్థతో ముడిపెట్టింది. వ్యక్తిగత స్వామ్యంపై ఆధారపడిన సామాజిక వ్యవస్థ లోపాలే పెట్టుబడిదారీ వ్యవస్థలో స్వభావ సిద్ధంగా వున్న సంక్షోభాలకూ, ఉత్పత్తి అరాజకత్వానికీ ప్రధాన కారణమని అది వాదించింది. ఈ గంభీరభావం సంక్షోభాల యంత్రాంగ విశ్లేషణ ద్వారా నిరూపింపబడని మాట నిజమే, కాని వారసత్వ హక్కును రద్దుచెయ్యడం ద్వారా వ్యక్తిగత స్వామ్యాన్ని పరిమితం చేయాలని చెప్పే, వాళ్ల అతి ముఖ్య డిమాండుకు ప్రాతిపదికల్లో యీ భావం ఒకటైంది. ప్రభుత్వం ఏకైక వారసురాలు కావాలి, అప్పుడది, ఉత్పత్తి వనరులను పరిశ్రమదారులకు బాడుగకు యిస్తుంది. ఆ పరిశ్రమల డైరెక్టర్లు అప్పుడు సమాజపు ఏజెంట్లవుతారు. ఈ విధంగా వ్యక్తిగత స్వామ్యం క్రమంగా ప్రజల స్వామ్యం అవుతుంది.

సెంట్ సైమనిస్టులు భవిష్యత్సమాజపు పాదార్థిక పునాదిని పాత సమాజంలోనే వెతికారు. ఇది వాళ్ళు చేసిన కొత్త చేర్పు. వాళ్ల భావనలో, సోషలిజం, ఉత్పాదక శక్తుల అభివృద్ధియొక్క సహేతుక పర్యవసానంగా ఉత్పన్నంకావలసివుంటుంది. పెట్టుబడిదారీ రుణ బ్యాంకింగు వ్యవస్థను భవిష్యత్ ప్రణాళికాబద్ధ ఉత్పత్తి నిర్మాణానికి అండ దశగా వాళ్లు పరిగణించారు. సెంట్ సైమనిస్టుల యీ ప్రగాఢ భావాలు దరిమిలా పెటీబూర్జువా లేక బూర్జువా స్వభావం కలిగిన "రుణ స్వప్నాలు"గా మారిన మాట నిజమే. అయితే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు సోషలిస్టు సమాజం, పెట్టుబడిదారీ విధానంచేత సృష్టింపబడిన బడా బ్యాంకుల యంత్రాంగాన్ని పబ్లిక్ అకౌంటింగు కోసమూ, ఆర్థిక వ్యవస్థ అజమాయిషీ, నిర్వహణల కోసమూ వినియోగించుకోగలదు అన్న మూల భావాన్ని సెంట్ సైమనిస్టుల ఉజ్వల మానసిక ప్రతిభకు నిదర్శనంగా పరిగణించారు.

సెంట్ సైమన్ మాదిరిగానే, ఆయన శిష్యులు కూడా సమాజపు అభివృద్ధిలోనూ, పరివర్తనలోనూ విజ్ఞానశాస్త్రానికి గల పాత్రపట్ల విశేషమైన శ్రద్ధ చూపారు. విజ్ఞానశాస్త్రజ్ఞులూ, అత్యంత ప్రతిభావంతులైన పరిశ్రమదారులూ సమాజపు రాజకీయ, ఆర్థిక మేనేజిమెంటును చేబట్టాలి. భవిష్యత్సమాజంలో "ప్రజల మేనేజిమెంటు" అంతరించి, "వస్తువుల మేనేజిమెంటు" అంటే, ఉత్పత్తి మాత్రమే మిగులుతుందిగనుక, రాజకీయ మేనేజిమెంటు క్రమంగా అంతరించిపోతుంది. సెంట్ సైమనిస్టులు తమ కాలపు సమాజంలోని విజ్ఞానశాస్త్రపు, విజ్ఞానశాస్త్రజ్ఞుల పరిస్థితులను నిశితంగా విమర్శించారు.

సెంట్ సైమన్, ఆయన శిష్యుల రచనల్లో అర్థశాస్త్రపు ప్రధాన భావాభివర్గాల ప్రత్యేక పరిశీలన మనకి కనిపించదు. విలువ సృష్టి, పంపిణీలను గాని, వేతనం, లాభం, భూమి కౌలుల నియమాలనుగాని వాళ్లు విశ్లేషించలేదు. కొంతమేరకు, ఆనాటి బూర్జువా అర్థశాస్త్రపు అంగీకృత భావాలతో వాళ్లు సంతృప్తిపడ్డారు. అయితే ప్రధానాంశం ఏమిటంటే, వాళ్ల చింతన మౌలికంగా భిన్న దిశలో సాగి, భిన్న కర్తవ్యాలను ముందుకు తెచ్చింది. ఆర్థిక విజ్ఞానశాస్త్రంలో వాళ్ల శ్రేష్ఠత్వం ఏమిటంటే, బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రజ్ఞులయొక్క, "సేయ్ శాఖ"యొక్క మౌలిక సూత్రాన్ని, అంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ సహజమైనదీ, శాశ్వతమైనదీ అన్న సూత్రాన్ని వాళ్లు ఖండించారు. అందుచేత, యీ వ్యవస్థ ఆర్థిక నియమాల సమస్య పూర్తిగా భిన్నమైన స్థాయిలో పెట్టబడింది. అర్థశాస్త్రానికి ఒక నూతన కర్తవ్యం ఎదురైంది: పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం చారిత్రకంగా ఎలా తలెత్తి, ఎలా అభివృద్ధిచెందింది, దాని వైరుధ్యాలు ఏమిటి, అది ఎందుకు, ఎలా సోషలిజానికి చోటివ్వక తప్పదు? సెంట్

సైమనిస్టులు యీ కర్తవ్యాన్ని పరిష్కరించలేకపోయారు. అయితే వాళ్లు దాన్ని ముందుకు తెచ్చారన్నదే గొప్ప విశేషం.

అర్థశాస్త్ర విషయాంశాన్ని ఒక ప్రత్యేక విజ్ఞానశాస్త్రంగా చిత్రించి, దాన్ని రాజకీయాలనుంచి వేరుచేసినందుకుగాను, సేయ్‌ని సెంట్ సైమన్ ప్రశంసించాడు. ఆయన శిష్యులు ఈ విషయాన్ని ప్రస్తావించకుండా, సేయ్‌నీ, ఆయన అనుయాయులనీ సునిశిత విమర్శకు గురిచేసి, వాళ్ల సిద్ధాంతపు పెట్టుబడిదారీ విధాన సమర్థక స్వభావాన్ని స్పష్టంగా బహిర్గతంచేశారు. ఈ అర్థశాస్త్రవేత్తలు ప్రస్తుత ఆస్తి సంబంధాలు ఎలా తలెత్తాయో నిరూపించేందుకు ప్రయత్నించలేదన్న విషయాన్ని వేలెత్తి చూపించి, వాళ్లు యిలా అన్నారు: "సంపద ఎలా రూపొందుతుంది, ఎలా పంపిణీ చెయ్యబడు తుంది, ఎలా వినియోగించుకోబడుతుంది అన్న విషయాన్ని తాము చూపినట్లు వాళ్లు చెప్పుకుంటారన్న విషయం నిజమే. కాని, శ్రమచేత ఏర్పడిన యీ సంపద – ఎప్పుడూ కూడా పుట్టుకనుబట్టే పంపిణీ చెయ్యబడుతుందా, చాలవరకు సోమరుల చేతనే వినియోగించుకోబడుతుందా అన్న విషయాన్ని వాళ్లు పట్టించుకోలేదు."*

1831లో మొదలయ్యేది నాలుగవ దశ, సెంట్ సైమనిజం పతన దశ. కార్మిక వర్గంలోపల యేరకమైన గట్టి తోడ్పాటూ లేని సెంట్ సైమనిజం, ఫ్రెంచి శ్రామిక వర్గపు తొలి విప్లవ కార్యాచరణలతో పూర్తిగా నిర్ఘాంతపోయింది. ఈ దశలో అది సంతరించుకున్న మతపర, ఒంటెత్తు గూఢార్థాలు, దాన్ని కార్మికవర్గంనుంచీ, చివరకు ప్రజాస్వామిక విద్యార్థులనుంచీ సైతం దూరంచేశాయి. సెంట్ సైమనిస్ట్ మత శాఖకు ఎన్‌ఫంటేన్ "le Pere" (ఫాదరీ) అయాడు. ఓ చిత్రమైన మత సమాజం స్థాపించబడింది, ప్రత్యేకమైన దుస్తులు ప్రవేశపెట్టబడ్డాయి. వాటిలో వెయిస్ట్‌కోటులకు గుండీలు వీపుమీద వుండేవి. సెంట్ సైమన్ అనుయాయుల వివిధ గ్రూపుల మధ్య కటువైన అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. స్త్రీ పురుషుల మధ్య సంబంధాల సమస్య, సమాజంలో స్త్రీల హోదా – యీ రెండూ తగాదాకు కేంద్రం అయాయి. 1831 నవంబరులో బజార్ తన అనుయాయుల ఒక బృందంతోబాటు కూటమిని వదిలి బయటకు పోయాడు. అటుతర్వాత కొద్ది కాలానికి, 1830 జూలై విప్లవానంతరం అధికారంలోకి వచ్చిన ఆర్లియన్స్ ప్రభుత్వం, ఎన్‌ఫంటేన్‌పైనా, అతని గ్రూపుపైనా నీతిబాహ్యా ప్రవర్తనకు పాల్పడ్డారనీ, ప్రమాదకర భావాలను ప్రచారంచేస్తున్నారనే ఆరోపణల పైన కోర్టులో కేసుపెట్టింది. ఎన్‌ఫంటేన్‌కి ఒక ఏడాది జైలు శిక్ష విధింపబడింది. ఆ ఉద్యమం నిర్మాణరీత్యా కుప్పకూలి పోయింది. దాని సభ్యుల్లో కొందరు స్వతంత్రంగా

---

* *Doctrine de Saint-Simon: Exposition*, Bruxelles, 1831, p. 235.

సెంట్ సైమనిజాన్ని బోధించడానికి విఫల ప్రయత్నం చేశారు. కొందరు యితర సోషలిస్టు ధోరణులలో చేరిపోయారు. మరి కొందరు గౌరవనీయులైన బూర్జువా పౌరులుగా మారిపోయారు.

అయితేనేం, ఫ్రాన్సులోనూ, కొంతమేరకు తదితర దేశాల్లోనూ సోషలిస్టు భావాల భవిష్యదభివృద్ధిపై సెంట్ సైమనిజం ప్రభావం గురుతరమైనది. వాళ్ల మతంలో ఎన్నిలోపాలైనా ఉండుగాక, సెంట్ సైమనిస్టుల బలం, బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా వాళ్లకొక సాహసికమూ, సుసంగతమూ అయిన కార్యక్రమం ఉందన్న వాస్తవంలో వుంది.

చార్లెస్ ఫోరియర్ కష్ట జీవితం

ఎంగెల్స్ యిలా రాశాడు: "సెంట్ సైమన్ భావాల్లో మనకి సమగ్రమైన దృష్టివైశాల్యం కనిపిస్తే ఈ కారణంగానే తదుపరి సోషలిస్టుల భావాల్లో కచ్చితంగా ఆర్థికమైనవి కానివి దాదాపు అన్నీ ఆయన భావాల్లో బీజరూపంలో మనకి కనిపిస్తాయి – ఫోరియర్ భావాల్లో మనకి, అమల్లో వున్న సామాజిక పరిస్థితులపై విమర్శ కనిపిస్తుంది. ఈ విమర్శ అచ్చమైన ఫ్రెంచి, చతురపద్ధతిలో సాగింది, అయితే, ఆ కారణంగా దాని సమగ్రతకు ఏమాత్రం లోటు యేర్పడలేదు.... ఫోరియర్ కేవలం విమర్శకుడు మాత్రమే కాదు, ఆయన ఉల్లాసకర, ప్రసన్న స్వభావం ఆయన్నొక వ్యంగ్యరచయితను – నిస్సందేహంగా అన్ని కాలాలకూ చెందిన మిక్కిలి గొప్ప వ్యంగ్య రచయితల్లో ఒకడిని – చేసింది."* ఫోరియర్ భవిష్యత్ సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంబంధించిన అద్భుతమైన అనేక భావాల కర్త కూడా. తన తొలి వ్యాసాల్లో ఒకదాంట్లో ఎంగెల్స్, ఫోరియర్ శాఖ విలువను యీ కింది మాటల్లో అభివర్ణించాడు: "శాస్త్రీయ పరిశీలన, నిగ్రహంతో కూడిన, నిష్పక్షపాతమైన, క్రమబద్ధమైన ఆలోచన, సూక్ష్మంగా చెప్పాలంటే – సామాజిక తత్వశాస్త్రం."** మార్క్స్ ఎంగెల్సుల చారిత్రక భౌతికవాదానికి ముందరిదైన యీ సామాజిక తత్వశాస్త్రం, అర్థశాస్త్ర విజ్ఞానశాస్త్రానికి ఫోరియర్ కూర్చిన దోహదానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

---

* Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. 3, Moscow, 1973, pp. 121—22.

** Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. I, Berlin, 1969, S. 483.

సామాజిక విజ్ఞానశాస్త్ర సాహిత్యంలో ఫోరియర్ రచనలు అసదృశమైనవి. అవి పాండిత్యంతో కూడిన పరిశీలనలేకాక, ఉత్సాహంతో తొణికిసలాడే పుస్తకాలు, ఊహాతీత మైనంతగా స్వకపోల కల్పితాలు. వాటిలో సముజ్వలమైన వ్యంగ్యం విచిత్రమైన నిగూఢ త్వంతోనూ, జోస్యప్రాయమైన దూరదృష్టి దాదాపు అర్థ రహితమైన అభూతకల్పనల తోనూ, విస్తృతమైన వివేకవంతమైన సాధారణీకరణలు భవిష్యత్సమాజంలో జీవితానికి సంబంధించిన వినుగు కలిగించే వర్ణనతోనూ సమ్మిళితంచెయ్యబడ్డాయి. ఫోరియర్ ప్రధాన రచనలు వెలువడి యిప్పటికి ఒకటిన్నర శతాబ్దాలు గడిచిపోయాయి. ఫోరియర్ రచనల్లోని నిగూఢత్వాన్నీ, ఆధారరహితమైన అభూత కల్పననీ, మానవ సమాజ రూపాంతరీకరణపై ఆయన విజమైన ఉజ్వల భావాలనుంచి జీవితమే వేరుచేసింది.

చార్లెస్ ఫోరియర్ బెజన్‌సాన్‌లో 1772లో జన్మించాడు. ఆయనకి తొమ్మిదేళ్ల వయస్సప్పుడు ధనిక వర్తకుడైన ఆయన తండ్రి చనిపోయాడు. కుటుంబంలో ఏకైక పుత్రుడైన ఫోరియర్‌కి, ఆయన తండ్రి సంపదలోనూ, వర్తకంలోనూ గణనీయమైన భాగం వారసత్వంగా లభించివుండేది. అయితే బాగా చిన్నతనంలోనే చార్లెస్ ఫోరియర్ తన పరిసరాలతోనూ, కుటుంబంతోనూ ఘర్షణపడ్డాడు. వాణిజ్యంలో యిమిడివున్న దగా మోసాలు పిల్లవాడైనా అతనిలో ఆగ్రహాన్ని రెచ్చగొట్టాయి.

ఫోరియర్ బెజన్‌సాన్ జెస్యూట్ కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు. విజ్ఞానశాస్త్రాల్లోనూ, సాహిత్య సంగీతాల్లోనూ ఆయన విశేషమైన ప్రతిభను వ్యక్తంచేశాడు. ఆ కళాశాలను వదిలాక సైనిక ఇంజనీరింగు విద్యాలయంలో ప్రవేశం కోసం ఆయన ప్రయత్నించాడు, కాని ఆ ప్రయత్నం విఫలమైంది. అప్పటినుండి ఫోరియర్ స్వయంకృషి ద్వారా మాత్రమే తన జ్ఞానాన్ని వృద్ధిచేసుకోగలిగాడు. ఆయన విద్యలో తీవ్రమైన అంతరాయాలు వున్నాయి. అవి ఆయన రచనలో ప్రతిఫలించాయి. ప్రత్యేకించి ఇంగ్లీషు, ఫ్రెంచి అర్థశాస్త్రజ్ఞుల రచనలను ఆయన యెన్నడూ ప్రత్యేకించి అధ్యయనంచెయ్యలేదు. ఆయనకి వారి భావాలతో బాగా ఆలస్యంగానే, అందునా, పత్రికావ్యాసాలు, సంభాషణల వంటి పరోక్ష ఆధారాల ద్వారా మాత్రమే, పరిచయమైంది. ఆర్థిక సిద్ధాంతాలను సవివరంగా విశ్లేషించేందుకైనా ఆయనెన్నడూ ప్రయత్నించలేదు. కాని వాటిని దుష్ట "నాగరిక వ్యవస్థ"గా, అంటే, పెట్టుబడిదారీ విధాన సమర్థనగా పరిగణించి, వాటికి సంబంధించిన భావననే అసలు తిరస్కరించేశాడు.

సుదీర్ఘమైన తగాదాల తర్వాత, తిరుగుబాటుచేసేందుకు ప్రయత్నించిన మీదట పద్దెనిమిదేళ్ల ఫోరియర్ కుటుంబ ఒత్తిడికి తలొగ్గి, లియోన్‌లోని ఒక పెద్ద వర్తక కంపెనీలో సహాయకుడుగా పనికి పూనుకోవలసివచ్చింది. తన జీవితంలో గణనీయమైన భాగాన్ని ఆ పారిశ్రామిక పట్టణంలోనే ఆయన గడపవలసివచ్చింది. లియోన్‌లోని

సామాజిక సంబంధాల పరిశీలన ద్వారానే ఆయన సామాజిక, ఆర్థిక భావాలు చాలవరకు ఉద్భవించాయి. 1792లో, తన తండ్రి వారసత్వంలో కొంతభాగం చేతికి వచ్చినతర్వాతనే ఫోరియర్ తన సొంత వ్యాపార సంస్థను మొదలుపెట్టాడు.

ఫోరియర్ యౌవనకాలంలోనే విప్లవం జరిగింది. అంతకు ముందు గొప్ప చారిత్రక ఘటనలు ఆయనకి అంతగా ఆసక్తి గొలిపినట్లు లేదు, కాని 1793వ సంవత్సరం ఆ యువ వ్యాపారస్తుని జీవితంలో గొప్ప మార్పును కలిగించింది. జాకొబిన్ కాన్వెంటుకి వ్యతిరేకంగా లియోన్‌లో జరిగిన తిరుగుబాటు క్రమంలో ఆయన తిరుగుబాటుదారుల శ్రేణిలోనూ, వాళ్ళు లొంగిపోయాక జైల్లోనూ వున్నాడు. ఆయన ఆస్తులన్నీ జప్తు చెయ్యబడ్డాయి. ఆయన జైలునుంచి బయటపడగలిగాడు. తర్వాత స్వస్థానమైన బెజన్‌సాన్‌కు తిరిగివెళ్ళాడు. యువ ఫోరియర్ విప్లవ ప్రతీఘాతంలోకి విశ్వాసరీత్యా కాక, పరిస్థితుల మూలంగానే యీడ్వబడ్డాడు. బహుశా ఆయన తిరుగుబాటు బలగాల్లోకి బలవంతాన నెట్టబడివుంటాడు. అయితే ఆయన త్వరలోనే విప్లవసైన్యంలో జేరి, రిపబ్లిక్ కోసం పద్దెనిమిది మాసాలపాటు కొలువుచేశాడు. ఆరోగ్య కారణాల మూలంగా (యావజ్జీవితం ఆయన ఆరోగ్యం వాసియైనదే) సైనిక కొలువునుండి పంపివెయ్యబడిన ఫోరియర్, ఒక వ్యాపార సంస్థలో ట్రావెలింగ్ ఏజెంటుగా కుదిరాడు. తర్వాత కొంత కాలానికి లియోన్‌లో చిన్న వర్తక దళారీ అయ్యాడు. ఈ కాలంలో ఆయన ఫ్రాన్సులో విస్తారంగా పర్యటించాడు. ఆ క్రమంలో డైరెక్టరీ, కాన్సలేట్‌ల కాలంలో ఆర్థిక, రాజకీయ జీవితం ఎలావున్నదీ పరిశీలించగలిగాడు. సామాజిక నిశ్శ్రేణిలో ప్రభువర్గపు ఉన్నత స్థానాన్ని యిప్పుడు, సైన్యానికి సరుకుల సప్లయ్‌దార్లు, స్పెక్యులేటర్లు, స్టాక్ బ్రోకర్లు, బ్యాంకర్లతో కూడిన నయా ధనికవర్గం ఆక్రమించింది. "నాగరిక వ్యవస్థ" ప్రవేశించిన కొత్త దశ, జనానికి కొత్త కష్టాలనూ కడగండ్లనూ మాత్రమే తెచ్చి పెట్టింది.

ముప్పయ్యేళ్ళు వచ్చేసరికి, తన జీవిత గమ్యం సామాజిక సంస్కర్త కావడమేనన్న నిర్ణయానికి వచ్చాడు ఫోరియర్. ఆయనే పేర్కొన్నట్లు, తను చూసిన ఆర్థిక అవకతవకలను గురించి ఆయన చేసిన ఆలోచనల ప్రత్యక్ష పర్యవసానంగానే యీ నమ్మకం ఆయనలో గాఢంగా నాటుకుంది. 1803 డిసెంబరులో ఒక లియోన్ పత్రికలో ఆయనొక చిన్న వ్యాసాన్ని ప్రచురించాడు. "సార్వత్రిక సామరస్యం" అన్న ఆ వ్యాసంలో ఆయన తన అసాధారణమైన "ఆవిష్కరణ"ను గురించి వెల్లడించాడు. ఇతర విజ్ఞాన శాస్త్రజ్ఞులు "పదార్థిక చలన నియమాలను" కనుగొన్నట్లుగా — ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల పద్ధతుల ప్రాతిపదికపై "సామాజిక చలన నియమాలను" తను బహిర్గతం చేస్తానని (లేక అంతకు ముందే బహిర్గతం చేశానని) — ఆయన రాశాడు. "నాలుగు

చలనాల సిద్ధాంతమూ, సాధారణ భవితవ్యాలు" అన్న శీర్షికతో కర్త పేరులేకుండా లియోన్‌లో ప్రచురింపబడిన ఒక పుస్తకంలో ఫోరియర్ భావాలు మరింత సమగ్రంగా వివరింపబడ్డాయి.*

ఈ రచన రూపం ఎంత చిత్రమైనదైనప్పటికీ, దానిలో ఫోరియర్ "సమాజీకృత ప్రణాళిక"కు ప్రాతిపదికలు, అంటే, బూర్జువా సమాజాన్ని భవిష్యత్ "సమరస వ్యవస్థ"గా పరివర్తితం చేసేందుకు ఆయన ప్రణాళికా ప్రాతిపదికలు యిమిడివున్నాయి. పెట్టుబడిదారీ విధానాన్ని మానవజాతి సహజ, శాశ్వత స్థితిగా పరిగణించిన తత్వవేత్తలకూ, అర్థికశాస్త్రవేత్తలకూ భిన్నంగా ఫోరియర్ యిలా చాటిచెప్పాడు: "ఈలోగా, తనతోబాటు యిన్ని కష్టాలనూ కడగండ్లనూ తెచ్చిన యీ నాగరిక వ్యవస్థ కన్న లోపభూయిష్ఠమైనది మరొకటేమి వుండగలదు? దాని ఆవశ్యకత, దాని శాశ్వతత్వం కన్న మరింత అనుమానాస్పదమైనది మరొకటి ఏం వుండగలదు? సామాజికాభివృద్ధిలో అది కేవలం ఒకదశ మాత్రమే అవడం సంభావ్యం కాదా?"** "సమాజీకృత వ్యవస్థ... నాగరిక వ్యవస్థ అనంగతత్వం స్థానాన్ని ఆక్రమిస్తుంది..."***

ఫోరియర్ పుస్తకం దాదాపు గమనింపబడనే లేదు, అయినా అది ఆయన ఉత్సాహాన్ని మందగింపజెయ్యలేదు. ఆయన తన భావాలను అభివృద్ధిచేసుకోడాన్ని కొనసాగించాడు. 1811లో ప్రభుత్వోద్యోగమూ, 1812లో తన తల్లి మరణానంతరం ద్వారా కొద్దిపాటి పెన్షనూ లభించడంతో ఆయన ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగయాయి. 1816–1822 దశలో ఆయన లియోన్‌కి ఎక్కువ దూరంలో లేని ప్రాంతంలో నివసించాడు. ఆయనకి అనుయాయులు ఏర్పడనారంభించారు. ఆయన జీవితంలో మొట్టమొదటిసారిగా సాపేక్షంగా శాంతియుతమైన వాతావరణంలో ఆయన అధ్యయనంచెయ్యగలిగాడు. ఈ అధ్యయన ఫలితంగా 1822లో పారిస్‌లో "గృహం, భూమి, సంఘాన్ని గురించిన సిద్ధాంతం" అనే శీర్షికతో ఓ పెద్ద గ్రంథం వెలువడింది. ఫోరియర్ మరణానంతరం

---

* ప్రకృతియొక్క, మానవాళియొక్క నియమాలను వివరించేందుకుగాను నాలుగు రకాల చలనాన్ని అధ్యయనంచెయ్యడం అవసరమని ఫోరియర్ విశ్వసించాడు. అవి: పాదార్థిక, జీవ, జంతు, సామాజిక చలనాలు. ఇటువంటి అనిశ్చిత క్రమీకరణకూ, వర్గీకరణకూ ఉదాహరణలు — ఫోరియర్‌కు వాటిపట్ల మక్కువ — ఆయన రచనల్లో కొల్లలుగా కనిపిస్తాయి.

** *Oeuvres complètes de Charles Fourier*, t. I, Paris, 1846, p. 4.

*** అదే గ్రంథం, పేజి 9.

వెలువడిన ఆయన రచనల సంపుటాల్లో యీ పుస్తకం "సార్వత్రిక సమైక్య సిద్ధాంతం" అనే శీర్షికతో ప్రచురింపబడింది.

కార్మిక సంఘాల నిర్మాణాన్ని గురించి విపులీకరించేందుకూ, నికరంచేసేందుకూ ఫోరియర్ ప్రయత్నించాడు. వాటికి ఆయన "*phalanxes*" అని పేరుపెట్టాడు. ఫలాంక్స్‌లు నివసించే, పనిచేసే, తమ విశ్రాంతి కాలాన్ని సరదాగా గడిపే భవనాలకు ఆయన "*phalanstere*" అని పేరుపెట్టాడు. ప్రయోగాత్మకమైన ఫలాంక్స్‌లు, అమల్లోవున్న సామాజిక వ్యవస్థలో ఎటువంటి మార్పూ లేకుండానే, వెన్వెంటనే స్థాపించెయ్యబడతాయని ఫోరియర్ ఆశించాడు. ఆయన పారిస్‌లో నివసిస్తూవుండిన కాలంలో ప్రతిరోజూ ఒక నిర్దిష్టమైన వేళలో, సంపన్న దాతలను కలుసుకునేందుకోసం యింటిదగ్గర వేచి వుంటూండేవాడు. వాళ్ల విరాళాలతో ఫలాన్‌స్టేర్లను నిర్మించవచ్చునని అమాయకంగా ఆశించేవాడు. సహజంగానే అటువంటి సంపన్నదాతలు ఎవరూ రాలేదు.

ఫోరియర్ మరోమారు పారిస్, లియోన్‌లలో ఆఫీసు పని చేసి తన జీవికను సంపాదించుకోవలసివచ్చింది. మిత్రుల, అనుయాయుల ధనసహాయం ద్వారా 1828లో మాత్రమే, ఆయన ఈ హేయమైన పరాధీనపు బతుకునుండి బయటపడగలిగాడు. ఆయన బెజన్‌సాన్‌కి తిరిగివెళ్లి, తను కొన్ని యేళ్లుగా కృషిచేస్తున్న పుస్తకాన్ని పూర్తి చేశాడు. "కొత్త ఆర్థిక సమాజీకృత ప్రపంచం" (1829) అన్న యీ పుస్తకమే ఆయన రచనల్లోకెల్లా మణిపూస. ఆయన తొలి సాహిత్య వ్యాసాలు వెలువడి అప్పటికి సావు శతాబ్దం పూర్తి అయింది. పెట్టుబడిదారీ విధానాభివృద్ధి ఆయన విమర్శకు బోలెడంత కొత్త సమాచారాన్ని సమకూర్చింది. అదే సమయంలో ఫోరియర్ భవిష్యత్సమాజంపైన ఆన అభిప్రాయాలను అభివృద్ధిచేసి, తన వెనుకటి నిగూఢత్వం లేకుండా, వాటిని మరింత సుబోధకమైన రూపంలో విపులీకరించాడు.

తన జీవితపు చివరి సంవత్సరాలను ఆయన పారిస్‌లో గడిపాడు. ఆయన కష్టపడి పనిచెయ్యడం కొనసాగించాడు. తన రోజువారీ పనికోటాను కర్మయోగి మాదిరిగా కచ్చితంగా పూర్తిచేస్తూండేవాడు. ఆ కృషి ఫలితంగా మరో పెద్ద పుస్తకం, వివిధ ఫోరియరిస్టు పత్రికల్లో వ్యాసపరంపర, ఆయన మరణానంతరం ప్రచురింపబడిన అనేక పెద్ద రాతప్రతులూ తయారయ్యాయి. ఈ రచనల్లో ఆయన సామాజిక, ఆర్థిక, నైతిక, ప్రవర్తన, విద్యాబోధనశాస్త్ర, తదితర రంగాలకు సంబంధించిన విస్తృత సమస్యలను పరిశీలించాడు. ఆయన ఆరోగ్యం బాగా క్షీణించినప్పటికీ, ఆయన బుద్ధి నిరంతరాయంగా, గొప్ప సృజనాత్మక శక్తితో పనిచేసింది. చార్లెస్ ఫోరియర్ పారిస్‌లో 1837 అక్టోబరులో మరణించాడు.

1830 నాటికి అప్పుడే ఫోరియరిస్టు ఉద్యమం గణనీయమైన స్థాయిలో వుంది.

అయితే ఫోరియర్ మాత్రం, తన చివరి సంవత్సరాల్లో చాలా ఒంటరితనం అనుభవించాడు. ఆయన సాహసికబోధనను ఒక చచ్చు, సంస్కరణవాద బోధనగా నీళ్లకార్చ ప్రయత్నించిన శిష్యులు చాలామందికి ఆయన అంతకంతకు దూరమయాడు. ఆయన స్వభావంతో వరిపెట్టుకోవడం చాలమందికి దుర్ఘటంగా వుండేది. ముసలితనం, అనారోగ్యం ఆయన సంశయాత్మక, అనుమాన ప్రవృత్తినీ, మొండి పట్టుదలనూ తీవ్రంచేశాయి.

బూర్జువా లోకజ్ఞానం దృష్ట్యా ఫోరియర్, సెంట్ సైమన్ మాదిరిగానే దాదాపుగా పిచ్చివాడు. చతురభాషులు యీ గొప్ప ఊహాజనిత సోషలిస్టుల యింటిపేర్లతో శ్లేషక్రీడ ఆడారు: saint — పవిత్ర, fou — పిచ్చివాడు అయితే ఆయన ఫ్రెంచి కవి బెరంజేచేత వర్ణింపబడిన పిచ్చివాళ్లలో ఒకడు:

"పెద్దమనుషులారా, మీ యీ లోకం
సత్య పథాన్ని ఆవిష్కరించలేకపోతే
మానవాళికి స్వర్ణ స్వప్నాన్ని ప్రసాదించే
పిచ్చివాడికివే జోహార్లు!"

చార్లెస్ ఫోరియర్ దృష్టిలో, ఆయన ఏ ప్రపంచంలో జీవించి, పనిచేశాడో ఆ ప్రపంచమే పిచ్చిది.

ఈ పిచ్చి ప్రపంచం

మానవ సమాజాభివృద్ధి చారిత్రక నియమక్రమాన్ని చిత్రించేందుకు ఫోరియర్ ప్రతిభావంతమైన ప్రయత్నం చేశాడు. ఆయన మానవజాతి చరిత్రను, భూమిపై దాని ఆవిర్భావంనుంచి భవిష్యత్ సమరస సమాజందాకా యీ కింది విధంగా చిత్రించాడు:

ఉత్పత్తి కృషి ముందరి దశలు	1. ఈడెన్ పేరుగల ఆదిమ దశ 2. ఆటవిక దశ, లేక కృషి రాహిత్యం
ఛిన్నాభిన్న, నకిలీ, అసహ్యకర ఉత్పత్తి	3. పితృస్వామిక దశ, సన్నకారు ఉత్పత్తి 4. అనాగరిక దశ, మధ్యతరహా ఉత్పత్తి 5. నాగరిక దశ, భారీ ఉత్పత్తి
సమాజీకృత, న్యాయ, ఆకర్షణీయ ఉత్పత్తి	6. గ్యారంటీయిజం, అర్ధ సంఘం 7. సమాజీకరణవాదం, సరళ సంఘం 8. సామరస్యవాదం, సంకీర్ణ సంఘం

ఫోరియర్ నాగరికతను నాలుగు దశలుగా విభజిస్తాడు. మొదటి రెండూ మౌలికంగా, బానిసయాజమాన్య, ఫ్యూడల్ వ్యవస్థలు, కాగా, మూడవది, ఫోరియర్ కాలంనాటి స్వేచ్ఛాయుత పోటీ పెట్టుబడిదారీ విధానం.

ఇక్కడ మనం ఒక విషయాన్ని చూడవచ్చు. ఫోరియర్ మానవ సమాజాభివృద్ధి ప్రధాన దశలను నిర్వచించడమే కాకుండా, వాటిని, ఆ దశల్లో ప్రతిఒకదాని ఉత్పత్తి స్థాయికీ లంకె పెట్టాడు. ఆ విధంగా చెయ్యడం ద్వారా ఆయన, మార్క్స్ ప్రవేశ పెట్టిన సామాజిక, ఆర్థిక నిర్మాణాల భావనకు మార్గాన్ని సుగమం చేశాడు. సమాజ చరిత్ర అవగాహనలోనే ఫోరియర్ గొప్పతనం అతి స్పష్టంగా ప్రస్ఫుటమైందని ఎంగెల్స్ రాశాడు.

నాగరికత నాలుగవ దశను ఆయన పరిశీలించిన తీరు, ఫోరియర్ అత్యుత్తమ జోస్యాలలో ఒకటి: ఆయన ఒకమాదిరి విచిత్ర రూపంలోనే అయినా, గుత్త దశలోకి — దీన్ని ఆయన వర్తక ఫ్యూడలిజం అన్నాడు — పెట్టుబడిదారీ విధానపు పరివర్తనను ఆయన ముందుగా దర్శించాడు. గతితార్కిక ఆలోచన విషయంలో అద్భుతమైన ప్రజ్ఞను ప్రదర్శించి, స్వేచ్ఛాయుత పోటీ సహజంగానే తనకు తానే వ్యతిరేకిగా మారి, గుత్తాధికారానికి దారితీస్తుందని ఫోరియర్ నిరూపించాడు. ఈ గుత్తాధికారాన్ని ప్రధానంగా, ''కొత్త ఫ్యూడల్ ప్రభువుల''చేత వర్తకపు, బ్యాంకింగు గుత్తకరణ రూపంలో ఆయన చిత్రించాడు.

ఫోరియర్ పెట్టుబడిదారీ విధానాన్ని — దీన్ని ఆయన తలకిందులు ప్రపంచం అని పిలిచాడు — నేరారోపణ పత్రంతో చిత్రించాడు. ఆ కాలానికి అది, సాహసంలోనేమి, లోతులోనేమి సాటి లేనిది. దాని ప్రాధాన్యం యీనాటికీ పాక్షికంగా మిగిలివుంది. అయితే యిది ఫోరియర్ బలమే కాకుండా, బలహీనత కూడా. పెట్టుబడిదారీ విధానపు నేరాలను చిత్రించడంలో, వాటికి గల మూలకారణాన్ని ఆయన ఆవిష్కరించలేకపోయాడు. ఉత్పత్తి సంబంధాల విషయంలోనూ, బూర్జువా సమాజపు వర్గ నిర్మితి విషయంలోనూ ఆయనకి స్పష్టమైన అవగాహన లేకపోవడమే యిందుకు కారణం. సెంట్ సైమన్ మాదిరిగానే ఫోరియర్ కూడా, పరిశ్రమదారులూ, కూలి శ్రామికులూ ఒకే శ్రమించే వర్గం అని అభిప్రాయపడ్డాడు.* అందుచేతనే, సమాజపు శాంతియుత పరివర్తనావకాశంపట్ల ఆయన అమాయక భావవాద విశ్వాసం. ఆయన యీ విశ్వాసానికి ఆయన తర్కం, ప్రత్యేకించి ఆయన సిద్ధాంతానికి ఆనాడు అధికారంలో వున్నవాళ్ల ఆమోద ముద్ర లభించటం దోహదంచేశాయని చెప్పవచ్చు.

---

* ఫ్యాక్టరీ యజమానులను ఆయన ''సామాజిక పరభాగ్యోపజీవుల'' బృందంలో

బతుకు తెరువుకోసం గత్యంతరం లేక వాణిజ్య రంగంలోకి దిగవలసిన ఫోరియర్‌కి పెట్టుబడిదారీ వర్తకమంటే తీవ్రమైన ద్వేషం ఏర్పడింది. ఆయన రచనల్లో వందలాది పేజీలు వర్తకప్పు, వర్తకుల దుర్లక్షణాలను గురించి, కుయుక్తులను గురించి, నీచత్వం గురించి వర్ణించేందుకు వినియోగింపబడ్డాయి. వర్తక పెట్టుబడినీ, డబ్బు పెట్టుబడినీ బూర్జువా సమాజంలో దోపిడికీ, పరభాగ్యోపజీవనానికీ మూలకారణంగా ఆయన పరిగణించాడు. వర్తక పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడికి రూపాంతరం మాత్రమేననీ, దానికి ఎంతటి స్వీయ ప్రాముఖ్యం వున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానంలో అది ఉప పాత్రను మాత్రమే వహిస్తుందన్న విషయాన్ని ఫోరియర్ గమనించలేదు.

ఫోరియర్ పెట్టుబడిదారీ ఉత్పత్తిని సాంఘిక వ్యతిరేకమైనదిగా, అసంబంధితమైనదిగా, అతుకుల బొంతవంటిదిగా వర్ణిస్తాడు. ఏ అర్థంలో? బూర్జువా ఉత్పత్తి ఏకైక లక్ష్యం పరిశ్రమదారు లాభమేగాని సమాజావసరాలను తీర్చడం కాదు. అందు చేత, సరకుల విడి ఉత్పత్తిదారుల ప్రయోజనాలకూ, సమాజ ప్రయోజనాలకూ మధ్య వైరుధ్యం పెట్టుబడిదారీ విధానపు నిరంతర లక్షణం. పరిశ్రమదారుల మధ్య పోటీ, అర్థికశాస్త్రవేత్తలు చెప్పున్నట్లు, సమాజ ప్రయోజనాలకు దోహదం చెయ్యదు, తద్భిన్నంగా, ఉత్పత్తిలో అరాజకత్వాన్నీ, అయోమయస్థితినీ, ఎవడికివాడే చిన్న నా బొజ్జకు శ్రీరామరక్ష అనుకొనే వాతావరణాన్నీ సృష్టించడం ద్వారా, దాన్ని అది నాశనం చేస్తుంది. లాభాలవేటా, పోటీ పరుగూ వేతన కార్మికులను దారుణంగా దోచుకోడానికి దారితీస్తుంది. ఇంగ్లండు రాకాసి ఫ్యాక్టరీల్లో పెద్దలూ, పిన్నలూ అతి నికృష్టమైన వేతనానికి గాడిద చాకిరీ చేసే ఉదాహరణను చూస్తే పెట్టుబడిదారీ విధానం ఎక్కడికి పోతోందో తెలుస్తుంది.

సంపదకీ దారిద్ర్యానికీ మధ్య పెరిగిపోతున్న అగాధాన్నీ, సౌభాగ్యం మధ్య పేదరికాన్నీ, స్వేచ్ఛాయుత పోటీ సూత్రం పునాదిగా కలిగిన బూర్జువా అర్థశాస్త్రపు అనివార్య పతనానికి ముఖ్యమైన ఒక రుజువుగా ఫోరియర్ పరిగణించాడు. సిస్మాండీ కనీసం ఈ యథార్థాలను గుర్తించాడు, తద్వారా "నిర్మాగమాటమైన విశ్లేషణ దిశగా ఆయన తొలి అడుగు" వేశాడు, కాని "పాక్షిక గుర్తింపు"ను మించి ఆయన ముందుకు వెళ్లలేదు అని రాశాడు ఫోరియర్. అయితే, సిస్మాండీతో వాదించడంలో సేయ్, అర్థశాస్త్ర ప్రామాణికత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నించాడు గాని, ఆ పని చెయ్యలేకపోయాడు.

చేర్చిన మాట నిజమే, కాని, వాళ్లలో "ఓ సగం మంది" నాసి రకం వస్తువులను ఉత్పత్తిచేసి, సమాజాన్నీ, ప్రభుత్వాన్నీ మోసగించిన మేరకే ఆయన వాళ్లను అలా వర్గీకరించాడు.

అర్థశాస్త్రజ్ఞులపైన ఫోరియర్ చేసిన ఘాటైన విమర్శల్లో యీ కిందది ఒకటి: ''అర్థశాస్త్రజ్ఞులతో మొదలుపెట్టి కుతర్కం చేసేవాళ్లలో ఎంతమంది పరభాగ్యోప జీవులున్నారు? ఏ పరభాగ్యోప జీవుల కేతనాన్నైతే తాము భుజాన వేసుకు తిరుగుతారో వాళ్లకు వ్యతిరేకంగా అర్థరహితమైన ఆడంబర వ్యాఖ్యలతో సరిపెట్టుకుంటారు యీ అర్థశాస్త్రజ్ఞులు.''*

అంతిమ విశ్లేషణలో, శ్రమ, దాని నిర్మాణ, ఉత్పాదకతలే సమాజపు నిర్మాణాన్నీ, సంక్షేమాన్నీ నిర్ణయిస్తాయి. ఈ విషయాన్ని గ్రహించిన ఫోరియర్, పెట్టుబడిదారీ విధానంలో శ్రమ ఏ విధంగా స్వాహాచెయ్యబడుతోందో, బానిసగా చెయ్యబడుతోందో అపూర్వమైన పద్ధతిలో చిత్రిస్తాడు. ''నాగరికతా వ్యవస్థ'' శ్రమను మనిషి సహజ కార్యకలాప స్థితినుంచి, ఆనందానికి మూలకందమైన స్థితినుంచి, ఒక శాపంగా, ఒక దుఃఖ హేతువుగా మార్చివేసింది. ఈ సమాజంలో చేతనైన ప్రతివాడూ సక్రమ పద్ధతుల్లోనో అక్రమ పద్ధతుల్లోనో పనినుండి తప్పించుకుంటాడు. సన్నకారు పరిశ్రమ యజమాని — రైతు, వృత్తి పనివాడు లేక చివరకు పరిశ్రమదారు — శ్రమ అన్నది, పోటీదార్లతో, భద్రతా రాహిత్యంతో, పరాధీనతతో ఘర్షణే, కాని కూలి శ్రామికుని శ్రమ సాటిలేనంత కష్టతరమైనది. అది నిర్బంధ శ్రమ, ఏమాత్రమూ తృప్తి కలిగించజాలని శ్రమ. ఉత్పత్తి పెరుగుదలతో, ఉత్పత్తి కేంద్రీకరణతో, భారీ పెట్టుబడికి లోబరచబడివుండటంతో, యీ మాదిరి శ్రమ అంతకంతకు అధికంగా ప్రాబల్యం వహిస్తుంది.

మార్క్స్ తన తొలి రచనలు అనేకంలో అన్యథాకరణ భావనను అభివృద్ధిచేశాడు. పెట్టుబడిదారీ సమాజంలో, తన శ్రమ ఫలితాలనుంచి, సమాజ భవితవ్యంనుంచి మనిషి అన్యథాకరణే యిది. పారిశ్రామిక క్షుద్ర దేవతకు నిస్సహాయమైన సత్తరకాయగా మనిషి పరివర్తనే యిది. నిస్సందేహంగా మనకు యిక్కడ ఫోరియర్ చిన్నెలు కనిపిస్తాయి. మార్క్స్ అన్యథాకరణ సమస్యను ఒక ఖండికలో ఫోరియర్ పేరుతో నేరుగానే ముడిపెడతాడు.**

పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక లోపాలను మాత్రమే గాక, దాని రాజకీయాలను, నీతులను, సంస్కృతిని, విద్యావిధానాన్ని కూడా ఫోరియర్ దయ్యబడతాడు. స్త్రీలకూ పురుషులకూ మధ్య సహజమూ, మానవతాపూర్ణమూ అయిన సంబంధాలను పెట్టు

---

* Charles Fourier, *Oeuvres choisis*, Paris, 1890, pp. 64—65.

** Karl Marx and Frederick Engels, *Collected Works*, Vol. III, pp. 293—94.

బడిదారీ విధానం ఎలా వంకిలంచేసి, స్త్రీలను ఏ విధంగా నిమ్న, పీడిత స్థానంలో అట్టే పెడుతుందో ఆయన ప్రత్యేకించి విస్తారంగానూ, మంటతోనూ రాశాడు.

సరే యిప్పడిక, ఫొరియర్ చేసిన సామాజికాభివృద్ధి దశల వర్గీకరణ పట్టీని తిరిగి పరిశీలిద్దాం. నాగరికతకూ, సామరస్యవాదానికీ మధ్య ఆయన రెండు పరివర్తన దశలను పెట్టాడు. వాటికి ఆయన గ్యారంటీయిజం, సమాజీకరణవాదం (sociantism) అని పేర్లు పెట్టాడు. నాగరికతా వ్యవస్థలో ఏవో కొన్ని పాక్షిక సంస్కరణలు చెయ్యడం కాక, యీ వ్యవస్థను రూపుమాపడం, దానికి మౌలికంగా భిన్నమైన సమాజాన్ని సృష్టించడమే తన లక్ష్యం అని తరచుగా ఆయన పేర్కొన్నాడు. అయినాకూడా ఫొరియర్ విప్లవాత్మక పరివర్తన పంథాను తోసిపుచ్చాడు, దానిలో యిమిడివున్న బృహత్తరమైన కష్టాలను గుర్తించాడు, తత్పర్యవసానంగా రాజీపడేందుకు సిద్ధపడ్డాడు, సామరస్యాన్ని సృష్టించుకొవేందుకుగాను నాగరిక దశ జనం కొద్దిగొప్పల్లో చాలకాలం వేచివుండాల్సి వుంటుందని సమ్మతించాడు.

మొదటి పరివర్తన దశ అయిన గ్యారంటీయిజం మౌలిక లక్షణాలను ఆయన రేఖా మాత్రంగా యిలా చిత్రించాడు. వ్యక్తిగత స్వామ్యం గణనీయంగా మారదు, అయితే సమష్టి ప్రయోజనాలకూ, అజమాయిషీకీ అది లోబరచబడుతుంది. ఉమ్మడి శ్రమ కోసం, అలాగే భోజనాలు, విశ్రాంతి వగైరాల కోసం కూడా కుటుంబ బృందాల వేర్వేరు సంఘాలు తలెత్తుతాయి. ఈ సంఘాల్లో శ్రమ పెట్టుబడిదారీ కూలిశ్రమ లక్షణాలను క్రమంగా కోల్పోతుంది. ఆర్థిక అసమానత్వం యింకా అట్టేవుంటుంది. పోటీపైన సమాజపు అజమాయిషీ వుంటుంది, అది సరసమూ, సరళమూ అవుతుంది. గొప్ప సామాజిక పథకాలు చేబట్టబడుతాయి. ప్రత్యేకించి మురికివాడల నిర్మూలన వంటివి. పట్టణాలు కొత్త పథకం మేరకు తిరిగి తీర్చిదిద్దబడుతాయి. ఫొరియర్ యితర ఊహాస్వర్గాలు అన్నింటి మాదిరిగావే గ్యారంటీయిజానికి కూడా, రాజకీయ నిర్మాణంలో విస్తృతమైన మార్పుల అవసరం లేదు. నిరంకుశ లేక రాజ్యాంగబద్ధ రాజరికంలో, రిపబ్లిక్‌లో, లేక ఏ యితర వ్యవస్థలోనైనా సరే అది ఆరంభం కావచ్చు.

నాగరికతా వ్యవస్థలోపల గ్యారంటీయిజంయొక్క కొన్ని పూర్వావసరాలు అప్పడే అభివృద్ధిచెందుతున్నాయి, "నాగరికతా వ్యవస్థ మేధా ప్రతిభ" యీ దిశగా కదులుతోంది. ప్రజల భ్రమలూ, ప్రత్యేకించి బూర్జువా సామాజిక శాస్త్రాల ప్రభావం మాత్రమే గ్యారంటీయిజానికి పరివర్తనను విరోధించాయి. మరోవంక, గ్యారంటీయిజం నెలకొన్నప్పుడు, నూతన సామాజిక వ్యవస్థ ప్రయోజనాలను మానవజాతి త్వరలోనే తెలుసుకొంటుంది, పూర్తి సహకార వ్యవస్థకు అది సన్నద్ధమవుతుంది.

అయితే, ఫొరియర్ గ్యారంటీయిజాన్ని మరో విధంగా చూడటం కూడా సాధ్యమే.

పెట్టుబడిదారీ వ్యవస్థను మెరుగొనర్చి దాన్ని "సహించదగినది"గా చేసేందుకు ఒక సంస్కరణ విధానంగానేగాని, దాని రద్దుకు సన్నాహకంగా కాదు. అలా చూసినప్పుడు ఫోరియర్ సిద్ధాంతం సర్వసామాన్యమైన సంస్కరణవాదంగా మారిపోయి, బూర్జువా "సంక్షేమ రాజ్యపు" ఆధునిక భావాచరణలను ఉత్పన్నంచేసిన భావాల సరసన చోటుచేసుకుం టుంది. తన భావాలకు అటువంటి భాష్యం చెప్పడాన్ని ఫోరియర్ స్వయంగా ఖండించి వుండేవాడు. అయితే ఆయన అనుచరుల్లో చాలామంది సరిగా యీ పనే చేశారు.

1830 దశకంలోనూ, అంతకన్న తక్కువ మేరకు 1840 దశకంలోనూ ఫ్రాన్సులో ప్రధానమైన సోషలిస్టు ధోరణి ఫోరియరిజమే, సెంట్ సైమనిజం కన్న ఎక్కువ జీవశక్తి కలిగినదిగా అది రుజావుచేసుకుంది. సెంట్ సైమనిజంలో వున్న మతపర, ఒంటెత్తు స్వభావం దానిలో లేకపోవడం, మరింత తక్షణ, వాస్తవిక ఆదర్శాలను, ప్రత్యేకించి ఫలాంక్స్‌ల రూపంలో, ఉత్పత్తిదారుల – వినిమయదారుల సహకార సంఘాలను అది ముందుకుతేవడమే యిందుకు కారణం. అయితే, ఫోరియర్ సిద్ధాంతానికి ఫ్రెంచి కార్మికవర్గంలో అంతగా తోడ్పాటు లేదు, అది ప్రధానంగా యువ మేధావుల మధ్యనే విస్తృతంగా వ్యాపించింది.

1848 విప్లవం ఫోరియరిస్టులను రాజకీయ కార్యాచరణ రంగంమీదకి తెచ్చింది. వాళ్ళు దాంట్లో పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాదానికి సన్నిహితమైన వైఖరిని అవలం బించారు. వాళ్ళు జూన్ ప్రజా విప్లవాన్ని బలపరచలేదు. మరో ఏడాది తర్వాత లూయీ బోనపార్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రయత్నించారు, కాని తేలికగా అణచివెయ్యబడ్డారు. ఫ్రాన్సులో ఉండిపోయిన కొద్దిమంది ఫోరియరిస్టులూ దరి మిలా పరపతి సంఘ కార్యకలాపాల్లో నిమగ్నులయారు. ఫోరియరిజం చారిత్రక పాత్ర ముగిసిపోయింది. ఫోరియర్, తనకు తెలియకుండానే అయినా, ప్రధానంగా కార్మికవర్గ ప్రయోజనాలనే వ్యక్తంచేసినప్పటికీ, ఆయన అనుయాయులు పెటీ, మధ్యబూర్జువా వర్గ వైఖరిని అవలంబించారు.

చారిత్రక రంగంమీదకు ఒక నూతన విప్లవాత్మక ప్రపంచ దృక్పథమైన శాస్త్రీయ కమ్యూనిజం, శ్రామికవర్గ పార్టీల అవతరణను చాటిచెప్పిన "కమ్యూనిస్టు ప్రణాళిక," దానితోబాటే ఊహాజనిత సోషలిజానికి, ప్రత్యేకించి ఫోరియరిజానికి చావు గంటను కూడా మోగించింది. మార్క్స్ ఎంగెల్సులు యిలా రాశారు: "విమర్శనాత్మక ఊహా జనిత సోషలిజం, కమ్యూనిజంల ప్రాముఖ్యానికీ, చారిత్రకాభివృద్ధికీ మధ్య విలోమ సంబంధం వుంటుంది. ఆధునిక వర్గపోరాటం అభివృద్ధి అయ్యేకొద్దీ, పోరాటానికి దూరంగా ఉండటమూ, పోరాటాన్నే ఖండించడమూ ఊహాలోకపు ఆకాంక్షలు ఆచరణరీత్యా విలువా కోల్పోతాయి, సిద్ధాంతరీత్యా అసమర్థనీయమూ ఔతాయి. అందువల్ల యీ

సిద్ధాంతాల కర్తలు అనేక విషయాల్లో విప్లవకారులుగా వుండినప్పటికీ, వాళ్ల శిష్యులు ప్రతిచోటా ప్రగతి విరోధక ముఠాలుగా మాత్రమే వున్నారు. శ్రామికవర్గపు ప్రగతిశీల చారిత్రకాభివృద్ధికి వ్యతిరేకంగా వీళ్లు తమ గురువుల మూలాభిప్రాయాలనే గట్టిగా పట్టుకుంటారు. అందువల్ల వీళ్లు నిరంతరంగా వర్గపోరాటాన్ని నిర్వీర్యం చెయ్యడానికీ, వర్గవైరుధ్యాలకు రాజీ పొసిగించడానికీ కృషిచేస్తారు — ఆ చేయడంలో యే మినహాయింపులూ వుండవుకూడా. ప్రయోగాల ద్వారా తమ ఊహాస్వర్గ సమాజాలు సాధించాలని — విడి 'ఫలాన్‌స్టీర్లు' స్థాపించాలనీ వీళ్లు యింకా కలలు కంటూనే వుంటారు. ఈ ఆకాశహర్మ్యాలన్నింటినీ సాధించడానికి వీళ్లు బూర్జువాల భూతదయకూ, డబ్బు సంచులకూ విజ్ఞప్తులు చేయక తప్పదు."*

భవిష్యత్ సామాజిక స్వరూపం

సెంట్ సైమన్ భవిష్యత్ సామాజిక వ్యవస్థ ఉజ్వల రేఖాచిత్రాన్ని వదలగా, ఫోరియర్ గొప్ప దూరదృష్టితో దాని వివరాలను రూపొందించాడు. ఈ రెండు ఊహాస్వర్గాలూ ఒకదానితో ఒకటి అనేక విధాల విభేదిస్తాయి. కాని వాటిమధ్య ముఖ్యమైన ఉమ్మడి లక్షణం ఒకటుంది: వ్యక్తిగత స్వామ్యమూ, అనార్జిత ఆదాయమూ యింకా ఉన్న ఒక సోషలిస్టు సమాజాన్ని వాళ్లు చిత్రించారు. అయితే, ఆ రెండు విధానాల్లోనూ కూడా వ్యక్తిగత స్వామ్యం తన స్వభావాన్ని మౌలికంగా మార్చుకొని, సమష్టి ప్రయోజనాలకు తలొగ్గవలసివుంటుంది. అనార్జిత ఆదాయం అర్జిత ఆదాయ లక్షణాలను క్రమంగా సంతరించుకోవలసివుంటుంది.

ఈనాడు, సెంట్ సైమన్, ఫోరియర్‌ల ఊహాస్వర్గాలు రెండూ కూడా తమ సొంత పద్ధతిలో విలువైనవే. సెంట్ సైమన్ రచనల్లోనూ, ఆయన అనుయాయుల రచనల్లోనూ కేంద్రీకృత ప్రణాళికాబద్ధ జాతీయార్థిక వ్యవస్థ, సమష్టి సూత్రాలపైన దాని నిర్వహణా విధానం ప్రత్యేకించి ఆసక్తిదాయకమైనవి. ఫోరియర్ రచనల్లో — సోషలిస్టు సమాజంలో వేర్వేరు విభాగాల్లో శ్రమయొక్క, జీవితంయొక్క సంఘటన విశ్లేషణ ఆసక్తికరమైనది.

ఫోరియర్ ఊహాస్వర్గపు ఆర్థిక పార్శ్వాన్ని పరిశీలిద్దాం. ఫలాన్‌క్స్ అన్నది ఉత్పత్తి

---

* Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. I, pp. 135—36.

దారుల — వినిమయదారుల ఒక సంఘం. దీనిలో మామూలు జాయింట్ స్టాక్ కంపెనీ లక్షణాలతోబాటు కమ్యూన్ లక్షణాలు యిమిడివుంటాయి. ఫలాన్క్స్‌లో వివిధ కార్యకలాపాల్లో నిమగ్నులయ్యేవారి సంఖ్య, వారి పిల్లలతో కూడా కలిపి, 1,500నుండి 2,000దాకా వుంటుంది. అటువంటి సమష్టి సంఘంలో జనంయొక్క యిష్టానిష్టాల, ఉపయోగకర ఫలితాల దృష్ట్యా, అత్యంత సముచితమైన పంపిణీకి అవసరమైన మానవ వైవిధ్య స్వభావం వుంటుందని ఆయన విశ్వసించాడు. ఫలాన్క్స్‌లో వ్యావసాయిక, పారిశ్రామిక ఉత్పత్తులు సమ్మిళితమై వుంటాయి. అయితే వ్యావసాయికోత్పత్తికి ప్రాబల్యం వుంటుంది. ఫోరియర్ పారిశ్రామిక రంగాన్ని సాపేక్షంగా చిన్నదే అయినా, అధిక ఉత్పాదక కార్ఖానాలుగా ఊహించుకున్నాడు. నాగరిక వ్యవస్థలో ఉత్పన్నమైన ఫ్యాక్టరీ వ్యవస్థను ఆయన గట్టిగా తిరస్కరించాడు.

ఫలాన్క్స్‌కి తొలి ఉత్పత్తి సాధనాల నిల్వ వాటాదార్ల విరాళాలనుండి సమకూరుతుంది. అందుచేత వారిలో పెట్టుబడిదారులు కూడా వుండవలసివుంటుంది. పేదలు కూడా ఫలాన్క్స్‌లో సభ్యులుగా ఉండవచ్చు, అయితే వాళ్ళు మొదట్లో వాటాదారులు కానవసరం లేదు. అటువంటి సందర్భంలో వాళ్ళు తమ వాటాను శ్రమరూపంలో చెల్లిస్తారు. వాటాలపైన స్వామ్యం వ్యక్తిగతమైనదిగా వుంటుంది. ఫలాన్క్స్‌లో సభ్యుల ఆస్తిలో అసమానత్వం వుంటుంది. అయితే, ఒక పెట్టుబడిదారు దానిలో సభ్యుడైనప్పుడు, అతను పాత అర్థంలో పెట్టుబడిదారుగా ఉండడు. సృజనాత్మక శ్రమకు సంబంధించిన సాధారణ వాతావరణం ప్రత్యక్ష ఉత్పత్తిక్రమంలోకి అతన్ని లాగుతుంది. మేనేజరుగానో, ఇంజనీరుగానో లేక విజ్ఞానశాస్త్రజ్ఞుడుగానో అతనికి ప్రతిభ వుంటే, ఆ యోగ్యతలో అతని శ్రమను సమాజం వినియోగించుకొంటుంది. అది లేకపోతే, అతను తనకు నచ్చిన పనిని ఒక "సీరీస్" (బ్రిగేడు)లో వుండి చెయ్యవచ్చు. అయితే, ధనికుల బిడ్డలూ, పేదల బిడ్డలూ ఒకే ఆరోగ్యకర వాతావరణంలో విద్యార్జన చేస్తారుగనుక, యీ వ్యత్యాసాలు తదుపరి తరాల్లో తుడిచివెయ్యబడతాయి. పెద్ద వాటాదార్లకు ఫలాన్క్స్ నిర్వహణలో కొన్ని ప్రత్యేక సౌకర్యాలు వుంటాయి. అయితే వాళ్ళకు పాలక సమితిలో మెజారిటీ కలిగివుండటం సాధ్యం కాదు. మరి, ఏదేమైనా యీ పాలక సమితి పాత్ర అతి స్వల్పంగా మాత్రమే వుంటుంది.

సామాజిక శ్రమ సంఘటనపట్ల ఫోరియర్ ప్రత్యేక శ్రద్ధ చూపాడు. ఒక రకం శ్రమనుంచి మరొకదానికి తరచుగా మార్చడం ద్వారా, పెట్టుబడిదారీ, శ్రమ విభజన లోని ప్రతికూల పార్శ్వాలను తొలగించవచ్చునని ఆయన ఆశించాడు. ప్రతి వ్యక్తికీ ఒక కనీస మొత్తపు జీవితావసరాలు పొందే గ్యారంటీ వుంటుంది. తత్ఫలితంగా అతని శ్రమ నిర్బంధమైనది కాక, స్వేచ్ఛాయుతమైన కార్యకలాప వ్యక్తీకరణ అవుతుంది.

శ్రమకి పూర్తిగా కొత్త ప్రేరణలు ఉత్పన్నమవుతాయి: పక్కవాడిని మించాలన్న పోటీ భావం, సామాజిక వృత్తి, సృజనాత్మకతలోని ఆనందం.

ప్రధానంగా శ్రమ ఉత్పాదకత పెరుగుదల కారణంగా సమాజపు సంపదా, ఆదాయమూ వేగంగా పెంపొందుతాయి: దీనికితోడు, పరభాగ్యోపజీవనం అంతరిస్తుంది, ప్రతి ఒక్కడూ పనిచేస్తాడు. చివరకు, పాత వ్యవస్థలో అనివార్యమైన అనేక నష్టాలనూ, అనుత్పాదక వ్యయాన్నీ ఫలాన్క్స్ నివారిస్తుంది. ఫోరియర్ దృష్టిలో, భవిష్యత్సమాజం సమృద్ధమైనదీ వాస్తవికమైనదే కాకుండా, ఆరోగ్యకరమూ, సహజమూ, ఆనందప్రదమైన సమాజంగా కూడా వుంటుంది. భవిష్యత్సమాజభావాలతో తరచుగా ముడిపెట్టబడుతూవుండే జీవిత సౌకర్యాలపట్ల విముఖత్వం ఫోరియర్కి పూర్తిగా విజాతీయమైనది.

ఫలాన్క్స్లో కూలిశ్రమా వుండదు, వేతనాలూ వుండవు. ఫలాన్క్స్ సభ్యులకు, శ్రమనిబట్టీ, పెట్టుబడినిబట్టీ, ప్రతిభనుబట్టీ యిచ్చే ఒక ప్రత్యేక తరహా డివిడెండు ద్వారా, శ్రమ ఉత్పాదితపు పంపిణీ (డబ్బు రూపంలో) జరుగుతుంది. మొత్తం నికరాదాయం మూడు భాగాలుగా పంచబడుతుంది: $^{5}/_{12}$వ వంతు "శ్రమలో క్రియాశీలంగా పాల్గొనేవారికి," $^{4}/_{12}$వ వంతు "వాటాల సొంతదార్లకి," $^{3}/_{12}$వ వంతు "సైద్ధాంతిక, ఆచరణాత్మక అనుభవం కలవారికి." ఫలాన్క్స్ సభ్యుల్లో ప్రతి ఒకడూ సాధారణంగా యీ రకాల్లో రెండింటికీ, కొన్ని సందర్భాల్లో మొత్తం మూడు రకాలకీ చెందుతాడు గనుక, అతని ఆదాయం భిన్న రూపాలతో కూడివుంటుంది. ఫలాన్క్స్లోని ప్రతి ఒక సభ్యునికీ చెల్లింపు, అతని శ్రమ ఆహ్లాదకరమైనదైనా లేక అనాహ్లాదకర స్వభావం కలిగినదైనా, దాని సామాజిక విలువ ఆధారంగా మారుతుంది. అయితే సాదా శ్రమ (ప్రధానంగా శారీరక శ్రమ)కు చెల్లింపు "రకరకాల శ్రమ బ్రిగేడ్ల"లోని సభ్యులు పాల్గొనడం పుణ్యమా అని కొద్దిగొప్పల్లో సమానంగానే వుంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తికి తోటమాలిగా సగటుకు తక్కువ మొత్తం ముట్టిందనుకోండి, అతనికి గుర్రాల సంరక్షకుడుగానూ, పందుల పెంపకందారుగానూ సగటుకు మించిన మొత్తం లభిస్తుంది.

పంపిణీలో పెట్టుబడి భాగాన్ని తగ్గించి, ప్రత్యక్ష శ్రమ భాగాన్ని పెంచాలనీ, ప్రత్యేకించి వివిధ రకాల వాటాలకు భిన్న భిన్న డివిడెండ్లను ప్రవేశపెట్టడం ద్వారా ఆ ధోరణిని పెంచాలనీ, ఫోరియర్ ఆశించాడు. "కార్మికుల వాటాలకు" — యివి చిన్న మొత్తాల పొదుపు ద్వారా పరిమిత మొత్తంలో కొనుగోలుచెయ్యబడతాయి — అధిక డివిడెండు చెల్లింపును ఆయన ప్రతిపాదించాడు. పెట్టుబడిదార్ల మామూలు వాటాలకు అంతకన్న బాగా తక్కువ డివిడెండు చెల్లింపబడాలన్నాడు. ఆటువంటి పద్ధతుల ద్వారా

తన అసమానత్వ సూత్రాన్ని — యీ సూత్రం సమాజపు శీఘ్ర అభివృద్ధినీ, వికాసాన్నీ సాధిస్తుందని ఆయన భావించాడు — తనకు సమానంగానే అభిమానపాత్రమైన సార్వత్రిక సౌభాగ్య, ఆర్జిత ఆదాయ ప్రాధాన్యతా లక్ష్యాలతో సరిపుచ్చాలని ఫోరియర్ ప్రయత్నించాడు. వ్యక్తిగత స్వామ్యాన్ని రద్దుచెయ్యడం కాక, సమాజ సభ్యులందర్నీ యజమానులను చెయ్యడం, తద్వారా వ్యక్తిగత స్వామ్యానికి గల దోపిడి స్వభావాన్నీ, వినాశకర సామాజిక పర్యవసానాలనూ తొలగించడమే ఆయన కోరుకున్నది. ఈ విధంగా వర్గవైరుధ్యాలు త్వరలోనే అంతరించిపోతాయనీ, వర్గాలు సన్నిహితమైన, సమ్మిళితమైపోతాయనీ ఆయన ఆశించాడు.

ఫలాన్క్స్ సభ్యుల ధనాదాయాలు వర్తకం ద్వారా వస్తురూపంలోనూ, సేవల రూపంలోనూ వ్యయమవుతాయి. అయితే, యీ అమ్మకం పూర్తిగా యీ సమాజాల చేతుల్లో వుంటుంది. ఫలాన్క్స్ తరఫున వ్యవహరించే సంస్థ, యితర ఫలాన్క్స్‌లతో కూడా వర్తకం చేస్తుంది. సరుకులు చిల్లరగా ఏ ధరలకు అమ్మబడాలో సామాజిక మధ్యవర్తులు నిర్ణయిస్తారు.

వినిమయపు హేతుబద్ధ వ్యవస్థీకరణను భవిష్యత్సమాజపు ఒక ముఖ్య కర్తవ్యంగా ఫోరియర్ పరిగణించాడు. ఈ సందర్భంగా కూడా ఆయనకి, అసమానత్వాన్ని సమష్టి తత్వంతో ముడిపెట్టే సమస్య ఎదురైంది. వ్యక్తిగత గృహనిర్వహణను రద్దుజేసి, దాని స్థానంలో సామూహిక భోజనశాలలనూ, సేవలనూ ఏర్పాటుచెయ్యడం ద్వారా ఆయన యీ సమస్యను పరిష్కరించ ప్రయత్నించాడు. ఆయా వ్యక్తుల ఆదాయాలనుబట్టి అవి వివిధ స్థాయిల్లో ఏర్పాటుచెయ్యబడాలని ఆయన అభిప్రాయపడ్డాడు. వ్యక్తిగత విలాసాలు అర్థరహితమేగాక, అనందర్భంకూడా అవుతాయి. వాటి స్థానాన్ని సామూహిక భవనాలూ, వినోద కార్యక్రమాలూ, పండుగలూ ఆక్రమిస్తాయి. ఇది వ్యక్తిగత వినిమయంలోని అసమానతను విశేషంగా తగ్గిస్తుంది. సందర్భవశాత్తూ యిక్కడో విషయం చెప్పుకోవలసివుంది. అప్పుడు వ్యక్తిగత వినిమయం ఆరోగ్యకరం, అర్థవంతం, పొదుపైనదే కాకుండా, మరింత సమానమైనది కూడా అవుతుంది. ఉదాహరణకు, మిక్కిలి ధనిక సభ్యులకు సైతం మూడుగదులకు మించి వుండవు. ఫోరియర్ ఊహాస్వర్గంలో భవిష్యత్సమాజంలో మానవుని అభివృద్ధి, అతని మనస్తత్వం, ప్రవర్తన, నీతినియమాలు అన్న సమస్యపట్ల గణనీయమైన శ్రద్ధ చూపబడింది. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు, పిల్లల పెంపకం, విశ్రాంతిని అనుభవించే ఏర్పాట్లు, విజ్ఞానశాస్త్రపు పాత్ర, కళల పాత్ర అన్న సమస్యలకు యీ గొప్ప ఊహాజనిత సోషలిస్టు రచనల్లో వందలాది పేజీలు వినియోగింపబడ్డాయి.

ఫోరియర్ సమాజాన్ని కొన్ని ఫలాన్క్స్‌ల సమూహంగానే తప్ప అంత వివరంగా

పరిశీలించలేదు. ప్రభుత్వాధికారాన్ని ఆయన దాదాపు బొత్తిగా ప్రస్తావించలేదు. ఫలితంగా దరిమిలా అరాజకవాదులు ఆయన భావాలను కొన్నింటిని స్వీకరించడం సంభవించింది. ఫోరియర్ ఫలాన్క్స్‌లలో కనీసం ముమ్మరమైన ఆర్థిక సంపర్కం, మారకం వున్నాయి. వాటి మధ్య విస్తృతమైన శ్రమ విభజన వుంటుంది.

ఫోరియర్ విధానం వైరుధ్యాలతోనూ, స్పష్టమైన లోపాలతోనూ నిండివుంది. ఫోరియర్ దూరదృష్టితో చూసి, ప్రతిఒక్క విషయాన్నీ నియంత్రితంచేసేందుకు ప్రయత్నించినప్పటికీ, పూర్తి ఆర్థిక దృష్ట్యా చూసినప్పుడు, ఫలాన్క్స్‌లో చాల విషయాలు అస్పష్టంగానూ, అనిశ్చితంగానే ఉండిపోయాయి. ఫలాన్క్స్‌లో సరుకు—డబ్బు సంబంధాల స్వభావ, ప్రమాణాలు ఏమిటి? దాని ఉపవిభాగాలు తమ శ్రమ ఉత్పాదితాలను ఎలా మారకం చేసుకుంటాయి? ప్రత్యేకించి, ముడిపదార్థాల్నూ, సగం తయారీ ఉత్పాదితాలూ తదుపరి దశలకు ఎలా బదలాయింపబడతాయి? కేంద్రీకృత అక్కౌంటింగు మాత్రమే వుండి (అవే ఫోరియర్ మనల్ని నమ్మమంటాడు), కొనుగోళ్ళూ, అమ్మకాలూ లేకపోయినట్లయితే, మరి, ఆయన సవివరంగా వర్ణించే వర్తక సరుకు మారకం అవసరం ఫలాన్క్స్‌కి ఏముంది?

ఫలాన్క్స్‌లో విశేషమైన పాత్ర వహించవలసిన సామాజిక వినిమయ నిధులు (విద్యాలయాలు, నాటక శాలలు, గ్రంథాలయాలు, సామూహిక పండగలపై ఖర్చు, వగైరాలు) ఎలా ఏర్పడుతాయన్న విషయం స్పష్టంగా లేదు. వీటికోసం మొత్తం ఆదాయంనుంచి కేటాయింపులు ఉన్నట్లుగాని, వ్యక్తిగత ఆదాయాలపై పన్నుల విధింపు వున్నట్లుగాని ఏమీ కనిపించదు. సామాజిక పథకాలకు ధనికులు ఉదారంగా విరాళాలు యిస్తారన్న సూచన మాత్రమే వుంది.

ఇంతకన్న ముఖ్యమైన, సమస్య ఏమిటంటే, సంచయనం, దాని సామాజిక పార్శ్వాల సమస్య. పెట్టుబడి మదుపు కోసం మొత్తం ఆదాయంనుంచి కేటాయింపులేమీ సమకూర్చబడలేదు గనుక, సంచయన నిధి అన్నది ఫలాన్క్స్ సభ్యుల వ్యక్తిగత పొదుపుల నుండి మాత్రమే రూపొందగలదు, వాటాల కొనుగోలు దీనికొక రూపం కాగలదు. అయితే పెట్టుబడిదారులు, తమ అధికతర ఆదాయాలనుండి (ఒకే స్థాయి వినిమయంతో) ఫలాన్క్స్‌లోని యితర సభ్యులకన్న, చాలా ఎక్కువగా పొదుపు చెయ్యగలరు. అందుచేత, పెట్టుబడి, ఆదాయాల కేంద్రీకరణ ధోరణి అమల్లోకి రాక తప్పదు. బహుశా యీ భయం మూలంగానే, పైన పేర్కొన్న మాదిరిగా వాటాల్లో వ్యత్యాసాన్ని ఫోరియర్ ప్రతిపాదించివుండవచ్చు. అయితే అదే సమయంలో, పెట్టుబడిదారులకు ఫలాన్క్స్ ఆకర్షణీయంగా ఉండాలన్న ఆదుర్దా కొద్దీ, "యితర" ఫలాన్క్స్‌ల వాటాలపైన స్వామ్యం కలిగివుండే అవకాశాన్ని బహుశా ఆయన అందుకే ఊహించివుంటాడు. బహుశా

నూటికి తొంభైపాళ్లు యీ విధానం పెట్టుబడిదారీ విధానాన్నీ, సిసలైన పెట్టుబడి దారులనూ ఉత్పన్నం చేసివుండును.

ఫోరియర్ విధానంలోని యీ లోపాలనూ, అనేక యితర లోపాలనూ చూసినప్పుడు రెండు ప్రధాన నిర్ణయాలకు రాక తప్పదు:

మొదటిది, ఊహాజనిత సోషలిజం, అది ఏ చారిత్రక పరిస్థితుల్లోనైతే ఆవిర్భవించిందో వాటి కారణంగా, పెటీబూర్జువా భ్రమలనుండి తనను తాను వదిలించుకోలేకపోయింది, సమాజపు సోషలిస్టు పరివర్తనకు తన పథకాల విషయంలో సుసంగతంగా ఉండలేక పోయింది.

రెండవది, భవిష్యత్సమాజపు ప్రజలకు ఏదో ఒక ప్రత్యేక కార్యాచరణ పద్ధతినీ, ప్రవర్తన పద్ధతినీ నిర్దేశించడానికీ, వాళ్ల జీవితాన్ని నియంత్రితం చేసేందుకూ జరిపే ప్రయత్నాలన్నీ విఫలం కాక తప్పదు.

అయినాకూడా ఫోరియర్‌లో మనం ప్రధానంగా చూసేది ఆయన భ్రమలనూ, పొరపాట్లనూ కాదు. తన వాదాన్ని పెట్టుబడిదారీ విధాన విశ్లేషణపై ఆధారంచేసు కొని, సోషలిస్టు సమాజపు అనేక వాస్తవ నియమాలను ఆయన చూపాడు — దీనిలోనే వుంది ఆయన మేధాప్రతిభ. శ్రమ సంఘటన, శ్రమను మనిషి సహజావసరంగా మార్చడం, పోటీ — వీటిపైన ఆయన అభిప్రాయాలు ప్రత్యేకించి గమనార్హమైనవి. శారీరక మానసిక శ్రమలకు మధ్య వ్యత్యాసాన్ని రద్దుచేసే సమస్యను కూడా ఫోరియర్ లేవదీశాడు. వినిమయాన్ని తగ్గించుకోవడం, పౌర సేవల రంగాన్ని విస్తరింపజేయడం, స్త్రీలను యింటి చాకిరీనుండి విముక్తమొనర్చడం, సోషలిస్టు యుగంలో ప్రేమయొక్క స్వేచ్ఛా సౌందర్యాలు, యువతరానికి పనిపట్ల సరైన వైఖరిని అలవడజెయ్యడం — వీటన్నింటిపైనా ఆయన భావాలకు యీనాటికీ ప్రాధాన్యం వుంది.

ప్రకరణం 19

రాబర్ట్ ఓవెన్, తొలినాటి ఇంగ్లీషు సోషలిజం

"డ్రాయింగ్ రూములో పొట్టిగా, బక్కగా వున్న ఒక ముసలాయన వున్నాడు. ఆయన జుట్టు ముగ్గుబుట్టలాగా వుంది. ఆయన ముఖంలో కొట్టవచ్చినట్లు దయా భావం తొంగిచూస్తోంది. ఆయన కళ్ళు నిర్మలంగా, ప్రకాశవంతంగా, సౌమ్యంగా ఉన్నాయి. గొప్ప దయార్ద్ర భావానికి ప్రతీకలుగా వృద్ధుల్లో కనిపించే బాల్యస్నిగ్ధమైన నీలికళ్ళు అవి.

"ఆ యింటి ఆడబడుచులు ఆ తెల్లజుట్టు ముసలాయన దగ్గరకు పరుగున వెళ్ళారు; వారి మధ్య అంతకుముందే పరిచయం వుందనడం స్పష్టం.

"తోటకు దారితీసే తలుపు దగ్గర నేను ఆగాను.

" 'మీరు బలే మంచి సమయానికి వచ్చారు' ఆ పిల్లల తల్లి ఆయనతో కరచాలనం చేస్తూ అంది. 'ఈ రోజు మీకు ఆసక్తిగొలిపే ఒక విశేషం వుందిక్కడ. మా రష్యన్ అతిథిని మీకు పరిచయం చెయ్యనివ్వండి,' ఆమె నావంక తిరిగి, 'మీ మూల పురుషుల్లో ఒకరిని కలుసుకోవడం మీకు సంతోషం కలిగిస్తుందను కుంటాను' అంది.

"ఆ ముసలాయన కలుపుకోలు తనంగా నవ్వి, 'రాబర్ట్ ఓవెన్, మిమ్మల్ని కలుసు కున్నందుకు సంతోషం' అన్నాడు.

"నేనాయన చేతిని పుత్ర సహజమైన గౌరవభావంతో స్పృశించాను. నేను యింకా కొంచెం చిన్నవాడినై వుంటే, మోకాళ్లపై మోకరిల్లి ఆ ముసలాయన్ని నా శిరస్సుపై చేతులుంచి ఆశీర్వదించి వుండమనేవాడిని....

"ఓవెన్ నాతో యిలా అన్నాడు: 'మీ దేశంనుంచి గొప్ప విషయాలు నేను ఆశి స్తున్నాను. అక్కడ మార్గం నిష్కంటకంగా వుంది, మీ మతగురువులు అంత శక్తి వంతులు కారు, దురభిప్రాయాలు అంత బలవత్తరం కావు.... మరి అక్కడ బలం... మందిబలం!"

1852లో 80 ఏళ్లకు పైగా వయస్సు కలిగిన ఓవెన్‌తో తన సమావేశాన్ని గురించి సుప్రసిద్ధ రష్యన్ ప్రజాస్వామ్యవాదీ, రచయితా అయిన గేర్త్సెన్ రాసినది

యిదీ. సెంట్ సైమన్, ఫోరియర్, ఓవెన్‌లను గురించి మార్క్స్ కూడా సరిగా "మూల పురుషులు" అన్న — గేర్‌త్సెన్ వాడిన — యీ మాటనే వాడటం గమనార్హం.

స్వయంగా ఊహాజనిత రైతాంగ సోషలిజాన్ని బోధించిన గేర్‌త్సెన్ అభిప్రాయం సహజంగానే యిందుకు గణనీయంగా భిన్నమైంది. అయితే మార్క్స్, గేర్‌త్సెన్‌లు యిద్దరికీ కూడా సోషలిజం మూలపురుషుల్లో ఓవెన్ ఒకడు.

విశాల హృదయుడు

రాబర్ట్ ఓవెన్ వేల్స్ రాష్ట్రంలోని న్యూటౌన్ అనే ఒక చిన్న పట్టణంలో 1771లో జన్మించాడు. ఆయన తండ్రి అంగడి యజమాని, దరిమిలా పోస్ట్‌మాస్టరు. ఏడవ ఏడు వచ్చేసరికే ఓవెన్ స్థానిక స్కూలు ఉపాధ్యాయుడికి సహాయకుడుగా ఉపయోగించు కోబడుతూండేవాడు. అయితే మరో రెండేళ్లకే ఆయన చదువు ముగిసిపోయింది. జేబులో కేవలం నలభై షిల్లింగులతో తన అదృష్టాన్ని వెతుక్కుంటూ ఓవెన్ పెద్ద పట్టణాలకు బయల్దేరాడు. స్టామ్‌ఫర్డ్, లండన్, మాంఛెస్టర్‌లలో బట్టల అంగళ్లలో ఆయన అసిస్టెంటుగా పనిచేశాడు. విరామాల్లో ఆయన చదువుకునేదేదో ఆయన చదువంతా అంత మాత్రమే. ఫోరియర్‌కి మాదిరిగానే ఓవెన్‌కి కూడా క్రమబద్ధమైన విద్యాభ్యాసం లేదు. అయితే దాని మూలంగా కలిగిన మేలేమిటంటే ఛాందస పాండిత్యంతో బాటు వుండే దురభిప్రాయాలూ, పిడివాదాలూ ఆయనకి అబ్బకుండా తప్పిపోయాయి.

ఆ కాలంలో పారిశ్రామిక విప్లవ కేంద్రం మాంఛెస్టరే. ప్రత్యేకించి పత్తి పరిశ్రమ అక్కడ ముమ్మరంగా అభివృద్ధిచెందింది. ఓవెన్‌లాంటి వ్యవహార దృష్టి కలిగిన, శక్తిశాలి అయిన యువకుడికి జీవితంలో ముందుకుపోయేందుకు త్వరలోనే అవకాశం లభించింది. అప్పట్లో జౌళిపరిశ్రమలోకి నూలువడికే యంత్రాలు వేగంగా ప్రవేశపెట్ట బడుతున్నాయి. అందుకని ఆయన మొదట్లో తన సోదరుడి దగ్గర్నుంచి డబ్బు బదులు తీసుకొని నూలువడుకు యంత్రాల కార్ఖానా తెరిచాడు. అటుతర్వాత ఆయన యిద్దరు ముగ్గుర్ని చేర్చుకొని, ఓ చిన్న స్వంత నూలువడుకు కార్ఖానాను మొదలుపెట్టాడు. ఇరవైయేళ్లు వచ్చేసరికల్లా, ఓ పెద్ద జౌళి ఫ్యాక్టరీకి ఆయన మేనేజరూ, తర్వాత దానిలో సహభాగస్వామీ అయాడు.

ఆ సంస్థ వ్యవహారంపైన స్కాట్లండుకు వెళ్లినప్పుడు ఆయనకి ఓ పెద్ద జౌళి ఫ్యాక్టరీ యజమానియైన డేవిడ్ డేల్ కుమార్తెతో పరిచయమైంది. ఈ ఫ్యాక్టరీ గ్లాస్గో సమీపంలోని న్యూలానార్క్ సెటిల్‌మెంటులో వుంది. మిస్ డేల్‌తో వివాహ ఫలితంగా 1799లో ఓవెన్ న్యూలానార్క్‌కి మారి, అక్కడ తన మామగారి పూర్వపు

ఫ్యాక్టరీకి మేనేజరూ (మాంచెస్టరుకి చెందిన మరికొందరు పెట్టుబడిదారులతో) సహయజమానీ అయ్యాడు. ఓవెన్ తన స్వీయ చరిత్రలో రాసినట్లు, ఆయన అప్పటికే తన పారిశ్రామిక, సామాజిక ప్రయోగాన్ని గురించి ఆలోచించి, ఒక నిర్దిష్ట పథకం వేసుకొని మరీ న్యూలానార్కుకి వచ్చాడు. ఎంగెల్స్ యిలా రాశాడు: "ఈ తరుణంలో సంఘసంస్కర్త అయిన 29 ఏళ్ల ఫ్యాక్టరీ యజమాని ఒకడు — దాదాపు ఉదాత్తమైన, శిశు సహజమైన సరళ స్వభావం కలవాడు, అయితే అదే సమయంలో జన్మతః మానవ నాయకులైన కొద్దిమందిలో ఒకడు — ముందుకు వచ్చాడు."*

వ్యక్తిగత స్వామ్యాన్నిగాని, పెట్టుబడిదారీ ఫ్యాక్టరీ విధానాన్నిగాని ఓవెన్ అప్పట్లో సవాలు చెయ్యలేదు. అయితే ఆయనొక విషయాన్ని రుజువుచెయ్యడం తన కర్తవ్యంగా పెట్టుకున్నాడు, నిజానికి అలా రుజువుచేశాడు కూడా. భయంకరమైన కూలి బానిసత్వమూ, కార్మికులను పీడించడం సమర్థమైన ఉత్పత్తికీ, అధిక లాభాలకూ అవసర షరతేమీ కాదన్నదే ఆ విషయం. ఆయన కార్మికులకు సమంజసమైన పని పరిస్థితులనూ, జీవిత పరిస్థితులనూ కల్పించాడంతే. అది పెంపొందిన శ్రమ ఉత్పాదకత దృష్ట్యా, పెంపొందిన సామాజిక ఆరోగ్యం దృష్ట్యా పరమ విభ్రాంతికరమైన ఫలితం తెచ్చింది.

ఓస్, యింతేనా అనిపించవచ్చు! అయితే, యీ పని చేసేందుకు ఓవెనూ, ఆయన కొద్దిమంది అనుయాయులూ ఎంతగా కృషిచెయ్యవలసివచ్చిందో, ఎంత పట్టుదల, దృఢ విశ్వాసం, ధైర్యం అవసరమయ్యాయో మనం అర్థంచేసుకోవలసివుంటుంది. న్యూలానార్కులో పనిదినం పదిన్నర గంటలకు తగ్గించబడింది (మిగిలిన ఫ్యాక్టరీల్లో అది పదమూడు పధ్నాలుగు గంటలు వుండగా), సంక్షోభాల కారణంగా ఫ్యాక్టరీ మూతపడిన సమయాల్లో కూడా వేతనాలు చెల్లించబడ్డాయి. వృద్ధులకు పెన్షన్లు ప్రవేశపెట్టబడ్డాయి. పరస్పర సహాయక నిధి ఏర్పాటుచెయ్యబడింది. ఓవెన్ కార్మికుల కోసం తక్కువ అద్దెలకు ఓ మోస్తరు యిళ్లను కట్టించాడు. తగ్గించబడినప్పటికీ, లాభసాటిధరలకు కార్మికులు వస్తువులను కొనుక్కొనే సౌకర్యం కల్పించాడు.

ఓవెన్ ప్రత్యేకించి బాలబాలికలకు చాలా చేశాడు. ఫ్యాక్టరీలో వాళ్లకి తేలిక పని కల్పించాడు, బాలబాలికలకు విద్యాలయం నెలకొల్పాడు, దానిలో రెండేళ్లకు పైబడిన పిల్లలందరూ చేర్చుకోబడేవారు. దరిమిలా అమల్లోకి వచ్చిన కిండర్ గార్టెన్లకు ఆ విద్యాలయం ఒక నమూనాగా ఉపయోగపడింది. బాలబాలికలపట్ల యీ శ్రద్ధ వెనుకగల ప్రధాన సూత్రాన్ని ఓవెన్ 18వ శతాబ్దపు తత్వవేత్తలనుంచి గ్రహించాడు: పరిసరాలు

---

* Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. 3, p. 123.

ఎలా తయారుచేస్తే మనిషి అలా తయారవుతాడు; అతన్ని మెరుగుపరచాలంటే, అతను ఏ పరిసరాల్లో పెరుగుతాడో, ఆ పరిసరాలను మెరుగుపరచాలి.

ఓవెన్ భాగస్వాములకు యీ భావాలు ఆందోళనను కలిగించాయి. వాటిని వాళ్లు అవకతవక అయినవిగా భావించారు. దానికి అయే ఖర్చువెచ్చాలు వాళ్లకి మరింత అవకతవకగా కనిపించేవి. కాగా, లాభాలన్నీ వాటాదార్లకే చెందాలని వాళ్లు డిమాండుచేశారు. దానితో ఓవెన్‌కి తన వాటాదార్లతో నిరంతరాయంగా ఘర్షణపడక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. 1813లో ఆయన కొత్త వాటాదార్లను సంపాదించుకోగలిగాడు. వీళ్లు తమ పెట్టుబడిపైన 5 శాతం స్థిర ఆదాయం పొందడంతో తృప్తిపడి, మిగిలిన అన్ని విషయాల్లోనూ ఓవెన్‌కి పూర్తి స్వేచ్ఛను యిచ్చేశారు. అప్పటికి ఓవెన్ పేరు విస్తృతంగా ప్రసిద్ధిచెందింది. న్యూలానార్కు ఒక యాత్రాస్థలమైంది. అక్కడికి గుంపులు గుంపులుగా యాత్రికులు వస్తూండేవారు. లండన్‌లోని ఉన్నత వర్గాల్లో ఓవెన్‌కి పోషకాభిమానులు ఏర్పడ్డారు: ఆయన శాంతియుతంగా చేసే మానవసేవా కార్యకలాపం అప్పటికింకా ఎవరికీ కంటగింపు కాలేదు. చాలామందికి అది తీవ్రమైన సామాజిక సమస్యల పరిష్కారానికి మంచి పంథాగా కనిపించింది. ఓవెన్ మొదటి పుస్తకమైన, 1813లో ప్రచురింపబడిన "సమాజాన్ని గూర్చిన నూతన దృక్పథం, లేక మానవ స్వభావాన్ని రూపొందించడాన్ని గూర్చిన వ్యాసాలు"కు హార్దికమైన స్వాగతం లభించింది. అందులో ఆయన భావాలు, ప్రత్యేకించి విద్యారంగంలో సావధానతతో కూడిన సంస్కరణవాదాన్ని అధిగమించకపోవడమే అందుకు కారణం.

అయితే ఓవెన్‌లో, పరహిత పరాయణత్వంపట్ల తృప్తి క్రమక్రమంగా తగ్గిపోయింది. దానివల్ల ఏదో కొంత సాధింపబడే మాట నిజమే అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఫ్యాక్టరీ వ్యవస్థ మౌలిక ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించలేదన్న సంగతిని ఆయన గ్రహించాడు. ఆయన దరిమిలా యిలా రాశాడు: "నేను కొద్ది సంవత్సరాల్లో యీ జనానికి అటువంటి ఫ్యాక్టరీ వ్యవస్థలో సాధ్యమైనంత మేరకు సాధించాను. ఆ పేద శ్రామికజనం తృప్తిచెందినప్పటికీ, తదితర పాత వ్యవస్థగల ఫ్యాక్టరీలతోనూ యితర శ్రామికజనంతోనూ సరిపోల్చుకున్నప్పుడు, తాము చాలా బాగా చూడబడుతున్నామనీ, తమపట్ల ఎక్కువ శ్రద్ధ వహింపబడుతోందనీ వాళ్లు గ్రహించి బాగా సంతృప్తిచెందినప్పటికీ, అన్ని ప్రభుత్వాల అదుపులోనూ వున్న అపారమైన సాధనాలతో ప్రపంచ దేశాలన్నింటిలోని జనాభాలకూ యీనాడు కల్పించడానికి అవకాశంగలదానితో సరిపోల్చిచూస్తే, వాళ్లదింకా హీనమైన బతుకేనన్న విషయం నాకు తెలుసు."*

---

* R. Owen, *The Revolution in the Mind and Practice of the Human Race*, London, 1850, pp. 16—17.

పరహిత పరాయణుడైన పెట్టుబడిదారు దశనుంచి కమ్యూనిజం బోధకుడుగా ఓవెన్ మారేందుకు ప్రత్యక్ష ప్రేరణను కల్పించినవి 1815–1817 మధ్య జరిగిన చర్చలు. ఈ చర్చలు ఇంగ్లండు ఆర్థిక పరిస్థితి క్షీణించడానికీ, నిరుద్యోగ పేదతనాల పెరుగుదలకూ సంబంధించినవి. ఒక ప్రభుత్వ కమిటీకి ఓవెన్ తన పథకాన్ని సమర్పించాడు. పేదలకు సహకార వాడలు నెలకొల్పాలనీ, అక్కడ వాళ్లు, పెట్టుబడిదారీ పరిశ్రమ దారులు లేకుండా సాముదాయకంగా పనిచేస్తారనీ ఆ పథకంలో ఆయన సూచించాడు. ఆయన భావాలు తప్పుగా అర్థంచేసుకోబడి, కోపాన్ని రేకెత్తింపజేశాయి. ఓవెన్ జన బాహుళ్యానికి విజ్ఞప్తిచేశాడు. 1817 ఆగస్టులో లండన్లో జరిగిన కొన్ని సభల్లో ఉపన్య సించి, పెద్ద సంఖ్యలో హాజరైన జనానికి తన పథకాన్ని మొట్టమొదటిసారిగా ఆయన వెల్లడించాడు. ఆయన దరిమిలా దాన్ని మరింత అభివృద్ధి చేసి, విస్తరింపజెయ్యసాగాడు. ఒకానొక నిర్దిష్ట సమస్యతో ఆరంభమైన ఆ మామూలు పథకం క్రమంగా కమ్యూనిస్టు సూత్రాలపై సమాజ పునర్నిర్మాణానికి ఒక సమగ్ర విధానంగా అభివృద్ధిచెందింది. శ్రమ సహకార సంఘాల ఏర్పాటు ద్వారా ఓవెన్ యీ పునర్నిర్మాణానికి పథకంవేశాడు. ఈ సంఘాలు కొంత మేరకు ఫొరియర్ ఫలాంక్స్‌లను గుర్తుకుతెస్తాయి, కాని యివి సుసంగతమైన కమ్యూనిస్టు సూత్రాలపై ఆధారపడినవి. ఈ శాంతియుత విప్లవానికి మార్గావరోధాలుగా వున్న పాత సమాజపు మూడు మూలాధారాలైన వ్యక్తిగత స్వామ్యం, మతం, అమల్లో వున్న కుటుంబ రూపాలపైన ఆయన గట్టి దాడిచేశాడు. 1821లో ప్రచురింపబడిన "లానార్క్ కౌంటీకి నివేదిక"లో ఓవెన్ తన భావాలను అతి సమ గ్రంగా వ్యక్తంచేశాడు.

బూర్జువా సమాజ పునాదులపై దాడిచెయ్యడానికి ఓవెన్‌కి చాలా ధైర్యం అవసర మైంది. బలిష్ఠమైన శక్తుల ప్రయోజనాల కోపానికి తను గురి అవుతానన్న సంగతి ఆయనకు తెలుసు, అయినాకూడా ఆయన వెనుకంజవెయ్యలేదు. తన లక్ష్యంపట్ల హృదయపూర్వకమైన విశ్వాసంతో ఆ పంథాలో ప్రవేశించాడు, తన జీవితపు తుది క్షణందాకా అదే పంథాలో పయనించాడు. 1817నుండి 1824దాకా ఆయన గ్రేట్ బ్రిటన్ అంతటా పర్యటించాడు, విదేశాల్లో పర్యటించాడు, అనేక ఉపన్యాసా లిచ్చాడు, చాలా వ్యాసాలూ, పాంఫ్లెట్లూ రాశాడు, నిరంతరాయంగా తన లక్ష్యాన్ని గురించి ప్రచారం చేశాడు. సమాజానికి తన పథకం ఎంతటి ప్రయోజనకర స్వభావం కలిగినదో ఆనాటి పాలకులూ, ధనికులూ గ్రహిస్తారని ఆయన ఆశించాడు. ఆ సంవ త్సరాల్లోనూ, తదుపరి సంవత్సరాల్లోనూ, ఓవెన్ దాన్ని పదే పదే ఇంగ్లీషు ప్రభు త్వానికీ, అమెరికన్ అధ్యక్షులకీ, పారిస్ బ్యాంకర్లకీ, రష్యన్ జారుకూ ప్రతిపాదిస్తూనే

వున్నాడు. పలుకుబడి కలిగిన వ్యక్తులు కొందరు కొంతవరకు ఆయన పథకాలను బల పరచినప్పటికీ, ఆయన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే అయాయి.

ఇంగ్లీషు "విద్యావంత సమాజం"పట్ల భ్రమలు తొలగిపోవడం, ఆ కాలపు కార్మికోద్యమంతో సంబంధాలు లేకపోవడం, న్యూలానార్క్‌లో తన పలుకుబడిని కూడా కోల్పోవడం – వీటన్నింటి మూలంగా ఓవెనూ, ఆయన కొడుకులూ అమెరికాకు వెళ్లిపోయారు. అక్కడ ఆయనొక భూఖండాన్ని కొని, 1825లో New Harmony ("నూతన సామరస్యం") అన్న ఒక సమాజాన్ని స్థాపించాడు. అది సమానత్వ కమ్యూనిజం సూత్రాలపై ఆధారపడింది. ఆయనకు గల ఆచరణాత్మక మనోదృష్టీ, అనుభవమూ మూలంగా అలాంటి సమాజాలు స్థాపించిన యితరులు చేసిన పొరపాట్లు చెయ్యకుండా ఆయన తప్పించుకున్నాడు. అయినాకూడా, ఓవెన్ సంపదనంతనీ మింగేసిన యీ ప్రయత్నం వైఫల్యంతో ముగిసింది. 1829లో ఆయన బ్రిటన్‌కి తిరిగివచ్చాడు. తన పిల్లలకు (మొత్తం ఏడుగురు) డబ్బు పంచి, ఓవెన్ క్లుప్తంగా గడుపుకోసాగాడు.

అప్పటికి ఆయన వయస్సు అరవై సంవత్సరాలు. చాలామంది విషయంలో క్రియాశీల జీవితం అంతటితో ముగిసిపోయేది, రిటైరైపోయి, శాంతియుతంగా జీవిత శేషం గడిపివుండేవారు. అయితే ఓవెన్ అందుకు భిన్నంగా, 1830 దశకంలో యితర ఊహాజనిత సోషలిస్టులు ఎన్నడూ చెయ్యజాలనిదాన్ని చేశాడు: విస్తృత కార్మికోద్యమంలో ప్రవేశించాడు.

ఆ సంవత్సరాల్లో ఉత్పత్తి, వినిమయదారుల సహకార సంఘాలు వేగంగా పెంపొందాయి. వాటిలో వృత్తిపనివారూ, అంతకన్న కొంచెంతక్కువగా ఫ్యాక్టరీ కార్మికులూ సమైక్యమయ్యారు. ఓవెన్ త్వరలోనే ఇంగ్లండులోని సహకారోద్యమ నాయకత్వ స్థానానికి చేరుకున్నాడు. 1832లో ఆయన Equitable Labour Exchange ("సమాన శ్రమ మారకం")ని ఏర్పాటుచేశాడు. ఆ ఎక్స్‌చేంజి (సహకార సంఘాలనుండీ, యితర అమ్మకందార్లనుండీ కూడా) శ్రమ వినిమయ ప్రాతిపదికపై వెయ్యబడిన అంచనా ప్రకారం వస్తువులను స్వీకరించి, యితర వస్తువులను "శ్రమ డబ్బు"కి అమ్మేది. చివరకు ఆ ఎక్స్‌చేంజి దివాళా తీసింది. ఓవెన్ దాని బాకీలను తన సొంత డబ్బుతో తీర్చవలసివచ్చింది. మరో కార్మికోద్యమ ఆద్యుల్లో కూడా ఓవెన్ ఒకడు. ఈ కార్మికోద్యమం – ట్రేడ్ యూనియన్ ఉద్యమం – భవిష్యత్తులో గొప్ప పాత్రను వహించవలసివుంది. 1833–34లో ఆయన 5 లక్షలమంది సభ్యులతో కూడిన తొలి సంఘటిత జాతివ్యాపిత ట్రేడ్ యూనియన్‌ని స్థాపించేందుకు ప్రయత్నించాడు. బలహీనమైన నిర్మాణం, నిధుల కొరత, ప్రభుత్వ తోడ్పాటు కలిగిన ఫ్యాక్టరీ యజమానుల వ్యతిరేకత – యివి ఆ యూనియన్ కూలిపోయేందుకు దారితీశాయి. ఓవెన్ అద్భుత

మైన పథకాలైతే విఫలమయ్యాయి, కాని వాటిలో ఏ ఒక్కటీ కూడా వృథాకాలేదు.

ఓవెన్‌తో సర్దుకోవడం కష్టంగానే వుండేది. తను చెప్పిందే రైటు అన్న తిరుగు లేని నమ్మకం కారణంగా ఆయన మొండిపట్టుదలతోనూ, అసహనంగానూ ఉండేవాడు. న్యూలానార్కు, "నూతన సామరస్యం"లలో గడిపిన ముప్ఫయ్యేళ్ల కాలంలో యితరులతో సహకరించడానికి గాక, మేనేజిమెంటుకే ఆయన అలవాటుపడ్డాడు. కొత్త భావాలకు ఆయన చెవినొగ్గేవాడు కాదు. మహోత్సాహమైన మానవతావాదమూ, సామర్థ్యమూ కలిసి, యౌవన దశలోనూ, మధ్య వయస్సులోనూ ఓవెన్‌కి విశిష్టతను చేకూర్చి, జనాన్ని ఆకర్షించాయి. వాటి స్థానాన్ని యిప్పుడు వినుగెత్తించే ఊకదంపుడు మాటలూ, ఆలో చనలూ ఆక్రమించాయి. విశేషమైన మానసిక విస్పష్టతను చివరికంటా నిలుపుకున్న ఓవెన్, వృద్ధాప్య సహజమైన కొన్ని విడ్డూర ప్రవృత్తులను పరిహరించుకోలేకపోయాడు. తన జీవితపు చివరి సంవత్సరాల్లో ఓవెన్ ఆధ్యాత్మికవాదంలోకి దిగి, మార్మికవాదంలో ఆసక్తిచూపాడు. అయితే, గేర్‌త్సెన్ గమనించిన దయార్ద్రభావాన్ని ఆయన చివరికంటా నిలుపుకున్నాడు.

ఓవెన్ యింకా విస్తారంగా రచనలు చేస్తూ, పత్రికలు ప్రచురిస్తూనే వున్నప్పటికీ, మరో సమాజాన్ని ఏర్పాటుచేసి, తన అభిప్రాయాలను అవిరామంగా ప్రచారం చేస్తూనే వున్నప్పటికీ, 1834 దరిమిలా సామాజిక కార్యకలాపాల్లో ఆయన ప్రముఖమైన పాత్రను వహించలేదు. ఆయన అనుయాయులు ఒక చిన్న కూటమిగా ఏర్పడి, తరచుగా బాగా అభివృద్ధినిరోధక ధోరణులను బలపరచారు.

1858 ఆకురాలుకాలంలో, అప్పటికి 87 ఏళ్ల వయస్సుగల ఓవెన్, లివర్‌పూల్ వెళ్లి, అక్కడ ఒక సమావేశ వేదికపై జబ్బుపడి, కొన్ని రోజులు మంచంపైన గడిపి, చిన్ననాటినుండి తను తిరిగివెళ్లని తన సొంత పట్టణమైన న్యూటౌన్‌కి తిరిగివెళ్లాలని ఆకస్మికంగా నిర్ణయించుకున్నాడు. అక్కడే ఆయన 1858 నవంబరులో మరణించాడు.

ఓవెన్, అర్థశాస్త్రం

అర్థశాస్త్రంపట్ల ఓవెన్ వైఖరి సెంట్ సైమన్ వైఖరికీ, ప్రత్యేకించి ఫోరియర్ వైఖరికీ భిన్నమైనది. ఓవెన్ ఆ విజ్ఞానశాస్త్రాన్ని తిరస్కరించలేదు, తద్విరుద్ధంగా, తన పథకానికి ఆధారం ఆ శాస్త్ర సూత్రాలేనని – స్మిత్, రికార్డోల రచనలను దృష్టిలో పెట్టుకొని – ఉద్ఘాటించాడు కూడా. ఎంగెల్స్ యిలా రాశాడు: "ఓవెన్ కమ్యూనిజం అంతా, ఆర్థిక సమస్యలపై వివాదాల్లో అది నిమగ్నమైన మేరకు, రికార్డో రచనలపై

ఆధారపడింది."* సాంప్రదాయిక అర్థశాస్త్ర సూత్రాలనుంచి పెట్టుబడిదారీ వ్యతిరేక నిర్ణయాలను లాగినవాళ్లలో మొట్టమొదటివాడు ఓవెనే.

సందర్భవశాత్తూ యిక్కడొక విషయం చెప్పుకోవాలి. ఓవెన్ బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రంనుంచి తన విధానానికి కావలసినదాన్ని మాత్రమే గ్రహించి, మిగిలినదాంట్లో చాలమటుకు అలక్ష్యంచెయ్యడమే కాకుండా, బాహాటంగా తిరస్కరించాడు. తన రచనల్లో ఆయన ఆర్థిక సమస్యలను స్పృశిస్తాడు, అంతేగాని వాటిని ప్రత్యేకించి పరిశీలించడు. ఆయన ప్రధాన ఆర్థిక భావాలు "లానార్క్ కౌంటీకి నివేదిక"లో వున్నాయి. ఓవెన్ కార్యశీలి. తన ఆర్థిక భావాలను ఆయన, "సమాన శ్రమ మారకం"లోనూ, మొదట న్యూలానార్క్‌లోనూ, తర్వాత అమెరికాలోనూ, చివరకు సహకారోద్యమంలోనూ, అమల్లో పెట్టేందుకు ప్రయత్నించాడు.

ఓవెన్ అభిప్రాయాలకు ప్రాతిపదిక రికార్డో శ్రమ విలువ సిద్ధాంతం. శ్రమయే విలువ సృష్టికర్త, కొలబద్ద. కాగా సరుకుల మారకం శ్రమనుబట్టే జరగాలి. అయితే రికార్డో మాదిరిగా కాకుండా, పెట్టుబడిదారీ విధానంలో మారకం శ్రమను బట్టి జరగదని ఆయన భావిస్తాడు. ఆయన అభిప్రాయంలో, శ్రమనుబట్టి మారకం అన్నదాని అర్థం, కార్మికుడు తను ఉత్పత్తిచేసిన సరుకు పూర్తి విలువను పొందాలి అన్నది. నిజానికి కార్మికునికి అలాంటిదేమీ ముట్టడు.

అయితే విలువయొక్క "న్యాయబద్ధ" నియమోల్లంఘనను వివరించేందుకుగాను ఓవెన్ బువాగిల్బేర్ భావాలవంటి భావాల దిశగా తిరుగుతాడు. దోషమంతా డబ్బుది, సహజ కొలమానమైన శ్రమను తోసివేసి దాని స్థానాన్ని ఆక్రమించిన కృతక కొలమానమైన డబ్బుది.

ఓవెన్‌ది అత్యంత ప్రాథమిక అర్థశాస్త్రం. ఆయన యీ భావాలన్నింటినీ తను ప్రతిపాదించే చర్యను గురించి నిరూపించేందుకు మాత్రమే వినియోగిస్తాడు: శ్రమ యూనిట్‌ని విలువ కొలమానంగా ప్రవేశపెట్టడం, యీ కొలమానం ప్రాతిపదికపై సరుకుల మారకం, డబ్బు ఉపయోగాన్ని రద్దుచెయ్యడం. ఆయన అభిప్రాయం ప్రకారం యీ చర్య, సమాజపు అత్యంత క్లిష్ట సమస్యలను పరిష్కరించేస్తుంది. కార్మికుడికి అతని శ్రమకు న్యాయమైన ప్రతిఫలం ముట్టుతుంది. కార్మికులకు ముట్టే ప్రతిఫలం సరుకుల నిజవిలువకు అనురూపంగా ఉంటుంది గనుక, అమితోత్పత్తీ, సంక్షోభాలూ అసాధ్యమవుతాయి. అటువంటి సంస్కరణ కార్మికులకే గాక, భూస్వాములకూ, పెట్టుబడిదారులకూ కూడా లాభదాయకంగా వుంటుంది: "...ఉదారంగా ప్రతిఫలం ముట్టిన

* Karl Marx, *Capital*, Vol. II, pp. 13—14.

శ్రమనుండి మాత్రమే, వ్యావసాయిక, కార్ఖానా ఉత్పాదితాలకు అధిక లాభాలను చెల్లించడం సాధ్యం."*

డబ్బు "న్యాయమైన" మారకాన్ని కేవలం దగాగా ఎలా మారుస్తుంది? సరుకులు, తమలోని ప్రతి ఒక్క దానిలోనూ యిమిడివున్న శ్రమ పరిమాణాన్నిబట్టి మారకంచేసుకోబడకపోతే, అంతిమ విశ్లేషణలో వాటి ధరలను నిర్ణయించేది ఏమిటి? కార్మికుడు తన శ్రమచేత సృష్టింపబడిన ఉత్పాదితపు పూర్తి విలువను పొందినట్లయితే, పెట్టుబడిదారుయొక్క, భూస్వామియొక్క ఆదాయాలు ఎక్కడినుంచి వస్తాయి? ఓవెన్‌ని యిలా ఎన్నైనా ప్రశ్నలు అడగవచ్చు, అయితే వాటికి ఆయన దగ్గర జవాబంటూ ఏమీ ఉండదు.

ఓవెన్ ఆర్థికాభిప్రాయాలు ఉత్పత్తి సంబంధాలతోబాటు సమాజపు మౌలిక పరివర్తనతో గాఢంగా ముడిపడివుండకపోయినట్లయితే, ఒక్క చలామణీ రంగంలో మాత్రమే, ప్రత్యేకించి డబ్బు రద్దు సంస్కరణద్వారా పెట్టుబడిదారీ లోపాలను రద్దు చెయ్యడంపట్ల అవి పెటీబూర్జువా భ్రమలుగానే తప్ప మరేవిధంగానూ అధికమైనవిగా ఉండేవికావు. శ్రమ విలువనుబట్టి న్యాయమైన మారకం జరగాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థను రద్దుచెయ్యడం అవసరమని తేలుతుంది! ఉత్పత్తి పరికరాలపైనా, సాధనాలపైనా వ్యక్తిగత స్వామ్యం లేని భవిష్యత్సమాజంలో మాత్రమే కార్మికుడు తన శ్రమను "దాని నిజ విలువకు" యిస్తాడు. అటువంటి సందర్భంలో పెట్టుబడిదారులు, భూస్వాముల సమస్యే ఉత్పన్నం కాదు. సమాజ పునర్నిర్మాణంనుండి వాళ్ళు పెట్టుబడిదారులుగానూ, భూస్వాములుగానూ కాక జనంగా లాభం పొందుతారు.

సహజంగానే, సరుకుల ఉత్పత్తి చారిత్రక స్వభావమూ, విలువ నియమమూ ఓవెన్‌కి బొత్తిగా స్పష్టం కాలేదు. రికార్డోకి లాగానే ఓవెన్ దృష్టిలోకూడా అవి అంతే శాశ్వతమూ, సహజమూ. అయితే దీన్నిబట్టి రికార్డో పెట్టుబడిదారీ విధానం శాశ్వతమూ, సహజమూ అన్న నిర్ణయానికి రాగా, ఓవెన్ తద్విరుద్ధమైన నిర్ణయాన్ని, అది "తాత్కాలికమూ," "అసహజమూ" అన్న నిర్ణయాన్ని లాగాడు. ఎందుకంటే, రికార్డో చారిత్రక నిరాశావాదాన్ని సైతం ఓవెన్ ఆమోదించలేదు. ఆ నిరాశావాదాన్ని సహేతుకంగానే ఆయన, మాల్థస్ ప్రభావంతోనూ, ఆయన జనాభా సిద్ధాంతంతోనూ ముడిపెట్టాడు. ఓవెన్ యీ సిద్ధాంతాన్ని ఖండించాడు. ఉత్పత్తియొక్క, ప్రత్యే

---

* R. C. Owen, *The New Existence of Man upon the Earth*, Part III, London, 1854, p. XV.

కించి వ్యవసాయపు నిజ, సంభావ్య పెరుగుదలను గురించిన గణాంక లెక్కలను ఉల్లేఖించి, పేదతనానికి దోషం సామాజిక వ్యవస్థదేగాని, ప్రకృతిది కాదని ఆయన వాదించాడు.

ఓవెన్ కమ్యూనిజం

ఓవెన్ ఊహాస్వర్గాన్ని ఆకాలపు యితర ఊహాస్వర్గాలనుండి వేరుచేసి, దాని కమ్యూనిస్టు స్వభావాన్ని గురించి మార్క్స్ ఎంగెల్స్‌లు వక్కాణించి చెప్పారు. మార్క్స్ యిలా అంటాడు: "అర్థశాస్త్రపు రికార్డియన్ దశలో దాని విరుద్ధ ప్రతిపాదన అయిన కమ్యూనిజం (ఓవెన్), సోషలిజం (ఫోరియర్, సెంట్ సైమన్...) కూడా వస్తాయి [కనిపిస్తాయి]."* ఎంగెల్స్ యిలా అంటాడు: "కమ్యూనిజం దిశగా ఆయన పురోగమనమే ఓవెన్ జీవితంలోని మూలమలుపు."**

మనం యింతకు ముందే చూసినట్లు సెంట్ సైమన్, ఫోరియర్ల విధానాలు పూర్తిగా సోషలిస్టువి కావు. వాళ్ల భవిష్యత్సమాజంలో ఏవో కొన్ని పరిమితులతో వ్యక్తిగత స్వామ్యమూ, ఉత్పత్తి సాధనాలపై ఏదో ఒక విధమైన హక్కు గలిగి, పెట్టుబడిపై ఆదాయం పొందే పెట్టుబడిదారులు కూడా వుంటారు. ఓవెన్ విధానం సుసంగతమైన సోషలిస్టు స్వభావం కలిగినదే కాకుండా, అది రెండవదీ మరింత ఉన్నతమైనదీ అయిన కమ్యూనిస్టు దశను కూడా చిత్రిస్తుంది. ఆ దశలో వ్యక్తిగత స్వామ్యమూ, అన్ని వర్గవ్యత్యాసాలూ పూర్తిగా రద్దుచెయ్యబడతాయి. ప్రతి ఒక్కడూ పనిచెయ్యాలి. ఉత్పాదక శక్తుల పెరుగుదల ప్రాతిపదికపైన, అవసరాన్నిబట్టి పంపిణీ జరుగుతుంది. ఓవెన్ ఊహాస్వర్గంలో మత లేక మార్మిక వాసన బొత్తిగా లేదు. దానిలో వాస్తవికతా, కొన్ని పర్యాయాలు దాని వ్యవహార సరళి ఆచరణాత్మక స్వభావమూ కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. ఇంతమాత్రాన ఓవెన్ విధానంలోని ఊహాజనితత్వం తగ్గదనుకోండి. సెంట్ సైమన్, ఫోరియర్‌ల మాదిరిగానే ఆయనా కమ్యూనిస్టు సమాజానికి దారితీసే అసలైన పంథాలను చూడలేదు.

అయితే ముఖ్యాంశం యిదీ. 19వ శతాబ్ది మొదట్లో మరింతగా అభివృద్ధి

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, p. 238.

** Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. 3, p. 125.

చెందిన సమాజాన్ని కలిగిన ఇంగ్లండులోని వాస్తవ పరిస్థితుల్లోంచి కమ్యూనిస్టు లక్ష్యాలు పెరిగాయన్న విషయాన్ని ఓవెన్ ఉదాహరణ నిరూపిస్తుంది. ఫ్రెంచి సోషలిస్టులకు వున్న అనేక పెటీబూర్జువా భ్రమలు ఓవెన్‌కి లేవు. పెట్టుబడిదారీ వర్గపు దోపిడి స్వభావం విషయంలోనూ, పెట్టుబడిదారీ వ్యక్తిగత స్వామ్యాన్ని పూర్తిగా రద్దు చెయ్యవలసిన అవసరం విషయంలోనూ ఆయనకి అనుమానం లేదు. ఫ్యాక్టరీ విధానాన్ని ప్రాతిపదికగా చేసుకున్న కారణంగా, వాస్తవ సమృద్ధినీ, అవసరాన్నిబట్టి పంపిణీనీ సాధ్యంచేసే శ్రమ ఉత్పాదకతలో పెరుగుదలను సాధించే నిర్దిష్ట మార్గాలను ఆయన మరింత స్పష్టంగా చూడగలిగాడు. అడపాదడపా – దురదృష్టవశాత్తూ యీనాడు కూడా – దర్శనమిచ్చే అపరిణత నిష్క్రమ సర్వమానవ సమానతావాద "బ్యారక్సు" కమ్యూనిజం పథకాలకంటే ఓవెన్ కమ్యూనిజం చాలా భిన్నమైనదీ, ఉన్నతమైనదీని. ఏ సమాజంలోనైతే ఉత్పత్తీ, సంపదా అద్భుతంగా పెంపొందుతాయో, దానితోబాటు మనిషి మటుకు మనిషి సమరసంగా అభివృద్ధిచెందుతాడో, దేనిలోనైతే మానవ వ్యక్తి విలువ అపారంగా పెరుగుతుందో అటువంటి సమాజాన్ని గురించి ఆయన కలలుగన్నాడు. బూర్జువా కిరాయి రచయితల అభాండాలు ఎలా వున్నప్పటికీ కూడా, కమ్యూనిజం, మానవతావాదం అన్నవి పరస్పరం పరిహరించుకొనే భావనలు కావనీ, తద్విరుద్ధంగా, నిజమైన మానవతావాదం నిజమైన కమ్యూనిస్టు సమాజంలో వికసిస్తుందనీ నిరూపించిన ప్రథముల్లో ఓవెన్ ఒకడు.

ఓవెన్ పథకంలో కమ్యూనిస్టు సమాజపు ప్రాతిపదిక యూనిట్ ఒక చిన్న సహకార కమ్యూన్. దాంట్లో 800 నుండి 1200 మంది సభ్యులుంటే మంచిది. ఆ కమ్యూన్లలో వ్యక్తిగత స్వామ్యం గాని, ఎటువంటి వర్గాలు గాని వుండవు. శ్రమలోనూ, పంపిణీలోనూ కొంత తేడాను సృష్టించగలదేమైనా ఉందంటే అది "వయస్సుకి లేక అనుభవానికి" సంబంధించిన వ్యత్యాసం మాత్రమే. పంపిణీ యంత్రాంగం గురించి ఓవెన్ దాదాపుగా ఏమీ వర్ణించడు, సమాజంలోపల శ్రమనుబట్టి ఉత్పాదితాల మారకం గురించి (యీసారి కూడా, ఫోరియర్ మాదిరిగానే) కొద్ది అస్పష్టమైన వ్యాఖ్యలు చేస్తాడు. బాగా మిగులు వున్నప్పుడు "సమాజపు ఉమ్మడి నిల్వనుంచి తనకు అవసరమైన దేన్ని అయినా ప్రతి ఒక్కడూ స్వేచ్ఛగా పొందేందుకు అనుమతింపబడవచ్చు" అన్న అంశానికి తనను తాను పరిమితం చేసుకుంటాడు.

నూతన మానవుని అభివృద్ధిపట్ల ఓవెన్ గణనీయమైన శ్రద్ధ వహిస్తాడు. మనిషి మనస్తత్వంలో మార్పుని ప్రధానంగా సంపద పెరుగుదల, అవసరాలు తీరడం అన్న రెండు పాదార్థిక అంశాలతో ఆయన ముడిపెడతాడు. వీటి ఫలితంగా "వ్యక్తిగత సంచయనంపట్ల గల కోరికలన్నీ అంతరిస్తాయి. వ్యక్తిగతంగా సంపదను కూడబెట్టడమ

న్నది వాళ్ళకి, అందరికీ సరిపడినంతకన్న అధికంగా అమూల్యమైన నీరు వున్న పరిస్థితిలో, నీటిని సీసాల్లో నింపుకోవడం మాదిరిగానో, లేక నిలవచెయ్యడం మాదిరిగానో, వివేకశూన్యమైనదిగా కనిపిస్తుంది."*

ఆ కమ్యూన్ పరిధులను దాటి ముందుకుపోయి, పెద్ద సంఖ్యలో అలాంటి యూనిట్లను కలిగిన ఒక సమాజాన్ని చిత్రించేందుకు ఓవెన్ ప్రయత్నించాడు. వాటి మధ్య గణనీయమైన స్థాయిలో శ్రమ విభజన వుంటుంది, శ్రమ విలువ ప్రాతిపదికపైన పరస్పర మారకం జరుగుతుంది. ఈ మారకం కోసం కమ్యూన్ల యూనియన్ ఒకటి, గొదాముల్లో వున్న వస్తువులకుగాను, ప్రత్యేకమైన శ్రమ – కాగితపు డబ్బును జారీ చేస్తుంది.** ఈ కొత్త సమాజం కొంత కాలంపాటు "పాత సమాజం"తోనూ, దాని ప్రభుత్వంతోనూ కలిసివుంటుంది, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తుంది, పాత సమాజానికి మామూలు డబ్బుకు సరుకులను అమ్ముతుంది – అని ఓవెన్ ఊహించాడు.

భూమితోబాటు, ప్రాథమిక ఉత్పత్తి సాధనాలను కమ్యూన్లు ఎలా, ఎవరి వద్ద నుండి పొందుతాయి – అన్న అతి ముఖ్య సమస్యను ఓవెన్ అలక్ష్యంచేశాడు. ఉత్పత్తి సాధనాలను ప్రభుత్వమో, లేక కొందరు వికాసవంతులైన పెట్టుబడిదారులో కమ్యూన్లకు ఉచితంగా అప్పజెప్తారని బహుశా అమాయకంగా ఆయన అనుకొనివుంటాడు. కాని మరో ఖండికలో ఆయన మరింత వాస్తవిక దృష్టితో, కమ్యూన్ సభ్యులు "తమ చేతులకు పని కల్పింపబడేందుకు అవసరమైన పెట్టుబడిపైన వడ్డీని చెల్లించాలి" అని చెప్తాడు. కాగా, ఆ కమ్యూన్‌లు పెట్టుబడిదారులు లేకుండా కొనసాగజాలవన్నమాట. కమ్యూన్లు తాము ఉత్పత్తికి బాధ్యులుగా ఉంటాయిగనుక, మహా అయితే పరిశ్రమ నిర్వహణ ఆదాయాన్ని నిలుపుకోగలుగుతాయి, అంతేగాని, అవి రుణవడ్డీని వదులుకోవలసివుంటుంది.

ఓవెన్ విధానం ఊహాజనితమైనది, అందుచేత దానినిండా వైరుధ్యాలే, అసంగతాలే. దీనికి ప్రధాన కారణం యేమిటో మనకి తెలుసు: వర్గ సంబంధాలు అప్పటికింకా పరిణతం కాలేదు, అందుచేత, సమాజ పునర్నిర్మాణానికి ఒక వాస్తవిక పద్ధతిని రూపొందించడం ఊహాజనిత సోషలిస్టులకు దుస్సాధ్యమైపోయింది. కార్మికవర్గపు చారిత్రక కర్తవ్యాన్నీ, సోషలిస్టు విప్లవ అవసరాన్నీ, అనివార్యతనూ అర్థంచేసుకున్నప్పుడు తప్ప

* R. Owen, *The New Existence of Man upon the Earth*, Part III, p. XXXIV.

** ఓవెన్ "సమాన శ్రమ మారకం" నిజానికి, అటువంటి డబ్బును జారీచేసింది.

యీ పని చెయ్యడం సాధ్యం కాదు. దీన్ని అర్థంచేసుకోవడమన్నది ఓవెన్‌కీ, తదితర ఊహాజనిత సోషలిస్టులకీ వస్తుపరంగా దుస్సాధ్యం.

అయినాకూడా, వాళ్ల విజయాల మాదిరిగానే వాళ్ల పొరపాట్లు లేకుండా, ఓవెన్ జీవిత కాలంలోనే మార్క్సిజం ఆవిర్భావానికి దారితీసిన సామాజిక విజ్ఞానశాస్త్రాల ప్రగతి కూడా అసాధ్యమే అయ్యుండేది.

కార్మికవర్గ చింతనాపరులు

నెపోలియన్ యుద్ధాల అనంతరం ఇంగ్లండు ఆర్థిక యిబ్బందులు, తొలి ఫ్యాక్టరీ చట్టాలు, ట్రేడ్ యూనియన్లు, రికార్డియనిజం స్థిరపడటం, ఓవెన్ ఆందోళనా కార్యక్రమం – అర్థశాస్త్రంలో కార్మికవర్గ ప్రయోజనాలను మొట్టమొదటి సారిగా చైతన్యయుతంగా వ్యక్తంచేసినవాళ్లకు సామాజికార్థిక, భావజాలాత్మక పూర్వరంగం యిదీ. వాళ్ల కృషి సుసంగతంగా సాగలేదు, వాళ్లు చాలవరకు పెటీబూర్జువా సంస్కరణ వాద సోషలిజంమీద ఆధారపడ్డారు. అయినాకూడా, వాళ్ల సేవలు గొప్పవే. 1820, 1830 దశకాలకు చెందిన యీ ఇంగ్లీషు సోషలిస్టులు ఒక వంక సాంప్రదాయిక అర్థశాస్త్రానికీ ఊహాజనిత సోషలిజానికీ, మరోవంక మార్క్స్ ఎంగెల్స్‌ల శాస్త్రీయ సోషలిజానికీ అతిముఖ్యమైన ఒక లింకువంటి వాళ్లు.

స్మిత్, రికార్డోల బూర్జువా "వారసుల"కు భిన్నంగా, స్మిత్, రికార్డోల సిద్ధాంతాలను వాళ్లు ప్రగతిశీల, బూర్జువా వ్యతిరేక లక్ష్యాలకు వినియోగించేందుకు ప్రయత్నించారు. ఈ వాస్తవాన్నిబట్టే, అర్థశాస్త్ర చరిత్రలో వాళ్ల పాత్ర నిర్ణయింపబడింది. వాళ్లు కొన్ని సందర్భాల్లో ఓవెన్ కన్న ఎక్కువ మేరకు అర్థశాస్త్రవేత్తలు, వాళ్లు రికార్డియన్ విధానాన్ని మరింత కచ్చితమైన శాస్త్రీయ రూపాల్లో అభివృద్ధిచేసేందుకు ప్రయత్నించారు. అయితే, వాళ్ల రచనలు ఆ సంవత్సరాల కార్మికోద్యమ నిర్దిష్ట కర్తవ్యాలకు తరచు ప్రత్యక్షంగా అంకితంచెయ్యబడిన మాట నిజమేననుకోండి. ఈ రికార్డియన్ సోషలిస్టుల బృందంలో (ఒకో అప్పుడు వాళ్లని అలా పిలిచేవాళ్లు) అత్యంత ప్రముఖులు విలియం థాంప్సన్, జాన్ గ్రే, జాన్ ఫ్రాన్సిస్ బ్రేలు. పెట్టుబడి స్వభావంపైనా, పెట్టుబడికీ శ్రమకీ మధ్య సంబంధాలపైనా, పెట్టుబడిదారీ విధానంలో లాభపు రేటు ధోరణులపైనా కొన్ని అద్భుతమైన భావాలకు జనకుడైన థామస్ హాడ్జ్‌స్కిన్ ప్రత్యేకించి ప్రముఖ పాత్ర వహించాడు.

థామస్ హాడ్జ్‌స్కిన్ చనిపోయినప్పుడు లండన్‌లోని ఏ ఒక్క వార్తాపత్రికా ఆయన పేరు ప్రస్తావించలేదు. "జాతీయ ప్రముఖుల జీవిత చరిత్రల నిఘంటువు" అనే

బృహద్గ్రంథంలో సైతం విక్టోరియన్ యుగానికి చెందిన వేలాది మంది ప్రముఖ బ్రిటిషర్లలో, ఆయనకి చోటు దొరకలేదు. హాడ్జ్‌స్కిన్ రచనలు పునర్ముద్రింపబడలేదు. ఆ శతాబ్దాంతానికల్లా ఆయన పేరు విస్మృతిసుడిగుండంలో పడిపోయింది. ప్రధానంగా మార్క్స్ ధర్మమా అని ఆయన "పునరావిష్కరింపబడ్డాడు." సోషలిస్టు భావాల అభివృద్ధికీ, ప్రత్యేకించి అర్థశాస్త్రాభివృద్ధికీ ఆయన రచనల ప్రాముఖ్యాన్ని గురించి మార్క్స్ పేర్కొన్నాడు. దీని తర్వాతనే లేబర్ సిద్ధాంతవేత్తలూ, చరిత్రకారులూ ఆయన్ని పేర్కొనడం మొదలుపెట్టారు. వెబ్ దంపతులు మార్క్స్‌ని "హాడ్జ్‌స్కిన్ ప్రఖ్యాత శిష్యుడు" అని కూడా అన్నారు. మార్క్స్‌ని అదే మాదిరిగా హేగెల్, రికార్డో, ఓవెన్, యింకా అనేక యితర చింతనాపరుల "శిష్యుడు" అని చెప్పవచ్చు. అయితే, సరిగా యీ కారణంగానే అటువంటి వ్యాఖ్య అర్థరహితం.

హాడ్జ్‌స్కిన్ 1787లో ఒక సైనికోద్యోగి కుటుంబంలో జన్మించాడు. నౌకా కళాశాలలో శిక్షణ పొందిన హాడ్జ్‌స్కిన్, నెపోలియన్ యుద్ధాల కాలంలో నౌకాదళంలో పనిచేశాడు. స్వతంత్ర స్వభావ కారణంగా ఈ యువ ఆఫీసరు అధికారులతో ఘర్షణ పడి, పాతికేళ్ల వయస్సప్పుడు కొలువులోంచి రాజీనామా చేయవలసివచ్చింది. 1813లో హాడ్జ్‌స్కిన్ ఒక పుస్తకాన్ని ప్రచురించాడు. అందులో ఆయన బ్రిటిష్ నౌకాదళంలోని నిష్ఠురమైన ఆచారాలను దుయ్యబట్టాడు. బెంథామ్, జేమ్స్ మిల్‌ల చుట్టూ జేరిన లిబరల్సు దృష్టిని ఆ పుస్తకం ఆకర్షించడంతో, హాడ్జ్‌స్కిన్ ఆ బృందంలోకి తీసుకో బడ్డాడు. రికార్డో కొత్తగా రచించిన పుస్తకంపైన మెక్‌కుల్లొహ్ రాసిన వ్యాసాన్ని 1818లో ఆయన చదవడం తటస్థించింది. తర్వాత ఆ పుస్తకాన్ని కూలంకషంగా అధ్యయనం చేశాడు. ఆయన రచనలనూ, లేఖలనూబట్టి చూసినప్పుడు, 1820 నాటికే ఆయనకి తన కాలపు రాజకీయ, ఆర్థిక భావాలతో బాగా పరిచయం ఏర్పడిం దనీ, అప్పటికే ఆయనకి చాలా సమస్యలపైన సొంత అభిప్రాయాలు ఏర్పడ్డాయనీ బోధపడుతుంది. ఆయన లేఖల్లో ఒక దానిలో ముఖ్యమైన యీ కింది వ్యాఖ్య కనిపి స్తుంది: "రికార్డో అభిప్రాయాలు సమాజపు ప్రస్తుత రాజకీయ పరిస్థితిని దోష రహితమైనవని వాదించి, భవిష్యత్తులో మెరుగుదలపట్ల మన ఆశలకు హద్దులను విధి స్తాయి. అందుచేత రికార్డో అభిప్రాయాలు నాకు నచ్చలేదని చెప్పేందుకు నేను సంకో చించను."*

రికార్డో సిద్ధాంతంపట్ల తన యీ వైఖరిని హాడ్జ్‌స్కిన్ నిలుపుకున్నాడు: రికార్డో సిద్ధాంతపు చాలా సూత్రాలు సరైనవన్న విషయాన్ని ఒకవంక గుర్తిస్తూనే, మరోవంక

---

* Elie Halévy, *Thomas Hodgskin*, London, 1956, p. 67.

దానిలోని అసంగతత్వం విషయంలో రికార్డోను ఆయన విమర్శించాడు. ఈ అసంగతత్వ కారణంగా ఆయన భావాలు కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఉపయోగపడగలవని ఆయన అభిప్రాయపడ్డాడు. మిల్, మెక్‌కులోహ్‌లకు సంబంధించినంతవరకు, "పెట్టుబడి దాడికి వ్యతిరేకంగా శ్రమకు సమర్థన" అన్న శీర్షికతో, లేక పెట్టుబడి అనుత్పాదకత..." అన్న ఉపశీర్షికతో వెలువడిన హాడ్జ్‌స్కిన్ తొలి ముఖ్య ఆర్థిక రచన, ప్రధానంగా వాళ్లకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడినదే. 1825లో లండన్‌లో ప్రచురింపబడిన ఈ చిన్న పుస్తకం ట్రేడ్ యూనియన్లను చట్టబద్ధంచేసే శాసనం కోసం జరిగిన పోరాటంతో ప్రత్యక్షంగా ముడిపడివుంది. రచయిత "ఒక శ్రామికుడు" అన్న గుప్తనామం వెనుక తనను తాను మరుగుపరచుకున్నాడు. కొద్ది సంవత్సరాలు ఎడిన్‌బరోలో గడిపిన హాడ్జ్‌స్కిన్ అప్పటికి తన కుటుంబంతో లండనుకి మకాం మార్చాడు. పత్రికా రచన ద్వారా జీవికను సంపాదించుకొంటూ, పెంపొందుతూన్న కార్మికోద్యమంలో ఆయన చురుకుగా పాల్గొనసాగాడు. ఆయన సోషలిస్టు విశ్వాసాలు అప్పటికే పూర్తిగా అభివృద్ధి చెందాయి. హాడ్జ్‌స్కిన్ అర్థశాస్త్రం, సోషలిజం, కార్మికోద్యమాల చరిత్రలో స్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడంటే, 1823–32 మధ్య హాడ్జ్‌స్కిన్ చేసిన కృషే అందుకు కారణం.

హాడ్జ్‌స్కిన్ కార్మికుల విద్యను అత్యంత ముఖ్యమైన కర్తవ్యంగా పరిగణించాడు. లండన్‌లోని మెకానిక్కుల ఇన్‌స్టిట్యూట్ సంస్థాపకుల్లో ఆయన ఒకడు. ఆ విద్యాలయానికి అవసరమైనన్ని నిధులను కార్మికులే పోగుచెయ్యలేరన్న విషయం త్వరలోనే తేలిపోయింది. దానితో తన "మానస పుత్రిక" మేనేజిమెంటునుంచి బూర్జువా ఉదారవాదులచేత ఆయన తొలగింపబడ్డాడు. ఆ సంస్థకి బూర్జువా లిబరల్సూ, పెట్టుబడిదారీ పరహితపరాయణులూ పెద్ద మొత్తాల్లో డబ్బునిచ్చి సహజంగానే ఆ సంస్థ విధానాన్ని తామే నిర్ణయించాలని పట్టుబట్టారు. అయినాకూడా, హాడ్జ్‌స్కిన్ ప్రధాన ఆర్థిక రచనలు ఆ కార్మిక విద్యాలయంలోని ఆయన కార్యకలాపాలతో ముడిపడివున్నాయి. ఆయన ఆ విద్యాలయాన్ని, తన భావాల ప్రత్యక్ష ప్రచారం కోసం వినియోగించుకోవాలని ప్రయత్నించాడు. కార్మికులకు వరుసగా ఉపన్యాసాలిచ్చాడు. "సులభగ్రాహ్య అర్థశాస్త్రం" అనే శీర్షికతో యీ ఉపన్యాసాలు 1827లో ప్రచురింపబడ్డాయి.

హాడ్జ్‌స్కిన్ పుస్తకాలు ఇంగ్లండులో చాలామంది దృష్టిని ఆకర్షించాయి. వాటిని ప్రత్యేకించి సోషలిజం వ్యతిరేకులు తీవ్రంగా పట్టించుకున్నారు. వాళ్లు దిట్టమైన బూర్జువా పత్రికా రచయితలను ఆయనకి వ్యతిరేకంగా సమీకరించారు. 1832లో ఆయన "ఆస్తి సహజ, కృతక హక్కులు" అనే మరో పుస్తకాన్ని ప్రచురించాడు. హాడ్జ్‌స్కిన్ కార్మికుల స్వామ్యాన్ని సహజమైనదిగానూ, ఒక మనిషిని వేరొక మనిషి

దోచుకోవడమనే ప్రాతిపదికపైన ప్రభుత్వపు తోడ్పాటుతో బలప్రయోగ, సంప్రదాయాల ప్రాతిపదికపైన గల ఆస్తిస్వామ్య రూపాలన్నింటినీ కృతకమైనవిగానూ పరిగణించాడు. నిజానికి ఆయన, సమాజాభివృద్ధిలో పెట్టుబడిదారీ విధానాన్ని ఆర్థికంగా సహేతుకమైన ఒక దశగా గుర్తించ నిరాకరించాడు.

1832 దరిమిలా హాడ్జ్‌స్కిన్ రాజకీయ, విజ్ఞానశాస్త్ర కార్యకలాపాల రంగం నుంచి నిష్క్రమించి, పరిగణనీయం కాని చిల్లరమల్లర పత్రికారచనల ఊబిలో కూరుకుపోయాడు. అప్పటికి ఆయన ఏడుగురు బిడ్డల తండ్రి. వైఫల్యం తర్వాత వైఫల్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. లిబరల్సు ఆధ్వర్యంలో అంతకు కొంచెం ముందే స్థాపించబడిన లండన్ విశ్వవిద్యాలయంలో పని దొరుకుతుందన్న ఆశ పటాపంచలైంది. నిలకడైన ఆదాయానికి మార్గాంతరం లేకపోయింది. పత్రికారచన ఒక్కటే తన కుటుంబ పోషణ సాధనమైంది. ఇందుకు వేరే కారణాలు కూడా ఉన్నాయనడం స్పష్టం. అప్పటికి హాడ్జ్‌స్కిన్‌కి కార్మికోద్యమ నాయకులతో అభిప్రాయభేదాలు మొదలయాయి. ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణకు అనుకూలంగా వున్న కార్మిక నాయకులతో సూత్రరీత్యా ఆయన ఏకీభవించలేకపోయాడు. ఓవెనైట్ల మాదిరిగా సహకారోద్యమంలో ఆయనకి భవిష్యత్తు కనిపించలేదు. ఓవెన్ కమ్యూనిటీ కమ్యూనిజాన్ని కూడా ఆయన తిరస్కరించాడు. నిజానికి ఆయనకి కచ్చితమైన కార్యక్రమం అంటూ ఏమీ లేదన్న విషయం స్పష్టపడిపోయింది. హాడ్జ్‌స్కిన్ పండిన వయస్సులో 1869లో మరణించాడు.

శ్రమ విలువ సిద్ధాంతాన్ని, రికార్డో దానికి యిచ్చిన రూపంలో, సోషలిస్టులు ఆమోదించారు. వాళ్లు ఆ సిద్ధాంతపు మూలసూత్రాన్ని దాని తార్కిక కొసకు తీసుకెళ్లారు. సరుకుల విలువను సృష్టించేది శ్రమ మాత్రమే. తత్పర్యవసానంగా, పెట్టుబడిదారు లాభమూ, భూస్వామి కౌలూ యీ విలువనుండి ప్రత్యక్ష మినహాయింపే. విలువ అన్నది సహజంగానే కార్మికునికి చెందుతుంది. ఈ నిర్ణయానికి వచ్చిన సోషలిస్టులు సాంప్రదాయిక అర్థశాస్త్రంలోని వైరుధ్యాన్ని గమనించారు: అటువంటి సూత్రాలపై ఆధారపడిన యీ అర్థశాస్త్రం పెట్టుబడిదారీ వ్యవస్థనూ, పెట్టుబడి చేత శ్రమ దోపిడినీ, సహజమైనదిగానూ, శాశ్వతమైనదిగానూ ఎలా పరిగణించగలదు?

మార్క్స్, బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల శ్రామికవర్గ ప్రత్యర్థులచేత యీ కింది వాక్పరంపర అనిపిస్తాడు: "శ్రమయే మారకపు విలువయొక్క ఏకైక మూలం, ఉపయోగపు విలువయొక్క క్రియాశీలమైన స్రష్ట. ఇదీ మీరు చెప్పేది. మరోవంక, పెట్టుబడే సర్వస్వం అనీ, కార్మికుడు ఏమీ కాడనీ లేక కేవలం పెట్టుబడియొక్క ఉత్పత్తి ఖర్చు మాత్రమే అనీ మీరు అంటారు. తద్వారా మిమ్మల్ని మీరు ఖండించు

కున్నారు. ఇది కార్మికుణ్ణి పెట్టుబడి దగాచెయ్యడం తప్ప మరేమీ కాదు. శ్రమయే సర్వస్వం."*

ఈ "ఉపన్యాసం" అందాజుగా యిలా కొనసాగింపబడవచ్చు. పెట్టుబడి లేనిదే శ్రమ ఉత్పత్తిచెయ్యజాలదని మీరంటారు, అని సోషలిస్టులు బూర్జువా అర్థశాస్త్రజ్ఞులతో అంటారు. అయితే, మీ వాదనలో పెట్టుబడి ఒక వస్తువు: యంత్రాలు, ముడి పదార్థాలు, సరుకు నిల్వలు. అలా అయినప్పుడు, నూతన, సజీవ శ్రమ లేనిదే పెట్టు

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, p. 260. ఉపయోగపు విలువ (సంపద) సృష్టికర్తగా శ్రమ నిర్వచనంలో "క్రియాశీల" అన్న మాటను గమనించండి. తన సహజ రూపంలో ఒక ప్రకృతి అంశంగా గాని (సాగుచెయ్యబడని భూమి, ఖనిజ నిక్షేపాలు, జలపాత విద్యుచ్ఛక్తి మొదలైనవి), లేక అంతకు పూర్వపు శ్రమ చర్యకు గురిచెయ్యబడిన ప్రకృతి శక్తులుగా గాని (ముడిపదార్థాలు, యింధనం, శ్రమ పరికరాలు మొదలైనవి) వుండే శ్రమ సాధనాలు ఉత్పత్తి క్రమంలో క్రియారహిత అంశాలుగా పాల్గొంటాయి. తన *Critique of the Gotha Programme*లో మార్క్స్ యిలా అంటాడు: "సమస్త సంపదకీ శ్రమయే మూలం కాదు. ప్రకృతి, శ్రమ అంతగానూ ఉపయోగపు విలువల (పాదార్థిక సంపద కచ్చితంగా అలాంటిదానిలోనే యిమిడివుంటుంది!) మూలమే, శ్రమ మటుకు శ్రమ, ప్రకృతియొక్క ఒక శక్తియైన మానవ శ్రమశక్తి వ్యక్తీకరణ మాత్రమే" (Karl Marx and Frederick Engels, *Selected Works*, in three volumes, Vol. 3, p. 31). ఉత్పత్తి క్రమాల్లో శ్రమా, ఉత్పత్తి సాధనాలూ కొంతవరకు పరస్పరం మార్చుకోదగివుంటాయి. పెట్టుబడి (ఉపయోగించదగిన ఉత్పత్తి సాధనంగా) బొత్తిగా అనుత్పాదకమైనదన్న భావం తప్పు, ఒక విధంగా అది, రికార్డో సిద్ధాంతానికి "వామపక్ష మొగ్గ"ను యిచ్చిన అర్థశాస్త్రవేత్తలకు చెందుతుంది. మార్క్స్ అన్నట్లు: "పెట్టుబడి ఉత్పాదకతను తను పరిశీలించేటప్పుడు హాడ్జ్‌స్కిన్ ఒక విషయాన్ని అశ్రద్ధచేశాడు. అది ఏ మేరకు ఉపయోగపు విలువలను, లేక ఏ మేరకు మారకపు విలువలను ఉత్పత్తి చేస్తుందన్నదే ఆ సమస్య (Karl Marx, *Theories of Surplus-Value*, Part III. p. 267). పైన పేర్కొనబడిన భావానికి సంబంధించి యీ వ్యాఖ్యలు ముఖ్యమైనవి. ఆ భావం ఏమిటంటే, ఉత్పత్తిని సాంకేతిక-ఆర్థిక దృష్ట్యా — ఉపయోగపు విలువల సృజన, పరివర్తన క్రమంగా — అధ్యయనంచేసేటప్పుడు, శ్రమ ఉత్పత్తి సాధనాలతో ఏ రూపాల్లో, ఏ పరిస్థితుల్లో, ఏ అనుపాతాల్లో సమ్మిళితమవుతుందన్న విషయాన్ని అధ్యయనంచెయ్యడం అవసరం.

బడి నిర్జీవమైన దవుతుంది. పెట్టుబడి ఒక వస్తువు మాత్రమే అయినప్పుడు, లాభం, శ్రమచేత సృజింపబడిన విలువలో ఒక భాగం, తనకు రావాలని అది ఎలా అనగలదు? దీని అర్థం ఏమిటంటే, అది ఒక సామాజిక శక్తిగానే గాని, ఒక వస్తువుగా తన హక్కును వ్యక్తంచెయ్యడం లేదు. ఆ శక్తి ఏమిటి? వ్యక్తిగత పెట్టుబడిదారీ స్వామ్యం. సమాజపు ఒకానొక నిర్మాణాన్ని వ్యక్తంచేసే వ్యక్తిగత స్వామ్య హోదాలో మాత్రమే పెట్టుబడి కార్మికులపైన శక్తిని సంపాదించుకొంటుంది. కార్మికుడికి తిండితీర్థాలు కావాలి, అందుకోసం అతను పనిచెయ్యాలి. అయితే, అతను పెట్టుబడిదారు అనుమతితో, అతని పెట్టుబడి సహాయంతో మాత్రమే పనిచెయ్యగలడు.

మార్క్స్ ఏ ఖండికను గురించైతే యీ కింది మాటలు చెప్పాడో, దానిలో హాడ్జ్‌స్కిన్ దాదాపుగా యివే మాటలు ఉపయోగించాడు: "చివరకు ఇదిగో యిక్కడ, పెట్టుబడి స్వభావం సరిగా అర్థంచేసుకోబడింది."* అంటే, అర్థం ఏమిటి? ఇక్కడ పెట్టుబడి ఒక సామాజిక సంబంధంగా చూడబడింది. అంతిమ విశ్లేషణలో యీ సామాజిక సంబంధం ఏమిటంటే, కూలి శ్రమ దోపిడి.

ఇంగ్లీషు సోషలిస్టు ఆర్థికవేత్తలు తదితర ముఖ్య సేవలు కూడా చేశారు. పెట్టుబడిపై సార్వత్రిక ఆదాయ రూపంగా అదనపు విలువను అర్థంచేసుకోవడంలో కూడా రికార్డో కన్న వాళ్లు దగ్గరగా వచ్చారు. వేతనాల నిధికి సంబంధించిన బూర్జువా పెట్టుబడిదారీ విధాన సమర్థక సిద్ధాంతాన్ని సవాలుచేసినవారిలో వాళ్లే ప్రథములు. అయితే, బూర్జువా అర్థశాస్త్రంపై వాళ్ల విమర్శలో కొన్ని గట్టి లోపాలుకూడా వున్నాయి. ఈ లోపాలు వాళ్ల అభిప్రాయాల్లోని చారిత్రక పరిమితులనూ, ఊహాజనిత తత్వాన్నీ ప్రతిబింబిస్తాయి. స్మిత్, రికార్డోలు పెట్టుబడిదారీ విధానాన్ని సహజ, శాశ్వత నియమాల పరిపూర్తిగా చూడగా, సోషలిస్టులు దాన్ని సరిగా అవే నియమాల ఉల్లంఘనగా చూశారు. బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తల మాదిరిగానే వాళ్లు కూడా, 18వ శతాబ్దంనుండి వారసత్వంగా పొందిన సహజ న్యాయ భావాలనే తమకు ఆధారంగా చేసుకున్నారు. పోతే, యీ న్యాయాన్ని కేవలం భిన్నమైన పద్ధతిలో వ్యాఖ్యానించారంతే. ఈ మాదిరి సోషలిజం ఊహాజనితం మాత్రమే కాగలదు.

ఓవెన్ మాదిరిగానే యీ అర్థశాస్త్రవేత్తలు శ్రమకూ, పెట్టుబడికీ మధ్య మారకం శ్రమ విలువ సిద్ధాంతాన్ని భంగపరుస్తోందని భావించారు. లాభానికి బూర్జువా విజ్ఞాన శాస్త్రం యిచ్చిన ఆర్థిక నిర్వచనను వాళ్లు సరిగానే తిరస్కరించారు, అయితే దాని స్థానంలో నిజంగా శాస్త్రీయమైన విశ్లేషణను ప్రవేశపెట్టలేకపోయారు. పెట్టుబడి

---

* Karl Marx, *Theories of Surplus-Value*, Part III, p. 297.

నుండి వచ్చే లాభం అన్నది, "సహజ" ఆర్థిక నియమాల చట్రంలో తమ విధానంలో యిముడలేదుగనుక, లాభాన్ని వివరించవలసివచ్చినప్పుడు, వాళ్లు బలప్రయోగం, దగా, తదితర ఆర్థికేతర అంశాలవంకకు తిరగవలసివచ్చింది. తత్ఫలితంగా పెట్టుబడిదారీ విధానపు స్థానంలో సోషలిస్టు వ్యవస్థను ప్రవేశపెట్టాలన్న వాదన, అనేక విషయాల్లో నైతిక స్వభావాన్ని సంతరించుకుంది: ధర్మం జయించాలి. కార్మికుడికి అతని శ్రమ యొక్క పూర్తి ఉత్పాదితం ముట్టాలన్నదే ఈ ధర్మపు సారాంశం.

ఈ "పూర్తి (తగ్గించబడని) శ్రమోత్పాదితం" అన్నది దీర్ఘకాలం మనే భవితవ్యం కలిగినది. ఈ డిమాండు ఆదినుంచీ కూడా ఊహాజనితమైనదే: అభివృద్ధిచెందిన సోషలిస్టు సమాజంలో సైతం కార్మికులు "పూర్తి ఉత్పాదితాన్ని" తమ వ్యక్తిగత వినియోగానికి పొందజాలరు. అలా జరిగిననాడు సంచయనానికి, పౌరావసరాలకు, పాలనా యంత్రాంగ నిర్వహణ, వృద్ధులు, కౌమారుల పోషణ మొదలైన వాటికి అప్పుడిక నిధులంటూ ఏమీ మిగలవు. ఇక్కడ అసలు విషయం యేమిటంటే, కార్మికులు తమ శ్రమ పూర్తి ఉత్పాదితాన్ని పొందరన్నది కాదు, పెట్టుబడిదారీ విధానం కింద, అదనపు ఉత్పాదితాన్ని హరించే దోపిడిదారుల ప్రత్యేక వర్గం ఒకటి వుంటుంది. అయినప్పటికీ కూడా, 1820, 1830 దశకాల్లో యీ సమర నినాదం ప్రగతిశీలమైనది. అప్పుడే ఆవిర్భవించిన కార్మికవర్గ పోరాటాన్ని అది ముందుకు తీసుకువెళ్లడమే యిందుకు కారణం.

ఊహాస్వర్గ దశనుండి విజ్ఞానశాస్త్ర దశకు

మార్క్స్ ఇంగ్లండుకు వచ్చే నాటికి (1849) మూడు దశాబ్దాల బ్రిటిష్ సోషలిస్టు సాహిత్యం అనేక సంపుటాల్లో అచ్చయి వుంది. బ్రస్సెల్స్‌లో తను ఆరంభించిన ఆ సాహిత్యపు సవివర అధ్యయనాన్ని ఆయన ఇంగ్లండులో కొనసాగించాడు. సెంట్ సైమన్, ఫోరియర్, ఓవెన్‌ల భావాల మాదిరిగానే, యీ ఇంగ్లీషు సోషలిస్టుల రచనలు, మార్క్స్ పూర్వ చింతనాపరుల జ్ఞానభాండాగారం అనవచ్చు. సమాజానికి సంబంధించిన తన విప్లవాత్మక సిద్ధాంతాన్ని రూపొందించడంలో మార్క్స్ యీ జ్ఞాన భాండాగారాన్ని వినియోగించుకున్నాడు.

వి. ఐ. లెనిన్, "మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు భాగాలూ" అన్న తన వ్యాసంలో యిలా రాశాడు: "తొలినాటి సోషలిజం... ఊహాజనిత సోషలిజం.

అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించి, ఖండించి, శపించింది, దాని నాశనాన్ని గురించి అది కలలు కంది, అది ఉత్తమ సమాజ వ్యవస్థను గురించి వ్యూహించింది, దోపిడిచేయడంలో వున్న అవినీతిని గురించి ధనికులను ఒప్పించేందుకు కృషిచేసింది.

"కాని ఊహాజనిత సోషలిజం నిజమైన పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిసత్వపు సారం ఏమిటో అది వివరించలేకపోయింది, పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను బైటపెట్టడంగాని, ఏ సామాజిక శక్తి నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం కలిగివుందో చూపడంగాని అది చేయలేకపోయింది."*

ఘనమైన యీ కర్తవ్యాలను మార్క్సిజం పూర్తిచేసింది. మార్క్స్ ఎంగెల్సులు సోషలిజాన్ని ఊహాస్వర్గంనుండి ఒక విజ్ఞానశాస్త్రంగా మార్చారు. ఈ పని చేసేందుకుగాను, అంతకుముందరి కాలంలో విజ్ఞానశాస్త్రాలలో అత్యంత ప్రగతిశీల చింతనాపరులు అభివృద్ధిచేసిన అన్ని భావాల, ఊహాజనిత సోషలిజపు జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రపు ఇంగ్లీషు సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు ప్రగతిశీల, విప్లవాత్మక భావాల సవిమర్శక సమీక్ష ప్రాతిపదికపైన, మౌలికంగా నూతనమైన సైద్ధాంతిక విధానాన్ని సృష్టించడం అవసరమైంది. మార్క్సిస్టు సిద్ధాంతం సవిమర్శక అవగాహన ప్రాతిపదికపైన అభివృద్ధిచెందింది.

అదనపు విలువ సిద్ధాంతమే మార్క్స్ ఆర్థిక బోధనకు ఆధారశిల. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అసలైన సారాంశాన్ని – పెట్టుబడిచేత వేతన శ్రమ దోపిడిని – అది వివరిస్తుంది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు నిరూపించినట్లు, వెనకటి 19వ శతాబ్దపు చింతనాపరులు, ప్రత్యేకించి రికార్డో, ఆయన సోషలిస్టు వ్యాఖ్యాతలూ అదనపు విలువను అర్థంచేసుకోవడానికి సన్నిహితంగా వచ్చారు. అయితే, శ్రమచేత సృజింపబడిన ఉత్పాదితపు విలువనుండి పెట్టుబడి, భూమి సొంతదారుల మినహాయింపుగా అదనపు విలువను కొద్దిగొప్పల్లో సరిగానే వర్ణించినప్పటికీ, దీన్నిదాటి వాళ్ళు మరి ముందుకు పోలేదు. సాంప్రదాయిక ధోరణికి చెందిన అర్థశాస్త్రజ్ఞులు యీ సూత్రాన్ని సహజమైనదిగానూ, శాశ్వతమైనదిగానూ పరిగణించి, శ్రమకీ, పెట్టుబడికీ మధ్య విలువ పంపిణీ ఏ పరిమాణాత్మక అనుపాతాల్లో జరుగుతుందో కనుక్కొనేందుకు మాత్రమే ప్రయత్నించారు. అయితే, సోషలిస్టులు యీ పంపిణీ అన్యాయమైనదని కనుక్కొని, యీ అన్యాయాలను తొలగించేందుకుగాను ఊహాజనిత పథకాలను వివరించారు.

వాళ్ల విషయంలో ఏదైతే అంత్యాంశమో, అది మార్క్స్ విషయంలో ఆరంభాంశమాత్రమే అయింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు వస్తుపర నియమాల ప్రాతి

* V. I. Lenin, *Collected Works*, Vol. 19, Moscow, 1968, p. 27.

పదికపైన, అదనపు విలువ ఎలా ఉత్పన్నమవుతుందో వివరించిన మీదట, ఆయన సుసంఘటితమూ, ప్రగాఢమూ అయిన ఒక ఆర్థిక సిద్ధాంతాన్ని నిర్మించాడు. మార్క్స్ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి నియమాన్ని ఆవిష్కరించి, యీ అభివృద్ధి ప్రధాన ధోరణిని — పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని విప్లవాత్మకంగా తోసివేసి, దాని స్థానాన్ని సోషలిజం, కమ్యూనిజం ఆక్రమించే దిశగా వెళ్లే ధోరణిని శాస్త్రీయంగా రుజువు చేశాడు. ఈ విప్లవాన్ని సాధించి, నూతన సమాజ స్రష్ట అయ్యే సామాజిక శక్తి కార్మికవర్గమేనన్న విషయాన్ని మార్క్స్ నిరూపించాడు.

పేర్ల సూచి

పాఠకులకు మనవి

ఈ పుస్తకాన్ని గురించిగానీ, దీని అనువాదాన్ని గురించిగానీ మీ అభిప్రాయాలనూ సలహాలనూ మా భావిప్రచురణల సహాయార్థం "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మా చిరునామా:

Progress Publishers

17, Zubovsky Boulevard

Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
బాంక్ రోడ్డు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002